గురువులు

# గురు విజ్ఞాన సర్వస్వము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తిరుమల తిరుపతి దేవస్థానం వారి వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

**TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)**

**http://ebooks.tirumala.org**



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# గురు విజ్ఞాన సర్వస్వం



రచన. సంకలనకర్త

**తోటపల్లి బాలకృష్ణ శర్మ**



కంచి పీఠాధిపతులు

"ఓం ఐం హ్రీం శ్రీం"

# గురు విజ్ఞాన సర్వస్వం

శ్రీ గుం గురుభ్యోన్నమః, పం పరమ గురుభ్యోన్నమః
పరాత్పర గురుభ్యోన్నమః, పరమేష్ఠి గురుభ్యోన్నమః,
సద్గురు శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామినే నమః

## జయ గురుదత్త - శ్రీ గురుదత్త

"మంగళానాం చ కర్తారౌ వందే వాణీ వినాయకౌ"

శ్లో॥ ఓం నమో బ్రహ్మాదిభ్యో బ్రహ్మ విద్యా సంప్రదాయ
కర్తృభ్యో వంశ ఋషిభ్యో నమోగురుభ్యః ।
సర్వోపప్లవ రహిత ప్రజ్ఞాన ఘన ప్రత్యగర్థో,
బ్రహ్మైవాహమస్మి సోఽహమస్మి బ్రహ్మోహమస్మి ॥

"వందే బోధమయం నిత్యం గురుం శంకర రూపిణమ్"
"సద్గురుం తం నమామ్యహమ్"
"వందేఽహం శ్రీగురు పాద పంకజమ్ విశుద్ధ విజ్ఞానౌ కవీశ్వరౌ"
"సర్వశ్రేయస్కరీం మమమాతాం (మాతరం) నతోఽహం పితృవల్లభామ్"

**మాతా పితృభ్యోన్నమః - శ్రీ సరస్వత్యై న్నమః**

"రచన - సంకలనకర్త"
**తోటపల్లి బాలకృష్ణ శర్మ**

గురువిజ్ఞాన సర్వస్వము
తోటపల్లి బాలకృష్ణ శర్మ
(Retrd. తెలుగు పండిత్)

ప్రథమ ముద్రణ : అశ్వయుజ విదియ, శ్రీ వ్యయ నామ సంవత్సరం,
యుగాబ్ది - 5107. సెప్టెంబర్ - 24- 2006

ప్రతులు : 1000

ప్రతులకు :
తోటపల్లి బాలకృష్ణ శర్మ
(Retrd. తెలుగు పండిత్)
మజీద్ రోడ్, ఇం.నెం. 8-14-47,
వనపర్తి - 509103,
పాలమూరు - జిల్లా. ఆ.ప్ర.
ఫోన్ : 08545 - 232797

తోటపల్లి బాలకృష్ణ శర్మ
(Retrd. తెలుగు పండిత్)
ప్లాట్ నెం : 31,
శ్రీ కృష్ణ దేవరాయ కాలనీ,
బి.యన్.రెడ్డి నగర్,
హైదరాబాద్.
ఫోన్ : 09441927725

కూర్పు & ముద్రణ :
సుందర్ గ్రాఫిక్స్,
7-1-307/14/F/29,
జయప్రకాశ్ నగర్,
సనత్ నగర్, హైదరాబాద్.
ఫోన్: 9391030025

మూల్యం : రూ ॥ 216/-



ఈ గ్రంథం తిరుమల తిరుపతి దేవస్థానం వారి

ఆర్థిక సహాయ, సహకారంతో ముద్రితమైనది.



శ్రీ భూయుత శ్రీహరి చిహ్నితాభ్యాం
అగస్త్య రేఖాదిభి రంచితాభ్యాం ।
నిగూఢ బీజాక్షర ముద్రితాభ్యాం
నమో నమః సద్గురు పాదుకాభ్యాం ।

శ్రీ మహాగణాధిపాయనమః శ్రీ గురుదత్తాత్రేయనమః

శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి

# సంగ్రహ చరిత్ర

శ్రీమద్ భారద్వాజస గోత్రంలో గండ్లూరు నరసింహ శాస్త్రిగారనే మహనీయుడు ఇంచుమించు 20వ శతాబ్దితో సమంగా ఈ భూమిపై జన్మించెను. వారికి 1938సం॥లో భార్య గతించటంతో వారు కొన్నాళ్ళకు ఈశ్వరాజ్ఞగా, వారి అక్కయగు వెంకమ్మతో తీర్థయాత్రలొనర్చుచూ కర్ణాటక రాష్ట్రపు అడవులలో నిగూఢంగావున్న అర్కావతీ, గుప్తగామినీ, కావేరీనదుల త్రివేణీ సంగమ పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు.

అచట హరితస గోత్ర పవిత్రుడైన లింగణ్ణగారనే సత్పురుషుడు భార్యా పిల్లలతో కాపురముండేవాడు. వారి సంతానంలో జ్యేష్ఠురాలగు "జయలక్ష్మి" అనే పుత్రిక 1924 సం.లో జన్మించియుండినది. ఆ సంగమక్షేత్రం నిరంతరం దత్తాత్రేయ స్వామి వారి సంచార పవిత్రస్థలమగుటతో యోగులనేకులు అక్కడకు చేరి సాధనలు చేసుకొని వెళుతూవుండేవారు. అట్టి వారిలో ఫకీరు తాత అనే 120 యేళ్ళ వృద్ధయోగితోనూ, కరపాత్ర యతీంద్రులనే శతవృద్ధ యతితోను బాల జయలక్ష్మికి స్నేహ మేర్పడింది. క్రమంగా గురు శిష్యరికంగా మారి, అనతి కాలంలోనే ఆమె యోగ శిఖరాల నధిరోహించే దత్తాత్రేయ సాక్షాత్కారం కూడ పొందింది.

అచటికి తీర్థయాత్రలకై వచ్చిన వెంకమ్మ, నరసింహ్మ శాస్త్రులు దైవలీలగా అచటనే కాపురముంటున్న లింగణ్ణగారింట్లో ఆతిధ్యం పొందిరి. ఊహాతీతమైన రీతిలో ఆ రెండు కుటుంబాల కలయికగా లింగణ్ణ కూతురు జయలక్ష్మికి నరసింహశాస్త్రిగారితో వివాహం జరిగింది, అట్లు జయలక్ష్మి నరసింహశాస్త్రిగారి ధర్మపత్నికాగా, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం సమీపంలో గల బొమ్మెపర్తి గ్రామంలో మెట్టినింటికి చేరింది.

అచట ఆదర్శగృహిణిగా, అంతరంగంలో సిద్ధయోగినిగా జీవిస్తూన్న జయలక్ష్మి మాతకు 'చిత్రభాను' సంవత్సరం అధిక జ్యేష్ఠ శుద్ధ ఏకాదశీ మంగళవారం తేది, 22-05-1942న, ఆది గురుమూర్తి నవీనావతారానికి ద్వారభూత అయి మగశిశువుకు మాత అయింది. 'సత్యనారాయణ' అనే నామధేయంతో నూతనావతారి

బాలుడు గోరుముద్దలతోనే సాధన రహస్యాలు వంట బట్టించుకొన్నాడు. ఆటపాటలలోనే అద్భుత మహిమలావిష్కారమైనవి సత్యనారాయణకు. దానికితోడు 1953 సం॥లో జయలక్ష్మమ్మ తన యోగవిద్యనంతనూ శక్తిపాత విధానంలో తన తొలి ముద్దుబిడ్డయగు సత్యనారాయణకు ధారదత్తం చేసి, భావిజీవితంలో నతడు నిర్వహించవలసిన కార్యక్రమ ప్రణాళికను, అద్భుతావహమైన విరాడ్రూప దర్శనాలను గ్రహించి ప్రశ్న గణపతి రహస్యాలను యిచ్చి తనువు చాలించేసింది. అట్లు, ఆ మహాసాధ్వి ఒకానొక శంకర జయన్తి మహాపర్వాన ఈ భూమికవతరించి, మరో శంకరజయన్తినాడే తనువు చాలించడం గొప్ప సుకృతం.

సత్యనారాయణ తల్లి ఆజ్ఞగా ఆధ్యాత్మిక సాధన నిరంతరం సాగిస్తూ, తన ఐదవఏటనే అగస్త్యమహర్షి అనుగ్రహంతో వైద్య విద్యను పొంది, శ్రీ విద్యారాజయోగ మార్గంలో నిగూఢంగా సాధన సాగించాడు. దానికి తోడు యోగినీ మణి అగు మేనత్త వెంకమ్మగారి నుండి హఠయోగవిద్యను ధారాదత్తం చేసుకొన్నాడు సత్యనారాయణ. ఆ రోజుల్లో ప్రొద్దుటూర్లో నివసిస్తున్న శ్రీ అభేదానంద స్వామి వారు, శ్రీ యోగీంద్ర భారతీ స్వామి సత్యనారాయణలోని మహత్త్వాన్ని గుర్తించారు. 1959 సం.లో ఉపనయనం జరగడంతో సత్యనారాయణకు 'శ్రీ అర్క గణపతి' దర్శనమిచ్చి విశేషోపదేశాలు చేశాడు. ఆ అర్క గణపతి ఉపదేశంతో అంతర్గత సాధన తీవ్రతరంగానొనర్చి ఐహికాభివృద్ధి వొందిరి. పూర్వం పొందిన రత్నశిలలోంచి గణపతి సందేశాలతో, గణపతి హోమాలతో, సంకీర్తనలతో, 'శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ'గా సాక్షాత్ శ్రీదత్తావతార మూర్తిగా శ్రీసద్గురు సార్వభౌములుగా వెలుగుతూ సర్వులకు వెలుగునందిస్తున్నారు.

ఇట్టి వీరి చరిత్రను సంక్షిప్తముగా వ్రాసి ఈ గ్రంథమునకు ఒక వన్నె తెచ్చిన వానినైతిని. వీరి కథను ముందుగా పఠించి ధన్యులు, కృతకృత్యులగుదురని ఆకాంక్షిస్తున్నాను.

ఇట్లు
వారి కృపాభిలాషి
**తోటపల్లి బాలకృష్ణశర్మ**

★★★

అస్మత్ మాతాపితరులకు వందనం



క్రీ.శే. శ్రీ తోటపల్లి జ్యోసి లక్ష్మయ్య
ధర్మపత్ని
శ్రీమతి ల॥కు॥సౌ॥ వెంకమ్మ



శ్రీ తోటపల్లి బాలకృష్ణ శర్మ
ధర్మపత్ని
లు।।కు।।సౌ।। తోటపల్లి లక్ష్మీదేవి

# శ్రీ గురుభ్యోన్నమః

## ముందుమాట

శ్లో॥ గణపతి గురుమేకం, సచ్చిదానంద రూపం,
విభుధ నివహా సేవ్యం, యోగ మార్గాధి రూఢం ।
శరణ ముపగతానాం, ఆర్తి సంఘాద్రి వజ్రం,
మమ హృదయ నివాసం, భక్తి నమ్రో నమామి ॥

"**శ్రీ గురువిజ్ఞాన సర్వస్వం**" అను నీగ్రంథరచనను 'శ్రీగురు' పాదకమల రేణువులచే నామనోదర్పణమును పవిత్రమొనర్చుకొని 'ధర్మార్థ కామ మోక్ష' ఫల ప్రదాయిని యగు సకల దేవాత్మక శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ శ్రీ గురు అవధూత దత్త పీఠాధిపతి శ్రీగురుదేవునకు నమస్కరిస్తూ గుర్వనుగ్రహంతో, గురువాశీర్వాద బలంతో రచనకు పూనుకొంటిని. ముందుగా కీ॥శే॥ నామాతా పితరులకు, అటులే నాకు మాతాపితృ తుల్యులగు మరియు గురుతుల్యులగు ల॥కు॥సౌ॥ వెంకమ్మ, బ్రహ్మశ్రీ తోటపల్లి వేంకటేశ్వర శర్మ గారలు వదిన, అన్నగార్లకు పాదాభివందనములు.

'గురు' శబ్దానికి సంప్రదానంలో చతుర్థీవిభక్తి బహువచనం "గురుభ్యః" అంటే గురువులకు, "నమః" అంటే నమస్కారము. "శ్రీ" సకల ఆధ్యాత్మిక సంపదలకు నిలయమైన గురు పరంపరకు నా నమస్కారం. "గురువు" పరంపర అనగా, శ్రీశంకరాచార్యుల వంటి గురువునకు పద్మపాదుడు శిష్యుడు. ఇక గోవింద పాదులు పరమగురువు. గౌడపాదుల గురువు "పరమేష్ఠి" గురువుగా, లేదా గురువులందరికీ గురువైన పరమాత్మ పరమేష్ఠి గురువుగానెంచబడును. 'గురువు' అనేదే "పరమేష్ఠి" గురుపరంపర కదా! అట్టి గురువరేణ్యులకు శిష్యునిగా నమస్కరిస్తున్నాను.

శిష్యుడికి గురువు పూజ్యుడు. శిష్యుని అణకువను, శ్రద్ధను గురుపాదపూజ, గురుపాదాభివందనం, ఆపాదధూళి స్వీకరించడంను సూచిస్తుంది. గౌరవమన్ననలకు గురువు అర్హుడు. అందుకు శిష్యునకు గురువు భగవత్స్వరూపుడుగా ఆధ్యాత్మవిద్యను అనుగ్రహిస్తాడు.

అట్టి "గురు తత్త్వమును" గురుశిష్యుల అనుబంధ వ్యాఖ్యగా - స్వస్తి శ్రీబహుధాన్య నామ సంవత్సరం ఆషాఢ శుక్ల పూర్ణిమ (వ్యాసపూర్ణిమ)

తేది.౯-౯-౯౯న "శ్రీగుగుజయంతి" సందర్భమున వ్రాయడం పూనుకొంటిని.

"శ్రీగురువు" త్రిమూర్త్యాత్మక రూపుడని ఎల్లరు పలికినటుల, ఆ గురువు ప్రాశస్త్యమును వివరించుచూ, అతడు త్రిమూర్త్యాత్మక రూపునకతీతుడని, తలంచుచూ గుర్వనుగ్రహంతో నాలోకలిగిన తపనతో సత్కార్యాచరణంగా అతనిని గూర్చి వ్రాయడం ధన్యమైన జీవనముగా భావించితిని.

ఈ కలియుగంలో రానురాను గురుశిష్యులకుండు పవిత్రానుబంధం, బృహత్ వాత్సల్యం, అనుభూతి, అనురాగం, గౌరవమర్యాదలు సన్నగిల్లి పోతూడండం జూచి, శ్రీ (అధ్యాత్మిక) విద్యకుండు మహిమను తెలుపు తపనతో మార్గ దర్శక గ్రంథం వ్రాయడం ప్రారంభించితిని.

పూర్వకాల విద్యావిధానమునకు, నేటి విధానమునకు భేదము హస్తిమశకాంతరం. బోధించు గురువర్యులతోను భేదమున్నది. అనగా విద్యా బోధనలో నిజాయతీ నేడు లోపించిందనుటలో సంశయంలేదు. పరోపకార పరాయణత్వం నశించి, స్వార్థ తత్పరతకు, సంకుచిత తత్వమునకు చోటు చేసుకొన్నది, ఈ నాటి విద్యావిధానము. మనో వికాసములకు, విశాల భావములకు తావులేని నేటి విద్యాబోధన గర్హింపదగినదే కాని, గర్వింపదగ్గది కాదు. పౌరులు ఎట్లైన ఎదుగుదురు. కాని, భావి భారత పౌరులుగా ఎదుగవలెనన్న నేటి ఉపాధ్యాయులలో నైతిక మార్పు రావాలి. విద్యార్థుల మనోఫలకముపై, వారి మనోవృత్తిని (మనస్తత్వము) గ్రహించి లక్ష్యసాధనకై విద్యాబోధ ఎంతేని అవసరం. అందుకు తాను అచార్యుడుగా గాని, ఉపాధ్యాయుడుగాని (ఉపాధ్యాయుడనగా ఉపేత్య = సమీపపేత్య అదీతే ఇత్యుపాధ్యాయః), మార్గదర్శకుడుగాని తలంచి మెలగాలి. అనగా తన విద్యుక్త ధర్మమును గ్రహించి మెలగాలి. అప్పుడే విద్యార్థులను తీర్చిదిద్ద యత్నించును. అది అతని విధి. అట్లనియే -

తొలుత మన పూర్వ గురువరేణ్యులను స్మరించుకొని, వారి ఆశీర్వాద బలముతో కొన్నినాకు లభ్యమగు ముఖ్యుల చరిత్రలను, అనగా ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత ప్రముఖుల నుండి పొందిన విద్యావివేకాదులను, మహిమలను, అనుభవాలను, కథలుగా నీ గ్రంథమున పొందు పరచితిని. వ్రాయుటలోని మర్మ మొకటే, అది నేటి "గురు శిష్య యువతకు" సన్మార్గ దర్శకమై నీతి ప్రవర్తనకు దోహదమగునట్లుగా వ్రాయడమైనది. ఈ గ్రంథమును పఠించిన వారెల్లరకును,

సరస్వతీ కరుణా కటాక్ష వీక్షణ మహిమతో జ్ఞానవిజ్ఞానములు వారికి సంక్రమించాలని, వారు భావి జీవితమున సద్గుణవంతులగుటకది ఆదర్శ మగుననే ధ్యేయముతో వ్రాయడమైనది.

బోధ గురువులను కొనియాడుతూ, బాధ గురువులను తూలనాడుతూ, అక్కడక్కడ ఆయాగురువుల గూర్చి పొగడ్తలను, విమర్శలను వివరించి సాహసించితిని. ఇట్టిది కేవలం మన ఆంధ్రరాష్ట్రమునకేగాక, యావద్భారత ప్రజానీకమునకును ఉపయుక్తమగు విషయాలను, గురునీతి సూత్రములను, సన్మంగళాచరణ శ్లోకములను, గురు (ప్రార్థన) స్తుతులను, సద్గురు పరంపర విశేషాలను, గుర్వష్టకములను, వేదాధ్యయన విధానములను సేకరించి రచించడమైనది. పఠించిన వారలకు అవగాహనమగును. వ్రాయుటలో లభించిన ఆమూలాగ్ర విషయములకు తావిచ్చుటలో ఎచటనైన పునశ్చరణములు చోటుచేసుకొనినచో సర్వులు సహృదయ పూర్వకముగా వాటిని దోషముల నెంచకుందురని ఆశిస్తున్నాను.

ఈ గ్రంథమును వ్రాయుటలో కొన్ని లభించిన పురాణములు, ఉపనిషత్తులు, ఇతిహాస గ్రంథములు మరియు మహనీయుల ఆధ్యాత్మిక పత్రికలు నాకు తోడ్పడినవి. వాటిలోని సముచితమైన గురుశిష్య సంబంధమైన, పూర్వంవారి సంప్రదాయ, ఆచారధర్మ బద్ధ ప్రవర్తనల విషయములను సేకరించి వ్రాయడమైనది. విరాట్పురుషులును గురువులనెట్లు పాదప్రణామంబులొనర్చి తరించరో, ఆ సద్గురువు లెట్లు సంతుష్టులైరో పఠించినవారికే అవగాహనమగును. దైవ సృష్టి యందు ఉత్తమ జీవిగా మానవుడు ఆవిర్భవిస్తాడు. ఆ మానవుడు పుట్టక పూర్వము మహాజ్ఞానిగా తల్లి గర్భవాసమందుండి, పుట్టుకతో అంతా మరచి మాయలోపడతాడు. అదే దైవ (విష్ణు) మాయ. కాని ధర్మబద్ధ జీవనం ముఖ్యముకదా! అందుకు బాల్యమునుండి మ గురూపదేశం ముఖ్యావసరము. సద్గురువుల సాహచర్యం అంతకన్నా అవసరం. వారి సేవలతో, వారి కృపాభిలాషులుగా మెలగటం ఇంకా అంతకన్నా అవసరం.

కావున అట్టి గురువుల కృపాపాత్రుడగుటకు అల్పుడనగు నేను అనల్పభావ పరంపరలోనలరారు గురువరేణ్యుల గూర్చి, వారి తత్త్వోపదేశముల గూర్చి వ్రాయుటకు, ఇది గురువాజ్ఞగా భావించి రచన గావించితిని.

నాయీ రచనకు ముందు ప్రస్థాన త్రయంలో నొకటగు "శ్రీమద్భగవద్గీత" వ్యాఖ్యానం మరియు "ఓంకార తత్త్వము" అను రెండు గ్రంధరచనలు చేయబడినవి.

నామదిలో నిండుగా ఈరచనాధిష్ఠాన దేవతా మూర్తులగు గురు సంప్రదాయ అభినవతారగా వెలుకొందుచున్న శ్రీ అవధూత దత్తావతార మూర్తులైన శ్రీ సద్గురు దేవులు శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారికి సహస్ర సాష్టాంగదండ ప్రణామంబులతో ఈ గురు గ్రంథరచనను అంకిత మొనర్చుచున్నాను.

శ్రీ స్వామివారి దివ్యానుగ్రహం మాకు ఎల్లెడల వర్షించుగాక! "గురుతత్త్వమే" ఆత్మమార్గము వంటిదని, గురుచరణ కమలములందుంచుచున్నాను. "గురుచరణం, గురుధామం, గురుపదం" గురుపాదములకు రూపాంతరం కదా! ఆ గురుపాదములకు కమలములతో పోల్చుకొని, ఆ దివ్య పుష్పరాజములను నా శిరస్సుపైధరించితిని. అట్లు ధరించుటనునది వారిని (గురువును) నా అల్పహృదయమందుంచుకొని కొలుచుట కనువగునట్లుగా భావించి స్మరించుకొనుటకు నా ఆత్మ వస్తువుగా స్వీకరించి తిని. శ్రీస్వామీజీ వారి దివ్య గురుపాద తీర్థంగా పొందినంత మహద్భాగ్యంగా పరిగణించి, మరొక మారు వారి దివ్య చరణారవిందములకు నా హృదయాంజలిని సమర్పిస్తూ ముగించుచున్నాను.

గురు రసపూర్ణమైన ఈ గ్రంథమును అర్యులు ఉపేక్షించకుందురు గాక! అల్పజ్ఞుడనైన నన్ను యీ గ్రంథము నుండి ప్రవహించు గురువుల కథారసములు చెరకుగడ రసములుగా గ్రహించి ఆదరించుదురని ప్రార్థన. గురువు నందు గౌరవము గలవారు దీనిని స్వీకరించి అనుభవించుడు.

ఇట్లు
బుధజన విధేయుడు,
**తోటపల్లి బాలకృష్ణశర్మ**

# శ్రీరస్తు

శ్లో॥ సప్తకోటి మహామంత్రాః చిత్త విభ్రమ కారకాః ।
ఏకమేవ మహామంత్రా గురురిత్యక్షరద్వయమ్ ॥

"ఓం శ్రీ గురుదేవాయ విద్మహే, పరబ్రహ్మణే ధీమహీ
తన్నోగురుః ప్రచోదయాత్ ॥ - గురుదేవాయ నమః

## "శ్రీసద్గురుంతం నమామి"

ప్రియబాంధవులారా! గుర్వనుగ్రహంతో బుధజన విధేయతతో నా సృష్టిః కురుతే కావ్యం" అన్నట్లు తపనతో నాకు తోచిన విధముగా, లభించిన ఆధారములతో రచింపబడిన ఈ "గురు విజ్ఞాన సర్వస్వము" అను గ్రంథమును వ్రాసితిని. అట్టి గ్రంథమును శ్రద్ధగా చదివి, స్పందించి, భక్తితో, అనురక్తితో అనుగ్రహించి అందించి స్పందనలో వారివారి మనోభిప్రాయములకు సంతుష్టుండనై పేరుపేరున వారికి నా నమస్సుమాంజలులు అందజేస్తున్నాను.

ఈ గ్రంథమును ముద్రించుటకు (D.T.P & Printing) అడిగిన వెంటనే సహృదయంతో సమయాన్ని వెచ్చించిన శ్రీ కల్లూరి సుబ్రహ్మణ్యం, సుందర్ గ్రాఫిక్స్, సనత్‌నగర్ హైదరాబాదు - వారికి కృతజ్ఞతలందజేస్తున్నాను.

గ్రంథమును ముద్రించుటకు వెంటనే ఆర్థిక సహాయమందించిన వారికి పేరుపేరున నేను ఋణపడినట్లుగా కృతజ్ఞతాభివందనములు సమర్పిస్తున్నాను.

ముఖ్యముగా కోరినవెంటనే ఆశీస్సులతో అభిప్రాయమందించిన గురుతుల్యులు మాతాపితరుల సమానులైన గౌ॥ శ్రీ తోటపల్లి వేంకటేశ్వర శర్మ అన్నగారికి, మరియు శ్రీమతి లః॥కుం॥సౌ॥ వెంకమ్మ వదినగారికిని నాపాదాభివందనములు.

నాకన్ని విధములు తోడునీడగా సహాయసహకారములందించిన నా సహధర్మచారిణి శ్రీమతి లః॥కుం॥సౌ॥ తోటపల్లి లక్ష్మీదేవికి నా దివ్యాశీస్సులు, కృతజ్ఞతలు.

ఈ గ్రంథమును పొందిన వారెల్లరు సహృదయంతో పఠించి యేవేని భాషాదోషాలున్న, అచ్చుతప్పులున్న మీ సూచనలతో నాచిరునామాకు అందజేసిన పునః ప్రచురణలో సరిచేసి దిద్దుకొందును. అట్టివారికి ముందుగా నా కృతజ్ఞతాభినందనములు.

మరొక్కమారు ఎల్లరకును నా హృదయపూర్వక వందనములు.

ఇట్లు
బుధజన విధేయుడు,
సంకలన కర్త
**తోటపల్లి బాలకృష్ణశర్మ**

# అస్తు సద్యః పర నిర్వృతయే

శ్లో॥ శ్రీమత్తోటపల్లి వంశ్యః ఋషి గౌతమ గోత్రజః ।
వేదమూర్తి స్సదాచారః లక్ష్మణార్యమహోదయః ॥

శ్లో॥ తత్పుత్రో వేంకమాంబాయాః ద్వితీయోచప్రియౌరసః ।
బ్రహ్మశ్రీ బాలకృష్ణాఖ్యో శర్మామమ సుహృన్మణిః ॥

శ్లో॥ శ్రీమతీ విదుషీలక్ష్మీ దేవేతి ధర్మపత్నినా ।
ప్రేరితం బాలకృష్ణేన విదుషాకృతి నిర్మితం ॥

శ్లో॥ 'గురు విజ్ఞాన సర్వస్వ'మపూర్వం గద్యమద్భుతం ।
గురుశిష్యాను సంబంధి కవీనాం నికషం కృతం ॥

శ్లో॥ భక్తిభావ సమాకీర్ణం కావ్యం సరస ముజ్వలం ।
వ్యాసాది సచ్చిదానంద పర్యంతం సుప్రశంసితం ॥

శ్లో॥ ఆంధ్ర పండిత శిష్యాణాం సత్పాఠ్యమితి భావయే ।
ఏతయోః కవి దంపత్యోః శ్రేయో భవతు సర్వదా ॥

ఇతి -

(పుల్లానారాయణ శర్మ)
సంస్కృతాంధ్ర పండితః
విశారద - కవిచంద్ర.
వనపర్తి

## అవధాన సరస్వతీ పీఠం

అవధాన కళాప్రపూర్ణ
బృహత్ ద్విసహస్రావధాని
బ్రహ్మశ్రీ డా॥ మాడుగుల నాగఫణి శర్మ

# ఆశీర్మంగళవాచకమ్

"గురు విజ్ఞాన సర్వస్వం" అన్న ఈ గ్రంథంలో శ్రీ తోటపల్లి బాలకృష్ణ శర్మగారు 98 శీర్షికలతో గురుతత్వాన్ని అత్యద్భుతంగా వివరించినారు - విశ్లేషించారు.

గురువు అంటే ఎవరు? ఆ గురువు ఎట్లా వుండాలి? ఆ గురువు వలన ప్రయోజన మేమి? అసలు గురువు యొక్క ఆవశ్యకత మానవుని జీవితంలో ఎంత? శిష్యుడెవరు? శిష్యుడు గురవు నెలా ఉపాసించాలి. బ్రహ్మవిద్యా సాధనలో - బోధనలో శిష్యునికి గురువు యొక్క మార్గదర్శకత్వం ఎంత? జీవుడు - దేవుడు బ్రహ్మవిద్య. కొందరు గురుమూర్తులు శ్రీదత్తాత్రేయులు - శ్రీశంకరులు, శ్రీశృంగేరి - శ్రీకాంచి - పీఠాల గురుపరంపరలు. అద్వైత పీఠాలే గాక - విశిష్టాద్వైత, వైష్ణవ గురుమూర్తులు వారి వరంవరలు, శ్రీ రాఘవేంద్రాది ద్వైత గురుమూర్తులు - వారి పరంపరలు ఇంకా శ్రీ వేదవ్యాసులవారు - వ్యాస గురుపూర్ణిమ, శ్రీ దక్షిణామూర్తి ఆయావిశేషాలు, గురుసేవా పద్ధతి, వేదములో గురుతత్వం ఉపకోసలాది వివరణం, ఇలా "గురు" అన్న రెండక్షరాలకు సంబంధించి - నాటి తత్త్వం నుండీ - నేటి పరమానందయ్య శిష్యులతోపాటు వీధిబడులదాకా సర్వసమగ్రంగా శ్రీ తోటపల్లి బాలకృష్ణ శర్మగారు ఇందులో విశేషాలను పొందుపరిచినారు.

ప్రాచీన వాఙ్మయ సముద్రమును మథించి - కలశీకరించి యింత సులభసుందరంగా గురుతత్వామృతాన్ని ఆధునిక

సమాజమునకు అందించుచున్న అపరనారాయణులు - అక్షర ధన్వంతరులు శ్రీ బాలకృష్ణశర్మగారు. ఈ గ్రంథరచన - ఈ సంకలనం - గురువులెవరో ఎలా ఎంచుకోవాలో ఎవరిని అనుసరించాలో ఎరుగక తికమకయగుచున్న ఆధునిక సమాజమునకు - చక్కని కరదీపిక కాగలదు.

ఈ రచన - **సాక్షాత్ దత్తాత్రేయ** స్వరూపులుగా ఈయుగంలో కీర్తింపబడుతున్న శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారికి అంకితమీయడం - ధన్యతాపరాకాష్ఠ నాపాదించుకొన్నది.

శ్రీ బాలకృష్ణ శర్మగారికి ఆశీర్వచనములు ఆయురారోగ్య విభవములతోపాటు వారికి ఇతోఽధిక గ్రంథరచనా శక్తి కలుగు గాక!

శుభమ్

పార్థివ
జ్యేష్ఠ బహుళద్వాదశీ
3-7-2005

విద్యావాచస్పతి, వేదశ్రీ, విద్వచ్ఛిరోమణి

**బ్రహ్మశ్రీ తెలకపల్లి విశ్వనాథశర్మ** M.A.

11-13-454/1, రోడ్డు నంబరు - 14, అలకాపురి, హైదరాబాదు - 500 035, ఫోను : 040 - 24033326

శ్రీరస్తు

శుభమస్తు

# శ్రీ గురుభ్యోన్నమః

'విష్ణుం శివః వా భజతాం గురోః పిత్రోశ్చ సేవినాం ।
గోవైష్ణవ మహాశైవ తులసీ సేవినా మపి ॥
నస్యాత్ కలికృతో దోషః కాశ్యాం నివసితా మపి ।
కలౌ గురూణాం భజనమశ భక్త్యధికం స్మృతిమ్ ॥

బ్రహ్మ శ్రీ తోటపల్లి బాలకృష్ణ శర్మగారు 'గురు విజ్ఞాన సర్వస్వం' అనే పేర గురుతత్త్వ సర్వస్వము ఒక్కచోట లభించేట్టు గ్రంథస్థం చేసినారు.

ఏకలవ్యుని కథ ప్రఖ్యాతమే. గురువు అనుగ్రహించి, బోధించియో - హస్త మస్తకసం యోగం చేసియో - మౌన వ్యాఖ్యతో ఏకలవ్యుని అనుగ్రహింప లేదని ఐతిహాసికులకెల్లరకు విదితమే. ఐనను ద్రోణునిలోని విజ్ఞానము నంతను కేవలం ఏకలవ్యుని - ద్రోణగత భక్తి. మాత్రమే ద్రోణుని విజ్ఞానము ఆకర్షింప బడినది. శ్రీ శర్మగారి కృషి అమోఘము, తెలుగు ప్రజలకు లాభదాయకము.

ధార్మికవాగ్భూషణ

**కె.బి.సోమయాజులు**

# నివాళి

బ్రహ్మణ్యులు శ్రీ తోటపల్లి బాలకృష్ణ శర్మగారు సంకలమొనరించి రచించిన గురువిజ్ఞాన సర్వస్వమును స్థాలీపులాకన్యాయముగా పరికించు భాగ్యము కలిగినది. ఒకటి రెండు మెతుకులు పట్టు భాగ్యము కలిగినది. ఒకటి రెండు మెతుకులు పట్టుకొన్నంతనే శ్రీ శర్మగారి సుదీర్ఘ కృషి యొక్క లోతు పాతుల జాడతెలిసినది. కాళిదాసాది మహాకవులు విశ్వశ్రేయము నాకాంక్షించి కావ్యము లల్లినట్లే శ్రీ బాలకృష్ణ మహాశయులు యీ సర్వస్వమును సంతరించినారన్న విషయమవగతమైనది.

శ్రీ శర్మగారు నాబోటి కించిజ్ఞుని తమ సంకలనమును గురించి రెండు మాటలు వ్రాయమన్నప్పుడు నాకెంతో ఆశ్చర్యం కలిగింది. నడిచే దేవుడుగా ప్రసిద్ధులైన జగద్గురువు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ శ్రీచరణుల, అంతేవాసి శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతీ జగద్గురువుల నారాయణస్మరణ పూర్వకాశీస్సులనందిన శ్రీ శర్మగారి రచనను గురించి నేను రెండుమాటలు వ్రాయుటాయని వెనకాడితిని. కానీ నాకు వెంటనే మరియొక ఆలోచన స్ఫురించినది. వీరి రచన అటు ఉత్తమాధికారులనే గాక నావంటి మందాధికారులను, అల్పజ్ఞులను కూడ అలరించినదనుటకు నామాటలు తార్కాణములుగా నిలవగలవన్న స్ఫురణకలిగి యిందుకు సాహసించితిని.

నేటి యువతకు గురువన్న మాటకు గల అర్థము, పరమార్థములను అవగతమొనరించుకొనుటకు అవకాశమే లేకుండ పోయినది. వారికి తెలిసిన మాటలు మాష్టారు, ఉపాధ్యాయుడు, ఉపన్యాసకుడు (లెక్చరర్), ఆచార్యుడు (ప్రొఫెసర్), ప్రధానాచార్యుడు (ప్రిన్సిపాల్), ఉపకులపతి (వైస్ ఛాన్సలర్), కులపతి (ఛాన్సలర్) అన్నవి మాత్రమే. ఇవికూడా ఆంగ్లభాషాపదాలలోనే వారికి

పరిచితములు. ఆ ఆంగ్లపదాలను భారతీయ భాషలలోనికి అనువదించినపుడు వాడిన ఆచార్య, కులపతి శబ్దములు పారిభాషిక పదములు, అర్థవంతములును ఐనవి. "యస్మాద్ధర్మానాచినోతి స ఆచార్యః" ఆచార్యుడనగా తనాచరించి, ఆచరింప జేయువాడని అర్థము. ప్రొఫెసర్ అనగా కేవలము యితరులకు జోశ్యము చెప్పువాడు లేదా రాబోవు ధ్వానిని తెలుపువాడని అర్థము. అట్లే "ఏకాదశ సహస్రాణాం, యోన్న దానాదినా భరతే సవై కులపతిర్నామ వేద వేదాంగ పారగః" కులపతి యన్నమాటకు పదకొండువేల మంది శిష్యులకు అన్నము పెట్టి చదువు చెప్పువాడని అర్థము. దీనిని బట్టి నేటి ఆచార్య, కులపతుల విషయమాలోచించినచో ఆశ్చర్యము కలుగక మానదు కదా!

అందుకే శ్రీ శర్మమహోదయులు, గురువన్న పదమునకుగల మహత్తరార్థాన్ని వివరించే అనేక యుదాహరణలను సేకరించి సంకలనమొనరించారు. మనలోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానప్రకాశము నందించువాడు గురువు ప్రహ్లాదుడన్నట్లు అనర్థ చయంబునందు దుశ్శీలత అర్థకల్పనము సేయువాడు గురువు కాదు. అతడు క్రూరుడు.

మనకు పూర్వాపరవిద్యలున్నాయి కేవలము ఆత్మజ్ఞానము నందించు పరావిద్యయగు జ్ఞానమునకు తోడు లౌకిక జ్ఞానమును కలిగించు అపరావిద్యకు కూడా విలువనిస్తాము దానికే విజ్ఞానమనిపేరు "జ్ఞానం విజ్ఞాన సహితం యద్ జ్ఞాత్వా తం పూర్వమభివాదయేత్" అన్నది మన సిద్ధాంతము నేలవిడిచిన సాము చేయువారము కాము మనము.

అట్టి పరాపరవిద్యలను, జ్ఞాన విజ్ఞానములను మన గుండెలనింపు వాడు గురువు. అట్టి గురువునకు సంబంధించిన విజ్ఞానసర్వస్వమీ "గురువిజ్ఞాన సర్వస్వ"మన్న యుద్గ్రంథము.

ఇప్పట్టున మాపితృపాదులు, కమనీయ కవితా తపస్వి, కీ॥శే॥ కల్లూరి వేంకట సుబ్రహ్మణ్య దీక్షిత మహోదయులు పద్యరూపమున వెలిబుచ్చిన భావము నిట యుదహరించి శ్రీబాలకృష్ణశర్మగారి మహత్తర కృషికి నా నివాళి

సమర్పించుకుంటాను.

సీ॥ మునుల జీర్ణకుటీరముల ముంగిళులు
విశ్వ విద్యాలయమ్ములై వెలయునాడు
ఋషి శేఖరోదాహ హృదయ సీమలు జ్ఞాన
భాండారములనంగ వరలునాడు,
తపసులాత్మీయ చైతన్య విద్యుద్దీప
కళజోపి తమమెల్ల గడపునాడు
మునిముఖాబ్జముల జాల్కొను బ్రహ్మకళ కళా
వ్యాఖ్యాన పఙ్క్తులు వ్రాయునాడు
కపటమెఱుఁగక పొరపాటు గనక జ్ఞప్తి
నూను శుకపఙ్క్తి సహపాఠియైన నాడు
అంటినది యొక్క యక్షర మదిదలంతు
భారతీయార్ష భారతీవ్యక్తి కొఱకు

**ఆచార్య ఎస్వీ రామారావు**
అధ్యక్షులు, తెలుగుశాఖ
డీన్, ఆర్ట్స్ ఫ్యాకల్టీ (రిటైర్డ్)
ఉస్మానియా విశ్వవిద్యాలయం

# 'గురు' సర్వస్వము

గురు శిష్య సంబంధం ఎంతో విశిష్టమైనది. పవిత్రమైనది. భారతీయ సాంస్కృతిక వికాసంలో శిష్యాచార్య వ్యవస్థ అత్యంత ప్రముఖస్థానం వహించింది. భారతీయులకే కాదు సమస్త మానవజాతికీ ఆదర్శం గురువు. గ్రీకు దేశంలో ప్లాటో, అరిస్టాటిల్, అలెగ్జాండర్ మున్నగు గురుశిష్యులు ప్రసిద్ధి గడించారు. ప్రాచీనమైన మన వేదశాస్త్రాలు, పురాణేతి హాసాలు, కావ్య నాటకాలు గురుకులముల జీవన చిత్రణకు పట్టం కట్టాయి.

చరాచర జగత్తును సృజించి, వాటి స్థితి, లయములకు కారకుడైన ఆదిదేవుడే ప్రపంచానికి ప్రథమ గురువు. "గురు స్సాక్షాత్ పరబ్రహ్మ". భారతీయ గురుపరంపర అపారమైనది. అసంఖ్యాకమైనది. ఈ గ్రంథకర్త పేర్కొన్నట్లు "ఏ దేశంలోను ఇంత పటిష్ఠమైన, ప్రామాణికమైన, అనుస్యూతమైన శైష్యోపాధ్యాయిక యున్నట్లు కానరాదు" (పు. 131). ఉపనిషత్కాలంలో యాజ్ఞవల్క్యుడు, ఉద్దాలకుడు, శ్వేతకేతువు, అష్టావక్ర ప్రభృతులు - రామాయణకాలంలో వశిష్ఠ, విశ్వామిత్రులు, - భరత వంశీకుల యుగంలో వ్యాస, ద్రోణ, భీష్మాచార్యులు, శుకుడు, శుక్రాచార్యుడు, పరశురాముడు - బలరామకృష్ణుల విద్యాగురువు సాందీపుడు మున్నగువారు సమకాలీన సమాజానికి మార్గదర్శకులై ముందుకు నడిపించారు. జీవన పోరాటంలో కింకర్తవ్యతా మూఢుడైన నరునికి గీతోపదేశం చేసి ధర్మసంస్థాపనం కావించిన నారాయణుడు "గురూణాది గురుః"గా వినుతికెక్కాడు. కవికుల గురువు కాళిదాసు కౌత్సవరతంతుల అనుబంధాన్ని హృద్యంగా వర్ణించాడు. అర్థశాస్త్రకర్త అయిన చాణుక్యుడు చంద్రగుప్తుని రాజనీతి విశారదునిగా తీర్చిదిద్ది మౌర్యసామ్రాజ్య స్థాపనలో కీలకపాత్ర వహించాడు

అయితే ప్రాచీన భారతీయ విద్యావిధానం లౌకికవిద్య, ఆధ్యాత్మిక విద్యలుగా రెండు విధాలుగా కొనసాగింది. మహర్షులైన మన గురువులు ఆధ్యాత్మిక విద్యకు ప్రాధాన్యం ఇచ్చారన్నది జగమెరిగిన సత్యం "ప్రజ్ఞానం బ్రహ్మ", "అయమాత్మా

బ్రహ్మ", "అహం బ్రహ్మాస్మి", "తత్త్వమసి" అన్న వాక్యరత్నాలు వారి జ్ఞానబోధ నుంచి వెలువడిన సూక్తి ముక్తాలే.

విద్వాంసులైన శ్రీ తోటపల్లి బాలక్రిష్ణశర్మగారు భారతీయ విజ్ఞాన వాఙ్మయమంతా మథించి గురు శిష్య తత్త్వము - వారి లక్షణాలు, ఆదర్శాలు సూక్ష్మేక్షికతో విశ్లేషించి విశదీకరించారు. ఉపనిషత్తులు, అధ్యాత్మ రామాయణం, దేవీభాగవతం, వివేక చూడామణి మున్నగు మహాగ్రంథాల ఆధారంగా గురుశిష్య సంబంధాలను - గురు శుశ్రూషలో శిష్యులు శ్రద్ధ, శిష్యులపై గురువుల వాత్సల్యభావం మున్నగు పలు అంశాలను సహృదయైక వేద్యం కావించారు.

పౌరాణిక కాలానికే కాక చారిత్రక యుగానికి చెందిన గురు పరంపరను కూడా వివరించటం ఈ గ్రంథానికి నిండుతనం చేకూర్చింది శ్రీశంకర, రామానుజ, రాఘవేంద్రులు - అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత మతానుయాయులు, పీఠాధిపతుల వివరాలు, ఆధునికులైన రామకృష్ణ వివేకానందులు, షిర్డీ సాయిబాబా, సత్యసాయిబాబాల ప్రస్తావనలు పొందుపరచటం సముచితంగా ఉంది.

ప్రాచీన విజ్ఞానానికి సంబంధించిన సంకలన గ్రంథాలు కొన్ని వెలువడ్డాయికాని, 'గురు' విజ్ఞాన సర్వస్వంగా ఉగ్గడింపదగిన "శ్రీ గురు విజ్ఞాన సర్వస్వం" అన్న ఈగ్రంథం ఒక్క చేతిమీదుగా రూపొందటం పరమాశ్చర్యకరమైన సన్నివేశం. దత్తపీఠాధిపతి సద్గురు శ్రీ గణపతి సచ్చిదానందస్వామి అనుగ్రహం చేతనే ఈ కార్యం సుసాధ్యమైంది.

వర్తమాన సమాజంలో గురుశిష్య సంబంధం దిగజారిందని, గురువుల పట్ల చులకనభావం ఏర్పడిందని కొన్ని అపోహలు వ్యాప్తిలో ఉన్నాయి. కాని పైకి కనిపించేది ఒకటైతే లోపలదాగివున్న వాస్తవం మరొకటి అని గుర్తించాలి. విద్యను వ్యాపారంగా మారుస్తూ ర్యాంకుల వేటలో పరుగెడుతున్న విద్యాసంస్థలు తమ గొప్పను ఎంతగా ప్రకటించుకొంటున్నా, ఆయా విషయాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులే వారికీర్తి సౌధానికి మూలస్తంభాలన్న విషయం విస్మరింపరాదు చుక్కారామయ్య వంటి బోధగురువులను బట్టి విద్యాసంస్థలకు గౌరవం ఏర్పడుతుంది కాని సంస్థలను బట్టి వ్యక్తులకు గౌరవం కలుగదు. అయితే నేటి విద్యా వ్యవస్థ ఆధ్యాత్మిక విజ్ఞానానికి దూరమై కేవలం భౌతికమైన విలువలకు ప్రాకులాడటం ప్రశంసనీయంకాదు

బాలకృష్ణ శర్మగారి సోదరులు శ్రీ తోటపల్లి కృష్ణమూర్తి గారితో నాలుగుదశాబ్దాల క్రితం నేను స్థాపించిన 'జ్యోతిర్మయి' సంస్థ ద్వారా ఆత్మీయతా భావం ఏర్పడింది. నేడు ఈ బృహద్గ్రంథం ద్వారా శర్మగారి పరిచయభాగ్యం కలుగటం పుణ్యవిశేషంగా భావిస్తున్నాను. కరువుజిల్లాగా మారిన పాలమూరు పాండితీ ప్రాభవంలో మాత్రం సుసంపన్నమైనదని మరొకసారి ప్రకాశమానం చేసిన శ్రీ బాలకృష్ణ శర్మగారిని మనసారా అభినందిస్తున్నాను.

డా॥ ఎస్వీ రామారావు

శ్రీ కపిలవాయి లింగమూర్తి
వాణీ సదనం,
నాగర్ కర్నూలు

# 'గురువు'ను గూర్చి విశదీకరించడం

అహం అనగా 'నేను' అనే ఈ రెండక్షరాలలో మానవుని యొక్క సమస్త లక్షణాలు అనగా అతని గుణగణాలు, ఆచారాలు, ఆహారవిహారాలు అన్నీ యిమిడి యున్నవి. అదే విధంగా లోకమన్న మానవుడే భూమిపై వుండే సమస్త మానవులు సృష్టి అన్నపుడే జగత్తులో గల సమస్తమైన చరాచరాలు విశ్వమున్నపుడే భూగోళం వంటి అనేక గోళాలను గర్భీకరించుకొన్న బ్రహ్మాండాలు రెండేసి అక్షరాల పేర్లలోనే ఇమిడి ఉన్నవి.

ఇట్లు విశ్వమొకటే కాదు, సృష్టి కర్తలైన బ్రహ్మ, విష్ణు, ఈశ్వరులనబడిన త్రిమూర్తులు వానికి మూలమైన బ్రహ్మ తన్నువు గూడ రెండక్షరాలలోనే యిమిడియున్నది.

పైన చెప్పబడిన విశ్వమంతా అనగా సృష్టి దానిలోని చరాచర జగత్తుయొక్క తత్త్వమంతా మళ్ళీ 'జ్ఞాన'మనే రెండ క్షరాలలో ఒదిగి యుంది. పైన చెప్పబడిన విశ్వవిషయమంతా ఈ 'జ్ఞానము'లో ఒక అల్పాంశం మాత్రమే. ఈ జ్ఞాన మనేది ఎంత విస్తృతమయిందో, ఎంత గంభీరమయిందో యింతవరకు మానవ మేధస్సుకెవరికీ అందలేదు. ఈ విధంగా అనంతమైన ఈ జ్ఞానరాశి అంతా మళ్ళీ 'గురు'వనే రెండక్షరాల ద్వారానే లోకానికందుతుంది. కనుక ఈ సృష్టి అంతా ద్వంద్వరూపమైన ఒక అక్షర పరబ్రహ్మలీల.

మానవుడు మహాత్ముడౌతాడు. ఋషి అవుతాడు, ద్రష్టయౌతాడు, పరమహంస అవుతాడు, చివరకు పరతత్త్వమైన బ్రహ్మత్వంలో 'అహం బ్రహ్మాస్మి'యని అద్వైతాన్ని భజిస్తాడు కోని, అది మళ్ళీ గురువు దగ్గర మాత్రం చెల్లదు. కనుక విశ్వంలో గురువు యొక్క స్థానమెంత ఉన్నతమైందో యిక్కడ పాఠకులే ఊహించుకోవాలి.

లోకంలో నేదైనా శాస్త్రం, కళ, విద్య, కర్మకౌశలంగాని ఎవరికేది అలవడెనా అదంతా గురుమూలకమే. అట్లా కానినాడతడు వానిలోనెంత సాధన చేసినను ఆ విద్యలింగం గ్రుడ్డిగానే మిగిలిపోతోంది.

పుష్పదంతాచార్యుడు శివుని తన మహిమ్న స్తోత్రంలో

– "అసిత గిరి సమం స్యాత్ కజ్జలం సింధుపాత్రే
సురతకు వరశాఖా లేఖినీం పత్రముర్వీం
లిఖిత యది గృహీత్వా శారదా సర్వకాలం
తదపి తవ గుణాణమీశ పారం నయాతి॥"

భా: ఓ శివా! సముద్రానంతా సిరాబుడ్డి, కల్పవృక్షముల శాఖలన్నీ కలాలు, భూమినంతా కాగితంగా చేసి శారదాదేవిని గుణాలను గురించి నిరంతరం వ్రాయ సాగినప్పటికి, ఆమె దానిని పూర్తిచేయలేదు. అని చెప్పిన యిదే ఆ భావాన్ని సరిగా కబీరుదాసు తన దోహాలో –

– "ధరతీకో కాగజ్ కరై -కలం కరై బనరాజ్
సాత్ సముందర్‌కో మషీకరై హరిగుణతిగానజాయ్"

భా: భూమినంతాకాగితం, వనాలన్ని కలాలు, సప్తసముద్రాలు సిరాగా చేసినప్పటికి భగవంతుని గుణాలన్ని సంపూర్ణంగా వ్రాయలేము. అని విష్ణుపరంగా చెప్పినాడు.

దీన్ని శ్రీపుట్టపర్తి నారాయణాచార్యులుగారు తనయొక్క కబీరు రచనావళిలో అనువదిస్తూ –

భూమినంతయు కాగితము గావింతును. వృక్షములను కలములను చేయుదును. సప్తసముద్రములను సిరాయొనరింతును. ఏమి జేసిననేమి గురువు గుణములు వ్రాయుటకు వీలుగాదు. అని గురుపరంగా అనువదించినాడు. బహుశః వారికి లభించినపై దోహాలో –

"గురుగుణ లిఖాన జాయ్" – అని పాఠభేదముండవచ్చు. లేదా ఆయనే అనగా కబీరే

"గురుగోవింద్‌లో ఏకైహై దూజాయహ్ ఆకార్!"....

చూడటానికి రెండు ఆకారాలు వేరు వేరైనా 'గురువు గోవిందుడు' ఇద్దరొకటే అని ఆయనే చెప్పినాడు. కనుక ఆ విధంగా కూడ 'హరి' శబ్దాన్ని శ్రీపుట్టపర్తి వారు గురుపరంగా స్వీకరించి యుండవచ్చు. ఏదైతెనేమిగాని -

ఇపుడటువంటి ఒక అగాధమైన సముద్రానికే బాలకృష్ణ శర్మగారేత మెత్తినారో, దీని కొరకు వీరెంతకాలంగా ఎన్ని గ్రంథాలు శోధించవలసి వచ్చిందో ఈ క్రింది పట్టిక చూస్తె మీకు అర్థమౌతుంది.

శ్రీమద్భగవద్గీత - శ్రీమద్భాగవతం - శ్రీమన్మహాభారతం - అధ్యాత్మ రామాయణం - ఆంధ్ర భాగవతం - కామకళాసూత్రం - కోష్టీ ప్రదీపకం - గురు కృపాలహరి - గురు గీత - గురు సూత్రాలు - తులసీ రామాయణం - దేవీభాగవతం - నారాదపురాణం - బ్రహ్మ పురాణం - బ్రహ్మాండపురాణం - బ్రహ్మవైవర్తము - యోగవాశిష్ఠం - వాల్మీకి రామాయణం - విశ్వనాథ కల్పవృక్షము - విశ్వనాథ చక్రవర్తి గుర్వష్టకము - శంకరవిజయము - శబ్ద కల్పద్రుమం - శివ పురాణం - సనత్సు జాతీయం - సీతారామాంజనేయ సంవాదం - స్వారోచిష మను సంభవం - సూతసంహితలు.

ఉపనిషత్తులు - అమృతబిందు, ఈశావాస్యం, ఐతరేయ - కఠ, ఛాందోగ్య, తేజోబిందు, బ్రహ్మబిందు, మైత్రేయ, శ్వేతాశ్వతర - లు.

ఇవి ఇందులో నాకు కనిపించినవి కొన్ని మాత్రమే. ఈ గ్రంథములో వీరు 'గురు' శబ్ద నిర్వచనం. అతని యొక్క లక్షణాలు, గురువులలోగల భేదాలు, శిష్యుని లక్షణం, శిష్యుని పరిరక్షించటం, శిష్యుడు గురువుగారికి చేయవలసిన సేవ, గురువు శిష్యునికి బ్రహ్మవిద్యను బోధించటం పరమ గురువులైన మతత్రయమహనీయుల చరిత్రలు విద్యాలక్షణం, గురువు శిష్యుని గురుపదం (పీఠం)పై అభిషిక్తుని చేయడం, శిష్యుడు గురువునకు చెల్లించవలసిన కట్నం. అతనికి గురువు పట్ల ఉండవలసిన భక్తి, గురుసేవ, గురుధిక్కారఫలం", -

అనే విషయాలన్నీ యిందులో వీరు రత్నహారం వలె ఒక క్రమములో కూర్చినారు. కూర్చటమే కాక పురాణ కవులను మరియు కథలను గూడ జోడించినారు.

గ్రంథరచన ఒక యెత్తుకాగా, పిమ్మట దాన్ని ఒక క్రమములో సరిచేసికోవటం మరొక ఎత్తు. ఈ అవగాహన రచయితల్లో ఈనాడు చాలమంది కుండదు.

ఈ బాలకృష్ణ శర్మగారెవరో నేనింతవరకు వీరి పేరు గూడవినలేదు. వ్యక్తి నెరుగనని యిక వేరే చెప్పనక్కరలేదు. ఒకనాడు నా దగ్గరకు ఆకస్మికంగా వచ్చి తన యొక్క ఈ రచన నిచ్చి పరిచయం చెప్పుకొన్నారు. ఇది దాదాపుగా 500 పుటల గ్రంథం. నేను విషయసూచిక చూచి, అయ్యా! నావల్ల మీ గ్రంథమునకు న్యాయం జరుగదు. నేనంత సమర్థుని కాను. శ్రీ తెలకపల్లి విశ్వనాథ శర్మగారి వంటి వారు దీనికి తగిన వారని చెప్పినాను. అది విని వీరు నేనాయనను గూడ కలిసినాను. అయినా మీరు వ్రాయించితే, యిక యితరు లక్కరలేదన్నా వినలేదు. ఇది నాకు శక్తికి మీరిన పనియే, అయినా పెద్దవారు వచ్చినారని అంగీకరించక తప్పలేదు. దీన్ని గురుపూర్ణిమనాడు చేతిని తీసుకొని మూడుదినాలు తదేకంగా అధ్యయనం చేసినాను. వారి కోరిక మేరకు ఈ నాలుగు మాటలు వ్రాసినాను.

ఇట్లు

సాహిత్యారాధకుడు

**కపిలవాయి లింగమూర్తి**

పార్థివ గురుపూర్ణిమ

తేది 21-07-05

# అభిప్రాయం

"గురుర్బ్రహ్మా, గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మతస్మై శ్రీగురవేనమః"

గురువు శబ్దము త్రిమూర్తితత్వము సృష్టి, స్థితి, లయ కారము. 'గు' కారశ్య గురుయోః, 'రు'కారశ్య రూపయోః, 'వు' కారస్య ఉపయోః, అజ్ఞానమే చీకటి తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసాదించేవాడు గురువు.

అద్వైత తత్వ సంప్రదాయము శ్రీ శంకర భగవత్పాదులతో యావద్భారతముననే వ్యాప్తినంది నిత్య సత్య తత్వముగా వెలుగొందుచున్నది.

**గురుపరంపర:** - నారాయణుడు - చతుర్ముఖుడు - వశిష్ఠుడు - శక్తి - పరాశరుడు వ్యాసుడు - శుకుడు - తరువాత గౌడపాదులు గోవింద భగవత్పాదులు - శ్రీ శంకరభగవత్పాదులు

వీరి అద్వైత సిద్ధాంతము ఉపనిషత్ప్రతిపాదితము నిత్య శుద్ధ చైతన్యమొకటి సత్యము

**అసతోమా సద్గమయ**
**తమసోమాజ్యోతిర్గమయ**
**మృత్యోర్మా అమృతంగమయ**

**అసత్తులో నుండి సత్తులోకి, తమస్సు నుండి వెలుగులోకి, మృత్యువు నుండి అమృతత్వమును చేరడము. గురుజ్ఞాన ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి, వీటిలో జ్ఞానశక్తి మూలము. శ్రీగురుతత్వమే దక్షిణామూర్తి.**

**చిత్రం వటుతరోర్మూలే । వృద్ధాః శిష్యా గురుర్యువా ।**
**గురోస్తు మౌనంవ్యాఖ్యానం । శిష్యాస్తుచ్ఛిన్న సంశయాః ।**

**మౌనంముని ధర్మము.**

శ్రీ దక్షిణామూర్తి సర్వలోక గురుడు, సంసారరోగ గ్రస్తులకు చికిత్సకుడు, సర్వవిద్యానిధి అట్టి దేవుని నమస్కరించవలెను.

"గురువే సర్వలోకానాంభిషజేభవ రోగిణాం"

"నగురోరధికం, నగురోరధికం" శివశాసనతో శివశాసనతః

- (హరి శాసనతః)

తోటపల్లి బాలకృష్ణ శర్మగారు శ్రీగురుభ్యోనమః అను శబ్దముతో ఎన్నో విషయాలను సేకరించి సంకలనము చేసారు. గురుతత్వము, గురు శిష్యుల సంబంధము, గురుబోధ, గురుగీత, గురు ధర్మము, గురు మిత్ర వాత్సల్యము గురు కులవాసాలు మొదలగునవెన్నియో సేకరించి అనేక గురు సంబంధ విషయాలను తెలియబరుస్తు జ్ఞాన జ్యోతిని అందిస్తున్నారు.

వీరి కృషి ప్రశంసనీయము దీని వలన వీరిలోగల గురు భావన వ్యక్తమగుచున్నది. ఇట్టి సంకలన గ్రంధము చాల గొప్పది.

ఇట్టి సంకలన గ్రంధానికి అభిప్రాయం వ్రాసే అవకాశం కలిగించినందులకు ధన్యవాదములు.

ఇట్లు

**బి.ఎల్.ఎన్.మూర్తి**

ఆంధ్రోపన్యాసకులు

వనపర్తి

# అభిప్రాయం

పూజ్యులు గురుతుల్యులు శ్రీ తోటపల్లి బాలకృష్ణ శర్మగారు తమ గ్రంథమునకు నా అభిప్రాయమును వ్రాయమన్నారు. నాకు ఈ అవకాశము కల్పించినందులకు కృతజ్ఞుడను.

"సరసులగు పండితుల విమర్శనము లెల్లగడచిన దైకదా నిర్దుష్ట కావ్యమగును" అన్నట్లు ఈ గ్రంథరాజము అందరిచే శభాష్ అనిపించే రీతిలో రూపుదిద్దుకున్నది. శ్రీ శర్మగారు అనేక గ్రంథములను పరిశోధించి యేర్చి కూర్చిన సుభాషితాలు, దృష్టాంతాలు ఉదాహరణలతో యెంతో మధురముగా సులభశైలిలో రచించి పాఠకలోకానికెంతో ఉపకారము గావించినారనుటలో అతి శయోక్తి లేదు. ఈ గ్రంథమును పురాణ ఇతిహాస వేద, ఉపనిషత్తులు మొదలగు ఉత్తమ గ్రంథములను ప్రమాణముగా తీసుకొని వ్రాసినారు. గురువుల గురించి చాలా బాగా వర్ణించినారు.

శ్లో॥ అజ్ఞాన తిమిరాంధానాం జ్ఞానాంజన శలాకయా ।
చక్షురున్మీలితం యేన తస్మై శ్రీగురవేనమః ॥

శ్లో॥ త్యజేద్ధర్మం దయాహీనం విద్యా హీనం గురుం త్యజేత్ ।
త్యజేత్ క్రోధముఖీం భార్యాం నస్నేహా న్బాంధవాం స్త్యజేత్

అను ఆర్యోక్తిని అనుసరించి ఈ గ్రంథమున చాలా విషయాలను పొందుపరిచిరి.

ఇట్లు
భవదీయుడు, సాహిత్యాభిమాని
డా॥ వలియుద్దీన్ (ఆ.వే.వై)
వనపర్తి

# అభిప్రాయం

యస్మాదుత్పత్తి గుప్తీ క్షతిరపి జగతాం యచ్చ శాస్త్రైక యోనిః
సర్వజ్ఞం మాయయా యత్సహజ సుఖ సదద్వైత సంవిత్స్వరూపమ్ ।
తద్బ్రహ్మ స్వప్రకాశం శ్రుతి శిఖర గిరాం సైవ తాత్పర్య భూమిః
స్వాత్మాఽసౌ యం విదిత్వా జనమృతి జలధిం నిస్సరంతీహ సంతః ॥

(స్వారాజ్య సిద్ధి)

"స్వప్రకాశమూ, సర్వజగత్తుకూ వేదశాస్త్రాలకూ మూలకారణమూ, వేదాంత తాత్పర్యస్థానమూ అయిన అద్వితీయ సచ్చిదానంద పరబ్రహ్మ పదార్థమనే ఆత్మ తత్త్వాన్ని తెలియగల్గడమే సర్వోపద్రవ కారణమైన జనన మరణ రూప సముద్ర తరణోపాయము" - అనేది భారతీయ ఆధ్యాత్మిక మీమాంసకు పరిశిష్ట సారము.

దుర్లభమైన మానవ జన్మకు ముక్తి ప్రదమైన ఆత్మజ్ఞానాన్ని పొందడమే పరమ ఫలము. గుర్వనుగ్రహ లబ్ధి లేనిదే ఆత్మజ్ఞానము సిద్ధించదు-

శ్లో॥ యస్య ప్రసాదాదహమేవ సర్వం మయ్యేవ సర్వం పరికల్పితం చ ।
ఇత్థం విజానామి సదాత్మరూపం తస్యాంఘ్రి పద్మం ప్రణతోఽస్మి నిత్యమ్ ॥

అంటూ గురుగీత గురు ప్రాభవాన్ని స్పష్టంగా చెప్పింది. సర్వకారణమైన ప్రకాశరూప పరమాత్మనే (పరమశివుడే) సర్వగురువు '(స) పూర్వేషామపి గురుః కాలాన వచ్ఛేదాత్' అంటూ పతంజలి మహర్షి యోగదర్శనంలో పరమాత్మ సర్వగురుత్వాన్ని సిద్ధాంతించాడు.

మాతాపితరులు, ఆచార్యుడు గురువులుగా ప్రథమ గౌరవార్హులు అన్న శ్రుతిని-

శ్లో॥ పురుషస్యేహ జాతస్య భవంతి గురవః త్రయః ।
ఆచార్యశ్చైవ కాకుత్స! పితా మాతా చ రాఘవ! ॥

అంటూ వాల్మీకి మునీంద్రుడు ప్రతి వ్యక్తికీ ముగ్గురు గురువులున్నారని పేర్కొన్నాడు.

అట్టి సర్వోత్కృష్టుడైన గురువు ప్రాశస్త్యాన్నీ, శిష్యుని లక్షణాలనూ శ్రీ తోటపల్లి బాలకృష్ణ శర్మగారు విస్తృతంగా అర్థవాదోపపత్తికంగా 'శ్రీ గురుభ్యోనమః' అనే బృహద్గ్రంథంగా సంతరించారు. సర్వంకషమైన పాండిత్యంతో, బహుముఖీనమైన అభ్యాసంతో, చక్కని వ్యుత్పన్నతతో బహు పురాణేతిహాసోపనిషద్గాథలతో శర్మగారు గురువు తత్త్వాన్నీ, శిష్యుల భక్తి, వినయ విశ్వాసాది సద్గుణ సంపత్తుల ప్రయోజనాలనూ సరళ సుందరంగా సంకలన వ్యాఖ్యారూపకంగా ఇందులో పొందు పరిచారు. గ్రంథాన్ని సిద్ధంచేయడానికి విషయ బాహుళ్యాన్ని సేకరించడంలోనూ, క్రమంగా కూర్చడంలోనూ శర్మగారి అభినివేశానికి,

తపనకూ ఆశ్చర్యం కలుగక మానదు.

సహజంగా అద్వైత సంప్రదాయాన్ని అభిమానించే శర్మగారు తమ 'శ్రీ గురుభ్యోన్నమః' గ్రంథానికి సమగ్రత కలిగించే విధంగా అద్వైత, విశిష్టాద్వైత, ద్వైతాల నే త్రిమత ప్రవర్తకులైన ప్రాచార్యులందరినీ ప్రస్తుతించడం వల్ల 'వ్యాఖ్యాన కాలే చాద్వైతం, ద్వైతం చా చరణే తథా' అనే శుష్క తత్వానికి అపవాదంగా అనభవాద్వైతాన్ని ప్రదర్శించడం వారి పరిణతికి దృష్టాంతం.

శర్మగారి రచనలో మచ్చుతునకలు, మెచ్చు తునకలు కొల్లలు -

ఆచార్యుని తరణ తారణ దక్షతను ప్రకటించే -

'ఆచినోతి హి శాస్త్రాణి ఆచారే స్థాపయత్యపి ।
స్వయ మాచరతే యస్తు తమాచార్యం ప్రచక్షతే ॥'

వంటి నిర్వచనాలు ఈనాటి గురువులకు చురకలు.

గురు శిష్య సంబంధాన్ని తెలిపే గురు శూశ్రూషా గాథలలో ధౌమ్యుడు - అతని శిష్యులైన అరుణ, పైల, ఉపమన్యులనే శిష్యుల కథలు మిగుల విజ్ఞాన దాయకాలు. నాడు గురువులు శిష్యులను అనుగ్రహించడానికై పాటించే గురుకుల సంప్రదాయ పరీక్షా విధానం నేటి విద్యార్థులకు కనువిప్పు, ఆదర్శం.

ఉత్తరోత్తరోన్నతములైన భగవన్నిష్ఠ, భాగవతనిష్ఠ, ఆచార్యనిష్ఠ అనే పర్వత్రయ నిష్ఠలలో భగవంతునికంటే భక్తుడు, భక్తుని కంటే ఆచార్యుడు గొప్ప అనడంలో ఆచార్యుని ఔన్నత్యం వ్యక్తమౌతున్నది. భగవంతుడు ప్రత్యక్షా గోచరుడు. భాగవతుడు స్వయం తరణ సమర్థుడు మాత్రమే. ఆచార్యుడే తారణ క్షమత గలవాడు.

ఎంతటి సమర్థుడైన గురువైనా దోషదూషితాహార భక్షణతో శక్తి విహీనుడౌతాడని అనడానికి శ్రీమద్రామానుజుల వారి కాకరకాయల కథ చక్కని నిదర్శనము.

సద్గురు కృప అమృతత్వాన్ని కలిగిస్తుంది. అలా కాని విద్య గాడిద మోసే గంధపు చెక్కల వంటిదే అనే విషయాన్ని చెప్పే -

'కేషాంచిత్ ధృతకాష్ఠ భార సదృశం జ్ఞానం హి మూర్ధ్ని స్థితం
కేషాంచిత్ హ్యాదిసంగతంచ భవతి ప్రోద్యద్ధసంతీ సమమ్ ।
కేషాంచిత్ వివశన్మ దాశ్వ నివహారూఢం భవేత్ స్యందనం
కింత్వంగాంగ సుధాయతే గురుకృపాసిక్తస్య పుణాత్మనః ॥'

అనే శ్లోకం స్మరణీయం. కొందరి జ్ఞానంలో పరిమాణభారం కాక పదార్థగౌరవం ఉండదు. కొందరిది అహంకారాల నిప్పుల కుంపటి. మరికొందరిది భూమిపై కాలు నిలువని

ఉన్మత్త విహాయసయానం. గురు కృపాలబ్ధిని పొందిన శిష్యుల జ్ఞానమే నిత్యానంద సుధా ప్లవనం. ద్రోణ, భీష్మ సంవాద రూపమైన ఈ పూర్వోక్తి శిష్యుల సంస్కారాన్ని బట్టి వారు గురువుల నుండి గ్రహించే విజ్ఞాన విషయ వైవిధ్యాన్ని కన్నులకు కట్టినట్లు చెప్తుతున్నది. గురు ముఖతః తాత్పర్యాంతరార్థ రహస్యాలను ఒంట బట్టించుకున్న శిష్యుల విద్యకున్న ప్రాధాన్యం స్వయం ప్రజ్ఞతో **పుస్తక పఠన మాత్రం**తో లభించిన విద్యకు ఉండదు -

'పుస్తక **ప్రత్యయాధీతం, నాధీతం గురు**సన్నిధౌ ।
న శోభతే **సభామధ్యే జారగర్భ ఇవ స్త్రి**యః ॥"

అని పెద్దల అనుభవ సూక్తి.

ఈవిధంగా సంప్రదాయబద్ధమైన గురుశిష్య సంబంధాలను వివరిస్తూనే - వెర్రితలలు వేసిన ఆధునిక నాగరిక సమాజంలో గురు శిష్య వ్యవస్థకు విఘాతం కలిగిందని శర్మగారు అడుగడుగునా ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యాగర్వంతో విర్రవీగే శిష్యుడు సద్గురు శిష్యత్వాన్ని స్వీకరించలేక పతితుడౌతాడనే అంశాన్ని శ్రీ శుకమహర్షి కథలో వివరిస్తూ - జగద్గురు శబ్దానికి జగత్తుకే గురువు అనిమాత్రమే కాకుండా - జగత్తులోని ప్రతి జీవిలోనూ, అణువులోనూ గురుత్వాన్ని చూచేవారు అంటూ షష్ఠీతత్పురుషంగా కాకుండా, బహువ్రీహ్యర్థంలో జగద్గురు శబ్దానికి గూఢార్థం వివరించడంలోని శర్మగారి బుద్ధి నైశిత్యం ముదావహం -

"అప్యున్మత్తాత్ప్రలపతః బాలాచ్చ పరిజల్పతః ।
సర్వతః సార మాదద్యాత్ అశ్మభ్య ఇవ కాంచనమ్ ॥"

అని కదా ఆర్యోక్తి

శ్రీ తోటపల్లి బాలకృష్ణ శర్మగారు రచించిన 'శ్రీగురుభ్యోనమః' అనే గ్రంథం స్వయం సమగ్రమై ఎల్లరకు ఆవశ్యక విషయ శోభితమైనది. దీనికి పరిచయ వాక్యాలు కేవలం ఔపచారికమే. ఈ రూపంగా నాకు ఇందులో ప్రసక్తి కలుగడానికి శర్మగారి సౌజన్యమే కారణం. వారు సుమనస్కతకు నమోవాకములు

**ఓం తత్సత్**

ఇట్లు
**డా॥ తలముడిపి బాలసుబ్బయ్య**
మహబూబ్‌నగర్

## Sri Grurbhyannamah

In bringing out this book the author Sri Totapally Balakrishna Sharma has taken lot of pains to stress the need of an efficient preceptor or "Gurur" in moulding and shaping out a disciple or "shishya into a perfect spiritual being depending on the level of discipline", dedication and devotion of the disciple (Shishya). Indeed the author has rightly pointed out in his foreword/perfect that an infant baby before its birth, in the womb of its mother, will be a divine being. But when it is delivered on to the earth it develops as it grows, into a selfish being, encompassed by Maya, and thus loses its divine nature. But under the conscious care, education and training by a competent, preceptor or (Guru) it regains its spiritual strength. This only shows clearly that an individual being, will be led from animal being to human being and then into divine being in gradual steps under the care and training of a competent Guru.

The author in his elaborate compilation listed out a number of Acharyas, both ancient and modern from Adishankara to Paramahamsa Rama Krishna who had mesmarised and transformed their disciples like Sureswara Charya, Totaka Hstamalaka and in modern times Swamy Vivekananda into perfect spiritual beings who shook the entire humanity by their word and spiritual powers. The author, himself being a disciple of Sri Sri Sri Satchidananda Ganapathi has under gone a spiritual transformation by following his perceptions and teachings. Of course he has not exhibited openly to any one, nor in his writings, of his spiritual powers. Still he behaves as a sincere and honest disciple of his 'Guru'. In his zeal to emphasise the importance of 'Guru' he went round various centers of spiritual and religions orders like Srinagari, Mnatralaya, Kanchi, Pusphagiri, Chinna Jiyar Swamy center of Visistadvita and learnt that each of these centers was unique in its own way and by a stsytem of its own to promote religiousity and spirituality. He found that all the Acharyas or Gurus left a rich legacy, in their own right, of a rich order of discipline, dedication, respect – fullness to Gurus, Indeed Bharat i.e.., India has a rich spiritual heritage, which no other country can claim. We have proofs that these Aadi Gurus whether it Aadi Shankara, Madhav, or Ramanuja of the medieval period or Swamy Vivekanand of the recent past and

who was the disciple of Sri Ramakrishna Paramahams, have been able to stir the whole world by their spiritual powers. The author, through out his authorship extensively quoted the sayings of the Great Preceiptors (Gurus) to remind and reestablish the supremacy of spirituality over secular knowledge and material subjects to which the present Generation is giving importance. He deplores the said trends of ignoring the Gurus, and not paying due respect to the gurus. No doubt we are acquiring knowledge through various subjects and through various kinds of teachers. This knowledge of secular subjects, which help us to amass wealth and power will not confer the benefits of wisdom and evoke the spirit in the individuals, learning them. It is only through spiritual learning and practices that we can eliminate the conflicts and confer peace to the whole universe. Such examples he quoted extensively through out his book right from Vedas, Puranas & Poetry.

The author ardently desires and appeals to the present generation of students to rededicate and devote themselves to the cause of paying first respect to their welchosen 'Grurs" and gain their mercy and blessings for their own benefits and finally appears to them to revive the ancient values for the harmonious going on of the society at large. I am very much thankful to Sri Totapally Bala Krishna Sharma in asking me to write my views about his authorship entitled, as "Grurbhyannamah".

My views about work will not be commensurate with his valuable work of authorship and gigantic project he has undertaken. How ever humble my views are, I feel greatly elated to associate myself with his great authorship.

With due respects
To the author
Sri T. Balakrishna Sharma

**V. Krishna Murthy,**
Retired Lecturer.
Judcharla

# అభిప్రాయం

అజ్ఞానతిమిరాంధస్యజ్ఞా నాంజన శలాకాయా
చక్షురున్మీలితంయేన తస్మై శ్రీగురవేనమః
ఆనందమానందకరం ప్రసన్నం జ్ఞాన ప్రసూనం నిజబోధయుక్తం
యోగీంద్రమీడ్యం భవరోగవైద్యం శ్రీమద్గురుం నిత్య మహంభజామి ॥

అత్యంత విలువైన వజ్రము మనకులభిస్తే దానిని చిన్న బంగారపు భరిణిలో భద్రపరచి, ఆ భరణిని వెండి భరణలోని నిక్షిప్తమొనర్చి, ఆభరణిని రాగభరణిలో దాచి, దానిని ఇత్తడి భరణిలో దాచి కాపాడుకొనుటకు యత్నించుచుందుము. అటులనే గురుకృపా విశేషముతో లభ్యమైన "ఓం నమశ్శివాయ" యను ప్రణవముతో సంయుక్తమగు పంచాక్షరీ మహామంత్రమును కృష్ణ యజుర్వేద మందలి నాల్గవకాండమందు రుద్రాధ్యాయములో లోకేశ్వరుడైన సదాశివుని స్తుతించే వేదమంత్రముగా భద్ర పరచుకొన్నాము. కృష్ణయజుర్వేదమందు ఏడు కాండలు గలవు. ఆ 7 కాండములలో 3 కాండములు మొదట 3 కాండములు చివర ఉండి మధ్యమ కాండముగా 4వ కాండము ఒప్పారుచున్నది. ఆ నాల్గవకాండమందు 8వ ప్రశ్న అనువాకము నందు "నసోమాయచ" అను మంద్రమందు "నమశ్శివాయచ శివతరాయచ" అనియున్నది.

హఠాత్తుగా ఎవరేని కొన్ని నామములతో సదాశివుని నమస్కరించమని పురికొల్పినచో యేవో 5,6 నామములకంటే ఎక్కువ నామాలతో స్వామిని నమస్కరించుటకు మనము అసమర్థులమగుదుము. అను విషయము నెరిగిన సర్వేశ్వరుడు అగు వేదపురుషుడు మనకు రుద్రాధ్యాయము ననుగ్రహించినాడు. ఓం నమస్తే రుద్ర.... అని అన్నియు నమస్కారములే । ఆ ఈశ్వరుడుదయదాల్చి ప్రత్యక్షమై వత్స! నీకేమికావలయునో కోరుకొమ్మని అవకాశమిస్తే వెనువెంటనే యే5 6 అవసరమైన, సద్యస్కాలములో స్ఫురించిన కోరికలను కోరుకొందుము తప్ప ఎక్కువ కోరికలు స్ఫురించవు. అను విషయము నెరిగిన పరాత్పరుడు మనకు చమకము అను వేద భాగమును అనుగ్రహించినాడు. ఓం అగ్నావిష్ణూ

శోభాయై పతరోఽనుమదంతు. అన్నియు కోరికలే. భక్తులకు కొంగు బంగారమైన, భగవదారాధనమునకు సంబంధించిన భక్త్యైక్యవేద్యమైన గురుతత్వమందు పొందు పరుపబడి యుండుట విశేషము. తత్వజిజ్ఞాసువులకు ఈ గ్రంథము పయుక్తమై నాతమ్ముడు చి॥బాలకృష్ణ శర్మ కృషి సార్థకము కావలయునని మనసారా ఆకాంక్షించుచున్నాను.

**తోటపల్లి వేంకటేశ్వర శర్మ**
మహబూబ్‌నగర్

# అభిప్రాయం

అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ

జ్ఞానం వెలుతురైతే, అజ్ఞానం చీకటవుతుంది. అజ్ఞాన తిమిరాలను పారద్రోలే దీపశిఖ గురువు. మానవుడు నిత్యాన్వేషి. ప్రకృతి అతనికి ఆది గురువు అయ్యింది. "ప్రారంభః క్రియతే అనయేతి ప్రకృతిః' అని ప్రకృతికి గురుబాల ప్రబోధికలోని వ్యుత్పత్తి. ఆవిధంగా జగత్సృష్టియే ప్రకృతియైనప్పుడు ప్రకృతి పరమాత్మ స్వరూపమవుతుంది. అలా గురువు భగవత్ స్థానాన్ని అధివసించాడు. ఇదే ప్రకృతి మనకు వేదోపనిషత్తులను ప్రసాదించింది. ఈ వేదోపనిషత్తులు గురువే బ్రహ్మ, గురువే విష్ణువు గురువే శివుడు అని అన్నాయి. ఇలా సృష్టి స్థితిలయల మూర్తిమత్త్వం ఏకమై గురువుగా అవతరించింది. కాబట్టి ఈ చరాచర సృష్టిలోని జ్ఞానాన్వేషం, జ్ఞానావగహనం అన్నీ గురువే.

ఈ లౌకిక ప్రపంచంలో ప్రత్యామ్నాయం లేనివి రెండేరెండు ఒకటి తల్లి, రెండు గురువు. తల్లి ప్రేమ భౌతికమైన అభివృద్ధిని అందిస్తే, గురుశాసనం ఆత్మోద్దీపనను కలిగిస్తుంది. మరణానంతర జీవనాన్ని కూడా అందిస్తుంది. అందుకే 'శ్రీ గురుభ్యోనమః'

గురువు కెంత ప్రాధాన్యత ఉందో గురు ప్రాశస్త్యాన్ని తెలిపే ఈ గ్రంథానికి కూడా అంతే ప్రాధాన్యత ఉంది. అందుకే ఈ గ్రంథరచయిత శ్రీ బాలకృష్ణ శర్మగారికి నా పాదాభివందనం. చూడగానే చేతులెత్తి నమస్కరించాలనిపించే వదనంతో, జ్ఞానజ్యోతి అలరారుతున్న, అహంకారం లేని వినయ సంపదకు మారు రూపంలా కనిపించే పెద్దలు బాలకృష్ణశర్మ గారి ముందు నేను చాలా చిన్నదాన్ని. అణుమాత్రం కూడా కాని దాన్ని. వారిని కొలిచే తూనిక రాళ్ళనుకూడా మోయలేని దాన్ని. కాకపోతే ఒక్క విషయం మాత్రం నిక్కచ్చిగా చెప్పగలను. వీరి ఈ గ్రంథం ఈనాటి సమాజానికి అత్యావశ్యకం. ఇలాంటి గ్రంథాన్ని వెలుగులోకి తెచ్చుకొనలేకపోతే మన విజ్ఞానానికి మనమే సమాధులు పేర్చుకున్న వాళ్లమవుతాము. ప్రతి ఇంటికి, ప్రతి ఒక్కరిని చేరదగిన గ్రంథం ఇది. అందుకే శ్రీ బాలకృష్ణశర్మ గారికి మరోమారు వినయాంజలులతో 'శ్రీ గురుభ్యోనమః'.

**Dr. ఎ. జయంతి**
తెలుగు అధ్యాపకురాలు
హైదరాబాదు.

# మహోపకృతి

మన సంస్కృతి సర్వస్వం గురు తత్త్వాధీనం

అసలు మన ధర్మం మనుగడ ఈ గురువుల ద్వారానే జరిగింది జరుగుతోంది అన్ని సంప్రదాయాలు గురు ప్రాధాన్యాన్నే పేర్కొన్నాయి

గహనమై, అనంతమై విస్తరిల్లిన తరణోపాయజ్ఞానం జీవునకు సరిగ్గా అందించడంలో గురువే శరణ్యుడు గురువులో ప్రకాశించే అసలు గురుత్వం పరబ్రహ్మయే

ఇటువంటి గురువిజ్ఞాన సర్వస్వాన్నీ బహుశాస్త్రమథనతో ఒక చక్కని సమన్వయంతో సర్వజనోపాయంగా తీర్చిదిద్దిన శ్రీ తోటపల్లి బాలకృష్ణ శర్మగారు, ఈ రచన ద్వారా ఋషిఋణం తీర్చుకొనడమే కాక, ధర్మానుయాయులకు మహోపకారం చేశారు సాధకులకు ఇది సమగ్ర సహాయకారి

అందునా గురువ్యవస్థసైతం కలిదోషాక్లిష్టమై, వ్యాపార ధోరణితో దెబ్బతి(ంటు)న్న తరుణంలో, గురుస్వరూపాన్ని సనాతన దృష్టితో సంకలన పరచి అందివ్వడం ఆవశ్యకం, అభినందనీయం, అభివందనీయ స్థానీయులైన శ్రీశర్మగారి జ్ఞానదీప్తికి నమశ్శతాలు

హైదరాబాద్
22/12/05

బుధజన విధేయుడు

**సామవేదం షణ్ముఖశర్మ**

# అభిప్రాయం

బ్రహ్మశ్రీ తోటపల్లి బాలక్రిష్ణ శర్మగారి "గురు విజ్ఞాన సర్వస్వం" అను సంకలన రచనను గచ్ఛద్వ్యాఖ్యగా చదివాను. ఇందలి వీరి రచనా విధానమాపాత మధురము. "సంతతధారాభిషేకము" వ్యక్తి జీవిత సుఖమునకు ప్రాధాన్యత నిచ్చు ఈ రోజులలో సుఖమునకు మూలము ఎక్కడ ఉన్నది! అనే విషయమును చాలమంది తెలుసుకోలేక పోతున్నారు. మూలం తెలుసుకుంటే అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లకలుగుతారు. అందరి సుఖసంతోషాలేకదా దేశానికి క్షేమం సౌభాగ్యం.

భారతదేశమున చరిత్రకందని కాలమునుంచి ఈ విషయమున స్థిరమగు విజ్ఞానము సంప్రదాయరూపమున అనగా తండ్రినుంచి, కుమారునకూ అతని నుంచి మనుమనికీ అందింపబడుతూ వచ్చుచునే యున్నది. దీనినే పూర్వీకుల సంప్రదాయం, గురు సంప్రదాయం అని కూడా అంటారు.

సంప్రదాయం పూర్వీకుల నుండి మనదాకా వచ్చిన నడవడిక మరియు సాధనాక్రమము. నడవడిక మాత్రమే పరిమితంగా చూస్తే పూర్వీకులు అనగా మనవంశమున, మనకన్నా ముందు పుట్టిన వారు ఆచరించుతూ వస్తున్న విధానాన్ని మన సంప్రదాయం అంటున్నాము. సాధనకు కూడా ప్రాధాన్యమిస్తే దీన్నే గురు సంప్రదాయం అంటున్నాము.

ఎక్కువగా మన సంప్రదాయంలో ఈ రెండూ సమిశ్రితంగానే ఉంటూ ఉంటాయి ఎక్కడైనా గురు సంప్రదాయం విడిగా ఉన్నట్లు కనిపడినా అది ప్రధానమైన వంశ సంప్రదాయంలోంచి పుట్టుకువచ్చినదే. నడవడికకు వంశ సంప్రదాయము ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తూ వచ్చింది. సాధనకు ప్రాధాన్యత ఈ వంశ సంప్రదాయంలో సంమిళితంగానే ఉంటుంది. కానీ కాలము ఎప్పుడూ ఒకే తీరులో ఉండదు మానవుని యోగ్యత అర్హత కూడా ఎప్పుడూ ఒకే తీరుగా ఉండవు - ఆయా దేశాల వాతావరణ ఇతర అనుకూలత ప్రతికూలతలను బట్టి వంశ సంప్రదాయాలు సమయానుకూలముగా వాటివాటి నడవడికలను అవి మాటిమాటికీ సింహావలోకనం చేసుకుంటూనే ఉంటాయి. ఈ ప్రయత్నంలో ఈ వంశ సంప్రదాయానికి అర్హతగల వ్యక్తులకు తగిన సాధనా సౌకర్యాన్ని తగినంతగా అందించలేక పోవటం జరుగుతుంది. అలాంటి సందర్భాలలో గురు సంప్రదాయం అనేది ఇందులోంచే పుట్టుకు వస్తుంది. ఈ రెండు సంప్రదాయాల కలబోతనే మనం సనాతన సంప్రదాయం అంటున్నాము.

ఈ వంశ సంప్రదాయం కూడా నిజానిజాని గురు సంప్రదాయమే అసలు గురు సంప్రదాయం కోసమే వంశ సంప్రదాయం పుట్టింది

ఇంతకూ గురువంటే ఏమిటి అంటే మామూలు భాషలో తూస్తే కాదు. మోస్తే తెలిసే బరువు బరువును మోయటం అంటే మనం ఇష్టపడం. కాని మన ఇష్టం వచ్చినట్లు ఇష్టం లేనిదాని నల్లా వదిలేస్తుంటే, ఇష్టంలేని కష్టాన్నైనా మోయకపోతే మనకు ఇష్టమైన సుఖం దక్కుట లేదు. ఇది అందరికీ అనుభవంలోకి వస్తూనే ఉన్నది.

ఇష్టం లేని బరువును మోయటానికి కొన్ని సౌకర్యములు కావలసి వస్తయ్యి, అసౌకర్యములు జన్మకు సంబంధించిన సర్దు బాట్లతోకూడుకున్నవి ఐతే అది వంశ సంప్రదాయాన్నిబట్టి సమకూర్చుకోవలసి వస్తుంది. ఉదాహరణకు పుట్టుక, పోషణ, పెంపకం వగైరాలు. మరి ఇతర విష యాలకు సంబంధించినదిఐతే, అది గురు సంప్రదాయాన్ని బట్టి సమకూర్చు కోవలసి వస్తుంది. ఉదాహరణకు శ్రవణం, తపన, సాధన, త్యాగము వగైరాలు.

వీటిలో తపన (తీవ్రమగు మంచి కోరిక) సాధన అనగా ఈ మంచి కోరికను కాలాయాపన లేకుండా తగినంత తొందరలో పొందాలి అని చేసే ప్రయత్నం. త్యాగము అంటే ఈ ప్రయత్నంలో ఎదుర్కొనవలసి వచ్చిన ప్రతికూల వాతావరణాన్ని సమయస్ఫూర్తితో నిర్భయంగా ఎదురుకోవటం.

ఇవన్నీ చాల బరువైన విషయాలు. ఈ విషయాలన్నిటికి ఒక సమగ్రమైన కష్టనష్టాలు లేని జీవన విధానాన్ని మనం సంప్రదాయం అని పిలుచుకుంటున్నాము. దీన్ని మరలా రెండు విధానాలుగా చేశాం. అదే వంశ సంప్రదాయం, గురు సంప్రదాయం, అనిరీ రెండింటిలో కూడా కష్టనష్టాలు ఉంటాయి కాని చాల తక్కువ స్థాయిలో ఉంటాయి వంశ సంప్రదాయంలో ఆత్మ సంరక్షణ ప్రధానంగా జీవి యొక్క మనుగడతో ముడిపడి వుంటింది. గురు సంప్రాదయంలో సాధకునీ యొక్క తపనకు తగినట్లుగా ప్రమాణ ప్రవృత్తికి లొంగిన తెంపుపై ప్రాధాన్యత కలిగి ఉంటుంది.

సాధారణంగా పుట్టుకతో అందరూ లఘువులే అంటే తక్కువ జ్ఞానం కలవారే. ఎక్కడో ఏ కొందరో గొప్పదైన జ్ఞానంతో పుడుతారు. వారు పుట్టే విధానాలు మనకు తెలిసిన మాతపత్మ సంబంధాల లాంటివి కాకపోవచ్చు కావచ్చూ కూడా. వారు ఎలా పుట్టారు అనేది మనకు ముఖ్య చర్చనీయాంశం కాదు వారికి వచ్చిన జ్ఞానం ఎటువంటిది అనేది ముఖ్యం. వారు ఎలా ఎప్పుడూ జ్ఞానాన్ని సంపాదించినా, వారు సంపాదించిన జ్ఞానం రెండు రకాలుగా ఉంటుంది. విషయం వారికి స్వయంగా తెలియటం తెలిసింది తెలిసినట్లుగా ఆచరించితరించటం ఒకరకం అలా తెలుసుకుని తాము తరించి ఇతరులను గూడా తరింపచేయాలని ఇతరుల స్థాయికి దిగివచ్చిఐనా తమస్థాయిని తాము వదిలిపెట్టక తమ కృపకు పాత్రులగు వారిసి ఉద్ధరింప చేయునది ఇంకా ఉత్తమమైన రెండవరకం.

అసలు జ్ఞానం అంటే దుఃఖముయొక్క ఆనవాలుతో కూడా సంబంధములేని

ఎడతెగని సుఖాన్ని పొందటమే. ఏ గొప్ప విషయాన్ని పట్టించుకోకుండా బతికే మనబోంట్లకు ఇది చాలాకష్టం. కనుకనే కష్టపడి ఆ భగవంతుడే దయామయుడై వేదరూపంలో స్మృతులరూపంలో, కావ్యాలరూపంలో, స్వయంగానూ పరోక్షంగానూ అంతులేని వాఙ్మయరూపంలో ప్రజలకు ఇప్పటికినీ అందించుచునే యున్నాడు.

ఈ పని చాలాబరువైన పని. మనకు తెలిసినంతవరకు మనిషి పుట్టిన తరువాత అతనికి తెలుసుకోవాలని తపన పుడుతుంది. ఆ తరువాత తగిన గురువును అతడు వెతుక్కుంటాడు అథవా అటువంటి గురువు అతనికి తటస్థపడతాడు. కాని భగవంతుని విషయమట్లుకాదు మనం ఎవ్వరం పుట్టకమునుపే, అసలు ఈ సృష్టి పుట్టకమునుపే ఆయన మనను గురించి పట్టించుకున్నాడు కనుక ఆయన ఉత్తమ ఆది గురువు.

ఈ లోకోత్తమ ఆది గురువు అయిన భగవంతుడు నేటికి కూడా మన ఈ బ్రహ్మశ్రీ తోటపల్లి బాలకృష్ణ శర్మగారు వగైరాల రూపంలో కూడా తానదిగా తెలియపరచుచూ వచ్చిన వాఙ్మయరహస్యములను మనబోంట్లపై కరుణచే మనకర్థమగు భాషలో అందించుచున్నాడు. నాడు వ్యాసుడై చేసిన పనిని నేడు ఈ కృష్ణమూర్తిగారై చేశారు అని వీరిపుస్తకం చేస్తే అనిపిస్తోంది. వీరిచే చెప్పబడిన సూక్తి మరెక్కడా లేదనిపిస్తోంది. వీరు ఇట్టి విషయాలలో వేదముల నుంచి, ఉపనిషత్తుల నుంచి, పురాణాల నుంచి, కావ్యాల నుంచి, కథానికల నుంచి నానా రుచిరార్థ సూక్తినిధిగా కనిపించుచున్నారు. ఇంతబృహద్గ్రంథ సమీకరణ చూస్తే మంచి విషయాలను స్వంత అభిప్రాయాలతో కలుషితం చేయకుండా ప్రమాణ ప్రధానంగా అందించాలనే తపన వీరికి ఎక్కువ అని అర్థమగుచున్నది.

వీరియనవరత ఈ పరిశ్రమకు తుష్టుడై ఆ పరమేశ్వరుడు వీరిని వీరి కుటుంబము వారిని అన్ని విధములా కాపాడుచూ వీరి చేతి మీదిగా ఇంకా ఎన్నెన్నో మంచి విషయములను వెలువరింపజేసి, అస్మదాదులను తరింప చేయుచుండవలెనని ఆ పరమేశునర్థించుచున్నాను.

పార్థివ సంవత్సరం,
సుబ్బరాయ షష్ఠీ
తేది : 6-12-2005.

**కుప్పా దక్షిణామూర్తి**
ఇంటి.నెం. 1-3-110,
రాజేంద్రనగర్, మహబూబ్‌నగర్.

"శ్రీ మాత్రేనమః - శ్రీ గురుభ్యోనమః"

# బ్ర॥ శ్రీ॥ తోటపల్లి బాలకృష్ణ శర్మ సర్వస్వం

ఉచ్చైర్గతి ర్జగతి సిధ్యతి ధర్మ తశ్చేత్
తస్య ప్రమాచ వచనై కృతకేత రైశ్చేత్
తేశాం ప్రకాశనదశాచ మహీసురైశ్చేత్
తానంతరేణ నిపతేత్క్యదు మత్ప్రణామః - (భోజరాజు)

ధర్మమువలన ఉత్తమగతి లభించును. ధర్మజ్ఞానము అపౌరుషేయములగు వేదముల వలననే కలుగును. ఆ వేదములను ప్రకాశింప జేయుటవలననే మహీసురులు అనగా బ్రాహ్మణులు మాన్యులు, పూజ్యులగుదురని భోజరాజాశయము.

ప్రాచీనమహర్షులు విజ్ఞానావారాన్నిధులు. వారి దివ్య దృష్టికాల పరిమితికి అతీతమైనది. వారి సర్వకార్యములకును జగద్ధిత కాంక్షయే ఆలంబనం వేదవిజ్ఞానము కరతలామలకమగుటచే వారందరి ధర్మనీతిని తత్త్వవిషయములను, లోకమున ప్రచురింపగోరి స్మృతి, శాస్త్ర, పురాణేతిహాసాదులను నిర్మించిరి. వేదములు విషయభాషాగాంభీర్యముచే సామాన్యులకందుబాటులో లేనికతమున అట్టివారు కరుణాళువులై మహర్షులు ప్రసాదించిన స్మృత్యాది గ్రంథములను పరిశోధించి వేదవిజ్ఞానమును పొందుటకు అవకాశమున్నది. భాషారూపములందు తప్ప వేదములకు తదనుబంధములయిన స్మృత్యాదులకును ప్రతిపాద్య విషయమందు భేదమంతగా గోచరించదు.

భారతీయ సంస్కృతి పునర్జీవనమునకు ఆర్షవిజ్ఞానము అంత్యతావశ్యకము. అదిలేకుండనే దానికొరకై యత్నించుట నేలవిడిచినసాము. పునాది లేకుండ సౌధము నిర్మించుట. మరి ఆ ఆర్షవిజ్ఞానము సంస్కృత భాషాభూషితము, పండితైక వేద్యము. సామాన్యునకు ఆ గ్రంథములన్నను లేనట్లే పరిణమించినది. తత్కారణంగ ఎందరో మహానుభావులు శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాదులందు ప్రపంచితమైన భారతీయ సంస్కృతి స్వభావ, స్వరూపములను సర్వసుబోధములయిన దేశీయ భాషలలో ప్రదర్శించుటకు కృషి చేసినవారు కలరు. అట్టి వారిని గూర్చి, వారు వివరించిన విషయములను గూర్చి, ఆ విషయాలను సర్వసుబోధకంగ సరళభాషలో ఆంధ్రులకు అందించుచున్న వారు బ్రా॥శ్రీ॥ తోటపల్లి బాలకృష్ణ శర్మగారు. వీరు రచించిన విశిష్టమైన

గ్రంథరాజము "గురు విజ్ఞాన సర్వస్వము".

శ్రీ శర్మగారు శిష్టాచారసంపన్నులు. వృత్తిచే తెలుగుపండితులు (ప్రస్తుతము విశ్రాంత ఉపాధ్యాయులు) వైదిక విద్యావినోదులు, తత్త్వశాస్త్ర విచారశీలురు, విశేషించి విజ్ఞాన సౌజన్య నిధులు. అన్నింటికి మించి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద స్వామిగారి దివ్యాశీర్వాద సంపదను పొందిన పరమభక్తాగ్ర గణ్యులు. వీరి ధర్మపత్ని సౌ॥ తోటపల్లి లక్ష్మీదేవి ఈమెయు ఆంధ్రభాషోపాధ్యాయిని. ఉభయులు ఆంధ్రసరస్వతీ ఉపాసకులు. సుదీర్ఘకాలం విద్యారంగమందున్నారు. ఇక వారి లేఖిని నుండి వర్షించు వ్రాతలు అమృతతుల్యమైన కుల్యాప్రవాహములై పారకుండునా! పై పెచ్చు వంశపరంపరాగత వేదవిద్యాధ్యయన తత్పరతచే మరింత ద్విగుణీకృతముగ వీరి లేఖిని భారతీయ సంస్కృతిని ప్రాకాశింపజేయుటలో రాటుతేలియున్నది. ఈ 'గురు విజ్ఞాన సర్వస్వము' నందు 98 శీర్షికలుగలవు. ప్రతి శీర్షిక దేనికదియే ప్రత్యేకత కలిగి యున్నది. హిమవత్పర్వతమునకు ఏ శిఖరమునకదియే ప్రత్యేకత కలిగినట్లు ఈ గ్రంథమును సంపూర్ణముగ అధ్యయనమొనర్చినచో ఉత్తములు మహిమాన్వితులుగను, మధ్యమలు సత్సంస్కృతీ సంచారులుగను, అధములు సంస్కరించుకొని తమ జీవిత పథములను పురుషార్థ సాధనయందు చక్కగా పయనింప జేసుకొందురనుటలో విప్రతిపత్తి లేదు. ఇందలి ప్రతి వ్యాసమును చదివినాను. తప్పనిసరిగా చదివించునుకూడా. జిజ్ఞాసాయుతమైన ఈ గ్రంథరాజమహిమ ఎంతని వర్ణించగలను? కాన పాఠక మహాశయులు అత్యంతావశ్యకంగా చదువలసిన గ్రంథరాజమిది.

సుజనస్తుత్యము ధర్మయుక్తము జగచ్ఛోభాయ మానమ్ము, భ
క్తజనామోదిత భవ్యవృత్తము రసోద్యద్వాక్య విస్తార, మా
గజచర్మాంబర భక్తిపూత మలవాక్కాంతా శిరోభూషణం
బజనిప్రాపక మీదుగ్రంథము బుధారాధ్యాత్త మై యొప్పదే ?

గురువన్నన్ పరమామృతాంబునిధి సాంగోపాంగ వేదాగ్ర సు
స్థిరబోధైక శరణ్య మార్యజన సంసేవ్య ప్రభారాశి యౌ
నరవేషాంతర పూర్ణతత్త్వము మహానంద ప్రపూర్ణమ్ముగా
అరయంజాలిన చాలునయ్య పరమాత్మా! పాహిమాం గురూం

గురుచరణారవిందములకుః సరితూగెడు రక్షణ ప్రభా

వరణము లేదురా సుజనపర్వ మహోదయమైన శాంతికిఁ
శరణము సుమ్మి సద్గురుని సన్నిధి లెమ్మిక నేను గూడా నీ
కరములు పట్టి వచ్చెదనుగా! యనుమిత్రుని జూపు సద్గురూ!

మాన్యులు శర్మగారితో బాటు నేను కూడా పైరీతిగా గురువును స్తుతించుకుంటాను.

ఈ గ్రంథరచనతో, కూర్పుతో, ఆంధ్రలోకమునకు ఎనలేని సేవచేసి వీరి జన్మధన్య మొనర్చికొన్నారు – మానవ జీవిత లక్ష్యసిద్ధికి అనుకూలించు సద్గ్రంథమని నొక్కి వక్కాణింప నొక్కమాటతో ఈ గ్రంథ ప్రయోజనము గూర్చి చెప్పినవాడనగుదనని భావింతును. వీరికి ఈశుడితోధిక విజ్ఞానప్రదాయక గ్రంథ నిర్మాణశక్తి నొసగి, ఆయురారోగ్య భాగ్యములొసగి మనచుగాక! యని ప్రార్థింతును.

వీరికి హృదయ పూర్వక నమస్కారములు.

ఇట్లు
బుధ విధేయుడు
**డి.ఎస్. బాబుదేవీదాస శర్మ**
ఆత్మకూరు (అమరచింత)
పాలమూరు 509131

"శ్రీ మాత్రేనమః - శ్రీ గురుభ్యోనమః"

# శ్రీ గురుభ్యోనమః

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం ।
ప్రసన్న వదనంధ్యాయేత్సర్వవిఘ్నోపశాంతయే ॥

శ్లో॥ గురవే సర్వలోకానాం భిషజే భవరోగిణాం ।
నిధయే సర్వవిద్యానాం దక్షిణామూర్తయే నమః ॥
జంతూనాం నరజన్మ దుర్లభా మతః పుంస్త్వం తతో విప్రతా
తస్మాద్వైదిక ధర్మమార్గ పరతా విద్వత్త్వమస్మా ।
ఆత్మానాత్మ వివేచనం స్వనుభవోత్పరం బ్రహ్మాత్మనా సంస్థితి
ర్ముక్తిర్నో శతకోటి జన్మసుకృతైః పుణ్యైర్వినాలభ్యతె

తా: సకల స్థావర జంగమ రూప భూతములలో మానవ జన్మ దుర్లభము. ఆ నరజన్మయందు పురుష శరీర ప్రాప్తి దుర్లభము. అందులోను బ్రాహ్మణత్వ విశిష్ట పురుష శరీరము దుర్లభము - ఆ శరీరము నందును వేద ప్రతిపాదిత అధ్యయన అధ్యాపనా దిషట్కర్మ మార్గ సనాతన ధర్మమునందు నిష్ఠకలుగుట దుర్లభము. అందులోను పరోక్షజ్ఞాన ప్రాప్తి, ఆత్మానాత్మవివేకం, ఆత్మయొక్క అపరోక్ష జ్ఞానము కల్గుట, బ్రహ్మరూపుడై నిరంతరం ఆత్మస్థితుడై 'ఆత్మ సంస్థ మనః కృత్వానకించిదపి చింతయేత్' సంపూర్ణ జీవన్ముక్తావస్థ నుండుట అత్యంతదుర్లభం. నూరుకోట్ల జన్మల యందుచేసిన పుణ్యఫలముగా కాని మోక్షప్రాప్తి కలదు -

పరమేశ్వరుడు తన ఆత్మశక్తియైన మాయచే జడసృష్టియైన వృక్షాదులను, చేతన సృష్టియైన పశువులను మృగములు మొదలగు వానిని నిర్మించి అసంతుష్టుడయ్యెను. అంతటితో ఆగక తిరిగి ప్రయత్నించి మానవుని సృష్టించి తాను కృతకృత్యుడయినట్లు సంతసించెను. పరబ్రహ్మ సాక్షాత్కారము లేక ఆత్మసాక్షాత్కారము పొందగల సామర్థ్యము వివేక జ్ఞానము కేవలం ఇట్టి మానవుని యందే "ఇంద్రియేభ్యః పరం మనః, మనసస్తు పరాబుద్ధియో బుద్ధే పరతస్తు సః" అను శృతాప్రమాణము ననుసరించి బుద్ధికికూడ పరమైన ఆత్మదర్శనము తన బుద్ధియోగం ననుసరించి పొందగలుచున్నాడు. దీనినే గీతలో 'వ్యవసాయాత్మాకాబుద్ధి' అని నిర్వచింపబడినది.

దానినే కృష్ణుడు 'ఏషాం బుద్ధిమతాన్ బుద్ధిర్మనీషా చ మనీషిణాం యస్సత్య మనృతేనేహ మర్త్యై నా ప్నోతమామృతం' మానవుడు అశాశ్వత భ్రమాత్మకమైనట్టియు ఈషణత్రయం వాసనాత్రయంతో గూడిన ప్రకృతి ఆకర్షణలను అధిగమించి తన అమృత తత్త్వమగు ఆత్మదర్శనము పొందుటలోనే బుద్ధిమంతుడగుచున్నాడు. బుద్ధియొక్క ప్రయోజనము అట్టి ఆత్మసాక్షాత్కారమును పొందుటయందే ఉన్నది.

శ్లో॥ "తజ్జ్ఞానం ప్రశమకరం యదింద్రియాణాం
తజ్జ్ఞేయం యదుపనిషత్సు నిశ్చితార్థం ।
తే ధన్యాభువి పరమార్థ నిశ్చితేహా
శేషాస్తు భ్రమ నిలయే పరిభ్రమంతి ॥

ఇంద్రియ సంయమనమునకు దోహదముచేయనిదే యదార్థజ్ఞానము - 'ఉపనిషత్ ప్రతిపాద్యమగు ఆత్మయందు నిశ్చయాత్మక భావన కల్గియుండుటయే మన కర్తవ్యము అట్టివారే ధన్యులు. ఇతరులు ఈ మాయా జాలములోబడి పరిభ్రమించుచున్నారు. 'ముహూర్తం జ్వలితం శ్రేయోనతు ధూమాయితం చిరం' అట్టి పరమార్థ చింత నుండి మనలను తప్పించు ప్రతి ఆలోచన అనర్థకరమైనదే జరయంతి తేజః దుర్విజ్ఞేయమైన మన జీవిత మర్మమును భేదించి వ్యక్తపరచునదే ధర్మము. అట్టి ధర్మావలంబనచే జీవితము సార్థకత నొందును.

మనము ఆధ్యాత్మికంగా పురోగతి పొందాలంటే ప్రాపంచిక విభిన్న దృష్టిని వదలాలి ఏకైక పరమాత్మయందే మన దృష్టిని ఏకాగ్రపరచాలి. సర్వము పరమాత్మయే సర్వవిధ నామరూపాలతో ప్రకాశించునది ఆ పరమాత్మయే.

భారతదేశంగాని ప్రపంచంలో మరేదేశంగాని వానిపురోగతి ఆధ్యాత్మిక అభ్యున్నతిపైనే ఆధారపడివున్నది. అట్టి ఆధ్యాత్మిక బలంవల్లనే మనదేశం ఎన్ని విదేశీ దురాక్రమణలు జరిగినా నిలద్రొక్కుకొని ఉన్నాము. అట్టి అభ్యున్నతిని పొందించగల విద్యయే యదార్థమైన విద్య హృదయగ్రంథిని భేదించి ఆత్మ స్వరూపము అవగతమగునట్లు చేయునదే అసలైన విద్య మనోవాక్కాయ కర్మలతో పరంజ్యోతి వ్యక్తమగు పరమాత్మ ధ్యానములో నిమగ్నులమగుటయే నిజమైన భగవదారాధన "ఆత్మనా విందతేవీర్యం" ఆత్మబలమే మనయావత్ క్రియాకలాపానికి మూలాధారం - ఐహిక బాధలు కేవలం పైపై ఉపశాంతులవల్ల నివారింపలేము. మనుష్య స్వభావము

మారినగాని శాశ్వత దుఃఖ నివారణ కలుగదు. సర్వదుఃఖములకు కారణం అజ్ఞానమే జ్ఞానతేజో ప్రభావమువల్ల కల్గిన అధ్యాత్మిక బలము వల్లనే ప్రపంచములోని సమస్త బాధలు నివారింపబడును -

పైన తెలుపబడిన **ఆదర్శములు సర్వమానవులకు** అనగా ముముక్షువులైన విజ్ఞానులకు **అందించిన మీ రచనలు "గురువిజ్ఞాన** సర్వస్వం", "ఓంకారతత్త్వం" ఐహిక ఆముష్మిక **ఫలములను పొందించ**గలవు. ఇందుకు మీరు చేసిన కృషి ప్రశంసనీయమైనది. ఇది దైవాదేశం **తిరిగి**మన భారతీయ సనాతనధర్మం సుప్రతిష్ఠిత మొనర్చుట, జాతిని ప్రబోధించుట ఈనాటి మన ముఖ్య కర్తవ్యం. అట్టి కర్తవ్య నిర్వహణయందు మీరుగావించిన కృషి అసాధారణం. అనేక తాత్త్విక విషయాలను సుబోధకశైలిలో అందరికి అర్థమగునట్లు వివరించినారు. మీ రచనలు ఉత్తరోత్తర ప్రజలయందు ధార్మిక ఆధ్యాత్మిక ప్రవత్తులను కల్గించి ధర్మోరక్షతః అన్నట్లు ప్రజలకు, అభ్యుదయ నిశ్శ్రేయసములను కల్గించుననుటలో ఎట్టి సందేహము లేదు.

ఇట్లు
**వెలమకన్న చంద్రశేఖర శర్మ**
రామంతపురం, హైదరాబాద్.

# స్పందన

"గురువే దైవము తల్లిదండ్రి సఖుడన్ గుర్వే పరాదేవతా ।
గురువే సత్యము నిత్యమై వరలు ఆ గుర్వే సమస్తమ్మురా ।
మెరుగౌ జీవన మార్గదర్శకుడు మీ మేల్కోరు ఆప్తుండురా ।
గురువే బంధువు తత్వబోధకుడు ఆ గుర్వే ప్రజాబంధువౌ ॥"

గురువును మించిన దైవములేదు. అట్లాంటి గురుచరిత్ర గురించి మన ప్రాచీన గ్రంధముల యందు నిక్షిప్తం చేసిన అనేక విషయాలను ఎంతో శ్రమతో పరిశోధించి క్రోడీకరించిన శ్రీతోటపల్లి బాలకృష్ణ శర్మగారు బహుదా ప్రశంసనీయులు

పురాణములు, భారత, భాగవతములు, ఉపనిషత్తుల యందు వర్ణింపబడ్డ గురు శిష్యుల అనుబంధాన్ని ఆధునిక ప్రపంచానికి చూయించి తద్వారా నేటితరం శిష్యులు గ్రహించవలసిన అమూల్య సంపదను ఒక చోట అందించే ప్రయత్నం చేసిన శర్మగారికి ఈ జాతి నిజంగా ఋణపడి యున్నది

గురువు ఒక వ్యక్తి కాదు అతడొక ప్రేరక శక్తి నిద్రాణమైన శిష్యులను తనబోధనా పటిమతో మేల్కొల్పి అపూర్వ విజయాలు సాధించిన అమేయ తపశ్శక్తి సమన్వితులైన గురువుల చరిత్రను కళ్ళకు కట్టినట్లుగా పొందపరిచిన శ్రీబాలకృష్ణ శర్మగారు అభినందనీయులు

గురుశిష్యుల మధ్యగల వాత్సల్యాన్ని భక్తిని సోదాహరణంగా వర్ణించి శిష్యులు తమ తమ గురువులకు సమర్పించిన గురుదక్షిణ అద్భుత చరిత్రలు, అపూర్వ సాహసాలు చిత్రించి నేటి తరానికి ఎంతో మేలు చేశారు

శిష్యులు తాము సంకల్పించిన విద్యలు నేర్వడానికి వారు చేసిన కఠోర పరిశ్రమ, అచంచలదీక్ష, ప్రాణాలకు తెగించి తన లక్ష్యాన్ని చేరుకోవడానికి చేసిన సాహసాలు, తాము తరించడమే కాకుండా ఈ అనంతవిశ్వాన్ని తరింపచేయాలనే సనాతనధర్మ సందేశాన్ని సరళ సుందరంగా సమకూర్చిన శ్రీశర్మగారు ధన్యజీవనులు

అజ్ఞానులు, వ్యసనలోలురు, పతితులు సైతం గుర్వనుగ్రహంతో భక్తులుగా, జ్ఞానులుగా, తత్వవేత్తలుగా రూపాంతరం చెందిన ఎన్నెన్నో దృష్టాంతాలు ఎక్కడెక్కడినుంచో గ్రహించి పాఠకులకు శ్రమలేకుండా విస్తృత సమాచారాన్ని ఒకో

చోట గ్రంథస్థం చేసిన బాలకృష్ణ శర్మగారి కృషి సఫలీకృతమైనదనుటలో సందేహంలేదు.

గుర్వనుగ్రహంతో పామరులుసైతం ప్రతిభాసంపన్నులుగా యెదిగిన ఉదంతాలను అధ్యయనం చేయుటకు, ప్రకృతి నియమాలను సైతం గుర్వనుగ్రహంతో అవలీలగా అధిగమించే **యెన్నెన్నో దివ్య** చమత్కారాలకు తార్కాణమైన "గురువిజ్ఞానసర్వసం" **పాఠకలోకానికి కామధేను**వనడంలో సందేహం లేదు.

సంసార **సాగరాన్ని తరించాలంటే గు**ర్వనుగ్రహం కావాలి. గుర్వనుగ్రహం కావాలంటే గురుశరణాగతి కావాలి. గురు శరణాగతి కావాలంటే శ్రీ బాలకృష్ణ శర్మగారి "గురు విజ్ఞాన సర్వస్వం" అనే గ్రంథం చదవాలి. ఈ గ్రంథం సాధకుల పాలిట కల్పవృక్షం వంటింది

ఆధ్యాత్మిక రంగంలో అడుగిడిన సాధకులను సాదరంగా ఆహ్వానించి సాంత్వనము పలికెపెన్నిధానము 'గురువిజ్ఞాన సర్వస్వము' భవబంధవిచ్ఛేదమొనర్చి, భక్తులకు తరుణోపాయమందించి ముక్తిమార్గానికి సోపాన పంక్తియై విరాజిల్లు శర్మగారి గ్రంథరాజమును చదువని వారే దురదృష్టవంతులు.

గురుశిష్య సంబంధాలను గుదిగ్రుచ్చి అందించిన శర్మగారి కృషి సఫలమైనది. నిజంగా విజ్ఞాన సర్వస్వమనదగినంత సప్రమాణ ప్రజ్ఞాధురీణులు మన శర్మగారు వారికీర్తి ఆచంద్రతారార్కమై విరాజిల్లుగాక. వారికి ఆ చదువుల తల్లి సకల భోగభాగ్యములు సమృద్ధిగా యిచ్చి ఆశీర్వదించుగాక ఈ గ్రంథమును గూర్చి నాలుగు మాటలు చెప్పడం నా అదృష్టంగా భావిస్తాను

ఇట్లు
బుధజన విధేయుడు
**డా॥ పొద్దుటూరి ఎల్లారెడ్డి**
పాలమూరు.

**ఆంధ్రోపన్యాసకులు,**
**ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల,**
**మహబూబ్‌నగర్**

"శ్రీ మాత్రేనమః - శ్రీ గురుభ్యోనమః"

# జై గురుదత్త

బ్రహ్మశ్రీ తోటపల్లి బాలకృష్ణశర్మగారి దివ్యసన్నిధికి శుభవిభవాకాంక్షలతో ప్రణామములతో -

గురు విజ్ఞానము సర్వము
గురుతర బాధ్యత వహించి గురుకృపతోడన్
నెరవేర్చ గలిగినారలు
ధరలో మీ జీవితంబు ధన్యం బాయెన్
చెప్పగవలసిన వన్నియు
చెప్పిరి బుధవరులు, ముందు జేర్చితిరి కదా!
చెప్పినవె మరల జెప్పిన
యొప్పగునే! మిన్నకుంట యొప్పగును కదా!

ఎంతో శ్రమకోర్చి తత్త్వనిరూపణము గావించినారు.
ఎన్నో పవిత్ర ప్రామాణిక గాథలు జోడించినారు.
సంప్రదాయలోకమునకు విస్మరించారని మేలు గూర్చినారు.

మీ కృషి అమోఘమైనది. మీ జీవితము అర్థవంతమైనది.
సాయిభక్తులమైన మా బోంట్లకిది అత్యంత ప్రీతిపాత్రమైన పొత్తము.
దత్తభగవానుడు మీ పవిత్ర సారస్వతము అనుగ్రహించు గాక!

శుభమ్

ఇట్లు
బుధజన విధేయుడు
**వెలుదండ సత్యనారాయణ**
పాలమూరు.

# విషయ సూచిక


| | |
|---|---|
| 1. మంగళా చరణ శ్లోకములు | 1 |
| 2. శ్రీ సద్గురు స్తుతులు | 4 |
| 3. శ్రీ కృష్ణంవన్దే జగద్గురుమ్ | 9 |
| 4. జగద్గురు శ్రీకృష్ణాయ తస్మైనమః | 11 |
| 5. జగద్గురు శ్రీ దక్షిణామూర్తి (గుర్వష్టకము) | 13 |
| 6. శ్రీ దక్షిణామూర్తి స్తోత్రమ్ | 15 |
| 7. శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి సద్గురు స్తవము | 17 |
| 8. శ్రీ శంకరాచార్య కృత గుర్వష్టకమ్ | 18 |
| 9. శ్రీ గురు పాదుకాస్తోత్రమ్ | 20 |
| 10. "గురుగీత" | 22 |
| 11. పరమేశ్వర స్తవము | 24 |
| 12. అధ్యాత్మయోగ విద్య నభ్యసించిన వారు | 26 |
| 13. ఆత్మసాక్షాత్కారము పొందుట | 29 |
| 14. "గురుః - గురువు" - (నిర్వచనము) | 31 |
| 15. గురుతత్వం | 70 |
| 16. సద్గురువుల సాహచర్యం (ఉపదేశం) | 79 |
| 17. గురుకులవాస ధర్మము - గురుశుశ్రూష | 100 |
| 18. ఆచార్యులు - శిష్యులు | 127 |
| 19. శ్రీదక్షిణామూర్తయే నమః | 147 |
| 20. శ్రీదత్త స్తవము | 156 |
| 21. శ్రీదత్త గురుదర్శనం | 157 |
| 22. శ్రీ గురుదత్త అవతార పరంపరలు | 176 |
| 23. జ్ఞానయోగ వాశిష్టము | 195 |
| 24. శ్రీ 'గురు' - వ్యాస పూర్ణిమ | 218 |

25. శుకునకు గ్రహణం తొలగింది 235
26. అద్వైత జగద్గురువు శ్రీ ఆదిశంకరాచార్య - చరిత్ర 241
27. శ్రీ శంకరుల శిష్యుల చరిత్రలు 263
28. విశిష్టాద్వైత శ్రీ వైష్ణవ పరంపరాగత గురువర్యులు 279
29. ద్వైత మతాచార్య శ్రీ మధ్వాచార్యుల గురుపరంపర 295
30. శ్రీ భరద్వాజ మహర్షి సాంగత్య ఫలం 307
31. ఆచార్య పూజ 310
32. శిష్యుని ఆచార్యస్థానములో అభిషేకించుట 312
33. శ్రీగురుపాదమహిమను స్తుతించుట 317
34. గురువు సాంప్రదాయ మహిమ 320
35. శ్రీగురు బోధ 333
36. గురువు - సమభావన 340
37. గురు శిష్య పరంపరాభి వర్ణనము 342
38. శిష్యునిలో గురువుపై విశ్వాసము 347
39. ఆచార్యుడు తప్పినచో 357
40. ఎటువంటి శిష్యులకు విద్య గరపరాదు? 360
41. బోధనానంతరం శిష్యుని కర్తవ్యం 371
42. గురువు కన్న ధర్మము మిన్న 382
43. వేదాధ్యయనము 384
44. వీధిబడులు 387
45. ఆధ్యాత్మిక గురుదేవులు 389
46. శ్రీ ఆంజనేయ గురుస్తుతి 395
47. శ్రీ గోస్వామి తులసీదాసు గురుస్తుతి 398
48. బలరామకృష్ణుల "గురుదక్షిణ" 401
49. అర్జునుని గురుదక్షిణ 403
50. కౌత్సుని గురుదక్షిణ 405

51. గాలవుని గురుకట్నము (కథ) 406
52. గురుకట్నముగా యోగవిద్యను నర్థించుట 407
53. కౌశికుని గానమహిమ 408
54. బ్రహ్మవిద్య - ఉపకోసల విద్య 409
55. బ్రహ్మ (వైశ్వానర) విద్య 413
56. గురు వాక్యపాలకుడు 417
57. దేహాభిమానమే సృష్టిలో పనికి మాలినది 420
58. కలిపురుషుడు - విద్యనభ్యసించుట 421
59. గురు, మిత్ర వాత్సల్యము 423
60. శ్రీకృష్ణార్జునుల (గురుశిష్య) సంబంధం 425
61. గురువును మించిన శిష్యు(డు)లు 430
62. భక్తప్రహ్లాదుని 'విద్యాభ్యాసము 434
63. మంత్రగ్రహణము (కచుని వృత్తాంతం) 438
64. తారక మంత్రోపదేశం 441
65. అద్వైత జ్ఞాన దృష్టి 443
66. "బలికి గురూపదేశము" 445
67. ఏకనాథ్ మహారాజ్ (కథ) 446
68. బాల అరుణి (కథ) 447
69. అష్టావక్రుని వృత్తాంతము 448
70. తపశ్శక్తి మహిమ 449
71. మిత్రసఖుడు (కల్మషపాదుని) వృత్తాంతము 450
72. గురుధిక్కారము 452
73. భుశుండిని గురుధిక్కారము 454
74. ఆషాఢభూతి(కథ) 458
75. కర్ణుని భంగపాటు 459
76. శిష్యుదును గురువగును 460

77. గురువుపై గురితప్పి పతనమైన పాండురంగని కథ 461

78. సత్యకాముని కథ 464

79. పరనిందా ఫలితం 465

80. తిరుమల నంబి కథ 467

81. గురుబోధనా శక్తి 469

82. శిష్యత్వమునకు అర్హత 471

83. గురు పీఠాధిపత్యం - కథ 473

84. విష్ణు శర్మ విద్యాబోధన 475

85. పరమానందయ్య శిష్యుల కథ(లు) 477

86. వీరశైవుల శివ(గురు) భక్తి 479

87. బ్రహ్మ కలితో చెప్పిన గురుతత్త్వము 482

88. గురుస్మరణ మహిమ 485

89. రోగనివారణ 489

90. గురునిలో శ్రీకల్లేశ్వరుని దర్శించుట 492

91. శివునికన్నా శ్రీగురుడు మిన్న 493

92. గురుభక్తి 495

93. గురువాక్య పరిపాలన 499

94. హనుమంతుడు ఆచార్యుడు 502

95. నారదుడు మహర్షియే గాక మహాగురువు 506

96. శ్రీగురువాక్య పరిపాలనతోనే మంత్రసిద్ధి 508

97. సాళువ - తుళువ వంశీయుల గురుశిష్యుల ఔన్నత్యము 513

98. పరుష వాక్యములతో భంగపడిన శిష్యుని వ్యథ 517

గురు - సూత్రములు 519


★★★

# 1. మంగళాచరణ శ్లోకములు

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయేత్సర్వవిఘ్నోప శాన్తయే ॥

శ్లో॥ యస్యద్విరదవక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతమ్ ।
విఘ్నం నిఘ్నంతి సతతం విష్వక్సేనంతమాశ్రయే ॥

శ్లో॥ సరస్వతీ నమస్తుభ్యం వరదేకామ రూపిణి ।
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతుమే సదా ।

శ్లో॥ పాశాంకుశధరావాణీ వీణాపుస్తక ధారణీ ।
మమవక్త్రే వసేన్నిత్యం ముగ్ధ కుందేందు నిర్మలా ॥

శ్లో॥ వర్ణనామర్థ సంఘానాం రసానాం ఛందసామపి ।
మంగళానాంచ కర్తారౌ వందే వాణీ వినాయకౌ ॥

శ్లో॥ వాగర్థా వివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే ॥
జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ ॥

శ్లో॥ వందే బోధమయం నిత్యం గురుం శంకర రూపిణమ్ ।
యమాశ్రితోహి వక్రోఽపి చంద్రః సర్వత్ర వంద్యతే ॥

శ్లో॥ శ్రీమన్నృసింహ విభవే గరుడధ్వజాయ
తాపత్రయోప శమనాయ భవౌషధాయ ।
తృష్ణాది వృశ్చిక జలాగ్నిభుజంగరోగ
క్లేశవ్యయాయ హరయే గురవేనమోఽస్తే ॥

శ్లో॥ కృష్ణం కమల పత్రాక్షం పుణ్యశ్రవణ కీర్తనమ్ ।
వాసుదేవం జగద్యోనిం నౌమినారాయణం హరిమ్ ॥

శ్లో॥ నారాయణం నమస్కృత్యనరం చైవనరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్ ॥

శ్లో॥ లక్ష్మీనాథం సమారంభాం నాథ యామున మధ్యమామ్ ।
అస్మదాచార్య పర్యన్తాం వందే గురు పరంపరామ్ ॥

శ్లో॥ భవానీ శంకరౌ వందే శ్రద్ధా విశ్వాస రూపిణౌ ।
యాభ్యాం వినా న పశ్యంతి సిద్ధాః స్వాంతఃస్థ మీశ్వరమ్ ॥

శ్లో॥ ఓం శ్రీశైలేశ దయాపాత్రం, ధీభక్త్యాది గుణార్ణవమ్ ।
యతీంద్ర ప్రణవం వందే, రమ్యజామాతరం మునిమ్ ॥

శ్లో॥ ఓం హరలీలావతారాయ శఙ్కరాయ పరౌజసే ।
కైవల్య కలనా కల్పతరవే శ్రీగురవేనమః ॥

శ్లో॥ ఓం నమోబ్రహ్మాదిభ్యో బ్రహ్మవిద్యా సంప్రదాయ కర్తృభ్యో ।
వంశ ఋషిభ్యో మహద్భ్యో నమోగురుభ్యః ॥

శ్లో॥ ఓం బ్రహ్మణే మూర్తిమతే శృతానాం శుద్ధిహేతవే ।
నారాయణ యతీంద్రాయ తస్మైశ్రీగురువేనమః ॥

శ్లో॥ దత్తాత్రేయ సమారంభాం నృసింహాదిక మధ్యమామ్ ।
సచ్చిదానంద పర్యంతాం వందేదత్తగురు పరంపరామ్ ॥

శ్లో॥ చిదాత్మజ్ఞాన రూపాయ గురువే బ్రహ్మరూపిణే ।
దత్తాత్రేయాయ దేవాయ నమోఽస్తు పరమాత్మనే ॥

శ్లో॥ సీతారామ గుణగ్రామ పుణ్యారణ్య విహారిణౌ ।
వందేవిశుద్ధ విజ్ఞానౌ కవీశ్వర కపీశ్వరౌ ।
వందేఽహం తమశేష కారణ పరంరామాఖ్యమీశం హరిమ్ ॥

శ్లో॥ శ్రీరామ కృతి కర్తారం, భక్తలోక శిరోమణిమ్ ।
వందేఽహం తులసీదాసం, మహాకవి వతంసకమ్ ॥

శ్లో॥ ఓం యోగీశ్వరం వేదచూడం వేదాన్తార్థనిధిం మునిమ్ ।
గోవిన్ద భగవత్పాదాచార్య ముపాస్మహే ॥

శ్లో॥ వ్యాసాయ విష్ణు రూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమోవై బ్రహ్మ నిధయే వాసిష్ఠాయ నమోనమః ॥

శ్లో॥ వ్యాసం వశిష్ఠనప్తారం శక్తేః పౌత్రమకల్మషమ్ ।
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్ ॥

శ్లో॥ నమోఽస్తుతే వ్యాస విశాల బుద్ధే ఫుల్లారవిందాయత పత్రనేత్ర ।
యేనత్వయా భారతతైల పూర్ణః ప్రజ్వాలితో జ్ఞాన మయప్రదీపః ॥

శ్లో॥ పూజ్యాయ రాఘవేంద్రాయ సత్యధర్మ రతాయచ ।
భజతాం కల్పవృక్షాయ నమతాం కామధేనవే ॥

శ్లో॥ దత్తాత్రేయం గురుం వందే భవబంధ వినాశనమ్ ।
సర్వరోగ హరందేవం భుక్తి ముక్తి ఫలప్రదమ్ ॥

శ్లో॥ ద్రష్టుం పక్షన శక్నోషి దర్పణేన వినా సఖే ।
ద్రష్టు మాత్మ స్థితం దేవం నశక్నోషి గురుంవినా ॥

★★★

## గురు - సూత్రములు

గురోర్గర్వేణావ మానాదపస్మారే భవేన్నరః

★★★

ఆచార్యో బ్రహ్మణోమూర్తిః - (మను 2/225)

★★★

ఆజన్మాంతం గురు శూశ్రూషతో శాశ్వత బ్రహ్మలోక ప్రాప్తి -(మన 2/244)

★★★

ఆచార్యునితో వివాదం పెట్టుకున్న నరక ప్రాప్తియే - (మను 4/182)

★★★

"అధ్యయానంతే శిష్యః విసృజ్య ప్రణవ౧ బ్రవీతి" - (వై 9-12-94)

శిష్యుడు అధ్యయానంతమునందు ఓంకారము పలుకవలెను

★★★

సర్వకార్యార్థ సిద్ధ్యర్థం ప్రణమామి గురుం సదా

★★★

గురూపదేశము ద్వారా లభించిన మంత్రమే సాధకునకు ఫలప్రదము

★★★

శ్రీగురుభ్యోనమః

ఆచార్యదేవోభవ - శ్రీకృష్ణం వందే జగద్గురుం - శ్రీ గురవేనమః

# 2. శ్రీ సద్గురు స్తుతులు

1 శ్లో॥ ఓం గురుబ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవేనమః ॥

2.శ్లో॥ అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా ।
చక్షురున్మీలితం యేన తస్మై శ్రీగురవేనమః ॥

భావము: ఏ మహాను భావుని చేత అజ్ఞానాంధ కారమువల్ల, అంధుడనగు నాజ్ఞాన నేత్రము బ్రహ్మ జ్ఞాన మనెడి కాటుక యొక్క కణికతో తెరవబడుచున్నదో, అట్టి నా సద్గురు స్వామి చరణకమలములకు నమస్కరించుచున్నాను.

3.శ్లో॥ స్థావరం జంగమం వ్యాప్తం యత్కించిత్ సచరాచరమ్ ।
త్వం పదం దర్శితం యేన తస్మై శ్రీగురవేనమః ॥

భావము: ఈ చరాచర జంతువులందు వ్యాపించి యుండెడి "త్వం" పద లక్ష్యార్థమగు ప్రత్యగాత్మ స్వరూపమిట్టిదని దాని లక్షణము విశదముగా బోధించినట్టి శ్రీసద్గురునాధునకు నమస్కరించుచున్నాను.

4.శ్లో॥ చిన్మయాం వ్యాపితం సర్వం త్రైలోక్యం సచరాచరమ్ ।
అసిత్వం దర్శితం యేన తస్మై శ్రీగురువేనమః ॥

భావము: అఖండ సచ్చిదానంద పరబ్రహ్మమే పరమాత్మ స్వరూపము గాను, ప్రత్యగాత్మ స్వరూపముగాను యున్నదనియు, పరమాత్మ ప్రత్యగాత్మలు రెండున్ను అభేదం పరబ్రహ్మ స్వరూపమనియు, కాబట్టి ప్రత్యగాత్మ స్వరూపియగు నీవే పరబ్రహ్మము. పరబ్రహ్మమే నీవు. అని ప్రత్యగాత్మ పరమాత్ముల ఐక్యమును బోధించెడి "అసి" పదార్థ రహస్యార్థమును నాకు విశదముగా బోధించి నన్ను కృతార్థునిగా చేసినట్టి శ్రీ సద్గురుమూర్తికి నమస్కరించుచున్నాను.

5.శ్లో॥ ఆ బ్రహ్మస్తంబ పర్యంతం పరమాత్మ స్వరూపకమ్ ।
స్థావరం జంగమం చైవ ప్రణమామి జగద్గురుమ్ ॥

భావము: బ్రహ్మదేవుడు మొదలుకొని తృణ పర్యంతముండెడి స్థావర జంగమ రూపంబగు ఈచరాచర ప్రపంచము సర్వమున్ను పరబ్రహ్మ స్వరూపముగనే యున్నది. అట్టి

పరబ్రహ్మమే 'గురు' స్వరూపముగా నున్నదిగాన, అట్లు బ్రహ్మస్తంబ పర్యంతం చరాచర ప్రపంచ స్వరూపియగు సద్గురు పరబ్రహ్మమునకు నమస్కరించుచున్నాను.

6. శ్లో॥ గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో స్సదాచ్యుతః ।
న గురోరధికః కశ్చిత్ త్రిలోకేషు విద్యతే ॥

7. శ్లో॥ దివ్యజ్ఞానోపదేష్టారం దేశికం పరమేశ్వరమ్ ।
పూజ్యయేత్పరయా భక్త్యా తస్యజ్ఞానం ఫలం లభేత్ ॥

(యోగశిఖ - ఉత్తర - 5వ అధ్యాయం)

8. శ్లో॥ యస్యదేవేపరాభక్తిః యథాదేవే తథాగురౌ ।
తస్యైతే కథి తాహ్యర్థా ప్రకాశంతే మహాత్మనః ॥

సూ॥ త్రిలోకములలో గురువుకంటే అధికుడు లేడు. గురువే దివ్యజ్ఞానోపదేశము జేయును - జ్ఞానఫలము లభించునటుల జేయును.

9. శ్లో॥ శ్రీ గుర్వ విచ్ఛిన్న పరంపరాయాం, భూమండలాచార్యక సార్వ భౌమాన్ ।
వ్యాఖ్యాన సింహాసన పట్ట భద్రాన్, భజేగురూన్ శృంగపురీ మరేశాన్ ॥

10. శ్లో॥ ఈశ్వరో గురురాత్మేతి మూర్తి భేద విభాగినే ।
వ్యోమ వ ద్వ్యాప్త దేహాయ దక్షిణా మూర్తియేనమః ॥

11. శ్లో॥ ఓం నమశ్శివాయ గురవే సచ్చిదానన్దమూర్తయే ।
నిష్ప్రపంచాయ శాన్తాయ నిరాలమ్బాయ తేజసే ॥

12. శ్లో॥ అజ్ఞాన మూలహరణం జన్మకర్మ నివారణమ్ ।
జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం గురోః పాదోదకం పిబేత్ ॥

13. శ్లో॥ చిద్రూపేణ పరివ్యాప్తం త్రైలోక్యం సచరాచరమ్
తత్పదం దర్శితం యేన తస్మై శ్రీగురువేనమః ॥

14. శ్లో॥ నగురోరధికం తత్త్వం నగురోరధికం తపః ।
తత్త్వజ్ఞానాత్ పరం నాస్తి తస్మై శ్రీగురవేనమః ॥

15. శ్లో॥ శోషణం భవ సింధోశ్చ ప్రాపణం సారసంపదః ।
యస్య పాదోదకమ్ సమ్యక్ తస్మై శ్రీగురవేనమః ॥

16. శ్లో॥ త్వమేవ మాతాచ పితాత్వమేవ । త్వమేవ బంధుశ్చ సఖాత్వమేవ ।
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ । త్వమేవ సర్వం మమదేవదేవ ॥

17.శ్లో॥ వందే గురూణాం చరణారవిందే । సందర్శిత స్వాత్మ సుఖావ బోధే ।
జనస్యయే జాంగలి కాయ మానే । సంసార హాలాహల తావశాంత్యై ॥

18.శ్లో॥ శివో మృత్యుంజయశ్చైవ జ్ఞానినాంచ గురోర్గురుః ।
యత్ జ్ఞానాత్ జ్ఞానవానస్తి యోగిశో జ్ఞాన విత్ప్రభుః ॥
- (శ్రీదేవి.భా.9వ స్కం. 38వ అ. 41వ శ్లో)

19.శ్లో॥ అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరమ్ ।
తత్పదం దర్శితం యేన తస్మై శ్రీగురవేనమః ॥

20.శ్లో॥ బ్రహ్మానందం పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిం ।
ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాది లక్ష్యమ్ ।
ఏకం నిత్యం విమలమచలం సర్వధీసాక్షీభూతం ।
భావాతీతం త్రిగుణరహితం సద్గురుం తం నమామి ॥

21.శ్లో॥ పితుః శతగుణామాతా గౌరవే చేతినిశ్చితమ్ ।
మాతుః శతగుణః పూజ్యోజ్ఞాన దాతాగురుః ప్రభుః ॥
- (శ్రీదేవి.భా.9వ స్కం. 37వ అ. 6వ శ్లో)

22.శ్లో॥ ధ్యాన మూలం గురోర్మూర్తిః । పూజామూలం గురోః పదం ।
మంత్రమూలం గురోర్వాక్యం । మోక్షమూలం గురోః కృపా ॥

23.శ్లో॥ గురువే సర్వలోకానాంభిషజే భవరోగణాం ।
నిధయే సర్వ విద్యానాం దక్షిణామూర్తయే నమః ॥

24.శ్లో॥ యత్కటాక్ష వశాదేవ, ముచ్యేహం భవ బంధనాత్ ।
తంవందే సచ్చిదానందం శ్రీగురుం కరణానిధిమ్ ॥

25.శ్లో॥ యః కలిబ్రహ్మ సంవాద మిషేణాహ యుగస్థితిః ।
గురుసేవాంచ సిద్ధస్యాత్ శ్రీదత్తశ్శరణం మమ ॥

26.శ్లో॥ అప్రమేయ మహా విద్యాశేఖరాం చిత్తమస్తకామ్ ।
రక్తాం చతుర్భుజాం వందే శ్రీవిద్యా గురుపాదుకామ్ ॥

27.శ్లో॥ ఓం సచ్చిదానంద రూపాయ జ్ఞానవైరాగ్య దాయినే ।
అసజ్ఞానన్ద దేవాయ తస్మై శ్రీగురువేనమః ॥

28.శ్లో॥ ఓం మఙ్గళం గురుదేవాయ మహనీయ గుణాత్మనే ।
సర్వలోక శరణ్యాయ సాధురూపాయ మఙ్గళమ్ ॥

29 శ్లో॥ గురుం గురుతరం గమ్యం గరుగమ్యం గుణాకరం ।
వందే గురూత్తమందేవం దేవ వంద్య పదాంబుజమ్ ॥

- (కార్తవీర్యార్జునుని స్తుతి)

30.శ్లో॥ సదా నింబ వృక్షస్య మూలాధి వాసాత్ ।
సదా స్రావిణం తిక్తమప్య ప్రియంతం ।
తరుం కల్పవృక్షాధికం సాధయంతం ।
నమామీశ్వరం సద్గురుం సాయినాధమ్ ॥

31.శ్లో॥ సదా కల్పవృక్షస్య తస్యాధి మూలే ।
భవద్భావ బుద్ధ్యా సపర్యాది సేవామ్ ।
నృణాం కుర్వతాం భుక్తిముక్తి ప్రదంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాధమ్ ॥

32.శ్లో॥ ఓం జననీం శారదాం దేవీం రామకృష్ణం జగద్గురుం ।
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహూర్ముహుః ॥

33.శ్లో॥ శ్రీమన్ నృసింహ విభవే గరుడధ్వజాయ ।
తాపత్రయోప శమనాయ భవౌషధాయ ।
తృష్ణాది వృశ్చిక జలాగ్ని భుజంగ రోగ ।
క్లేశవ్యయాయ హరయే గురవే నమోఽస్తు ॥

34.శ్లో॥ ఆత్మనే బ్రహ్మణే తుభ్యం అనంతగుణ శకయే ।
సకలాకల రూపాయ శంభవే గురవేనమః ॥

35.శ్లో॥ నమోగురుభ్యో గురుపాదుకాభ్యో నమోపరేభ్యః పరపాదు కాభ్యః ।
ఆచార్య విద్యా శంకర పాదుకాభ్యో నమోఽస్తుదేవీ మణి పాదు కాభ్యః ॥

36.శ్లో॥ కలిదోష వినాశార్థం జపదేకాగ్ర మానసః ।
శ్రీగురుం పరమానందం దత్త ఇత్యక్షరద్వయమ్ ॥

37.శ్లో॥ దత్త దత్త ఇదం వాక్యం తారకం సర్వదేహినామ్ ।
శ్రద్ధాయుక్తో జపేనిత్యం దత్త ఇత్యక్షరద్వయమ్ ॥

38.శ్లో॥ గురోః స్తవమధీయానో విజయీ సర్వదాభవేత్ ।
గురు సాయుజ్య మాప్నోతి గురునామ పఠేద్బుధః ॥

39.శ్లో॥ గురోః పరతరం నాస్తి సత్యం సత్యం నసంశయః ।
గురోః పాదోదకం పీత్వాగురోర్నామ సదా జపేత్ ॥

40.శ్లో॥ తేఽపి సన్న్యాసినోజ్ఞేయా ఇతరే వేషధారణః ।
గంగాద్యాస్సరితః సర్వాగురుపాదాంబుజం సదా ॥

41.శ్లో॥ గురుస్తవం న జానాతి గురునామ ముఖేనహి ।
పశుతుల్యం విజానీయాత్ సత్యం సత్యం మహా మునే ॥

రఘుపతి మీశ గురోర్గురం ప్రపద్యే

★★★

## గురు - సూత్రములు

"సహి విద్యాతః తం జనయతి" (ఆపస్తంభ సూ: 1-1-16)

ఆచార్యుడు శిష్యుని విద్యాజ్ఞాన రాశినుండి జనింప జేయవలెను.

★★★

"గురుణా అనుజ్ఞాతః భైక్షాన్నమశ్నీయాత్" (వై. 8-2-23)

ఆచార్యుని అనుజ్ఞతోనే పొందిన భిక్షాన్నమును తినవలెను.

★★★

"గురుం సంభ్రమాన్ననమే ద్యోహి" (దేవీ భాగవతం; 4స్కం; 34అ; 64 శ్లో)

★★★

గురువువాక్యము ఎప్పుడును అసత్యము కాదు.

★★★

"గురోః ప్రాప్తః పరీవాదః న శ్రోతవ్యః కథంచన"

తన గురువు గురించిన నిందను నేపరిస్థితిలోనూ వినరాదు. చెవులు మూసుకొనవలెను. లేదా! అక్కడి నుండి నిష్క్రమించవలెను.

అన్నది పార్వతి. (స్మృతి)

# 3. కృష్ణం వందే జగద్గురుమ్
## (శ్రీ కృష్ణాష్టకమ్)

1. శ్లో॥ వసుదేవ సుతం దేవం కంస చాణూర మర్దనం ।
దేవకీ పరమానందం **కృష్ణం వందే జగద్గురుం** ॥

భావము: వసుదేవుని **కుమారుడు, దేవదేవుడు, కంస**చాణూరు లను వధించినవాడు. దేవకీ దేవికి పర**మానందమును గూర్చిన వాడును** అగు జగద్గురువైన శ్రీకృష్ణ పరమాత్మకు నమస్కరించుచున్నాను.

2. శ్లో॥ అతసీ పుష్పం సంకాశం హారనూపురశోభితం ।
రత్నకంకణ కేయూరం కృష్ణం వందే జగద్గురుం ॥

భావము: అవిసి పువ్వువంటి రంగు కలిగిన వాడును, కంఠ హారములతోను, అందెలతోను, హస్తాభరణములతోను శోభించె ఆకారముగల జగద్గురువగు శ్రీకృష్ణ పరమాత్మకు నమస్కరించుచున్నాను.

3. శ్లో॥ కుటిలాలక సంయుక్తం పూర్ణ చంద్రని భాననం ।
విలసత్కుండల ధరం కృష్ణం వందే జగద్గురుం ॥

భావము: వంపులు తిరిగిన ముంగురులతోను, రత్న కుండలములతోను, పూర్ణ చంద్రుని వంటి మోముతో ముద్దులొలికెడి జగద్గురువైన శ్రీకృష్ణ పరమాత్మకు నమస్కృతులు.

4. శ్లో॥ మందార గన్ధ సంయుక్తం చారుహాసం చతుర్భుజం ।
బర్హి పిఞ్ఛావ చూడాంగం కృష్ణం వందే జగద్గురమ్ ॥

భావము: మందార పుష్ప పరిమళముతో నిండినదియు, చతుర్భుజములను కలిగినదియు, నెమలి పింఛముతో విలసిల్లు దివ్య దేహము గల జగద్గుర వగు శ్రీకృష్ణ పరమాత్మకు వందనములు.

5. శ్లో॥ ఉత్ఫుల్ల పద్మ పత్రాక్షం నీల జీమూత సన్నిభమ్ ।
యాదవానాం శిరోరత్నం కృష్ణం వందే జగద్గురుం ॥

భావము: పద్మ రేకుల వంటి విశాల నేత్రములతోను, నల్లని మేఘముల వంటి శరీరకాంతితోను కూడిన వాడై యాదవులందరికిని శిరోభూషణమువలె ప్రకాశించు

శ్రీకృష్ణ పరమాత్మకు నమోవాకములు.

6. శ్లో॥ రుక్మిణీ కేళీ సంయుక్తం పీతాంబర సుశోభితం ।
అవాప్త తులసీ గంధం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

భావము: పీతాంబర ధారియు, తులసి మాల ధరించిన దాని పరిమళముతో నిండిన దేహమును కలిగి, రుక్మిణి దేవితో క్రీడ సలుపు జగద్గురువగు శ్రీకృష్ణ పరమాత్మకు వందనములు.

7. శ్లో॥ గోపికానాం కుచద్వన్ద్వ కుంకుమాంకిత వక్షసం ।
శ్రీనికేతం మహేష్వాసం కృష్ణం వందే జగద్గురుం ॥

భావము: గోపికలను ఆలింగమును చేసికొను సమయంలో వారిస్తన ద్వయము నందున్న కుంకుమతో చిహ్నితమైన విశాల వక్షస్థలం కలవాడును, సంపదలకు నిలయమైన వాడును అగు జగద్గురువైన శ్రీకృష్ణ పరమాత్మకు నమస్కారములు.

8. శ్లో॥ శ్రీవత్సాంకం మహోరస్కం వనమాలా విరాజితం ।
శంఖ చక్ర ధరం దేవం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

భావము: 'శ్రీవత్సము' అనెడి పుట్టుమచ్చకల తన విశాల వక్షస్థలముపై వనమాలను ధరించినవాడును, శంఖ చక్రములను ధరించిన కరములు కలవాడును అగు జగద్గురువు శ్రీకృష్ణ పరమాత్మకు నమస్కరించుచున్నాను.

## ఫలం

9. శ్లో॥ కృష్ణాష్టక మిదం పుణ్యం ప్రాతురుత్థాయ యః పఠేత్ ।
కోటి జన్మ కృతం పాపం స్మరణేన వినశ్యతి ॥

భావము: పుణ్యప్రదమైన ఈ కృష్ణాష్టకమును ప్రాతః కాలమున లేచి శుచిగా పఠించు వారికి కోటి జన్మలలోని పాపము నశించును.

## ఇతి శ్రీశంకరాచార్యకృతం శ్రీకృష్ణాష్టకం సంపూర్ణమ్

★★★

# 4. జగద్గురు శ్రీకృష్ణాయ తస్మైనమః

అవతార పురుషులు యుగ యుగాల్లో జన్మించుచు, లోకోద్ధరణకై పాటుపడడం పరమాత్ములకే సాధ్యం. అట్టి యుగపురుషుడు ద్వాపరయుగంలో విష్ణువు శ్రీకృష్ణావతారమెత్తి ఆ యుగంలోనే గాక, రాబోవు కలియుగమును కూడ ధర్మచింతన, ఆధ్యాత్మికపథంలో నడిపించు యత్నమునకునవతారమెత్తితినని తానే ప్రబోధించిపలికెను.

శ్రీకృష్ణావతారం చాలా పరిణతి చెందిన అవతారం అందులకే "కృష్ణం వందే జగద్గురుం" అని స్తుతించిరి. భగవద్గీతలో తన రెండవ అంశగా జన్మించిన అర్జునుడు యుద్ధరంగమున యుద్ధ మొనర్చనని చతికిలబడగా, అతనిని యుద్ధ మొనర్చుటకు పురమాయించడంలో ఆధ్యాత్మిక బోధనగా గీతాబోధ చేయడమయ్యెను. దానిలోనే తానవతరించుటను కారణమిట్లు పలికెను.

శ్లో॥ యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥

అని మరల -

శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం ।
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

అని స్వయంగా పలుకుటలో అవతరించుటకు గల కారణం స్పష్ట పరచెను శ్రీకృష్ణావతారం పరమ పురుషుని అవతారం. భాగవతంలో భగవంతుడనే సంబోధింపబడెను. ఎందులకనగా శ్రీకృష్ణుడు పసిపాప మొదలు తన అవతారాన్ని జగద్గురువుగా కూడ సంబోధింపబడుతూ ఆరాధించడం ఆచారమయింది అజ్ఞానాంధకారాన్ని తొలగించు యత్నములో జీవుల జీవన విధానాన్ని బోధించిన పరమగురువు అందులకతడు జగద్గురువుగా వినుతికెక్కెను.

సామాన్యులలోనూ ధర్మ జిజ్ఞాసను మేలుకొలిపి, వారిని భగవంతుడే వచ్చి తనవైపు మళ్ళించడమే తన అవతార లక్ష్యమని చాటెను. భగవన్నామం ఎక్కడ కీర్తింపబడుతుందో అదే పుణ్యక్షేత్రం, పవిత్ర తీర్థ స్థలం. ఆ భగవన్నామోపదేశంకానీ, తత్త్వజ్ఞానోపదేశం కాని అవతార పురుషులైన సద్గురువుల వల్లనే సాధ్యమవుతుంది. గురువు సహాయంతో భగవన్మార్గం లభించును. ఆ మార్గముననే సుగమమైన భగవత్సాక్షాత్కారం లభించును.

అట్టి సద్గురువులు లభించడం చాలా అరుదు. శ్రీకృష్ణుడు పరమాత్మ స్వరూపుడుగా అవతరించినందుకే, తానేస్వయంగా "ఆచార్యం మాం విజానీయాత్ - నేనే గురువున్నని తెలుసుకో" అని అంటారు భాగవతంలో అందులకే గురువుకీ, భగవంతుడికీ తేడా లేదు.

తమ స్పర్శతోనేగాక, సంకల్పంతో కూడ మనుషులను పరమార్థ మార్గంవైపు నడిపించగల సమర్థుడు, శక్తి మంతుడు గురువు. ఎంతటి పతితులనైన పాపాత్ములనైనా యుద్ధరించగల ప్రజ్ఞ గురువునకే సాధ్యం. కావున గురువు జగద్గురువు శ్రీకృష్ణ పరమాత్మ గీతోపదేశ మొనరించు గీతాచార్యుడుగా వినుతికెక్కెను.

"రామో విగ్రహవాన్ ధర్మః" రామావతారం ధర్మపరిపాలన గురించి గట్టిగా సూచిస్తుంది. కృష్ణతత్త్వం **మాత్రమిట్లుగా గీతలో** నుపదేశించెను.

శ్లో॥ సర్వధర్మాన్ **పరిత్యజ్యమామేకం** శరణం వ్రజ ।
అహం త్వాం సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచ ॥

ధైర్య బుద్ధితో దేహతెంపు గల ధర్మాలన్నిటినీ (అనగా ఏయే ధర్మాలను అనుసరించాలనే ఆలోచనలను) అనన్య భక్తితో వదిలెయ్యి. నన్నొకడినే మాత్రం శరణు వేడుకో నేను నీ పాపాలన్నింటినీ తొలగిస్తాను. అంటాడు.

ఈ యుపదేశం అసామాన్యం. అసాధారణం అట్టి

"కృష్ణో రక్షతునో జగత్రయ గురుః కృష్ణం నమస్యామ్యహం"

జగద్గురు హేకృష్ణా! రక్షస్వమాం, దాసోస్మహం

★★★

## గురు - సూత్రములు

"ఆచార్యనుక్తో యత్కించిత్ కర్మనాచరతి" - (వైఖాయనస సూక్తి: 8/2/18)

ఆచార్యునిచే చెప్పబడని ఏకార్యం చేయరాదు.

★★★

"గురుచ్ఛాయాం నాక్రామతి." - (వైఖాయనస సూక్తి : 10-2-30)

గురువు నీడను ఎప్పుడు దాటరాదు.

★★★

"శుభం వా శుభ మన్యద్వా యదుక్త గురుణా భువి."

గురువు చేతను చెప్పబడినట్టిది. మంచిదైనా, చెడుదైనా మంచిదే యగును.

# 5. జగద్గురు శ్రీ దక్షిణామూర్తి (గుర్వష్టకము)

శ్లో॥ అద్రాక్ష మక్షీణ దయానిధాన మాచార్యమాద్యం వటమూల భాగే
మౌనేన మందస్మిత భూషితేన మహర్షిలోకస్య తమోనుదంతం ॥

భావము: మఱ్ఱి చెట్టు క్రింద నుండి, చిరునవ్వుతో కూడి మౌనంతో మహా మునిజనులు, అజ్ఞానాన్ని పారద్రోలు దయాకరుడైన తొలిగురువును నేను కనుగొన్నాను.

శ్లో॥ అపార కారుణ్య సుధా తరంగై రపాంగ పాతైరవలోక యంతం ।
కఠోర సంసార నిదాఘతప్తాన్ మునీనహం నౌమి గురుం గురూణాం ॥

భావము: అంతులేని కారుణ్యమనే అమృతపు తరంగాలైన కడగంటి చూపులతో తీవ్రమైన సంసారమనే వేసవిచే తాపాన్నొందు మునులను కడదేర్చుచున్న గురువులకు మూలగురు దేవునకే నేను నమస్కరించెదను.

శ్లో॥ మమాద్య దేవో వటమూల వాసీ, కృపావిశేషాత్కృత సన్నిధానః ।
ఓంకార విద్యా ముపదిశ్య విద్యా మావిద్యక ధ్వాంతమపాకరోతు ॥

భావము: వట మూలాన నుండు దేవుడిప్పుడే దయావిశేషంతో నన్ను చేరి "ఓంకారం" అను పరాపరబ్రహ్మ విద్యనుపదేశించి అజ్ఞానాంధకారాన్ని బోగొట్టు గాక!

శ్లో॥ కలాభిరిందోరివ కల్పితాంగం, ముక్తాకలాపైరివ బద్ధమూర్తిం ।
ఆలోకయే దేశిక మప్రమేయ మనాద్య విద్యాతి తిమిర ప్రభాతం ॥

భావము: చంద్రుని కళలెల్ల కరిగి, పోతపోసినట్లున్న మేనుగల వాడును, ముత్తియముల మొత్తములతో నిలువెల్ల పొదిగినట్లున్న వాడును, మొదట లేక మధ్యలో వచ్చిన **అజ్ఞానపు చీకటికి** ప్రభాతకాలమైన అనగా సూర్యోదయంలాంటి వాడును అయిన **గురువర్యుని నేను** గాంచుచున్నాను

శ్లో॥ **తత్త్వార్థ మంతే**వసతా మృషీణాం యువాపి యస్సన్ను పదేష్టుమీష్టే ।
ప్రణౌమితం ప్రాక్తన పుణ్యజాలై రాచార్య మాశ్చర్య గుణాధివాసం ॥

భావము: ఏ దేవుడు చిన్నవాడై యుండి, శిష్యులుగా తన వద్దకు చేరిన మునులకు తత్త్వార్థాన్ని యుపదేశించుటకు సమర్థుడై యుండెనో. ఆ గురువరునకు, ఆశ్చర్యకరాలైన గుణాలకు అధిష్ఠానమైన దైవానికి వెనుక (పూర్వం) నేను చేసిన పుణ్య ఫలాలుండటం చేత నమస్కరింప గలుగుచున్నాను.

శ్లో॥ ఏకేన ముద్రాం పరశుంకరేణ కరేణ చాన్యేన మృగం దధానః ।
స్వజాను విన్యస్తకరః పురస్తా దాచార్య చూడామణి రావిరస్తు ॥

భావము: ఒక చేతిలో జ్ఞానముద్రను, మరొక చేతిలో గొడ్డలిని, వేరొక చేతిలో లేడిని ధరించి యున్నవాడై నాల్గవ చేతిని మోకాలిపైన పెట్టుకొని యున్న గురుశిరోమణి నాకు ప్రత్యక్షమగుగాక!

శ్లో॥ ఆ లేపవంతం మదనాంగ భూత్యా శార్దూలకృత్యాపరి ధానవంతం ।
ఆలోకయే కంచన దేశికేంద్రం అజ్ఞాన వారాకర బాడబాగ్నిం ॥

భావము: కాముని కాల్చిన బూడిదను ఒడలికి రాసుకొని, పెద్దపులి తోలుధరించి, అజ్ఞానానికి, సముద్రానికి బడబాగ్నిగా వెలుగుచు వర్ణింప శక్యం కాని గురువర్యుని నా భాగ్య వశాన నేను దర్శించుచున్నాను.

శ్లో॥ కాంత్యా నిందిత మందకందళ వపుర్న్యగ్రోధ మూలే వసన్
కారుణ్యామృత వారధిర్మని జనం సంభావయన్ వీక్షితైః ।
ర్మోహధ్వాంత విభేదనం విరచయన్ బోధేన తత్తాదృశా
దేవ స్తత్త్వమసీతి బోధయతుమాం ముద్రావతా పాణినా ॥

భావము: మొల్ల పువ్వులను అపహసించు తెల్లని శరీరకాంతి గలిగి మఱ్ఱి మొదల నివసించుచు, దయాసముద్రుడై చూపులచే మునిజనుల నాదరించుచు జ్ఞానబోధచే అజ్ఞానమనే చీకటిని భేదించుచున్న దేవుడు జ్ఞానముద్రతో నున్నతన చేతితో నాకు "తత్ త్వం అసి" అను మహావాక్యాన్ని దాని అర్థాన్ని బోధించుగాక!

★★★

## గురు - సూత్రములు

"గురు ర్విద్వాంసశ్చ ప్రత్యహం అభివాదనీయాః"
గురువునకు, విద్వాంసునకు నిత్యం నమస్కరించవలెను.

★★★

"గురుణాం వివాదం నాచరేత్" - (వైఖాయనస సూక్తి : 10-3-47)
గురువుతో వివాదం కూడదు.

★★★

అధ్యయనం చేయించువాడధ్యాపకుడు.

# 6. శ్రీ దక్షిణామూర్తి స్తోత్రమ్

1 శ్లో॥ విశ్వం దర్పణ దృశ్యమాన నగరీ తుల్యం నిజాంతర్గతం
పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథా నిద్రయా
యస్సాక్షాత్కురుతే ప్రబోధ సమయే స్వాత్మానమేవాద్వయం
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥

2 శ్లో॥ బీజస్యాంతరివాంకురో జగదిదం ప్రాఙ్నిర్వికల్పం పునః
మాయాకల్పిత దేశకాల కలనా వైచిత్ర్య చిత్రీకృతమ్
మాయావీవ విజృంభ యత్యపి మహాయోగివ యస్స్వేచ్ఛయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥

3 శ్లో॥ యస్యైవ స్ఫురణం సదాత్మక మసత్కల్పార్థకం భాసతే
సాక్షాత్తత్త్వ మసీతి వేదవచసా యోబోధయాత్యాశ్రితాన్
యత్సాక్షాత్కరణాద్భవేన్న పునరావృత్తిర్భవాంభో నిధౌ
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥

4 శ్లో॥ నానాచ్ఛిద్ర ఘటోదరస్థిత మహాదీప ప్రభా భాస్వర్వం
జ్ఞానం యస్యతు చక్షురాది కరణ ద్వారా బహిస్పదంతే
జానామీతి తమేవ భాంతమను భాత్యే తత్ సమస్త జగత్
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥

5 శ్లో॥ దేహం ప్రాణమపీంద్రియాణ్యపిచలాం బుద్ధించ శూన్యం విదుః
స్త్రీ బాలాంధ జడోప మాస్త్వహమితి భ్రాతభృశం వాదినః
మాయా శక్తివిలాస కల్పిత మహా వ్యామోహ సంహారిణే
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥

6. శ్లో॥ రాహుగ్రస్తదివాకరేందు సదృశో మాయా సమాచ్ఛాదనాత్
సన్మాత్రః కరణోప సంహరణతో యోऽభూత్సుషుప్తః పుమాన్
ప్రాగ స్వాప్సమితి ప్రబోధ సమయేయః ప్రత్య భిజ్ఞాయతే
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥

7. శ్లో॥ బాల్యాదిష్వపి జాగ్రదాదిషు తథా సర్వాస్వవస్థాస్వపి
వ్యావృత్తాస్వను వర్తమానమహమి త్యంతః స్ఫురంతం సదా

స్వాత్మానం ప్రకటీ కరోతి భజతాం యోభద్రయాముద్రయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥

8. శ్లో॥ విశ్వం పశ్యతి కార్యకారణతయాస్వస్వామి సంబంధతః
శిష్యాచార్యతయా తథైవ పితృపుత్రాధ్యాత్మనా భేదతః
స్వప్నే జాగ్రతివాయ ఏష పురుషో మాయా పరిభ్రామితః
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥

9. శ్లో॥ భూరంభాంస్యనలోఽనిలోంబంర మహర్నాథో హిమాంశుః పుమాన్
ఇత్యాభాతి చరాచరాత్మక మిదం యస్యైవ మూర్త్యష్టకమ్
నాన్యత్కించన విద్యతే విమృశతాం యస్మాత్పర స్మాద్విభోః
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥

10. శ్లో॥ సర్వాత్మత్వమితి స్ఫుటీకృత మిదం యస్మాదముష్మంస్తవే
తేనాఽస్య శ్రవణాత్తదర్థ మననాద్ధ్యానాచ్చ సంకీర్తనాత్
సర్వాత్మత్వ్య మహావిభూతి సహితం స్యాదీశ్వరత్వంస్వతః
సిద్ధ్యే త్తత్పునరష్టదా పరిణతంచై శ్వర్యమవ్యాహతమ్ ॥

## ఇతి శ్రీ శంకరాచార్యకృతమ్

★★★

## గురు - సూత్రములు

"గురు వాక్యం న వృథాఽతస్తత్పదే భజ తరిష్యసి"

గురువాక్యం వృథాకాదు కావున, వారి పాదములను భజించిన తరింపగలరు.

★★★

"మహాదోషోగురు శాపాద్ధ విష్యతి"

గురువును శపించుట వలన మహాదోషము వాటిల్లును.

★★★

పుత్రుల శిష్యుల హితము కోరిన ఆచార్యులు శాస్త్రముల నేర్పరచిరి.

# 7. శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి సద్గురు స్తవము

1. సిద్ధి బుద్ధి మహాయోగ వరణీయో గణాధిపః ।
యస్స్వయం సచ్చిదానందం సద్గురుం తం నమామ్యహమ్ ॥

2. యస్స్వ దత్తాత్రేయ భావో భక్తానామాత్మదానతః ।
సూచ్యతే సచ్చిదానందం సద్గురుం తం నమామ్యహమ్ ॥

3. యోగా జ్యోతి స్సముద్దీప్తం జయలక్ష్మీనృసింహయోః ।
అద్వయం సచ్చిదానందం సద్గురుం తం నమామ్యహం ॥

4. యోగవిద్యా చిత్రభానుం చిత్రభాను శరద్భవమ్ ।
జ్ఞానదం సచ్చిదానందం సద్గురుం తంనమామ్యహమ్ ॥

5. గణేశ హోమేర్కదినే నిత్యం శ్రీచక్ర పూజనే ।
దీక్షితం సచ్చిదానందం సద్గురుం తం నమామ్యహమ్ ॥

6. అగస్త్య ముని సంక్రాంత నానావైద్య ధురంధరమ్ ।
భవఘ్నం సచ్చిదానందం సద్గురుం తం నమామ్యహమ్ ॥

7. వాద్యోదంచ ద్దివ్యనామ సంకీర్తన కళానిధిమ్ ।
నాదాబ్ధిం సచ్చిదానందం సద్గురుం తం నమామ్యహమ్ ॥

8. దత్త పీఠాధిపం ధర్మ రక్షణోపాయ బంధురమ్ ।
సత్కవిం సచ్చిదానందం సద్గురుం తం నమామ్యహమ్ ॥

9. విధూత భక్త సమ్మోహ మవధూతం జగద్గురుమ్ ।
స్వాశ్రయం సచ్చిదానందం సద్గురం తం నమామ్యహమ్ ॥

10. సాధుత్వం భక్తిమైశ్వర్యం దానం యోగమరోగతామ్ ।
సన్మతిం జ్ఞాన మానందం సద్గురుం తం నమామ్యహమ్ ॥

– స్వస్తి – శుభం – మంగళం –

# 8. శ్రీ శంకరాచార్య కృత గుర్వష్టకమ్

1. శరీరం సురూపం తథావాకళత్రం
యశశ్చారు చిత్రం ధనం మేరు తుల్యమ్
మనశ్చేన్న లగ్నం గురోరంఘ్రి పద్మే
తతః కిం? తతః కిం? తతః కిం? తతః కిం?

2. కళత్రం ధనం పుత్ర పౌత్రాది సర్వం
గృహం బాంధవాః సర్వమేతద్ధి జాతమ్
మనశ్చేన్న లగ్నం గురోరంఘ్రి పద్మే
తతః కిం? తతః కిం? తతః కిం? తతః కిం?

3. షడంగాది వేదో ముఖే శాస్త్ర విద్యా
కవిత్వాది గద్యం సుపద్యం కరోతి
మనశ్చేన్న లగ్నం గురోరంఘ్రి పద్మే
తతః కిం? తతః కిం? తతః కిం? తతః కిం?

4. విదేశేషు మాన్యః స్వదేశేషు ధన్యః
సదాచార వృత్తేషు మత్తోన చాన్యః
మనశ్చేన్న లగ్నం గురోరంఘ్రి పద్మే
తతః కిం? తతః కిం? తతః కిం? తతః కిం?

5. క్షమా మండలే భూప భూపాల వృందైః
సదా సేవితం యస్య పాదారవిందమ్
మనశ్చేన్న లగ్నం గురోరంఘ్రి పద్మే
తతః కిం? తతః కిం? తతః కిం? తతః కిం?

6. యశోమేగతం దిక్షుదాన ప్రతాపా
జ్జగద్వస్తు సర్వంకరే యత్ప్రసాదాత్
మనశ్చేన్న లగ్నం గురోరంఘ్రి పద్మే
తతః కిం? తతః కిం? తతః కిం? తతః కిం?

7. నభోగే నయోగే నవా వాజరాజౌ
నకాంతాముఖేనైవ విత్తేషు చిత్తమ్
మనశ్చేన్న లగ్నం గురోరంఘ్రి పద్మే
తతః కిం? తతః కిం? తతః కిం? తతః కిం?

8. అరణ్యేనవా స్వస్యగేహే న కార్యే
నదేహే మనో వర్తతేమే త్వనర్ఘ్యే
మనశ్చేన్న లగ్నం గురోరంఘ్రి పద్మే
**తతః కిం? తతః కిం? తతః కిం? తతః కిం?**

9. గురోరష్టకమ్ యః పఠేత్పుణ్యదేహి
యతిర్భూపతిర్బ్రహ్మచారీ చ గేహి
లభేద్వాంఛితార్థం పదం బ్రహ్మసంజ్ఞం
గురోరుక్త వాక్యేమనో యస్య లగ్నమ్

**"ఇతి శ్రీ శంకరాచార్య కృతం"**

★★★

## గురు - సూత్రములు

"దదాతి శ్రీగురుర్భాయో దత్తేఽసంకల్పితం ధృతం"
గురువు శిష్యుడు సంకల్పించని వాటిని (శ్రేయస్సును) అధికముగను, శీఘ్రముగను ప్రసాదించును.

★★★

గురు బోధలు, గురు చింతనలతో మానసికారోగ్యము కుదుటబడును.

★★★

"వదాన్యః కామదః కోఽత్రవదాన్యస్సు చమేఘువత్"
గురువు కోరికల దీర్చువాడని, ఇచ్చుటలో మేఘము వలె యివ్వగలడని ఋషులు చెప్పిరి.

★★★

స్వ గురువును నిందించుచుండ హర్షముగా వినువాడు రాక్షస జన్మ నెత్తుదురు. గురునింద కూడదు - కూడదు.

★★★

గురుపాదములందే సమస్త తీర్థములు కలవని "స్మృతులు" నిరూపించుచున్నవి.

# 9. శ్రీ గురు పాదుకాస్తోత్రమ్

1. శ్లో॥ నాలీక నీకాశ పదాదృతాభ్యాం
నారీ విమోహాదాది నివారకాభ్యామ్ ।
నమజ్జనాభీష్ట తతి ప్రదాభ్యాం
నమోనమః శ్రీ గురుపాదుకాభ్యామ్ ॥

2. శ్లో॥ శమాది షట్కప్రద వైభవాభ్యాం
సమాధి దాన వ్రత దీక్షితాభ్యామ్ ।
రమాధవాంఘ్రి స్థిరభక్తిదాభ్యామ్
నమోనమః శ్రీగురుపాదుకాభ్యామ్ ॥

3. శ్లో॥ నృపాలి మౌలివ్రజ రత్నకాన్తి
సరిద్విరాజజ్ ఝషకన్యకాభ్యాం ।
నృపత్వదాభ్యాం నతలోక పంక్తే
ర్నమోనమః శ్రీగురుపాదుకాభ్యామ్ ॥

4. శ్లో॥ అనంత సంసార సముద్రతార -
నౌకాయితాభ్యాం గురుభక్తిదాభ్యాం ।
వైరాగ్య సామ్రాజ్యద పూజనాభ్యాం
నమోనమః శ్రీగురుపాదుకాభ్యామ్ ॥

5. శ్లో॥ పాపాంధకారార్క పరంపారాభ్యాం
తాపత్రయాహీంద్ర ఖగేశ్వరాభ్యామ్ ।
జాడ్యాబ్ది సంశోషణ బాడబాభ్యాం
నమోనమః శ్రీ గురుపాదుకాభ్యామ్ ॥

6. శ్లో॥ కవిత్వ వారాశిని శాకరాభ్యాం
దారిద్ర్యదావాంబుదమాలి కాభ్యామ్ ।
దూరీకృతానమ్ర విపత్తితాభ్యాం
నమోనమః శ్రీగురుపాదుకాభ్యామ్ ॥

7. శ్లో॥ నతాయయోః శ్రీపతితాం సమీయుః
కదాచిదాప్యాశు దరిద్రవర్యాః ।
మూకశ్చ వాచస్పతితాం - హితాభ్యాం
నమోనమః శ్రీ గురుపాదుకాభ్యామ్ ॥

8. శ్లో॥ కామాది సర్పవ్రజభంజకాభ్యాం
వివేకవైరాగ్య నిధి ప్రదాభ్యామ్ ।
బోధప్రదాభ్యాం ధృతమోక్షదాభ్యాం
నమోనమః శ్రీగురుపాదుకాభ్యామ్ ॥

9. శ్లో॥ స్వార్చాపరాణామఖిలేష్టదాభ్యాం
స్వాహాసహాయాక్ష దురంధరాభ్యామ్ ।
స్వాన్తాచ్ఛ భావప్రద పూజనాభ్యాం
నమోనమః శ్రీ గురుపాదుకాభ్యామ్ ॥

ఇతి శ్రీ శృంగగిరి జగద్గురు శ్రీసచ్చిదానంద శివాభినవ
నృసింహ భారతీ మహాస్వామి విరచితం
శ్రీ గురుపాదుకాస్తోత్రం సంపూర్ణమ్

"నమామి శంకరం గురుమ్" - "తమాశ్రయామి సద్గురుమ్"
"తత్వమాశ్రయామి దేశికమ్" - "సదాభజామి శంకరమ్"
"సదా జగద్గురుర్గతిర్మమ" - "గురుంతమేవ శంకరాభిధమ్"
"శంకరస్య సద్గురోః ప్రసాదతః" - "సర్వం సద్గురుంమయమ్"

★★★

## గురు - సూత్రములు

"దేశకాలేచ పాత్రేచ దత్తం శతగుణం భవేత్"

సంప్రదాయానుగుణముగా వినీత భావముతో గురువులకడ నేర్చిన విద్యయే విద్య. అట్టి విద్యయే తనకును, లోకమునకును శుభంకరము.

★★★

యథా జాత్యంధస్య స్వరూప జ్ఞానం న విద్యతే. తథా గురూప దేశేన వినా కల్ప కోటి శతైరపి తత్త్వజ్ఞానం న జాయతే.

భా: పుట్టు గ్రుడ్డి వానికి స్వరూప జ్ఞాన మెట్లుండదో, అటులే గురూప దేశము లేకుండా కల్పకోటి శతములైనా తత్త్వజ్ఞానము కలుగదు.

# 10. "గురుగీత"
## (గ్రంథ సమీక్ష)

"గురుగీత" – అనే గ్రంథమును శ్రీవేదవ్యాసుల వారు సద్గురు దత్తతత్త్వ ప్రచారం చేస్తూ తన స్కాంధ పురాణంలో నిబంధించారు. ఈ 'గురుగీత' – సప్త ఋషుల సమక్షములో, జగత్కల్యాణంకోసం 'శివపార్వతుల" మధ్య జరిగిన సంభాషణ. సకల జగన్మాత పార్వతీదేవి కైలాసంలో పరమేశ్వరుణ్ణి "గురువు అంటే ఏమిటి?" – అని, వేసిన ప్రశ్నకు సమాధానమే ఈ గురుగీత గ్రంథం.

గురూపాసన ఎలా చేయాలో తెలిపే మహత్తర గ్రంథమిది. "గురు"తత్త్వాన్ని తెలిపే యీ గ్రంథం మొదటకైలాసంలో వెలసినా, దీనిని మానవలోకాని కందజేసిన పరమ గురుమూర్తి శ్రీ దత్తాత్రేయ స్వామి. అందుకే గురుదత్తుడ్ని "గురుమార్గ ప్రవర్తకుడు" అని వినుతికెక్కెను.

కాలక్రమేణ ఈ"గురుగీత" – పరమపూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజి శ్రీదత్తపీఠాధిపతి వారి వెలుగులో వెలుగొందినది. ఆ గ్రంథమునకు వ్యాఖ్యానమును శ్రీస్వామీజీ అవధూత దత్త పీఠాధిపతి ఆస్థానంలోనున్న పండితులు బ్రహ్మశ్రీ కుప్పావేంకట కృష్ణమూర్తిగారు వ్రాసిరి –

శ్లో॥ గురుభక్తో భవే చ్ఛీఘ్రం గురుగీతా జపేనతు ।
ధన్యా మాతాపితా ధన్యో ధన్యావంశ జనాఖిలా ॥
ధన్యాచ వసుధా కృత్స్నా గురుభక్తి ప్రభావితః ।

భావము: "గురు గీత"ను జపించిన (పఠించిన)వాడు త్వరగా గురుభక్తుడౌతాడు. అట్టి గురుభక్తుని కన్నతల్లి దండ్రులు, అతని వంశము వారునూ, ఆ దేశవాసులునూ ధన్యులు.

శ్లో॥ యస్యదేవే పరాభక్తిః యథాదేవే తథాగురౌ ।
తస్యతే కథితాహ్యర్థః ప్రకాశయన్తే మహాత్మనః ॥అని వేదశాసనము, కదా కనుక –

శ్లో॥ ఈశ్వరో గురురాత్మేతి మూర్తి భేదద్విభాగినే ।
వ్యోమ వద్వ్యాప్త దేహాయ దక్షిణా మూర్తయేనమః ॥ అని స్మరించవలెను.

శ్లో॥ ఇత్యేక రూప కతయా యోవాజానాత్యహంత్వితి ।
సకృత్ జ్ఞానేన ముక్త స్స్యాత్సమ్యక్ జ్ఞానే స్వయం గురురితి ॥

(తేజోబిందూపనిషత్ – 42వ మంత్రం)

ఈశుని ఏకరూపము జ్ఞానముతో నెవడు తెలిసికొనునో అతడు సకృత్ జ్ఞానముతో ముక్తుడగును. సమ్యక్ జ్ఞానము వచ్చుసరికి స్వయముగానే గురువగును.

**"ఆదిరం తశ్చ చిన్మాత్రం గురుశిష్యాది చిన్మయం"**

ఆద్యంతములు గురుశిష్యాదులే - అని శివుడు కుమారస్వామితో ననెను. అట్టి సంవాదములు, వాటికి భాష్యములు, వివరణలు "శ్రీగురుగీత"లో నిబంధించబడినవి.

శ్రీ జగద్గురు శంకర భగవత్పాదులచే స్తుతింపబడిన "శ్రీగుర్వష్టకం" - కూడ ప్రచురింపబడియున్నది. అట్టి "శ్రీ గురుగీత"ను పఠించి ధన్యులౌతారని ఆశిస్తున్నాను.

## జయగురుదత్త శ్రీగురుదత్త

★★★

## గురు - సూత్రములు

సత్పాత్ర విద్యాదానము గురువునకు ప్రతిష్ఠాకారణం, లోకక్షేమంకరం, శ్రేయోదాయకమునూ

★★★

"తత్త్వం గురుసమం నాస్తి, న దేవః కేశవాత్పరః"

గురు సమమగు తత్త్వం, కేశవుని మించిన దైవం లేదు.

★★★

"అగ్ని శుశ్రూష వశ్చైవ గురు శుశ్రూష కాస్తథా"

అగ్నిని, గురువులను సేవించిన వారలకు భవబంధ ముండదు. అనగా పునర్జన్మ యుండదు.

★★★

"నచాక్రమే ద్గురోశ్ఛాయాం తదాజ్ఞాంచ". గురువు గారి నీడను, ఆజ్ఞను దాటరాదు.

★★★

# 11. పరమేశ్వర స్తవము

భుశుండిని అనుగ్రహించుటకై అతని గురువగునొక బ్రాహ్మణుడు పరమేశ్వరుని యిట్లు స్తుతించెను.

ఛం॥ నమామీశ మీశాన నిర్వాణ రూపం,
విభుం వ్యాపకం బ్రహ్మవేద స్వరూపం ।
నిజం నిర్గుణం నిర్వికల్పం నిరీహం,
చిదాకాశమాకాశ వాసం భజేఽహం ॥ - 1

నిరాకారమోంకార మూలం తురీయం,
గిరిజ్ఞాన గోతీత మీశం గిరీశం ।
కరాలం మహాకాల కాలం కృపాలం,
గుణాగార సంసారపారం నతోఽహం ॥ - 2

తుషారాద్రి సంకాశ గౌరం గభీరం,
మనో భూతకోటి ప్రభా శ్రీ శరీరం ।
స్ఫురన్మౌళి కల్లోలినీ చారుగంగా,
లసద్భాల బాలేందు కంఠే భుజంగా ॥ - 3

చలత్కుండలంభ్రూ సునేత్రం విశాలం,
ప్రసన్నాననం నీలకంఠ దయాలం ।
మృగాధీశ చర్మాంబరం ముండమాలం,
ప్రియం శంకరం సర్వనాథం భజామి ॥ - 4

ప్రచండం ప్రకృష్టం ప్రగల్భం పరేశం,
అఖండం అజం భానుకోటి ప్రకాశం ।
త్రయః శూల నిర్మూలనం శూలపాణిం,
భజేఽహం భవానీ పతిం భావగమ్యం ॥ - 5

కలాతీత కల్యాణ కల్పాంతకారీ,
సదా సజ్జనానందదాతా పురారీ ।
చిదానంద సందోహమోహాపహారీ,
ప్రసీద ప్రసీద ప్రభో మన్మథారీ ॥ - 6

నయావద్ ఉమానాథపాదారవిందం,
భజంతీహలోకే పరే వానరాణాం ।
న తావత్సుఖం శాంతి సంతాప నాశం,
ప్రసీద ప్రభో సర్వ భూతాది వాసం ॥ - 7

నజానామి యోగం జపంనైవ పూజాం,
నతో౨హం సదా సర్వదా శంభు తుభ్యం ।
జరాజన్మదుఃఖౌఘ తాతప్యమానం,
ప్రభో పాహి ఆపన్నమామీశ శంభో ॥ - 8

శంకరుడు ప్రసన్నుడగుటకు ఈ రుద్రాష్టకము ద్వారా ఆ బ్రాహ్మణుడు భక్తితో స్తుతించి ప్రసన్నుడయ్యెను. కావున నెవరేని భక్తితో నీ రుద్రాష్టకము పఠించినచో పరమశివుడు వారిని అనుగ్రహించును.

## - శుభమస్తు -

## గురు - సూత్రములు

"శిష్య పాపం గురోర్వజేత్" - అని.

శిష్యుడొనర్చిన పాపం గురువు పొందును.

★★★

విషం అనగా, ఏమిటి? "అవధీరణా గురుషు",

గురువు లేదా! జ్ఞాని చెప్పిన మాటను వినక తిరస్కరించడం విషతుల్యం.

★★★

"కరణధార సద గురుదృఢ నావా" -

సద్గురువు శరీరమును నావకు కర్ణధారుడు.

★★★

'గురు'మార్గ ప్రవర్తకుడే సద్గురువు.

★★★

# 12. అధ్యాత్మయోగ విద్య నభ్యసించిన వారు

1. అధ్యాత్మ యోగవిద్య యాజ్ఞ వల్కుని (ముని) వలన హిరణ్య నాభుడు అభ్యసించి యోగాచార్యుడయ్యెను.
2. "శబరి" అంతటి మహాభక్తురాలు తాను నివశిస్తున్న పంపానది తీరములో అనేక గురువులను **సేవించి తరించెను.**
3. బ్రహ్మదత్తుడు, మరి యారుగురును, కౌశికుడను బ్రాహ్మణ పుత్రులు – వీరందరును "శని" తండ్రియైన గర్గుని శిష్యులైరి.
4. కృష్ణుడను నొకముని, ఇతడు దేవకి యొక్క తనయుడు. ఘోరుడను గురునికితడు శిష్యుడయ్యెను. ఆగురువు నుండి "పురుష యజ్ఞము" అను విజ్ఞానమునేర్చెను.
5. విశ్వామిత్రుని అస్త్రగురువులు కృశాశ్వుడు, భృశాశ్వుడు.
6. వశిష్ఠుడు సూర్యవంశీయుల ఆధ్యాత్మిక గురువేగాక, ధర్మ సందేహములను దీర్చిన మహద్గురువు.
7. శ్రీశుకునకు జన్మతః గురువు అతని తండ్రి వ్యాసుడు. అటుపిదప గురువు బృహస్పతి. అటు తర్వాత జనక మహారాజును గురువుగాపొంది జ్ఞానోపదేశమును పొందెను.
8. ఆంజనేయుడే గురుదేవుడు. జీవుని దేవునిగా మార్చె అమృత మూర్తి సద్గురువు. భక్తునికి, భగవంతునికి మధ్య ఆధ్యాత్మిక వారధి నిర్మించే మహానుభావుడు. తులసీదాసునకు రామకైంకర్య మార్గము జూపినవాడు.
9. "వాల్మీకి"ని సన్మార్గములో పెట్టిన మహనీయుడు, రామాయణ గ్రంథకర్తగా రూపొందింప జేసిన "నారదుడు" గురువే.
10. గురువే శివుడు. అట్టి గురుసేవ వలన సకల సిద్ధులు చేకూరును.
11. భృగు మహర్షి తనతండ్రి, గురువు అయిన వరుణుని వద్ద శిష్యరికంతో ఆధ్యాత్మిక విద్య నభ్యసించెను.
12. శ్వేత కేతువు తన తండ్రి, గురువు అయిన ఉద్దాలకుని వద్ద శిష్యరికంతో ఆత్మజ్ఞాన బోధితుడయ్యెను.
13. శ్రీకృష్ణుడు సాందీపుని వద్ద విద్యనభ్యసించెను.

14. అర్జునుడు గురువగు ద్రోణాచార్యుని నుండి అస్త్రవిద్యల భ్యసించి, శ్రీకృష్ణుని నుండి గీతబోధతో ఆత్మజ్ఞానము లరవరచుకొనెను.

15. శ్రీరామచంద్రుడు బాల్యమున వశిష్ఠుని ద్వారా, తదుపరి విశ్వామిత్రుల ద్వారా సకల విద్యలు నేర్చెను.

16. దేవతలంతా బృహస్పతి నుండియే సకలవిద్యలు నేర్చిరి.

17. శ్రీ ఆంజనేయుడు శ్రీసూర్య భగవానుని మెప్పించి ఆత్మ బోధను పొందెను.

18. "అహమేవ పరం బ్రహ్మ అహమేవ గురోర్గురుః" అని, "సర్వం పరబ్రహ్మం - అహం గురుః పరః" పరమగురుడును అని - గురువునకు గురువును. "బ్రహ్మణోఽన్యద్గురుర్నాస్తి", బ్రహ్మకన్న వేరైన గురువు లేడు.

19. యోగవిద్య అవిచ్ఛిన్నమైనది - అతి రహస్యాతిరహస్యమైనది. పరమ శుభమైనదియును, దీనిని మించినది లేదు. అట్టి అమృతత్త్వ విద్యను రహస్యముగానే గ్రహించవలెను. దీనిని పుత్రుడు కాని వానికి, శిష్యుడు కాని వానికి బోధింపరాదు. గురువే దేవుడనుకొను వానికి, పరమ భక్తునకు చెప్పదగిన శాస్త్రమిది.

20. పూర్వమొకప్పుడు సనకసనందాది యోగీశ్వరులు, ఇతర ఋషీశ్వరులు, ప్రహ్లాదాది విష్ణు భక్తులు, శ్రీ హనుమంతుని జేరి, శ్రీరామ తారక మంత్రం తత్వోపదేశమును ఉపదేశింప ప్రార్థించి, విని, సర్వదోష వర్జితులై పవిత్రులైరి - అని శ్రీరామ రహస్యోపనిషత్తు తెలిపెను.

21. "శ్రోత్రియం బ్రహ్మనిష్ఠగ్ం స్వగురుం గచ్ఛేద్యథావిధి ।
గురుస్తస్మై పరాం విద్యాం దద్యాద్బ్రహ్మాత్మ బోధినీమ్ ॥"

భా॥ శ్రోత్రియుడు బ్రహ్మనిష్ఠుడైన గురువును యథావిధిగా చేరవలెను. గురువు బ్రహ్మాత్మ బోధిని యగు విద్యనాతనికివ్వవలెను.

అని - (రుద్రహృదయోపనిషత్ - 5వ మం.లో)

22. "ఘటమిత్యుక్తం, యథాదీపోహి తత్పరమ్
గురువాక్య సమాభిన్నే బ్రహ్మజ్ఞానం స్ఫుటీ భవేత్,
కర్ణధారం గురుం ప్రాప్యకృత్వా సూక్ష్మ తరంతిచ
అభ్యాస వాసనాశక్త్యా తరంతి భవసాగరమ్ ॥"

భా: "శరీరమే ఘటము. పరమాత్మయే దీపము". గురూపదేశమున శరీరమను ఘటము భిన్నముకాగా, బ్రహ్మజ్ఞానము స్ఫుటమగును (దీపజ్వాల ప్రకాశించును) గురువును కర్ణధారుణిగను (చుక్కాని నడుపువాడు) పొంది సూక్ష్మముగా తరింతురు. అభ్యాస వాసనాశక్తిచే భవసాగరమును తరింతురు.

(యోగకుండల్యుపనిషత్ 3-7 మంత్రములు)

23. "ప్రసన్నాస్తు **వదంత్యేవ గురవో గుహ్యమప్యుత**" -

భా: ప్రసన్నులైన **గురువు లెంతెంతటి రహస్యము**నైన తేలికగా తేటపరుతురు.

24. అంగీరసుడు తన పుత్రుడగు బృహస్పతితోబాటు, శుక్రునకును విద్యాగురవై యుండెను. విద్యా బోధనలో వ్యత్యాసముండడంతో శుక్రుడు గౌతముని జేరి అర్థించగా, ఆతడందులకు శివుడే పరమగురువని జెప్పగా, నతడు శివుని మెప్పించి, ఆరాధించి "మృతసంజీవని" విద్య నేర్చెను.

25. గురోర్ముఖేన జ్ఞాతవ్యం నాన్యథా గ్రంధకోటిభిః ।

అన్యథాలభితం నాస్తి సత్యం సత్యం పునః పునః ॥ - (శృతి)

26. రహస్య ఖండమున శ్రీచక్రానికీ, శ్రీ విద్యకును మరియూ శ్రీదేవికిని గురుశిష్యులకు ఉండవలసిన తాదాత్మ్య భావాలు చెప్పబడినవి.

27. పూర్వము బ్రహ్మజ్ఞానమును (శ్రీవిద్యను) బ్రహ్మనుండి భృగుమహర్షి పొందెను. వారి నుండి చ్యవన మహర్షి పొందెను. వాని నుండి దక్షప్రజాపతి పొందెను. వారి నుండి మార్కండేయ మహర్షి పొందెను. వారి నుండి క్రోష్టిముని పొందెను. వాని నుండి ధర్మపక్షులు పొందినవి. ఆ పక్షుల నుండి జైమిని మహర్షి పొంది బ్రహ్మజ్ఞాన సంపన్నుడై తన కుమారునకును, తన శిష్యులకును నేర్పెను.

28. శ్లో॥ "ఏవం పరంపరా ప్రాప్తం ఇమం రాజర్షయో విదుః ।"

"ఇట్లు ఈ ఆధ్యాత్మిక విద్యగురు శిష్యపరంపరా ప్రాప్తిస్తూ వస్తూందని", శ్రీకృష్ణ భగవానుడు గీత (4వ అ॥ 2 శ్లో)లో తెలిపెను.

29. బ్రహ్మ (విద్య) జ్ఞానం పొందు విద్యార్థి మకర సంక్రమణం నాడు ధర్భలు, నువ్వులు చేతబట్టుకొని వినమ్రతతో ఉత్తమ గురువును చేరాలి. ఆ గురువు యీతనికి జ్ఞానదానం చేయాలి ఆ రోజు. అనగా బ్రహ్మజ్ఞానం పొందుటకు బ్రహ్మజ్ఞానందాన మొనర్చుటకును పుణ్య (శుభ) దినమిది.

★★★

# 13. ఆత్మసాక్షాత్కారము పొందుట

"శ్లో॥ నైవవాచా నమనసా ప్రాప్తుం శక్యోన చక్షుషా ॥
అస్తీతి బ్రువతోఽన్యత్ర కథం తదుపలభ్యతే ॥" -
(కఠోపనిషత్తు - షష్ఠవల్లి - 12వ మంత్రశ్లోకము)

భావము: ఆత్మ అనునది మాటల ద్వారా, కన్నుల ద్వారా, మనస్సు చేతను పొందవానికి సాధ్యపడేది కాదు. "అది ఉన్నది" అనగా "ఆత్మ" నిత్య సత్యమైనది. అట్టి ఆత్మను సాక్షాత్కరించు కొనిన ఋషుల (గురువుల) నుండియే దానిని పొందవలె. ఇతరత్రా పొందలేము.

వివరణ: మనకు జ్ఞానసాధనాలైన మనస్సుకు, ఇంద్రియాలకునూ ఆత్మ అతీతమైనదనడం సత్యము. అందుచేత అట్టి ఆత్మ సాక్షాత్కారం పొందిన గురువు యొక్క ఉపదేశంతో ఆత్మలాభం కలుగుతుందని "శృతి" ఉవాచ.

"ఆత్మ అనేది యొకటి మొదటి నుండియు ఉన్నదీ" అని చెప్పే గురువు పలుకులలో విశ్వాసాలు యుంచి, ఆయన ఉపదేశాలను పాటించే శ్రద్ధ భక్తి ప్రపత్తులు కలిగి ఆచరించుటలో కొంత "ఆత్మ"ను గురించి గ్రాహ్యమగును. ఎంతగా తర్కవితర్కాలు, హేతువాదాలు చేసినను నిర్వివాదంగా అతీంద్రియమైన 'ఆత్మ' ఉనికిని నిర్ధారించి చెప్పలేం. ఉన్నదనే ప్రతివాదము, సమాన బలంకల్గలేదనే వాదాన్ని యెదుర్కొంటూనే యుంటుంది. అందుచేత వేదాంతులు తమ తమ సిద్ధాంతాన్ని కేవలం తర్కంమీదనే కాక, శబ్ద ప్రమాణంపైన శృతులపైనను అనుభవశీలురైన ఋషుల ఉద్ఘాటనలపైన నిలబెట్టారు. "వ్యాసుడు" తన వేదాంత సూత్రాలలో అలాంటి శుష్కవేదాంత చర్చను కేవలం తర్కము, తత్త్వనిర్ణయం చేయజాలదంటూ కొట్టి వేశాడు.

**అందుచేత**, "ఆత్మ" సాక్షాత్కారానికి ప్రథమసోపానం ఏమంటే, స్వయంగా **ఆత్మసాక్షాత్కారం పొందిన** గురువు పలుకులలో విశ్వాసం కలిగియుండడం. కనుక, "ఆత్మ" యొక్క నిజస్వరూపాన్ని సాక్షాత్కరించుకోవడానికి మొట్ట మొదటిది శ్రద్ధ అత్యవసరం. శాస్త్రాలలో చెప్పబడిన "ఆత్మసత్త"ను గూర్చిన శ్రద్ధ, గురూపదేశంతోనే క్రమంగా బలపడి, తదుపరి తన స్వయం స్ఫూర్తితో ఆత్మ ఉనికిని తెలియ బరచుకోవచ్చును. మనస్సే గురువుగా మారి, ఇక గురువుగా వ్యవహరిస్తుంది. నిద్రాణ స్థితి తొలగి ఆధ్యాత్మిక సంక్లిష్ట తత్త్వాల స్థితికి చేరుతాడు. తన ఆధ్యాత్మిక సంశయ నివృత్తికై సాధకుడు యత్నించడు. అదే భగవద్గీతలో (2అ - 52వశ్లో)

శ్లో॥ యదాతే మోహకలిలం బుద్ధిర్వ్యతి తరిష్యతి ।
తదాగన్తాసి నిర్వేదం శ్రోతవ్యస్య శృతస్యచ ॥

భా॥ నీ బుద్ధి ఎప్పుడు అజ్ఞాన మోహాల నుండి విముక్తమవుతుందో అప్పుడది వినడం మంచిది. ఆ శాస్త్రంలో అలా వచించబడింది.

ఆత్మ విద్యా గురువు శిష్యునకు మంత్రాన్ని ఆత్మపరం చేస్తాడు. పరమాత్మ సాక్షాత్కారం పొందుతాడు శిష్యుడు.

"కఠోపనిషత్తు" ద్వితీయ వల్లి యందున్న 7వ-

శ్లో॥ శ్రవణాయాపి బహుభిర్యోనలభ్యః,
శృణ్వంతోఽపి బహవోయం నవిద్యుః ।
ఆశ్చర్యో వక్తా కుశలోఽస్యలబ్ధాఽఽ
శ్చర్యో జ్ఞాతా కుశలాను శిష్టః ॥

భా॥ ఆత్మను గురించి వినడానికి కూడా యెంతో మందికి సాధ్యపడదు. దాని గురించి వినిన వారు కూడా ఎందరో దానిని గ్రహించలేరు. దానినుపదేశించే ఆచార్యుడద్భుతమైనవాడు. అనగా! సమాజంలోనతి సక్కృతుగా ననిపించే "ఆత్మజ్ఞాని" ఆయన (గురువు) శక్తి స్వభావము కూడా నిజంగా నాశ్చర్యమైనదే. సమాజానికి వీరే జీవగఱ్ఱలు. అటులే శిష్యుదును యద్భుతమైన బుద్ధి తీక్ష్ణత గలవాడు. అనగా! ఆత్మవిద్య నర్థంచేసుకోగల శిష్యుదును యెంతో యరుదు. అవసరమైన అర్హతలు, సాధన చతుష్టయం మాత్రమే, ఆత్మవిద్యకు తగిన శిష్యునిగా నొనర్చును. అట్టి శిష్యునకు సమర్థుడైన యాచార్యుడుపదేశించగా దాన్ని గ్రహించగలిగె శిష్యుడు నిజంగా నద్భుతమైన వాడు గదా!

"తైత్తరీయోపనిషత్తు"-లో "ఉపకుర్వాణ బ్రహ్మచారికి గురుకులవాసం నుండి గృహస్థ జీవనం గ్రహించటానికి ముందు గురూపదేశం పొందడం ఉపదేయం. గురువును తల్లిదండ్రులతో సమానంగా చూడవలెనని. అదియే శిష్యుని ధర్మాచరణమ"ని కలదు.

★★★

## గురు - సూత్రం

"గురురేవ హరిస్సాక్షా న్నాన్యస్య ఇత్య బ్రవీచ్ఛృతిః"

గురువే సాక్షాత్తు మహావిష్ణువని శృతి చెప్పుచున్నది.

## 14. "గురుః - గురువు" - (నిర్వచనము)

"గిరతి అజ్ఞానం ఇతి గురుః" - అంటే అజ్ఞానాన్ని కబళించేవాడే గురువు కబళింప జేసే వాడని అర్థం "గురు గీత" గ్రంథంలో పరమశివుడు జగన్మాతయైన పార్వతితో సంభాషణ (ప్రశ్నోత్తరాల చర్చగా) అంటాడు

శ్లో॥ గుకారాశ్చాంధకారస్తు రుకారస్త న్నిరోధకః ।
అంధకార వినాశిత్వాత్ గురురిత్యభి ధీయతే ॥

"గు" అనే అక్షరం అంధకారానికి (అజ్ఞానాంధకారానికి) సంకేతం "రు' అనే అక్షరం తొలగించేదిగా, వెలుగుకు సంకేతం బ్రహ్మజ్ఞానమనే బోధచేత అజ్ఞానాంధకారంను పోగొట్టి, స్వయం ప్రకాశమై వెలిగే ఆత్మానుభవం కల్గించే వాడు "గురువు" - అని అర్థం

"గురు" అనే పదం విడదీస్తే "గ్-ఉ-ర్-ఉ' అనే అక్షరాలు కనపడుతాయి వీటిలో 'గ'కారం సిద్ధకరమైన బ్రహ్మకు, 'ర'కారం పాపనాశకమైన శివశక్తికి సంకేతాలు ఈ రెండునూ పాలనాస్వభావం కలిగిన "విష్ణుశక్తి"తో ('ఉ' కారం) కలిసినప్పుడే 'గురు అనే పదమేర్పడి, 'గురు' తత్త్వం మూర్తీభవిస్తోంది అందుకే గురువును త్రిమూర్తి స్వరూపుడుగా యావద్భారతంలోను ఏ సాంప్రదాయం వారైన గురుధ్యానంగా మొదట నీశ్లోకం పఠింతురు

శ్లో॥ గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణుః
గురుదేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ
తస్మై శ్రీ గురవే నమః ॥ - అని

"గురువు" కేవలం ఈశ్లోకం ద్వారా త్రిమూర్తి స్వరూపియే గాక, సాక్షాత్ **పరబ్రహ్మయే గురువని** స్పష్టం

**'గురు' శబ్ద**మునకు మరియొక శ్లోకము

శ్లో॥ 'గు' కారశ్చ గుణాతీతో, రూపాతీతో రుకారః ।
గుణ రూప విహీనత్వాద్గురురిత్యభిధీయతే ॥

'గు'కారం, గుణముల కతీతుడు
'రు'కారం, రూపముల కతీతుడు
అనగా గుణ, రూపములు లేనివాడని భావము
'గు'కారం, 'రు'కారం అద్వయతారకం (ఉపనిషత్తు)
"స-క్రమ" మార్గాన్ని చూపువాడే గురువు

"నద్యాం కీటా ఇవ" - నదీ నీటిలో కొట్టుకొని పోతున్న కీటకము తీసి ఒడ్డున వేసినట్లు ('శరీరమే నేను' - అనుకొని జనన మరణ రూప సంసార సాగరంలో కొట్టుకొని పోయెవానిని) ఆత్మతత్త్వ మెరిగిన జ్ఞాని (గురువు) కీటకమును (శిష్యుని) ఒడ్డున పడవేసి రక్షించి, నిర్వికల్ప ప్రత్యక్ష జ్ఞాన బోధ నిట్లు జేయును.

ఓ జీవి! 'తత్' అంటే సర్వవ్యాపి, సర్వజ్ఞుడు, సర్వశక్తి సంపన్నుడైన, పరమాత్మ. 'త్వం' అనగా నీవే. అంటే దేహం మాత్రమే నీవని భావించి, అంతర్లీనమైయున్న 'ఆత్మ'ను ఎరుంగక, కించిత్ జ్ఞాన స్వల్ప శక్తి గలనీవు, జీవాత్మ పరమాత్మ వేరువేరని భావించి యున్నవాడవు.

కాని తత్త్వజ్ఞుడైన గురువు "తత్త్వమసి" - ఆ పరమాత్మవు నీవే - అని 'గురు' వాక్యాన్ని బోధిస్తాడు. దానితో, జీవునకు (శిష్యునకు) పూర్వ సత్కర్మానుష్ఠానం వల్ల చెడు సంస్కార భావనలన్నీ నశించడంతో "తత్త్వమసి" వంటి వాక్యంతో నతడును "అహంబ్రహ్మాఽస్మి" - అనే ప్రత్యక్ష జ్ఞాన మంకురించును.

'గురి'ని కల్పించేవాడు గురువు. లక్ష్య సాధనా మార్గాన్ని జూపువాడే గురువు. ఇది స్థూలార్థం.

తే॥ విద్య గరపిన గురువును వేయినోళ్ళ
జెప్పుకొన్నను దానిలో తప్పులేదు
గురువు నందలి భక్తియే గొప్ప వెలుగు
సకల తత్త్వము తెలియగ సత్యమిదియె ॥

మరొకటి

కం॥ పరమార్థమైన తత్త్వము
కరతలమున జూపి శిష్యగణమును బ్రోవన్
గురువును పోలిన యతిడిహ
పరములలో లేదు లేదు పరికింపంగన్ ॥

శ్రీకృష్ణ భగవద్గీత - 2వ అ. 7వ శ్లోకమున -

"శిష్యస్తేఽహం శాధి మాంత్వాం ప్రపన్నమ్"

"శ్రీకృష్ణా! నేను నీ శిష్యుడను. నిన్ను శరణజొచ్చి యున్నాను. నన్ను శాసింపుము" - అని అర్జునుదర్థించెను.

అటులే -

(11వ అ. 43వ శ్లోకమున) అర్జునుడిట్లనును.

"త్వమశ్చ పూజ్యశ్చ గురుర్గరీయాన్" -

"శ్రీకృష్ణా! నీవు పూజనీయుడవు. గురుడవు మరియు పెద్దవు" అని - కీర్తించెను.

"మనీషాపంచకము"లో - శ్రీ శంకరాచార్యులిట్లనిరి.

శ్లో॥ బ్రహ్మైవాహమిదం జగచ్చ సకలం చిన్మాత్ర విస్తారితం
సర్వం చైతద విద్య యాత్రిగుణయాఽశేషం (సేశం) మయాకల్పితం ।
ఇత్థం యస్య దృఢామతిః సుఖతరే నిత్యే పరే నిర్మలే
చండాలోస్తు సతుద్విజోఽస్తుగురురిత్యేషామనీషామమ ॥

భా॥ నేను బ్రహ్మమును, ఈ ప్రపంచమంతయును బ్రహ్మముతో నిండి యున్నది. అజ్ఞానముచే ప్రపంచమని మనస్సుచే కల్పింపబడినది. ఇట్లు దృఢ నిశ్చయం కలిగి ఆత్మానందమును పొందియున్నవాడు ఛండాలుండు అయినను బ్రాహ్మణుడు అయినను అతడు నాగురువు."

శ్లో॥ యత్సాఖ్యాంబుద్ధి లేశ లేశత ఇమే శక్రాదయోయోనిర్వృతాః
యచ్చిత్తేనితరాం ప్రశాంత కలనేలబ్ధ్వామునిర్నిర్వృతాః ।
యస్మిన్నిత్యం సుఖాం బుధౌ గళిత ధీః బ్రహ్మైవ సబ్రహ్మవిత్
యఃకిశ్చిత్న సురేంద్ర వందిత పదోనూనం మనీషామమ ॥

భా॥ ఆత్మానందమనే సముద్రములోని నొకనీటి బొట్టు ఇంద్రుని సౌఖ్యమునకు సమానమైనది. అట్టి ఆత్మానందమును నిత్యమూ యనుభవించువాడు కేవలం బ్రహ్మజ్ఞానియేకాదు బ్రహ్మమే. అతడే నాకు గురువు ఈశ్వరుడును అట్టి గురుడు బుద్ధి కధిదేవత.

శ్లో॥ గురవో బహవస్సంతి శిష్యవిత్తాపహారకాః ।
తమేకం దుర్లభం మన్యే శిష్యహృత్తాపహారకమ్ ॥

భా: గురువులమని శిష్యుల ధనములపహరించుట, శిష్యురాండ్ర మానమపహరించుట వంటి దుర్గుణములు కల్గియుందురు కొందరు. , శిష్యుల హృదయ తాపము హరించుటరుదు కావున గుర్తెరింగి గురువులను ఎన్నుకోవలెను.

గురువు పరంపరాగతమైన క్రమ శిక్షణ కలవాడైతేనే శిష్యునకుపదేశమిచ్చుట కర్హుడని, అతడే సద్గురుడని తలంచవలెను. వాసుదేవోపాసనకలుగు మహనీయుల సాంగత్యమావశ్యకము. వారినే గురువులందరు. తాను పొందవలసిన శిక్షణనను గురించి గురువులు మారుచున్ననూ, చిట్ట చివరి అనుగ్రహం మాత్రమొకే గురువు చేతిలో నుండును. అనగా అన్ని జన్మల యందును తనకెవరు గురువులుగా నున్ననూ తానుమాత్రము, ఆ

అసలు (ఆధ్యాత్మికబోధ) గురువు పర్యవేక్షణలో తనకు తెలియకుండగనే లభించును. అపూర్వపు గురువులందరు అసలు గురువు యొక్క నియామకులే. ఇట్టి పరస్పరత్వము పరమ గురువుల శ్రేణి యందు కలదు. దీనినే - శ్రీరామానుజుల వారు "సారూప్యము" అనిరి.

శిష్యుడు స్వయంగా గురువును గురువుగా నెన్నుకొన్నంత మాత్రంతో, ఆయన వెంటనే గురువుగా కాదు. ఆయన నిన్నును శిష్యుడిగా యెన్నుకోవాలి. ఎన్నుకునే అధికారం శిష్యుడికి యున్నట్లే గురువుకును కలదు. నిదానించి, పరిశీలించి, శిష్యార్హతను గురువు నిర్ణయిస్తారు. అప్పుడే శిష్యుడౌతాడు. కనుక గురువును యెన్నుకొనే బాధ్యత, కృషి శిష్యునిదే. ఎన్నుకున్నాక, నువ్వెంత వెనుకబడి యున్నావో, ముందు నువ్వెంత యింకాకృషి చేయాలో గురువు గ్రహించి శిష్యత్వం యిస్తాడు. శిష్యుడును అట్టి గురువు లభించినందులకు గురువుపై భక్తి కలిగి యుండాలి.

ఇది, గురు శిష్యతత్త్వం.

స్త్రీలకు భర్త ఎలాంటి వాడో, జీవులందరికిని గురువు అటువంటి వాడు. స్త్రీలకు భర్త దైవస్వరూపుడు. అటులే, జీవులకు గురువంటే శివుడని, శివస్వరూపిగా తలంచి, అల్పమైన కోరికలను తీర్చమనడం, మహిమలను జూపమనడం అవివేకం. గురువుని ఎన్నుకున్నాక, పరీక్షించడమో, పరిత్యజించడమో శిష్యునకు హక్కులేదు.

గురువు నడుచుకోవలసిన ప్రవర్తనా నియమావళి అనునది యుంటుంది. కానీ, ఏదో నొకనాడు అట్టి ప్రవర్తనా నియమావళిని అతిక్రమించినట్లు కనబడిన వెంటనే, ఉన్మత్త (చపల) శిష్యులు తమ నిర్ణయాన్ని మార్చుకొని, మరో గురువుకై అన్వేషిస్తారు. ఇట్టివారు ఉభయ భ్రష్టులౌతారు. నిజంగా వీరే గురు నిందకులు. కనుక పతితులు.

కావున, జీవులు (శిష్యులు) హృదయమనునది నిష్కల్మషంగా నుంచుకొని, సహజమైన శాంతి, తృప్తి, సహనం కలిగి యుండాలి. సత్త్వగుణ సంపన్నుడైన గురుస్థానం శివస్థానంగానెంచి, తన హృదయాన్ని పరిపూర్ణంగా గురువునకు అంకితమివ్వాలి. అదే శిష్యుని నిజమైన గురుత్వము.

అటులె గురువు కూడా "గురుతత్త్వం" కలిగి యుండాలి. తనను పరిపూర్ణంగా విశ్వసించిన శిష్యునకు తాను పరిపూర్ణంగా ఆత్మజ్ఞానాన్ని అనుగ్రహించవలెను. అట్టివాడే సద్గురువుగా నెంచబడును.

సద్గురువు బోధలను శ్రద్ధగావిని, మనన మొనర్చుకొని, వాటిని అమలులో పెట్టినప్పుడే ఆసద్గురువు బోధలకు సార్థకత యుండును. త్రికరణ శుద్ధిగా, "తలపు, మాట,

పని"లో సమన్వయంతో మెలగడానికి ఆబోధలు తోడ్పడును. భావి జీవిత కాలంలో తానును తత్త్వదర్శిగా, మార్గదర్శిగా, పూర్ణచంద్రునిగా, సర్వసమర్థుడుగా, సద్గురువుగా నెంచుకోబడును. సర్వ శుభాశీస్సులు కల్గియుండును. అట్టిదే ఆత్మ జ్ఞానం పొందునట్లు నిదర్శన సద్గురువుగా చెలామణి అగును. ఇదియే పూర్వపు గురువు శిష్యుని పట్ల ఆశించిన అపేక్షణీయము.

కం॥ గురు సూచన తెలియకయే
నరుడిల పరిపూర్ణుడనగా న్యాయంబగునా
గురు సూచ నెరిగినందుకు
గురుతేమియు లేక యుండు "గురు" గోప్యమునన్ ॥

కం॥ గురువర్యుల పరమార్థం,
బరయంగా దొరలకైన దొరకదు సుమ్మీ ।
శరణాగతులగు వారికి,
పరిపూర్ణము సులభముగను ప్రత్యక్షమగున్ ॥ (అచల ఋషి ఉవాచ)

"గురువును దర్శించాలన్న చెట్టులోను, పుట్టలోను, పిట్ట (పక్షి) లోను దర్శించవచ్చునని" – ఒక మహానీయుని ఉవాచ –

"గురువు" అనే పదానికి, "శ్రీ పతంజలి మహర్షి" పలికిన శాస్త్రీయ నిర్వచనం యోగ సూత్రాలలో నిట్లున్నది.

"క్లేశ – కర్మ – విపాక –ఆశయైః అపరామృష్టః పురుష విశేషః ఈశ్వరః" అనిన్నీ
"స పూర్వేషాం అపి గురుః కాలేన అనవచ్ఛేదాత్" అనిన్నీ నిర్వచించారు.

యోగ విఘ్నకరాలైన కష్టాలు, జనన మరణ పరంపరలకు కారణమయ్యే కర్మలు – వాటి ఫలితాలు, కర్మలకు మూల కారణమైన సంకల్పాలు, అవి – ఏవీ అంటనీ పరమ పురుషడే "ఈశ్వరుడు" అనీ, త్రిగుణాతీతుడని, త్రిమూర్తులకతీతమైన మరొక మూర్తి అనీ, త్రిమూర్తులలో నొకడు కాడనీ,

మరియు, అతడెప్పుడునూ కాలాతీతుడు గనుక, మూల తత్త్వ విజ్ఞానాన్నందజేసే "గురు" రూపమది. ఈశ్వరునిలో నుండే యనంత శుభ సంకల్పాలు, గుణాలు, గురువులోనూ యుంటాయి. గురుడు మహాజ్ఞాని. అపార కరుణా సముద్రుడు. భగవంతుని ప్రత్యక్షంగా చూడలేక పోయినా, గురువులో చూడగలము. అట్టి భగవత్స్వరూప సద్గురువునాశ్రయించి, సేవించినట్లైతే సాక్షాత్పరమేశ్వరుని సేవించినట్లే.

అట్టి సద్గురువులు లభించాలన్నను దైవానుగ్రహం అత్యంత అవసరం. మరి దైవానుగ్రహం పొందుటకు ప్రత్యక్షంగానున్న గుర్వనుగ్రహం అవసరం.

శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్యుల వారు రచించిన "వివేక చూడామణి"లో నిట్లు తెలియజేశారు.

"దుర్లభం త్రయమే వైతద్దైవానుగ్రహ హేతుకమ్
మనుష్యత్వ ముముక్షత్వం మహాపురుష సంశ్రయః"

దైవానుగ్రహం వల్లనే - "సత్పురుషులు సహవాసం, మోక్షేచ్ఛ, మనుష్య జన్మ ప్రాప్తి" అనే మూడు వరాలు లభిస్తాయని భావము.

అటులనే వారు రచించిన "ప్రశ్నోత్తర రత్నమాలిక"లో ప్రపథమమునే నిట్లున్నది.

"భగవన్ కిం ఉపాదేయం గురువచనం హేయమపిచకిం అకార్యమ్
కో గురుః అధిగత తత్త్వః శిష్యహితా యోద్యతః సతతమ్"

భా: హే భగవాన్! సంపాదించ వలసినదేమిటి? అన్న ప్రశ్నకు, గురువచనం (వాక్యం) అన్నసమాధానం. గురు వాక్యాన్ని విని అర్థం చేసుకొని పాటించినపుడే, బ్రతుకులో వ్యర్థం (నీచం) దూరమౌతుందని దీని అర్థం.

త్యజింపదగిన దేది?
ధర్మ విరుద్ధమై, అజ్ఞానానికి దారితీసే ఏ అకార్యమైనా అని సమాధానం.

కో గురుః? (గురువు ఎవరు?)

"అధిగత తత్త్వః శిష్యహితా యోద్యతః సతతమ్" -

"ప్రజ్ఞానం బ్రహ్మ, తత్త్వమసి, అహం బ్రహ్మాఽస్మి" వంటి మహావాక్యాలను అర్థం చేసుకొని స్వయంగా ననుభవించి, తత్త్వదర్శనం చేసినవాడే "సద్గురువు". ఇది యొక నిర్మల రూపం - ఒక దివ్య జీవనప్రకాశం. మరియు శిష్యునిహితానికై సర్వదా ప్రయత్నిస్తాడు గురువు. బోధింపమని, తరింప జేయమని శిష్యుడు గురువుని ఆశ్రయిస్తే, "గురువు" సత్-చిత్-ఆనంద స్వరూపుడు కాబట్టి, అవిద్యా ప్రభావము చేత బాధనొందే శిష్యునిపై గురువునకు సానుభూతి కలగడం సహజం.

గురువులో సహజ సిద్ధమైన ఈ ఆత్మానందం శిష్యుడి యందు ప్రేమగా అభివ్యక్తమౌతుంది.

"గురువు అంటే - శిష్యుని హితం కోసం సర్వదా ప్రయత్నించే వాడే" అని శ్రీ శంకరాచార్యుల వారి అభిప్రాయం. "సతతమ్" - అనేమాటకు, సర్వకర్మలలోనూ, ఆచరణ ద్వారా శిష్యుల హితాన్ని కోరి ప్రేమాదరములతో వాళ్ళలో నున్న అవిద్యా హృదయగ్రంధుల తెగేవరకు బోధించేవారే గురువులు. ఆత్మజ్ఞాన ప్రబోధం చేసేవారే

గురువులు సద్గురువులకు నమస్కరిస్తే మనలోని (శిష్యునిలోని) పాపాలను సమూలంగా నాశన మొనర్చుకొన్నవారై, అపార గురుకృపకు, ప్రేమకు పాత్రుడవుతాడు అదే శిష్యుని యోగ్యత గురువు ప్రేమ శిష్యుని స్పృశిస్తుంది సద్గురువులకు శిష్యుల ధన- దరిద్రవంతుల తేడాయుండదు జ్ఞానపతితులను జూచి వ్యథచెందుతారు విజ్ఞానులను జూచి విమల చిత్తులౌతారు

కనుకనే, గురుబోధ ద్వారానే ఆత్మజ్ఞానమందుతుంది అనగా స్వయంకృషితో ఆత్మజ్ఞానం లభించేది కాదు అందు గురుదేవుడంటే - రక్త మాంసయుత ప్రత్యక్ష భగవత్స్వరూపుడు "గురు వినానవ - గురువు లేక ముక్తి లేదని, అర్థం

భగవద్గీతలో అర్జునునిలోని అవిద్యా, అజ్ఞానం, మాయ, మోహాంధకారముల నుండి విముక్తి నొనరించు ఆత్మజ్ఞానిగా రూపొందింప జేసి, తరింప జ్ఞానయోగ బోధామృతాన్ని అందింప జేసిన శ్రీకృష్ణ పరమాత్మ సద్గురురూపుడే

ఎన్న గురున కన్న నెక్కువ లేదయా,
విశ్వదాభిరామ వినరవేమ ।

భవబంధాల నుండి విముక్తి కలుగజేసి, ఆత్మవిధులుగా మార్చి తరింప జేసేది గురుదేవుడే - అని వేమన ప్రవచించెను

"అహంతా ధన క్షేత్రే విద్యాది జాతా,
ప్రదేయాగురౌ - నైవ తుచ్ఛం ధనాది ।"

ధనము, పొలాలు, విద్యా మొదలై వాటివల్ల పుట్టిన అహంకారాన్ని గురువుకు సమర్పించాలి అంతేగాని అల్పమైన ధనాదులను కాదు

ఈ సూక్తి ధనవంతులకొక చురక

ధర్మ శాస్త్రాలలో విద్యావినిమయం గూర్చి మహర్షులు విశ్వ జనీనంగానూ విశ్వకాలీనంగానూ అన్వయించే రీతిగా నొకనియమాన్ని శాసించారు

శ్లో॥ గురు శుశ్రూషయా విద్యా, పుష్కలేనధనేనవా ।
అథవా విద్యయా విద్యా, చతుర్థీనోపపద్యతే ॥ - అని

విద్యా వినిమయానికి మూడు మార్గాలున్నాయి అవి

1 శిష్యుడు గురువునకు సేవచేసి, విద్యనార్జించడం
2 శిష్యుడు గురువునకు కోరినంత ధనమిచ్చి విద్యను పొందడం
3 ఉభయులు ఒకరి విద్యను ఒకరు పంచుకోవటం

వీటికి మించిన నాల్గవ మార్గం లేనే లేదు - అని శాస్త్రం.

వీటిలో - "గురు శుశ్రూషయా విద్యా" - అనునది శ్రేష్ఠం.

విద్యా వినిమయంలో రెండవ పక్షంగా -

"పుష్కలేన ధనేన వా" - అత్యవసర పరిస్థితులేర్పడినపుడు విద్యా - ధన వినిమయంతోనూ విద్యాభివృద్ధిని అంగీకరించవచ్చును. అనగా అనుమతితో గురుదక్షిణగా నివ్వవచ్చును.

శ్లో॥ "నిర్ణీయతే లౌకిక బోధనేషు
మిథస్సు ఖార్థా గురుదక్షిణాసా ।
పరాసు విద్యాసు తుసాధనాధ్వ
శ్రమోత్సుకత్వం గురుదక్షిణోక్తా॥"

లౌకిక విద్యలలో - గురుశిష్యులిద్దరికీ సౌకర్యంగా నుండటమే గురుదక్షిణకు ప్రయోజనం. ఉభయులు గురుదక్షిణను నిర్ణయించుకొంటారు. ఆధ్యాత్మిక విద్యలో మాత్రము శిష్యుడిలో నుండే ఆసక్తే. గురువునకిచ్చు గురుదక్షిణను కోరుకొంటాడు ఆధ్యాత్మిక గురువు. అంతగా అత్యవసరమనితోచిన, గురువులే ఆ గురుదక్షిణను గ్రహిస్తారు.

"మిదస్సుఖార్థా" - అనగా పరస్పర సుఖసంతోషమునకే అభ్యసించి నందులకు శిష్యునకు, బోధించిన సత్ఫలితం పొందడం. అది ధనరూపం కావచ్చు, మరే రూపమైన గావచ్చు.

ఏది ఏమైన శిష్యుడు ఆధ్యాత్మిక శిఖరాలనందు కొన్ననాడే గురువునకు తృప్తి. వారికదియే కీర్తికాంక్ష.

"పరాసు విద్యాసుత సాధనాధ్వ ।
శ్రమోత్సుకత్వం గురుదక్షిణోక్తా॥"

శిష్యుడు కష్టాలకు జంకకుండా ఆధ్యాత్మిక సాధన చేయ గలగటమే - అదే తనకు గురుదక్షిణ అని సంతోషిస్తాడు. అదియే మంచి శిష్యుడి లక్షణం. ఆధ్యాత్మిక గురువు లక్షణమిదే. బ్రహ్మజ్ఞాన మొసంగిన గురుడు శ్రేష్ఠుడని, శాస్త్రములు వచించుచున్నవి. శివుడే కోపించిన వాడిని గురుడు కాపాడును. గురుడు కోపించిన వానిని శివుడును కాపాడలేడు.

కనుక ఉత్తమ శిష్యుడు మనో వాక్కాయ కర్మములతో గురుసేవా తత్పరుడై, యెల్ల భంగుల గురునే సంతోషపెట్టవలెను. అట్లు చేయని శిష్యుడు కృతఘ్నుడగును. అట్టి కృతఘ్నునకు ప్రాయశ్చిత్తము లేదు, లేదు. అని పూర్వమే ఇంద్రుడధర్వుణునకు

జ్ఞానముపదేశించెను. అపుడు దీనినితరులకు జెప్పిన నీ తల నరుకుదునని యింద్రుడు ప్రతిన బూనెను. కావున "జ్ఞాన బోధ" అతి రహస్యమైనదిగా గుర్తించి శిష్యులకు మాత్రమే యోగ్యమైనదిగా

"లబ్ధయేన సధన్యః స్యాత్కృత కృత్యశ్చ"
దీనిని పొందిన వాడు ధన్యుడు కృతార్థుడును.
అట్టి గురువు లభించడమనునది

శ్లో॥ "శమాది షట్క సంపత్తిర్యోగ సిద్ధిస్తథైవచ ।
తథోత్తను గురుప్రాప్తిః సర్వమేవాత్ర దుర్లభమ్ ॥"

(దే.భా-7వ స్కం-37వ అ-40వ శ్లో)

"శ్రీగురుం నిజరూపిణమ్ సుప్రసన్నం లసద్భూషితం శక్తి సంయుతమ్"-

గురుదేవుడు లసద్ భూషలు దాల్చి సకల విచిత్ర శక్తులు కల్గి యుండును. ఆత్మరూపమగు గురువునకు యెల్లెడల నమస్కరించుము.

(దే.భా-7వ స్కం-40వ అ-2వ శ్లో)

నమస్కరించుటను, ప్రణామములని పలుకుటనునది నమ్రతకు, అణకువకు ప్రతీకములే. అనాదిగా శిష్యుడు గురువును చేరి దండవత్ సాష్టాంగ నమస్కారం ప్రణామం బొనర్చుట తనలోనున్న అజ్ఞానాంధకారాన్ని వదులు కొనుటకై, జ్ఞాన బోధకమైన ఆధ్యాత్మిక విద్యను నేర్పుమని అభ్యర్థించుట యనుబడను.

ఈ "నమః" అను పదమును "శ్రీ గురుభ్యోనమః" అనుటలో, గురువర్యా! మః = నాకు నేను ఉపయుక్తుణ్ణి, న = కాను, అనగా 'నన్ను నేను ఉద్ధరించుకోలేను' అని భావమును ప్రకటించుకొనుచున్నాను అని అర్థం. విద్య నభ్యసించుటకు పూర్వం శిష్యుడు వినయం కలిగియుండి, శారీరకంగా నావినయాన్ని ప్రదర్శించుకొనేదే యీ నమస్కారక్రియ.

అటులే "ప్రణామం" = "నమ" కు ప్రత్యయం చేరిస్తే ప్రణామం అవుతుంది.

## "మంత్ర దీక్ష గురువునకు" చేసే నమస్కారం

శ్లో॥ వ్యత్యస్త పాణినా కార్యముప సంగ్రహణం గురోః ।
సవ్యేన సవ్యః స్పృష్టవ్యో దక్షిణేనచ దక్షిణః ॥

భా॥ గురువునకు నమస్కరించునపుడు చేతులు మార్చి, కుడి చేతితో కుడిపాదం, ఎడమ చేతితో ఎడమ పాదం స్పృశిస్తూ భక్తి భావంతో నమస్కరించవలెను, అని
ఇదే ప్రణమాస్త్రం

"గురు నమస్కారం శిష్టాచారం" సర్వోత్కృష్టదైవ స్వరూప, ఆత్మజ్ఞానోప దేష్టయగు సద్గురువునకు పరమ భక్తితో నమస్కరించుటననునది శిష్య శిష్టాచారం. ఆనమస్కారము సద్గురువుని హృదయ పుష్పమున సోకినంతనే పుష్పమెట్లు వికసించునో, అటులే గురువు హృదయము ఆర్ద్రతతో నిండి ఆ శిష్యునిపట్ల కటాక్షము చూపును.

"చెలువుగ పువ్వులు జీరుట కంటెన్,
బొలుపుగ గన్గవమూయుట కంటెను,
నలువగు నీయమనస్కపదంబే,
సులభము సౌఖ్యము సూక్ష్మము వత్సా ।"

అని సీతారామాంజనేయ సంవాదమునందు శ్రీరామ చంద్రుడు అంజనీ సుతునకుపదేశించెను.

గురు కటాక్షము లేని వారలకును వైరాగ్యబోధోపరతులు గలుగని వారలకును వింధ్య పర్వతమును పూల చెండువలె ఎత్తుట యెటుల కలలోని వార్తయో అటుల సాధ్యము కాదు. ఆత్మవస్తువు గోరు శిష్యుడు ఉత్తమ గురువు నాశ్రయించవలెను. అతని అజ్ఞాన నివృత్తితో బాటు పరమానంద రూప సత్ఫలం పొందును.

"తద్విజ్ఞానార్థం స గురుమేవాభి గచ్ఛేత్" అని శృతి.

అందులకు అతనిలో (శిష్యునిలో) ముక్తిహేతువులగు శ్రద్ధాభక్తిధ్యాన యోగములగు నాలుగు సాధనములు అవసరములు. అనగా శిష్యుడు స్వతః సిద్ధముగా శుద్ధ బుద్ధ ముక్త స్వభావము కలిగి యుండవలెను. ఎందుకనగా - భవ బంధ విముక్తికి కారకుడు గురువే కనుక -

శ్లో॥ పథ్యమౌషధ సేవాచ క్రియతేయేన రోగిణా ।
ఆరోగ్య సిద్ధిర్దృష్టాఽస్య నాన్యానుష్ఠిత కర్మణా ॥

ఆరోగ్యము చేకూరవలెనన్న యౌషధంతో పాటు పథ్యమవసరం కదా!

అద్వయతారకోపనిషత్ - (9వ మండలము) నందు -

"అన్తర్లక్ష్య జలజ్యోతి స్వరూపం భవతి. పరమగురూప
దేశేన సహస్రారే జలజ్యోతిర్వా బుద్ధి గుహానిహిత
చిజ్జ్యోతి ర్వా షోడ శాన్తస్థ తురీయ చైతన్యంవా అన్తర్లక్ష్యం
భవతి, తద్దర్శనం సదాచార్యమూలమ్,"

భా: అమనస్క యోగము యొక్క అంతర్లక్ష్యము జలజ్యోతి స్వరూపముగా నగును.

పరమ గురువు యొక్క యువదేశము వలన సహస్రదళ కమలమునందున్న జలజ్యోతి గాని, బుద్ధి గుహ యందున్న చిజ్జ్యోతి గాని, షోడ శాంతము నందున్న తురీయ చైతన్యముగాని అంతర్లక్ష్యమగును సద్గురువు యొక్క యనుగ్రహము వలన అంతర్లక్ష్య దర్శనం కలుగును

"ఆచార్యోవేదసమ్పన్నో విష్ణు భక్తో విమత్సరః, యోగజ్ఞో యోగ నిష్ఠశ్చ సదాయోగాऽత్మక శ్శుచిః, గురుభక్తి సమాయుక్తః పురుషజ్ఞో విశేషతః ఏవం లక్షణ సమ్పన్నో గురురిత్యభిధీయతే", -

భా వేద సంపన్నుడును, విష్ణు భక్తుడును, మాత్సర్యరహితుడును, యోగవేత్తయు, యోగానుష్ఠానము గలవాడును సదాయోగాత్మకుడును, శుచియైనవాడును ఆచార్యుడగును గురుభక్తి తత్పరుడును పరమాత్మ జ్ఞానం కలవాడును, ఇట్టి లక్షణములు కలవాడు 'గురువ'ని చెప్పబడును

"గు" శబ్ద స్త్వన్ధకార స్స్యాత్ రు' శబ్దస్తన్నిరోధక - అన్ధకారనిరోధిత్వా ద్గురురిత్యభిధీయతే గురు రేవ పరం బ్రహ్మ గురురేవ పరాగతిః గురురేవ పరావిద్యాగురురేవ పరాయణమ్ గురురేవ పరాకాష్ఠ గురురేవ పరంధనం, యస్మాత్తదుపదేష్టాऽసౌ తస్మాద్గురుతరో గురురితి

భా 'గు' అనగా అంధకారము రు అనగా అంధకారమును పోగొట్టువాడు అంధకారము (అజ్ఞానము)ను పోగొట్టువాడు కావున అతనిని "గురువు" అని మరొకవిధంగా చెప్పబడును

గురువే పరబ్రహ్మము గురువే పరమగతి గురువే పరావిద్య, గురువే పరమాశ్రయము గురువే పరాకాష్ఠ గురువే పరమధనము ఎదుపదేశము చేయువాడు కావున, గురువు మిక్కిలి గొప్పవాడు

"యస్సకృదుచ్చారయతి తస్య సంసార మోచనం భవతి సర్వజన్మ కృతం పాపం తత్క్షణా దేవ నశ్యతి, సర్వాన్ కామానవాప్నోతి సర్వపురుషార్థ సిద్ధిర్భవతి, య ఏవం వేదేత్యుపనిషత్ "

ఎవడు యీ గురు స్తోత్రమును నొక్కసారి యుచ్చరించునో, అట్టి వానికి సంసార నివృత్తి కలుగును అతడనేక జన్మలలో చేసిన పాపములు తక్షణమే నశించును - అతడు సకలాభీప్సితములను పొందును - అతనికి సకల పురుషార్థ సిద్ధులు చేకూరును - ఎవడిట్లు తెలియునో వానికి వాంఛితములు నెరవేరును - అనియిట్లుపనిషత్తు

సచ్ఛీల గురువుని చేరుటలోని సత్ఫలితమెట్లుండును. "అజ్ఞాన తిమిరాంధం"లో నున్నశిష్యుని జ్ఞానాంజనంలో తేలియాడినట్లు చేస్తాడు గురువర్యులు. అదియునుగాక, శిష్యుడు నిరహంకారిగా గురువుని చేరి, సాష్టాంగ దండప్రణామంబు చేస్తేచాలు, అపుడాగురువు అనుగ్రహంతో అతని దోషాలు నశిస్తాయి. అదియునుగాక, "శిష్యపాపం గురుః" గురువుని చేరినచో, వందనం చేసినను, చేయకున్నను శిష్యుల పాపాల బాధ్యత గురువు స్వీకరిస్తాడు. ఇక, గురువు వాటిని **తనకును చేరకుండా,** శిష్యునిలో నిలువనీయక, అగ్నిలో వేసిన దూదివలె, వాటిని **భస్మీభూతమొనర్చుతాడు. అలాంటి** గురువేగదా, గురు శబ్దానికర్హుడు.

అందుచే శిష్యుడు నిరహంకారాన్ని సూచిస్తూ, ముందు పరిపూర్ణమనస్కుడై సాష్టాంగపడి సేవించాలి. అట్లుగానిచో అట్లొనర్చిననాడు శిష్యునకు మరింత పాపం చుట్టుకొంటుంది కూడ.

"మైత్రేయ్యుపనిషత్తు"లోని ద్వితీయోధ్యాయంలో 24వ శ్లోకం

శ్లో॥ ధన వృద్ధా వయోవృద్ధా విద్యావృద్ధస్తథైవచ ।
తే సర్వే జ్ఞాన వృద్ధస్య కింకరాః శిష్యకింకరాః ॥

భా॥ లోకములో కొందరు ధనముచే వృద్ధులు. కొందరు వయస్సుచే వృద్ధులు. కొందరు విద్యచే వృద్ధులు. కాని వీరందరు జ్ఞాన వృద్ధుల శిష్యులకును అజ్ఞాకరులు.

సక్రమమైన మార్గాన్ని చూపే గురువు లేనివారి జీవితం చుక్కాని లేని నావలాగా పతనమైపోతుంది. కనుక, "గురి"ని కల్పించే వాడు గురువు. 'గురి' అనగా 'లక్ష్యం' నమ్మకం, సత్యమును జూపువాడు. దైవానికి, జన్మించిన మానవుడికి మధ్య 'వారధి' లాంటివాడే గురువు. బాహ్య ప్రపంచంలో నెలా సుఖవంతమైన జీవన మార్గాన్ని జూపు వాడే గురువు. గురు ప్రభావంతోనే జాతి శక్తి, దేశభక్తి నిలుచును. దానితో మంచి సమాజాన్ని నిర్మించగల్గుతాడు. అందులకే గురువు శిష్యుల యెడల నొకొకతరి 'చాకలి'గా వ్యవహరిస్తాడు. ఎవరికెట్టి యుతుకు యుతకాలో తెలిసి యుతుకుతాడు - బోధిస్తాడని అంతర్యం.

నిజమే గురువొక శిల్పి - ఏ శిలనెట్లు ఏయే యులి, సుత్తి యుపయోగించి శిలావిగ్రహమెట్లు తయారు చేయలో తెలిసి మలచును.

మరియు గురువు కంసాలి వంటివాడని, ఏ వస్తువును నెట్లు తయారొనర్చాలో తెలిసి, ముడి బంగారమును నొక అభరణముగా తయారు చేస్తాడు.

కావున, ఏ విద్యకైనను గురువు కావాలి. అధ్యాత్మిక విద్యకు మరీను. మంచి, చెడుల హెచ్చరికలతో, అవసరమైనపుడును చేయూత నిచ్చుచూ, సందేహాల దీర్చుచు, సలహాల నొసంగుచూ, సతమతమౌతున్న వారిని దరికి చేర్చుచుండు ఆచార్య సమాశ్రయణం

తప్పు మరోదారి లేదు. గురుభక్తి కలిగి ప్రత్యక్ష భగవత్స్వరూపుడుగా భావించినచో నట్టి గురువు శిష్యునిలో జ్ఞాన జ్యోతిని వెలిగించును. లేక మానవ మాత్రుడని భావించినచో శిష్యుని చదువంతా గజస్నానమువలె వ్యర్థమగును.

వ్యక్తులలో అంతర్లీనంగా నున్న చైతన్య శక్తులను జాగృతమొనర్చి కర్మాచరణకు స్ఫూర్తి నిచ్చేవాడు **గురువు.** వారిలోని చొరవను. సృజనాత్మకతను వ్యక్త పరచడానికై మార్గదర్శకుడును. **దిక్కుతోచక, దిగులుతో బాధ పడుచు**న్నపుడు, ధైర్యం చెప్పి పురోగతికి నడిపించేవాడు **గురువు. తమలోని దివ్యత్వంను** దర్శించు కొనునట్లు, ఆచరణాత్మకంగా ధీమంతులుగా, ధార్మికంగా తీర్చిదిద్దేవాడు, దార్శనికుడు గురువే

శ్లో॥ వినాయకం, గురుంభానుం బ్రహ్మా, విష్ణు, మహేశ్వరాన్ ।
సరస్వతీం ప్రణమ్యాదౌ సర్వకార్యార్థ సిద్ధయే ॥

గురువును వ్యక్తి వినాయకునితో, సూర్యునితో, బ్రహ్మ, విష్ణువుతో, మహేశ్వరునితో మరియు సరస్వతీ వంటి మహనీయులతో పోల్చబడి, వీరందరికిని (అనగా గురువుతోసహా) మనః పూర్వకంగా నమస్కరించిన సర్వకార్యములు సిద్ధించునని తెలియబడెను.

అట్టి గురువు నుండి శిష్యుడు ఏదేని పొందుటకు వలసిన భక్తి వినయములు ఇట్లుండవలయునని (ప్రవర్తనావళి) గూర్చి ఆధ్యాత్మ రామాయణములో అరణ్యకాండ యందు వ్యాసభగవానుడిట్లు జెప్పెను.

శ్లో॥ "ఏకదా లక్ష్మణో రామమేకాన్తే సముప స్థితమ్ ।
వినయావనతో భూత్వా పప్రచ్ఛ పరమేశ్వరమ్ ॥"

పంచవటి యందు వాసము చేయుచుండగానొక సమయమునందు లక్ష్మణుడు ఏకాంతమున పరమేశ్వరుడగు శ్రీరామచంద్రుని చేరి, నమస్కార పూర్వకంగా స్తోత్రము చేసి వినయముతో వంగినవాడై యిట్లని అడిగెను. అని కలదు.

ఇచట ఏకాన్తము నందనుటచే, శిష్యుని మనస్సులో నేదొనొక తెలుసుకొను తపన నివారించుకొనుటకై, గురువు ఏకాంతమును నుండునప్పుడే శిష్యుడుపదేశము పొందుటకై, ప్రార్థింపవలయుననియు, అందులకు "సముపస్థితమ్" అనుటచే, మొదట గురువును నమస్కారోపస్థానములచే తన యందు ప్రసన్నుని గావించు కొనవలయుననియు, "వినయావనతః" అనుటచే ఆచార్యుని యెడ భక్తి వినయములు కలిగి యుండవలెననియు సూచింపబడుచున్నది. అనగా లక్ష్మణుని ప్రవర్తనావళి గ్రహించదగినది.

లక్ష్మణుని గురు ప్రవర్తనకిది యొక నిదర్శనం. అన్నను గురువుగానెంచి

బోధామృతం గ్రోలెను. అనగా గురువు ఎవరంటే? పారమార్థిక బోధచేసి మనజ్ఞాన చక్షువులను తెరిపిస్తారో వారే అసలైన గురువులు. జన్మ సంసారమాయా బంధాల నుండి విముక్తి కల్గిస్తారో వారే గురువులు.

"గురువు"నకు అంత ఆధిక్యం కలదని, ఆ గురువు అధికుడని, బరువు, విలువ, గౌరవాదరములు పొందు అర్హులని గమనార్హము.

"బ్రహ్మసృష్టి **చేయు బ్రహ్మాండములనెల్ల**
విష్ణువన్ని **పెంచి వృద్ధిచేయు,**
పరమశివుడు ద్రుంచు పాపిష్టి జీవుల
"గురువు" మూడు క్రియల సలుపునొకడే"

## గురుః స్థానమెట్టిది?

శ్లో॥ మంత్రద్వారా గురో శ్శక్తిః శిష్యం ప్రాప్నోత్యతో గురుః ।
మంత్రోపదేశ సమయే పాపం శిష్యస్య చామయమ్ ॥

శ్లో॥ స్వయం స్వకృత్య కష్టానా మనుభోక్తా భవేద్ధ్రువమ్ ।
గురుస్థానే స్థితి స్తస్మాదతి క్లేశావహామతా ॥ - (శ్రీ శారదాదేవి ఉపదేశములు)

భా: మంత్రం ద్వారా గురువు శక్తి శిష్యునకు ప్రాప్తిస్తుంది. అందుచేత గురువు మంత్రోపదేశ సమయంలో శిష్యుని పాపాన్నీ, వ్యాధినీ స్వయంగా స్వీకరించి కష్టాలను అనుభవిస్తాడు. అందుచేత గురుస్థానంలో ఉండడం మిక్కిలి క్లేశావహమైనది.

**గురువు అనగా నెవరు?** అని "కల్మషపాదు"ని ప్రశ్న

సోమ దత్తుడను బ్రాహ్మణుడు, గురువును ఉపేక్షించి బ్రహ్మరాక్షసత్వం పొంది, తదుపరి పశ్చాత్తాపముతో నిట్లనుచున్నాడు.

గురువులు పూజ్యులు, ఆదరముతో నమస్కరింపదిగిన వారు. వేదాధ్యయనంతో వేదార్థమెరింగినవారు. వేదమును బోధించువారు. శాస్త్రముల ధర్మమెరింగి యుపదేశించువారు. మన్త్రముల నుపదేశించువారు. మన్త్రార్థములు వ్యాఖ్యానించువారు. వేదములయందలి సందేహముల దీర్చువారు. వ్రతముల నుపదేశించు వారు. భయరహితమొనర్చువారు. అన్నము పెట్టువారు. అన్నము పుట్టుటకు దారిని చూపువారు. గురువులే.

అదియును గాక, అన్నము పెట్టు వారును, కన్యాదానము చేసిన వారును,

మేనమామయును, పెద్ద అన్నయు, కన్నతండ్రియును, ఉపనయనమొనర్చినవారును, నిషేకమును చేసినవారును, సంస్కరించినవారును, ఇటుల వీరందరును గురుతుల్యులే. వందనీయులే.

మరియు గురువును గూర్చి మహాత్మ్యమును జెప్పుటను నదియును గొప్ప శ్రేయస్సు - అటులే వినుటను కూడా శ్రేయస్సు.

"యత్పృష్టం తద్వదామితే, గురుమహాత్మ్యకథనం శ్రవణం చానుమోదనమ్" - అని (నారదపురాణం. 9-9వ శ్లో)

ధర్మోపదేశ మొనర్చినవారు, భవపాశములను ఛేదించగల, ధర్మములతో కూడిన పురాణములను జెప్పువారు ఉత్తమ గురువులు.

ఉత్తమ గురువేలా యుండాలో, గురుబోధయేలా యుండాలో "వాల్మీకి" గురువరేణ్యుల ధ్వని గర్భితంగా సూచననిట్లు చేస్తున్నారు. - గురుబోధనలో పునరుక్తి దోషముండదు. శిష్యునకు ప్రేరణ కల్గించువాడే గురువనబడును.

"పరావాక్, మహి కారణ శరీరస్థితి దైవవాక్"

ఇది దివ్యవాణి, అంతర్వాణి దీనివలననే గురువులు ప్రకాశింతురు. ఇది దివ్యవాణి, అంతర్వాణి. దీనివలననే గురువులు ప్రకాశింతురు. తల్లి దండ్రులకు తమ పిల్లలపై వాత్సల్యముండుట సహజం. అటులే, ఆ పిల్లల (శిష్యుల) యెడల వాత్సల్యముండుట గురువులకును సహజము కదా!

శ్లో॥ దయాంచిత దృగంచలాద్దృత జనాలి(ళి) హృత్పంకజ
ప్రబోధకలాపటు ప్రకటవైభవోఽస్మద్గురవః ।
భవాబ్ధి తరుణాతుర స్వజన లాలనాలోలహృత్
సదామమ హృది స్ఫురన్మధుర విగ్రహో జీయతామ్ ॥

**భా:** **దయాపరివ్యాప్తాలైన** కటాక్ష వీక్షణాలతో తనను ఆశ్రయించిన అశేష జనావళుల హృదయ పద్మాలను వికసింపజేసి విజ్ఞాన మరందాలను జాలు వారేలా చేయగల తమ వైభవాన్ని విస్పష్టంగా ఆవిష్కరించిన వారు మన ఆచార్యవర్యులు. సంసార సాగరాన్ని తరించాలనే ఆతురత గల స్వాశ్రితులను లాలించడంలో విలోలమైన హృదయం కల్గిన మన గురువు యొక్క విగ్రహం మన (శిష్యుల) హృదయంలో స్ఫురిస్తూ నిరంతరం జయించు గాక!

శ్లో॥ సర్వజ్ఞః సర్వకర్తాచ కథమాత్మా భవిష్యతి ।
శిష్యం ప్రతీర్థం పృచ్ఛంతం వక్తుమారభతే గురుః ॥

అదీగాక, "ఈశ్వరో గురురాత్మేతి మూర్తి భేదివిభాగినే."

అనికూడ అనగా - వస్తువు ఒక్కటే. ఆ వస్తువు ఈశ్వరుడుగా, గురువుగా, జీవుడు (శిష్యుడు)గాను రూపొందింది. అనగా రూపాంతరం చెందింది. ఈశ్వరుడెట్లా సృష్టిలో వ్యాపించియున్నాడో, గురువు కూడ సర్వజ్ఞుడుగా సర్వులకు జ్ఞానాన్ని పంచుచూ వ్యాపించియున్నాడని అర్థం.

జీవుడు వీరిరువురిని ఆధారంగా జేసుకొని విశ్వజ్ఞానిగా చెలామణి అవుతాడు తదనంతరం.

"విశ్వం దర్పణ దృశ్యమాన నగరీ" - అనే రీతిగా శ్రీ శంకరాచార్యులవారు యిలా అన్నారు.

శిష్యుడొక జీవుడు. ఆ జీవుడు జ్ఞానాన్నార్జించాలంటే, ఈశ్వరుని లాంటి గురువు అవసరం. జీవుడు లేనిది ఈశ్వరుడు లేడు. విశ్వంలేదు. గురువు శిష్యునకు దర్పణం వంటి వాడు. గురువు ఆదర్శమును అమలు పరచును.

శ్లో॥ వరిష్ఠంచ గరిష్ఠంచ దర్మిష్ఠం శ్రేష్ఠ సేవితమ్ ।
ప్రేష్ఠంచ బంధు వర్గాణామతి శ్రేష్ఠంచ జ్ఞానినామ్ ॥

భా: గురువు వరిష్ఠుడు, గరిష్ఠుడు, ధర్మిష్ఠుడు, శ్రేష్ఠ సేవితుడు. ఆప్త బంధువర్గమునకు ప్రియతముడు. జ్ఞానులలో మిక్కిలి శ్రేష్ఠుడు.

శ్లో॥ జ్యేష్ఠంచ భ్రాతృవర్గాణామనిష్ఠం సురవైరిణామ్ ।
దృష్ట్వా గురుం జపంతపంచ తత్రతస్థా సురేశ్వరః ॥

భా: గురువు భ్రాతృవర్గమునకును జ్యేష్ఠుడు. దానవులకప్రియుడు. అట్టి గురువు జపధ్యానము నుండగ అమరపతియును చూచి యచట నిలుచుండును.

శ్లో॥ "గురుసేవా విప్రసేవా వేదసేవాదికంచయత్ ।"

శ్లో॥ "గురు విప్రేంద్ర దేవేషు సర్వేభ్య శ్చపతిర్గురుః ।"

భా: గురుసేవ, విప్రులసేవ, వేదసేవలాదిగా, విద్యాదానమొనర్చు గురుడు విప్రేంద్ర దేవతలందరిలోను గొప్పవాడు.

శ్లో॥ విష్ణు మంత్ర ప్రదాతాచ స గురుర్విష్ణు భక్తిదః ।

శ్లో॥ గురుశ్చ జ్ఞానదో యోహియత్ జ్ఞానం కృష్ణ భావనం ।

భా: విష్ణు భక్తి గలిగించు విష్ణు మంత్రముపదేశించు గురుడే నిజమైన గురుడు.

కృష్ణ భావనగల జ్ఞానము తెలుపు గురుడు జ్ఞానప్రదుడు

శ్లో॥ బ్రహ్మ విద్యా గురుః సాక్షాన్మునిః కారుణికః ఖలు ।
యథా సర్వేశ్వరః శ్రీమాన్మృదుః కారుణికః ఖలు ॥

భా: నిజముగా బ్రహ్మవిద్యను బోధించువాడే గురుడు ముని - దయాళుడు - సర్వేశ్వరుడు - నారాయణుడుని వలె యుపదేశింప తగినవాడు

మరియు జగత్తునకు శాంతి సౌఖ్యములనందించు వారే గురువులు నిత్యసత్యమైన దైవత్వమునకు సోపానములు నిర్మించువారే గురువులు అంతర్దృష్టిని, అభివృద్ధిపరచి, దివ్యకాంతి జ్యోతిని ప్రకాశింప జేసే వారే గురువులు అనగా మానవత్వాన్ని వికసింపజేసి, దివ్యత్వాన్ని ప్రకాశింపజేసే వారే గురువులు

"అధ్యాత్మ విద్యా విద్యానాం" అన్నాడు శ్రీకృష్ణుడు "ఆ విద్యనే నేను" - అని అర్థం అసామాన్యమైన సంక్లిష్ట పరిస్థితిని సంబాళించ కలిగేది వేద సందేశంలోని శక్తి, శ్రీకృష్ణ పరమాత్మ మాత్రమే. 'నభూతో నభవిష్యతి'గా వేదాలను బోధించిన గురువర్యుడు శ్రీకృష్ణుడు, అర్జునునకు గీతోపదేశంద్వారా అర్జునుని వంటి అజ్ఞానంధకారాన్ని నిర్మూలించడమే గురువుల ఆంతర్యము

సూర్యోదయ కిరణాలతో కమలములు వికసించినట్లు, గురువుల ఆధ్యాత్మిక సద్బోధల కిరణములచే శిష్యుల హృదయ కమలములు జాగృత పడినట్లగును. అట్టి గురువుల ఘనతకు ప్రతి రూపాలుగా శిష్యులు నిలవాలి గురు పవిత్రతను శిష్యుడు పొందాలి దివ్యమంగళ స్వరూపులై వెలిగినపుడే గురు పవిత్రతను నిలిపిన వారవుతారు 'గురు' జ్ఞానముతో ప్రజ్ఞానవంతులౌతారు

శ్లో॥ గురుస్తతస్తుతం శిష్యం కృపాదృష్ట్యావిలోకయేత్ ।
**తచ్చైతన్యం నిజే** దేహే భావయే త్సంగతంత్వితి ।
**తతః శిష్యతను** స్థాన మధ్వానాం పరిశోధనామ్ ॥

భా: గురువు తన శిష్యుని దయ గల చూపు ుతో చూడవలయును. శిష్యుని చైతన్యము తన శరీరమందున్నట్లు గురువు తలంచవలయును. పిదప శిష్యుని శరీరమును, సమాధానం చెప్పబోవురీతిని శోధించవలయును.

శ్లో॥ కుర్యాత్తు హోమతో విద్యన్ది వ్యదృష్ట్యవలోకనాత్ ।
యేన జాయేత శుద్ధాత్మా యోగ్యో దేవాద్యనుగ్రహాత్ ॥

భా: శిష్యుడు పరిశుద్ధుడగునట్లు గురువతని మొగమున తన చల్లని చూపులతో చూడవలయును. దానిచే శిష్యుడు శుద్ధాంతరంగుడై దేవతలకనుగ్రహ

పాత్రుడగును.

శ్లో॥ పునరుత్పాదయే తస్మాత్సృష్టి మార్గేణవై గురుః ।
ఆత్మస్థితం తచ్చైతన్యం పునః శిష్యేతుయోజమేత్ ॥

భా: పిదప గురువు సృష్టి మార్గమున బ్రహ్మరూపునిగా శిష్యుని రూపొందించవలయును. తనలో నున్న శిష్యుని చైతన్యమును తిరిగి శిష్యుని కందించవలయును.

శ్లో॥ తతో గురుః స్వకేయాత్తు హృదయాన్నిర్గతాం శివామ్ ।

భా: అటుపిదప గురువు తన హృదయమునుండి వెడలిన భగవతి శిష్యుని హృదయములో ప్రవేశించునట్లు భావించవలయును.

## గురువునకుండవలసిన యోగ్యత గూర్చి -

### పురాణం యింకా అంటుంది:-

శ్లో॥ సద్ధర్మో శాసకో నిత్యం సదాచార్యనియోజకః ।
సంప్రదాయ కృపాపూర్ణో విరాగీ గురురుచ్యతే ॥

భా: ఏది ఉత్తమమైన ధర్మమని శాస్త్రాలు బోధించుచున్నవో, వాటిని నిర్మత్సరుడై శాసింపగల వాడైన గురువుయుండాలి. నిత్యమునూ ఉత్తమమైన ఆచారాన్ని (ఆచరణవిధానాన్ని) ప్రతిబోధించి ఆచరింపజేసేవాడు కావాలి.

"ఆచారోప్రభవోధర్మః" అని భారతీసూక్తి.

శ్లో॥ ఆచినోతిహి శాస్త్రాణి ఆచారే స్థాప యత్యపి ।
స్వయమాచరతే యస్మాత్తస్మాదాచార్య ఉచ్యతే ॥

భా: శాస్త్రములను చక్కగా తెలుసుకుని ఆచరణలో పెట్టినట్లుండి, తానూ ఆచరించువాడే ఆచార్యుడు. ఆచార్యుడు కర్మవిదుడై యుండాలి. అని చెప్పు కొన్నాము. అట్టి ఆచార్యుడు "బృహస్పతి" తో సమానుడు. అందులకే,

శ్లో॥ ఆచార్యస్తు యధాస్వర్గే, శక్రాదీనాం బృహస్పతిః ।
తథాత్వం మమయజ్ఞేఽస్మిన్నాచార్యో భవ సువ్రత ॥

భా: బుద్ధి కధి దేవత బృహస్పతి యెటులో, ఆచార్యుడును సహస్రార చక్రాధిపతి, విద్వాంసుడు, నేర్పరి. అని బృహస్పతితో సమానుడు. -

బృహస్పతి (ఆచార్యుడు) తారగాను, గుణాతీతుడు గాను, రూపవర్జితుడు గాను, పోల్చుటలో "గురు" శబ్దం బుద్ధి కధిదేవతగా పోల్చవచ్చును.

'బృహస్పతి'ని తారతో పోల్చవచ్చును.

ఆతని బోధామృతమే తారాస్థాయి. కనుక, శబ్ద బ్రహ్మగా పోల్చవచ్చును.

"విద్యా దదాతి వినయం, వినయాద్యాతి పాత్రతామ్."

అనుసూక్తిగా

"సావిద్యాయావిముక్తయే" - విముక్తిని కలిగించేదే "విద్య" అనగా అజ్ఞానాంధకారాన్నుండి తొలగించి, వివేక విచక్షణా జ్ఞానాభివృద్ధి పరచువాడు గురువు.

కర్మ, జ్ఞాన, భక్తి ప్రపత్తులు కలిగించే వాడు గురువు.

శ్లో॥ గురురేవ పరబ్రహ్మ గురురేవ పరధనం ।
గురురేవ పరంకామో గురురేవ పరాయణః ॥
మరియు

శ్లో॥ గురురేవ పరావిద్యా గురురేవ పరాగతిః ।
యస్మాత్తదుపదేష్టాఽసౌ తస్మాద్గురు తరో గురుః ॥

అటులే, మన జీవిత సర్వస్వం గురువే. భగవంతుని కంటే గురువే గొప్పవాడు. ఎందుకనగా, భగవంతుణ్ణి గూర్చి తగు మార్గం చూపేవాడు గురువే కనుక.

మరియు, గురువు మహనీయుడు. శిష్యునిపై భగవంతునకు కోపం వచ్చిన, గురుడే సముదాయించి, తగు భగవన్మార్గమునకు మార్గదర్శకుడగును. ఇక గురువే కోపగించినట్లైన, కాపాడే వారు లేరుకూడా.

"ఉపాయం, ఉపేయం" - రెండూ గురువే. అని గుర్తించాలి.

'గురువు' శివస్వరూపుడని, శివ సహస్రనామంలో కీర్తింపబడినవాడు, అటులే

శ్లో॥ గురువే సర్వలోకానాం, భిషజే భవరోగిణాం ।
నిధయే సర్వవిద్యానాం, దక్షిణా మూర్తయే నమః ॥
అని స్తుతింపబడ్డాడు.

విష్ణుసహస్రనామంలో - గురువు,

శ్లో॥ గురుర్గురుతమోధామ సత్యస్సత్య పరాక్రమః ।
నిమిషోఽనిమిషస్స్రగ్వీ వాచస్పతి రుదారధీః ॥

బృహస్పతి వంటివాడుగా, వేదధ్యాయిగా కీర్తింపబడినాడు. వేదము మహాకారణము యోగ సమాధి యందు మహాకారణమును పక్వమును జేసుకొని పరమాత్మతో

లీనమైనవాడు గురువు.

అనగా విష్ణు (వేద) స్వరూపుడు గురువు.

సూర్యుని కిరణములచే చీకటి మాత్రమే తొలగును. కాని, శ్రీగురువు సహస్రార మంటపమున నిలిచి, సహస్ర కిరణములనెడు పలుకులతో లోకుల అజ్ఞానమనెడు అంధకారాన్ని (అజ్ఞానమును) పోగొట్టి జ్ఞాన ప్రకాశమును కలిగించుట చేత కోటి సూర్యప్రకాశుడని గురువునకు కీర్తి ప్రతీక.

మహత్తత్వ బుద్ధి గలవాడు - గురువు.

మహా భాగవతంలో - "పోతన"కవి గారు

"కుంభినీధవు జెప్పెడి గురుడు గురుడు
చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు" -

అని "విద్య గురువు"లను స్తుతించెను.

"సౌందర్యలహరి"లో శ్రీ శంకరాచార్యులిట్లనిరి -

శ్లో॥ వందే గురుపద ద్వంద్వ మవాఙ్మానస గోచరమ్ ।
రక్త శుక్ల ప్రభా మిశ్రమ తర్క్యంత్రై పురం మహః ॥ (ధ్యాన శ్లోకమిది)

గురువు శక్తి రూపముగా స్తుతింపబడెను.

"శ్రీగురుః" సర్వకారణ భూతాశక్తిః" అని,
భావోపనిషత్తు నందు పేర్కొని యున్నది.

అట్టి శక్తి రూప గురుపద ద్వంద్వమునకు వందనములని,
గురువును శివవిశిష్ట శక్తి స్వరూపునిగా కీర్తి.

"పరమ శివాత్మనో గురుః" అని,

"శిగురుశ్శివ ఏవ సః" - అని, అనగా గురువు శివుడేయని,
"శ్రీ శంకరాచార్యుల" ఉవాచ.

"గురువు గంగాభవాని" - వంటివాడని, మానవునికి భగవంతునితో అనుసంధానము కూర్చు మధ్యవర్తిగా, అనంత శక్తి సంపన్నుడుగా, "అమృత సరస్సు"-లాంటి వాడుగా, మహా సముద్రములాంటి మనస్తత్వము కలవాడుగా, "వారధి"గా కీర్తింపబడువాడు.

"నరుణ్ణి నారాయణుని"గా మార్చే మహనీయుడు గురువు. బుద్ధి వికాసానికి తోడ్పడే వ్యక్తిగా, ఆదర్శజ్యోతి స్వరూపుడుగా, వెలుగు బాటలోనికి లాగుకొని పోవును.

"ఆత్మ బుద్ధి స్సుఖంచైవ, గురు బుద్ధిర్వి శ్వేషతః" అన్నారు.

ఆదిత్య స్వరూపుడుగా నుండును గురువు. అట్టి సద్గురు కరుణాకటాక్షము వలననే ఆత్మ విద్య సిద్ధించును. దివ్య జ్యోతి స్వరూపుడగు గురువర్యుల కిరణ సంపదయే ప్రస్థాన త్రయాది రూపముపై నావిర్భవించి విజ్ఞాన దీపికలై వెలయుచున్నవని భావము.

శ్లో॥ దృష్టాన్తోనైవ దృష్టః త్రిభువన జఠరే సద్గురోః జ్ఞానదాతుః ।
స్పర్శశ్చేత్ తత్ర కల్ప్యఃస నయతి యదహోస్వర్ణ తామశ్మ సారమ్ ॥

శ్లో॥ నస్పర్శత్వం తథాపిశ్రిత చరణ యుగే సద్గురుః స్వీయ శిష్యే ।
స్వీయం సామ్యం విధత్తే భవతి నిరుతమః తేనవాఽతాకికోఽపి ॥

భా: గురువు జ్ఞాన ప్రదాత - ఆయనతో పోల్చదగు వస్తువు ముల్లోకాల్లో యేది లేదు. పరుసవేదిని దృష్టాంతంగా గ్రహించుదామంటే సరిపోదు. అది ఇనుమును బంగారంగా మార్చుతుందే కాని, ఆ ఇనుమును తనవలె మరియొక పరుసవేదిగా రూపొందించలేదు. గురువట్లు కాదు. భక్తి శ్రద్ధలతో తన నాశ్రయించిన శిష్యుని తన యంతటి వానిగా జేస్తాడు. సద్గురువునకు సాటియైనదేది లేదు. ఆయన సాటిలేని లోకోత్తర పురుషుడు.

శృతి ఆదేశించినటుల - "మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ"- అని వీరిని దేవతలుగా ఆరాధించుటకు కారణం, "ఆపస్తంభ మహర్షి" - ఇలా అన్నాడు.

"యస్మాధర్మా నాచినోతిస్త ఆచార్యః,
నహివిద్యాతః తం జనయతి, తచ్ఛ్రేష్ఠ జన్మ
శరీరమేవ మాతాపితరౌ జనయతః తస్మై సదృహ్యేత్ కదాచన"

భా॥ అధర్మం వలన యనేక అనర్థాలు సంభవిస్తాయి. వాటిని నిరూపించి, ధర్మతత్త్వాన్ని యుపదేశించువాడు ఆచార్యుడు. తల్లి దండ్రులు భౌతిక శరీరాన్ని మాత్రమే యిస్తారు. ఆచార్యుడు విద్యా శరీరాన్ని అనుగ్రహిస్తాడు. ఇట్లు మరియొక జన్మను యనుగ్రహించటం చేత, తల్లి దండ్రులతో పాటు ఆచార్యుని గూడా దైవంగా ఆరాధించాలి. ద్రోహం తలపెట్టరాదు.

మరియు తల్లిదండ్రులు పూర్వజన్మ కృత పాపాలను క్షమింప జేసుకోవటానికి యోగ్యమైన భౌతిక శరీరాన్నిస్తారు. ఇది మానవులందరికినీ సర్వసాధారణమే. అటులే

భౌతిక విద్యలు, వృత్తి విద్యలు ఆర్జించటం ప్రతివాని లక్ష్యమే. కానీ, మానవ జీవితాన్ని చరితార్థం చేసే యుత్తమ విద్యా శరీరాన్ని సంపాదించటం యెంతో(శ్రమ సాధ్యం. అది సద్గుర్వనుగ్రహైక సాధ్యమని మరువరాదు. అట్టి సద్గుర్వనుగ్రహం పూర్వజన్మ సుకృత విశేషంచే గానీ లభించదు. గ్రంథాలను చూచి, మనంతట మనము సాధించ గల్గింది గాదు. మరియొక విశేషమేమనగా-

"తం విద్యా కర్మణీ సమన్వార భేతే పూర్వ ప్రజ్ఞాచ" అనిశృతి ఉవాచ.

మాతాపితరుల వలన లభించిన యీ భౌతిక శరీరంకంటే, ఆచార్య ప్రసాద లబ్ధమైన నీవిద్యా శరీరంలోనొక వైలక్షణ్యముంది. భౌతిక శరీరాన్ని యెప్పటికైనా యిక్కడ విడిచిపెట్టవలసిందే. అది మన వెంటరాదు. మన వెంట వచ్చేది విద్యాశరీరమే. ఈ జన్మలో నార్జించిన ప్రజ్ఞా సంస్కారాలు మాత్రమే మనవెంట వచ్చేవి. వీటితోనే భవిష్యత్తున ఉత్తమ జన్మను ప్రాప్తింప జేసుకొని, వీటితోనే భవిష్యత్తున ఉత్తమ జన్మను ప్రాప్తింప జేసుకొని, మరలా జన్మంలోనూ ఉత్తమ విద్యా సముపార్జనానికి దోహదం చేస్తుంది. లేదా, తరించటానికి మార్గం చూపుతుంది. అందుచేత, నిట్టి శరీరాన్ననుగ్రహించే ఆచార్యునితో సాటియైనదేదియును ముల్లోకాల్లో లేదని, "శ్రీ శంకర భగవత్పాదు"లు సెలవిచ్చిరి. ఇంతేకాదు, ఆచార్యుడు ప్రత్యక్షమూర్తి త్రయ స్వరూపుడుగా పెద్దలు నొక్కి చెప్పుదురు.

అదియే, గురువు బ్రహ్మగా, విష్ణువుగా, మహేశ్వరునిగా కీర్తింపబడినవి.

విద్యాశరీరాన్ని మరల సృష్టించి యిచ్చుట చేతనే "ఆచార్యుడు" సృష్టికర్త బ్రహ్మగా, విద్యచేత ఉత్తమ స్థితిని కల్పించి పాలించుటచేత స్థితి కర్తగా; అజ్ఞానాంధకారాన్ని లయమొనర్చుట వలన లయకర్తగా రుద్రుడుగా, పేర్కొనినాడు. ఇంతేకాదు జ్ఞానమార్గాన్ని ప్రదర్శించి మోక్ష సామ్రాజ్యాన్ని యనుగ్రహించటం చేత ఆచార్యుడు శిష్యుని దృష్టిలో "సాక్షాత్పరబ్రహ్మ"యే అని చెప్పుట మతిశయోక్తి కాదు.

కావున ప్రత్యక్ష దైవము, విద్యా శరీర ప్రదాత, అయిన ఆచార్యుని యెడ శ్రద్ధా భక్తి పరిప్లుత హృదయంతో విద్యా సముపార్జనం చేయాలి. అపుడే మానవుడు అజ్ఞాన తిమిరం నుండి వెడలి, జ్యోతిర్మయ జ్ఞానమార్గాన పయనం చేయగలుగుతాడు. ఇహాముత్ర ఫల భోగాలు, రెంటిని సాధించి, సార్థక పురుష నామ ధేయుడౌతాడు.

ఆచార్యుడు, మహాత్ములు, మహర్షులు మొదలగువారు సర్వులకు ప్రత్యక్ష దైవస్వరూపాలు, "గంగా భవాని"వంటి వారు. అనగా గంగానది యెంత పవిత్రమైనదో వీరును అంత పవిత్రమైన వారని గ్రహింపు. వీరు దూషణ, తిరస్కారములకతీతులు. భగవంతునితో అనుసంధానము కూర్చు మధ్యవర్తులు. జన్మయిచ్చిన జన్మదాతల కన్న ఉత్తములు. అనంతశక్తి సంపన్నులని విశ్వసించ వలసినదే.

కావున, మాతాపితరులు భౌతిక రూపం ప్రదానం చేయగా, ఆచార్యుడు వాత్సల్యముతో వారికి విద్యా శరీరమునను[గ్రహించును. కాబట్టి ఆచార్యుడును పితృతుల్యుడును, దైవతుల్యుడని భావించుట శాస్త్ర మర్యాద. అటుల గుర్వనుగ్రహీతుడగు శిష్యుడు ఆవిద్యాశరీరంతో భాసిల్లుచు, భావి కాలమందు వారే సద్గురువులై, మరల శిష్యులకు విద్యాప్రదాను లగుదురు.

కొందరు, తల్లిదండ్రులు చేసిన పుణ్యపాపాలు సంతానానికి తప్పక సంక్రమిస్తాయి. వాటిలో భాగం పంచుకోవడానికే ఆ సంతానం తమ పూర్వ జన్మ కర్మఫల శేషాన్ని అనుభవించడానికే ఆ సంతానంగానే వారి వారి గర్భవాసమందు పుడుతుంటారు. అయితే పుట్టి పెరిగిన తర్వాత వారికి అదృష్టవశాత్తు జ్ఞానోపదేష్ట అయిన ఆచార్యుడు లభించిన, వారి యనుగ్రహంతో, భగవత్కృపను పొంది ప్రాచీన పుణ్య పాపాలను దూరంగా తొలగించుకోవచ్చును, సత్సంస్కారాలను పొందవచ్చును కూడా. కావున, తల్లిదండ్రులు జన్మదాతలు మాత్రమే. వివేకాన్ని పంచేవారు, ప్రసాదించేవారు ఆచార్యులే, అనగా "జ్ఞాన జన్మ"ను నిచ్చుదాతలు ఆచార్యులు. భగవంతునకు శిష్యునకు (భక్తునకు) నడుమ 'సేతువు' లాంటివాడు ఆచార్యుడు.

జ్ఞానహీనుడు, జ్ఞానం (దీపం) లేక కాంతిలేని చీకటి గదిలోకి వెళ్ళునపుడు, కనులున్నా వస్తువులను గుర్తించలేక తన్నుకు పోతాడో, సుఖ శాంతులతో నెట్లుండడో అనగా ఆచార్యునను[గ్రహం లేని వాడు గానతడు అజ్ఞానాంధకారంతో ఆధ్యాత్మిక రంగప్రవేశం పొందలేక ఒడుదుడుకులతో అశాంతి పాలౌతాడు. అట్టి శిష్యుని యెడల ఆచార్యులు జ్ఞాన దీపాన్ని వెలిగించి, అజ్ఞానాంధకారాన్ని తొలగించగల భగత్స్వరూపుడతడు, జ్యోతి స్స్వరూపుడును, అవిద్యా పరులకతడు ఆశాకిరణుడు. శిష్యుల సంక్షేమమునకై వివిధ రీతులలో పరితపించే హృదయాలెన్నైతే వున్నాయో, వాటన్నిటిలోనూ అనుస్యూతంగానే చైతన్యవంతముగా ప్రకాశిస్తుందో వారే "శ్రీగురు దేవులు".

ఆ గురుదేవులకుండే ప్రధానలక్షణాలు రెండు. ఒకటి "ప్రజ్ఞ". రెండవది "ప్రేమ". ఇంకను వారు ధరించిన రూపాలు అనేకములు. వాటిలో మనకందుబాటులో నుండు 'గురుతర' ప్రక్రియలతో, మనకు (శిష్యులకు) సరియైన దారిని జూపే పనిగా పెట్టుకొన్న మహానీయుడు శ్రీగురుదేవులే.

కనుకనే, "గురు రూపము" జేగీయమానంగా ప్రకాశించే జ్ఞానజ్యోతి రూపుడతడు. అదియే ప్రజ్ఞా రూపము. 'ప్రజ్ఞ'యనగా వివేకంతో కూడిన శక్తిరూపం. ఇక దానికితోడు 'గురు రూపము' మేళవించగా ప్రేమరూప ధారుడౌతాడు. 'ప్రేమ' యనగా నిస్స్వార్థమైన కరుణాస్వభావము. ఇట్లు 'ప్రజ్ఞ, ప్రేమ' రూపాలతో గురురూపం అంతర్జ్యోతి స్వరూపంగా

వెలుగుచుండును. ఆ వెలిగే వత్తి మరో వత్తిని వెలిగించు చుండును. అట్టి గురువనే జ్యోతిని చేరినవారు, అదే జ్యోతి వెలుగులో వారు మిలమిలా వెలుగుచుందురు. ఇకవారు, తమ జ్యోతి వెలుగులను దేశదేశాలు వ్యాపింపజేయు వారే గురుస్వరూపులు. అటువంటి గురువులను పొందటమే ముముక్షువైన శిష్యుని కర్తవ్యం. శిష్యునకు ఇహం, పరం రెండింటిలోనూ ఆనందం లభించటానికి గురువు యత్నించవలెను.

అథఃపతనమైన (అజ్ఞానాంధకారమైన) శిష్యుల నుద్ధరించడానికై, వారి వారి అదృష్టం రీతిగా సద్గురువులు అవతరించి క్రమంగా వారిలో నుండు తమస్సును తొలగించి యత్నిస్తారు. 'అవతరణం' అనగా భగవంతుని ప్రతినిధిగా మానవాకారంగా ప్రత్యక్షమవడం. శిష్యుల సంకల్పమును బట్టి కూడా సద్గురువు దిగిరావడం జరుగును. అనగా అట్టి శిష్యుల నుద్ధరించ గురువుల సత్సంకల్ప లక్షణమే. వారి భాగ్యానుసారం క్రమంగా దిగి రావడం అవతరణం అందురు. బిడ్డ రోదనం గని, తల్లి ప్రత్యక్షమై వంగి ఆ బిడ్డను తన ఒడిలోకి అందుకొనునట్లు, గురువు కూడ శిష్యుని తపన గ్రహించి అవతరించడం కర్తవ్యం.

"ఆత్మ బుద్ధి సుఖంచైవ గురు బుద్ధిర్విశేషతః" అని కదా! శిష్యునిలో నెంత తెలివియున్ననూ, ఆ తెలివికి, రత్నమును సానపట్టినట్లు శిష్యుని రాణింపజేయునతడు గురువే.

కాని, ఆ మానవుని మోహము నశిస్తేనే స్మృతి కలుగుతుంది. అట్టి మోహము నశించడానికై గురుకృప భగవదనుగ్రహం కావాలి. వీరిద్వారా మోహాదూరులై ఆత్మ స్మృతితో ఆత్మలోకమును చేరుకుంటారు.

సద్గురువులు వేదాంత తత్త్వాన్ని ప్రబోధించి తద్వారా శిష్యుల మోహాన్నుండి విముక్తి జేయు త్రిమూర్తి రూపులు. అందులకే, "గురుర్బ్రహ్మ, గురుర్విష్ణు, గురుదేవో మహేశ్వర" అన్నారు. అదొక గురు మంత్రము. ఆ మంత్రరహస్య విశేషార్థమిదియే-

గురుః బ్రహ్మ - గురుడే బ్రహ్మ.
గురుః విష్ణుః - గురువే విష్ణువు.
గురుః ఏవ - గురుడే మహేశ్వరుడు (సాక్షాత్ శివుడు)
గురుః సాక్షాత్ పరబ్రహ్మ - గురుడే ప్రత్యక్ష పరబ్రహ్మ స్వరూపుడని,
తస్మైశ్రీ గురువేనమః - అట్టి శ్రీగురు భగవానునకు నమస్సులు.
అనికదా!

**వివరణ :-** బ్రహ్మ నాకు స్థూల శరీరము నిచ్చునొక నిర్మాత. నేను మానవునిగా పుట్టి, గతించుదును, అనే భావాలతో నుంటిని. ఈ స్థూలశరీరమే నేననే అహంకార భండాలత్వము గల నాకు బోధించి బోధించి నన్ను దేవునిగా నొనర్చి, పుట్టుక చావులు లేకుండా, అనగా

(జన్మరహితునిగా) నొనర్చినాడు. దానిచే నేను సర్వ వ్యాపకుణ్ణి. బ్రహ్మానంద స్వరూపుణ్ణి, చైతన్యమే నేను. అను భావముతో నేను బ్రహ్మగా, బ్రాహ్మణునిగా (బ్రహ్మ నిష్ఠునిగా), బ్రహ్మవేత్తగా, బ్రహ్మను (బ్రహ్మమును) తెలిసిన వానిగా. ఇంతేగాక నన్నిట్లు తయారు చేసిన నా ఈ గురుడే బ్రహ్మదేవుడు.

**గురుర్విష్ణుః :-** విష్ణువు నాకు ఈ స్థూల శరీరమునిచ్చి సూక్ష్మ శరీర రక్షకుడుగా నున్నాడు. అయితే ఈ రక్షణ శాశ్వతము కాదు. విష్ణువు రక్షించే స్థూల శరీరము నశిస్తుంది కదా! కనుక ఈ రక్షణ స్థిరం కాదు. కాని గురువు సూక్ష్మ శరీరమును యముని కందించి, నన్ను చిక్కకుండగా రక్షించువాడు గురువే ఎట్లనగా! గురువు నా సూక్ష్మ శరీరమునిండా (ఆత్మనిండా) బోధామృతాన్ని నింపి, స్థూలదేహాభిమానాన్ని పోగొట్టి, ప్రత్యక్ష దేవుడ నేననే ఆత్మజ్ఞానాన్ని కల్గిస్తాడు. నాలోని సంకల్ప ప్రవాహాన్ని దాటించి, దైవత్వభావమొనర్చి, గురుకీలులోనే నిద్రించునట్లొనర్చి, ఆ అనుభవముతోనే ఈ స్థూల దేహాన్ని వదిలే నాకు, గురు కీలులో (దేవునిలో) లీనమవు ఉపాయమును జెప్పి, ఇక యమునికి చిక్కకుండ రక్షించిన నా గురుదేవుడే నాకు విష్ణువు.

**గురుదేవో మహేశ్వరః :-** మహేశ్వరుడు నాకు కారణ శరీరాన్నిచ్చి, స్థూల శరీరాన్ని చూపుతూ వున్నాడు. కాని, నన్ను మరల జన్మలేకుండా పూర్తిగతించేటట్లు శివుని వల్ల కాదు. అని అనుకుంటుంటే తోచే తోపికలను చూచుకుంటూండడమే కారణ శరీరములో పడిపోవుటగును. ఈ తోపికల్లోనే కొట్టుకొని పోతూ వుంటే నాకు తెలియకుండానే ఆయుస్సు కొంచెము కొంచెం నశించి, తుదకు గతించుచున్నాము. కారణ శరీరము నన్నిటుల మోసం చేస్తుంది. గురుడిట్టి కారణశరీరాన్ని తొలగించి, అహం తత్త్వమును నశింపజేస్తున్నాడు. ఆ అహంకారం గతిస్తే యిక పునర్జన్మ యుండదు. దైవత్వం నాలో ఆపాదింప బడుతుంది. దీనికి కారకుడు గురుదేవుడే. దేవునిలో నన్నులీన (లయ) మొనర్చుతాడు కనుక. నా గురుదేవుడే నాకు మహేశ్వరుడు. నాలోని అజ్ఞానం నశించితే అహంకారం నశిస్తుంది. అందులకు దైవమునందు లయమవవలె. అజ్ఞానం కాని, అహమనునది దానికదే దూరమవును. అనగా నిక దరికి జేరవు.

**పరబ్రహ్మ :** పరబ్రహ్మ నాకు తెలివిని (జ్ఞానాన్ని) కలిగిస్తాడు. తెలివి భ్రాంతి జ్ఞానంగా మార్చి, మిధ్యావస్తువులను చూచుకుంటూ వుండేటట్లొనర్చి, జనన మరణ ప్రవాహములో మునిగి తేలేటట్లు చేసి, పరబ్రహ్మమొనర్చినాడు. మిధ్యా ప్రపంచముపై జీవ సంకల్పిత నిర్మిత జీవ సృష్టిలో పడి కొట్టుకొనిపోయే నన్నాదరించి, దగ్గరకుతీసి, నా భౌతిక నేత్రాలను జ్ఞాన నేత్రాలుగా నొనర్చి (తెరిపించి), నా జ్ఞానానికి (తెలివికి) యధార్థాన్ని కనుగొనే శక్తినిచ్చి, బ్రహ్మజ్ఞేయాన్ననుగ్రహించిన నా గురుదేవుడే నాకు పరబ్రహ్మ. అనగా మిధ్యా జ్ఞానాన్ని పోగొట్టి, తత్త్వజ్ఞానాన్నందించి దేవునిలో లీనమవునట్లొనర్చినది నా గురుదేవుడే

నాకు పరబ్రహ్మ స్వరూపుడు.

నిజముగా నా రూపము ప్రత్యగాత్మ, గురుని నిజరూపము పరమాత్మ. ఈ ప్రత్యగాత్మ, పరమాత్మలొకే బ్రహ్మము. సర్వం బ్రహ్మము నాలోని గురుడు ప్రత్యగాత్మ, ఈశ్వరునిలోని గురుడు పరమాత్మ.

ఈనాశరీరమెట్టిదనిన -

1 పంచ భూతములు - కఖ, గఘ, ఙ;లు

2. కర్మేంద్రియములు - చఛ, జఝ, ఞ;లు

3. జ్ఞానేంద్రియములు - టఠ, డఢ, ణ;లు

4. పంచవిషయములు - తథ, దధన;లు

5. క్రమంగానివియే - పఫ, బభమ లు; అనగా!

ప - మనస్సు ; ఫ - అహంకారం,

బ - మహతత్త్వ బుద్ధి ; భ - ప్రకృతి.

మ = జీవుడు.

మః = అనగా జీవునకు, జీవత్వము పెంచుకోవడానికి కాదు.

న - కాదు; నమః - జీవత్వానికి పెంపు కాదు.

**గురువేనమః** : - గురువు కొరకు, (అనగా) - బ్రహ్మత్వమును పొందుట కొరకే నాప్రయత్నము.

నమః : - జీవత్వాన్ని పొందుటకు కాదు. నేను, నేను కాని, నీవే అని

ఇట్లు గురుదేవుని ప్రార్థించిన శిష్యుడు గుర్వనుగ్రహమును సంపాదించును. అప్పుడా గురువులు తారక సంఖ్యా మనస్క యోగములు క్రమము నుపదేశించుదురు. ఇట్లు వారి యుపదేశముతో మంత్ర రహస్యార్థముల నన్నింటిని ఆ శిష్యుడెరుంగును.

## మహావాక్యార్థ వివరణము

ఇట్లు శిష్యుని అభివృద్ధి ప్రకారం బెరింగించి గురువుల యుపదేశము నభివర్ణించుచున్నాడు.

మ॥ క్రమ మొప్పార నహంపదంబునకు నీకాయేంద్రియప్రాణచి
త్తమనోహంకృతి బుద్ధిరూప జడజాతంబెల్ల వాచ్యార్థమా
ద్యము సచ్చిత్సుఖ రూపమై తనరుశుద్ధ ప్రత్యగాత్మ ప్రకా
శము లక్ష్యార్థము వేద శాస్త్ర రహస్యంబింత నిక్కంబగున్

**తా॥** వారు 'అహంబ్రహ్మాఽస్మి' అను మహావాక్యమున కర్థము నీ రీతి నుపదేశింతురు.

అహం - నేను, అను పదమునకు శరీరము, ఇంద్రియము, ప్రాణము, బుద్ధి, మనస్సు, అహంకారము. అను మొదలగు వానియొక్క సమూహము వాచ్యార్థము. ఇది సత్యముగా వేదశాస్త్రములు బోధించునర్థము. ఇదియే సర్వసారమగు అంశము.

'అహం బ్రహ్మాఽస్మి' - నేను బ్రహ్మను **అయి ఉన్నాను**. అనగా నేను బ్రహ్మంబు నొక్కటియే **- ఇదియే జీవ** బ్రహ్మైక్యము. పరిపూర్ణ పరబ్రహ్మమును.

'అస్మి' అను పదమునకర్థ ఐక్యము, అప్పుడు గాని బ్రహ్మజ్ఞానిని గానగుదును.

ఇదియే వాచ్యార్థ జ్ఞానమునకు ఫలము. ఇట్టి ఫలముచే శిష్యుడు (జీవుడు) చరితార్థుడై, పునర్జన్మ రహితుడై, సర్వం బ్రహ్మముగా నెరింగిన వాడగును.

## గురువే పరబ్రహ్మమని బోధించుట

మ॥ గురుడజుడు గురుడు విష్ణుడు
గురుడు మహాదేవుడఖిల గురుడు గురుడు స
ద్గురుడే పరబ్రహ్మంబని
గురుని నుపాసించునతడు గురుతరభక్తిన్

(129. ప. సీతారామాంజనేయ సంవాదం)

**గురు శిష్యులనేది** ఒక చిన్న **సంఘం:** గురు శిష్య వ్యాజ్యం గల ఈ సంఘంలో మానవుడు తోటి మానవునితో మెలగవలసిన రీతిని గూర్చి "శ్రుతి" వారుభయులను నిట్లు పలికిస్తుంది. అదియే శాంతి మంత్రము. ఆద్యంతముల వేదాధ్యయనములో పలుకుటకిది శుభప్రద మంత్రము.

"సహనావవతు । సహనౌ భునక్తు । సహవీర్యం కరవావహై ।
తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై ॥
ఓం శాన్తి శ్శాన్తి శ్శానిః ॥ - (ఉపనిషద్వాక్యం)

'ఆచార్యుడు, శిష్యుడు' - అగు మా ఇద్దరను పరబ్రహ్మ విద్య కాపాడు గాక! మాయిరువురకును పరబ్రహ్మ విద్యావిషయకమైన సామర్థ్యము లభించును గాక! మాచే అధ్యయనము చేయబడిన విద్య మా యిద్దరి యందును తేజోవంతమై అర్థజ్ఞాన యోగ్యమగును గాక! మాయిద్దరి మధ్యను నెట్టి విరోధము కలుగకుండు గాక! ఏదైన ప్రమాదము వలన మాయిద్దరకును ద్వేషము కలిగేనేని, అది వెంటనే శమించి పోవును గాక! మాయందు

తాపత్రయము (ఆధ్యాత్మిక, ఆధి దైవిక, ఆధి భౌతిక)ములు శాంతిని పొందుగాక!

అని, ఆయిరువురును పఠించి వేదాధ్యయనం ప్రారంభించుదురు. అది ఆధ్యాత్మిక విద్యయైనను. భౌతిక విద్యయైనను వినాగురువు వచ్చునది కాదు. సద్గురువునకు సచ్ఛీలుడైన శిష్యుడు దొరకడం, వారి వారి పూర్వ జన్మబంధం. భావి గురు శిష్య పరంపరకు ఆదర్శం. నిదర్శనం, వారి వేదాధ్యయనం.

"మా విద్విషావహై" - "పరస్పరం ద్వేషం లేకుండా ఉందాము" అని "గురుశిష్యులు" చెప్పుకొనే **శాంతి పాఠం**లోని ఈ వాక్యం మిక్కిలి ప్రసిద్ధమైనది. విద్యనేర్చుకొనేందుకు ఏలాంటి ద్వేష భావము లేకపోవడమే వారిరువురుల ప్రయోజనం. "ద్వేషం" అనగా, ఒకరిపట్ల యొకరికి వ్యతిరేక భావముండడమే. ద్వేషం సంస్కృతికి విరుద్ధం. ద్వేష రహితమే సన్మార్గానికి పునాది. ఆత్మను దెబ్బతీసేదే ద్వేషం. ద్వేషరాహిత్యమే భక్తిమార్గం. ద్వేషభావం ధర్మానికి ప్రధాన శత్రువు. మిక్కిలి ప్రమాదకరమైనది.

అట్టి ద్వేషం ఒక వర్గానికో, వ్యవస్థకో చెందినది కాదు. వ్యక్తి వ్యక్తికి సంబంధించినది. అది ఆభిజాత్యమో, భాషో, మతమో, కులమో ఏదైనా కావచ్చు. భిన్నత్వం లేకుండా ఏకత్వభావం కలిగియుండడం ద్వేష రాహిత్యం.

ఆ ద్వేషం గురుశిష్యుల హృదయాలలో మొలకెత్తరాదు. ద్వేషబీజం అంకురించిన అది విషవృక్షముగా పెంపొంది, వారిరువురి మధ్య జరుగు అధ్యయనమునకు ఆటంకము ఏర్పడును.

కావున ఉభయులద్వేష రాహిత్యమే ప్రధాన గుణమని, గీతాచార్యుడిట్లు సెలవిచ్చెను.

"అద్వేష్టా సర్వ భూతానాం మైత్రః కరుణ ఏవచ"

"మైత్రి కరుణ"తో సహృదయాల లక్షణాలతో మెలగాలి.

అద్వేషం గలవాడే సద్గురువు. అట్టి సద్గురుడు బోధించే సద్విషయాలను వింటూ, వారి ప్రవర్తనలను ఉపేక్షించకుండా మెలగినట్లైన అనగా ఆచరించినట్లైన శిష్యుడును అద్వేష్టిగా నెన్నబడును. ఆ గురువు కూడా సద్గురువుగా శిష్యుని మదిలో నిలిచిపోవును అని, శ్రీస్వామి వివేకానంద వారును ఇలా అన్నారు.

"The Question is often asked why should we look in to the character and personality of a teacher? We have only to Judge of what he says and take that it. But this is not right. In spiritual sciences, it is impossible that those can be any spiritual light in the soul that is impure. What religion can an impure man teach? So it is essential

to have purity of heart and soul for one self for imparting to others. Hence we have to see what the teacher's and then what he teaches us. The function of teacher is transference of something and not of move stimulation of the existing intellectual faculties is the student"

కాబట్టి సద్గురువు పవిత్రుడైతేనే ఆధ్యాత్మిక తరంగాలనూ, శక్తినీ తననాశ్రయించిన శిష్యులకు ప్రసరింప జేయగలడు. అదే "సహనావవతు".

**తైత్తరీయోపనిషత్తులో నిట్లు వివరించబడినది -**

"ఆచార్యః పూర్వ రూపమ్ । అన్తేవాస్యుత్తర రూపమ్ । విద్యా సంధిః ।
మరియు - సహనౌ యశః । సహనౌ బ్రహ్మవర్చసమ్ ॥

- (మూడవ అనువాకం)

"యశః నౌ సహబ్రహ్మవర్చసమ్ సహనౌ" -

యశః = కీర్తి; నౌ = మాయిద్దరికిని; సహ = కూడ,
బ్రహ్మ వర్చసమ్ = బ్రహ్మతేజస్సు; సహనౌ = మాయిద్దరికిని;

"శిష్యాచార్యులమగు మా యిద్దరికిని యశస్సు" కలుగు గాక! ధర్మనిమితః కీర్తిః, అనగా ధర్మం ఆచరించటంతో పవిత్ర భావాలు, పవిత్రమైన జీవితం వల్ల వచ్చేపేరు, కీర్తి, ఆ ఉభయుల వేదాధ్యయనం వలన వచ్చే కీర్తితో బ్రహ్మ తేజస్సు కలుగు గాక!

ఈ చర్యతో వారుభయుల మనస్సు. అతిపవిత్రమై ఉన్నత భావాలతో నిండిఉన్నప్పుడు, ఆ "పవిత్రత" శరీరంలోని ప్రతిరోమ కూపం నుండి అద్భుతమైన తేజోరూపంతో బయలు వెడలుతుంది.

అయితే, పూర్వమే బ్రహ్మజ్ఞానాన్ని పొంది కృతార్థుడైన ఆచార్యునకి ప్రార్థన అనవసరం. కనుక, యిది శిష్యునిచే చేయబడుతున్న ప్రార్థన, అని గ్రహించాలి.

శిష్యుని ఆశయం బ్రహ్మ విద్యార్జనమే కదా!

పూర్వకాలంలో ఆశ్రమంలో చేరిన శిష్యుల పోషణ భారం గురువు గారిదే. అందుకని స్వార్థ సుఖానికి కాక, ధర్మానుష్ఠానంకై సంపద కోరబడుతూ ఉండేది. ఆ సంపద శిష్యులకోసమై, అనగా బ్రహ్మ విద్యార్జన అభిలషించు శిష్యుల నిమిత్తమై సద్వినియోగ మొనర్చుచుండెడి వారు. అందులకు ఆచార్యులు (గురువులు) ఇటు బ్రహ్మ విద్యకు, సంపదకును అధికారులు. శిష్యులకై ఆర్జించిన విద్యను సద్గురువులు, బ్రహ్మ విద్యను వారలకందించడానికై, పొందించడానికై తహ తహ లాడుతారు.

అమాయంతు బ్రహ్మచారిణః స్వాహా ।
విమాయంతు బ్రహ్మచారిణః స్వాహా ।
ప్రమాయంతు బ్రహ్మచారిణః స్వాహా ।
దమాయంతు బ్రహ్మచారిణః స్వాహా ।
**శమాయంతు బ్రహ్మచారిణః స్వాహా ।**

బ్రహ్మచారిణః = బ్రహ్మచారులు; మా = నాదగ్గరకు;
ఆయంతు = వచ్చెదరుగాక!
వి = నలుదిక్కుల నుండి; ప్ర = ఎక్కువ మంది
దమాయంతు = దమాన్వితులైన;
శమాయంతు = ప్రశాంత చిత్తులైన;

1. అమాయంతు = శ్రద్ధావంతులైన విద్యాభిలాషులగు;
2. విమాయంతు = బ్రహ్మవిద్యకొరకే గాక, లౌకిక విద్య కొరకును;
3. ప్రమాయంతు = తెలివి తక్కువ వారు కాక, శ్రేష్ఠమైన బుద్ధి కలవారు.

చేరెదరుగాక

అనగా బ్రహ్మచార్యులు అన్ని దిక్కుల నుండి, అధిక సంఖ్యాకులుగా, ధీమంతులైన, ప్రశాంత చిత్తులైన వారు నాదగ్గరకు వచ్చెదరుగాక! అని. ఎటుల?

యథా౽౽పః ప్రవతాయంతి ।
యథా మాసా అహర్జరమ్ ।
ఏవం మాం బ్రహ్మచారిణః ।
ధాత రాయంతు సర్వతః స్వాహా ।

హేధాతః = ఓవిధాత; ఆపః = నీరు, యథా = ఎటుల
ప్రవతాయంతి = మెట్ట ప్రదేశముల నుండి పల్లపు ప్రదేశములకు నెట్లు ప్రవహించుచుండునో; మాసా = నెలలు; అహర్జరం = సంవత్సరమున చేరుచున్నవో; ఏవం = అటులనే; బ్రహ్మచారిణః = బ్రహ్మచారులు;
సర్వతః = అన్నిచోటుల నుండి, మాం = నాదగ్గరకు;
ఆయంతు = వచ్చెదరుగాక ।
"స్వాహా" – ఈ స్వాహాకారం (హోమవిధిని సూచిస్తుంది)

అని, గురువుగారు ముందుగానే హోమ విధానంలో ప్రార్థించుటలోని ఆంతర్యం ఏమిటి?

"తంత్వా భగప్రవిశాని స్వాహా ।
సమా భగ ప్రవిశ స్వాహా ।" - (4వ అనువాకంలో)

ప్రతి వేశోఽసి । ప్రమా బాహి ' ప్రమాపద్యస్వ॥"

అర్థం:భగ = పూజ్యమైన (ఓ ప్రణవ స్వరూపదేవా)
తంత్వా = బ్రహ్మమునకు కోశమువంటి వాడైన నీలోనేను (నన్ను)
ప్రవిశాని = ప్రవేశించుదును గాక;
సహత్వం = నీవుకూడ. మా = నాలో.
ప్రతివేశః అసి = ఆశ్రమ స్థానమైయున్నావు; మా = నన్ను,
ప్రభాహి = ఆత్మజ్ఞానంతో ప్రకాశింప జేయుము. ప్రపద్యస్వ = పొందుమా

భావము: ఓ పూజ్యమైన ప్రణవమా! ఓంకార వేదసారమని; ఇది బ్రహ్మ ప్రాప్తికి శ్రేష్ఠమైన స్థానమని; నీవు ఆశ్రయ స్థానమై యున్నావు. నన్ను ఆత్మజ్ఞానముతో ప్రకాశింప జేయుము. నన్ను పొందుము (నన్ను నీలో ఐక్యమొనర్చుకొనుము).

ఈ ప్రణవంతో ఐక్యం చెందటానికిగాను విద్యార్థియును ప్రణవాన్నే ప్రార్థించుచున్నాడు.

"స ఏవ మాతాచ పితా సఏవ ।
స ఏవ బంధుశ్చ గురుస్సఏవ ॥"

**శిష్యులు** తమ తల్లి దండ్రులను వీడి యొంటరిగా, యింటికి దూరంగానెక్కడో ఆశ్ర**మవాటికలో**, **ఆరణ్యక** రీతిలో నున్నామన్న బెంగ రేఖామాత్రం కూడ రానీయకుండా పరి**పూర్ణానందం వాళ్ళను**భవించాలని, తల్లిగా, తండ్రిగా, గురువుగా, కూర్చుచుట్టముగా, అన్నీ తామే అయ్యియుంటారు గురువులు.

శ్లో॥ "పక్షీచ శాఖా నిలయం ప్రవిష్టః
పునః పునశ్చోత్తమ స్సాంత్వ వాదీ ।
సుస్వాగతాం వాచ ముదీర యానః
పునః పున శ్చోదయతీవ హృష్టః ॥"

**భావము:** పక్షి కొమ్మల్లో యుంటుంది. అది ఉత్తమ సాంత్వవాది. అది మళ్ళీ మళ్ళీ స్వాగతం పలుకుతున్నది. ఆ విధంగా పలకడంలో అది మళ్ళీ మళ్ళీ స్వాగత ప్రేరణ చేస్తున్నది.

ఇక్కడ 'పక్షి' అంటే గురువు. అని అర్థం.

శిష్యుడు విద్యాపారంగతుడగుటకు గురువు బోధిస్తాడు. మరి, శిష్యుడు గ్రహిస్తాడు, సాధిస్తాడు. ఈ నేపథ్యంలో గురువు శిష్యుణ్ణి ప్రేమిస్తూండాలి. అప్పుడు శిష్యుడు గురువును ప్రేమిస్తాడు, ఆదరిస్తాడు కూడ. ఇట్లు వారిరువురిలోను అంతర్గత వాత్సల్యం, క్రమశిక్షణ, మరియు బాంధవ్యం పరస్పరాశ్రయము. గురువును కీర్తి శిఖరాన నిలిపేది శిష్యుని ప్రజ్ఞాపాటవాలపై, ప్రతిభావ్యుత్పత్తులపై(ను) ప్రోదిచేసి పెంపుచేసేది గురువే. ఆ శిష్యుని చూచి గురువు గర్వముతో శిరమెత్తుతాడు. గురువు, గౌరవమును జూచి ఆనందంతో శిరసొంచుతాడు శిష్యుడు. ఆదేశాల నౌదలదాల్చు తాడు కూడ. శిష్యుని సేవా భావానికి ఎద పొంగులు వారేది గురువు. కావున గురువు లేనిది శిష్యుడుండడమెంత అసంభవమో, అనుచితము కాదో, శిష్యుడు లేని గురువుండడమంతే విడ్డూరము. గురువు కష్టాలకు శిష్యుడు కరిగిపోతాడు. శిష్యుని ఆపదలకు గురువు ఆవేదన చెందుతాడు.

అదియునుకాక, గురుశిష్యుల మధ్యగల సంబంధము కేవలం ధనం గైకొని, విద్య గరిపే ధనసంబంధముండ రాదు. వారిద్దరిలో స్వేచ్ఛ, స్నేహాలుండి, ఒకరినొకరు అర్థం చేసుకోవడం వంటి వాతావరణముండాలి. అప్పుడే వారిరువురి మనో బుద్ధులు వికసిస్తాయి. వారి మధ్య సన్నిహిత సంబంధముండి, గురువును శిష్యుడు చనువుతో స్వతంత్రంగా ప్రశ్నలు వేసి, తగు సమాధానములు పొందడంలోనే, మన (భారత) దేశములో వేదాంతం శిష్యులకు బోధింపబడిందని ఉపనిషత్తుల శైలి గ్రహించిన స్పష్టమగును. శిష్యుడు నిర్భయంగా గురువును ప్రశ్నలు వేయడానికిగానీ, అతని వాక్యాలను పూర్వపక్షము చేసి వాదించడానికి గానీ స్వాతంత్ర్యం మన మతంలో తప్ప ప్రపంచములోని మరియే యితర మతంలోనూ కానరాదు.

"ఉపనిషత్" అనగా అదే, "ఉప = సమీపంలో, నిషత్ = కూర్చొని" అనే అర్థంతో శిష్యుడు గురువుతో నుండి, గురువు యొక్క సమగ్ర స్వరూపాన్ని అనగా - గురువంటే ఏమిటి? అని కొంత అవగాహన శిష్యునిలో కలగాలి, కలిగి యుండాలి. గురు బోధనను యథాతథంగా ఆచరణలో పెట్ట యత్నించవలెను.

ఇలా గురుశిష్యుల మధ్య విద్యలో నుండు లొసుగుల గూర్చి చర్చలను జరుపుకొనే సత్సంగమనే ఈ 'అమర సంప్రదాయం' మన మతంలోనే కానవస్తుంది. గురువున కుండ వలసిన రెండు ముఖ్య లక్షణాలలో నొకటి శాస్త్ర జ్ఞానం. రెండవది ఆత్మతత్త్వము యొక్క స్వానుభవం. ఈ రెండింటిలో నేది లేకున్నను, శిష్యులకు గురువు మార్గదర్శకుడు కానేరడు.

శిష్యుడు విద్యావంతుడైనచో కృతజ్ఞతగా విజ్ఞానభిక్ష పెట్టిన విజ్ఞాన దేవతయైన గురువునకు తాను జీవితాంతం ఋణపడి యుండునట్లు భావిస్తాడు. ఆ ఋణాన్నే మనవారు

"ఋషి ఋణం" అన్నారు. ఆ ఋణం నుండి విముక్తి పొందవలెనని కేవలం గురుదక్షిణ (ధనం)తో మాత్రం కాదు. సదావారి బోధనలను, పాఠమును పఠించుటకు పూర్వము "ఓం శ్రీ గురుభ్యోనమః" అని మనస్సున నమస్కరించుకొని స్మరించుకొనుచుండవలెను. అటులే, తాను పొందిన రీతిగా భావి కాలమున నితరులకును నట్లే బోధించుటయును కొంత గురు ఋణం తీర్చుకొనునట్లగును. అనగా గురువుల నుండి పొందిన జ్ఞాన తేజస్సును తమ దగ్గరే దాచి పెట్టుకోకుండా నితరులకు (శిష్యులగువారికి) అట్టి తేజస్సును ప్రకాశింప జేయవలెనని భావము. దాని వలన తనకు అట్టి విజ్ఞాన తేజస్సు రెండింతలుగా ఇనుమడింపబడును. "వ్యయే కృతే వర్ధత ఏవనిత్యం, విద్యాధనం సర్వధనం ప్రధానం", అను నీతి సూక్తి ఎంత సమంజసమో!

మరియు గురువు పట్ల నీతి నిజాయితీ కలిగి, హృదయ పూర్వకంగా గురువు "గురు సిద్ధాంతాల" ననుసరించ యత్నించాలి శిష్యుడు. అట్లొనర్చుటను ఆచార్యులను ప్రశంసించిన దానికన్నా మిన్నయే యగును. గురువు బోధించిన లక్ష్యాన్ని చేరే యత్నమే, అనగా జవదాటడం కూడదని, అదియును "గురు ఋణం" తీర్చినట్లేయగును. ఆచార్యులను ప్రశంసించుచు, అధ్యయనంవల్ల పొందే లాభమును చవి చూచినను "గురు ఋణం" తీర్చినట్లే యగును.

మరియు విద్యావంతుడైన శిష్యుడు కృతజ్ఞతతో విజ్ఞాన దేవతయైన గురువునకు తాను ఎల్లెడల ఋణపడి యుండినట్లు భావించి, అట్టి ఋణవిముక్తిని పొందటానికి గురువులు బోధించిన శాస్త్రములను పఠించి, అట్టి శాస్త్రములోని నీతిని చట్టపరంగా నమలుపరచుకొనుచు, నితరులకును తెలియజేస్తూ, వారును అమలులో నుంచునట్లు బోధించినను గురు ఋణ విముక్తులగుదురు.

## ఒక చిన్న కథ :-

'గోష్టి పూర్ణుడ'ను గురువునొద్ద శ్రీమద్రామానుజులు శిష్యునిగా నుండినపుడు, ఆ శిష్యుని విద్యాభ్యాసమునకు మెచ్చి సంతోషించి, నాయనా! నీకొక రహస్యమంత్రము ఉపదేశించెదను. దానిని నీవు జపించి తరించుము. ఈ రహస్యమంత్రమును నీలోనే (రహస్యముగా) నుంచుకొనుము. నీవు యితరులకు నేర్పినచో నరకమునకు వెళ్ళుదువు, నేర్చిన వారు జపించినచో స్వర్గస్థులగుదురు - అని కూడ దాని యదార్థము తెలిపి, అట్టి "అష్టాక్షరీ మంత్రము" నుపదేశించెను. అదియే, "ఓం నమోనారాయణాయ" ఇది నారాయణరత్నము.

ఆ మంత్ర రత్నమును శ్రీమద్రామానుజులు పఠించి, జపించి శుద్ధి పొంది, నొకనాడు శ్రీరంగనాథుని గుడిగోపురముపై నెక్కి ఆ నారాయణమంత్రమును అందరికిని

వినిపించునట్లు పెద్దగా అరచి పఠించెను.

ఈ వార్త గురువునకు తెలిసి, శ్రీమద్రామానుజులను పిలిచి, "ఈ రహస్య మంత్రమునిట్లు అందరికిని వెల్లడించితివి కదా! అట్లెందులకు" అని, మరల, "దీని పర్యవసానమెరింగియే నిట్లొనర్చితివా!" అని మందలించెను.

అందులకా రామానుజులు గురువునకిట్లు సమాధానమిచ్చెను. "నేను నేర్చిన, జపించిన నేనొక్కడినే స్వర్గమును చేరెదను. నేనొంటరిగా కాక, ఈ మంత్రమును విని, జపించిన వారెల్లరును స్వర్గమునకు వెళ్ళెదరు కదా! అలాంటప్పుడు చెప్పినవాడిని నేను నరకమునకు వెళ్ళినను నాకేమి చింతలేదు". అని సవినయముగా పలికెను.

అదివినిన గురువు, శిష్యుని సమాధానంతో చాలా సంతోషించి, నాయనా! నీ యందున్న యితరుల చింతన కడు శ్లాఘనీయమైనది. అట్టి నీకీర్తి చిరస్థాయిగా నిలిచి పోగలదని ఆశీర్వదించెను.

అటులే శ్రీరామకృష్ణుని శిష్యుడగు నరేంద్రుడు (స్వామి వివేకానంద) గురువు నుండి సదుపదేశమును పొందెను. శిష్యునితోనిట్లనెను, "నాయనా! నీవు 'నిర్వికల్పతపస్సమాధి స్థితి'గా నీ జీవితలక్ష్యంగానుంచుకొని, వటవృక్షములాగా నుంచుకొని, వటవృక్షములాగా తయారైయుండాలి. మరియు పరార్థమునకై జీవించేవాడే ధన్యుడు'" అని కూడా ఉపదేశించెను. – (శ్రీ రామకృష్ణ కథామృతం)

"గృహీవాక్యోస్వర్గముపైతి విద్వాన్" –

గురూపదేశంతో విద్యావంతుడు స్వర్గము చేరునని, "విదురనీతి".

తాను నేర్చినది పరోపకారముగా నితరులకును నేర్పుటనునదియును గురు ఋణము తీర్చునట్లగునని గ్రహించవలెను.

ఋణమట్లుండని, ఆచార్యులుపదేశించిన ఆధ్యాత్మికంపై విశ్వాసమున్నచో, ఆ ఉపదేశం వృథాపోదు.

భగవద్గీత 18వ అ. 63, 64వ శ్లోకములు, శ్రీకృష్ణభగవానుడు అర్జునునితో, "అర్జునా! ఇట్లు సర్వోత్కృష్టమగు రహస్యాతి రహస్యమును నీకు ఉపదేశించితిని. అట్టిహిత వాక్యమును విశ్వసించు వాడవని, నాకు మిక్కిలి ప్రియ మిత్రుడవని, భక్తుడవని ఉపదేశించుచున్నానని" పలికెను.

అటులనే, "శ్వేతాశ్వతరోపనిషత్తు 6వఅ, 21, 22, 23 శ్లోకములలో మంత్రములలో, "శ్వేతాశ్వతర ఋషి" సర్వోత్కృష్టులైన సన్న్యాసులకు నుపదేశించునట్లున్నది.

అతడు బ్రహ్మవిదుడైన ఆధ్యాత్మిక గురువు కనుక. ఈ ఉపనిషద్ మంత్ర రహస్యములను అరిషడ్వర్గములను జయించిన పుత్రునికిని, శిష్యునకును బోధింపదగినవి. అదియును భగవంతుని యందు, భగవద్రూపమగు గురువు నందును భక్తి కలిగినవారికే యిట్టి బోధ సద్వినియోగమై సత్ఫలిత మిచ్చునదై యుండును.

కనుక ఏ శాస్త్రాన్నయినా సొంతంగా పఠించరాదంటారు శ్రీశంకర భగవత్పాదులు ఏకాగ్రత, ధ్యాన విధానాలు గురువుల వద్దనే నభ్యసించాలి. ఏకాగ్రతకై తనకు నచ్చిన దేవతను 'మూర్తి' స్వరూపమును ధ్యానించాలికదా! అందుకును గురువును అన్వేషించాలి.

"వక్తా, శ్రోత" లెట్లుండాలి, అనగా – వక్త చక్కగా, గట్టిగా, వినేవాడి చెవుల్లోనే కాదు, ఎదలోను ఘాటుగా నాటుకపోయేటట్లు చెప్పగలవాడు. అని, మరియు– నేర్పుగా చెప్పేవాడు. అర్థయుక్తముగా అనగా విడమరచి నిపుణతతో వేదవేదాంగాలు గాని, పురాణాలు గాని ఆధ్యాత్మిక దృష్టితో వ్యాఖ్యానించి చెప్పడం. అది వక్తలక్షణం.

అటులే "శ్రోత" కూడ విన్నదాన్ని విన్నట్టే మననం చేసి యెదలో నిలుపుకో గలగటం, ఆ తీరుపైనే యధారపడి యుండటం 'శ్రోత' యనిపించుకొనును.

ఇంతకు చెప్పే సామర్థులెవరు? వినదగినవారెవరు? ఇది యీనాడు బాగా నాలోచించాల్సిన విషయం. సత్ప్రవచనాలకే పరిమితం ఏర్పడినది కదా!

శ్లో॥ నాపృష్టః కశ్య చిద్బ్రూయాత్ న్నాచాఽన్యో ఏవ పృచ్ఛతః ।
జానన్నపి హి మేధావీ జడవల్లోక ఆచరేత్ ॥

భా: తననడగనిదే యెవరికైనా నేమియును చెప్పరాదు. 'శ్రద్ధ, భక్తి' ఇవి రెండూలేని వాడడిగినను చెప్పరాదు. "బుద్ధిమంతుడు" తనకన్నీ తెలిసియున్ననూ లోకంలో తెలియనట్లే యుంటాడు. మౌనిగా మూగవాడిలా మాట్లాడకుండా యూరకుంటాడు.

"శ్రద్ధావాన్ లభతే జ్ఞానం,"
"వినాభక్తి నలభతే ముక్తి" అనగా –

శ్రద్ధ గలవానికే జ్ఞానం లభిస్తుంది. భక్తిలేని వానికి ముక్తి లేదు. అనగా భక్తి గలవానికే ముక్తి లభిస్తుంది. కావున శ్రద్ధగలవాడే దేనినైనా సాధించగలడు. మనకు జ్ఞాన బిక్షను పెట్టే గురువుపై భక్తి, శ్రద్ధ, గౌరవం కలిగియుండాలి. ఇవి గలవారే రాణిస్తారు. శోభిస్తారు. అటువంటి గురువును పొందటమే శిష్యుని కర్తవ్యం. ఇక యిట్టి శిష్యుల భవిష్యత్తు బంగారు బాటయే.

ఇట్టి బంగారు బాట కలియుగమున నుండదని తులసీ దాసు తన మానస చరితంలో నిట్లు చెప్పెను.

"గుర శిష బధిర అంధకారాలేఖా, ఏకనా సునఇ ఏకనహీ దేఖా ।
హర ఇసిష్య ధన సోకన హరఇ, సోగుర ఘోర నరక మహుపరఈ ॥"

భా: గురుశిష్యుల బంధం(గుడ్డి, చెవిటి వారి మధ్యగల బంధంవంటిదగును. గురువునకు జ్ఞాన దృష్టి యుండదు. శిష్యుడు గురూపదేశమువినడు. శిష్యుని ధనమపహరించి, వానిని శోక సంతప్తుని జేయుగురువులు కొల్లలుందురు.

## గురువులెందరు?

త్రివిధ గురువులుగా పేర్కొనిరి కొందరు

1. జన్మదాత (తండ్రి), 2. విద్యా గురువు, 3. మోక్ష గురువు.
1. ఉపదేశ గురువు, 2. కుల గురువు, 3. జగద్గురువు.
1. మాతా 2. పితా 3. ఆచార్యుడు.

ఈ త్రివిధ గురువులలో (బ్రహ్మశ్రీ) విద్యనేర్పు గురువు అధికుడు. జీవుని యాత్రలో గురుయాత్ర గొప్పది. విశ్వామిత్రుడు బాలురైన రామలక్ష్మణులను వెంటనిడుకొని పోయి వారికి అనేక అస్త్ర విద్యలు నేర్పి, బల, అతి బల విద్యలలో ఆరితేరులగావించి, వారి సహాయమున నిర్విఘ్నముగా యజ్ఞ మొనర్చి, అడ్డు తగిలిన తాటకిని, మారీచ సుబాహులను హత మార్చునట్లు జేసెను. అదొక వనయాత్ర యనవచ్చును. లేదా సాహసయాత్ర యనవచ్చును. విజ్ఞానయాత్ర అనవచ్చును. లేదా శుభయాత్ర యనవచ్చును.

## ఇక జ్ఞానామృతాన్నందించే గురువులైదుగురు.

1. పంచ సంస్కారప్రదాత, 2. బ్రహ్మ ప్రదాత, 3. ప్రబంధ ప్రదాత,
4. బ్రహ్మార్థ ప్రదాత అనగా శ్రీమద్రామాయణం వంటి విశేషార్థ ప్రదాత.
5. పంచమోపాయ ప్రదాత.

## షడ్విధ గురువులు:-

1. ప్రేరకుడు, 2. సూచకుడు, 3. వాచకుడు,
4. దర్శకుడు, 5. బోధకుడు, 6. శిక్షకుడు.

వీరునూ పలు రకములుందురు.

## అష్ట గురువులు:-

1. అక్షరాభ్యాసమొనర్చినవారు. గురువు.
2. గాయత్రీ మంత్రోపదేశమొనర్చిన వారు. గురువు.
3. వేదాధ్యయనం గావించిన వారు. గురువు.
4. శాస్త్రాభ్యానము గావించిన వారు. గురువు.
5. పురాణేతిహాసములు జెప్పినవారు గురువు.
6. మతాచార సంప్రదాయముల బోధించినవారు గురువు.
7. ఇంద్రజాలాది మంత్ర బోధకుడు.
8. బ్రహ్మజ్ఞానోపదేశకుడు.

వీరిలో తుది గురువే (బ్రహ్మ జ్ఞానోపదేశకుడే) మోక్ష గురువు. మిగిలిన వారు సచ్ఛీల జీవన యాత్ర సాగుటకుపయోగపడు గురువులు

అటులే గురువులు మరొక విధముగా త్రివర్గముల వారుందురు. ఆధ్యాత్మిక విధులను నుపదేశించి, ఇక తనవంతు తీరినదని, వాని సంగతియే పట్టించుకోని గురువులు అనేకులు. ఇట్టి వారు మూడవ వర్గము వారు.

శిష్యులకు అర్థమగునంతవరకు నయాన భయాన తగు సమయాన శిష్యునిలోని తపనను బట్టి తనబోధనలను తగు భాషలో నూరిపోసి, వాటిని నతడు తిరిగి ఆచరించునట్లు జేసి, వారి యోగక్షేమముల విషయంలో, కీర్తి ప్రతిష్ఠలు పొందునట్లు శ్రద్ధవహించు, అతడే తానుగా తానే అతడుగా మెలుగు గురువు రెండవ వర్గమునకు చెందినవారు.

శిష్యుడు తప్పు మార్గములో పోవుచు గాడితప్పినట్టి శిష్యుడు తన యుపదేశములను నాలకింపకున్నను, ఆచరించకున్నను, వానిని శాసించి బలత్కారముగానైనను ప్రయత్నించి సరియైన మార్గమున పెట్టు గురువు మొదటి దశకర్తుడు.

ముఖ్యముగా గురువులనబడు వారు ఆధ్యాత్మిక వారధుల వంటివారు. వీరే శ్రేష్ఠ జీవిత గమ్యమును జేర్చువారు. పురుషార్థములు నెరింగించి, సర్వోచ్ఛ స్థానమును జేర్చువారు. అట్టి వారు (8) ఎనమండుగురు.

1. బోధ గురువు :- వేద శాస్త్రముల గూర్చి బోధించు గురువు.
2. వేద గురువు :- వేద శాస్త్రతత్త్వమును గూర్చి బోధించు గురువు.
3. నిషిద్ధ గురువు :- వశ్యాకర్షణ మంత్రములచేత యిహపర లోక సుఖదుఃఖముల నిచ్చువారు.

4. కామ్యక గురువు :- పుణ్యకర్మలు చేయించి యిహపరలోక సుఖముల నిచ్చువారు.

5. సూచక గురువు :- వేదాంత శాస్త్రముల అంతరార్థమును తెలియజేయువారు.

6. వాచక గురువు :- మనో బుద్ధి, చిత్త, అహంకారములనెడి వాటిపై వైరాగ్యము కలుగజేసెడివారు.

7. కారణ గురువు :- "అహం బ్రహ్మోఽస్మి" మొదలగు వేదవాక్యములను బోధించి ముక్తి యనుభవమును కలుగజేయువారు.

8. విహిత గురువు :- శిష్యుల సకల సందేహములను నివృత్తి యొనర్చి కైవల్య ప్రాప్తి కలిగించువారు. ఇతడు సాక్షాత్ శివుడంతంటివాడు.

ఇక నేటి లౌకిక సంబంధమైన విద్యను నేర్పువారు గురువులనబడరు. వీరిని "టీచర్లు" అనుట మేలు. "చెవిలో మంత్రము చేతిలో డబ్బు" సూత్రధారులు. ఇట్టి టీచర్లు నేడు వందలు, వేలు లభింతురు. సచ్ఛీల సంపన్నులైన శిష్యులు మాత్రం లభించుటను అరుదు. ఆ ధన గురువులకు మదశిష్యులే లభింతురు. ముఖ్యముగా ఈనాటి కాలంలో గురువుల, శిష్యుల మధ్య అవగాహన లేకపోవడం గమనార్హము.

అథవా గురువులు సచ్ఛీలురైయుండి బోధించదలచుకొన్ననూ వినే శిష్యుడునూ లేడు. ఇక శిష్యుడు వినదలచుకొన్న తగు గురువు లభించడము లేదు.

"వక్తా శ్రోతాచ దుర్లభః" అన్నటుల ఉభయులు దుర్లభులే. "నదుర్లభః"గా నుండవలెనని కాంక్ష.

శిష్యుడెప్పుడు గురువు నుండి విద్యను గ్రహించవలెననిన, తుమ్మెద పూలయందున్న మాధుర్యమును పొందుటకు యత్నించునట్లు, గురువును నాశ్రయించి 'గురు'బోధను గ్రహించవలెను. అడగంది అమ్మయినా పెట్టనట్లుగా, "నాపృష్టః కస్య చిద్బ్రూయాత్" అని, అడుగలేదు కదాయని ఊరకున్నా శిష్యుడు తప్పుదారి పట్టినచో, చెప్పుటకు యత్నించుబాధ్యత గురువునకున్నది.

భారతంలో ధృతరాష్ట్రుడు ధర్మబోధ విననివాడైననూ, విదురుడు తన ధర్మబోధ మానలేదు. అటులే గీతాబోధను సంజయుడు తన విధిగా శ్రీకృష్ణుడుపదేశమంతయును ధృతరాష్ట్రునకుపదేశించెను కదా! విననిచోనతని దౌర్భాగ్యము.

## పంచవిధ గురువులు

1. గూఢుడు, 2. దృఢుడు, 3. ప్రీతుడు, 4. మౌని, 5. సకృత్ కామగతుడు.

**1. గూఢుడు** :- తాను ఆత్మజ్ఞాన సంపన్నుడైనా, అది ప్రకటితం కాకుండా, ఏకాంతాన్ని కోరుకుంటూ తనను కోరి వచ్చిన వారికి మాత్రమే తత్వాన్ని బోధించేవాడు.

2. **దృఢుడు** :- పరిపూర్ణజ్ఞానియై, అంతటితో తృప్తి పొందక, సంచారం చేస్తూ పది మందికి తత్త్వబోధ చేసేవాడు.

3. **ప్రీతుడు** :- సర్వం త్యజించి, జగత్తుతో సంబంధం లేకుండా ఈ జగత్తంతా ఒక నాటకరంగమనే స్పృహ కలిగి, దృష్టి మాత్రంతో శిష్యులను తరింప జేయగలిగిన వాడు.

4. **మౌని** :- నిశ్చల చిత్తంతో, అద్వైతామృత పానాన్ని గ్రోలుతూ, ధ్యాన బలిమితో ఆశ్రితులను తరింప జేసేవాడు.

5. **సకృత్ కామగతుడు** :- మహాసంకల్పశక్తి కలిగినవాడై, తనను ఆశ్రయించిన వారిని అఖండజ్ఞాన సంపన్నులను చేసేవాడు.

శ్లో॥ గూఢో దృఢశ్చ ప్రీతశ్చ మౌనేన సుసమాహితః
సకృత్ కామగతో వాపి పంచధా గురురీరితః ॥

★★★

## గురు - సూత్రములు

హితమునుపదేశించు వారును, బ్రహ్మ విద్యనుపదేశించు నతడును త్రిమూర్తి స్వరూపుడగు గురువుగా నెంచవలెను.

★★★

గురుభక్తుని కాలమృత్యువే బాధింపజాలదు. అనగా! యముని వలనను భయపడనవసరము లేదు.

★★★

గురువు వాక్యమునెవడు శిరసావహింపడో వాడు రౌరవ నరకమును పొందును.

★★★

గురుభక్తితోనే సకల శాస్త్రాలునేర్పడమగును.

★★★

శిష్యుని హితానికై సతతం ప్రయత్నిస్తాడు గురువు.

# 15. గురుతత్వం

## (శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ)

స్త్రీలకు భర్తను మార్చుకోవటాని వీలు లేనట్లే, శిష్యుడు తన గురువును మార్చుకొన వీలులేదు. గురువును ఎన్నుకున్నాక, ఆ గురువును పరీక్షించే హక్కు, పరిత్యజించే హక్కు ఉండదు. అటులే గురువు కూడ శిష్యునిగా ఎన్నుకోవడంలో పరీక్షిస్తాడు, పరిశీలించి, అర్హుడుగా నెగ్గిననే శిష్యునిగా సమ్మతిస్తాడు. గురువునకు శిష్యుని కృషిపట్ల తృప్తి కలిగిననే శిష్యత్వం వచ్చేది.

కొందరు మహత్తులకు లోబడి శిష్యత్వమునకు సిద్ధమౌతారు. ఆ మహత్తులు చూపడం మానినతోడనే ఇక ఆ గురువును వదలిపోతారు. అప్పుడు గురువు కూడ మరల వానిని దరిచేరనీయడు. ఇక వారు ఉన్మత్త శిష్యులుగా గురునిందకులుగా, పతితులై, మరొక గురువును చేరుటలోను అట్లే విఫలురై ఉభయభ్రష్టులౌతారు.

కొందరు, గురువు పొందు కీర్తి ప్రతిష్ఠలకు తామే కారణమని భావిస్తూ, తామే వెలుగులోకి తెచ్చిన వారమనీ చెప్పుకొనుచు, ఆత్మలో మాత్రము గురువు గొప్పవాడేననీ తలంచుచూనే, ఆ గొప్పదనాన్ని తమ హృదయాల్లోనే భద్రపరచుకొని ఉన్నవారు కూడ ఆత్మవంచకులని చెప్పవచ్చు. వీరినే శిష్యాభాసులని, గురువు మహత్తుపై వెర్రి దృష్టికల వారని చెప్పవచ్చును.

మహత్తులనేవి అల్పమైనవి. అలా అని గురువుల మహత్తులను ఆధారంగా చేసుకొని గురువులని గ్రహించరాదు. గురువంటే శివుడని అర్థం. అలా శివస్వరూపి అయిన గురువుని అల్పమైన మహిమలకు పొత్తు కలుపుతూ గురువుగా గుర్తించడం అవివేకం.

అన్ని విత్తనములు మొలకెత్తవు. వాటిని పరీక్షించవలే. అనగా నేలలోనాటి నీరు పోసి చూడాలి. మొలకలెత్తినవి అసలైన విత్తనములని, వాటిలో తులసి విత్తనమేది? గంజాయివిత్తన మేదియో కూడ గుర్తించవచ్చును

నిర్మల హృదయం సహజమైన సత్వగుణ శివస్థానం. ఆస్థానం శాంతి, తృప్తి గలదిగా గురుస్థాన ప్రధానంగా నుంటుంది. అందుకని గురువును ఎన్నుకొనునపుడే హృదయ పరిశీలన అవసరం. అసలు గురు పరిశీలన అంటే హృదయ పరిశీలనే. "గురువుగారి గుప్పెడు ఉపదేశం కొండంతవరం" -

### ఆత్మలో పరమాత్మ

"ఆత్మలో పరమాత్మ ఎట్లు ఇమిడి ఉంటాడు?" - అని శిష్యుడు గురువును

ప్రశ్నించగా, గురువు శిష్యుడిని, "గంగా జలం గైకొనురమ్మ"ని ఆదేశించాడు. శిష్యుడు వెంటనే గురువాజ్ఞగా తన కమండలంలో గంగానదికి వెళ్ళి గంగాజలం నింపుకొచ్చేశాడు. "ఇదిగో నండీ! గంగా జలమ"ని కమండలం అందించాడు.

"నాయనా! నేను తెమ్మన్నది గంగాజలం కదా! ఈ కమండలం ఏమిటి?" అడిగారు గురువుగారు.

"ఆ కమండలంలోనే గంగాజలమున్నదండీ!" అని సెలవిచ్చాడు శిష్యుడు.

"గంగాజలమైతే, అందులో అంతటి గంగాజలమెట్లు ఇమిడి యున్నదీ? అయినా ఆ గంగలోని జలచరములేవి?" అని, మరల ప్రశ్నించాడు గురువుగారు.

"స్వామీ! ఈ కమండలమెంత? అందు గంగ యంతయు ఎట్లు యిమిడును? జలచరములెట్లు పట్టును?" అని పలికి, తెల్లబోయెను.

"అదే నాయనా! ఆ చిన్న కమండలంలో గంగాజలం లోని జలం ఇమిడి యున్నదో, అంతటి పరమాత్మయూ నొక అంశగా "ఆత్మ"రూపంగా ఇమిడి యున్నాడు. అనగా "ఆత్మయే పరమాత్మ"గా విలీనమైయుండును.

## గురుబలం - "సూక్తి"

శ్లో॥ నదేవతాజన్యబలం బలంస్యాత్ గురోర్బలం వైబలమీరితంతత్ ।
యోవా గురూన్ ధిక్కురుతే విమూఢః త్రిశంకువద్భ్రష్టగతి స్సనూనమ్ ॥

భా: దేవతల వల్ల పొందిన బలం బలంకాదు. గురువుల బలమే బలమని పెద్దలు చెప్పారు. కనుక, మూఢుడై గురువులను ధిక్కరించే వాడు త్రిశంకువు లాగానే భ్రష్టుడుకాక తప్పదు.

ఎవరేని సహజంగానే బలం కల్గియుంటారు. అందుకు కారణం? అట్టిది గతజన్మలో దేవతలను బాగా ఉపాసించిన ఫలితమే, ఈనాటి విశేషబలం, పుట్టుకతో వస్తుంది అదే సూక్తిపై శ్లోకంలో నున్న "నదేవతా జన్య బలం బలం స్యాత్" వర్తించింది.

కానీ, ఆ బలం బలమే కాదు - అదే సూక్తి శ్లోకంలోని రెండవపాదం ఇలాచెబుతుంది.

"గురోర్బలంవై బలమీరితం తత్" - గురువులబలమే బలమని సూక్తి.

ఎందుకనగా - గురువులు భూలోకవాసులు, అనగా మానవులు. ఇక దేవతలు స్వర్గలోక వాసులు. వీరల బలంకన్నా మానవుల బలం ఎక్కువ ఎలా కుదురుతుంది.

చూద్దాము -

ప్రభుత్వం వారు ఒక విద్యార్థికి విద్యార్థి వేతనం మంజూరు చేశారు. అట్టి కాగితాలు ఢిల్లీ నుంచి ఆ విద్యార్థి ఉన్న గ్రామం చేరాయి. కాని, స్థానిక ప్రభుత్వాధికారి ఆ విద్యార్థికా సొమ్ము అందించకపోగా, "వీడు మోసపు విద్యార్థి" అని నివేదిక పంపాడు. మంజూరు ఆగిపోయింది దాంతో ఇట్లు ఆగిపోవడానికి గల కారకుడు స్థానిక అధికారి. పై అధికారి కన్న ఛోటా అధికారియే.

అట్టిది ధర్మమో అధర్మమో, విద్యార్థి మంచి గుణాలవాడే. ఆ "మంచి" క్రిందిస్థాయి అధికారికి సమ్మతం కాలేదు. అట్లుగాక, ఆ విద్యార్థి మంచితనమును గుర్తించిన గురువులకా అధికారము నిచ్చిన, పై అధికారిని సమ్మతింపజేసియైన, ఆ విద్యార్థికాసొమ్ము అందించ యత్నించును. ఇట్టి వారు పరమాత్మ తత్వవేత్తలు. స్థానికులగు సద్గురువుల సమ్మతమే, పై ఉన్నతాధికారుల సమ్మతమై యుండడము వారికే శ్రేయస్సు, వ్యవస్థకును క్షేమం.

దురాశగల త్రిశంకువు వశిష్ఠుడంతటి సద్గురువును వీడి, విశ్వామిత్రుడనే మరో గురువును ఆశ్రయించి. తన ఆశయమును తీర్చమని కోరాడు. ఈ ఆశ తగునా, కాదా, అనే ఆలోచనలేక, ఆ గురువును వీడి తననాశ్రయించాడనే అహంకారంతో విశ్వామిత్రుడు త్రిశంకువు ఆశయమగు స్వర్గలోకం పొందుటకై పైకేగగా, పై దేవతలు, ఇతడనర్హుడని, మరల క్రిందికి పంపిరి. ఇట్లు క్రిందికీ చేరలేక, పైకిపోలేక, మధ్యలో ఆగిపోయెను త్రిశంకుడు. అందుకే "యోవాగురూన్ ధిక్కురుతే విమూఢః" సద్గురువులను ధిక్కరించేవాడు త్రిశంకువు వంటి మూఢుడుగా గుర్తింపబడును.

అందుకని, దత్త సద్గురు కృపాబలమే "గురు"బలం

**అట్టి గురుబలం పొందుదురు గాక!**

## బ్రహ్మ చెప్పిన "గురు" - మహిమ

బ్రహ్మ 'కలి'లో 'గురు' మహిమను నిట్లు వివరించెను. 'గురు' అను రెండక్షరములో 'గ'కారము, 'ర'కారములకు 'ఉ'కారము చేరి 'గురు' వైనది.

'గ' కారః సిద్ధిదః ప్రోక్తః, 'రే'పః పాపస్య దాహకః, 'ఉ' కారోవిష్ణుః, అవ్యక్త స్త్రియాత్మ గురుః పరః.

'గ'కారం అంటే సిద్ధించటం, 'ర'కారం అంటే పాపాలను దహించివేసేది. 'ఉ'కారం అగోచరమైన త్రయాత్మకులైన విష్ణు, బ్రహ్మ, రుద్రులే ఈ త్రియాత్మక రూపమే 'గురు' శబ్దం. "శ్రీ గురుడు" నిజంగా త్రిమూర్త్యాత్మకుడు. అటులే -

శ్లో॥ గణేశో వాఽగ్నివాయుక్తో విష్ణు నా చ సమన్వితః ।
వర్ణద్వయాత్మకో మంత్ర శ్చతుర్వర్గ ఫలప్రదః ॥

గణేశుని గురువు అంటారు. (ఈపై శ్లోకంలో మంత్ర శాస్త్రాల గూఢ పరిభాషలో 'గురు' మంత్రోద్ధారఫలం చెప్పబడింది.)

'గ'కారం **అంటే గణేశుడు**; 'ర'కారం **అంటే** అగ్ని; 'ఉ'కారమంటే విష్ణు; ఈఉకారం 'గ, ర' అనే రెండు **అక్షరాలకుండు రూపం. అలా** 'గురు' అనే రెండక్షరాల మంత్రం రూపొందింది. చతుర్విధాల **పురుషార్థాల** నిచ్చుమంత్రమిది.

(ఈ మంత్రాన్ని గురుముఖాన్నే పొందాలి)

శ్లో॥ గురుఃపితా గురుర్మాతా గురురేవ పరః శివః ।
శివేరూష్టే గురుస్త్రాతా గురౌరుష్టేన కశ్చన ॥

భా: గురువే తల్లీ, తండ్రీ, గురువే నిశ్చయంగా శంకరుడు. శంకరుడే కోపిస్తే గురువు రక్షిస్తాడు. కానీ గురువే కోపిస్తే ఆ శంకరుడు కూడ రక్షించలేడు.

శ్లో॥ హరౌ ప్రసన్నేఽపిచ వైష్ణవ జనాః సంప్రాప్తయంతే గురుభక్తిమవ్యయమ్ ।
గురౌ ప్రసన్నే జగతామధీశ్వరః జనార్దన స్తుష్యతి సర్వసిద్ధిదః ॥

భా: ఈశ్వరుడు ఒక వేళ ప్రసన్నుడైతే అతను గురువుగానే గుర్తించ బడతాడు. గురువు ప్రసన్నులైతే, ఈశ్వరుడు వశమౌతాడు.

శ్లో॥ గురుం భజ శాస్త్రమార్గాన్ ప్రదేది తీర్థం ప్రతం యోగ తపాదిధర్మాన్ ।
ఆచర వర్ణాది వివేక యజ్ఞాన్, జ్ఞానం పరంభక్తి విరాగ యుక్తం ॥

భా: శాస్త్రమార్గాన్ననుసరించి శ్రీ గురుణ్ణి భజించాలి. తీర్థ, వ్రత, యోగ, తపస్సులు జ్ఞానాన్నిస్తాయి. ఆచారధర్మ వీర్ణాశ్రమాలూ, వివేక కర్మమార్గాలూ, భక్తివైరాగ్యాలూ గురుమార్గాన్ని చూపిస్తాయి.

ఇదంతావిని, "కలి" చేతులు జోడించి, "గురువు సర్వదేవతా సమానుడెలా అయ్యాడో చెప్పండి" అని బ్రహ్మను కోరగా, బ్రహ్మ 'కలి'తో మరల నిట్లనెను.

శ్లో॥ గురుం వినా నశ్రవణం భవేత్కస్యాపి కస్యచిత్ ।
వినాకర్ణేన శాస్త్రస్య శ్రవణం తత్కృతో భవేత్ ॥

భా: మానవుడు వినడంతో సర్వశాస్త్రాలు తెలుసుకొంటాడు. కానీ, గురువు లేకుండా శాస్త్రశ్రవణం ఏలా అవుతుంది?

గురువులు శిష్యులను ఉద్ధరించే విషయముగా, "సౌందర్యలహరి"లో 3వశ్లోకం

ఇట్లున్నది.

శ్లో॥ అవిద్యానా మంతస్తిమిరమిహిరద్వీపనగరీ
జడానాం చైతన్యస్తబకమకరందస్రుతిఝరీ
దరిద్రాణాం చింతామణి గుణనికా జన్మజలధౌ
నిమగ్నానాం దంష్ట్రా మురరిపువరాహస్య భవతి ॥

శిష్యులు కొందరు **అవిద్యులుగా**, జడులుగా, దరిద్రులుగా నుంటారు. అట్టివారిని "గురువు" విష్ణుమూర్తి వరాహ రూపంలో వచ్చి భూమిని యుద్ధరించినట్లు ఉద్ధరిస్తాడు. తరింప జేస్తాడు కూడా. ఇక్కడ "వరాహ"రూపం అనగా శ్రేష్ఠమైన ఆకారం. అదే వరహదినం, అనగా శ్రేష్ఠమైన దినం. ఆ దినమే గురు పూర్ణిమ అనవచ్చును.

అందుకే, "గురుమతులు తపస్సులంతః కరణంబుల శుద్ధి సేయ ఘనత భక్తిన్" - అన్నారు.

'అవిద్యా' అనునది కర్మవిధి నిష్పాద్యం. 'విద్యా' అనునది దేవతాజ్ఞానం, ఆత్మజ్ఞానం.

జడులు - కర్తవ్యాకర్తవ్య బుద్ధి ప్రకాశ శూన్యులు. దరిద్రులు - పూర్వ జన్మ దుష్కృతులు - ఇందరిని "గురువు" చింతామణిలాగా వారి రూపుమాపి కల్పవృక్ష పుష్పగుచ్ఛంగా నిలుస్తాడు.

## గురుభక్తి ఈశ్వర భక్తికి తొలిమెట్టు

సర్వాంతర్యామి అయిన భగవంతుణ్ణి తెలుసుకొనేందుకు సద్గురువు ఆశ్రయం తప్పనిసరి. భగవత్సాక్షాత్కారం కల్గించే శక్తి సద్గురువుకేయుంది. సద్గురువు సత్య సంధుడై తన శిష్యులను సత్య పథంలోకి నడిపిస్తాడు. గురువుపై అపారమైన, అనన్యమైన ప్రేమానురాగాలు, భక్తి విశ్వాసాలుండిన శిష్యులకు, త్వరగా భగవత్సాక్షాత్కారం కలుగును. భగవంతుని దయకు పాత్రులు కావడానికి సులభమైన సాధన గురుభక్తి. గురుభక్తి ఈశ్వర భక్తికి తొలిమెట్టు. భగవంతుని తేజస్సును గురువు ద్వారా శిష్యుడు పొందగలుగుతాడు.

అందుకే, భగవంతుడు గురురూపంలో తరలివస్తాడు. అలా వచ్చిన ప్రత్యక్ష దైవమే గురువు. "భగవంతుడి కంటే ముందు గురువుకు నమస్కరించడం అందుకే", అని అంటాడు "భక్త కబీరు".

అదియేగాక, మనిషిని దుష్టత్వం నుండి, దుశ్చింతన నుండి సహనంతో వివిధ పురాణోపపురాణ గాథలతో తల్లిలా సన్మార్గంవైపుకు మరల్చే శక్తి గురువుకే యుంది. గనుక,

భగవంతుడు తన సంకల్ప సృజనను నిత్యధార్మికం గావించేందుకు గురువుగా అవతరించాడనడం అతిశయోక్తి కాదు.

## గురుత్వం - శిష్యత్వం

'విద్యానాథ శాస్త్రి' అనే మహనీయుడు గొప్ప పౌరాణికుడుగా, ఉపన్యాసకుడుగా పేరుపొందిన వాడు. **అందరినీ అట్టే ఆకట్టుకొనే చదువరి.**

అట్టి మహనీయునికి శిష్యునిగా చేరాలనే తపనగల సుదర్శనుడనే వాడు, ఆ శాస్త్రిగారిని చేరి, తన ఉత్సుకత వెల్లడించాడు. అనగా వారిని గురువుగానెంచి, ఆధ్యాత్మికతను ఒంట బట్టించుకోవాలనే ఆశ కలిగింది.

అందుకని శాస్త్రిగారిని వెంటాడుతూ, ఆచి తూచి నడుచుకుంటూ, వారి ఉపన్యాసాలను వింటూ, తగినంత చనువు సంపాదించుకొన్నాడు.

ఆ చనువుతోనే అతడు ఒకనాడు తనను శిష్యునిగా అంగీకరించమని, తనకును ఆ ఉపన్యాసాల ధోరణిని కల్గించమని, మీరు చెప్పినవే నేనూ పలువురికిని చెప్పి మీ యంతటి కీర్తిని పొందుభాగ్యం కల్పించమని అర్థించడమయ్యెను సుదర్శనుడు. అందుకు శాస్త్రిగారు, "నాయనా! 'గురూత్వం' అనేది చాలాపెద్ద బాధ్యత. ముందు తాను తరించి, ఇతరులను తరింపజేయగల శక్తి కల్గివుండాలి. కానీ నీ వంటి వారిని చేర్చుకుని నా గురూత్వం నిలబెట్టుకోలేనేమో" అని నిక్కచ్చిగా చెప్పెను.

ఆ మాటలు సుదర్శనునకు ఛాందసంగా తోచినవి. అయినా పట్టువీడక, శాస్త్రిగారు ఒంటరిగా ఉత్తర భారతదేశయాత్ర చేయడంలో తాను తోడుగా నుంటాననీ వొప్పించి వెంబడించాడు.

ఇరువురూ కాశీని దర్శించి, అటుపిదప హిమాలయాలలోని నొక శివాలయం చేరి, ఆ రాత్రి అక్కడే వెంట తెచ్చుకున్న పండ్లు తిని నిద్రించారు. కాని అర్ధరాత్రి శాస్త్రిగారికి దాహం వేయడంతో ఇక నిద్రపట్టక, అలసటతో కదలలేక నీటికి తహ తహలాడి, విధిలేక ప్రక్కనే పరుండి యుండిన సుదర్శనంను లేపాడు. గాఢ నిద్రలో నున్న సుదర్శనుడు లేచి, సంగతి తెలిసి మనస్సులో విసుగు జెంది, "ఆ అర్ధరాత్రి నీళ్ళు ఎక్కడ దొరుకుతాయి?" అని ప్రశ్నించాడు.

అయినా! శాస్త్రిగారు కూడ తన దాహం తీర్చుకోవడానికి సుదర్శనాన్ని బతిమాలుతూ, "నాయనా! ఈ గుడి వెనుకే ఒక బావి ఉన్నట్టు చూశాను. వెళ్ళి తీసుకరా!" అన్నాడు. అందుకు సుదర్శనం, తెలుసు అన్నట్లున్నా, లేచి వెళ్ళి నీళ్ళు తెచ్చే ఓపికలేక ఈ చలిలో ఆ నీళ్ళు త్రాగితే జ్వరం వచ్చేస్తుంది, కనుక ఓపిక పట్టియుండండి స్వామీ!" అని

నిద్రలోకి వెళ్ళాడు. శాస్త్రిగారు చేసేది లేక మౌనం దాల్చాడు.

తెలవారింది. సుదర్శనం లేచి, రాత్రి తానొనర్చిన అశ్రద్ధ పట్ల సిగ్గుపడ్తూ, నీళ్ళు తెచ్చి శాస్త్రిగారి కందివ్వయత్నంలో, అంతవరకే శాస్త్రిగారు లేచి బావివద్ద స్నాన మొనర్చి అనుష్ఠానములో నున్నాడు. ఆ అనుష్ఠాననంతరం శాస్త్రిగారు సుదర్శన్‌తో, "నాయనా! రాత్రి నేనేవెళ్ళి బావిలోంచి నీళ్ళు చేదుకొని దాహం తీర్చుకున్నాను. ఇక, నీవు కోరినట్లు నేను గురుత్వం స్వీకరించడం అటుంచి శిష్యత్వం నీకు లేకపోవడం గ్రహించితిని. శారీరకమైన నిద్రను, చలిని జయించలేని వాడవునీవు. గురువు ఆదేశించిన సాధన మార్గంలో విఫలుడనైతివి. అంతకంటే బలవత్తరమైన మనస్సును జయించి ఆధ్యాత్మిక ప్రగతిని ఎలా సాధించగలవు? అందులో రాత్రి నువ్వునాతో వాదనకు దిగావు తప్ప, నా ఆజ్ఞను పాటించక, ఉల్లంఘించి విఫలుడవైతివి అందుకే నావైఫల్యం కూడా! ఉత్తమ గురువులు శిష్యులు అంతరాత్మపై పట్టుసాధిస్తారు. వారి ఆదేశాన్ని శిష్యులు కాదనడం కానీ, వారితో వాదనకు దిగడం కాని జరుగదు. కనుక, నేను గురుత్వానికి తగనుకూద. సాధారణ పౌరాణికుడుగానే నుండడం నా స్థాయికి తగింది".

అని, శాస్త్రిగారు తానేమి విచారించక, వెంటనే సంధ్యావందనానికి నిమగ్నమైపోయారు.

సుదర్శనం, తన వైఫల్యానికి వెలవెలపోయి ముఖంలో నెత్తురు చుక్కలేక తిరుగు ప్రయాణం కట్టాడు.

అటులే, గురూత్వం లేని గురువులను, నేడు ప్రభుత్వముచేత నియమింపబడు ఉపాధ్యాయులుగా చలామణి అవుతున్నారు. వీరు, తాము విద్యనభ్యసించుటలోని తపన, తాము నేర్చిన విద్యను అవిద్యావంతులకు అమ్ముకొని జీవనం గడుపయత్నంలో నుందురు. దీనినే విద్యా విక్రయము అని చెప్పవచ్చును. విద్యకు విలువ కట్టి విక్రయించడం కడు శోచనీయం. విద్యకు విలువ యున్నదా? విద్యాదానమని అన్నారు కాని, ధనార్జన నిమిత్తమై నిర్దిష్టమైన వెలకట్టడం కడుదోషం.

పూర్వకాలములో గురుకులములందు విద్య నభ్యసించుటకై శిష్యులు చేరి, తోచినంత విద్య నభ్యసించి, తుదకు (చదువు ముగిసిన తదుపరి) వారి యోగ్యతగా గురుదక్షిణ యిచ్చి వెళ్ళుపద్ధతి. అట్టునూగాక, ఆ గురుకులముల గురువులు ధనాధికుల వద్ద తోచినది గ్రహించి చేరిన శిష్యుల భోజనవసతులును కల్పించి బోధించెడివారు. ఒకొక పరి గురువులే ఖర్చులు భరించెడివారు.

మరి ఈనాడు ఈవిషయము (Subject) బోధించిన ఇంత మొత్తమును అది కూడ ముందుగానే ఇచ్చుకోవలసినదిగా గురువులు శిష్యులను కట్టడి చేస్తూ పొట్టలు పోషించు

కొనుచున్నారు. ఇట్లు విద్యను విక్రయించువారు సమాజపు హితమును కోరువారెట్లగుదురు?

ఇది గ్రహించిన వారు, అలనాటి సమాజమునకు ఈనాటి సమాజమునకు వ్యత్యాసము అవగాహన చేసుకోకపోరు.

దోషయుక్తమైన సమాజంలో దోషయుక్తమైన ఆహారపానీయాల సేవనంతో ఉపాధ్యాయులు దోషయుక్త బోధనలు చేయడం ఆశ్చర్యం పడనవసరం లేదు

అంతెందులకు, శ్రీమాన్ రామానుజాచార్యుల వారు తన శిష్యులకు బోధించుటలో తను చేసిన దోషమును గూర్చి యిట్లు చెప్పుకొనెను.

శ్రీరామానుజాచార్యుల వారికి కాకరకాయలన్న అత్యంత ప్రీతి అట. ఇది తెలిసిన వంట మనిషి ఆచార్యుల మెప్పు పొందుటకుగాను, ఒక తోటకు వెళ్ళి, ఆతోటలోని కాకరకాయలను తెంపుకొని, తోటమాలికి కబురు కూడ చేయకుండా తెచ్చి చక్కగావండి, ఆచార్యులకు వడ్డించాడు. ఆచార్యుల వారు తిని "చాలా రుచిగా చేశావు, మరి ఈ కాకరలు ఎక్కడ తెచ్చితివి" అని అడిగిన, వంట మనిషి మీకిష్టమని మంచి ధర చెల్లించి తెచ్చితినని సమాధానమిచ్చినాడు. అది అట్లు జరుగగా -

శ్రీరామానుజాచార్యుల వారు మామూలుగ శిష్యులకు బోధించడంలో అసంబద్ధముగా పాఠము చెప్పుట ప్రారంభించెను శిష్యులలో నొక ముఖ్య శిష్యుడది గ్రహించి, ఏదోనెపముతో ఆపాఠమును నిలిపెను. గురువుయిట్లు పంథా తప్పి బోధించుటకు కారణం ఏమైయుండునా యని, ఆనాటి భోజన ప్రక్రియలో వండిన వంటకం ఏమిటని ప్రశ్నించెను. వంటమనిషి ఉన్నసత్యమును తెలుపగా, ఆ దోషపు తిండితోనే ఈనాడు ఆచార్యులు అసంబద్ధముగా పాఠము ప్రారంభించినారని గ్రహించి, దొంగిలించిన కాకరకాయల ప్రభావమని తెలిసి, ఇకముందు ఇట్టి దోష పూరిత ఆహారం వండవద్దని, ఆ వంటమనిషికి శిష్యుడు నిర్దిష్టమైన ఆజ్ఞయిచ్చినాడట.

**అనగా, ఎవరైనను** సేవించు ఆహారపానీయముల ప్రభావము కూడచోటు **చేసుకొనునని గ్రహించవలెను** ముఖ్యముగా సర్వులకు (సమాజమునకు) మార్గదర్శకులుగా చలామణి అగు ఉపాధ్యాయులు గ్రహించ వలసినది ఇదే. అటులే -

శిష్యులు గురువును అర్చించి అభీష్టములను బడసి, అర్థకామములను నిరసించి స్వధర్మనిష్ఠచే అంతరంగ శుద్ధి వడసి మోక్షమేకోరి, ఉదాసీనుడైన గురువును గురుభావము గానే నెంచి, ఆత్మ తృప్తిచే బంధ విముక్తులైన శిష్యులు ఉదాసీనులయ్యెదరు.

అట్టి ఉదాసీన స్థితిలో శిష్యులకు శిష్య భావమును లేదు. లేకున్నను గురువు నందు గురుత్వము లేకుండబోదు, నదులన్నీ సముద్రములో పడగానే, ఆనదులకు

నదులన్నపేరు పోయి సముద్రత్వము సిద్ధించును. అట్లుగాక, నదీత్వం సిద్ధించదు. నదులకు నాయకుడన్న పేరే నిలుచును సముద్రమునకు. అటులే శిష్యులకు జ్ఞాన లాభముచే శిష్యత్వం పోయి గురుత్వం వచ్చినను, గురువుల యందున్న గురూత్వం ఎన్నటికిని పోదన్నమాట, ఈ క్రింది ప్రమాణంతో -

"శిష్యహానిః ప్రభో దేస్యాత్ గురుత్వంనైవ హీయతే"

★★★

## గురు - సూత్రములు

"నాస్తి తత్త్వం గురోఃఫరమ్"

గురువును మించిన తత్త్వము లేదు. - (సూత ఉవాచ)

★★★

గురువునకు నమస్కరించునపుడు, తన కుడి హస్తముతో కుడిపాదమును, ఎడమ హస్తముతో ఎడమ పాదములను స్పృశించి, మోకాళ్లు వంచి, వక్షస్థలమును, ముఖమును భూమికి తగులునటుల సాగిలబడి, మోకాలు మొదలు పాదాంతము వరకును స్పృశించి నమస్కరించవలెను.

★★★

"విద్యాదానం చోత్తమోత్తమమ్ సర్వేషామపి విశిష్యతే"

★★★

"విద్యాదానేన సాయుజ్యం విష్ణోర్యాతి నృపోత్తమ!"

విద్యాదానముతో విష్ణులోక ప్రాప్తి యుండునని.

★★★

తదా భగవత్కథా శ్రవణా ధ్యానాదౌ శ్రద్ధాజాయతే. అప్పుడు భగవత్కథా శ్రవణధ్యానాదుల యందు శ్రద్ధ కలుగును.

★★★

ఆదిత్య స్వరూపుడు ఆచార్యుడు.

★★★

"ఆచార్యః ప్లావితా" - ఆచార్యుడు తరింపజేయువాడు.

# 16. సద్గురువుల సాహచర్యం (ఉపదేశం)

ఆశ్రమం (తరగతి)లో నున్న శిష్యులందరిలో కొందరే గురూపదేశానికర్హులై పోగా, కొందరు ఆ గురూపదేశం వంటబట్టక అర్హులు కాలేక పోవడం సహజమే.

శ్లో॥ గురూపదేశేషు సదాధికార వంతో యద్వైవ శ్వసనే సమస్తాః ।
ఉచ్చైర్గతిం తత్రభజంతికేచిత్ ఘనాః పరార్థ ప్రవణాఇవాభ్రే ॥

వీల్చే గాలిపై అందరికి అధికారం ఉన్నట్లే- గురూపదేశం నొందే అధికారం అందరికీ ఉంది. అయితే గురూపదేశంలో గూడా పరోపకారరతులైన ఘనులు కొందరు మాత్రమే ఉన్నత స్థితికి చేరగలరు.

గురువు శిష్యులకు పరీక్షలు నిర్వహించడమనేది శిష్యులను గుర్తించడానికై. చివరి దెబ్బలాంటివి. తుదకు గ్రహించినదేమిటి? గురువు తన దగ్గరకి వచ్చిన శిష్యులందరికీ విశాలమైన హృదయంతో, అపారమైన ప్రేమతో అసలు తత్వాన్ని భిన్నభిన్న మార్గాలలో నుపదేసిస్తున్నాడు. ఆ ఉపదేశంతో పరోపకార నిరతులైన ఘనులు కొందరు ఉన్నత మేఘాలవలె పైపైకి అనగా ఉన్నత స్థితికి చేరుకొంటారు.

శ్లో॥ శృత్యాచార్య ప్రసాదేన యోగాభ్యాసవశేనచ ।
ఈశ్వరానుగ్రహేణాపి స్వాత్మబోధోయదా భవేత్ ॥

పరిశుద్ధజ్ఞానమనేటటువంటి ఆత్మజ్ఞాన మెప్పుడు కలుగుతుందయ్యా-అంటే,

వేదోక్తమైన తత్త్వజ్ఞానాన్ని ప్రసాదించే గురువుగారి ప్రసాదం ప్రదమం కలగాలి. ఆ తరువాత ఆ గురువుగారి ప్రసాదం (అనుగ్రహం)తో సిద్ధించటంవంటి జ్ఞానాన్నే నిరంతరమైన "నిధి" ధ్యానస్వరూపమైన యోగాభ్యాసంతో దాన్ని సాధించాలి

"గురువనుగ్రహం, యోగానుగ్రహం"- ఈ రెండుతో "ఈశ్వరానుగ్రహం" వుండాలి. ఈ మూడింటితో నీ అజ్ఞాన మనేటటువంటి నిద్ర (తమస్సు)తొలగిపోతోంది.

కావున గుర్వనుగ్రహం ప్రథమం కావాలి. అటుపిదప పరిపూర్ణమైన యోగ విద్యకి "దివ్యశక్తి-నిధి" అయిన సద్గురువు అవసరము. సద్గురువుని అనుసరించుటమనేది మనపరంపర సదాచారమే- అదియే శ్రీరామరక్ష.

"సత్యాన్వేషకుడు" తన సద్గురువుని విశ్వజనీనమైన సత్యతత్వానికి సమర్థుడైన "ప్రతినిధి"గా భావించాలి.

సామాన్యుడట్టి సద్గురువును నొక సామాన్యునిగానే భావిస్తాడు సద్గురువు కేవలం

తన యునికి వలననే మన మనస్సుని ఉన్నతగతికి పురోగమింప జేయగల అప్రమేయుడతడే. సర్వతంత్ర స్వతంత్రుడు. వాస్తవానికి భౌతికమైన, మానసికమైన, ఆధ్యాత్మికమైన అన్ని స్థాయిలలో సద్గురువు పరిపూర్ణుడు. తనకన్నిరకాలైన మానవాతీత దివ్య శక్తులున్నా, సద్గురువు మామూలు మానవుని వలెనే ప్రవర్తించుచున్నారు, తనను శరణు పొందిన వారికి తన దివ్య ఆధ్యాత్మిక మార్గదర్శగమ్యమువైపు మళ్లించి వారికి నుత్తేజాన్ని యనుగ్రహించే కరుణామూర్తి సద్గురువు.

అట్టి సద్గురువు శిష్యుల లౌకిక భావనను ఆధ్యాత్మిక సాధనవైపు త్రిప్పి, వారి పురోగతిని త్వరితం చేస్తూ, హృదయపరివర్తన గావిస్తూ సన్మార్గంలో నడిపించే సమర్థుడు సద్గురువు.

దివ్యత్వమే సద్గురువు యొక్క సహజస్థితి. హితులైన యోగ శక్తులకతడు పుట్టినిల్లు. వారిపూర్వ జన్మల, ప్రస్తుత జన్మల, ఇక రాబోయేజన్మల కర్మలను గుర్తించే త్రికాలజ్ఞుడు. హితమైనది తగినట్లుగా బోధించే సమయజ్ఞుడు. తన త్రికాలజ్ఞతను ఆధ్యాత్మిక వైద్యునిగా శిష్యుల మనస్తత్వాలను సమతుల్యంగా మారుస్తూ, వారిని యోగసాధనా మార్గంలో నియోగిస్తాడు. రోగనివారణమెట్లు వైద్యుడు గుర్తిస్తాడో, అటుల భక్త శిష్యుల కర్మలను ఆధ్యాత్మికం వైపు పురోగమింపజేస్తూ శాశ్వతారోగ్యసుఖ సౌభాగ్యాలను కలుగజేస్తాడు సద్గురువు.

శిష్యుల ఆత్మజ్ఞానం పెంపొందింపజేయు వారిలో మంచి చెడుల విచక్షణ, మంచి ఆరోగ్యం, మానసికస్థిరత, ఆత్మవివేకం కలుగజేస్తాడు సద్గురువు.

'సద్గురువుల పరంపరను అనుసరించుటనేది పూర్వం నుండి కొనసాగుతున్న సదాచారమే.

శ్రీ విష్ణుంశీ అవతారుడైన శ్రీరాముడు శ్రీదత్తాత్రేయుని, కులగురువైన శ్రీవశిష్ఠమహర్షిని, గురువులుగా సేవించి తరించెను.

అటులనే శ్రీకృష్ణుడును సాందీపమహర్షిని గురువుగా సేవించెను. అట్టి మహనీయులే గురువులను సేవించి తమ జీవితములను ధన్యత గావించుకొనిరి.

ఇక ఆధునిక యుగంలో వెలసిన శ్రీరామకృష్ణపరమహంసను వివేకానందుడు సద్గురువుగానెంచి సేవించి తరించెను.

శ్రీ షిర్డిసాయిబాబా, శ్రీసత్యసాయిబాబాలను నెందరో మహనీయులు సద్గురువులుగా భావించి సేవించి తరించుచున్నారు.

శ్రీ రమణమహర్షి, శ్రీ కంచికామకోటి పరమాచార్యులు శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వాములవంటి సద్గురువులను, శ్రీశ్రీశ్రీ శృంగేరి శారదాపీఠాధిపతి ఆది శంకరాచార్యుల భగవత్పాదస్వామి యొక్క పరంపర పీఠాధిపతులైన శ్రీశ్రీ సచ్చిదానంద శివాభినవ నరసింహభారతీస్వామీ, శ్రీశ్రీ అభినవ విద్యాతీర్ధ మహాస్వామీ, శ్రీశ్రీ చంద్రశేఖర భారతీమహాస్వామీ, శ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామీల వంటి మహా సత్పురుషులను గురుపరంపరగా నెంచి సేవించి తరించుచున్నారు(ము) మనము.

ఆ శృంగేరి పీఠాన్ని శాశ్వతంగా నిలిపిన శ్రీశ్రీ విద్యారణ్యులస్వామివారిని సద్గురువుగానెంచి సేవించి తరించిన మహాత్ముల్ని గురించి విన్నాము. వీరంతా మహాత్ముని ప్రతినిధులే. ప్రస్తుతం భౌతిక రూపాల్లో మన మధ్యలో వారు లేకున్ననూ, వారి ఆశీస్సుల ప్రభావితులమైయుండి వారి సన్మార్గ దర్శకులమై యుండుటనేది, వారి కరుణాకటాక్ష వీక్షణాల చలవయే యనేది మనం మరువరానిది.

మనం భక్తి నియమానుసారంగా నుండినచో మన కష్టకాలంలో వారే (మహాత్ములు) ప్రత్యక్షమై సద్గురువులుగా సన్మార్గదర్శకులుగా శాశ్వత బ్రహ్మానందంలో నోలలాడించెదరు. వారి కృపతో దివ్యశక్తి మనలో నాటుకొని నిక్షిప్తంగా గల నిగూఢ శక్తులను జాగృతం చేస్తుంది. దానితో మనలో ఆత్మనిగ్రహం, ఏకాగ్రత, మనశ్శాంతి, మానసిక వికాసం, మనశ్శుద్ధి యేర్పడి సద్గురువుల సహవాస సంపదలకు నిలయులమై వారి చరణాన్ని ఆశ్రయించి గురు మార్గాన్ననుసరించుటతో ధన్యులమవుతాము.

ఎందుకనగా! "శ్రీగురుశ్శివ ఏవసః"-అంటే గురువు శివుడే కదా! ఇట్లు కల్పాంతం దాకా జగద్గురు శ్రీశంకరులబోధలు ప్రపంచమునకు తలమానికములై ధర్మవృద్ధిని కావిస్తూనే వుంటాయి.

పూర్ణ అంతఃకరణంగల గురువు వెలుగు (కాంతి) శుద్ధ స్ఫటికము వలె ప్రతిబింబిస్తుంది. అందుకనే గురువును చూడగనే యెవరికైనను మనస్సు స్పందిస్తుంది. మన అంతరంగాన్ని "గురువు" అనే తాళపుచెవి (Key)తో తెరవాలి. ఆ తాళపుచెవి హృదయ కవాటంలో దాచుకోవాలి. ఇందులకై సద్గురువు కృప కటాక్షవీక్షణములు ప్రసరించ ప్రయత్నించవలెను.

అందులకై ముందుగా నీలో యున్నది (అహం సర్వం) తొలగించుకొని, నాకేమి తెలియదన్నభావముతో, నిర్మలమన హృదయంతో గురువును నాశ్రయించినపుడే. "గురు" (గురువు) అనుగ్రహం లభిస్తుంది.

గురువు ముందు, శిష్యుడు తలవొగ్గినప్పుడు, గురువుదృష్టి శిష్యుని బ్రహ్మరంధ్రాన్ని చూచినపుడే గుర్వనుగ్రహాన్ని శిష్యుడు పొందగలడు.

జ్ఞానాగ్నితో వెలిగే "సద్గురువు"-అనే అగ్ని శిష్యునిలోని దుర్వ్యసనాలను, దుర్వాసనలను దహించి వేస్తుంది.

గురువు శిష్యునకు ఆధ్యాత్మిక విద్యయైనను, మరే విద్య (సంగీతాది) సాధనమొనర్చుటలో గురువును శిష్యుడనుసరించుటలోనే శిష్యరికం అనబడును. అనగా గుర్వాదేశానుసారం నడుచుకొనిన, గురువును శిష్యుని సాధించటంలో తానుండు (బ్రహ్మ)స్థితిలోకి గైకొనిపోయినచో అదియే గురువు శిష్యుని కిచ్చు అభయహస్తము.

అయితే, గురువునకు సాధకుని జపమంత్రోపదేశమును చేసిన నది యా జపమున కధికారి. ఏశిష్యుడు యోగ్యుడని తలుస్తాడో అతనికి తగు యుపదేశం చేస్తాడు. గురువునకు శిష్యుల పట్ల నిరంతరం సద్భావనయే యుంటుంది. అందులకా శిష్యులు తమ చిత్తములో శుద్ధత్వము, ధైర్యమును ధారణ కలిగియుండమత్యంతా వశ్యకము.

గురువు "ఈశ్వరరూపుడ"ని చెప్పుకొన్నాము. అట్టి ఆంతరంగిక గురువు యొక్క శరణ్యమే వాస్తవిక గురువుయొక్క శరణము. ఈశ్వరుడే గురువులలో గురుత్వముగా నుత్పన్నమై యుండడముతో, ఆలాంటి గురువును అభిముఖముగా నుంచుకొని, అతనినే శరణువేడి కృపను, ఆత్మతత్త్వమును పొందవచ్చును.

శాస్త్రాలలో - "గురువు" సాక్షాత్తు శంకరుడని చెప్పబడింది - ఆ గురువులో శంకరుని దర్శించగలిగే మానసికస్థితి జీవుని (శిష్యుని)లో కలగాలి. గురువు సర్వగుణ సంపన్నుడు కదా! అతడు భౌతికంగా ముందున్నను, ఆధ్యాత్మికంగా అంతర్దృష్టి శిష్యునిపై నుండునని భావము. శిష్యునకు ఆధ్యాత్మిక తపన గలవానికి, గురువుపట్ల తపన గౌరవం వుంటుంది. నిజముగా ఆధ్యాత్మిక తపన గల శిష్యునకు తాను పొందిన గురువుపట్ల విశ్వాసం కలిగియుండిన, తనకెందుకు గురువు అవసరమో తనకు గల అభిలాష సద్గురువు తీర్చును. సందేహము లేదు. అప్పుడా శిష్యునకు ఆర్తిని బట్టి సత్పురుషుల లాంటి గురువు తారసపడును. వారి దర్శన భాగ్యంతోనే శిష్యునిలోని మనోరథం కొంత తీరినట్లే! అట్టి గురుస్థానాన్ని 'గురు'స్థానంగా శిష్యుడు తీర్మానించుకోవాలి.

అందులకై శిష్యునిలో అల్పత్వం యుండకూడదు. 'గురు'భావంతో నుండిననే కరుణాసముద్రం లాంటి గురువు యొక్క కరుణకు పాత్రుడౌతాడు. గురువెప్పుడు తన అర్హతను ప్రకటించుకోడు. శిష్యునిలోని ఆర్తి, తపనను బట్టియే గురువు తగు బోధన చేయగలడు. "ఇతడు నాగురువు" అని 'గురు' భావనగా గుర్తించినపుడే అట్టి సద్బోధనవంటబట్టును- ఉదాహరణముగా "శ్రీకృష్ణభగద్గీతయే" తార్కాణము.

గురువును సాధారణంగా గుర్తించిపుడు శిష్యత్వం వచ్చిపడదుకూడ-గురు సన్నిధిలో నుండి, గురువును భగవత్స్వరూపంగా తలంచిననే శిష్యత్వం పరిపాకం చెందదు. గురువంటే

ఎవరు? శిష్యుడికి సద్బోధచేసేవాడు. శిష్యుడంటే ఎవరు? గురువు వద్ద బోధన పొందేవాడు ఈ రెండును పరస్పరావగాహనపై నాధారపడి వుంటుంది. గురువనగా ఆధ్యాత్మిక జ్ఞాన సిద్ధిని పొందిన గురువు. అట్టి గురువునకు శిష్యులున్నా ఒకటే లేకపోయినను నొకటే. అతనికెట్టి కొరతయుండదు.

గురువుగారిని, "గురువుగారూ!" అని సంబోధించడంలోనే శిష్యుని అణుకువ, మన్నన తేటతెల్లమౌతుంది. "నేను నీపరిపూర్ణ శిష్యుడను" - అని త్రికరణ శుద్ధిగా విశ్వసించిననే శిష్యత్వమనిపించుకొనును. అంతలోనే శిష్యుడౌతాడని కూడా చెప్పలేము. నేను శిష్యుడను, ఎలా కాకుండాపోతాను? అని అహంకరించిన, అతనిలో ఆత్మవిశ్వాసం లేదనే భావన శిష్యధర్మాలను పొందియుండాలి.

"తవశిష్యోఽహమిత్యుక్తేర్నతే సిద్ధ్యతి శిష్యతా"

"నేను నీ శిష్యుడను" అని చెప్పినంత మాత్రాన శిష్యపదవి రాదు. రావాలంటే ఏం చేయాలి?

శిష్యుడిగా పనికొస్తాడా లేదా, అనేది గురువు స్వంత నిర్ణయంపై, సంతృప్తిపై, అనుగ్రహంతో శిష్యత్వం పొందుతాడు. కాని, శిష్యుని ఘనకార్యంతో శిష్యపదవి గురువివ్వడు. శిష్యత్వమునకై గురువును ప్రార్ధన చేయుటననుది శిష్యుని ప్రధమ కర్తవ్యమైయున్నది. అదియును మనస్ఫూర్తిగా నుండవలెను. అది శిష్యునిపై నాధారపడియుండును.

గురువునుండి ఆధ్యాత్మికోపాసన కానీ, మంత్రోపాసన పొందేవాడి ఉపాసనత్వము అతని దాస్యభక్తిపై గురువు శిష్యుని ఉపాసనామార్గంలో పెట్టాలో, లేక సేవారూపమైన భక్తి మార్గంలో పెట్టాలో నిర్ణయించుకొని శిష్యత్వమిస్తాడు. అనగా పరోక్షంగా శిష్యుడు తన అర్హతను పెంచుకొనే మార్గం కొంత సునాయాస మవుతుంది. తాను పొందు యుపాసనకు వెనుక ప్రత్యక్షంగా కాకున్నను, పరోక్షంగా గురుద్యాసభక్తి, నామసంకీర్తన అనగా గురువుదైవ స్వరూపునిగా నెంచి, సహజమైనప్రీతి, వాటిని ఆచరంచె ఆసక్తిని గురువుగ్రహించినచోనిక "శిష్యత్వం" అనేదపదవి పొందినట్లే యగును. దానితో గురువు యొక్క ఆధ్యాత్మికోపాసనగానీ, మంత్రోపాసనగానీ కొంత పొందినట్లే యగును. అనగా గుర్వనుగ్రహంతో పరోక్షంగా పొందినవాడై, యిక ప్రత్యక్షంగా సాధనకై మార్గం సుగమమై, పరిపూర్ణ శిష్యత్వము పొందినవాడై, అట్టి సద్గురువు కృపవల్ల ఉత్తమ శిష్యుడనిపించుకొనునని, ఇతడే గురుబోధన పొందు శిష్యుడుగా సార్ధకనామము పొందగలడు.

తత్త్వజ్ఞానార్జనకు "సద్గురుబోధ" శ్రవణం. శ్రవణంతోబాటు మననం, ఆ మననంను భావవిస్తరణతో మోహనాశనం పొంది, నిశ్చలత్వం కల్గియుండిన శిష్యునిలో మనస్సు ప్రశాంతత పొందును. అందులకై, పదేపదే గురు దర్శనం చేయమని శాస్త్రవచనం.

దానితో జ్ఞానోదయం, సమన్వయం పొందుటగును. ఆ గురుసేవలో గురువే సర్వంగా త్రిమూర్తి స్వరూపుడుగా (సృష్టి, స్థితి, లయ కారుడుగా) గ్రహించినచో "సచ్చిదానంద తత్త్వస్వరూప శక్తి"ని పొందును. అట్టి శిష్యుడని మల్లెపూవురేకుని సూదితో చీల్చినంత సులభంగా శాస్త్రజ్ఞానం తెలియపరచి యుద్ధరిస్తాడు సద్గురువు.

ఆ సద్గురువు దర్శనమునకై ముందుగా శిష్యునిలో తాననే అహంకారం వదిలి, చిత్తశుద్ధి, భక్తితత్త్వం అలవడియుండాలి. విశ్వాసంతో "గురువును, దేవుడిని" అభేద బుద్ధితో చూడటం నేర్చుకోవాలి. అపుడా శివుని కృపగా గురుకృపకు పాత్రుడౌతాడు శిష్యుడు. కృపతో శిష్యవాత్సల్యం ప్రసరించి, అఖండ శివశక్తి స్వరూపం పొందినచో గురుశిష్యులకు భేదం యుండదు. శిష్యుడును "శివోఽహం"గా తలపించును. అందులకా సద్గురువు సాక్షీస్వరూపుడు - గురుపాదయుగళమే జ్ఞానభిక్ష. భగవంతుడిని దర్శింపచేసేవాడే సద్గురువు. ఆధ్యాత్మికరంగంలో తల్లిదండ్రుల స్థానం గురువుది. గురువు క్రొత్త సందేహాలను తీర్చడమే కాక, క్రొత్త సందేహాలను పుట్టిస్తారు కూడ. అలాగురువు యొక్క శిక్షణలో శిష్యుడి మనస్సు వికాసం పొందుతున్నకొద్దీ, తన సందేహాలకు తానే సమాధానం అన్వేషించుకొనేస్థితి శిష్యునికి వస్తుంది. అందులకై గురువులు సందేహాలు తీరుస్తారు.

సద్గురువుల శుశ్రూషతో సంపూర్ణ వేదాధ్యయనం అలవడును. ఆ వేదాధ్యయనంతో సంపూర్ణప్రజ్ఞకలవారై నిస్సందేహులై, సద్గురువుల ఆజ్ఞతో చక్కగా గృహస్థాశ్రమము స్వీకరించి, అధ్యయన సంపన్నులగు సంతానవంతులై, తదుపరి తగుశిష్యులను బడసి, శాస్త్రవిహితమగు సత్కర్మలనుజేసి, దేశకాల ప్రవృత్తి ననుసరించి, అహింసావ్రతులై యావజ్జీవితమును సజీవ యాత్రసాగించు మానవుడు బ్రహ్మలోకమును పొందును.

అతని జన్మ నిరంతరం రాహిత్యమగును - (ఛందో:ఉ.8-15 ఖండః)

సద్గురువు తత్త్వమస్యాది మహావాక్యాలను అర్థవిమర్శనగా బోధించునపుడు, సాధకుడు శ్రవణ, మనన, నిధి, ధ్యాస, ధారణాదులతోనుపదేశాన్ని మనస్సునకు బాగా పట్టించుకోవాలి శిష్యుడు. అందులకు మనస్సును బాగా నిగ్రహించుకోవాలి. గురుపాదయుగళమే జ్ఞానభిక్ష-సద్గురువు సన్నిధానములో నెలామెలగాలో గురుభక్తి ఏలాంటిదో శ్రీగురుదత్త శిష్యుడైన కార్యవీర్యుడి ద్వారా నేర్చుకోవచ్చు. సద్గురు కృపతో అనేక విషయాలు (రహస్యాలు) తెలుస్తాయి. దత్తాత్రేయుడు సద్గురువు. గురుసాంప్రదాయాలలో సత్ప్రవర్తకుడు-యోగానికి యేకైకాచార్యుడును - సమదర్శియును - గురువులలో యిష్టదైవస్వరూపుడును - బ్రహ్మ సాక్షాత్ శ్రీ గురుదత్తాత్రేయ ప్రసాదం (అనుగ్రహం)తోనే మరల వేదాలను దక్కించుకొని సద్గురువుగా పెంచుకొన్నాడు. అదియే వేదాల మరుపుతో మరల వేదజ్ఞానం కల్గించాడు శ్రీ గురుదత్తాత్రేయస్వామి బ్రహ్మకు.

## సద్గురు లక్షణములు - (దేవీ భాగవతములో)

శ్లో॥ "సుందరః సుముఖః స్వచ్ఛశ్శుచిశ్చ బహు తంత్రవిత్ ।
అసంశయ స్సంశయచ్ఛిన్నిరపేక్షో గురుర్మతః ॥"

## శిష్యలక్షణములు -

శ్లో॥ "చతుర్భిరాద్యైః సంయుక్తః శ్రద్ధావాన్ సుస్థిరాశయః ।
ఆస్తికో దృఢ భక్తిశ్చ గురౌ మంత్రేచ దైవతే ॥"
ఏవం విధో భవేచ్ఛిష్యః ఇతరోవ్యాధి కృద్గురోః ॥

కావున యిట్టి శిష్యుడు (సచ్ఛిష్యుడు) సద్గురువును నాశ్రయించి, శుశ్రూషచేసి, గుర్వనుగ్రహమున బ్రహ్మనిష్ఠతో అద్వైత సిద్ధిని పొందదగునని శిష్టాచార్యులు, బోధించియున్నారు-

ఉత్తముడైన సద్గురువు ఒకప్పుడు తన శిష్యునిలోని నొకానొక దోషాన్ని పట్టించుకోకుండా వదిలేస్తాడు. ఎందుకంటె, తాను యీ శిష్యునిలో నేరకమైన సాధనను ప్రవేశపెట్టాడో, దానికీ ప్రత్యేక దుర్గుణం భంగకరం అవునో, కాదో ఆయన కొక్కడికే తెలుసు. ఆయన వొకానొక శిష్యుడిలో నొకానొక దుర్గుణాన్ని యుపేక్షించి వదలివేసినంతమాత్రాన ఆయన దాన్ని సద్గుణంగా భావిస్తున్నాడని మనం అనుకోరాదు కొబ్బరితోటరైతు, పోకచెట్టును గుర్తించలేదనుకోరాదు

సద్గురువు, యొక శిష్యుడియొక్క హృదయమనే క్షేత్రంలో తాను నిక్షేపించిన ప్రధాన సాధన మార్గాన్నిబట్టి, ఆ మార్గానికి విరోధులైన దుర్గుణాలను పీకి పారేస్తాడు తక్కిన వాటినలాగే వదిలేస్తాడు అహంకారం యింతదుర్గుణాలన్నిటికీ మూలబీజం కనుక నట్టి మూలబీజమును సద్గురువు ఉపేక్షించడు. అనగా దాన్ని తొలగించుటకు వెనుకాడడు

సద్గురువు శిష్యుని హృదయ క్షేత్రంలో మొలచియున్న బీజములను గుర్తించి, కలుపుమొక్కయేదో, పనికి వచ్చుమొక్కయేదో నిర్ణయించే సామర్థ్యం ఆయనకే తెలుసు. అందుకే "సద్గురువు" పండించే రైతువంటివాడు"- కావున, అతని సారధ్యంలో నున్న శిష్యుడు తన హృదయక్షేత్రంలోని కలుపుమొక్కలకిక తావు లేదని గ్రహించాలి. అదియును సచ్ఛీలవంతుడైన శిష్యునికే సాధ్యమగును- ఎందుకనగా తనలో నున్న అహంకారాన్ని గుర్తించిన కారణాన, అట్టి అహంకారం సద్గురువు సాంగత్యంతో రూపుమాసినదని, తానిక సుక్షేత్ర పంటనందుకోగలననే గ్రహించగలడు.

అందులకీ సూక్తిని పెద్దలందించారు

శ్లో॥ యత్ స్వీకార్యం శిష్యాత్, నిరేత్తవ్యం హి భవతి దుర్గుణా ।
క్షేత్రే విజాతి వృక్షం, కర్షక వర ఏవవేత్తినహిధేనుః ॥

భా: శిష్యుని నుండీ గైకొనవలసిందేదో (తొలగించవలసినదేదో) సద్గురువుకే సాధ్యం. ఆయనే నిర్ణయించాలి. (శిష్యుడు కాదు.) పొలములోనున్న కలుపుమొక్కయేదో రైతుకే తెలుస్తుంది. మేసే గోవుకు కాదు. కావుననతడు "కర్షక వరః" అని-"స్వీకరించడం"లోని అర్థం స్వంతం చేసుకోవడమనికాదు.

వైదిక సాహిత్యజ్ఞానార్థమై శిష్యుడు - గురువునిట్లు చేరాలి అని, "మాండూక్యోపనిషత్" చెబుతూంది.

"తద్విజ్ఞానార్థం సగురుమేవాభిగచ్ఛేత్
సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మం నిష్ఠమ్" -(1.1.12)

అటు భగవద్గీత (4.34శ్లో:)లో గురువును ఆశ్రయించడం,

శ్లో॥ తద్ విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।
ఉపదేక్ష్యంతి తేజ్ఞానం జ్ఞాని నస్తత్త్వదర్శినః ॥"

ఆధ్యాత్మిక గురువును ఆశ్రయించి తత్త్వజ్ఞానం పొందదానికి ప్రయత్నించడంలో వినయంతోచేరి, పరిచర్యలొనర్చిన, తత్త్వజ్ఞానాన్ని ఉపదేశించగలడు. అతడు (గురువు) స్వయం ఆత్మ సంస్కారంతో పరమార్థాన్ని దర్శించిన వాడు గనుక.

శ్రీ జగద్గురు శంకరాచార్యులు "వివేకచూడామణి"-లో సద్గురువుల లక్షణాలను నిలాచెప్తున్నాడు.

సద్గురువు వేదసారమెరింగిన వాడైయుండాలి. సకలపాప విముక్తుడై, నిష్కళంకుడై, కామరహితుడై, ఉత్తమబ్రహ్మవేత్తమై, సదా బ్రహ్మమునందే ధ్యానిమగ్నుడై, శాంతస్వభావుడై యుండాలి. వందనీయుడు కాబట్టి, తనకు నమస్కరించే శిష్యుల (భక్తుల) యెడల బంధువుగా వర్తించాలి. వారి నుండి యేలాంటి ప్రతిఫలమపేక్షించక సదా దయా, కరుణా సముద్రుడై, బృహద్భావుకుడుగా, ఆధ్యాత్మచింతనుడైన వారే సద్గురువుగా నెంచబడుదురు.

అట్టి సద్గురువును శిష్యులు వెతుక్కుంటూ వచ్చిచేరతారు. నిష్కళంకభక్తితో, వినయ విశ్వాసములతో నమస్కరిస్తారు.

ఉపాధి (శరీరపోషణ) యున్నంతవరకు సద్గురువునకు శుశ్రూష చేయుచుండవలెను. గురువు గృహస్థుడైనచో గురువును సేవించిన విధముగా గురుపత్నికిగూడ, గురు పుత్రులను సేవించవలెను.

సద్గురువు యొక్క కరుణలేనిచో విషయములను త్యాగము చేయుట దుర్లభము. తత్త్వదర్శనము, సహజావస్థయును దుర్లభము. అందులకు సద్గురువు మొట్టమొదట శమదమాది సద్గుణములతో తన శిష్యుని పరిశుద్ధునిగా నొనర్చవలెను.

గురువు ప్రాణాయామ (వాయు) జయము పొందినవాడై యుండవలెను. అట్టి గురువు శిష్యులచే సేవింపబడువాడగును. గురువాక్యము వలన సుషుమ్నయందు "సోఽహం, సోఽహం" అను జపము సిద్ధించును. అట్టి గురూపదేశ మార్గమున పయనించిన శిష్యుడు గురువుగానే ప్రకాశితుడగును.

ఎవనియందు దేవునియందు వలెనే, గురువునందును భక్తికలదో అతడు సర్వశక్తి సమన్వితుడగును.

"గురోర్వాక్యసమం భిన్నేబ్రహ్మజ్ఞానం ప్రకాశతే"

గురువాక్యము సమముగా భిన్నమైన బ్రహ్మజ్ఞానము ప్రకాశించును. గురువును కర్ణధారునిగా (చుక్కాని పట్టువాడుగా) పొంది ఆ గురు వాక్యమును తెప్పగాను దృఢముగా పొందవలెను. శుశ్రూషలతో గురువును ప్రసన్నుని చేసుకొని పరబ్రహ్మ తత్త్వవిషయమును అడిగి తెలుసుకోవలెను "అన్యధాశరణం నాస్తి"- త్వమేవశరణం మమ"- అని జొచ్చిమృతత్వమునుండి అమృతత్వం పొందాలి. నిజమైన జిజ్ఞాసువుతో, అనన్యశ్రద్ధాభక్తులతో మెలగుచూ, గురువులో దాగియున్న బ్రహ్మతత్త్వం ఆ స్వాదించి, బ్రహ్మానంద పునీతుడై, 'గురు' వాక్యపరిపాలకుడై మెలగుచుండవలెను.

ఈ సద్గురువులకు తమశిష్యులలో నున్న ప్రతిదుర్గుణాన్ని పోగొట్టి, స్వార్థాన్నీ, అహంకారాన్ని రూపుమాపాలి.

బాధ్యతగల గురువులకై పెద్దలు యీ సూక్తి అందించారు.

శ్లో॥ మృదుత్వదానై స్స్వార్థ్యముఖాన్ స్వశిష్యే,
దాతుం గురుస్తద్విపరీతమేతి।
స్తనందయ వ్యాధి నివారణాయ
మాతాపిబేత్ తిక్తరసం స్వయంహి ॥

భా: మృదుత్వము, నిస్వార్థత వంటి సద్గుణాలను శిష్యులలో కలిగించేందుకే, ఒకప్పుడు సద్గురువు వాటికి భిన్నమైన కఠినత్వ, స్వార్థపరత్వాది దుర్గుణాలను తాను పొందుతూంటాడు. చనుబాలు త్రాగే చంటివాడికి వ్యాధి తగ్గటం కోసం ఒక్కొక్కసారి తల్లితనే స్వయంగా చేదుమందు త్రాగుతుంది కదా!

సద్గురువు శిష్యుడిలోనున్న దుర్గుణాలు రూపుమాపి సద్గుణాల బీజములను నాటు

అభ్యాసం కల్గియుండాలి. దావాగ్నిలో అలమటించు జీవులను, శీతలరజనీ కిరణాలతో పరితాపాన్ని పోగొట్టునట్లు, శిష్యులలోనున్న దీనాలాపనలను దయామయుడైన గురువు అభయదానమిచ్చి ధైర్యం చేకూర్చాలి. అతనిలోని ఆర్తిని కనిపెట్టి పరబ్రహ్మోపదేశం చేయాలి-

"జ్ఞానాదేవతుకైవల్యం"- అంటుంది గీత. ఇదియే వేదాంతార్థ విచారణకే ప్రాముఖ్యం యిచ్చినట్లు - అనగా ఉపనిషత్తుల ప్రతిపాదించిన స్వానుభవ బ్రహ్మవిజ్ఞానం వల్లనే భవసాగర దుఃఖం, హృదయతాపం నశిస్తుందని శ్రీశంకరుల నిశ్చితాభిప్రాయం.

"శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరస్యం యతేంద్రయః" - శ్రద్ధ యెక్కువైతే అంతగా ముక్తికి చేరువౌతాడు సాధకుడు- అని గీత ఉద్బోధించెను. శిష్యుడు నిజముగా పరమాత్మ స్వరూపుడే- కానీ, అజ్ఞానంతో అనాత్మవస్తువిషయాలకు దాసుడైన కారణాన, సద్గురువును చేరినంతలో ఆత్మానాత్మ విచారణతో విజ్ఞానవంతుడై, స్వయంగా ప్రకాశమానబద్ధముక్త స్వరూపుడై పరమాత్మ అంశగా ఆత్మజ్ఞానుడైతాడు. అఖండ జ్ఞాన దీప్తుడై వెలుగొందుతాడు. సద్గురువు దృష్టిలో ధన్యుడై, పూర్వపాప దోషరహితుడై జన్మరాహిత్యుడౌతాడు.

## ప్రబోధితమైన శిష్టాచారము

శ్లో॥ గచ్ఛంతీహసు సంతుష్టాధర్మపంధాన ముత్తమమ్ ।
శిష్టాచారమహాత్మానో యేషాంధర్మః సునిశ్చితః ॥

శ్లో॥ అనుసూయాక్షమాశాంతః సంతోషః ప్రియవాదితా ।
కామక్రోధ పరిత్యాగః శిష్టాచార నిషేవణమ్ ॥

శ్లో॥ కర్మచ శృత సంపన్నం సతాం మార్గమనుత్తమమ్ ।
శిష్టాచారం నిషేవన్తే నిత్యం ధర్మమనువ్రీతాః ॥

ఇట్టి శిష్టాచారము సత్వగుణ ప్రధానమైనదగుటచే, ధర్మబద్ధముగా నిలిచియున్నది. ఇయ్యది కర్మ జ్ఞానముల రెండిటికి ధ్యేయము.

సద్గురువులకు, సచ్ఛిష్యులకును, ఉపాసకులకును శిష్టాచారముండుట సర్వదా శుభఫలదాయకము. జీవుడిలో అంతర్గతమైన ఆధ్యాత్మిక తపన వుండి కూడా, ప్రబలమైన విషయ వస్తు వాసనాబలం వల్ల తనలోని దుర్గుణాలను, అనాచారాన్ని, స్వధర్మం వీడినట్టి ప్రవర్తనను జయించలేకుండా వున్నారో, వాళ్లకూ, వాళ్లకు పూర్వమున్న గురువులను గూర్చి పైనుదహరించిన"-

శ్లో॥ "మృదుత్వనైస్సార్ద్య...స్వయం హి"-లోని,

"గురుస్తద్విపరేతమేతి" అనుసూక్తి, సద్గురువు అద్దంలాగా వ్యవహరిస్తాడని చెప్పటానికే, ప్రయోగించడమైనది. "విపరీతం" అంటే, తెలుగుభాషలో "అత్యధికం" అనే

వాదుక- సంస్కృతంలో "విపరీతం" అంటే 'వ్యతిరేకం' అనీ, తలక్రిందులనీ, కుడియెడమలనీ, తారుమారుగా కావటం అని అర్థం. కుడియెడమలుగా మారటమనేది అద్దంలోనే ప్రస్ఫుటమౌతోంది. గురువు అద్దంలాగా, అని తలంచిన ఆ కుడి యెడమల తారుమారై శిష్యుడిలోగల ప్రబలమైన దుర్గుణాలు, అనాచారత్వం, స్వధర్మం వీడడమటువంటివి సద్గురువు (అద్దం)లో ప్రతిబింబిస్తుంది. అదే క్షణంలో గురువులో గల సద్గుణం, ఆచారత్వం, స్వధర్మమత్వం శిష్యుడిలో ప్రవేశిస్తుంది.

సామాన్యముగా శిష్యులు కొందరు మందమతుల్లాగా, పొగరుబోతుల్లాగా, కొందరు ఏమియు తెలియకున్నను తెలిసినట్లుగా, కొందరు తెలిసియు తెలియనట్లుగా అనగా, గురువు ఇంకా మరేమి ప్రత్యేకవిషయమును జెప్పునో అదియును తెలిసికొందామని కుతూహలం కలవారునూ యుందురు. సూక్తిలోని "విపర్యయం" అనేపదం శిష్యుడియెడల గురువు అనుసరించే ఉపాయాన్నీ, బోధననూదాని ఫలితాన్నీ అద్దంలో చూస్తూ సరిచేసుకొనడమనేది సూచిస్తోందనీ గ్రహింపు.

నిజముగా నీ సూక్తి కేవలం శిష్యులకోసంగాక, ఈనాటి గురువుల కోసమనియు గ్రహించవలెను. అనగా సందేహం వున్నవారి కందరికిని యీ సూక్తి ఒకమంచి దృష్టాంతము-

గురువుకూడా తానే అద్దమై శిష్యుడి వికట స్వభావస్వరూపాన్ని తనలో ప్రతిబింబింపజేయటానికి జంకడు-జంకడు కూడ- జంకరాదు కూడ.

ఈ ఉపమానంతో పై తెలిపిన శ్లోక సూక్తి నిష్కర్ష చేస్తోంది. "సద్గురువు"లను వారియెడల యీ సూక్తి ప్రతిబింబింపజేయును- అట్టి సద్గురువులను అర్థంచేసుకొని, తమకై వారు తిరిగి చేదుమందులను మ్రింగవలసిన గత్యంతరం లేకుందునట్లు మెలగవలెను.

ఈ సూక్తి విషయం బాగా అర్థమవడానికి శ్రీదత్తాత్రేయ పురాణంలోని "విష్ణుదత్తు"డనే తపస్వికథ ఒక చక్కని దృష్టాంతము.

విష్ణుదత్తుడనే తపస్వి తన భార్యతోనూ పూర్వమునుండియు తపస్సే ప్రదానంగా పెట్టుకొని, పరిశుద్ధమైన ఆద్యాత్మిక మార్గంలో నుండెడివాడు. అనగా లౌకిక భావనలేక, సద్గురువుల సాహచర్యంతో చక్కటి ధర్మోపదేశాలు పొందుతూ, ఆధ్యాత్మిక మార్గంలో చాలాదూరం ప్రయాణం చేశాడు.

ఇప్పుడిక శ్రీదత్తాత్రేయ స్వామి సద్గురు దర్శనం పొందాలని కోరిక కలిగింది. అటులనే శ్రీదత్తస్వామికిని ఈ విష్ణుదత్తునికి తన దర్శనం యివ్వాలనే సంకల్పం కలిగింది. ఎందుకంటే, వెనుకటి గురువులెవ్వరూ తొలగించని దోషాలను తాను తొలగించే బాధ్యతను తననెత్తిన వేసుకోదలచుకుంటున్న సద్గురువతడు.

విష్ణుదత్తుడను, శ్రీదత్తాత్రేయ స్వామి సద్గురువును దర్శించు తపనలోనే వృద్ధుడైపోగా, అలాంటి వృద్ధునిలోను తపనను గ్రహించిన శ్రీస్వామి అలాంటి వాడిలోనూ కొన్ని దోషాలుండునని, అవి సూక్ష్మమైనవైననూ వాటిని కూడ తొలగించే తపన శ్రీదత్తస్వామికి కలిగింది. అట్టిది వారికే సాధ్యం.

విష్ణుదత్తుడిక శ్రీదత్తస్వామి దర్శనంకై వెళ్లగా, ఆ తపస్వికి శ్రీస్వామి మొదట యొక మాంసపుదుకాణంలో త్రాగుబోతుగా కనిపించాడు. ఆచారపరుడైన ఈ విష్ణుదత్తుడు ఈ త్రాగుబోతురూపంలోనున్న శ్రీ దత్తస్వామిని జూచి, ఆయన వద్దకు వెళ్లలేకపోయెను.

మరల రెండవసారి కూడా శ్రీస్వామి స్మశాన సంచారిగా ఆటవికుడిలాగా కనిపించగా నా స్వామిని వదిలేశాడు. కానీ! ఈ రెండు సంఘటనలతో విష్ణుదత్తుడిలో ఆలోచన, మథనం ప్రారంభమైనది. దత్తస్వామి తనకీ విధంగా నెందులకు దర్శనం యిస్తున్నారు? అని, పలు మథనం తదుపరి, అతనిలో ఆలోచనామృతం తేటతెల్లమైంది. అదియే-

నేను అనాచారాన్ని ద్వేషిస్తున్నాను. ద్వేషం తగదుకదా! నేను సదాచారంగా నున్నప్పటికినీ, యితరుల అనాచారాన్ని మాత్రము ద్వేషించకూడదు. ఇది తెలిసి కూడ నేను దాన్ని ద్వేషిస్తున్నాను. అట్టి నా ద్వేషాన్ని అద్దంలో చూపినట్టుగా చూపించడం కోసమే. శ్రీదత్తస్వామి అనాచారమైన వేషాలతో నాకు దర్శమిస్తూండడం, నాలోని ద్వేషమే అని గ్రహించాడు." ఇట్టి గ్రహింపు (ఆలోచనామృతం)తో విష్ణుదత్తుడిలోని పూర్వ ఆ దోషం నిశ్శేషంగా మిగులలేదు - దాంతో శ్రీ దత్తాత్రేయ స్వామి సద్గురువు విష్ణుదత్తుని తపనను గ్రహించి ఆ వెంటనే తన నిజస్వరూప దర్శనం అనుగ్రహించాడు.

## ఇది విష్ణుదత్తుని కనువిప్పుకథ -

ఇట్లెందరినో పరీక్షించాడు. అందరికి, ఒకే రూపాన్ని జూపలేదు. ఎవ్వరిలో నేలోపముందో, దాన్ని అద్దంలాగా తన రూపములో చూపించారు. కావున, సద్గురువుల (అద్దం) చేరేముందు, తనలోని దోషములను తలంచుకొని, అనగా అవగాహనతో చేరి వాటిని సరిపెట్టుకొనే యత్నం చేయాలి.

సద్గురువు అద్దంలాంటివారు. సాధనలో వెనుకంజ వేయరాదు. స్వయం సాధనమనునది విజయమునకు నాంది.

శ్లో॥ స్వయం సాధన సంపత్తిమర్జసిద్ధింయదీచ్ఛసి ।
కిం తితీర్షోర్హనుమతో వార్ధింరామః ప్లవందదౌ ॥

సద్గురువు చెప్పిన పనులు చేసేటప్పుడు, సిద్ధిరావాలని నీ కుంటే, కావలసిన

సాధన సంపత్తిని, నీవే సంపాదించుకో, సముద్రాన్ని దాటుదామనుకొన్న హనుమంతుడికి శ్రీరాముడు పడవ నందించాడాయేమి? అని.

సద్గురువు మన శిష్యత్వాన్నంగీకరించినపుడు, మన భాగ్యాలు ఫలించి పండించినట్లే - మనలోనొక పరిశుద్ధ జ్యోతిని వెలిగించినట్లే. అందుచేత మన జీవితంలో సద్గురువు ప్రవేశించటమొక అద్భుత భాగ్యం. పూర్వపుణ్యాల అనివార్య పరిణామం.

ఏ సంప్రదాయంలోనూ గురూపదేశం లేకుండా, అనుష్ఠానం చేసిన వారెవరు లేరు. అట్టి అనుష్ఠానమునకు ముందు తప్పనిసరిగా తన సద్గురుధ్యానం నొకవ్రతంగా పెట్టుకుంటారు. గురూపాసనయే తన ధ్యేయంగాపెట్టుకుంటారు. అదే "గురు రూపాయ నమః, లేదా శ్రీగురుభ్యోనమః" అననిదే ముందుకుసాగరు. అనగా ఏ ఊపాసనామార్గంలో వెళ్ళిననూ, ఆ మార్గం వెళ్లి గురూపాసనంలో కలిసిపోతుందని విశ్వాసం. తనలో నింతవరకు ప్రజ్వరిల్లిన ఆధ్యాత్మిక ఆర్తి, ఆవేదనకు కొంత ఊరట కల్గింది. ఆలోచనలకు విశ్రాంతి ఏర్పడింది. ఇక మనోయింద్రియాలకు నిశ్చలత, నిర్భయం నిలిచింది. సద్గురు దర్శన భాగ్యం మనస్సునకు హాయి చేకూరింది. ఇక ఆ గురూపాసనలోనే జీవితం ధన్యమైనది జీవునకు. హృదయం శాంతిమయమగును. హృదయమంటే ఏమిటి?

శ్లో॥ "హృదయం నామ కిమితి స్వతోవేత్త్యసి చింతనాత్"।
ప్రత్యభిజ్ఞాయతే శాంత్యాహృదయే సద్గురు స్సఖే ॥

హృదయమనేది మనస్సే. ఆ హృదయంలో శాంతి కలగటం. అదే మనశ్శాంతి. ఆ శాంతిద్వారానే నీవు సద్గురువును గుర్తుపట్టగలవు.

సద్గురువు (సదాచార్యు)లు లభించాలంటే, షడ్గుణాలు శిష్యులు పొంది యుండాలి అన్నారు పెద్దలు. అవి 1. భగవత్సౌహార్ధము 2. యదృచ్ఛాసుకృతం 3. భగవత్కటాక్షం 4. అద్వేషం 5. ఆభిముఖ్యం 6. సాత్త్విక భాషణం అనునవి

## వివరణ:-

1. జీవుని యందు భగవత్ సౌహార్ద్రం ప్రసరించాలి.
2. దానితో జీవునకు సద్భావం (సుకృతం) కల్గుతుంది.
3. ఈ సద్భావంతో భగవదృష్టి జీవునిపై పడుతుంది.
4. దానితో చీకాకులు తొలగి, మిక్కిలి సంతోషమును పొందును.
5. అందరి యెడల ద్వేషం తొలగి, భగవద్వచనాలు వింటూ, భగవత్సంకీర్తనలచే భగవంతునకాత్మీయుడైతాడు. అనగా భగవంతుని సన్నిధి చేరుతాడు.
6. ఆభిముఖ్యంతో భగవల్లీలలు వినాలని కుతూహలపడతాడు. భగవద్దర్శన మునకై

తహతహలాడుతాడు.

ఇక నిట్టివాని స్థితి సద్గురువుని చేరుకోగల స్థితి యేర్పడును. అట్టి శిష్యుడు చేరుటననుది, సద్గురువునకు సత్పాత్ర లభించినట్లు. అనగా- సర్వవిధాలదున్ని, ఎరువువేసి, నీరుపెట్టిన సారవంతమైన నేల రైతు (సద్గురువు)నకు లభించినట్టు. ఇక వానిలో సద్బీజాలు చల్లుతాడు. అవి మొలకెత్తిపంట విరగబడి పండునట్లుగా శిష్యుని హృదయ కేదారాల్లో విద్యాబీజాలు పడగా, **అతనిలో ఆధ్యాత్మిక సస్యం** తెగపెరిగి, ఆచార్యులనీడలో ఆనందపుపంట పండును..

## ఎవరు సద్గురువులు?

అనగా సంప్రదాయంగా శాస్త్రార్థం తెలుసుకొన్నవారై, చైతన్య స్వరూపుడై యుండి, ఆత్మానాత్మవివేకం కలవారై, పల్గురితో మహాత్ముడని నిరూపింప సమర్థుడై యున్నవాడే సద్గురువు.

## మహాత్ముడనగా?

"మహాన్ ఆత్మాయస్యసః మహాత్మా" - అనగా - విశాల హృదయం (గొప్ప మనస్సు) గలవారు మహాత్ముడు. సమభావంతో తనతోనున్న శిష్యులపట్ల మమతానురాగాలతో మెలగవలెను. వారిలో చైతన్యం కల్గించు మహనీయుడుగా నున్నవాడినే (గురువునే) మహాత్ముడని పిలువబడును.

వివేకచూడామణి"లోని 163వ శ్లోకం -

దేహ - హమిత్యేవ జడస్యబుద్ధిః
ర్దేహేచ జీవే విదుషస్త్వహం ధీ ।
వివేక విజ్ఞానవతో మహాత్మనో
బ్రహ్మాఽహ మిత్యేవ మతిః సదాఽఽత్మని ॥

తా॥ (ఈ శ్లోకమును గమనించిన) ఆత్మానాత్మ వివేకశూన్యుడుగా నున్నవాడు మూఢుడు. ఇతడే దేహము ఆత్మయని తలంచును. శుష్క శాస్త్రజ్ఞానము గల పండితుడు చిదానంద భాసుడగు జీవుడే ఆత్మయనుకొనును. దృఢమగు అపరోక్ష జ్ఞానముగల మహాత్ముడు "అహంబ్రహ్మాఽస్మి"యనెడి బుద్ధితో సదా కూటస్థ రూప స్వస్వరూపమే తాననెడి దృఢనిశ్చయము గలిగియుండును.

అట్టి సద్గురువును చేరి ఆత్మవస్తువును తెలుసుకొని తద్గురూపదిష్టమార్గమున తత్త్వవిచారము చేయవలెను.

శ్రీ శంకరభగవత్పాదులచే విరచింపబడిన "వివేకచూడామణి" 376 శ్లోకములతో నున్న గ్రంథము, సర్వ వేదాన్త విజ్ఞాన విద్యావిదుషీమణికి చూడామణియై యలరారుచు, ముముక్షువులకు పెన్నిధిగా, అజ్ఞాన తమోభాస్కరమై, కరతలామలకముగా నున్నయీ గ్రంథమున, శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్యుని ద్వారా శ్రీగోవిన్ద భగవత్పూజ్యపాద శిష్యునకు నొనర్చిన శృతి స్మృతి పురాణేతిహాస హితోపదేశము. గురుశిష్యసంవాద రూపముగానున్న పరతత్త్వమును నేటి గురుశిష్యులు పఠించి, అసలైన విద్యాతత్వమును గ్రహించుదురని మిక్కిలిగా ఆశించుచున్నాను.

ఇదియే సద్గురువుల, సచ్ఛిష్యుల విద్యాధ్యయనమని గోచరించును. భారతంలో ద్రోణాచార్యుడు భీష్మునితో శిష్యుల విజ్ఞాన విషయం గూర్చి పెద్దల సూక్తిగా నిట్లనెను.

"కేషాంచిత్ ధృతకాష్ట భార సదృశం జ్ఞానంహిమూర్ధ్ని స్థితం,
కేషాంచిత్ హృది సంగతంచ భవతి ప్రోద్యద్దసంతీ సమమ్ ।
కేషాంచిత్ వివశోన్మదాశ్వని వహైరూఢం భవేత్ స్యందనం.
కిం త్వంగాంగ సుదాయతే గురుకృపాశక్తిస్య పుణ్యాత్మనః ॥"

భా: కొందరి జ్ఞానం వారి తలపై కట్టెలమోపల్లె వుంటుంది. కొందరి జ్ఞానం వారి గుండెలపై మండే కుంపటిలా వుంటుంది. కొందరి జ్ఞానం మదించి, పట్టు తప్పి, పరుగులు తీసే గుఱ్ఱాలు కట్టిన రథంలాగా వుంటుంది. కాని, సద్గురు కృపారసంలో తడిసిన పుణ్యాత్ముడికి మాత్రం - జ్ఞానం అన్నది వాడి ప్రతి **అవయవములోనూ అ**మృతం అవుతుంది.

**అటులే. కృప అనునది** మనస్సు మెత్తపడడంకాదు. గురుకృప అనునది "గురుశక్తి" అని **అర్థం చేసుకోవాలి శిష్యుడు**. మరియు తదేక బోధనలో నిష్ఠ. ఈ నిష్ఠ సద్గురు**వునకుండును.**

**ఆ సద్గురు**వు విద్యాసాగరంలో శక్తిమంతుడై యుంటాడు. "సర్వ విద్యలకును సారం అంతర్వికాసమే కదా!" అందులకు, ఏ గురువుయైన అంతర్వికాసవంతుడైయున్న 'శక్తి'మంతుడై యున్నట్లేయని చెప్పుకోవాలి. అతనిలో తేజోమండలం పెచ్చుపెరిగి యుంటుంది.

కావున శిష్యుడు గురువు యొక్క శక్తిని గూర్చి ఆలోచించకూడదు. గురుకృపతో తన జీవన విధానం. ఆలోచనా విధానం. ఆచరణావిధానమే తన విధానంగా, అనగా గురు విధానంలో తను (శిష్యుడు) మమేకం అవుతున్నట్లుగా తలంచాలి. గురువు చెప్పే ప్రతి వాక్యంలోనూ స్వారస్యాన్ని ఆస్వాదించే యత్నం శిష్యుడు చేయాలి. ఇలాచేస్తే

నీరుపల్లమెరిగినట్లే, గురువులో నున్న విజ్ఞానవంతమైన శక్తి శిష్యుడిలోకి ప్రవహిస్తుంది. గురుకృపారసంలోనున్న ఆర్ద్రత ఇదే. ఆ ఆర్ద్రతలో శిష్యుడు తడిసి పోవడమంటే, గురుశక్తిని పొందడమనునదే. అలా గురువులు శిష్యులను అయస్కాంతం లాగా ఆకట్టుకొంటారు.

అట్టి సద్గురువులు పూర్వంలో వశిష్ఠ, వ్యాస మహర్షులే తార్కాణులు. వీరు నిజంగా తేజోమండలులే.

ఇట్టి సద్గురువుల నుండి నేర్చుకోవలసినవి రెండేరెండు. ఒకటి, గురువు దేనిని గూర్చి బోధిస్తున్నాడో. దానిని హృదయపూర్వకంగా నాచరిస్తూండాలి. రెండవది. పొందిన బోధను హృదయపూర్వకంగా గ్రహించియుండాలి. ఈ రెండును శిష్యునకు పట్టుబడితే, గురుకృపామృత వర్షపరిపూర్ణంగా వర్షించినట్లేయగును.

శ్లో ॥ మధం లుబ్ధో యథాభృంగః, పుష్పాత్ పుష్పాంతరం వ్రజేత్ ।
జ్ఞానలుబ్ధో తథాశిష్యః. గురోః గుర్వంతరం వ్రజేత్ ॥

తేనెటీగ తాను తినక త్రాగక పుష్పాంతరంలోని మధువును సమకూర్చు కొంటుంది.

అటులే జ్ఞాన పిపాసియగు శిష్యుడు గొప్పగొప్ప మహనీయులనుండి (అనగా వారి అంతర్యమునుండి మరియు బాహ్యోపదేశములనుండి) వారి సత్ప్రవర్తనలను తాను పొంది, అలవరచుకొని మార్గదర్శక శిష్యుడగుటకు యత్నించును.

"విజ్ఞాయ సేవితశ్చోరఃమైత్రీమేతిచ చోరతామ్"

శిష్యుడు విజ్ఞుడైనచో గురువుతో మైత్రినొనర్చి, సేవిస్తూ గురువిజ్ఞానము పొందును. కాని గురుసేవ చేయక. మైత్రీ స్వభావమూలేకుండా విజ్ఞానము గురువునుండి దొంగలించలేడు కదా?

అటులే ఒక పెద్ద (విజ్ఞుడు) మనిషి గజదొంగతో కలిసియున్నను, ఆతని చోరత్వమలవరచుకోక, ఎట్టి ప్రమాదములో పడక, ఏ విధముగాను తాను గజదొంగతో నిమగ్నుడు కాడు, అనగా ఏలాంటి దోషభూయిష్టమునకు గురికాడు.

తెలుగులో నున్ననొక సామెత – "మీ చిత్తం నాప్రాప్తి" అని కలదు. సద్గురువుపై నమ్మకం, దృఢమైన భక్తి కలిగియుండిన జీవన సరళియే మారును. అట్లుగాక, వ్యాపారభక్తి కల్గియుండిన, ఆ వ్యాపారబాటయందే పయనించవలసి వచ్చును. నిజముగా, ఎవరి కర్మ వారే యనుభవించవలసి యుండును. అటులే ఎవరి బాటయందు, అనగా తానేర్పరచుకొన్న బాట యందుతా.. పయనించవలసి యుండును. అది అతని కర్మ. జీవితంలోని ఒడుదుడుకులన్నీ తమ కర్మానుసారమే జరుగుచుండును. అవి అనుభవించక తప్పదు.

కానీ. సద్గురువును చేరిన. తన కర్మను అనుభవించుటలో కావలసిన (ఆవశ్యకతయగు) నైతిక స్థైర్యమును కల్గిస్తాడు కర్మరాహిత్యమును కూడ పొందగల్గును ఉన్నత స్థాయి నందును.

గురువు నెందుకు అనుసరించాలన్నది ఒక ప్రశ్న. ఎందుకంటే అతని (శిష్యుని. జీవుని) జీవన సరళిని సన్మార్గస్థితిలో నడుపుకొంటూ. ముందుచేసిన తప్పులే మరల నొనర్చకుండా సద్గురువు సహాయమొనర్చును. ఎందుకనగా సద్గురువు సన్మార్గదర్శకుడు అయితే, వారు సద్గురువు యెడల శరణాగతులైయుండిన. ప్రార్థించిన అప్పుడే సద్గురువు వారి బాధ్యతలను స్వీకరిస్తాడు కర్మభారాన్ని తగ్గించడానికి యత్నిస్తాడు. దుష్కర్మలో మునగకుండా చేయూతనిస్తాడు సత్పంథలో నియంత్రించుటకు సాధకుడౌతాడు శరణాగతరక్షకుడౌతాడు. వారి పాపములను, భ్రమలను నశింపజేసి సత్యమును ప్రదర్శించును. జన్మరాహిత్యమొనర్చి, వాని ఆత్మను బంధవిముక్తముగావించి, పరమాత్మ యందు విలీనమొనర్చి, పరమానందమైన సచ్చిదానందస్థితికి గైకొనిపోవును

అందులకే "గురువు" ఆత్మజ్ఞానము కల్గించువాడని. మహిమాన్వితుడని పేర్కొనిరి "గురు" శబ్దములోని "గు" అనగా మనము చేస్తున్న కర్మలు పాపములు; "రు" అనగా వాటిని నశింపజేసేది అని అర్థము. కనుక, సద్గురువును చేరండి. సత్యాన్వేషణలో కర్మవిముక్తులై, బంధరాహిత్యులై, పరిపూర్ణానందం పొందండి. అదే పాపప్రక్షాళనమార్గం. జన్మసాఫల్యసత్సాంగత్యమే సద్గురు సాన్నిధ్యము. గురువు మిమ్ములను గుర్తించునట్లు ప్రార్థించండి. వారి నిండైన హృదయాశీస్సులను పొందండి. వారి దివ్యానుగ్రహంతో మీ జన్మలను తరింపజేయ సాగిలపడి మ్రొక్కండి. వారి మహిమోన్నతమైన కటాక్షవీక్షణాల దృష్టి ప్రసరించునట్లు ఆకర్షితులు కండి ఇకచూడండి! మీ కష్టనష్టములు నూటికి నూరుపాళ్లుగా వారే భరించి, మీకు సంపూర్ణ సుఖ సంతోషాలు కల్గిస్తూ. తానూ. వీటన్నిటికిని అతీతుడై, తామరాకుపై నీటిబిందువువలె. ముత్యపుచిప్పలోని ముత్యమువలె వెలుగొందుచు, నక్షత్రకిరణంవలె తాను వెలుగుచు మనకు వెలుగును ప్రదర్శించును.

ఆధ్యాత్మ రామాయణములో (బాలకాండ 7వ సర్గ)

శ్లో ॥ సత్సఙ్గ లబ్ధయా భక్త్యా యదాత్వాం సముపాసతే ।
తదామాయా శనైర్యాతి తానవం ప్రతిపద్యతే ॥

సత్పురుషుల సహవాసముచే భగద్భక్తినిపొంది ఉపాసించు జనులకు "మాయ" క్రమముగా నశించి కృశత్వము పొందును

శ్లో॥ తతస్త్వద్ జ్ఞాన సంపన్నః సద్గురుస్తేన లభ్యతే ।
వాక్యజ్ఞానం గురోర్లబ్ధ్వా త్వత్ప్రసాదాద్విముచ్యతే ॥

అంతనట్టి సత్పురుషునకు నిన్ను తెలిసిన సద్గురువు లభించును అంత భగదనుగ్రహముతో నతడు సద్గురువు నుపదేశముచే మహావాక్యమున ఖండార్థము తెలిసికొని మోక్షమును పొందును

అనగా మహావాక్యములచే సద్గురువు అజ్ఞానము నశింపజేయునని తెలియును

"సమాప్య తత్పూర్వముపాత్త సాధనః ।
సమాశ్రయేత్ సద్గురు మాత్మలబ్ధయే ॥'

సద్గురువు నాశ్రయింపవలెననుటలో వ్యుత్పత్తి బలమున తానే గ్రంధములు పఠించుటచే జ్ఞానము కలుగదు అనగా గురూపదేశముననే కలుగునని భావము.

మానవుడు మొదట తన వర్ణాశ్రమములకు విధింపబడిన నిత్యనైమిత్తిక క్రియలను ఫలాభి సంధి లేక యనుష్టించుచు, దానివలన నంతఃకరణ శుద్ధి పొందినవాడై "నిత్యానిత్య వస్తువివేకము, ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము, శమాదిషట్కము, ముముక్ష"యను సాధన చతుష్టయమునొంది వెంటనే యాకర్మము నంతయు సన్యసించి యాత్మజ్ఞానము కొరకు సద్గురువు నాశ్రయింపవలెను

ఆత్మతత్త్వ జ్ఞానము చేతనే అజ్ఞాన నివృత్తి కల్గి, గురూపదేశ వేదాంత విచారము సాధ్యమై బ్రహ్మ భావమును శిష్యుడు పొందును దానిచే సాధన చతుష్టయ సంపన్నుడై, గురువునను గ్రహము పొంది, తత్త్వమస్యాది మహావాక్యార్థము విచారించి, జీవేశ్వరుల అభేదము తెలిసినవాడై. అవిద్యానాశమునొంది, అవిద్యా కల్పితమైన సుఖదుఃఖాత్మకమగు సమస్త ప్రపంచమునకును చలనమునొందక జీవన్ముక్తి నొందును

దానితో నతడు వేదవాక్యములలో అవాంతర వాక్యములను విచారించి ఆత్మపరోక్ష జ్ఞానమునొంది అనంతరం మహావాక్యములను విచారించి అపరోక్షజ్ఞానము నొందినవాడై. అంతఃకరణోపహితుడును ఉపాధిధర్మములంటని వాడునగు కూటస్థుని పరబ్రహ్మమునుగా నెరింగి యధిష్ఠాన చైతన్యము తెలిసిన వాడగుటచే దాని యందు తోచునట్టి సమస్త దృశ్య ప్రపంచమును త్యజించును. అనగా నీ మిథ్యా ప్రపంచమునెడ ఉదాసీనుడునుగా వ్యవహరించును

ప్రాజ్ఞుడైన సద్గురు లక్షణాల్ని శ్రీశంకరులు ఇలా వెల్లడించిరి

శ్లో ॥ శ్రోత్రియోఽవృజినోఽకామహతో యో బ్రహ్మవిదుత్తమః।
బ్రహ్మణ్యు పరతః శాంతః నిరింధన ఇవానలః ॥

శ్రోత్రియుడు ఎవడు? శృతుల్ని అధ్యయనమొనర్చువాడు. ఎలాంటి పాపాల్ని చేయనివాడు, ఎటువంటి కామంచేతా బాధపొందనివాడు, విషయవాసనలు

లేనివాడు, శాంతిని పొందుటచేత కట్టెలు లేని అగ్నిలాగ శాంతుడు. అనగా! కామాది. ద్వంద్వాది గుణత్రయాది వికారాలు లేనివాడు అతడు బ్రహ్మవేత్తలలో ఉత్తముడుగా (బ్రహ్మకుండే ఉపరతిని) ప్రాజ్ఞుడు సద్గురువు అనబడును.

– (వివేకచూడామణి-34)

శ్లో ॥ ఆయాంత్యేవ ముహుః కామాః. తరంగా ఇవసాగరే ।
తదంతం మాప్రతీక్షస్వ, సద్యః సద్గురుమాశ్రయ ॥

సముద్రములో తరంగాలు వస్తున్నట్లుగా, మనలో కోరికలనేవి వస్తూనే వుంటాయి. అవి ఆగిపోవాలని ఎదురుచూడకు. తక్షణమే సద్గురువును ఆశ్రయించు.

శ్లో॥ ఇతస్తతో మాచరత్వం గురుమేకం సమాశ్రయ ।
నోచేత్ శాద్వల భూధావద్గొరేవత్వం భవిష్యసి ॥

నువ్వు అటుఇటు తిరగకు. ఒకే గురువును ఆశ్రయించు. లేకపోతే, పచ్చికబయలులో పరుగులు తీసే ఆబోతువే అవుతావు నువ్వు.

శ్లో॥ విచారణీయో వేదాన్తా వందనీయోగురుః సదా ।
గురుణాంవచనం పథ్యం దర్శనం సేవనం నృణామ్ ॥

శ్లో॥ భావాద్వైతం సదాకుర్యాత్ క్రియాద్వైతమ్ నకర్హిచిత్ ।
అద్వైతం త్రిషులోకేషు నాద్వైతం గురుణాసహ ॥

వేదాన్త ఉపనిషద్వాక్యములు విచారణీయములు. గురువు సదా వందనీయుడు. నరులకు 'గురు' వాక్యశ్రవణమును, దర్శనమును, సేవయును హితకరములు.

భావాద్వైతమునవలంబింపుము. అనగా అద్వైత భావమును హృదయముననే నిలుపుకొనుము. కర్మవేళల అద్వైత భావమును ప్రదర్శింపకుము. (అట్లయిన కర్మయే నిర్వహించబడదు.) ముల్లోకముల అద్వైతము చెల్లును, కాని గురువుపట్ల కూడదు. (ఏలయన ఐక్యము ఘటిల్లిన గురుపూజయును, ఫలమగు గురుకృపయును లభింపవు.)

గురువును ఆశ్రయించడంలో నశ్వరమును నది తెలుసుకొనుటగును. తానొనర్చు కర్మల ఫలమునూ నశ్వరమని, అనగా కర్మల వలన పొందు పుణ్యఫలమును నశ్వరమని గ్రహించవలయును. అట్టి కర్మలవిరక్తి కలిగి. ఉత్తమలోకములందు నిరాసక్తి పెరిగి. పరమాత్మయందు భక్తి కల్గి శ్రేయస్సును సాధించవలయును.

శ్లో॥ తస్మాద్గురుం ప్రపద్యేత జిజ్ఞాసు శ్శ్రేయ ఉత్తమమ్ ।

ఇహ, పరలోక సుఖములునూ క్షణికములు, నశ్వరములు గావున వశించని స్థిరమైన అనంతఫలమును ఇచ్చునది ఉత్తమ శ్రేయస్సు అట్టిదేది అని తెలుసుకొనదలచిన సద్గురువును ఆశ్రయించవలయును శబ్ద బ్రహ్మలో పరబ్రహ్మలో నిష్ణాతుడైన అనగా ఆగమయోగముల వలన కల్గిన జ్ఞానము కలిన గురువును ఆశ్రయించవలయును.

అట్లుగాక జ్ఞాన హీన గురువును చేరినచో ఉభయభ్రష్టత్వమగును. ఈ భావమునే "పోతన" ఆంధ్రభాగవతంలో ఇలా అన్నాడు.

"కాన వాని యూతగొని కాననీవాడు విశిష్ఠ వస్తువుల్ కాననీ భంగి" అని- గుడ్డివాడు ఇంకొక గుడ్డివానిని ఊతచేసుకొనినచో ఇద్దరూ వస్తుప్రదర్శన చేయజాలరు అటులే జ్ఞానహీనుని గురువుగా పొందినచో తాను కూడా తెలియగోరిన దానిని తెలియజాలడు కదా? అందుకే,

శ్లో॥ భిన్ననావాశ్రితః స్తబ్ధో యథాపారం నగచ్ఛతి ।
జ్ఞానహీనం గురుం ప్రాప్యకుతోమోక్షమవాప్నుయాత్ ॥

పగిలిన నావ నాశ్రయించిన స్తబ్ధుడు తీరమును చేరజారనట్లు, జ్ఞానహీనుడైన గురువును ఆశ్రయించినవాడు మోక్షమునెట్లు పొందగలడు?

అదియునుగాక శిష్యుని సందేహమునెట్లు తీర్చగలడు.

కేవలం 'వేదే బ్రహ్మణి' అనకుండగా "శాబ్దే బ్రహ్మణి' అని చెప్పుటచే వేదపురాణేతిహాసాగమాది జన్యజ్ఞానం కలవానిని" అని అర్థం

అటులే "సత్యంవద, ధర్మంచర" అని బోధించిన సరిపోదు సత్యాధర్మాల నాచరించిన పురాణపురుషుల ఉదా॥ హరిశ్చంద్ర, ధర్మరాజాదుల ఆచరణాలచే పొందినవారి ఇహావర సుఖములను కీర్తిని వినుతించవలయును. అందుకు మన భారత, రామాయణగాధలను తెలిపినచో విన్న శిష్యుని బుద్ధి వికసించును. నిశ్చయ జ్ఞానమును పొందును

అందుకే గురువు వేదశాస్త్ర పురాణేతిహాస నిష్ణాతుడై, పరోక్ష జ్ఞానముకలవాడై, యోగశక్తితో బ్రహ్మసాక్షాత్కారమును పొందినవాడైనపుడే శిష్యునకంతటి అనుభూతిని అందించగలడు

ఈ రెండేగాక, "ఉపశమాశ్రయం" అనుచున్నారు. 'ఉపశమము' అనగా రాగద్వేషములు లేకుండుట అట్టి దానికి ఆశ్రయమైనవాడు. రాగద్వేషములున్నవాడు

చూడజాలని వాడు ఇతరులకెట్లు బోధించగలడు?

కావున, కర్మఫలాసక్తి విరక్తుడై సద్గురువును ఆశ్రయించినచో, ఉత్తమ శ్రేయోజ్ఞానమును పొందుటకు శిష్యుడు అర్హుడగును

శ్లో॥ దుర్లభోవిషయత్యాగో. దుర్లభం తత్త్వదర్శనం ।
దుర్లభా సహజావస్థా. సద్గురోఃకరుణాంవిన ॥

విషయ వాంఛల్ని త్యాగం చేయడం బహుకష్టం. ఆత్మసాక్షాత్కారం (తత్త్వదర్శనం) పొందడం కూడా చాలా కష్టం సహజావస్థ (అమనస్క బావన) లభించడం కూడా కష్టమే. అయితే సద్గురువు కరుణ లేకుండా ఈపైవన్నియు లభించవు కావున ఆ సద్గురువు కరుణ ఉంటే ఇవన్నియూ సాధ్యమే

"ఈశ్వరో గురురాత్మేతి, మూర్తిత్రయ విభాగినే"

"ఈశ్వరుడు - గురువు - ఆత్మ" - ఈ మూడును ఒక్కటే

అనగా గురువే ఈశ్వరుడు. గురువే ఆత్మ. అనుభవం రససిద్ధమైన క్షణంలో. అద్వైతస్థితిలో, గురువు - తాను (ఈశ్వరుడు) ఒకటిగానే వెలుగుతాడు అదే బ్రహ్మానందం ఆ బ్రహ్మానందానుభూతి భాష్పమై భాసిస్తుంది. గురు పాదద్వంద్వం రెండూ శ్రీ భూమికలు అందువల్ల అక్కడే శరణాగతి పొందాలి గురు పాదాలు శ్రీచరణాలు లక్ష్మి - సరస్వతులు సంగమ స్థిరస్థానం, గురుపాద పీఠం.

వేద వేదాంతములకు మూలమైన, అంత్యమైన పరబ్రహ్మమే గురువు. అట్టి గురువునకు నమస్కరించవలెను. నమస్కరించడమంటే శరణువేడటమే, సమర్పించుకోవటమే అటువంటి 'శ్రీ గురుచరణద్వయం'ను ఆశ్రయించిన, అనుగ్రహించి అనుభవాన్ని ప్రసాదించిన మరుక్షణమే మన యింద్రియాధీనమైన మనస్సు మరుగున పడి వాసనా. మాలిన్య రహితమైన నిజమనస్సు అనుభవంలోకి వస్తుంది

★★★

## గురు - సూత్రం

"గృహీవాక్యోస్వర్గ ముపైతివిద్వాన్"

గురూపదేశంతో విద్యావంతుడు స్వర్గము చేరుసని విదురనీతి

★★★

# 17. గురుకులవాస ధర్మము - గురుశుశ్రూష

సద్గురువును చేరిన శిష్యుడు వినయవిధేయతలతో నుండి, శుశ్రూషతో విద్యనార్జించుట శ్రేయోదాయకం.

విద్యనభ్యసించు మార్గముల తెలుపుచు శ్రీ శంకర భగవత్పాదులు - నిట్లనిరి.

శ్లో॥ గురు శుశ్రూషయా విద్యా పుష్కలేన ధనేనవా ।
అథవా విద్యయా విద్యాత్వన్యథా నోపలభ్యతే ॥

అటులే, వారు. నొక శిష్యుడు వేసిన ప్రశ్నకు నిట్లు సమాధానమిచ్చెను.

శ్లో॥ అపారసంసార సముద్ర మధ్యే, సమ్మజ్జతోమే శరణం కమస్తి ।
గురో కృపాళో కృపయావదైత, ద్విశ్వేశ పాదాంబుజ దీర్ఘనౌకా ॥

భా: సంసార సముద్రంలో నిమగ్నమైనవానికి రక్షణ పొందుటకు భగవానుని పాదపద్మములను జేర్చు విశాలమైన గురువనుగ్రహమను నౌకను ఆశ్రయింపును. తరించిపోవుదువు.

కనుక గుర్వనుగ్రహముచే, గురు కృపా మహిమను చాటెడి శక్తిపాత విద్యారహస్య ప్రభావముచే, శిష్యులయందు విద్య జాగృతమగుట. లోకోత్తర దివ్యానందానుభూతి కలుగుటయే. ఇట్టిది "కట్టు గాథా" విషయం కాదు. శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీ రమణమహర్షి మొదలగు మహాత్ముల జీవితమును పరిశీలించిన ఈ యథార్థము తేటపడగలదు.

విద్యా లక్ష్యమును సాధించు శిష్యుడు గురుశుశ్రూష మొనర్చి, వారినుండి విద్యారహస్యమును తెలుసుకోవాలి.

"శ్రోతుమిచ్ఛా శుశ్రూషా"- 'శుశ్రూష'యనగా గురూపదేశమునందు శ్రవణేచ్ఛ కలిగి యుండుటనుగాక, గురువునకొనర్చు పాదసంవహనాది క్రియా సముదాయము కూడా శుశ్రూషయే. ఇంతయేల గురువునకు చేయుసకల సపర్యలు శుశ్రూషయే యగును. ఆ శుశ్రూషలో గురువాజ్ఞను మీరక, గురువు ఏ సమయమున నేమి ఆజ్ఞనిడునో, ఏమి ఉపదేశించునోయని, ఎదురు చూపు నిలకడ వంటి శ్రద్ధ కలిగి, ఆయన సన్నిధానమందే ఆతురతతో వేచి యుండవలయును. ఆ ఆతురతయే గురువనుగ్రహబోధ లభించును.

అదియునుగాక, "నాపృష్టః కస్యచిద్బ్రూయాత్"- చేరనిదే, అడుగనిదే ఏ విషయమును ఏవనికి బోధింపరాదు. ఉపనిషత్తుల సారాంశమైన భగవద్గీతలో శ్రీకృష్ణుడును అర్జునుని ఆతురత, తపనను గుర్తించియే గీతారహస్యబోధ గరపెను.

అర్జునుడు. "అన్యథా శరణం నాస్తి"యని శ్రీకృష్ణుని పాదాలచెంత వంగి నమస్కరించి వినమ్రుడై యిట్లు పలికెను

"శిష్యస్తేఽహం శాధి మాంత్వాం ప్రపన్నమ్"-

నేను నీకు శిష్యుడను, నీవు నాకు గురువువు- అని శరణాగతుడయ్యెను. అట్లు శిష్య భావం పొందిన పిదపనే శ్రీకృష్ణపరమాత్మ గీతారహస్యమును బోధించెను.

"శాసనీయః శిష్యః" అను వ్యుత్పత్తిననుసరించి, శిష్యుడై గురువును జేరాలి.

విద్యాలక్ష్యమును సాధించు శిష్యుడు గురుశుశ్రూష చేస్తూ. వారి నుండి విద్యారహస్యమును గ్రహించాలి. విద్యయొక్క పరమలక్ష్యమును సాధించి కృతార్థుడు కావాలి.

గురువు ఆశ్రమములో లేనప్పుడును వారికి సంబంధించిన అనగా ఆశ్రమ ధర్మములను పాటించుటలో ఆశ్రమం పరిశుభ్రంగానుంచడం, సకాలమున హోమద్రవ్యమును సేకరించియుంచడం, అటులే హోమకార్యములను నిర్వహించడం, గురుపత్ని ఆజ్ఞను పాటించడం మొదలగునవన్నియును గురు శుశ్రూషగానే పరిగణింపబడును

నారద పురాణం 9వ అ- 33వ శ్లోకమున నిట్లున్నది

"గురు శుశ్రూషణేరతాః ప్రయాన్తిబ్రహ్మ

సదీనమితి శాస్త్రేషు నిశ్చయః" - అనగా గురుసేవలో నాసక్తులైనవారు బ్రహ్మలోకమును పొందెదరు ఇది శాస్త్రనిర్ణయం. అని, మదయంతి సౌదాస మహారాజు (భర్త)తో ననెను.

అటులే 9వ అ. 108వ శ్లోకంలో 2వ పాదమున -

"జ్ఞానతోఽజ్ఞానతో వాపి యోఽవజ్ఞాం కురుతేగురోః"-

శ్లో॥ తస్యైవా ప్రణశ్యన్తి ధీవిద్యార్థాత్మజాః క్రియాః ।
శుశ్రూషాం కురుతే యస్తుగురూణాం సాదరం వరః ॥ (109వ శ్లోకం)

భా: తెలిసి, తెలియకగానీ గురువును అవమానించిన లేదా, నమస్కరించక పోయినను వారికున్న బుద్ధి, విద్య. తానొనర్చిన సుకృతములన్నియును నశించును.
గురువును సేవించిన నరులకు సర్వసంపదలు కలుగునని విజ్ఞులు పలుకుదురు.
"శుశ్రూషర్గురు భక్తో యః సమాం వహతి సర్వదా"
- (10వ అ. 60వ శ్లో/2వ పా)

గురుభక్తి కలవారు శ్రీమహావిష్ణువును మోయువారగుదురు-

శ్లో॥ దేవతా యస్య తుష్యన్తి గురువో వా నృపోత్తమా ।
తటాగ పుణ్య కృచ్ఛస్యాది త్యేషా శాశ్వతీ శృతిః ॥ - (12వఅ - 59వశ్లో)

భా. దేవతలను, గురువులను సంతోషింపజేసినవాడు చెరువును త్రవ్వించిన వాని పుణ్యమును పొందును-అని శృతి వాక్యము.

శ్లో॥ ఉపనీతో ద్విజో విప్ర పరిచర్యాపరోగురోః ।
వేదగ్రహణ పర్యన్తమ్ నివసేద్గురువేశ్మని ॥ - (25వ అ. 22వ శ్లో,

భా: ఉపనీతుడైన ద్విజుడు గురువునకు పరిచర్యనొనర్చుచు వేదాధ్యయన పర్యంతం గురుకులమున నివశించియుండవలెను.

శ్లో ॥ ఆ నీయా నింద్య విప్రాణాం గృహద్భిక్షాం జితేంద్రియః ।
నివేద్య గురవేఽశ్నీయాద్వాగ్యతస్తదనుజ్ఞయా ॥ - (25వ అ. 30వ శ్లో)

భా: ఉత్తమ విప్రులనుండి భిక్షను తెచ్చియింద్రియ జయముతో నాభిక్షను గురువునకు నివేదించి, గురువాజ్ఞగా మౌనముగా తాను (శిష్యుడు) భుజించవలెను.

శ్లో॥ శుశ్రూషారహితా విద్యాయద్యపి మేధా గుణైస్సముపయాతి ।
వంధ్యేన యౌలవనవతీ నతస్యసాఫల్యవతీ భవతి ॥ -(50 అ. 245 శ్లో)

బా: గడ్డపారతో త్రవ్వుచు భూమిలో నీరును పొందినట్లు గురువులో నున్న విద్య శుశ్రూషతో పొందగలరు.

గురువును సేవించుటయే, పుష్కల ధనముచేకాని, విద్యను తిరిగి బోధించుటచేగాని, విద్యను పొందవచ్చును - నాల్గవమార్గం లేదు - గురువును సేవించక మేధా సంపత్తిచే విద్యను పొందిననూ గొడ్రాలి యౌవనము వలె సఫలము కాజాలదు.

- (నా.పు)

"నవినా గురుసంవాసాత్ జ్ఞానస్యాధి గమస్మృతః" - (నా.పు)

అనగా గురువాశ్రమమున నివసించక (ఆశ్రమధర్మము పాటించక) పరిపూర్ణ జ్ఞానమును పొందలేరు అని-

## బ్రహ్మోపనిషత్తున 28వ మంత్రము

శ్లో॥మం: తత్కుర్యాద విచారేణ శిష్యస్సంతోషసంయుతః ।
హంస విద్యా మిమాం లబ్ధ్వా గురుశుశ్రూషయానరః ॥

భా: శిష్యుడు సంతోషముతో కూడిన వాడై వెనుకముందు ఆలోచించక, గురువు చెప్పినదానిని చేయవలెను. గురుశుశ్రూషచే నరుడి హంస (సోఽహం) విద్యను పొందును - అని యిట్లు నారదపురాణంలో వివరింపబడెను.

విద్యనభ్యసించు, లేక అభ్యసింపగోరు శిష్యులకు కృపారసార్ద్రులైన ఉత్తమ గురువులే శరణ్యం, శరణం, శరణమ్. అందుకని -

1. "గురు శుశ్రూషయా భక్త్యాగుర్వనుగ్రహలేశతః
2. గురు సంకల్ప మాత్రేణ విద్యానిష్యంతు తుందలః
3. గుర్వనుగ్రహ పూతశ్చ జయతే జయతే సదా!"

కనుక, శిష్యులు గురువు యెడల శ్రద్ధాభక్తులతో వినయ సంపదతో శుశ్రూష మొనర్చి విద్యాసముపార్జన చేయుచుండెడి వారలు - ఒక మహనీయుడిట్లంటాడు.

కం॥ గురుసేవకు దాసుడగుచు,
గురుమూలము గోరియున్న గురుభక్తుడగున్
గురుకరుణకు పాత్రుండై,
కరిగించును గురుని హృదయ కమలామృతమున్ ॥

గురు శుశ్రూషతోబాటు గురు సన్నిధానమున అనగా గురువు ఆశ్రమమున శిష్యుడు మెలగవలసిన విధమును "మను ధర్మ శాస్త్రము"న నిట్లు "మనువు" వివరించెను.

శ్లో॥ ప్రీతి శ్రవణ సంభాషోన్ శయానో నసమాచరేత్ ।
నాసీనో నచ భుంజానో నతిష్ఠన్ న పరాఙ్ముఖః ॥ - 1

శ్లో॥ ఆసీనస్యస్థితః కుర్యాదభి గచ్ఛంస్తు తిష్ఠతః ।
ప్రత్యుగమ్యత్వావ్రజతః పశ్చాద్ధవంస్తుధావతః ॥ - 2

శ్లో॥ పరాఙ్ముఖ స్వాభిముఖో దూరస్థస్యైతవంస్తు చాంతికం ।
ప్రణమ్యతు శయానస్యని దేశేచైవ తిష్ఠతః ॥ -3

భా: గురువాజ్ఞగా చెప్పినదానికి శిష్యుడు శయనించీ, కూర్చుండీ, భుజించుచూ, పెడమొగముపెట్టి ముచ్చటించుటనూ, బదులు చెప్పుటను చేయరాదు.

గురువు ఆసనమున కూర్చుండియుండి ఆజ్ఞయిచ్చిన యెడల శిష్యుడు నిలుచుండి వినమ్రుడై ఆ ఆజ్ఞను శిరసావహించుట యుక్తము. గురువు నిలుచుండి ఆజ్ఞ నిడిననే శిష్యుడెదురేగి మాటలాడవలెను. గురువు కొలది దూరమున నడచుచూ మాటలాడిన, శిష్యుడు గురువు దరికి చేరి వినమ్రుడై మాటలాడవలెను. ఒకచో గురువు పరుగిడుచు మాటలాడిన, శిష్యుడు తానునూ వారిని వెంబడించి పరుగిడుచునే సంభాషించవలెను.

ఇట్లు, ప్రతిక్షణమున గురువును గౌరవించుచూ, ఆ గురువాజ్ఞల శిష్యుడు శిరసావహించవలయును. తద్భిన్నముగా నడచుటే గురుద్రోహము. గురువాదరణయే భగవదాదరణం. గురువును సేవించడంలో కేవలం శరీరంతోనేగాక, మనోబుద్ధులతో, గురువుని హృదయభావాలనుగ్రహించుయత్నముగా జ్ఞాన స్వభావముతో, ఆత్మార్పణంతో సేవించవలెను. వారి సేవతోపాటు, తాను వారినుండి గ్రహించిన సద్విషయాలను,

సద్బోధలను అమలుపరచడమనునదియే "ఆచార్యోపాసనం" అందురు. అని శ్రీకృష్ణభగవానుడు గీతోపన్యాసంగా 13వ అ. 8వ శ్లోకములో నిట్లు పలికెను.

"ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః" - 8/2 పా॥

గురుసేవతో గుర్వనుగ్రహం పొందును. గుర్వనుగ్రహంతో దైవానుగ్రహం లభించును. ఈ రెండింటితో మోక్షమార్గం సుగమమగును. అందు శిష్యుడు 'శౌచమ్' శుచిత్వము మిక్కిలి ప్రాముఖ్యం. 12వ అ. 16వ శ్లోన నిట్లున్నది.

"అనపేక్ష శ్శుచిర్దక్షః" ఏకోరికలు లేని బాహ్యాభ్యంతరశుద్ధిగలవాడు దక్షుడు అని - అదియే ముముక్షత్వమునకు మార్గము. మరియు "స్థైర్యం", ఆత్మవినిగ్రహః" అన్నాడు. స్థిరత్వము, మనోనిగ్రహం, ఈ రెండును అత్యావశ్యకములు.

అటులే 17వ అ. 14వ శ్లో.న, "దేవ ద్విజ గురు ప్రాజ్ఞపూజనం, శౌచమార్జనమ్"-దేవతలను, బ్రహ్మనిష్ఠులను, గురువులను, జ్ఞానులను (బ్రహ్మజ్ఞానులైన మహాత్ములను) బాహ్యాంభ్యంతర శుద్ధి కలిగియుండి పూజించవలెనని, అదియే శారీరక తపస్సని శ్రీకృష్ణభగవానుడు నుడివెను. నిజమే బాహ్యాంభ్యంతరములందు వికాసం పొందగోరు శిష్యుడు అట్టి మహనీయులను భక్తి గౌరవ పురస్సరముగా సేవించుచు విద్యనభ్యసించుటను, "స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే" ఇట్లు వారిచేనామోదింప ఆదర్శమైన వేదమభ్యసించుటను వాగ్రూపంబైన తప్పంబని "శృతి" చెప్పెను.

కనుకనే శ్రీకృష్ణపరమాత్మ ప్రధాన పురుషేశ్వరునిగా లోకైక ఆచార్యుడుగా, యోగీశ్వరులకు ధ్యానమూర్తిగా స్తుతింపబడెను. అందులకే అర్జునునకు ఆత్మవేత్తగా నిలిచెను. కావున-

శ్లో॥ ఆచార్యో వేద సంపన్నః విష్ణుభక్తో విమత్సరః,
మన్త్రజ్ఞో మంత్రభక్తశ్చ సదా మన్త్రార్థదశ్శుచిః ।
గురుభక్తి సమాయుక్తః పురాణజ్ఞోవిశేషతః
ఏవం లక్షణ సంపన్నో గురురిత్యభిధీయతే"-
అని గురువును గూర్చి పలికిరి.

శ్లో॥ గురుపుంగవ పుంగవ కేతనతే, సమతా మయతాం నహికోఽపి సుధీః ।
శరణాగత వత్సల తత్త్వ నిధౌ, భవ శంకర దేశిక మే శరణమ్ ॥

భా: గురుపుంగవుడు ఆదర్శమూర్తిగా పురుషోత్తముడుగా, శరణాగతవత్సలుడుగా "త్వామేవ శరణం గతః" అని అకుంఠితమైన గురుభక్తిని ప్రదర్శించవలెను.

(శ్రీ శంకరాచార్య ఉవాచ)

"తేషాం త్వయాసనేన ప్రశ్వసి తవ్యం" - "శృతి" ఉవాచ.

ఆచార్యుడు ఆసనమునందుపవిష్టుడై నుపదేశించు సమయంబున శిష్యుడు బిగ్గరగా నిట్టూర్పు విడవరాదు.

"ఆచార్యాయ ప్రియంధన మాహృత్యప్రజాతంతుం మావ్యవచ్ఛేత్సీ !"-ఇతి "శృతి"

విద్యనభ్యసించిన పిదప **శిష్యుడు ఆచార్యున**కు ప్రియమైన ధనమును గురుదక్షిణగ నొసంగి, గురువనుజ్ఞచే గృహస్థాశ్ర**మమును స్వీకరించి** ధార్మికుడై, ధర్మప్రజాసంపత్తిని కలిగి యుండవలయునని, "శృత్యుపదేశము"-

గురుశుశ్రూష చేసియు, పుష్కలమైన గురుదక్షిణను నొసంగియు, తన విద్యనొసంగియు విద్యను గ్రహించిన వారు కలరు.

అటులే, "బ్రహ్మపురాణమున"ను, 222వ అధ్యాయమున, 22వ శ్లోకము నుండి 28వ శ్లోకము వరకు, గురువు యెడల శిష్యుడు మెలగవలసిన విధులు నిట్లుపదేశింపబడినవి.

శ్లో॥ బాలః కృతోపనయనో వేదాహరణ తత్పరః ।
గురోర్గేహేవసన్విప్రా బ్రహ్మచారీ సమాహితః ॥ -22

భా: బాలుడుపవీతుడై వేదాధ్యయన తత్పరుడై గురుగృహమందు (ఆశ్రమమందు) వసించుచు బ్రహ్మచారియైయుండవలయును.

శ్లో॥ శౌచాచార రతస్తత్రకార్యం శుశ్రూషణం గురోః ।
వ్రతాని చరతా గ్రాహ్యోవేదశ్చ కృత బుద్ధినా ॥ - 23

భా: శిష్యుడు సదాచారమందభిలాషగొని, గురు శుశ్రూష జేయవలెను. (శుశ్రూషయనగా, సేవలందించుటయేగాక, గురు విద్యవినవలెనను కోరిక, గురువాజ్ఞను వినుట, అటులే నడుచుకొనుట) వ్రతదీక్షగా అనగా బ్రహ్మచర్యవ్రతముల పాటింపవలసి యుండును. మనస్సును నిల్పి, నిశ్చలమైన అవధానముతో వేదమునభ్యసించవలయును.

శ్లో॥ ఉభే సంధ్యే రవిం విప్రాస్తథై వాగ్నిం సమాహితః ।
ఉపతిష్ఠే త్తథా కుర్యాద్గురోరప్యభివాదనమ్ ॥ - 24

మది కుదుర్చుకొని యుభయ సంధ్యలందును అగ్ని కార్యములందు పాల్గొని గురువునకభివాదము చేయవలెను.

శ్లో॥ స్థితే తిష్ఠేద్వ్రజేద్యాతి నీచైరాసీత చాఽసితే ।
శిష్యో గురౌద్విజశ్రేష్ఠః ప్రతికూలంచ సంత్యజేత్ ॥ -25

భా: గురువు నిలువబడిన తాను (శిష్యుడు) నిలబడి, నడచినచో వెంటనడచి, ఆయనకు క్రిందుగా (నేలపై) కూర్చుండవలెను. గురువునకు ప్రతికూలమైన పనిని వదిలిపెట్టవలెను.

శ్లో॥ తేనైవోక్తం పఠేద్వేదం నాన్యచిత్తః పురస్థితః ।
అనుజ్ఞాతంచ భిక్షాన్నమశ్నీయాద్గురుణా తతః ॥ - 26

భా: ఆయనతో (కంఠంకలిపి) వేదం పఠింపవలెను. ఆతనికెదురుగా కూర్చుండి వేరు తలంపు పొందరాదు. ఆపై బిక్షాన్నము తెచ్చి ముందుగా గురువునకు నివేదించి, తదనుమతిందానది తినవలెను.

శ్లో॥ అవగాహేదపః పూర్వమాచార్యేణావగాహితాః ।
సమిజ్జలాదికం చాస్యకల్ప కల్పముపానయేత్ ॥ - 27

భా: గురువు (నదిలో) దిగి స్నానము చేసిన తర్వాత నా తీర్థమందు తాను దిగి స్నానము చేయవలెను. సమిధలు తీర్థమును గురువునకై శిష్యుడు ప్రతికల్పము (అవసరమైనప్పుడల్ల) తేవలెను.

శ్లో॥ గృహీత గ్రాహ్యవేదశ్చ తతోఽను జ్ఞామవాప్యవై ।
గార్హస్థ్య మావసేత్ప్రాజ్ఞో నిష్పన్నగురునిష్కృతిః ॥ - 28

భా: వేదము చదివిన తరువాత గురుదక్షిణనను సమర్పించి, ప్రాజ్ఞుడై గార్హస్థ్యమందు ప్రవేశింపవలెను.

223వ అధ్యాయమునందున్న 31వ శ్లోకమున-

శ్లో॥ గురుతల్పీ గురుద్వేషి గురుకుత్సార తిశ్చయః ।
బ్రహ్మద్విద్వాఽపి పతతి బ్రహ్మణో బ్రహ్మయోనితః ॥

భా: గురుతల్పగుడు, గురుద్వేషి, గురువుల పరిహసించువాడు బ్రహ్మద్వేషి బ్రాహ్మణ్యపతితుడగును. అని వివరించబడెను.

మరియు, గురుశుశ్రూషా విధానముల వివరణలు శృతులలోనిట్లు చెప్పబడెను.

1. గురుని గృహారామ, క్షేత్ర, పశు, ధన, ధాన్యాదులను రక్షించుటనునది- "స్థాన శుశ్రూష"

2 దేశికునకు అభ్యంగన స్నానము, పాదసంవాహనాదుల జేయుటనునది- "అంగశుశ్రూష"

3 గురుడే సర్వము - అనగా తల్లి, తండ్రి, బంధువు స్నేహితుడు విద్య, ధనము దాత, దైవము, రక్షకుడని భావించుటనునది - "భావశుశ్రూష"

4 గురువునకిష్టములగు పదార్థములడుగమునుపే తుష్టిగా విందుగా తెచ్చియిచ్చుట - "ఆత్మశుశ్రూష"

ఇట్లు, శుశ్రూష వివరములను **శిష్యుడు** గురువులపట్ల ప్రవర్తించుటనునది మహోన్నతమైన మనోయజనం.

ఇక షట్ చత్వారింశత్ - ప్రమేయములలో -

1 "గురుసంకీర్తన" ప్రథమమైనది

2 ఏకోన పంచాశత్ - ఉపపాతకములలో "గురుత్యాగము" - రెండవది

3 షట్కర్మలలో - "గురుసేవ" ఇది మోక్షోపాయ కర్మ ఇదే ఆత్మసంయమ నియమము

4 నవవిధ స్నాతకములలో "గురుదక్షిణ"కై, ధనార్జనకై యాచించుట ఆ ధనమును సమర్పించుటయును (ఈరెండును సద్ధర్మములే అని మనుస్మృతి ౧౧-౧)

5 దశాపరాధములలో, "గురువును అవమానించుటనునది . దీనికి ప్రాయశ్చిత్తం భగవన్నామం జపించుట శ్రేయస్సు.

6 "దశ" విధనియమములలో, "గురు శుశ్రూష ప్రథమమైనది ఈ దశవిధ పుణ్యకర్మలలో "గురుజనసేవ" శ్రేష్ఠము

ఇట్లు శిష్యులు విద్యాలక్ష్మిని సాధించు నిమిత్తమై, లోకంలో పవిత్రీకరింపజేసే కర్తవ్యములలో "గురుపాదసేవ యొకటి అదియును శ్రద్ధాభక్తులతో, వినయ సంపదలతో గురుపాదసేవతో విద్యనార్జించడం ఆ విద్యా సముపార్జనతో శిష్యుడు పరిపూర్ణుడుగా, కృతార్థుడగా ధన్యజీవిగా కీర్తింపబడును

గురుసేవారతునకు గురువు యెడల కోపం తగదు "గురు శుశ్రూషయా జ్ఞానం"- విదురనీతి. సేవా, సంస్కారంతో కూడిన నమస్కారం ద్వారానే శిష్యుడు జ్ఞానం పొందును తన వినయ విధేయతల ద్వారానే గుర్వనుగ్రహం, ప్రీతిని, ఇష్టమును పొందును ఇక విద్యాజ్ఞానము ఆ శిష్యునకు కరతలామలకమేయగును వారి హృదయమెపుడు పరిపక్వమై, నిర్మలమై, భక్తియుతమై అలరారుచుండును అట్టి శిష్యుని గురువు వెతికికొని తెచ్చి అతని హృదయక్షేత్రమందు జ్ఞాన బీజమును నాటి తరింపజేయును- ఇట్టి దృష్టాంతములు పురాణములందు, చరిత్రలలోను కాన బడుచున్నవి

శ్లో॥ గురుశ్చైవ ప్రసాదేన తవచైవోప శిక్షయా ॥ - 40/2. పా

శ్లో॥ తస్యచైవ ప్రసాదేన ప్రాదర్భూతం మహామునేః ॥ - 40/1.పా

జనకమహర్షి గురువుగా శుకమహర్షితో గురు శుశ్రూషగూర్చి యిట్లనెను.

గురువుగారి యనుగ్రహమువలన, నీ శుశ్రూషవలన నీకు అంతయూ జ్ఞానోదయమయ్యెను. అటులే నాకునూ గుర్వనుగ్రహము వలననే జ్ఞానము ప్రకాశించుచున్నది.

కావున గురువు జ్ఞానదీపిక నిచ్చే సాక్షాద్భగవత్స్వరూపుడు. అనగా మానవ మాత్రుడు కాదని భావము. జీవునకు (శిష్యునకు) నిదర్శనార్థము గురు సన్నిధియే ఏకైక మార్గము. భగవత్స్వరూపుడైన శ్రీకృష్ణపరమాత్మను అర్జునుడు మొదట మానవమాత్రుని గానే భావించియుండినను, శ్రీకృష్ణుడు మాత్రము తనకు తగు శిష్యుడు అర్జునుడే యని ఎన్నుకొని, బంధుత్వమేర్పరచుకొనుటేగాక, అతనిలోనున్న కించిత్ అహంకార అజ్ఞానాంధకారమును తొలగించుయత్నముగా తగు సమయముననే (యుద్ధరంగమున) గీతోపదేశమొనర్చి ప్రధాన పురుషేశ్వరునిగా, లోకైక గురువుగా స్తుతింపబడెను.

ఇట్టి గురుసన్నిధిలో (చేరువలో) నుండి శుశ్రూష మొనర్చడం మెంతో ఫలదాయకం. ఆ శుశ్రూషయు త్రికరణ శుద్ధిగా, భక్తి భావముగా నుండిన ఆ గురువు నుండే యేదోయొకనాడు గుర్వనుగ్రహముతో సర్వమును పొందవచ్చును.

కావున శిష్యుడు బ్రహ్మచారిగానుండి గురుసన్నిధానములోనే యుండి దాంతుడై గురువునకు దృఢ సౌహార్థపూర్వకంగా దాసుని మాదిరిగా నమ్రతతో హితాన్నంచరిస్తూ ప్రతిదినం ప్రాతస్సాయంకాలాలలో గురుపూర్వకంగా అగ్న్యాదిత్య సురోత్తములను నుపాసిస్తూండాలి. సంధ్యాత్రయ సమయములలో గాయత్రీ జపవర్తియై, ఉభయ (ప్రాతస్సంధ్యలలో) సంధ్యలలో మౌనవ్రతాన్ననుష్ఠించాలి. గురువు పిలిచినపుడు మాత్రమే వినయంతో సమీపించి, ఆయన పాదాలకు తలసోకునట్లుగా వినమ్రుడై నిలవాలి. వేదాధ్యయనానంతరం తిరిగి వెళ్లేటప్పుడును సాగిలబడి మ్రొక్కి ఆయన ఆజ్ఞను పొందిన తదుపరియే అక్కడ నుండి మరలవలెను.

ప్రాతస్సమయములలో విహిత గృహాలకు భిక్షార్థం పర్యటించి వచ్చి, ఆ భిక్షాన్నాన్ని గురువునకు నివేదించి ఆయన అనుమతి గైకొనిన పిదపనే తాను భుజించాలి. గురువు అనుమతించని నాడు ఉపవసించాలి. సౌశీల్యం, మితాహారం, శ్రద్ధ, భక్తి, దక్షత, జితేంద్రియత్వం వంటి వాటి యెడల యెన్నడును పరాకు చెందకూడదు. పరస్త్రీలతో పనిపడితే, తత్కార్యపర్యంత కాలం మాత్రమే యుండి తగురీతిగానే ముచ్చటించి నిష్క్రమించాలి. మితముగానే వారితో వ్యవహరించాలి- కేశసంస్కారం ఉన్మర్ధనం, జలకం అభ్యంజనం

వంటి క్రియలు ఏ వయస్సులో నున్న స్త్రీల చేత యెన్నటికిని చేయించుకొనరాదు - ఎందుకంటావా?

ఆ   పొలది దాప వహ్నిపురుషుడాజ్యఘటంబ
కరుగ కుండరాదు కడిగేనేని
బ్రహ్మయైన కూతు బట్టక మ్మానదు
వడుగు కింతి పొత్తు వలదు వలదు.

కావున బ్రహ్మచారిగానుండి గురుకుల నియమాలతో గురుశుశ్రూషతో వేదవేదాంగాలును అభ్యసించి, అధ్యయనానంతరం గురుభక్తిగా గురువునకు "గురు" దక్షిణను యధాశక్తిగా సమర్పించి, ఆయన అనుజ్ఞాతుడై వెడలి, వీలగుచో మరలి వచ్చి గురువాజ్ఞగా తక్కిన ఆశ్రమములో తనకభీష్టమైన దానిని స్వీకరించవచ్చును లేదా నిత్య బ్రహ్మచారిగాను నుండిపోవచ్చును.

ఏ ఆశ్రమములలో నున్న వారైన అనునిత్యం పాటించే ముఖ్య ధర్మ మొకటున్నది అదేమిటనగా!

ఏ ఆత్మ గురువులో, అగ్నిలో, సర్వభూతాలలో, తనలో జీవరూపాన నుంటూనే, ఉందని వాడుగా భాసించే ఆ ఆత్మని తత్వాన్ని విచారించాలి పెద్దలు చెప్పిన అనుభవసారాన్ని విచారపూర్వకంగా సమన్వయించుకొని తత్వపరులై చరించేవారు చివరకు పరబ్రహ్మాన్ని చేరుకుంటారు. సర్వాశ్రమాలకు ఇదే పరమధర్మం. గురువాజ్ఞతోనే గృహస్థాశ్రమ జీవనానికి పూనుకోవాలి. అటుపిదప వానప్రస్థ ధర్మం పాటిస్తూ బ్రహ్మపథంలో పయనించు ఆధ్యాత్మిక చింతనతో కాలం గడపాలి. గురువాశ్రమ మనేడిది సరస్వతీ నిలయం వంటిది సరస్వతీ వాగ్రూపంబైన గురువును వాగ్దేవతగా భావించవలెను. అది సర్వతీర్థనిలయం

"నారదపురాణం"లో 18/2 శ్లోకపాదమున నిట్లున్నది.

"నవినాగురు సంవాసాత్ జ్ఞాన స్యాధిగమ స్మృతః"

గుర్వాశ్రమమున నివసించక జ్ఞానము పొందలేదు. అని కావున, "నవినాగురు సంబంధాత్ జ్ఞానస్యాధిగమస్తథా" - 20/2 గురుసంబంధం లేనిచో జ్ఞానము లభించదని కలదు.

శ్లో॥  ప్రక్షాళ్య పాదమాచమ్యగురోరభి ముఖస్సదా ।
తస్య పాదౌ చ సంగృహ్య అధీయాత విచక్షణః ॥    (నా.పు.25 అ 45 )

భా:  పాదప్రక్షాళనమొనర్చి, ఆచనమనము చేసి గురువుగారికి అభిముఖముగా నుండి

గురుపాదములను గ్రహించి వినేకముగా అధ్యయనమొనర వలెను.

శ్లో॥ సాంగాన్వేదాన్గురోర్యస్తు సమధీతే ద్విజోత్తమః ।
సోఽనూచానః ప్రభవతి నాన్యథా గ్రంధ కోటిభిః ॥

గురువువలన సాంగోపాంగముగా వేదాధ్యయన మొనర్చు మానవోత్తముడు "అనూచానుడ"నబడును స్వయముగా కోటి గ్రంధములను చదివిననూ అనూచానబడదు.. .అని. (యజుర్వేదమునందున్న శివుని మహాత్మ్యమును ప్రకటించు రుద్రాధ్యాయమున నిట్లు కలదని, "నారదపురాణము" 50వ అ 12వ శ్లో తెలిపెను)

"ఈ నారద పురాణం" లోనే "గురుకుల వాసధర్మం" గూర్చినిట్లు తెలుపబడెను.

పూర్వకాలమున లోకహితమునకై బ్రహ్మధర్మ సంరక్షణమునకై నాలుగాశ్రమములను నిర్దేశించెను. ఆ నాలుగాశ్రమములలో "గురుకుల వాసధర్మం" మొదటిది.

ఈ గురుకుల వాసమున చక్కగా శౌచసంస్కార నియమ వ్రతములచే మనస్సును నిగ్రహించి ఉభయ సంధ్యలందు సూర్యాగ్నులను ఆరాధించి, సోమరితనమును. ఆలస్యమును వీడి గురువునకభివాదమొనర్చుచు. వేదాభ్యాసముచే, శ్రవణముచే అంతరాత్మను పవిత్రమొనర్చుకొనవలెను. త్రికాలస్నానాదికములను నిర్వర్తించి బ్రహ్మచర్యమును. అగ్నిపరిచర్యను, గురుశుశ్రూషను నిత్యభిక్షాచరణమును. భిక్షచే లభించినదానిని గురువునకు నివేదించితాను భుజించవలెను. అధ్యయనమందు అంతరాత్మను గుర్వధీనమొనర్చి, గురువు చెప్పిన మాటను ఆజ్ఞగా పరిపాలించుచు. (అనగా వ్యతిరేకించుటనునది ఏకోశానలేక) గుర్వనుగ్రహము పొందుచు స్వాధ్యాయమును నభ్యసించు చుండవలెను.

స్వాధ్యాయనమెట్లు? - "స్వం అధ్యయనం స్వాధ్యాయః" ఈ స్వాధ్యాయము ఆత్మచికిత్సకం, తపోరూపము. "తపోహి స్వాధ్యాయః" పరమాత్మను దర్శించుటకు స్వాధ్యాయ యోగములు చక్షుస్థానీయములు

నారద. వాల్మీకి. వ్యాసాది మహర్షులందరు స్వాధ్యాయ తపో నిరతులే- కావున స్వాధ్యాయము పరమాత్మ తత్త్వావ బోధన క్షమమనియు నిట చక్కగా నిరూపింపబడెను. గురువును నారాధించుటను ఈ విషయమున నొక శ్లోకము కలదు.

శ్లో॥ గురుం యస్తు సమారాధ్యద్విజో వేదమవాప్నుయాత్ ।
తస్య స్వర్గ ఫలా వాప్తిః సిద్ధ్యతే చాస్యమానసమ్ ॥

భా: గురువునారాధించి వేదమును పొందినవానికి స్వర్గఫలము లభించును.

(నా పు. 43అ. 111శ్లో)

ఈ గురుకులాశ్రమములో నుండి గురువులనారాధించుటను.

గురుసంప్రదాయమనునదియును చాలా పవిత్రమైనది. ఎందుకనగా?

భగవంతుని కంటే హెచ్చుగా భాగవతులను. వారికంటే మిన్నగా, "ఆచార్యులను" ఆరాధించగలగాలి. దీనినే మన సంప్రదాయంలో "పర్వత్రయనిష్ఠ" అంటారు. ప్రథమ పర్వనిష్ఠ భగవన్నిష్ఠ-రెండవ పర్వనిష్ఠ భాగవతనిష్ఠ. మూడవది ఆచార్యపర్వనిష్ఠ.

"పర్వ" అంటే "కణుపు"; అనగా "మెట్టు" మొదటదాని కంటె రెండవది. రెండవదానికంటే మూడవది శ్రేష్ఠమని, అదే ఆచార్యనిష్ఠ. దానినే "చరమ పర్వనిష్ఠ" అన్నారు.

మొదటి మెట్టును చేరుకోవాలనుకొన్నను ఆచార్యుడవసరమే కదా? ఈ మొదటి మెట్టును తాకినవాడు, (చేరినవాడు) రెండు, మూడు మెట్లు దాటినట్లే యగును. కనుక మొదటి, రెండవమెట్లు చేరుకోవాలన్న మూడవమెట్టగు ఆచార్యుడంత అవసరము. మొదటి, రెండవ మెట్లను చేరినచో మూడవమెట్టు మనస్సునకు సమన్వయమగును. అప్పుడే "చరమ పర్వనిష్ఠ" చరితార్థమవుతుంది.

విద్యాధ్యయన సమయమున శిష్యులు గ్రహించినది, గ్రహింపదగినది ఒక పాదము మాత్రమే. అనగా తాను శ్రవణము జేసి సంపాదింపగలిగినది ఒక వంతు మాత్రమే అని అట్లు శ్రవణము జేసిన విద్యను శ్రద్ధగా మనన మొనర్చి, అట్టి మననంతో యనుభవంలోకి తెచ్చుకోవాలి. అట్లు స్వమేధయా సంపాదించిన జ్ఞానంతో నతని విద్య రెండు వంతులగును. అనగా ద్విగుణీకృతమగును.

**అదే- "ఆచార్యాత్పాదమాదత్తే-** పాదం శిష్యః స్వమేధయా" ఆ శిష్యులే బుద్ధి **కుశలతతో పరిశోధించి, ఒకరినొకరు** "ముఖేముఖే సరస్వతి"గా తోటి విద్యార్థులతోను. గోష్ఠులు సలుపుచు. **తదితర** మేధావులతోను సంవాద రూపముగా మరిన్ని విశేషాంశాల **నెన్నిటినో తెలిసికొనవచ్చును.** అటులే

**"పాదం** సబ్రహ్మచారిభ్యః"

**సాహ**చర్యాదుల ద్వారా మనస్సున నావరించిన అజ్ఞానమేఘాలు తొలగి, క్రమముగా బుద్ధివికసించును.

అంతమాత్రముచేత సంపూర్ణం కాలేదు. దీనితో నిలిచిపోయేనా, నతడు (శిష్యుడు) అట్టి అసంపూర్ణ విద్య అతని ఆధ్యాత్మకౌన్నత్యమునకు పకరించకపోగా, అహంకారహేతువు కాగలదు కూడ. అనగా అర్థజ్ఞానులుగా నిలుచుదురు. "Half Knowledge is allways danger" అన్నట్లగును.

కనుక తానునేర్చిన, అధ్యయనమొనర్చిన విద్యను అనుభవజ్ఞుల నాశ్రయించి,

శుశ్రూషతో ఆ విద్యను వారి ముందుంచి. ఆ విద్యాలక్ష్యాన్ని గుర్తించాలి. విద్యారహస్యాలను తెలిసికోవాలి.

గురు శుశ్రూష వల్లనే సర్వసిద్ధులు లభిస్తాయి. యోగం లభిస్తుంది. ఆ యోగంతో ఆత్మసిద్ధిని శిష్యుడు సాధించాలి. అందులకు నీ సూక్తియే తార్కాణము.

శ్లో॥ గురోః పదార్చాప్రదదాతి యోగం. యోగేన లభ్యాస్వయమేవ సిద్ధిః ।
జలప్రదానేన ఫలం ప్రసూతే ద్రాక్షా-నతే వక్త్రపుటె దదాతి ॥

భా: సద్గురువును సేవిస్తే యోగం ఆ యోగంతో ఆత్మసిద్ధిని సాధించుకోవాలి శిష్యుడు. నీళ్లు పోస్తే ద్రాక్షతీగ పెరిగి పళ్లు కాస్తుంది. అంతేగానీ నీ వక్త్రంలోకి పెట్టదు.

గురువులు తమ శిష్యులకు యోగ్యత సిద్ధించేలాగా పట్టుపట్టి కృషి సల్పుతారు. కాని, ఆ గురువు యొక్క కృషికి వెనకాల శిష్యుడి కర్తవ్యం? అదియే, "గురోఃపదార్చా" గురువుగారి పాదసేవ. అక్కడితోగాక, ద్రాక్షతీగకు నీరు పోయటం-ఇదియును గురుసేవయే-అనగా రైతే శిష్యుడు. ద్రాక్షతీగయే గురువు. తదుపరి లభించేది యోగం. అదియే ద్రాక్షగుత్తి. ఆ ద్రాక్ష పండును రైతు (శిష్యుడు) ఆస్వాదించటమే సిద్ధి. అందులకు శిష్యుడు సద్గురువును అన్వేషించుకోవాలి. అనగా ద్రాక్ష తీగెను పాతటమన్నమాట.

అన్వేషించి ఆశ్రయించిన గురువును సేవించాలి. ఇదే కుదుట్లో నీళ్లుపోత. ఇంతవరకు శిష్యుడి (రైతు)పని. ఆ తరువాత ద్రాక్షతీగ ఎదిగినట్లుగా సద్గురువు యొక్క కరుణ పెరుగుతుంది. ద్రాక్ష గుత్తులు పండినట్లుగా, శిష్యుడికి యోగాన్ని అందిస్తుంది. ఇంతవరకు గురువు పని.

ఈ యోగంవల్ల పరమాత్మ సిద్ధి. ఈ పరమసిద్ధి గురువుయొక్క శక్తిపాతంతో గానీ, అభ్యాస శిక్షణద్వారాగానీ యోగం సిద్ధిస్తోంది. సిద్ధికి యోగం అనేది సాధనం అనగా సిద్ధి ఒకరు ఇచ్చేది కాదు. ఒకరు పుచ్చుకొనేది కాదు. కేవలం గురువును సేవిస్తూ, గురువు ఆచరణను అనుసరించాలి.

సద్గురువు యోగం యిస్తాడు. పొందవలసిన సిద్ధియును సూచిస్తాడు. దీనికి, దానికిని మధ్య- "చేతికీ, నోటికి"ని వున్నంత దూరం వుంటుంది. ఆ చేతినీ, నోటినీ సంయోజనం చేసే సాధన శిష్యుడికి వుండాలి. అని, నిర్ధారణగా, సూక్తిగా సామెతగా- "గురి చూపించేవాడే గురువు" అని, ఈ విషయాన్ని స్పష్టం చెయ్యటం కోసమే ఈ సూక్తి యోగం.

మొత్తం మీద. గురు శిష్య వ్యహారంలో గురువు యిచ్చేది కీలకమైనదే- అయినప్పటికిని, శిష్యులపాత్రే పెద్దదని. మిక్కిలి బాధ్యతయు శిష్యుడిదేననీ, అనగా

ప్రయత్నంతో కూడిన యోగంతో సిద్ధి శిష్యుడు పొందునని. ఈ సూక్తి హెచ్చరిక విశేషించి గురువనుగ్రహాన్ని శిష్యుడు సరియైనమార్గంలో వినియోగించుకోవలసిన బాధ్యతయును శిష్యుడిదే అని కూడా, గ్రహించవలసిన శిష్యుడి ప్రథమ కర్తవ్యం

"ఇమం వివస్వతే జ్ఞానం, ప్రోక్తవానహమవ్యయమ్"- అని గీతలో 4వ అధ్యాయము ప్రథమ శ్లోకములో నుడివినట్లు. ఏ యోగమునకైనను, విజ్ఞానమునకైనను ప్రథమ గురువు విష్ణువే విద్యార్థి సూర్యుడు. కనుక నీ అవతారమున ఆ గురు శిష్యులిద్దరూ అనగా శ్రీకృష్ణుడీ గీతను మొదట సూర్యునకు బోధించుటచే. జ్ఞాన సూర్యుడిగా ప్రకాశించుచు అవలీలగా ఆధ్యాత్మిక రహస్యములను గ్రహించగలిగెను. అదియే శిష్యునిలో నున్న సూక్ష్మగ్రాహ్యము

శ్లో॥ అధ్యాపయే స్మహదేతద్యశస్యం వాచోవికారాః కవయో వదంతి ।
అస్మిన్ యోగే సర్వమిదం ప్రతిష్ఠతమే తద్విదురమృతాస్తే భవంతి ॥

భా: మహత్తరమైనటువంటి, ప్రశస్తిని కలిగించేటటువంటి యోగశాస్త్రాన్ని యోగ్యమైన విద్వాంసుడు శిష్యులకు బోధించాలి. ఇతర శాస్త్రాలన్నీ వాక్కుల వికారాలే కాని, ప్రయోజనం కలిగించేవి కావు. సమస్తం యోగంలోనే యుంది - దీనిని తెలుసుకొన్నవారు అమృతులౌతున్నారు.

- (అని సనత్సుజాత ఉవాచ)

మంత్రం జపించాలంటే గురూపదేశం పొంది యుండాలి. గురువు చిన్నవాడైన పర్వాలేదు. అట్టి గురువు దీక్షాపరుడై ఉపాసనాపరుడై యుండిన. సేవించి మంత్రం పొందవచ్చును. నిజముగా సద్గురువులు సాధారణంగా సేవ చేయించుకోరు అయితే శిష్యుణ్ణి అనుగ్రహించడానికి, అతనిలోని లోపాల్ని, అహంకారాదుల్ని - తొలగించడానికే చిన్నచిన్న పనులిస్తారు - అనగా చేయమని.

మంత్రదీక్ష యిచ్చే గురువు వయస్సులో పెద్దవాడైయుండవలసిన అవసరం లేదు. పరీక్షిత్తు మహారాజునకు శ్రీమద్భాగవతాన్ని బోధించినవాడు యువకుడైన శుకమహర్షి (వ్యాస భగవానుని పుత్రుడు). అటులే శ్రీశంకర భగవత్పాదులకు మండన మిశ్రుడను శిష్యుడున్నాడు. మరి ఆయన (మండనీమిశ్రుడు) శ్రీశంకరభగవత్పాదుల కంటే వయస్సులో పెద్దవాడే.

మరియు ఆది గురువు, జ్ఞానస్వరూపుడైన దక్షిణామూర్తి యువకుడే శ్రీరామకృష్ణపరమహంసకు వయస్సులో పెద్దవాడైన వృద్ధ గోపాల్ అనే శిష్యుడుండేవాడు. మంత్రోపదేశానికి జ్ఞానం ముఖ్యంగానీ వయస్సుకాదు. గురు శుశ్రూషకు వయస్సులో చిన్నాపెద్దా చూడనవసరంలేదు

జీవులకు మనుష్య శరీరప్రాప్తి, మోక్షేచ్ఛ, సద్గురుసేవయునను మూడును మహాదుర్లభమైయున్నవి. పూర్వ జన్మ వాసనను బట్టియే సద్గురు కరుణాకటాక్షము. అట్టి సద్గురుని సేవాభాగ్యములభించుట అరుదు.

సద్గురువును చేరడంతో వాగ్రూపమున ప్రార్థించుట-

స్వామిన్నమస్తే నతలోకబన్ధో కారుణ్య సిన్ధో పతితం భవాబ్ధౌ ।
మాముద్ధరాత్మీయ కటాక్షదృష్ట్యా ఋజ్వ్యాతి కారుణ్య సుధాబ్ధి వృష్ట్యా ॥

భా: స్వామీ! మీ చరణారవిందములకు నమస్కారములు. తమకు నమ్రులగు వారలకు జనని జనకులయట్లు బంధువు దయాసముద్రుడవునగు స్వామీ! నేను సంసారసాగర నిమగ్నుడనైయున్నాను. తమ కరుణామృత వర్షధారలచేతను, సరళ కటాక్ష వీక్షణముచేతను ననుద్ధరింపవేడుచున్నాను అని యిట్లు ప్రార్థించవలెను.

శిష్యుడట్లు ప్రార్థింపగా, విని గురువు శరణాగతుడైన శిష్యునిపై కరుణించి, సమీపించి, అతనిలోని తపనను గ్రహించి తప్పక తత్త్వోపదేశము చేయును. దానితో నతని అజ్ఞానము నశించి బ్రహ్మాత్మైక్య భావము చెంది దుఃఖసంసార బంధమునుండి విముక్తి చెందును. ఆత్మస్వరూప, స్వకీయ నిర్మలజ్ఞాన చక్షువునకు సద్గురు స్వరూప (దైవత్వం) జ్ఞానం గోచరించును. తత్త్వజ్ఞాన ప్రాప్తియుపొందును.

ఇదంతయును సద్గురు సేవాప్రయత్నముతో త్రికరణ శుద్ధత్వంతోనే లభించును. అతడెంతటి విజ్ఞుడైనను సరే.

శిష్యుడెంతటి మేధావుడైన, మహాత్ముడైన గురువు సాన్నిధ్యమవసరం. సద్గురువుని నాశ్రయించనిదే, గురువు శుశ్రూష చేయనిదే విద్యార్థికి విద్యాసిద్ధి, జ్ఞాన సిద్ధి చేకూరదు. అందులకే, ప్రాచీన వేదమహర్షులు సాంప్రదాయప్రకారం, గురువుల నాశ్రయించి, గురుపాదసేవ[illegible] యత్నించెడి వారలు. వారెం[illegible] మహాత్ములైనను సరే.

గురువు కృప బహు సున్నితమైనది. పరిపూర్ణ శరణాగతితోనే గురు కృప లభించును. దానికై గురుశుశ్రూష అవసరం. [illegible]ముగా గురుశుశ్రూష బహుతేలికైంది. శిష్యుని హృదయం తేలికపరచేది. గురుసేవకడ్డుదారులేమీ యుండవు.

గురువాజ్ఞ నెరవేర్చుటనునది, గురువు శక్తిని (అనుగ్రహం) పొందినట్లుగా, ధీరుడై, విశ్వాసముతో ప్రారంభించాలి. గురువనుగ్రహంతో నాపని సఫలీకృతమగును. శిష్యుని, గురువనుగ్రహమనే తైలంతో, హృదయంలోనొక 'జ్యోతి' ప్రజ్వలిస్తున్నట్లు శక్తి రూపముత్పన్నమై కార్యమునకెట్టి విఘ్నము కలుగదు. అదే అనురూప శక్తి అంటారు. అనగా గురురూప

ఆత్మవిద్యను నాస్వాదించు గురు మార్గమది ఇక ఆ శిష్యునిలో జ్ఞానజ్యోతి వెలిగినట్లే

అట్లు గురు కటాక్షమున శిష్యుడు స్వస్వరూపమును తెలిసికొని జీవభ్రాంతిని వీడి, బ్రహ్మస్థితిరూపుడగు గురువే తన జ్ఞాన జ్యోతి స్వరూపుడని గ్రహించగా, శిష్యుడట్లు చైతన్యం పొందగా గురువు ప్రసన్నుడగును

గురు శుశ్రూష ముఖ్యంబని, ముఖ్యసాధనమని శ్రీరాముడు ఆంజనేయునితో ననెను.

సీ॥ గురు పదాంభోజముల్ గొలువక కల్గునే
ప్రవిమల వైరాగ్య భాగ్యమహిమ,
గురుపాద తీర్థంబు గ్రోలక కల్గునే
జ్ఞాన విజ్ఞాన యోగానుభవము
గురు సుప్రసాదంబు గొనకున్నగల్గునే
ప్రతి లేని చిత్తోపరతి సుఖంబు
గురు తత్త్వమాత్మగన్గొనకున్న గల్గనే
నిరతి శయంబైన పరమ పదము

తే॥ అట్లుగావునీ విద్యార్థియైన యోగి
వినయభక్తు లెదలోన బెనగొనంగ
నలచతుర్విధ శుశ్రూషలాచరించు
కొనుచుననిశంబు గురువుల గొలుచు ననఘ

(సీతారామాంజనేయ సంవాదం 3వ అ 180 ప)

ఇట్లు బ్రహ్మజ్ఞానము కోరుయోగి గురువునాశ్రయించి వినయ భక్తులమెరయ చతుర్విధ శుశ్రూషల నాచరించుచు సేవించవలెను

అట్లు సేవించుటనునది, శిష్యుని ధన్యత్వజీవన పరమావధి అందులకా గురువు కూడ శిష్యుని పరిపూర్ణ విశ్వాసమును చూరగొని సదానంద రస సింధు నిమగ్నుడై నిరుపమానమగు మనస్సుతో చిరకాల యశస్సు చేకూర్చునట్లు ఆశీర్వదించును.

ఇట్లుభయుల పవిత్ర హృదయములను గాంచిన పరమాత్మయును పరిపూర్ణానందమును పొందును-

గురువుచే విద్య గరుపువాడు కనుక అతడు శిష్యుడని. శిష్యునిచే శుశ్రూష సమ్మానింపబడువాడు కనుక గురువునకాపేరు వచ్చెను. కావున శిష్యుడు సకలప్రయత్నముల ద్వారా గురువును గౌరవించవలెను. గురువే దైవమని. సర్వంబని యెంచవలెను. ఆతడు

సర్వమంత్రప్రభావ స్వరూపుడు కనుక, గురువాజ్ఞను శిరసావహించవలెను. దానిచే శిష్యుడు జ్ఞాన సంపదను పొందును. గురువు సన్నిధిలోనున్న సకల పాపములు హరించును. గురువు కోపము, శిష్యుని ఆయుర్దాయము, జ్ఞానసంపద, పుణ్యకర్మలు భస్మీపటలము అగును.

బ్రహ్మోత్తర పురాణమున గురుశుశ్రూష గూర్చియిట్లు చెప్పబడెను.

హంస ఉవాచ:-

శ్లో॥ జ్ఞాతవ్యాగురు శుశ్రూషా, పరమంధర్మ కారణమ్ ।
గురుశుశ్రూషయావిద్యాం. నరః సమధిగచ్ఛతి ॥

భా: గురుశుశ్రూష యొనర్చడం ధర్మహేతువు (సాధనము)లలో ఉత్తమము. అది యెరుగదగినది. నరుడు గురుశుశ్రూషతోనే విద్యను పొందగలడు.

శ్లో॥ యదేవ పుణ్యమాప్నోతి గురు శుశ్రూష యాద్విజః ।
ద్విజ శుశ్రూషయా శూద్రస్తదేవ ఫలమశ్నుతే ॥

భా: ద్విజుడు గురు శుశ్రూషచే నెంతఫలము పొందునో, శూద్రుడు ద్విజ శుశ్రూషచే అంతఫలము పొందును. అని, శృత్యువాచ-

"నారద పరివ్రాజకోపనిషత్"లో విద్యనర్థించు వాడెట్లు సద్గురువుని చేరవలె? ఎట్లు శుశ్రూష చేయవలె?నని నారదునకు హిరణ్యగర్భుడగు విష్ణుమూర్తి యిట్లు వివరించెను.

2వ మం: విధి వదా దావను పనీతో పనయనానం తరం శ్రద్ధావంతం సత్కులభవం శ్రోత్రియం శాస్త్రవాత్సల్యం గుణవంతమకుటిలం సద్గురు మాసాద్యనత్వా యథోపయోగం శుశ్రూషాపూర్వకం స్వాభిమతం విజ్ఞాప్య ద్వాదశవర్ష సేవాపురస్సరం సర్వ విద్యాభ్యాసం కృత్వా తదనుజ్ఞయా స్వకులాను రూపాభిమత కన్యాం వివాహ్యాపంచవింశతి వత్సరం గురుకుల వాసం కృత్వాఽథ గుర్వనుజ్ఞయా గృహస్థోచిత కర్మకుర్వన్ దౌర్బ్రాహ్మణ్య నివృత్తిమేత్య స్వవంశవృద్ధి కామః పుత్రమేకమాసాద్య"-

భా: అనుపనీతుడు విధి విధానముగా ఉపనయనమొనర్చుకొని. పిమ్మట సద్వంశ సంజాతుడును తల్లిదండ్రులకు విధేయుడునగునాతడు, ఆ తండ్రి సమీపమునగాక, మరియొక సద్గురువుని నాశ్రయించవలెను. మరి ఆ సద్గురువు సత్సంప్రదాయుడై శ్రద్ధావంతుడై, కపటరహితుడైనట్టి వారిని చేరి నమస్కరించి, శుశ్రూషజేస్తూ తన తపనను తెలియపరచి, ద్వాదశవర్షంబులు భక్తిశ్రద్ధలతో సేవలొనర్చుచు, సమస్త శాస్త్రములనభ్యసించవలెను. పిదపగురుదేవుల ఆజ్ఞతో తన వంశమునకు

చెందిన, అభిమతమైనదియగు అనగా ఆరు కన్నిషేధములతోడు నీడగా నుండి కన్యను వివాహమాడవలెను. 25 సం. లవయస్సు వరకు గురుకులవాసము చేసిన పిమ్మట, గురువుల యనుమతిని పొంది, గృహస్థాశ్రమమున కనుకూలమగు కర్మలనొనర్చుచు బ్రాహ్మణ విరుద్ధములగు కర్మలను త్యజించి, నిజవంశ వృద్ధి నిమిత్తమొక పుత్రుని పొందవలెను"-

(తదుపరి, విధివిధానముగా సన్న్యాసము పొందుటకును గురువు నాశ్రయించవలెను.) అటుపిదప-

షష్ఠోపదేశః 7వ మం.లో నిట్లు చెప్పబడినది

విరజ్యసర్వ భూతేభ్య ఆ విరించి పదాదీపి, ఘృణాం విపాట్య సర్వస్మిక్ పుత్రమిత్రాది కెష్వపి, శ్రద్ధాలుర్ముక్తి మార్గేషు వేదంత జ్ఞాన లిప్సయా. ఉపాయనకరోభూత్వా గురుంబ్రహ్మవిదం వ్రజేత్, సేవాభిః పరితోష్యైనంచిరకాలం సమాహితః, సదావేదాంత వాక్యార్థం శృణుయాత్సుసమాహితః నిర్మమో నిరహంకార స్సర్వసంగ వివర్జితః సదా శాంత్యాది యుక్తస్సన్ ఆత్మన్యాత్మానమీక్షతే."...

"యోగి (సన్న్యాసి) బ్రహ్మదేవుని పదము మొదలుకొని, సమస్త పదములనుండి, సర్వ జీవుల నుండియు విరక్తుడై, పుత్ర మిత్రాదుల యందు ప్రీతి వదలి శ్రద్ధాళువై, ముక్తిమార్గములందు వేదాంతజ్ఞానమును పొందగోరువాడై పత్రపుష్ప ఫలాదులనుగైకొని, బ్రహ్మవేత్తయైన సద్గురువును నాశ్రయించవలెను. సద్గురువును సేవాదులతో సంతోషింపజేసి వారి యొద్ద చాలకాలము సావధానముగా మిక్కిలి ఏకాగ్రతతో వేదాంతవాక్యములను నిరంతరము శ్రవణము చేయవలెను-

శిష్యుడు అహంకార మమకారములవర్జితుడై, సర్వసంగి వివర్జితుడై, సదా శాంత్యాది సద్గుణములతో గూడి యుండి, తన హృదయమునందు పరబ్రహ్మను వీక్షింపవలెను....

8వ మంలో- గురుణాంచహితే యుక్తస్తత్ర సంవత్సరంవసేత్....

అనూజ్ఞాప్య గురూంశ్చైవ చరేద్ధి పృథివీ మిమామ్....

"గురుసేవాతత్పరుడై వేదాన్త జ్ఞానార్జన నిమిత్తము సంవత్సరకాలము సద్గురువు సన్నిధిలో నుండవలెను.....

ఆ పిమ్మట సద్గురువుల అనుమతితో లోకసంచారము చేయవలెను.

"సపరివాట్సర్వక్రియాకారక నివర్తకో గురుశిష్య శాస్త్రాది

విసిరుక సుర్ః సంసారం విసుజుచామోహితః" -(6వ మం.లో)

సర్వక్రియాకారక నివర్తికుడగు పరివ్రాట్టు, గురుశిష్య భావమును, శాస్త్రాదులను త్యజించినవాడై, సమస్తసంసారమును విడిచిపెట్టి మోహ రహితుడగుచు... కైవల్యపదమగు పరమపదమును పొందుచున్నాడు.

అట్లు గురువుల సాంగత్యంతో, గురువుల శుశ్రూషతో తరించిన శబరి, తుదకు రఘుశ్రేష్ఠుడైన శ్రీరామచంద్రుడు సోదరుడగు లక్ష్మణునితో సీతాన్వేషణ నిమిత్తమై తనను చేరగా, తన జీవనం ధన్యమైనదని వారి పాదములపై వ్రాలి నమస్కరించి, తన ఆనందభాష్పములచే కాళ్లు కడిగి స్వాగత సత్కార్యముల నొనర్చెను. వారి రాకకై యెదురు చూచిన తన తపన యీడేరినదని భక్తి పారవశ్యముతో నిట్లనెను.

– "అత్రాశ్రమే రఘుశ్రేష్ఠ గురవోమే మహీర్షయః
స్థితాః శుశ్రూషణంతేషాం కుర్వతీసముపస్థితా
బ్రహ్మావర్షే సహస్రాణి గతాస్తే బ్రహ్మణః పదమ్
గమిష్యన్తోఽబ్రువన్మాం త్వం వసాత్రైవసమాహితా"–

అని. వారు వెళ్లుచు నాకిట్టి దర్శనభాగ్యము కలుగునని కూడా సెలవిచ్చిరి.

శ్లో॥ "యావదాగమనం తస్యతావద్రక్ష కళేబరమ్.
దృష్ట్వైవ రాఘవం దగ్ధ్వాదేహం యాస్యసి తత్పదమ్"
అని నాగురువులు పలికిరి.

శ్లో॥ తథైవాకరవం రామత్వద్ధ్యానైక పరాయణా,
ప్రతీక్ష్యాగమనం తేఽద్య సఫలంగురుభాషితమ్ ॥

ఆ గురువుల శుశ్రూష ఫలమో, వారి సాంగత్యఫలమో నేనెరుగకున్నాను.

"తవ సందర్శనం రామ గురూణామపి మేనహి"

అని పలికి, స్వామీ! నేను స్త్రీని. మూఢురాలను, మరియు నీచజాతియందు బుట్టినదానను. నీదాసుని దాసులకును దాసినగుట యందు నాకధికారము లేదు. ఇంకా సాక్షాత్తుగా నీకే దాసురాలనగు కధికారమెక్కడిది? అనిదీనముగా స్తోత్రము చేయగా, శ్రీరాముడిట్లనెను–

శ్లో॥ పుంస్త్వే స్త్రీత్వే విశేషోవా జాతి నామాశ్రమాదయః
నకారణం మద్భజనే భక్తి రేవహి కారణమ్"

శ్లో॥ భవేత్ సర్వం తతో భక్తిర్ముక్తిరేవ సునిశ్చితమ్
యస్మాన్మద్భక్తి యుక్తాత్వం తతోఽహం త్వాం ఉపస్థితః"

ఇతో మదర్శనాన్ముక్తిస్తవ నాస్త్యత్ర సంశయః–

కావున, నీచపు బుట్టువుగల యా శబరియును గురుశుశ్రూషాఫల కర్మచే శ్రీరాముని దర్శించి దేహమును చాలించుకొని మోక్షమునుపొందెను. కావున,

"జ్ఞాత్వాసద్యోభవేన్ముక్తః సత్యమేవ మయోదితమ్"

అట్టి గురు శుశ్రూషవల్ల గురువునకు శిష్యునిపట్ల "గురు"వాత్సల్యం పెరుగుతుంది శిష్యుని వినయ విధేయతల ప్రదర్శనతో విద్య కూడ అతనికి పరిపూర్ణంగా ప్రాప్తమౌతుంది.

అందులకే గురు శుశ్రూష అనేది గొప్పధర్మమని ఈ హితవచనం పలుకుతుంది.

శ్లో॥ తథాగాధ ఖనిత్రేణ, భూతలే వారి విందతి ।
యథా గురుగతాం విద్యా, శుశ్రూషయాధిగచ్ఛతి ॥

భా: లోతుగా గునపాలతో త్రవ్వితేనే భూగర్భంలోని జలాలను పొందగలం. అలాగే గురువులోని విద్యను గ్రహించాలంటే శుశ్రూష వల్లనె సాధ్యమౌతుంది.

బుద్ధిమంతుడను వాడు యిట్లుందురని పెద్దలు వచించుచుందురు-

శ్లో॥ శుశ్రూష శ్రవణంచైవ, గ్రహణం దారణం తథా ।
ఊహాపోహ సమాయుక్తో, బుద్ధి సతదుచ్యతే ॥

భా: పెద్దల సేవచేయుచు, వారు చెప్పిన మాటలను వినుచు, విషయమును గ్రహించుచు, మరువక ధారణచేయుచు, చక్కని ఊహాపోహలతో ఆలోచించుచు ఆచరణలో పెట్టుచూ, పలువురికి మార్గదర్శకుడై యుండవలెనని, అతడే బుద్ధిమంతుడని పెద్దలు పలుకుదురు-

"ముదలియాండర్" అనే యువకుడొకడు శ్రీరామానుజాచార్యుల వద్దకు గురూపదేశం పొందుటకు వచ్చెను.

శ్లో॥ షట్త్రింశదాబ్దికం చర్యం గురౌత్రైవేదికం వ్రతమ్ ।
తదర్ధికం పాదకంవాగ్రహణాంతికమేవవా ॥

శిష్యుడు (బ్రహ్మచారి) మూడువేదాలను సాంగంగా అధ్యయనం చేయడానికీ గురుకులంలో ముప్పది ఆరుసంవత్సరాలుండాలి లేదా అందులో సగము పద్దెనిమిదేండ్లుగాని, లేదా అందులో సగం తొమ్మిదేండ్లుగాని, కనీసం బాగా నేర్చుకునేంతవరకుగాని గురుశుశ్రూషలో బ్రహ్మచారిగా మెలగాలి.

"చతుర్థమాయుషో భాగముషిత్వాఽద్యంగురావిహ"

తమ ఆయుఃపరిమాణంలో నాల్గవ భాగాన్ని గురుకుల వాసంలో గడపాలి శిష్యుడు.

"ఆశ్రమాదాశ్రమం గత్వాహుతహోమ జితేంద్రియః ।

భిక్షాబలి పరిశ్రాంతః ప్రవ్రజన్ప్రేత్యవర్ధతే ॥"

పూర్వాశ్రమాలలో శిష్యులు వేదవిహిత కర్మలనాచరిస్తూ జితేంద్రియుడై, భిక్షాటనం, బలిదానం, గు. పశుశ్రూషలతో అలసట చెందినవాడైనచో నతడు బ్రహ్మపదమును బొంది బ్రహ్మమై వర్ధిల్లుతాడు.

అందుకే మనువు మోక్షప్రదమైన షట్కర్మానుష్ఠానములలో గురు శుశ్రూషయు నొకటని తెలిపెను.

"గురుసేవా చనిశ్శ్రేయసకరం పరమ్" (12-84)

జన్మసంసారబంధ విముక్తి కొరకు గల తీవ్రమైన కోరికయే గురువుయొక్క దర్శనము చేయిస్తుంది. అనగా సంసార సాగరమునందు దిక్కుగానక పరితపిస్తూ విభ్రాంతచేతస్కులై అలమటించేవారికి "గురుమేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం" అని శృతులన్ని ఏకకంఠంతో నంటున్నాయి. త్రాహి త్రాహి కృపాసింధో" అని శ్రీగురుని శరణు కోరనిదే సందేహం పోదు. అజ్ఞాన తిమిరాంధుడై ఆర్తినొందేవానికి జ్ఞానోపదేశం చేసి కనులు తెరిపించగలవాడు శ్రీగురుడొక్కడే కనుక అటువంటి శ్రీగురుడవైన నీవే దిక్కుగా నుండవలెనని" కోరుతున్నాను అని అర్థం.

## గురుసేవ (శుశ్రూష)ఫలం - భారతముననున్ననొక (కథ)లు

పూర్వము ద్వాపరయుగమున 'ధౌమ్యుడ'ను నొక మహర్షి కలదు. అతని వద్ద "అరుణుడు, పైలుడు, ఉపమన్యువు"లను ముగ్గురు శిష్యులు వేదాధ్యయన నిమిత్తమై వచ్చి వారి సేవలొనర్చుచుండిరి.

పూర్వపు విద్యాపరిస్థితి యెట్టిదనిన శిష్యుడు వచ్చుటతోడనే అతనికి విద్య చెప్పు సంప్రదాయము లేకుండెడిది. ఎంతోకాలం పరీక్షార్థం అతని వలన నానా విధములకు శుశ్రూషలు చేయించుచుందురు. ఇట్లు కొంతకాలము శిష్యుడొనర్చు సేవచే అతని చిత్తము పరిపాకము నొందుట చూచి, అప్పుడు వారు కృపాదృష్టితో శిష్యుని చూతురు. వెంటనే అతడు సర్వవిద్యా పారంగతుడగును. ఇది ప్రాచీన విద్యా సంప్రదాయము.

దౌమ్యుడు అట్టి సంప్రదాయము ననుసరించిన వాడే గావున, ఒకరోజు అరుణుడను శిష్యుని పిలిపించి, - "శిష్యుడా! నీవు మా పొలమునకు వెళ్లి చెరువు నీరు మంచిగా తడియున్నట్లు పొలమున నీరు పెట్టుము" అని ఆదేశించెను. గురువాజ్ఞను చెవిన పడిన తోడనే ధన్యుడనని తలంచి, వెంటనే ఆ శిష్యుడు క్షేత్రమునకు వెళ్లగా, మధ్యేమార్గమున ఆచెరువుకాలువ కట్ట తెగి ప్రవాహము పల్లమునకు వృధా యగుచుండగా చూచి, వెంటనే దగ్గర నున్నరాళ్లను, మట్టిని గండిపడిన చోట వేసి ప్రవాహమును అరికట్టెను. కాని, ఆ

ప్రయత్నము విఫలం కాగా, నీరు పొలమునకు ప్రవహించుటకు బదులు వృధాయగుచున్నవని, గురువాజ్ఞను నెరవేర్చలేక పోవుదునేమోయని, ప్రాణములు త్యజించియైనను గురుకార్యము నిర్వహించుటయే తన ధర్మమని నిశ్చయించుకుని, గురువునే ధ్యానించుచు తన శరీరమును పడిన గండికి అడ్డుకట్టగా నుండునటుల ప్రవాహమునకడ్డముగా పదుకొనెను. అప్పుడా ప్రవాహజలము స్వేచ్ఛగా గురువుగారి పొలమున ప్రవేశించి చక్కగా తడిసెను

అంతలో గురువు 'దౌమ్యుడు' సూర్యుడస్తమించినను శిష్యుడగు అరుణుడు యింటికి రాకపోగా ఖిన్నుడై పొలము చేరి బిగ్గరగా పిలువగా, గురువు పిలుపుతో నీటినుంచి లేచి భక్తిభావముతో (గురువాజ్ఞను నెరవేర్చితిననే) గురువు యొక్క పాదములకు వందనమాచరించెను. జరిగిన వృత్తాంతము గ్రహించి, అతని గురుభక్తికి సంతసించి ధైర్యమునకు, త్యాగమునకు విస్మితుడై, నాయనా! నీవు సమస్తవేద శాస్త్ర పారంగతుడగుదువు గాక! అని ఆశీర్వదించెను. అటులే అతడు అట్టి విద్యానిధి యయ్యెను. తదుపరి శిష్యునకు సెలవిచ్చి వివాహితుడవై సుఖముగా జీవించుడని పంపివైచెను.

కొంతకాలము పిదప దౌమ్యుడు 'పైలుడ'ను రెండవ శిష్యుని పరీక్షింప నెంచి, ఒకరోజు అతనిని పిలిచి, "పుత్రకా! క్షేత్రమున పైరు పక్వముగా నున్నది. నీవు పొలమునకు వెళ్లి అహోరాత్రములు కాపలా కాచి ధాన్యమును సిద్ధపరచుమ"నిరి. అతడును గురువాజ్ఞగా క్షేత్రమునకు వెళ్లి పైరును రక్షించి ధాన్యము రాశిపోసి, గురువును సమీపించి, మీ ఆజ్ఞయైనచో ధాన్యము ఇంటికి తెచ్చెదననెను. అప్పుడు దౌమ్యుడు అటులే ఆదేశించి, తన వద్దనున్న బండిని, ఒక దున్నపోతును మాత్రమే శిష్యునకు స్వాధీనమొనర్చెను. శిష్యుడు అటులే మారుమాటాడక గురువాజ్ఞగా నొక మహిషమునే బండికాడికి కట్టి రెండవప్రక్కన తను కాడిని యెత్తి పొలము చేరి నలుబది మణుగుల ధాన్యముతో బండిలో నింపుకొని గురువు గృహమునకటులే తెచ్చుచుండెను. కాని ఆ మహిషముతో సమముగా తాను బండిని లాగలేక నడువలేకుండ పోవుటయేగాక, త్రోవలో ఆ మహిషమును బురదలో దిగబడెను. అప్పుడు దాని కంఠపాశమును వదలి బండిని బురదనుండి తీయగలందులకు ప్రాణమునైను లెక్కచేయక బండిని లాగుటకు ప్రయత్నించుచుండెను. ఆ సమయమునకే దౌమ్యమహర్షి అచటికేతెంచి శిష్యుని సాహసమునకు, దృఢ భక్తికి మిక్కిలి సాహసించి బండిని లాగుటలోని గురువాజ్ఞకు సంతసించి, వెంటనే శిష్యుని సమీపించి ఆ శిష్యుని ఆలింగనమొనర్చుకొనెను. అంతే గురువనుగ్రహ పాత్రుడగునట్లు వెంటనే అతడును సర్వవిద్యాపారంగతుడయ్యెను. అటుపిదప పైలుని పిలిచి ఆశీర్వదించి గృహమునకు వెళ్లి గృహస్థుడవై సుఖమైన జీవనము గడపమని పంపివైచెను.

ఇక మూడవ శిష్యుడు 'ఉపమన్యుడు' గురుసేవా నిరతుడు. కాని తిండిపోతు. విద్యాభ్యాసమునకర్హుడై యుండగా, శిష్యుని పిలిచి, "ఓరీ! నీవు నిత్యము గోవులను అరణ్యమున మే క్కకొని రమ్ము" అని ఆజ్ఞాపించెను. శిష్యుడటులే గురువాజ్ఞగా గోవులను మేతకుగైకొనిపోయి, అచట ఆకలికి తట్టుకోలేక సూర్యుడస్తమించక పూర్వమే గోవులతో తిరిగి వచ్చెను. ఆ మరునాడు గురువు **తిరిగి శిష్యునిక్**, నాయనా! గోవులను ప్రొద్దుగ్రుంకు వరకు మేపి గైకొని రమ్మ'ని ఆజ్ఞాపించెను. **అటులేయని** గోవులతో అరణ్యమునకు వెళ్లి, ఆ గోవులను మేతకు వదలి, తను ఆకలి**కి తట్టుకొనలేక** సమీపమున నున్నగృహములందు మధూకరమొనర్చుకొని భుజించెను. సూర్యుడస్తమించిన వెంటనే గోవులను గురువు గృహమునకు గోవులను తెచ్చెను. మేతకు వెళ్లినపుడు శిష్యునకు మితాహారమిచ్చుటచే శిష్యుడట్లుచేసి, ఎప్పటివలె పుష్టిగానుండుటను గ్రహించిన గురువు శిష్యుని ఆ సంగతి గూర్చి ప్రశ్నించెను. అందులకాతడు న్నదున్నట్లుగా చెప్పెను."నాయనా! గురువునకు ముందుగా సమర్పించని మధూకరమును నీవెట్లు భుజించితివి? కనుక, నీవు యాచించిన మధూకరమును నాకు తెచ్చిఇచ్చి గోవులను కాచుటకు పొమ్మని ఆదేశించెను. శిష్యుడు మారుమాట్లాడక, అటులే చేస్తూండగా, ఒకనాడు తను ఆకలికి తట్టుకోలేక, వేరే యిండ్లలో మధూకరము పొందుచు పుష్టిగానుండెను. ఆ విషయమును కూడా గ్రహించిన గురువు అట్టి మధూకరమును గూడ తనకే ముందు సమర్పించమని ఆజ్ఞాపించెను. అతడటులే ఆకలిని తట్టుకొనియుండి, తుదకు తన పూర్వపు అలవాటుగా ఆకలికి తట్టుకోలేక, ఆవుదూడలు పాలు త్రాగుచుండగా, వాటి మూతినుండి జారిన చొంగధారలు త్రాగుచు యథారీతిగా గురువిచ్చిన ప్రసాదమును తినుచు తృప్తిగా నుండెను. అదియును గ్రహించిన గురువు ఆగ్రహించి ఓరీ! మతిభ్రష్టుడా! ఉచ్ఛిష్ట పయఃపానమొనర్చవచ్చునా! కదు దోషము కదా! ఇక మీదట నట్లొనర్చకుము అని ఆజ్ఞాపించెను.

శిష్యుడును గురువాజ్ఞగా నుండి యథారీతిగా గోవులను తోలుకొని కాచుచుండెను. కాని పూర్వము వలె తను ఆకలికి తట్టుకోలేక, ఎటుతోచక, తుదకు గోవుపాలను గ్రోలవద్దని ఆజ్ఞాపించాడు కదా! గురువు. ఆ జిల్లేడు వృక్షముల ఆకులనుండి వెలువడిన పాలను గ్రోలుటలో అభ్యంతరములేదు కదా! యని, అట్టి ఆకుల నుండి స్రవించు పాలధారను గ్రహించుటకు యత్నించెను. దురదృష్టవశమున ఆ పాలు చిట్లి అతని కంటిలో పడెను. వెంటనే అతని రెండుకండ్లు అంధకారము కాగా, గోవులను కూడ చూడలేక బాధపడెను. తుదకు సూర్యుడస్తమించగా ఎటులో కఱ్ఱ సహాయమున గోవులను తోలుకొని వస్తూండగా, దారిలోనున్న నొకగర్తమును గానక అందులో పడెను. గోవులు గురువు గృహమునకు చేరుకొనెను. కాని గోవుల వెంబడియున్న శిష్యుడు మాత్రము రాకపోగా, గురువు శిష్యునికై **వెదక నారంభించెను.** గురువు కేకలు విని, గర్తమున పడియున్న శిష్యుడు దీనస్వరముతో

పలికెను. అది విని వచ్చిన గురువు ఆశ్చర్యపడి, జరిగిన వృత్తాంతము గ్రహించినవాడై తన యాజ్ఞనునిట్లు పాటించుటను, శిష్యుని పట్ల వాత్సల్యముతో నిట్లనెను.

"నాయనా! నీవు అశ్వినీ దేవతలను స్మరింపుము"ని చెప్పెను. శిష్యుడటులే ప్రార్థింపగా, యధాపూర్వకముగా దృష్టిని పొందెను. వెంటనే గర్తమున నుండి వెలుపలికి వచ్చి గురువు పాదములపై పడెను. అట్టి గురుభక్తికి గురువాజ్ఞకు సంతసించి, ఆలింగమొనర్చుకొని యిట్లనెను.

"వత్సా! నీ గురుభక్తికి, కౌశల్యమునకు మెచ్చితిని. అని, అతని శరీరమున హస్తముంచి కదు వాత్సల్యముతో నాశీర్వదించెను. ఆ ఆశీర్వచన ప్రభావముతో తక్షణమే ఆ ఉపమన్యుడును సకల వేద శాస్త్ర పారంగతుడయ్యెను.

దౌమ్యుడు ఆ శిష్యుని, "గృహమునకు వెళ్లి గృహస్థుడవై సుఖమైన జీవితము గడుపుము. నీ కీర్తి భూతలమున ప్రఖ్యాతి గాంచున"ని ఆశీర్వదించి పంపివైచెను

ఈ ఉపమన్యుడంతటి గురువునకు 'ఉత్తకుడ'ను శిష్యుడు విద్యనభ్యసించి, తుదకు గురుదక్షిణగా, గురువాజ్ఞతో పాతాళలోకము నుండి ఆదిశేషుని కుండలముల తెచ్చి గురుపత్నికి సమర్పించి గురుఋణం తీర్చుకొనును. (అట్టిగాధ ప్రత్యేకముగా నున్నది)

ఇట్టి గురు శుశ్రూష గాధలు అనేకములు - గురు శుశ్రూషాఫలములును అనేకములు. ఇవి ఈనాటి గురువులకు శిష్యులకును కంటకములే. అయినను ఆదర్శనీయములని పురాణ గాధలు వక్కాణించుచున్నవి

అందులకే గురువును శిష్యుడు చేరెను. శిష్యుడు గురువును చేరినను ఫలితం శిష్యుని భాగ్యమె కాక, సదురువులను చేరడం మహద్భాగ్యం వారి చెంతకు శిష్యుడు చేరడం 'మార్జాల కిశోరం'లాగా ఉండాలి. అందుకే భగవద్గీతలో (18-66శ్లో) గురువును చేరడంలో - అర్జునునకు;

శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ ।
అహం త్వాం సర్వ పాపేభ్యో మోక్ష యిష్యామి మాశుచః ॥
అన్నాడు "శ్రీకృష్ణభగవానుడు"

## పూర్వమున ఆశ్రమధర్మాలు

నారద ఉవాచ :-

1. గురుకులంలో శిష్యుడు బ్రహ్మచారిగా నుండవలెను
2. ఇంద్రియ నిగ్రహంతో గురువునకు హితం చేకూర్చవలె

3. గురువు పట్ల మహాగాఢమైన స్నేహంతో దాసునిలా అణగిమణగి యుండవలెను గురువే ఆత్మస్వరూపుడు కనుక.

4. ఉ౯ సాయంకాలముల యందు గురువునూ, అగ్నినీ, అర్కునీ, వేదోత్తములను, దేవోత్తములనూ ఉపాసిస్తూండాలి. వాఙ్మయముతో, ఏకాగ్రబుద్ధితోను గాయత్రిని సతతం జపిస్తూండాలి.

5. గురువాజ్ఞగా బద్ధుడై వేదాలు అధ్యయనం చేయాలి.

6. అధ్యయనారంభంలోనూ, చివరనూ గురువు పాదాలకు శిరసా అభివాదం చేస్తూండాలి.

7. శాస్త్రంలో చెప్పబడినప్రకారం మేఖల, అజినం, వస్త్రాలు, జడలు, దండం, కమండలం, యజ్ఞోపవీతం, దర్భలు సతతం తోడుగా నుంచుకోవలెను.

8. గురువాజ్ఞగా ఉదయసాయంకాలముల యందు భిక్షచేయాలి. ఆ భిక్షగురువునకు సమర్పించి, ఆయన అనుమతితో శిష్యుడు భుజించాలి. లేకుంటే పస్తుండాలి.

9. సచ్ఛీలంతో, మితాహారంతో, దక్షతతో, ఆస్తిక్యంతో, మనోనిగ్రహంతో నుండాలి.

10. స్త్రీలతో, స్త్రీలకు లొంగినవారితో అవసరమున్నంతమేరకే ప్రసంగించాలి. ఎవరితోను స్త్రీలప్రస్తావన చర్చించరాదు.

11. గురుపత్నులతో, యువతులతో తల జుట్టు దువ్వించు కొనటం, నలుగుపిండి పెట్టించుకొనటం, స్నానం చేయించుకొనటం, తలంటించుకొనటం, ఇత్యాది కృత్యములు వయస్సులోనున్న శిష్యునకు కూడదు.

ఉపదేశం పొందుటకు ముందు గురుసేవచేయుట, లేదా, గురువాజ్ఞను పాటించుట, గురువుపెట్టిన పరీక్షలో నెగ్గుటయనునది సంప్రదాయం. వీటికతదర్శుడా!

ఆ సమయంలో 'పెరియనంబిగారి' కూతురు కావేరి నది నుండి నీరు తేవడానికి ఆమె (అత్తుళాయమ్మ) తన అత్తగారిని సహాయం కోరుతుంది. ఆ అత్త అందులకు నిరాకరించగా, అది చూచిన రామానుజులవారు ముదలియాండన్‌ను ఆమెకు సహాయార్థమై పురమాయించగా వెంటనే అతడు వెళ్లి ఆసేవనొనర్చును అట్టి ఆజ్ఞననుసరించిన ఆశిష్యునకు గురువు రామానుజాచార్యులు ఉపదేశం చేస్తాడు ఎందుకంటే తాను తనగురువగు నంబిగారినుండి ఉపదేశం పొందుటలో నాతడుపెట్టిన పరీక్షలో నెగ్గి తగుశిష్యుడు అనిపించుకొంటాడు.

**అటులే** దత్తావతారమైన శ్రీనరసింహసరస్వతియు తనవద్దకు చేరిన **సాయందేవునకును** పరీక్షపెట్టగా అదొక గురుకృపగా భావించి వెళ్లి నిండు వర్షంలోను

నిప్పులు తెచ్చియిస్తాడు. అందులకు తగు శిష్యుడనిపించుకొనును.

షిరిడి బాబాగారు కూడ ఇలాగే తనవద్దకు చేరిన శిష్యులను అనేక పరీక్షలుద్వారానే తన సేవలకు వాడుకొనేవాడు. గురుచరణం తప్ప తమకిక దిక్కెవరు లేరని నిశ్చయించిన వానికే తల్లిలాగా తండ్రిలాగ ఆదరిస్తాడు.

## గురూపసదనము

"తద్విజ్ఞానార్థం సగురుమే వాభిగచ్ఛేత్ ।
సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ ॥"

అనివేదము విధించును. అనగా ముముక్షువు బ్రహ్మము నెరుంగుటకు సమిధలు చేతబూని శ్రోత్రియుడైన బ్రహ్మనిష్ఠుడైన గురువు చెంతకేగవలయును" అని.

వేదాంత శ్రవణము చేయదలచిన శిష్యుడు మోక్షార్థిగా, విరక్తుడైన ముముక్షువు గురువు చెంతకేగి తానుచేయదలచిన వేదాంత శ్రవణమునకు అడ్డు తొలగుటకై యీదిగువ కనబరచిన దశవిధ శాంతులను పఠించవలయును

శ్లో॥ శివనామిని విభావితేంతరంగే మహతి జ్యోతిషిమానినీ మయార్ద్రే ।
దురితాన్యపయంతి దూరదూరం ముహురాయంతి మహంతి మంగళాని॥

శ్లో॥ స్మృతే సకల కళ్యాణ భాజనం యత్రజాయతే ।
పురుషస్తమజం నిత్యం వ్రజామి శరణం హరిమ్॥
హరిః ఓమ్ - శంనో మిత్రశ్శం వరుణః. .

...ఓం శాంతిః శ్శాంతిశ్శాంతిః . . . . . 1

సహనావవతు. ... .ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః.. .. 2

యశ్ఛందసామృషభో........ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః . . 3

అహం వృక్షస్యరేరివా..........ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః..... 4

పూర్ణమదః పూర్ణమిదం..... ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః.... 5

ఆప్యాయంతు మమాంగాని.....ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః.... 6

వాఙ్మేమనసి ప్రతిష్ఠితా.........ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః... . 7

ఓం భద్రంనో అపివాతాయనమః..ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః.... 8

ఓం భద్రంకర్ణేభిః.......ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః.... 9

యోబ్రహ్మాణం విదధాతి.....ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః.... 10

ఇట్లు పై శాంతి పాఠానంతరం నిట్లుచ్చరించవలెను.

"ఓం నమో బ్రహ్మా దిభ్యోబ్రహ్మా విద్యాసంప్రదాయ కర్తృభో వంశఋషిభ్యో, పరమ ఋషిభ్యోమహద్భ్యోగురుభ్యో నమః ।"

"సర్వోపప్లవరహితః ప్రజ్ఞాన ఘనః ప్రత్యగర్థో బ్రహ్మై వాహమస్మి బ్రహ్మైవాహీమస్మి అధీహిభోభగవః"

అని యిట్లు - మరల ప్రార్థనలు

శ్లో॥ సదాశివ సమారంభాం శంకరాచార్యమధ్యమాం ।
అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం ॥

శ్లో॥ నారాయణం పద్మభువం వశిష్ఠం శక్తించ తత్పుత్రపరాశరంచ ।
వ్యాసం శుకం గౌడపాదం మహాంతం గోవిన్ద యోగీన్ద్ర మధాస్య శిష్యః ॥

శ్లో॥ శ్రీశంకరాచార్య మధాస్య పద్మపాదంచ హస్తామలకంచ శిష్యః ।
తంతోటకం వార్తికకార మన్యానస్మద్గురూన్సంతత మానతోస్మి ।

శ్లో॥ శృతి స్మృతి పురాణానా మాలయం కరుణాలయం ।
నమామి భగవత్పాదం శంకరం లోక శంకరమ్ ॥

శ్లో॥ యద విద్యావిలాసేన భూత భౌతిక సృష్టయః ।
తంనౌమి పరమాత్మానం సచ్చిదానంద విగ్రహమ్ ॥

శ్లో॥ శంకరం శంకరాచార్యం కేశవం బాదరాయణం ।
సూత్ర భాష్యకృతౌవందే భగవంతౌపునఃపునః ॥

అని పఠించి, పిమ్మట శ్రీమచ్ఛంకరభగత్పాద విరచితమగు శ్రీదక్షిణామూర్తి స్తవమును పఠించవలెను.

**గమనిక** : గ్రంథవిస్తరణభీతిచే "శ్రీ దక్షిణామూర్తి" స్తవమును ప్రచురించలేదు.

★★★

## గురు - సూత్రం

అగ్ని త్రయములో ఆచార్యుడు ఆహవనీయాగ్ని వంటివాడు. అనగా శ్రేష్ఠుడు.

★★★

# 18. ఆచార్యులు - శిష్యులు

భారతీయసంస్కృతిలో శిష్యాచార్య వ్యవస్థకు ఒక వైలక్షణ్యం ముంది. ఏ దేశంలోను ఇంత పటిష్ఠమైన, ప్రామాణికమైన, అనుస్యూతమైన శైష్యోపాధ్యాయిక యున్నట్లు గురుశిష్య సంబంధం ఉన్నట్లు కూడ కానరాదు.

ఏనాటినుంచో "లౌకిక విద్యలు, ఆధ్యాత్మిక విద్యలు"గా మన విద్యా విధానము రెండు విధాలుగ వస్తోంది. ఆది నుంచీ యీ రెండు విధానాల్లోనూ ఈ వ్యవస్థ కూడా అటులనే వస్తోంది.

"ఆచార్యవాన్ పురుషోవేద"-

"ఆచార్యదేవ ప్రాపితా విద్య"- అనియు.

"ఆచార్యదేవోభవ" అని శృతి - పలుమార్లు ఆచార్యావశ్యకతను, ఆచార్యప్రశస్తిని, కీర్తిని నిరూపించినది.

అంతేకాదు - తరువాత, "లౌకిక వాఙ్మయమూ" ఆచార్యులను కించపరుచలేదు. తక్కువ చేయలేదు.

"గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ"- అని త్రిమూర్తులతో పరబ్రహ్మతో తౌల్యాన్ని గురువునకు పేర్కొని, ఆయనను అగ్రాసనంపై, (ఉన్నతపీఠంపై) నిలిపింది

వీటిమాట యిట్లాయుంచితే, సాక్షాత్ శ్రీమన్నారాయణుడు, "తానే ఆచార్యుడుగా, తానే శిష్యుడుగా" రెండు రూపాలు అవతరించి, "అష్టాక్షరీ మహామంత్రాన్ని భువిలో నవతరింపజేసిన సన్నివేశం "శిష్యాచార్య" వ్యవస్థకు "జయపతాక" కాగా, ఆయనే తానాచార్యుడుగా నరుణ్ణి (అర్జునుణ్ణి) శిష్యుడిగా జేసుకొని, గీతనవతరింపజేసిన ఘట్టం, ఆ పతాకకు - "వ్రేలాడు పసిడి చిరుమువ్వలుగా" కాలమున్నంతకాలం జనావళి వీనులకు విందు చేస్తూనే యుంటుంది.

ఏ విద్యలు కానీండి, కళలు, శాస్త్రాలు, ఆగమాలు, మంత్రతంత్రాలు కానీండి, గురువులేకుండ యేమీలేదు. సాంగోపాంగంగ కోరేవారికి ఆచార్యుల ఉపస్థితి అత్యావశ్యకమే. ఆచార్యుల సన్నిధిని అభ్యసింపవలసినదే కనుకనే, "శాస్త్రమాచార్యుల సన్నిధి చదువునట్టి చదువు చదువే" అన్నారు పెద్దలు.

"ఆచరన్ శుభ కర్మాణి ఆచారే స్థాపయే నపి స్వయమాచరతే యస్థు తస్మాద్ ఆచార్య యిష్యతే"

ఆచార్యుడనగా ఆచరించి చూపేవాడు. "ఆచరణ" అంటే ఏమిటీ? గురువుపట్ల విశ్వాసం, భక్తిప్రపత్తులు, గురువును నమ్ముకొనుట.

ఒ. గురువు శిష్యునితో, "నన్ను నమ్ముకో, ఇంకా ఏమి అక్కరలేద"ని అనిన, శిష్యుడు, "సరే! నమ్మేశాను." అంటాడు. "అయితే నీతల తీసి యిక్కడపెట్టు" అంటాడనుకో గురువు. అంతే శిష్యుడు తెల్లమొగమేసి, ఆశ్చర్యంగాను, విషాదంగాను నుండిపోతాడు. ఇక సమ్మతిస్తాడా! లేదు. "పోనీ పెద్ద మొత్తంలో డబ్బుయిమ్ము" అంటాడు గురువు. పెద్దమొత్తమనగా నెంత? అని వాపోతాడు. దానికినీ సమ్మతించడు- "పోనీ! మీ అబ్బాయిని నావద్ద శిష్యరికంగా, సేవకైయుంచు" అంటాడు గురువు.

"అబ్బే వానికింకా తగు కోర్సు (లౌకికవిద్య) పూర్తి కాలేదండి" అంటాడు శిష్యుడు. "మరీ! నీవైన నావద్ద యుండి వారం రోజులపాటు బోధన విను."అంటాడు గురువు.

"మరీ! వారంరోజులంటే నా వ్యాపారం ఏమగునో!" అంటాడు శిష్యుడు. ఈ సంభాషణంతో "నేను నమ్మేశాను" అనే సమాధానమునకు, గురువు అటులే నమ్మేందుకు తెలివి తక్కువవాడు కాడుకదా! "శరణాగతికి" తావేలేదు.

సంపూర్ణంగా సమర్పించుకోలేదని అర్థం. గురువనుగ్రహము పొందేదెలా? గుర్వనుగ్రహం పొందలేని వాడు దైవానుగ్రహమెట్లు పొందగలడు? బోధనపట్టదు. మంత్రము సిద్ధించదు. అనగా మంత్రసిద్ధి లభించదు.

శిష్యుని మనోరథం నెరవేరాలంటే, గుర్వనుగ్రహం పొందటం మొదటి మెట్టు. గురువుచెప్పినది ఆచరించుట రెండవమెట్టు. అంతటితో సరిపోయిందా! గుర్వనుగ్రహం పొందాలంటే, గురువు యొక్క మార్గమునుసరించాలి. గురువు మామిడి పండును చూపుతూ, "ఇది సీతాఫలమయ్యా" అన్నాడనుకో, "అవును అది సీతాఫలమే" అని విశ్వసించాలి శిష్యుడు- అట్లుగాక,

అది యెటులండి? అని, యెదురు ప్రశ్నవేశాడా! అంటే- గురువుపై, గురువుమాటపై విశ్వాసం లేదనే అర్థం.

గురువు శిష్యునితో- "నాయనా! నేను ఈశ్వరుడికన్నా గొప్పవాడిని" అన్నాడనుకో, శిష్యుడలాగే విశ్వసించాడనుకో ఆ గురువులో తప్పక ఈశ్వరత్వము దర్శించును శిష్యుడు.

దానికి బదులుగా - "ఇదేమిటండీ! ఈశ్వరుడెక్కడ? మీరెక్కడ?" అని ఎదురుప్రశ్నవేసిన నికవిశ్వాసమునకర్థంలేదు.

గురుబోధనతో సాధనమొనర్చుట మూడవమెట్టు- ఆ సాధనలో గురువుపై గురి (లక్ష్యం) కలిగి యుండినచో, శిష్యుని తన ఆచరణలోకి గైకొనిపోయి, తనకు శిష్యునకెట్టి

భేదము లేనటుల తారాస్థాయికి చేరుదురు.

"ఆచరణ"కిదే సోపానము. అర్థము కూడ.

లోకములో ప్రతి అణువు గురువులాంటిదే. మనస్సే అసలైన గురువు. విజ్ఞులైన వారందరును గురువులే.

గురువు త్రివిక్రముడివంటివాడు. చిన్నగా కనపడవచ్చును. విరాట్పురుషుడును పెద్దగాను, బహుపెద్దగాను అగుపడవచ్చు- ఇదెప్పుడు సాధ్యమగును?

శిష్యునిలో అహంకారం నశించినపుడు, ఆ శిష్యుని, భగవంతుని మధ్యనున్న అజ్ఞానాంధకార తెరను తొలగించేవాడు గురువు. జాగృతమొనర్చువాడు గురువే. గురు సంప్రదాయ ప్రవర్తకుడు గురువులో ఇష్టదేవుణ్ణి దర్శిస్తాడు. ఆత్మజ్ఞాన జిజ్ఞాసతో వచ్చిన శిష్యుని సంశయములన్నీ పారద్రోలి సద్వస్తు సందర్శన కలుగునట్లు చేయుటకు ముందుగ, వానిలోని మానసిక శక్తులన్నింటినీ మేల్కొలిపి, ఉత్తేజపరచి, మార్గదర్శక సూత్రాలతో వాటిని సక్రమ పద్ధతిలో మళ్లించి, వాని బుద్ధి విశేషంచే పరబ్రహ్మదర్శనము అనుభవైక వేద్యమగునట్లు ఆచార్యుడు ప్రవర్తిస్తాడు.

అందులకు శిష్యునిలో ముందుగా ఆత్మజ్ఞాన జిజ్ఞాస, పట్టుదల, ఆర్తితో గూడిన మనస్తత్వం, తెలివి, ఆతురత వంటి జిజ్ఞాసవుంటే, ఆచార్యుడు వాటిని తన మనోశక్తితో గుర్తించినట్లైన శిష్యుడు తప్పక సఫలీకృతుడైతాడు

## గురువు యొక్క గురుత్వము (ఆచార్యత్వము):-

'గురు' శబ్దమునకు "వు" ప్రధమవిభక్తి ప్రత్యయము. అనగా గురువు ప్రధముడు. ఆ గురువు శబ్దమునకు మారు పదము "ఆచార్యః". 'ఆచార్యః' అనగా వేదార్ధమును వ్యాఖ్యానించువాడు. బోధించువాడు. అవేదార్ధమును బోధించుటకర్తృత కలవాడే ఆచార్యుడు.

ఇట్టి ఈశ్వరాదేశ చిహ్నము కలిగియుండువాడుగా, ధర్మమందు నియమ నిష్ఠలుకలవాడుగా, భక్తి ప్రవత్తులు కలవాడుగా నుండవలెను. త్యాగ, వైరాగ్య, అమృతత్త్వ మానసుడై యుండిననే యింతరులకు ధర్మోపదేశమొనర్చగలడు. ఈశ్వరానుగ్రహ పాత్రుడై, అంతఃకరణ కలిగినవాడై, కరుణ రస హృదయుడై యుండవలెను.

"భగవంతుడు రసస్వరూపుడు", "రసోవైసః అని "తైత్తరీయోపనిషత్తు" చెప్పును. కనుక గురువు బోధ గురువుగా నుండవలెను. కాని బాధ గురువుగా నుండరాదు. తాను బోధించుటలోని అంశము పరమార్ధముగా నుండవలెను. శిష్యుని సత్ప్రవర్తనకు దారితీయవలెను. తత్త్వజ్ఞాన శోభితుడే సద్గురువు. అతడే బోధగురువు. భగవద్భావనతో

భగవత్కళ్యాణ గుణములతో గురువు శిష్యులకు బోధించవలెను.

"పరీక్షిత్తున"కు భాగవతమును బోధించుటకై 'శుకమహర్షి'పై నుదహరించినట్లు ఆ గుణములు కలిగిన వాడగుటచే, తండ్రియగు వ్యాసుని గురువుగా నెంచి స్మరించి యుపక్రమించెను ధన్యుడయ్యెను.

అటులనే నారద పరాశరాది బోధనలు మహోన్నత స్థితి నందినది. ఆచార్యుని బాధ్యతలను వహించుటకును వానిని (ఆత్మసంబంధమగు) సక్రమముగా నిర్వహించుటకును నెవ్వడైనను శక్తిమంతుడగును. ఆత్మజ్ఞానమాధుర్యము ననుభవించుచు శిష్యులకును నట్టి మాధుర్యమును చవిచూపుదురు. భగవంతుని ప్రతినిధులుగా నుండి జ్ఞానమార్గ మాధుర్యమును చవిచూపుతు జ్ఞానమార్గదర్శకులని చెప్పుటలో నతిశయోక్తికాదు. పరమసత్యమిది.

నిజమే ఆచార్యులన ఆదర్శజ్యోతులు. ఈ ఆదర్శజ్యోతులు నిరంతరం వెలుగుతున్నపుడే విద్యార్థి జ్యోతులను వెలిగించటానికవకాశం యుంటుంది. విద్యార్థులలో నున్నవి వత్తులు మాత్రమే. అవి యెంతతైలముతో తడిసియున్నను వెలిగించువాడు ఆచార్యుడే. ఇచట తైలమనగా నాతని స్వంతజ్ఞానము. స్వంత జ్ఞాన మెంత యున్నదానిని వెలిగింపజేయుటకు, అనగా వెలుగులోకి తెచ్చుటకు వత్తిని వెలిగించిననే సాధ్యమగును.

అజ్ఞానాంధకారలోకము నుండి విముక్తికిగానీ, విద్యార్థియనే నావకు ఆచార్యుడు చుక్కాని వంటివాడు. మరియు 'శిల్పి' వంటివాడు. ఎంతటి బండరాయినైనను నొక విగ్రహరూపమొనర్చును. అటులే ఆచార్యుడు 'తోటమాలి' వంటివాడు. రకరకాలైన పూలమొక్కలను క్రమవరుసలో నుంచి, వాటిలో కలుపు పెరగకుండా తొలగించుచు నొకే వరుసలో నుండునట్లు చూచును. ఇచట యనవసరపు మొక్కలనగా, కలుపుమొక్కలను దురాశలు, అసూయలు మొదలగునవి మొలకెత్తునప్పుడు, వాటిని వెంటనే యేరి పారవేయటవమే గురువృత్తి. ఇంకా పెరుగకుండా వాటిని (దురహంకార జ్ఞానాంధకారమును) ఖండించుచు సక్రమరీతిలో నుంచును (నాటును).

ఆచార్యుడు సూర్యునివంటివాడని, సూర్యుని కిరణముల కాంతికి కమలములు వికసిస్తాయి. అటులే ఆచార్యుని దర్శనముతో విద్యార్థుల హృదయాలు వికసిస్తాయని, అతని చల్లని చూపే (ఆర్ద్రదృష్టే) దీనికి కారణము. సూర్యాస్తమయం కాగానే కమలములు ముడుచుకుపోతాయి. కాని ఆచార్యుడట్లుకాక, విద్యార్థి హృదయాన్ని నిరంతరం వికసించియుండునట్లొనర్చు సమర్థుడు.

చంద్రుని చల్లని వెన్నెల కాంతికి కలువలు వికసిస్తాయి. అటులే ఆచార్యుడును, అటు సూర్యునిగా, ఇటు చంద్రునిగా విద్యార్థిలో తేజస్సును, చల్లని చూపును ఆచార్యుడు ప్రసరింపజేస్తూ, హృదయ జ్యోతులను వెలిగింపజేస్తూ, వికసింపజేస్తూంటారు.

'అలారం' వంటివాడు ఆచార్యుడు. అజ్ఞానాంధకారంలోనున్న విద్యార్థులను జాగృతపరచుటకై గడియారమును నెట్లా అలారం మ్రోగునట్లు అమర్చుదుమో, జడ పదార్థమైన గడియారమే యట్లు సకాలంలో క్రమంగా నిర్వర్తిస్తూ మేలుకొలుపుతుందో చైతన్య వంతులైన ఆచార్యుల పాత్రకూడ యట్లుండవలెను. అనగా తన కర్తవ్య నిర్వహణమునందు.

ఆచార్యుడు నీళ్ల(Watertank) వంటివాడు. విద్యార్థులు నీళ్లనల్లాల (tap)వంటివారు. Tankలో నెటువంటినీరుంటే, అట్టినీరే కొళాయిలకు లభిస్తుంది. నీరులేని Tankలో నుండి కొళాయిద్వారా నొకచుక్కైన నీరు రాదుకదా! అటులే ఆచార్యులు జ్ఞానసమృద్ధి కలవారై, తమనుండి విద్యార్థులకు జ్ఞానము సరఫరాచేయగలరు. అనగా జ్ఞానబోధచేయగలరు. అటులగాక, జ్ఞానశూన్యులై నిమిత్తమాత్రులుగా Bell మరియు Bill లకై పాటుపడువారు. బ్రతుకలేక బడిపంతులైయున్న వారెట్లు విద్యార్థులకెట్లు జ్ఞానోపదేశమొనర్తురు?

Tankలోని నీరు స్వచ్ఛమైయుండి నిండియున్నను, ఆ Tankకు అమర్చబడిన కొళాయిలద్వారములు సరిగా నుండిననే నీరు సక్రమంగా సరఫరాయగును కదా! అటులే బోధించే ఆచార్యుడుంటే, నేర్చుకోవడానిగాను సిద్ధంగాలేని విద్యార్థులగతి ఏమిటి? ఆ దుర్గతిని నివారించుటకే ఆచార్యుడు సిద్ధపడి యుండవలెను. అనగా నావిద్యార్థిలో నేదో నొక చోట లోపముండి విద్యయందనురక్తి చూపడు. కొళాయి బాగులేక నీటిధార వెలువడక పోయినను దానిలో నున్న చెత్తను తొలగించుటకెట్టు యత్నించుదవో! అటులే విద్యార్థులలోనున్న లోపభూయిష్టమైన కల్మషమును తొలగించుటకు యత్నించవలయును.

విద్యార్థులలో సాధారణముగా పూర్వజన్మ దుష్కృతంవల్లనే లేక వారి తల్లిదండ్రుల పెంపకం లోపంవల్లనో, అదియుగాక, వారు పెరిగి పెద్దగు సంఘ సహవాసంతోనో వారి మదిలో నేదో చెప్పరాని కల్మషం నిండియుందురు. దాని వలన కొంత మానసిక అనారోగ్యమునకు గురియగుచుందురు. అట్టి విద్యార్థులు ఆచార్యులనెడి Water tank నుండి స్వచ్ఛమైన నీరు పొంది, మానసిక ఆరోగ్యవంతులై, అనగా లభించిన విజ్ఞానముతో వికసించి యావజ్జీవము భావికాలమున నెల్లవేళలయందు సత్సంప్రదాయములతో గౌరవ మర్యాదలతో, ఆదర్శవంతులై రాబోవుతరంవారికి ఆచార్య పీఠమలంకరించి సన్మార్గమగు రాచబాట యేర్పరుచుదురు.

కాని, యీనాటి అధ్యాపకులు, ఉపాధ్యాయులు తమ పుత్రులయెడలనే ప్రేమాదరములు జూపుచు, వారినెట్లైనను యున్నతస్థితికి తెచ్చుటకు యత్నించుదురు.

ఏదేని ప్రభుత్వం నుండి లేక సంస్థనుండిగాని, వేల రూపాయలు వేతనము పొందుచూ, తమ భార్యాబిడ్డల పోషణకై తపన జెందుదురు. ఉద్యోగమొనర్చు కారణమదియేయని సంకుచిత బుద్ధితో, వేతనము తమబ్రతుకు కొరకే కదా! యని

మెలగుచుందురు. అలాంటివారే కొల్లలున్నారు.

కాని, సంస్థ యుద్దేశమదికాదు తాను బ్రతుకుచూ, విద్యార్థులకు బ్రతుకకు బాట జూపవలెను తమపుత్రులు కేవలం ఔరస పుత్రులు - కాని విద్యార్థులు ఆచార్యుల పట్ల ప్రేమపుత్రులుగా మెలగుదురు. ఆచార్యుల నుండి ప్రేమాదరములను పొందునట్లు కాంక్షించుచుందురు. కనుక, ఔరసపుత్రులకన్నా ప్రేమపుత్రులను సన్నిహితం చేసుకొంటారు నిజమైన ఆచార్యులు

భారతంలో ద్రోణాచార్యుడు ఔరసపుత్రుడైన అశ్వత్థామ కంటే, ప్రేమపుత్రుడైన అర్జునునికే విలువిద్యల రహస్యాలు బోధించాడు. కనుకనే ద్రోణుడు ఆచార్యుడని పిలువబడెను.

అధ్యాపకునకు, ఆచార్యునకు చాల వ్యత్యాసమున్నది. కేవలం అధ్యయనం చేయించువాడధ్యాపకుడు కానీ, ఆచరించి బోధించే వాడాచార్యుడు. అట్టి ఆచార్యులవంటివారు నేడు చాలా అరుదు. బ్రతుక నేర్చు అధ్యాపకులు నేడు కొల్లలు.

శ్రీశ్రీగారు - "ఏదేశ చరిత్ర చూచిన ఏమున్నది గర్వకారణం" అన్నటుల - నేడు ఏ అధ్యాపకునిగానీ, ఉపాధ్యాయుని చరిత్రజూచిన ఏమున్నది గర్వకారణము? ఇట్టివారికే అవార్డులు, బహుమానాలు, గౌరవాలు, పురస్కారాలు.

శిష్యుడి మనస్తత్వాన్ని గుర్తించి తగు విద్యాప్రాపకంగా విద్య నందించేవాడును, పొందించేవాడును కావాలి. అతడే ఆచార్యుడు. ఆచార్యుడు యోగ సాధనయందు నిపుణుడైయుండిన, అతడు కొంత ఆధ్యాత్మిక జ్ఞానం సంపాదించినట్లే. శిష్యునితత్త్వం గుర్తించుటకు సులభమగును.

ఆధ్యాత్మికాచార్యుడనగా సాక్షాత్ దేవదేవుని ప్రతినిధియే. అనగా గురుపరంపరకు చెందినవాడన్నమాట. 'గురు' బోధనలను సదవగాహన మొనర్చుకొనిన వ్యక్తి ఆధ్యాత్మిక గురువౌతాడు. అట్టి ఆధ్యాత్మికాచార్యుడగు శ్రీకృష్ణపరమాత్మ అనుగ్రహంతో (గీతాబోధతో) అర్జునుడు స్వధర్మమును గుర్తించి కురుక్షేత్ర యుద్ధమున సవ్యమార్గముననే కౌరవులను జయించగలిగెను.

కావున ఆచార్యుని సాన్నిధ్యం, అడుగడుగున అత్యంతావశ్యకము. మంత్ర సాధనకు, తంత్ర సాధనకును ఆచార్యుల ఉపస్థితి మరీ హెచ్చు అవశ్యకం. వేదాలుకాని, శాస్త్రాలుకాని, సంగీతాది కళలుకాని, మరేవి కానియ్యండి ఆచార్యుల దరిజేరడంతోనే అవి అభ్యసించవీలగును. అందులకే, "శాస్త్రమాచార్య సన్నిధి చదువనట్టి చదువు చదువు"- అన్నారు. పెద్దలు.

ఆచార్యుడు మేఘం వంటివారుగా పోల్చదమయ్యెను. ఎట్లనగా, మేఘం సముద్రములోని ఉప్పునీటిని గ్రహించి, అందున్న ఉప్పుతనాన్ని తొలగించి మాధుర్యంగా మార్చి, వర్ష రూపముగా కురిపించును. అటులే శాస్త్రాలలోని కాఠిన్యతను అవగాహనమొనర్చుకొని, సరళీకరించి శిష్యులకు సుబోధముగా నందజేస్తాడు.

ముఖ్యముగా విద్యలలో ఆధ్యాత్మ విద్యశ్రేష్ఠమైనది. ఆ విద్యనందించే వాడే ఆచార్యుడు. అట్టి ఆచార్యుడు సత్యం, ధర్మం, శాంతి ప్రేమ, వాత్సల్యంవంటి ప్రధానగుణములను కల్గియుండును. వాటితో నతడు జ్ఞానం, కౌశలం, సమ్యగ్భావన, అంతర్ముఖత వంటివి కల్గి, శిష్యుని హృదయక్షేత్రమున అధ్యయనమందు నాటుటకు యత్నించును. తనను చేరిన శిష్యుని, పవిత్రహృదయుడై, సచ్ఛీల సంపన్నుడై ఆదర్శనీయుడై అతనిలో ఆధ్యాత్మిక విద్యను సమర్ధవంతముగా బోధించుటకు యత్నించును. నిజమే. ధర్మబద్ధులైయుండి తామాచరించు ప్రతి విషయాన్ని ఆదర్శనీయంగా శిష్యుడు తన మనః పూర్వకముగా విశ్వసించునట్లు మెలగుచుండును. అప్పుడే, ఆచార్యునిలో దైవమును దర్శించుకొనుచు, శిష్యుడు తరించును. అట్టి గురుశిష్యపరంపర విజయవంతమై ఉభయులు భావి కాలమునకు ఆదర్శనీయులైయుందురు.

కావున, "శైశవేఽభ్యస్త విద్యానాం" అన్నట్లు బాల్యదశయందే విద్య, విద్యతోపాటు వినయం పట్టుబడుతాయి. అంకురార్పణతోనే అట్టివి అలవడుతాయి. అంటిపెట్టుకొని యుంటాయి.

అందులకే, "విద్యాదదాతి వినయం, వినయాత్ యాతి పాత్రతామ్" - అన్నారు. అనగా, విద్యవినయమునిచ్చునది, వినయముతో నతడు అర్హత పొందును. కావున విద్యజీవిత పరమావధికే కాని, భౌతిక జీవనోపాధికికాదని, ఆచార్యుడు ఆధ్యాత్మవిద్యకు ప్రాధాన్యమిచ్చును. లేనిచో, అనగా, భగవద్విశ్వాస శూన్యులకు ఎంతవిద్య లభించినను, వారిలో నాటియున్న మౌఢ్యము తొలగదు. మూర్ఖతవీడదు. కావున "సావిద్యయా విముక్తయె" అన్నది ఉపనిషత్తు. మౌఢ్యాన్ని వదులగొట్టే, జ్ఞానాన్నందించే విద్యాసత్యాన్ని గ్రహించాలి. విద్యాసత్యాన్ని గ్రహించిన విద్యార్థియే విద్యార్థి. విద్యలలో మర్మవిద్య అది. అందరికినీ ఆమోదయోగ్య విద్య. ప్రయోజన పరిజ్ఞాన విద్య అది. విద్యార్జనకు సార్థకతనిచ్చు విద్య. అవగాహనకు విశిష్టమైన విద్య. సహజ సమాజసేవ కంకితమగు విద్య. విమలపరిణామం చేకూర్చువిద్య. అట్టి విద్యను గరుపు అమృత సరస్సువంటివాడు. అతడే సద్గురువు. శ్రీహరిచరణములు జేర్చు విద్యాగురువు.

హిరణ్యకశిపుడెంతటి దైత్యరాజైనను, అతని కుమారుడగు ప్రహ్లాదుని, సమర్థవంతులైన అచార్యులవద్దకు విద్యాభ్యాసమునకు పంపగా, తన తనయుడెంత వరకు

విద్యనభ్యసించెనో ప్రశ్నించగా, తనయుడు ప్రహ్లాదుడు వెంటనే "విబుధలు బోధించిన విద్యలలోని మర్మ ంబలెన్నో గ్రహించితి"నని నుడివెను. ఆ మర్మ విద్యయే శ్రీహరి చరణముల సన్నిధి చేర్చు విద్యయని ప్రహ్లాదుని కథనం. ఆ కథనం ప్రత్యేకముగా విశదపరచడమైనది.

అనాదిగా జీవుడు ఆచార్యులనాశ్రయించుచు, ఆచార్యుని, "నా ప్రజ్ఞాన ఘనమైన బ్రహ్మం" నీవైయున్నావని, అర్థించుచు ఆచార్యుల యుపదేశములందున్న మర్మమును గ్రహించి, ఆత్మ తత్త్వమును పరిశీలించుకొని, ఆజీవుడు తుదకు "అయమాత్మబ్రహ్మం"గా నిష్ఠతో ధ్యానపరుడై "అహంబ్రహ్మాఽస్మి"గా తరించెను. ప్రాచీన సాంప్రదాయమటులే యుండేది.

ఏదేని మంత్రాలు అనగా (అష్టాక్షరాది మంత్రాలు) ఆచార్యులవల్ల యుపదేశం పొంది, వాటిని జపించడం సంప్రదాయం. శాస్త్రమును, తరతరాలుగా వస్తున్న సదాచారముకూడ

శ్లో॥ తద్విజ్ఞానార్థం సగురుమే వాభిగచ్ఛేత్ ।
సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ ॥

అని సమిధలు చేపూని వేదాధ్యయ నాభిలాషిగా, కొంత పూర్వం వేదాధ్యయనపరుడై బ్రహ్మనిష్ఠుడైన గురువును శిష్యులు ఆశ్రయించేవారు.

"అలనాడు గురూపసదనవేళ ఉపదగా సమర్పించే వాళ్లు"

అటుల వచ్చిన శిష్యులను ఆచార్యులు కొంతకాలము వారి ఆర్తి, శ్రద్ధ, విశ్వాసం, యోగ్యత మొదలైనవాటిని బాగుగా పరిశీలించి, తమకు వారి శిష్యత్వమునందు పరిపూర్ణమైన 'గురి' కుదిరినాకే ఆశించినవి యుపదేశించి పంపేవారు. ఇది కేవలం గురుశిష్యుల మధ్యజరిగే వ్యవహారం. ఇట్టి శైష్యోపాధ్యాయిక సంబంధం చాలా విలక్షణముగా నుండేది.

కొందరు ఆచార్యులు శిష్యులను యేళ్ల తరబడి తమ ఆశ్రమాల్లో అట్టిపెట్టి, కొంతకాలమునకు విద్య నభ్యసింపజేసి పంపేవారు. మరికొన్ని సన్నివేశాలు చూస్తే ఆశ్చర్యమేకాదు, ఒకరకమైన జలదరింపుకూడ కలుగుతుంది. శిష్యుల ప్రవర్తనములోని నైష్ఠుర్యాన్ని బహుధాపరిశీలించికాని, అనుగ్రహించేవారు కాదు.

భగవానుడు మానవుల తప్పొప్పులను బట్టి సంసారాన్నిగాని, మోక్షాన్నిగాని అనుగ్రహిస్తాడు. కానీ, ఆచార్యులు మాత్రం వారి మనస్సు ఉజ్జీవింపజేసి మోక్షాన్ని పొందేలాగ చేస్తారు. అందుచే, అట్టి దయాళువైన ఆచార్య సమాశ్రయణమే అనందదాయకం.

శ్లో॥ బాలమూక జడాన్ధశ్చపంగవో బధిరాస్తథా ।
సదాచార్యేణ సందృష్టాః ప్రాప్నువంతి పరాంగతిం ॥

సదాచార్య కటాక్షంవల్ల బాలలుకాని, మూగవారుకాని, అజ్ఞులుకాని, గుడ్డివారుకాని, కుంటివారుకాని సద్గతిని పొందుతారు.

శ్లో॥ ధారాయణోऽపి వికృతం యాతి గురోః ప్రత్యుతస్య దుర్బుద్ధేః ।
కమలం జలాదపేతం శోషయతిరవిర్నతోషయతి॥

ఆచార్యసంబంధం లేకున్న భగవంతుడును అటువంటి మనుష్యుని చూచి బాధపడతాడట. తామరపువ్వును సూర్యుడు వికసింపచేస్తాడు. ఎప్పుడూ? - పూవు నీటిలో ఉన్నంతవరకే, నీటితో సంబంధాన్ని కోల్పోతే, వికసింపజేసే సూర్యుడు ఆ తామరపూవును వాడిపోయేటట్లు చేస్తాడు కదా? ఆచార్యులు నీటివంటివారు, భగవానుడు సూర్యునివంటివాడు. మనసత్తాను నిలబెట్టినవారు ఆచార్యులు. నీటితో అనుబంధంవున్న తామరను సూర్యుడు కాపాడినట్లు, గురుసంబంధం వున్న శిష్యుణ్ణి భగవంతుడు కాపాడుతాడు - ఆచార్య సంబంధమున్నవాడు, సూర్యుడు తామరపూవును వికసింపజేసినట్లు, సర్వేశ్వరుడు ఆత్మజ్ఞానమును వికసించునట్లుచేయును. ఆచార్యసంబంధంలేనివాడు ఆత్మనీటితో సంబంధంలేని తామరపూవువంటిది. అప్పుడే జ్ఞానవికాసం కల్గించే ఈశ్వరుడే జ్ఞానహీనుని చేయును.

"ఆచార్యవాన్ పురుషోవేద తస్యతావదేవ చిరం ।
యావన్నవిమోక్ష్యే అథ సంపత్స్యే ॥

ఆచార్యుడున్నతడే భగవంతుని సాక్షాత్కరించుకొనగలడు. అట్టివానికి శరీరపాతయే అలస్యం. శరీరపాతమైన వెంటనే మోక్షాన్ని పొందగలడు.

భగవంతునిపై విశ్వాసం కల్గించువాడును ఆచార్యుడే. సదాచార్యుని పొందింపజేస్తాడు సర్వేశ్వరుడు. అట్టి సదాచార్యుని కృపాకటాక్షాలను సర్వకాల సర్వావస్థలయందు పొందుటకై యత్నించువాడే పరమేశ్వరుని అనుగ్రహపాత్రుడు కాగలడు. అటులే, సత్యకామ జాబాలుణ్ణి, వారి గురువు నాలుగు వందల ఆవులిచ్చి, వాటిని వేయి చేసుకొని వచ్చాకనే ఆశ్రమం ప్రవేశం కల్పిస్తాడు.

ఈ సత్యకామ జాబాలుడు తననాశ్రయించిన ఉపకోసలుణ్ణి పన్నేండేళ్ల ఆశ్రమంలో నుంచుకొని తుదకొకనాడు తాను యితర దేశముల సంచారార్థమై వెళ్లాడు. ఉపకోసలుడు మాత్రము ఆశ్రమంలో నుండి అగ్నికార్యములు నిర్వహించుచుండగా, అగ్నులతనికి ప్రసన్నములై అతనికి కొంత యుపదేశములివ్వగా, తిరిగి గురువు వచ్చి శిష్యుని యోగ్యతయందు విశ్వాసమేర్పడి తానప్పుడతనికి బ్రహ్మోపదేశం చేసి పంపుతాడు.

*- (ఇట్టి కథలు విశదముగా నీగ్రంథమునందే విశదపరచడమై యున్నవి)-*

శ్రీ యద్రామానుజులు శ్రీరంగం నుంచి గోష్ఠీపురానికి పద్దెనిమిది పర్యాయములు తిరిగిన తదుపరికాని, గోష్ఠీపూర్ణులవల్ల మంత్రార్థం పొందినవారైరి.

ఇంతటి కట్టుదిట్టాలు ఏర్పరచినారు మనవారు. శిష్యాచార్య వ్యవస్థలో ఎంతటి ప్రచండ శాసనమో చూడండి. ఏ ఉపచారాలు, ఉపసదనాలు, ఉపదలు లేకుండా కేవలం కృపామాత్రం ఎక్కడో, ఎవరో నొక ఆచార్యులు తాముగా అనుగ్రహించడం, అనేది విశేష విషయం

ఆధ్యాత్మ రామాయణములో (అరణ్యకాండ)

శ్రీరాముడు లక్ష్మణునకు హితబోధ గావించుచూ, జీవాత్మ పరమాత్మల కభేదముగా నిట్లనును-

శ్లో॥ ఆచార్య శాస్త్రోపదేశాదైక్య జ్ఞానం యదాభవేత్
ఆత్మనోర్జీవ పరయోర్మూలావిద్యా తదైవ హి
లీయతే కార్య కరణైః సహైవ పరమాత్మని.

భా: ఆచార్యుని యుపదేశమువలనను, వేదాంత విచారమువలనను, "ఎప్పుడు జీవాత్మకు పరమాత్మలకు భేదము లేదన"ని యపరోక్ష జ్ఞానము కలుగునో, ఆ క్షణమందే సర్వసంసారమునకు కారణమయిన అవిద్య తనచేత కల్పితములైన కార్యకారణములన్నిటితోనూ పరమాత్మ యందు లయమునొందును అని.

"ఆచార్య" అనుగ్రహంవల్ల సమకూడనివేవి ఉండవని ఈక్రింది ప్రమాణవచనమే సాక్ష్యం.

శ్లో॥ ఆచార్యస్య ప్రసాదేన మమ సర్వమభీప్సితమ్ ।
ప్రాప్స్యామితి విశ్వాసః యస్యాస్తి స సుఖీభవేత్ ॥

ఆచార్యునిపై విశ్వాసం ఉన్నవానికి వారి యనుగ్రహంతో సర్వసుఖములు, అభీష్టములు నెరవేరును.

అందుకు ఉదాహరణం, ఆచార్యపారతంత్ర్యంగల 'ఉపమన్యువు' ఆచార్యానుగ్రహానికై, నిష్ఠాగరిష్ఠుడై, ఆజ్ఞాపాలకుడై యుండి సర్వవేద జ్ఞానం సిద్ధించేలా వరాన్ని పొందుతాడు.

ఆచార్యుని యందుగల విశ్వాసపాత్రులు శబరి, ఏకలవ్యుడు, వివేకానందుడు మొదలగువారు ఆదర్శవంతులు.

## "సాధారణమైన ఆచార్యనిర్వచనమ్":

శ్లో॥ ఆచినోఽతి హి శాస్త్రాణి ఆచారే స్థాపయత్యపి ।
స్వయమాచరతే యస్తు తమాచార్యమ్ ప్రచక్షతే ॥

శాస్త్రజ్ఞానాన్ని తాము సంపాదించుకొని తామాచరిస్తూ, శిష్యులను ఆచారంలో నిలబెడుతుండే వారు ఆచార్యులు అని "ధర్మం సదాచారం"- యస్మాద్ధర్మాన్ ఆ చినోతి స ఆచార్యః"

ధర్మమనగా 'సదాచారము'. అట్టి సన్మార్గోపదేశ ధర్మములను ఎవరైతే ఆచరించుచున్నారో వారే ఆచార్యులు

"శిష్టాః ఖలు విగత మత్సరాః నిరహంకారాః కుంభీధాన్యా
అలోలుపాదంభ దర్పలోభమోహక్రోధవివర్జితాః"

పరంపరాగత ఆచార్యుల పరగుణములను ద్వేషింపనివారై, అహంకారంలేనివారై సంచయముగల ధాన్యము లేనివారై, లోలువత్వంలేనివారై, దంభ, దర్ప, లోభ, మోహ, క్రోధములు విడిచిపెట్టినవారైయుండవలెను అని, "తస్మై నదుహ్యేత్కదాచన"- సన్మార్గ గత ఆచార్యునికి అపకారం తలపెట్టరాదు

"శ్రీమద్వేదాంత దేశికులు"- సువిపులమైన, పర్యాప్తమైన ఆచార్యనిర్వచనాన్ని చిత్తగించండి - "సిద్ధం సత్సంప్రదాయే, స్థిరదయ, మనఘం శ్రోత్రియం, బ్రహ్మనిష్ఠం, నత్త్వస్థం, సత్యవాచం, సమయ నియతయాసాధు వృత్త్యాసమేతం దంభాసూయాదిముక్తం, జిత విషయగుణం, దీర్ఘబంధుం, దయాళుం, స్ఖలిత్వేశాసితారం, స్వపరహితపరం, దేశికం భూష్ణురీప్సేత్"-

సిద్ధం సత్సంప్రదాయే - శ్రియఃపతి నుండి అవిచ్ఛిన్నంగా వస్తున్న సంప్రదాయ గురుంపరాపర సంబంధంకలవారు కావాలి ఆచార్యులు అనుస్యూతనంగా వస్తున్న ఆచార్యపరంపరకు చెందిన వారు కావాలి. అందుకే -

ఈ ఆచార్యపరంపర యొక్క అవిచ్ఛిన్నత్వాన్ని అనుసంధించుకొని మనస్సులో నిలుపుకొనేందుకునే దానివల్ల శ్రద్ధాదికాన్ని పెంపొందించుకొనేందుకే, "కాలక్షేపాల్లో" - ఆచార్యపరంపరను అనుసంధానం చేయడం శ్రీభాష్య భగవద్విషయాదులు కాలక్షేపం చేసినప్పుడు శిష్యాచార్యాదులిరువురూ శాంతిపాఠం అనుసంధించినాక, ఆచార్య పరంపరను కలిసి స్మరించుకొని చివరగా శిష్యుడు స్వాచార్యతను కూడా అనుసంధానం చేసుకొన్నాక కాలక్షేపం కావిస్తూంటారు.

ఇది సంప్రదాయ మర్యాద - మచ్చునకు

సద్గురుస్తుతులను పఠించడం సంప్రదాయం.

స్మరించుకోవడం శ్రేయోదాయకం.

అటులా ఆచార్యపరంపర స్తుతులను పఠించడం, స్మరించుకోవడం, వీలుపడితే సేవించుకోవడం, సర్వదా సంప్రదాయ సిద్ధమే.

కానీ, అటులా పరంపరలో వచ్చినవారినే ఆచార్యులుగా వరించడం, సేవించడంతప్ప, తదుపరి ఎవరూ అక్కరలేదనుకునే సద్యోజాత, సద్యోనిష్ఠ గురువులను ప్రస్తుతం మన సంప్రదాయం స్వాగతించడంలేదు అసలల్లాంటి పద్ధతివైపు కన్నెత్తి కూడ చూడలేదు అందుచేత, ఆచార్యులెప్పుడునూ సత్సంప్రదాయ, సశ్శీలవంతులై ఛాత్రులయెడల ఆదర్శవంతులై పరంపరాసంప్రాప్తులు కావాలి

"స్థిరధీయమనఘం" - తానాచార్యసేవచేసి గ్రహించిన దానియందు పరమప్రామాణికమైన, అచంచలమైన బుద్ధికలవారు అనగా సద్బుద్ధులు కలవారై యుండాలి. ఉపసదనం నుంచి ప్రాణోత్క్రమణం వరకు స్వాచార్యులయందు, వారి యుపదేశములందు ఏకరూపమైన ప్రావీణ్యం, ప్రామాణ్యం కలవారు కావాలి పాపవిముఖులు కావాలి. పాపపుటాలోచనలకు స్వస్తి చెప్పాలి

స్వాధ్యాయపరులు ఎల్లప్పుడును - "శ్రోత్రియం, బ్రహ్మనిష్ఠం" - అనగా బ్రహ్మను గూర్చిన జ్ఞానం (బ్రహ్మజ్ఞానం) బాగా కలవారై యుండాలి బ్రహ్మ సాక్షాత్కారం పొందిన వారు కాకపోయిననూ, బ్రహ్మసూత్రాలు ఎరింగినవారైయుండాలి.

"సత్వస్థం, సత్యవాచం" - సత్త్వోద్దీపనం వల్ల రజస్తమస్సుల స్పర్శలేకుండా మెలగి స్థిరత్వ కల్గియుండాలి నిష్ఠుర సత్యవ్రతులు కావాలి తపశ్శాలి అయితే కాని, జితేంద్రియుడైతేకాని, సత్త్వపూర్ణుడైతేకాని, సత్యవచనుడు కాలేడు ఎట్టి వాగ్దోషానికిని పాల్పడక, శుద్ధ సత్యవాక్‌శాలిగా నుండినచో శిష్యుని యెదలో మహోన్నత వ్యక్తిగా ఆచార్యుడు స్థిరపడిపోతాడు

"సమయ నియతయాసాధువృత్యా సమేతం" -

పూర్వులు (పెద్దలు) ఎప్పుడెట్లానడుచుకునేవారో అటులే తాము నడుచుకొనే ఆచార్యులు కావాలి. తమ వ్యక్తిగతమైన వ్యాఖ్యానాలను శిష్యునితో సంప్రదించకూడదు. దానివలన ముఖ్యోపదేశం తరిగి, వారిని తప్పుదోవపట్టించిన వారగుదురు. క్షేత్రము వంటి శిష్యుని మదిలో అసలైన పంట కన్న కలుపు మొక్కలను నాటినట్లవుతుంది.

కావున, ఆధ్యాత్మికాచార్యుల అర్హతల గురించి, అనగా గురుపరంపరను గూర్చి

గీతలో 4వ అ- మొదటి మూడు శ్లోకాలలో శ్రీకృష్ణ పరమాత్మ అర్జుననకు బోధించును. వాటి భావమిది.

"అర్జునా! నాశరహితమగు నీ నిష్కామకర్మయోగమును (జ్ఞాననిష్ఠను) పూర్వమునేను సూర్యునకు బోధించితిని. అతడు వైవస్వత మనువునకుపదేశించెను. మనువు ఇక్ష్వాకువునకు, తదుపరి అతని నుండి రాజర్షులు తెలుసుకొనిరి. ఇప్పుడు నేను మరల నీకు బోధించుచున్నానని, అది మిక్కిలి శ్రేష్టమైనదియు రహస్యమైనదనియు నెరుంగుము"- అని పూర్వ ఆధ్యాత్మికాచార్యుల బోధన గూర్చి విశదపరచెను

అట్టి ఆధ్యాత్మికాచార్యుల. నియమిత శిష్యుల మధ్య శిష్టాచారానువర్తనం, ప్రమాణముగా నుండాలి.

"తె యధా తత్రవర్తేరన్, తేయధా తేషువర్తేరన్"

అన్నట్లుగా ధర్మజ్ఞులైన, సమయజ్ఞులైన పెద్దల నడవడే ప్రమాణముగా భావించి తదనుసారి వర్తనం కలవారు. శిష్టాచారానువర్తనం సదనుష్ఠాన సంభావనం కావించుకొంటూ తాము అట్లాంటి అనుష్ఠాన తత్పరులుగా కాలక్షేపం చేయువారు కావాలి

"దంభాసూయాదిముక్తం" దంభం, అసూయ మొదలైన గుణాలుండరాదు. సంకుచిత బుద్ధి దోషాలుండరాదు సద్గుణ సంపత్తి, సాధువృత్తానుసరణం కలిగి యుండవలెను

"జితవిషయ గుణం" - బలవాన్ యింద్రియగ్రామః విద్వాంస మపి కర్షతి" మొసలి కోరల వంటివి. కనుక, జితేంద్రియులై యుండాలి

"దీర్ఘబంధం" - శి, ఆచార సంబంధం చాలా పవిత్రమైనది. ప్రధాన మైనదియునూ, శిష్యుడు చేరే స్థితి, అదే లక్ష్యం నిశ్చయమయ్యే వరకు నీ బాంధవ్యం కొనసాగాల్సిందే. ఇది తదుపరియైనను, సుదీర్ఘ సంబంధం లాంటిది. లౌకిక బంధమునకు దూరమైనది.

"దయాళుం" - ఆచార్యునకు శిష్యుల పట్ల ఎడతెగని దయాళుత్వముండాలి. వాడి గుణాలలో దోషాలను తన చరణాలప్రోలవేరినాడన్న, ఇక ఎంచక, వాటినుండి వానిని విముక్తి చెందే సద్గుణాన్ని రంగరించిపోసి యోగ్యతను ప్రసాదించాలి. కృపాపాత్రుడవాలి.

"స్థాలిత్యే శాసితారం" - ఆచార్యునకొక్కనికే ఉన్న ఒక హక్కుయిది. శిష్యుడు తప్పుచేస్తేకాని, అపామార్గం వైపు వెళ్తేకాని, అటువంటి తప్పుదోవ పట్టును మరలించుటకు నవసరమున్నచో నిర్దేశించియైనను, నిర్బంధియైనను, నిష్ఠురంగానైనను ఆజ్ఞాపించే (శాసించే)

అధికారం ఈ సృష్టిలోనొక్క ఆచా ర్యునకే కలదు. తప్పటడుగు శిష్యుడువేసినచో అతని కది ముప్పు అని, ఏ ాదలించియైన ు సవ్యమార్గాన తేవాల్సిన బాధ్యత ఆచార్యులదే

"స్వ పర హితపరం" - స్వపర - తనపై నిర్భరులైయున్నవారి, హితపరం-మంచిని చూసేవారూ, తన మంచి, ఎదుటివానిమంచిని చూసేవారు. తనపై భారంమోపి తనవారుగా నున్నవాని మంచిని చూస్తూ, తానేమైనా లెక్కచేయక నుండువాడు. సర్వుడు శిష్యుడు. అటులనే, "స్వపర-హితపరం" - శిష్యహిత పరుడు. స్వహిత పరత్వం లేదు ఆయనకు, హితపరత్వమే కాని తన కోసం కంటె, తనను నమ్ముకొనివచ్చిన శిష్యులహితంకోసం తపించే వారైయుండాలి ఆచార్యులు. అట్లాంటివారినే యుజ్జీవింపకోరే శిష్యులు ఆశ్రయించాలి

ఆచార్యులు జ్ఞానంతోబాటు సదనుష్ఠానం కల్గియుండాలి. అర్థ సంపాదనకై విధిగా యాజనాధ్యాపనాలు చేయాలి. తనతో నున్న శిష్యుల జీవనభృతికై యాచించవచ్చును. దాక్షిణత్వం, సంభావ్యతను విస్మరించరాదు - ఔచిత్యాన్ని వదలరాదు.

అట్టి ఆచార్యులకు చక్రవర్తి యైననూ తలవంచవలసినదే. దారి తొలగాల్సిందే సాగిలబడవలసినదే సంభావించవలసినదే. మరియు నిట్టి ఆచార్యధిక్కార ఫలితం. ఆ అనుభవజ్ఞులైన చక్రవర్తులకే వదితం చెప్పనవసరంలేదు - అని, నేటి విజ్ఞులైన అధికారులు గ్రహించతగినది

"ఉపాధ్యాయాన్ దశాచార్యః....గౌరవేణాతిరిచ్యతే" ॥
పదిమంది యుపాధ్యాయులకన్న ఒక ఆచార్యుడు మిక్కిలి గౌరవించ దగువాడు
- (మనుః2-14[illegible])

"ఆచార్యో అవహీనయాగ్నిరూపః" అని శృతి.

పూర్వాచార్యుల ప్రధాన లక్షణాలుండెడివి. ముఖ్యముగా

1 శిష్యవాత్సల్యము 2. విషయపరిజ్ఞానం 3. బోధనాకౌశలం
4. మనస్తత్వ మెరింగి యుండుట 5 సర్వులయెడల సమ్యగ్భావన - వంటివి.

కాని నేటి గురువుల బోధ, "చెవిలో మంత్రం చేతిలో ధనం" - అనగా నిట్టివారిని ధన గురువులందురు. వీరికితోడు మద శిష్యులు తయారవుతున్నారు. శిష్యులపై గురువులకు వాత్సల్యం లేదు. గురువులపట్ల శిష్యులకు భక్తి, విశ్వాసంలేదు. ఆచార్యులను ఆకతాయి ప్రశ్నలతో విసిగించు శిష్యులు శిష్యులేకారు. వారు ఆచార్యులపట్ల పరమ శత్రువులే.

ప్రాచీన సాంప్రదాయంలో గురుశిష్యుల అనుబంధం అతిపవిత్రంగా నుండెడిది. అట్టి బంధం యుభయులలో లేదు. దైవభక్తి లేదు. దేశభక్తి లేదు. మాతాపితరుల భక్తిలేదు.

గురువులపై ఇక సుంతైన లేదు. ఇట్టిదే ఈనాటి ఉభయుల విద్యాభ్యాసం

పరహితంగా ప్రవర్తించే ఆచార్యులు రెండురకములు.

1. కృపామాత్రప్రసన్నులు 2. అనువృత్తిప్రసన్నులు

1. ప్రతిఫలాపేక్ష లేక మానవాళిని ఉజ్జీవింపజేయాలనే ఆకాంక్ష, జాలితో గురువులను శిష్యులను చేరుతారు.

2. పునఃపున అర్థించుకొనుటలో పరీక్షించి, తదుపరి తత్త్వబోధ చేసేవారు అనువృత్తి ప్రసన్నులు.

ఆచార్యుని అడుగు జాడలలో అనుసరించుచు, ఆచార్యుని ఉపదేశమందు, చిత్తమును చెత్తకు లీనము కాకుండునట్లు ఏకాగ్రత కల్గియుండవలెను. ఆచార్యుల అనుబంధం శిష్యునకు మోక్షము కలుగుట తథ్యం. తగు శిష్య సంబంధంతో ఆచార్యులును, తమకు మోక్షము సిద్ధించునని తలంచుట మిక్కిలి విశేషము. ఇట్టిది ఆచార్యుల హృదయవైశాల్యమును, సౌశీల్యమును సూచించును.

గీతలో చెప్పినవిధంగా, "విద్యావినయ సంపన్నే" కావున, వినయము లేనిదే విద్య రాణించదు. అని శ్రీ ఆదిశంకరుల వారునూ సమర్థించుచూ నిట్లు వ్యాఖ్యానించిరి-

ఆధ్యాత్మిక విషయ సాధనకు వినయము అనేది చక్కని భూషణం. వినయము లేనిదే శిష్యుడు విద్యార్జనకు అనర్హుడు వినయముతోనే గురువు హృదయాన్ని చూరగొనగలడు.

కాని, ఈనాడు అట్టి వినయం విద్యార్థులలో నెక్కడును కానరాదు. అవినయవంతులే నెక్కువగా నున్నందున శిక్షణ యోగ్యులు గురువులకు కరువయిరి. గురువుల సాన్నిధ్యంలో అధిక ప్రసంగం చేయడం, గురువు కన్నా ముందు తోచిందంతా వాగడం, గొప్పలు చెప్పుకోవడం, విర్రవీగిప్రసంగించడం, తనవల్లనే గురువు శోభించినాడని **ఆడంబరంగా పలుకడం** వెనుదిప్పి నడవడం, ఇవన్నీ అవినయాలే".

**కావున శ్రీ శంక**రులు, "అవినయం అపనయం", అని అవినయాన్ని పోగొట్టుమని సూచించెను. అవినయం ఉన్నంతవరకు విద్యార్థి విద్యను సాధించలేదు

మరియు, "ఈశ్వరానుగ్రహుడైన పుంసామద్వైతవాసనా" అనుటలోని భావం, ఈశ్వరానుగ్రహం పొందియుండాలి. ఈశ్వరానుగ్రహానికి మూలభూతమైనది గురువనుగ్రహం. కావున, గురుభక్తితోనే తత్త్వార్థం విశదమగును. ఆ గురుభక్తిని చెడగొట్టుకొనే అనుసంధానం ఎవడైనా తొందరపడి చేసినట్లైతే, వాడికేరకమైన తత్త్వార్థ స్ఫూర్తి సంభవించదు.

గురువును పరమేశ్వరునిగా భావిస్తే, ఆ రూపంతోనే "అహం వాత్వమసి భగవోదేవతే"! త్వం వా అహమస్మి భగవోదేవతే" అని ఉపనిషన్మంత్రం. అనగా "ఓ గురుదేవా నువ్వే నేను, నేనే నువ్వు" అనే భావరూపం పొందును. "భగవః" అనగా మహిమాన్వితమైనటువంటి ఓ దేవతా." అని అర్థం. అభేదాను సంధానం సాధించుటనునది, ఈశ్వర రూపాన్ని పొంది వున్నటువంటి గురువుతో సాన్నిధ్యం పొందాలి. "ఈశ్వరుడు, గురువు" అనే రెండు రూపాలులేవు, ఉండవు కూడ. సద్గురుని అనుసరిస్తేనే అర్థమయ్యేది. గురుతత్త్వంలోని నవ్వు, కోపం, శాపం మున్నగునవన్నీ లోకకల్యాణార్థమే.

"నా రుద్రో రుద్రమర్చయేత్" అనేది, "నేనే శివుణ్ణి" అనుభావనతో రుద్రార్చన జరిపినట్లు, "అహమిత్యేవ విభావయే భవానీం" అనేది, ఆ "దేవిని నేనే" అను సత్సంకల్పముతో భవానీ అర్చన చేసినట్లు, సద్గురు సేవలను దీక్షతో, సహనంతో చేయాలి. క్షణంలోనే గురు కృప కలగదు. దేవుని యెడలను, గురువు ఎడలను శ్రద్ధా, భక్తి, భయం, విశ్వాసం ఉండాలి. విద్యనర్థించుటలో గురువువాక్యాన్ని గురువాక్యంగా అనుసరించాలి. కాని గురువుని బాకీదారుడుగా దబాయించరాదు. నీవొక అడుగు గురువు వైపు వేస్తే, ఆయన నీవైపు యెన్నెన్నో అడుగులు వేసి, నిన్ను అనుగ్రహిస్తాడు. కనుక గురుసేవ అనునది, యొక దీర్ఘమైన సాధన.

"నమోగురుదేవా!" అను త్రికరణ శుద్ధి సంబోధనతో "నాయనా! నీకు శుభాశీస్సులు" అంటారు గురువు.

అనగా, సద్గురు కృపతో బాటు, శుభం, విజయం కల్గుగాక! అని అర్థం.

గురుభక్తిని గూర్చి శివుడు పార్వతితోనిట్లు చెప్పెను "గురుగీత"లో-

గురుభక్తి సర్వసిద్ధి. శివుడే గురువను దృఢ భావముతో శిష్యుడు గురువను సేవించాలి. గురుభక్తి ఫలమనంతము. యజ్ఞదానములనొనర్చినంత సమానము. అంతెందులకు గురుభక్తి ప్రయాసలేనిది. మిక్కిలి సులభమునూ కూడ. శ్రద్ధ, ఓపికలు అవసరములు.

ఒక కథ: పూర్వము ఒక ఆశ్రమమున "త్వష్ట్ర"యను బ్రాహ్మణ కుమారుండెను. ఆ బాలునకు తండ్రి ఉదనయానంతరం గురువాశ్రమమున విడిచి వెళ్లెను. ఆ బాలుడు గురువు సేవలొనర్చు గురుకుల వాసము చేయుచుండగా నొకనాడు పెద్దగాలివాన సంభవించి ఆ పర్ణశాల కూలిపోయెను. అందున్నవన్నియు పాడుకాగా-

1. గురువు, శిష్యుని (బాలుని) పిలిచి తనకొక చక్కని భవనము నిర్మించిపెట్టమని, గృహవసతులు సమకూర్చమని కోరెను.

2. గురుపత్ని, తనకొక మంచి రంగులరవికె కావలయునని కోరెను
3. గురుపుత్రుడు, తనకొక బురద అంటని నీటిపై నడచుటకనువుగా, ఎచటికి వెళ్లవలెనన్న అచటికి చేరుకొనెటట్లుండు పాదరక్షలు సమకూర్చమనెను.
4. గురుపుత్రి, తనకొక అందమైన కర్ణాభరణములు, ఆడుకొనుటకు కట్టె బొమ్మ ఏనుగు, ఆ ఏనుగు దంతముతో చేయబడిన సుందరమైన యిల్లు (బొమ్మరిల్లు); వంటసామగ్రి (మసి అంటనివి) పాత్రసామానులు కావలయునని కోరెను. ఇవి-

ఇకవారి కోరికలు తీర్చుటకుగాను, తనకేమి తెలియని కోరికలవి గదా! యని చింతించుచు, తుదకు గురువే శరణ్యమని వేడుకొని పయనమయ్యెను!

ఒక అరణ్యమార్గమున నొక అవధూత తనకగుపడగా అతనికి నమస్కరించి అర్థించెను. అందులకా అవధూత కరుణించి కాశీవెళ్లి విశ్వేశ్వరుని వేడమని చెప్పెను. "కాశీ సర్వధర్మములకు రాశి" - కదా! అల్పుడగు ఆ బాలుడావధూతను కాశీకి చేర్చుమని ప్రార్థించెను. అంతే - ఆ బాలుడు ఆ అవధూత ఊతగా వెంటనే కాశీలో నుండెను. కాశీలో అన్నిదేవతల దర్శనముతో ధన్యుడయ్యెను. అంతలో అవధూత అదృశ్యమయ్యెను. శిష్యుడా అవధూతనే తను గురుస్మరణతో గురువుగా తనకీమార్గము చూపెనని, మరల గురుస్మరణ చేయగా, ఆ గుర్వనుగ్రహముతోనే తన కన్నియు సమకూరెనని తలంచి మిక్కిలిగా ప్రార్థించెను.

ఆ ఈశ్వరానుగ్రహముతో గురు సమూహపు కోరికలను బడసెను.

ఈశ్వరుడును శిష్యుని (ఆబాలుని) భక్తికి మెచ్చి నాయనా నీవు "విశ్వకర్మ" యను పేరుతో వినుతికెక్కెదవని అనుగ్రహించి అంతర్ధానమందెను.

గురువును సంతసించి, ఆ శిష్యుని ఆశీర్వదించి ఆ చంద్రార్కముగా అష్ట సిద్ధులు బడయు**నటుల పరమొసంగి** యింటికి పంపెను.

**ఇదియే "విశ్వకర్మ"** కథ.

## సత్సంగత్యముతోనే భక్తితత్త్వమలవడును.

ఒకనాడు పార్వతి శివుని భక్తి తత్త్వముపదేశింపుమని కోరగా, శివుడది అతి రహస్యమైనదని, అటు ఇటుచూచి, ఎవరూలేరని తలంచి "భాగవతం" వినిపించాడు. కానీ, చెప్పేటప్పుడు నిద్రించకుండగ వినాలి. అనగా "ఊఁ" కొడుతూ వినాలి, అనిచెప్పి మొదలుపెట్టాడు.

ఆ భాగవతగానం వింటూ నిజంగానే పార్వతి నిద్రించినది. కానీ, అచటనొక

చిలుక గ్రుడ్డు ఆ గానప్రభావంతో పగిలి చిలుక పిల్లగా మారగా- నిద్రించిన పార్వతిని చూచి, "ఊఁ" కొట్టడమేమిటని, గ్రహించి సమీపములో ఆ చిలుకను చూచాడు శివుడు. అంతే- ఆ చిలుక భయపడి పరుగెత్తి సమీపములో తపమొనర్చుచున్న వ్యాసు నోటిలో దూరింది.

ఇంతకాలానికా మహర్షి అగ్నిమథనం చేస్తూండగా అతని చెమట బిందువులు "అరణి"లో పడగా, దానిలోంచి నొక చిలుక తల రూపముగా నొకమహర్షి పుట్టాడు. అతడే "శుకమహర్షి".

వ్యాసునిద్వారా "భాగవతం"విని, పరీక్షిత్తునకుపదేశించెను. ఈ 'శుకుడు' పూర్వములో నొక భ్రమరరూపముగా పద్మములో తిరుగాడుచు "కృష్ణస్మరణ" చేయగా, అది విని రాధామాత ఆ భ్రమరమునకు శ్రీకృష్ణ కథోపదేశము చేసెను. ఇదియే సత్సంగ మహోపకారం.

# ఛాత్రుడు

"పతంజలి" సూత్రముగా - లోకమునందు పరంపరగా "ఛాత్ర" శబ్దము మరుగైయున్నది. ఈ శబ్దము విద్యార్థిని తెలుపు పదమైయున్నది. "ఛత్ర" శబ్దము వలన నిందు గురువు ఉపమేయము. అనగా శిష్యుని యొక్క అజ్ఞాన రూపమగు నంధకారమును నివారించును గావున, ఛత్రమయ్యెను. గురువులు రక్షించెడి పురుషుడు ఛాతృడనబడును.

"ఛత్రం గురుస్తత్సేవ నశీలమస్య స ఛాత్రః" ॥

గురువు యొక్క దుష్ట కర్మములనాచ్ఛాదనమొనర్చు స్వభావి ఛాతృడనబడు ననిరి "పతంజలి"వారు.

"ఛత్రమివ ఆచరతీఽతి ఛాత్రః"

లోకమున గురువుచే శిష్యుడు ఛత్రమువలె ఛాతృడై యుండవలెను. శిష్యుని చేతను గురువును ఛత్రమువలె పరిపాల్యుడై యుండవలెననియు జెప్పుదురు.

"ఛాత్రాన్తే వాసినే శిష్యే" - "ఛాత్ర, అన్తేవాసి" శబ్దములు శిష్యుడినే తెలుపుచున్నవని నిఘంటుకారులంటారు. ఛత్రమనగా గొడుగు. గొడుగు పట్టుకున్న వానిచుట్టూ నిడ వ్యాపించినట్లు ఛాతృడు గురువుగారి కీర్తిని లోకమంతా వ్యాపింప జేయును. అదియే ఛాతృడని అందురు.

"ఛాత్రః" అను శబ్దము గురువులోని లోపముల విమర్శించనివాడు. అని - "అన్తేవాసి" అనునది సర్వవేళలందు గురువును వీడక యాశ్రయించి యుండువాడు. అట్లుండి

విద్యనభ్యసించుచు, ఆ గురువును నేసమయమునను విమర్శించనివాడు శిష్యుడని "ఛాత్ర" శబ్దమునకర్థము. గురువు ఆ ఛాత్రుని నిశితంగా పరీక్షించి తన సన్నిధానమున నుంచుకొని జ్ఞానం బోధించెను. అయితే, గురువు యెడల శిష్యులును సుముఖంగా ఉత్తమ శ్రేష్ఠమైన మనస్తత్వముతో మెలగియుండిన, గురువులతని చేష్టలు మెచ్చితేనే, నచ్చితేనే అట్టి ఛాత్రునకు విద్యాబోధ జరుపబడును. ఖచ్చితముగా చెప్పితీరవలెననే నిబంధనయు లేదు. గురువుపై నిర్బంధము అంతకన్నాలేదు. ఆ ఛాత్రునిపై పగిపూర్ణమైన విశ్వాసం కలిగితేనే, విద్యోపదేశము జరుగును. ఇట్లాంటి వాడైతే బాగుండుననె తలంపు గురువునకు తలపించేటట్లు మెలగాలి శిష్యుడు. స్పృహణీయ వర్తనుడై యుండినచో అంతకంటే యోగ్యత ఛాత్రునకు వేరేముంటుంది!

## చిత్తశుద్ధి

చిత్తం (సంకల్పం) శుద్ధంగా నుండే శిష్యునకు యొకే మంత్రంలో జ్ఞానోదయం కలుగుతుంది. చిత్తంలో దోషం వుందంటే, అనుగ్రహం అందదనే అర్థం. కారణం, ఇంద్రియాలలో దోషం పేరుకొని యుండడంతో ఇంద్రియాలకధిపతి యగుచిత్తం (మనస్సు) కూడ దోష భూయిష్టమై యున్నదని యర్థం. చిత్తదోష రహితంతో గురువనుగ్రహ కారణమగును.

అందులకు శిష్యుడు గురువు బోధపై మనస్సు లగ్నమొనర్చవలె. చిత్తాన్నెక్కడో లగ్నమొనర్చి యుండిన గురువు బోధ చిత్తమున కెక్కదు, అర్థం కాదు. అట్లర్థం కావటం లేదంటే, అది గురువు గారి దోషంకాదు. గురువు బోధపై మనస్సు, చెవి, దృష్టి ఏకాగ్రత యొనర్చినపుడే గురు(వు) బోధలు తలకెక్కును, ఆ ఏకాగ్రత కలిగి యుండి గురుబోధలు వింటుంటే, ఇంద్రియాలు శుద్ధమైతే మనస్సు అహంకారమును గోల్పోయి, పరిపూర్ణమైన గురుబోధ వినబడిన ఆ దేహమే శుద్ధమగును

గురువులు శిష్యులకు బోధించుటలో వారి కనేక పరీక్ష పెడుతుంటాడు ఆ పరీక్షలకు తట్టుకొనే వాడు గురు బోధలకర్హుడౌతాడు. అటులే, వశిష్ఠుడు తన శిష్యులకనేక పరీక్షలు పెట్టేవాడు.

ఒకసారాయన (వశిష్ఠుడు) తన శిష్యుడైన ప్రవర్ధక మహారాజును చేరాడు. "రాజా! నీరథం నాకివ్వు" అన్నాడు. రాజు వెంటనే తన రథం వశిష్ఠునకిచ్చెను. వశిష్ఠుడు రథము నధిరోహించి, "రాజా! అశ్వములకు బదులుగా నీవీరథమును లాగుటకు సిద్ధపడగా, అట్టిది గమనించిన రాణియును రాజునకు సహాయముగా రథమును లాగుటకు సిద్ధ పడగా, వశిష్ఠుడు అందులకు అంగీకరించకపోగా, రాజు యొకడే రథములాగెను. ఇట్లు, రాజు వశిష్ఠుని గురు(వు) భావముతో, చిత్తశుద్ధిగా సేవా తత్పరత కల్గియుండి, గురువాజ్ఞను పాటించెను. అందులకు గురువు వశిష్ఠుడతి ప్రసన్నుడై ఆ రాజునకు అనేక వరాలిచ్చి

వెళ్ళెను.

ఇదియే గురు సేవా తత్పరత. అనగా గురువాజ్ఞగా, గురువునకును గుణంగా ప్రవర్తించడంలో త్రికరణ శుద్ధి కలిగి యుండాలి శిష్యుడు. గురు సేవలకు పరిమితం లేదు. కఠినమైన గురువాజ్ఞలకు, మౌనంగా నుండి తన అశక్తతను వెలిబుచ్చడం కూడా నొక సేవయే. కాని, గురువాజ్ఞను ధిక్కరించడం. వృథా కబుర్లు చెప్పడం, కాల హరణమొనర్చడం వంటివి. అహంకారమునకు, సోమరి తనమునకు తార్కాణములు.

కావున, "గురువు శుశ్రూష" గురు శుశ్రూషయే అని భావించాలి. ఆర్థిక సేవలకన్నా, శారీరక మానసిక సేవలే గురువునకు పరమానందం.

శ్లో॥ సత్యం దానం తపస్త్యాగో, మిత్రతా శౌచమార్జవమ్ ।
విద్యాచ గురు శూశ్రూషా ధృవాణ్యేతాని రాఘవే ॥

భా: "సత్యం, దానం, తపస్సు, తపస్సు, త్యాగం, స్నేహం, పరిశుభ్రత, ఋజు స్వభావం, విద్య, గురు శుశ్రూష" - అనే గుణాలు శ్రీరామచంద్రునిలో నుండేవి. కనుక ఉత్తమ, ఉదాత్త స్వభావులు వారు.

★★★

## గురు - సూత్రములు

గురువును స్మృతించిన దారుణములైన భయరహితులగుదురు.

★★★

జేసదగురసన ఇరిషా కరహీ ।
రౌరవ నరకకోటి జుగపరహీ ।
త్రిజగ జోని పునిధరహీ సరీరా,
అయుత జన్మభరి పావహీ పీరా ॥

భా: గురువునెడ ఈర్ష్యాళువైన మూర్ఖుడు, కోట్లకొలది యుగముల వరకు రౌరవ నరక యాతనలకు గురియగును. తరువాత పశుపక్ష్యాది యోనులలో జన్మించుచు, వేలకొలది జన్మలలో దుఃఖముల ననుభవించును.

★★★




## స్తవము

శ్లో॥ ఈశ్వరో గురురాత్మేతి మూర్తిభేద విభాగినే ।

[illegible] ॥

# 19. శ్రీదక్షిణామూర్తయే నమః

"తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే" ఇది శ్రీదక్షిణామూర్తి స్తోత్రమునకు మకుటము. పరమేశ్వరావతారయగు శ్రీ దక్షిణామూర్తి, గురుమూర్తిగా పేర్కొనబడి నాడు. "తత్త్వోపదేష్టమగు గురువునకు" - శ్రీదక్షిణామూర్తికి అభేదము వివక్షితము, ఇచట "ఇదం నమః" ఇదిగో నమస్కారము, అని చెప్పబడినది. ఇచట నమస్కారము "ప్రహ్వీ భావము"తో ఆత్మ సమర్పణ రూపము. అనగా అభేదాను సంధానము. ఇట్లు పరమేశ్వరునకును, గురువునకును, ఆత్మకును వ్యావహారిక "మూర్తి" భేదమున్నను, ఏకతత్త్వ రూపముగా నుగ్గడింపబడినది.

శ్రీ దక్షిణామూర్తి శ్రీ జగద్గురువుగా, సర్వవిద్యానిధిగా, స్తుతింపబడుచున్నాడు. జ్ఞానోపదేష్ట యగు గురువు, మహావాక్య జన్య బ్రహ్మాత్మాపరోక్ష సాక్షాత్కారముతో, అజ్ఞానము నివర్తింపగా, ఉపాధ్యభిమానమును వీడి అద్వయ చిన్మాత్ర - ఆత్మస్వరూపానుభూతిని పొందుచున్నాడు. ఆ స్వప్న సాక్షి యగు "ఆత్మ, గురువు, ఈశ్వరుడు" ఒకే తత్త్వము" అను అర్థము ప్రతిపాదింపబడుచున్నది. "స్వప్రకాశ అఖండ సదాత్మ" స్వరూపమే ఈశ్వరుడగును, జీవుడగును, భోగ్యప్రపంచముగను, తత్త్వజ్ఞానోపదేశక గురుస్వరూపముగను సర్వాత్మకమయినది.

జీవుడు (శిష్యుడు) పూర్వ స్వరూప విస్మృతి కలిగినందున, వేదాన్త వాక్య శ్రవణ మనన నిధి ధ్యాన సాధనచే స్వరూప ప్రబోధ స్మృతిని గురూపదేశము వలన పొందవలసినవాడై యున్నాడు. ఏక రూపమునగు సదానన్దాద్వయ బ్రహ్మ స్వరూపమును గురువు అనుభవించుచు చిన్ముద్రచే శిష్యులకు ఆత్మతత్త్వమును బోధించుటచే విరుద్ధ దేశకాలావస్థ భేదములను, అనుషంగికములైన వానిని త్రోసిపుచ్చి అనుస్యూతమగు ఏకాత్మానుభవము ప్రత్యభిజ్ఞగా చూపబడినది. "తత్త్వమసి"యను గురూపదేశము శృతిప్రమాణము. కనుకనే వేదాధ్యయనారంభమున ఇట్టి గురువు పరతత్త్వ స్వరూపుడుగా, ప్రణవాత్మకుడుగా దర్శింపబడి వందనీయుడగుచున్నాడు.

వేదాధ్యయనారంభమున "శ్రీ గురుభ్యోనమః హరిః ఓమ్" అనెడి యీ అనూచాన సాంప్రదాయిక వచనమే, శ్రీదక్షిణామూర్తి స్తోత్రమున "శ్రీ గురుమూర్తయే ఇదం నమః" అని యనుట ద్వారా - "తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే" అనుమకుటము మంత్రరూపమని శ్రీ జగద్గుర శంకరాచార్యులు సూచించిరి. "గురుః శ్రీశంకరాచార్యః" కదా.

శ్రీ దక్షిణామూర్తి స్తోత్రము యొక్క ప్రణవాత్మకత్వమును, గురువు యొక్క

ప్రణవాత్మకత్వోద్బోధకత్వమును, గురువు "ముముక్షు జన శరణ్యుడ"ను నది సందేశ ప్రబోధాత్మకము.

గురువు శ్రీగురుమూర్తి యగు శ్రీదక్షిణామూర్తి బ్రహ్మనిష్ఠులైన మహాత్ములచే పరివేష్టింపబడి పరబ్రహ్మతత్త్వావగతికై సేవింపబడుచున్నాడు. ముముక్షువులగు సాధకులెంత బ్రహ్మనిష్ఠులైనను, ఎంతటి మహాత్ములైనను, వారు గురు పాద పద్మములాశ్రయించి తదనుగ్రహ పాత్రులు కావలసినదే. అంతేవాసులై గుర్వనుగ్రహ సమయమునకై ప్రతీక్షించ వలసినదే. అని బ్రహ్మోపగతిని కాంక్షించు శిష్య స్వరూపము, శిష్యుని అర్హతలు నిర్దేశింపబడుచున్నవి. అటులే - "మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మతత్త్వంయువానం" అను వచనంతో గురుస్వరూపము నిర్దేశింప బడుచున్నది. "మౌనం" వాగింద్రియ నిగ్రహమేగాక, "మౌనం హి బ్రహ్మ" అట్టి పరబ్రహ్మ తత్త్వ స్వరూపుడే శ్రీగురుమూర్తియే శ్రీదక్షిణామూర్తి "యత్సాక్షాదపరోక్షాద్బ్రహ్మ" యను శృతి వాక్య వివరణయే యీ మౌనవ్యాఖ్య

భాగవతములోని 10 స్కం. 16వ అ. 47వ శ్లోకము

శ్లో॥ అవ్యాకృత విహారాయ సర్వవ్యాకృత సిద్ధయే ।
హృషికేశ నమస్తేఽస్తుమునయే మౌనశీలినే ॥

అని ముని, మౌన శీలత్వమును గూర్చి వివరింపబడినది.

అటులే "శ్రీధర స్వామి" వ్యాఖ్యగా

"మునయే ఆత్మారామాయ ......... తత్స్వభావాయ"

మౌనమనగా ఆత్మారామత, అది మహాత్ములకు స్వభావసిద్ధం.

"మౌనం చైవాస్మిగుహ్యానాం" - అని గీతలో, రహస్యములలో మౌనమునై యున్నాను. అని శ్రీకృష్ణ పరమాత్మ వెల్లడించుకొనెను.

అనాది సిద్ధముగా వర్ధిల్లునట్టి గురు శిష్య సంప్రదాయము శ్రీ శంకరులను గావించినది. శ్రీ శంకరులకు పద్మపాదుడు, హస్తామలకుడు, తోటకాచార్యుడు, సురేశ్వరులు అను ముఖ్య శిష్యులు గురుపూజా సందర్భమున ఆచార్య పంచకములో పేర్కొనబడుచున్నారు. అందులకే,

శ్లో॥ శృతి స్మృతి పురాణానామాలయం కరుణాలయం ।
నమామి భగవత్పాద శంకరంలోక శంకరమ్ ॥

అని స్తుతింపబడెను. వీరు శ్రీ శంకరావతారమూర్తి. ఇట్టి శ్రీ ఆచార్యపాదులు పరమేశ్వరునకు, నిశ్శ్రేయసకరమైన జ్ఞానమునుపదేశించునట్టి గురువర్యునకును అభేదము

ప్రతిపాదించుచు లోకానుగ్రహ దృష్టితో శ్రీ దక్షిణామూర్తి స్తోత్రమును, ప్రసన్న గంభీరార్థ స్ఫోరకములైన ప్రస్థాన త్రయ భాష్యములను రచించిరి.

"శ్రీ దక్షిణామూర్తి" - స్తోత్రమున ౭వ వార్తికమున

శ్లో॥ "సర్వజ్ఞ స్సర్వకర్తాచ కథమాత్మా భవిష్యతి ।
శిష్యం ప్రతీత్థం పృచ్ఛన్తం వక్తు మారభతే గురుః ॥"

అల్పజ్ఞుడైన శిష్యుడు (జీవుడు), సర్వజ్ఞత్వ, సర్వ శక్తి సంపన్నుడగుటకు గురువిట్లనుచున్నాడు.

"పుత్రాయా శిష్యాయ వాదద్యాత్" - అనువచనము ననుసరించి పుత్రుడు, శిష్యుడు ఆత్మజ్ఞానోపదేశమున కర్హులని, పుత్రుడును శిష్యుడు కాక, జ్ఞానోపదేశము నొందినను అది సఫలము కాజాలదు. శిష్యుణ్ణి పరీక్షించి, యుపదేశము చేయుట ఆచార్యుని కర్తవ్యము. శిష్యుడును జిజ్ఞాసువై పరి ప్రశ్నచేయునంత వరకు ఆత్మవిద్యోపదేశ గ్రహణమునకు యోగ్యుడు కాజాలడు. తీవ్రజిజ్ఞాస కలిగినపుడే యతని చిత్తము సమాహితమగును.

యోగ్యుడగు శిష్యునకు విద్యోపదేశ మొనర్చుట ఆచార్యుని కర్తవ్యమని, శాస్త్రీయ మర్యాద. అట్లొనర్చుట వలన సంప్రదాయము రక్షింపబడును.

గురుముఖము ద్వారా శ్రవణము చేసినపుడే జ్ఞాన ప్రయోజకమైన అపూర్వము ఉత్పన్నమగును. కాని, పుస్తక పఠనంతో కాదు. గురుముఖ శ్రవణము జ్ఞాన ప్రయోజకము. ఇట్లు శిష్యుడు (జీవుడు) ఆచార్యోపదేశముతో, వేదాంత వాక్య శ్రవణముతో ప్రబోధము నొందినపుడు అద్వయాత్మ తత్త్వావరోక్ష సాక్షాత్కారము పొందును. దానితోనతడు జాగ్రత్, సుషుప్తి, స్వప్నావస్థాత్రయ రహితుడగును. ఆత్మ తత్త్వము అద్వైతము. కావున అద్వయాత్మ జ్ఞానోదయం స్వతంత్రము కాదు. శృతి గుర్వధీనమని, శ్రీ శంకరులును వ్యాఖ్యానించిరి.

"తద్విజ్ఞానార్థం సగురుమేవాభిగచ్ఛేత్" అని ముండకోపనిషత్తు ౧-౨-౧౨లోను, "ఆచార్యాద్ధి ఏవం విద్యా విదితా సాధిష్ఠం ప్రాపయతి" యని (ఛాందోగ్యపనిషత్తు ౪-౯-3) లోను చెప్పినటుల, శృతులు, జ్ఞానము గురుముఖైక వేద్యమని కంఠోక్తిగా పలికినవి.

అదియును గాక, శ్రీకృష్ణ గీతలోను (౪-3౪).

శ్లో॥ తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నే సేవయా ।
ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వ దర్శినః ॥

అనుచు ఉక్తవిషయమునే సమర్థించుచున్నది.

శ్లో॥ "శ్రుత్యాచార్య ప్రసాదేన యోగా భ్యాసవశేనచ
ఈశ్వరాను గ్రహేణైవ స్వాత్మబోధో యదాభవేత్ ॥"

శృతి, గురు ప్రసాదము (అనుగ్రహము) వలన యోగాభ్యాస బలముచేతను, ఈశ్వరాను గ్రహము చేతను స్వస్వరూప సాక్షాత్కారమగును. వేదవచనమే జ్ఞానోత్పాదన సమర్ధము. దానితో శిష్యుడు (జీవుడు) అనాది మాయా పరిచ్ఛిన్నుడై యున్నందున ఆ వచనముతో మేల్కొని స్వస్వరూపసగతిని పొందును. అందులకు, ప్రసన్నుడైన యాచార్యుడే ఆత్మ తత్త్వోపదేశము చేయ సమర్థుడు.

ఆత్మ విద్యోపదేశకుడైన యాచార్యుడు సాంసారిక విషయములచేత ప్రభావితుడు కాడు. సర్వైషణా త్యాగమొనర్చిన ఆచార్యుని వలననే ఆత్మజ్ఞానోపదేశము సంభవమగును. అట్టి ఆచార్యుని సర్వాత్మనా ప్రసన్నుని జేసికొనుట శిష్యుని కర్తవ్యమని శాస్త్రములుపదేశించుచున్నవి. గురువు శిష్యుని పూర్వ జన్మానుగత దుష్టవాసనలను ఉపశమింప జేసి, ఆ శిష్యుని అంతఃకరణము ఈశ్వరాభిముకమైనపుడే, గురువు శిష్యుని ఎడ ప్రసన్నుడై ఆత్మ తత్త్వోపదేశము చేయును.

శాస్త్రజ్ఞాన సముపార్జనము చేయువాడు, శిష్యుని సదాచారము నందు నియోగించువాడు. స్వయముగా సదాచార నిష్ఠుడైనవాడు ఆచార్య నామముచే వ్యపదేశ్యుడగును. ఉపాసకుడు, భక్తుడు కాని వాడు భక్తినుపదేశించినట్టి యుపదేష్ఠ కానేరడు. గురువు సిద్ధుడైనను, సాధకుని వలె సదాచార పరాయణుడు కావలయునని శాస్త్రములు వధించుచున్నవి. సిద్ధుడైనను, సదాచారనిష్ఠుడు కానిచో, అతడు ఆచార్యత్వ పదమునకు అర్హుడు కాజాలడు.

కావున, ఉన్మత్త పిశాచాదుల వలె సంచరించు అజ్ఞానులు ఆచార్యులు కాజాలరు. "ఆచార్య వాన్పురుషోవేద", "వేదాన్త విజ్ఞాన సునిశ్చితార్థాః" ఇత్యాది శృతులు ఆచార్యుని మహిమాతి శయమును సంకీర్తనము చేయుచున్నవి. నిధి ధ్యాసనాపరుడైన సాధకుడే యోగీశ్వరుడగును. స్వగురూపదిష్టమైన యోగ విధానమునే సాధన చేయనగును. తాదృశ మహిమోపేతుడే 'గురు' శబ్ద వాచ్యుడు. కావుననే శాస్త్రములు "గురువు" దుర్లభుడని, సద్గురుని పొందడం పరమేశ్వరుని అనుగ్రహము వలననేయని, "తమేతం వేదాను వచనేన" (బృహదారణ్యకోపనిషత్తు ౪-౪-౨-౨) అనువచనము సత్యమని ఘంటాపథమని అవగతమగును.

శ్రీవ్యాస భగవానుడు, "సూత సంహితా ముక్తి ఖండము"నందు, పరమ శివుడు సంసారమోచకుడనియు, గురువు సంసారమోచక ప్రదుడనియు పరమశివ స్వరూపాభిన్నమైన గురు స్వరూపమును విశదముగా వర్ణించిరి.

మరియును, తాదృశ సచ్చిదానంద మూర్తియైన శ్రీదక్షిణామూర్తి దేవుడు గురువులకు గురువు. ఆయన అద్వయ బ్రహ్మాత్మ తత్త్వమునుపదేశించునట్టి అతివర్ణాశ్రమి యని.

'గురు' స్వరూపమును అతివర్ణాశ్రమియైన యాచార్యలక్షణములను 'సూత సంహిత' యందిట్లు వర్ణించుచున్నది.

శ్లో॥ "ఆచార్య ఏవ సంసార మోచక ప్రద ఉచ్యతే ।
ఆచార్యో నామ వేదాన్త విచారేణాప్తవేదనః ॥"

ఆచార్యుడు సంసారమోచక ప్రదుడనియు, వేదాంత విచారముచేత ఆత్మజ్ఞానిగా, ఆచార్య శబ్ద వ్యపదేశ్యుడు. ఈశ్వరుడు సంసారమోచకుడని శృతి, స్మృతి, పురాణేతిహాసము వలననే తెలిసికొనుటకు నవకాశమున్నను, తత్స్వరూపమును ఆచార్యుని వలననే శ్రవణము చేసి తెలిసి కొనవలయును.

కావుననే, ఆచార్యుడు స్వాత్మ విద్యా ప్రదానము చేత సంసారమోచక ప్రదుడనియు చెప్పబడినది.

ఈ ఆచార్యులయిదు విధములు.

శ్లో॥ బ్రహ్మచారీ గృహస్థశ్చ వానప్రస్థశ్చ భిక్షుకః ।
అతి వర్ణాశ్రమీ చేతి క్రమాత్ శ్రేష్ఠావిచక్షణః ॥

అను, సూత సంహితావచనాను సారము బ్రహ్మచారి, గృహస్థుడు, వాన ప్రస్థుడు, సన్న్యాసి, అత్యాశ్రమి అని గురువులందరనియు, వీరిలో నొకరి కంటే మరియొకరు క్రమముగా శ్రేష్ఠులనియు తెలియుచున్నది.

"అతి వర్ణాశ్రమీ సాక్షాద్గురూణాం గురు రుచ్యతే"

అతి వర్ణాశ్రమీ మైన వాడు, అనగా శరీరేంద్రియ సంఘాతాభిమానము చేత కల్పితములైన వర్ణాశ్రమ ధర్మములను అతిక్రమించి, కేవల స్వస్వరూపస్థానము కలవాడు సాక్షాత్తు గురువులకు గురువు, ఆయన కంటె నధికుడుగాని, తత్సమానుడు గాని యీసమస్త సృష్టిలో లేడనుట నిస్సంశయము.

అట్టి అతివర్ణాశ్రమియైన ఆచార్య శ్రేష్ఠుడే పరాశివాభిన్న స్వరూపుడైన శ్రీదక్షిణామూర్తికి నమస్కారము.

జనన మరణ రూప సంసార సాగరము నుండి తరింపజేయువాడు బ్రహ్మవేత్తయైన యాచార్యుడే. "బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి" అను శృతివచనము కదా! ఆచార్యుడు

పరమేశ్వరాభిన్నుడు. తాదృశ మహత్త్వ సంపన్నుడైన సద్గురు మూర్తికిని నమస్కారము.

విద్యా గ్రహణమునకే ఉపసదన విధితో గురు సమీపమున కేగిన శిష్యుడు, విద్యోపదేష్ట యగు నాచార్యుడు, పితృ పుత్రాది రూపముతో నీవిశ్వమును నెవరు చూచునో, అట్టి గురుమూర్తి యగు శ్రీదక్షిణామూర్తి దేవునకు నమస్కారము.

ఆ పరమేశ్వరుడే అనేక విధములుగా భావింపబడునని,

శ్లో॥ ఉపాస్యోపాసకత్వేన గురు శిష్య క్రమేణచ ।
స్వామి భృత్యాది రూపేణ క్రీడతి స్వేచ్ఛయేశ్వరః ॥

పరమేశ్వరుడు సర్వసంకల్పము చేత ఉపాస్య, ఉపాసక రూపకముతోను, స్వామి భృత్యురూపముతోను, గురుశిష్య క్రమముతోను క్రీడించుచున్నాడు.

ఒకప్పుడు శిష్యుడుగా విద్యాగ్రహణము చేసినవాడే, కాలాంతరమునందు విద్యోపదేశకుడై యాచార్యపదము నొందును. కావున, పరమేశ్వరుడే లీలగాననేక రూపములను ధరించునని భావము. అటులే!

శ్లో॥ పితరం ప్రతిపుత్రోయః పుత్రం ప్రతిపితైవసః ।
ఏక ఏవ హినానేవ కల్ప్యతే శబ్దమాత్రతః ॥

తండ్రికి పుత్రుడైనవాడే, పుత్రునకు తండ్రియగుచున్నాడు. ఒకే వ్యక్తి, కేవలం శబ్దముల చేతనే యనేక విధములుగా కల్పింపబడుచున్నాడని భావము.

> "విమతః శిష్యాచార్య రూపో భేదప్రపంచో వస్తుతః ఆత్మన్యన్యత్రవా నకాలత్రయేఽప్యస్తి, యత్రయత్ ప్రపన్నం తత్రైవ జ్ఞానాపనోద్యత్వాత్, స్వప్నదృష్ట ప్రపంచవత్" -

జ్ఞానోదయమైనంతనే శిష్య, ఆచార్య ఉపదేశాది వ్యవహారములు స్వప్నము వలె గోచరించును. మనోభ్రాంతికి అవస్థాత్రయమే కారణము. జ్ఞానోదయమైన తరువాత జ్ఞానియైన వాడు విశ్వమునిక జూడదు. అతని లోని దోషము నివృత్తికాగా, అవస్థాత్రయం (జాగ్రత్, స్వప్న, సుషుప్తావస్థలు) నివృత్తములగును. "విశ్వం నపశ్యతి", అని. అట్టి భ్రమయు తొలగును.

ఇట్లు గురు తత్త్వవిశేషము గల "గురుమూర్తయే శ్రీదక్షిణామూర్తయే నమః", గురుమూర్తి యగు శ్రీదక్షిణామూర్తికి నమస్కారము.

"దక్షిణామూర్తి" అనగా ఈశ్వరుడే "గురుమూర్తి" అనగా తత్త్వబోధ చేసినవారే. ఉభయులొక్కటే ఇట్టి వారికి నమస్కారమొనర్చు శిష్యుడు (జీవుడు)ను సమానుడే.

"ఈశ్వరో గురురాత్మేతి" - ఆ ముగ్గురును నొక్కటే. "నమః" అను పదమునకర్థం "నమః ప్రహ్వీభావే - దాని కంటే భిన్నంగా నేను లేను." అను భావముతో "ఐక్యాను భవాన్ని పొందటం" పేరే నమస్కారం.

"నమస్కారం" అంటె, రెండు చేతులు జోడించి తలవంచడంలోని అర్థం, నీవు ఉన్నతుడవనీ, నేను అల్పుడననీ భావించి, నాహృదయమనే పద్మాన్ని నీ కర్పిస్తున్నాననీ, మరియు, జీవాత్మ పరమాత్మతో నైక్యమవడం అని, అదొక అంజలీ ముద్ర ఐక్యాను సంధానం. అనగా, వారితో ఐక్యాను సంధాన మగుచున్నామని భావం. అనగా అభేదాన సంధానం. మరియు ఆత్మాను సంధానం రూపమైనటువంటి ఆగురువు నందు ఏకత్వాన్ని పొందేటువంటి, నమస్కారం, ఆ గురువునకు సమర్పిస్తున్నామని అర్థం.

ఎటువంటి గురువునకు? ఈశ్వర రూపముగానున్న గురువునకు. ఈశ్వరాభిన్నుడైనటు వంటి గురువుతో జీవుడను శిష్యుడు ఏకత్వ సంధానమగుటయే. అనగా! ఈశ్వరుడొకడున్నాడు. అటులే అట్టి రూపుడగు గురువొకడున్నాడు, ఈ గురువు ఈశ్వర రూపముతో తాదాత్మ్యం పొందియున్నాడని భావము.

అనియిట్లు అర్థం చెప్పినంతలో - "నాద్వైతం గురుణా సహ" భావనగా, పొరపాటుననూ కలలోనూ తాను (శిష్యుడు) గురువుతో సమానుడనని తలంచరాదు అట్లు యే శాస్త్రము సమ్మతించదు.

గురువు ఉపదేష్టగా నుండి, మనకు (శిష్యునకు) జ్ఞానం ప్రసాదించినంత కాలం, జ్ఞాన సిద్ధి యింకా లభించక, యింకా జ్ఞానార్జనకై అర్థిస్తున్నంత కాలమున గురువు గురువుగానే, శిష్యుడు శిష్యుడు గానే నుండడమని అర్థం. అటులే వేషధారణలో సమానత్వమున్ననూ, తానెంత శక్తిమంతుడై యుండిననూ, ఎట్టి పరిస్థితులలోనూ గురువుతో శిష్యునకు అద్వైతం కుదరదు; అని సూక్తి. అనగా గురువు గారితో సమానుడనని తలంచరాదు.

"ఈశ్వరో గురురాత్మేతి మూర్తి భేద విభాగానే" - అని, ఈశ్వరుడును, గురువును యొక్కరే. వారిలో జీవు (శిష్యు)డైన నొక్కడే, ఒక్కటియును అని తత్త్వశాస్త్రం చెప్పును. తత్త్వస్థితిలో అది సత్యమే. అయినప్పటికినీ, సాధన స్థితిలో నేను గురువుతో తాదాత్మ్యం పొందుతున్నాను గదా, అని అట్టి యెడ నేనుకూడ గురువునే. కనుక ఈ గురువునకు నమస్కారం కానీ, ప్రార్థించడం కానీ, ఎందుకు చేయవలెననే దుర్భావం గలవానికి, "నిజమైన అద్వైతం" తెలియదని, ఇంకా జ్ఞానోదయం కలుగలేదనే భావన.

అభేదాను సంధానమెప్పుడును ఈశ్వరుడితో అనుసంధానముండాలి. ఆ అభేద అజ్ఞానాన్ని గురువు నుండి సంపాదించి యుండాలి. అట్టి అభేద జ్ఞానాన్ని కేవలం ఈశ్వర

రూపుడైన గురువుపై ఉంచాలి. ఆ ఈశ్వరుడికే "దక్షిణామూర్తి" అని, అదియే "దక్షిణామూర్తయే గురుమూర్తయే నమః" అని నమస్కారం చేయుటలోని అర్థం. అభేదజ్ఞానం గురువుద్వారా పొందుటలో, ఆ దక్షిణామూర్తి యగు ఈశ్వరుడు యీవిశ్వమంతా విస్తరించి యున్నాడని జీవుడనే రూపంలోనూ, ఈశ్వరుడే చేరి యున్నాడని గ్రాహ్యం. ఈ గ్రహింపు సద్గురువుద్వారానే లభించినది గనుక, ఈ గురువుని ఈశ్వరుని లయమొనర్చి, అట్టి ఈశ్వరునిలో గురువుతో తాదాత్మ్యం భావన పొందాలి. లేనిచో ఈశ్వరుడిని దూరమొనర్చి, కేవలం సాక్షాత్తు గురువులోనే తాదాత్మ్య భావన కలిగియుండిననూ, లేక, గురువును వదలి ఈశ్వరుడినే తాదాత్మ్యం పొంద యత్నించిననూ, ఆ గురువుపై నుండే గురుభక్తి ఈశ్వరభక్తి భిన్నమగును. తత్త్వము నశించునుకూడ.

ఇందాక, ఉపనిషత్తు మంత్రంలో చెప్పినదే,

శ్లో॥ "యస్యదేవే పరాభక్తిః యథాదేవేతథాగురౌ ।
తస్యైతే కథితాహ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః ॥"

భా: ఈశ్వరుడు యందు ఎటువంటి నిర్మలమైన, నిష్కామమైన భక్తి కలిగి యుండునో, అటువంటి భక్తే సాక్షాత్ గురువుపై నుండాలి. అట్టి వారికి మాత్రమే ఈ ఉపనిషత్తులో బోధింపబడిన అర్థం హృదయంలో ప్రకాశించగలదు.

అద్వైత జ్ఞానులగు గురువులు తమ శిష్యుల విషయంలో నెంతవరకూ సావకాశముంటుందో, అంతవరకునూ దుష్ఫలితాలు రాకుండా, శాంతులు చేస్తూంటారు. శిష్యులకు కొద్దిగా సూచనలునూ యిస్తూంటారు. ఈ సూచన లిచ్చునపుడు అందుకోవాలి శిష్యుడు (లు). తప్పినచో యిబ్బందులు ఎదుర్కొంటారు. ఒకసారి తమను నమ్మినవారి దుష్కర్మలను తామే నెత్తిన వేసుకొని, ఆ యాతనంతా పడుతూవుంటారు. కర్మఫలం అనుభవించటం గూడ ఈశ్వరుడికిని తప్పదు. ఇక ఈ కలియుగంలో గురువే సర్వం శిష్యులకర్మ ఫలమనుభవించటం గూడ సాధ్యపడదు. ఎందులకు?

గురువుపై అచంచలమైన విశ్వాసం శిష్యుడికే పరిపూర్ణంగా నుండాలి. అటులే ఆ గురువునకునూ ఈ శిష్యునికై యీపని చేస్తే, వీడివల్ల యింకా పది మందికి మేలు చేకూరుతుందని, లేదా! వీడైననూ సన్మార్గమునకు వస్తాడని ఫరవాలేదని, శిష్యునిపై అచంచలమైన విశ్వాసం వుండాలి. అప్పుడే శిష్యుడి కర్మ గురువు అనుభవించే వీలుంటుంది.

అట్టిది జరగాలంటే శిష్యునిలో త్యాగం కొంతయుండాలి. ఆ త్యాగంతోనే గురువుయొక్క విశ్వాసాన్ని చూరగొంటాడు. చూరగొనాలి, ఇది సాధ్యమే.

తేజోవంతుడైన గురువు, అంధకార నిమగ్నుడగు శిష్యుని యందు జ్ఞాన తేజస్సును

కలిగించాలి, ప్రజ్ఞానమనే ప్రకాశ వంతమైన వెలుగును (జ్యోతిని) వెలిగించేవాడే ఆచార్యుడు. జ్ఞాన దృష్టిని కల్గిస్తాడు. అట్టి ఆచార్యుల యెడల 'గురి' (లక్ష్యం) కల్గియుండిననే గౌరవం ఏర్పడును.

ఆ లక్ష్యమేమిటి ? జ్ఞానార్జనము. అమూల్య జ్ఞాన సంపదను ఆస్వాదించ వలెను. అందులకై గురువు యెడల శ్రద్ధా, గురుభక్తి కలిగి యుండాలి.

శ్రీ శంకరులు **తన యనుభూతినే శ్రీదక్షిణామూర్తి** వ్యాజముతో స్తోత్రము మౌన వ్యాఖ్యా శ్లోకరూపమున **ఉపవర్ణించుకొనిరని** తెలిసెను. అందులకే మౌన రూపుడగు ఆ దక్షిణామూర్తి సాక్షాత్కారమే తత్వావగతియే మౌన వ్యాఖ్యా. అమ్మహాత్ముని అనుగ్రహదృష్టియే మౌనవ్యాఖ్య కావున అట్టి మౌన వ్యాఖ్యావైశిష్ట్యముతో వర్ధిల్లుదురు గాక! ఆ అద్వైత విద్యను బోధించిన ఘట్టం పురాణాలలో ప్రసిద్ధం -

శ్లో॥ చిత్రం వటతరోర్మూలే వృద్ధా శిష్యాగురుర్యువా ।
గురోఽస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు ఛిన్నసంశయాః ॥

ఎంత ఆశ్చర్యం ?! మఱ్ఱి చెట్ల క్రింద ఈ గురువేమో యువకుడు. శిష్యులేమో ముసలి వగ్గులు, చేసే బోధేమో మౌనం. ఆ మౌనంతోనే శిష్యుల సందేహాలు మాత్రం పటాపంచలై పోతున్నాయి!!! అనేదే శ్లోకం వివరిస్తోంది.

దక్షిణామూర్తి శిష్యులైన సనక సనందనాదుల, నారదులద్వారా యీవిద్యను ప్రవర్తింప జేశారని సాంప్రదాయుకులు చెబుతున్నారు. ఈ సాంప్రదాయము అంతా గురుశిష్య బోధపరంగా జరిగిందే తప్ప గ్రంథ రూపకంగా జరుగలేదు.

శ్లో॥ ఈశ్వరో గురురాత్మేతి మూర్తిబేదా విభాగినే ।
వ్యోమ వద్వ్యాప్త దేహాయ దక్షిణామూర్తయే నమః ॥

★★★

## గురు - సూత్రం

"గుర్వవజ్ఞా మనుష్యణాం రాక్షసత్వప్రదాయిని" (నా.పు: 9-83/1)

మానవులు గురువునకు అవమానించినచో రాక్షసత్వం పొందుదురు.

అందుకు "శ్రీమాన్నచాచరేత్"-శ్రేయోభిలాషి అట్లవమానించడు.

★★★

# 20. శ్రీదత్త స్తవము

**శ్రీ గణేశాయ నమః శ్రీ సరస్వత్యై నమః శ్రీపాద వల్లభ నరసింహ సరస్వతి శ్రీ గురు దత్తాత్రేయాయ నమః**

1. దత్తాత్రేయం మహాత్మానం వరదం భక్తవత్సలం ।
ప్రపన్నార్తి హరం వందే స్మర్తృగామీ స నోవతు ॥

2. దీన బంధుం కృపాసింధుం సర్వకారణ కారణం ।
సర్వ రక్షాకరం వందే స్మర్తృగామీ స నోవతు ॥

3. శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణం ।
నారాయణం విభుం వందే స్మర్తృగామీ స నోవతు ॥

4. సర్వానర్థ హరం దేవం సర్వమంగళ మంగళం ।
సర్వక్లేశ హరం వందే స్మర్తృగామీ స నోవతు ॥

5. బ్రహ్మణ్యం ధర్మతత్వజ్ఞం భక్త కీర్తి వివర్ధనం ।
భక్తా భీష్ట ప్రదం వందే స్మర్తృగామీ స నోవతు ॥

6. శోషణం పాప పంకస్య దీపనం జ్ఞాన తేజసః ।
తాప ప్రశమనం వందే స్మర్తృగామీ స నోవతు ॥

7. సర్వరోగ ప్రశమనం సర్వపీడా నివారణం ।
విపదుద్ధరణం వందే స్మర్తృగామీ స నోవతు ॥

8. జన్మ సంసార బంధఘ్నం స్వరూపానంద దాయకం ।
నిశ్శ్రేయస పదం వందే స్మర్తృగామీ స నోవతు ॥

9. జయలాభ యశః కామ దాతు ర్దత్తస్య య స్తవం ।
భోగ మోక్ష ప్రద స్యేమం ప్రపఠేత్ స కృతీ భవేత్ ॥

★★★

## గురు - సూత్రములు

"గురువు" - వెలుగునిచ్చు భాస్కరునితో సమానుడు.

# 21. శ్రీదత్త గురుదర్శనం

శ్రీగురుదత్తాత్రేయ మూర్తి, శ్రీమన్నారాయణ బ్రహ్మరుద్రాంశలతో, మహాతపస్సంపన్నుడైన అత్రిమహాముని, మరియు సమస్త సద్గుణాల రాశి అద్వితీయురాలైన అనుసూయ దంపతుల పుణ్యఫల సంతానము అవతరించిన మహాయోగి పుంగవుడు.

ఆ గురుమూర్తి బాల్యము నుండియే అనంతచిత్ర విచిత్ర విభూతి సంపన్నుడుగా, ఆశ్రమవాసులకాశ్చర్యం కలుగునట్లు గురుతత్త్వం ప్రదర్శించెను. ఆ గురుతత్త్వమునకు ముగ్ధులైన కొందరు ముని కుమారులు శ్రీదత్తస్వామి చుట్టూచేరి తమని శిష్యుల్నిగా స్వీకరించమని ప్రార్థించారు. మరి, స్వామి వారిని పరీక్షించాలని తలంపుతో నొకనాడు వారందరు చూస్తుండగానొక సరస్సులో మునిగి మాయమయ్యాడు. ముని కుమారు లదిగని అబ్బురపడిరి. యోగంపై ఆసక్తితో, స్వామి మీద ప్రీతితో, ఆ రూపం మీది మోహంచేత, వారాయనను విడిచి వెళ్లలేకపోయారు. త్రిలోకసమ్మోహకమైన ఆ దివ్య సుందర రూపాన్ని తలంచుకొంటూ వారా సరస్తీరంలోనే నిలిచిపోయి, స్వామి కనిపించేదాక, తమ యిళ్లకు వెళ్ళరాదని నిశ్చయించుకొన్నారు. కానీ ఆ రూపం చూడలేక, అట్లు వంద సంవత్సరాలుగా అటులే వేచియున్నారు.

సరోవర గర్భంలో నిశ్చల సమాధిలో మహానందమయుడైయుండి, మునిజనులు వేచియుండడం తనకానందం కలిగింది. కాని, స్వామికింకా వారిని మిక్కిలిగా పరీక్షించాలని తలంచెను.

దత్తస్వామి యెంతకరుణాసముద్రుడో, అంత పరీక్షా నిష్ఠురుడును. అందులకతడు నొకనాడిట్లు దర్శన మిచ్చెను. ఒకచేత్తో నొక సుందరవనితను, మరోచేత్తో మద్యపాత్రను పట్టుకొని సరస్సులోంచి బయటకు వచ్చెను. స్వామి చెంత నున్న స్త్రీని, దానికి తోడుగా **స్వామి చేతిలోని మద్యపాత్ర**ను చూచి వారిలో కొందరు స్వామికంటె మ్లేచ్ఛులే నయమని తలం**చి అసహ్యపడి, "ఇత**డెంత భ్రష్టుడు ఛీఛీ"యని స్వామిని వీడి వెళ్లిరి. మరికొందరు **స్వామి క్రీడను దర్శించి**, లోలోన మహదానందపడి యిటులైన స్వామిని దర్శించితిమని చేతులు మొగిడ్చి ఆ యోగీశ్వరుని పలురీతుల సంస్తుతించిరి.

మాతాపితరులచేత కూడా "గురుదత్తా! నీవు జగత్తులను అంధకారంనుండి కాంతిలోనికి నడిపించడానికై అవతరించిన జగద్గురువువయ్యా!" అని స్వామికీర్తింపబడెను. వారి యాజ్ఞతో జగదుద్ధరణకై సహ్యాద్రికేగెను.

జంభాసురుని వధించు నిమిత్తమై దేవేంద్రునకు బృహస్పతి వంటి మహోత్తముడే శ్రీదత్తస్వామిని ఆశ్రయించమని యుపదేశించెను. అటులే దేవేంద్రుడు రాగా, అతనికినీ

స్వామి పరీక్షలెదుర్కొనే స్థితి కలిగెను. పరీక్షలో నెగ్గెను. దేవేంద్రుని కోరికపై కరుణించి, జంభాసురుని స్త్రీవ్యామోహంలోపడవేసి, ఆ దేవేంద్రాదులతోనే ఆ రాక్షసుని వధించునట్లు చేసెను.

బ్రహ్మగారు మానవసృష్టికై అవిద్యావరణం (అనగా తమస్సు, మోహము, మహామోహము, తామిస్రము, అంధతామిస్రము) అనే ఐదు శాఖలు కలిగిన అవిద్యను సృష్టించెను. కానీ అదెంత బలమైనదోమరి, పుట్టీ పుట్టడంతో ముందా బ్రహ్మనే ఆవరించెను. దాంతోనిక వారికి వేదాలు స్ఫురింపలేక దుఃఖార్తుడయ్యెను. కొంత తెలివిన్ని తెచ్చుకొని, పరాశక్తి స్వరూపిణి యగు రేణుకామాతను దర్శించుటకై సహ్యాద్రికేగెను.

ఆమెననేక రీతుల స్తుతించి తన దుఃఖకారణం వెల్లడించెను. ఆమె కరుణించి, వాసుదేవరూపంలో నున్న శ్రీదత్తస్వామిని, అనఘామాతను రప్పించి బ్రహ్మమొర వినిపించినది.

అప్పుడా దత్తస్వామి గంభీర స్వరంతో నిట్లనెను. "ఓ సృష్టికర్తా! విను. సమస్త వాఙ్మయము ఓంకారనాదాత్మకంగా ప్రకాశిస్తూంది. ఆ నాద రూపమే యీ జగజ్జననీ రేణుకామాత. ఈమెయే వేదమాత, సావిత్రీ, గాయత్రీ, బ్రహ్మరూపిణి, ఏకవీర, ఓంకారైకస్వర మరియు – "హ్లాదిని, విమల, ఉత్కర్షిణి, జ్ఞానయోగ, ఇత్యా, ఈశాన, ప్రహ్వీ, అనుగ్రహా" అని ఎనిమిది పేర్లుండడం చేత యీామెను "అష్టపర్యాయవాచిక" అని కూడ వ్యవహరిస్తారు" – అని చెప్పడంతో బ్రహ్మ, శ్రీదత్తస్వామిని, ముందున్న అనఘాదేవిని స్తుతించెను. అంతలో అనఘాదేవి ముఖంలోంచి వేదాలు, రేణుకాదేవి ముఖంలో ప్రవేశించగా, బ్రహ్మ రేణుకామాతను ప్రార్థించగా తృటికాలంలో ఆయనకు, సాంగోపాంగంగా సమస్తవేదాలు మరల స్ఫురించెను. ఆ ఆనందంతో మరల రేణుకామాతను స్తుతించి, యిట్లుపదేశమిచ్చిన శ్రీదత్తగురుమూర్తికిని అనేక విధముల నమస్కరించి, కృతార్థుడై శెలవు పుచ్చుకొని వెళ్లెను.

ఇట్లు శ్రీ గురుదత్తుడు బ్రహ్మకు బ్రహ్మోపదేశమొనర్చి గురుస్థాన మూర్తుడయ్యెను.

శ్రీ దత్తగురుస్వామి ప్రభావము, కరుణాశీలం, ఆయన పరీక్షావిధానము, వరప్రదానము, ఔదార్యము ఇవన్నీ ఆయన కత్యంతప్రియాతిప్రియ శిష్యుడైన కార్తవీర్యార్జునుడి చరిత్ర కన్నా మించిన కథలేదు.

త్రేతాయుగారంభానికి చెందిన కృతవీర్యుడనే మహాచక్రవర్తి బిరుదాంకితుని పట్టమహిషి "శీలధరాదేవి" పుణ్యదంపతుల నోముపంటగా, "స్నపనవ్రత" ఫలముగా, నొక తేజశ్చక్రం ఆమె గర్భవాసమున చేరినట్లుగా, ఆ కాంతి తేజోవంతమైన పండులాంటి కొడుకును కన్నది. కాని ఆ తేజశ్చక్రంలో అంచులు మొక్కపోయినట్లుగా, ఆ బాలుని చేతులు చచ్చు(చొట్ట) చేతులుండుట ఆ తల్లిదండ్రులకు విషాదం మిగిలెను. అయినను ఆ

బాలునికి అర్జునుడని, కృతవీర్యుని కొడుకగుటచే కార్తవీర్యుడని నామకరణం స్థిరమయ్యెను.

ఆ బాలుడు పిన్నవయస్సులోనే అద్భుత పాండిత్యం సంపాదించి, గురువులచేత భళి అనిపించుకొనెను. ధర్మబుద్ధికి, బుద్ధికుశలతకు మంత్రులు, గురువులు సంతోషించిరి.

అతని మంత్రులలో నొకడైన "గర్గముని" కార్తవీర్యునితో నిట్లనెను. "నాయనా! జగద్రక్షణార్థమై త్రిమూర్తుల అంశతో నవతరించిన శ్రీదత్తాత్రేయ స్వామివారు సహ్యాద్రి సానువుల్లోనున్నాడు. ఆయన యోగానికి ఏకైకాచార్యుడు, సమదర్శి, ఆయనను సేవించు నీ కోర్కెలను తీర్చువాడాయనే"యని చెప్పగా– శ్రీదత్తస్వామి పేరు వినడంతో తన వొళ్లంత పులకరించినట్లు కాగా శ్రీగర్గమునికి వినయపూర్వకంగా నమస్కరించెను. ఆ వినయమునకు మరల మంత్రియిట్లనెను. నాయనా! ఆ స్వామి యెంత కరుణాకటాక్షుడో అంత, పరీక్షానిష్ఠురుడు. కావున జాగ్రత్త అని కూడ ఉపదేశించెను.

ఆ ఉపదేశంతో పెద్దల ఆశీస్సులు పొంది కార్తవీర్యార్జునుడు సహ్యాద్రికి చేరి, దత్తాశ్రమంలో శ్రీదత్తస్వామి సందర్శించి, శరణుజొచ్చి, ఆయనను భక్తి ప్రపత్తులతో సేవించసాగెను.

శ్రీ దత్తస్వామి కార్తవీర్యునకును అనేక పరీక్షలు పెట్టెను. అయినను పట్టువదలక స్వామిని ఆరాధించెను. ఆ అర్జునుడి కృతనిశ్చయంగని శ్రీదత్తస్వామి సంతోషించి, కరుణించి యిట్లనెను.

"అర్జునా! కావలసిన వరంకోరుకో" అని పలికెను. అందులకు, "ధర్మార్థ కామమోక్షములు, సిద్ధులు, వీరపరాక్రమ శక్తితత్త్వం, ప్రసాదిస్తూ, తన మరణం అత్యాదిక ప్రసిద్ధుడైన మహావీరుడి చేతిలోనే సంభవించునట్లు అనుగ్రహించండి గురుప్రభూ! అన్నింటికి మించి నీ మీద భక్తి నిశ్చలంగా నుండే వరమిమ్మని" అర్థించెను

**అటులే శ్రీదత్తగు**రుస్వామి అనుగ్రహించెను. ఆ అనుగ్రహపాత్రుడై సెలవు పొంది, వెడ**లి తన యిష్ట భోగభా**గ్యాలు పొందుతూ చక్కగా రాజ్యమేలుచూ, అంతటి వీరుడు **మరొకడు లేడనునట్లు మ**హోన్నతముగా ప్రజలను పరిపాలించసాగెను. తనకిట్టి మహోన్నత శక్తి, తన చొట్టచేతులను వీర్యవంతముగా నొనర్చి, అందులకు శ్రీదత్తగురు ప్రభువును మాత్రము మరువలేదు. అతని గురుభక్తికి దీటుగా ప్రతిసంవత్సరము అనఘాష్టమీ వ్రతం చేస్తూ, తన రాజ్యంలో అందరిచేతను మహావైభవంగా జరుపునట్లు చూచేవాడు.

కొంతకాలానికతనికీ రాజ్యభోగాలు మొగంమొత్తి, పరమ తత్త్వముపై మనస్సుమళ్లగా, తనకీ తత్త్వమార్గమును తన గురుదేవుడైన శ్రీదత్త స్వామియే చూపునని, మరోమార్గము లేదని దృఢచిత్తుడై మరల సహ్యాద్రిచేరి తన తపన శ్రీగురుదత్తునితో నిట్లు

మొరపెట్టుకొనెను.

"శ్రీ గురుప్రభూ! నేనింతవరకును రాజ్యభోగములే శాశ్వతములని, దేహేంద్రియ ప్రాణవిషయాలలో కూరుకొనిపోయి నన్నునేనే పోగొట్టుకొని, నా అహంకార గ్రంథిని ఛేదించుకొని మిమ్ములను శరణుజొచ్చితిని. దేవదేవా! నాకు తగుజ్ఞాన బోధామృతం ప్రసాదించు. నన్ను కృతార్థుణ్ణిచేయి. నా సేద తీర్చు ప్రభూ!" అని ఎన్నోరీతుల మొరపెట్టుకొనెను- స్తుతించెనుకూడా! అందులకు స్వామి సంతసించి, తన శిష్యునిలో భోగసామ్రాజ్యస్థితి నశించినదని, ఇక యోగసామ్రాజ్య సాధన గూర్చియిట్లుపదేశించెను.

దేహాభిమానమే బంధము. ఆ అభిమాన త్యాగమే ముక్తి ఆ త్యాగంతో పామరుడికి సైతము కర్మలోని పాపపుణ్యాలంటవు. మనోయింద్రియములను అరికట్టి, అహంకారాన్ని క్షయింపజేసిన మోక్షప్రాప్తి కలుగును.

శ్లో॥ మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః ।
బంధస్య విషయాసంగి ముక్తేర్నిర్విషయం మనః ॥

ఈ మనస్సు విషయాదులంటుకొనినవే బంధం. ఆ బంధం విడనాడితే మోక్షం. ఆనందం. కనుక బంధమునకును, మోక్షమునకును మనస్సే కారణం. ఆ మనోబంధమును యోగసాధన అనగా ప్రాణాయామముతో నిగ్రహించవచ్చును. దేహమందున్న ప్రాణము, మనస్సూ రెండు కాడెద్దుల వంటివి. ఏ యొక దానిని నిగ్రహింపజేసిన రెండవది లొంగుతుంది. అందులకీ దేహమనస్సులను సత్కర్మాచరణంలో నిమగ్నమొనర్చిన, తద్వారా చిత్తశుద్ధి, ప్రాణజయం, మనోనిగ్రహము ఏర్పడును.

ప్రాణయామ సాధన గురూపదిష్టమైన ప్రత్యేక ఉపదేశంతో సాధించవలెను. ఈ యోగ ప్రక్రియను నిరంతరంగా సాధననొనర్చిన ప్రాణమనోశక్తులు ఏర్పడును. ఆ మనోనిగ్రహంతో దేహేంద్రియాదులనరికట్టి ఆత్మలో లయింపజేసిన మనస్సు సుస్థిరమై ధ్యాన నిధితో "అహం బ్రహ్మాస్మి"గా నిర్వికల్ప సమాధి స్థితి ఏర్పడును. తద్వారా ఎట్టి విషయవాంఛలు దరిజేరవు. పుణ్యపాప కర్మలంటవు. ఏ సిద్ధులనాశించు బుద్ధి జనించదు. ఇట్టి మనస్థితినే "కషాయ పక్వస్థితి" అందురు. ఆ మనోప్రాణదేహము అఖండాకారతతో సమతుల్యముగా, నేర్పడి, ఆ యోగస్థితి గాలి తాకిడి లేని "దీపశిఖ"లాగా తేజోవంతమై బ్రహ్మాకారస్థితిగా జీవన్ముక్తుడగును. భోగసామ్రాజ్య అహంకారగ్రంథులు పటాపంచలగును. నాయనా! అని, తన కుడి హస్తమును ఆతని శిరస్సున నుంచి ఆశీర్వదించెను. ఇట్లు శ్రీదత్తస్వామి కార్తవీర్యార్జుననకు గురూపదేశమొనర్చగా, ఆ చక్రవర్తి శ్రీస్వామి నిట్లు మరల స్తుతించెను.

"గురుప్రభూ! మీయాజ్ఞ మేరకు నేను యోగసాధకుడనైయుండి పరమానందం పొందితిని కానీ నాపూర్వ ప్రారబ్ధంతో నన్నీమనస్సు స్థూలదేహాని కీడ్చింది దానితో నాకేర్పడిన నిరుపమాన ఆనందం క్షణంలో మాయమైంది కావున, స్వామీ! నీపాద యుగళమే నాకు జ్ఞానభిక్ష ఈ భోగరాజ్యంపై నాకు వాంఛలేదు దేనిపై భేదాభిప్రాయంలేదు ఈ జగత్తంతా చిదానంద రసపరిపూర్ణమని తోచినది మీరే పరమతత్త్వానివి ఆత్మవు ఆద్యుడవు స్వామీ! మీ పాదసేవనంతో నేను సంపూర్ణ ఫలవంతుడనైతిని మీ కరుణ అపారమైనది అనంతమైనది నన్ననుగ్రహించితివి "

శ్లో॥ గురుం గురుతరం గమ్యం గురుగమ్యం గుణాకరం ।
వందే గురూత్తమం దేవం దేవ వంద్య పదాంబుజం ॥

భక్త్యావేశంలో నిమగ్నుడైన కార్తవీర్యుడు స్వామి పాదాలను గాఢంగా ఆలింగనమొనర్చి, మరలనిట్లు పలికెను "స్వామీ! నాకిక మీ యాజ్ఞ తప్ప వేరే కర్తవ్యం లేదు అందులకై ఎదురు చూస్తున్న దాసుణ్ణి ఆజ్ఞాపించండి" అని పలుకగా-

స్వామి చిరునవ్వుల సింగారాలతో శిష్యుణ్ణి సేదతీర్చి, యిలా అన్నాడు

"నాయనా! ముందు స్నానాదిక నిత్యకర్మలాచరించు భుజించు విశ్రమించు రేపు సమాధి స్థితిపొంది, ఆరుమాసముల తదనంతరం నాకగుపించు" అని ఆజ్ఞాపించెను

అటులే కార్తవీర్యుడు సమాధిస్థితి నొందిన సంవత్సరానంతరం స్వామినిచేరి, పాదాలు శిరస్సునందుంచుకొని, నమస్కరించుచు, స్వామి పరిచారకులందరికీ నమస్కరించు, ప్రత్యేకముగా స్వామిని అనేకరీతుల గురుస్తుతిగావించెను

ఆ కార్తవీర్యార్జునుని స్తోత్రమును వినిన శ్రీదత్తస్వామి, "కార్తవీర్యా! నీవే నన్ను స్తోత్రములో నా గుట్టు (చరిత్రను) బైట పెట్టితిని నేనే నీ నోటి నుండి స్తోత్రమును పలికించితిని ఇట్టి స్తోత్రాన్ని ప్రతిరోజు ప్రాతఃకాలంలో పఠించే వారికి సంసార బంధాన్ని పోగొడుతాను నేను నీకు కలిగిన శాస్త్రాలలోని సందేహం కలుగుట నిజమే శాస్త్రాలలో పరస్పర విరోధం వున్నట్లు కనిపిస్తూంటుంది కానీ అది అభాస మాత్రమే అందులకై 'సప్తోదాహరణి గాధలు' ప్రమాణములు వీటిని విని మననం చేసినట్లైతే పరమ మూఢుడికైనా అవిద్యనశిస్తుంది " అని కార్తవీర్యునకు శ్రీదత్తస్వామి మహావాక్య తత్త్వోపదేశమొనర్చెనునిట్లు-

నాయనా కార్తవీర్యా! ఏ శాస్త్రం తెలుసుకోవలసిన చిత్తం పరిశుద్ధమనాలి అందులకై నిత్యకర్మలు శ్రద్ధతో చెయ్యాలి చేసిన కర్మల ఫలాన్ని భక్తితో ఈశ్వరార్పణం చెయ్యాలి ఆ ఈశ్వరుణ్ణి సేవించాలి భజించాలి, ధ్యానించాలి అటులే గురువును కూడా ఆరాధించాలి అట్లొనర్చిన చిత్తం శుద్ధమై, ఆ చిత్తానికి విరక్తికలిగి, ఈ జగత్తు

మిథ్యయనితెలిసి భ్రాంతిని పోగొట్టుకోవడం జరుగుతుంది. గురవనుగ్రహంతో జగత్తత్త్వ విచారం కలిగి జ్ఞానోదయంతో, అద్వితీయానంద స్థితితో జీవునకు దేవునకు భేదంలేదని తోస్తుంది. అదే మోక్షమార్గానికి నాంది. ఇట్టి పరమ గుహ్యమైన వేదాంత సిద్ధాంతమును నీకు ప్రియశిష్యుడవని బోధించితిని. నీవు సూక్ష్మబుద్ధివి. యోగసాధకుడవు కమ్ము. నాయనా! నీవు కోరినవన్నీ చెప్పితివి. కనుక, నీలో నున్న గర్వబీజాంకురమును తొలగించు. ఎందుకనగా గర్వం చాపక్రింద నీరులాంటిది. బుద్ధిని కూడ కమ్మేస్తుంది. కావున గర్వాన్ని, అహంకారాన్ని జయించు. శుభం." అని ప్రబోధించెను.

కొంతకాలమునకు శ్రీదత్తస్వామి వరప్రభావంగా కార్తవీర్యునకు సాటియగు వీరుడు జమదగ్ని పుత్రుడగు పరశురామునితో యుద్ధభేటి ఏర్పడెను. తానొనర్చిన మహాపరాధానికై యిట్టి సరిజోడు వల్ల మరణం పొంద వలసినదే. నావంటి చీడపురుగు, నీచ గర్విష్ఠి యింకా బ్రతికి యుండడం శ్రీగురుదత్తస్వామి శిష్య పరంపరకే మహా అవమానం. తానిక చచ్చితీరవలె. అందుకే స్వామి తనంతటివాడిని తన్నుమించినవాడగు యీ బ్రాహ్మణోత్తముని తనను వధించుటకు పంపుటను ఆ గురుదేవుని యనుగ్రహమే. తనకెట్టి శిక్ష తగ్గకూడదు అని తలంచి దృఢ నిశ్చయముతో పరశురామునితో యుద్ధ మొనర్చుటకు సిద్ధపడెను - గురుధ్యానములోనే యుద్ధమొనర్చు శిష్యుడను మరొకడు లేడు. పరిపూర్ణముగా శ్రీగురుదత్తస్వామి కృపకు పాత్రుడైయుండి, అట్టి ఆ గురుకృపకే పాత్రుడైన పరశురాముని వంటివాని చేతిలో మరణం పొందడం సర్వం శ్రీగురుదత్తప్రభూ కటాక్షమేయని, తుదకు ఆ పరశుని చేతిలో అసువులు బాసెను.

ఒక్క క్షణం ఆలోచించిన, కార్తవీర్యుడు తప్పులెన్నో చేసినను గురుద్రోహం మాత్రం కలలోను తలంచలేదు. గురుధిక్కారం అతనెన్నడు ఎరుగడు. అందువలననే సద్గురు దత్త స్వామియు యీ శిష్యుని తప్పులెప్పుడు పరిగణనలోకి తెచ్చుకోలేదు. ఎందుకనగా అతని తప్పులకు ఆయన చేసిన ప్రతి శిక్షా ఉత్తరోత్తర మహోన్నత్యాన్ని కల్గించింది. శ్రీదత్తగురుసాన్నిధ్యంలో అనేకులు ఇటు ఐహికాన్నీ, అటు ఆముష్మికాన్నీ, రెంటికి మించి కైవల్యాన్ని పొంది తరించినట్లు, ఈ కార్తవీర్యుని వంటివారే గొప్ప సోదాహరణం.

ఇక్కడికి కార్తవీర్యార్జునుడి కథ సమాప్తమైనది.

కాని, శ్రీగురుదత్తస్వామి వ్యక్తిత్వంలోని మరోభాగం కూడా తెలియాలంటే, పరశురాముడును శ్రీదత్తస్వామివారికి ప్రియ శిష్యుడే. అయినా, కార్తవీర్యుడంతటి శిష్యుడు కాకపోవచ్చును. కానీ, స్వామికి ప్రియాప్రియాలుండవు. ఆయన వాటికతీతుడు. అందులకనే పరశురాముడు బ్రహ్మణ్యశీలత్వం శాంతిని ప్రక్కనపెట్టి, ఇదం బ్రాహ్మ్యం ఇదంక్షాత్రం అనే ధర్మంగా, శ్రీదత్తస్వామికి ప్రియాతి ప్రియమైన శిష్యుడగు కార్తవీర్యుణ్ణి ఊచకోతకోసి,

చిత్రహింసచేసి చంపిన పరశురాముడిపై కోపంరావడం అటులున్నా, ఇంతటి దుర్మార్గుడగు క్షత్రియాధముని శిష్యత్వమునకు సమ్మతించిన ఆ దత్తస్వామిపై కన్నెర్ర కల్గినదా! లేదు. తానూ శ్రీదత్తస్వామి ప్రియశిష్యుడేగనుక.

అంతటి మహావీరుణ్ణి వధించడంలో తాను (పరశురాముడును) స్వయంగా వెళ్లి, నిస్సంకోచంగా, శ్రీదత్తస్వామి పాదాలనాశ్రయించాడు. శిష్యుడయ్యాడు. శ్రీస్వామియు నితన్ని కార్తవీర్యుడి కన్నా అధికంగా నాదరించాడు. ఆ పురాణపురుషుణ్ణి అంతస్తత్వాన్ని రవ్వంత ఆకళించుకోవాలంటే, కార్తవీర్యుని అహంకారం, బ్రాహ్మణధిక్కారం, గోగ్రహణం, ఇవన్నియు అతని మదోన్మత్త తత్త్వం కూడ గర్హించ దగ్గవే.

అయినను, తానొనర్చిన పాపమునకు శిక్షననుభవించి తీరాలనే తపన, పశ్చాత్తాపం గ్రహించిదగినవే. పాపమొనర్చి పారిపోవాలను తలంపు మరోపెద్ద తప్పు, పాపమును. ఈ రెండు తప్పులకు (పాపములకు) గుర్వనుగ్రహం కోరడం, శరణువేడడం తగదని, అదిస్వామి వంటి గురుపరంపరకే అవమానం, మరియు తనవంటి శిష్యపరంపరకే గర్హించతగినదిగా - తన శిక్ష తనకు పడాలి, కనుక తనకిక మరణమే శరణ్యమని తలంచెను. ఆ మరణమునకును శ్రీదత్తస్వామి గుర్వనుగ్రహమే ఉండాలని కాంక్షించుచూ, ఇంకా పరశురాముణ్ణి రెచ్చగొట్టడమే తన కర్తవ్యమని ఆ మహావీరునితో యుద్ధమునకు తలపడెను. అయినను తనమనస్సును శ్రీ సద్గురు దత్తస్వామి పాదాలపై లగ్నమొనర్చి, తానూ ఆత్మారాముడై యుండిన తరి, ఆ స్థితిలో అంతటి ఆత్మారాముని వధించుటకు పరశురాముడు పరమేశ్వరుణ్ణి స్మరించుకొని, అతని (కార్తవీర్యుని) శిరస్సుని ఖండించెను. దేవతలు పూలవర్షం కురిపించిరి. కాని అంతకు పూర్వమే కార్తవీర్యుడు జీవన్ముక్తుడై యుండి, ఇప్పుడు విదేహముక్తుడై అసువులు బాసెను.

సహ్యాద్రి గుహల్లో సమాధి స్థితిలోనున్న సద్గురు దత్తమూర్తి జరుగవలసినది జరిగినదని నిశ్చలంగా నుండి పోయెను.

మరి యింతటి కీర్తిమంతుణ్ణి, వారి (క్షత్రియ) సంతతిని వధించిన పరుశురామునకును పశ్చాత్తాపము కలిగెను. అందులకు తనకు మనశ్శాంతి కలుగుటకు మార్గమేమియని తల్లియగు రేణుకామాతను తలంచుకొనెను. అంతే, తన తండ్రి జమదగ్ని, తల్లి రేణుకాదంపతుల మరణకాలమందు, తమకుపదేశించిన తల్లి ఉపదేశంలో, వారి ఉత్తర క్రియ శ్రీదత్తస్మరణంతో పరిపూర్తిచేసి, తానొనరించిన పాపపరిహారముగా శ్రీగురుదత్తస్వామినే ఆశ్రమమును చేరి స్తుతించెను. శ్రీదత్తస్వామి పరశురామునితో యజ్ఞమొనరింపజేసి, "త్రిపుర రహస్యమనె"డి జ్ఞాన బోధచేసి తరింపజేసెను.

## జంభాసురుని వధ :-

ఒకప్పుడు జంభాసురుడనే రాక్షసుడు తపోబలంతో అజేయుడై స్వర్గంపై దండెత్తి దేవతలనునోడించి దేవేంద్రుని పదవీభ్రష్టుని చేశాడు. దానితో దానవుల విగ్రవీగుతనమును జూచి, దేవేంద్రుడు చేయునది లేక, వాలఖిల్యాది మహర్షుల సమక్షంలోనున్న దేవగురువైన బృహస్పతిని చేర్యాడు.

బృహస్పతియు వాలఖిల్యాదులతో సంప్రదించి యిలా చెప్పాడు- "దేవేంద్రా! ఇప్పుడీ విపత్తును ఉపాయముతో త్రిమూర్త్యాత్మకుడైన శ్రీగురుదత్తాత్రేయ స్వామియే దాటించగల డు. నీవు దేవతలతో సహ్యాద్రి చేరి, వారినే మొరపెట్టుకో. శిష్యుడవనే ప్రీతి కొద్ది చెబుతున్నాను. వారు బహు పరీక్షా కరినుడుసుమా! జాగ్రత్త అసహ్యపడకు. అతడొక నిర్మలజ్యోతి శిఖ - గ్రహించి మసలుకో - శుభమస్తు విజయోస్తు!" అని దీవించిపంపెను.

ఇంద్రుడు దేవతలతో సహ్యాద్రి చేరెను. అనునట్లే, శ్రీదత్తగురుస్వామి బహు వికృతంగా, బీభత్సంగా, నింద్యాచారంతో దర్శనమిచ్చెను. అయిన వారికి బృహస్పతి గురూపదేశం బాగాపనిచేసింది. వారు దత్తాత్రేయుని పరీక్షాలీలలు తలంచుకొని, ధన్యులమైతిమని లోలోన చేతులు జోడించుకొని నమస్కరించుచు, దోసిలొగ్గుచు వారిట్లు ప్రార్థించిరి.

"స్వామీ! నీవు త్రిజగద్గురువువి. విద్యామూర్తివి. జ్ఞానాత్మకమైన అంతర్జ్యోతితో నిరంతరం వెలిగే నీకు ధర్మాధర్మాలంటవు. నీవనఘుడవు. హరివి. ఈ తల్లి సాక్షాదిందిరా మాత. అనఘాదేవి. ఆమె ప్రకృతి. మీరు పురుషులు. మీయనుగ్రహం మాకు శరణం. అన్యథాశరణం నాస్తి" అని స్తుతిస్తూ దేవేంద్రుడు దేవతలు స్వామి పాదాలపై వ్రాలారు.

అందులకా స్వామి కరుణించి, తన నిజరూపంతో ప్రత్యక్షమై జంభాసురుని వధించు ఉపాయము చెప్పెను.

"నాయనా దేవేంద్రా! నేనీచోటు విడిచి రాలేను. కనుక, నీవు దేవతలతో సహా ఆ రాక్షసులను నాకళ్లు ఎదుటికి తెస్తే నాకు చేతనయింది చేస్తాను." అని స్వామి అభయవాక్యంతో దేవేంద్రుడికి, దేవతలకు కొండంత బలమొచ్చింది.

అంతే, వారు జంభాసురుణ్ని యుద్ధానికి పురిగొల్పి ఆ రాక్షసులనందరిని సహ్యాద్రికి తేవడంతో, చూడగా, శ్రీదత్తస్వామి తన పత్ని అనఘాదేవి జగన్మోహన సౌందర్యంతో, అచ్చమైన ఉన్మత్తవేషంతో, మదిరామత్తత్వంగా, దానికి తోడు శృంగార లీలా పరాయణత్వం, రాక్షసులకు వళ్లు పులిసి, మతి దప్పి, యుద్ధం మాట మరచిపోయిరి. అంతే, ఆ ప్రక్కనున్న అరగోచితో నున్న శ్రీస్వామిని ప్రక్కకీడ్చి, అనఘాదేవిని బలవంతముగా తమ పల్లకీలో

నెక్కించుకొని, ఆ పల్లకిని నేనంటే నేనని మోయడానికి తగవులాట పడిరి.

అదిగని శ్రీదత్తస్వామి నవ్వుచూ, "దేవతలారా! ఇప్పుడు లక్ష్మి తన ఏడవస్థానమగు ఈ పాపాత్ముల నెత్తికెక్కినది. అనగా వారికిక దౌర్భాగ్యం దాపురించినట్లే. ఇక వారు నిర్వీర్యులే. ఇంకా ఏమైన వారి పుణ్యశేషం మిగిలిన ఈ పరస్త్రీని అంటుకున్న పాపానికి బూడిద అయినట్లే. కనుక, ఇదేమంచి తరుణం" అని దేవతలను పురమాయించగా, వారు శ్రీదత్తస్వామి అనుగ్రహోపదేశంతో మహోత్సాహంతో ఆ రాక్షసులపైకి యుద్ధమునకు దిగిరి. జంభాసురునితో సహారాక్షసుల నందరిని హతమార్చిరి.

పల్లకీలోంచి ఎగిరివచ్చి శ్రీదత్తస్వామిని చేరింది తల్లి అనఘాదేవి. ఇంద్రాది దేవతలు స్వర్గ రాజ్యలక్ష్మిని యిట్లు మరల పొందగల్గిరి శ్రీదత్తస్వామి రక్షకుడును, ఉపదేశమొనర్చుటలో జగద్గురువును అయ్యాడు

## శ్రీదత్తగురువు గారి గురువులు

లోకంలో ననేకావతారాలున్నాయి, కాని శ్రీదత్తావతారంలో గురు ప్రభావములు, గురు విలక్షణతలు గ్రహింపదగినవి. జగద్గురువుగా వెలసిన తనకును ప్రవృత్తిమార్గాన్ని చూపిన గురువులున్నారని శ్రీగురు దత్తాత్రేయుడు భక్తవరదుడైన ప్రహ్లాదునితో నిట్లు వివరించెను.

"ప్రహ్లాదా! నా స్మృతి పథంలో నున్నవి రెండే రెండు గురువులు. అవియే, ఎలా యుండకూడదో చెప్పింది జుంటీగ. ఎలా ఉండాలో చెప్పింది కొండచిలువ- అనగా, జుంటీగ వైరాగ్యాన్ని నేర్పింది. కొండచిలువ సంతుష్టిని నేర్పింది." అని గూఢాతిగూఢమైన గురు తత్త్వాన్ని బోధించెను.

అటులే, శ్రీకృష్ణ పరమాత్మ ఆవిర్భవించిన యాదవ వంశానికి మూలపురుషుడైన "యదువు" అనే మహారాజునకు నొకప్పుడు శ్రీ అవధూత దత్తస్వామి దర్శనం లభించింది. వారిలో చీకుచింతలేని స్థితిని చూచి నిట్లనెను.

"స్వామీ! అంతర్గతంగా నేధర్మాన్ని ఆశ్రయించి యుండటం వలన మీకీ స్థితి లభించినది, దయతో నాకుపదేశించండి".

ఆ మాటలోనున్న ఆర్తిని, వినయాన్ని చూచి శ్రీ అవధూత యిట్లు సమాధానమిచ్చెను.

"యదురాజా! నేను లోకాన్ని విస్తృతంగా పరిశీలించి, ఎందరెందరో గురువుల నుండి రవ్వంత జ్ఞానాన్ని సంపాదించితిని. రాజా! నా కిరువదినలుగురు గురువులున్నారు.

జాగ్రత్తగా విను. 1. భూమి 2. వాయువు 3. ఆకాశము 4. నీరు 5. అగ్ని ఇవియే పంచభూతములు. మరియు -

6. సూర్యుడు 7. చంద్రుడు అటులే 8. పావురాలు 9. అజగరము (కొండచిలువ) 10. సముద్రము 11. మిడత 12. తుమ్మెద 13. గజము 14. మధుహారి (తేనెటీగ) 15. లేడి 16. చేప 17. "పింగళా" - అనే వేశ్య 18. కురరము (లకుమికపిట్ట) 19. బాలుడు 20. బాలిక 21. శరకారుడు 22. సర్పము 23. సాలీడు 24. పురుగు ఇవి 24.

వాటినుండి గ్రహించినది విను -

1. భూమినుండి - క్షమా, పరోపకారత్వం
2. వాయువు నుండి - నిస్సంగత్వము, నిర్లేపత్వము
3. ఆకాశము నుండి - సర్వవ్యాపక తత్త్వం
4. జలము నుండి - నిర్మలత్వం, మాధుర్యం, స్నిగ్ధత్వము
5. అగ్ని నుండి - తేజస్సు, ఈశ్వరతత్త్వం
6. సూర్యుని నుండి - జలగ్రాహి, జలత్యాగియు. లోకబాంధవుడతడు. 'సర్వలోకమునకతడొక్కడే.
7. చంద్రుని నుండి - వృద్ధి క్షయాల రూపుడు. అట్టివి షడ్భావ వికారాలు దేహానికేకాని, తనకు (ఆత్మకు) కావని చంద్రుడు నేర్పెను.
8. పావురాల జంట నుండి - కామ క్రోధాలకు వశమైనచో "ఆత్మారామం"ను కోల్పోతారని గ్రహింపు
9. అజగరము నుండి - దైవికంగా లభించినదానికి తృప్తిచెంది, ఆత్మనిష్ఠ కలదైయుంటుంది.
10. సముద్రం నుండి - తనలో నేదియును నుంచుకోదు. అపవిత్రమైనది కల్మషమైనదియు అనగా అది యోగతత్త్వం కలది. కామాన్నీ, వికారాన్నీ కూడ తనలో చేరనీయదు. తన మనో భావాన్ని బైటకు పొక్కనీయదు.
11. మిడత నుండి - మృత్యురూపమైన మోహమనెడి జాలాగ్నికి బలియవడం, సుఖమను తలంపుతో మృత్యురూపం పొందునది.
12. తేనెటీగ నుండి - ఏ పూవును కూడ బాధించకుండ తను పొందునది (మధురమును) పొంది జీవిస్తుంది. అటులే యోగి ఎవరిని నొప్పించకుండా భిక్ష గ్రహించి పోషించుకొంటాడు.

ప్రతి పుష్పాన్ని వదలక యుండడమనునది, ముని ప్రతి శాస్త్రాన్ని అధ్యయనం చేయడం నేర్పుతో సారాన్ని గ్రహించడం, కానీ, కూడబెట్టిన మధు సంపద రేపటికని నుంచుకొనిన అట్టి పరుల సొత్తగునని గ్రహించడు. అటులే ముని తాను పొందిన బిక్ష మరునాటికని నుంచుకొనడు. ఉంచుకొనినను అది పనికిరానిదగును కదా!

13. గజము నుండి - తానెంత బలిష్ఠమైనదో, అంత మృత్యురూపమగు మోహముగలది. అనగా స్త్రీలౌల్యం గలది. ఆ మోహంలోపడి తానితరులకు వశమవును.

14. మధుహారి నుండి - ఇతరులు కూడబెట్టుకొనిన వస్తువు (మధువు)ను, లోభం చేత న్యాయాన్యాయాలు లెక్కించక, అపహరించువాడు కడునీచుడు.

15. లేడినుండి- అమాయకత్వంతో సంగీతం మోజుతో వేటగానికి చిక్కును, ఋష్యశృంగముని సంగీత నాట్యాలకు భ్రమసి సానివారి వలలో పడ్డాడు.

16. చేప నుండి - 'ఎర'కు (జిహ్వ) 'చాంచల్యంతో ఇంద్రియనిగ్రహం కోల్పోయి గాలమునకు చిక్కును. 'జిహ్వ' కాన రాని దొంగకదా!

17. పింగళ నుండి - ధనాశతో కాలహరణం భౌతిక వాంఛకు శరీరమును భ్రష్టత్వమొనర్చుకనుట.

18. కురరము నుండి - తనకు ప్రియమైనదని, ఇతరులకు ప్రియమైనదని లెక్కించక పోటీపడుటలో పొందు దుఃఖము.

19. బాలుడు నుండి - యోగితో సమానుడు. పాపపుణ్యాలెరుంగని వాడు. భగవత్ప్రాప్తి వల్ల నిరుద్యముడై యుంటాడు.

20. కన్యక నుండి - తనకున్నలేమిని కనబరచకుండా కుటుంబ గౌరవాన్ని కాపాడుకొంటుంది.

21. శరకారుడు నుండి - ఏకాగ్రతను సాధిస్తాడు.

22. సర్పము నుండి - ఈ శరీరం క్షణభంగురమని, తన కంటు యొక గృహము ఏర్పరచుకోదు.

23. సాలెపురుగు నుండి - పరబ్రహ్మతత్త్వం తెలియును. సృష్టిలయముల క్రియాస్వరూపి.

24. పురుగు నుండి - రొదచేస్తూన్న తుమ్మెదనే చూస్తూ మనస్సునంతయు ఆ తుమ్మెదవైపు లగ్నమొనర్చగా, కొంతసేపటికి, తాను ఆ తుమ్మెద రూపం

పొందుతుంది. అనగా భక్తుడు దేనిపై లగ్నమొనర్చునో అటులా రూపధారి యగును. ఉదా ॥ భరతుడు. (శ్రీరాముని తమ్ముడు)

అటులే తనకు ప్రతి అణువు గురువేయని, తనలోని మనస్సే తనకు గురవని కూడ చెంటెను.

## నహుషుని చరిత్ర

పూర్వం చంద్రవంశంలో "ఆయువు" అనే రాజు గొప్పకీర్తి మంతుడై సకల భోగభాగ్యాలతో, ప్రజలను కన్నబిడ్డలవలె చూచుచు రాజ్యాన్ని పాలించేవాడు.

[illegible]యువునకు తగినట్లుగా ఆయన ధర్మపత్ని "ఇందుమతీదేవీ"యు అన్నివిధమ[illegible] తోడుగా నుండెడిది. కాని వారికి బహుకాలానికి సంతానం లేక పరితపిస్తు[illegible] వారు ఒకనాడు వారుభయులు తమకిక శ్రీదత్తాత్రేయ స్వామియే శరణ్యమని, ఆ గురుప్రభుని ఆరాధించుదామని నిశ్చయించుకొని సహ్యాద్రికి వెళ్లిరి.

వారు వెళ్లేసరికి శ్రీదత్తప్రభు రాజుగారి బావమరిదిలాగా, సకల భోగ భాగ్యాలతో మెలగుచు, పడుచుస్త్రీలతో మద్యము నందుకొనుచు, విచక్షణ లేకుండా తప్ప త్రాగుచు హంగామాగా నున్న శ్రీదత్తస్వామిని దర్శించి, ఇవన్నియు వారి యనుగ్రహలీలలేయని తలంచిన వారుభయులు శ్రీగురుస్వామికి సాష్టాంగ దండప్రణామములతో నమస్కరించుచు రెండు కాళ్లు కళ్లకద్దుకొన్నారు. తానొక సమస్త భూమండల సామ్రాజ్యైక ఛత్రాధిపతియని, వీరొక బైరాగియని కూడ తలంచక, స్వామి తనకాళ్లతో తన్నగా, అది మా భాగ్యమని, వెంటనే చేతులు జోడించి స్వామీ!

"నమస్తే దేవదేవేశ నమస్తే పరమేశ్వర ।
త్వామహం శరణం ప్రాప్తః శరణాగతవత్సల ॥"

దేవా! నిన్ను శరణుజొచ్చాను. నువ్వేమి చేసినను నిక్కణ్ణించి కదలం. స్వామీ! మీరు త్రిమూర్త్యాత్మకుడివి." అవి ఎన్నోరీతుల దాసానదాసునిలాగా మొరపెట్టుకొన్నారు.

స్వామి "ఛీ" కొట్టిన వదలక మరింత పట్టుదలతో వేడుకొనుచుండగా, స్వామీ అనుగ్రహించినట్లు మీ కోరిక యేమిటని చెప్పమని పలుకగా, వారు వెంటనే తేరుకొని, స్వామినిట్లు వేడుకొనిరి.

"యోగేశ్వరా! మాకు సర్వజ్ఞుడు, అజేయుడు, దేవబ్రాహ్మణభక్తుడు, సకల శాస్త్రవేత్త, విశేషించి ధనుర్వేదనిపుణుడు, అకుంఠిత ప్రజ్ఞాశాలి, ప్రజాపాలనాదక్షుడగు వంశోద్ధారణుడైన పుత్రుని ప్రసాదించమ"ని కోరిరి.

స్వామి చిరునవ్వు నవ్వుచు, విష్ణ్వంశ సంభూతుడు ఇంద్రసముడగు సార్వభౌముడు పుట్టునని వరమిచ్చి నొకఫలము వారి కందించెను.

ఇలాయుండగా "హుండుడు" అనే రాక్షసుడు, తన కూతురు "గంద" చారులద్వారా వినినది, "ఆయువు"వల్ల జనించిన కుమారుడు తన మరణకారకుడ"ని వార్త తెలుసుకొనెను. వినిన వెంటనే ఆ బాలుని వధించు నిమిత్తమై, ఆ రాక్షసుడు రహస్యంగా మారు వేషములో రాజధాని చేరుకొని, **"ఇందుమతీదేవి"కి గర్భ విచ్ఛిన్న** మొనర్చదలచెను. ఆ ప్రయత్నం శ్రీస్వామి దత్తవర ప్ర**భావంతో విఫలమయ్యెను.**

అంతఃపురంలో "ఇందుమతీదేవి"కి సాక్షాత్ సూర్యభగవానుని వంటి తేజోవంతుడైన పుత్రుడు పుట్టెనని, కలకలధ్వని పుట్టెను. ఇక హుండుడికి దిగులు మొదలైనది. వెంటనే బాలుని నపహరించాలని, అక్కడున్న దాసీలలో నొకదానిపై ఆవరించి, పురిటింట్లోనున్న మహారాణి సొమ్మసిల్లియుండినదిగని, ఆ దాసీరూపంలో పసిబాలుని యెత్తుకొని మాయమయ్యెను. వాడు తన పట్టణమగు కాంచన పట్టణమునకు చేరి, తన పరివారముతో వీడిని వధించి, నాకాహారముగా పెట్టుమని పురమాయించెను.

ఆ రాక్షసుని పరివారము ఆ బాలుని వంటవానికిచ్చి రాక్షస రాజునకు విందొనర్చమని చెప్పివెళ్లిరి. రాక్షసుని ఆజ్ఞగా ఆ బాలుని నరకుటకై యత్నించగా, ఎత్తిన కత్తి రెండు ముక్కలుకాగా, బాలుని తెచ్చిన "మేకల" అనుసైరంధ్రీ చూచి ఆశ్చర్యపడి, అదిరిపోయినది. "శ్రీ గురుదత్తప్రభు రక్షణ ఆలాంటిది." వంటలవాడును ఆశ్చర్యపడి, బాలుని పరీక్షగా నిటునటుజూచి, మహారాజలక్షణాలున్న ఈ పసికందుని వధించక, ఇక వారు ఆ రాత్రియే రహస్యముగా దేవతల గురువగు వశిష్ఠమహర్షి ఆశ్రమంలో నుంచి, ఓ లేడిపిల్లను చంపి రాక్షసునకు వండిపెట్టిరి. మద్యంమత్తులో నున్న ఆ రాక్షసుడది గ్రహించక, ఆరగించి నిశ్చింతగా నుండెను.

శ్రీదత్తప్రభులీలల కసాధ్యమేముంది? దానవులును మానవులౌతారు. దేవతలు కూడా యగుదురు. అది వారి సంకల్ప మహిమయే.

ఉదయాననే శ్రీవసిష్ఠమహర్షికి చంద్రబింబాననుడగు బాలుడగుపించగా, వారు దివ్యదృష్టితో అంతయునెరిగి, బాలుని గైకొని ఇది దైవలీలగా భావించి, ఆ పిల్లవాడికి క్షత్రియోచిత సంస్కారంగా "నహుషుడు" అని పేరు పెట్టెను.

అట్లా బాలుడు ఆశ్రమంలో దినదిన ప్రవర్ధమానంగా పెరుగుచు, వశిష్ఠుని ద్వారా సకల విద్యావిశారదుడై, సర్వాస్త్రనైపుణ్యుడై, అద్వితీయప్రజ్ఞాకళాధీరుడై నియతవ్రతుడై యుండెను.

ఇట్లుండగా, నహుషుని తల్లిదండ్రులు తమశిశువు మాయమగుటతో ఎంతో పరితపించిరి. చెదరిన కలలాగా ఏమిటీ మాయ? అని పరిపరివిధాల పరితపించుచు, తుదకు తమ కుమారుడిట్లు మాయ మగుటలో నేదో రహస్యమిమిడియున్నదని, అయినా శ్రీదత్త స్వామినే నమ్ముకొని యుండిరి.

ఒకనాడు వశిష్ఠుడు, నహుషుడు నెరవేర్చవలసిన విధిహుండుని, వధించ సమయమాసన్నమైనదని తలంచి నహుషుని పిలిచి, ఆ రాక్షసుని వధించుమని ఆదేశించెను. గురువాజ్ఞగా నహుషుడును సమరోత్సాహంతో వసిష్ఠ మహర్షికి నమస్కరించెను. వశిష్ఠుడాశీర్వదించుచు నిట్లనెను "నాయనా! శివకన్యయైన "అశోకసుందరి" నిన్ను భర్తగా పొందుటకు సుదుష్కరమైన తపస్సొనర్చినది. అట్టి సుందరిని ఈ హుండుడపహరించి తన చెరలో నుంచుకొన్నాడు. కావున వానిని చంపి ఆమెను భార్యగా పొంది మీ తల్లిదండ్రులను విజయ గర్వంగా చేరుకో"యని, ఆదేశించెను.

నహుషుడు సమరోత్సాహంతో నుండగా ఇంద్రుడు తన సారధి (మాతలి)తో తన దివ్యరథమును, దివ్యాస్త్రములను అందించెను. నహుషుడును రథానికి నమస్కరించి, దేవేంద్రునకును నమస్సుమాంజలులర్పించి, రథారూఢుడై హుండునిపై యుద్ధ శంఖారావమొనర్చెను.

ఆ ధ్వనితో హుండుని హృదయములో గుబులు పుట్టి తనను వధించునెవడని, విర్రవీగి, తుదకు నిజమెరింగి, తన శత్రువే తనపై దండెత్తనున్నాడని, ఇకనైనా వానిని చంపి, తన పగ తీర్చుకొందామని యుద్ధమునకు తలపడెను. నహుషుడును వానితో భయంకరముగా యుద్ధమొనర్చెను. దేవతలందరాశ్చర్యపడిరి. అందులో శ్రీదత్తప్రభు తన భక్తులనేగాక, ఆ భక్తుల సంతతిని కూడ కాపాడునుకదా! ఆ ఆశీర్వాదబలంతో హుండుని వధించి, వాని చెరలో నున్న అశోకసుందరిని కాపాడి, వశిష్ఠుని ఆశ్రమంచేరి, ఆమెను ధర్మపత్నిగా పొంది, వారి ఆశీర్వచనముతో, తల్లిదండ్రులను చేరి, వారికిని ఆనందము కల్గించి, నమస్కరించి, వారి ఆశీస్సులను పొందెను.

ఇది నహుషుని కథ. శ్రీదత్తస్వామి కరుణా నిదర్శనం.

## భద్రశీలుడు (ధర్మకీర్తి)

శ్రీగురుదత్తస్వామి చెంతనుండడం, ఆశ్రయించడం మనవంతు. అంతే, ఇక స్వామి కరుణకు పాత్రులమయినట్లే. మనల్నిక మరచిపోడు, విడిచి యుండలేడు. మనలోనే యుండి మనమొనర్చు కర్మలకును, అవి తప్పులై యుండినను తట్టి తుదకు జ్ఞానోదయం కలుగునట్లు చూచును. అదియే శ్రీదత్తస్వామి ప్రత్యేకత. అందులకు, భద్రశీలుని పూర్వజన్మలో

చూపిన లీలలే నిదర్శనం.

పూర్వం నర్మదానదీ తీరాన "గాలవుడ"నే పరమశాంత తపస్వికి కొంతకాలానికొక కొడుకు పుట్టాడు. వాడికి "భద్రశీలుడ"ని పేరు పెట్టెను. ఆ బాలుడు పెరిగి పెద్ద వాడగుటతో తన పూర్వజన్మ సంస్కారముగా నెల్లప్పుడు దైవధ్యాన నిమగ్నుడగుచుండి, ముద్దు ముద్దు మాటలతో కేశవ నామాలు పలుకుతూండెడి వాడు. దైవారాధనలతో కాలం గడుపుతూండడం చూచి, బాలుని సంస్కార **విశేషాన్ని గ్రహిస్తూ, వాడిని ప్రోత్సహి**స్తూండేవారు వృధాకాలహరణ మెరుగడు. "ఏకాదశీ"**నాడు ఉపవాసముండి "రామ"నామ** స్మరణంతో రాత్రంతయూ భజన కీర్తనలతో కూర్చునేవాడు. అట్టి పుణ్యపుత్రుని చూచి తల్లిదండ్రులును సంతోషించెడివారు.

వారొకనాడు భద్రశీలుని, నాయనా! నీవు పూర్వ జన్మలో ప్రహ్లాదుడివా!" అని తల్లి దండ్రులడుగగా, బాలుడు ఉలిక్కిపడి, "కాదు, నేను ధర్మకీర్తి మహారాజు"నని పలికెను అట్లు పలుకుటతో వారాశ్చర్యపడి, తేరుకొని, మరల యిది సత్యమేయని, తండ్రి తన యోగశక్తితో సమ్మతించి, ఇక తన జన్మ తరించినదని తలంచెను. తాను పుణ్యలోకానికి వెళ్ళు తలంపుతో, "నాయనా! సిద్దపురుషా! ఇట్టీ జన్మనొందుటకు యముడు నీకుపదేశించిన చరిత్ర చెప్పుము" - అన్నాడు.

## ధర్మకీర్తి చరిత్ర :- భద్రశీలుడిలా చెప్పదొడెంగెను.

"నాన్నగారు! నా చరిత్ర అనుట కన్న "ధర్మకీర్తి కథ" కథగానే చెబుతాను. శ్రీదత్తస్వామిని నమ్మియుండి, కొన్నాళ్లకు భ్రష్టబుద్ధులగు హేతువాదుల సాంగత్యంతో శ్రీస్వామిని మరచి, నాస్తికుడై, తుదకు పడరాని పాట్లన్నియును పొందుటతో, శ్రీస్వామి ధర్మకీర్తిని భ్రష్టత్వం నుండి సన్మార్గ ప్రవర్తనకు. అదృశ్యహస్తరూపంలో గైకొని పోయిరి. ఇట్టి ధర్మకీర్తి చంద్రవంశపుమహారాజు ఇతడు ప్రతిష్ఠానపురంను రాజధానిగా తొమ్మిది వేయిల సంవత్సరములు రాజ్యం పరిపాలించెను. కొన్నాళ్లకు శ్రీదత్తస్వామిని దర్శించి, తను, ధర్మస్వరూపమూలహేతువేదో తెలిసికొనదలచి, అటులే సహ్యాద్రికి చేరెను. అటులాస్వామిదర్శన తపన కలిగిన భద్రశీలునకు, శ్రీస్వామి పరీక్షించడంలో చేరిన రాజును, కొట్టడం, తన్నడం, బండబూతులనడం ఆ ధర్మకీర్తికి, ఇవన్నియు తన్ననుగ్రహించు, పవిత్రుణ్ణి చేయు క్రియలేయని, విశ్వసిస్తూ, దోసిలొగ్గి, తలవంచియుండడంతో, శ్రీస్వామి కరుణించి ధర్మ స్వరూప విధానాలనేకరీతుల బోధించెను. వీటిని అమలులోనుంచమని కూడ పలికెను.

కానీ! రాజు వినిన ధర్మోపాసనలు అమలులో పెట్టలేక, దుష్టుల, నాస్తికుల దుర్బోధలతో స్వామినే మరచి, దుర్వ్యసనాలకు దిగజారెను. ఒకానాడున్నట్టుండి వేటకై ససైన్యంగా వెడలి, తుదకు తన సైన్యమునకును దూరమై, అలసి ఆకలి దప్పులకును కరువై తిరుగుచు రేవానదీ ప్రాంతముచేరెను. తను అధిరోహించిన అశ్వమును తనకుదక్కక,

తోడులేక, అదియు ను గతించెను. చేయునది లేక రాజు ఎటులోనదిని చేరగా, ఆ సమీపంలో కొందరు భజనకీర్తనల నొనరించుటను విని, అచట వెలుగుచున్న దీపాల వెలుగులో వారిని చేరెను. అదొక ముని పల్లె ఆ రోజు ఏకాదశి పర్వదినం కావటంతో ఆ పల్లె వాసులందరు రేవా నదీ తీరాన హరి కీర్తనలతో జాగరణ చేస్తూ దీపారాధనలతో నుండడం రాజు చూచెను. తను ఆకలి కొనిన కారణాన, వారి నింత అన్నమడుగ తలంచెను. ఎంత మహారాజుయైనను, "ఆకలి ముందు సర్వులు **ముష్టివాళ్లేకదా!**"

కాని **రాజుకిది అలవాటు లేని పని.** దానికి తగినట్లుగా వారాదినము ఉపవాసమున్నారని తెలిసి, తన ఆశ నిరాశకాగా, ఇట్టి "ఏకాదశీ" మహత్తు స్వామి చెప్పినది గుర్తుకురాగా, ఆ దినమున ఉపవాసముండడం నొక ఉత్తమవ్రతమని, మహర్షులంతా యీ వ్రతమాచరిస్తూ తరించుచుందురు కదా! యని గ్రహించి, తానిట్లు భ్రష్టత్వము పొందుటకు స్వామి యుపదేశించిన ధర్మమార్గములను పెడచెవిని పెట్టి, మాట మీరిన కారణాన నేనీ ఆకలికి, పరితపించడం దుఃఖహేతువే. అని రవ్వంత మనస్సు కలత చెంది, పశ్చాత్తాపపడి, ఆకలిబాధకు ఆవరించిన రోగబాధకు తాళలేక, తనకిక మరణమే శరణ్యమని తలుస్తూ, తన చెవులలో మహర్షులుచ్చరిస్తున్న హరినామ సంకీర్తనలను వినుచు, ఆ వెలిగించియున్న దీపారాధనలను జూస్తూ ఆ రాత్రి పొద్దువేళకు ధర్మకీర్తి తనువుచాలించెను.

## ఏకాదశీ వ్రత మహిమ :-

గతించిన ధర్మకీర్తిని యమభటులు యమపురికిగైకొని పోయిరి. కాని ఈ రాజొనర్చిదుష్ట కర్మలకన్నా, ధర్మం సూక్ష్మమైన ఏకాదశీ వ్రతం తెలిసి తెలియక పాటించిన వాడితడని, ఆనాడు సంపూర్ణోపవాసముండి, రేవానదిలోస్నానమొనర్చి నందులకు, వ్రత దీక్షా పరాయణుల సాన్నిధ్యంలో హరి నామసంకీర్తనలను వినినందులకు, ఆ రోజుననే ప్రాణాలు విడిచినందులకుగాను, ఆ ఏకాదశి ఉపవాస ప్రభావం వల్ల, ఈ రాజొనర్చిన పూర్వ పాపాలన్నియును హరించిపోయినవి. మరియును, ఏకాదశీ జాగరణ, నామసంకీర్తనల నాలకించిన పుణ్యఫలం మిగిలియున్నది. మిక్కిలిగా నిదంతయు రాజునకొనర్చిన శ్రీదత్తస్వామి కరుణాకటాక్ష వీక్షణము వారి హస్త స్పర్శ మహిమ తరగని నిధిగానున్నది. రాజొనర్చిన పూర్వ పుణ్యఫలం, అంతయు పూసగ్రుచ్చినట్లు చిత్రగుప్తుడు యమధర్మరాజుతో చెప్పెను.

అంతయు విన్న యముడు ధర్మకీర్తి యెడల సౌమ్యమనస్కుడై ఇతనిని వైకుంఠంనకు గైకొని వెళ్లమని తన భటులకాజ్ఞాపించెను. వారటులేజేసిరి. అదియును గాక, తన భటులకిట్లు ఆనతిచ్చెను. ఎవరేని ధర్మపరాయణుల జోలికి పోరాదు. శివకేశవ నామాల్ని కీర్తించేవారి ఛాయలకే పోరాదు. మిక్కిలిగా ఏకాదశీ వ్రతమాచరించువారి మాట ఈ యమలోకంలో తలచరాదు. ఏకాదశీ దినాన పాపాలన్నీ అన్నాన్ని ఆవరించి యుంటాయి. కనుక ఆ

అన్నం తిన్నవారినే శిక్షించవలెను. ఎందుకనగా ఆనాడు అన్నం తినేవాడు పాపాలు తిన్నవాడన్నమాట. ఇట్టి "ఏకాదశీ" వ్రతాన్ని జన్మలో నొక్కసారైన ఆచరించిననుచాలు" అని వారితో పలికెను.

చూచారా! శ్రీదత్తస్వామి కృపకు పాత్రుడైన వారి గతి. గనుక, శ్రీదత్త కృపావలంబనంతో హరిభక్తి మార్గంలో జన్మ పరంపరను నధిగమించి ఆత్మలాభం పొందాలని, "భద్రశీలుడు ఇట్లు ధర్మకీర్తి కథను వివరించి, తానిట్లు హరినామ సంకీర్తనల నొనరించుటకు తన పూర్వ జన్మ ధర్మకీర్తి పుణ్యప్రవర్తనయే కారణమని, ఈ జన్మ విశిష్టమైనదిగా, జన్మ రహస్యమును కూడ వివరించి, ఈ ధర్మోపదేశం తండ్రికి వివరించి ధన్యుడయ్యెను.

## శ్రీ దత్తగురునిచే ప్రహ్లాదునకు జ్ఞానయోగం

లోకంలో అనేకావతారాలున్నాయి. కాని దత్తావతారంలో అనేకానేక ప్రత్యేకతలు, విలక్షణతలున్నాయి. బృహత్తర కార్యాలతో భక్తులకు పరిపూర్ణ సిద్ధి ననుగ్రహించి, ఆత్మారామస్థితిని సమకూర్చే పరిపూర్ణావతారమే శ్రీదత్తావతారం.

ఇందులకు నిదర్శనంగా ప్రహ్లాదోద్ధరణ కథయే మనకు విదితము.

విష్ణుమూర్తి నరసింహావతారంతో భక్త ప్రహ్లాద వరదుని కాచుటకై, అతని తండ్రియైన హిరణ్యకశిపుడను దానవుని సంహరించెను. తదుపరి ప్రహ్లాదుడు రాజై, అనేక భోగాలను హరితత్పరుడై అనుభవిస్తూ, ఐహికంగా యెట్టి లోటులేకుండా, తన ప్రజలను సహృదయ ప్రేమపూర్ణతతో కన్నబిడ్డలవలె చూస్తూ పవిత్ర మనస్సుతో పాలించుచుండెడివాడు.

అయినా, ఆ భక్తుడి అంతరాంతరాలలో నేదో నొకమూల అనిర్వచనీయమైన అసంతృప్తి దాగియున్న కారణాన, తాను తన సన్నిహితులైన విద్వాంసులను వెంబడించుకొని లోకతత్వాన్ని విస్తృతులైన విద్వాంసులను వెంబడించుకొని లోకతత్వాన్ని విస్తృతంగా పరిశీలించడానికై లోక యాత్రసాగిస్తూ, తిరిగి తిరిగి దక్షిణాపథాన, సహ్యాద్రి ప్రాంతంలోనున్న కావేరీ నదీ తీరానికి చేరుకొన్నాడు. శ్రీదత్త రూపంలో దాగియున్న బాలప్రహ్లాద వరదుడు. తన తీరానికి చేరుకున్న ఈ వృద్ధ ప్రహ్లాదుణ్ణి ప్రేమపూరితంగా చూస్తూ నవ్వుకున్నాడు. తానొక ముని రూపముగా ఇసుకలోదొర్లుతూ అగుపించాదు ప్రహ్లాద చక్రవర్తికి. పవిత్రుడైన ప్రహ్లాదున కారూపం ఆశ్చర్యం కలిగించినది.

ప్రహ్లాద చక్రవర్తి సందేహించకుండా ఆ మునికి సాదరంగా సాష్టాంగ వందనమొనర్చి, సవినయంగానిట్లు ప్రశ్నించెను.

"మునీంద్రా ! మన్నించండీ. ఇట్లు మీరీ బురదలో పొర్లుతుండడం, మీరీ శరీరంను

రవ్వంతైనా లెక్క చేయకపోవడం, రాగద్వేషాలు లేకుండునట్లు అగుపించడంలో మీ తత్త్వాన్ని నన్ననుగ్రహించి నాకుపదేశించండి" అని పలుకగా-

స్వామి కళ్లు తెరచి ప్రహ్లాదునితో నిట్లనెను.

"ప్రహ్లాదా! నీవు ఆధ్యాత్మిక సంకల్పబలంతో శ్రీహరినే నమ్మియుండిన నీవు అంధకార మనునది ఎరుంగకున్నావు. పరమ భాగవతుడివి. నన్ను నీవు ప్రశ్నించావు కనుక విను. ఈ మానవ జన్మ, ఎన్నెన్నో జన్మల తదనంతరం లభించినది నాకు కానీ ఈ జన్మ ధర్మాధర్మ ప్రసక్తి లేని కామతృష్ణలకు బానిస. ఈ లోకస్థితియునంతే. దుఃఖాలను దూరమొనర్చుకొనుటకు సుఖాలను పొందుటకు కొందరు సత్క్రియలొనర్చుచున్నారు. కాని వారనుకొనునట్లు సుఖము నిలువక, దుఃఖమే మిగుల్చుకుని యుండడంతో నాకీ కర్మలపై ప్రయోజనం కనపడకపోగా, ఇలా దూరంగా వచ్చేశాను.

ఎందుకనగా మనఃకల్పితాలైన సుఖభోగాలు, అశాశ్వతాలైన అభాసరూప ఆనందాలు. ఎవరికివారే అతి తెలివి గలవారమని అహంభావముతో, మోహమహిమతో అసత్యమైన, ద్వైతాత్మకమైన ఘోరసంసార చక్రంలో చిక్కి పరిభ్రమించడం లోకరీతియైనది. నీవును ఈ లోకాన్ని విస్తృతంగా చూస్తూ, భోగాలు స్వయంగా అనుభవించితివి. ఈ భోగాలలో సుఖమున్నదా! ఈ భోగం కోరువాడు ధనం ప్రాణం కోరుతాడు. కాని, ధనం వల్ల ప్రాణభయముండుటను గ్రహించును. కావున ఈ ధనం, ప్రాణం రెండునూ చేరి శోక, మోహ, భయ, క్రోధ, రాగ దైన్య, శ్రమాదులనెన్నిటినో పుట్టించి, సంపదలపై వెఱ్ఱితనం విస్తృతంగా పెరిగి, అంతులేని లోభులై తుదకు తమ శ్రమంతా వృధా అవడంతో మరల శాశ్వత దుఃఖబాధలను అనుభవించుచున్నారీమానవకోటి. ఇట్టి ప్రవృత్తిని దూరమొనర్చు నాకు రెండే రెండు గురువులయ్యాయి. ఒకటి జుంటీగ. లోభంతో శ్రమించి, తుదకు కూడబెట్టుకొనిన తేనెను వదలుకోవడంతో దానినుండి వైరాగ్యాన్ని నేర్పుతుంది తుదకింతేనని. ఇక రెండవది కొండచిలువ. కొండంత శరీరంతో నుండినను తన శరీర పోషణకై తపన చెందక, యిటునటు తిరగక, పెంపసలాడక, దొరికినది తింటూ దొరకనప్పుడు దుఃఖించక, నిశ్చింతగా నుండడంలో, ఎలా యుండాలో నేర్చుకొన్నాను. కొండచిలువ ద్వారా. దానితో నేనీ అజగరవ్రతంలో నుండి ఏదియును ఆశించక, లభించినది పొందుతూ, ఈ లౌకిక సుఖదుఃఖాలకతీతుడై యున్నాను.

నాయనా! ప్రహ్లాదా! లోకమంతా మాయాపరవశమై యున్నకారణాన ఆత్మానుభూతిని, ఆత్మానందాన్ని పొందలేకపోతున్నది. కాని, నేనట్లు కాక, సర్వసమదృష్టిని కలిగియుండి, ఆత్మానందానుభవంతో, ఏకాకారంతో నున్నాను. ఇట్టి గూఢాతి గూఢమైన నా ఆత్మవృత్తాన్ని (వృత్తాంతం)ను నీకు మర్మం లేకుండా చెప్పితిని. నీవు హరిప్రియుడవు, కనుక నాకును ప్రియుడవే. నేను చెప్పినది బాగా ఆకళింపుచేసుకో. ఇదే 'పరమహంస

యోగము'. అని బోధించడంతో, ప్రహ్లాదునకు అంతర్జ్యోతి దర్శనంగా శ్రీదత్త గురువు సాక్షాత్కరింపజేసెను. ప్రహ్లాదుడానందంతో స్వామిని పూజించి, వీడ్కొని, తనశేష జీవితాన్ని ఆత్మారామస్థితిలో గడిపెను.

"ఇదే శుద్ధ చిత్తమునకు తత్త్వబోధ"

## అలర్కుని చరిత్ర :

జీవుడు తగినంత సంస్కారం కల్గి యుండినచో శ్రీ దత్తస్వామియే ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. అట్టి సంస్కారం జన్మతోనే వస్తుంది. అట్టి జన్మలనిచ్చువాడు శ్రీదత్త స్వామియే – "సువర్ణా జ్ఞాయమానస్య సువర్ణత్వంచ నిశ్చితం" – అని సూక్తి.

పూర్వం "శత్రుజిత్"దనే రాజు "తుందిల"యోగి శిక్షణలో చక్కటి సంస్కారవంతుడై యుండెను. అట్టి మహారాజునకు "ఋతుధ్వజుడ"ను కొడుకుండెను. ఇతడు తండ్రివలె సంస్కారవంతుడే గాక, మహావీరుడును.

ఒకప్పుడు "గాలవుడనే మహర్షి ఆదేశంతో, తండ్రి, కుమారుడగు ఋతుధ్వజుని "పాతాళకేతువు కొడుకు చంద్రకేతువు"లను సంహరించు నిమిత్తం అతని వెంబడి పంపెను. ఆ ఋతుధ్వజడు ఆ రాక్షసులను తరిమి, వారి చెరలోనున్న "విశ్వావసు" అనే గంధర్వరాజ కుమార్తె "మదాలస"ను విడిపించి, అగ్నిసాక్షిగా వివాహమాడి, తిరిగి గాలవు'ని చెంతకుచేరి ఆశీస్సుల పొంది సుఖసంతోషములతో నుండిరి.

ఇట్లుండ నొకనాడు ఋతుధ్వజుడు మాయాఋష్యాశ్రమం చేరి, వారి కోరికతో తన రత్నాభరణం అందివ్వగా, ఆ ఋషి మాయమై "శత్రుజిత్తు"ను చేరి, నీ కొడుకు గతించినాడని ఆభరణం చూపగా అది విన్న 'మదాలస' అసువులు బాసెను.

**ఋతుధ్వజుడు** రాగా తన భార్య గతించినది విని, మిక్కిలి పరితపించెను. ఆ దుఃఖ**మును చూడలేక అతని** మిత్రులు నాగుల సంతతివారగుటచే, వారి తండ్రి అశ్వతరుడు శివుని **మెప్పించి మరల "**మదాలస" వంటి కూతురును పొందెను. ఆమెను ఋతుధ్వజునికిచ్చి వివాహం జరుపగా వారికి "విక్రాంతుడు, సుబాహువు, శత్రుమర్ధనుడు, అలర్కుడు" అను కుమారులు కలిగిరి. మదాలస అధ్యాత్మిక చింతన గలది. అట్టిమాతకు ఆ నలుగురును శ్రీ గురుదత్తోపదేశంతో రాజ్యభోగములను విడిచి వైరాగ్యంతో శేషజీవితం గడిపిరి". అలర్కునకు హితోపదేశ కారకులు అతని అన్నలే.

ఈ కథ శ్రీ గురు దత్తప్రభు మహిమకు నిదర్శనం.

**- నమోస్తు -**

# 22. శ్రీ గురుదత్త అవతార పరంపరలు

"బ్రహ్మ వైవర్త పురాణము"న - సూతుడు శౌనకాది మునులతో సద్గురుని కథను వివరిస్తూ ఇట్లనెను-

బ్రహ్మ నాలుగు యుగములను సృజించెను. అందులో కలియుగ ప్రభావమును గూర్చి, అందలి జనుల దురాగతముల, దుష్ప్రవర్తనలను వివరిస్తూ, బ్రహ్మదేవుడు గురువు మహిమలను కూడ తెలిపెను.

బ్రహ్మదేవుడు కలిని పిలిచి, "కలీ! నీవు ఈ కలియుగమువ గురువులను, గురుధర్మపరులను, గురువు సేవకులను బాధింపరాదని హెచ్చరిస్తూ నిట్లాదేశించెను.

"యే సేవంతే హరిహరాభేదేన గురూనపి, గురుసేవారతాంశ్చైవ,

గురుభక్తాన్విశేషేణ కలేత్వం నైవపీడయ" -

శివకేశవులకు భేదమెంచక పూజించువారిని, గురుసేవకులను, గురుసేవారతులను, ముఖ్యముగా గురుభక్తులను నీవు పీడించరాదు. అని పలుకగా-

కలి, బ్రహ్మదేవునకు నమస్కరిస్తూ - "బ్రహ్మదేవా! 'వద కో గురుః? గురు స్వరూపం కథయప్రసాదాద్విస్తరేణమే. గురువనగానెవడు? ఆయన స్వరూపమేమి? అనుగ్రహించి విశదముగా వివరింపుడు" అని కోరెను.

అందులకు బ్రహ్మ ప్రసన్నుడై యిట్లనెను.

"కలే శృణు ప్రవక్ష్యామి గురుమహాత్మముత్తమం"

కలీ! గురుమహాత్మ్యము ఉత్తమమైనది. చెబుతున్నాను శ్రద్ధగా వినుము

శ్లో॥ 'గ' కార స్సిద్ధిదః ప్రోక్తో రేపః పాపస్యదాహకః ।
'ఉ' కారో విష్ణురవ్యక్తః త్రితయాత్మా గురుఃస్మృతిః ॥

భా: 'గ' అను శబ్దము సిద్ధిని కలుగజేయును. 'ర' అన్నది పాపమును దావానలము వలె భస్మము చేయును. 'ఉ' అన్నది విష్ణువు. ఇట్టి 'గురు' అన్న శబ్దము అవ్యక్తమైన త్రిమూర్త్యాత్మకముగా చెప్పబడును.

శ్లో॥ గణేశో వహ్నియుక్తశ్చ విష్ణు నాచసమన్వితః ।
వర్ణద్వయాత్మకో మంత్రశ్చతుర్వర్గ ఫలప్రదః ॥

భా: ఈ రెండక్షరముల మంత్రము 'గురు' అన్నది గణేశ, అగ్ని, విష్ణుయుతము. ఈ మంత్రము చతుర్వర్గ ఫల (ధర్మార్ధ కామమోక్ష)ముల నొసంగునది.

శ్లో॥ గణేశ సంజ్ఞో గకారః వహ్ని సంజ్ఞో రకారకః ।
విష్ణు సంజ్ఞ ఉ కార స్స్యాదేవం గురురితి స్ఫుటం ॥

భా: 'గ'కారము గణేశునకు, 'ర' కారము అగ్నికి, 'ఉ'కారము విష్ణువునకు సంజ్ఞలుగా నున్న యీ శబ్దార్ధ సమన్వితమైనదే 'గురు' అన్నది నిశ్చయము.

శ్లో॥ గురుర్బ్రహ్మ గురుర్విష్ణుర్గురుర్దేవో మహేశ్వరః ।
గురురేవ పరంబ్రహ్మ తస్మాద్గురు ముపాశ్రయేత్ ॥

భా: గురువు బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే మహేశ్వరుడు. గురువే పరబ్రహ్మము. అందుచే గురువునే ఉపాసించి, ఆశ్రయించవలెను.

శ్లో॥ బ్రహ్మత్వేనోత్పాదక త్వాద విద్యాదేశ్చ తారణాత్ ।
భవ సంహార కత్వాచ్చ గురుస్స్యాత్మా తమాశ్రయేత్ ॥

భా: జీవుని జీవ భావనను పోగొట్టి బ్రహ్మభావనను పుట్టించు వాడగుటచే బ్రహ్మముని, అవిద్యారూపములైన కామ్య కర్మలను నివారణమెట్లు ఒనర్చుకోవాలో తెలుపుటతో విష్ణుదనియు, అపారమైనభవమును సంహారమొనర్చుటచే రుద్రుడనియు గురువు కీర్తింపబడుతాడు. అట్టి గురువును త్రిమూర్తుల రూపుడని ఆశ్రయించవలెను.

శ్లో॥ గురుదర్శన సంకల్పాదపి సిద్ధిశ్చ పాదుకే ।
దృష్ట్వా హృష్టో గృహం గత్వా పుమార్థానపి విందతి ॥

భా: "గురుదర్శన సంకల్పం" కలిగిన తోడనే సిద్ధి లభించును. శ్రీ గురు పాదుకలను చూచి సంతుష్టుడై ఇంటికి వచ్చిన, అతనికి ధర్మార్ధ కామమోక్షములు లభించును.

శ్లో॥ త్రిమూర్తిః శ్రీ గురురితి శ్రద్ధావానిష్ట భాగ్భవేత్ ।
ఏకభావాయ భక్తాయ సదద్యాదఖిలాన్వరాన్ ॥

భా: త్రిమూర్తి రూపుడైన శ్రీగురువునందేకాగ్రభక్తితో భావన చేసిన భక్తునకు (శిష్యునకు) సర్వమునిచ్చును. శ్రద్ధావంతునకు కోరినవన్నియునిచ్చును.

శ్లో॥ కుపితో యదిదైత్యారిః త్రిపురారి రథాపి వా ।
తతోఽపి భక్తమాత్మీయం శ్రీగురుః పరిరక్షతి ॥

భా: హరిహరులు కోపించిన తన ఆత్మీయుడైన శిష్యుని (భక్తుని) శ్రీ గురువు రక్షించును.

శ్లో॥ యస్మై ᐟస్మై కదాచిత్తు గురుః కుప్యేత చేత్తదా ।
రక్షితుం తం శక్నోతి మాధవో వాఽప్యమాధవః ॥

భా: శ్రీగురుడు ఎవడినైన కోపించిన వానిని ఆ హరిగానీ, హరుడు గానీ రక్షింపశక్యులు గారు. అనగా -

శ్లో॥ "దేవేరుష్టే గురుస్త్రాతా గురౌరుష్టేన కోఽప్యదః"

దేవుడు కోపించిన గురువు రక్షించుటకు సమర్థుడు.
గురువు కోపించిన రక్షింప సమర్థులెవ్వరూ లేరు - అని

శ్లో॥ గురుః పితా గురుర్మాతా గురురేవ పరశ్శివః ।
ఈశ్వరో యది కుప్యేత గురూరక్షతి తంతదా ॥

భా: "గురువు" తల్లిదండ్రియు, పరమపురుషుడైన శివుడు. శివుడు కోపించిన, వానిని గురువు రక్షించును.

శ్లో॥ యదా కదాచిచ్ఛిష్యాయ గురుః కుప్యేతదైవతః ।
పరిరక్ష తు మీశానస్తం న శక్నోతి సర్వథా ॥

భా: ఎప్పుడైన శిష్యుని గురువు కోపించిన, ఈశానుడైన ఈశ్వరుడే అయిన రక్షింప సమర్థుడు కాడు.

శ్లో॥ హరౌ ప్రసన్నేఽపి హివైష్ణవాజనాః సంప్రార్థయంతే గురుభక్తి మవ్యయాం ।
గురౌప్రసన్నే జగతామధీశ్వరో జనార్దన స్తుష్యతి సర్వసిద్ధిదః ॥

భా: శ్రీహరి ప్రసన్నుడగుచో విష్ణుభక్తులు ఎడతెగనట్టి గురుభక్తిని ప్రసాదించమని ప్రార్థించెదరు. గురువు ప్రసన్నుడైనచో జగత్తునకే ఈశ్వరుడైన జనార్దనుడు సంతుష్టుడై సర్వమును సిద్ధింపజేయును.

శ్లో॥ యదిప్రసన్న ఈశానః సద్గురుర్నైవతుష్యతి ।
గురౌ ప్రసన్న ఆసన్న ఈశావస్తస్య ధీమతః ॥

భా: ఈశ్వరుడు ప్రసన్నుడైన, గురువు సంతసింపక పోవచ్చును. గురువు ప్రసన్నుడైన బుద్ధిమంతునకు భగవంతుడు సమీపముననే యుండును.

శ్లో॥ గురుంవినా న శ్రవణం భవేద్యస్యాపి కస్యచిత్ ।
వినా సచ్ఛాస్త్రశ్రవణాత్త్వర్ధ్బ యాన్ముచ్యతే కథం ॥

భా: గురువు లేకుండా ఎక్కడైనా శాస్త్రపురాణశ్రవణం యెట్లు సాధ్యపడును. గురుముఖత

సచ్ఛాస్త్రములను విననిదే వారికేరీతిగా నీ భయము తొలగును.

శ్లో॥ గురోర్వినా నశ్రవణం స్వబుద్ధ్యాతత్వతోభవేత్ ।
శాస్త్రాణి సులభాస్యేవ శ్రవణే సులభేసతి ॥

భా: గురువు ద్వారా జ్ఞాన సముపార్జనంతో తత్త్వదర్శియగు శిష్యుడు అజ్ఞానమును తన నేర్పుతో శ్రవణం ద్వారా తొలగించుకోగలడు. గురువు లేకుండా స్వబుద్ధితో తత్త్వము సిద్ధించదు. శాస్త్రములు సులభము కావు. గురువు నుండి పొందిన శాస్త్రముల శ్రవణం సులభమగును. అనగా!

శ్లో॥ శాస్త్ర తత్త్వేఽవబుద్ధే తు సంసార తరణం స్వతః।
గురుఃప్రకాశ కస్తస్మాజ్జ్యోతీ రూప ప్రదర్శకః ॥

భా: గురువు లేకుండా స్వంత మేధస్సుతో శ్రవణం సాధ్యపడదు. గురువు సుబోధక శ్రవణంతో శాస్త్రములలోని లోతుపాతులు గ్రహించి సుసంసారం నుండి తరించగలడు. అందుకని ఉపదేశించు గురువు బ్రహ్మమును ప్రదర్శించును.

శ్లో॥ గురు వాక్యాతి చారీ స రౌరవం నరకం వ్రజేత్ ।
గురువాక్యామకుర్వాణో మాయా సిన్ధౌ సమజ్జతి ॥

భా: గురువు వాక్యమును పాటించని వాడు రౌరవాది నరకమును పొందును. అట్టివాడు మాయయనెడి సముద్రమున మునిగిపోవును.

శ్లో॥ తతోనవిన్దతి గతిందుర్గతిం యాతి సోఽధమః ।
తారకో గురురేవాతో భక్తస్య శృతి సమ్మతః ॥

భా: సముద్రము నుండి ఊర్ధ్వగతులే లేక అధోగతులకే వెళ్లును. అట్టివాడు అధముడే. కావున భక్తుని తరింపజేయు వాడు గురువే"-అన్న వాక్యము వేద సమ్మతమైనది.

## దీపకుని గురుభక్తి(కథ)

అట్లు సూతుడు శౌనకాదుల మహర్షులకు తొలుత గురుమహిమలను తెలుపుచూ, మరల బ్రహ్మదేవుడు కలితో ఇట్లనెను.

కలీ! "గురుశిష్యుల కథ"యనునొక పురాతన కథ కలదు. దానిని నీకు చెప్పుచున్నాను వినుము.

పూర్వము గోదావరీ నదీ తీరమున అంగీరస మహాముని ఆశ్రమం కలదు. అదొక పుణ్యారణ్యమైయుండెను. అందు బ్రహ్మర్షి ముఖ్యులు, పుణ్యాత్ములు తాపసులుండిరి.

అచట పైలమహర్షి సుత్రుడైన "వేదధర్ముడ"ను ఋషి తన శిష్యులకు వేదోపనిషత్తులను బోధించుచుండెను. వారందరు గురుసేవా తత్పరులై యుండిరి. వారిలో వేదధర్మునకు అగ్రగణ్యుడైన శిష్యుడు "దీపకుడ"ను వాడుండెను.

ఈ దీపకుడు నైష్ఠిక బ్రహ్మచారి. అతడొక నాడు శాస్త్రాధ్యయనం చేస్తూండగా అందులోని వాక్యం చదివెను. "శిష్యుడికి గురువు పరబ్రహ్మ స్వరూపుడు. గురుసేవకు మించిన తీర్థాలూ, వ్రతాలూ, ఉపవాసాలు ఏవీ లేవు." అని యున్నది. అది చదివినప్పటి నుండీ దీపకుని స్మృతిపథంలో గురువు నాశ్రయించి, వారికి సేవా శుశ్రూషలు విధిగా నొనర్చి విద్యనభ్యసించాలని కోరికతో ఇల్లు వదలి, వేదధర్మఋషిని ఆశ్రయించెను.

ఆ ఋషికి సాష్టాంగముగా నమస్కరించి, "అయ్యా! నన్ను దయచేసి తమ శిష్యునిగా స్వీకరించండి" అని అర్థించెను. ఆ దీపకుని వినయవచనాలకు ప్రసన్నుడైన వేదధర్ముడు అతనినిట్లు శిష్యునిగా పరిగ్రహించాడు.

దీపకుడనతి కాలములోనే సకల శాస్త్రాలూ ఔపాసనం పట్టి, బుద్ధిని ఏకాగ్రమొనర్చి గురువాక్యమునందు నిశ్చయాత్మకమైన పూర్ణ విశ్వాసంతో గురుసేవాతత్పరుడై యుండెను. ఆధ్యాత్మిక విద్యాతేజస్సుతో అట్లు అలరారుచున్న సచ్ఛిష్యుడగు దీపకుని చూచి, సంతోషాతిశయముతో నొకనాడు గురువైన వేదధర్ముడు ఇలా అన్నాడు.

"వత్సా! పూర్వజన్మలో నేను నీకు ఋణపడియున్నానోనేమో. నీవు నాకిట్టి సేవలొనర్చుటలో నాకపరిమితానందం కలిగెను." అని తన తృప్తిని వెల్లడించెను.

ఆ కాలపు ఆశ్రమంలో గురువులు శిష్యులకు సకల విద్యారహస్యములను చెప్పుట గురుకుల పద్ధతి. శిష్యులును ఆ విద్యను లోక కల్యాణమునకు వెచ్చించుచుండిరి. మరి, ఆ విద్యనెట్లు ఉపయోగింతురో, ప్రజ్ఞాశాలియైన గురువు శిష్యులను ముందుగానే పరీక్షించుచుండెడివారు.

ఒకనాడు వేదధర్ముడు తన శిష్యుల భక్తిశ్రద్ధల పరీక్షింపనెంచి శిష్యులందరను పిలిచి, వారిని సంతోషముగా నభినందించి "శిష్యులారా! మిమ్ములను నొకమాట అడుగదలచితిని. నాయందు ప్రీతి కలిగియుంటే నామాటను వినుడు.

అన్నమాటలకు శిష్యులు, "గురో! మీరు మాకు స్వాములు. మమ్ములను తరింపజేయువారు. మీయాజ్ఞను యేదైనా మా శిరస్సున ధరించి నెరవేర్చుదుము. సందేహము వలదు. (స్వామి - తను, మన, ధన, ప్రాణములకధికారి అని.)

శ్లో॥ గురు వాక్యాతిచారీ స రౌరవం నరకం వ్రజేత్ ।
గురువాక్యమకుర్వాణో మాయా సిన్ధౌ సమజ్జతి ॥

శ్లో॥ తతో న విన్దతి గతిం దుర్గతిం యాతి సోఽధమః ।
తారకో గురురేవాతో భక్తస్యశ్రుతి సమ్మతః ॥

భా: గురు వాక్యమును పాటించని వాడు రౌరవాదినరకమును పొందును. అట్టివాడు మాయయనెడి సముద్రమున మునిగిపోవును. అక్కడి నుండి అధోగతులకు వెళ్లును. ఇక ఊర్ధ్వగతులుండవు. అట్టి వాడధముడు. కావున "భక్తుని తరింపజేయువాడు గురువే" అను వాక్యము వేద సమ్మతమైనది. అని శిష్యులనిరి.

వేదధర్ముడు వారి మాటలు విని ఆనందించి దీపక ముఖ్యులైన శిష్యులతో-

"నాయనలారా! వేల జన్మముల క్రిందట నేను చేసుకొన్న పూర్వార్జితమైన మహాపాపమున్నది. వాటిలో నేచేసిన అనుష్ఠాన, తపో, ధర్మాచరణముల వలన కొంత పోగొట్టుకొన్నాను. కాని మిగిలిన ప్రారబ్ధము నేనభవించవలసినదే. నేను తపస్వినని నిర్లక్ష్యమొనర్చిన నాకు యీజన్మలో మోక్షమునకు విఘ్నమగును. ఘోరపాపమును యుపేక్షించరాదని నాకు తోచుచున్నది. ఈ దేహముతోనే దానిననుభవించనిదే అది నాశనము కాదు. ఆ పాపమునకు నిష్కృతి లేదు. కావున ఆ పాప నివారణార్థమై 'కాశీ' క్షేత్రమునకు వెళ్లి పాపమనుభవింతునని మనస్సున నిశ్చయించితిని. నాకక్కడ రక్షణగా, శుశ్రూషనొనర్చు భారము మీరు వహింపవలెను. మీరు నన్ను త్వరగా నచ్చోటికి గొనిపొండు. మీలో నన్నక్కడ రక్షింపనెవడు సమర్థుడు. రోగబాధతో నేను మాట్లాడు నిష్ఠుర వచనములను సహించి బాధలనంగీకరించు వాడెవ్వడనెను-.

అది విని, గురుసేవ యందు నిమగ్నుడగు, గురువుచే ఆదరింపబడు దీపకుడు గురువునకు నమస్కరించి యిట్లనెను.

"స్వామినిజపాపం స శేషమేత్, దేహనాశక రాస్యాస్య శీఘ్రం కార్యాప్రతిక్రియ"

స్వామీ! ఎవరైన తన పాపమును శేషముంచరాదు. అదిదేహ నాశకరమగుటయే. త్వరితముగా దానికి ప్రతిక్రియా నొనర్చవలసినదే అని పలికెను.

వేదధర్ముడు విని యిట్లనెను.

"శిష్యా! యా వద్దేహో దృఢో నృణాం తావత్పాపక్షయః
కార్యో భవేదగ్రే విషోపమః"

శిష్యా! మానవులకు తమదేహము దృఢముగానున్నపుడే పాపమును నశింప జేసికొనవలెను. వదలివేస్తే ముందుముందు అది విషముతో సమానమగును. మరియు,

శ్లో॥ స్వయమేవాత్మనః పాపం భోగ్యందేవోఽథఋషిః ।
జ్ఞానీవాఽపి నశక్నోతి త్యక్తుం భోగం వినైవ తత్ ॥

తాను చేసుకొన్న పాపము తానే యనుభవింపవలెను. దేవుడుగాని, ఋషిగాని, పాపమును అనుభవించనిదే పాపం లయం గాదు. అన్నాడు గురువు.

ఆ మాటలు విన్న దీపకుడు, "స్వామీ! మీరు చెప్పినది సత్యం నా శక్తి కొలది సేవ చేసెదను. ఆజ్ఞాపింపుడ"నెను. ఆ మాటలు విన్న వేదధర్ముడిట్లనెను.

"నేను పాపము చేత కుష్ఠురోగముతో కాలుచేతులాడక, కండ్లు కానరాక, రక్తం చీము కారుతుంటే, జుగుప్సాకరమైన వికార రూపంతో నా స్వస్వభావం పూర్తిగా మారి, నాలోని సాధుత్వం నశించి దుష్ట చేష్టలు చోటు చేసుకొని పాపాల ప్రభావంతో నేనతి కఠినంగా వ్యవహరిస్తాను. అట్టి తరి నేనితరుల సేవకై దీనుని వలె ఎదురు చూస్తాను. ఇట్టి దురవస్థలో నీవు నాకు సేవ చేయగలవా. అదియును ఇరువదియొక సంవత్సరము లున్నట్లు సేవింప శక్తుడవైతే యీ పనికి అంగీకరించుము" అనెను.

ఆ మాటలు విన్న దీపకుడు యిట్లనెను-

స్వామీ! మీ పాపమునకు ప్రాయశ్చిత్తం నేననుభవించెదను. ఆ ఇరువదియొక్క సంవత్సరములు కుష్ఠుతో అంధుడనై యుండి మీ పాపక్షయమును నాదేహముతో సేవలొనర్చెదను. నిశ్చయముగా నన్నట్లుగా ఆజ్ఞాపింపుడు" అని గురు పాదములను బట్టి వేడెను.

ఆ మాటలు విన్న గురువు వేదధర్ముడు మహానందమునొంది మరల యిట్లనెను-

"శిష్యా! పాపము యొక్క గతిని తెల్పెదను వినుము. ఎవరు చేసిన పాప కర్మలను వారే బాధ్యులు. వాటిని వారే స్వయంగా అనుభవించాలి. పాపాల్ని అనుభవించడం కన్న, ఆ పాపపీడితునికి సేవలొనర్చడం బహు దుర్లభం. దుస్సాహసం. అది ఇతరుల వల్ల సాధ్యమయ్యేడిది కాదు. కావున, నేను నా దేహముతో పాతకముననుభవింతును. నేను నీ సహాయముతో కాశి యందు నా పాపమనుభవించి పాపరహితుడనై శాశ్వతమైన బ్రహ్మపదమును పొందుదును."

దీపకుడందులకు సమ్మతించి, గురువుతో సహా కాశీనగరము చేరి మణికర్ణికా ఘట్టమును సమీపించెను. గురుశిష్యులిరువురు ఉత్తరదిశనున్న కమలేశ్వరమహాదేవ మందిర సమీపములో బస ఏర్పాటు చేసుకొన్నారు.

అచట వేదధర్ముడు జగన్నాథుడైన విశ్వనాథునికీ, జగన్మాత అన్నపూర్ణాదేవికి పూజార్చనలొనర్చి, మణికర్ణికకును నమస్కరించి, పూర్వ జన్మంలో చేసిన పాపాలను ఆవహించాడు. తత్ఫలితంగా నీతడు కుష్ఠురోగి అయ్యాడు. అతని శరీరంలో నుండి రక్తం, చీము కారుతుండగా, అంధత్వం ఆవరింపగా, ఇక శరీరం దుర్వాసనతో పురుగులు ఏర్పడి,

దుఃఖితుడయ్యెను. స్మృతిని కోల్పోయెను. గురువుగారి దుస్థితి చూచి శిష్యుడగు దీపకునకు దుఃఖమావరించి, రోదించెను కూడా. అచటచట భిక్షించి గురువునకు అన్నమును తినుపించుచుండెను.

గురువు శరీరం చీము రక్తంతో నుండగా దీపకుడు ఏమాత్రం అసహ్యించుకోకుండా, అంకిత భావంతో వాటిని తన స్వహస్తములతో కడిగి తుడిచి మందులు వేస్తూండేవాడు. "విశ్వనాథ రూపం తం మత్వాభక్త్యాఽభిపూజ్యచ" గురువును విశ్వనాథ రూపంగా నెంచి ముదముతో, భక్తితో పూజించెను. అయినను-

శ్లో॥ రోగేణ పీడితాలోకే సాధవోఽపి గతఽత్రపాః ।
క్రూరాభవన్తి హిమునిః శాంతోఽపి క్ర్యూరతాం గతః ॥

భా: రోగముచే బాధనొందు లోకులు సాధువులయ్యు నిర్లజ్జులై ఎట్లు క్రూరత వహింతురో ఆ రీతిగనే వేదధర్ముడు శాంతుడయ్యును క్రూరతనందెను."

శిష్యుడు తెచ్చిన అన్నమును పెట్టినపుడా గురువు తినకుండా అతి కోపముతోనిది కొంచెముగానున్నది" అని దానిని నేలపై విసరివేసెను. నాకిష్టమైన పక్వాన్నములను తెమ్మని తిట్టేవాడు. మరునాడు గురువునకిష్టమైన దానినే యాచించి తెచ్చినను, వానిలోని దోషములను నెంచి, తినకుండ శిష్యుని కొట్టెడివాడు. ఒక్కొక్కసారి ప్రీతమనస్కుడై, "శిష్య శిఖామణీ! నీవు జ్ఞాన రాశివి, నా కొరకై నీవిట్లు కష్టమును పొందదమాయనుగదా?" అని, మరల వెంటనే యిట్లనును. "నీవు నా శరీరమును దుర్వాసన పోవునట్లు కడుగుటలేదు. మిక్కిలిగా బాధించుచున్నావనుటయే నిశ్చయము. నీవు వెడలిపో! దోమలు వాలుతున్నను ఎందులకు వాటిని తోలి నివారించకున్నావు?" అనుటతో శిష్యుడు వాటిని తోలుటకు మొదలు పెట్టగా, వెంటనే భిక్ష ఎందుకు తేలేదు"అనును.

ఈ రీతిగా పాపముచే సంప్రాప్తమైన రోగముచే పీడింపబడుచు, ఆ గురువు విపరీతముగా నిట్లనును. "పాపస్యహి గతిస్త్వియం"-ఇది పాపగతి మరియు-

శ్లో॥ అధికం పాతకం తత్ర దైన్య మాత్సర్యదుష్టతాః ।
వసన్తి పాపరూప సన జానాతి శుభాశుభం ॥

భా: పాపము యెక్కువగానున్నచోట దీనత్వం, మాత్సర్యం, దుష్టత్వం వసించును. పాపి శుభాశుభమును తెలియదు.

శ్లో॥ "యోదైన్యేనాతి దుఃఖేన పీడితో భాషతేఽన్యథా ।"

ఎవడైతే దీనతచే, అతిదుఃఖముచే పీడింపబడుతుంటాడో అతడు వేరొక విధంగా మాట్లాడు"నని, "వత్సా! పాపరూపమైన ఉన్మత్తత యనియే గ్రహించుము. అందుకు

సందియము లేదు. రోగములతో కుష్ఠు పదునెనిమిది విధములు. అన్నియు దుఃఖములిచ్చునవే. వాటిలో 'గలత్కుష్ఠం' మహా కష్టదాయకము. అది ఆ గురువునకు(నాకు) ఆవహించినది." అనెను-

దీపకుడు సర్వం విని, గురువు యొక్క దోషములను నెంచక, ఎంత తిట్టినను, కొట్టిననూ, గద్దించిననూ ధర్మనిష్ఠతో విసుగు విరామం లేకుండా, ఆ గురువు భయపెట్టినా, వలదని నివారించిననూ, ఈసడించిననూ బ్రహ్మచర్యనిష్ఠతో గురువునకొనర్చు సమస్త పరిచర్యనొనర్చడం ఆ విశ్వనాథునికై తపశ్చర్యనొనర్చునట్లుగా భావించి, తన దినచర్య యథావిధిగా గావించెడి వాడు దీపకుడు. అట్లు గురుసేవ తత్పరుడై యుండి కాశీ క్షేత్రమందున్నను, ఆ తీర్థమునగల పవిత్రస్థలములనూ సందర్శించలేదు. తుదకు విశ్వనాథుని దర్శనము కూడ చేసుకొనలేదు.

అనగా- గురువదాశ్రితుడై గురువునే త్రిమూర్తిరూపుడు గానెంచి, ఇతరము మాటలాడువాడు కాడు. ఆ గురుసేవతో తన శరీరపోషణ కూడానెరుగడు. నిష్ఠురములైన గురుని వాక్యములను సహించి, ఆయన మనస్సు సంతోషముగా యుంచుటకు, ఆ గురువు చెప్పిన రీతిగా ప్రవర్తించుచుండెను.

ఆ తీరున దీపకుడి గురుసేవా తత్పరతకు సంతుష్టుడైన విశ్వనాథుడు, ఒకరోజు ప్రసన్నుడై ప్రత్యక్షమయ్యెను. "వత్సా! నీ గురుసేవ అపారమైంది. ఏ వరం కావాలో కోరుకో"- అన్నాడు.

అందులకు గురుసేవా వ్రతదీక్షలోనున్న దీపకుడు, పరమేశ్వరుని పలుకులకు నిట్లనెను. సర్వేశ్వరా! మృత్యుంజయా! ఆద్యా! నా గురువునునడుగక, నేను ఏ వరమును అడుగను"-అని, గురువును సమీపించి, "గురుదేవా! విశ్వనాథుడు ప్రసన్నుడై వరమివ్వ వచ్చినాడు. మీరనుజ్ఞ యిచ్చినచో మీకు రోగము నివారించునట్లడుగమందురా! ఆ వరముచే మీకు రోగము శాంతించును"అని ఆజ్ఞ కోరగా ఆ మునియైన వేదధర్ముడు మిక్కిలి కోపముతో నిట్లనెను-

"అలసిపోతివా! అందుకు మహేశ్వరుని నా రోగశాంతికై వరము అడుగనున్నావా? నా రోగ నివారణకై భగవంతుని వరం కోరుకోవద్దు. ఎవరు చేసిన పాపం వారు అనుభవిస్తేనే అది నశిస్తుంది. అదే ప్రాయశ్చిత్త మవుతుంది. అందులోనే తృప్తి ఉంటుంది. అనుభవించకుండా పాపము శమించదు. వరము వలన ఆగిపోయిన ఆ ప్రారబ్ధము మరు జన్మమున అనుభవించ వలసి యుండును. అట్లనుభవించనిచో మిగిలిన ప్రారబ్ధము పాపరూపమై మోక్షమునకు విఘ్నము కలుగజేయునని శాస్త్రములు ఘోషించుచున్నవి." అని పలికెను.

(గురువు యీలోకమున బంధించు వరముల నివ్వడు" - మరియు "తమపదాశ్రితులైన సంచిత ప్రారబ్ధ, ఆగామి కర్మలను తన దైనరీతిలో శిష్యునిచే అనుభవింపజేసి కర్మను నాశనమొనర్చుటతో, శిష్యునకు మోక్ష ప్రతిబంధకములను తొలగింప జేయుటద్వారా, మోక్షప్రాప్తి కలుగ జేయును. ఇదే సూక్ష్మము)

శిష్యుడైన **దీపకుడు గుర్వాజ్ఞయే** ప్రమాణమని యెంచి, విశ్వేశ్వరుని చేరి, "విశ్వేశా! గురువునకిష్టములేని **వరము నేను కోరను." అనెను.** అది విన్న శివుడు పార్వతితో (మోక్షమండపమున కొచ్చి **శ్రీమహావిష్ణువును,** అచటనున్న సమస్త దేవతలను వీక్షించి, వారితో దీపకుని గురుసేవాతత్పరత వృత్తాంతం వివరించెను.

ఆ మాటలను విన్న విష్ణువును ఆశ్చర్యపడి, ఇట్టి గురు భక్తి పరాయణుని లోకమున కానమని, త్రికరణ పూర్వకంగా గురుసేవా తత్పరతకు "దీపకుడు నిజముగా కుల దీపకుడు" ధర్మం, జ్ఞానం, కీర్తి సర్వమూ గురువేయన్న, గురుపాదములే భజించు దీపకుడు ధన్యుడని యెంచి, తాను దీపకుని సమీపించి యిట్లనెను. నాయనా! నీగురు భక్తిని విని సంతసించితిని. సువ్రతా వరమడుగుమనెను.

దీపకుడు నారాయణునకు సాష్టాంగ దండప్రణామంబు చేసి, గద్గద స్వరంతో నిట్లనెను.

"దేవదేవా! నేనెప్పుడు మిమ్ములను స్మరించనూలేదు. పూజార్చనలను గావించనూ లేదు. నా గురుభక్తిని మీరెక్కడ చూచితిరి మీరెలా నాపట్ల సంతుష్టులై అయాచితంగా వరం కోరుకోమంటారు. నాకెందులకు వరమివ్వతల చితిరి. మునులు దివ్యకోటి వత్సరములు అరణ్యములందు తపమాచరించుచుందురు. వారినందరిని యుపేక్షించి తపోహీనుడనైన నాకు వరమీయవచ్చితిరి. వరము పొందు అర్హత నాకులేదు." అనెను.

ఇట్టి ప్రౌఢమైన దీపకుని వాక్యములను విని, ఆ హరియూ విస్మయుడై గురుభక్తికి సంతుష్టుడై మరల యిట్లనెను. "నాయనా దీపకా! నీ పలుకులకు సంతసించితిని. కోరినవరమిచ్చెదను కోరుకో" అందులకు దీపకుడు, విష్ణువునకు నమస్కరించి వినయము ఉట్టి పడినట్లు యిట్లనెను -

హృషీకేశా! నాకు వేదశాస్త్రాదులు, మీమాంస తర్కవ్యాకరణ శాస్త్రాదులు బోధింపగలవాడు మాగురుదేవులే. సర్వ విజ్ఞాన ప్రకాశకుడు నాకు గురువే. ఆ గురువునకు త్రిమూర్తులు అధీనములు. అట్టి సద్గురువుండగా నాకితర దేవతలతో పని యేమి? సర్వదేవతలు, సర్వతీర్థములు సద్గురువే, అనుట సత్యము. అందుచే నాకు పరమార్థం (జ్ఞానము-మోక్షము) దూరముగానెట్లుండును? సిద్ధులు, యోగులునూ గురువువినా జ్ఞానులు కాలేదు. ఈ జ్ఞానము, మోక్షము గురువు వల్లనే లభించునవి. అట్టి మీరిచ్చు వరము నా

గురుదేవుడు యివ్వగలడు" అనెను.

ఆ మాటలు విన్న శివకేశవులు దీపకుని గురుభక్తికి మరింత సంతసించి, ఉభయులు మరల వరమీయ పలికిరి. "నాయనా! నీవు ఏఏ రీతులలో గురువును సంతుష్టుని గావించెదవో అట్టి వరమనుగ్రహించెదము కోరుకో"-అనిరి.

దీపకుడందులకు పరమానందంబొంది, యిట్లు ప్రార్థించెను. "స్వామీ! నాకు నిరంతరం అచంచలమైన **గురుభక్తిని కల్గిన వానిగా** నుండునట్లు ప్రసాదించండి. అదే అన్నిటికిని మూలమైనది"**-అని ప్రార్థించాడు.**

"తథాస్తు"-అని నారాయణుడు వరమిచ్చెను. శివుడును సర్వదేవతలును సంతసించిరి. ఇట్లు దీపకుడు సదా అచంచలమైన గురుభక్తిని పొంది వేదధర్మునితోను కృతార్థుడయ్యెను.

కనుక, 'గురు' అను రెండక్షరములు 'అమృత సముద్రము' వంటివి. అందు మునిగిన వానిని తాపత్రయములు కూడ దహింపవు. గురువే సర్వులకు సర్వత్ర పూజ్యుడు.

శ్లో|| యస్య నాస్తి దృఢా భక్తిః స సదా క్లేశదైన్యభాక్ ।
శ్రీ గురుస్తస్యకిం కుర్యాత్సం శయావేష్టితస్యతు ॥

భా: ఎవనికి ఆ గురువు యందు దృఢమైన భక్తి లేదో వాడు ఎల్లప్పుడు దుఃఖములచే దీనుడై యుండును. సంశయముచే చుట్టబడిన వానిని గురువేమి చేయగలడు?

శ్లో|| నిస్సంశయం భజగురుం సోఽభీష్టం తే ప్రదాస్యతి ।
భజతోఽను భజత్యేష భక్తంనోపేక్షతే నిజం ॥

భా: సంశయ రహితుడవై గురువును భజింపుము. ఆయన నీ కోరికలను తీర్చును. గురువును భజించు నిజభక్తుని గురుడును సదా తలంచుచునే యుండును. గురువు నిజభక్తులను ఎప్పుడూ ఉపేక్షించడు.

శ్లో|| గురుర్నిరుపమో యస్య శిష్యః సంస్పర్శ మాత్రతః ।
మాయామయ ప్రపంచంతు పరం బ్రహ్మైవ పశ్యతి ॥

భా: ఏ గురుదేవుని హస్త స్పర్శ మాత్రమున యీ మాయామయ ప్రపంచమంతయూ పరబ్రహ్మరూపంగా దర్శనమిచ్చునో ఆ గురువు సాటిలేని వాడు.

శ్లో|| తస్మాత్త్వం సంశయం త్యక్త్వానిగమాగమ విశ్రుతం ।
చరణం శరణం గచ్ఛ కామధేనుం జగద్గురోః ॥

భా: అందుచే నీవు సంశయమును వీడి వేదవేదాంగముల యందు ప్రసిద్ధుడైన

గురుచరణములయందు శరణాగతుడవు కమ్ము. అతను జగద్గురువు, కామధేనువు.

శ్లో॥ గురులీలా కామధేనుర్వేద శాస్త్రమతాఽఽదృతా ।
లీలావిహారిణో మర్త్య రూపిణోఽరూపిణో విభోః ॥

భా: రూపము లేనివాడయ్యు, రూపం ధరించి లీలా విహారుడై లీలలు చేసిన గురువు కామధేనువు. **ఇది వేదశాస్త్ర సమ్మతము.** అని సిద్ధముని నామధారకునితో గురులీలలు, గురుమహిమలు వివరించెను.

అది విని నామధారకుడు సిద్ధమునితో నిట్లనెను. ఓ యోగీశ్వరా! మీరు చెప్పిన గురు లీలలు విని నాకు గురువుయందు గురి కలిగినది. కానీ, జగద్గురువు అన్నారే. వారెవరు? వారెట్లు ఈ భువిపై అవతరించిరని తెలిసికొన కోరిక కలదు. మీరే తెలుపుటకు సమర్థులు. కావున ఆ గురు పరంపరను వివరింపుడు. (శ్రీ దత్త గురు పరంపరను)

అందులకు సిద్ధముని, నామధారకుని గురుభక్తికి సంతసించి యిట్లు వివరించెను.

నాయనా నామధారకా! వినుము. ఇట్టి గురుచరితమును విన్నవారికి ఆయురారోగ్య, సౌఖ్య, ధనధాన్య సంపత్తులు, పుత్రపౌత్ర వేద వేదాంగ విద్యలు పొంది, అంతమున మోక్షపదమును లభించును. ఇది నిస్సంశయము.

సూర్యవంశమున జన్మించిన అంబరీషుని ఏకాదశీ వ్రతదీక్షను కాపాడుటలో శ్రీ మహావిష్ణువు దూర్వాసుని శాపమహాత్మ్యముతో ఈ భువి యందు అనేక అవతారములెత్తవలసి వచ్చెను.

అందు శ్రీగురుదత్తావతారమొకటి. ఈ అవతారము త్రిమూర్త్యవతారము. అత్రి మహాముని వంటివానికి తగు ధర్మపత్ని అనసూయ. ఆమె మహాపతివ్రతయని తెలిసి అసూయతో త్రిమూర్తుల భార్యలు ఆ త్రిమూర్తులను బలవంతము చేసి, ఆమె పాతివ్రత్యమును పరీక్షించుడని పంపిరి. వారు కాదనలేక అత్రిలేనితరి అనసూయను చేరి, పరీక్ష నెంచి, అతిథివేషధారులై భిక్షనర్థించిరి. అందులకు ఆమె సిద్ధపడగా, "ఓ సాధ్వీ నీవు మాకు నగ్నముగా అన్నము భుజింపజేయవలెను." అని ఆదేశించిరి. ఆమె ఆశ్చర్యపడినను, కాదనలేక, "అతిథులు తిరిగిపోయిన ఆ గృహము అరణ్యప్రాయమగును" అని, తన మనస్సు నిర్మలమొనర్చుకొని, భర్త పాదములను స్మరించుకొని, ఆ రీతిగనే భిక్షమిడుటకు సిద్ధపడెను. ఆమె పాతివ్రత్యమహిమతో నామువ్వురు పసిబాలులైరి. తాను యథేచ్ఛగా ఆ ముగ్గురికి అన్నము భుజింపజేసెను. ఆ తదుపరి, వారిని ఊయలలో పరుండబెట్టి, జోలపాటలు పాడుచుండెను.

అంతలో అత్రి మహాముని వచ్చి చూచి ఆశ్చర్యపడి, జరిగిన సంగతి గ్రహించి, "వీరు మన ఇంటి నోములపంటల"ని భార్యతో పలికెను. ఆమెయు మిక్కిలి సంతోషించెను.

కానీ! త్రిమూర్తీమణులు అదివిని తెలిసి, అనసూయా అత్రి మహామునిని చేరి, తామొనర్చిన తప్పిదమునకు క్షమార్హులము కామని, వానిని యధారీతిగా మాకప్పజెప్పుడని ప్రార్థించిరి అందులకు-

అట్టి త్రిమూర్తులను యధారీతిగా నొనర్చగా, వారు అనసూయా పాతివ్రత్యమునకు మిక్కిలి సంతసించి, వారిని(అత్రి అనసూయను) వరము కోరుమనిరి

అనసూయ **వారి ఆజ్ఞగా భర్తతోనిట్లు** విన్నవించెను స్వామీ! ప్రాణేశ్వరా! మీ మహిమతో వీరు మన**కింత వరకు సుతులుగా వె**లసిరి కావున వారినే మనకు సుతులగునటుల వరము కోరుడ"ని ప్రార్థించెను అత్రి అటులే కోరగా, ఆ ముగ్వురును వారి అట్టి సంతానేపేక్షకు సంతసించి, తథాస్తని దీవించి వెడలిరి

అట్లు త్రిమూర్తుల వర ప్రభావముతో ఆ పుణ్య దంపతులకు బ్రహ్మాంశగా చంద్రుడు, రుద్రాంశగా దూర్వాసుడుగను, విష్ణ్వాంశగా శ్రీ దత్తుడును ఉద్భవించిరి

వీరు లోకపూజితులుగా ఖ్యాతి చెందిరి

వారిలో చంద్రుడు, దూర్వాసుడును తీర్థయాత్రా దర్శనమునకై వెడలిరి వెళ్లుతూ మాతాపితరులతో నిట్లనిరి "మాతా! పితా! శ్రీ దత్తుడు త్రిమూర్త్యాత్మకుడు సందియం లేదు మిక్కిలి విష్ణ్వాంశ సంభూతుడు ఈ జగము విష్ణుమయం కావున మీ కోరిక వారే తీర్చగలదనిరి"

ఇట్లు శ్రీ దత్తుడు గృహమందే యుండి, తదుపరి గురుపరంపరకు శ్రేష్ఠమగు మూలపీఠాధిపతియై వెలసెను సహ్యాద్రి పర్వతమున నివసించి తన లీలలను ప్రదర్శించి, వారిని దర్శించనెంచిన వారినందరిని తరింపజేసెను "

నాయనా! నామధారకా! నరరూపమున అవతరించిన శ్రీదత్తగురు చరిత్రమును వింటివి కదా! ధన్యుడవు నీవని" సిద్ధముని పలుకగా-మరల నామధారకుడు మునీశ్వరునినిట్లు ప్రార్థించెను

స్వామీ! తదుపరి, శ్రీదత్త గురువు అవతారములీ భువియందు ఏ తీరున వర్ధిల్లెను దయయుంచి వివరింపుడు అని కోరగా ఆ మునీశ్వరుడు శిష్యుని తపనను గ్రహించి వారి అవతార పరంపరలు నిట్లు జెప్పదొడంగెను

## శ్రీ పాద శ్రీ వల్లభావతారం

పూర్వం పిఠాపురంలో "రాజశర్మ" అనే బ్రాహ్మణుడుండేవాడు అతడు వేదవేత్త, ధర్మశీలుడు ఆతని ధర్మపత్ని సుమతి ఆ దంపతులేనాడు తమ నిత్యానుష్ఠానాలు మానలేదు వారికి భగవద్భక్తిగా శ్రీ దత్తస్వామిపై భక్తి బాగా కుదిరింది అట్టి పుణ్యదంపతులకు కుమారుదు

కుంటి, మరొక కుమారుడు గ్రుడ్డి. ఇట్టి అగ్ని గుండాలని భరిస్తూండేవారు.

ఒక రోజున వారింట్లో తద్దినపు వంటలవుచుండగా, వాకిట్లోకొక యతి వచ్చి "భవతి భిక్షాందేహి" అన్నాడు. ఆ ధ్వని వినిన తోడనే ఆ ఇల్లాలు యతికి భిక్ష వేయుటకు వెళ్లింది. ఆమె కళ్లకెదురుగా శ్రీ దత్తస్వామి దివ్యతేజస్సులతో కనపడ్డాడు. ఆ స్వస్వరూపా సాక్షాత్కారంతో, ఆమె వారిక్కి పాదాభివందనమొనర్చింది.

శ్రీ స్వామి సంతోషించి ఆమెను వరం కోరుకోమన్నాడు. ఆమె తన పూర్వ సంతానం గూర్చి పలికి, స్వామీ! ఆ అనసూయమ్మ తల్లి నోచుకొనిన నోముఫలంగా, ఆమె నీవంటి మహనీయుని కన్నది. ప్రభూ! నన్ననుగ్రహించి నీలాంటి పుత్రుడిని ప్రసాదించు స్వామీ. అవగానే స్వామి సన్నగా నవ్వి తథాస్తని అంతర్ధానం అయ్యాడు

ఆ సంగతి భర్తతో చెప్పగా, అతడును సంతోషించెను. భార్య చర్యకును అభినందించాడు. శ్రాద్ధం గడిచింది.

సాక్షాత్తుగా శ్రీ దత్త స్వామియే వచ్చి భిక్ష స్వీకరిస్తే ముల్లోకాల తృప్తి ఫలంగా, కొద్దికాలానికే వారికొక పుత్రుడుదయించాడు. ఆ పసికందు పాదాల్లోని అద్భుత చిహ్నాలను బట్టి "శ్రీపాదుడ"ని పేరు పెట్టారు తల్లితండ్రులు. ఆ బాలుడు శుక్ల పక్ష చంద్రుడిగా యెదుగుతూండగా, ఏడవయేట బాలునకు ఉపనయనమొనర్చి, వేదాధ్యయనంలో నుంచిరి. గురువులాశ్చర్యపడునట్లు త్వరలోనే శ్రీపాదుడు చతుర్దశ విద్యలు నేర్చెను.

కానీ! శ్రీపాదునకు యుక్త వయస్సు రాగానే, తల్లిదండ్రులు పెళ్లిమాట యెత్తగానే నవ్వుచూ, వారి వ్యధను గ్రహించి, తన అన్నల వంక అలా చూచాడు. అంతే! వారిరువురు కుంటి, గ్రుడ్డిని కోల్పోయి, విద్యావివేకాలతో ప్రకాశించిరి. వారందరు బహు ఆనందపడిరి. ఇక తన విధిగా, శ్రీ దత్తప్రభు మాదిరిగా లోకోద్ధరణకై, వారందరి అనుమతి పొంది, తీర్థాటనకై బయలుదేరెను.

**దారిలో శ్రీపాదుడు** తనను సేవిస్తున్న భక్తులకనేకులకు యోగసిద్ధిని ప్రసాదిస్తూ, బదరికాశ్రమాన్ని దర్శించి, తుదకు గోకర్ణం చేరాడు అక్కడ మూడేళ్లుగా నుండి వేలాది భక్తులనుద్ధరించి, అటునుండి శ్రీశైలం చేరి నాలుగునెలలుండి, కృష్ణా తీరాన్ననుసరిస్తూ రాయచూరులో సమీప గ్రామం 'కురుగడ్డ'కు చేరాడు. అక్కడనేకులకు తన రక్షణ లీలలను ప్రదర్శించునపుడు, ఒక ముదుసలి విధవకు దున్నలాంటి కొడుకు, వారిరువురు ఆత్మహత్యకు పూనుకోవడం గని, వారిని వారించెను స్వామి కానీ, ఆ తల్లి తన కొడుకు శుద్ధ మొద్దు అగుటను తెలిపెను. నీలాంటి కొడుకు పుట్టాలి. ఇట్టి మొద్దు కుమారుడెందులకు నాయనా! యని విలపించెను. స్వామి అనుగ్రహించి, ఆ తల్లిని శనిప్రదోష వ్రతమాచరించుమని చెప్పగా ఆమెకు దుఃఖము పొంగి పొర్లెను.

స్వామి యుపదేశించినది భవిష్యత్తు సూచన. అయినను స్వామి గ్రహించి ఆమె ఆవేదనకు కరుణించి, ఆ మొద్దబ్బాయి నెత్తిన హస్తం మోపగా, ఆ యువకుడు తక్షణం చతుర్వేద మంత్రాలు ధారాపాతంగా పఠించసాగాడు. తల్లి నివ్వెరపోయింది. స్వామి పాదాలపై వ్రాలింది.

స్వామి, తల్లి కొడుకులిరువురిని ఇతోధికముగా దీవించి, శనిప్రదోష శివారాధన వ్రతపూజ మరచిపోవద్దని హెచ్చరించి పంపేశాడు.

ఇట్లు స్వామి అద్భుతాలన్నీ ప్రదర్శిస్తూ శ్రీపాద శ్రీవల్లభుడను పిలుపుతో సాక్షాద్విష్ణు స్వరూపుడిగా వెలుగొందెను. ఇప్పటికి సుమారు 550 సం॥ల పూర్వం మన ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురంలో శ్రీదత్తస్వామి శ్రీపాద వల్లభుడనే పేరుతో అవతరించి, కొన్నివేల మంది భక్తులను ముక్తికెక్కించెనని, అనేక గాథలు కలవు. అన్ని గాధలలో భక్త రక్షణయే శ్రీ దత్తస్వామి ధ్యేయమే కదా! అనునట్లున్నవి. భక్తోద్ధారణార్థమై ఆవిర్భవించిన త్రిమూర్త్యంశల ప్రభావమే శ్రీ దత్తాత్రేయ సద్గురు అవతారం.

శ్రీ దత్తాత్రేయ సంప్రదాయములో కలియుగానికి ముందు స్వామికి "యోగిరాజ, అత్రి వల్లభుడు, శ్రీ దత్తాత్రేయుడు, కాలాగ్నిశమనుడు, యోగిజన వల్లభుడు, శ్రీ లీలా విశ్వంభరుడు, సిద్ధిరాజు, జ్ఞానసాగరుడు, విశ్వంభరావధూతం, మాయాయుక్తావధూత, మాయాముక్తావధూత, ఆదిగురువు, శివస్వరూపుడు, శ్రీదేవదేవ, దిగంబరుడు, శ్రీకృష్ణ శ్యామ కమలనయనుడు" అను షోడశావతారాలున్నాయని పేర్కొంటారు.

## శ్రీ నృసింహ సరస్వతి అవతారం

శ్రీ దత్తస్వామి ఎత్తిన మరో అవతారం ఇది.

గతజన్మలో శనిప్రదోష శివారాధన వ్రతమాచరించి యున్న ఆ వృద్ధాంగన పునర్జన్మగా మహారాష్ట్రంలో 'కరంజ'మనే పట్టణంలో బ్రాహ్మణ పుత్రికగా జన్మనొందెను. ఆ పట్టణంలోనే నున్న "మాధవుడనే" విద్వాంసుడికిచ్చి వివాహమొనర్చెను తండ్రి ఆమెను.

కొంతకాలానికి వారిరువురికి తొలి సంతానంగా, శనిప్రదోష వ్రతమహిమగా, పురిటిలోనే పుట్టిన బాలుడు పురిటి గది దద్దరిల్లేటట్లు ప్రణవ(ఓంకార) నాదం చేస్తూ పుట్టెను. అందరికీ ఆశ్చర్యం కలిగెను.

ఆ పిల్లవాడికి "నరసింహుడ"ని పేరు పెట్టిరి. పిల్లవాడు పిన్న స్వరూపుడై, తన తల్లి పాలు తనకు సరిపోవడం లేకపోగా, తల్లి రొమ్ము స్పృశించెను. తల్లి పాలు గంగా ప్రవాహం లాగా రాగా, బాలుడాపాలను కడుపునిండా త్రాగుచుండెను. బాలుడు మూడేళ్లు వచ్చినా, మాటలు లేకపోగా ఏడ్చినా నవ్వినా, "ఓం" అని ధ్వనిస్తూండడంతో తన బాలుడికి

మాటలు రావని దిగులు చెందుయుండిరి. బాలుడికి ఏడేళ్లు రాగా, అందరికి ఆశ్చర్యం కలుగునట్లు ఒక ఇనుప ముక్కను బంగారపు కణికగా మార్చెను. ఇట్లు సర్వం బంగారు మయం కాగా!, ఆశ్చర్యపడి వారికి మతి పోయినంత పని కాగా! తేరుకుని బాలునినిట్లు ప్రశ్నించిరి.

బాబూ నీవెవరివి? మమ్ములనిట్లుద్ధరించి, మరి మాట్లాడవేమి? మేము ఏమి అపరాధనమొనర్చితిమి? అని పరిపరి విధాల వేడుకోసాగిరి కుమారుడిని.

అపుడా స్వామి సంజ్ఞలతో వారికి, తనకు ముందు ఉపనయనమొనర్చుమనీ, అపుడు తాను మాట్లాడుతాననీ చెప్పెను. తల్లి తండ్రులు ఆనందపడి బాలునకుపనయన మొనర్చుటకు సిద్ధపడిరి. మూగవానికేమి ఉపనయనమని ఊరివారంతా గేలి చేసిరి. ఉపనయనం జరిగెను.

తండ్రి బ్రహ్మోపదేశం చేసెను. వాడులోలోపల మంత్రం పఠించుకొనెనేమో, తల్లి భిక్షపెట్టుటకు రాగా పురోహితుడు మంత్రం చదివెను. అంతలో బాలుడే "భవతి భిక్షాం దేహి" అనెను. ఆవెంటనే ఘంటారావంగా ఋగ్వేద పనస "అగ్నిమీళే పురోహితం" అని, పలుకుచు చివరకు మరల "భవతి భిక్షాందేహి" అన్నాడు. తల్లి యంత్రంగాభిక్ష వడ్డించింది. అందరూ ఆశ్చర్యపడునట్లు యజుర్వేద పనస "ఇషేత్వా" అని, మరల "భవతి భిక్షాందేహి" అన్నాడు. ఇకమూడో సారి సామగానముగా "అగ్న ఆయాహి" అనుమంత్రం పఠిస్తూ, మరల "భవతి భిక్షాందేహి" అన్నాడు. ఆ వేదగాన ప్రవాహమునకు తల్లి దండ్రుల ఆనందానికి అవధులు లేవు.

అట్లు తల్లి తదుపరి అందరి దగ్గర భిక్షకోరి, ఇక నివృత్తి మార్గాన్ని చేబడుతానని తల్లి దండ్రుల అనుమతి కోరెను. వారు పుత్రవాత్సల్యంతో విలవిలలాడిరి. వారినెట్లో ఓదార్చి శాంతింపజేసి, ఇట్లా అన్నాడు.

**అమ్మా! క్రిందటి జన్మ**లో నీవు శని ప్రదోష శివార్చన చేశావు. కనుక నేను నీకు **పుత్రుడనయ్యాను. అని తల్లి** శిరస్సును స్పృశించగా, ఆమె గతజన్మను గ్రహించెను. కళ్ళు మూసి తెరిచేలోపు, తన ముద్దు బిడ్డ శ్రీపాదవల్లభాకృతిలో దర్శనమొనర్చెను. ఆమె భక్తిపూర్ణమై శ్రీస్వామి పాదాలపై వ్రాలెను. స్వామి వెంటనే తన బాలరూపం జూపెను.

ఆమె పుత్రవాత్సల్యమున కనుగుణముగా ఆమెకింకా నలుగురు పుత్రులను ప్రసాదించెను. వారిలో ఇద్దరు పుత్రులు కవలలు జన్మించేదాక, ఆగి, మరల తనకు అనుమతి యిమ్మని కోరెను. వారును కాదనలేకపోయిరి. వారు స్మరించినంత మాత్రాన దర్శన మిస్తానని పలికి, యిక తీర్థాటనంగా బయలుదేరెను.

శ్రీస్వామి వెంబడి అనేక ఉద్దండ పండితులును శిష్యులుగా వెంట తిరుగసాగిరి. మరియు అనేక యోగ సాధకులును స్వామి నరసింహుడిని ఆశ్రయించిరి. కొంత దూరం వెళ్ళాక, అందరిని వెనుకకు పంపి, స్వామి ముందుకు సాగాడు. తన సంకల్పబలంతో కాశీ మహాక్షేత్రం చేరెను.

అచటి యతీశ్వరులంతా యీ బాలస్వామిని చూచి వారి అంతరాత్మంలోనే స్వామికి భక్తులైరి. వారిలో కల్లా వృద్ధుడు, జ్ఞాని, శ్రేష్ఠుడు అయిన "కృష్ణ సరస్వతి" అనే యతీశ్వరుడు శ్రీస్వామిని యత్యాశ్రమాన్ని స్వీకరించమని ప్రార్థించిరి. స్వామి తలంపు కూడా అదే అన్నట్లు సరే అనెను. పది సంవత్సరాల వయస్సు స్వామికి, వంద ఏళ్ళువయస్సుగల వృద్ధుడు కృష్ణ సరస్వతీ యతీశ్వరుడు శిష్యుడయ్యెను. కానీ; శ్రీస్వామి లోకాన్ననుసరించి, తాను కృష్ణ సరస్వతికి శిష్యుడై సన్యాశ్రమం స్వీకరించాడు. అందులకు కృష్ణ సరస్వతి శ్రీస్వామికి, "శ్రీ నృసింహ సరస్వతీ" అని యోగపట్టం యిచ్చాడు గురువుగా.

శ్రీస్వామి అనతికాలంలోనే "అపర శంకరుడని" కీర్తింప పడ్డాడు. కాశీ నుండి బదరికాశ్రమం చేరి, అచట నున్న మేరు పర్వతమునకు ప్రదక్షిణం చేసి, ప్రయాగకు చేరాడు.

ప్రయాగలో శ్రీస్వామి ద్వారా అనేకులు సన్యాసయోగ దీక్షలను పొందిరి. వారిలో బాల సరస్వతి, కృష్ణసరస్వతి, ఉపేంద్ర సరస్వతి, మాధవ సరస్వతి, సదానంద సరస్వతి, జ్ఞాన జ్యోతి సరస్వతి మొదలైనవారు ముఖ్యులు.

కొంతకాలానికి తిరిగి తన స్వగ్రామం 'కరంజ'కు చేరుకొన్నాడు. తల్లి దండ్రులను దర్శించాడు శ్రీస్వామి. అచట అనేక లీలలు జూపి, అచటి నుండి వైద్యేశ్వరక్షేత్రాన్ని చేరి, అచట కొంతకాలం రహస్యంగా నుండి, అచటను నొక మందబుద్ధి గలవానిని, మహాపండితునిగా నొనర్చెను. ఒక సాధు గృహస్థునకు మహానిధి నిప్పించెను. గురుపరాఙ్ముఖుడైన మరో సాధకుణ్ణి సరిదిద్దెను శ్రీస్వామి.

అట నుండి అమరేశ్వరం చేరి, పంచతీర్థ సంగమంలో ఔదుంబరవృక్షం క్రింద కొంతకాలం రహస్యంగా నివసించెను. అచటను భక్తులైన ఆరుగురు యోగినులు శ్రీస్వామిని అంతరంగంలో అర్చించేవారు. వారినీ అనుగ్రహించి, మరికొందరిని పిశాచాన్నుంచి దూర మొనర్చి సంతానమను గ్రహించి, ఆ బిడ్డ జబ్బు చేసి గతించిన, శ్రీ స్వామి ఆ బాలుని పునర్జీవునొనర్చెను.

అచట నుండి శ్రీస్వామి బయలు దేరి, భీమా, అమరజానదీ సంగమంలో నున్న గంధర్వపురంలో నున్న గుప్తయోగుల నుద్ధరించెను. ఇట్లనేక మహిమలను జూచిన ఆ నగర రాజు కూడ స్వామికి శిష్యుడయ్యెను. స్వామికొక మఠం కట్టించి అందుండమని

అర్థించగా స్వామి సరేనని, యుండి అనేకుల భక్తులనుద్ధరించి, తుదుకు శ్రీశైలం చేరి, కృష్ణా నదిలో పూల పడవ ప్రయాణంతో అంతర్ధానమయ్యెను.

## - జయగురుదత్త -

"అహంకారం" అనునది ఎంతటి మహానీయునికినీ తగదు. నేను స్వామి (భగవద్భక్తుణ్ణి) అని చాటుకోండి, అట్టి అహంకారం పొందకండి. అదేమీ శాశ్వత జీవనానికి మార్గదర్శకం.

ఒకప్పుడు శ్రీనృసింహ సరస్వతీ స్వామి వారు గాణ్గాపురంలో మకాంపెట్టిన కొత్తల్లో, అక్కడికి దగ్గరలోనున్న "కుమసీ" గ్రామంలో నుండే "త్రివిక్రమ భారతి" అనే యతి ఉండేవాడు. ఇతడు గొప్పదీక్షాపరుడు నైష్ఠికుడు, నరసింహోపాసకుడు. అయితే కాస్త కోపిష్టి.

ఆ కోపమే శ్రీ నరసింహ సరస్వతీ స్వామిపై యుండేది. ఏమని? "ఇతడు (నృసింహ సరస్వతీ స్వామి) యతి కదా! మరి యతి ఏకాకిగా నుండాలి కదా! కాని యితడు పది మందిని చుట్టూతా చేర్చుకుంటూ పటాటోపంగానుంటాడ"ని, త్రివిక్రమ భారతీ స్వామి వారికి సహజ స్వభావంగా నుండేది. దానికి తోడు ఇతడు దివ్యమహత్తులను కురిపిస్తున్న శ్రీ నృసింహ సరస్వతీ స్వామిపై విశృంఖలంగా విమర్శలు గుప్పిస్తూ వుంటే, అట్టివీ త్వరలోనే శ్రీ నృసింహ సరస్వతీ స్వామివారి చెవికి సోకనవి.

ఆ సంగతేమిటో, తెల్సుకుందామని శ్రీ నృసింహ సరస్వతీ వారు సపరివారంగా "కుమసీ" గ్రామానికి బయలుదేరాడు. ఇలా ఇతడు చేరువగు సరికి, త్రివిక్రమ భారతీ స్వామి వారికి మనస్సులోనేదో చెప్పరాని ఆందోళన కలుగసాగింది. ఏది జపించిన శ్రీనృసింహ స్వామి వారే దర్శనమిచ్చివారే పలుకుతున్నట్లనిపించి, ఏమిటి చిత్రమని? తానేమైనా పొరపాటు పడ్డానా? అని అంతర్మథనం పడ్డాడు.

అంతే, ఆ అంతర్మథనంలోనే అన్ని విధాల తర్కించుకొని, శ్రీ నృసింహ సరస్వతీ స్వామి వారిపట్ల తానూహించిన తప్పిదమే, తనకింత మనో వేదనకు కారణమైనదని ఊహించెను. శ్రీ నృసింహ సరస్వతీ స్వామి వారే, అతని అంతరంగాని కొక సూక్తి అందించెను

శ్లో॥ వనాద్వనంధావసి శాంతి సిద్ధ్యై నపాదమూలం తు గురోః ప్రయాసి ।
కిం మూఢ వేణీ బహుధా భ్రమంతీ శాంతిం సమే వృత్యనవాప్య సింధుమ్॥

భా: శాంతికోసం ఒక అడవినుంచి యింకొక అడవికి పరుగులు తీస్తున్నావే గానీ,
సద్గురు పాదాలను మాత్రం ఆశ్రయించటం లేదు. ఓయీ! తెలివి తక్కువవాడా!

నది ఎన్నిరకాలుగా పరుగు లెత్తినా సముద్రాన్ని చేరకుండా శాంతిని అందుకో గలదా! అని తాత్పర్యం.

నీవంటి ఉపాసనాదశలో నున్నవారికీ సూక్తి బహు గంభీరమైంది. నది కొండలను దాటి, కోనలను అధిగమించి ఉప్పొంగుచు ప్రవహించుచూ, సముద్రమునకు చేరువగు సరికి, తన నడక (ప్రవాహం)లో ఉద్రేకం తగ్గి, ప్రశాంతత పొంది, తనంతట తానుగా తన ఉద్రేకం తగ్గించు కొనుచు, దైవాన్వేషణకై పరితపించడం మొదలిడుతాడు. అదే అదృష్ట భాగ్యం కలిసివచ్చినట్లై, తనకుపదేశించు గురువు చేరువవుతున్నట్లు, అంత శాంత్యనుభూతిలోకి వస్తాడు.

నిజమే సాధకుడు గురువు చేరువగు సరికి, గురుదర్శన భాగ్యముకై, గురుతత్త్వ బోధనకై తపిస్తాడు. నది, సముద్రముతో నైక్యమగుసరికి తానే సముద్రమగు నట్లు, సర్వం జలతత్త్వంగా, అటులే గురువు, శిష్యుని ఉద్ధరించు నిమిత్తమై చేరువగు సరికి, శిష్యుడే గురువై, భగవతత్త్వమే శాంతి రూపముగా నిలిచి, అట్టిది గురువులో లీనమైన శిష్యుడికే శాంతి లభిస్తుంది. విజ్ఞాన జ్యోతి వెలిగి, అతనిలో (శిష్యుని)లో అంధకారం తొలగి, ఆత్మ పరిశోధనకు దారితీస్తుంది.

అట్టిదే! త్రివిక్రమా! నీలోని అహంకారం తొలగినది కనుకనే, భ్రమ కూడ తొలగి, సర్వం భగవన్మయంగా తోచినది. నేనిలా చేరువగుసరికి, నీమనస్సు వెన్నెలా లాగా వెల్లనై, చల్లనై నీ అంతరంగమగు మనస్సు సద్గురువు పాదాలపై వాలింది ఆ క్షణంలోనే నీకు గురుతత్త్వము సుస్థిరమైపోగా, గుర్వైక్యం చెందితివి. అందులకే నీలో నున్న మనో వేదన, ఆందోళన తగ్గి, అంతరంగ పరిపూర్ణానందమై, ఇక యెప్పుడూ ఆందోళనలకు తావులేకుండా శాశ్వత సుస్థిర ప్రశాంతి నొందితివి.

అని, త్రివిక్రముని అంతరంగమందు శ్రీనృసింహ సరస్వతీ స్వామివారు ప్రబోధించిరి.

ఈ సంఘటన, సద్గురు ప్రాప్తినిపొందు సంఘటనగా సర్వుల హృదయాల్లో శాశ్వతంగా సుస్థిరమై విలసిల్లు గాక!

## జయ గురుదత్త శ్రీ గురుదత్త

### గురు - సూత్రం

గురుకృపకు పాత్రుడైన వానికి దైన్యముండదు.

ఇహపర సౌఖ్యములుండును. ఇది సత్యము.

# 23. జ్ఞానయోగ వాశిష్టము

వశిష్ట ప్రోక్త జ్ఞానయోగవాశిష్టము అనునదియొక సద్గురూపదేశ బృహద్గ్రంథము వేదాంత విజ్ఞానం బ్రహ్మ విద్యను గూర్చి బోధించు ఉత్తమ తత్వశాస్త్ర గ్రంధము వాల్మీకి మహాకవిచే విరచింపబడిన శ్రీమద్రామాయణము నందున్న శ్రీరామ-వశిష్ట సంవాద రూపమగు యీ "యోగవాశిష్టము" సంగ్రహరూప గ్రంధము

"నాన్యః పంధా విద్యతే஽యనాయ" అను వేదాంత వాక్యానుసారంగా, అనాదియగు "అవిద్య"ను జీవుని నుండి పారద్రోలుటకు జ్ఞానయోగ మార్గమొక్కటే సాధనము అదియును సద్గురూపదేశంతోనే తగు యదార్ధ విజ్ఞానం పొందుటలో పూర్వ విషయ వాసనలు దూరమగును దానితో అధ్యాత్మ విజ్ఞానం పెంపొంది పరమాత్మ విచారణకు దోహదమగును గురు కృపా విశేషంతో జీవునిలో స్వార్ధము నశించి, పరమాత్మ యెడల నిష్కామ భక్తి నిలిచి పరతత్త్వమును నిలుచును

ఏదియేమైన అధ్యాత్మ విద్యాప్రాశస్త్యము పొందుటకు గురూపదేశముతో బాటు పురుష ప్రయత్నమును అత్యావశ్యకము అందులకు శమదమాది సంపత్తి, సాధు సాంగత్యం, సంతృప్తి, చిత్త నైర్మల్యం, మనో ఏకాగ్రత అత్యంతావశ్యకములు వాటితో జీవుడు యీ లోకమందు పలుమార్లు జన్మించి జ్ఞాన సముపార్జనతో జన్మ సార్ధకతను పొంది పునర్జన్మ రహితుడగును అనగా మోక్షమును పొందును

కావున జీవుడు ప్రతి జన్మమందు సంసారపరమగు లౌకిక కర్మలను, శాస్త్రవిహిత కర్మలనాచరించు చుండినను జన్మరాహిత్యమగు మోక్షమును పొందలేకున్నాడు దానికి కారణం అహంకారం తాను ఈశ్వరాంశయై యుండినను, ఈశ్వరుని గుర్తించలేకపోవటమే సత్వరజోస్తమో గుణములకు దాసుడై మాయాజీవిగా జీవనం సాగించడమే ధ్యేయంగా జీవిస్తున్నాడు

ఈ త్రిగుణములకు అతీతమైన భావములుకల వాడే మోక్ష మార్గమును అన్వేషించుటకు యోగ్యుడగును ఈశ్వర సాన్నిధ్యం పొందుటకర్హుడగును మోక్షమార్గ అభిలాషిగా ఆత్మజ్ఞానం పొంది తన జీవాత్మను పరమాత్మతో సంయోగమొనర్చి ఆ పరమాత్మలోనే లమయమగును జీవుని ధ్యేయం ధన్యమగును కదా!

ఇట్లుండ జీవుడు ఆత్మజ్ఞానుడై యుండినను, జీవించినంత కాలం స్వధర్మమును వీడరాదు కేవలం వైరాగ్యమునందే జీవనవ్యయమొనర్చినచో జన్మ సాఫల్యం కాదు ముక్తిమార్గమంతకన్న కాదు

అట్టిదే, మానవ మాతృనిగా అవతరించిన శ్రీరామునకును జ్ఞానోపదేశ మొనర్చ అవసరమయ్యెను. అదియే జ్ఞానయోగ వాశిష్ఠము.

త్రేతాయుగమున శ్రీమహావిష్ణువు దుష్టశిక్షణార్థమై దశరథుని పుత్రుడుగా అవతరించెను. ఆదికవియగు వాల్మీకి మహర్షి నారదోపదేశముతో దశరథుని కాలమందే మహాత్కావ్యమగు శ్రీమద్రామాయణమును రచించెను.

ఒకనాడు దశరథుని నిండు సభలో నున్న భరద్వాజాది మహర్షులెల్లరు గూడి ఆత్మ జ్ఞానమును గూర్చి మహర్షి వాల్మీకిని ప్రశ్నించిరి. అతడు అఖండమగు రామాయణ ప్రవచనమును విని' ంచుచు, ఇదియే ముక్తిదాయకమని తెలుపుచు దానిలో వశిష్ఠుడు శ్రీరామచంద్రునకు ఉపదేశించిన "జ్ఞానయోగ వాశిష్ఠము" మిక్కిలి మోక్షదాయకమని వాల్మీకి పలికెను.

ఇట్లుండ, దశరథతనయుడు శ్రీరామచంద్రుడు పదునాలుగేండ్ల ప్రాయమందు సకల విద్యలనభ్యసించి, యువరాజుగా పట్టాభిషిక్తుడగుటకు యోగ్యుడయ్యెను. కాని, శ్రీరామచంద్రునకు వైరాగ్యముదయించి, ఈ దృశ్య జగత్తంతయు మిథ్యయనియు తత్త్వజ్ఞానము పొందుటచే మాత్రము మనస్సునకు శాంతి కలుగుననియు అట్టి జ్ఞానములేని మనుష్యులు నిత్యులమని నమ్మి సత్యవస్తువును వీడియున్నారని భావించి విచారముతో నుండెను. అనగా వైరాగ్య చింతనాపరుడై యుండెను.

అట్టి యెడ కొలువునందున్న ఇనకుల గురువగు వశిష్ఠుడు శ్రీరామచంద్రునికి సుదీర్ఘమైన తత్త్వజ్ఞాన ముపదేశించి కర్తవ్యోన్ముఖునిగ జేసెను. అదియే జ్ఞానయోగ వాశిష్ఠము.

బ్రహ్మమానస పుత్రుడైన వశిష్ఠ మహర్షి మహాజ్ఞాని. తపశ్శాలియు. బ్రహ్మర్షియై యుండి దశరథునకును కులగురువై కొనసాగుచు, దశరథ పుత్రులగు శ్రీరామచంద్రాదులకు సకల శాస్త్రవిద్యాదులను నేర్పెను. అటులే విశ్వామిత్రుడను మహారాజు వశిష్ఠ మహర్షికి ఆకర్షితుడై మహాతప మొనర్చి తుదకు వశిష్ఠుని మెప్పించి బ్రహ్మర్షిగా ఖ్యాతిపొందెను. వారిరువురిలో నున్న వైరము వీడెను, వారిరువురును నిషధ పర్వతముపై సాటి మహర్షుల శ్రేయస్సు కోరినవారై బ్రహ్మను గూర్చి మహాతప మొనర్చిరి. బ్రహ్మ బ్రహ్మానందమొంది వారికి ప్రత్యక్షమై ఆత్మజ్ఞానము ప్రభోధించెను. అట్టి ఆత్మ జ్ఞానమును వశిష్ఠ మహర్షి శ్రీరామచంద్రునకు ఉపదేశించెను. ఆ ప్రబోధయే వశిష్ఠ – రామ సంవాద రూపము.

మోక్షాభిలాషులకు, ఆత్మజ్ఞానమును పొందగోరు వారికి ఉపకరించు ఈ "జ్ఞాన యోగ వాశిష్ఠము" మరువరానిది. విలువ కట్టలేనిదియును.

తపస్సంపన్నులగు ఋషులు మహర్షులుగా పేరొంది త్రికాలజ్ఞులుగా, వారికి

జరుగబోవు విషయములు స్పష్టముగా తెలియును. తాము పొందిన సద్బోధలను తిరిగి మరొక మహనీయులకు బోధించుటకు యత్నించుదురు. అటులే, విష్ణువు మానవునిగా నవతరించినను పూర్వ వాసనలుగానీ తనలో తీర్థయాత్రల ఫలితంగా సంపూర్ణ వైరాగ్యము నాటుకొని యుండెను. దానితో ఎప్పుడూ ఏదో తపనతో గోడపై నిలిచిన బొమ్మవలె యుండెడివాడు.

అట్టితరి విశ్వామిత్రుని ఆగమనంతో తాను యాగదీక్షలోనున్న కారణాన, ఆయాగ సంరక్షణార్థమై దశరథుని రామలక్ష్మణులను తన వెంట పంపుమని అభిలషించెను. కాని దశరథుని పుత్రవాత్సల్య వాక్యములకు వశిష్ఠుడు దశరథుని ఓదార్చి విశ్వామిత్రుని వెంట పంపుటకు సమ్మతింపజేసెను.

అటులే శ్రీరాముని రాకతో అతనిలో కలిగిన వైరాగ్య స్థితిని విశ్వామిత్రుడు, వశిష్ఠుడును గ్రహించిరి. శ్రీరామునిలో లేని పరితాపము, లక్ష్మీ నిరాకరణము, జీవిత విరక్తి, అహంకార నివృత్తి, మనో నింద, తృష్ణా నింద, దేహనింద, జీవనంపై ప్రకృతిపై, దైవ దుర్విలాసము, అనిత్యముపై వైరాగ్యము మొదలగు వాటిపై మనస్సు నిలుపుకుని యుండడం. ఇదియొక తత్త్వచింతనయని సంతోషించిరి. శ్రీరామచంద్రుడు సూక్ష్మబుద్ధి కలవాడుగా, సహజమైన నిర్మలమైన విషయాన్ని గ్రహించియున్నాడని తెలిసి, అతనికి శుకమహర్షి తత్త్వవృత్తాంతమును ఉదాహరణగా గైకొని, ఆ శుకునినెట్లు ధర్మ కార్యోన్ముఖుని గావించినట్లు శ్రీరామునిని కూడ నట్లే కార్యోన్ముఖుని గావించవచ్చునని తలంచిరి అచటనున్న మహర్షులెల్లరు.

శ్రీరాముడు తండ్రి యాజ్ఞగా తండ్రియు మహర్షులును నున్న సభకేతెంచి సర్వులకును వినయపూర్వక నమస్కారములు సమర్పించెను. ఆ శ్రీరాముని వినయ విధేయతలకు అందరు మిక్కిలి సంతసించిరి. అందరి ఆశీస్సులు శ్రీరాముడు పొందెను.

మొదట విశ్వామిత్రుని ఆగమనము గూర్చి దశరథుడు శ్రీరామునితో ప్రస్తావించెను. విశ్వామిత్రుడును తన రాకను గూర్చి వివరించెను. అందులకు వశిష్ఠుడును బలపరచెను. కాని శ్రీరాముడు మౌనమును వీడలేదు. అందులకు మొదట శ్రీరామునిలోని తాత్త్విక చింతనకు తెరవేయవలెనని దశరథుడు తొలుత యత్నించెను. తదుపరి విశ్వామిత్రుడు, వశిష్ఠుడును యత్నింప, ఆముగ్గురి మాటలను విన్న తదుపరి, శ్రీరాముడు తనలోనేర్పడిన పరితాపము నెరవేరినట్లేయని తలంచి, మొదట అనగా పూర్వమొక దివసమున వాల్మీకి మహర్షి నుండి పొందిన తత్త్వజ్ఞానంలోని మరికొంత విశేషమును వీర్ని నుండి పొందనిచ్చగలవాడై తొలుత విశ్వామిత్రునకు నమస్కరిస్తూ ఇట్లు ప్రశ్నించ ప్రారంభించెను.

మహాత్మా! లోకంలో పుట్టుట చచ్చుటనునది ఏమి? పుట్టిన మానవులు

సంసారములో పొందిన సుఖదుఃఖములకు కారణమేమి? సంపదలు ఎంతవరకు మానవుని సుఖింపజేయును? అవి నిత్యములా! కావుగదా! అయినా వాటికొరకై పరిపూర్ణాయుర్దాయము లేని ఈ జీవుడు ఎందులకు పొందుటకు యత్నించుచున్నాడు? ఎందుకనగా ఆయుర్దాయం చిగురుటాకు చివరనున్న మంచు బిందువులవలె అస్థిరమైనది కదా? అయిననూ జీవుడు జీవమున్నంత వరకు అహంకార మమకారములకు లోనగుచు సుఖదుఃఖముల మిళితములచే తుదకు, పొందదగిన శాశ్వత నిత్య పరిపూర్ణానందమును పొందలేక గిట్టుచు మరల పునర్జన్మకు పాత్రుడగుచున్నాడు. అట్టివానికి లోకకర్మలు నెరవేర్చుటలో ఉత్సుకత చూపుటెందులకు?

అను వైరాగ్య సంబంధమైన ప్రశ్నలు వేయదొడగెను. విశ్వామిత్రుడు విని, శ్రీరాముని తత్త్వజ్ఞాన సందేహములకు మిక్కిలి సంతసించి, జ్ఞానవైరాగ్యం వల్ల కలిగిన పరితాపం కాని అజ్ఞానం కాదని, తమ బోధవల్ల శ్రీరాముడు ఉన్నతమైన ఉత్తమ పురుషుడౌతాడని తలంచి, ఈ సమయమే తగుబోధనొనర్చుటకు తరుణమని విశ్వామిత్రుడు ప్రారంభించెను.

మొదట, వ్యాసుని కుమారుడైన శుకమహర్షికినిట్లే వైరాగ్య చింతన అంకురించగా, తొలుత తండ్రి, తదుపరి జనకమహర్షి బోధనతో నతడు కార్యోన్ముఖుడయ్యెనని, శుకుని వృత్తాంతము తెలిపెను.

మరల విశ్వామిత్రుడిట్లు పలికెను-

రామచంద్రా! శుకుడట్లు జనకుని చేత ఆత్మవస్తువునెరింగి విశ్రాంతినొందెను. నీవును యొకింత బోధనొందిన అనగా జ్ఞానవివరణ పొందిన అది నీకు కూడ విశ్రాంతి పొందింపజేయును. నీలోని సందేహములు తీరును. దానితోనిక కార్యోన్ముఖుడవగుదువు. ఇంతకు మించి నీవు గ్రహించవలసినది ప్రత్యేకముగా ఏమీలేదు. అనెను.

సభ్యులనుద్దేశించి విశ్వామిత్రుడు, సభ్యులారా! రామచంద్రుడు జ్ఞేయమగు ఆత్మస్వరూపుడై యుండెను. దానితో భోగములు సంసారబంధములని యెరింగి వాటిపై రుచి నశించినది. ఇదే మహోన్నతమైన జ్ఞానమే "బ్రహ్మము". మోక్షమునకు మార్గము. అయినను పరిపూర్ణమైన చిత్త శాంతి కల్గుటకు వారి కులగురువైన వశిష్ఠ మహర్షి ఉపదేశముతో రాముడు నిర్మల చిత్తుడగును. అని వశిష్ఠ మహర్షిని చూచి ఇట్లనును.

మహర్షీ! మీరు రఘుకుల రాజులందరకును కుల గురువువు. సర్వజ్ఞుడవు. త్రికాలజ్ఞుడవు. నిర్మలమనస్కుడవు. కావున మీరు ఈ రామచంద్రునకు మనము పూర్వము బ్రహ్మ ఉపదేశించిన జ్ఞానబోధను బోధించుడు. నిర్మల చిత్తమనస్కుడైన రామచంద్రునకు మీబోధ చక్కగా ప్రవేశించును. మీ ఉపదేశము వ్యర్థము గాదు. అని విశ్వామిత్రుడు పల్కిన విధమును, వశిష్ఠుడు శ్రీరామచంద్రునికి ఉపదేశించిన బోధను "వాల్మీకి మహర్షి" తనతోనున్న

"భరద్వాజు"నితో సహా, తన వద్దకు చేరిన అరిష్టనేమి రాజునకు చెప్పిన విధము యిది-

సుతీక్షుణుడనే బ్రాహ్మణునకు అగస్త్యమహాముని "కర్మ,జ్ఞానము"ల గూర్చి బోధించుటలో అతనికీ కథ బోధించెను.

ఓ బ్రాహ్మణుడా! పూర్వము "అగ్నివేశ్యుడనే" బ్రాహ్మణునకు "కారుణ్యుడ"నే కొమరునకును "కర్మజ్ఞానముల" గూర్చి చెప్పడంలో యీ కథ చెప్పతొడంగెను.

పూర్వము "సురుచి" అనే అప్సరసస్త్రీ మహేంద్రుని ఆదేశముతో గంధమాదన పర్వతముపై ఘోర తపస్సొనర్చు అరిష్టనేమి రాజును చేరి, స్వర్గలోక జీవన వృత్తాంతము గూర్చి వివరిస్తుంది. ఆ వృత్తాంతము విన్న అరాజు ఈ లాంటి స్వర్గము అక్కరలేదని చెప్పి తిరిగి తపస్సొనర్చుటకు పూనుకొనగా, దేవేంద్రుని ఆజ్ఞగా తానొచ్చిన విమానంలో అరిష్ట నేమిరాజును వాల్మీకి ఆశ్రమానికి చేర్చాడు. మహేంద్రుని మాటగా ఈ రాజునకు తత్త్వోపదేశ మొనర్చమని 'సురుచి' వాల్మీకిని కోరి తిరిగి దేవేంద్రునిలోకం చేరినది.

ఇట్లు అరిష్టనేమి వాల్మీకి ఆశ్రమానికి చేరిన తోడనే మహర్షికి నమస్కరించి ఇట్లనెను -

"మహర్షీ! నాకు యీసంసార విముక్తిని పొందు మోక్షోపాయమార్గము చూపుదని" కోరెను.

వాల్మీకియు, మహారాజును కుశల ప్రశ్నలడిగి "మోక్షోపాయం పొందు, వాశిష్ఠ రామాయణ కథ వారి సంవాదం గూర్చి చెబుతావిను" అని శ్రీరామునకు నీవలెనే సంసార యాతనల విముక్తి పొందుటకు యిచ్చ గలిగి యుండెను. దానితో తన స్వధర్మ కర్మానుష్ఠానమును వీడియుండెను. అట్టి శ్రీరామునకు వారి కుల గురువైన వశిష్ఠుడు బోధించిన తత్త్వజ్ఞానోపదేశము గూర్చి జరిగిన సంవాదము వినుమ"ని చెప్పుచూ శ్రీమహావిష్ణువు సనత్కుమారుని, శాపంతో అజ్ఞానం సంభవించిన విధమును, భృగుపత్ని, బృంద, దేవశర్మల శాపంతో మానవునిగా దశరథుని జ్యేష్ఠ కుమారుని అవతారమెత్తిన శ్రీరాముని పరితాపమిదియని యిట్లు చెప్పుదొడంగెను.

మహరాజా! శ్రీమద్రామాయణమును పఠించిన అనంతరం, యీవశిష్ఠ గీతను పఠించిన పునర్జన్మ లేదని చెప్పుచూ భరద్వాజుని నుద్దేశించియు, చెప్పుచూ, ఉత్తమ జ్ఞానము సముపార్జించు. ఈ జ్ఞాన యోగ వాశిష్ఠమునందు ఆత్మ తత్త్వము నెరుంగు వాస్తవ స్వరూపము బోధింపబడియున్నది. అట్టి బోధను వినిన శ్రీరామచంద్రుడు వంటి ధన్యులు 'నభూతో నభవిష్యతి".

ఇట్లు, ఒకరి వలన మరొకరుగా, ధర్మ సందేహములను తీర్చుకొనుటలో "వాశిష్ఠ

రామాయణం" కొనసాగిన సంవాదరూపకమిది.

వశిష్ఠుడు శ్రీరామునకు మొదట "పురుష ప్రయత్నము"ను గూర్చి వివరించుచూ శమ, దమ, విచార, సంతోష, సత్సాంగత్య నిరూపణమును వివరించెను.

అటుపిదప పరమార్థ వివరణతో పూర్వపు మహనీయులు తత్త్వగాథలను గూర్చి ఒకొక ప్రకరణములుగానిట్లు చెప్పదొడంగెను

## ఉత్పత్తి ప్రకరణము

1. వశిష్ఠుడిట్లు పలికెను. శ్రీరామచంద్రా! పూర్వము 'పద్మజుడను' రాజు యొక్క భార్య 'లీల'యను వనిత శీలవతిగా నుండి నిత్యం సరస్వతీదేవిని అర్చించి మోక్షోపాయం గూర్చి తెలుసుకొని ఆచరించి ధన్యురాలయ్యెను.

2. అటుపిదప శ్రీరామచంద్రా! పూర్వము హిమవత్పర్వతపు ఉత్తరాన 'కర్కటి' యనునొకరక్కసి ఘోరతపస్సొనర్చి బ్రహ్మను మెప్పించి "సూదిగ" నగునట్లు వరము పొంది, బహుక్రూర కార్యములొనర్చుచు తుదకు విరక్తిచే మరల బ్రహ్మను గూర్చి తపస్సొనర్చి మెప్పించి ఉత్తమ గుణస్త్రీ రూపము పొందునట్లు వరము పొందెను.

3. శ్రీరామచంద్రా! నేను బ్రహ్మవలన వినిన ఆదిత్యుడు పల్కిన ఐందవోపాఖ్యానం గూర్చి చెప్పెదవినుడు.

'ఇందుడ'ను విప్రునకు సంతానము లేకపోగా, తాను తన భార్య సంతానార్థమై శివుని అనుగ్రహంతో పదుగురు పుత్రులను పొంది, కొంత కాలము తదుపరి ఆ యిరువురు స్వర్గస్థులైరి. ఆ పదుగురు ఎట్లో పెరిగి పెద్దవారై తమలో తాము బ్రహ్మత్వమును సంపాదించుకొని తపస్సొనర్చి ఆ పదుగురును బ్రహ్మలైరి. అందులో తానొకడని ఆదిత్యుడు పల్కిన విధము గూర్చి బ్రహ్మ చెప్పినది ఇది. అనెను.

4. తదుపరి వశిష్ఠుడు శ్రీరామచంద్రునకు చిత్త – చికిత్సా విధానంతో దృశ్యదోష వస్తు పరిహారము గూర్చి వివరించెను.

## స్థితి ప్రకరణము

1. వశిష్ఠుడిట్లు చెప్పదొడంగెను. శ్రీరామచంద్రా మనస్సు నందు విశాల ప్రపంచమెట్లు స్థితినొంది యున్నదో వినుము. పూర్వము భృగుమహర్షి తన కుమారుడగు శుక్రుడు మృతి చెందినది తెలిసి యమధర్మరాజునకు శాపమివ్వబోగా, ఆ కాలుడు భృగునకు బోధించినది, మనస్సున కల్గిన లౌకిక భావనలను త్యజించునట్టి చిత్తము సనాతన

బ్రహ్మమగును. అట్టి దుర్భావనలతోనే శుక్రుడు గతించి, మరల జన్మమెత్తి పుణ్యఫలముతో మరోజన్మ మెత్తి దైత్యుల గురువుగా వినుతికెక్కెను. అనగా పూర్వపు జన్మమెత్తి తండ్రిని చేరునని చెప్పగా, భృగువు సంతసించెను.

2. శ్రీరామచంద్రా! దృశ్య వస్తువుల కంటె ప్రత్యగాత్మను గాంచుటలో నెగ్గిన శంబరుడును దైత్యేంద్రుని కుమారులగు దామ, వ్యాళ, కటో పాఖ్యానము వినవలసినదే. వీరు ముగ్గురును దైత్యులైనను విషయ వాసనారహితులై యుండి దేవతలను జయించుచుండిరి. కాని అంతఃకరణమున మాత్రము వాసనలచే అహంకారులైయున్న కారణాన దేవతలచేతనే కొంత కాలమునకు హతులైరి.

3. జగన్మాయా స్వరూపనివారణకై శరలోముని కుమారుడగు దాసురుడు కదంబ వృక్షాగ్రమున కూర్చునియుండి ఘోర తపస్సు చేయగా, అతడు ఆత్మజ్ఞానము పొందెను. అతనిని చేరిన నొక వనదేవతకు పుత్రుని అనుగ్రహించెను, ఆ బాలునితో, నాయనా! జీవునకు మోక్షము పొందుటకు సంకల్పరహితమే కారణమని బోధించెను. కావున రామచంద్రా! సంకల్పక్షయమే మోక్షోపాయము. అందుచే ఆత్మ పదమునకు అన్వేషింపుము.

4. పూర్వము బృహస్పతి కుమారుడు కచుడను వాడు మహాజ్ఞానియై తండ్రికి తగ్గ తనయునిగా దృశ్యవస్తువులపై వాంఛారహితుడై, ఆత్మయే సర్వమని, సర్వత్ర ఆత్మయే వ్యాపించుయున్నదని తలంచి, తాను సదాఘంటానాదముగా ఓంకారముచ్చరించుచు పరమాత్మయందే లీనమై యుండెడి వాడు. కావున పురుషయత్నముచే నికృష్ట వస్తువులపై విరక్తి కలిగియుండిన పరమాత్మను చేరగలవని వశిష్ఠుడు పలికెను.

## జనకోపాఖ్యానము

అట్టు శ్రీవాల్మీకి భరద్వాజునితో నిట్లనెను.

భరద్వాజా! వశిష్ఠుని బోధనలను వినిన శ్రీరామునకు ఆలోచన జ్ఞానముదయింప, అట్లు ఆత్మపదమున నా మనస్సు ఎప్పుడు విశ్రాంతినొందునని వశిష్ఠుని ప్రశ్నించెను.

అందులకు వశిష్ఠుడు యిట్లనెను. రామచంద్రా! సత్యా సత్య విచారణద్వారా జ్ఞేయ వస్తువగు ఆత్మను స్వయం ప్రయత్నముననే నెరింగిన నీమనస్సు విశ్రాంతి నొందును. అదియే మనస్సునకు ముక్తిదాయకము.

శ్రీరాముడు మరొక మారు మనస్సును గూర్చి యిట్లు ప్రశ్నించెను. మహాత్మా! మనస్సు ఎట్లు సంసార వాంఛను కలుగ జేయుచున్నది? ఆ సంసారమును దాటు

ఉపాయమును నాకు తెలియజెప్పుమనెను

వశిష్ఠుడిట్లు చెప్పెను రామచంద్రా! సచ్ఛాస్త్రముల చేతను, సజ్జన సాంగత్యము చేతను, ఉత్తమ వైరాగ్యము చేతను శుద్ధాత్మ తత్వమెరింగి, చిత్త సౌజన్యముతో వైరాగ్యమును పొందియుండి బ్రహ్మ నిష్ఠులగు గురువులను చేరి, వారి యుపదేశముచే ఆత్మపదమును పొందెదవు దానితో నీసంసార జీవనయాతన నుండి విముక్తి పొందెదవు దుఃఖ రహితుడవగుదువు

అందులకు జనకుడే సాక్షి, ఒకనాడు జనక మహారాజు వన విహారమున నొకచోట సిద్ధులు కొందరు శ్రుతి, స్మృతి, ఆత్మ సాక్షాత్కార గీతములను పాడుచుండగా విని, ఆత్మ జ్ఞానము పొంది, తన రాజ్య సంపదలపై విరక్తిచెంది, శుద్ధ చిద్రూపుడై నిష్కామమనెడిదే నిర్వివాద ఆత్మ పథమున దృఢ నిశ్చయుడై ధీరహృదయుడై యుండెను

కావున రామచంద్రా! నీవును జనకునివలె వివేకివై నిరంతరం నిత్య తత్వ విచారణతో ఆత్మ సాక్షాత్కారం పొంది సుఖ సంపదలతో వెలయుము

ఇట్లు జనకోపాఖ్యానము వెల్లడించెను

రామచంద్రా! పుణ్యపావనోపాఖ్యానము వివరించెద వినుదు పూర్వము మహేంద్ర పర్వతమున నున్న దీర్ఘతపుడను మునీశ్వరుని కిరువురు పుత్రులుండిరి వారిలో జ్యేష్ఠుడైన పుణ్యుడు బ్రహ్మ జ్ఞానము పొందియుండెను రెండవ వాడైన పావనుడు అర్ధ జ్ఞానుడైయుండెను కొంతకాలమున కాముని గతించగా, అర్ధజ్ఞానుడైన పావనుడు తండ్రికై విలపించెను అదిచూచి, బ్రహ్మజ్ఞానియైన పుణ్యుడు సోదరుని ఓదార్చుచు, వాని జన్మ పరంపంరల గూర్చి చెప్పుచు, ఈ జన్మలు భ్రమలు, క్షణికములు కావున కేవలం సాక్షీభూతులమై మెలంగుచూ చిత్తమును క్షోభపెట్టక చిత్తవృత్తిరహితుడవై జీవన్ముక్తుడవు కమ్ము అని బోధించెను

రామచంద్రా! అట్లు నీవును జ్ఞానోదయుడవై నిర్మలమైన, నిష్కామమైన, దుః ఖరహితమైనట్టి బ్రహ్మీభూత స్థితిని పొందుము అందుకు నీకు బలి ఉపాఖ్యానము వివరించెద వినుడు

భూమికి అధోభాగము నున్న విరోచనుని పుత్రుడగు "బలి" సమస్త సౌఖ్యములను పొందుచు కొంతకాలమునకు వైరాగ్య ముదయింపగా, తండ్రిని నిట్లు ప్రశ్నించెను తండ్రీ! మనస్సు యొక్క మోహమెట్లు శమించును? శాశ్వత శాంతి ఎప్పుడు పొందుదును?

విరోచనుడిట్లు పలికెను దైత్యేంద్రా! అభ్యాసముచే మనస్సును జయించినచో మోహము నశించును శాంతిని పొందుదువు అందులకు సన్మార్గవర్తుడవై గురూపదేశముతో

మనస్సును మెల్ల మెల్లగా ఆత్మోన్ముఖ ప్రయత్న సాధనచే దృశ్య కల్పనావాసనలను వీడి నిత్య సత్యమగు బ్రహ్మస్వరూపమువై యుండుము. అని చెప్పిన తోడనే తమ గురువగు శుక్రాచార్యుని ప్రార్థించెను.

చిదాత్మ స్వరూపుడైన శుక్రాచార్యుడు ప్రత్యక్షము అయి, బలి చక్రవర్తికి ఇట్లు ఉపదేశించెను -

దైత్యేంద్రా! **విషయవాసనయే కల్పనము. బంధమును.** అట్టి కల్పన రహిత జ్ఞానమే ముక్తికి మార్గము. యధార్థ **నిత్య సత్య ప్రాప్త కర్మల** నాచరించుటయే జీవన్ముక్తికి సోపానము. అదియే సద్ధర్మము.

కావున రామచంద్రా! నీవును బలిచక్రవర్తివలె వివేకవంతుడవై నిత్యమగు ఆత్మ స్థిరత్వం పొందియుండుము. అని రాముని జ్ఞాన స్వరూపమును గూర్చి గుర్తు చేసెను

వశిష్ఠుడు ప్రహ్లాదోపాఖ్యానము గూర్చి యిట్లు పలికెను రామచంద్రా! హిరణ్య కశిపుని సంతానములోనొకడు ప్రహ్లాదుడను బాలుడు బాల్యము నుండియు విష్ణుభక్తుడై యుండెను. కాని తండ్రి హిరణ్య కశిపుడు హరిద్వేషియైన ఆ హరి నృసింహావతారమెత్తి హిరణ్య కశిపుని సంహరించెను. ప్రహ్లాదుడు వైరాగ్య తత్త్వము నలవరచుకొని, విష్ణు స్మరణతోనే విశ్రాంత మనస్కుడై యుండెను. అట్టి భక్తునికై విష్ణువే పాతాళమునయున్న ప్రహ్లాదునకు ప్రత్యక్షమై "సర్వోత్తమమైన ముక్తి ఫలమును పొందు బ్రహ్మమందు నీకు తత్త్వవిచారణ కలుగు గాక!" అని వరమునొసంగి అంతర్ధానమయ్యెను.

కావున రామచంద్రా! నీవును నిరంతర ఆత్మవిచారణకై అన్వేషిస్తూ సర్వోత్తమమైన జ్ఞాన ప్రాప్తిని పొందుము.

రామచంద్రా! గాధి ఉపాఖ్యానము వివరించెద వినుడు. పూర్వము 'గాధి'యనునొక బ్రాహ్మణుడు విష్ణు సందర్శనార్థమై తపస్సొనర్చగా విష్ణువు ప్రత్యక్షమయ్యెను గాది విష్ణువును, పరమాత్మ సంబంధమగు మాయను దర్శింపగోరెను. విష్ణువు అటులేయని వరమిచ్చి, పిమ్మట దీనిని త్యజించెదవని అదృశ్యమయ్యెను.

అంతట గాది నీటమునిగి 'అఘమర్షణ' సూక్తమును పఠింప యత్నింపగా ఆ సూక్తము గుర్తుకు రాక. వేరొక సూక్తము పఠించెను. వెంటనే తాను తన గృహమందు గతించునట్లు, మరొక జన్మగా నొక ఛండాల స్త్రీ గర్భమున ప్రవేశించినట్లు దృశ్యము గాంచెను. ఏమిటిది యని చింతించి, యిది విష్ణు మాయని భావించి, తన భ్రమకు వగచి, మరల విష్ణుని గూర్చి తపమొనర్చి తనపూర్వ (బ్రాహ్మణ) రూపమును పొంది, కొంతకాలమునకు విష్ణువు సన్నిధి చేరెను.

ూమచంద్రా! గాదివలె, శరీరము తానుగా భావించినచో, ఆత్మజ్ఞాన శూన్యుడని, మోహ నిమగ్నుడని, గ్రహించుము. కావున సంసారమాయ మహాభయం కరమైనదిగా సంకటమున పడద్రోయునదిగా గుర్తించుము. అట్టి రాగాది మాలిన్య రహితుడవై కేవలం ప్రత్యగాత్మయందే మనస్సును నిలుపుము.

ఓ రామచంద్రా! నీకు ఉద్దాలకోపాఖ్యానము వివరించెద వినుడు. ఉద్దాలకుడు పంచభూతముల విచారణ **పరవశుడై సమాధి పొందుటకు** ధ్యానాభ్యాసమొనర్చుటలో మనో చపలత్వము పొంది, **తుదకు ఆత్మవిచారణతో** బ్రహ్మ ప్రతీకమగు ఓంకారము నుచ్చరించుచు సమదృష్టి భావముతో ప్రశాంత మనస్కుడై సమాధి స్థితిని పొంది శివైక్యము చెందెను.

కావున చిత్తముయొక్క అకర్తృత్వమే ఉత్తమ సమాధి స్థితి యని గ్రహింపుము.

రామచంద్రా! నీకు సురఘు-పరిఘోపాఖ్యానము గూర్చి వివరించెదవినుడు

శబ్దమయ దృష్టి గూర్చి సురఘుడను కిరాతుని గూర్చి వినుము. పూర్వము కైలాస పర్వత గుహలయందు సురఘుడను రాజు చిత్త శాంతిలేక 'మాండవ్యుడ'ను మహర్షిని చేరి యిట్లనెను.

"స్వామీ! నాకు విషమదృష్టి లేకుండా, సమ దృష్టియే నాయందుండునట్లు అనుగ్రహింపు" మని కోరెను.

మాండవ్యుడిట్లనెను. "రాజా! వైరాగ్య, త్యాగాది స్వప్రయత్నముతో స్వాత్మ బోధ పొందుదువు. ఏది అశక్యమగు పరిత్యజంచుటయే అదియే పరమగు ఆత్మపదము" అని బోధించెను.

ఆ బోధనతో ఆరాజు స్వాత్మజ్ఞాన విచారణచే పరమోత్తమమగు బ్రహ్మ పదమును పొందుటకు సర్వకాల సర్వావస్థల యందు సమరూపమగు సమాధి స్థితిని పొందియుండెను." - అని వశిష్ఠుడు చెప్పగా, శ్రీరామచంద్రునకు చంచలమైన మనో స్థితిలో ఎట్లు సమాధి స్థితి నొందును? అని సందేహము కల్గి మహర్షిని ప్రశ్నించెను.

వశిష్ఠుడిట్లనెను - "రామచంద్రా! అట్లు సమాధి స్థితిని పొందియున్న సురఘుని, పరిఘుడనే రాజు సర్వము త్యజించి చేరెను. సమాది స్థితికి మార్గము చూపమనికోరగా సురఘుడు, రాజా! కర్తృత్వ అహంకార రహిత స్థితియే సమాధి స్థితికి మార్గమని చెప్పగా, పరిఘుడట్లు సమాధి స్థితిని పొంది తరించెను -

రామచంద్రా! నీకు బాస, విలాసోపాఖ్యానమును వివరించెద వినుడు. పూర్వము సహ్యపర్వతమునందు "భాస - విలాసుల"ను యిర్వురు ముని పుత్రులుండిరి. ఆ ముని పుంగవులు విజ్ఞానవంతులుగా వృద్ధ తపస్సు లైయుండిరి. అయినను, వారిలో కనిష్ఠుడగు

భాసుడు జ్ఞేయమగు ఆత్మను పొందలేక, సంసార సాగరమెటుల దాటవలె" నని సంతాపముతో నుండగా, జ్యేష్ఠుడగు విలాసునకు, సోదరుని సంతాపరహితుని జేయుటకు యత్నించుటలో అనేక తత్త్వబోధలు జేసెను. ఎన్నో విధముల ఆత్మజ్ఞాన సంబంధమగు విషయముల గాథలను వినిపించగా, భాసుడు సంతాపరహితుడై పలు విధముల ఆత్మానందమును, నిర్మల జ్ఞానమును పొంది విలాసునితోబాటు ముక్తినొందెను.

శ్రీరామచంద్రా! అట్లు ముక్తి నొందుటలో ఇక్ష్వాకు వంశీయులైన దిలీపుడు-మనువు రాగాది దోషములంటక ప్రజల నేలిరి. అటులే మాంధాతయును రాజు పరమాత్మ పదమునొందెను. దానవాధీనుడైన ప్రహ్లాదుడు అక్షయ సుఖమును పొందెను. విశ్వామిత్ర మహాముని ముక్తుడైనప్పటికి, వేదోక్తమైన యజ్ఞక్రియ నాచరించుచున్నాడు. జనకుడు, శర్యాతి, సగరుడు మొదలైన వారును, బృహస్పతి, ఉశనుడు, సూర్య చంద్రులు, సప్తర్షులు మొదలగు జీవన్ముక్తులై జ్యోతిశ్చక్రమందు స్థితి కల్గియుండిరి. అగ్ని వాయువు, వరుణుడు, యముడు, తుంబురుడు నారదుడును జీవన్ముక్తులై స్వర్గమున విమానస్థితియై యున్నారు.

రామచంద్రా! ఆత్మస్థితి స్వరూపమును పొందుటకు వీతహవ్యుడను ముని వాసనారహితుడై, ఇంద్రియ చాపల్యమును వీడి, మనస్సును భ్రమలకు లోనుగాకుండా, వింధ్య పర్వత గుహలయందు మున్నూరు సంవత్సరములు సమాధి స్థితిలో నుండెను. కొంతకాలానంతరం అతనికి ఆత్మవిస్మృతి (అవిద్య) నశించినది. అనగా దృశ్యము నశించినది. దానితో అతనిలో ఆత్మస్మృతి స్పష్టమై, మోహమాలిన్య రహితుడైయుండి, ఓంకార మాత్రల స్థూల సూక్ష్మాది భేదమును స్మరించుచు ఆత్మయందు, స్థితియందు కల్గియున్నను వ్యవహార కార్యముల నాచరించు చుండెను.

కావున నీవును వీతహవ్యుని వలె రాగద్వేష రహితుడవై ఆత్మ స్థితిని పొందియు వ్యవహార కార్యముల నాచరించు వాడవు కమ్ము.

**అని వశిష్ఠుడు** యిట్లు ఆత్మబోధ నొనర్చెను.

## నిర్వాణ ప్రకరణము.

1. రామచంద్రా! బ్రహ్మైక్య విధానము గూర్చి వివరించెదవినుడు. ఆత్మ విచారణలో వాసనారహితుడవై వైరాగ్య జ్ఞానాదుల నభ్యసించుటలో "నేను బ్రహ్మమునే" అనెడి సత్య జ్ఞానము కలుగగా జీవునకు బ్రహ్మభావన ఉదయించును. దానితో బ్రహ్మమునందు బ్రహ్మము స్ఫురించునట్లు కాగా, సంసారమును తరించుదువు. బ్రహ్మైక్యమగుటతో దేహభ్రాంతి తొలగి ఆత్మయందే జీవుడు స్థితి పొందియుండును.

2. రామచంద్రా! 'నేను' దేహమును భ్రాంతిని త్యజించి, సమ్యగ్దర్శనముచే పరమశాంతిని పొందిన భుశుండుడనునొక పక్షి (కాకి)ని గూర్చి వివరించెద వినుడు-

మేరు పర్వతమునందు భుశుండుడను కాకిని నేను చేరి, "నీవెట్లు సంతాపరహితుడవై, క్షీణింపకుండ యున్నావు" అని ప్రశ్నించితిని.

భుశుండిట్లు పలికెను. "మునీంద్రా! నేను సత్పురుషుల సాంగత్యముతో నుండుచు, వారి బోధనలచే నిర్మల హృదయుడనై, ఆశాపాశములకులోను గాక, జగన్మాయను వీక్షించుచుండినను, అరిషడ్వర్గముల దరిజేరనీయక, ధనరాశులందు కలత చెందక, నైష్కర్మ్యముచే (అకర్తృత్వ, అభోక్తృత్వభావముచే) సంతాపరహితుడనై స్వాత్మమందు నిమగ్నుడనై జగత్తును నేనే అని భావించుచుంటినని" పలికెను.

కావున శ్రీరామచంద్రా! "నీవును అట్లు సమ్యగ్దర్శనముచే, జగన్మిధ్యా భావముతో జగద్రూపమును మనస్సునుండి త్యజించి స్వాత్మనవలోకించి, కర్తృత్వ భావము వీడి యుండిన ఆత్మపధమును పొందుదువు" అని బోధించెను -

3. వశిష్ఠుడిట్లు చెప్పదొడంగెను. శ్రీరాఘవా! నేనొక సారి పరమేశ్వరుడైన చంద్రశేఖరుడుండు కైలాస పర్వతము చేరి, ఆ మహాదేవుని నిట్లు ప్రశ్నించితిని, స్వామీ! త్రినేత్రా! నీ స్మరణ మంగళకరమై పొందరాని వస్తువునైనను ప్రాప్తింప జేయ గలదు. అయిన చిత్తక్షోభ లేనిది, సంతాప వర్జితము, సమస్త సౌభాగ్యముల నిచ్చు దేవతార్చన ఎట్టిది?

ఈశ్వరుడిట్లు పలికెను. దేవుడనగా, అకృత్రిమము, అనాద్యంతము, నిరతిశయానందమునగు చైతన్యము. అదియే శివ మంగళ స్వరూప ప్రకాశరూపమైనట్టి చిద్వస్తువు. ఆత్మానందము పొందునది అదియే. అందులకు జ్ఞానము, శమము, ఆత్మ పూజలు ఉత్తమ లక్షణములు. శమ, జ్ఞానాదులనెడి పుష్పములచే పూజించుటచే దేవతార్చన యనబడును. ఈ శరీరమున 'ఆత్మ' దేవుడు జ్ఞానముచే పూజింపబడిన, ఆ శరీరధారియే పరమాత్మగా, సమస్త జగత్తుగా, చైతన్యమునకు నిలయముగా ఆద్యంత స్వరూపుడుగా పూజింపదగినవాడుగా, వందనీయుడుగా, జన్మరాహిత్యుడుగా, స్వాత్మచింతనుడుగా ఆహ్లాదము నొందుచు పారమార్థిక స్వరూపముతో తాను ఈశ్వరుడగుచున్నాడు. అందులకు చిరకాల అభ్యాసమవసరము.

కావున ఆత్మ సాక్షాత్కారముచే కర్మ జ్ఞానేంద్రియులు క్షమియింప శేషించు ఆత్మయే శివుడు - అదియే "తత్సత్".

అని చెప్పి పరమశివుడు నిష్క్రమించెను.

"శ్రీరామచంద్రా! నాటి నుండి నేను ఆత్మార్చనతో వాసనలకతీతుడనై. దుః ఖరహితుడనై చిదాత్మలో ఏకత్వము పొంది, సర్వవైషమ్య రహితుడనై సమత్వ బ్రహ్మతత్త్వముతో నుంటి"నని పలికెను.

అది విన్న శ్రీరామచంద్రుడు, "మునీంద్రా! నా సంశయం తీరునది సర్వం బ్రహ్మమయంగా తోచి ఆత్మయందే స్థిరుడనై వీరత్వము పొందితిని. మీరు చెప్పినటుల జ్ఞాత, జ్ఞాన, జ్ఞేయములను (త్రిపుటి)యను ఏకరూపముగా ఆత్మయందే వీక్షించుచుంటిని. దేవతలు, మహర్షులు, సిద్ధులు, గణములు ఆత్మనే ఆస్వాదించు చుందురని, అదియే తురీయావస్థగా గ్రహించితిని. బ్రహ్మయందే పూర్ణత్వమునొంది బ్రహ్మ జ్ఞానామృతమును పొందితిని." అని పలుకగా –

వశిష్ఠుడిట్లనెను. రామచంద్రా! స్వప్నమును పోలిన సూక్ష్మ శరీరము మనస్సు, బుద్ధి, అహంకారము, జ్ఞానేంద్రియ పంచకములతో పూర్వాష్టకములతో జీవుడు మోక్షమును పొందు వరకు స్థావర జంగమాది యోనులందు పుట్టుచునే యుండును అట్లు పుట్టకను అరికట్టుటకు శరీరము నందున్న ఆత్మ శోధన అత్యంతావశ్యకము. ఆ ఆత్మసాక్షాత్కారముతోనే సర్వం తెలుసుకొనెదవు. అనగా ఏది సత్యం, ఏది అసత్యం గ్రహించిన జీవుడే దేవుడగుచున్నాడు. అట్లు ఆత్మపూజ (సమాధి స్థితి)లో నిమగ్నుడయిన చిత్తము శాశ్వతానందం నొందును.

4. వశిష్ఠుడిట్లు బోధించెను. రామచంద్రా! అర్జునోపాఖ్యానం గూర్చి వివరించెద వినుడు. రాబోవు యుగమునందు అనగా ద్వాపర యుగము నందు నరనారాయణులు శ్రీహరి శ్రీకృష్ణుడుగను, రెండవరూపము అర్జునుడగును జన్మింతురు. కురుపాండవ యుద్ధమున అర్జునుడును నీవలె బేలతనముతో నుండగా శ్రీకృష్ణుడు కర్తవ్యబోధగా అర్జునునకు భగవద్గీతోపదేశ మొనరించును.

"అదియే ఆత్మతత్త్వోపదేశము. ఆత్మస్థితి కలిగిన వాడు తానెవరో తెలుసుకొనును. పరమాత్మను గుర్తెరుంగును. జ్ఞాని యగును వాస్తవాస్తవముల తెలుసుకొని మసలును. అహంకార రహితుడై, సందేహ భయ వర్జితుడై, సాక్షాత్తు భగవద్రూపుడై, ఆత్మస్వరూప జీవుడుగా నిక శోకింపడు. పునర్జన్మ రహితుడగును." అని బోధించి అర్జునుని కర్తవ్యోన్ముఖుని గావించును.

5. వశిష్ఠుడు మనోనాశనము గూర్చి యిట్లు బోధించును. రామచంద్రా! ఈ జగద్భ్రమ విస్మరణయే ఆత్మజ్ఞాన జీవన్ముక్తి హేతువు. చిత్త నిశ్చయత్వమే మౌనము. అట్టి

మౌనములు నాలుగు విధములు. "వాఙ్మౌనము, అక్షమౌనము, కాష్ట మౌనము, సుషుప్త మౌనము." వాక్కును నిరోధించుట వాఙ్మౌనము - ఇంద్రియ నిగ్రహం అక్షమౌనము. చేష్టలను పరిత్యజించుట కాష్టమౌనము. ఆత్మ తత్వం సుషుప్తి మౌనము.

'ఓంకారము' యొక్క మొదటి "అ,ఉ,మ్" మూడు పాదములును, నాల్గవదియైన "ఁ" అర్ధ మాత్రతో లయమొనర్చును. అటులే సాంఖ్యము (జ్ఞానము) - యోగము (కర్మయోగము) రెండింటిని నెరింగినవాడే జ్ఞాని. "ఏకత్వ దృఢా భ్యాసము, ప్రాణవాయువుల విలయము, మనో నిగ్రహము" - అను మూడింటితో మోక్ష సాధనయగును. వీటితో మనో నాశనము. వీటిలోనేది సిద్ధించినను మిగిలిన రెండును సులభ సిద్ధములే.

మనస్సు ఆత్మ స్వరూపము కాగా, ఆత్మయే శేషించి మనస్సు పరమపద లయ మొందును సమత్వ ఆత్మను దర్శించును.

6. వశిష్ఠుడు భగీరథోపాఖ్యానము వివరించెను. రామచంద్రా! భగీరథుడును జగద్యాత్రను గూర్చి శోకించెను. ఒకపరి తమగురువైన "త్రితలుని" జేరి తన శోకమెట్లు శమించునని ప్రశ్నించెను.

ఆ గురువు యిట్లు తెలిపెను. రాజా! సాధన చతుష్టయమగు శ్రవణ మననం, స్మరణం కీర్తనాదులచే సమస్త శోకములు నశించి, జ్ఞానముచే చిత్తహృదయాకాశమున జ్ఞేయమగు ఆత్మయందు స్థితుడగును. పునర్జన్మ రహితుడై తానే బ్రహ్మయై శాశ్వతానంద మొందును" అని త్రితలుని బోధనతో భగీరథుడు తిరిగి రాజుయై కర్తవ్యోన్ముఖుడై గంగను రప్పించి తనవారి నందరిని ముక్తి గావించెను.

7. వశిష్ఠుడిట్లు పలికెను. రామచంద్రా! పూర్వము మాళవ దేశపు రాజధాని యగు ఉజ్జయినియను పట్టణమునకు శిఖిధ్వజుడను రాజు, మరియు అతని భార్యయును కేవలం శ్రవణ మననాదుల ద్వారా ఆత్మజ్ఞానం పొందిరి. శారీరక మానసిక వ్యాధులు లేక తత్వజ్ఞానులై జీవించుచుండిరి. వారిలో రాజుభార్య అనంతమైన జ్ఞానమును పొందియుండ, రాజు మాత్రము స్వాత్మజ్ఞానమునకై అరణ్యములకేగగా, రాజు భార్య (చూడాల) పదునెనిమిది సంవత్సరములు రాచ కార్యములను నెరవేర్చెను. కొంతకాలమునకా భార్య చూడాల భర్తను చేరి కుశలమడిగెను.

అట్లు తన వద్దకే తెంచిన భార్యను గుర్తించక, ఆమెను బ్రహ్మమును గూర్చి సర్వోత్తమమైన జ్ఞానమును పొందుట యెట్లని ప్రశ్నించెను.

భార్య చూడాల యిట్లు పలికెను. రాజర్షీ! నీవుత్యాగ శీలివే, కాని అహం వీడనైతివి.

దానితో నీలో బ్రహ్మానందం భాసించుట లేదు. స్వాత్మజ్ఞానమును పొందుటకు శరీరమును శుష్కించుట నేరము. దేహాది భావములు విసర్జించవలెను. ఎందుకనగా, దేహము చిత్త మనోవికారముల నుండునది. చిత్తమును సన్యసించిన అంతఃకరణలు నశించును. ఆత్మ శేషించిననే అహంకారమాలిన్యం తొలగి సంపూర్ణ బంధవిముక్తుడగును జీవుడు. ఆత్మ పదమును పొందును. గురూపదేశముతో పవిత్రమైన జీవన్ముక్తుడై, వీతరాగుడై, శాంతుడై, జితేంద్రియుడై పరమాత్మ పథమును పొందునని జెప్పగా, శిఖిధ్వజుడు భార్య చూడాలని గుర్తించి ఆనంద పరవశుడయ్యెను. ఇదియే చూడాలోపాఖ్యానము-

8. వశిష్ఠుడిట్లు పలికెను. రామచంద్రా! బృహస్పతి కుమారుడగు కచుడును శిఖధ్వజుని వలె జ్ఞానియై యుండెను. ఆ కచుడు తండ్రిని సమీపించి, మహాత్మా! జీవత్వమను సంకెళ్ళచే బంధింపబడిన ప్రాణికి విముక్తి ఎట్లు?

వశిష్ఠుడు బృహస్పతి పల్కిన విధమును యిట్లు చెప్పెను. "రామచంద్రా! సర్వానర్థములకు సంసారమును పరిత్యజించుటయే విముక్తి" అని, చెప్పినతోడనే తండ్రి మాటతో కచుడు సమస్తమును త్యజించి ఏకాంతమునకు వెళ్ళెను.

కావున రామచంద్రా! చిత్త స్వరూపము అహంకారం. అహంకారం అజ్ఞానముచే జనించును. నేననుదేహ భావమే బంధం. నీకట్టి అహంకార ప్రసక్తి అనవసరం. జీవన్ముక్తుడగుటకు కచుడు యత్నించుటనునది దేహభావం లేకపోవడమే. అందులకు పూర్వము బృంగీశుడను వానికి శివుడుపదేశించిన విధము చెప్పెద వినుము.

రామచంద్రా! బృంగీశుడిట్లు శివుని ప్రశ్నించెను. పరమేశ్వరా! ఉత్తమ నిశ్చయం (సంకల్పం)తో నీ జగత్తు నందు వెలయ గలమా?

ఈశ్వరుడిట్లు పలికెను. బృంగీశా! మహాభోక్త, మహాకర్త, మహాత్యాగుల గూర్చి వివరించెద వినుడు. అహం వదలి శాశ్వత కూటస్థ ఆత్మభావమున వలంభించిన మహాభోక్తయగును. మహా కర్తయునగును. అనగా, ఇచ్ఛాశూన్యుడుగా జన్మ - స్థితి - లయములందు సమత్వముతో దేనిని ద్వేషింపక యధా ప్రాప్తమగు దానిని పొందుచు అనుభవించుటయే భోక్త, మహాకర్త ఎవడు గ్రహించుచున్నను గ్రహించక, క్రియాలాభముల గూర్చి ఆచరించినను ఆచరించక, భుజించినను, భుజింపక, యుండువాడే మహాభోక్త. లాభాలాభములకు సుఖదుఃఖములకు ఖేదమొందనివాడు మహాభోక్త.

అటులే, "సమస్త ఇచ్ఛలను, చేష్టలను, దేహత్యాగ, జన్మత్యాగ,* యుక్తాయుక్త కర్మత్యాగ, దృశ్యములన్నియు మిథ్యయను భావించువాడే మహాత్యాగి." అని ఈశ్వరుడిట్లు వచించినది శ్రీరామచంద్రునితో వశిష్ఠుడు చెప్పెను.

ఁవున రామచంద్రా! నీవును, ఈశ్వరుడు పల్కినట్లు ఆచరించి, బృంగీశుని వలె దేహాది పంచకోశములను, అవస్థాత్రయము త్యజించి, నిరంకుశత్వం వీడి శుద్ధత్వము పొంది, అంతర్ముఖుడవైనచో దుఃఖరహితుడవగుదువు.

అందులకు మరొక ఉదాహరణముగా ఇక్ష్వాకుల వంశజుడైన ఇక్ష్వాకుడను రాజు గూర్చి వివరించెద వినుడు. రామచంద్రా! ఈ రాజు తండ్రియైన మనువును జేరి, వార్ధక్య మరణాదులున్న ఈ దృశ్య ప్రపంచమెట్టిది? అని ప్రశ్నించెను.

మనువు యిట్లు పలికెను. నాయనా! ఈ దృశ్య జగత్తే మిథ్య. ఇక జననం, వార్ధక్యం, మరణాదులు శాశ్వతమెట్లు? అనగా సర్వం శూన్యం. ఏదియును నిలుచునది కాదు. ఆత్మయొకటే శాశ్వతము. అది ఈ పంచేంద్రియములకు అధిపతియైన మనస్సునకును అతీతమైనది. అదృశ్యమై యున్న ఆత్మ శుద్ధాంతః కరణముతోనే కనపడును. ఆ ఆత్మయే పరమాత్మ. ఆపరమాత్మ గురూపదేశముతోనే దృశ్యమగును. కాని శాస్త్రాదులవల్ల కాదు. వాసనా రహితమైన స్వకీయ నిర్మల బుద్ధికి గోచరించును. అట్టి ఆత్మ, పరమాత్మ తన దేహమందున్నను, అవిద్యతో కనుగొనలేక పోవుటనునది అహంకార కారణం. ఆ అహంకార రహితమే ప్రత్యగాత్మ. అదియే మోక్షము" అని, చెప్పగా ఇక్ష్వాకుడట్లు స్థిరచిత్తుడై, ఆత్మదృష్టి కలవాడై యుండి తుదకు బ్రహ్మాపథమున (పదమున) జేరెను.

శ్రీరాముడిట్లు ప్రశ్నించెను. మహర్షీ! జీవన్ముక్తులకు ఆకాశ గమనాదులుండునా?

వశిష్ఠుడిట్లు చెప్పెను. రామచంద్రా! మంత్ర-తంత్ర-యంత్ర తపస్యాది మహాశక్తుల వలన ఆకాశ గమనాదులు సాధారణ జనులచే గావింపబడుచున్నది. కాని జ్ఞాని వారి కంటే శ్రేష్ఠ గమనాదులు కలవాడు. అనగా వాని ఆత్మ బుద్ధి పరమాత్మ రూప తురీయ పదముపై మాత్రమే యుండును. అదియే శ్రేష్ఠమైన చిన్మాత్ర సత్యగమనము.

సంకల్పమే బంధము. మూఢులకే అల్ప సిద్ధులు పొందు సంకల్పముండును. కావున సంకల్ప రహితమే మోక్షము. దేనియందును (తృణము మొదలు బ్రహ్మ పదార్థము వరకును) వాంఛ లేనిచో మోక్షము ప్రాప్తించును.

శ్రీరాముడిట్లు ప్రశ్నించెను. మహాత్మా! "జాగ్రత్-స్వప్న-సుషుప్తి" అవస్థల యందు వ్యాపించియుండి నేత్రాదులకు అగుపించని తురీయావస్థను గూర్చి వివరించుడు?

వశిష్ఠుడిట్లు చెప్పెను. రామచంద్రా! శుద్ధ సమత్వ సాక్షిరూప అవస్థయే జీవన్ముక్తి స్థితి. అదియే తురీయస్థితి. ఈ స్థితి యందు అహంకారముండదు. కావున అది జాగ్రత్త గాదు. జడత్వము లేనందున సుషిప్తియు కాదు. ఇక స్వప్నము అనునది మిథ్య. కావున అహంకార రాహిత్యంతో సమత్వము సిద్ధింప, ఆత్మయందు చిత్తము విలీనమగును. అదియే

తురీయావస్థ.

శ్రీరాముడిట్లు ప్రశ్నించెను. మునీంద్రా! సప్తజ్ఞాన భూమికల నభ్యసించుటెట్లు? అప్పుడు యోగి యెట్లుండును?

వశిష్ఠుడిట్లు చెప్పెను. రామచంద్రా! వేద మార్గస్థుడగు మనుజుడు "ప్రవృత్తుడని, నివృత్తుడని" రెండు విధములు "ప్రవృత్తుడు" - విషయ శూన్య నిర్యాణము (మోక్షము) తన కేల యని భోగసంపన్నమైన సంసార కర్మలనాచరించు వాడు "స్వర్గా భిలాషి" కల్గియుండును. "నివృత్తుడు" - సారములేని సంసారము తనకేలయని, కేవలం అంతః కరణమందు ఆత్మస్థితిని పొంది, ఆధ్యాత్మిక శాస్త్రజ్ఞాన మందున్నవాడు మోక్షాభిలాషి"గా మొదటి భూమికను పొంది యుండును.

అటులే "స్మృతి - శృతి సదాచార - ధారణ - ధ్యాన" కర్మల నాచరించువాడు రెండవ భూమికను పొంది యుండును.

శాస్త్ర - గురు - సజ్జన సాంగత్యంతో మూడవదైన భూమిక "అసంసంజ్ఞ" యుండుండును.

రామచంద్రా! ఇట్లు మూడవ భూమికను పొందిన విజ్ఞులు రెండు విధములు. 1.సామాన్యము. 2.శ్రేష్ఠము. నేను నిమిత్తుడను "సామాన్యము". వైరాగ్య భావనచే ఆత్మవస్తువుగా శాంత చిత్తుడై యుండుట "శ్రేష్ఠము".

జన్మ పరంపరల చివర సాధుజన సాంగత్యముచే వైరాగ్యముదయింప భూమికోదయం కల్గును. ఈ భూమికలతో జీవుడు గతించిన, అతని పాపకర్మము లన్నియు నశించుటతో, స్వర్గాది భోగములనుభవించి, అవియు క్షయింప భూలోకమునందు యోగియై జన్మించును. అతడు శాస్త్రాది ఆచార సద్గుణములతో తీర్థపుణ్య కార్యములనాచరించుచుండ ఆర్యుడనబడి, తదుపరి మిగిలిన నాల్గవ, ఐదవ, ఆరవ, ఏడవ భూమికలను క్రమముగా పొందుచు జీవుడు విదేహ ముక్తుడగును.

కనుక రామచంద్రా! సంకల్ప రహితుడవై, ఆత్మభావనతో కర్తవ్యమాచరించు చుండుము.

అని వశిష్ఠుడిట్లు బోధించినది, శ్రీవాల్మీకి భరద్వాజునితో చెప్పుచు మరల యిట్లనెను.

భరద్వాజా! నీవును చిత్తము శుద్ధమగు వరకు ఈశ్వరాది దేవతల నర్చించుచు, మనస్సును స్థిరమొనర్చుకొని ప్రత్యగాత్మ నవలోకింపుము. అట్టి తరిచిదానంద ఘనమైన ఆత్మభావన పొందగలవు. పంచకోశములకతీతుడవై, ఆత్మ జ్ఞాన సముపార్జనతో,

గురుబోధనలతో అభ్యాసముతో సమస్తము సిద్ధించునని, ఇది వేదమాత (ఉవాచగా) పలికెను.

మరల యిట్లనెను. భరద్వాజా! రామచంద్రుడిట్లు వశిష్ఠుని వలన పరిణతి చెందినది నీకు తెలిపితిని. అట్టితరి ఋషి సత్తముడగు వశిష్ఠ మహర్షిని గూర్చి విశ్వామిత్రుడిట్లనెను.

బ్రహ్మపుత్రా! వశిష్ఠ మునీంద్రా! మీరు బ్రహ్మజ్ఞాన శక్తి సంపన్నులు. మీ దర్శనంతో మేమును అట్టి వారమయితిమి. "దర్శన, స్పర్శ వాక్యములచే శిష్యుని దేహమందు శివరూప పరమాత్మ సమావేశమును కలుగ జేయువాడు నిజమైన గురువు." మీ శిష్యుడు రామచంద్రుడు విశుద్ధాత్ముడై యుండి విరక్తుడై యుండెను - మీ వలన "ఆత్మ" యను ఉత్తమస్థితిని పొందెను. ఈ జగత్తునకంతకు ఆనంద కారకుడయ్యెను." అని, వాల్మీకి, భరద్వాజునితో శ్రీరామచంద్రుని గురువాజ్ఞ పాలకుడుగా అభివర్ణించి చెప్పుచూ, వశిష్ఠునికిని పాదాభివందన మాచరించెను.

## ఉత్తరార్థము - (నిర్వాణ ప్రకరణము)

1. దృశ్యోపశమనము :- శ్రీరామచంద్రుడిట్లు ప్రశ్నించెను? సర్వక్రియా రాహిత్యము చేతను, సంకల్ప త్యాగము చేతను, జీవునకు దేహము పడిపోవును గదా! అట్టిచో ఆ మానవునకు జీవిత వ్యవహారాదులెట్లుండును?

వశిష్ఠుడిట్లు పలికెను. రామచంద్రా! దృశ్యపదార్థములను గూర్చిన భావనయే సంకల్పము. సంకల్పమే మనస్సు యొక్క బంధనము. సంకల్ప రహితమే మోక్షమార్గము.

సమస్త దుర్గుణములను నశింప జేయునట్టి "తత్త్వ విచారణ" మానవుల హృదయమందే యున్నది. ఎట్లు? కర్మ ఫలమందు ఆసక్తి లేకపోవుట, కర్మత్యాగముతో దేహాదులయందు 'అహం' లేకుండుటయు, ఓర్పుతో వివేకాది సత్క్రియలయందు ఆసక్తి చూచుటయే యదార్థ చిద్రూపము. జ్ఞానము ద్వారానే కర్మత్యాగము సిద్ధింప జీవన్ముక్తుడగుటకు దోహదమగును.

2. వశిష్ఠుడు మరల "విద్యాధరోపాఖ్యానము" గూర్చి యిట్లు వివరించెను. రామచంద్రా! శుద్ధచిత్త స్వభావునకు స్వల్పోపదేశమైనను చక్కగా ప్రవేశించును. గంభీరత్వము - సాధన - చతుష్టయత్వము లేని వానికి, యే బోధయును ఫలించదు. అట్టిదే, భుశుండిని విద్యాధరుల సంవాదము వివరించెద వినుడు - తనతో భుశుండు చెప్పిన విధము.

మహాత్మా! పూర్వము విద్యాధరుడను తపస్సంపన్నుడు, సదాచారపరుడు, ఆత్మజ్ఞానేశ్వరుడు. అతడు క్షయింపని ఆయువు గలవాడైయుండి నాలుగు కల్పముల జీవించి, పంచేంద్రియ, పంచప్రాణ - మనస్సు - బుద్ధి - అహంకారములనెడి పదునెనిమిది

అవయవములతో గూడిన ఉపాధిని పొందియుండుటచే సంసారవిరక్తి చెంది జనన మరణముల క్రమము గూర్చి నాతో నిట్లు విచారించెను. నేనిట్లు సమాధాన మిచ్చితిని.

"విద్యాధరా! నీకు సదుపదేశములు సులభ సాధ్యములు. అహంకారంవీడి, దృశ్యమునకు సాక్షియైన ఆత్మ నెరుంగుము. అందులకు జ్ఞాన సంపద అవసరము. గురు వాక్య పరిపాలనతో భౌతిక సంకల్ప త్యాగము పొందుము. దానితో నీచిత్తమున యదార్థ జ్ఞాన తత్త్వము నిలిచి, భౌతిక దృశ్య జగత్తుపై భ్రాంతి తొలగి నీ బాహ్యాంభ్యంతరముల యందు శుద్ధుడవగుదువు. అందులకు పురుష ప్రయత్నము అవసరమ"ని చెప్పితిని. అని విద్యాధరుని గూర్చి చెప్పెను.

అది విని శ్రీరామచంద్రుడిట్లు ప్రశ్నించెను. మహాత్మా! అవిద్య ఎట్లు తొలగును?

వశిష్ఠుడిట్లు పలికెను. రామచంద్రా! సత్పురుషుల సాంగత్యముచే సగభాగము అవిద్య తొలగును. మిగిలిన సగ భాగములో పాతిక భాగము శాస్త్ర విచారణతో, మిగిలిన పాతిక భాగము ఆత్మసాక్షాత్కార రూప ప్రయత్నముతో అవిద్య నశించును. అవిద్య నశింపగా సజ్జన సాంగత్యం, తత్త్వవేత్తల శాస్త్ర శ్రవణంతో, ముముక్షత్వ మేర్పడి నామరూప రహితమగు పరమాత్మ రూపము జీవుడు పొందును. ప్రాణ రక్షణకై మాత్రమే ఆహారమును పొందుచు, ప్రశాంతుడై, అంతఃకరణ శీలత్వముతో సత్యజ్ఞానిగా, నిర్మలాకాశముగా బ్రహ్మ (ఆత్మ) జ్ఞాన చింతనాపరుడై, పునర్జన్మ రహితుడై నిత్య నిర్వాణ (మోక్ష) రూపుడై వెలయుచుండును." అని పలికెను.

శ్రీవశిష్ఠుడు "మంక్యుపాఖ్యానము" గూర్చి యిట్లు చెప్పెను.

రామచంద్రా! నేనొక దినమున అయోధ్యకు వచ్చుచుండగా, "మంకి" యనునొక విప్రపాంథుడు నాతో సంసార తరుణోపాయము గూర్చి తెలుపుమనెను. అందులకు నేనిట్లు తెలిపితిని. విప్రుడా! సంసారమునకు దోషములగు "విషయ భోగము, విషయ వాసనల"ను రెండు హేతువులు. ఇవియే బంధములు. వీటి బంధ విముక్తియే ఆత్మతత్త్వ విచారణకు దోహదము. కావున నీవు ఈ దృశ్య సంసార మోహము వీడి తత్త్వజ్ఞానముతో సౌమ్య జీవనము సాగించుము" – అని తెలిపితిని.

కావున రామచంద్రా! నీవు సమస్థితియగు ఆత్మ పదమును పొందియున్నావు. అని తెలుపగా, రామచంద్రుడిట్లు ప్రశ్నించెను. మహాత్మా! సర్వం అవిద్యయైనచో వశిష్ఠుడను పేరుతో మీరెవరు? అని ప్రశ్నించడంతో కొంత మౌనము దాల్చి, మరల వశిష్ఠుడిట్లు పలికెను.

రామచంద్రా! ఇవ్విధముగా ప్రశ్నించు వారిని రెండు విధములుగా గుర్తించెదరు.

1. తత్త్వజ్ఞాని, 2. అజ్ఞాని. ఈ ఇరువురికిని సమాధానములు కలవు. ఆత్మజ్ఞానుడు ఆత్మరూపుడగుముని యగును. ఆత్మనెరుంగని వాడు అవిద్యచే అహంభావుడై యుండి నీచయోనులయందు మరల జన్మనెత్తును. అనగా మోక్షప్రాప్తి కనర్హుడుగా జీవించుచు భవ బంధముల బడి సుఖదుఃఖములను అనుభవించుచుండును. ఈ సర్వం మిథ్యయని, బ్రహ్మయే సత్యమని స్వప్రకాశ చిదాత్మరూపముతో స్థితిని పొందినచో ఆ జీవుడు ముక్తిని పొందును.

రామచంద్రా! జీవునకు రెండు మహాఘోరవ్యాధులు గలవు. అవి "ఇహ, పర" లోకములు, ఇహలోక మున ఆకలి దప్పికలతో అన్న పానాదులకై అలమటించుచు, నేదో రోగాలననుభవిస్తూ ఔషధములను తినుచు, అయినను అవియే నిత్యములని నమ్మి ప్రాకులాడుచు నరక జన్మ పరంపరలను పొందుచు జీవుడు జీవుడుగానే జీవించుచుండును. పరలోకంకోరువాడు సత్సంగాది, శాస్త్ర శ్రవణ మనన ములను ఔషధముల సేవించుచు మోక్షము నభిలషించు చుండును. అనగా జీవుడు జ్ఞాతృ - జ్ఞాన - జ్ఞేయములను త్రిపుటి నశించు వాడైనచో జగద్భ్రాంతిలో పడి మరల మరల జన్మల నెత్తుచు, అదియును కర్మ ఫలిత జన్మలనెత్తుచుండును.

కావున రామచంద్రా! ఈ జగత్తు అసత్తుగా నెరింగినవాడు అహంవీడి లక్ష్యమైనట్టి ఆత్మాన్వేషణకై పరితపించుచు పురుష ప్రయత్నములో బ్రహ్మ స్వరూపము నెరిగి తుదకు బ్రహ్మ ప్రదమును పొందును.

4. శ్రీరాముడిట్లు ప్రశ్నించెను. మహర్షీ! 'సమాధి రూప' వృక్ష ఫలమును గూర్చి తెలుపుడు. వశిష్ఠుడిట్లు సమాధానముగా, రామచంద్రా! సంసార సౌఖ్యయాతనల యెడల పరమవైరాగ్య భావనయే సమాధి రూప వృక్షమునకు బీజము, అందులకు జ్ఞాని అట్టి సంసార విషయాదులందు విరక్తి పొంది, ఇదంతయు వ్యవహార నటనలని, స్వప్న భూయిష్టమైనవిగా నెంచి, జగద్భ్రాంతిని వీడి, విజ్ఞాన సాధనలగు శాస్త్ర - శ్రవణ - పఠన - జపాదుల యందు ఆసక్తి గలవాడై దానాది సత్కర్మల నొనర్చుచు సహృదయుడై, ఈషణ త్రయములను (దార, ధన, పుత్రేషణలను) భస్మీ భూతమొనర్చు బ్రహ్మజ్ఞానుడై తుదకుముక్తి పొందును.

శ్రీరాముడిట్లడిగెను - మహాత్మా! ఈశ్వరుడనగా నెవరు? అతడు ఎట్లు ప్రసన్నుడగును?

వశిష్ఠుడిట్లు చెప్పెను. రామచంద్రా! బోధమయ స్వాత్మయే ఈశ్వరుడు. అతడు అంతరాత్మ స్వరూపమైన ఆత్మస్వరూపుడు. జీవుని జన్మల పరంపరల అభీష్టం ఆ పరమేశ్వరుడు పూజింపబడుచుండిన అప్పుడాతడు ప్రసన్నుడగును. సమత్వ ఆత్మ

స్వరూపునకు పరమేశ్వరుడొక వేద సమ్మతమైన ప్రణవం ఓంకారమును దూతగా పంపును. అతడే బోధ స్వరూపుడగు అంతరాత్మ అతడు రాగానే జీవునిలోని పిశాచ భావము నశించును. జీవుడప్పుడు నిశ్చలమగు మనోరూప ఆత్మ పద స్వరూపమును జేరును.

అదియే పరమార్ధ నిరూపణము. కావున రామచంద్రా! నీవు నిశ్చల మనస్కుడవై మౌనయుక్తుడవై యధా ప్రాప్తమగు కర్మలనాచరింపుచు శిలవలె ప్రజ్ఞాన ఘనుడవై శివరూపమగు ఆత్మ (బ్రహ్మ) స్వరూపము కమ్ము. కర్తృత్వ భోక్తృత్వములు సర్వము ఆత్మ రూపములే. ఆత్మజ్ఞాని నిర్వికారస్థితి యందే యుండి నిర్మలాకాశమువలె మోక్ష చిత్తవృత్తి కలిగి యుండిన, చిత్తము బహిర్ముఖ బంధము నుండి విడివడిన, ఆ చిత్తము పరబ్రహ్మ స్వరూపమై నిర్మల సూక్ష్మ శరీరధారుడగును.

రామచంద్రా! నిజముగా ఈ సృష్టియే మిధ్య. జీవన్ముక్తియే సాధనము. దానితో ఎందరో తరించిరి. అట్టి వారిని విశ్వసించని వారు మూర్ఖులు జ్ఞేయమగు ఆత్మజ్ఞానులు పరమాత్మ స్వరూపము నెరుంగుదురు వారే పురుషోత్తములు. ఆత్మజ్ఞులు, కావున నీవును బ్రహ్మ తత్వమును పొందుదు.

## ఆధ్యాత్మ విచారణ

వశిష్ఠుడు, ఆద్యంత రహితమగు శివరూపం ఆత్మయే అనునట్టి నిశ్చయము కల్గి యుండుటయే ఉత్కృష్టమైన జ్ఞానము అని పలికెను.

శ్రీవాల్మీకి భరద్వాజునితో విశ్వామిత్రుడు పల్కినది యిట్లు చెప్పెను. తేనెగల బంతిపై చీమలు తిరుగుచున్నట్లు, మనుజులు బ్రహ్మాండముపై తిరుగుచున్నారు. ఆ బ్రహ్మాండమే జగత్తు, అని పల్కిన విధము చెప్పుచూ -

వశిష్ఠుడు వెంటనే యిట్లనెను - రామచంద్రా! నాతోనొక మనుజుడు నొకముని ప్రబోధము నిట్లు వివరించెను. జీవుని ఆయువు క్షణ భంగురము. ఆత్మ యొక్కటే సత్యం. జీవుడు ఏభావముతో దేహత్యాగ మొనర్చునో, ఆ భావరూప జీవుడుగా అవతరించును. కావున, జీవుడు బ్రహ్మాకార బోధా భ్యాసముతో జ్ఞానియై, ఆధ్యాత్మ ఫలమును పొందును. రామచంద్రా! నీవు శాంతమనస్కుడవై ఓంకార ప్రణవమును ఆత్మయందు లయ మొనర్చి, తదేక నిష్ఠుడవై యుండి ఉత్తమమగు మోక్ష పధమును పొందుము. అదియే ఆత్మజ్ఞానికి శరణ్యము. లోకాచార వ్యవహారములకు దూరముగా నుండి శిష్టాచార విచారణలందుండి ఆదిశేషుని వలె మహాబుద్ధి కుశలతను ప్రదర్శించును. సద్గురువును చేరి మోక్షోపదేశము పొందుటకు యత్నించును. దృఢ చిత్తుడై ధ్యాననిమగ్నుడై ఆద్య స్వరూపమగు చిదాత్మ భావనతో అధిష్టాన దృష్టి కలిగినవాడై మోక్ష పధమగు చిద్రూప ఆనందస్థితిని జీవుడు

పొందును.

రామచంద్రా! జీవునకు సమ్యక్ జ్ఞాన ప్రబోధముచే మిథ్యయగు దృశ్య బుద్ధి నశించగా, నిరాకారమైన ముక్తిపై కాంక్ష కలుగును. జ్ఞాన రూపుడై ఆత్మరూపమైన ప్రబోధము వైపు మొగ్గు జూపుచు జగద్భ్రాంతిని వీడి, పూర్వాపర విచారణలతో సత్యత్వమునెరింగి, జగద్వాసనలకు లోనుగాక, చిదాత్మయందు ఉన్ముఖుడై బ్రహ్మ పథమును పొందును.

రామచంద్రా! నీవు యిట్టి ఆత్మ ప్రబోధమును పొంది ప్రబుద్ధుడవైతివి. మనో విశ్రాంతి నొందితివి. పరమార్థ స్థితిని పొందితివి. నీవలె, జీవులు సదాప్రశాంత స్థితులై నిర్మలమగు మోక్ష ప్రాప్తి పొందవలెనని ఈజ్ఞాన బోధ పరాకాష్ఠ చెందునని కాంక్షించుము. నీవిప్పుడు బ్రహ్మజ్ఞాన పరిపూర్ణుడవైతివి. నీ కోర్కెలన్ని తొలగిపోయెను గదా!

అట్లు, వశిష్ఠుడు పలికిన విధమును శ్రీవాల్మీకి భరద్వాజునితో, భరద్వాజా! శ్రీరాముని సందేహములు తీరిన తోడనే, అతడు శుద్ధ బుద్ధిచే పరబ్రహ్మ పదము నొందెను. అట్టి తరి సభాజనులందరు ధ్యాన నిమగ్నులై యుండగా, రాఘవుడు నిశ్శబ్దముగా నుండెను.

అచట నున్న సిద్ధుడును సభ్యుల నుద్దేశించి, వశిష్ఠుడు బోధించిన జ్ఞానామృతమును మనమెల్లరును గ్రోలి నూతన స్థితిని పొందితిమ"ని పలికెను.

అచట నున్న దశరథుడును వశిష్ఠుని నుద్దేశించి, స్వామీ! మీ బోధతో ఆత్మవస్తు ప్రాప్తితో మా అంతఃకరణములందు పూర్ణత్వం పొందితిమి. అందులకు నేనును నీ రాజ్యమంతయును మీ అధీన మందుంచితిన"ని పలికెను.

అందులకు, వశిష్ఠుడు యిట్లనెను. "రాజా! బ్రాహ్మణులమైన మేము, ప్రణవము చేతనే సంతుష్టిని పొందువారము. నేను బోధించినది సత్కార్యాచరణము, అందులకు రాజ్యాదుల రాజభారము మేము వహించలేము". అని పలికెను.

అట్లు వశిష్ఠుడు, రాజ్యాకాంక్షా విముఖత జూపడంతో దశరథుడు, మునీంద్రా! మీరు మాకు జూపిన "బ్రహ్మాత్మ రూపము"తో రాజ్యమును పోల్చినచో ఈరాజ్యము విలువ ఏమాత్రము సరితూగును? అని పలికెను.

అటుల వాల్మీకి ఆ వృత్తాంతమును జెప్పుచూ, అనంత అభీష్ఠములచే పరమభక్తితో తమ గురువైన వశిష్ఠునకు మరల మరల ప్రణామము లొనర్చుచు, యిట్లనెను.

మహాత్మా! మీ బోధతో నాభ్రాంతులన్నియును శమించినవి. నిర్మలమగు ఆత్మరూపముతో శుద్ధుడనైతిని. నామనస్సు వెలిసి, పరమ శాంతిని పొందినది. అవస్థాత్రయము దాటి తురీయావస్థ నొందితిని. అందరి రాజులవలె విషాద రహితుడైన ఆత్మ నిశ్చిత స్థితిని పొందితిని. నాలోని మాలిన్యము తొలగగా, ఈ స్వకీయ ఆత్మదేహముగా,

విశాల బ్రహ్మాండమును జూచుచున్నాను. నాలో హర్ష - విషాదములు సమానులై అపరిచ్ఛిన్న ఆత్మ పథమును పొందినట్లైనది. అని పలికెను.

వశిష్ఠుడిట్లనెను - రామచంద్రా! చాలా సంతోషము, "నేను పదేశించినది, శాస్త్రము తెలిపినది, మరియు స్వానుభవమ"ను **ఈమూడింటితో** పరస్పర విరోధము లేక, ఏక వాక్యముగా నొనర్చుము. **ఆత్మ వస్తువునకు జనన మరణ**ములుండవు. ఈ జనన మరణములు భ్రమలు మాత్రమే. **అట్టి సత్యమెరిగి, ఆత్మస్థితిగా, ధర్మ** బద్ధంగా రాజ్యపాలనము చేయుము. అని పలికెను.

అటుల వశిష్ఠుడు బోధించిన వాక్యములకు దశరథుడును, విశ్వామిత్రుడును, నారదుడును, లక్ష్మణ, భరత, శతృఘ్నులును విని, తామెల్లరు ఈ దృశ్య భ్రాంతిని తొలగితిమని, ఆత్మ ప్రకాశము నొందితిమని, అత్యంత పవిత్ర గంగాస్నాన మొనర్చినంత శుద్ధులమైతిమని, నిరతి శయానంద రూపుల మైతిమని పల్కిరి.

ఇట్టి వశిష్ఠ ప్రోక్తమగు జ్ఞాన బోధతో అచట నున్న అరిష్ఠుడు, అగస్త్యుడు, సుతీక్ష్ణుడును సంతుష్ఠులై వశిష్ఠుని శ్లాఘించి వెడలిరి.

భరద్వాజా! ఈ వశిష్ఠుని జ్ఞాన బోధను నీకు జెప్పి నీతోబాటు నేను ధన్యుడనైతినని శ్రీ వాల్మీకియు వశిష్ఠుని మిక్కిలి శ్లాఘించెను.

## ఇతి జ్ఞానయోగ వాశిష్ఠ్యం సమాప్తం

★★★

### గురు - సూత్రములు

భగవత్కథా శ్రవణాదుల బోధనతో హృదయస్థితమైన అనాది దుర్వాసనా గ్రంథి వినాశనమగును. దానితో హృదయమందున్న సర్వకామములు నశించును.

★★★

భక్తి చింతనతో వైరాగ్యమేర్పడి, దానితో బుద్ధి విజ్ఞానావిర్భావమగును. అజ్ఞానము క్రమంగా పరిపక్వమై జీవన్ముక్తుడగును.

★★★

# 24. శ్రీ జగద్గురు వ్యాస భగవానుడు

శ్లో॥ కృష్ణద్వైపాయనం వ్యాసం విద్ధినారాయణం ప్రభుమ్ ।
కోహ్యన్యః పుండరీకాక్షాన్మహాభారత కృద్భవేత్ ॥

జగమునందు అజ్ఞానమగు అంధకారం ఆవరించినపుడు మహాభారతమను తైలమునుపోసి, జ్ఞాన దీపమును వెలిగించిన మహాకరుణాశాలి శ్రీవేద వ్యాసుడు.

మహాభారతం ఆది పర్వంలో "క్రియాహీన కథం విప్రో భవేదృషి రుదారధీః" వివాహాది సంస్కారములు లేని స్త్రీని విధి పూర్వకముగా యాజ్ఞవల్క్యులు వివాహ హోమమొనరించినపుడు పరాశురులు వివాహమాడిరి. భగవంతుడును "నీ ఉదరమున అవతరించెదను". అని పరాశరులకు వరమొసంగి యుండినందున, యమునానదీ తీరమున అట్లవతరించెను. అట్లవతరించుట శుక్ల శోణిత సంబంధముతో పుట్టుట కాదు. అవతరించుటతో ఏడుసంవత్సరముల బాలునివలె పెరిగి నిలబడెను. జగద్గురువుగా, జగన్నాథుడుగా నున్న వ్యాసుడిట్లు అవతరించుటెట్లో, అతని కుమారుడును, శుక రూపమున వచ్చి వేదు కొనిన ఘృతాచికి, పుత్రుడుగా శుకుడు అవతరించెను. అనగా వేదవ్యాసులు తమ అద్భుత శక్తితో అరుణ్యోస్తనయం సృష్ట్వా అరుణులతో శిశువును జన్మింపజేసిరి.

వ్యాసులవారు దారియందు పోవుచున్న ఒక కీటకమును కూర్చుండబెట్టి దానిని రాజ్యమును ఏలినట్లుగా చేసిరి. అప్పుడు రాజులందరు కప్పములను, కానుకలను చెల్లించిరి. కాని అధిక్షేపించిన వారు లేరు. అనగా వ్యాసులు చేసినదే 'ధర్మము'. అది అందరికిని శిరోధార్యం, ఎవరునూ విరోధమును వ్యక్త పరచకుండగ తమ శిరములను వంచి యుండరు.

అట్టి వేదవ్యాసుల "మహా భారతకథ" ప్రారంభమున కంటే ముందుగనే, ఆ మహాభారత రచనను చేసి యుండిరి. "సర్వ శాస్త్రార్థ నిదర్శనాత్మకం" సకల శాస్త్రార్థమగు హరి సర్వోత్తమత్వము వాయు జీవోత్తమత్వమును ప్రతిపాదించు వేదముల కంటె ఉత్తమ మగు మహాభారతమును పంచమ వేదముగా ఖ్యాతి నొందించుట భగవంతుని కంటే వేరెవరికి సాధ్యమగును? అందుకే 'కోహ్యన్యః పుండరీ కాక్షాత్ మహాభారత కృద్ భవేత్" అను ఉద్గారం వెలువడినది. అదొక మహాప్రపంచ మహత్తర గ్రంథము. ఆ ప్రపంచమే వేరు. ఆ మహత్తర రచనతోనే 'వ్యాసోశ్చిష్టం జగత్సర్వం' అని ప్రసిద్ధి. దాంతో అతడు జగద్గురువుగా నెంచబడెను. శ్రీమహావిష్ణువులోనున్న 24 మహాపురుషుల లక్షణాలున్న ఆ వేదవ్యాసుని అవతరణం పూర్ణిమ కాబట్టి వారి జన్మనక్షత్రముగా గురుపూర్ణిమగా వ్యాస పూర్ణిమను ఆషాఢ పూర్ణిమ నాడు జరుపుట జ్ఞాన భిక్షను పొంది నట్లగును.

ధ్యానం: వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।

నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమోనమః ॥

"శ్రీ గురు పూర్ణిమ. వ్యాస పూర్ణిమ" మరియు వ్యాస జయంతి. కరుణ, కృప పరమాత్మ యవతారమైన "గురువు" నుండి పూర్ణ రూప దృష్టి మన మీద ప్రసరిస్తుంది. ఇది కిరణ రూపముగా, చీకటిని పారద్రోలునట్టిదిగా, జ్ఞానోదయం కల్గిస్తూ, హృదయంలో తేజోవంత మొనర్చుచు, ఆనందం పొందింప జేస్తుంది. మనో వికాసమే బ్రహ్మానందం కదా! అదియే అతీతమైన **ఆత్మ జ్ఞానానందం పొందు** విందు దినము. ఈ గురుపూర్ణిమయే గురువందన దినముగా **ఏర్పడెను**. ఎందుకనగా **వీరితం**డ్రి పరాశరుడును గొప్ప గురువుగా నెంచబడెను.

"అష్టాదశ పురాణాని వేదద్వైపాయనో గురుః" అన్నట్లు - వ్యాసుడు,

శ్లో॥ అష్టాదశ పురాణాని వేదద్వైపాయనో గురుః ।
బ్రాహ్మం పాద్మం వైష్ణవంచ, శైవం భాగవతం తథా ॥

శ్లో॥ తథాన్యం నారదీయంచ మార్కండేయంచ సప్తమం ।
ఆగ్నేయ మష్టమం ప్రోక్తం భవిష్యం నవమం తథా ॥

శ్లో॥ దశమం బ్రహ్మవైవర్తం, లైఙ్గమేకాదశం స్మృతమ్ ।
వారాహం ద్వాదశం ప్రోక్తం స్కాంధంచాఽపి త్రయోదశం ॥

శ్లో॥ చతుర్దశం వామనంచ, కౌర్మం పంచదశం తథా ।
మాత్స్యంచ గారుడంచైవ బ్రహ్మాండంచ తతః పరః ॥ - (వరాహపురాణం)

శ్లో॥ అష్టాదశ పురాణానాం, నామధేయాని యః పఠేత్ ।
త్రి సంధ్యం జపతే నిత్యం, సోఽశ్వమేధ ఫలం లభేత్ ॥ - (మార్కండేయపురాణం)

రచించెను. ఇట్టి అష్టాదశ పురాణాలను మానవాళికి అందించిన దినము వైశాఖ పూర్ణిమదినముగా వ్యాసమహర్షి జయంతి జరుపుకోవడం శ్రేయోదాయకం.

కాశీ క్షేత్రానికి సమీపములో 'వ్యాస కాశీ' అనే గ్రామం కలదు. అక్కడ వ్యాసుని దేవాలయం ఉన్నది. అలాగే మన ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్ జిల్లాలో బాసర (వాసర) క్షేత్రంలో వ్యాసుని గుడి ప్రతిష్ఠింపబడి యున్నది. ఆ వ్యాస మహానుభావుడే అచట సరస్వతీ అమ్మవారిని ప్రతిష్ఠించినట్లుగా ఈ వైశాఖపూర్ణిమ నాడు అచట ఉత్సవములు జరుపుకుందురు.

ఈ దినము గురు పరంపరను జ్ఞాపకం చేసుకొను దినం. గురువు నుంచి శిష్యుడికి జ్ఞానోదయం కల్గించు శుభదినం. అఖండమైన ఆనందం పొందు దినమిది.

"గురువు" అను మూడక్షరముల పదము మోక్షప్రదం. ముముక్షత్వం పొందింప

జేయు గురువు పరమాత్మ స్వరూపుడు. ఆ గురువును పొందటమే శిష్యుని ప్రథమ కర్తవ్యం.

శిష్యుని కిహ పరముల రెండింటిలోను యానందం పొందింప జేయు గురువు సద్గురువే. అట్టి గురువును నాశ్రయించాలి. గురువు అవతరించడం శిష్యుల నుద్ధరించుటకే అజ్ఞానాంధకారములో అథః పతనమైన శిష్యులను జాగృత పరచు వాడు గురువు. క్రమక్రమముగా జ్ఞానసోపాన మధిరోహింప జేస్తూ, శిష్యుని బుద్ధిలో రగులు అజ్ఞానరగడలను, చంచలత్వమును రూపుమాపి, **ఆధ్యాత్మికంగా మోక్షా**పేక్ష మనస్సున నాటునట్లు జేయువాడు గురువు. లోపాలను సరిదిద్దు**వాడు గురువు.** గురువు దర్శనంతో పాపాలను పోగొట్టు కొంటాడు శిష్యుడు. జ్ఞానోదయంతో పూర్ణత్వాన్ని పొంది, వెల్లి విరియు ఆనందాన్ననుభవిస్తాడు.

కనుక, పూర్ణత్వాన్ని, ఆనందాన్ని కలిగించేదే "గురుపూర్ణిమ", "వ్యాస పూర్ణిమ"- "వేద ద్వైపాయనో గురుః" అనికదా! -

"పూర్ణిమ" అంటే, మనోవికాసంతో పరిపూర్ణమైన జ్ఞానోదయం, నిండుదనమైన ఆనందాన్ని పొందే, పొందింపజేయు గురువును జ్ఞాపకం జేసుకొనే రోజు. ఆది గురువగు "వ్యాసమహర్షి"ని తలచుకొనేరోజు. గాయత్రీ వంటి ఆధ్యాత్మిక మంత్రోపదేశం, మరేదైన జీవితాన్ని తరింపజేసుకొనే మంత్రోపదేశం, మరేదైనను సదుపదేశం పొందింప జేసిన గురువును జ్ఞాపకం జేసుకొనే రోజు ఈ గురుపూర్ణిమ. పరమ గురువులను చేరు పర్వదినమే పౌర్ణమి. వేదముల యందు, గురు శిష్యులకు నడుమ ఈ నాటి చంద్రుడు ద్వారముగా వర్తించుననియు, ఈ పౌర్ణమి నాడు అట్టి ద్వారములు తెరువబడుననియు, బుద్ధి వికాసం పొందు దినమని, ధ్యానమునకు మూలదినమని, అటులే ఆ దినమునకు రెండు దినములు ముందు పరమ గురువుల నుండి శక్తిని సోదరులకు పంచిపెట్టు అనుకూల దినములనియు, అట్టి పన్నెండు పున్నముల సార్థకత ఎంతో, ఎంతెంతో.

ఆ మంత్రోపదేశములీనాడు గానీ, మరేనాడు గానీ పఠించినచో, జపించినచో సిద్ధి, ముక్తి అవశ్యం లభించును. అంతెందులకు ఈ శ్లోకము పలుమార్లు పఠించినచో ఆ గురుస్థానములో నున్న త్రిమూర్తులను స్మరించునట్లుకాగా, తరించు శ్లోకమిది.

ఓం గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవేనమః ॥

త్రిమూర్తులగు బ్రహ్మ, విష్ణు, శివుడును, ఈ ముగ్గురు గురువులో నున్నారని, అజ్ఞానాన్ని పారద్రోలే బ్రహ్మ, పరిపాలించి రక్షించే విష్ణువు, పాపాలను హరింప జేసే శివుడు. ఈ గురుత్రయ రూపాలను స్మరించుకొంటూ నమస్కరించడం మనందరి కర్తవ్యము.

అటులనే ఈ"గురు పూర్ణిమ" నాడు మనము ఆది గురువగు త్రిమూర్త్యాత్మకుడగు శ్రీ గురుదత్తాత్రేయుని స్మరించుకొను రోజు. శ్రీరామ చంద్రునకు ఆది గురువితడు. మరియు కార్తవీర్యార్జుని తరింప జేసిన సద్గురువీతడు. శ్రీ దత్తుని దర్శించినచో త్రిమూర్తులను దర్శించినంత ఫలము. ఆయనలోనే వారున్నారు. శ్రీ దత్తుడు స్మరణమాత్రముననే సంతుష్టుడవుతాడు. కృపాకటాక్షములొసగు శ్రీదత్తస్వామి సూచన మేరకు దేవతలు ఉపాయంతో రాక్షసులను స్వామి వద్దకు తెచ్చిన రోజు. ఆనాడు ఆషాఢ పూర్ణిమ స్త్రీ పురుషరూప దర్శనంతో జ్ఞానం, ఆరోగ్యం, సంపత్తి నిచ్చు ఈ సద్గురు సన్నిధి, యుత్తమ నిధియగు ముక్తినిచ్చు పద సన్నిధి. భక్తి విశ్వాసములతో హృదయము నిండుగా ప్రేమతో నీ గురుదేవుని సేవించాలి. సద్గురువు సేవలో "శ్రద్ధాభక్తి" కలిగిన వారికే పునర్జన్మ రాహిత్యంతో నుత్తమ ప్రాప్తి కలుగును. ఇది నిస్సందేహము.

## వ్యాస చరిత్ర

శ్రీ గురుదత్తాత్రేయుని తర్వాత సద్గురువుగా స్మరించుకొను "ఈ గురుపూర్ణిమ" నాడు, "శ్రీ వ్యాస పూర్ణిమ"గా కూడ స్మరించు కొందుము.

ప్రస్తుతము 29వ చతుర్యుగం నడుస్తోంది. అనగా, 28 చదుర్యుగాలు గడిచినవి. ప్రస్తుతం ద్వాపర యుగాంతరంలో వెలసిన మహర్షి, వేద వ్యాస పీఠము నలంకరించిన మహామనీషి శ్రీకృష్ణ ద్వైపాయనుడు.

ఇట్టి ఋషి పుంగవులకు మూల పురుషుడు మహనీయుడు శ్రీవశిష్ఠుడు. అట్టి ఋషి వంశం ముగ్గురు వేద వ్యాసులను (శక్తి, పరాశర, శ్రీకృష్ణ ద్వైపాయనులు) వరుసగా నావిర్భవింపబడిరి.

"వ్యాస" అనునది "పదవి"పేరు. అని పరాశర సంహితలో కలదు. కనుక, ఆ పదవి **నలంకరించిన శ్రీకృష్ణ** ద్వైపాయనుని వ్యాసభగవానునిగా సద్గురువుగా స్మరించుకొను దినమే ఈ శ్రీ వ్యాసపూర్ణిమ. శ్రీ గురుపూర్ణిమ.

గురుశిష్య సంప్రదాయము బహు విశిష్టమైనది. దీని నేర్పరచిన ఘనత శ్రీవేదవ్యాస మహర్షికి చెందుతుంది. ఈ మహర్షిని వదలి సనాతన ధర్మం వాఙ్మయమును మనం ఊహించలేము. వేదములను గ్రహించి, సంస్కరించి, సంవిధానమొనర్చి తానే వేదవ్యాసునిగా వినుతికెక్కెను. వేదములను ఋగ్వేద, యజుర్వేద, సామాథర్వణములుగా విభజించిన కారణాన వేదవ్యాసునిగా సార్థక నామధేయుడయ్యెను. వేదం మేధస్సు యొక్క సజీవ రూపం. అది మహాతరంగంలా అవిచ్ఛిన్నధారలా తరతరాలుగా సాగి వచ్చునది. అందుకే, "అనన్తావై వేదాః" వేదములు అనంతములు.

సృష్టి, కాలములును అనంతములు. అనంతమే అనంతమును దర్శింప జేయగలదు.

శ్లో॥ ఏవంచకార భగవాన్ వ్యాసః కృపణవత్సలః ।
వ్యవధాత్యజ్ఞ సంతత్యై వేదమేకం చతుర్విధం ॥

వ్యాసుడు కరుణ, వాత్సల్యం కలవాడు. రానున్నకాలంలో జనం అజ్ఞులై, సామర్థ్యములేని వారుగా గ్రహించి, వారికై వేదాన్ని నాలుగుగా విభజించెను.

ఇట్టి వ్యాసభగవానుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే. స్వల్ప ఆయుష్కులను, బలహీనులను, బుద్ధి హీనులగు వారిని జూచి శ్రీమన్నారాయణుడు "సత్యవతి - పరాశరుల" పుత్రుడుగా జనించి వేదమును నాలుగు విధములుగా విభజించెను. అట్లు విభజించిన వేదములను తన శిష్యులైన నలుగురికి బోధించెను.

1. పైలుడను శిష్యునకు ఋగ్వేదమును,
2. వైశంపాయనునకు యజుర్వేదమును,
3. జైమిని అను శిష్యునకు సామవేదమును.
4. సుమంతునకు అథర్వణ వేదమును బోధించెను.

ఇట్లు వేదమును విభజించి అందించిన వేదవ్యాసుడు, వేదములను గ్రహించలేని వారల కొరకు అష్టాదశ పురాణములను, ఉప పురాణములను, ఇతిహాసములను రచించి అందించెను. వేద విజ్ఞానమును సులభతర మొనర్చుటయే ఈ రచనల ముఖ్యోద్దేశము.

"ఇతిహాస పురాణాభ్యాం వేదం సముప బృంహయేత్"

అని శాస్త్రవచనమై యున్నది. అందుచేతనే వ్యాస భగవానుడు రచించిన మహాభారతమును పంచమ వేదముగా వినుతి కెక్కెను. వ్యాసులవారిని 'పురాణ బ్రహ్మ'గా కొనియాడిరి. అందుచే మహనీయులన్నారు "అచతుర్వదనో బ్రహ్మ ద్విబాహు రపరో హరిః అఫాలలోచన శ్శంభుః భగవాన్ బాదరాయణః" అనుటలో అతిశయోక్తి కాదు. వ్యాసులవారు తెలిసి ఏ లయకృత్యము చేయలేదు. జ్ఞాననేత్రాన్ని (ఫాలలోచనం) విస్ఫారితం చేసాడే తప్ప. ఇచట రుద్రనేత్రానికి జ్ఞాననేత్రం అని ఆదేశం అయింది. అందుకే చేతులెత్తి ధర్మానిగూర్చి పురాణ రచనలలో కన్నా భారతంలో ధర్మాన్ని జొప్పించినారు. కాని ఆ ధర్మాన్ని గూర్చి తెలుసుకుని ఆచరించుటయే మానవుల కర్తవ్యము. అని సూచించెను. మానవులపట్ల వారికంత ప్రీతి, ప్రేమ. అందుకే వారు జ్ఞానగురువులనిపించుకొనిరి.

శ్లో॥ శాంతోదాంతః కులీనశ్చ వినీతః శుద్ధవేషవాన్ ।
శుద్ధాచారః సుప్రతిష్టః శుచిర్దక్ష సుబుద్ధిమాన్ ॥

శ్లో॥ ఆధ్యాత్మ జ్ఞానసష్టశ్చమంత్ర తంత్ర విశారదః ।
నిగ్రహ న గ్రహేశక్తో గురురిత్యభి ధీయతే ॥

అట్టివాడే గురువు అనిపించుకొను. అట్టి వ్యాసుడు ధర్మ సూక్ష్మములను తెలియజేయు నీ భారతమును తన శిష్యుడైన రోమహర్షునికి బోధించెను.

అలాగే ప్రాయశ్చిత్తముగా, మనశ్శాంతి కలుగుటకై భక్తిరస ప్రధానమైన శ్రీమద్భాగవతమును రచించి తన కుమారుడు, శిష్యుడైన శుక బ్రహ్మకు బోధించెను.

వేదాంతర్గత తాత్త్విక విషయములను సులభ గ్రాహ్యమొనర్చుటకు న్యాయ ప్రస్థానమైన బ్రహ్మ సూత్రములను రచించి సర్వులచే జ్ఞాన శక్త్యావతారుడుగా కీర్తించబడెను.

ఇట్టి ఆధ్యాత్మిక గురువులు ఆదిదేవునితో సమానమైనవారు. వారు పొందు ఆత్మానందము నితరులకును పంచవలెననెడి తపనయే వారి వాంఛ. అట్టి వేదవ్యాసునకు సుమనస్సుమాంజలు.

శ్లో॥ జయంతి పరాశర సూనుః సత్యవతీ హృదయ నందనో వ్యాసః ।
యస్యాస్య కమల గళితం వాఙ్మయ మమృతం జగత్పిబతి ॥

ఎవని ముఖ కమలం నుంచి వెలువడే వాఙ్మయమనే అమృతాన్ని ప్రపంచమంతా సేవిస్తోందో అటువంటి పరాశర తనయుడూ, సత్యవతి హృదయానికి ఆనందం పొందింపజేసే వాడూ అయిన వ్యాసుడు వెలుగొందుతున్నాడు.

**ఇట్టి వ్యాసుడు** సమాజం దృష్టికి విచిత్రంగా, విలక్షణంగా నగుపించే జన్మ నేపథ్యంగల **వాడుగా, యావత్ప్రపంచాన్ని** నెత్తిన ధరించి పూజించే అత్యుత్తమ ఇతిహాసాలను అందించి సర్వులకు జ్ఞాన భిక్ష పెట్టడం సమనార్హ విశేషం.

ఈ వ్యాసుడు వశిష్ఠుని కుమారుడగు "శక్తి"కి తనయుడగు పరాశరుని కుమారుడు. అనగా "బ్రహ్మర్షి"గా పేరొందిన వశిష్ఠుని ముని మనుమడవుతాడు. ఇక వ్యాసుని తల్లి "సత్యవతి". ఈమే "ఉపరిచర వసువు" అనే రాజు వీర్యంతో యమునా నదిలోని నొక చేప ధరించగా, ఆ చేప గర్భం దాల్చి, శిశువును కనెను. ఆ శిశువు "మత్స్యగంధి" అనే పేరుతో వర్ధిల్లెను. ఈమెను బోయరాజగు దాశరాజు పెంచి పెద్ద చేసెను. ఆ యమునా నదినే దాటుటకు పడవ నడుపు నిమిత్తమై ఈ మత్స్యగంధిని నియమింప జేయగా, నొకనాడు పరాశరుడు తీర్థయాత్రగా ఆ యమునా నదిని దాటవలసి వచ్చెను.- నదిని దాటించిన (సత్యవతిని) మత్స్యగంధిని చూచి మనసు చలించిన పరాశరుడు ఆమెతో పొందుగోరెను

కాని తన తండ్రి దాశరాజు అనుమతి లేదు గనుక, తన శీలం నశించునని సందేహించడంతో, పరాశరుడు ఆమె కన్యాత్వం భంగం కలుగకుండా వరమిచ్చి ఆమెతో దాంపత్యం జరిపెను. ఆ కారణాన ఆ మత్స్యగంధికి ఈ వ్యాసుడు జనించెను. పుట్టుకతోనే జడధారిగా, దండ కమండలాలతో పుట్టి తల్లికి నమస్కరించాడట. ఆ తల్లి ఆశ్చర్యపడింది. ఇంకేముంది లోకోద్ధరణకై పుట్టినాననే తలంపుతో, "అమ్మా! నేనిక తపస్సుకై వెళ్తున్నాను, నన్నాశీర్వదించ"మని వేడెను. తల్లి దుఃఖించగా, అవసరమైనప్పుడు నన్ను స్మరించిన తోడనే నీ యెదుట ప్రత్యక్షమవుతానని మాట యిచ్చి సరస్వతీ నదీ ప్రాంతమున బదరికాశ్రమమున 'శమ్యాప్రాసం' అనే ఆశ్రమం చేరెను.

ఆ ఆశ్రమం నల్లని జింకలతో కూడి యున్ననొక ద్వీపకల్పం. అందు నివసించిన కారణాన వ్యాసునకు కృష్ణ ద్వైపాయనుడను పేరు ఖ్యాతికెక్కెను. ముక్త జీవుడైనవ్యాసుడు త్రికాలవేది గనుక రాబోవు కలియుగము అజ్ఞానాంధకారం, అవిద్యల గూర్చి తెలిసినవాడై యుండెను. అందుకని -

శ్లో॥ చాతుర్హోత్రం కర్మశుద్ధం ప్రజానాం వీక్ష్యవైదికమ్ ।
వ్యదధాద్యజ్ఞ సన్తత్యై వేదమేకం చతుర్విధమ్ ॥

(భాగ.- 1వ స్కం- 4వ అ-19వ శ్లో)

భా:- మానవుల కర్మలు శుద్ధి పరచుటకు వేదములందు తెలుపబడిన యజ్ఞములే మార్గములని ఆ యజ్ఞములను జనులయందు వ్యాప్తి చేయుటకై ఏకముగానున్న వేదమును సులభ పద్ధతిలో అవగతమొనర్చుకొనుటకు వ్యాసుడు ఆ వేదమును నాలుగు భాగములుగా విభజించెను.

శ్లో॥ త ఏవ వేద దుర్మేధై ర్ధార్యన్తే పురుషైర్యథా ।
ఏవం చకార భగవాన్ వ్యాసః కృపణ వత్సలః ॥

(భాగ.- 1వ స్కం- 4వ అ-24వ శ్లో)

భా:- ఎందుకనగా రాబోవు కలియుగ జనులు రజస్తమో గుణులై మందబుద్ధులై యుందురని సులభముగా గ్రహించగల రీతిలో వ్యాసుడు వేదమును విభజించెను-

జనులకిది జీవిత పరమలక్ష్య ప్రాప్తిని కలుగజేయగలదని వ్యాసముని కరుణతో భావించెను.

ఆ విధముగా నతడు స్త్రీలు, శూద్రులు, ద్విజ బంధువుల నిమిత్తమై నాలుగు వేదములందు తెలుపబడిన ఉపదేశములను వివరించు అష్టాదశ పురాణములు, మరియు ముఖ్య ప్రయోజనము తెలుపుటకు మహాభారతము ప్రామాణికంగా రచించుటతో అది

పంచమవేదముగా ఛాందోగ్యోపనిషత్తు (7-1-4) నందు పేర్కొనబడినది - ఇదొక ధర్మశాస్త్ర విలువలను నిర్ధారించుటకు ఇతి హాస రచన.

ద్విజ బంధువులనగా - ఒకవేళ తల్లి దండ్రులు గర్భాదాన సంస్కారమును పాటించకుండా కేవలం తమోగుణముతో సంతానోత్పత్తి పొందినచో వారిని ద్విజబంధువులు అనబడుదురు. ద్విజ బంధువులు ద్విజులతో పోల్చినచో నిక్కముగా అల్పజ్ఞులై యుందురు:

అట్టి మహాభారతమునందు వేద, ఉపనిషత్తుల సారాంశం భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు పలికినట్లుగా పొందుపరిచారు వ్యాసులవారు. శ్రీకృష్ణ భగవానుని ద్వారా నేర్చిన వేద జ్ఞానమునకు వ్యాసుడు తొలి శిష్యుడు. అందుకని శ్రీకృష్ణ భగవానుడు మరియు వ్యాసులవారిరువురును దివ్యులు.

వేదాన్ని (ఆమ్నాయాన్ని) లేఖ్యం కావించడంతోగాక భారతమనే జీవితకధగా లిఖించబడిన వేదాన్ని వ్యాసుడు గ్రంథస్థం చేశాడనే భావనతో తిక్కనగారు భారతాఖ్యమగు లేఖ్యంబైన ఆమ్నాయంబు కృష్ణద్వైపాయనుడు కావించనని అన్నాడు.

తన తండ్రి ఇచ్చిన విష్ణుపురాణం ఆదర్శంగా గ్రహించి బ్రాహ్మణములను కూర్చాడు. వీటిని వివరిస్తూ గురుకులాలలో వుండే మహర్షులు శిష్యులకు చేసిన ప్రభోధకాలే ఆరణ్యకాలుగా రూపుకట్టుకున్నాయి.

ఇక వేదాలను విభజించిన కారణాన వేదవ్యాసుడుగా ప్రఖ్యాతుడయ్యెను. వేదాల నధ్యయనం చేసిన వాడు వేదవేత్తగా, శాస్త్రాల నధ్యయనం చేసినవాడు శాస్త్రవేత్తగా వినుతికెక్కుదురు.

మరి వేద విభజన ఏమిటి?

వేదమనే మాటకు బ్రహ్మ, శ్రుతి, జ్ఞానం ఇత్యాది అర్థాలు, నామాలు కలవు. ఒక్కొక్క కార్యానికి పరమేశ్వరుడు తన అంశతో నొక్కొక్క అవతరాన్ని సృష్టింప జేస్తాడు. అటులే వ్యాసుడునూ అటువంటి అవతార పురుషుడుగా జనించెను. ద్వాపర యుగంలో పరాశర, సత్యవతుల పుత్రుడుగా ప్రకటనమైన ఈ వ్యాసుడు వాస్తవంగా శ్రీమన్నారాయణునికి పుట్టిన మానస పుత్రుడు. అప్పుడతని పేరు "అపాంతరముడు". అనగా, లోనున్న అజ్ఞానాన్ని (చీకటిని) తొలగించు కున్నవాడగుటచే, నేరుగా బ్రహ్మముఖం నుండి వెలువడిన వేదాలను శ్రద్ధగా నాలకించగా, వాటిని విభజించమని శ్రీమన్నారాయణుడే ఈ అపాంతరముని ఆదేశించాడు. ఆ ఆజ్ఞతో ఈ వేదవిభజనకు అపాంతరముడు పూనుకుని చక్కగా నిర్వర్తించెను. బ్రహ్మయును నెంతో సంతోషించెను. ఆ అపాంతరతమునకు బ్రహ్మ వేదవ్యాసుడనే బిరుదునిచ్చి, ఇటులే ప్రతి మన్వంతరంలోనూ వేద విభజన చేస్తూండమని బ్రహ్మకోరెను.

ఈ విధంగా వ్యాసుడు వేదాలను వ్యాసమొనర్చి వేదవ్యాసుడుగా సూచింపబడెను.

కనుక ప్రతిద్వాపరయుగంలో వేదవిభజన జరుగుతూంటుంది. ప్రథమ ద్వాపరంలో స్వయంభువు, ద్వితీయ ద్వాపరంలో ప్రజాపతి, తృతీయ ద్వాపరంలో శుక్రుడు, ఆ తర్వాత బృహస్పతి, వశిష్ఠుడు, త్రివర్ణుడు మొదలైనవారు ఈ 'వ్యాస' పదవిని అలంకరించినారు. గడచిన ద్వాపరంలో ఈ కృష్ణ ద్వైపాయనుడు, పరాశర - సత్యవతుల పుత్రుడుగా జన్మించి వేదవ్యాసుడుగా వినుతికెక్కెను.

ఇంతటి మహనీయునకును మహాభారత రచన కథానంతరం మనస్సులో నేదో అసంతృప్తి నిలిచెను. ఆ అసంతృప్తికి కారణమును ఎరిగియున్న నారదుడు, వ్యాసుడు తనకు తొలి ఆధ్యాత్మిక ఆచార్యుడు గనుక, మందహాసముతో నిట్లనెను - "మునీంద్రా! నీ విచారణలు పూర్ణములైనట్టివి. ఘనమైన మహాభారత రచనతో బాటు సనాతనత్వమును గూర్చి చర్చించినట్టి బ్రహ్మ సూత్రముల రచనము విద్వత్పూర్ణమై యున్నది. అదొక అత్యంత తాత్విక వ్యాఖ్యానముగా సంగ్రహింపబడినది. అట్టియెడ అసంతృప్తికి కారణమేమి?" అని ప్రశ్నించెను.

వ్యాసుడిట్లనెను - "బ్రహ్మతనయా! నా అసంతృప్తికి కారణము మీరెరుగరా? నాలో నిలిచిన ఈ అసంతృప్తికి గల లోపమేది? దయతో అన్వేషింపుడు." అని కోరెను.

నారదుడిట్లనెను -

"శ్లో॥ భవతానుదిత ప్రాయం యశో భగవతోఽమలమ్ ।
యేనైవా సౌన తుష్యేత మన్యే తద్దర్శనమ్ ఖిలమ్ ॥

- (భాగ. ప్ర.స్కం.5 అ - 8 శ్లో)

భా:- ఉదాత్తములును మరియు అమలములును అయిన శ్రీకృష్ణ భగవానుని వైభవములను నీవు వాస్తవముగా కీర్తించలేదు. భగవానుని దివ్యేంద్రియములను సంతృప్తిపరుప జాలనట్టి తత్త్వము నిరర్థకమైనదిగా భావింపబడును.

అనగా భగవత్సేవయే జీవులను సంతృప్తి పరచునది కదా! మరియు -

శ్లో॥ యథా ధర్మాదయశ్చార్థా మునివర్యాను కీర్తితాః ।
న తథా వాసుదేవస్య మహిమాహ్యాను వర్ణితః ॥

- (భాగ. ప్ర.స్కం.5 అ - 9 శ్లో)

భా: ధర్మాది చతుర్విధ ఫలపురుషార్థములను నీవు విశదముగా వర్ణించినను, దేవదేవుడైన వాసుదేవుని మహిమలను మాత్రము సమగ్రముగా వర్ణింపలేదు"- అనెను

నారద ముని కావించిన చక్కని రోగనిర్ణయము ప్రస్తావింపబడినది. అనగా వ్యాకులతకు మూలకారణం శ్రీకృష్ణుని కీర్తన చేయుట వదలివేయుటయే. ప్రామాణికమగు భక్తియుక్త సేవకు ప్రాముఖ్యత నొసగక పోవడమే. శ్రీకృష్ణ భగవానుని భక్తి యుక్త సేవలో నియుక్తులు కాకుండా ఎవ్వరునూ దివ్యానందమును పొందజాలరని స్పష్టము.

మరియు నిట్లనెను -

"శ్లో॥ న యద్వచశ్చిత్రపదం హరేర్యశో జగత్పవిత్రం ప్రగృణీత కర్హిచిత్ ।
తద్వాయసం తీర్థముశన్తి మానసా న యత్ర హంసా నిరమన్త్య శిక్‌క్షయాః ॥

భా: సమస్త విశ్వమును పవిత్రమొనర్చు శ్రీకృష్ణ భగవానుని యశస్సును కీర్తించునటువంటి వచనములు మహాత్ములైన వారిచే "వాయస తీర్థము"గా పరిగణింపబడును. పరమహంసలైన వారు వాస్తవమునకు దివ్యధామమున వసించునట్టి వారు గనుక, అట్టి వాయస తీర్థమునందు రమింపగోరరు" అని పలికెను.

ఇచట హంసలు, మరియు కాకులు ఒకే జాతి పక్షులైనను, కామ్యకర్మరీతులుగా, లేక రజోగుణ స్వభావులు కాకులైతే, పరమ హంసలుగా సత్త్వగుణుల సంపదలు గల మహాత్ములతో హంసలను పోల్చబడును. అనగా సజాతులైనను, భిన్న ప్రవృత్తుల జాతుల పోలిక గ్రహించదగినది.

మరల నారదుడిట్లనెను -

"ఓ వ్యాసదేవా! నీదృష్టి అమోఘమైనది. నీ యశస్సు నిష్కళంకమైనది. దృఢవ్రతుడవైన నీవు సత్యవ్రతుడవు. కనుక జనుల భవ బంధ విముక్తికై నీవు సమాధిమగ్నుడవై ఉరుక్రముడైన శ్రీకృష్ణ భగవానుని దివ్యలీలానుస్మరణమును గావింపుము. అనగా దివ్యసాహిత్య గ్రంధమును రచింపుడు. జీవులు వాంఛించు నిత్యశాంతిని మరియు దుఃఖ విముక్తిని కలిగించే పూర్ణ పురుషోత్తముడైన శ్రీకృష్ణ భగవానుని దివ్యలీలా గాథలను వర్ణిస్తూ రచింపుడు. అద్దానిని నెరుగుటచే మనుజుడు ఆ దేవదేవుని చెంతకే చేరగలడు. శ్రీకృష్ణ భగవానునితో గల నిత్య సంబంధమును పునః స్థాపించుటయే మానవుని ఏకైక ధర్మమైయున్నది.

వేదార్థములను ప్రామాణికముగా మహాభారతాది గ్రంథములందు వివరించునట్లుగా శ్రీకృష్ణ భగవానుని దివ్యచరితమగు 'శ్రీమద్భాగవతమును' వర్ణించి రచించుటకు సరియైన వాడవు నీవే. అసంతృప్తి నుండి బయట పడుటకు అన్యమార్గము వేరొక్కటి లేదు"

అ. నారదుడు తన స్వానుభవ సంకీర్తనల మహిమలను కొనియాడి ధన్యుడై వ్యాసుని 'శ్రీమద్భాగవతం' అను గ్రంధరచనకు పురమాయించి సెలవుగైకొని వెడలెను.

అట్టి నారదుని ప్రేరణతో వ్యాసుడు తన ఆశ్రమమందు ఆసీనుడై, పవిత్రీకరణకై ఆచమనముగావించి భక్తి యోగమునందు ధ్యానమగ్నుడై పూర్ణ పురుషోత్తముని పరమసత్య కథలను నెరింగినవాడై, వేద వాఙ్మయమగు శ్రీమద్భాగవతమును భక్తి తత్త్వంతో రంచించెను.

శ్లో॥ ఇదం భాగవతం నామ పురాణం బ్రహ్మ సమ్మితమ్ ।
ఉత్తమ శ్లోక చరితం చకార భగవానృషిః ।
నిః శ్రేయసాయ లోకస్య ధన్యం స్వస్త్యయనం మహత్ ॥

పునర్విమర్శ గావించుకొనిన పిమ్మట ఆత్మానుభవమునందు అంతకు పూర్వమే నిమగ్నుడైనట్టి తన పుత్రుడగు శ్రీశుక మహర్షికి బోధించి కృతార్థుడయ్యెను.

వ్యాసుడు జగత్తంతా సేవించే వాఙ్మయామృతాన్ని ప్రసాదించడం గొప్ప విశేషం. మహాపురుషుల జన్మవృత్తాంతాలు యెంతో విలక్షణంగా నుంటాయి. సాధారణ బుద్ధికి అర్థంకాని అంతరార్థాలు, పరమార్థాలు వాటిలో (జన్మ)లో దాగి ఉంటాయి.

యుగాల పరంపరలో జీవుల ఆయుర్దాయం, మేధాశక్తి తగ్గుతూండంతో విపరీత వ్యాఖ్యలు చేసే అల్పబుద్ధులకై సులభంగా గ్రాహ్యమగు వేదవిజ్ఞానం అవిచ్ఛిన్నంగా కొనసాగవలసినదే.

"బ్రహ్మసూత్ర కృతే తస్మై వేద వ్యాసాయ వేధసే ।
జ్ఞాన శక్త్యావ తారాయ నమో భగవతే హరేః ॥

బ్రహ్మ సూత్రకర్త శ్రీమన్నారాయణుని జ్ఞాన శక్తి అవతారమైన వేదవ్యాసునకు నమస్కారం ఎందుకనగా "వేదవ్యాస" నామం, నివాసం సరస్వతీ వాసం. జగత్తుకు నిజమైన జ్ఞాన భిక్షపెట్టిన అవతార జగద్గురువు వ్యాసుడే..

"గురియే కదా గురువు" అన్నారు భగవాన్ శ్రీరమణ మహర్షి. గురువు కానిదేదీ జగత్తులో లేదు. గురువు మన కందుబాటులో నున్న భగవత్స్వరూపుడు. భగవంతుడికన్నా యెంతో కరుణామయుడు.

మన సంప్రదాయంలో గురువులుగా గణుతికెక్కిన వ్యాసుడు విశేషంగా స్మరించుకో తగ్గ మహనీయుడు.

శ్లో॥ నమోఽస్తుతే వ్యాస విశాల బుద్ధే పుల్లార విందాయత పత్రనేత్ర ।
యేనత్వయా భారత తైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయప్రదీపః ॥

భారతమనే చమురు నిండిన జ్ఞాన మయమైన దీపాన్ని వెలిగించిన మహామేధ కలిగిన వాడా! విచ్చిన తామర రేకులవంటి కనులు కలిగిన ఓ వ్యాసమహర్షీ! నీకిదే నమస్కారము.

అటువంటి మహోన్నత శిఖరాలనందుకున్న గురువగు వ్యాసుని భక్తితో, కృతజ్ఞతతో సుస్మరించుకొనే పర్వదినమే ఆషాఢ శుద్ధ పౌర్ణమి దినం. ఈ దినము అనాదిగా వస్తున్న ఆధ్యాత్మిక భిక్షను పొందు సుదినం.

ఈ రోజున సూర్య చంద్రులిరువురూ గురువు (బృహస్పతి)తో కలుస్తారు సూర్యుడు ఆత్మకును, చంద్రుడు మనస్సునకు, గురువు జ్ఞానానికి సంకేతాలని చెబుతారు. ఈ మూడింటి కలయికే గురుపూర్ణిమ.

ఇట్టి గురుపూర్ణిమ ప్రాముఖ్యాన్ని తెలియజేసే కథ బ్రహ్మాండ పురాణములో నిట్లున్నది. ఇది నారదుడు వైశంపాయనునకు చెప్పినకథ.

పూర్వం కాశీలో "వేదనిధి - వేదవతి" అనే నిరుపేద దంపతులుండేవారు. వారికి ఎంతకాలానికి సంతానము కలుగులేదు. ప్రతిరోజు మధ్యాహ్నము వ్యాసమహర్షి రహస్యంగా గంగానదికి వచ్చి స్నానం చేసి వెడతారని, వేదనిధికి ఎవరో చెప్పారు అందుకు వ్యాసుని దర్శించి అనుగ్రహము పొందవలెనని వేదనిధికి ఆశ జనించింది. ఆ రోజే మధ్యాహ్నం మండుటెండలో వేదనిధి గంగా తీరానికి చేరుకొని వ్యాసుని రాకకై ఎదురు చూస్తుండగా, వ్యాసుడేనొక భిక్షుక రూపంలో రాగా, "స్వామి! నన్ననుగ్రహించండి, మీరే వ్యాసులు - మీరు తప్ప నన్ననుగ్రహించువారు లేరు." అనిగట్టిగా వారి పాదాలు పట్టి వేడు కొన్నాడు. వేదనిధి విశ్వాసానికి విశ్వసించిన వ్యాసుడు ప్రసన్నుడై "నాయనా! ఏమికావాలో కోరుకో" అని సెలవివ్వగా, "స్వామి! రేపు మాతండ్రిగారి ఆబ్దికం, మీరు బ్రాహ్మణులుగా రమ్మ"ని కోరాడు. అందుకు వ్యాసుడు తాను వ్యాసుడన్న సంగతి రహస్యంగా నుంచవలెనని షరతు పెట్టాడు. ఎటులో తన కోరిక మన్నించినందుకు వేదనిధి పరమానందంతో ఉప్పొంగి, అందుకు సమ్మతించి ఇంటికి వెళ్ళి తన భార్య వేదవతితోను ఈ వార్త చెప్పాడు. ఆమెయును చాలాసంతోషించి శ్రాద్ధ భోజనాల ఏర్పాటులో నిమగ్నురాలైనది.

భిక్షుక వేషంలో వేంచేసిన వేదవ్యాసుడు వారి ఆతిధ్య మర్యాదలతో తృప్తిగా శ్రాద్ధ భోజనం చేశాడు. ఆ దంపతుల ఆనందానికి అవధులు లేవు. వ్యాసుడు వారి భక్తికి మెచ్చి, ఆనందించి, "మీకు సకల సద్గుణ సంపన్నులు, ఐశ్వర్యవంతులు అయిన పదిమంది కుమారులు కలుగుతారని, మీకిక ఎట్టిలోటుండదని, తుదకు మీకు వైకుంఠ ప్రాప్తి పొందుదురని" - ఆశీర్వదించి వెళ్ళబోతుండగా, అప్పుడు వేదనిధి వాని పాదాలపై పడి

"స్వామీ! మీ పునర్దర్శన భాగ్యం మాకు ఎప్పుడు కలుగుతుంద"ని కన్నీటితో ప్రార్థించాడు. అప్పుడు వ్యాసుడు వారి మనో వేదనను గ్రహించి, "నాయనా! వేదార్థాలనూ, పురాణ గాథలనూ, శాస్త్రరహస్యాలను ధర్మబద్ధంగా వివరిస్తూ వ్యాఖ్యానించే ప్రతి పౌరాణికుడు కూడా నాస్వరూపముగానే భావించు. నా అనుగ్రహంలేనిదే వేద, పురాణ, శాస్త్ర మర్మాలు బోధపడవు. వారు ముందుగా నన్నిట్లు ప్రార్థింతురు కనుక.

శ్లో॥ నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్ ॥

అటువంటి ప్రతి పౌరాణికుదు నా రూపంలో నున్నాదని భావించి పూజించుకోండి. అదే గురు (వ్యాస) పూజగా తలంచిన ఆషాఢ శుద్ధ పూర్ణిమ. ఆనాడు నన్నర్చించి, పౌరాణికులను వస్త్ర భూషణాదులతో యథాశక్తి గౌరవించిన, నా అనుగ్రహం వారికి పరిపూర్ణంగా లభించునని చెప్పి నిష్క్రమించెను.

అట్లు నారదుని ద్వారా ఈ కథ విన్న వైశంపాయనుడు ఆ నారదునే వ్యాసరూపముగా భావించి పూజించినట్లు బ్రహ్మాండపురాణంలో పేర్కొనబడింది.

వేదవిభజన, అష్టాదశ పురాణాలను వ్రాసి, మహాభారత భాగవతములను ప్రసాదించి, బ్రహ్మసూత్రాలను నిర్మించి కర్మ, జ్ఞాన, భక్తి తత్త్వ అంతర్భారత 'భగవద్గీతను' అందించిన వ్యాసుని దినమే వ్యాసపూర్ణిమ దినము.

అట్టి 'వ్యాస పూర్ణిమ'కు గొప్ప ప్రాధాన్యతగా ఆషాఢ పూర్ణిమ 'గురుపూర్ణిమ'గా వినుతి కెక్కిన పూర్ణదినం.

వ్యాసుడు నారాయణునిగాను వెలుగొందిన కారణాన నాణెమునకు బొమ్మ-బొరుసు రూపాలలో కీర్తింపబడి, వ్యాస వాఙ్మయావిర్భావానికి మూల పురుషుడై, ధర్మ సంస్థాపనకు శ్రీకృష్ణ పరమాత్మగా కృష్ణద్వైపాయనుడని పేరు పొందెను. అందుకే మహాభారతంలో ద్విపాత్రగా నవతరించి కథాక్రమంలో కీలకమైన పాత్రను నిర్వహించాడు.

వ్యాసుడి పాత్రను సరిగా అర్థం చేసుకొంటె, ధర్మచ్యుతమైన కురువంశంలోకి ప్రవేశించి ధర్మాన్ని నిలబెట్టినాడు. ధర్మమేనొక సాధనంగా ధర్మాచరణం గావించువాడు మోక్షార్హుడని మహాభారతంలో నిరూపణం చేశాడు. అందుకే మహాభారతం ధర్మాలకు "నిధి" యని ప్రసిద్ధి కెక్కెను. ధర్మాధర్మానికీ నిరంతరంగా జరిగే సంఘర్షణలో ధర్మం జయించి తీరుతుందనే శాశ్వత సృష్టి ధర్మం వ్యాసమహర్షికి దర్శనమిచ్చింది. కనుకనే ఆయన "నమోధర్మాయ మహతే నమః కృష్ణాయ వేధసే బ్రాహ్మణేభ్యో నమస్కృత్య ధర్మాన్ వక్ష్యామి శాశ్వతాన్" - అని ధర్మము శాశ్వతమని చాటినాడు.

అట్టి ధర్మ నిరూపణం గావించిన వ్యాసుని పుత్రుడే శుకుడు. ఈ శుకుడు తండ్రినిమించిన ధర్మపరుడు. సాక్షాత్తు వ్యాసుని తేజోరూపుడే. శివుడే వరమొసగిన వరపుత్రుడు. పంచభూతాలతో సమానుడు. ఇట్టి సత్సంతానం కనడం ప్రకృతి ఏర్పరచిన ధర్మం. పరిపూర్ణ వంతుడగు వ్యాసుని ఉదంతం చిరస్మరణీయం. అందుకే భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు 10వ అధ్యాయం 37వశ్లోకంలో "మునీనామప్యహం వ్యాసః" అని నుడివిరి. అదే గురుపూర్ణిమ.

ఈ గురుపూర్ణిమ ఆషాఢ మాసంలో వచ్చే పూర్ణిమదినమే. ఈనాడు ఒక గురువును గాక, సృష్టిలో గల గురువులనందరికిని కలిపి అర్చన చేసే యేకైక పర్వదినము. గురువుగా నవతరించిన గురుపూర్ణిమ రోజది దివ్యత్వమైన మహానుభావుల జన్మ నొందిన దినమిది. భగవత్స్వరూపంతో గురువు మానవాకారంలో నవతరించిన శుభ పర్వదినమిది. శిష్యుల నుద్ధరించిన సుదినమిది. గురువులకాది దినమిది. గురుజయంతి దినం.

ఈ ఆషాఢ మాస పూర్ణిమ నాటికి చంద్రుడు పూర్వాషాఢలో గానీ, ఉత్తరాషాఢలో గాని నక్షత్రముండు మాసం, మాసం ఆషాఢ మాసం. ఈ మాసంలో సామాన్యంగా సూర్యుడు "మిథునరాశి" చివరిలోగానీ, కర్కాటక రాశి ప్రారంభంలో గాని సంచరిస్తూంటాడు. కనుక కర్కాటక రాశి లక్షణాలు చక్కగా ప్రస్ఫుటమై యుంటాయి.

సూర్యుడు కర్కాటకంలోకి ప్రవేశించాడంటే, ధక్షిణాయనం ప్రారంభమౌతోంది అన్నమాట. ఆకాశంలో 'దక్షిణం' అంటే అథోభాగం అని అర్థం. అధోభాగంలో పయనించటమే అంటే దక్షిణాయనం. ఇదే జీవుల పతనారంభం. కర్కాటకం అంటే ఎండ్రకాయ. ఇది అడ్డంగా నడుస్తుంది. కానీ తాను సరిగానే నడుస్తున్నానని, మరియు లోకమిట్లే అడ్డగోలుగా నడుస్తోందని భావిస్తూంటుంది. పతనమై క్రిందికి దిగజారే జీవుల లక్షణమిదే. ఈలాంటి జీవులను పైకెత్త వలసిన వారు గురువే.

కనుక, ఈ గురుపూర్ణిమ నాడు గురువు పాదం దర్శించడం మోక్షప్రదం.

వ్యాసుని గ్రంథాలలో ఏకొద్ది గ్రంథభాగాన్ని అధ్యయనం చేయాలి ఆనాడు.

## ఆషాఢ మాస మహిమ (అంతర్ముఖ సాధనకు ఆషాఢమాసం)

వర్షాకాలానికి ప్రారంభమాసం. ఈమాసంలో సూర్యుడి వేడి యింకా వుంటుంది. అయినా ఈ మాసపు ప్రథమ దివసం నుంచే వర్షపు చినుకులు ప్రారంభమై వాతావరణంలో కొంతమార్పు కలుగుతుంది. ఈ ఆషాఢ మేఘాల ధ్వనిని వేదఘోషగా గుర్తించిరి. ఆమేఘాల నుండియే వర్షించుటకు మండూకములు స్వాగత పలుకుల ధ్వనులు వేదధ్వనులుగా ధ్వన్యర్థము. ఈ ధ్వన్యర్థమును గ్రహించినచో వేదఘోషను వినినట్లు సార్థకమును పొందుదురు

మహనీయులు.

ఈ మాసంలోనే క్రిమికీటకములు సమస్త జీవులు ఉత్తమ గతిని పొందుతాయి అనుటకు సంశయం లేదు. అలాగనీ, ఏమీ సాధన చేయని జడజీవికి ఏ జన్మలోను ముక్తిలేదు. ప్రయత్నించడం ప్రతి జీవుల కర్తవ్యం. ప్రయత్నంలేని జీవుని పతనం పొందింప జేయు మాసమిది.

ఒక జీవి గతించి, ఊర్ధ్వలోకాలలోనో, అధోలోకాలలోనో పుణ్య పాపాలను అనుభవించి, మళ్ళీ భూమి మీదకు రావాలంటే (జన్మించాలంటే) ఆ జీవి ఆకాశం నుండి నేలపై పడే జలబిందువుల నాశ్రయించాలి. ఆ వర్ష బిందువుల ద్వారా, ఆ జీవి యేదో యొక మొక్కలోకి ప్రవేశిస్తాడు. అటు పిదప ఆ మొక్కను గానీ, మొక్క యొక్క బీజములను తినిన జీవుడి శరీరంలోకి ప్రవేశంకాగా, పురుష జీవిద్వారా స్త్రీ(జీవి) శరీరంలోకి ప్రవేశమగును జీవత్వము. పిదప తల్లి గర్భం నుండి యుత్పన్నమై, శరీరధారుడై ఈ భూమిపై పడతాడు. తిరిగి యీ శరీరం ఒక నాడెప్పుడైన పతనమవడం ఖాయం. ప్రధమంగా నాజీవి వర్షాధారంతో భూమిపై నున్నమొక్కలోకి ప్రవేశించేది ప్రధానంగా నీ వర్షాకాలంలోనే జరుగుతుంది. ఈలాంటి వర్షాకాలానికి ప్రారంభ సమయం ఆషాఢమాసం. కనుక 'కాళిదాసు' మహాకవి యునిట్లనెను. "ఆషాఢ స్య ప్రథమ దివసే" అని. జ్యోతి శ్శాస్త్రం కూడ యిదే చెబుతూంది.

ఇట్లు, జీవుల సూక్ష్మమైన జన్మకు, మరియు పతనమునకును మొట్టమొదటి కాలం ఆషాఢమాసం. జీవులందరూ సూక్ష్మరూపంలో వర్షాకాలంలోనే భూమి మీదకు ప్రవేశించిననూ, వారు స్వంత శరీరాలతో భూమిపైకి ఆయా మాసాలలో జన్మిస్తూంటారు. ఆమాసాన్ని బట్టియే వారి సామాన్య లక్షణాలు ఆయా రీతులలో నుంటాయని జ్యోతిశ్శాస్త్రం చెబుతూంది.

ఈ ఆషాఢమాసంలో పుట్టిన వారికీ లక్షణాలుంటాయని "కోష్ఠీ ప్రదీపము" అనే గ్రంథంలో నున్నదని "శబ్ద కల్పద్రుమయ్" చెబుతోంది. ఆ శ్లోకమిదియే.

శ్లో॥ అనల్ప జల్పీ ప్రమాదాభిలాషీ ప్రమాదశీలి గురువత్సలశ్చ ।
బహువ్యయో మంద హుతాశనస్స్యాత్ ఆషాఢ మాస ప్రభువో మనుష్యః ॥

ఆషాఢ మాసంలో పుట్టే ప్రతి జీవికి అన్నీ దుర్గుణాలే. అతిగా వాగుడుకాయ. ఎప్పుడూ తప్పులొనర్చుచు అసత్యాలు పలుకుతూ కామలోలుడై వుంటాడు. అతి వ్యయం చేస్తూ, అనారోగ్యుడై, అజీర్ణంతో బాధపడుతూ ఉంటాడు. అధోముఖుడై యున్నకారణాన అజ్ఞానాంధుడై యుంటాడు. కానీ, యిన్ని దుర్గుణాలున్న వాడిలో నొక యద్భుత సుగుణముంటుంది. అదియే "గురుభక్తి". అనగా గురువులనిన వల్ల మాలిన ప్రీతి కలిగి

యుంటాడు. అదియును నొకవిశిష్ట గుణం. శుచిః, బుద్ధి కలిగి యుంటాడు. "శుచి" అనగా వేడియని కూడ అంటారు. ఈ మాసానికీలాంటి యొక విశేష లక్షణముంటుందనీ, గురుపూజా పర్వాన్ని ఈ ఆషాఢ పూర్ణిమ నాడే మహర్షులు యేర్పాటు చేసిరని "కోష్టీ ప్రదీపం" చెబుతూంది.

పరమ గురువుల సాంగత్యం పొందుటకు ప్రతి పౌర్ణమి మిక్కిలి పర్వదినమని టిబెట్టు గురువు సెలవిచ్చెను. వేదముల యందు గురుశిష్యులకు నడమ చంద్రుడు ద్వారముగా వర్తించుననియూ, అట్టి పౌర్ణమీ, తత్త్వద్వారములు తెరువబడు దినమని చెప్పబడినది. పృథ్వీపైగల జీవుల శరీరములందలి ప్రాణమయ, బుద్ధిమయ, మనోమయ కోశముల యందలి శక్తి ప్రవాహములు ధ్యానమునకు వీలుగా మిక్కిలి ప్రసన్నముగా నుండును. మహర్షులు, గురువులు, శిష్యులను పెద్ద సంఖ్యలో స్వీకరించు పవిత్ర దినమిది. అటులే పౌర్ణమీ ముందు రెండు దినములు పరమ గురువుల నుండి శక్తిని సోదరవర్గమునకు పంచిపెట్టుటకు అనుకూలమైనదిగా చెప్పబడెను.

కావున ప్రతి పౌర్ణమీ నాడు సాయంత్రం సత్సంఘ మేర్పరచుకొని, తత్త్వ ప్రసంగములతో మనస్సు ప్రసన్న మొనర్చు కోవలెను. తమ ప్రియతమ గురువుల చిత్రపటముల నుంచుకొని, వారిని స్మరించుకోవలెను. ఇట్లు, అట్టి దినమున ప్రాతః సాయంకాలములలో గురుపూర్ణిమను గూర్చి దాని అంతరార్థమును అన్వయించు కోవలెను.

"తత్త్వం" అనగా? -

"శ్లో॥ ఋతంచ సత్యంచాభీఽద్ధాత్ తపసోఽధ్యజాయత ।
తతో రాత్ర్యజాయత తతస్సముద్రో అర్ణవః ॥

శ్లో॥ సముద్రాదర్ణవోదధి సంవత్సరో అజాయత ।
అహోరాత్రాణి విదధత్ విశ్వస్స మిషతో వశీ ॥

శ్లో॥ సూర్యా చంద్రమసౌధాతా యథా పూర్వమకల్పయత్ ।
దివంచ పృథివీంచ అంతరిక్షమధోస్వః ॥" -

భా: "ఋతము, సత్యము" - అనునవి "తత్" నుండి వచ్చినవి. మరియు వేడిమియు పుట్టినది. వేడిమి అనగా ఉష్ణము లేక వెలుతురు, పగలు అనికూడ, దాని నుండి ముద్రలతో కూడియున్న సముద్రము జనించినది, దానినుండి సంవత్సరం పుట్టినది.

విధాత విశ్వమున "రాత్రి, పగలు" అను కొలతలను ఏర్పరచెను. ధాత సూర్యుడు, చంద్రుడు, దివము, పృథ్వీ, అంతరిక్షము" అనువానిని పూర్వమువలెనే తన నుండి సృష్టించెను.

"శ్లో॥ సత్యేఽత్తంభితా భూమిః సూర్యేణోత్తభితాద్యోః ।
ఋతేనాది త్యాస్తిష్ఠంతి దివి సోమో అధిశ్రితః ॥

శ్లో॥ సోమేనాదిత్యా బలినః సోమేవ పృథివీ మహీ ।
అథో నక్షత్రాణా మేషాం ఉపస్థే సోమ ఆ హితః ॥

శ్లో॥ సోమం మన్యతే పపివాన్ యత్సంపింపన్త్రోషధిమ్ ।
సోమం యం బ్రహ్మాణో విదుః నతస్యాశ్నాతి కశ్చన ॥" -

భా: సత్యము చేత భూమి నిలచి యున్నది. సూర్యుని చేత "ద్యు"లోకము నిలిచియున్నది. ఋతముచే ఆదిత్యులు నిలిచిరి. దివిలోకమము సోమునిచే అధిష్ఠింపబడి యున్నది. ఆ సోమునిచే ఆదిత్యులు బలవంతులైరి. మరియు సోముని వలన పృథివీ పరిమాణము పొందుచున్నది. ప్రస్తుతము సోముడు నక్షత్రముల మధ్య నిలిచి యున్నాడు. ఆ సోముని నుండి సోమరసము పిండి త్రాగినట్లుగా భావింపబడుచున్నది. అట్టి సోమరసము రుచి చూడవలెననిన బ్రహ్మమును తెలిసిన వారైయుండవలెను. ఆ బ్రహ్మమును తెలిసికొనవలెనన్న గుర్వను గ్రహము పొందవలసి యుండును.

శ్లో॥ వ్యాసం వశిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమ కల్మషం ।
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిం ॥

వశిష్ఠుని మునిమనుమడు, శక్తి మనువడు, పరాశరుని తనయుడు, శుకుని తండ్రి, తపోనిధియైన వ్యాస గురు బ్రహ్మకు నమస్కారం.

శుకునకు తండ్రిగా గురువుగా నుండిన వ్యాసుడు కుమారునకు తిరిగి గురువుగా రాజర్షియైన క్షత్రియ కులజుడైన జనక చక్రవర్తిని చెంత చేరమని సూచించాడు. మొదట్లో సందేహించిన శుకుడు తుదకు జనకునిచేరి, శిష్యునిగా మెప్పుపొంది, "ఆత్మ తత్త్వం" పొందాడు. కనుక "గురువు" అనుపదం సూర్యచంద్రాదుల కన్న మిన్న పదం గురుపదం.

శ్లో॥ అభ్రశ్యామః పింగజటాబద్ధ కలాపః
ప్రాంశుర్దండీ కృష్ణ మృగత్వక్ పరిధానః ।
సర్వాన్‌లోకాన్ పావయమానః కవిముఖ్యః
పారాశర్యః పర్వసురూపం వివృణోత్ ॥

నమోఽస్తుతే వ్యాస విశాల బుద్ధే పుల్లార విందాయత పత్రనేత్ర ।
యేనత్వయా భారత తైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయ ప్రదీపః ॥

## - ఇతి వేదవ్యాస స్తుతి -

# 25. శ్రీశుకునకు గ్రహణం తొలగింది

వ్యాసుడు భాగవతరచనతో దుఃఖవిముక్తుడై శాంతమనస్కుడై యుండగా, వారి మనస్సులో మరొక మనోవేదన మొదలైంది. ధర్మాధర్మ వివేచనకు ప్రాధాన్యమిచ్చిన వ్యాసుని పౌరాణిక వ్యక్తిత్వం నిర్వికారుడు, నిస్సంగుడు. నిశ్చల తపోధనుడు, ముక్తుడైన శుకుని పుత్రుడుగా కనడంతో సంపూర్ణతను సంతరించుకుంది పుత్ర వ్యామోహము తీరింది

వ్యాసుడు భాగవత రచనకు పూనుకోవడానికినీ, శుకుని పుత్రునిగా పొందడానికినీ అంతర్గత సంబంధముంది. తన వాఙ్మయకృషి అంతా ధర్మనిర్వహణకే అయినా ధర్మాచరణ అంతిమలక్ష్యం మోక్షమే కదా! తన జీవితమంతటినీ ధర్మ నిరూపణకే అంకితం చేసిన వ్యాసునకు అశాంతి కలుగగా, అప్పుడు నారదుడు ప్రత్యక్షమై సర్వ అశాంతికి విరుగుడుగా కల్యాణాత్మకమైన విష్ణు కథలుగా భాగవత రచనకు పూనుకోమని ఉపక్రమిస్తాడు.

ఆ భాగవతాన్ని ధర్మబద్ధంగా రచించి, తనకుమారుడైన శుకుని ద్వారా పాండవుల మనుమడైన పరీక్షిత్తుకు భాగవతాన్ని బోధించడం, పరీక్షిత్తు కుమారుడైన జనమేజయునకు వైశంపాయని ద్వారా మహాభారత కథను వినిపింపజేయడంతో ధర్మవికాసం మొదలైంది

శుకుడు వ్యాసునకు కుమారుడుగా జన్మించడం కూడ ప్రకృతి ఏర్పరచిన ధర్మం వ్యాసుడు ఒంటరిగా నొకనాడు సరస్వతీ నదీ తీరంలో కూర్చుని యుండగా, ఒక చెట్టుపై రెండుచిలకలు తమ పిల్లలకు మేత పెట్టు దృశ్యంతో అతనికినీ సంతానంపై ముచ్చట కలిగింది. తాను కూడా సంసార జీవనం గడపాలి, సంతానం పొందాలి 'అపుత్రస్య గతిర్నాస్తి' కదా! నాకు తిలతర్పణం చేసేవాడు కావాలి కదా! అనే తపనలో బ్రహ్మను గూర్చి తపస్సొనర్చెను. బ్రహ్మదేవుని ప్రార్థించగా బ్రహ్మ తన మానస పుత్రుడగు నారదును వ్యాసుని చెంతకు పంపెను

నారదుని స్మరించి, అతని సలహాతో శక్తినియుద్దేశించి తపస్సొనర్చెను. ఆ శక్తి వ్యాసుని తపస్సునకు మెచ్చి పంచభూతాలతో సమానుడైన పుత్రుడు పుడుతాడని వరమిచ్చెను. చూచారా శ్రీదేవి కటాక్షంతో ఆమె సలహామేరకే వ్యాసునకు సంసార ఝంఝూటనం ఏర్పడెను.

ఒకనాడు వ్యాసుడు అరణిని మథించుచుండగా 'ఘృతాచి' అనే అప్సరస కనిపించినది. ఆమెపై వ్యాసునకు మోహం జనించగా, ఆ ఘృతాచి చిలుక రూపం ధరించగా వ్యాసుడు ఆ అందమైన చిలుకను మోహంతో చూడగా, తన తేజోవీర్యం అరణిలో పడగా, అరణి మథించడంతో ఆ శుక రూపంతోనే శుకుడు కుమారుడుగా పుట్టెను. తన ఆవేదన మరింత తీరినట్లైంది.

శుకుడు పుట్టుకతోనే ధర్మాచరణగా ప్రవర్తించడం వ్యాసునకెంతో సంతోషమనిపించినది. కుమారునకు వేదశాస్త్రాలు స్వయంగా బోధించాడు. తండ్రిని మించిన తనయుడైనాడు శుకుడు. అయినా తనకన్నా మించినను, మిథిలాపురి చక్రవర్తి జనకమహారాజర్షి వద్దకు కుమారుని పంపి ముక్తి మార్గాన్ని తెలుసుకోమని సలహా ఇస్తాడు వ్యాసుడు.

శుకునితో వ్యాసుని **పోల్చిన, ధర్మం దీక్షలో** శుకుడే గొప్పవాడని, మహనీయుడని సూచించేనొక ఉదంతం కలదు. ఒకనాడు వ్యాసుడు స్నానార్థమై నదికి వెళ్లగా, అదే అదనంగా భావించిన శుకుడు ఆకాశమార్గంలో కైలాసం వెళ్లాడు. వ్యాసుడు తిరిగి వచ్చి శుకుని గానక, పుత్ర వియోగంతో దుఃఖిస్తూ వెదకసాగాడు. మార్గమధ్యంలో "పుత్రా! పుత్రా!" అనే పిలుపునకు ప్రకృతి అంతా 'ఓ' అని బదులిచ్చిందట.

అటులే కొంత దవ్వు వెళ్లగా, ఒక కొలనులో కొందరు దివ్యకాంతలు దిగంబరంగా స్నానం చేస్తుండగా, వ్యాసుని రాకకు తత్తరపడిరి. అయినా అట్టివారిని "నా కుమారుని చూచితిరా! అయినా పడుచువాడైన శుకుని చూచిన లేని తత్తరపాటు నావంటి వృద్ధుడనైన నన్ను చూచి ఎందుకు తత్తరపడుచున్నార"ని ప్రశ్నించెను. అందులకు వారు "నీకు, నీ కుమారునకు పోలికెక్కడ? అతడు పడుచువాడైన నిర్వికారుడు, నిశ్చలుడు. మహాపురుషుడును." అని దేవకాంతలు బదులు పలికిరి. వ్యాసుడును నిజమేనని తలంచి ఊరకుండెను.

శుకుడు, తన తండ్రియే గొప్ప విద్యాతత్త్వవేత్తయని తలంచి యుండెను. అయినను తనకు తిరిగి జనక చక్రవర్తి వద్దకు పంపడం బాగా ఆలోచించియేనా? అని కాస్త మనస్సు చిన్నబుచ్చుకొన్నాడు.

వ్యాసుడును, "నాయనా! నీవు గురువుగా స్వీకరించతగిన మహనీయుడతడే" అని నిష్కర్షగా చెప్పెను. ఆ దేశంలో దృఢత్వం ధ్వనించడంతో శుకుడు మరింత చకితుడయ్యాడు. "తాను మాతృ గర్భంలో నున్నపుడే తను పొందిన చరమజ్ఞానం కరతలామలకం. వివేకాల, వైరాగ్యాల సారం సర్వం తాను తెలిసినవాడినీ, తన గురించి తెలిసిన జనకుడే తనకట్టి సలహానివ్వడంతో ఇంకా తాను సేవించదగిన మరో గురువు ఆ క్షత్రియ చక్రవర్తియా! ఎంత విడ్డూరము!" -

"అసలు తాను వైకుంఠానికి వెళ్లితే, తనకు దర్శనమివ్వడానికి విష్ణువు నిరాకరించడంలో అంతరార్థమేమిటి? అయితే నేనింకా పరిపూర్ణతను పొందలేదనే కదా! సరే, నా తండ్రి సలహా మేరకు ఆ చక్రవర్తినే గురువుగా పొందెదను. అదెంతపని," అని తండ్రితో చెప్పి వెళ్దామని, కాస్త అహంకార, రోషపౌరుషాలతో బుస కొడ్తూ వెళ్లగా, తండ్రి

వ్యాసుడది గమనించకపోలేదు. కుమారునిలో మదనవేదన, తాను త్రికాల వేదిని, త్రిలోకాలలో గురువుగా భావించి నెత్తిన పెట్టుకొనే వేదవ్యాస మహర్షి తనయుడనని, అందులో సన్యాసినీ, సద్బ్రాహ్మణుణ్ణి కదా!" అనే మనోగర్వం గ్రహించకపోదు. శుకునిలో పునరాలోచనకు తావులేకుండా బ్రహ్మాస్త్రంగా మరలా, "నాయనా! జనక మహారాజు వద్దకు వెళ్లు" అని పలికి, మరేమీ పలికేది లేనట్లు, నిశ్చలంగా మౌన ముద్రలో పడిపోయాడు.

చేసేది లేక శుకుడు జనకపురి మిథిలానగరం చేరుకొన్నాడు. ఆ పుర రాచవీధులలో శుకుని చూచిన వారెల్ల వినయంగా సాష్టాంగపడుటను గ్రహించి, తనవంటి వానికిట్టి దుర్గతియా! ఈ జనకుని గురువుగా పొందడం. అని, వెనుతిరిగి తండ్రిని చేరుకున్నాడు. కొడుకు అంతర్మథనాన్ని, మనస్తాపాన్ని అర్థం చేసుకోకపోలేదు. అయినను తన కుమారునకు జనకుని దర్శించడంలోనే జ్ఞానసిద్ధి కలుగుతుందని యెంచి. మరేమీ మాటాడక, తిరిగి అదే ఆజ్ఞ ఆదేశించాడు. ఇట్లు పన్నెండు పర్యాయాలు వెళ్లడం తిరిగి వెనుతిరగడం జరిగింది శుకునకు.

ఇక పదమూడోసారి మిథిలకు చేరి, తన దుస్థితికి తానే సిగ్గుపడుతూండడం, పరోక్షంగా నారదుడు చూచి, ఓహో! ఇతడేనా! భావిమహా భాగవతోత్తముడుగా ఖ్యాతిని పొందు శుకమహర్షి కదా! ఇంతటి వానికీ జనకుని గురువుగా పొందడంలో శంక ఏమిటి? శంకతోనే కదా! వారిలోనున్న ఉత్తమగుణాలు నొక్కొక్కటి జారిపోతాయని, ఇతనికి తెలియదా! అని, ఈ శుకునకు జ్ఞానోదయం కల్గించాలని తలంచి, ఒక వృద్ధ బ్రాహ్మణ వేషంలో శుకునకు దర్శనమివ్వతలచాడు.

మిథిలకు వెళ్లి మార్గంలోనున్న ఒక నది సమీపంలోనున్న మట్టి తవ్వి ఒక బుట్టలో నింపి, ఆ మట్టిని నదిలో వృద్ధ బ్రాహ్మణుడు వేయడం, వెడ్తున్న శుకుడు చూచాడు. ఈ నదీ ప్రవాహానికి ఈ వృద్ధుడు అడ్డుకట్ట వేయడమా! అమాయకుడిలా గ్రహించి వృథాప్రయత్నముగా తలంచి, అడగనే అడిగాడు. ఏమిటీ మూర్ఖత్వపు శ్రమయని?

అందులకు వృద్ధ బ్రాహ్మణవేషంలోనున్న నారదుడు, "నాయనా! నాకన్నా మూర్ఖులు ఉన్నారు. వెళ్లి ఆ శుకునితో చెప్పు. శుకుడు నిజంగా ఉత్తముడనుకొన్నాను. ఇప్పటికే తనలోనున్న పదునాల్గు ఉత్తమ గుణాలలో పన్నెండు గుణాలను నష్టపోయినట్లు తెలిసినది. ఇంకా రెండు గుణాలు మిగిలినవి అతనిలో. కావున ఇకనైనా, వాటితో జాగ్రత్తపడమ"ని అతనితో చెప్పు. అన్నాడు ముఖమెత్తి చూడకుండా.

ఆమాట వినడంతో శుకుడు ఆశ్చర్యపడి తనలో మెరుపులా వివేకం చోటు చేసుకొనగా, ఇతడెవరో గొప్ప మహనీయుడని యెంచి, సందేహించక, వెంటనే ఆ వృద్ధుని ముందు సాష్టాంగపడ్డాడు. శుకునికి జ్ఞానోదయమయ్యిందని నారదుడు సంతృప్తితో

అక్కడినుండి అదృశ్యమయ్యాడు.

ఇక శుకునకు తోచినది. తనకిక గురువు అవసరమేనని యెంచి, ఆ రాజప్రాసాదంలో ద్వారం కడ నిలిచి ద్వారపాలకునితో, "శుకుడొచ్చాడని చెప్పి పంపించాడు. తనలో, ఇక యేముంది, జనకుడే వచ్చి తనను తోడ్కొని వెళ్తాడని వేచిచూచెను. కాని తన తలంపు తలక్రిందులైనట్లుగా, "తాను పిలిచేవరకు అక్కడే యుండమ"ని ఆదేశించినట్లు ద్వారపాలకుడు వచ్చి చెప్పాడు.

శుకుడు ఆశ్చర్యపడి నిలుచున్న స్థలం చూడగా, తనంతటివాడు. రోజు రాజభవనాన్ని ఊడ్చి గోడపైనుండి చెత్తాచెదారం వేసే తావుగా తాను నిల్చున్నానని తెలుసుకొనెను. అలాగే నాలుగు రోజులు గడిచెను అలాగే నిల్చున్నాడు. ఇంకేముంది? ఆ చెత్తాచెదారంలోనే కప్పబడియున్నాడు శుకుడు.

జనకుడది గని, "అతనిని బయటకు తీసి, పరిశుభ్రంగా స్నానం గావింపజేసి, మంచి దుస్తులు ధరింపజేసి సభకు తోల్కొని రండ"ని భటులకాజ్ఞ ఇచ్చెను. భటులట్లే గావించి, అతనిని సభకు తీసుకొని వెళ్లిరి. ఆనాడు నిండు సభలో జనకుడు ఎత్తైన స్వర్ణమణిమయ సింహాసనంపై కూర్చుని ఉండడం. అటు ఇటు అందమైన అప్సరసలు ఆయనకు వింజామరలు విసరడం, ఒక సుందరాంగి ఆయన ఎడమకాలును ఒత్తడం చూచాడు. ఆశ్చర్యంగా మరొక దృశ్యం చూచి విస్తుపోయాడు. ఆయన(జనకుని) కుడిపాదం మాత్రం కణకణ మండే ఒక నిప్పుల కుంపటిలో పెట్టబడి యుండడం. అనగా కష్టసుఖాలను సమానంగా అనుభవించు మహాయోగిలా జనకుడు నిశ్చలంగా నిర్వికారంగానున్నాడు. అది చూచిన శుకుడు, "ఇతడు సాధారణ చక్రవర్తి కాడు. అణువణువున ఆత్మజ్ఞానం కల కర్మయోగి" అని, శుకునకు జనకుని తొలిదర్శనంలోనే గ్రహించెను.

అంతలోనొక పరిచారకుడు పరుగున వచ్చి, "మహారాజా! మిథిల యంతయు కార్చిచ్చుతో దగ్ధమైపోతోంది" అని పలుకగా విని, "అంతా దైవసంకల్పం" అని ఊరకున్నాడు జనకుడు. కాసేపటికి అదే పరిచారకుడు వచ్చి, మంటలు తొలగిపోయాయని చెప్పాడు. అదివిని, దానికిని "దైవసంకల్పమే" అని ఊరకున్నాడు

అటుపిదప జనకుడు శుకుని చూచి, నీవు వచ్చిన పనియేమిటి? అని ప్రశ్నించగా, శుకుడు, "మీ నుంచి ఉపదేశం పొందాలని వచ్చితిన"ని పలికెను.

అది విని జనకుడు అధికారులను పిలిచి, ఇతడు వ్యాసమహర్షి కుమారుడు శుకుడు. ఇతణ్ణి రాజోచితంగా సత్కరించాలి. అందులకు మన నగరమంతా అందంగా అలంకరించండి. సంగీత, నృత్య, నాటక కార్యక్రమాలతో విందువినోదాలలో వీరిని ముంచి తేల్చండి" అని ఆదేశించారు. అటులే అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలు మహాజోరుగా

సాగుచున్నవి.

జనకుడు సంతసించి అధికారులను మరల, "మీరు ఇతడి చేతిలోనొక స్వర్ణ పాత్ర యుంచి అందు నిండుగా పాలు పోసి నగరమంతా తిప్పండి. కాని ఆ పాత్రలోనినొక పాలచుక్కయైన క్రింద పడకుండా కనిపెట్టి చూస్తుండాలి. చుక్క క్రింద పడిందంటే తక్షణమే ఇతని (శుకుని) శిరచ్ఛేదం చేయండి. అని ఆదేశించడం శుకుని ఎదుటనే జరిగెను.

ఆ పరీక్ష తనమేలు కొరకే అని ఆ పాత్రతో నగరమంతా తిరిగెను శుకుడు. నగరంలో జరుగు సంబరాల దృశ్యము అతనేమాత్రం చూడక, తన లక్ష్యసాధనలో నెగ్గి, తనమనస్సున కమ్మిన అజ్ఞానపు పొరలు తొలగించుకొన్నాడు. అట్లు శుకుని ఏకాగ్రతకు జనకుడు సంతసించగా, శుకుడును జనకుని పరీక్షతో తనలోనున్న అహంకారం నశించిందని, జనకునకు సాష్టాంగ దండప్రణామంబు చేశాడు.

జనకుడు శుకుని ఆదరంగా దగ్గరకు తీసుకుని ఆత్మతత్త్వజ్ఞానాన్ని ఉపదేశించాడు. శుకుడు వారినుండి అనుజ్ఞను పొంది తండ్రి వ్యాసుని చేరెను. వ్యాసుడు తన కుమారుని నూతన తేజోరూపం జూచి మిక్కిలి సంతసించాడు. శుకుడును గురువు చంద్రసూర్యుల కన్నా చల్లనివాడని తేజోవంతుడని గ్రహించాడు. అనగా గురువును మించినదేదియు లేదని, గురువు గురువులాగానే ఉంటాడు. అని గ్రహించాడు. అటులే శుకుడును అట్లు వెలిగి అవధూతగా ఖ్యాతి నొందెను. పరీక్షిత్తు మహారాజునకు తానూ గురువై శ్రీమద్భాగవతమును బోధించి తాను తరించి వారిని తరింప జేసెను.

"జగద్గురువు" ఆశీర్వాదం పొందడం ఇంకా విశేషం అని గ్రహించాలి కూడ. ఎందుకు? "జగద్గురువు" అంటే జగత్తుకే గురువు అని అర్థం. జగత్తులోని ప్రతిజీవిలోనూ, ప్రతి అణువులోనూ గురుత్వాన్ని చూసేవారు జగద్గురువు అని గూడార్థం.

★★★

## గురు - సూత్రములు

గురుచరణం భవహరణం

★★★

శ్రోత్రియుడైన, బ్రహ్మనిష్ఠుడైన సద్గురువుని ఆశ్రయించి "గురు" తత్త్వబోధను పొందండి.

★★★

దేహాలున్నంతవరకు గురుశిష్యుల సంబంధం నశించదు.

## గురు - సూత్రములు

శిష్యుడు గురువును ఆశ్రయిస్తేనే అతని(శిష్యుని)లో
అవిద్యాలోపమంతరించి, ఆత్మవిద్యాపరుడౌతాడు.

★★★

గురువు సర్వదా ఆత్మానందానుభూతిని పొందుతుంటాడు.
శిష్యునిలో అజ్ఞాన హృదయగ్రంధులు తెగేవరకు బోధించే వారే గురువులు.

★★★

ఆత్మజ్ఞాన ప్రబోధంతో శిష్యుని జాగృతపరచుచు భవ బంధముల నుండి
విముక్తి ప్రసాదించే వాడే గురువు.

★★★

గురువు కరుణాకటాక్షము శిష్యులందరికిని స్పృశించును.

★★★

శిష్యుల విజ్ఞానంతో విమల చిత్తులౌతారు గురువులు.

★★★

"గురువినా నముక్తి" గురువు లేక ముక్తి లేదని వేదమనును.

★★★

గురువు కన్నా కన్న వారెక్కువ కారు. ఎందుకనగా, భౌతిక దేహాన్నిస్తారు
తల్లితండ్రులు. ఆ దేహానికి ముక్తిని ప్రసాదిస్తాడు గురువు.

★★★

శ్రోత్రియుడైన, బ్రహ్మనిష్ఠుడైన సద్గురువుని ఆశ్రయించి "గురు"
తత్త్వబోధను పొందండి.

★★★

దేహాలున్నంతవరకు గురుశిష్యుల సంబంధం నశించదు.

★★★

"గురుద్వేషీ స గోహత్యం లభేద్ధ్రువమ్"



శ్లో॥ శృతి స్మృతి పురాణానామాలయం కరుణాలయం ।
నమామి భగవత్పాద శంకరం లోక శంకరమ్ ॥

# 26. అద్వైత జగద్గురువు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య చరిత్ర

మన భారత భూమి కర్మభూమి. అట్టి కర్మభూమిపై వేదాంత తత్త్వబోధకులెందరో జన్మించి తరించిరి. వారిలో వేదాంత తత్త్వంతోనే జన్మించిన శ్రీశంకరాచార్యులు సుప్రసిద్ధులు. బహువిధ ఆచార్యోత్తములు. మహామహిమా సంపన్నులు. సద్గురు స్థానాన్నలంకరించిన సాక్షాత్ శంకరుడే 'జగద్గురువు' శబ్దముతో 'శ్రీమదాది శంకరాచార్యుల' వారు సూచింపబడుదురు.

పూర్వము వటవృక్షమూలమున దక్షిణామూర్తి రూపమున శివుడుద్భవించి, మౌనమనెడి వ్యాఖ్యానముతో పరమ ధర్మమగు నాత్మ దర్శనమునను(గ్రహించి, మహర్షి సంఘము నెవ్వడుద్ధరించెనో, అట్టి యా భగవానుడు, ఆ ఆది గురువు, ఆ సర్వ గురువు, ఆ శంభువు, ఆ సర్వజ్ఞుడు, ఆ విద్యలకీశానుడును అగు ఆ శంకరుడే' సన్మార్గ సంస్థాపనకై శ్రీ శంకరాచార్య రూపమున భూమండలమున నీ కలియుగమున నవతరించెను.

"ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే"

అని గీతాచార్యుడై శ్రీకృష్ణ భగవానుడన్నట్లు, మానవాళిని ధర్మపథంలో నిలిపి, ఏకసూత్రంలో నడువగలుగునట్లు జేసిన శ్రీశంకరులు ధన్యుడు. ధర్మమార్గ విషయంలోను, జ్ఞాన మార్గ విషయంలోను అద్వైత విజ్ఞాన జ్యోతిని వెలిగించిన జ్యోతిర్మయుడతడు. వేదధర్మానుష్ఠానమే తనయూపిరిగా చివరివరకు భారతావనిలో అనేక చోట్ల పర్యటించి, వైదిక సనాతన ధర్మసంస్థాపనార్థమై స్వయం సంపూర్ణాధికారంతో యావత్తు మానవ జాతిని తీర్చి దిద్దటానికి పూనుకున్న సద్గురుడు శ్రీ ఆదిశంకరాచార్యుడు. ఆ స్థానములో నిలిచిన వారెల్లరు జగద్గురువులని వ్యవహరించుట పరిపాటి అయినది. అందులకే -

"శృతి స్మృతి పురాణానామాలయం కరుణాలయం ।
నమామి భగవత్పాద శంకరం లోక శంకరమ్ ॥"

అని కీర్తించిరి, మరియు

"సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమామ్ ।
అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరామ్ ॥"

అనియు స్తుతించిరి. నిజమే, శంకరులు సాక్షాత్ లోకశంకరుడు. ఈశ్వరావతార సత్పురుషుడు. కావున, "శంకరశ్శంకరస్సాక్షాత్" అని సర్వులు ప్రశంసించిరి. పండితులకును

పామరులకును అతడొక విద్వత్పుంజం. మహోత్తేజం. జ్ఞానజ్యోతి స్వరూపం. "శం కరోతీతి శంకరః"; "శం భావయతి - ఉత్పాదయతీతి శంభుః" అని కూడ పదద్వయంతో నతడు పరమాత్మగా రూపొందెను. అసాధారణ ప్రజ్ఞావంతుడు. అద్భుతయోగ మహిమోపేతుడు. సన్యసించియు సాంఘిక శ్రేయస్సును కాంక్షించిన సంఘకర్త - మీదుమిక్కిలిగా కారణజన్ముడని చెప్పవచ్చును. ఆ శంకరుడు ఎందరో శిష్యులకు వేదరాశినంతా నూరిపోసి, సకల శాస్త్ర పురాణ వాఙ్మయమంతా ఆపోశనము పట్టినట్లు బోధించి జగదాచార్యుడై, ఆరాధ్యుడై ధార్మికుల మానసంతో 'వ్యాసో నారాయణః స్వయమ్'లాగా వీరు సాక్షాత్ శంకరుడుగా వెలిగెను. ఆ శంకరుల కథయే ఇది.

పూర్వము రాజశేఖరుడనే రాజు వృషపర్వత ప్రాంతమున రాజుగానుండి ప్రజలను కన్నబిడ్డల వలె చూస్తూ రాజ్యంను సుభిక్షంగా పాలించెడివాడు. ఆ రాజు గొప్ప శివభక్తుడు. ఆ వృషపర్వత ప్రాంతమున త్రివేణీ సంగమమును తలపింపజేయు పవిత్ర పూర్ణానది ప్రవహించుచుండెను. ఆ ప్రాంతమున కొబ్బరితోటలు కళకళలాడుచు చూపరుల కాకర్షణముగానుండును. అదియే కేరళ రాష్ట్రము.

రాజు రాజశేఖరుడికి స్వప్నములో పరమేశ్వరుడు ప్రత్యక్షమై "రాజా! ఈ వృషపర్వతముపై జ్యోతిర్లింగ రూపంలో వెలసితిని. కావున నాకొక ఆలయం నిర్మించి, నిత్యపూజలు జరుగునట్లు, నైవేద్యాదులు జరుగునట్లు ఏర్పాట్లు చెయ్యి' అని చెప్పి అంతర్ధానమయ్యెను. పరమేశ్వరాజ్ఞగా నట్లొనర్చి నిత్యపూజకైంకర్యాలతో రాజు నిమగ్న మయ్యెను. ఆ వృషపర్వతం పరమేశ్వర ఆవిర్భావంతో పుణ్య క్షేత్రంగా ప్రసిద్ధి కెక్కెను.

అట్టి పర్వత సామీప్యంలోనే 'కాలడి' అనే అగ్రహారంన నిత్యనైమిత్తిక అగ్నిహోత్ర కార్య నిమగ్నుడగు ఒక గృహస్థుడు ఉండేవాడు. అయన పరమనైష్ఠికుడు ఆధ్యాత్మ విద్యనారాధించువాడు. వేదవేదాంగ విద్యాప్రావీణ్యుడతడు. సద్గుణ సంపన్నుడు. సదాచార నిర్వహణతో భక్తి ప్రవృత్తులతో నుండెడివాడు. ఆయనకు సరిజోడు అతని అర్ధాంగియు. వారిది కాశ్యప గోత్రం. వీరి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్‌లో పిఠాపురం ప్రాంత నివాసుకులని, తదుపరి 'కేరళ' వారి ఆహ్వానంతో వలస వెళ్లిన వారని, అందుకేనేమో వీరిని 'నంబూద్రి' - నంబ ఊరి ఇల్లే అనగా మీది ఈవూరు కాదని వారట అచటివారు. వీరి కుటుంబము ధనిక వర్గమునకు చెందినది కాదు.

ఆ పుణ్య దంపతులకొక కుమారుడు కలిగాడు. శివభక్తి పుణ్యఫలంగా పుట్టిన ఆ కుమారునకు "శివగురువు" అని పేరు పెట్టిరి. 'శివగురువు' బాల్యం నుండియు గురుకులవాసంలో నుండి గొప్ప విద్యావేత్తయై తండ్రిని మించిన తనయుడుగా కీర్తి గడించెను. తగువయస్సు రాగానే 'ఆర్యాంబ' అనే కన్యతో తనయునకు వివాహం జరిపించారు ఆ

పుణ్యదంపతులు.

శివగురువు తన వారసత్వంగా వచ్చినట్టు తాను కూడా వేదవేదాంగ విద్యలు, సకల శాస్త్రాలలో ప్రావీణ్యుడై శీల సంపదతో, సజ్జన గోష్ఠితో, సదాచార అగ్నిహోత్ర కార్యకలాపాలతో నియమనిష్ఠలతో నుండువాడు. అట్టి విద్యావంతునకు తోడుగా ఆతని ధర్మపత్ని 'ఆర్యాంబ'యు అతనికన్ని విధములా సరిజోడుగా ప్రవర్తించెడిది.

కాని, ఆ ఆదర్శ దంపతులకు ఎంతకాలానికినీ సంతానం లేకపోగా, అందులకై వారు చేయని నోము లేదు. వ్రతం లేదు. కొలవని దైవం లేదు. అతిథి సత్కారం యథావిధిగా చేస్తూ, దానధర్మాలొనర్చుచు, పరమేశ్వరుని ప్రార్థనలు తప్ప వేరొకటి వారి నోట లేకుండెడిది సద్గతిని కల్గించు సంతానం లేని బ్రతుకుగా రానురాను వారిని క్రుంగదీసెడిది అయినా, అట్టి ఆదర్శ పుణ్య దంపతులకు పరమేశ్వరుడు ఫలమివ్వకపోవునా! తమ చెంగటనేనున్న జ్యోతిర్లింగరూపుడు వృషాచలేశ్వరుడు వారికి స్ఫురింపగా, అయ్యో! కొంగున నున్న బంగారమును విడిచి, మరచి మనమిట్లు పరితపించుట మహాపరాధము కదా! అని తలంచిరి. ఆ స్వామి, ఉపమన్యుడనే ముని బాలకుని భక్తికి మెచ్చి సంతోషించి, అతని కోరిక తీర్చిన కరుణామయుడు ఆ వృషాచలేశ్వరుడు కదా! అని పరిపరి విధముల తపించిరి ఆ దంపతులు

ఆ శివగురువు మరునాటి ఉదయమే భార్యాసమేతంగా పూర్ణానదిలో స్నానమొనర్చి నిశ్చల భక్తితో వృషాచలేశ్వరుని దర్శించి అభిషేకాదుల గావించిరి. సంతానం కోసం ప్రార్థించిరి. కొన్నాళ్లు గడచిన తదుపరి ఆ పరమ శివుని కరుణగా శివగురువు స్వప్నంలో వృషాచలేశ్వరుడు కనబడి కోరిక ఏమిటని ప్రశ్నించగా, శివగురువు స్వామిని సద్గతిని కలిగించు సంతానం కావాలని కోరాడు. అందులకు స్వామి సంతోషించి, సరే నీకోరిక తీరుస్తాను, కానీ! సంతానం విద్యాగంధంలేని మూర్ఖులు, దీర్ఘాయుష్మంతులు అయిన పెక్కుమంది కుమారులు కావాలా, లేక అల్పాయుష్కుడు, సకల విద్యాశోభితుడు, సర్వజ్ఞుడుగానొక సత్పుత్రుడు కావాలా!

అని పలుకగా, శివగురువు వెంటనే ఆ రెండవది ప్రసాదించమని అర్థించాడు. తన పరీక్షలో శివగురుడు గెలిచినందులకు శివుడు సంతసించి తథాస్తని అంతర్ధానమయ్యెను. ఆ మరునాడుదయం భార్య ఆర్యాంబతో స్వప్నవృత్తాంతం చెప్పగా తమకోరిక తీరినందులకామె చాలా సంతోషించెను.

పరమేశ్వర అనుగ్రహంగా కొన్ని దినములకే కడుపు పండి, ఆ వృషాచల ఈశ్వరుడగు శంకరుడే వారికి తనయుడుగా జన్మించునట్లు, "నందన"నామ సంవత్సరం "వైశాఖ శుద్ధపంచమి" తిథిగా "భానువాసరమున", "ధనుర్లగ్నం", "పునర్వసు నక్షత్రమున" సూర్యాది శుభఘడియలలో శుభగ్రహాలన్నియు ఉచ్చస్థితిలోనుండగా పుత్రోద్భవమయ్యెను.

చంద్రబింబంలా కాంతులు వెదజల్లే ముఖమండలంతో పరిసరాలను వెలిగిస్తున్న ఆ పసికందు శరీరమంతయు శుద్ధ స్ఫటికం లాగా నుండడంతో, శంకరుని శరీరచ్ఛాయలు గల ఆ బాలునకు “శంకరుడు” అనే నామకరణం చేసిరి. అది ఏది ఏమైనా శంకర అనే నామాక్షరములను నిశితంగా పరిశీలిస్తే తిథి, మాస, పక్షములను గోచరిస్తుంది. సంఖ్యాసంకేతంగా ‘శ’ - య,ర,ల,వ,శ లలో అయిదవది. అనగా అయిదు (౫) పంచమీ తిథి. అటులే వీటిలో ‘ర’ రెండవది (౨) అనగా వైశాఖమాసం హల్ల్ అక్షరములలో ‘క’ మొదటిది అనగా పక్షములలో శుక్లపక్షం. అదే వైశాఖ శుద్ధ పంచమీ సంకేతముగా శంకర నామధేయం పొందిరి. మరికొందరు శ్రీ శంకరుల పూర్వీకులు ఆంధ్రులని, వారిది గోదావరి మండలములోని సర్పవర్ష క్షేత్రమని, మయూరవర్ణ కేరళకు వెళ్లితరుణములో వారు వంశతిలకుడని క్రీస్తు పూర్వము 600 సంవత్సరముల ప్రాంతము వాడని పలికిరి. శంకరుని ప్రసాద లబ్ధిగా తమకిట్టి తనయుడు పుట్టినందులకు ఆ దంపతుల ఆనందం అపరిమితం.

శంకరుడి జన్మకాలం కొంత చర్చనీయాంశం. అట్టిది పండితులకును ఏకాభిప్రాయం కుదరలేదు. పూర్వచరిత్ర కనుక, వారి జన్మ కాలాన్ని ప్రామాణికంగా నిర్ణయించలేకపోయిరి. కొందరు పండితులు శంకరుడు క్రీ.పూ.750 సంవత్సర ప్రాంతంలో అవతరించినట్లుగా, మరి కొందరు క్రీస్తు తదుపరి 700 సంవత్సర ప్రాంతంలో జన్మించునటుల భావించి చెప్పిరి. అటులే మరికొందరు శ్రీ శంకరులు శర చరాబ్దంలో పుట్టిరనిరి. అనగా కలియుగారంభమైన తరువాత 2625 సంవత్సరములో జన్మించిరని అర్థము.

ఇట్లు శ్రీ శంకరుల జనన కాలం యెంత వివాదస్పదమైనప్పటికినీ, సామాజిక సంక్షోభానికి కారణమైన నాటి విపరీత ఛాందస మతాదులను ఖండించి, తాత్త్విక రంగాన్ని చక్కదిద్ది, అద్వైత మత స్థాపనతో సనాతన ధర్మోద్ధరణ కావించడం ద్వారా వారు నిర్వహించిన అవతార కార్య విషయంలో ఎట్టి అభిప్రాయ భేదాలకు తావులేదు. చర్చలకు పరిమితమూ లేదు.

ఏది ఏమైననూ, ఆ పుణ్య దంపతుల పూర్వ పుణ్యఫలమో, లేక వారి జన్మమందే నోచుకున్న భాగ్యమో, సర్వులకా పసికందు ముద్దుల మూటగా, తలపై చంద్రరేఖాయుత దృశ్యంతో, ఫాలభాగాన నొక నేత్రముగా, ద్విభుజాలపైన త్రిశూల ముద్రికలు దృశ్యాదృశ్యములుగా నున్నట్లు గుర్తించిరి. బాలుని చూచుటతో పండితుల మనస్సులు పరమశాంతితో, తేజోవంతముగా విలసిల్లటంతో, నిజముగా వారు పరమానంద సుఖానుభూతిని పొందిరట. ఈ బాలుడు తమను, తమ సంతతిని నుద్ధరింప అవతరించి వచ్చిన సాక్షాత్‌శంకరుడై యుండవచ్చునని, చూచి సంతసించుచు తలలూపుచు ప్రశంసిస్తూవెడలిరట. విజ్ఞులకు ఆ సదాశివుడే సాక్షాత్ బాలశంకరుడుగా శ్రీ శంకరాచార్య

రూపమున కారణ జన్ముడుగా అవతరించినట్లు వైదికమతోద్ధరణార్థం, నాస్తికత్వాన్ని రూపుమాపుటకు మహామనీషిగా ఉపనిషన్మతమైన అద్వైతాన్ని స్థాపించి మానవులకు మోక్షపథాన్ని సుగమమొనర్చిన మహోదారచరితుడు శ్రీ శంకర భగవత్పాదులు అని పలుకుటలో ఆశ్చర్యమేదియు లేదు.

శ్లో॥ మూర్ధని హిమకర చిహ్నం నిటలే నయనాంక మంసయో శ్శూలమ్ ।
వపుషిస్ఫటిక సవర్ణం ప్రాజ్ఞాస్తం మేనిరే శంభుమ్ ॥

ఆరుమాసాల బాలుడు ఊయలలో ఊగుచు, ఊయలకు కట్టిన మేలిమి మణులను కన్నార్పకుండగా చూస్తున్న ఆ పసిపాపను చూచిన వారందరు విస్తుబోయిరి. ఇక తల్లిదండ్రుల సంతోషం వర్ణనాతీతం. అటులే ఎల్లరకును తరుణోపాయం, సుఖశాంతులును శృతి మార్గముగా వ్యదజల్లిన విజ్ఞానాకాశ పూర్ణచంద్రుడుగా ఎల్లరకు తోచెను.

మరికొన్ని దినములకే శంకరుడు బుడిబుడి నడకలతో బాటు మాటలు, మాటలతో బాటు శాస్త్రయుక్తంగా విన్నది విన్నట్లుగా పలుకడం, ఆ పలుకులునూ స్వచ్ఛంగా, శుద్ధస్ఫుటముగా నుండడము విని ఇంటివారే గాక, అగ్రహార పండితులును ఆశ్చర్యపడిరి. శంకరావతార రూపులే శ్రీశంకర భగవత్పాదులుగా అవతరించెనని తలంచిరి

ఇట్లు బాల శంకరుడు దినదిన ప్రవర్ధమానమగుచు గొప్ప బాలమేధావిగా ప్రతిభావికాసాలతో పెంపొందుచు సర్వజ్ఞుడుగా "కాలడి" గ్రామస్థుల భాగ్యమా అనునట్లుండెను.

అదియును గాక, ఈ బాలశంకరుడు తను అగ్రహారమున అవతరించు చున్నాడను మహాసంకల్పముగానున్నట్లు గృహస్థులందరు పరమనైష్ఠికులై, నిత్యాగ్నిహోత్ర కార్యక్రమములతో సద్ధర్మాలతో భక్తి ప్రవృత్తులతో నిర్వర్తించుటను అదిదేవతలే ముందుగా దిగివచ్చి వారికి శుభాహ్వానముగా నుండెను. ఒక వేదవేదాంగ విద్యా ప్రావీణ్యుడు, సకల శాస్త్రకోవిదుడు, సర్వులను సదాచార నిర్వహణలో నడుపు సద్గుణ సంపన్నుడు తమ అగ్రహారమున పుట్టుచున్నాడను శుభ సంకకల్పమా అనునట్లు మహా పండితులుగా వారివారి ఇండ్లలో జన్మలెత్తి ఎదురుచూచుచుండిరి. వారే పద్మపాదుడనే సనందుడు, హస్తామలకుడు, మండన మిశ్రుడు, ఆనందగిరి, ఉదంకుడు, చిత్సుఖుడు, కుమారిల భట్టు, సాక్షాత్ సరస్వతీ రూప ఉభయ భారతీదేవి మొదలగు వారెందరో మహనీయులు సాక్షాత్ త్రిమూర్తుల అంశలే.

"ప్రపేదిరే పాక్తన జన్మ విద్యా" అన్నట్లు శంకరుడు బాల్యంలోనే సర్వవిద్యా రహస్యములను కరతలామలకమొనర్చుకొనెను. అతని మూడవ యేటనే తండ్రి శివగురువు శివలోకప్రాప్తుడయ్యెను. అయినను తల్లి ఆర్యాంబ ధైర్యంగా శంకరుని పెంచుతూ "పంచమే బ్రహ్మం వర్చస కామస్య" అనే వచనం ప్రకారం పంచవర్ష ప్రాయమునే శంకరునకు

ఉపనయనం గావించెను. ఆ వటువు ముఖాన బ్రహ్మవర్చస్సు తాండవించడం, అనునది అతనిలోని అంతర్గతమైయున్న సకలవేద శాస్త్ర పాండిత్య జ్ఞానమంతా అంతర్లీనమైయుండునట్లు తోచినది. సకల విద్యా పారంగతుడైన కారణాన, అద్వైత విద్యాఫలితంగా నతనికీ సంసార బంధమనెడిది ఏవగింపుగా తోచినది. సప్తవర్షప్రాయుడై సర్వజ్ఞుడైన కారణాన, అతనికట్టి అల్పవయస్సులోనే అతని వద్ద యెందరో విద్యార్జనకై శిష్యులు చేరిరి. వారును, వారితోబాటే శంకరుడును భిక్షకై వెళ్ళడం గురుకులాచారం.

ఒకనాడు శంకరుడే యొక బ్రాహ్మణుని యింటి ముందు నిలబడి భిక్ష కోరగా, ఆ యింటి ఇల్లాలు పరమ దారిద్ర్యముననుభవిస్తూ, అయ్యో! భిక్ష వేయుటకును యింటిలో ఏమియును లేదు కదా! యని పరితపించి, తుదకు నొక కుండలో అడుగుననున్న ఉసిరికాయను తెచ్చి భిక్షగా వేసి, స్వామీ! మన్నించండి యని భక్తితో మొరపెట్టుకొనెను. శంకరుడా ఇల్లాలి భక్తికి తన్మయత్వం చెంది, ఇంతటి వారికీదారిద్ర్యమేమిటని, నిట్లనుకొనెను.

శ్లో॥ సము నిర్మర జిత్ కుటుంబినీం పద చిత్రైః నవనీత కోమలైః ।
మధురైరుప తస్థివాన్ స్థవైః ద్విజ దారిద్ర్య దశా నివృత్తయే ॥

ఆ యిల్లాలి దారిద్ర్యాన్ని తొలగించాలని, మృదుమధుర ఆశు కవిత్వంతో మహాలక్ష్మిని ప్రార్థించారు శంకరులు. దానినే కనకధారాస్తవమంటారు. దాంతో ఆ ఇల్లాలి యింటిలో బంగారపు ఉసిరికాయల వర్షం ధారాపాతంగా వర్షించినది. శంకరుని ప్రార్థనా మహిమ అట్టిది.

తనతల్లి వృద్ధురాలగుటతో స్నానం కోసం యిబ్బంది పడుతూండడం జూచి శంకరుడు సమీపమున నున్న "పూర్ణా"నదిని ప్రార్థించి తన ఇంటి సమీపంలోనే ప్రవహించేలా చేశాడు. తనకు అల్పాయుర్దాయమని తెలుసుకొన్న తల్లి తనకై విలపిస్తుంటే, "అతి చంచలమైన బుద్బుద ప్రాయమైన యీ కళేబరంపై మూర్ఖుడును స్థిరబుద్ధితో నుండదు" అని తల్లిని ఓదార్చుచు వేదాంతం ఉపదేశించాడు.

అదేమనగా, ఈ సంసార పరంపరలో నెందరో తల్లులు, తండ్రులు, భార్యాబిడ్డలుండిరి. వారంతా ఏరిప్పుడు? నిజానికిది బాటసారుల సంగమస్థానం లాంటిదనే తత్వాన్ని యుపదేశించాడు. అట్టి యుపదేశంతో తన కుమారుడు వైరాగి అవుతాడేమోనని తోచినది. అటులనే తల్లిని సమ్మతింపజేయుట కొకనాడు శంకరుడు నదిలో స్నానం చేస్తూండగానొక మొసలి తన కాలు పట్టి యీడ్చినట్లు బిగ్గరగా అరిచాడు. అది విని తల్లి పరుగెత్తుకుని వచ్చి పెద్దగా విలపించినది. అదే అదనన్నుకొని, అమ్మా! నేను సన్యాసం స్వీకరిస్తే, దానికై నీవు సమ్మతిస్తే, ఈ మొసలి నన్ను వదలగలదు" అని శంకరుడన్నాడు. ఎట్లాగో కుమారుడు జీవించి యున్నదే సరియని శంకరుని సన్యసించుట కంగీకారము

తెలిపినది. అప్పుడే శంకరుడును మానసికంగా సన్యసించాడు. మొసలి తన పట్టు వీడింది. శంకరుడు సురక్షితుడైనాడు. కాని తల్లి శంకరుని సన్యసించుటకు సమ్మతించినను, దేశాటనమొనర్చుటలో తాను గతించినపుడు కుమారుడే తానెక్కడున్నను వచ్చి స్వయంగా తన అంత్యక్రియలు చేయాలని కోరగా, అందులకై తల్లి తలచుకొన్నంతలో తానెక్కడున్నను సమీపమున చేరుతానన్నాడు. ఆ సన్యాసము స్థిరపడుటకై గురువుల అన్వేషణలో అనంతశయనం, కన్యాకుమారి, మధుర, శ్రీరంగం తుదకు చిందంబరం చేరి అక్కడున్న గోవింద యతిని దర్శించి వారిద్వారా సన్యాసం స్వీకరించిరి. కొద్ది రోజులకే తన దిగ్విజయ యాత్రలో నుండగా తల్లి అంతిమకాలం సమీపించినట్లు దివ్యదృష్టి కనుగొని, వెంటనే శంకరులు తల్లిని చేరాడు. ఆ సమయములో తల్లికి బ్రహ్మతత్త్వాన్నియుపదేశించాడు. కాని ఆమె యాతత్త్వాన్ని అర్థం చేసుకోలేక, సగుణ రూపంలోనే పరమాత్మ దర్శనం కావాలని కోరింది. అలాగే అంటూ భుజంగ ప్రయాత వృత్తంలో నిట్లు శివుణ్ణి స్తుతించాడు.

"అనాద్యం తమాద్యం పరం తత్త్వమర్థం మనో వాగతీతం మహాశైవమీడే"-

ఈ స్తుతి విని శివుడు స్వయంగా సపరివారంతో దర్శనమిచ్చాడు. కాని ఆ ఆకారం వికారంగా నుండడంతో నామె వారివెంట వెళ్లనంది. అప్పుడా శంకరులు మరల విష్ణుస్తోత్రం చేశాడు. అప్పుడా స్తోత్రభావాన్ని బాగా మననం చేసుకొని తల్లి ఆ విష్ణు దర్శనంతోనే యోగిలాగా దేహం వదలిపెట్టింది.

"తల్లి కంటే దైవం వేరేలేదు కదా!" అందుచేత, శంకరుడు సన్యాసియైనను తల్లిని సేవించాల్సిందే. గతించిన తల్లికి దహన సంస్కారాలు చేయుటకు జ్ఞాతులు సమ్మతించకపోగా, అందుకని శంకరులు తన ఇంటి ప్రాంగణంలోనే తల్లికి దహన సంస్కారాలొనర్చెను.

ఒకప్పుడు కేరళను రాజశేఖరుడను రాజు పరిపాలిస్తున్నాడు. శ్రీ శంకరుని గూర్చి విని, వారిని తన నిలయాన్ని దర్శించి, సంతాన భాగ్యాన్ని అనుగ్రహించగలందులకు భద్రగజాన్ని పంపించాడు. తాను భద్రగజమధిరోహించనని త్రిప్పి పంపగా ఆ రాజే స్వయంగా వచ్చి రమ్మని అర్థించెను. శ్రీ శంకరులు స్వయంగా విధియుక్తముగా 'ఇష్టి' యజ్ఞము నిర్వహించగా రాజునకు సంతానం కలిగింది. ఆ సంతోషమునకు రాజు శ్రీ శంకరులకు బహుమానంగా బంగారు నాణెములను బహుకరించగా, తాను సన్యాసినని వాటిని ముట్టక ఆ ప్రాంతపు బ్రాహ్మణ గృహస్థులకు పంచిపెట్టిరట. నిజమే జ్ఞాన పంథాలో పయనించేవారికివి ఎందులకు?

అటుపైన, అనేక పుణ్య క్షేత్రాలను దర్శిస్తూ, ఆ సంచారంలోనే "గోవింద భగవత్పాదాచార్యుల" వారిని దర్శించి సేవించాడు. ఆయన సాక్షాత్ "పతంజలి మహర్షి"

అని కొనియాడాడు. తన గురువుగా స్వీకరించాడు శంకరుడు. ఈ గోవింద భగవత్పాదాచార్యుల గురువు గౌడపాదాచార్యుల వారు. ఈయన గురువు సాక్షాత్ శుకమహర్షి యింత గొప్ప గురుపరంపర శ్రీ శంకరుల వారిది.

ఆ గురువు ప్రథమ దర్శనంలో తననిట్లు ప్రశ్నించెను. త్వం కః? అని శంకరుని అడిగినపుడు, "యః కేవలోస్తి పరమః సశివోహమస్మి" అని సమాధానం చెప్పిన బ్రహ్మణ్యుడు శంకరుడు. ఆ మాట విన్న తర్వాతే ఆయన శంకరుని శిష్యునిగా స్వీకరించాడు. శంకరునికి సన్యాస దీక్షనిచ్చాడు.

అటుపై శంకరుడు దేశ సంచారం చేస్తూండగా అనేక వింతలు, విశేషాలు జరిగాయి. ఒక చోట నర్మదానది పొంగి ప్రజలకు ప్రాణభయం కల్గిస్తూంటే, శంకరుడొక పాత్రను ప్రవాహంలోకి వదలగా, ఆ పాత్ర నర్మదానది నీటిని త్రాగేసింది. అటులా ప్రాంతీయులకు మేలొనర్చి అటుపై కాశీ వెళ్లి కాశీ విశ్వేశ్వరుని దర్శించి తరించాడు. ఆ కాశీలో సంచరించుచున్నప్పుడే శంకరునికొక ఛండాలుడెదురయ్యాడు. అప్పుడా శంకరులు తన శిష్యగణముతో గంగానదికి ఆహ్నిక విధులకై వెళ్లుచుండగా నాలుగు కుక్కలతోనున్న ఛండాలుడెదురు పడడం, శిష్యులతనిని దూరముగా పొమ్మనడంతో నా ఛండాలుడిట్లనెను.

"దూరముగా పొమ్మనునది నన్నా? నా ఆత్మనా? నా శరీరమునా?" అని నవ్వుచు ప్రశ్నించెను. శంకరులది విని, యింతటి తత్త్వవాక్యములను పలికినది సాక్షాత్ శివుడని గ్రహించి ప్రణమిల్లాడు. శివుడు శంకరుల తత్త్వదృష్టికి మెచ్చి నిజస్వరూపంతో ప్రత్యక్షము కాగా–

"ఛండాఽలోస్తు సతుద్విజోఽస్తు గురుతిత్యేషామనీషా మమ" అంటూ శంకరుడు మోకరిల్లాడు. ఛండాలుడైన, బ్రాహ్మణుడైన, లేక ఏవరైనా సరే వినయ సంపన్నుడగు జ్ఞానిని గురువుగా స్వీకరిస్తాను. అన్నారు శ్రీ శంకర భగవత్పాదులు. 'మనీషా పంచకం' అనగా గురువు దైవసమానుడని భావించాలి.

"నిస్త్రైగుణ్యేపథి విచరతాం కోవిధిః కోనిషాదః" అని ప్రవచించాడు. అందులకు,

శివుడనుగ్రహించి దశోపనిషత్తులకు, బ్రహ్మసూత్రములకును భాష్యములు వ్రాసి వేదమత పునరుజ్జీవనమొనర్చుమని ఆదేశించి అదృశ్యమయ్యెను.

అద్వైత వ్యాఖ్యా గ్రంథరచనకు బదరికావనము తగినదని శంకరులు తలచి, శిష్యులతోనచటికి చేరెను. అచటనున్న "మందాకినీ" నదీ తీరాన తపమొనర్చుచున్న బ్రహ్మర్షుల చెంత వసించి ప్రస్థానత్రయాది 18 భాష్యములు, 40 ప్రకరణ గ్రంథములను, 74 లఘు గ్రంథములను రచించిరి. మరి ఇంకెన్నో మనకు అందనివి గలవని తోచుచున్నది.

"గుర్వష్టకం" అను గురు స్తోత్రం శ్రీ శంకరాచార్య కృతమే. ఇట్లు శ్రీ శంకరభగవత్పాదులు బ్రహ్మసూత్ర భాష్యం, భగవద్గీతాభాష్యం, కొన్ని ఉపనిషత్తుల భాష్యం, విష్ణుసహస్ర నామ స్తోత్ర భాష్యం, ఉపదేశ సాహస్రి, వివేక చూడామణి, సర్వవేదాంత సిద్ధాన్త సార సంగ్రహం మొదలైన కొన్ని ప్రకరణ గ్రంథాలు, దక్షిణామూర్తి స్తోత్రం, సౌందర్యలహరి, శివానందలహరి మొదలగు గ్రంథాలను రచించిరి. వీరి భావజాల నిర్మాణానికి వాడిన భాష గురించి శ్రీ చిన్మయానంద స్వామి వారిలా ప్రశంసించారు. "శ్రీ శంకరుని తూనీరం శత్రుభేద్యమైన వివిధాయుధాల అక్షయం. అడగంటుతున్న ఆర్ష విద్యను పునరుద్ధరించడానికిని, అద్వైత మతస్థాపనకున్నూ, తనకు తాను నియమించుకున్న ఒక అసాధారణ జ్ఞాని."

శ్రీ శంకరులు శిష్యులకు అద్వైత విద్యను ఉపదేశించుచుండగా పాశుపతులాయనతో వాదమునకు సిద్ధపడిరి. శృతిపారముల ప్రమాణముగా శంకరులు పాశుపతుల వాదమును ఖండించిరి. వారు వినమ్రులై శ్రీ శంకరుల పాద దాసులైరి.

శ్రీ వేదవ్యాసుడు వృద్ధబ్రాహ్మణ వేషంలో వచ్చి శ్రీశంకరుల భాష్య ప్రవచనమును విని, ఆయనతో వాదనకు దిగెను వారుభయులకు ఎనిమిదిరోజుల పర్యంతం వాదము నడిచినది. వాదమును వినుచున్న శ్రీ శంకరుల శిష్యులలోనొకడగు పద్మపాదుడను సనందుడు, ఇట్టి అపరశంకరులతో వాదించగల యీ వృద్ధుడు సాక్షాత్ శ్రీమన్నారాయణుడే కావచ్చుననెడి శంక, శంకరులును గ్రహించి ప్రార్థించగా, వ్యాసుడు నిజస్వరూపముతో ప్రత్యక్షమై శంకరుల భాష్యం సర్వోత్తముగా, ప్రసాద గాంభీర్యంగా, బహు యోగ్యంగనున్నదని ఆశీర్వదించి, వేద బాహ్యమత నిర్మూలనకు సంచారము చేయమని, అందులకై మరియొక 16 సంవత్సరములు జీవింపుమని అదృశ్యులైరి. ఇట్టి వ్యాసుడే గోవింద భగవత్పాదుల వంటి వారికీ శంకరుడు శిష్యుడగునని, గోవింద భగవత్పాదులతోననియుండిరి.

దిగ్విజయ యాత్రకై బయలుదేరిన శ్రీశంకరులు ప్రయాగలో తుషాగ్ని మధ్యమున శరీరము దహించుకొన్న కర్మసిద్ధాంతవాది కుమారిల భట్టును సమీపించిరి. అతదు సాక్షాత్ కుమార స్వామిగా గుర్తింపబడ్డాడు. పూర్వమీమాంస ప్రవర్తకుడును, గొప్ప కర్మిష్ఠి, జైమిని మహర్షికి శిష్యుడు. వేద విహితమైన కర్మనే తప్ప మరొకటి అంగీకరించడు.

అలాంటి మహనీయుడిని చేరిన శంకరుడు. వాద భిక్ష కోరెను. అలాంటి సమయానికా మహదాచార్యుడగు కుమారిల భట్టుగారు, యొక్క ఊక తొట్టిలో నిప్పుపెట్టి, దాంట్లో కూర్చునియున్నారు. అప్పటి వరకు తొడల భాగం కాలియుండి కదలకయున్నారు. అది చూచిన శ్రీ శంకరాచార్యుల స్వామివారు ఆశ్చర్యపడిరి. అయినను అట్టి తరుణములోను తనకు వాదభిక్ష పెట్టమని, నమస్కరించి అర్థించాడు. అప్పటికాస్వామి వారి వయస్సు షోడశ వర్షప్రాయం. శ్రీభట్టుగారి వయస్సు సుమారు 90 సం.లు.

శ్రీ కుమారిల భట్టుగారు దివ్యజ్ఞాన సంపన్నుడగుటచే, శ్రీశంకరుడు సాక్షాత్ శివుడేయని గుర్తించి, "నాయనా! నీతో చర్చించడం నా అదృష్టమే గానీ, వేరొండు కాదు. కానీ, ప్రస్తుతం నేను ఈ యూక తొట్టిలోనున్నాను. నీతో వాదించే ఓపిక లేదు. నా శిష్యులలోనొకడు మండనమిశ్రుడని నర్మదానదీ తీరంలోనున్నాడు. ఆయనతో వాదిస్తే నాతో వాదించినట్లే" అని పలికిరి.

శ్రీ కుమారిల **భట్టునకీ దుస్థితి యే**మిటని శంకరుడు ఆశ్చర్యపడి వారినే ప్రశ్నించగా, వారిట్లు చెప్పనారంభించెను. అందులకాయన, "జీవితంలో నేను రెండు తప్పులు చేశాను. ఒకటి గురుద్రోహం, రెండవది ప్రమాణములైన వేదాలను పందెములో పెట్టుట. ఈ దోషాలు నాతోనున్నవి. అవి యేవనగా, ఆ రోజులలో బుద్ధుని తదనంతరం, అతని అనుయాయులు, బౌద్ధ మతాన్ని ప్రచారం చేస్తూ వేదముల ప్రమాణములని చాటుచు, తమ సిద్ధాంతాలను మాత్రం రహస్యంగా నుంచుతూ, విశ్వాసము కల్గిన శిష్యులకే యాసిద్ధాంతాల రహస్యం చెప్పెడివారు. మిగిలిన వాళ్లందరికిని నేవో మహత్తులు చేసి చూపించెడివారు. ఆ మహత్తుల కాకర్షితులై వెళ్లే జనానికి, తుదకు వారి సిద్ధాంత రహస్యమేమిటో తెలియక పోయెడిది. అసలు విషయం ఏమిటంటే! బయట పెడితే వాదంలో వాళ్ల సిద్ధాంతం ఓడిపోతుందనే భయం. మరియు వారు పరమ నాస్తికులు.

అయితే వారి రహస్యమేమిటని తెలుసుకొనదలచి, శ్రీకుమారిల భట్టుగారు బౌద్ధయువకునిగా వేషం ధరించి, వారిని చేరి నమ్మించి "మీమాంస శాస్త్రం" చెప్పవలసిందని అర్థించాడు. అందులకై, వాళ్లు కొన్ని పరీక్షలు పెట్టి, ఈ కుఱ్ఱవాడు చాలా నిలకడైన, తెలివైన వాడని గ్రహించి, బౌద్ధమత సంబంధిత పాఠాలన్నిటినీ కుమారిలభట్టునకు బోధించారు. అట్లా బోధనలో చివరి స్థాయిలో వాళ్లు సూటిగా పరమాత్మను నిందించడంతో, వేడిరక్తంతో నున్న యీ కుఱ్ఱవాడు తట్టుకోలేక, కళ్లల్లో నీళ్లు పెట్టుకొన్నాడు. దానితో వారు ఆరా తీసి వెళ్లగొట్టే తరుణంలోనే వారి మత సిద్ధాంతాల రహస్యాలు తెలుసుకొన్నవాడగుటచే వారి వాదములన్నింటిని ఖండించి తుత్తునియలు చేశాడు.

("మీమాంస"-"మా"ధాతువునకు "జిజ్ఞాస" అనే అర్థంలో "సన్"ప్రత్యయం రాగా ఏర్పడిన విశిష్టమైన పదం అనగా "తెలిసికొనగోరుట"అర్థం.)

వారి నుండి తొలగి మీమాంస సిద్ధాంతమును ప్రచారం చేస్తున్న శ్రీ కుమారిల భట్టు "సుధన్వ మహారాజు"ను చేరాడు. ఆతడు భట్టుతో ఏమయ్యా! వేదాంత ధోరణిలో నున్నావు. నాకీ వేదాలు గీదాలు తెలియవు. వాటి నిదర్శనం చూపించు అని, వ్యంగ్యంగా పలుకగా, నాస్తికులకు వేదముల ప్రమాణాలే అని, చురకవేసి, యుక్త వయస్సులో నున్న ఆ కుమారిల భట్టు నిరూపణకై సిద్ధపడ్డాడు. ఆ రాజ భవనం పెద్ద కొండపై నుండడంతో,

"వేదములు కనుక ప్రమాణములైతే నాకెట్టి ప్రమాదం కలుగకుండు గాక!" అని ఉక్రోషంతో ఆ కొండపై నుండి క్రిందికి దూకేశాడు. పెద్ద ప్రమాదమేమి లేకపోయినను అతని కాలి చిటికెనవేలు కొంచెం బెణికినట్లయినది. అయినా ఆ విషయం ఎవరికిని గోచరం కాలేదు. కాని సభలో తాను దిగ్విజయం పొందాడు. ఈ శాస్త్రం మహిమ విస్తారమైంది.

అటుపిదప తనకు తాను పరితపిస్తూ, వేదములు ప్రమాణములని సర్వులు ఘోషిస్తుంటే, అట్టిదే, **నేను చెప్పి కొండపై నుండి దూకితే** నావేలు ఎందుకు బెణకాలి? ఆ దెబ్బయును ఎందుకు **తగలాలి? అని, తన గురువగు** జైమినీ మహర్షిని ప్రశ్నించాడు. ఆయన వెంటనే చెంపదెబ్బలు కొట్టాడు. తదుపరి అనునయించి, "నాయనా! నీవు చాలా తప్పుచేశావు. అదేమిటనగా, "వేదములు ప్రమాణములైతే నాకు దెబ్బ తగులకూడదని, వేదములకే పరీక్ష పెట్టావు. వేదములు ప్రమాణములే, నాకు దెబ్బ తగలదు" అని యుండాలి. కాని నీవు ప్రమాణములు కానిచో దెబ్బ తగులునని అర్థమా! అట్లు వేదములకే రెండు అవకాశాలు పెట్టావు" వేదములను కాస్తా కించపరచినవాడవైతివి. అదే నీకు తగిలిన ఈ చిన్నదెబ్బ. నీవు చేసిన ఈ చిన్న పొరపాటును గ్రహించటానికే యీ దెబ్బ. సరిదిద్దుకో" అని గురువు పలికెను.

ఇట్లు నేను చేసిన తప్పులకు గాను యీ ఊకాగ్నిలో నన్ను నేను హోమం చేసుకోవటం కంటే వేరే ప్రాయశ్చిత్తం లేదు. ఇక్కడ (తొడలదాక) కాలిందిప్పుడు. కొంత నా యోగశక్తితో నిలబడియున్నాను. తప్పితే నిలబడే పరిస్థితి కాదు. అని, ఆ స్థితిలోను తనను చేరినది అపరశంకరుడని గ్రహించిన వాడగుటచే కుమారిల భట్టు శంకరునకు సకలలోపచారాలు తన శిష్యులతో చేయించాడు. వారి అద్వైత సిద్ధాంతాన్ని వినిన వాడగుటచే తనకీ దుర్దశలో బ్రహ్మోపదేశం చేయమని, తనను మీ శిష్యునిగానంగీకరించమని అర్థించెను. శ్రీ శంకరులట్లే చేసిరి. తర్కంతో, హేతు బద్ధతతో, యుక్తితోను తాను ప్రతిపాదించిన అద్వైత సిద్ధాంతాన్ని సౌమ్యవాదనగానే అవతలి వారంగీకరించునట్లు చేసెడి వాడు. వారట్లు ప్రతిపాదించిన 'అద్వైతం' వైదిక ధర్మ వికాసానికి బ్రహ్మాండముగా తోడ్పడింది.

శ్రీ కుమారిల భట్టు వారి యాదేశానుసారము శ్రీశంకరులు నర్మదానదీ తీరాననున్న వారి శిష్యుడగు మండనమిశ్రుని చేరి, తన వాదనతో నతనిని నోడించి, సన్యసింపజేసి తన శిష్యునిగా పొందెను. అతని అపార పాండిత్య నిధియు అగుట వలన సురేశ్వరాచార్యులని పేరుతో పిలువబడెను.

అటుపిదప సంచారము చేస్తూ శ్రీశైలము చేరెను. అచట వీరశైవ, పాశుపత, మాహేశ్వర, వైష్ణవమత విద్వాంసులను వాదమున జయించి శిష్యులను జేసుకొనిరి. మత్సరగ్రస్తుడైన కాపాలికుడొకడు కుత్సితముగా శంకరులను వధించనుద్యమించగా, నృసింహ

తత్త్వమావేశింపబడిన పద్మపాదుడను శిష్యుని చేతిలో సంహరింపబడెను. అందులకా శంకరుడు, "శ్రీ మత్పయోనిధి నికేతన చక్రపాణే" అంటూ లక్ష్మీనృసింహ స్తోత్రం ప్రారంభించి, లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్" అంటూ ముగించారు.

అటుపైన వారు మహారాష్ట్రంలో ప్రచారం చేసి, చిదంబరంలోని ఆయాసభలలో బ్రహ్మసూత్ర భాష్యాదులను రచించి, ప్రచారం చేస్తూ, తర్వాత గోకర్ణం క్షేత్రమును దర్శించారు. అటునుండి మూకాంబికను సేవించారు. అచటనే శంకరులు, గతించిన కుమారుని ముందుంచుకొని విలపిస్తున్ననొక బ్రాహ్మణ దంపతులను ఊరడించి ఆ జగన్మాతను ప్రార్థించి ఆ బాలుణ్ణి పునరుజ్జీవింపజేసారు.

అటునుంచి "శ్రీబలి" అనే యూరు వెళ్లి, అగ్రహారంలో నివసిస్తున్న ప్రభాకరుదను మహాపండితుని కుమారుడుగని, తన దివ్యదృష్టితో నితడొక పరబ్రహ్మ స్వరూపంగా గ్రహించి ప్రశ్నించెను అంతవరకాతడు యేమి తెలియని రీతిలోనున్న వాడు శ్రీశంకరుని ప్రశ్నతో అనర్గళంగా ఆశుధారతో పరతత్త్వ ప్రబోధకాలైన ద్వాదశ శ్లోకాలు చెప్పగా నతనికి హస్తామలకుడని పేరుపెట్టి అతనిని తన శిష్యునిగా చేసుకొనెను

శ్రీ శంకరులు "శృంగగిరి" చేరి అచట తమ మఠమును (పీఠమును) స్థాపించి, తన శిష్యుడైన సురేశ్వరాచార్యులను పీఠాధి పతులను జేసిరి

అచటనే మందబుద్ధి యని భావింపబడు "గిరి", యను బాలుని తన సంకల్పముతో సకల శాస్త్ర పారంగతుని జేసి సన్యసింపజేసి తోటకాచార్యులని నామకరణం జేసెను అందులకాతడు "తోటకాష్టకం"గా శ్రీశంకరులను స్తుతించెను "హృదయే కలయే విమలంచరణం, భవశంకర దేశికమే శరణం" అని –

అటుపైన జైత్ర యాత్ర సాగిస్తూ నాస్తికమతాన్ని ఖండిస్తూ, షణ్మతాలకు సామరస్యం కూర్చి షణ్మతస్థాపనా చార్యులైనారు.

ద్వైత, విశిష్టాద్వైత, అద్వైతములను "మతం" అను కొనుటకంటే "జీవ బ్రహ్మలకు గల అనుబంధ దశ" అంటే బాగుంటుంది. "భగవంతుడూ జగత్తు" ఈ రెండును ఉండడమను మాట సత్యమే. జీవుడు వేరు, పరమాత్మ వేరు, వీరిద్దరి మధ్యలో నున్న జగత్తుయొక్క సృష్టి. జీవుడు భక్తి పారవశ్యంతో భగవంతుణ్ణి అర్చించి ఆ భగవంతుణ్ణి చేరుతాడు. అనగా పునర్జీవం లేదు నిజమాలోచిస్తే ఈ సర్వం ఆధ్యాత్మిక మయం. ఇట్టి జ్ఞానం పరిపూర్ణమైన స్థితిలో జీవుడు అన్యుడు కాదు, జీవ బ్రహ్మైక్యం అద్వైత స్థితి. అదే జ్ఞాన దీపం. పరమార్థమును, బుద్ధి వికాస ప్రతిఫలమే అద్వైతము. ద్విదా భావము లేదు. అనగా దీనినిమించినది మరొకటి లేదు. సత్య సిద్ధాంతమైనది. శ్రీ శంకరుని పర్యటన

మధ్యార్జునేశ్వరుని ఆలయపండితులకును అద్వైతం 'సత్య సిద్ధాంతం' అనే మాటలు ఆ ఆలయ మహా లింగము నుండి వినిపింప జేశారు దాంతో అద్వైతం అఖండత్వమైనది.

ఇట్టు శంకరుని అద్వైత ప్రస్థానంతో మనకు జ్ఞాన జ్యోతి వెలుగుతుంది. యావద్భారతం సంచారం చేసి, బదరి కేదారులును దర్శించిరి.

పూర్వం విభాండకుని పుత్రుడగు ఋష్యశృంగుడను మునీంద్రుడు తపస్సొనర్చినందులకు ఈ గిరికి శృంగగిరి యని తదుపరి శృంగేరిగా మారింది.

శ్రీ శంకరాచార్యులు తన శిష్యులతో సంచరిస్తూ శృంగగిరి ప్రాంతమున తుంగానది తీరమునకు చేరిరి. అచట వింతగా నొక ఆడుకప్ప ప్రసవ వేదన పడుచుండగా, ఒక త్రాచుపాము ఆ కప్పకు గొడుగుగా పడగవిప్పి ఎండ తగులకుండ యుండుటను శ్రీశంకరుల వారు చూచిరి. బద్ధ శతృవులైన వీటి మిత్రవాత్సల్యతను గ్రహించి, ఇదొక పవిత్ర క్షేత్ర స్థలముగానెంచి, అచటనే "శ్రీశారదాదేవి"ని ప్రతిష్ఠించిరి. శ్రీ శారదా దేవి నామంతో గొప్ప పుణ్య పవిత్ర క్షేత్రముగా వెలసినది. తదుపరి ఆ "శృంగేరి" శారదాపీఠముగా వెలసినది.

శృంగేరి పీఠమునందు శ్రీశారదాదేవి వెలసినట్లు ఉత్తరమున కాశ్మీరమునందు కూడా శారదాదేవి మందిరము కలదు. ఆ మందిరమున నాలుగు దిక్కుల నాలుగు ద్వారములతో అమరు సర్వజ్ఞ పీఠమొకటి కలదు. ఆ పీఠమునలంకరించుటకు తగు అర్హుడు, సర్వజ్ఞుడు లేకుండా బోసిగా నుండినది.

శ్రీ శంకరాచార్యులు ఉత్తరయాత్రలో దాని సంగతి విని, ఆ మందిరము దక్షిణ ద్వారమువైపు వెళ్ళెను. అటు వచ్చిన శంకరాచార్యులను ఆ ప్రాంతీయ పండిత విద్వాంసులగు కణాద, గౌతమ, కపిల, సౌతాంత్రిక, వైభాషిక, యోగాచార, మాధ్యమిక, బౌద్ధ, జైనులు అడ్డగించిరి. వారందరితో ఆచార్యులు వాదించి పరాజితులనొనర్చిరి. సర్వులు శ్రీ శంకరాచార్యుల సర్వజ్ఞత్వ వాదనకు చకితులై, ఈ సర్వజ్ఞ పీఠము నధిష్ఠించుటకు సమర్థించిరి. ఆ సర్వజ్ఞపీఠము నధిష్ఠించుటకు శ్రీ శంకరులు వెళ్ళగా, ఆశరీరవాణిగా శారదా దేవి ఆక్షేపించి యిట్లనెను - "ఆధ్యాత్మికతతో పాటు, కామ, శృంగార పాండిత్యవాదనకై సిద్ధ పడిననితడు అపవిత్రుడయ్యెనా! ఏమి?" అని, సర్వుల భావన తెలుసుకొన యత్నించెను. అదివిన్న సర్వులు సర్వజ్ఞులేగనుక, "ఆచార్యులు ఎల్లెడల పవిత్రులే. పరశరీరమున ప్రవేశించి, కేవలం వాదనకై తెలుసుకొన్న శృంగార కర్మదోషము వారికంటదు" అని ఘంటాపథముగా పలికిరి. ఆ పలుకులకే ఎదురు చూచిన శారదా దేవి సంతసించెను. శ్రీ శంకరాచార్యులు సర్వజ్ఞపీఠమునధిష్ఠించగా ఆకాశము నందు దేవ దుందుభులు మ్రోగెను. ఎల్ల దేవతలు పుష్పవర్షం కురిపించి మహదానందంతో శ్రీ శంకరులను ఆశీర్వదించిరి.

శ్రీ శంకరాచార్యులు పీఠములను ప్రతిష్ఠించుటలో అద్వైతపరముగా తూర్పున నున్న పూరీ జగ. న్నాథమునందు పద్మపాదులను శిష్యుడ్ని నియమించి ఋగ్వేద పారాయణము, దక్షిణమున నున్న శృంగేరియందు సురేశ్వరాచార్యులను నియమించి అందు యజుర్వేద పరాయణము, పశ్చిమమున నున్న ద్వారకలో హస్తామలకుని నియమించి సామవేద పారాయణమును, ఉత్తరమున నున్న బదరీక్షేత్రమునందు తోటకాచార్యులను పీఠాధిపతులుగా నియమించి అందు అథర్వణవేద పారాయణమును జరుగునట్లు ఆజ్ఞాపించిరి. ఆ పీఠాలలో భక్తి, జ్ఞాన, కర్మ కాండములను నుద్ధరించుటకు మోక్షప్రథమగు ధర్మ పరిపాలన, వైదిక సంరక్షణగా అద్వైత విద్యా ప్రచారం జరుగునట్లు అధికారములనిచ్చి, నిత్యనైమిత్తిక త్రికాలములయందు పూజలు జరుగునిట్లు ఆదేశించిరి. అట్లు శ్రీ శంకరాచార్యులు ఆయా పీఠాలలో శ్రీచంద్రమౌళీశ్వర లింగములను ప్రతిష్ఠింపజేసి వరుసగా నిట్లు వేదపరనము జరుగునట్లు కూడ చూచెను.

బదరిలో శిష్యుల సౌకర్యార్థము ఉష్ణకుండములను శ్రీ శంకరులు కల్పించి, కేదార నాథమును జేరి, అచట స్వామిని సేవించి, తరించి, తన శిష్యులనందరిని ఆశీర్వదించి శ్రీదత్తాత్రేయ గుహలోనికి జొచ్చి అదృశ్యులైరని కొందరు, కైలాస గిరిలోనే సంచరిస్తూ అదృశ్యులైరని చెప్పుదురు - అంతటి మహానుభావుడు "నభూతో నభవిష్యతు". సర్వుల ఆరాధ్యుడతడు. అట్టి శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యులు అదృశ్యులైనను, అతడు సర్వులకు మంగళకరుడైన సాక్షాత్ శివుని అవతారమవడం చేత పరమ శుభాన్ని మానవజాతికి ప్రసాదించడానికి జన్మించడంతో అతనికా పేరు సార్థక మయ్యింది.

శ్లో॥ అజ్ఞానాంతర్గహన పతితానాత్మ విద్యోపదేశైః ।
త్రాతుంలోకాన్ భవదవ శిఖాతాప పాపచ్యమానాన్ ।
ముక్త్వామౌనం వటవిటపినో మూలతో నిష్పతంతీ
శంభోర్మూర్తిశ్చరతి భువనే శంకరాచార్య రూపా ॥

భా॥ శంకరాచార్య రూపాన లోకంలో తిరిగేది శ్రీ శంభుమూర్తియే. వట వృక్షమూల్యాన్ని వదలి మౌనాన్ని త్యజించి అజ్ఞానారణ్యంలో చిక్కిన వారూ, భవతప్తులూ అయిన మానవాళిని రక్షించడానికి ఆత్మవిద్యోపదేశం చేస్తూ సంచరించే శంకరాచార్యులు సాక్షాత్ దక్షిణామూర్తియే అని భావం.

ఈ విధంగా శంభుడు శంకరుడయ్యాడు. శృతిలోని "శంభుడు, శంకరుడు" అనే పదద్వయం ఒకే పరమాత్మను సూచిస్తుంది.

శంకరుల ఆవిర్భావం, బాల్య జీవితం, వారణాసి గమనం, దిగ్విజయ యాత్రాదికాలను, జీవితలక్ష్య సిద్ధిని గురించి "శంకర విజయం" సమగ్రంగ వివరిస్తుంది.

ఆయా మతసంప్రదాయములను స్థాపించుకొనిన వారలను కూడా ఢీకొని కేవలం వాక్చాతుర్యంతో లోతగు పాండిత్య ప్రకర్షతో ఆత్మానుభూతి కలితమగు సౌజన్యంతో వాటిని రూపుమాపుటకు ప్రయత్నించుటనునది వారికి వారే సాటి. అద్వైత సిద్ధాంతంలోని సమైక్యభావాన్ని ఆధారంగా చేసుకొని "శైవం, వైష్ణవం, శాక్తం, సౌరం, గాణపత్యం, కౌమారం" అనే ఆరు మతాలలోని దోషాలను తొలగించి షణ్మత స్థాపకాచార్యులై వివిధ మతాల మధ్య సామరస్య భావములను పెంపొందించడానికి "పంచాయతన" పూజా విధానాన్ని వ్యాపింప జేశారు. "ఆదిత్య, అంబికా, విష్ణు, గణనాథ, మహేశ్వరులు" అను అయిదు ప్రతినిధి దేవతలను ఏక పీఠమున ప్రతిష్ఠించి, అందులో ఉపాసకుని ఇష్ట దేవత ప్రముఖ స్థానం అలంకరింపగా పూజించేటట్లు పూజావిధానంలోని దోషాలను సవరించారు. జీవహింసతో కూడిన యజ్ఞ యాగాదులకు స్వస్తి పలికించి, ఆయాదేవతల ఉగ్ర రూపాలను ప్రశాంత మూర్తులుగా మార్చివేశారు.

దేశపర్యటనలో అనేకానేక క్షేత్రాలు దర్శిస్తూ తీర్థ స్నానాదులు గావిస్తూ, ధనుష్కోటిలో ప్రథమ చాతుర్మాస్య దీక్ష ప్రారంభించిరి. ఈ దీక్ష ప్రారంభమునకు కారకులు వీరే.

కైలాసం నుండి అయిదు స్ఫటిక లింగాలను తెచ్చి, చిదంబరంలో మోక్షలింగం, కేదారంలో ముక్తిలింగం, నేపాల్‌లోని నీల కంఠాలయంలోని వరలింగం, కాంచీపురంలోని కంచిపీఠంలో యోగలింగం, శృంగేరి శారదాపీఠంలో భోగలింగాలను ప్రతిష్ఠించి తదుపరి పుష్పగిరిలో స్ఫటికలింగమును ప్రతిష్టించి సర్వులకు చిరస్మరణీయులైరి. మరియు పుష్పగిరిలో 'శ్రీ చంద్రమౌళీశ్వర'మను శుద్ధ స్ఫటిక లింగమును స్థాపించిరి.

ఇట్లు అద్వైతాన్ని ఆధారంగా చేసుకొని భారతదేశాన సాంస్కృతిక సమైక్యతను నిలబెట్టి ఆధ్యాత్మిక తత్త్వాన్ని పెంపొందించడానికి శ్రీ శంకర భగవత్పాదులు సన్యాసాశ్రమాన్ని వ్యవస్థీకరించి శతాబ్దాల తరబడి సిద్ధంగా స్థిరపడి యుండే మఠాలను తన స్మృతి చిహ్నాలుగా స్థాపించిరి. ఈ అద్వైత సంప్రదాయాన్ని బట్టి సన్యాసులు పదివర్గాలు. ఒక్కొక్క వర్గానికి చెందిన వారి పేరు చివరన చేర్చబడు విశిష్ట నామాంతారాన్ని బట్టి వారు, ఆవర్గంవారని తెలుస్తుంది.

ఈ వర్గాలన్నిటినీ కలిపి "దశనామీ" అని పేరు. అవి - 1.సరస్వతి, 2.పూరి, 3.భారతి, 4.వన, 5.అరణ్య, 6.తీర్థ, 7.ఆశ్రమ, 8.గిరి, 9.పర్వత, 10.సాగర.

శ్రీ శంకరులు ఏర్పరచిన మఠాలలో బదరీక్షేత్రం (బద్రీనాథ్), ద్వారకాపురి, జగన్నాథపురి, శృంగేరి ప్రధానమైనవి.

ఇలా ప్రతిమఠంలోనూ అద్వైతాన్ని బోధించే ఆచార్యుల పరంపరను అవిచ్ఛిన్నంగా

కొనసాగేటట్లు వ్యవస్థను శ్రీ శంకరులు స్థాపించి, పుణ్య జీవులకు ముక్తిని ప్రసాదించే సద్గురుడుగా వినుతికెక్కెనని "శ్రీ ఆనందగిరి" బహుగా కీర్తించిరి.

ఏ విద్యకైనా గురువు అవసరం. "గురువు అను గ్రహం, శిష్యుని అభ్యాసం" రెండూ ముఖ్యాంశాలే. శిష్యునకు దైవస్వరూపుడే గురువని, భక్తితత్త్వం కలిగి యుండాలి. లేకుంటే, మనస్సున కొక అనాదరం ఏర్పడుతుంది. కానీ శ్రీశంకరాచార్యుల దగ్గర చేరిన ఏ శిష్యులకు అప్రయత్నంగా గురువనిన భగవత్ స్వరూపుడనే భావం స్వభావ సిద్ధంగా నేర్పడడం, వారి స్వరూప సాంగత్యము. అందులకే వారన్న సర్వులకు భక్తి, ఆచార్యులనే పరతత్త్వ భావన కల్గును. అటుల సర్వత్రా విజ్ఞాన సంప్రదాయము సమసిపోకుండా ఆయా ప్రసిద్ధ క్షేత్రములలో సంప్రదాయక పీఠములను విలసిల్లజేసి గురుపరంపరతతో అద్వైతమునకు ఆధారభూతుడుగా (ఉపనిషత్ మతమైన) నిలిచెను. ఆ శంకర దర్శనానికే 'అద్వైతదర్శనం' అని వ్యవహారం. తన వాదనలో పలువురుని అద్వైతములో నిలిపి తప్తతనుత్వంకన్నా తపస్తప్త తనుత్వం గొప్పదని వారిని అంగీకరింప జేసిరి. అట్లు తనవేదాంత విజ్ఞాన యాత్రలో తులజాభవాని పురికి చేరి అచట భవాని శక్తి మతస్థులకును, జ్ఞానమార్గాన్ని బోధించిరి. ఇట్లు 72 మతస్థులను అద్వైతం వైపు మళ్లించిరి అదే శ్రీ శంకరాద్వైత దర్శనం. దాంతో 'గురువు' అను పదమునకు 'న గురోరధికం న గురోరధికం' అన్నది పెద్దల ఉవాచగా వారి యెడల నిలిచెను. గురుపరంపరా ప్రాప్త విజ్ఞానం ఆ మాటతో సాక్షీభూతమైయ్యను. అట్టి వీరు జీవించినది 32 సంవత్సరములే. అయినా వారి జ్ఞాన భాండారము ప్రతి వ్యక్తిలోనూ పటిష్ఠముగా నిలిచేదిగా, తలచుకొనేదిగా, చర్చించుకొనేదిగా, వ్యాఖ్యానించుకొనేదిగా శ్రేయోదాయకంగా నిలిచెను.

"ప్రాక్తనుడైన వామదేవ మహర్షిలాగా, ఆధునికులమైన మనం ఎంత బలహీనులమైనా బ్రహ్మజ్ఞానాన్ని పొందటానికి సర్వులకును అధికారం కలదు." అని, మానవుని జన్మహక్కుగా బ్రహ్మజ్ఞానాన్ని పొందటానికి అందరికినీ అధికారం కలదని స్పష్టీకరించి, పరమార్థ సిద్ధినీ పొందటానికి మానవజాతిని ప్రోత్సహించి, తదనుభూతికి సుమార్గాన్ని కూడా సూచించి, లోకానికి మహోపకార మొనర్చిన లోకశంకరుడే, ఆది శంకరావతార మూర్తిగా, సార్థక నామధేయులై అందరి మనస్సులలో చిన్మయముద్రను దర్శింప జేసిన శ్రీ గురుదక్షిణామూర్తిగా ప్రతిష్ఠితులైరి.

శ్లో॥ దివి భూమౌ తదాకాశే బహిరన్తశ్చమే విభుః ।
యోవిభాత్యక్తాభసాత్మా తస్మై సర్వాత్మనే నమః ॥

శ్లో॥ సకలజ్ఞ పదం సమవాప్య గురుర్నిగమోక్త సుమార్గ వికాస కృతే ।
ఉపకల్ప్యతు పీఠతతిం ప్రథితాన్ స్వకశిష్య వరాన్ వ్యదధా దధిపాన్ ॥

భా॰ శంకరాచార్యుడు సర్వజ్ఞపదమును పొందిన పిమ్మట వేదోక్తమగు సన్మార్గమును వికసింప జేయుటకై, పీఠములను స్థాపించి వాటియందు ప్రసిద్ధులగు తన శిష్యులను నధిపతులుగ జేసెను

## శ్రీశ్రీశ్రీ జగద్గురవేనమః

## శ్రీ నృసింహ స్తోత్రమొనర్చుటకు కారణము

శ్రీ శంకర భగవత్పాదులు శిష్యులతోకూడ దేశ సంచారమొనర్చుచు శ్రీశైలమునకు వచ్చిరి అచట నొక ఏకాంత స్థలమున ఆయన తపస్సు చేసుకొనుచుండిరి అంతట నొక కాపాలికుడు అతనిని కనిపెట్టి వధించ నిశ్చయించుకొనెను అట్లతడు ఒకరాజునుగానీ, గొప్ప యోగినిని గానీ, తనకారాధ్యదైవమగు "కపాలి" పరమేశ్వరునకు బలి యిచ్చినచో, అతడు గ్రహించి కోరిన వరములిచ్చునని, ఆ కాపాలికుని విశ్వాసము

అందులకతడు శ్రీ శంకరులను జేరి, తన సంకల్పమును తెలిపి, "మరణమునకు సిద్ధము కమ్మ"ని పలికెను అప్పుడాచార్య స్వామి యతనితో నిట్లనెను

"నేను మరణించుటకు సిద్ధముగనే యున్నాను కాని, నాశిష్యుల వలన నీకెట్టి అపాయము రాకుండా చూచుకొనుము " అని వారనిరి

మీ శిష్యుల సంగతి నేను జూచుకొందును లెండు మీరు మాత్రము నా సంకల్పమునకు ప్రతి ఘటింపక మరణించుటకు సిద్ధముగా నుండుమని, చెప్పి ఖడ్గ మెత్తెను అట్టి యెడ, శ్రీ శంకరుల అంగరక్షకుడైన "పద్మ పాదుడ"ను శిష్యునకు, తమ గురువర్యులు గొప్ప ఆపదలోనున్నట్లు స్ఫురించిన వెంటనే, అతడు శ్రీ నృసింహ రూపమున వచ్చి ఆ కాపాలికుని పట్టి చీల్చి చంపి శ్రీశంకరులను కాపాడెను

తనకిట్లు రక్షణగా ప్రత్యక్షముగా దర్శనమిచ్చిన శ్రీ నృసింహమూర్తిని, పరవశులైన శ్రీ శంకరులు వెంటనే శ్రీ నృసింహస్వామిని స్తుతించుచు ఎలుగెత్తి పఠించిరి

అదియే మచ్చునకు నీమకుటము ఉదాహరణము -

"శ్రీ లక్ష్మీ నృసింహ మమదేహి కరావలమ్బమ్"

అను 25 శ్లోకముల స్తుతులు గావించిరి చివరన 25వ శ్లోకమిట్లున్నది

శ్లో॥ శ్రీమన్నృసింహ విభవే గరుడధ్వజాయ తాపత్రయోపశమనాయ భవౌషధాయ।
తృష్ణాది వృశ్చిక జలాగ్ని భుజఙ్గరోగ క్లేశవ్యయాయ హరయే గురవే నమస్తే ॥

అని స్తుతించి, మరల -

"యాదాద్రి నాథ నృహరే తవ సుప్రభాతమ్"

అనే మకుటముతో సుప్రభాత స్తోత్రమును రచించిరి. ఈ సుప్రభాతం పఠించినచో పొందు ఫలము -

"సుఖ భాగినః" సుఖ భాగినులగుదురు. అటులే, శ్రీ నృసింహస్తోత్రమును పఠించినను, పఠింపించినను వారిరివురి యాపదలు నిశ్శేషముగా తీరునని భక్తుల విశ్వాసము. ఇది నిస్సందేహము.

## శ్రీ శృంగేరి జగద్గురు పరంపర

| క్ర.నం. | నామధేయములు | పీఠాధిపత్యకాలము క్రీ.శ. |
|---|---|---|
| 1. | శ్రీ శంకరభగవత్పాదులు | 820 విదేహకైవల్యం |
| 2. | శ్రీ సురేశ్వరాచార్యులు | 820 - 834 |
| 3. | శ్రీ నిత్యబోధ ఘనులు (సర్వజ్ఞాత్మముని) | 834 - 848 |
| 4. | శ్రీ జ్ఞాన ఘనులు | 848 - 910 |
| 5. | శ్రీ జ్ఞానోత్తములు | 910 - 954 |
| 6. | శ్రీ జ్ఞానగిరి | 954 - 1038 |
| 7. | శ్రీ సింహగిరి | 1038 - 1098 |
| 8. | శ్రీ మదీశ్వర తీర్థులు | 1098 - 1146 |
| 9. | శ్రీ నరసింహ తీర్థులు | 1146 - 1229 |
| 10. | శ్రీ విద్యాశంకర తీర్థులు | 1229 - 1333 |
| 11. | శ్రీ భారతీకృష్ణ తీర్థులు | 1333 - 1380 |
| 12. | శ్రీ విద్యారణ్యులు | 1380 - 1386 |
| 13. | శ్రీ చంద్రశేఖర భారతీ - 1 | 1386 - 1389 |
| 14. | శ్రీ నరసింహ భారతీ - 1 | 1389 - 1408 |
| 15. | శ్రీ పురుషోత్తమ భారతీ - 1 | 1408 - 1448 |
| 16. | శ్రీ శంకర భారతీ | 1448 - 1455 |
| 17. | శ్రీ చంద్రశేఖర భారతీ - 2 | 1455 - 1464 |
| 18. | శ్రీ నరసింహ భారతీ - 2 | 1464 - 1479 |
| 19. | శ్రీ పురుషోత్తమ భారతీ - 2 | 1479 - 1517 |
| 20. | శ్రీ రామచంద్ర భారతీ | 1517 - 1560 |
| 21. | శ్రీ నరసింహ భారతీ - 3 | 1560 - 1573 |

| | | |
|---|---|---|
| 22. | శ్రీ నరసింహ భారతీ - 4 | 1573 - 1576 |
| 23. | శ్రీ నరసింహ భారతీ - 5 | 1576 - 1600 |
| 24. | శ్రీ మదభినవ నరసింహ భారతీ | 1600 - 1623 |
| 25. | శ్రీ సచ్చిదానంద భారతీ - 1 | 1623 - 1663 |
| 26. | శ్రీ నరసింహ భారతీ - 6 | 1663 - 1706 |
| 27. | శ్రీ సచ్చిదానంద భారతీ - 2 | 1706 - 1741 |
| 28. | శ్రీ మదభినవ సచ్చిదానంద భారతీ - 1 | 1741 - 1767 |
| 29. | శ్రీ నరసింహ భారతీ - 7 | 1767 - 1770 |
| 30. | శ్రీ సచ్చిదానంద భారతీ - 3 | 1770 - 1814 |
| 31. | శ్రీ మదభినవ సచ్చిదానంద భారతీ - 2 | 1814 - 1817 |
| 32 | శ్రీ నరసింహ భారతీ - 8 | 1817 - 1879 |
| 33. | శ్రీ సచ్చిదానంద శివాభినవ నరసింహ భారతీ | 1879 - 1912 |
| 34. | శ్రీ చంద్రశేఖర భారతీ - 3 | 1912 - 1954 |
| 35. | శ్రీ మదభినవ విద్యాతీర్థులు | 1954 - 1989 |
| 36. | శ్రీ భారతీ తీర్థులు | 1989 |

## కంచిమఠం - పీఠాధిపతులు

జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యులు కంచి శంకరమఠమును క్రీ పూ 482వ సంవత్సరంలో స్థాపించారు. ఆయనే ప్రథమ పీఠాధిపతి. ఆనాటి నుండి నేటి జయేంద్ర సరస్వతి, శంకర విజయేంద్ర సరస్వతి స్వాముల వరకు కంచి శంకరమఠం పీఠాధిపతుల వివరాలు.

| | | | |
|---|---|---|---|
| 1. | శ్రీ శంకరభగవత్పాదులు | | భారతదేశమంతా ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లిన స్వామిజీ శ్రీఆదిశంకరాచార్య, కంచి శంకర మఠం వ్యవస్థాపకులు, తొలి పీఠాధిపతి వారే |
| 2. | శ్రీ సురేశ్వరాచార్య | : | క్రీ.పూ. 407లో ముక్తి పొందారు. |
| 3. | శ్రీ సర్వాజ్ఞాత్మాన్ | : | క్రీ.పూ. 364లో ముక్తి పొందారు |
| 4. | శ్రీ సత్యబోధేంద్ర సరస్వతి | : | క్రీ.పూ. 268లో ముక్తి పొందారు. |
| 5. | శ్రీ జ్ఞానానందేంద్ర సరస్వతి | : | క్రీ.పూ. 205లో ముక్తి పొందారు. |
| 6. | శ్రీ సుధానందేంద్ర సరస్వతి | · | క్రీ.పూ. 124లో ముక్తి పొందారు. |

7. శ్రీ ఆనంద జ్ఞానేంద్ర సరస్వతి : క్రీ.పూ. 55లో ముక్తి పొందారు.
8. శ్రీ కైవల్యానంద యోగేంద్ర సరస్వతి : క్రీ.పూ. 28లో ముక్తి పొందారు.
9. శ్రీ కృప శంకరేంద్ర సరస్వతి : క్రీ.శ. 69లో ముక్తి పొందారు.
10. శ్రీ సురేశ్వర : క్రీ.శ. 127లో ముక్తి పొందారు.
11. శ్రీ సివానంద చిద్జ్ఞానేంద్ర సరస్వతి : క్రీ.శ. 172లో ముక్తి పొందారు.
12. శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి : క్రీ.శ. 235లో ముక్తి పొందారు.
13. శ్రీ సచ్చిద్ జ్ఞానేంద్ర సరస్వతి : క్రీ.శ. 272లో ముక్తి పొందారు.
14. శ్రీ విద్యాజ్ఞానేంద్ర సరస్వతి : క్రీ.శ. 317లో ముక్తి పొందారు.
15. శ్రీ గంగాధరేంద్ర సరస్వతి : క్రీ.శ. 329లో ముక్తి పొందారు.
16. శ్రీ ఉజ్వల శంకరేంద్ర సరస్వతి : క్రీ.శ. 367లో ముక్తి పొందారు.
17. శ్రీ సదాశివేంద్ర సరస్వతి : క్రీ.శ. 375లో ముక్తి పొందారు.
18. శ్రీ యోగఫిల్కు సురేంద్ర సరస్వతి : క్రీ.శ. 385లో ముక్తి పొందారు.
19. శ్రీ మార్తాండ విద్యాజ్ఞానేంద్ర సరస్వతి : క్రీ.శ. 398లో ముక్తి పొందారు.
20. శ్రీ ముఖ శంకరేంద్ర సరస్వతి : క్రీ.శ. 437లో ముక్తి పొందారు.
21. శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి -2 : క్రీ.శ. 447లో ముక్తి పొందారు.
22. శ్రీ బోధేంద్ర సరస్వతి : క్రీ.శ. 512లో ముక్తి పొందారు.
23. శ్రీ సచ్చి సుఖేంద్ర సరస్వతి : క్రీ.శ. 512లో ముక్తి పొందారు.
24. శ్రీ చిత్సుఖేంద్ర సరస్వతి : క్రీ.శ. 527లో ముక్తి పొందారు.
25. శ్రీ సచ్చిదానంద జ్ఞానేంద్ర సరస్వతి : క్రీ.శ. 548లో ముక్తి పొందారు.
26. శ్రీ ప్రజ్ఞా జ్ఞానేంద్ర సరస్వతి : క్రీ.శ. 465లో ముక్తి పొందారు.
27. శ్రీ చిద్విలాసేంద్ర సరస్వతి : క్రీ.శ. 577లో ముక్తి పొందారు.
28. శ్రీ మహాదేవేంద్ర సరస్వతి : క్రీ.శ. 601లో ముక్తి పొందారు.
29. శ్రీ పూర్ణభోదేంద్ర సరస్వతి : క్రీ.శ. 618లో ముక్తి పొందారు.
30. శ్రీ భోదేంద్ర సరస్వతి - 2 : క్రీ.శ. 655లో ముక్తి పొందారు.
31. శ్రీ బ్రహ్మానంద జ్ఞానేంద్ర సరస్వతి : క్రీ.శ. 668లో ముక్తి పొందారు.
32. శ్రీ చిదానంద జ్ఞానేంద్ర సరస్వతి : క్రీ.శ. 672లో ముక్తి పొందారు.
33. శ్రీ సచ్చిదానంద సరస్వతి : క్రీ.శ. 692లో ముక్తి పొందారు.
34. శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి-3 : క్రీ.శ. 710లో ముక్తి పొందారు.
35. ~~శ్రీ చిత్సుఖేంద్ర సరస్వతి~~ : క్రీ.శ. 737లో ముక్తి పొందారు.
36. శ్రీ చిత్సుఖేంద్ర సరస్వతి :
37. శ్రీ విద్యాజ్ఞానేంద్ర సరస్వతి -3 : క్రీ.శ. 795లో ముక్తి పొందారు.

38. శ్రీ అభినవ శంకరేంద్ర సరస్వతి : క్రీ.శ.840లో ముక్తి పొందారు.
39. శ్రీ సచ్చిద్విలాసేంద్ర సరస్వతి : క్రీ.శ.873లో ముక్తి పొందారు.
40. శ్రీ మహాదేవేంద్ర సరస్వతి - 2 : క్రీ.శ.915లో ముక్తి పొందారు.
41. శ్రీ గంగాధరేంద్ర సరస్వతి - 2 : క్రీ.శ.950లో ముక్తి పొందారు.
42. శ్రీ బ్రహ్మానంద జ్ఞానేంద్ర సరస్వతి : క్రీ శ.978లో ముక్తి పొందారు.
43. శ్రీ ఆనంద జ్ఞానేంద్ర సరస్వతి : క్రీ.శ.1014లో ముక్తి పొందారు.
44. శ్రీ పూర్ణ భోదేంద్ర సరస్వతి - 2 : క్రీ.శ.1040లో ముక్తి పొందారు.
45. శ్రీ పరమశివేంద్ర సరస్వతి - 1 : క్రీ.శ.1061లో ముక్తి పొందారు.
46. శ్రీ సాంద్రానంద భోదేంద్ర సరస్వతి : క్రీ.శ.1098లో ముక్తి పొందారు.
47. శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి - 4 : క్రీ.శ.1166లో ముక్తి పొందారు.
48. శ్రీ అద్వైతానంద భోదేంద్ర సరస్వతి : క్రీ.శ.1200లో ముక్తి పొందారు.
49. శ్రీ మహదేవేంద్ర సరస్వతి - 3 : క్రీ.శ.1247లో ముక్తి పొందారు.
50. శ్రీ చంద్రచూడేంద్ర సరస్వతి - 1 : క్రీ.శ.1297లో ముక్తి పొందారు.
51. శ్రీ విద్యాతీర్థేంద్ర సరస్వతి : క్రీ.శ.1385లో ముక్తి పొందారు
52. శ్రీ శంకరానందేంద్ర సరస్వతి : క్రీ.శ 1417లో ముక్తి పొందారు
53. శ్రీ పూర్ణానంద సదాశివేంద్ర సరస్వతి :
54. శ్రీ వ్యాసాచల మహదేవేంద్ర సరస్వతి : క్రీ.శ.1507లో ముక్తి పొందారు.
55. శ్రీ చంద్రచూడేంద్ర సరస్వతి - 2 : క్రీ.శ.1524లో ముక్తి పొందారు.
56. శ్రీ సర్వజ్ఞ సదాశివ భోదేంద్ర సరస్వతి : క్రీ.శ.1539లో ముక్తి పొందారు.
57. శ్రీ పరమశివేంద్ర సరస్వతి - 2 : క్రీ.శ.1586లో ముక్తి పొందారు.
58. శ్రీ ఆత్మ భోదేంద్ర సరస్వతి : క్రీ.శ.1638లో ముక్తి పొందారు.
59. శ్రీ భగవన్నామ భోదేంద్ర సరస్వతి : క్రీ.శ.1692లో ముక్తి పొందారు
60. శ్రీ అద్వైతాత్మ ప్రకాశేంద్ర సరస్వతి : క్రీ.శ.1704లో ముక్తి పొందారు.
61. శ్రీ మహదేవేంద్ర సరస్వతి - 4 : క్రీ.శ.1746లో ముక్తి పొందారు.
62. శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి - 5 : క్రీ.శ.1783లో ముక్తి పొందారు.
63. శ్రీ మహదేవేంద్ర సరస్వతి - 5 : క్రీ.శ.1813లో ముక్తి పొందారు.
64. శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి - 6 : క్రీ.శ.1851లో ముక్తి పొందారు.
65. శ్రీ సుదర్శన మహదేవేంద్ర సరస్వతి : క్రీ.శ.1891లో ముక్తి పొందారు.
66. శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి - 7 : క్రీ.శ.1907లో ముక్తి పొందారు.
~~67. శ్రీ మహదేవేంద్ర సరస్వతి~~ - 5 క్రీ.శ.1907లో ముక్తి పొందారు.
68. శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామిజీ : తన నూరేళ్ళ వయస్సులో

క్రీ.శ.1994లో పరమపదించారు.

69. శ్రీ జయేంద్ర సరస్వతి : 1935, జులై 18న తంజావూరు జిల్లా ఇరుల్‌నీకి గ్రామంలో జన్మించారు. శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామిజీ వారసునిగా 1954లో నియమింపబడ్డారు. మఠం ఆధ్వర్యంలో విద్య, ఆరోగ్య సంస్థలు నెలకొల్పారు. అయోధ్య వివాదాస్పద విషయంలో అప్పటి ఎన్.డి.ఏ. ప్రభుత్వం తరపున మధ్యవర్తిత్వం వహించారు.

70. శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి : శ్రీజయేంద్ర సరస్వతికి వారసులుగా ఉన్న వీరు 1969లో జన్మించారు.

శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య గారు తన పర్యటనలో 'పుష్పగిరి'ని దర్శించి ఆ స్థల మహిమ విని అచట శ్రీచక్ర స్థాపన శ్రీరాజరాజేశ్వరీ దేవిని ప్రతిష్ఠించెను. కైలాసం నుండి తాను తెచ్చిన స్ఫటిక లింగము (చంద్రమౌళీశ్వరులుగా)ను సమర్పించెను. దాంతో ఈ పుష్పగిరి ఐదవ పీఠముగా ప్రసిద్ధికెక్కెను అచటి పీఠాధిపతుల నామధేయములు శ్రీశ్రీశ్రీ మద్ అభినవోద్ధండ నృసింహ భారతీ స్వామి వారుగా, శ్రీశ్రీశ్రీ మద్ అభినవోద్ధండ శంకర భారతీ స్వామి వారను పేర్లుగానే పీఠాధిపతులు కొనసాగుతున్నారు.

శ్రీశ్రీశ్రీ జగద్గురువే నమః

★★★

## గురు - సూత్రం

శ్లో॥ గురుచరణాంబుజ నిర్భరభక్తః సంసారాదచిరా ద్భవ ముక్తః।
సేన్ద్రియ మానస నియమా దేవం ద్రక్ష్యసి నిజహృదయస్థం దేవమ్ ॥

భా: నాయనా! చిత్తము నాత్మాన్వేషణ పధంలో నిలిపి, పట్టు విడువక పరబ్రహ్మ స్వరూపుడైన గురు పాదపద్మములను అపారమైన ప్రేమతో అర్చించి సేవిస్తున్న నీవు అనతికాలంలోనే నీ మనస్సును, ఇంద్రియములనూ నియంత్రించుకొని, జనన మరణ వలయ పరిభ్రమణ విముక్తుడవై, జీవన్ముక్తుడవై, నీలోఉన్న పరమాత్మావలోకనంలో నిత్యుడవై అలరెదవు గాత! ఇది సత్యము. ఈ సత్యము తధ్యము. - (శంకరోవాచ)

# 27. శ్రీ శంకరుల శిష్యుల చరిత్రలు

శ్రీ శంకర భగవత్పాదుల వారికి నలుగురు ప్రియశిష్యులేర్పడిరి. వారు సనందుడనే "పద్మపాదుడు"; ప్రభాకరుని తనయుడగు "హస్తామలకుడు"; మండన మిశ్రుడను "సురేశ్వరాచార్యులు"; గిరియను "తోటకాచార్యుడు"; ఈ నలుగురును నాలుగు వేదాలలాంటివారు. వీరి ద్వారా నాలుగు మహావాక్యాల్ని లోకానికి ప్రబోధిస్తూ బ్రహ్మవిద్యను వ్యాపింపజేశారు, శ్రీ శంకరులవారు. వీరేగాక వారి ప్రచారక వ్యవస్థను నిర్మించినవారు పదుగురున్నారు. వారే 1. సంబోధనాచార్యులు, 2. నిత్యానందుడు, 3. ఆనందగిరి, 4. యోగానందులు, 5. గౌడపాదులు, 6. సుమతి, 7. భారతీయ వంశ, 8. ధృడభక్తి, 9. సురేంద్ర, 10. మేధాతిథి. అనువారలు శిష్యులు. వీరు వారి శిష్యులనుటకన్న వారి ఆత్మస్వరూపులనుట అతిశయోక్తి కాదు.

పద్మపాదుని "గురుభక్తి"; హస్తామలకుడు తాను సాక్షాత్ "పరబ్రహ్మ స్వరూపుడ"ని, మండనమిశ్రుడు "వేదాలు కర్మయోగ ప్రతిపాదకాలు" అని, తోటకాచార్యుడు "గురుసేవయే గుర్వనుగ్రహమ"ని వారి నలువురి తత్త్వములు.

శ్రీ శంకరుల వారికి వీరేగాక .ఇంకా పలువురు శిష్యులుండేవారు. సర్వులు మిక్కిలి పవిత్ర హృదయం కలవారే. వారందరును సకల శాస్త్రములు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు తెలుసుకోటానికి వచ్చిన వారే. తర్క వ్యాకరణాదులును నేర్చిరి. కానీ, వీరిలో పై నలుగురు ప్రియతమ శిష్యులైరి.

శ్రీ స్వామి శిష్యులలో చాలా ప్రియతమ శిష్యుడు సనందుడు. తాను వ్రాసిన భాష్యాలన్నీ అతనిచే మూడుసార్లు చదివించారు. ఒకసారి శ్రీ స్వామివారి గంగానది గట్టున కూర్చుని శిష్యులకు తర్కం బోధిస్తున్నాడు. వారిలో సనందుడు మాత్రము గురుభక్తి పరాయణుడగుటచే తెల్లవారుఝామునే లేచి గురువు వస్త్రాలను ఉతుకుటకై గంగ ఆవలి ఒడ్డుననుండెను. అది అతని నిత్యకృత్యము. శ్రీస్వామివారు గంగానది ఆవలి యొడ్డున నున్న సనందుణ్ణి వెంటనే కేక వేశాడు. గురునామాన్నే జపిస్తూండే సనందునకు గురువాజ్ఞ పిలుపు(కేక) వినబడినది. అంతే, ఆ పిలుపు వింటూనే సనందుడు గురుపాదారవిందాల్ని ధ్యానిస్తూ ఆ పిలుపు తనకొక భాగ్యమని తలంచుచు గంగలో కాలు పెట్టాడు. అట్టి తరి పరీక్షగా గంగానది ఉప్పొంగి పరవళ్లు త్రొక్కుతుంది. అట్టిదేమియునెంచక, గురువాజ్ఞయే తనకు గొప్ప శ్రేయస్కరమని తలంచిన సనందుడు గురువుగారి వస్త్రాలనునందజేయ లక్ష్యముతో ఆ ప్రవాహపు నీటిలో వస్త్రములను శిరస్సునందుంచుకొని, గురునామాన్నే చింతిస్తూ శ్రీ శంకరుల దర్శనార్థమై నడవసాగాడు. ఆ పవిత్రమైన భావ ప్రభావముతో

సనందుడు అడుగుపెట్టిన చోటెల్లనొక రాతి పద్మములు వికసించి యుండుటతో, అతని పాదాలు కూడ నీటిలో మునగకుండా ఆ పాదాల స్థలములో పద్మములు వెలయుట, అలవోకగా నివతలి గట్టునకు చేరుటనునదియు, సనందునకును తెలియకుండుట, గురుభక్తికిది తార్కాణము. ఇట్టిది తోటి శిష్యులందరికిని ఆశ్చర్యం కలిగినది. ఎందుకనగా పూర్వమునుండియు సనందుడను వాడు విద్యలో తమకంటే చాలా వెనుకబడి యున్నాడని, ఇంకానేమి నేర్వగలడని చిన్నచూపు చూచెడివారు. అనగా తామెల్లరు విద్యాప్రావీణ్యులయితిమని అహంకరించేవారు. ఈ గురుసేవలోనే నిమగ్నుడై యుండుటయును అతనిపై ఈర్ష్యయు కలిగియుండిరి. అది గ్రహించిన శ్రీ శంకరులు సనందుని పిలిచి, తాను నేర్పిన విద్యలు అప్పజెప్పమని ఆజ్ఞనివ్వగా వెంటనే తడబడకుండా తానునేర్చిన విద్యలన్నీనొక పర్యాయం కంఠస్థముగా నప్పజెప్పెను. అది చూచిన శ్రీ స్వామివారే ఆశ్చర్యపడిరి. మిగతా శిష్యుల గూర్చి చెప్పనక్కరేలేదు. అతనినుద్దేశించి నాయనా! ఇవన్నీ నీవెట్లు తెలుసుకొన్నావు? అని శ్రీస్వామివారు ప్రశ్నించగా! అతడిట్లు సమాధానమిచ్చెను.

"స్వామీ! నేను శంకరుల వారికి సర్వమునూ అర్పితం గావించుకొంటిని" అన్నాడు.

శంకరుడనగానెవరు? అని ప్రశ్నించడంతో శంకలేని వాడే శంకరుడు. అలాంటి శంకరుని నేను ఆశ్రయించియున్నాను" అన్నాడతడు.

అంతే శ్రీ శంకరుల వారు సనందుని గురుభక్తికి సంతసించి, అతనిని మిక్కిలిగా నాశీర్వదించి, అతనికి "పద్మపాదుడనే" బిరుదునిచ్చెను. మిగిలిన శిష్యులకు గుణపాఠముగా, "శంక" పెట్టుకోకూడదని హితవు చెప్పెను. అట్లు సనందునకు పద్మపాదుడనే సార్థకనామధేయమయ్యెను.

## హస్తామలకుడు

శ్రీ శంకరుల వారు దర్శించిన అగ్రహారంలో బలి యొకటి. ఆ అగ్రహారంలో ప్రభాకరుడను పండితుడును, గొప్ప నిష్ఠాగరిష్ఠుడు. పైగా కుమారిల భట్టు శిష్యుడునూ. కాని యింత గొప్ప పండితుని కుమారుడు మాత్రము వట్టి జడుడు. తిండి అయితే తింటాడు, తిననట్టె యుంటాడు. సర్వం వింటాడు. ఏదీ విననట్టుంటాడు. 'అయినా ప్రభాకరుడు కుమారుడిపై నెన్నడు కోపగించక, అదంతా వాడి దుష్కర్మయే అని వదిలేశాడు.

కాని ఇలాంటి లక్షణాలన్నీ దుష్కర్మలు కావని, బాగా తత్త్వం తెలుసుకొన్న శ్రీ శంకరుల వారికే సాధ్యమైనది. నిజానికాబాలుడు పుట్టింది. గొప్ప పండితుని గర్భవాసమున. కనుక నతడు శుద్ధ పరిశుద్ధుడని యెరింగిన శ్రీ శంకరుల వారు ఆ బాలుణ్ణి యిట్లు ప్రశ్నించాడు.

కస్త్వం శిశో? కస్యకుతోసి గంతా? కం నామతే? త్వం కుత ఆగతోసి?

దానికాబాలుడు అలవోకగా-"నాహం మనుష్యః, నచదేవ యక్షాః న బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రాః, న బ్రహ్మచారీ, నగృహే, వనస్థః బిక్షుర్నచాహం నిజబోధ రూపః" అని అద్భుతంగా సమాధానం జెప్పాడు.

అనగా-"సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపమే తాన"ని, తెలియజెప్పాడు. అంతే కాకుండా అనర్గళంగా **అశుధారతో** పరతత్త్వ ప్రబోధకాలైన ద్వాదశ శ్లోకాలు అప్పుజెప్పాడు. అట్టివే, "హస్తామలక **శ్లోకాలు**"-**పరమాత్మ తత్త్వం** అరచేతిలో నుంచిన ఉసిరికాయ లాగా, ఆ తక్షణమే చెప్పాడు కనుక. అతని నాటినుండి "హస్తామలకుడ"ని పిలువనారంభించారు. శ్రీ శంకరుల వారికి నింకా శ్లోకాలు చెప్పేవాడేమో, కాని, అతని శిరస్సుపై తన హస్తమునుంచి 'హస్తమస్తక' దీక్షనిచ్చాడు. అప్పటికి గానీ, అతనిలో నావిర్భవించియున్న కవితా ప్రవాహం ఆగిపోలేదు. ఆ హస్తామలకుని తన వెంటనే గైకొని శృంగేరి అను పుణ్యక్షేత్రం చేరారు. అతను శిష్యుడైపోయాడు.

## సురేశ్వరాచార్యులు

శృంగేరిలో ఋష్యశృంగుడనే తపస్వి యుండేవాడు. ఆ ప్రభావంతో నెంతటి కోరికలైన నెరవేరుతుండేవి. సర్వదేవతానిలయమది. శ్రీ శంకరులిక్కడ చేరి శిష్యులెందరికో సర్వవేదాంత విషయాల్ని బోధిస్తూ, ప్రస్థాన త్రయాన్ని అక్కడే ప్రవచించిరి కూడ. ఇక్కడ శ్రీ శారదా పీఠమేర్పరచి, తాను ఓడించిన, సన్యసించియున్న మండనమిశ్రుని సురేశ్వరాచార్యులను పేరుతో వారిని ఆ శారదా పీఠాధిపతిగా నియమించి తాను బయలుదేరాడు.

శ్రీ దక్షిణామూర్తి స్తోత్రవ్యాఖ్యానం శ్రీ సురేశ్వరాచార్యులదే అగ్రగణ్యం. ఆ సురేశ్వరాచార్యుల చరిత్రయే ఇది.

## సురేశ్వరాచార్యుల (మండన మిశ్రుని) చరిత్ర

శ్రీ శంకరుల వారు పర్యటిస్తూ, అపర కుమారస్వామి అవతారమైన శ్రీ కుమారిల భట్టుని చేరి, వాదభిక్ష కోరెను. అందులకా భట్టు, శ్రీ స్వామి వారితో వాదన చేసే పరిస్థితి లేక, తన శిష్యుడగు మండన మిశ్రుని చేరమని, ఆయనతో వాదిస్తే తనతో వాదించినట్లే అని చెప్పిరి.

అటులే శ్రీ స్వామివారు నర్మదానదీ తీరాన గల మహిష్మతీపురం చేరాడు. ఆ పురంలోనున్న మండన మిశ్రుడు మహా పండితుడు. "వేదాలు కర్మయోగ ప్రతిపాదకాలు"గా,

గృహస్థాశ్రమమే సర్వశ్రేష్ఠమని అతని అభిప్రాయము. వారి వయస్సు సుమారు 50,60 సంవత్సరాలు. బ్రహ్మాంశతో పుట్టినవాడు. ఆయన భార్య "ఉభయ భారతీదేవి" సాక్షాత్ సరస్వతీ అంశతో పుట్టిన మహావనిత. ఈ ఉభయులు మీమాంస శాస్త్రాన్ని, కర్మ సిద్ధాంతాన్ని భారతదేశంలో ప్రచారం చేస్తూ, వారు స్వయంగా యజ్ఞ యాగాది అనుష్ఠానాలు చేస్తున్నారు.

వారి ఇంటి ముందున్న చిలుకలు సహితం వేదాల్ని గురించి "ఫలప్రదం కర్మ? ఫలప్రదోజః జగత్ ధృవం శ్యాత్? జగదధృవం శ్యాత్? స్వతః ప్రమాణం పరతః ప్రమాణం" అంటూ చర్చ చేస్తూంటాయట. ఆ గుర్తులను బట్టి శంకరులు యోగశక్తితో మండనమిశ్రుని యింటికి చేరారు. ఆయన యింటిలో నారోజు శ్రాద్ధ కర్మ కావటంతో వ్యాస, జైమిని మహర్షులను కూడా అక్కడే దర్శించటం జరిగింది. తాను వచ్చిన విషయం సెలవిచ్చాడు. ఆ సమయంలో సన్యాసి ముఖము చూడరాదని, అందులో కాస్త కోపిష్టియును, 20 సంవత్సరముల కుఱ్ఱవాడగు యీ సన్యాసితో తాను వాదించటమేమిటని వీలు కాదనెను. అయినను పట్టు వీడని శ్రీ శంకరుల వారు వాదించి అద్వైత వైభవాన్ని ప్రబోధించాడు. "సంసార బంధాన్ని తెంచివేయ గలిగిన వేదాంత తత్త్వాన్ని చక్కగా విని పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకోలేని వాడు ఆత్మహత్య చేసుకొనిన వాడవుతాడని" యుపదేశించాడు. "యతీశ్వరుడు తర్కవాదంలోకి దిగ కూడదు" అనేనిషిద్ధ వాక్యం ఉన్నా, లోకానికి మేలు చేయటం కోసం సన్యాసి వాదించవచ్చు. అనే ధర్మాన్ని పురస్కరించుకొని, మండన మిశ్రునితో వాదించటం ప్రారంభించాడు.

ఆ వాదన వినిన మండన మిశ్రుడు కాదనలేక సిద్ధ పడ్డాడు. కాని, వీరిద్దరి వాదనలను విని తీర్పు చెప్పే నెవరును అంగీకరించకపోగా, మండన మిశ్రుడే తన భార్య ఉభయ భారతిని పురమాయించాడు. అందులకామెయు సిద్ధపడెను. స్త్రీ తీర్పును శ్రీశంకరులు సమ్మతించిరి.

ఆ రోజులలో నున్న పండితులు కూడ మండన మిశ్రుని వంటి వారి వాదనకు, ప్రస్తుతమేతెంచిన శ్రీ శంకరుల వంటి వారి వాదనకు తీర్పునిచ్చుట, వెనుకంజ వేయుటయును సహజమయ్యేను. అనగా సాహసము లేనివారైరి. మండనమిశ్రుని ఇంటిలో ఆరోజు శ్రాద్ధకర్మ కావటంతో గుర్తుగా ఆ గుమ్మములోనొక ఆకు బోర్లించి, సింహద్వారము మూసి ఉంచటం ఆచారం. అది చూచిన బాల శంకరుడు యోగ మార్గముతో శ్రాద్ధంచేసే గదిలో వారి ముందర సాక్షాత్కరించాడు.

మహాకర్మఠుడైన మండనునికి, బాల సన్యాసి శంకరునికి సంస్కృత భాషలో సంభాషణ ఇలా సాగింది.

"కుతో మండ్యాగళాన్ముండీ పంథాస్తే పృచ్ఛ్యతే మయా ।
కిమహ పంథాస్త్వన్మాతా ముండేత్యాహ తథైవ హి ॥"

అనగా – "ఎక్కడ నుండి వస్తున్నావు బోడీ?" అని మండనుని ప్రశ్న.

"కంఠం వరకే బోడిని" అని శంకరుని కొంటె సమాధానం వచ్చింది.

సన్యాసులు కంఠానికంటే దిగువ శరీరములో క్షవరము చేసుకొనరాదు, కనుక అంతవరకే బోడిని అని చెప్పటం అర్థం.

"నీ మార్గాన్ని అడుగుచున్నాను" అన్నాడు మండనుడు.

"ఓహో నామార్గాన్ని అడుగుతున్నావా, నన్ను కదా! అయితే నా మార్గం ఏమి చెప్పింది" అని శంకరుడు ఎదురు ప్రశ్న వేశాడు.

దానికి మండనునికి కోపం వచ్చి – "నీ యమ్మ విధవరాలు అని చెప్పింది". అన్నాడు మండనుడు.

దానికి శంకరుడు – "అయ్యో పాపం నువ్వు మార్గాన్ని అడిగావు, అది మీ అమ్మ విధవరాలంది. అది అడిగిన నీకే వర్తిస్తుంది కదా!" అని తిప్పాడు కొంటె సమాధానంగా.

దిక్కుతోచలేదు మండనునికి. మండనమిశ్రుని ముందర నుంచోని చర్చించడానికి అటుండనీ. కనీసం మాట్లాడడానికిని పెద్ద పెద్ద వాళ్ళే జంకుతారు. అటువంటిది ఒక బాలుడు పైగా ఇచ్చిన కొంటె సమాధానాలు ప్రశంస నీయమైనవి.

అచ్చట నున్న శ్రాద్ధ భోక్తలైన జైమిని, వ్యాసులు గ్రహించి శ్రాద్ధములో శంకరుని విష్ణుస్థానంలో కూర్చోబెట్టి శ్రాద్ధం పూర్తిచేశారు. తదుపరి వాదన మొదలైంది.

ప్రారంభమైన వారి యుభయుల వాదన విని, "మీ వాదాలు బాగానే యున్నాయి. కాని, యింటికొక అతిథి (యతీశ్వరుడు) వచ్చిన కారణాన, ఆయనకు సమయానికి వండి పెట్టాల్సిన బాధ్యత కూడ తనపై నున్నద"ని, అందులకామే వారిరువురి మెడలలో వికసించియున్న పూల మాలలను ధరింపజేసి, ఎవరు ఓడిపోతే వారి పూలమాల వాడిపోతుంది, అని చెప్పి ఆవిడ వెళ్ళి పోయింది. ఈ వాదనకొక షరతు కూడా నిర్ణయించబడెను. "మండన మిశ్రునకు గృహస్థాశ్రమమే శ్రేయోదాయకమని, శ్రీ శంకరులకు గృహస్థాశ్రమ బంధాన్ని త్రెంచివేయ గల్గిననే వేదాంత తత్వాన్ని తెలుసుకోలేదని, యిట్లు వారిద్దరి వాదనలకు విరుద్ధముగా, మండన మిశ్రుడోడిన సన్యాసం స్వీకరించి, శ్రీ శంకరులకు శిష్యుడై పోవాలి. శ్రీ శంకరుల వారోడిన సంసార కర్మకాండలు చేపట్టాలి. ఇది వారి వాదనల షరతు.

వరుసగా ఏడు రోజులపైన వాగ్వాదం సాగింది. ఆ ఏడురోజులలోను ఒక్క సంధ్యావందనానికి, భోజనానికి మాత్రమే ఆపుతూ, తక్కిన కర్మలన్నీ ప్రక్కనపెట్టి అద్భుతమైన ప్రజ్ఞావాదన చేశారుభయులు. అట్టి వాదనలోని అనేక విషయాలు గ్రహించిన సభ్యులు కూడా ఆశ్చర్యపోతున్నారు. గెలుపెవరిదో గ్రహించలేకున్నారు వారు. ఎనిమిదోరోజు వచ్చేసరికి మండన మిశ్రుని మెడలోని పూలమాల వాడింది. అది కనుగొనలేక యుభయులు మహాధాటిగా వాదన చేస్తున్నారు.

ప్రతిరోజు వారిమెడలలోని పూలమాలలను గ్రహిస్తూండేది. తిరిగి తన గృహ కృత్యములలో మునిగియుండెడిది ఉభయ భారతీదేవి. ఆ యుభయులలో శ్రీశంకరుల వారిని, "శ్రీస్వామీ భిక్షకు రండి" - అని, అటులే తన భర్తను, "ఏమండీ! భోజనానికి రండి" అని పిల్చేది. కానీ, 8వరోజున భర్త మెడలోని పూల మాల వాడడం చూచి, ఆవెంటనే "మీరుభయులు" భిక్షకు రండని" పిలుపులోని అంతరార్థం గ్రహించిన మండన మిశ్రుడు ఆ వెంటనే షరతు ప్రకారం కాషాయ వస్త్రం కట్టి, శిఖ, యజ్ఞోపవీతములు విసర్జించి, మొలత్రాడు త్రుంచి సన్యసించాడు. నిజముగానే మండన మిశ్రుడు వాదనలో వోడిపోయినాడు, అలసిపోయినాడు కూడా, శ్రీ శంకరుడు చేసిన యుక్తి యుక్తమైన సర్వశాస్త్ర విషయాలను, గెలుపును ఆమోదించింది. భర్త మెడలోని మాల వాడడం ఓటమికి చిహ్నమైనది.

కానీ, ఉభయ భారతి కూడ శంకరునితో వాదనకు సిద్ధపడింది. ఆమెకును శక్తి చాలక, శృంగార విషయ మెరుంగని శ్రీ శంకరునితో కామశాస్త్ర విషయం వాదనలో పెట్టింది. వెంటనే శ్రీ శంకరుల వారు వాదన ఆపి, తనకొక మాసం గడువు యిమ్మని కోరినాడు. అందులకై శ్రీ శంకరులు అదియును తెలుసుకొనుటకై యత్నములో, యమరుక మహారాజు అరణ్యమునవేట నెపంతో గతించినట్లు యోగశక్తితో నెరింగెను. తానాదేహము నందు పరకాయ ప్రవేశమగుదునని, తన శిష్యుడగు పద్మపాదుని, తన దేహమును కాపాడుచుండమని పలికెను. అటులే శ్రీశంకరుడు ఆ రాజ దేహమునందు చేరి, ఆ రాజ మందిరమునందున్న రాణీవాసములోని, మహారాణి పడు విరహవేదనను గ్రహించినవాడై, కామ శృంగార తపనను తెలిసికొనెను. తిరిగి, తన యోగశక్తితో మహారాజు దేహమున ఆపద వాటిల్లినట్లు గ్రహించి, వెంటనే తాను తన దేహమునందు ప్రవేశించి, ఉభయ భారతీదేవిని చేరెను. అటుపిదప కూడ శ్రీశంకరుల వారు రాగా ఉభయ భారతీదేవి తానట్లు అంతటి మహనీయుని ప్రశ్నించడం సిగ్గనిపించి, తానోడిపోయితినని ఆమోదించినది. అయిన అట్లు ఆ ఓటమిని వారికి పరాభవముగా నెంచక గొప్పతనమును తన అనుభవంలోకి వచ్చినట్లుగా సద్భావం చూపెడివారు. శాస్త్రభాష్యాదుల రూపంలో వారి సందేహాలను, అపార్థములను తొలగించు యత్నము కూడా చేసెడివాడు. తన రచనలద్వారా వారు

జగద్గురువుగా, విశ్వకవిగా శ్రీ శంకరాచార్యులు వికాసం చెందెను.

అట్లు - ఓడిన మండన మిశ్రుని కూడ శ్రీ శంకరుల వారును కదు ప్రశంసించి, అంతటి మహనీయుని తన శిష్యునిగా పొంది, వారికి "సురేశ్వరాచార్యుల"ని నామకరణం చేశారు. ఆ సురేశ్వరాచార్యులను వెంటబెట్టుకొని తన పూర్వపు శిష్యులతో బయలుదేరాడు.

శ్రీ శంకరులు సురేశ్వరాచార్యుల వారిని మిక్కిలి గౌరవిస్తూ ఆదరిస్తుండడం మిగిలిన శిష్యులకు కాస్త అసూయ కనబడినట్లు కాగా, మరియు నతడు బలవంతముగా సన్యసించుకొన్నాడని, పరిపూర్ణమైన శిష్యరికం కాదని. మీదు మిక్కిలిగా నతని పాండిత్యానికి తట్టుకోలేక పోవడమంతా శ్రీస్వామి వారు గ్రహించగా- వారి ఈర్ష్యా సూయాదులను దూరమొనర్చుటకై తాను వ్రాసిన గ్రంథాలపై వ్యాఖ్యానములను వ్రాయుండని శిష్యునక్కొక్క గ్రంధము యిచ్చాడు. ఆచార్యుల వారి దగ్గర వచ్చిన చిక్కు ఏమిటంటే, తనకంటే వారి ఁసందరి (శిష్యులందరి) వయస్సులో మూడురెట్లు సుమారు పెద్దవారు. అనగా శ్రీస్వామి వారి వయస్సు సుమారు 30(ముప్పది) సంవత్సరములుండగా, వాళ్ళంతా సుమారు 70, 80 సంవత్సరముల వయస్సు గలవాళ్ళు. మిక్కిలి లోకానుభవం, పాండిత్యంలోను తీసిపోరు వారు. అందులకాస్వామీ తమ శిష్యులతో - "అయ్యా! మీరంతా పెద్దలు, మీవలె ఆయన శక్తి కూడ తెలుసుకోవాలి కదా!" అని, సురేశ్వరాచార్యులను పిలిచి, "మీరును అద్వైత సిద్ధాంతం గూర్చి స్వతంత్రంగానొక గ్రంథం వ్రాస్తే బాగుంటుంది" అన్నారు. అందులకాతడు సమ్మతించి కొద్దిరోజులలోనే "నైష్కర్మ్య సిద్ధి" అనే పేరుతో అద్వైత సిద్ధాంతముగా మిక్కిలి శిఖరాయమానమైన ఉత్కృష్ట గ్రంథమొకటి వ్రాశారు. ఆ గ్రంధము సిద్ధాంత గ్రంథాలలో మిక్కిలి వినుతి కెక్కినది. "నైష్కర్మ్యం" అనే పదానికి పూర్తి నిర్వచనం చేశాడతడు. ఈ నైష్కర్మ్యమె అద్వైత సిద్ధాంత సాధన భాగంలో మూలస్థంభం. గనుక ప్రతివారును నైష్కర్మ్యాన్ని సాధించాలి.

"కర్మణ్యా కర్మయః పశ్యేత్" - అని భగవద్గీత 4వ అధ్యాయం 18వ శ్లోకమున గ్రహించినచో, కర్మలలో అకర్మని, అకర్మలలో కర్మని దర్శించాలి" అని. ఇదే నైష్కర్మ్యానికి మూలం.

అది రచించిన తరువాత తోటి శిష్యులంతా తమ తప్పును గ్రహించి, అట్టిది విశిష్ఠ అద్వైత గ్రంథమని, నిజముగా అద్వైత సిద్ధాంతాన్ని నిలబెట్టె గ్రంథమిదియే అని, గ్రహించిరి.

తదుపరి సురేశ్వరాచార్యుల వారు శ్రీ శంకరాచార్యుల శ్రీదక్షిణామూర్తి స్తోత్రమునకు "మానసోల్లాసము" అనే పేరుతో శ్లోకాల రూపంగా నొక్కొక్క మెట్టున్నటుల 8 మెట్లతో అద్వైతమును తెలుపగా, శ్రీస్వామి వారు యిది శ్రీదక్షిణ మూర్తి స్తోత్రమునకు మహాత్మ్యంగా

ప్రతిపాదించారు. అతని అద్భుత ప్రజ్ఞా నిరూపణమని గ్రహించారు. ఇదే శ్రీసురేశ్వరాచార్యుల కథ.

## శ్రీ తోటకాచార్యుడు

శ్రీ జగద్గురు శంకరాచార్యుల వారి నలువురి శిష్యులలో నొకరైన తోటకార్యులొకడు. ఈయనను 'గిరి' అని కూడ పిలిచెడి వారు. ఇతనికెట్టి చదువు రాకపోగా, గిరికి చెప్పినా గోడకు చెప్పినా ఒకటే, అనే భావనలో మిగిలిన శిష్యులుండిరి. కాని గురుభక్తిలో గొప్పవాడు. నిత్య కృత్యాలలో నిరంతరం శ్రీస్వామి వారి శాటీలను నుతుకువాడు. అట్టి అతని గురు భక్తికి సంతసించిన ఆచార్యులు, మిగిలిన శిష్యుల భావనను గ్రహించి, దానిని వమ్ము జేయదలంచి, అతనికి చతుర్దశ విద్యాపాండిత్యాన్ని అనుగ్రహించాడు.

'గిరి' అట్లు సకల విద్యా పారంగతుడై తోటకవృత్తంలో సకల తత్త్వంగా "గురుతత్త్వం" తోటకాష్టకం వ్రాసి శ్రీ శంకరులను స్తుతిస్తూ గొప్ప శిష్యుడుగా ఖ్యాతి పొంది తరించెను.

# తోటకాష్టకము

## ప్రథమాష్టకము

విదితాఖిల శాస్త్ర సుధాజలధే మహితోపనిషత్కధి తార్థ నిధే ।
హృదితే కలయే విమలం చరణం భవశంకర దేశిక మే శరణం ॥

భా: స్వామీ! శాస్త్రములపారములు. ఆ శాస్త్ర విజ్ఞాన మనంతం. సకల శాస్త్ర విజ్ఞానము మీకు కరతలామలకం. కనుకనే మీరు విజ్ఞానామృత సాగరుడవు. అనగా మీ శాస్త్ర విజ్ఞానమనంతం, అపారం.

ఉపనిషత్తులు పూజ్యములు, పవిత్రములు, అనంతములు. మీరు సర్వోపనిషత్ప్రతిపాదిత విజ్ఞాన నిధివి. ఓ గురూత్తమా! మీ పాదము అచ్ఛ స్వచ్ఛము. పవిత్రము. అట్టి మీ దివ్య పాదమును నిరంతరము నాహృదయమున నిలుపుకొందును. అనగా నా హృదయములో సదా మీ పద ధ్యానము చేయుచుందును. ఓ శంకరా! సద్గురూ! మీరే నాకు దిక్కు, మీరే శరణం, మీరే గతి.

విశేషము :- ఈ శ్లోకమున, "విదితాఖిల శాస్త్రసుధా జలధే, మహితోపనిషత్కధి తార్థనిధే" అని శ్రీ శంకరులకు రెండు విశేషణములు ప్రయుక్తములైనవి. మొదటిది, నిఖిల శాస్త్ర విజ్ఞాన స్వరూపమును, రెండవది ఉపనిషద్విజ్ఞాన రాశి. అని - ఈ రెండును వారికి మిక్కిలి విశేషములే - ఇందలి మొదటి విశేషణము శ్రీ శంకరులకు గల నిఖిల పౌరుషేయ

శాస్త్రవిజ్ఞాన సంపదను స్పష్టపరచుచున్నది. అట్టి నిఖిల శాస్త్ర విజ్ఞాన సంపదతో విరాజిల్లు వాడగుటచే శ్రీ తోటకులు గురువు 'శ్రీ శంకరులను' విదితాఖిల శాస్త్రం అని సంబోధించుట యెంతయు సార్థకముగా నున్నది.

ఇక రెండవ విశేషణము, శ్రీ శంకరులు "అపౌరుషేయ వేద వాక్య తాత్పర్యవేత్త" అను విశేషమును ప్రస్ఫుటమగు చున్నది. కాగా! వేద వాక్య తాత్పర్య నిర్ణయమునకై నిఖిల శాస్త్ర విజ్ఞాన మావశ్యకమగు సంప్రదాయము యిటు సూచింపబడుచున్నది. ఇట్లు "పౌరుషేయ, అపౌరుషేయ" ఉభయ విధ శాస్త్ర విజ్ఞాన సంపన్నుడు, కావుననే శ్రీ శంకరుడు "సుధా జలధే" సాంగోపాంగ వేద విజ్ఞాన నిధిగా కీర్తింపబడినాడు.

"కలయే విమలం చరణమ్" - చరణములనగా పాదములుగదా! సామాన్యముగా దేహమునందు మిగిలిన అవయవములందున్న పవిత్రత పాదములందు దర్శింపరు - ఎందుకనగా, సంచార వశమున యెన్నో అపవిత్ర ప్రదేశములందు కాలిడుటచే పాదములు దూషితములగును - అందులకై పునః పునః పాదప్రక్షాళనమును కావించు ఆచారమున్నది. ఇది సాధారణ పురుష చరణముల విషయము.

కాని, మహాత్ముల విషయమట్టిది కాదు. వారు తపస్స్వాధ్యాయముల చేతను, శాస్త్ర విజ్ఞాన సంపదచేతను, వారొనర్చు పుణ్యస్థల కర్మపరిపాక వశము వలనను, వారి స్థూల, సూక్ష్మ శరీరములు (సర్వము) బ్రాహ్మీమయములు - వారివాక్కు అమోఘములు. వారిదృష్టి లోకక్షేమకరము. వారి చరణ విన్యాసముచే నాయాప్రదేశములు తీర్థ భూతములగును. వారి పాదధూళి భక్తులకు నిఖిల శ్రీరామరక్ష.

"సంచార పూతాని దిగంతరాణి" అని 'కాళిదాసు' మహాకవి, రఘువంశం రెండవ సర్గలో "నందినీ ధేనువు"యొక్క సంచారమును వర్ణించుటననునది తార్కాణము.

**అనగా మహాత్ములు** తమ సంచారముచే నాయా ప్రదేశములను పవిత్రములు కావించుచునని, **అనూచాన** సంప్రదాయ వచనముగా తోటకాచార్యులు కీర్తించుటను అతిశయోక్తి కాదు.

దీనిని బట్టియే ఆలయములందు దైవపాదులకలను గ్రహించుట, పీఠములందుంచుట, పాదపూజ మొదలగు సంప్రదాయములు ప్రవర్థిల్లినవి.

అట్టిదే, రామాయణమున భరత కృత పాదుకా పట్టాభిషేక మందులకు నిదర్శనము.

## ద్వితీయాష్టకము

కరుణా వరుణాలయ పాలయ మాం భవసాగర దుఃఖ విదూన హృదమ్ ।

రచ యాఖిల దర్శన తత్త్వవిదం భవశంకర దేశిక మే శరణమ్ ॥

భా: ఆచార్యదేవా! సంసార సాగరము నుండి పలుదుఃఖములచే నాహృదయము కృంగి కృశించి పోవుచున్నది. మీరు కరుణా సముద్రమవు నన్ను దర్శన తత్త్వవిధుని గావించుము. సంసార కూపము నుండి యుద్ధరింపుము. మీరు తప్ప నాకు మరి వేరు దిక్కెవరు.

ఈ శ్లోకము రెండు పాదములు - శ్రీ శంకరులు కరుణా వరుణాలయుడు - శిష్యుడు భవసాగర దుఃఖ విజీర్ణ హృదయుడు.

"వరుణాలయ, సాగర" శబ్దములు రెండును సముద్ర పర్యాయ వాచకములుగా ప్రసిద్ధములు. జలాధి దేవతగా వరుణుడు శ్రీరూపుడు. బ్రహ్మ విద్యావేత్తయును, బ్రహ్మ విద్యా స్వరూపులు కరుణశ్రీ సంపదులు. అట్టి బ్రహ్మ విద్యావేత్తయైన శ్రీ శంకరులట్టి కరుణశ్రీ నిలయుడు. అను విశేషార్థమును "కరుణా వరుణాలయ" అనుపదము ధ్వనింపజేయుట గమనింపదగినది.

ఈ దృష్టితోనే బ్రహ్మవిద్యాచార్యుడైన శ్రీ గీతాచార్యుడగు శ్రీకృష్ణుని "శరణం భవ కరుణామయ" - అనే తరంగములో "కరుణా రస వరుణాలయ" అని, "నారాయణ తీర్థులవారు" కీర్తించుటలోనిదే సంప్రదాయము కనబడుచున్నది.

"రచయాఖిల దర్శన తత్త్వ విదమ్" మూడవ పాదము, "భజగోవిందమ్ మూఢమతే - నహి నహి రక్షతిడు కృఞ్" కరుణే, ఇది శ్రీ శంకరుల యుపదేశముగా ప్రధానముగా పండితుల నుద్దేశించి చేసినదిగా గ్రహింపుము.

## తృతీయాష్టకము

"భవతా జనతా మహితా భవితా నిజ బోధ విచారణ చారుమతే ।
కలయేశ్వర జీవ వివేక విదం, భవ శంకర దేశిక మే శరణమ్ ॥

భా: ఓమహాత్మా! మీరు ఆత్మ స్వరూప విచారణ చేసిన మహా ప్రాజ్ఞుడవు. మీ హృదయము రమణీయ భావనాసుందరము - మీ పదముల సదా నమ్మిన నాకు, జీవేశ్వర వివేక విజ్ఞానమునను గ్రహింపుము. నీతత్త్వ బోధన, ఉపదేశములచే ఈమానవ కోటి సుఖశాంతులతో, కల్యాణ పరంపరలతో వర్ధిల్లగలదు. నేనా మానవకోటిలో చేరినవాడను. జగద్గురూ! నన్ను కరుణించుము. మీరే నాకు దిక్కు.

**విశేషము** : శ్రీ తోటకులు గుర్వనుగ్రహమున విద్యాపారంగతుడైనను అహంకార దూషితుడు కాలేదు. విద్యాతిశయముతో తోటి సద్బ్రహ్మచారుల యెదుట తన విద్యా ప్రాగల్భ్యమును

ప్రదర్శించనూ లేదు.

"విద్యా దదాతి వినయం వినయాద్యాతి పాత్రతామ్" అను సూక్తికి యుదాహరణ భూతుడై వెలిసెను. గురు పాదముల వీడలేదు. కేవలం తన క్షేమమునే కోరుకొనక, మానవకోటి సుఖ శాంతులను, కల్యాణము నాశించెను. తన మహాత్మ్యతను ప్రకిటించుకొనెను.

"భవతా జనతా మహితా భవితా" అని "శ్రీ ఆదిశంకరావతారము సకల జన నిఃశ్రేయసమునకే" అని చాటి చెప్పెను. శ్రీ శంకరులను జీవేశ్వర వివేక విదునిగా దర్శించి, తదనుగ్రహమునకు పాత్రుడయ్యెను.

## చతుర్థాష్టకము

"భవ ఏవ భవానితియే నితరాం, సమ జాయత చేతసి కౌతుకితా ।
మమ వారయ మోహ మహా జలధిం భవ శంకర దేశిక మే శరణమ్ ॥"

భా: దేశికోత్తమా! సాక్షాత్తు శంకరుడే మీ రూపమున అవతరించినాడను భావముతో నా మానసము పొంగుచున్నది. మీరు సాక్షాత్ శంకరులే. "శంకర శ్శంకర సాక్షాత్" - నేను మహామోహ సాగరమున బడితిని. దిక్కుతోచదు. నన్నుద్ధరింపుడు. ఉద్ధారకుడవు నీవే. నన్నొక దరి జేర్చుము.

**విశేషము** :- శ్రీ శంకర భగవత్పాదులు శ్రీ శంకరుడేయని, కీర్తించుటలో గల పరమార్థము, "నమః కపర్దినేచ వ్యుప్త కేశాయచ", జటా జూటధారి, ముండిత శిరస్కుడు ఈశ్వరుడు శ్రీ శంకర భగవత్పాదావతార సూచకమని, సంప్రదాయజ్ఞుల అభి భాషణ.

## పంచమాష్టకము

"సుకృతే ధికృతే భహుదాభవతో, భవితా సమదర్శన లాలసతా ।
అతిదీన మియు పరిపాలయాయాం, భవ శంకర దేశిక మే శరణమ్ ॥"

భా: ఓ గురూత్తమా! ఆత్మవిద్య అందరుకును సిద్ధించునది కాదు. సద్గురువుల ఆశీస్సులచే, ఈశ్వరానుగ్రహము వలనను నది సిద్ధించును. మీరు మూర్తీభవించిన బ్రహ్మజ్ఞాన స్వరూపులు. మీబోటి సద్గురువుల కటాక్షము వలననే సుకృతాత్ములైన ఉత్తమాధి కారులకు బ్రహ్మ విషయక జిజ్ఞాస ఆత్మస్వరూప దర్శనమందు ప్రగాఢ వాంఛ కలుగును. నేను అవివేకిని, దీనుడను, నిస్సహాయుడను, మీ శరణు జొచ్చితిని. నన్ననుగ్రహింపుము. సద్గురు కటాక్షము వలన గాని ఆత్మవిద్య సిద్ధింపదు గదా! నీవు దేశికుడవు, గురూత్తముడవు,

శరణు జొచ్చితిని. నన్ననుగ్రహింపుము. సద్గురు కటాక్షము వలన గాని ఆత్మవిద్య సిద్ధింపదుగదా! నీవు దేశికుడవు, గురూత్తముడవు, శరణు జొచ్చిన పాద సేవకులను ప్రసన్నులైన శిష్యులను రక్షించుడు. వారు దేశికులు, ఆచార్యులు, గురూత్తములు. మీరట్టి పరమ పావనుడవు, నన్ను రక్షించుము, ఆశ్రయమిచ్చి కాపాడుము.

**విశేషము** :- ఈ శ్లోకమున రెండు మూడు పాదాలలో శ్రీతోట కాచార్యులు శ్రీశంకరాచార్యులను, "నేనతి దీనుడను, ఉద్ధరింపుము" అని వేడుకొనుచున్నాడు. అతని దైన్యమట్టిది. కనుక, ఏట్టి కష్టములకును లోను కాలేదు. ఆర్తుడు కాదు. అర్థార్థీ కాదు, జడ బుద్ధి కావున, జిజ్ఞాసకు తావీయలేదు. మన స్సంక్షోభమంతకన్నా లేదు. భక్తి శ్రద్ధలతో నిండు మనస్సుతో శంకరుని యారాధించెను. అట్టి గురువు యొక్క శుశ్రూష లభించినందులకు తృప్తి చెందెను. ఆనందించెను. నిశ్చల, నిర్మల, నిర్వ్యాజ భక్తిచే శ్రీశంకరుల హృదయము స్పందించెను. మహితోపనిషత్కథితమైన విద్యాసుధా తరంగిణి తోటకుని హృదయమున పరవళ్ళు త్రొక్కినది. శాస్త్రీయముగా చెప్పవలెనన్న గురు భక్తిపాత ప్రభావముచే బ్రహ్మవిద్యా జిజ్ఞాస యుదయించినది. కాని, బ్రహ్మ విద్యా ప్రాప్తికి నోచుకొననైతిననెడి భావనయే తోటకుని దీనుని జేసినది. అపుడాతని నుండి, "అతి దీనమియం పరిపాలయ మాం" అను అభ్యర్థన వెలువడింది. "సమదర్శన లాలసతా" – అద్వైత వాసన అంకురించినది. దీనినే, "ఇహాముత్ర ఫలభోగ విరాగః" అని శాస్త్రకారులు నిర్దేశించిరి. ఆయన కోరిక యొకటియే అదియే – "సమదర్శన లాలసత" అందరిని సమభావనతో చూచుట. ప్రవర్తించుట – అద్వైత దృష్టిపెంపొందిన కొలది సిద్ధింప వలసిన ఫలము గూడ సమదర్శన లాలసతయే.

సమదర్శనమనగా "బ్రహ్మాత్మైక్య దర్శనము". ఇది జీవేశ్వర భేద నివృత్తి పూర్వకముగా ప్రసాదింపబడెడి యుత్తమ ఫలము. అధిష్ఠాన బ్రహ్మ స్వరూపమున భాసిల్లును. అదియే ఆయన లాలసత.

ఇది అపార గురు కృపా మహిమను చాటెడి "శక్తి పాత విద్యారహస్యము" అలౌకిక వేద విద్యావతార తత్త్వము.

## షష్ఠమాష్టకము

"జగతీమవియం కవితా కృతమో, విచరంతి మహామహసశ్ఛలతః ।
అహిమాంశు రిహ్రాత విభాసి గురో, భవ శంకర దేశిక మే శరణమ్ ॥"

భా: ఆచార్య వర్యా! మీరు నిజముగా దివ్యతేజో మూర్తివి. మీ దివ్య తేజము భాష్య ప్రకరణ, స్తోత్రాది కవితాకృతులుగా లోకము నుద్ధరించుటకై యెల్లెడల

సంచరించుచున్నవి అనగా జగత్వ్యాప్తములై విలసిల్లు చున్నవి మీరిపుడు నా దృష్టిలో అంధకారమును పారద్రోలు సహస్ర కిరణులు, లోక సాక్షివి, ఆదిత్య స్వరూపుడవు మీ దివ్య తేజస్సుతో నాలోని అజ్ఞానాంధ కారపు తెరలను చీల్చి యుద్ధరింపుము నాకు జ్ఞాన దృష్టి నొసంగి కాపాడుము అన్యధా శరణం నాస్తి

**విశేషము** - నిరంతరం సవిత్వరేణ్య దివ్య భర్గోపాసన జేయు శ్రీతోటకులు క్రమముగ, ఆ దివ్య భర్గ రూపుడే **తన** గురువని, దర్శించెను

"అహిమాంశు వారిత్ర విభాసి గురో!" అని తన యనుభూతిని ప్రకటించుకొనెను దివ్యజాతి రూపుడగు తన గురువర్యుల కిరణ సంపదయే

ప్రస్థాన త్రయాది రూపముపైనావిర్భవించి విజ్ఞాన దీపికలై వెలయుచున్నవని దర్శించి తరించెను

## సప్తమాష్టకము

"గురుపుంగవ పుంగవ కేతనతే, సమతామయతాం నహికోఽపి సుధీః ।
శరణాగత వత్సల తత్త్వనిధే, భవ శంకర దేశిక మే శరణమ్ ॥'

భా ఓ మహాత్మా! మీరు దేశికోత్తములు గురుపుంగవ జీవుడవు మీరు **ఉత్తమ** పురుషులకునూ ఆదర్శమూర్తులు, పురుషోత్తములు మీకు సాటి యెవరును నుండబోరు మీరు శరణాగత వత్సలుడవు అంత మాత్రమే కాదు, మీరు జ్ఞాన నిధివియును కలల లక్షణ లక్షితుడవైన ఓ మహాత్మా! మీ శరణు జొచ్చుచున్నాను నన్నాదరించుము ఆశ్రయమిచ్చి కాపాడుము

"త్వామేవ శరణం గతః"

**విశేషము** - "శృతి స్మృతి పురాణానామలయం కరుణాలయం" - అని శ్రీ శంకరులు కీర్తింపబడుచున్నారు

శ్రీ శంకరులు, "వేద శాస్త్రాభిజ్ఞుడు, కరుణాల వాలుడు" అని భావము వేదములను "శృతులు" అని పిలువబడుటకు గలకారణం, గురుముఖోచ్చారణాను రూపముగ శిష్యులచే శ్రవణేంద్రియ ద్వారా గ్రహింపబడి, అభ్య సింపబడుచున్నందున, శ్రీ శంకరులు శ్రుత్యాలయ, స్మృత్యాలయ రూపుడు పురాణాలయ రూపుడు కనుక తత్త్వనిధి యగు శ్రీతోటకులు శ్రీ శంకరులను "తత్త్వనిధా" అని, సంబోధించుచు గురు విద్యావైభవమును స్మరించుచున్నాడు తత్త్వనిధియై కరుణాలయుడై నందువలననే, గురుపుంగవుడగు చున్నాడు గురు పుంగవ కేతనుడగు చున్నాడు

## అష్టమాష్టకము

"విదితానమయా విశదైక కళా, నచకించన కాంచన మస్తి గురో ।
ధృత మేవ విదేహి కృపాం సహజాం, భవ శంకర దేశిక మే శరణమ్ ॥"

భా: ఓ జగద్గురూ! కరుణానిధే! నేనల్పజ్ఞుడు, శాస్త్ర సాంప్రదాయముల నెరుంగను. సంగీత సాహిత్యాది చతుష్ట కళలలోనే యొక్క కళను నారాధించ లేదు. కళాభిజ్ఞుడను కాను విద్యా గంధము లేని వాడను. భక్తితో మీకు శుశ్రూష జేయుట యొః క్కటియే నాకు తెలిసిన విద్య. నీకు సమర్పించు గురుదక్షిణకు నా వద్ద ధనం లేదు.

**విశేషము** :- గురువులు సాధారణముగా కొద్దియో గొప్పయో తెలివిగల వారిని మాత్రమే చేరదీయుదురు. ధర్మ సంరక్షణకై లేక లోకకల్యాణార్థమై అవతరించిన ఆచార్యుల దృష్టి కాంచనముపై ప్రసరించదు. భక్తి వినమ్రులై పవిత్రాంతః కరుణులైన భక్తి శిష్యుల యెడల సహజముగా వారిప్రేమ పొంగి పొరలి ప్రవహించును. వినీతులగు శిష్యులయెడ గురువుల వాత్సల్యము సహజము. సచ్ఛిష్యుని వలననే గదా గురువు యొక్క మహిమ ప్రకాశించునది. గురు కృపాకటాక్ష వీక్షణలె కదా! సచ్ఛిష్యుని పాలిట కల్పలతలు, విద్యనభ్యసింప గోరు శిష్యులకు కృపా రసార్ద్రులైన యుత్తమ గురువులే శరణ్యం "అన్యథా శరణం నాస్తి, సద్గురు చరణం శరణం శరణమే!"

వినీతుడైన శ్రీతోటకాచార్యుడు నిర్వ్యాజము, అకుంఠితమైన భక్తి కలవాడు. గురువులాశించునది యట్టి వినీత భావమునే అకుంఠిత దృఢ భక్తినే. కావుననే దేశికోత్తములగు శ్రీ శంకర భగవత్పాదుల ప్రేమ పొంగి పొరలి, తోటకాచార్యునిపై ప్రవహించునది. ప్రవహించుటయే తడవుగా శ్రీతోటకాచార్యుడు చతుర్దశ విద్యాపరి పూర్ణుడాయెను. విద్యాశరీరుడై ఆరాధనీయ గురు పరంపరలో చేరి పూజ్యపాదుడాయెను. సద్గురు సహజ కృపాపాత్రుడై ఆచంద్రార్క విరాజమాన యశశ్శరీరుడై విరాజిల్లెను. సద్గురు కృపామహిమ సహజమని ఉత్తమ సద్గురు విట్టి వాడని నిరూపించెను.

సచ్ఛిష్యుని పాలిట కల్పలతలు గురు కృపాకటాక్ష వీక్షణే కదా! సచ్ఛిష్యుని వలననే గదా! గురువు యొక్క మహిమ ప్రకాశించునది. విద్య నభ్యసించు, లేక అభ్యసించ గోరు శిష్యులకు కృపారసార్ద్రులైన యుత్తమ గురువులే శరణ్యము. "అన్యథా శరణం నాస్తి, సద్గురు చరణం శరణం శరణమే" -

"తద్విజ్ఞానార్థం సగురుమేవాభి గచ్ఛేత్", పరమార్థ దర్శనం పరమ పురుషార్థ సాధకమని, పరమార్థ విషయక పరిశోధనకై గురూపసదనం చేర్తాడు. గురు శుశ్రూష

చేస్తూ గుర్వనుగ్రహంతో జ్ఞాన సముపార్జన చేస్తాడు తత్త్వజ్ఞాని స్వరూపుడౌతాడు.

"నీరు పల్ల మెరుగు" అను సామెతగా, స్వయముగనే అది ప్రవహించును. నిజమైన, ఉత్తమాధికారియైన శిష్యుని హృదయ సంస్కార సంపదను సద్గురువే యెరుగును. అట్టి శిష్యునిపై పరవళ్ళు త్రొక్కును. కోరకయే శ్రీరామునకు విశ్వామిత్రుడు అస్త్రవిద్యారూప మంత్రనామము ఉపదేశించెనట. ఇట్టి స్థితి పురాణగాథలోనే కాక, నేడు కూడా యీ తోటకాచార్యుల గాథయే నిదర్శనము.

శ్రీ శంకరులు తోటకాచార్యుల నుద్ధరించిన విధానం "మౌన వ్యాఖ్యాప్రకటిత పరబ్రహ్మతత్త్వం" అను వాక్యమునకే వ్యాఖ్యాన రూపమగుచున్నది.

★★★

## గురు - సూత్రములు

ఆధ్యాత్మిక గురువు భగవానుని అంతరంగిక దాసుడు.

★★★

ప్రామాణికుడైన గురువు ఎల్లప్పుడు బ్రహ్మనిష్ఠుడై ఉంటాడు.

★★★

గురువును అనన్యభావముతో పూజించినచో భవసాగరం దాటించును.

★★★

కామాదులు నశించుటతో హృదయమున పుండరీక కర్ణిక యందు పరమాత్మా విర్భావములు కలుగును. దానితో దృఢమైన విష్ణు భక్తి చింతన మేర్పడును.

★★★

"ఏకాక్షర ప్రదాతారం యో గురుం నాభి నందతి"

"తస్య శృతం తపోజ్ఞానం స్రవత్యామ ఘటాంబువత్"

ఏకాక్షరోపదేశము (ఓంను) చేసిన గురువును నెవడు అభినందించడో, వాని చదువు, తపస్సు, జ్ఞానమును పచ్చికుండలోని నీటి వలె వ్యర్థమగును.

★★★

## గురు - సూత్రములు

శరీరాలు నశించిన గురుబంధం నశించదు.

★★★

ఆధ్యాత్మిక గురువులు ఆదిదేవునితో సమానము.

★★★

గురుకృపతోనే పరమాత్మ స్వరూపాన్ని గుర్తించగలము.

★★★

గురువులలో నుత్తమమైన, నేర్పు గల గురువు శ్రీదత్త సద్గురువు.

★★★

రోగులను బాగొనర్చు వైద్యుడెట్లు రాణించునో, శిష్యులను తీర్చిదిద్దు గురువునూ అట్లె రాణించును

"గురువులకు బుద్ధి శిష్యుల వల్లనే" - ఇదియే కర్మానుభవము.

★★★

"ఆచార్య భ్రష్ట దేహానాం భవేద్ధర్మః పరాఙ్ముఖః"(పరాశర స్మృతి)

★★★

సద్గురువును నాశ్రయించడమే మనశ్శాంతికి సులభోపాయం.

★★★

"గురువు"లో మహర్షి భావముండాలి.

★★★

'శిష్యుని'లో సంస్కృతి భావముండాలి.

★★★

'స పూర్వేషాదుపి గురుః కాలేనానవచ్ఛేదాత్"

★★★

గురువు వాక్యము, "గురు" వాక్య ప్రమాణముగా నెంచవలెను.



# 28. శ్రీ వైష్ణవ పరంపరాగత గురువర్యులు

శ్లో॥ సమస్తత్రయ్యన్త పర్యన్త చర్యాపర్యాయ వేధసే ।
నరవేషాయ శేషాయ గురవే పరమ వేదినే ॥

శ్లో॥ యోనిత్యమచ్యుత పదాంబుజ యుగ్మరుక్మ
వ్యామోహతస్తది తరాణి తృణాయమేనే ।
అస్మద్గురోః భగవతోఽస్యదయైక సింధోః
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే ॥

శ్లో॥ భూతసరో వేతాళాన్ కులశేఖర విష్ణుచిత్త భక్తిధనాన్ ।
భక్తాంఘ్రిరేణు శరజిత్ కలిరిపుముని వాహనానపి భజామి ॥

శ్రీ వైష్ణవ సంప్రదాయానికి పరంపరాగత విజ్ఞాన ప్రదాతలైన గురువులలో ఆది గురువు శ్రీమన్నారాయణుడు వారితో ప్రారంభమై మధ్యలో నాధమునులు, యామునాచార్యులు, భగవద్రామానుజులు, శ్రీ మణవాళ మామునులు నుండి ఈ నాటి మన ఆచార్యుల వరకు పరంపరగా నీ సంప్రదాయం మనకు అందినంత వ్రాయడమగుచున్నది

ఈ పరంపరా క్రమంలోని వారందరూ తెలియక పోయినా, వారి వంశ వృక్షములోని వారందరూ తెలియక పోయినా, వారి వంశ మూలపురుషుని ప్రాధాన్యేన తెలియపరచు నిమిత్తమై, వీరెందరు? వారు చేసిన ప్రజోపకారము లేమిటి? అని, విస్తారంగా కాకపోయిన క్లుప్తంగా తెలియజేసే ఈ వ్యాసం సామాన్యులునూ పఠించి తెలుసుకొనుటకై, మరియు వారి పూర్వాచార సాంప్రదాయిములను విడువక ఆచరించుటకై ఈ గురు పరంపరా, శిష్య పరంపరలోని మహానుభావుల గూర్చి వివరిస్తూ, పఠించి తరిస్తారని ఆశీస్తూ -

శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి
ఆశీస్సులు కాంక్షించుచున్నాను.

వేదంలోని "విష్ణువు", వాసుదేవ "కృష్ణుడు "గా, పాంచరాత్రా గమనంలో చెప్పిన "నారాయణుడు"ను మూడు వాహినులు కలిసి వైష్ణవతత్వంగా రూపొందింది. వాసుదేవ కృష్ణతత్వముతో పాటు ఆగమాలలో చెప్పిన వ్యూహ పద్ధతి వైష్ణవవ్యాప్తికి దోహదం అయ్యింది.

అదే శ్రీవైష్ణవం.

శ్రీ భగవత్తత్త్వ సత్త్వ సంపన్నులైన, అవిచ్ఛిన్న ఆచార్య పరంపరలో కృత కృత్యులైన, శ్రీ వైష్ణవ సంప్రదాయ శిష్టావ్యవహార మూర్ధన్యులెందరో, వారందరికిని నా మనో వాక్కాయ నమః సుమాంజలులు అర్పిస్తున్నాను.

శ్రీ మన్మణవాళ మహామునుల శిష్య పరంపరలో అష్ట దిగ్గజములుగా పేరొందిన విద్వాంసులలో "శ్రీమాన్ కోయిల్ కన్దాడై అణ్ణన్" వారికిని నా నమస్కృతులు.

## ప్రథమమున - శ్రీమద్రామానుజ సంక్షిప్త చరిత్ర

సకల చేతనులను ఉజ్జీవింపజేయు సంకల్పముతో సర్వేశ్వరుడు ఎన్నియో అవతారములెత్తెను. కాని వారిని భగవంతునిగా గుర్తించిన వారికన్న, నాస్తికులు శత్రువులుగా భావించిన వారధికులుండిరి అట్టితరి శ్రీ స్వామివారి పవళింపు వాహనుడైన ఆదిశేషు . స్వామివారి అనుజ్ఞతో ఈ భువియందున్న లోకులందరిని నుద్ధరించు నిమిత్తమై తొలుత శ్రీమద్రామానుజులుగా అవతారమెత్తెను.

పూర్వము మదరాసు(చెన్నై)కు సమీపమందున్న శ్రీ పెరంబుదూరులో "హారీత" గోత్రజులును. "ఆసూరి" వంశ సుధాకరులును. సకల సద్గుణ నిధియు, యజ్వమునగు "కేశవాచార్యుల"నబడు సద్వైష్ణవుడుండెను. వారి అనురూప ధర్మపత్ని కాంతిమతీదేవి. వారికి పుత్రసంతతి లేకుండుటచే మిక్కిలి పరితపించుచుండిరి.

ఒకనాటి చంద్రగ్రహణమునాడు ఆ పుణ్య దంపతులు సముద్ర స్నానమాచరించి, మదరాసునందున్న పార్థసారథిస్వామిని సేవించి, అచటనే పుత్రకామేష్టి యాగముగావించిరి. ఆ యాగఫలముగా కొలది కాలమునకే కాంతిమతీదేవి గర్భమును దాల్చి, కలియుగాది 4118 వ సం॥న (క్రీ.శ.1017) సం.న, పింగళ నామ సం. వైశాఖవాసమున, ఆర్ద్రా నక్షత్రమున, అపర ఆదిశేషుడుగా అనదగినట్టు అవతార జ్యోతిగానొక పుత్ర రత్నమును కనెను. ఆ పుత్రునకే తండ్రి రామానుజుడనిపేరిడెను.

తండ్రి కేశవాచార్యుడు తన బిడ్డనికి తగు విద్యా భ్యాసముతో, యధావిధిగా ఎనిమిదవ ఏట వైదిక సంస్కారముగా ఉపనయనము గావించి, సలక్షణ వేదాధ్యయనమును, సత్సంస్కృత సాహిత్యమును గఱపించి, పదునారవ ప్రాయమున గొప్ప కుటుంబమున జన్మించిన 'తంజమాంబ' అను కన్యతో వివాహము గావించెను. ఆ తండ్రి కొంతకాలమునకే పరమపదింపగా సకుటుంబంగా రామానుదుజుడు శాస్త్రాభ్యాస నిమిత్తమై కాంచీపురం చేరిరి. అందున్న అద్వైత వేదాంత పండితులగు 'యాదవ ప్రకాశుల' వద్ద సామాన్య

శాస్త్రములను నభ్యసించుచుండెను.

అట్లుండ, కొంత కాలమునకు గురువగు యాదవ ప్రకాశులు, తాను పోగొట్టజాలని, రాజ పుత్రికను పీడించునొక బ్రహ్మరాక్షసిని శిష్యుడు రామానుజుడు తన పాదతీర్థమున **పోగొట్టెను.** 'కప్యాస'మనెడి శృతికి, అశ్లీలార్థముగానున్న "కోతిపిర్ర వంటి ఎఱ్ఱని నేత్రములు **భగవానునివి" అను** దానిని ఖండించి, శ్రీరామానుజుడు "లోతైన నీటిలో బలమైన కాడపై, **నీటిపై కొచ్చి నిలిచి, సూర్యకిరణ స్పర్శచే** వికసితోన్ముఖమైన కమలములవలె ఎఱ్ఱనైన, విశాలమైన, **మృదువైన నేత్ర సౌందర్యము** భగవానునిది" అని సమంజసమగు అర్థమును జెప్పిరి.

దీనితో రామానుజునిపై యాదవప్రకాశునకు అసూయ యేర్పడి, తనకు మించిన పండితుడగునను దుస్సంకల్పముతో, వారిని తనతో కాశీయాత్ర సాగింపజేసి, శ్రీమద్రామానుజులను వధింపయత్నించెను. కాని ఆ మార్గమధ్యమున శ్రీరామానుజుల పినతండ్రి కుమారులగు గోవిందభట్టరు, వధించు యత్న రహస్యమును చెప్పగా, శ్రీ రామానుజులు వారి నుండి తప్పించుకొనిరి.

అటనుండి శ్రీరామానుజులు, బోయదంపతి రూపములో వచ్చిన శ్రీకాంచీ కోవెలలో నుండే "శ్రీ వరద రాజపెరుమాళ్" కృపచే సురక్షితులై 'కంచికి' చేరిరి. అచట శ్రీస్వామివారి తీర్థకైంకర్యమొనరుచచుండిరి. అచటనే, శ్రీ స్వామివారికి చామర కైంకర్యమును గావించుచున్న మహాజ్ఞాన సంపన్నులగు 'శ్రీ కాంచీపూర్ణుల' సహవాసమున సుఖముగానుండిరి.

ఇట్లుండ శ్రీరంగమందు వేంచేసియున్న శ్రీయామునాచార్యులు, మన రామానుజుల వృత్తాంతం విని, తమకు పిమ్మట మన మత ప్రవర్తకులు వీరేయని నిశ్చయించి వారినాకర్షించుటకు తమ శిష్యులగు పెరియనంబి గారిచే, తాము రచించిన 'స్తోత్రరత్నము'లోని, 'స్వాభావికానవధికాతిశయ' అనెడు శ్లోకమును రామానుజులకు వినిపింపజేయగా, అదివిని శ్రీయామునాచార్య వృత్తాంతమును సవిస్తరముగానడిగి తెలిసికొని, వారిని సేవింప శ్రీరంగమునకు వేంచేయుసరికి, యామునాచార్యులు తాము రామానుజులకుపదేశింప నెంచిన గూఢార్థములను తమశిష్యులలో ఉత్తములగు ఐదుగురు పండితులకు చెప్పియుంచి రామానుజులచే చేయింపనెంచిన మూడు మహత్కార్యములను వారితో చెప్పజాలని చింతతో మూడువ్రేళ్లను ముడిచి యుంచి పరమపదించిరి.

శ్రీరామానుజులు చేరినంత వారి వ్రేళ్లను ముడిచియుండుట జూచి వారి యభిప్రాయమును గుర్తెరింగి అందరు వినుచుండగా స్వామీ!

1. నేను పంచ సంస్కార సంపన్నుడనై ఆళ్వార్ల ప్రబంధములను లోకములో ప్రవేశింపజేతును. ప్రపత్తి ధర్మపరుడనై జనులనందరినట్టి వారినిగా చేయుదును అనియు.

2. సకల తత్త్వార్థములను సంగ్రహించి బ్రహ్మసూత్రములకు సరియగు శ్రీభాష్యమును రచించుననియు,

3. విష్ణు పురాణమును రచించి లోకములను మహోపకారమును గావించిన శ్రీపరాశరుల పేరును, వేదాలను విభజించి, బ్రహ్మసూత్రములను రచించిన శ్రీవేదవ్యాసుని పేరును, చిరస్థాయిగా చేయుదుననియు ప్రతిజ్ఞ చేయగా, శ్రీయామునాచార్యుల వారి మూడువ్రేళ్లను సాగుటను గాంచి అచ్చటనున్న వారందరును ఆశ్చర్యపడి శ్రీయామునాచార్యుల చరమకైంకర్యమును గావించి యిండ్లకేగిరి. శ్రీరామానుజుల వారిని శ్రీ యామునాచార్యులకు ఏకలవ్యునిగా గుర్తించి ఆశ్చర్యపడిరి.

పిమ్మట శ్రీరామానుజులు, శ్రీ యామునాచార్యుల వారిని చూడనివ్వలేదని కినుకతో శ్రీరంగని సేవింపకయే కాంచీపురం విచ్చేసిరి. ఇచట కాంచీపూర్ణులు కోవెలలోని శ్రీవరదరాజ స్వామితో ప్రతిరోజు వింజామరం వీస్తూ సాక్షాత్తుగా మాట్లాడుచుండెడివారు. అది తెలిసిన రామానుజులు వారి మూలమున, శ్రీ స్వామివలన నీ క్రింది ఆరు అర్థములను ఆశ్రయించదలచి శ్రీరంగం పయనమైరి.

1. విష్ణువే పరితత్త్వము,
2. జీవేశ్వరులకభేదం నిత్యం,
3 ప్రపత్తియే మోక్షోపాయము,
4. ప్రపన్నులకు మరణకాల స్మృతి అనవసరం
5. దేహమును విడిచిన వెంటనే మోక్షము లభించును.
6. మహాపూర్ణుల నాశ్రయించి పంచసంస్కారములను పొందుము. అని-

శ్రీరామానుజులు మధురాంతకపురము చేరుసరికి శ్రీ కాంచీ పూర్ణులు వీరి నిమిత్తమై వేంచేయుచు చెరువు గట్టున చెట్టు నీడలో వీరిని కలుసుకొనిరి. వెంటనే రామానుజులు వారి వలన శ్రీ వరదరాజస్వామి వాని ఆజ్ఞగా పంచసంస్కారములను బడసిరి. వారిని వెంట బెట్టుకొని కాంచీపురం చేరి, వారివద్ద ఆరు మాసములలో సకల ధర్మముల నధిగమించెను. ఆళ్వార్ల ప్రబంధములనన్నింటిని నేర్చెను. ఇందుచే యామునాచార్యుల వారి మొదటి కోరిక సఫలమయ్యెను.

తదుపరి, శ్రీరామానుజులకు సంసారమునందు విరక్తి కలిగి, తమ అవతార కృత్యమగు పరమత నిరసన స్వమత స్థాపనకును, జైత్రయాత్ర నిర్వహణమునకును, భాగవత

కైంకర్యమునకును ప్రతి బంధకముగా నుండుటచే గృహస్థాశ్రమమును వీడి, స్వేచ్ఛగా ప్రచారమును గావించుటకు శ్రీకాంచీపురమున శ్రీదేవరాజ సన్నిధిలో సన్యాసాశ్రమమును స్వీకరించి "యతిరాజుల"ని పిలువబడిరి. అంత తమ పూర్వాశ్రమ గురువగు యాదవ ప్రకాశులును తన **తల్లి** ప్రేరణ చేతను స్వప్నమునందు సాక్షాత్కరించిన శ్రీదేవరాజస్వామి **వారి ఆజ్ఞ చేతను యతిరాజగు** శ్రీరామానుజుల నాశ్రయించి, వారి వలన పంచ సంస్కారములను **బడసి "గోవింద దాస" నామధారులై** శిష్యులైరి.

**అటు పిదప, అతడు శ్రీరంగమునకేగి** శ్రీరంగనాథునిచే 'విభూతిద్వయ' నాయకత్వమును బడ**సి, వారి ఆజ్ఞచే** అచటి ఆలయమున వైదిక కార్యముల చక్కబరచు చుండిరి. శ్రీరామా**నుజులు**. పిమ్మట, వీరు 'మహాపూర్ణుల' నాశ్రయించి ద్వయ మంత్రార్థమును పొందిరి. అటు తదుపరి, 'గోష్ఠీ పూర్ణుల' వద్ద చరమ శ్లోక రహస్యార్థమును, 'తిరు'మంత్రమును పొందుటకై ఆహార నిద్రాదుల వీడి పదునెనిమిది పర్యాయములు తిరిగియును బడయక, తుదకు శ్రీరంగనాథుని పురుషాకారముచే ఆచార్యుల అభిమాన పాత్రులై వానికి నమ్మకము కలుగు నట్లు పెక్కు శపథములు చేసి మంత్రోపదేశమునందిరి.

అటులే వారినుండి అష్టాక్షరీ మంత్రమును పొందిన వెంటనే, అచట శ్రీ నృసింహ పెరుమాళ్ళ ఉత్సవార్థమునకు విచ్చేసిన భక్తాగ్రేసరులలో ఆర్తి కలవారల కందరకును వినబడునట్లు ఎత్తైన గోపురమెక్కి ఆ మంత్ర రహస్యార్థములనన్నింటిని ఉపదేశించిరి. అదివిని తమ ఆచార్యులు కోపించగా, "స్వామీ! గురు ద్రోహముచే నేనొక్కడనే కుంభీపాక నరకమున కూలుదు గాని, తమ యనుగ్రహముచే వీరందరు పరమ పదమును పొందుదురు గదా!" అనెను.

అంత శ్రీగోష్ఠీ పూర్ణులు రామానుజుల ఔదార్యమునకును, సాహసమునకును సంతసించి, "ఎంబెరు మానారే, నా నాథా!" యని వారిని ఆలింగమొనర్చు కొని, నాటి నుండియు ఈ సిద్ధాంతము 'రామానుజ సిద్ధాంతము' అని పిలువబడవలెనని ఆజ్ఞాపించిరి.

పిమ్మట శ్రీరామానుజులు, శ్రీ యామునాచార్యుల వారు తమకుపదేశించు నిమిత్తమై గుప్తముగా కొందరి శిష్యులకుపదేశించిన రహస్యార్థములు బడయుటకై తరుణ మాసన్నమైనదని, శ్రీమాలాధరుల (తిరుమాలై యాండాన్) నాశ్రయించి తిరువాయ్‌మొళి సాంప్రదాయార్థ కాలక్షేపమును, శ్రీ యామునాచార్యుల వారి కుమారులగు శ్రీ వరరంగార్యుల వలన 'పంచమోపాయమును' పొందిరి.

ఇట్లు క్రమముగ శ్రీ యామునాచార్యుల వారి శిష్యులగు ఐదుగురు గురుపుంగవుల నుండియు సకల రహస్యార్థములను గ్రహించిరి.

తదుపరి శ్రీ రంగనాథుని సేవాతత్పరులగు శ్రీ రామానుజలకు శ్రీయామునాచార్యా

భీష్టములలో రెండవదియగు "శ్రీ భాష్య గ్రంథరచనము" అవశ్య కర్తవ్యమని తోచి, శ్రీశైల పూర్ణుల వద్ద శ్రీవిశిష్టాద్వైత సంప్రదాయకరమగు శ్రీమద్రామాయణమును ఇరువది నాలుగు పర్యాయములు వినియున్న వారగుటచే బోధాయన వృత్తిని కూడ పరిశీలించుట ముఖ్యమని తలంచి కాశ్మీరు క్షేత్రమున జైనాధీనమున నున్న శారదాపీఠమును ఆ గ్రంథముండుట యెరింగి, తమ ప్రియ శిష్యులగు కూరత్తాళ్వారులను వెంట బెట్టుకొని యచటి కేగి బోధాయన వృత్తిని సంగ్రహించి శ్రీరంగమునకు పయనముకాగా, అచటి జైనులాయత్నమునకు విఘ్నము కలిగించిరి. ఐనను రాత్రుల యందా గ్రంథమునంతను పరిశీలించిన ఏక సంథాగ్రాహి యగు కూరీత్తాళ్వారుల బుద్ధి కౌశలము తమకు తోడుకాగా, వక్తులుగను శ్రీ కూరేశులు లేఖకులు గను నేర్పడి ఆ మహద్గ్రంథమును పూర్తి కావించిరి. దీనిచే శ్రీ యామునాచార్యుల కోరిక రెండవది తీరి నట్లయ్యెను.

పిమ్మట వేదార్థ సంగ్రహము, వేదాంత దీపము, వేదాంత సారము, గీతా భాష్యము నిత్య గ్రంథములను రచించిరి. ఒకనాడు శ్రీ రంగనాథుని అభిషేక సమయమున వారి సన్నిధిలో శరణాగతిగద్య, శ్రీరంగ గద్య, శ్రీవైకుంఠ గద్యమును (గద్యత్రయమును) విన్నవించిరి. ఇట్లు సప్త గ్రంథములు వీరిచే రచింపబడినవి.

తమ శిష్యులలో సమర్థులగు "తిరుక్కురుకైప్పిరాన్ పిళ్ళాన్" అను వారిచే 'తిరువాయ్ మొళి'కి వ్యాఖ్యానమును కూడ రచింప జేసిరి. ఈ పనులే వీరు పరమ పురుషునితో ప్రతిజ్ఞ గావించిన 'సోపానరాజి' నిర్మాణము.

**జైత్రయాత్ర :–** స్వేచ్ఛావృత్తికి అలవాటు పడిన శ్రీ రంగార్చకులు వీరి సక్రమ నిబంధనలకు తాళజాలక వీరి నెట్లయినను వధించవలెనను తలంపుతో పెక్కు ప్రయత్నముల గావించి విఫలులైరి. పిమ్మట శ్రీరామానుజులొకనాడు తమ సిద్ధాంతములను ఆసేతు సీతాచల పర్యంతము వెదజల్లు తలంపుతో శ్రీరంగనాథుని అనుమతిని బడసి పెక్కు శిష్య బృందములతో పయనమై మార్గమధ్యమున తటస్థించు పండితులతో వాదించి, వానిని తమకు శిష్యులనుగా చేసి కొనుచు వానిని పంచ సంస్కార పరుల గావించుచు, రాజులను వశీకరించుకొనుచు తిరుపతి మొదలగు క్షేత్రములకేగి అచటి శ్రీస్వామిని సేవించి శంఖ చక్రములను ప్రసాదించిరి.

ఇట్లనేక సంస్కారములనెల్ల స్థిరముగా నెలకొల్పుచు ఉత్తరమున శ్రీజగన్నాథమునకేగి అచట స్వామి సంకల్పము వలన యథాపూర్వమే సాగనిచ్చుచు, శ్రీ కూర్మమును సంస్కరించి, సింహాద్రి నాథుని సేవించి, బదరీ క్షేత్రమున నరనారాయణులను యథాతథముగా సేవించి, శ్రీ వైష్ణవ మతమునంతటను వ్యాపింప జేసిరి.

**శ్రియఃపతికి గురుత్వము :–** ఇట్లసంఖ్యాక, శిష్యసంఘముతో విరాజిల్లు వీరు, వీరి

పరిధవమునకు 'కురంగనగర' పెరుమాళ్ళు తామవతరించి చేయజాలని ఈ మహత్తర జనవశీకరణమునకేమి హేతువని కుతూహలముతో వీరిని ప్రశ్నించగా, ఆస్వామి అనురోధమున తాము ఉన్నత సింహాసనమున కూర్చుండి స్వామినేలపై కూర్చుండగా, వానికుడి చెవియందు ఈ మంత్ర రత్నమును ఉపదేశించి వారికి 'శ్రీవైష్ణవ నంబి' యని పేరు పెట్టిరి. తద్వారా జనులకే గాక, శ్రీరామానుజులు భగవానుడగు శ్రియః పతికిని ఆచార్యులై విరాజిల్లిరి.

**శ్రీ భాష్యకార బిరుదు ప్రాప్తి :-** శ్రీ మద్రామానుజులు తమ శ్రీభాష్య గ్రంథమును శిష్యులచే చదివించుచు, తిరిగి శ్రీ శారదాపీఠమును దర్శించి ఆమె ప్రార్థనపై కప్యాస శృత్యర్థము నుపన్యసించి ఆమెను సంతసింప జేసిరి. పిమ్మట నాశారదాదేవి తనకు పరిశీలనకై మొసంగబడిన 'శ్రీ భాష్య కోశమును' ఆదరమున శిరమున నిదుకొని ఇన్నాళ్ళకు తనకు సదర్థములు ప్రసాదించిరని ఆనందించి, పూర్వులు ఆపాదించిన అపార్థముల వల్ల కలిగిన లోజ్వరము తొలగినదని రామానుజులకు 'శ్రీ భాష్యకారులు' అని బిరుదమునొసంగి వారికి ఆరాధనార్థమైన తనచే నారాధింప బడుచున్న హయగ్రీవ విగ్రహమును ప్రసాదించెను. ఆ విగ్రహమునిప్పటికిని శ్రీరంగమున 'ఉదయవరుల' సన్నిధికి ప్రక్కసేవించవచ్చును.

**పరాశర నామ కరణము :-** శ్రీ రామానుజులు తమ ప్రియ శిష్యులగు శ్రీకూరత్తాళ్వారులకు శ్రీరంగనాథుని ప్రసాద మహిమచే జనించిన ముద్దు బిడ్డలిరువురకును "శ్రీ పరాశర, శ్రీ వేదవ్యాస భట్టర్లను" తిరు నామములుంచి శ్రీయామునాచార్యుల మూడవ కోరికను నెరవేర్చిరి.

**క్రిమికంఠుని ఉపద్రవము :-** అట్టితరి చోళదేశమును 'నాలూరాన్' అనుశైవ మతస్థుడు పాలించు చుండెను. వాడు శ్రీవైష్ణవుల యందుండు అసహనముచే, శివును కంటెగొప్ప దైవము లేదని అంగీకరింప జేయుటకై వైష్ణవులను బాధించుచుండెను. వీరలందరకు ప్రముఖులగు మన రామానుజులను ఒప్పిస్తే అంతామారినట్లే, అని తలచి వీరిని బాధింప సంకల్పించెను.

రామానుజుల వృత్తాంతమును కర్ణికాకర్ణికా గావిని, తామింకను నిర్వహింపవలసిన మహత్కార్యములకు విఘ్నము రాకుండుటకై కాషాయవస్త్రాలను విడిచి తెల్లని వస్త్రధారులై మైసూరు రాజ్యములో ప్రవేశించి తిరిగి అచట కాషాయ దండ ధారణ చేసిరి.

అచట జైనరాజులను తమ పాండిత్య ప్రకర్ష చేతను, నిజ సహస్ర ఫణమండిత దివ్యరూప తేజముతోను జయించి, వారలను తమ పాదాశ్రితుల గావించుకొని, 'తిరునారాయణ' పురమునకు వేంచేసిరి.

రామానుజులకు బదులు వాని ఆచార్యులు 'మహా పూర్ణులు, కురత్వాళ్వారులు' ఇరువురును క్రిమికంఠుని ఆస్థానమునకు చేరిరి. వారితో వాదన జరిగినను అంగీకరించని ఆ దుష్టుడు వీరిరువురి నేత్రములను తీయించదలచగా, అతనిచే తొలగించుకో నెంచక, తామేతొలగించు కొనిరి

తిరుగు ప్రయాణములో మహాపూర్ణులు బాధనోర్వజాలక దేహమును చాలించిరి. కూరత్తాళ్వారు కాంచీపురం చేరి పరమ పదానికై శ్రీవరదరాజుని ప్రార్థించిరి.

రామానుజులు తిరునారాయణపురంలో సంచరించు చుండగనే ఒకనాటి రేయి స్వప్నమున సాక్షాత్కారించిన శ్రీరామప్రియ పెరుమాళ్ళ నుద్ధరించి సక్రమముగా ప్రతిష్ఠించిరి. ఉత్సవులు ఢిల్లీ పాదుషా అపహరించెనని తెలిసి, ప్రబల సన్నాహముతో ఢిల్లీ పాదుషాను చేరిరి. అతని కుమార్తెచే నారాధింపబడుచున్న 'సంపత్కుమారులు' అనెడి ఉత్సవ విగ్రహమును నేర్పుగా తెచ్చి తిరునారాయణ పురమున ప్రతిష్ఠించి, వైభవముగానచటి ఉత్సవములను స్వయంగా జరిపించుచు తమ సామర్థ్యమును ఔదార్యమును చాటిరి.

అంతలో నచట క్రిమికంఠుని దుర్మరణ వార్త శిష్యుల వలన ఉడయవరులకు తెలిసెను. వెంటనే శ్రీరంగని చిరతర విశ్లేషమునకు విచారించుచున్న రామానుజులు తిరిగి శ్రీరంగమునకు శిష్య బృందముతో వేంచేసి, పూర్వముగానే రంగానాధుని ఉత్సవాదులను జరిపించుచు, తమ అనంతరం కూడా సిద్ధాంత ప్రచారము అవిచ్ఛిన్నముగా సాగుటకై తమ శిష్యులలో నుండి 74 మంది పీఠాధిపతులను, నలుగురు సింహాసనస్థులను, 774 మంది యతులను, 1200 మంది ఏకాంగులను నేర్పరచిరి

ఇక తమ ఎడబాటును సహింపజాలక పిలిపించుటను శిష్యుల యందలి యనుగ్రహముచే తమ ఆకృతిగమూడు శిలావిగ్రహములను నిర్మింపజేసి, వాటికి సమస్త కళావాహనముల జేయించి, తాము స్వయముగానా విగ్రహములను ఆలింగన మొనర్చుకొని తమ తేజమునందు ప్రవేశింప జేసి, శ్రీరంగము, శ్రీ పెరంబుదూరు, మేల్కోటియను తిరునారాయణ పురమనెడు త్రిక్షేత్రముల యందును శాస్త్రోక్తముగా ప్రతిష్ఠింప జేసిరి.

## శ్రీరామానుజుల నవసంఖ్య సోపాన గ్రంథరచనలు.

| | | |
|---|---|---|
| 1. శ్రీభాష్యం, | 2. వేదాన్త దీపం, | 3. వేదాన్త సారం, |
| 4. వేదార్థ సంగ్రహం, | 5. గీతా భాష్యం, | 6. నిత్య గ్రంథం, |
| 7. శరణాగతి విద్య, | 8. శ్రీ రంగ గద్యం, | 9. వైకుంఠగద్యం. |

**శ్రీ రామానుజుల అవతార ప్రస్థానం :–** ఇట్లు తమ అవతార కృత్యములన్నియు నూట ఇరువది (120) సంవత్సరములలో నిర్వహించిన పిమ్మట తమ ప్రస్థాన దశలో

తమ శిష్యులనందరిని రావించి వారికి '82 దివ్య సూక్తుల' నుపదేశించిరి.

గోవిందభట్టరు తొడ యందు శిరస్సును, ఆంధ్ర పూర్ణుల వడి యందు పాదములను నుంచుకొని, మహా పూర్ణుల పాదుకలను తమ దృష్టి పథమున దగ్గరగా నుంచుకొని, శ్రీయామునాచార్యుల పాదములను మనస్సు నిడుకొని ధ్యానించుచు, శిష్యులందరును భృగు, ఆనందవల్లులను, తిరువాయ్‌మొళి మొదలగు దివ్య ప్రబంధములను అనుసంధించుచుండ "మాఘ శుద్ధ దశమీ శనివారమున మధ్యాహ్న సమయమున" బ్రహ్మరంధ్రమును ఛేదించుకొని తమ స్వస్థానమగు పరమ పదమునకు వేంచేసిరి.

ఈ అవతార పూర్వ విశేషమును విచారించిన, 'శ్రీ ఆదిశేషువు' శ్రియః పతిని సేవుంచుటకై, త్రేతాయుగమున శ్రీరాముని అనుకరించు లక్ష్మణునిగను, ద్వాపర యుగమున శ్రీకృష్ణ పరమాత్మకు అన్నగా బలరాముడుగా నవతరించిరి. వీరు శ్రియఃపతికి మిక్కిలిగా తోడ్పడి, తదుపరి కలియుగమున మరల జనులను దృఢమగు పరమపద సోపానముతో దివ్యసౌధమునెక్కించుటకై 'శ్రీరామానుజుల' అవతారమెత్తి తరించిరి.

## "జై యతిరాజు జయజయ"

ఇట్లు వీరి తదనంతరం శ్రీవైష్ణవ సాంప్రదాయమును నిలబెట్టిన మహనీయులు వీరే – 1.సరోముని, 2.భూతయోగి, 3.మహాయోగి, 4.తురుమళిశైయాళ్వార్, 5.నమ్మాళ్వార్, 6.కులశేఖరాళ్వార్, 7.పెరియళ్వారుల, 8.శూడికొడుత్త నాచ్చియార్, 9.విప్రనారాయణులు, 10.తిరుప్పాణియాళ్వార్, 11.తిరుమంగైయాళ్వార్ (పరకాలురు), 12.మధుర కవియాళ్వార్, 13.శ్రీమన్నాథమునులు, 14.పుండరీ కాక్షులు, 15.కురుగైక్కావలప్పన్, 16.మణక్కాల్‌నంబి (శ్రీరామమిశ్రులు), 17.శ్రీఆళవందార్, 18.శ్రీతిరువరంగ ప్పెరుమాళరైయర్ (రంగార్యులు), 19.శ్రీ పెరియ నంబి, 20.శ్రీశైలపూర్ణులు, 21.శ్రీతిరుక్కోటియూర్‌నంబి (గోష్ఠిపూర్ణులు), 22.శ్రీ తిరుమాలై యాణ్డాన్, 23.మారనేరనంబి, 24.శ్రీతిరుక్కచ్చి నంబి (శ్రీ కాంచీపూర్ణులు), 25.ఎంబెరుమానార్ (భగవద్రామానుజులు), 26.ముదలియాణ్డాన్ (దాశరథి), 27.శ్రీకన్దాడై యాణ్డాన్, 28.శ్రీవత్స చిహ్నమిశ్రులు, 29.తెఱ్కాళ్వాన్, 30.శొట్టినంబి (పూర్ణ దేశికులు), 31.పిళ్ళతిరుమల నంబి (శ్రీ శైలార్యులు), 32.శ్రీవంగి పురుత్తనంబి, 33.వడుగనంబి, 34.పుండరీకాక్షర్, 35.తిరుక్కురుగైప్పిరాన్ పిళ్ళాన్, 36.సుందరత్తోళుడైయాన్, 37.ఎమ్బార్ (శ్రీగోవిందదాసర్), 38.శిఱియగోవింద పెరుమాళ్ (ఆంధ్రపూర్ణులు), 39.తిరువరంగత్త ముదనార్ (రంగామృతకవి), 40.శ్రీ అరుళాళప్పెరుమాళ్ (వరదగురువు) 41.శ్రీఆళ్కొణ్డ వెళ్ళి జీయర్. 42.శ్రీ వేదాన్త దేశికులు, 43.శ్రీ బ్రహ్మ తంత్ర స్వతంత్ర జీయర్, 44.పెరియభట్టర్ (శ్రీరామపిళ్ళై), 45.పెరియభట్టర్ (పరాశర భట్టర్), 46.నలన్తికళ్ నారాయణ జీయర్, 47.శ్రీ నంజీయర్ (వేదాన్తి), 48.నమ్బిళ్ళై (లోకాచార్యర్),

49.కన్దాడైతోప్పర్, 50.నడువిల్ తిరువీధి ప్పిళ్ళై భట్టర్ (ఉద్దండ భట్టర్), 51.పిన్బళకియ పెరుమాళ్ జీయర్, 52.ఈ యూణ్డి మాధవర్, 53.ఈయూణ్ణి పద్మ నాభర్, 54.నాలూరాన్ పిళ్ళై (శ్రీ వరాహప్పెరుమాళ్ సైనార్), 55.నాలూర్ ఆచ్చాన్ పిళ్ళై, 56.తిరునారాయణ పురుత్తాయ్, 57.ఇళమ్బిళిశైప్పిళ్ళై (ద్రావిడ వేదాన్త దేశికర్), 58.తిరుప్పతి కేశవాచార్యర్, 59.విళాంశోలై పిళ్ళై, 60.తిరువాయి మొళిప్పిళ్ళై (శ్రీశైలేశులు), 61.మణవాళమామునులు (పెరియ జీయరులు) 62.వానమామలై జీయర్ (వానాద్రి యోగి), 63.పట్టరపిరాన్ జీయర్ (భట్టనాథముని), 64.తిరువేంగడ జీయర్ (వేంకటయోగి), 65.కన్దాడైయణ్ణన్, 66.ప్రీతివాది భయంకరం అణ్ణా, 67.ఎరిమ్బియప్పా (దేవరాజర్), 68.అప్పిళ్ళై జీయర్ (ప్రణతార్తిహరులు), 69.శ్రీఅప్పిళ్ళాన్ (సామ్యరామానుజులు), 70.శ్రీకన్దాడై పోరేత్తినాయర్ (సమరపుంగవులు), 71.ఏట్టూరి శింగరాచార్యర్ (శ్రీశైల నరసింహార్యులు), 72.జీయర్నైనార్ (అభిరాములు), 73.కోయిల్కన్దాడై అప్పన్ (శ్రీనివాస గురువు), 74.ఆత్తాన్ రామానుజ పిళ్ళై, 75.పరవస్తు అణ్ణన్, 76.పరవస్తు అ కియమణవాళ జీయర్, 77.శుద్ధసత్వమణ్ణన్, 78.కోయిల్ కన్దాడైనాయన్.

వీరే ఈ పెరియ తిరుముడి యడవును అనుగ్రహించిరి. గ్రంథ విస్తరణ భీతిచే ముఖ్యుల, ముఖ్యాంశములను మాత్రమే వివరించడమైనది. గమనార్హము.

శ్రీవైష్ణవులకు కులదేవతయగు అనన్తకోటి బ్రహ్మాండనాయకుండగు శ్రీమన్నారాయణుడే. అతడు ఆదిమధ్యాన్త శూన్యుడు. తనతో సమానుడుకాని, అధికుడు కాని లేడు. సర్వోపనిషత్తులచే తెలిసికోదగినవాడు. అవాప్త సమస్త కాముదు. అనన్త కల్యాణగుణ విశిష్టుడు. ఆశ్రయించిన వారికి సర్వసులభుడు. అర్చామూర్తి స్వరూపుడు.

వీరు వేంచేసిన భోగ, పుష్ప, త్యాగ, జ్ఞాన మంటపములు

శ్రీరంగం - భోగ మంటపము,

తిరుమల - పుష్ప మంటపము,

కాంచీపురం - త్యాగమంటపము,

తిరునారాయణ పురం - జ్ఞాన మంటపము,

అళ్వార్లు పాడిన మంగళా శాసనములను బట్టి తిరుపతులు 108. అందు ముఖ్యమైన తిరుపతులు.

శ్లో॥ శ్రీరంగ మంగళమణిం కరుణా నివాసం,
శ్రీవేంకటాద్రి శిఖరాలయ కాలమేఘమ్ ।
శ్రీహస్తిశైల శిఖరోజ్వల పారిజాతమ్,
శ్రీ శం నమామి శిరసాం యదుశైలదీపమ్ ॥

అని చెప్పబడినది.

పెరియ పెరుమాళ్ (శ్రీరంగనాథులు) మూలవిరాట్
పెరియపిరాట్టియార్ (లక్ష్మీదేవి) ఈమెయే శ్రీరఙ్గనాయకి.
సేనముదలియార్ (విష్వక్సేనులు) - వీరికి ఆచార్య శ్రీరఙ్గనాయకి అనుగ్రహించిన ప్రబంధం శ్రీవిష్వక్సేన సంహిత.

☆☆☆

శ్రీవైష్ణవ గురుపరంపరగా నున్న వారిలో కొందరి ప్రముఖుల (అతి మహనీయుల గూర్చి) విశ్లేషణలు.

## సరోముని - (పోయ్‌గైయాళ్వార్)

శఙ్ఖాంశ సంభూతులైన శ్రీపోయ్‌గై యాళ్వార్‌ల అవతార స్థలం తొండమండలం నందలి పెరుమాళ్‌కోయిల్. (ఇదే కాంచీపురం). వీరు స్వర్ణ పుష్కరిణి యందలి తామర పుష్పము నందవతరించిరి. వీరు ద్వాపర యుగం "ఎనిమిది లక్షల అరవైనాలుగు వేల తొమ్మిది వందల" (8,64900) సం.నకు సమానమైన 'సిద్ధార్థి నామ' సం.న. అల్పిశిమాసం. (తులామాసం) శుద్ధ అష్టమీ మంగళవారం శ్రవణానక్షత్రమున అవతరించిరి. వీరి తురు నామములు - కాసారయోగి, సరోమునీంద్రులు.

తిరువారాధనం ఆళ్వార్ కళ్‌నైనార్.
ఆచార్యులు సేనముదలి ఆళ్వార్.

## వీరొనర్చిన మఙ్గళా శాసన క్షేత్రములు

1. శ్రీరఙ్గము, 2. తిరుమల, 3. కాఞ్చీపురం, 4. తిరుక్కోవలూర్

వీరు అనుగ్రహించిన దివ్య ప్రబంధము వైయ్యమ్ తకళియా అని ప్రారంభమైన ముతల్ తిరువన్దాది నూరుపాశురములు.

-☆☆☆-

## భూతయోగి - (పూతత్తాళ్వార్)

వీరు తొండమండలమున సముద్ర తీరమందలి తిరుక్కడల్ మల్లై (మహాబలిపురము) క్షేత్రమున మాధవీపుష్పమున అవతరించిరి. వీరు గదాంశ సంభూతులు. పోయ్‌కై ఆళ్వార్లు అవతరించిన మరునాడు నవమీ తిథి, బుధవారము ధనిష్ఠా నక్షత్రమున అవతరించిరి.

**తిరునామములు** :- 1.భూతయోగి, 2.పూతత్వాళ్వార్, 3.మల్లావరపురాధీశర్.

**తిరువారాధన** :- ఆళ్వార్ కళనైనార్.

**ఆచార్యులు** - సేనముదలి ఆళ్వార్లు.

**వీరొనర్చిన మఙ్గళా శాసనములు దివ్య ప్రదేశములు** :- శ్రీరఙ్గము, తిరుమల, తిరుక్కడల్మల్లై (మహాబలిపురం), తిరుక్కోవలూర్.

**అనుగ్రహించిన ప్రబంధములు** :- అన్బేతకళిఅని ప్రారంభమగు ఇరణ్డాన్దిరువన్దాది నూఱు పాశురములు.

-☆☆☆-

## మహాయోగి - (పేయళ్వార్)

వీరు నన్దకాంశ సంభూతులు - తొండమండలము నందు సముద్ర తీరమున గల మైలాపురము వీరి యవతార స్థలము. ఇచట గల 'మణికై రవము'ను నూతియందు గల 'రక్తాబ్జము' నందవతరించిరి. పూదత్తాళ్వార్ల వతరించిన మరునాడు దశమీ గురువారము. వీరిది తిరునక్షత్రము

**తిరునామములు** :- మహదాహ్వాయములు, పేయళ్వార్, మయిలాధిపర్.

**తిరువారాధనము** :- ఆళ్వార్ కళనైనార్.

**ఆచార్యులు** - సేనముదలియార్.

**వీరొనర్చిన మఙ్గళా శాసనములు దివ్య ప్రదేశములు** :- శ్రీరఙ్గము, తిరుమల, తిరువలిక్కేణి, తిరుక్కోవలూర్.

**అనుగ్రహించిన ప్రబంధములు** :- తిరుక్కణ్డేన్ అని ప్రారంభమగు మూన్ఱామ్ - తిరువన్దాది నూరుపాశురములు.

-☆☆☆-

## తిరుమశైయాళ్వార్

వీరు సుదర్శనాంశ సంభూతులు. వీరి అవతారస్థలం తొండమండలం నగల తిరుమ శై.విభవ సం.మకర మాసం, కృష్ణపక్షమున దశమీ గురువారం మఖానక్షత్రయుక్త తులాలగ్నమునందవతరించిరి. తండ్రి భార్గవమహర్షి. తల్లి కనకాఙ్గియనే దేవకాంత (కనకాఙ్గిమమ్మాళ్). వీరిని పెంచినవారు హరిదాసులు.

**తిరునామములు** :- భక్తి సారులు, మహీసార పురాధీశర్, భార్గవాత్మజులు, తిరుమళిశైయ్యార్, మళిశైప్పిరావు.

వీరు అష్టాంగయోగనిరతులు.

**తిరువారాధనము :-** శొన్నవణ్ణం శెయ్దపెరుమాళ్ (యధోక్తకారి).

**ఆచార్యులు -** సేనముదలి ఆళ్వార్, పురుషకారులు పోయ్గై ఆళ్వార్.

**శిష్యులు -** కణికృష్ణుడు, దృఢవ్రతుడు.

**వీరనుగ్రహించిన ప్రబంధములు :-** నాన్ముకన్ తిరువన్దాది తొంబది యారు పాశురములు, తిరుచ్చన్దవిరుత్తం నూటన్నర పది పాశురములు.

-☆☆☆-

# నమ్మాళ్వార్

వీరు విష్వక్సేనాంశతో అవతరించిరి. వీరి అవతార స్థలం - పాండ్యదేశమందలి తామ్రపర్ణి నదీ తీరమున తిరుక్కురుగూర్. వీరు కలియుగాది ప్రమాది నామసం. నలుబది మూడవ దినమున (అనగా వైశాఖ (వృషభ) మాసం, పన్నెండవ దినమున) శుక్రవారమునాడు శుక్ల పక్ష ౧౪ చతుర్దశీ విశాఖానక్షత్ర యుక్త కర్కాటక లగ్నమున చతుర్థ వర్ణమున తిరుక్కురుజ్గుడి నంబి పెరుమాళ్ళ అనుగ్రహము వలన అవతరించిరి. వీరి తండ్రి కారియార్. తల్లి ఉడయనంగయార్ (నాథనాయకి) వీరిది నమ్మాళ్వార్ల తిరువంశము. వీరి నివాసము నిద్రపోని చింతచెట్టు.

**తిరునామములు :-** 1.కాని మారన్, 2.మారన్, 3.శఠకోపన్, 4.పరాఙ్కుశర్, 5.నమ్మాళ్వార్, 6.వేదమ్ తమిళ్ శెయ్ద పెరుమాళ్, 7.తిరువాయ్ మొప్పెరుమాళ్, 8.ఉదయ భాస్కరర్, 9.తిరునావీరుడయపిరాన్, 10.కురుకేశర్, 11.కురుకైప్పిరాన్, 12.తిరుక్కూర్ గూర్ నమ్బి, 13.తెన్నర్జ్గన్ పొన్నడి, 14.వకుళా భరణర్, 15.అరుళ్మారన్.

వీరికి శిరస్థానీయులు, శ్రీ హస్తములు, భుజములు, శరీరము ఆళ్వారులు, కటి, జఘనము, తొడలు పిక్కలు, నాథయామునాది పూర్వాచార్యులు.

**తిరువారాధన :-** పొలిన్దునిన్నపిరాన్

**ఆచార్యులు :-** సేనముదలియార్

**శిష్యులు :-** మధురకవి ఆళ్వార్, నాథమునులు మొదలగు వారు.

**వీరనుగ్రహించిన ప్రబంధములు :-** సుమారు 31 గ్రంథములు.

వీరు (35) ముప్పది ఐదు సంవత్సరములు భూమండలమున వేంచేసి యుండిరి. అనగా జీవించి యుండిరి.

-☆☆☆-

## కులశేఖరాళ్వార్

వీరు కేరళదేశమందలి 'తిరువంజిక్కళం' అను క్షేత్రమున కౌస్తుభాంశతో అవతరించిరి. వీరు పరాభవ నామ సం.వ కుంభమాసము శుక్ల పక్ష దశమీ గురువారము పునర్వసు నక్షత్రమున అవతరించిరి. వీరి తండ్రి క్షత్రియోత్తముడైన దృఢవ్రత మహారాజు అన్నగారు - శేఅన్

**తిరునామములు** :- కురశేఖర్ ప్పెరుమాళ్, కులశేఖరాళ్వార్, కొల్లికావలన్, శేరలరకోన్, కుక్కుట పురాధీశర్.

**వీరి ఆచార్యులు** :- సేనముదలియాళ్వార్లు.

**తిరువారాధన**:- మన్ననార్, విభవావతారమున చక్రవర్తి త్తిరు మగనార్ (శ్రీరామ చంద్రుని యందును, అర్చావతారమున తిరువేంగడముడయాన్ యందును, మిక్కిలి ప్రావీణ్యము కలవారు. అనుదినము శ్రీవైష్ణవులతో కాలక్షేపమొనర్చుట. శ్రీమద్రామాయణము వినుట. శ్రీరంగ యాత్ర చేయుట మొదలగునవి భగవత కైంకర్యములు వీరి నిత్యకృత్యములు.

**వీరనుగ్రహించిన ప్రబంధములు** :- "ముకున్దమాల" అను స్తోత్రము మొదలగునవి.

**మంగళాశాసనమొనర్చిన దివ్యదేశములు** :- శ్రీరంగం, తిరుమల, ఆళకర్ తిరుమల, అయోధ్య, విత్తువక్కోడు, వణ్పురుడోత్తమ్, తిరుక్కణ్ణపురమ్, తిరుచ్చిత్తరకూడమ్.

వీరు ఇరువది ఏడు (27) తిరునక్షత్రములు వేంచేసి, బ్రహ్మదేశమందలి మన్ననార్ క్షేత్రమున పరమపదించారు.

-☆☆☆-

## పెరియాళ్వార్ (శ్రీ విష్ణు చిత్తులు)

వీరి అవతారస్థలము పాండ్యదేశమందలి శ్రీవిల్లిపుత్తూర్. వీరు గరుత్మంతుని అంశము. జనవం క్రోధన నామ సం. మిధున మాసం, శుక్లపక్షము ౧౧(ఏకాదశీ) ఆదిత్యవారం స్వాతీ నక్షత్రమున అవతరించిరి. తండ్రిగారు బ్రాహ్మణోత్తములైన ముకుందాచార్యులు. తల్లిగారు పద్మమ్మ, అన్నగారు - కులంబియర్. వీరు పూర్వశిఖులు శాలావృత గోత్రులు - బోధాయన సూత్రులు, యజుశ్శాఖీయులు, కుమార్తె - ఆణ్డాళ్.

**వీరి తిరునామములు** :- శ్రీవిష్ణు చిత్తులు పట్టరపిరాన్, భట్టనాథులు అనునవి.

**వీరి ఆచార్యులు** :- సేనముదలియార్.

**తిరువారాధనులు** :- లక్ష్మీనారాయణులు.

వీరి నిత్యకైంకర్యము పుష్పవనమును పెంచి శ్రీస్వామికి మాలికలు సమర్పించుట.

**నివాసము** :- శ్రీవిల్లి పుత్తూరు.

**శిష్యులు**:- పాండ్యరాజు.

**వీరనుగ్రహించిన ప్రబంధములు** :- తిరుప్పల్లాణ్డు 12 పాశురములు, పెరియాళ్వార్ తిరుమొళి 466 పాశురములు. వీరి దివ్యమంగళాశాసన మొనర్చిన దివ్యదేశములు- దక్షిణ మధుర, శ్రీవిల్లి పుత్తూరు, కూడలూరళగర్, తిరుక్కోట్టియూర్, గోకులం, ఉత్తరమధుర, తిరుమల తిరువెళ్ళరై, తిరుక్కురుంగుడి, శ్రీరఙ్గం, కుంభకోణం, తిరువనన్తపురం, కణ్ణామెన్నుంకడినగర్.

వీరు 85 సంవత్సరములు వేంచేసి, తదుపరిపరమ పదించారు.

-☆☆☆-

## శూడి కొడుత్తనాచ్చియార్ - (ఆణ్డాళ్) శ్రీ గోదాదేవి చరిత్ర రచయిత

(అముక్త మాల్యద)

భూదేవి అవతారస్థలము పాండ్యమండల మందలి శ్రీ విల్లి పుత్తూరు వీరి అవతారస్థలము. పెరియాళ్వారుల నన్దన వనమందలి తిరుత్తుళాయ్ (తులసి) కుదురునందు అవతరించిరి. వీరు 'నళ'నామ సంవత్సరము కర్కాటక మాసం శుక్ల పక్షము చవితి మంగళవారం **పుబ్బా** నక్షత్రము వరీయాన్నామ **యోగము**, భద్ర కరణం తులా లగ్నము మధ్యాహ్న కాలమున అవతరించిరి. పెరియాళ్వారుల గృహమున పెరిగిరి.

శూడి కొడుత్తనాచ్చియార్, గోద, ఆణ్డాళ్, ఆళ్వారు, తిరుమకళ్, అనునవి వీరి తిరునామములు. నూట ఎనిమిది దివ్యదేశములందును వీరు వేంచేసియున్నారు. వీటిలో ప్రధానమైనది శ్రీవిల్లి పుత్తూరు.

**వీరి ప్రబంధనములు** :- తిరుప్పావై, నాచ్చియార్.

**వీరి మంగళా శాసనములు చేసిన క్షేత్రములు** :- 1.తిరువాయ్ ప్పాడి (గోకులము) 2.తిరుప్పా ఱ్కడల్ (క్షీరార్ణవం), 3.ఉత్తర మధుర, 4.శ్రీవిల్లి పుత్తూరు, 5.శ్రీరంగం, 6.తిరుమల క్షేత్రములు.

**వీరి తిరువారాధనము** :- నంబెరుమాళ్.

**వీరి ఆచార్యులు** :- పెరియ పెరిమాళ్.

-☆☆☆-

## విప్రనారాయణులు (తొణ్డరడిప్పొడియాళ్వార్) - (భక్తాంఘ్రి రేణువు)

వీరి అవతార స్థలము చోళ దేశమందలి కావేరీ నది తీరమునగల

'మణ్డఙ్గుడి'యను అగ్రహారము. వీరు వనమాలాంశ సంభూతులు. కలియుగాది నూట ఎనిమిది సంవత్సరములు గడిచిన పిమ్మట 'ప్రభవ' నామ సంవత్సరం ధనుర్మాసము జ్యేష్ఠ నక్షత్రమున అవతరించిరి. వీరి తండ్రిగారు సకల వేద విశారదులైన పూర్వశిఖ బ్రాహ్మణోత్తములు.

"విప్రనారాయణులు, భక్తాఙ్ఘ్రిరేణువు, అన్బర్‌తాళ్ తూళి" అనునవి వీరి తిరునామములు.

**ఆచార్యులు** :- సేనముదలియార్.
తిరువారాధన నంబెర్‌మాళ్. వీరు బ్రహ్మచర్యా శ్రమ నిరతులు. వైష్ణవుల యిండ్లలలో మధూకరమెత్తి జీవించెడివారు. పుష్పవనం పెంచి మాలాకైంకర్యం చేసెడి వారు. శ్రీరంగం వీరి నివాసము మంగళాశాసనమొనర్చిరి.
వీరనుగ్రహించిన ప్రబంధములు :- తిరుప్పళి, తిరుమాలై 105 సం.లు జీవించిరి.

-☆☆☆-

## తిరుప్పాణి యాళ్వార్ (మునివాహనులు)

వీరు శ్రీవత్సాంశమున చోళదేశమున గల శ్రీరఙ్గంనకు సమీపాన తిరుక్కావేరి నదీతీరమునగల ఉరైయూర్‌న అవతరించిరి. వీరువడ్ల కంకి యందు అయోనిజులుగా అవతరించిరి. పంచమ వర్ణమున పెరిగిరి. దుర్మతి నామ సం.కార్తీక పూర్ణిమ బుధవారం రోహిణీ నక్షత్ర జాతకులు. (సుమారు కలియుగాది 120 సం.గడచిన పిమ్మట) పాణ్ పెరుమాళ్, పాణర్, యోగివాహనులు, గాయక సార్వభౌములు అనునవి వీరి తిరునామములు. విద్య - "గానవిద్య" ఆచార్యులు - సేనముదలియార్, తిరువారాధన - నంబెరుమాళ్, శిష్యులు - సారఙ్గముని. వీరిప్రబంధం - అమలనాది పిరాన్. వీరి దివ్యమఙ్గళాశాసనం శ్రీరంగం, తిరుమల 50 సం.ల జీవనం.

శ్లో॥ మేషార్ద్ర సంభవం విష్ణోః దర్శన స్థాపనోత్సుకం ।
తుండీర మండలే శేష మూర్తిం రామానుజం భజే ॥

శ్లో॥ శేషో వా సైన్య నాథో వా శ్రీపతిర్వేతి సాత్వికైః ।
వితర్క్యాయ మహాప్రాజ్ఞైః భాష్యకారాయ మంగళం ॥

★★★



శ్లో॥ పూజ్యాయ రాఘవేంద్రాయ సత్యధర్మరతాయచ।
భజతాం కల్పవృక్షాయ నమతాం కామధేనవే ॥

# 29. ద్వైత మతాచార్య శ్రీ మధ్వాచార్యుల గురు పరంపర

మన దేశంలో యెందరో మహనీయులు అవతరించి, ఆద్యంతం హృద్యంగా, ఆశ్చర్యస్ఫోరకంగా, అనితర సాధ్యమైన మహిమలతో నలుదిక్కుల వెలుగొందుచు ఆధ్యాత్మిక పరిమళంతో ఎందరో భక్తులను తరింపజేయ ఆచార్యవరేణ్యులు సర్వులకు గురుతుల్యులైరి.

అట్టి మహనీయులలో ఆచార్యత్రయం ఒకటి. వారే శ్రీశంకరాచార్యులు. శ్రీరామానుజాచార్యులు, శ్రీమధ్వాచార్యులనువారు. అద్వైత మతాచార్యులుగా శ్రీశంకరాచార్యులు. విశిష్టాద్వైత మతాచార్యులుగా శ్రీరామానుజాచార్యులుగా ప్రఖ్యాతులైరి. వీరిరువురికి భిన్నంగా ద్వైతమతాచార్యులుగా శ్రీమధ్వాచార్యులు ప్రఖ్యాతులైరి.

అద్వైతమనునది, జీవాత్మకు పరమాత్మకు అభేదం. విశిష్టాద్వైతమనునది. వైష్ణవం, విష్ణువేమూల సత్యమనుట. కాని, ద్వైతం సద్వైష్ణమని, తమ సిద్ధాంతప్రకారం జీవుడు, పరమేశ్వరుడు భిన్నులని, జగత్తు మిథ్య కాదని, అది సత్యమని, శ్రీహరియే సర్వోత్తముడని, అతడే పరబ్రహ్మయని, వీరిని గూర్చి తెలుసుకోవడం జ్ఞానమని, ఆ జ్ఞానమే మోక్ష సాధనమని సిద్ధాంతీకరించిరి. ఎవరెట్లు సిద్ధాంతీకరించినను, సర్వులు ఆధ్యాత్మికాచార్యులేయని విశ్వ సిద్ధాంతము.

శ్రీ మధ్వాచార్యులు క్రీ.శ. 1199లో నేటి కర్ణాటక రాష్ట్రంలోని 'ఉడిపి'కి సమీపంలో 'బెల్లె' అనే గ్రామంలో "మధ్యగేహుడు, వేదవతి" అనే పుణ్యదంపతులకు జన్మించారు. వీరి పూర్వాశ్రనామం "వాసుదేవుడు". తమ ఇరువై అయిదవ ఏట సన్యసించి, "ఆనందతీర్థ భగవత్పాదులనే ఆశ్రమ నామం స్వీకరించిరి. వీరి గురువు అచ్యుత ప్రేక్షకాచార్యులు. శ్రీహరి ఆజ్ఞతో వాయుదేవుడే రామావతార కాలంలో ఆంజనేయుడిగా, శ్రీకృష్ణావతార కాలంలో భీమసేనునిగా, కలియుగంలో మధ్వాచార్యులుగా నవతరించాడని చెబుతారు.

## అవతార విశేషాలు

శ్లో॥ ప్రహ్లాద రాజః ప్రథమో ద్వితీయో వ్యాసరాజః ।
రాఘవేంద్ర స్తృతీయస్తు భగవత్కార్య సాధకః ॥

దేవలోకమునందు భగవత్పూజా చింతనాపరుడగు ప్రధానుడుగా "శంకుకర్ణుడు" వినుతికెక్కెను. శ్రీహరియును ధర్మప్రచారమొనరించుటకు, ప్రజలను సముద్ధరింపజేయ శంకుకర్ణుడే తగినవాడని మదినెంచెను. అట్టి శ్రీహరియోగమున ఈ శంకుకర్ణుడు మూడు

దివ్యావతారములను దాల్చెను. అందు ముమ్మొదటిది ప్రహ్లాదవాతారం. రెండవది వ్యాసరాయలు. మూడవది శ్రీరాఘవేంద్రులు.

ప్రహ్లాదుడు రాక్షస కులమున పుట్టినను, నారదుని ఉపదేశ బలంతో శ్రీహరిభక్తుడై, శ్రీహరిని నిందించిన తండ్రియగు హిరణ్యకశిపుని మరణమునకు కారకుడై, తుదకు శ్రీహరి పాదపద్మముల సేవలో అంకితుడయ్యెను.

అటుపిదప "శ్రీ వ్యాసరాయలు" సీతమ్మ రామాచార్యులను పుణ్యదంపతుల కుమారుడుగా జన్మించి వేదాంత గురువుగా పుణ్యశ్లోకుడుగా మినుతికెక్కెను. శ్రీశ్రీ పాదరాయలకడ వ్యాసరాయలు వేదాంతము నభ్యసించిరి. ద్వైతమత పీఠము నలంకరించిన శ్రీ వ్యాసరాయల భక్తి జ్ఞాన వైరాగ్యములకు ముదమొంది శ్రీగోపాలకృష్ణుడీ మహనీయునకు దర్శన భాగ్యం ప్రసాదించెను.

వ్యాసరాయలు తిరుమల క్షేత్రం చేరి, శ్రీవేంకటేశ్వరుని దాదాపు పన్నెండు సంవత్సరాలు ఆగమోక్త విధానముగా పూజలు సలిపిరి. అట్టి పూజామహిమతో శ్రీకృష్ణదేవరాయల యనంతరం ఆ గద్దెనధిరోహించుటకు కారణం కాగా, ముందుగా ఆ గద్దెనెక్కిన శ్రీకృష్ణదేవరాయలకు పట్టిన "కుహూ"యను దుర్యోగము వీరికి సంప్రాప్తమగు ప్రారంభముననే తెలిసి శ్రీ వ్యాసరాయలు చివాలున ఆ గద్దె దిగి తమపైనున్న వస్త్రమును సింహాసనంపై బడవైచిరి. ఆ వస్త్రం మండి బూడిదయైనది. దానితో శ్రీకృష్ణదేవరాయల 'కుహు' దుర్యోగము తొలగిపోగా, వారు వ్యాసరాయల మహిమను కొనియాడిరి.

అట్టి తపశ్చక్రవర్తియగు శ్రీ వ్యాసరాయల వారు అనేక చోటులలో ఆంజనేయస్వామివారి విగ్రహములను ప్రతిష్ఠించిరి. వాటిలో తుంగభద్రానదీ తీరమునందు హంపి క్షేత్రమున, అటులే పాలమూరు జిల్లాలోని శ్రీకృష్ణానదీ తీరమునందున్న బీచుపల్లి క్షేత్రము మరియొకటి.

ఇట్టి మహానుభావుడు ద్వైత వేదాంత సామ్రాజ్యమును తొంబది సంవత్సరములేలి "విళంబి" సం.న ఫాల్గుణ బహుళ విదియనాడు ఆనెగొంది సమీపమున తుంగభద్రానదీ తీరమున బృందావన ప్రవేశమొనరించినారు.

ఇచట ఇంకను ఎనమండ్రుగురుల ద్వైతపీఠాధిపతుల బృందావనములు కలవు. అట్టి దివ్యస్థలం "నవబృందావనమ"ని పేరు గాంచినది.

ద్వైతమత సంప్రదాయమునకు చెందిన పురాతన పీఠములలోనొకటి విజయనగరమునందు నెలకొనియుండెను. ఆ పీఠమునకు వరుసగా అధిష్ఠించిన వారిలో శ్రీమధ్వాచార్యులనువారు ప్రథములని ప్రసిద్ధి.

ఒకానొక సమయాన శ్రీమధ్వాచార్యుల వారు సముద్ర తీరమున నిలిచి యుండెను. అట్టితరి ఆ సముద్రమున తుఫాను చెలరేగగా, నడిసముద్రాన నున్ననొక నావ అల్లకల్లోలమగుచుండగా శ్రీ ఆచార్యులవారి దృష్టిలో పడెను. వెంటనే వారు తన పవిత్రతమమగు **కాషాయ** వస్త్రమును ఊపుచు నావను సురక్షితముగా ఒడ్డునకు జేర్చెను. దానితో అందున్న **ప్రయాణీకులు ప్రాణము**ల దక్కించుకొనిరి. అందుకని ఆ నౌకాధిపతి శ్రీఆచార్యుల **మహనీయతకు కృతజ్ఞతగా నౌకయందు**న్న అమూల్య వస్తువులను కానుకగానివ్వ**బోగా, వారు వాటి**నన్నించిని **నిరాకరించి, అందు**న్న గోపీచందనపు ముద్దను గ్రహించెను.

అదేమోకానీ, **అం**దు అనల్పశిల్ప కళానైపుణ్యమున తీర్చిదిద్దబడిన దశావతార వెండిపీఠమొకటి, మరియు మంథాన శ్రీకృష్ణ విగ్రహమొకటి బయల్పడెను. విగ్రహమును "ఉడిపి" పీఠమున ప్రతిష్ఠించిరి.

తదుపరి ఆ వెండి పీఠమునకు సరిపడు శ్రీరాముల విగ్రహమును చేయించి, అందలంకరింపజేసి పూజాదికముల గావించిరి. ఆ శ్రీరాముల విగ్రహమునకు దిగ్విజయరాములని పేరిడిరి.

అట్లు కొంతకాలమునకు శ్రీమధ్వాచార్యులవారు ఆ ఆశ్రమమట్టిని పిడికిలి యందిడుకొని అదిమిపట్టగా ఆ మట్టి సాలగ్రామ రూపము దాల్చినది. అటులే ఎనిమిది సాలగ్రామ రూపాలను రూపొందింపజేసి, వాటిని శ్రీమధ్వాచార్యుల కప్పగించిరి. వీటినే శ్రీవ్యాసముష్టి సాలగ్రామములని వినుతికెక్కెను.

అట్లుండగా -

పూర్వం దేవశిల్పి వరేణ్యుడగు "విశ్వకర్మ" తన కళా కౌశలముట్టి పడునట్లు చేజేతుల శ్రీమూలరాముల విగ్రహమును బంగారముతో నిర్మించి బ్రహ్మదేవునకొసంగెను.

ఆ బ్రహ్మదేవుడు దానిని జాబాలికిని, జాబాలి పరమేశ్వరునకు, అట్లు పరంపర ప్రసాదింపబడుచు, తుదకు కళింగ దేశాధిపతులగు గజపతుల దేవతార్చన పీఠమునలంకరించి యుండినది. వారిలో తుదకునొక పసిబాలుడు ఆ రాజ్యమునకు వారసుడుగా నిలువగా, రాజ్యభద్రతకు ప్రతినిధిగా అన్వేషణకై ఆ రాజ్యమంత్రులెల్లరు ఆలోచించినొక భద్రగజమునకొక పూర్ణకుంభమును, ఒక పూలదండనునొసగి వదలిరి.

అది తిరిగి తిరిగినొక చెఱువుగట్టున స్నానార్థమై నిలిచియున్న "శ్రీనరహరి తీర్థులను"వారిని చేరి, పూర్ణకుంభోదకముచే వారిని అభిషేకించి, వారి మెడలో పూలదండను అలంకరింపజేసి వారిని మూపుపైనెక్కించుకొని రాజమందిరమునకు జేరెను. ఆమంత్రులు

కళింగరాజ ప్రతినిధిగా నియమించుకొనిరి. ఈ నరహరితీర్థులు శ్రీమధ్వాచార్యుల శిష్యుడే.

కొంతకాలమునకు ఆ కళింగ రాజకుమారుడు పెరిగి పెద్దవాడై పట్టాభిషిక్తుడయ్యెను. ఆ సంతోషంలో రాజకుమారుడు శ్రీనరహరితీర్థుల వారికి, పూర్వం నుండి అర్చింపబడు శ్రీమూలరాముల బంగారు విగ్రహమును కానుకగా సమర్పించుకొనెను. దానిని వారు తన గురువగు శ్రీమధ్వాచార్యుల వారికొసగగా, వారి శ్రీమఠమునందే శ్రీమూలరాముల విగ్రహము **నిత్యపూజలందు కొను**చుండెను. దానితోబాటు శ్రీ వేదవ్యాసుల వారందించిన సాలగ్రామ**ములకును, దిగ్విజయ రాము**లకును, మరియు శ్రీజయరామ శ్రీవైకుంఠ వాసుదేవ సాలగ్రామములకును నిత్యపూజలు జరుగుచుండెను.

ఈ మధ్వాచార్యులే బ్రహ్మ సూత్రాలకు భాష్యం రచించారని, ఆ భాష్యానికి శ్రీ సుశీలేంద్రాచార్యులను వ్యాకరణాధ్యాపకులు "ద్వారకానాధ్" అనువారే "అనువ్యాఖ్యానం" రాశారు. ఆ అనువ్యాఖ్యానానికి 'శ్రీన్యాయసుధ' పేరుతో 'జయతీర్థులవారు' వ్యాఖ్యానం రచించిరి. శ్రీరాఘవేంద్రులవారి "పరిమళవ్యాఖ్య" న్యాయసుధకు వ్యాఖ్యానమే. ఈమధ్వ పరంపరలో "శ్రీజయతీర్థులు" ఆరవ ఆచార్యులుగా, "శ్రీసుధీంద్ర తీర్థుల"ను వారు పదునారవ ఆచార్యులుగా, వినుతికెక్కియుండిరి. ఆ పరంపరలో వీరు మాత్రము విద్యాధికులుగా వేనోళ్ల పొగడబడిరి. ఆ గురుపరంపరలో వరుసగా పీఠాధిపతులిట్లుండిరి.

శ్లో॥ శ్రీ శాదిదేవతారమ్భాం శ్రీ మన్మధ్వసుమధ్యమాం ।
సాక్షాన్మద్గురుపర్యంతాం వందే గురుపరంపరాం ॥

1. శ్రీ హంసనామక పరమాత్ములు
2. శ్రీ చతుర్ముఖ బ్రహ్మదేవులవారు
3. శ్రీ సనక తీర్థులు
4. శ్రీ సనందన తీర్థులు
5. శ్రీ సత్కుమార తీర్థులు
6. శ్రీ సనాతన తీర్థులు
7. శ్రీ దూర్వాస తీర్థులు
8. శ్రీ జ్ఞాననిధి తీర్థులు
9. శ్రీ గరుడవాహన తీర్థులు
10. శ్రీ కైవల్య తీర్థులు
11. శ్రీ జ్ఞానేశ తీర్థులు
12. శ్రీ పర తీర్థులు
13. శ్రీ సత్యప్రజ్ఞ తీర్థులు

| | | |
|---|---|---|
| 14. | శ్రీ ప్రాజ్ఞ తీర్థులు | |
| 15. | శ్రీ అచ్యుత ప్రేక్షకాచార్యులు | |
| 16. | శ్రీ మన్మధ్వాచార్యులు | మాఘశుక్ల 9 |
| 17. | శ్రీ పద్మనాభ తీర్థులు | కార్తీక కృష్ణ 14 |
| 18. | శ్రీ నరహరి తీర్థులు | పుష్య కృష్ణ 7 |
| 19. | శ్రీ మాధవ తీర్థులు | భాద్రపద కృష్ణ 30 |
| 20. | శ్రీ మదక్షోభ్య తీర్థులు | మార్గ కృష్ణ 5 |
| 21. | శ్రీ జయతీర్థులు(శ్రీ మట్టీకాచార్యులు) | ఆషాఢ కృష్ణ 5 |
| 22. | శ్రీ విద్యాధిరాజ తీర్థులు | వైశాఖ శుక్ల 3 |
| 23. | శ్రీ కవీంద్ర తీర్థులు | చైత్ర శుక్ల 9 |
| 24. | శ్రీ వాగీష తీర్థులు | చైత్ర కృష్ణ 3 |
| 25. | శ్రీ రామచంద్ర తీర్థులు | వైశాఖ శుక్ల 10 |
| 26. | శ్రీ విభుధేంద్ర తీర్థులు | మార్గ శుక్ల 6 |
| 27. | శ్రీ జితామిత్ర తీర్థులు | మార్గ కృష్ణ 30 |
| 28. | శ్రీ రఘునందన తీర్థులు | కార్తీక కృష్ణ 8 |
| 29. | శ్రీ సురేంద్ర తీర్థులు | పుష్యశుక్ల 12 |
| 30. | శ్రీ విజయీంద్ర తీర్థులు | జ్యేష్ఠ కృష్ణ 13 |
| 31. | శ్రీ సుధీంద్ర తీర్థులు | ఫాల్గుణ కృష్ణ 2 |
| 32. | శ్రీ రాఘవేంద్ర తీర్థులు (శ్రీ గురుసార్వభౌములు) | శ్రావణ కృష్ణ 2 |
| 33. | శ్రీ యోగీంద్ర తీర్థులు | మాఘశుక్ల 10 |
| 34. | శ్రీ సూరీంద్ర తీర్థులు | జ్యేష్ఠ శుక్ల 2 |
| 35. | శ్రీ సుమతీంద్ర తీర్థులు | అశ్వయుజ కృష్ణ 12 |
| 36. | శ్రీ ఉపేంద్ర తీర్థులు | మార్గ కృష్ణ 8 |
| 37. | శ్రీ వాదీంద్ర తీర్థులు | జ్యేష్ఠ శుక్ల 9 |
| 38. | శ్రీ వసుధేంద్ర తీర్థులు | అశ్వయుజ కృష్ణ 7 |
| 39. | శ్రీ వరదేంద్ర తీర్థులు | ఆషాఢ శుక్ల 6 |
| 40. | శ్రీ ధీరేంద్ర తీర్థులు | ఫాల్గుణ శుక్ల 13 |
| 41. | శ్రీ భువనేంద్ర తీర్థులు | వైశాఖ కృష్ణ 7 |
| 42. | శ్రీ సుబోధేంద్ర తీర్థులు | చైత్ర కృష్ణ 3 |
| 43. | శ్రీ సుజనేంద్ర తీర్థులు | కార్తీక కృష్ణ 8 |
| 44. | శ్రీ సుజ్ఞానేంద్ర తీర్థులు | శ్రావణ కృష్ణ 4 |

| | | |
|---|---|---|
| 45. | శ్రీ సుధర్మేంద్ర తీర్థులు | పుష్య కు. 5 |
| 46. | శ్రీ సుగుణేంద్ర తీర్థులు | మార్గ శు. 15 |
| 47. | శ్రీ సుప్రజ్ఞేంద్ర తీర్థులు | మాఘ కృ. 6 |
| 48. | శ్రీ సుకృతీంద్ర తీర్థులు | అశ్వయుజ శు. 10 |
| 49. | శ్రీ సుశీలేంద్ర తీర్థులు | ఆషాఢ శు. 3 |
| 50. | శ్రీ సువ్రతీంద్ర తీర్థులు | వైశాఖ శు. 12 |
| 51. | శ్రీ సుయతీంద్ర తీర్థులు | పుష్య శు. 2 |
| 52. | శ్రీ సుజయీంద్ర తీర్థులు | మాఘ సు. 4 |

శ్లో॥ ఆంధ్రత్వమాంధ్ర భాషాచ ప్రాభాకర పరిశ్రమం ।
తత్రాపి యాజూషీ శాఖా నాల్పస్య తపసఽఫలమ్ ॥ - (అప్పయ దీక్షితులు)

వీరి పరంపర యిట్లుండగా ద్వైతమతాచార్యులు శ్రీసురేంద్ర తీర్థుల వారు ఉపవాస వ్రతములనాచరించుట యందు మక్కువ కల్గియుండిరి. వీరి పాండిత్య ప్రతిభలు నిరుపమానములు.

కాలక్రమముగా చోళమండలమున తంజాపురం నందు జగద్విఖ్యాతి నార్జించిన శ్రీ మదప్పయదీక్షితుల వారు అద్వైతమత వ్యాప్తికి కంకణము గట్టుకొని యుండగా, ఆ సమయాన వారి సమకాలీనుడుగా తాతాచార్యులను వారు విశిష్టాద్వైత మతమును విశ్వతోముఖ వ్యాప్తినొందించిరి. ఈ ఉభయులిట్లు సూర్యచంద్రుల వలె పీఠములలంకరించి రాజోపచారములు పొందుచుండిరి.

వారికి తోడుగానేమో! శ్రీ సురేంద్ర తీర్థులవారు ద్వైతమత స్థాపనకై సంచారార్థముగా ఆ ప్రాంతమునకు రాగా, ఆ త్రిమతప్రవక్తల మేలుకలయికతో వారి ముగ్గురి కీర్తి ప్రతిష్ఠల పూలవాసనల ఘుమఘుమలు దిగంతముల వ్యాపించినవి.

ఇట్లు సురేంద్రతీర్థుల వారు సంచారమొనరించుటలో ఆ మఠ నిర్వహణ భారము వారి శిష్యుడగు శ్రీ విజయేంద్ర తీర్థుల వారిపై నుంచబడెను. అటుపిదప శ్రీ సురేంద్ర తీర్థులు మధుర చేరి అందే దేహమును వదలి బృందావనం ప్రవేశించిరి.

ఇట్టి మధ్వ పరంపరలో, పదునారవ శతాబ్దిలో విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు కర్ణాటాంధ్ర ప్రాంతాలను విజయవంతముగా పరిపాలించుతరి, వారి చల్లని ఏలుబడి మిక్కిలి ప్రసిద్ధికెక్కెను. వారి ఆస్థానములోనే "శ్రీకృష్ణభట్టు" అనే పండితుడుండేవాడు. ఇతడు వీణావాదనంలో దిట్ట. వీరి గోత్రం గౌతమస. ఇంటిపేరు 'బీగేముద్ర'. వారి కుమారుడు కనకాచలభట్టు. మనుమడు, అనగా కనకాచలభట్టు కుమారుడు తిమ్మనభట్టు.

# శ్రీశ్రీశ్రీ రాఘవేంద్ర స్వామి వారి చరిత్ర

శ్రీరాయల తదనంతరం విజయనగర సామ్రాజ్యం వైభవం అంతరించింది. అంత కాలం ఆ వైభవ కల్పవృక్షపు నీడలో చల్లగా, సుఖవంతముగా జీవించిన ఆ కుటుంబము నిలువ నీడలేకపోగా, ఆ విజయనగర రాజధానిని వీడి, నేటి తమిళనాడులోని కుంభకోణం చేరింది.

తిమ్మనభట్టు ధర్మపత్ని గోపికాంబ. వారికి వేంకటాంబ అనే కుమార్తె, గురురాజనే కుమారుడు కలిగారు. అట్టి తఱి, ఆ కుంభకోణ మఠానికి మధ్వపరంపరగా పదునాల్గవ ఆచార్యులైన శ్రీ సురేంద్ర తీర్థులు అధిపతిగా నుండిరి. అది పదమూడవ శతాబ్ది. ఈ తిమ్మనభట్టు కుటుంబమును వారు ఆదరించి ఆశ్రయమిచ్చిరి. బతికి చెడిన కుటుంబంగా, భౌతిక సంపదను కోల్పోయి యున్ననను, భక్తి సంపద వారి వద్ద పదిలంగానే యుండినది. ఆ దంపతులిరువురును తమ ఇష్టదైవమైన శ్రీ తిరుమలేశుని దర్శనం పొంది, తమకు మరో కుమారుని ప్రసాదించమని వేడుకొనిరి. వారి ప్రార్థనలో నెంత నిర్మల భక్తి సంపదకలదో! అటులే, పుత్రుని ప్రసాదించమని వేడిన వెంటనే అవతార పురుషునే అనుగ్రహించాడా దేవదేవుడు.

అతడే నేటి 'మంచాల' అనే కుగ్రామాన్ని మంత్రాలయంగా, మహనీయక్షేత్రంగా మలచిన మహనీయుడు శ్రీ రాఘవేంద్రస్వామి. క్రీ.శ. 1595 మన్మథనామ సంవత్సరం, ఫాల్గుణ శుద్ధ సప్తమీ, మృగశిరా నక్షత్రంలో, మధ్వపరంపరలో మణిహారంలోని నాయకమణిగా, మహాపండితుడిగా, ఎదనిండా మానవత్వఝరిని నింపుకుని అవతరించాడు శ్రీ గురురాఘవేంద్రస్వామి.

'మంత్రం' అనే రెండక్షరాలు, భారతీయ ఆధ్యాత్మిక పరిభాషలో నెంతో ప్రధానమైనది. **అట్టిది అనితర**మైన మహిమగల ఆమాటతో నొక దివ్యక్షేత్రరూపం ధరించి, దేశం **నలుదిక్కుల నుంచి** ఎందరో భక్తులను ఆకర్షిస్తుంటే, అదొక ఆమంత్రించి రప్పించు**కొనినట్లున్నది.**

తరలి వచ్చిన వారెల్లరు ఆధ్యాత్మిక పరిమళంతో మంత్రముగ్ధులై, మహదైశ్వర్యాన్ని తమ కొంగున కట్టుకొని సంతృప్తి సంతోషాలతో తిరుగు ప్రయాణంలో తమకిక ఆరాధ్యదైవం శ్రీ రాఘవేంద్రస్వామియే ఇంటి ఇలవేలుపుగా భావించి వెళ్లుదురు. నిజమే, మహనీయులు మనమధ్య సశరీరంగా సంచరిస్తూ, మనలో వొకరుగా నుండి మహత్తరమైన భక్తిని నాటుదురు. ఆ మహోన్నతుడు శ్రీ గురురాఘవేంద్రస్వామియే.

వారి పూర్వాశ్రమ నామం "వేంకటనాథుడు". బాల్యం నుండియు యేది చెప్పినను వెంటనే తిరిగి అప్పజెప్పు గొప్పధారణ శక్తి కలిగియుండెడి వాడు. ఆ ధారణ శక్తి తండ్రి

తిమ్మనభట్టు చకితుడై, తాము మరొక పుత్రుని ప్రసాదించమని శ్రీ వేంకటేశ్వరుని కోరినందులకు, ఇంతటి విద్యాప్రభావ అవతార పురుషుని ప్రసాదించినందులకు, తమ భాగ్యంగా కనులారా దర్శించే అదృష్టం కలిగించాడని, ఆ స్వామి నామధేయమే పెట్టుకొన్నామా ఏమి? అని సంతోషించిరి ఆ పుణ్యదంపతులు.

ఆ సంతోషం కొంతకాలం కనులారా పొందుటకు నోచుకోలేకపోయిరి. తండ్రి గతించగా, అతడు(వేంకటనాథుడు) అన్నవదినెల పోషణలో ప్రాథమిక విద్యాభ్యాసం కుంభకోణ మఠంలో సాగుచుండగా, అతనికి వ్యాకరణ శాస్త్రంపై ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది. అతని అన్నతో ఉన్నత విద్యాభ్యాసం, వారి బావ లక్ష్మీనరసింహాచార్యుల పర్యవేక్షణంలో 'మధుర'లో కొనసాగింది. వేదశాస్త్ర విద్యలలోనే కాక, ఇంటివిద్య అయిన వీణావాదనంలోను శతపత్రకమలంలా వేంకటనాథుని ప్రజ్ఞ వికసించింది. ఆ విద్యా ప్రాభవంతో వేంకటనాథుడు గుణసౌందర్యంతో బాటు తను సౌందర్యం కూడా సరిజోడైంది. బాల్యంలోనే, సర్వేశ్వరుడు 'ఓం' అనే ఒక్క అక్షరంలో ఎలాఇమిడి యున్నాడని ఆలోచించిన మేధావి, ఇంతటి మహనీయుడుగా దివ్యత్వమైన విద్యావంతుడగుటలో ఆశ్చర్యములేదు.

వేంకటనాథుడు కుంభకోణంలో విద్యాభ్యాసం సాగిస్తున్నపుడు, అక్కడి మధ్వమఠాధిపతిగా పదహారవ ఆచార్యులు శ్రీ సుదీంద్ర తీర్థులను వారుండిరి. వారి వద్దనితడు, అచటి విద్యార్జనకే విచ్చేసిన అనేకమంది విద్యార్థులలోనొకడు. విద్యాభ్యాసంలో ఒద్దికతో, బుద్ధికుశలతతో, వినయవిధేయతలతో మెలిగెడివాడితడు. అందులకే గురువగు సుదీంద్రులకు నితనిపై ప్రత్యేకమైన వాత్సల్యముండెడిది. అదే, సాటి విద్యార్థులకీతనిపై అసూయ నిలిచింది. అయినా, వేంకటనాథుడు తన నిత్యకృత్యంగా, ఏరోజు చెప్పిన పాఠానికి ఆరోజే వ్యాఖ్య రచించి నిద్రించడం అలవాటు చేసుకొన్నాడు.

ఇట్లుండగా ఒకనాడు, మధ్వపరంపరలో ఆరవ ఆచార్యులు శ్రీ జయతీర్థులను వారు రచించియున్న 'న్యాయసుధ' అనే గ్రంథాన్ని గూర్చి, అందులోని ఒక భాగాన్ని బోధిస్తున్నారు శ్రీ సుదీంద్రుల వారు తన శిష్యులకు. బోధనలోనొకచోట ఆ స్వామికి వ్యాఖ్యానించడం స్ఫురించలేదు. బోధనను మరునాటికి వాయిదా వేశారు. ఆ రాత్రి అతనికి నిద్ర పట్టలేదు. ఎటుతోచక విద్యార్థులు విశ్రమించు స్థలానికి వెళ్లారు. అచటికి కొంతదూరంలో ఒక పాడుబడిన మంటపంలో చలికి వణుకుచు ఒంటరిగా నిద్రపోతున్న వేంకటనాథున్ని చూడగానే ఆచార్య హృదయం ఆర్ద్రమైపోయింది. అతని ప్రక్కనేయున్న తాళపత్రాల దొంతర ఆచార్యులను ఆశ్చర్యచకితులను జేసింది. ఏమిటాయని కుతూహలంతో దీపపు వెలుగులో వాటిని చదవనారంభించిరి. వారిలో ఆశ్చర్యానందములు వెల్లివిరిసినవి. కంటినిండా ఆనందభాష్పాలు జలజలరాలాయి. తనకు స్ఫురించని వదలిపెట్టిన భాగానికి తగిన అర్థవివరణ చేస్తూ, మృదుమధుర శైలిలో వ్రాసిన వ్యాఖ్యానం అది. అప్రతిభులయిన ఆ

ఆచార్యులవారు తాను పైన కట్టుకున్న పట్టు శాలువాను వేంకటనాథునిపై కప్పి తాళపత్రాలను తీసుకొని స్వస్థానానికి వెళ్లారు. మేలుకొన్న వేంకటనాథుడు తనపై కప్పియున్న పట్టు శాలువాను చూచి ఆశ్చర్యపడి ప్రక్కనున్న తాళపత్రాలు లేకపోవడంతో భయపడ్డాడు. ఆచార్యులను సందర్శించిన అనంతరం అసలు విషయం తెలిసింది. ఆ న్యాయసుధకు సంపూర్ణ వ్యాఖ్యానం వ్రాయవలసిందని ఆచార్యులవారాదేశించి దానికి "పరిమళమ"ని తానే నామకరణం చేసిరి. దానితో వేంకటనాథునకు 'పరిమళాచార్యుల'న్న బిరుదునూ అనుగ్రహించిరి.

తదుపరి తమ వారసుడిగా మధ్వపీఠాన్నధిరోహించి భక్తిభావ పరిమళాలను నలుదెసలానితడు వెదజల్లగలడని ఆ ఆచార్యవర్యుడానాడే యూహించియుంటారు. అట్టి సత్సంకల్పం ఫలవంతమవడానికి ముందు వేంకటనాథుడు ఎన్ని పరీక్షలు ఎదుర్కొన్నాడో తన గృహస్థ జీవితంలో? పుటం పెడితే తప్ప బంగారానికి వన్నెరాదు కదా! ఎన్నైనా ఆటుపోట్లను నిబ్బరంగా నెదుర్కొనిననే కర్మ నిశ్శేషం దాటవలసిందే! అది ఎంతటివారైనను సరే!

వేంకటనాథునకు సరిజోడుగా 'సరస్వతి' అను కన్య అర్ధాంగి అయింది. కొంతకాలానికి వారికి లక్ష్మీనారాయణుడనే కుమారుడు కలిగెను. విద్యాపాండిత్యములోను సరస్వతీ సాక్షాత్కారం లభించిన వేంకటనాథునికి లక్ష్మీ ప్రసన్నత కాలేదు. పేదరికపు అంచుల దాకా చవిచూస్తూ, దాదాపు నిత్యోపవాసంతో ఎన్నాళ్లో గడిపారు. ఆ పుణ్యదంపతులు దైవానికిని నిత్యనైమిత్తిక ఆరాధనలో నైవేద్యం మంచినీళ్లే అయినను ఇరువురిలో చిరునవ్వుల వెన్నెలల చలువ పందిళ్లవలె నుండెడివి. ఇంటిలో దొంగలుకూడ పడి కొద్దిపాటి వంటసామగ్రి కూడా దోచుకెళ్లారు.

ఒకసారి ఒక సంపన్నుడు యజ్ఞం నిర్వహించి, సమారాధనకు సర్వులను ఆహ్వానించాడు. వేంకటనాథుడును భార్యవలదన్నను కుమారుని వెంబడించుకొని ఆ విందునకు వెళ్లాడు. అచటివారంతా వేంకటనాథుని పాండిత్యం, వ్యక్తిత్వాలను నేమాత్రం పట్టించుకోక, ఆ ఋత్విక్కులు అతనిని చులకన చేసి తమందరికిని గంధం తీసేపని అప్పగించారు. అయినా వేంకటనాథుడు మౌనంగా వారి అదేశాన్ని పాటిస్తూ, ఇట్టి అపచారాన్ని భరించలేకపోయినా, అతనిలో ఆకలిదహించుకుపోవడంతో, ఆ అగ్నిదేవుడు ఆగ్రహంతో మంటలు కురిపించగా, తీసిన గంధం వారి ఒంటిని తాకి, తాపమునకు తాళలేక, తామొనర్చు తప్పునకు వారెల్లరు వేంకటనాథుని చేతులు జోడించి ప్రార్థించిరి. వారి బాధ చూడలేక వేంకటనాథుడు అగ్నిహోత్రుని వారి తప్పును మన్నించమని అగ్ని సూక్తం పఠించి శాంతింపజేశాడు. మరల వారెల్లరు వేంకటనాథుడు పఠించిన వరుణసూక్తంతో తీసిన గంధం రాసుకొని ఉపశమనం పొందిరి.

కొన్నిదినములకు వేంకటనాథుడు భార్యాకుమారులతో మరల కుంభకోణం చేరి,

శ్రీ సుదీంద్రుల అండ చేరాడు. వారి నుండి వేదాంత విద్య నేర్చి, తమ మధ్వ సిద్ధాంతాన్ని మథించాడు. వాదపటిమలో ఆరితేరాడు. ఇక ఇటు ఆకలి, విద్యాదాహం కూడ తీరడంతో, గురువు సుదీంద్రుల వెంట దేశసంచారం చేస్తూండగా, అక్కడక్కడ ద్వైతమత ప్రచారం ప్రజ్ఞాపాటవం కనబరచిన వేంకటనాథుని చూచి, సుదీంద్రుల వారి హృదయం పులకరించింది. తానిచ్చిన ఆనాటి 'పరిమళాచార్య' బిరుదు సార్థకమైనదని, మురిసిపోతూ, ఈనాడు మరల "మహాభాష్యాచారుడ"ని బిరుదును ప్రసాదించాడు శ్రీ సుదీంద్రులవారు.

తదుపరి తన వారసుడతడేయని తలంచి, తానున్న ఆశ్రమంలో పరంపరగా వెలసియున్న 'మూలరాము'ని అర్చన బాధ్యతను, ఆశ్రమపీఠాధిపత్యమును వేంకటనాథునకు అప్పజెప్పాడు శ్రీ సుదీంద్రులవారు. తన శిష్యుడు కారణజన్ముడని, అవతార పురుషుడని గ్రహించి యుంటాడు కాబోలు.

ఇట్టి ఆశ్రమ పీఠాధిపత్యం, గురువర్యుల ప్రతిపాదనకు వేంకటనాథుడు నిర్విణ్ణుడయ్యాడు. ఒకవైపు భార్యాపుత్ర బంధం, మరోవైపు గురువర్యుల ఆదేశంతో ఎటూ తేల్చుకోలేకపోగా, రాత్రి స్వప్నంలో సరస్వతీదేవి సాక్షాత్కరించి, సుదీంద్రులల ఆదేశాన్ని శిరసావహించమని ఆదేశించగా, ఇది దేవీ ఆజ్ఞగా సమ్మతించాడు. భార్య తన భర్త వియోగమునకు చింతించినను, భర్త ముఖంలోని ప్రశాంతతకు సంతసించినను, భర్త వియోగమునకు తాళుకోలేక తన కుమారుని బంధువులకప్పగించి ఆత్మహత్య చేసుకొంది. అట్లు ఆ ఆశ్రమ పీఠాధిపత్యం పొందుటకు వేంకటనాథుని పూర్వజన్మ కారణాన్ని సాక్షాత్ సరస్వతీదేవి వెల్లడించినట్లు, ఈ పూర్వావతార గాథ వినవలసిందే.

కృతయుగంలో శ్రీమన్నారాయణుని సేవలో తరించిన మహాభక్తుడు "శంఖకర్ణుడను" వాడు. అతడే కారణాననో బ్రహ్మ యిచ్చిన శాపవశాన, రాక్షసుడైన హిరణ్యకశిపునకు ప్రహ్లాదుడుగా జన్మించాడు. ద్వాపరయుగంలో అతడే బాహ్లిక చక్రవర్తి(కురుక్షేత్ర యుద్ధంలో కౌరవ పక్షాన పోరాడిన వీరుడు)గా పుట్టాడు. కలియుగంలో 1447 సం.లో ద్వైతమత ప్రబోధకుడైన శ్రీవ్యాసరాయలుగా, అనంతరం ఈ వేంకటనాథుడుగా అవతరించి, తుదకు మధ్వపరంపరగా 17వ ఆచార్యులుగా నీతడు పట్టాభిషిక్తుడయ్యాడు.

అనగా క్రీ.శ. 1621 సం.లో ఫాల్గుణ శుద్ధ విదియనాడు శ్రీ సుదీంద్రుల వారి ఆధ్వర్యాన శ్రీవేంకటనాథునకు సన్యాసాశ్రమమిచ్చి "శ్రీ రాఘవేంద్రతీర్థుల"ని నామకరణం జరిగెను. ఆ దివ్యక్షణాలెట్టివో కాని, శ్రీ సుదీంద్రుల వారిదెంతటి భవ్యవాక్కో కానీ, ఆ నామం అష్టాక్షరీ మంత్రంగా మారి, నేటికి ఎందరో ఆర్తులకు అభయ ప్రధానమంత్రముగా మారింది. కానీ, భర్తయిట్లు సన్న్యాస దీక్ష పొందిన సంగతి వినిన తన అర్ధాంగి, మొదలు తెగిన చెట్టులా కుప్పకూలి, ఆత్మహత్య చేసుకొన్నది. ఆ ఆత్మహత్యాపాపము భార్య పొందకుండ, శ్రీ గురురాఘవేంద్ర స్వామి మంత్రజలంతో ఆమెకు పుణ్యలోకాలు కల్పించిరి.

ఇక ఆనాటి నుండి శ్రీ రాఘవేంద్రస్వామి వైభవం, దీక్షాదక్షత, మధ్వ సిద్ధాంత వ్యాప్తి, భగవద్భక్తి, పాండిత్యంలో అపార బృహస్పతిగా, వేదాంతపు చరమజ్ఞానం, వారి అంతరంగం కరుణాసార్ద్రంగా, తారతమ్యాలు లేని మనస్సుతో తనను నిండు మనస్సుతో నిర్మల భక్తి భావనతో కొలిచిన వారిని తన అక్కున జేర్చుకుని ఆదరించిన అవ్యాజవత్సలుడుగా వెలుగొందసాగెను.

నిత్యసంచార వ్రతంలో నొకనాడు తంజావూర్‌లో స్వామి అడుగిడగా, అంతకుపూర్వం అచట దారుణ క్షామంతో నున్నవారు, క్షామరహితులై సకలవిధముల ధాన్యసంపన్నులైరి. అలాగే రోకలిని చిగురింపజేయడం, మామిడిపళ్ల రసంతోనున్న గంగాళంలో ప్రమాదవశాత్తు పడి గతించిన బాలుని జీవింపజేయడం వంటి మహిమలు అపారం.

అటులే, శ్రీ స్వామి సంచారం చేస్తూ ఆదోని చేరారు ఆ సమీప గ్రామమైన కందనాతికి చెందిన పసులకాపరి వెంకన్న ఈ స్వామిని దర్శించి, తనకు విద్యాభిక్ష పెట్టమని అర్థించాడు. స్వామి అనుగ్రహించి, “నాయనా! ఆపత్సమయంలో నన్ను స్మరించుకో”అన్నారు. వెంకన్న అసదుల్లాఖాన్ వద్దకు చేరగా, అప్పట్లో ఆదోని ప్రాంతాన్ని అసదుల్లాఖాన్ పాలించెడివాడు. అతడొకనాడు కందనాతికి సైన్యసమేతంగా చేరాడు. చదువురాని అసదుల్లాకొక ఉత్తరం అందగా, ఆ లేఖను చదివి పెట్టమని ఈ వెంకన్న చేతికందించాడు. కాని వెంకన్న కూడ నిరక్షరాస్యుడు. తొలుత భయపడిన వెంకన్న శ్రీగురు రాఘవేంద్రస్వామిని స్మరించుకొన్నాడు. అంతే, పర్షియన్ భాషలోనున్న ఆ లేఖను పఠించి, అందులోనున్న అసదుల్లా సైనిక విజయాన్ని సూచించే లేఖయని, చెప్పగా అతడు సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బై, ఈ మహిమకు కారకుడైన శ్రీగురు రాఘవేంద్రస్వామిని దర్శించి, వారికోరికగా తుంగభద్రా తీరంలోని మంచాల గ్రామాన్ని కానుకగా నిచ్చాడు. అదే శ్రీవారి బృందావనంగా నెలకొన్న నేటి మంత్రాలయ క్షేత్రమైంది.

ఈ మంచాల గ్రామంలో ప్రహ్లాదావతార పురుషుడగు శ్రీరాఘవేంద్రుడు, తానావతారంలో నిచటనే యజ్ఞం చేసినట్లు, మంచాలమ్మను కులదేవతగా ఆరాధించాడు. తనకులదేవత “మంచాలమ్మ”యే అని గ్రహించి నేటికి ఆ మంచాలమ్మను పూజించిన తదుపరియే తన బృందావనము దర్శించుదురని నియమము కలదు. కావుననే, నేటికి ఆ మంచాలమ్మను పూజించిన తదుపరియే తన బృందావనం దర్శించుదురనీ నియమం కలదు.

అట్లు దర్శించుటలోని స్థలమహిమ ప్రాధాన్యత. పూర్వం ద్వాపరయుగంలో పాండవులొనర్చిన అశ్వమేధయాగాశ్వం వెంట అర్జునుడుండగా, అనుసాల్వుడను రాజు ఆ అశ్వమును పట్టగా, అర్జునుడు ఆరాజును ఎదుర్కొని యుద్ధంలో పరాజితుడయ్యెను. అందులకు, అది స్థలప్రభావమని యెరింగి అదియే మంచాలయని తెలుసుకొని, ఆరాజును

జయించుటకు శ్రీకృష్ణుని సలహాపై అనుసాల్వుని ఆ మంచాల నుండి ఇవతలకు రప్పించి యుద్ధంలో అతన్ని ఓడించాడని, స్థలమహిమ అట్టిదని తెలుసుకున్నారు.

శ్రీస్వామి 1671 సం.విరోధికృత్ సంవత్సర శ్రావణ బహుళ తదియ దినమున సశరీరంగా (సమాధి) బృందావనంలో ప్రవేశించాడు. అట్టితరి భక్తుడగు వెంకన్న అసదుల్లాఖాన్ దివాణంలో దివాన్ స్థాయికి ఎదిగి యుండెను. ఇదంతయు ఆ స్వామి మహిమయేయని, తన ఆధ్వర్యమున శ్రీ స్వామివారి బృందావన ప్రవేశవేళ భజనలతో భక్తులు వేదం పఠించిరి. అట్టితరి భక్తుల కన్నీరు ప్రవాహములై శోక తప్త తరుణమయ్యెను. తన కొరకై దుఃఖించపలదని, ఈ బృందావనం నుంచే అందరి యోగక్షేమాలను చూస్తుంటాననీ, తనమహిమ 700 సంవత్సరాలుంటుందని, అన్న అభయవాక్యాలే భక్తులకు ఒకింత ఊరట కలిగించినవి.

సమాధి వార్త తెలిసిన శ్రీ స్వామివారి సన్నిహిత శిష్యుడు అప్పణాచార్యులు పరుగున వచ్చి, తనకు శ్రీ స్వామివారి దర్శనముకానందున వెంటనే వారి నోటినుండి ఈ ప్రార్థనాశ్లోకం వెలువడెను. అదియే భక్తులకు తారకమంత్రంగా నిలిచెను. ఆ తారకమంత్రం బృందావన ముఖద్వారమును అలంకరించెను.

శ్లో॥ పూజ్యాయ రాఘవేంద్రాయ సత్యధర్మరతాయచ ।
భజతాం కల్పవృక్షాయ నమతాం కామధేనవే ॥

## ఇతి శ్రీ గురురాఘవేంద్రాయనమోనమః

-★★★-

## గురు - సూత్రములు

"గురువాక్యంతు శిష్యాణాం సిద్ధికారకం"

శిష్యులకు గురువాక్యమే సిద్ధికి కారణం.

★★★

"ఫలదా సద్యో గురుభక్తి"

గురుభక్తి సద్య (వెంటనే) ఫలమునిచ్చును.

★★★

"సంసార తారణి త్వీగృగ్నాన్యత్సుగమ సాధనం"

★★★

# 30. శ్రీ భరద్వాజ మహర్షి సాంగత్య ఫలం

భరద్వాజ మహర్షికి రామాయణావిర్భావ కారణభూతుడనే గొప్పతనం కూడ కలదు. ఇతడు తన జీవితకాలంలో అనేక మహర్షుల వద్ద శిష్యరికం చేసిరి వేదాధ్యయనం చేశాడు. వాల్మీకి మహర్షి దగ్గర ఈయన శిష్యుడుగా నున్నపుడే, వాల్మీకి, రామాయణ మహా కావ్యాన్ని వ్రాయడం జరిగింది.

ఒకనాటి మిట్ట మధ్యాహ్నం, జన సంచారం లేని అరణ్యంలో వాల్మీకి, అతని శిష్యుడైన భరద్వాజుడు మధ్యాహ్న స్నానమునకై తమసా నదీ తీరానికి చేరారు. అపుడు వాల్మీకి భరద్వాజునితో -

"శ్లో॥ అకర్దమమిదం తీర్థం భరద్వాజ నిశామయ ।
రమణీయం ప్రసన్నాంబు సన్మనుష్యమనో యథా ॥"

భా: "ఓ భరద్వాజా! తమసానది నీరు ఎంత స్వచ్ఛంగా, నిర్మలంగా నుందో చూడు. సత్పురుషుల మనస్సులాగా యెంత అందంగా నుందో!"–

అంటూ చెప్పిన శ్లోకం, వ్రాయబోయే రామాయణ కవితా ప్రవాహానికి ముందుగానే, వాల్మీకి హృదయంలో నావిర్భవించింది. ఇచట తనతో నున్న శిష్యుడగు భరద్వాజుడు అట్టి వాడనే ధ్వని, ప్రస్ఫుటమైనది. సహృదయుడైన భరద్వాజునితో తన ఆనందాన్ని పంచుకోకుండా యుండలేక పోయాడు వాల్మీకి.

"మధుర పధార్థాన్ని ఒంటరిగా ననుభవించడం తగదు కదా!"

తనతో నున్న అన్నివిధాల సమానుడై, రసికుడైన భరద్వాజుడు ప్రక్క నున్నందున, వాల్మీకి తన మనస్సులో పుట్టిన దృశ్యము అతనికెట్లు చెప్పకుండ యుండగలడు?

ఆ దృశ్యము, నదిలోని యిసుక తిన్నెలలో బయలుదేరే చిన్న చిన్న ఊటనీటి కాలువలు, రాబోయే వరద ప్రవాహాన్ని (కవితా ప్రవాహాన్ని) తెలియ జేసినట్లుగా, వాల్మీకి నోటి వెంట వెడలి, వ్రాయబోయే రామాయణ మహాకావ్యానికి 'నాంది' పలికినట్లైంది. దీనికి సాక్షిగా నున్న శిష్యుడు భరద్వాజుడొక్కడే.

అనగా భరద్వాజుడును రామాయణావిర్భావ కారకుడని, ఆ మహర్షి గొప్పతనాన్ని కూడ సూచిస్తున్నట్లు మనం గ్రహించవచ్చు.

"భరద్వాజ" అనే పదానికి గంభీరమైన అర్థాలు అనేకం. 'భరద్, వాజ', 'భరత్' అనువ్యక్తి, మహర్షి 'వాజ' – అనునది భరించువాడు, మోయువాడు, రక్షించువాడు, అని

అర్థములు. 'ఓజస్' అనే పదమే 'వాజ'గా, 'వాజి'గా మారింది. అటులే 'వాజమ్' అనే పదానికి దేహశక్తి, దేహదార్ఢ్యములని కూడ పిలువబడును. అట్టి దేహములను కలవాడని భావము. నల్లగా, బలిష్టంగా నుండే యొక పక్షిని కూడ "భరద్వాజ పక్షి" అని పిలువబడును.

ఇక 'వాజ' – అనే పదానికి మరొక శ్రేష్ఠమైన అర్థాలున్నాయి. అన్నం, వేగం, సంపద, తండులము, జలము, నెయ్యి వంటి తినుబండారములు మరియు 'బహుమానము', యాగములో నుపయోగించు 'హవిస్సు' అని, వీటన్నిటిని భరించువాడని, కుటుంబ పోషకుడని, అనేక అర్థాలు చెప్పుకొందరు.

'భరం' ఆభరణం వంటిది. అనగా మనకు రక్షణ వంటిది. భారాన్ని భగవంతుని యందుంచుటయే రక్షణ. అదియే 'భరన్యాసము' అనబడును. అట్టి పేరుగల భరద్వాజుడు. అందులకే "భరే శిష్యాన్" – భరద్వాజునివంటి శిష్యుడుండడు.

మన రక్షణ భారాన్ని భగవంతుని యందుంచుటయే 'భరన్యాసం' అనబడును.

భరే సుతాన్, భరే శిష్యాన్, భరే దేవాన్, భరే ద్విజాన్ ।
భరే భార్యాం భరద్వాజాం, భరద్వాజోఽస్మి శోభనే ॥ అని

ఇక ఋగ్వేదంలో వచ్చే అనేక సూక్తులకు భరద్వాజుడే ఋషి. యజుర్వేదంలో ఆదిలోనే ఈ మహర్షి ప్రస్తావన కలదు. సామవేదంలో నొక సామము ఈ మహర్షి పేరుతో పఠించబడును.

ఇట్టి భరద్వాజుడును మహాతపస్సంపన్నుడు. ఇతని సాంగత్యముతోనే శబ్ద బ్రహ్మవేత్తయగు వాల్మీకి మహాముని శ్రీమద్రామాయణమును పూర్వోత్తర భాగములుగా అనగా! రామాయణము, మరియు వాశిష్ఠ రామాయణములు మనోల్లాస రచనా కౌశలముగా, ఇందలి విషయమంతయును శ్రీ సీతారాముల చరిత్రతో పాటు, ఆధ్యాత్మికమును కూడా జొప్పించినాడు. కనుకనే వాల్మీకి రామాయణంలోని సామగ్రి ఆదర్శవంతమైన పాత్రల చరిత్రములు, ఆధ్యాత్మికమును.

ఇట్టి పరిపూర్ణమైన గ్రంథకర్త వాల్మీకి మహర్షి, ఆధ్యాత్మికమును గూర్చి, బ్రహ్మోపదిష్టమును గూర్చి అవతారమూర్తియగు శ్రీరామచంద్రునిచే ప్రశ్నింపజేసి, వశిష్ఠులవానితో చెప్పించునట్లు, అందులకు ప్రేరకుడుగా అపరబ్రహ్మయనదగు విశ్వామిత్రుని ప్రోత్సహింపజేసి, రచిస్తూ గ్రంథార్థమును పరిపూర్ణముగా గ్రహించెడి శిష్యులు భరద్వాజాది మునులు ధన్యులైరి. వీరందరును వాల్మీకి రామాయణంలోని సుచరిత్ర పాత్రులు. కనుక ఆగ్రంథము ఉత్తమోత్తమమైన ఉద్గ్రంథముగా ఉన్నత స్థానమలంకరించెను. ఈ రామాయణమున్నంత వరకు వాల్మీకి వంటి గురువు, భరద్వాజుని వంటి శిష్యులు

చిరస్మరణీయులు.

ఈ మహర్షి వేదాధ్యయనమునకు మూడు జీవితకాలములు వెచ్చించి, ఇంకనూ వృద్ధుడైననూ అదే ప్రయత్నమునందు శిథిలమైన శరీరముతో పడుకొని మానసిక చింతన చేస్తుండెడివాడు.

ఆయనకు త్రిలోకాధిపతి ఇంద్రుడు దర్శనమిచ్చి - "అయ్యా! నీకు నాల్గవ జన్మకు సరిపడ ఆయుర్దాయము నిస్తాను. ఆ కాలములో నేమి చేస్తావు." అని అడుగగా, "బ్రహ్మచర్యమును ఆచరించగలను", అని సమాధానమిచ్చెను. అప్పుడొక చక్కని దృష్టాంతమును ఇంద్రుడు చూపెను.

మూడు కొండలను చూపి, వాటి నుండి మూడుగుప్పెళ్ళు మట్టిని గైకొని, "అయ్యా భరద్వాజా! నీవు మూడు జీవితముల కాలము అనుష్ఠించిన బ్రహ్మచర్యముచే మూడు కొండల వంటి వేదరాశిలో నీ మూడు గుప్పెళ్ళు మాత్రమే అధ్యయనము చేశావు-ఇంకనూ మిగిలిన భాగమంతా అధ్యయనం చేయనిదే, 'అనంతవై వేదాః' వేదరాశికి అంతములేదు. అపారమైనది. అందుచే, సూక్ష్మముగా నీకు సమస్త వేదాధ్యయన ఫలము లభించుటకు సర్వ విద్యా స్వరూపమైన 'సావిత్రాగ్ని ఔపాసన' ను ఉపదేశిస్తాను" - అని ఆ విధానమును అనుగ్రహించి అంతర్ధానమయ్యెను ఇంద్రుడు.

★★★

## గురు - సూత్రములు

"శాస్త్రమాచార్యుని సన్నిధి చదువు నట్టి జనుడు జనుడు",
- అని అన్నారు పెద్దలు.

★★★

త్యాగభావమునకు గురువులు తరువుల వంటి వారు.

★★★

కువాదుల శిష్యుల పట్ల సద్గురువులు మౌనాన్నే పాటిస్తారు.

★★★

'లఘుత్వమగమద్ దేవో గురూణాం గురురవ్యజః'
పరమేశ్వరుడగు శ్రీరాముడు గురువులకును గురువైనవాడయ్యెను;

★★★

"గురువినా నముక్తి" గురువు లేక ముక్తి లేదని వేదమనును.

# 31. ఆచార్య పూజ

## శ్రీ శివపురాణం (43వ అధ్యాయం)

### శౌనక ఉవాచ :-

శ్లో॥ ఆచార్య పూజనం బ్రూహి సూతవ్యాస గురోఽధునా ।
గ్రంధస్య శ్రవణాంతే హి కిం కర్తవ్యం తదప్యహో ॥ - 1

భా: ఓ సూతా! నీకు వ్యాసుడు గురువు. ఇప్పుడు ఆచార్యుని పూజించుటను గూర్చి చెప్పుము. గ్రంథమును శ్రవణమొనర్చుట పూర్తి అయిన పిదప ఏమి చేయవలెను? ఆవిషయమును కూడ చెప్పుము.

### సూత ఉవాచ :-

శ్లో॥ పూజయే ద్విధ వద్భక్త్యాచార్యం శృత్వాకథాం పరామ్ ।
గ్రంథాంతే విధి వద్దద్యాదా చార్యాయ ప్రసన్నధీః ॥ - 2

శ్లో॥ తతో వక్తార మానమ్య సంపూజ్యచ యథావిధి ।
భూషణైర్వస్త్ర కర్ణానాం వస్త్రై సౌమ్యాదిభి సుధీః ॥ - 3

శ్లో॥ శివపూజా సమాప్తౌతు దద్యాద్ధేనుం సపత్నికామ్ ।
కృత్వాసనం సువర్ణస్య ఫలమానస్య సాంబరమ్ ॥ - 4

శ్లో॥ తత్రాస్థాప్య శుభం గ్రంథం లిఖితం లలితాక్షరైః ।
ఆచార్యాయ సుధీర్దద్యాన్ముక్త స్స్యాద్భవ బంధనైః ॥ - 5

శ్లో॥ గ్రామోగజో హయశ్చాపి యథాశక్త్య పరాణిచ ।
మునే సర్వాణి దేయాని వాచకాయ మహాత్మనే ॥ - 6

శ్లో॥ విధాన సహితం సమ్యక్ శృతం హి సఫలం స్మృతమ్ ।
పురాణం శౌనకమునే సత్యమేవోదితం మయా ॥ - 7

శ్లో॥ తస్మాద్విధానాదుక్తంతు శృణుయాద్భక్తితో మునే ।
పురాణం నిగమార్థాఢ్యం పుణ్యదం హృదయం శృతేః ॥ - 8

## సూతుడిట్లు పలికెను :-

1. శ్రేష్ఠమగు కధను వినిన పిదప ఆచార్యుని యధావిధిగా పూజించవలయును. గ్రంధము పూర్తి అయిన తదుపరి భక్తుడు (శిష్యుడు) ప్రసన్నమగు మనస్సు కలవాడై యధావిధిగా ఆచార్యునకు దానము చేయవలెను.

2. తరువాత వివేకియగు శిష్యుడు (భక్తుడు) ప్రవచన కర్తకు ప్రణమిల్లి, యధావిధిగా చక్కగా పూజించి చేతులకు, చెవులకు భూషణములను, నాజూకైన వస్త్రము మొదలగు వాటిని సమర్పించవలెను.

3. శివపూజ పూర్తి అయిన పిదప వివేకి యగు శిష్యుడు.

4. (భక్తుడు) గోవును దూడతో సహా ఆచార్యున కీయవలెను.

5. పలము బరువుగల బంగారముతో ఆసనమును నిర్మించి దానిని మంచి వస్త్రముతో కప్పి దానిపై శుభకరమగు గ్రంధమును స్థాపించవలయును. ఆ గ్రంధము సుందరమగు అక్షరములచే వ్రాయబడి యుండవలెను. దానిని ఆచార్యునకు ఈయవలెను. ఇట్లు చేయు భక్తుడు సంసార బంధముల నుండి విముక్తుడగును

6. ఓమునీ! మహాత్ముడగు ప్రవచన కర్తకు గ్రామము, ఏనుగు, గుఱ్ఱము మొదలగు వాటినన్నింటినీ యధాశక్తి గానీయవలెను.

7. ఓ శౌనక మహర్షీ పురాణమును యధావిధిగా శ్రవణమొనర్చినచో, ఫలము లభించునని చెప్పబడినది. నేను సత్యమునే చెప్పుచున్నాను.

8. ఓమునీ! కావున, వేద రహస్యములతో నిండియున్నది, పుణ్యప్రదం, వేదహృదయము అగు పురాణమును వక్త యధావిధిగా చెప్పగా భక్తితో శిష్యుడు వినవలెను.

★★★

### గురు - సూత్రం

శిష్యుడు గురువును ఆశ్రయిస్తేనే అతని (శిష్యుని)లో అవిద్యా లోపమంతరించి, ఆత్మవిద్యా పరుడౌతాడు.

★★★

# 32. శిష్యుని ఆచార్యస్థానములో అభిషేకించుట

## శివపురాణము (20వ అధ్యాయము)

భగవద్భక్తిని, సంస్కారమును పొంది యున్న శిష్యుని ఆచార్యుడు, శిష్యుడిక ఆచార్యస్థాన యోగ్యుడైనచో, ఆచార్య స్థానము స్థానమునందు అభిషేకించ వలయును. యోగ్యుడు కానిచో చేయరాదు.

ముందుగా పరమేశ్వరుని చక్కగా పూజించి, శిష్యునకు రక్షాబంధన మొనర్చి, శిష్యుని తలపాగా లేకుండగా శివాజ్ఞగా ఆ శిష్యుని ఆసనముపైకి ఎక్కించవలయును. తరువాత గురువు శిష్యుని పుత్రవాత్సల్యముతో నాతని శిరస్సుపై తన(శివ) హస్తమునుంచి, తాను శివభావమును పొందినవాడై, శిష్యుని శివాచార్యుడని నిర్దేశించవలయును.

గురువు మరల దేవదేవుని పూజించి, సాష్టాంగదండ ప్రణామంబొనర్చి తలపై చేతులను జోడించుకొని శివునకు విన్నవించవలెను. ఓ భగవాన్! నీ యనుగ్రహముచే వీనిని ఆచార్యునిగా చేసితిని. ఓదేవా! నీవు అనుగ్రహించి వీనికి దివ్యమగు ఆజ్ఞను నిమ్ము.

గురువు యిట్లు ప్రార్థించి, శిష్యునితో గూడి మరల శివునకు నమస్కరించి, దివ్యమగు శివాగమమును శివునితో సమానముగా పూజించవలెను. గురువు మరల శివుని అనుమతితో శివజ్ఞానము యొక్క గ్రంథమును రెండు చేతులతో శిష్యున కీయవలెను. అతడు శివ విద్యారూపుడగు ఆగ్రంథమును తలపై నిడుకొని యథా శాస్త్రముగా విద్యాసనముపై నుంచి నమస్కరించి ఆ గ్రంథమును పూజించ వలయును.

తరువాత గురువు శిష్యునకు రాజార్హత స్థానము పొంది నట్లుగా భావించి, లోకములో ఆదరమును కల్గించునది అగు ఆచారమును శిష్యునకుపదేశింపవలెను. శివశాస్త్రములో చెప్పిన లక్షణములను బట్టి ప్రయత్నపూర్వకముగా గురువు శిష్యుని పరీక్షించి, వానికి సంస్కారమొనర్చి శివజ్ఞానము కల్గించవలెను.

ఇట్లు శిష్యునకుపదేశించిన తదుపరి, శివపూజా పునశ్చరణ గావించి, ఉద్వాసనం జెప్పి, సభాసదులను కూడా పూజించవలయును.

## గురువు శిష్యుని యోగపట్టణమునకు తయారు చేయుట

## శ్రీ శివపురాణం (18వ అధ్యాయం)

శౌనకుడు సూతుని నిట్లు ప్రశ్నించెను.

మునివర్యా! వామదేవ మహర్షి మహేశ్వరుని పుత్రుడగు కుమారస్వామిని ఏమి ప్రశ్నించెను?

అందులకు సూతుడిట్లు వివరించెను.

ఓ భగవాన్! షణ్ముఖా! నీవు తత్త్వములన్నియు తెలిసినవాడవు. అమృత సముద్రమగు, పవిత్రమగు అంతఃకరణం గల ఈ యతులకు గురుస్థానము లభించు విధమెట్టిది?

ఓవామదేవా! గురుస్థానమునునిచ్చే యోగపట్టణమును చెప్పెదను. ఇది మిక్కిలి రహస్యమైనది, మోక్షమునిచ్చునది, అగు దీనిని నీ యందలి ప్రేమచే చెప్పుచున్నాను

"వైశాఖ, శ్రావణ, ఆశ్వయుజ, కార్తీక,మార్గ శీర్ష, మాఘ" మాసములలో శుక్లపక్షములో శుభదినములగు పంచమీగాని, పూర్ణిమనాడు గాని, ప్రభాత కృత్యముల నెరవేర్చుకుని గురువు వద్ద అనుమతిని పొంది అతనిని అర్చించవలెను.

అపుడు అనుకూలుడగు ఆ గురువు తన శిష్యులతో గూడి యోగపట్టమునిచ్చు శిష్యుని చేతిని తన రెండు చేతులతో పట్టుకొని తూర్పుముఖముగా కూర్చుండబెట్టవలెను. ముందుగా అలంకరించిన మండపములో దర్భలు, వానిపై మృగచర్మము, దానిపై వస్త్రము పరచి, తాను(గురువు) కూర్చుండదగిన శుభ్రమగు ఆసనముపై కూర్చుండబెట్టిన విధముగా శిష్యుడు(యతి) కూర్చుండవలెను. అతని యెదుట శంఖమునుంచి, దానిని పూజించి శాస్త్రరీతిగా షడంగములలో చెప్పినట్లు శుభ్రమగు నీటిని నింపి, ఏడుసార్లు ఓంకారముతో శంఖమును అభిమంత్రించవలయును.

తదుపరి షోడశోపచారములతో పూజించి, ఆ శంఖమును సంరక్షాస్త్ర మంత్రముతో మరియు కవచమంత్రముతో కప్పి రక్షించవలెను. ముద్ర సంస్కారములతో సుగంధద్రవ్యములతో పుష్పములతో అలంకరింపజేయవలెను. ఆ శంఖమునకు దక్షిణముననొక మండలమును ఏర్పరచి, అచట సుగంధద్రవ్యములనుంచి, మంత్రముల శుచిగా నొనర్చబడిన శుభ్రమగునొక ఘటమును నుంచి, దానిని చుట్టు దారముతో చుట్టి, ఆ ఘటమును కూడ పూజించి, అందు శుభ్రమైన సుగంధజలమును నింపి యుంచవలెను. ఆ నీటిలోనూ పసుపు కుంకుమ పూలను వేసి సుగంధద్రవ్యమును వేయవలెను. ఆఘటముపై శుభ్రమగు వస్త్రమును కప్పి, అగ్రభాగమున మామిడి ఆకులు, పుష్పదూర్వాదుల నుంచి, నారికేళమును సమర్పించి, అందు ఘటమునందు పంచరత్నములను వేయవలెను

ఇట్లు పూజించిన తరువాత గురువు శిష్యునకనుకూల్యమగు "నృమ్లుస్కం గూమ్" అనే బీజాక్షరములను పలికి, అందు పరమేశ్వరుని ఆవహింపజేసి ధేనుముద్ర, యోనిముద్రలతో ఘటమునకు ప్రదర్శింపజేసి దిగ్బంధనమొనర్చవలెను. తరువాత ఆచార్యుడు ఆ శిష్యుని తలను దర్భలతో కప్పి, మండలమునకీశాన్య దిక్కునందు చతురస్రమును గీసి,

దానిపై యథావిధిగా సుందరమగు ఆసనము అమర్చి, దానిపై తన పుత్రునివంటి ఆ శిష్యుని కనుకూల౦ ౦గా కూర్చుండబెట్ట వలయును.

తరువాత ఆ పూజాఘటమును స్వస్తి మంత్రములతో పైకి తీసి శిష్యుని శిరస్సుపై ప్రదక్షిణ విధానములో నభిషేకించవలయును. ఏడుమార్లు ఓంకారమును ఉచ్చరించి, తరువాత పంచ బ్రహ్మమంత్రములతో నభిషేకించి, చివరలో శంఖమునందలి జలమును చుట్టూ చల్లవలయును. తదుపరి సుందరమగు దీపమును చూపించి క్రొత్త కౌపీనమును, రెండు పైవస్త్రములను ధరింపజేయవలెను.

తరువాత గురువు తన కాళ్లను కడుగుకొని, రెండు సార్లు ఆచమనమొనర్చి, భస్మమును చేతపట్టుకొని, ఆ శిష్యుని రెండుచేతులను తనరెండు చేతులతో పట్టుకొని మండపమునకు మధ్యలో నిలుచుండజేసి, యధావిధిగా వాని అవయవములందు భస్మలేపనమొనర్చి, మరల యధాస్థానమున (ఆసనముపై) కూర్చుండబెట్టవలయును.

ఇక గురువు తన ఆసనమునందు తూర్పుముఖముగా కూర్చుండి, శిష్యునకు ఆత్మతత్త్వమందు అభిలాష కలుగునట్లు, అందులకు స్వచ్ఛమైన మనస్సు కలవాడగునట్లు చెప్పవలయును. గురువు కూడా తాను పరిపూర్ణుడనగు శివస్వరూప భావనలో స్థిరముహూర్త కాలము, ఆత్మయందు లగ్నమనస్కుడై సమాధి స్థితిని పొందవలెను.

తరువాత గురువు కన్నులు తెరచి, శిష్యుని నిలుచుండ నియోగించి, చేతులను కట్టుకొనునట్లుగా నిలిపిన శిష్యుని గురువు ప్రసన్నమగు మనస్సుతో వీక్షింపవలెను. భస్మధారణతోనున్న తన కుడిచేతిని శిష్యుని తలపై నుంచి, దక్షిణ కర్ణమునందు "హంస్సోహం" (పరబ్రహ్మ స్వరూపుడను నేను) అనునట్లు స్పష్టముగానుపదేశింపవలెను.

("హంస" అనుపదము "హం" శక్తి స్వరూపమని, "స"కార సాక్షాత్ శంకరుడేయని తెలుసుకోవలెను.)

ఇట్లుపదేశించిన తరువాత గురువు, "అణోరణీయాన్" అను మంత్రము యొక్క అర్థము అగు ఆత్మతత్త్వమును ఉపదేశింపవలెను. ఇప్పుడా శిష్యుడు సాక్షాత్తు బ్రహ్మస్వరూపుడుగా నెంచి, గురువు శిష్యునకు ఆత్మతత్త్వార్థ వాక్యములను (అనగా సర్వం నేనే, త్రిమూర్తుల స్వరూపుడను నేనే) బోధించి దైవైక్య భావనలోకి తెచ్చి, మరల స్వస్థానమున కూర్చుండబెట్టవలయును.

తరువాత శంఖమును దాని ఆధారపీఠముతో గైకొని భస్మముతో పవిత్ర జలముతో పూజించి, ఏడుసార్లు ఓంకారమునుచ్చరించి, శంఖమును అభిమంత్రించి, తరువాత గురువు శిష్యునకిట్లు బోధించవలెను. "ఓమ్, ఎవడైతే లేశమైననూ భేదభావనను చేయునో వాడు

మహాభయమును పొందునని వేదము సద్రూపమగు ఆత్మ తత్త్వమును బోధించుచున్నది. కావున, నీవును దృఢమగు మనస్సు కలవాడవై భయమును విడిచిపెట్టుము" అని గురువు శిష్యునకిట్లు బోధించి, తాను స్వయముగా శిష్యుని శివుని రూపములో ధ్యానిస్తూ, పూజించవలయును. శిష్యుని నఖశిఖ పర్యంతం పంచ బ్రహ్మమంత్రముల న్యాసమొనర్చి, అతని అవయవములందు(38) ముప్పది ఎనిమిది మంత్రముల రూపములోనున్న "ఓంకార కళలను"కూడ న్యాసమొనర్చి, శివస్వరూప భావనగా అర్చించి, "బ్రహ్మవిదాప్నోతి" వంటి వేదమంత్రములను పఠించి, అతని కంఠమున పూలమాలను అలంకరించవలెను. శ్రీ విరూపాక్షునిచే నిర్మించబడిన పంచాశిక (ఏబది అధ్యాయముల) శాస్త్రములోని సిద్ధిస్కంధమును శిష్యుని మెల్లగా జపమొనర్పజేయవలెను.

తరువాత, గురువు తాను పరిపూర్ణుడనైతినని భావించి, "పూర్ణోఽహం" అను మంత్రమును పఠించి, ఈ శిష్యుడు నాకు పరి పూర్ణ కీర్తిని దెచ్చునని తలంచవలెను. తదుపరి, గురువు ప్రేమతో శిష్యునకు తిలకము దిద్ది, సుగంధలేపనమొనర్చి, "శ్రీపాద" అను బిరుదమునిచ్చి, ఛత్రమును పాదరక్షలను సమర్పించవలయును.

శిష్యుడిప్పుడు పరిపూర్ణుడగు "గురువు" పీఠమునకు అర్హుడని, అట్టి గురుపట్టణముపై శిష్యుని కూర్చుండునట్లు అనుజ్ఞ ఇవ్వవలెను. "శివోఽహమస్మి" అని సర్వదా శివభావనగా సమాధి స్థితిని పొందియుండుమని బోధించి, తరువాత తాను(గురువు) స్వయముగా నమస్కరించవలయును. అటులే ఇతరులను కూడ నమస్కరించవలయును.

తరువాత గురువైన శిష్యుడు లేచి, గురువునకు, ఆ గురువు యొక్క గురువునకు, ఆతని శిష్యులకును తలను వంచి వినయముతో నమస్కరించవలెను. సచ్ఛీలవంతుడుగా ప్రవర్తించవలయును.

ఇట్లు శిష్యుడు గురువయిన తదుపరి, తాను బోధించుటకై వచ్చిన వ్యక్తిని సంవత్సర కాలము పరీక్షించి, అర్హుడగుచో తగు శిష్యునిగా స్వీకరించవలెనని, తుదకు గురువు బోధించి, నాయనా! రాగాదులను విడిచిపెట్టి సదా శివధ్యాన నిమగ్నుడవై యుండుమని హెచ్చరించి వెడలును.

శిష్యుడును అనునిత్యం శివపూజా నిమగ్నుడైయుండి శివధ్యాన పరుడై, ప్రసన్న మనస్కుడై యుండి, తాను కూడా శిష్యులను చేరదీసికొని వారిని పుత్రవాత్సల్యముతో బోధించుచు లోక కళ్యాణముగా జీవనము సాగించవలెను.

అట్లు గురుశిష్య పరంపర అనాదిగా సాగుతుంది.

భారతీయ జీవన ప్రగతి క్రమంలో గురువుల పరంపర ఏర్పడింది. ఆచార్య

పురుషుల సమిష్టి భావపరంపర గురుత్వంగా రూపొందింది. అనాదిగా యీ సమాజం కేవలం ఒక మహాపురుషుణ్ణి కాక, "సమగ్ర సంస్కార తత్వాన్ని" గురువుగా స్వీకరించింది.

ఈ సమగ్ర సంస్కార తత్వాన్ని ఆచరించడంలోనూ, ఆచరింపజేయటంలోను వివిధ సమయాలలో వివిధ మహాపురుషులు కృషి చేశారు. చేస్తున్నారు.

ఇట్లు ఈ దేశంలో గురుపరంపరకు ప్రతీకగా ఆచార్యతత్వానికి విగ్రహ రూపంగా "కాషాయధ్వజం" విరాజిల్లింది. **అరుణకాంతుల** ఈ పతాకం 'ఋషి'యని గురుకుల వాటికలలో అరుణరాగ రంజితమైన **కాషాయవస్త్ర** గురుపరంపరలోని సన్యాసులకు ఆహార్యమైంది.

అందుకే భారతీయులకు అనాదిగా ఈ అరుణ ధ్వజమే గురువు. ఆచార్యపరంపరకు ప్రతీకగా అరుణధ్వజాన్ని చిహ్నంగా భావించడంలోనిఔచిత్యం ఇదే. ఈ ధ్వజం గురువు ఆశ్రమంలో ఉదయించే సూర్యమండలంగా జ్ఞానబోధ రూపముగా, కాంతి స్వరూపంగా వెలిగే ఆచార్య తత్వమండలం ఇదే.

విద్యనభ్యసించే శిశువు ఆరంభంలోనే "సుబ్రహ్మాబ్రహ్మాచారిభిః(విద్యార్థులలో ఉత్తమవిద్యార్థిగాల) రూపొందాలని వేద ఋషుల ఆకాంక్ష ఆ ఆకాంక్షే ఆకృతియే ఆచార్యుడు.

★★★

## గురు - సూత్రములు

గురూపదేశముతో సమస్తమైన పరమ తత్వరహస్యమును తెలిసికొని, సర్వ సంశయములను పోగొట్టుకొని, త్వరగా మోక్షమును సాధింతునని నిశ్చయించుకోవలెను. అదే శిష్యుని పరమ లక్ష్యము.

★★★

సిద్ధి పురుషుడైయున్న గురువే మంత్రోపదేశమునకు అర్హుడు.

★★★

గురువు కన్నా కన్న వారెక్కువ కారు. ఎందుకనగా, భౌతిక దేహాన్నిస్తారు తల్లితండ్రులు. ఆ దేహానికి ముక్తిని ప్రసాదిస్తాడు గురువు.

★★★

శిష్యుల విజ్ఞానంతో విమల చిత్తులౌతారు గురువులు.

# 33. శ్రీగురుపాదమహిమను స్తుతించుట

"శ్రీగురోఃపాదం పద్మసదృశం." అట్టి పాదములకు శరణం భజే. "గురోః పాదోదకం పీత్వాగురోర్నామ సదాజపేత్" - అని శుక ఈశ్వర సంవాదంలో స్తుతింపబడినది. గురు చరణములు శరణాగతి పొందడం అనన్య భావనయే. "గురువిద్యా దేవతానామైక్యం సంభావయేద్ధియా" - అను ఆగమవచనము గురువర్యునకు. గురుమంత్రోపదేశమునకు, ఆ మంత్ర దేవతకు నైక్యము భావింపవలెను.

శివశక్త్యాత్మకమైన పరబ్రహ్మ తేజస్సుచేతను, దానికి లక్ష్యమైన వేదరూప శబ్దబ్రహ్మము యొక్క వాక్కుచేతను, దానికి సహకారియైన చిత్తశుద్ధికి హేతువైన స్థూల శరీరసాధ్యమైన కర్మోపాసన పాదశబ్దము చేతను లక్షితములైనవి.

"యేగత్యర్థాఽస్తే జ్ఞానార్థాః" అనుటచే పాదమనగా జ్ఞానమే. "జ్ఞాత్వాకర్మాణి కుర్వీత" అను అనుశాసనముచే కర్మబ్రహ్మోపాసనలు రెండింటికి 'జ్ఞానము' అవశ్యకమని సూచించు జ్ఞానార్థమైన పాదమభివర్ణితమైనది.

గురుత్వమను గురుస్థానము గురుపాదమందే యుండును. గురుపాదము పద్మ సదృశమన్నాము. సూర్యకిరణ ప్రసారమందు జడమైన పద్మము వికసించినట్లు, గురుమూర్తి సాక్షి అట్లు - గురుపాదాదులకు పద్మాదులుపమానంగా పోల్చినందుకు ఆ పాదములు నిర్మలమైనవిగానున్నవని తాత్పర్యం. అనగా, ఆ గురువు తేజోవంతమైన జ్యోతిరూపుడుగా భాసించుచున్నాడని ఆరోపింపబడినది. కావున అట్టి గురుపాద దర్శనమే బ్రహ్మావగతి సాధనమని స్పష్టము.

**గురుపాదం** శ్రీహరి పాదమే. బ్రహ్మ ఆహరిపాదమును అభిషేకించెను అందుకే అది **బ్రహ్మకడిగిన పాదమై** విరాజిల్లెను. బ్రహ్మయును తరించెను గురూ! నీ చరణము నాకు శరణమగు గాక! యని గురుచరణాశ్రయం పొందగా, ఆ గురువునకు హితుడైన శిష్యునియందు గౌరవం నిలుచును. గురుచరణం, గురుపదమనగా గురుజ్ఞానమని "పదగతౌ" యే గత్యర్థాస్తే జ్ఞానార్థాః" అనుటలో గురుపదమునకు జ్ఞానమే అర్థము; కేవలం పాదమని దుర్భావనలేక, గురుపాదము శరణ్యముగానెంచుట సర్వాగమ సమ్మతము.

భరతుడు అన్నయగు శ్రీరామచంద్రుని అన్నగా గాక, తండ్రిగా, గురువుగా నెంచినాడు. అందులకు శ్రీరామచంద్రుడు తనకు బదులుగా తన పాదముల ధరించు పాదుకలను నివ్వగా, భరతుడు వాటినే శ్రీరాముని ప్రతినిధిగా నెంచి పట్టాభిషేకమొనర్చెను. శ్రీపాదమునకు పాదుకకు అభేదం వివక్షితము. తత్వము అటులే లక్ష్మణుడు అన్న

శ్రీరామచంద్రుడు భార్య సీత ధరించిన ఆభరణములలో ఆమె కాలిన ధరించిన నగలను గుర్తించి, ఇవి సీతామాతవేయని గుర్తించెను. అనగా అన్నగురువగునపుడు గురు పత్నినికూడ గురువుగా, మాతగానెంచడం సాంప్రదాయం.

కనుక శ్రీరాముని కన్న శ్రీరామనామం గొప్పది. శ్రీరామనామం కన్న శ్రీరామ పాదం మిన్న. అందుకే త్యాగరాజు, శ్రీరామచంద్రా! నిన్నాశ్రయించిన లక్ష్మణునికంటె నీ పాదముల పాదుకలనాశ్రయించిన భరతుడే భక్తాగ్రేసరుడయ్యెను కదా! అని స్తుతించెను.

శ్రీ వ్యాసభగవానులు "శ్రీమద్భాగవతము"లో "నిజిత హృషీక వాయుభిః" అను శ్లోకములో ఇంద్రియవాయువులను అదుపులో బెట్టిన వారికి కూడ అదుపులోనికిరాని "మనస్సు" అనెడి గుఱ్ఱమును లొంగదీసుకొనుటకు గురుచరణముగాక, మరిపెక్కు ఉపాయములచే ప్రయాస పడువారు, పెక్కువ్యసనముల పాలై చుక్కానిపట్టు సరంగులేని ఓడలోని వర్తకులవలె సంసార జలధి పాలయ్యెదరు." అన్నారు.

అటుల వారే, ఆ గ్రంధము గ్రంధములోనే - "త్యక్త్వా సుదుస్త్యజ సురేప్సిత"- అన్న శ్లోకములో దేవతలు గూడ మోహపడు రాజ్యలక్ష్మిని బాసి ప్రియసతి ముచ్చటపడిన లేడి వెంట పరుగెత్తిన నీ చరణారవిందమునకు నమస్కారము" అన్నారు. అనగా భక్తాభీష్టములను దీర్చుటలో నిది నిజమైన లేడియా? మాయలేడియా? అన్నది విచక్షణ చేయనంత తొందరపాటు గలది నీ చరణమని వారి తపన.

అభయమీయగల గురుపదం ఉపాసించతగునది. గురుపాదాశ్రయులైన అరుణోదయాన సకల సంధ్యాద్యుపాసనచేర్చి సకలైశ్వర్యములు బడసినట్లు ధన్యులు వారు - గురు పాదోపదేశోపాసనతో త్రికరణములు నిర్విచేష్టములగును. అదే బ్రహ్మానందస్థితి. సర్వశరణ్యమైన గురుచరణము శిరోధార్యము. భక్తుల (శిష్యుల) సర్వపాపములను హరించునగు గురుచరణములు భవతరణం పొందు శరణ్యమైయున్నవి. అందమైన పాదముల సందర్శనంతో ఆనందం బ్రహ్మానందం చేరును.

గురుపదములయెడల గౌరవం నిలుచుటనునది, "గురుపదసమవాప్తౌ" అనగా గురు అనుపదముపై తద్ధిత ప్రత్యయము (భావార్థకమైన 'అణ్' ప్రత్యయము) చేయబడగా 'గౌరవం' అనురూపం సిద్ధించును.

'గురు' వను శబ్దంతో సర్వంద్వైత వివాదము తొలగి అభయస్థానమగు అద్వైతసిద్ధికుపాస్యస్థానమయినదని "గురుపదతః ఉతస్థః" అనగా గ కారము మీదను, రేఫ మీదను ఉన్నది ఉకారమే నిలువగా, "వు" ప్రత్యయం చేరి "గురువు"గా గౌరవపదంగా నిలిచినది.

శ్రీకల్లూరి వేంకటసుబ్రహ్మణ్య దీక్షితులుంగారు శ్రీకాంచీ కామకోటి పీఠాధీశ్వర జగద్గురు శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ వారి శ్రీచరణస్తుతిగా శ్రీమహాభారతేతిహాస స్వరూపముగా గురుస్తుతిని, వారు "గురుకృపాలహరి"లో బహుగొప్పగా అభివర్ణించెను అటులే వారిని భగవద్గీతాసారముగాను దైవాది సంపద్వివేకముచే గమ్యులుగా, మోక్షరూపమైన సన్యాసయోగంగమ్యులుగా స్తుతించి ధన్యులైరి.

నమోనమః సద్గురు పాదుకాభ్యాం

★★★

## గురు - సూత్రములు

"దివ్య జ్ఞానోపదేష్టారం దేశికం పరమేశ్వరమ్ ।
పూజయేత్పరయా భక్త్యా తస్య జ్ఞానఫలం భవేత్ ॥"

దివ్యజ్ఞానోపదేశము చేసిన పరమేశ్వరుడైన ఆచార్యుని పరమైన భక్తితో పూజించవలెను. వానికి జ్ఞానఫలము కలుగును.

★★★

"యథాగురు స్తథైవేశో, యథైవేశ స్తథాగురుః,
పూజనీయో మహాభక్త్యా న భేదో విద్యతేఽనయోః,
నాద్వైతవాదం కుర్వీత గురుణా సహ కుత్రచిత్.
అద్వైతం భావయేద్భక్త్యా గురుర్దేవస్య చాత్మనః" -

గురువెట్లో ఈశ్వరుడట్లే, ఈశుడెట్లో గురుడునట్లే. మహా భక్తితో పూజింప దగినవాడు. వీరిద్దరికీ భేదములేదు. గురువుతో గూడ అద్వైతవాదము నెక్కడను చేయరాదు. భక్తితో గురునికి, దేవునికి, తనకు అద్వైతమును అభేదమును భావించవలెను.

★★★

గురువు సర్వదా ఆత్మానందానుభూతిని పొందుతుంటాడు.

శిష్యునిలో అజ్ఞాన హృదయగ్రంధులు తెగేవరకు బోధించే వారే గురువులు.

# 34. గురువు సాంప్రదాయ మహిమ

ఎవరికెవరు గురువు? భగవంతుడు జగద్గురువు కదా! ఆ స్థానమును గురువు అనువాడు ఆక్రమించి యుండును. అట్టి గురువును నెవ్వడు మానవ మాత్రునిగా నెంచునో అట్టి వాడెన్ని జపతపంబు లొనర్చినను, ప్రార్థన లొనర్చినను సర్వం నిష్ఫలం.

శ్రీమద్భాగవత 11 స్కం. 17వ అ. 27వ శ్లో. న

"ఆచార్యం మా విజానీయా న్నావమన్యేత కర్హిచిత్ ।
నమర్త్య బుద్ధ్యాసూయేత్ స్సర్వదేవ మయోగురుః ॥"

శిష్యునకు భగవత్సాక్షాత్కారము కలుగుటకు పూర్వము, బ్రహ్మానుభవమున మొట్ట మొదట గురు సాక్షాత్కారము నొందును. తదుపరి విచిత్రముగనే తానే (గురువు) భగవద్రూపమును బొంది శిష్యునకు భగవత్సాక్షాత్కారమును ప్రసాదించును. అప్పుడు 'గురువును దైవమును' ఏకమే యని శిష్యుడు గ్రహించును. ఇక శిష్యుడు కోరినవెల్ల (వరములను) భగవద్రూపమున గురువేవాని కొసగును. వేయేల, సర్వమును జీవ బ్రహ్మైక్యపదమగు నిర్వాణము సైతము, గురువే శిష్యునకు చేకూర్చును.

భగవంతుడు సేవ్యుడనియు, తాను (శిష్యుడు) సేవకుడనియు, ఇట్లు 'సేవ్య సేవక' భావమును నిలుపు కొనుగోరు నతడు ద్వైత స్ఫురణము కలిగియు నుండవచ్చును. శిష్యుడేమి కోరినను గురువను గ్రహించగలడు.

- "మంత్రంబు చెవినూద మానవగురుడు
ఆత్మలో ముద్రించునల శివ గురుండు" -

గురువు మధ్యవర్తి, సంధానకర్త, నారాయణ సమాగమము కలిగించువాడు. గంగాభవాని వంటివాడు. దూషణ తిరస్కారాదుల కతీతుడు.

ఎందుకనగా? శిష్యుని బ్రహ్మామార్గమున నడిపించువాడు గురువు, సన్మార్గ దర్శకుడతడు. బ్రహ్మను జేరగోరుదువేని సద్గురుని నాశ్రయించి, అతనిని తు.చ.పాటించవలసిన ఆవశ్యకత మెంతేని కలదు. భగవంతుని నెట్లు విశ్వసించుదురో, తన గురువులనట్లు విశ్వసించ వలయును.

భగవన్మహిమలను గ్రహించ తపన యున్న శిష్యులకు నిజముగా భగవంతుడే సద్గురుని రూపమునవచ్చి, దైవ ప్రతినిధిగా శిష్యుని తపన తీర్చును. అదియును శిష్యుడు నిష్కళంక హృదయుడై, త్రికరణ శుద్ధుడై మనః పూర్వకమగు ప్రార్థననొనర్చిననే అట్టి సద్గురుని సన్నిధానము లభించును.

ఇట్టి శిష్యులు యీ కాలమున అరుదుకదా! కావుననే గురుని యావశ్యకత గురువొక్కడే. కాని యుప గురువులు అనేకులుండ వచ్చును. ఎవని యొద్ద నేమినేర్చినను, ఆతడుపగురువనబడును. అవధూతకు నిట్టి యుప గురువులు ఇరువది నలుగురుండినట్లు "భాగవతమున" చెప్పబడినది.

స్వాతీ నక్షత్రపు వర్షపు బిందువుకై నెదురుచూచు ముత్తెపు చిప్పవలె, సద్గురువుచే తారక మంత్రోపదేశము పొందుటకై యెల్లెడల సంచారమొనర్చు మోక్షకాములగు శిష్యులు కొందరుందురు. ఆ మంత్రోపదేశానంతరం శిష్యులు సమస్త సంగములను వీడి, తమ హృదయ గుహాంతరాళమున ప్రవేశించి బ్రహ్మానంద ప్రాప్తి పర్యంతం ఆ మంత్ర జపమొనర్చుచు అందే నెలకొని యుందురు. అనగా సాక్షాత్కార రూపమగు దివ్యజ్ఞానము, తత్త్వజ్ఞాన సంపద జ్యోతి స్వరూపమా గురువు నుండి పొందిననే మోక్షార్హులగుదురు.

ఒక సమయమున గురువు తప్పుదోవ పట్టినను, ఆ తప్పును నిరర్థకముగా నెంచక, హంసవలె యా గురువు నుండి పొందిన మంత్రమును అవశ్యముగా జపించు చుండవలయును. ఎవరేని గురునిందాలాపములు పలికినను "శివ శివ"- "నారాయణ, నారాయణ"యంచు వినుటకు యత్నించకుడు. వారించుటకే యత్నించుడు. ఎందుకనగా చెప్పినవాడు చెప్పినను, వినువాడు కూడ నట్టి దోషమును పొందును. గురువు తల్లి దండ్రుల కన్న అధికుడు. తల్లి దండ్రులు కేవలం భౌతిక దేహమును నిచ్చిన వారే. కాని గురువు జ్ఞాన సంపదనందించినవాడు. అనగా ఆచార్యుడు మూడవ దేవత. తల్లిదండ్రుల తర్వాత పేర్కొన బడు వాడీతడే. అన్న ప్రాశన మొనర్చువారు మాతాపితరులైతే, అక్షరాభ్యాసం (అక్షరారాధనం) బనర్చు వాడాచార్యుడు. సమస్త విద్యలు నేర్పువాడు గురువే. "గాయత్రీ, అష్టాక్షరీ, పంచాక్షరీ" వంటి మంత్రోపదేశమొనర్చు సత్సంప్రదాయ రహస్యాల నెరింగించు వాడు గురువే. మంచి చెడులను గూర్చి బోధించునాడీ గురువే.

చిదిమిన పాల్గారు పసిమి చెక్కిళ్ళనాటి బాలుడు, తదుపరి నిగనిగల నల్లని మీసం కట్టుతో అజ్ఞానమంతరించి వెలుగుల పొదవైన "దీప కళిక"గా విశ్వానురాగ తిలకంతో వెడలు వాడు ఆచార్య సన్నిధానం నుండే కనుక, ఆచార్యుడు లేక శిష్యుడు లేడు. వీడి భవిష్యత్, అభ్యున్నతి అంతా గురువు బిక్షయే. ఆ గురువునకు మానస పుత్రుడు. తనంత కావాలీతడు, అని తలంచియుండును.

విశ్వామిత్రుడు శ్రీరాముణ్ణి తన వెంటగైకొని పోయి తనంతటి వాడుగా చేశాడు. పరశురాముడు భీష్ముణ్ణి తనంతటి వాడుగా చేశాడు. ఇట్టి యాచార్యుల సత్సంకల్ప ప్రభావం అప్రతిహతం, అవశ్యఫల దాయకము కూడ.

తీగను పందిరి దాక నెక్కించి అల్లుకొనేటట్లు చేసి, మూడు పూవు

లారుకాయలొనర్చు నతడు గురువే కదా! అట్టి గురువు నడవడికను నెప్పుడును ఖండింపరాదు. గురువు కల్లు పాకలో గానీ, సాని కొంపలో జొర బడిననూ, గురువు "పూజ్యుడని, నిత్యారాధనీయుడని" శిష్యుడు తలంచి యుండవలెను.

అందులకు శ్రీగురుదత్త దర్శనం లభించు చమత్కార దృశ్యములే సోదాహరణములు. గురుభక్తి కలవారి కవి అదృశ్యమహిమలు.

"తైత్తరీయోపనిషత్తు"లోని మొదటి అనువాకంలో చివర -

తన్మామవతు । తద్వక్తారమవతు । అవతు మామ్ ।
అవతు వక్తారమ్ ॥ ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ॥ అని

తత్ = ఆబ్రహ్మము, మాం = నన్ను (శిష్యుడనగు), అవతు = రక్షించుగాక, తత్ = అది, వక్తారం అవతు = ఆ ఆచార్యుని రక్షించుగాక! అవతుమాం = నన్ను రక్షించుగాక, వక్తారం అవతు = ఆ ఆచార్యుని రక్షించుగాక! ఓం శాంతిః శాంతిః శాంతిః = త్రివిధముల తాపములు (తాపత్రయములు) శమించుగాక! అని చెప్పబడెను.

ఆచార్యుని, నన్ను (శిష్యుడనగు) బ్రహ్మవిద్యాభి లాషుడనగు నన్ను గ్రహణ శక్తి, జ్ఞాపక శక్తులనిచ్చి అనుగ్రహించుగాక! రక్షించుగాక! అనే రెండు పర్యాయములు ప్రార్థించుటయు విద్యపై గల గౌరవము, విద్యాశక్తిని చూపించటం గ్రహింపదగినది.

తాపత్రయములు :- 1.ఆధ్యాత్మికం, 2.అధి భౌతికం, 3. అధిదైవికములు.

వివరణ:-1.ఆధ్యాత్మికం (ఆత్మానిత్యాఽనిత్యాది సందేహములు) :-

జ్వరము, తలనొప్పి మొదలైన శారీరక బాధలు.

2.అధి భౌతికం :- చలి, ఎండ, క్రూర జంతువులు, దొంగలు, ఇత్యాదులచే కలిగే బాధలు. ఋగ్మతలు సంసారిక బాధలు.

3.అధి దైవికం :- యక్షులు, రాక్షసులు, దేవతలు వీరి వలన కలిగే బాధలు - అని.

బ్రహ్మ విద్యాపథంలో పయనించుటకు మొదలు విక్షేపనివారణకై విద్యార్థి మిత్రాది దేవతలను (మిత్రుడు, వరుణుడు, అర్యముడు, ఇంద్రుడు, బృహస్పతి, విష్ణువు) లను ప్రార్థించాడు.

మొదటి అనువాకంలో -

తర్వాత ఉపాసకుని చిత్తశుద్ధికై వివిధ ఉపాసనలు, వాటి ఫలితాలు చెప్పబడ్డాయి. చెప్ప బడ్డ ఫలితం విద్యార్థికి లభించినదని తలంచ వచ్చును. ఉపాసనలలో కృతార్థుడైన

విద్యార్థి, నిర్విఘ్నంగా గమ్యం చేరుకున్నందుకు కృతజ్ఞతలర్పించు చున్నాడు మిత్రాది దేవతలకు

అధ్యాపన సామర్థ్యం ఆచార్యునకు గ్రహణ సామర్థ్యం శిష్యునకును బ్రహ్మ విద్య ఫలవంతమగు గాక! అనగా బ్రహ్మ సాక్షాత్కారమవు గాక!

అధ్యయన సమయములో గురుశిష్యులిరువురి నుండి అనాలోచిత ప్రమాదాలు జరుగవచ్చు ఇది పరస్పర ద్వేషానికి దారితీయవచ్చును ద్వేష భావం ఉన్నంతవరకు అధ్యయనం, అధ్యాపనం రెండును జరుగవు ఒకవేళ జరిగిన తప్పులను శాంతంగా చక్కగా దిద్దుకోవాలిగాని అవి యెటువంటి అభిప్రాయ భేదాలకు దారి తీయకూడదని దేవతలను ప్రార్థించుటగును

బ్రహ్మ విద్యా మార్గంలో కలుగనున్న ఆటంకాల నివారణకై శంనో మిత్ర 'సహనావవతు' అని దేవతా ప్రార్థన చేయబడును కృతార్థుడైనవాడే ఆచార్యుడగుటకు యోగ్యుడు కనుక నీ ప్రార్థన శిష్యునిదే అని గ్రహించాలి

బ్రహ్మజ్ఞాని (మోక్షమును) బ్రహ్మమునే పొందును విద్యా ఫలాన్ని గూర్చి చెబితే ముముక్షువు మనస్సులో విద్యార్జనాసక్తి మరింత దృఢమౌతుంది అటులే శిష్యుని ఆశయం కూడ బ్రహ్మ విద్యార్జనయై యుండాలి విద్యను ఆర్జించి యుండిన సద్గురువులా విద్యను నితరులకును నందించడానికై తహ తహలాడుతారు విద్యావాంఛ కలిగినపుడే పుత్రునికైనా సరే, ఉపదేశం చేయాలి

పూర్వ చరిత్రలో విద్యారణ్యస్వామి వారి చరిత్ర, బహు ఆదరణీయమైనది ఆదర్శనీయమైనది సంస్కృతంలో శ్రీ శంకరవిజయం అను గ్రంథమును రచించినారు

ఈ విద్యారణ్యులు మొదట మాధవాచార్యులుగా పేరు గలవారు ఈతడు తండ్రియగు "సాయణాచార్యుడ"నే వేద పండితునకు తల్లి 'శ్రీమతీ దేవి కి జన్మించిన మేటి రత్నం సోదరులు సాయణాచార్యులు భోగనాధుడను వారలు

ఈ మాధవాచార్యులు (విద్యారణ్యుడు) తండ్రి వద్ద పూర్వమీమాంస శాస్త్రము అధ్యయన మొనర్చి, తదుపరి పవిత్ర శివక్షేత్రం విష్ణుక్షేత్రంగా వెలసిన కాంచీపురంలో శ్రీవిద్యా తీర్థులనే బిరుదును పొంది, పండితులందరికిని కిరీటము వంటి వాడగు శ్రీశంకరానందులనే యతీశ్వరులను గురువుగా సేవించి, వారి నుండి పూర్వమీమాంస శాస్త్రమును పూర్తిగా రహస్యములతో నేర్చుకొనెను

తదుపరి మాధవార్యుడు మరింత విద్యార్జనకై తన తల్లిని సమ్మతింపజేసి కాలినడకనే కాంచీపురం (కంచి)నకు ప్రయాణమయ్యెను తండ్రియెంతటి బృహస్పతి వంటి వాడైనను

గురువును నా(శయింపనిదే, గురు శు(శూష చేయనిదే విద్యాసిద్ధి, జ్ఞానసిద్ది కలుగదు విద్యార్జనకై కేవలం తెలివి తేటలెన్నియున్నా, (ప్రాచీన మహర్షుల సాం(ప్రదాయం (ప్రకారం కూడా ఎంతటి మహాజ్ఞానులైనా, గురువును నా(శయించి గురుపాద సేవ చేయవలసినదే

అంతెందులకు, సాక్షాత్తు భగవత్స్వరూపావతారమైన శ్రీరామచం(ద్రమూర్తి, శ్రీకృష్ణ పరమాత్మ సహితము గురువులను సేవించి విద్యలనభ్యసించిరి.

స్వయంగా నారాయణావతారుడైన వేదవ్యాస మహర్షియును (బహ్మజ్ఞానియై యుండియు, (బహ్మ సూ(త్రములను, అష్టాదశ పురాణములను, ఉపపురాణములను, భారత, భాగవతాది (గంధాలనూ రచించిననూ, తన కుమారుడైన "శ్రీ శకుని" రాజర్షి యన జనకుని వద్దకు గురు శు(శూష చేసి (బహ్మ విద్యలను నేర్చుకొనుమని పంపెను.

కావున తల్లిదం(డులు బాల్యమునుండి తన బిడ్డలకు తను బోధించిన విద్యతో బాటు, బాహ్యలోకాను భవమ్మును కూడ పొందుటకు, మరింత విద్యను అభ్యసించుటకు ((బహ్మ జ్ఞానము వంటి విద్య) పొందుటకు అవకాశము కల్పించిన మాతృ, పితృ భక్తితో పాటు గురుభక్తియును అనగా "గురుదేవో భవ" అనునదియు (గహించును.

శ్రీకృష్ణ పరమాత్మకు అభిమాన పా(త్రుడైన అర్జునుడు అనన్యసామాన్య లక్షణ లక్షితుడు. అట్టివాడు ఆ శ్రీకృష్ణునకు శిష్య వరేణ్యుడుగా కీర్తి నందెను. శ్రీ భగవద్గీతను బోధించుటలో శ్రీకృష్ణుడు, ఆ బోధను ఆకళింపు చేసుకొన్న అర్జునుడు, గురుశిష్యులుగా నిరువురును విశిష్ట వ్యక్తులే

స్వామీ వివేకానంద, శ్రీరామకృష్ణ పరమహంస వంటి మహనీయుని శిష్యులలో అ(గ గణ్యుడుగా కీర్తిగాంచెను. జగత్కల్యాణానికై ...వు ఆదర్శమూర్తిగా మహాపురుషుడుగా సోదర శిష్యులకు గురుభక్తిని దైవభక్తిగా నిర్ధ...ంచెను

"యస్య దేవే పరాభక్తిః యథాదేవే తథాగురౌ" – అనగా ముందు దేవుని యందు అవ్యాజమైన భక్తిగా, నిష్కామమైన భక్తి కలిగి యుండాలి, అటుపిదప దైవ మార్గమును జూపిన గురుదేవునిపై భక్తి కల్గినచో......

"తస్యైతే కథితా హ్యర్థాః (ప్రకాశన్తే మహాత్మనః"

అటువంటి మహాత్ములకు మేము చెప్పే తత్త్వబోధలన్నీ లోపల తమంత తాముగా దీప్తిస్తాయి. అనగా వెలుగొందుతాయి. అట్టి దీప్తులు వారి వారి పరిపూర్ణ హృదయ తృప్తిని ...స్తి గిస్తాయి.

★★★

ఇట్టి దీప్తులు పూర్వమే ఎందరో మహాత్ములలో వెలుగొంది, అటువంటి దీప్తి పరంపరా, అటువంటి మహాత్ములను గురుభక్తిగా, ఆర్తిదృష్టి, దృష్టితో బాటు అమితగౌరవాదరములు జూపినచో వారు (మహాత్ములుగా, గురువులుగా) కీర్తింపబడి శిష్యుల యెడల పరిపూర్ణ అవ్యాజమైన పుత్రవాత్సల్యమేర్పడి, వెంటనే "చిన్ముద్ర" ప్రదర్శించుదురు. ఆ ప్రదర్శన చేత అర్ధజ్ఞానంతో శిష్యులలో జ్ఞానజ్యోతి దీవింపబడును. అందుకే, "కరకలిత చిన్ముద్రం" – అని దక్షిణామూర్తి స్తవంలో ప్రయోగింపబడినది.

చిన్ముద్రతో దీపింపబడుట అంటే?

"మైత్రేయ్యుపనిషత్తు" – తృతీయోఽధ్యాయం 21 శ్లో

శ్లో॥ "సర్వప్రకాశ రూపోఽస్మి చిన్మాత్రా జ్యోతి రస్మ్యహం ।
కాలత్రయ విముక్తోఽస్మి కామాది రహితోఽస్మ్యహం ॥

భా: నేను అన్నిటి యొక్క ప్రకాశమే స్వరూపముగా గలవాడను. చిన్మాత్రమైన ప్రకాశస్వరూపుడను. మూడు కాలముల కామాదులను లేనివాడను. కేవలం జ్యోతి రూప చిన్మాత్రుడను. కాలత్రయమున నేక రీతిగా నుండువాడను అరిషడ్వర్గములు లేని వాడను." –

అని మైత్రేయుడనెను.

"చిన్ముద్ర" – బొటన వ్రేలుతో చూపుడు వ్రేలు కలుపుట అనికదా! అట్టి చిన్ముద్రలో నున్న వ్రేళ్ళు తప్ప మిగిలిన మూడు వ్రేళ్ళు వరుసగా మధ్య, అనామిక, చిటికెన వ్రేళ్ళు జాగ్రత్, స్వప్న, సుషుప్తావస్థలు ఇవి యొకదానితో నొకటి అహంకారానుభవం కలిగిస్తాయి.

ఆ అనుభమెప్పుడు, ఎట్లు కలుగును?

క్రమముగా జాగ్రదవస్థ నుండి స్వప్నావస్థ పొందినపుడు, స్వప్నావస్థ నుండి సుషుప్తావస్థలోకి వెళ్ళి, తిరిగి వెనుదిరిగి తుదకు జాగ్రదవస్థలోకి రాగానే స్మరించడం, గుర్తు చేసుకోవడం జరుగును.

దేనిని గురించి గుర్తు చేసుకోవడం ?

తన పూర్వానుభవంతో ఆ స్మృతులను గూర్చి స్మరించుకోవడంతో మొదటి కొస్తాడు. కానీ,

చిన్ముద్రలో మూర్తీభవించి యుండిన అది, ఒకటి ఈశ్వరునిపై నుండి భక్తి బొటనవ్రేలును, రెండవది తమకు పూర్వము అధ్యాత్మిక విద్యను గరిపిన లేదా, ప్రస్తుతం ఇట్టి విద్యను గరుపుచున్న గురువుపై నున్న గురుభక్తి చూపుడు వ్రేలును యోగపరిచి కలిగి

ఆ సాధ్యా సాధ్యాలెట్లు కలుగును? వినండి.

"- శేషాద్రి స్వాముల వారని నొకమహనీయుడుండేవాడు. ఆయననొక శిష్యుడి తలపైన చెయ్యి పెట్టాడు. ఏముహూర్తంచూచి చెయ్యి పెట్టాడో గానీ, ఆశిష్యుడు ఇక కళ్ళు తెరవలేదు రాయిలాగా కూర్చున్నాడు అతని బంధువులంతా వచ్చి గోలచేశారు. మావోడికేదో 'చేతబడి' చేశావు. ధ్యాస లేకుండా పోయింది. అని కంగారు పెట్టారు.

కానీ, స్వాముల వారికేమి కంగారు కలుగలేదు. నేనేం చేసేదయ్యా? నేనెక్కడి కెళ్ళినా సరే, అగ్గిపుల్ల వేసుకుంటూ వెళ్తాను ఆ పుల్లలను మీ అందరిపై పారేశాను ఎవరికినీ అంటుకోలేదు ఎక్కడ కర్పూరం ఉంటే, అక్కడ అగ్గిపుల్లతో అది అంటుకుంటుంది. కాని అక్కడ కర్పూరం లేదు కదా! నేనేమి చేసేది. పోపొమ్మ" అన్నారువారు

అలాగే లోపల అట్టి కర్పూరం మనలో నుంటే, ఆ దక్షిణామూర్తి వారు గాని, వారి అంశతో నుద్భవించిన మహనీయులైన గురూత్తములు గానీ, ఎవరైతే యున్నారో వారు మనకు యే జ్ఞాన దీప్తిని కల్గిస్తారో, అది వెంటనే కర్పూరం అంటుకొన్నట్లు వెలుగొందుతారు.

అట్లు అంటుకోకపోతే ఏమి చేయాలి?

అతనిలో కర్పూరం తయారవడానికి యత్నించాలి. అనగా కర్పూరం తయారవలేదని నిదర్శనం. మన నెత్తిన అగ్గిపుల్ల కాదు కదా! 'గ్యాసు పొయ్యి' పెట్టినను అంటుకోదు. ఎందులకు? - మన హృదయాలు ఆధ్యాత్మిక విద్యను గ్రహించటానికి తగినటువంటి పవిత్రమైన కర్పూరంగా పరివర్తన (చైతన్యం) చెందటానికి ఉపనిషద్భాష్యాలు పఠించాలి బ్రహ్మ సూత్రాలు, భగవద్గీత, వాటి భాష్యాలు, ఇత్యాది ఆధ్యాత్మిక. వేదాంత గ్రంధాలను చదువాలి. లేదా! మహనీయుల చేత విన యత్నించాలి వాటిని ఆచరణలో పెట్టాలి. కనుక దక్షిణామూర్తి స్తోత్రంలో వేదాంతవిద్య ప్రారంభం కావాలని, ఆ సాంప్రదాయం యొక్క సారాంశమన్నమాట.

వేదాంత తత్త్వంతో సద్గురువును చేరి, ఆ సద్గురు బోధలు వింటూ వుంటే ఏదో యొక రోజు ఆ వేదాంత తత్త్వం అంటుకోకపోదు వినుటకు త్రికరణ శుద్ధి కల్గియుండాలి. ఏ వేదాంత గ్రంథం పఠించుటకు పూర్వం, తదుపరియును శ్రీదక్షిణామూర్తి స్తోత్రం పారాయణమొనర్చుట విజ్ఞుల సాంప్రదాయం.

## "దక్షిణా మూర్త్యుపనిషత్"లో గురు సాంప్రదాయం గూర్చి

3వమం: "ఓ మాదౌనమ ఉచ్చార్య తతోభగవతే పదమ్, దక్షిణేతి పదం పశ్చాత్ మూర్తయే పదముద్ధరేత్, అస్మచ్ఛబ్ద చతుర్థ్యంతం మేధాం ప్రజ్ఞాపథ్యం వదేత్, సముచ్చార్యతతో

వాయు బీజం ఛంచ తతః పఠేత్, వహ్నిజాయాం తతస్త్వేష చతుర్వింశాక్షరోమనుః" - ఈ మంత్రమును గురుముఖతః పొందవలెను.

ధ్యానము: స్ఫటికము వలెను, వెండివలెను తెల్లగా ప్రకాశించు దేహము కలవాడును. ముత్యాల హారమును, అమృత కలశమును, గ్రంథమును, చిన్ముద్రను హస్తములయందు కలవాడును, పామును నడుమునకు ధరించినవాడును. చంద్రుని తలపై ధరించిన వాడును త్రిలోచనుండును, అనేక భూషణములను ధరించినవాడును, అగు శ్రీదక్షిణామూర్తి దేవుని ధ్యానించుచున్నాను.

"మంత్రేణ న్యాసః, ఆదౌ వేదాది ముచ్చార్యస్వరాద్యం సవిర్గకం, పఠిచార్ణం తత ఉద్ధృత్వ అంతరం సవిసర్గకమ్. అంతే సముద్రరేత్తారం మనురేష నవాక్షరః ॥" - అను మంత్రము, న్యాస మంత్రమును గురు ముఖతః పొందవలెను.

ప్రార్థన: క్షీరమువలె తెల్లనివర్ణము గలవాడును, వటవృక్ష ఛాయలో శ్రీచుకాది, మునీశ్వరులచేత పరివృతుడైన వాడును, చిన్ముద్ర, జింక పరశువు హస్తముల యందు గలవాడును. ఒక హస్తమును మోకాలిపై నుంచుకొని యున్నవాడును, పాము మొలనూలుగా కలవాడును. చంద్రకళను జటలో ధరించిన వాడును, అగు శ్రీ దక్షిణామూర్తి మాకు భావశుద్ధిని ప్రసాదించు గాక!

4వమం: "మన్త్రేణ న్యాసః బ్రహ్మ ఋషి న్యాసః, తారం బ్లూం నమ ఉచ్చార్యమాయాం వాగ్భవమేవచ, దక్షిణాపద ముచ్చార్యతత స్యామూర్తయే పదమ్, జ్ఞానందేహి తతః పశ్చాత్ వహ్ని జాయాం తతో వదేత్, మనురష్టాదశార్ణో&యం సర్వమంత్రేషు గోపితః" - ఈ మంత్రము సద్గురు సన్నిధిలో చెప్పుకొనవలెను.

ప్రార్థన: విభూతి ధారణతో శోభాయమానుడై తెల్లని కాంతి గల వాడును, చంద్రకళను ధరించినవాడును, తన హస్త పద్మములయందు చిన్ముద్ర అక్షమాల వీణ గ్రంథము అనువానిని ధరించి ప్రకాశించుచున్నవాడును, యోగ పట్టాభిరాముడును, వ్యాఖ్యా పీఠము నందాసీనుడై మునీశ్వర బృందముచే పరివేష్టితుడై యున్నవాడను, సర్పాభరణుండునునగు దక్షిణామూర్తీశ్వరుడు నమ్ములను రక్షించునుగాక!

"మంత్రేణ న్యాసః, బ్రహ్మఋషిః, న్యాసః తారం మాయాం రమాబీజం పదం సాంబశివాయచ, తుభ్యంచానల జాయాంచ మనుః ద్వాదశవర్ణకః ॥" - అని ఈ మంత్రం, గురువు ద్వారా చెప్పుకొనవలెను. అటులనే -

శుకాది మహర్షులు సేవించుట కొరకు వట వృక్షచ్ఛాయలో నివసించు

వాడుననగు దక్షిణామూర్తి దేవుని ధ్యానించెదము.

3వమం: "విష్ణు ఋషిః, అనుష్టుప్ఛందో దేవతా దక్షిణా&&స్యోమం త్రేణాంగ న్యాసః, తాం ) నమోభగవతే తుభ్యం వటపదం తతః, మూలేతి పదం ఉచ్చార్య వాసినే పదముద్ధరేత్, వాగీశాయపదం పశ్చాత్ మహోజ్ఞాన పదం తతః, దాయినే పదముచ్చార్య మాయినే నమ ఉద్ధరేత్, అనుష్టుభో మంత్రరాజ స్సర్వమంత్రోత్తమోత్తమః" - అనుమంత్రమును సద్గురు సన్నిధిలో పొందవలెను.

ధ్యానము: వేదప్రతి పాద్యుడును, గ్రంథము, అగ్ని, సర్పము, అను వీటిచే ప్రకాశించు బాహువులుగల వాడును, ముక్తాహార విభూషితుడును, చంద్రకళలో ప్రకాశించు కిరీటము కలవాడును, ప్రసన్న వదనుడును, వట వృక్షమూలము నందు నివసించుచున్న వాడును, గిరీదేవి భర్తయు, అజ్ఞానము నశింపజేయువాడును, అగు పరమ సద్గురు మూర్తిని ఉన్నత స్థితిని పొందుటకు ధ్యానించుచున్నాను.

"దక్షిణా" - అనగా బుద్ధి (మేధా). నేత్రమునకెదురుగాబోధ పడుటవలన, పరమ శివుడు దక్షిణామూర్తి అని బ్రహ్మవేత్తలందరు.

ఈ పరమ రహస్య మంత్రములను పఠించిన భక్తులు సమస్త పాపక్షయులై మోక్షమును పొందెదరు. ఇత్యుపనిషత్ సమాప్తమ్.

## గురు(వు) శక్తి

"గృహీ వాక్యోనయవిద్ వదాన్యః,
స్వర్గముపైతి విద్వాన్"

గురువుల యుపదేశమును స్వీకరించు వాడు స్వర్గమును పొందును - అని "విదురనీతి" -

గురువు, యోగి పుంగవుల నుండి దివ్యప్రేమ, ఆధ్యాత్మిక శక్తి యితరులకు ఐదారు మార్గముల ద్వారా ప్రవహిస్తుంది.

ఇందులో మొదటిది - గురువు శిష్యుని కళ్ళలోనికి నిశితంగా దృష్టిని సారించడం. దీనినే - "అక్షి సంయోగ శక్తి పాతము" అంటారు.

రెండవది - గురువు తన ఏకాగ్ర మనస్సు ద్వారా శిష్యుడు ఆపదలో నున్నప్పుడు, అత్యంత శక్తివంతమైన ఆధ్యాత్మికత రంగములను పంపి అతనిని కాపాడడం. ఈ పద్ధతిని - "మహా శక్తి పాతము" అంటారు.

మూడవ మార్గము - గురువు శిష్యుని హృదయ కమలముపై తన దివ్య

హస్తమునుంచి, ప్రేమ ఆధ్యాత్మిక శక్తులద్వారా దానిని యుత్తేజ పరచడం. ఈ మార్గమును "హృత్ శక్తి పాతము" అంటారు.

నాల్గవ మార్గము - ఆ దివ్య పురుషుడు (గురువు) తన దక్షిణ హస్తమును పూర్తిగా దృష్టిని సారించి **సాధకుని శిరస్సుపై నుంచి ఆశీర్వదించడం.** అనగా, ఆ దివ్య పురుషుని దక్షిణ **హస్తముతో సాధకుని శిరస్సుపై భాగము** సంయోగం చెందడం. దీని వలన దివ్యానందమనే **అమృతము** సాధకుని **శిరస్సు నుండి** క్రిందకు ప్రవహించి శరీరమంతా వ్యాపిస్తుంది. దీనినే - "హస్త మస్తక సంయోగము" అంటారు.

ఐదవ మార్గము - గురువు సాధకుని ఆర్తిని మన్నించి, శిష్యుని "శిరస్సును, హస్తమును" తన (గురువు యొక్క) చరణ కమలములపై కొంతసేపు తగిలి యుంచడానికి అంగీకరిస్తాడు. తద్వారా గురువు చరణములు, బొటన వ్రేళ్ళు శిష్యుని శరీరములో ఆధ్యాత్మికమైన శక్తిని ప్రవేశ పెడ్తాయి. ఇట్లు శిష్యుని పాపప్రక్షాళన మొనర్చి రక్షించే జీవాధారమైన దివ్య శక్తి సాధకునకు ప్రవేశ మౌతోంది.

ఆరవ మార్గము - పైనుదహరించిన అన్ని మార్గములు గొప్ప ఆధ్యాత్మిక ప్రాముఖ్యత గల యొకే యొక పరిపూర్ణమైన సంఘటనలో మిళితమై యుంటాయి.

ఇక సాధకుడు నిస్వార్థ ప్రేమతో పరిపూర్ణమైన ఆత్మ సమర్పణ భావముతో ఆ దివ్య పురుషుని (గురువు) ముందు సాష్టాంగపడి, తన శిరస్సును, హస్తమును ఆతని చరణకమలములపై నిలిపి, తాదాత్మ్యభావముతో తనవైపు నిశిత దృష్టితో చూస్తున్న గురువు దృష్టితో తనవైపు నిశిత దృష్టితో చూస్తున్న గురువు దృష్టిలో దృష్టి కలుపుతాడు. గురువు తన దివ్య హస్తమును శిష్యుని శిరస్సుపై నుంచి అతనిని ఆశీర్వదించుతాడు. అప్పుడు దివ్యమైన ప్రాణశక్తి ప్రవహించే ఆధ్యాత్మిక పరమైన యీ ఒక్క క్షణంలో సాధకుడు తన అంతరంగంలో నిరుపమానమైన, భావాతీతమైన తాదాత్మ్యస్థితిలో పొంగి పొరలే దివ్యానందాను భూతిని పొందుతాడు.

దీనినే "హస్త మస్తక సంయోగ"మందురు.

ఇట్టి చర్య అనుభవించిన **అదృష్టవంతుల మనస్సులలో పేరుకపోయిన** కల్మషమును తొలగించి, వారి శారీరక, మానసిక రుగ్మతలను తొలగించి, చివరకు వారిని ఆధ్యాత్మిక ఆత్మజ్ఞానం పొందే సాధనలో ప్రవేశమౌతోంది. దీనికింత గొప్ప ప్రాముఖ్యత కలదు. ఈ సంయోగఘడియలో శిష్యుడు పరిపూర్ణమైన ఆత్మార్పణంగా నుండాలి.

అప్పుడు పొందదగినదిది?

"అనన్య ప్రోక్తే&గతి రత్ర నాస్తి" అని గద 'శృతి'.

అనగా నీ వర్ణింపబడిన బ్రహ్మయే తన ఆత్మగా కల్గిన ఆచార్యుడు బోధించగా,

ఆత్మ విషయమున జ్ఞానము కలుగదనెడు మాటయే ఉండదు ఆచార్యునకు కలిగినట్లుగానె శిష్యునకు కూడ "ఆ బ్రహ్మము నేనే" - అను బోదకలిగియే తీరును అని అనగా ఉపదేశించునట్టి గురువు బ్రహ్మ తాదాత్మ్యమును పొందిన వాడైనచో, అతడు బోధ చేయగా శిష్యునకునూ తప్పక అట్టి బ్రహ్మజ్ఞానము కలిగి తీరును దాంతో "బ్రహ్మమునేనే" అను అనుభవము కలిగితీరును

ఇట్లు గుర్వనుగ్రహమున తామే బ్రహ్మమని గుర్తింపు కలుగుటతో, పూర్వమున్న విభిన్న భావము అనగా వీరింతవరకు తెలుసుకొనగోరుచున్న తాము వేరనియు, తెలియబడ వలసిన బ్రహ్మ వేరనియున్న భావముతో వారికి వేదవాక్యముల సమన్వయమందిక సందేహములే వారిలో నిలిచియుండునవి ఇపుడా సందేహములన్నియుతీరి, వారాత్మారాములైరి దాంతో వారికి పొందగినదేదియు పొందబడనిదేదియు కానరాలేదు అనగా సర్వం పొందబడినవే ఆయ్యెను సర్వం తెలియబడినవియే అయ్యెను నైష్కర్మ్య సిద్ధి యనెడి పరమశాస్తి వారికి దక్కెను

★★★

## గురు - సూత్రములు

శిష్యుడు గురువును ఆశ్రయిస్తేనే అతని(శిష్యుని)లో
అవిద్యాలోపమంతరించి, ఆత్మవిద్యాపరుడౌతాడు

★★★

ఆత్మజ్ఞాన ప్రబోధంతో శిష్యుని జాగృతపరచుచు భవ బంధముల నుండి
విముక్తి ప్రసాదించే వాడే గురువు

★★★

గురువు కరుణాకటాక్షము శిష్యులందరికిని స్పృశించును

★★★

"కామధేనుర్గురోర్వాక్యం
భవిష్యత్యోన్యదా కథం
గురుభక్తి విశేషతః"

★★★

# 35. శ్రీగురు బోధ

పసితనంలోనే శ్రీగురుబోధ పొందడం అందరికిని అత్యావశ్యకం. శ్రీగురుబోధతో ధారణ కలుగుతుంది. ఆ ధారణ శాశ్వతమై మరపురానిదిగా నిలిచి, మరీ ఎక్కువ గురుబోధకై రాను రాను తహ తహ పడుతుంటాడు. ఆ ఆతురతతో విషయ సంగ్రహణ యందు ధారణా శక్తితో జ్ఞాపక శక్తిని కలిగియుంటాడు.

యోగాచార్యుడైన 'పతంజలి' మహర్షి మాత్రం 'ధారణ' శబ్దానికి, "ఇంద్రియాలను నితర విషయాలపైకి పోనీయకుండా మన స్థిమితంతో సావకాశంగా ధ్యానాభ్యాసంతో యేకాగ్రతపై మనస్సు దృష్టి నిలుపుతూ యేదేనినొక మంత్రమును స్మరిస్తూండడం 'ధారణ'యగును. ఉదా॥ "శ్రీరామ రామ" మంత్రమును మనస్సున ధారణ చేస్తే, ఆ మనస్సు ఆమంత్రముపై స్థిరమై యిక శాశ్వతంగా ఆ "రామ రామ" శబ్దమునే స్మరిస్తూండడం జరుగును. ఈ 'రామ రామ' శబ్దం శ్రీరాముడనే బావనలో నిమగ్నమై యుండడం 'ధ్యానమ'నబడును. ధ్యానానికి, ధారణకు సూక్ష్మ భేదమున్నది. 'ధ్యానం'లో స్మరణ యుండదు. విరుపు ఉండదు. ఒకే భావన నిరంతరంగా నిలిచి యుంటుంది. కాని, 'ధారణ'లో స్మరణ ఉంటుంది. ఆ స్మరణకు మధ్య మధ్యలో విరుపు కూడా యుంటుంది. మనస్సును నొకే స్మరణపై నిలబెట్టడాన్ని 'ధారణ' అందురని 'పతంజలి' భాష్యం.

'ధారణ' పెరిగితేనే 'ధ్యానం'లోకి దారితీస్తుంది. అట్టి ధ్యానమే మనస్సునకు శాంతినిస్తుంది. ఆ 'శాంతి' నీక్రింది సూక్తి ద్వారా పొందవచ్చునని పతంజలి ఉవాచ.

శ్లో॥ చేద్ధారణా శక్తి వివర్ధనేచ్ఛా పాఠ్యేషు భాగేషు కలర్థి బాల ।
ధ్యానాశ నిద్రా పఠనాని నిత్యం విధేహి కాలే నియతే వితంద్రః ॥

భా. బాల్యదశలో నున్న ఓ కలార్థీ! చదివిన విషయాలు చిరకాలం గుర్తుండే ధారణా శక్తి పెరగాలంటే, సోమరి తనం వదలి ప్రతిరోజూ ధ్యానం, భోజనం, పఠనం, నిద్రలనునవి నిర్ణీత సమయాలలో (క్రమంగా) చేయాలి. 'కలార్థీ' అనగా 'జ్ఞానార్థి' అని అర్థం. "పాఠ్యేషు భాగేషు" అనుపదాలకు సాధక స్థాయిలో ధారణా శక్తి పెరగటం సహజం. అది కలార్థి కోరిక. ఇదియును గాక, ఆధ్యాత్మిక విజ్ఞానంపై సాధన చేయడం కూడ 'ధారణ' యగును.

'ధారణ'కు పైమెట్టు ధ్యానం. అది దైవధ్యానంగా నున్నచో దానిని పతంజలి ఈశ్వర ప్రణిధానమన్నాడు.

"తపః స్వాధ్యాయ ఈశ్వర ప్రణిధానాని క్రియాయోగః" అని అతని సూత్రం.

పతంజలి చెప్పిన 'ధారణ' పొందాలనుకొన్నవాడు ఈశ్వర ప్రణిధాన రూపమైన ధ్యానానికెక్కువగా సమయం కేటాయించాలి దానితో జ్ఞాపక శక్తి పెంపొందును. ఉత్తరోత్తర కాలం నేదైనను (యోగాంగమైన) ధారణను నవలీలగా సాధించ గలుగుతాడు. ఇదియే పతంజలి సూక్తి.

పూర్వం శ్రీరామకృష్ణ పరమహంసకు నొక శిష్యుడుండేవాడు. అతనికొక దురలవాటుండేది. అదియే సిగరెట్టు తాగడం. ఆ దురలవాటు మానడానికెంతో ప్రయత్నించాడు. కాని నతనికి సాధ్యం కాలేదు. ఒక నాడు రామకృష్ణుడు సిగరెట్టు పెట్టెనొకటి అతనికిచ్చి దానితో నొక షరతుపెట్టాడు. అది యేమనగా, నొక సుద్ద ముక్క యిచ్చి, ఒక సిగరెట్టు త్రాగే లోపు 108 సార్లు 'శ్రీరామ' మంత్రం వ్రాయాలి. అనే నియమం పెట్టాడు. ఇక యా శిష్యుడి నియమమున కొన్నాళ్ళకు సిగరెట్టు త్రాగడం మాని, 'శ్రీరామ' నామములో నిమగ్నుడై పోయాడు. అతడు రామకృష్ణుని తన జీవితం మరువలేదు. అటు పిదప ఆదురలవాటు జోలికి పోలేదు.

ఇట్లు - శిష్యునిలో నున్న దురలవాట్లను తొలగించుకొనుటకు గురువులను నాశ్రయించాలి. శుద్ధ చిత్తముతో, భక్తితో, అర్పణ బుద్ధితో నమస్కరించాలి. కరుణించమని ప్రార్థించాలి. శిష్య ప్రార్థనకు గుర్వనుగ్రహం తప్పక లభించును. సద్గురువుతో, సద్గోష్టితో చర్చించుకొనిన ఆ గురువునకుండే సువాసనలబ్బును. ప్రతిశ్వాసలో గురువుని స్మరించగలగాలి. గురువుతో వీలైనంత వరకు సత్సంగం జరుపుతూ గురుమంత్రం జపించాలి. శ్వాసనే గురువనుకోవాలి. ఉపదేశం యిచ్చినా, యివ్వకున్నా శిష్యుడు గురుమంత్రం జపిస్తూండాలి. ఏ సమయాననైనా గుర్వనుగ్రహం కలగవచ్చు.

గురువు కూడ, తను శిష్యునకు ఉపదేశమిచ్చినా, యివ్వకున్నా ఆ శిష్యుని పరోక్షంగా, నిరాకారంగా నడిపించే వాడుగా నుండాలి

శిష్యుడును, ఏలాగైనా గురు సన్నిధికి చేరటం ముఖ్య కర్తవ్యం సద్గురువును అనుసరిస్తేనే గురు(వు) లక్షణాలు గ్రహించ గలుగుతాడు శిష్యుడు. అట్లు అనుసరించడంలో ప్రమాదం లేదు. నష్టమూ అంతకన్నా వుండదు. ఎందుకనగా సద్గురువు మార్గదర్శి. అట్టి సద్గురువును శిష్యుడు పూర్తిగా అర్థం చేసుకొని, తనలోని దుర్లక్షణాలను గ్రహించి, వాటిని దూరమొనర్చుకొని గురువును అనుసరిస్తూ, గురుదేవులే తన సర్వస్వముగా భావించియుండాలి. అందుచే గురువును "శిరస్థితాయైనమః" అని, "గురు మూర్త్యైనమః" అని, "గురుప్రియాయైనమః" అని, శిరస్సు గురుపాదుకా రూపముందునటుల భావించవలెను. శ్రీవిద్యా గురువు, దేవతా స్వరూపముగా నెంచవలెను. శ్రీ గురు పత్నియు పూజ్యురాలని సన్మానమిచ్చునట్లు ఉండవలెను. గురువు దైవరూపుడు, అటులే గురుపత్ని దైవరూపిణి, ఏ

పుణ్య పురుషులు అర్హులగు శిష్యులకు మన్త్రదీక్ష దానము చేయుచు గురువులనిపించు కొనుచున్నారు. అట్టి వారియందు ప్రేమ, ప్రియత్వము కలిగి యుండుట శ్రేష్ఠము. జ్ఞానమును పొందించునది గనుక 'దీక్ష', అట్టి దీక్షను పొందియున్న గురువునొద్ద శిష్యుడు తిరిగి మన్త్ర ప్రధానముగా దీక్షను పొందినచో, అతనిలోనున్న అజ్ఞానమనెడి పాపము నశించును.

మరియు "సగురుర్మత్సమో జ్ఞేయః" అని గురువును పొగడుదురు. జ్ఞాన గురువులు చిన్ముద్రతో మౌనముగా దర్శనమిచ్చిన, శిష్యులు తరించుటయే గాక, బ్రహ్మజ్ఞానులగుదురని శృతి పలుకుచున్నది.

– "మౌన వ్యాఖ్యాప్రకటిత పరబ్రహ్మ తత్త్వయువానం" –

అని వచనముతో ముని, గురు స్వరూపమని నిర్దేశింపబడినది. మరియు

శ్లో॥ "చిత్రం పటతరోర్మూలే వృద్ధా శిష్యాః గురుర్యువా ।
గురోస్తు మౌన వ్యాఖ్యానం శిష్యాస్తు ఛ్ఛిన్న సంశయః ॥

గురువు మౌన వ్యాఖ్యతో తత్త్వముపదేశించును. అట్టి గురువు తత్త్వతః మహాత్ముడు.

ముముక్షువులగు శిష్యులు (సాధకులుగా) బ్రహ్మ నిష్ఠులై గుర్వనుగ్రహ సంపన్నులై, అజ్ఞానరహితుడై, మౌన ముద్రాంకితుని (గురువును) అపరోక్షముగా సాక్షాత్కరించుకొనును. ఉత్తమ గురువు ముముక్షువులగునంతే వాసులకు, నిధి ధ్యాసన సమాపన్న చేతస్కులకు గురువు మౌనస్వరూపుడై సాక్షాత్కరించును. అని పూర్వంలో చెప్పుకొన్నాము.

అట్లు అపరోక్షముగా సాక్షాత్కరించుటయే మౌన వ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మ తత్త్వం.

"యత్సాక్షాదపరోక్షాద్బ్రహ్మ" – యని శృతి.

బ్రహ్మజ్ఞాన తత్త్వవాక్య వివరణమే మౌన వ్యాఖ్య.

శ్లో॥ అవ్యాకృత విహారాయ సర్వ వ్యాకృత సిద్ధయే ।
హృషీకేశ నమస్తేఽస్తు మునయే మౌన శీలినే ॥

అని, ముని యొక్క మౌన శీలిత్వమును వ్యాస మహర్షి భాగవతం 10స్క.16వఅ. 47శ్లోకమున తెలిపెను.

అటులే – 'శ్రీధరస్వామి' – 'మౌని'ని గూర్చి ఇట్లు వ్యాఖ్యానించెను.

"మునయే ఆత్మారామాయ కిం సాధన వశేన ।
నహి నహి – మౌన శీలినే మౌన మాత్మారామతా" ॥ అని

'మౌనమ'నగా ఆత్మారామత, అది మహాత్ములకు స్వభావ సిద్ధము. సాధన సాధ్యముకాదు. మహాత్ములు ఆత్మారాములై, మౌన ధారు (రూపు)లై విరాజిల్లు చుందురు.

శ్లో॥ తపస్స్వాధ్యాయ నిరతం తపస్వీవాగ్విదాంవరమ్ ।
నారదం పరి పప్రచ్ఛ వాల్మీకిర్ముని పుంగవమ్ ॥

ఆత్మారాముడు మునిపుంగవుడు. అనగా మౌన స్వరూపుడు. నారదుని కృపాకటాక్షమున తపస్వియైన వాల్మీకి వాగ్విదాంవరుడై మౌనియౌ మరలినట్లు శ్రీమద్రామాయణాదిమ శ్లోకము బోధించుచున్నది.

నారద మహర్షి గురూపదేశముగా వాల్మీకి మౌనియౌ శ్రీమద్రామాయణము వ్రాయగలిగెను. అదొక దీక్షగా నారద గురూపదేశంగా కొనసాగెను.

శ్రీ శంకరులు బాల్యముననే గోవింద భగవత్పాదుల నాశ్రయించి తన్మౌన వ్యాఖ్యాప్రకటిత బ్రహ్మతత్త్వము నవగతమొనర్చుకొని బ్రహ్మవిద్యా స్వరూపుడాయెను. అతడును మరల తన శిష్యులకు మౌనముద్రాంకితుడై చిన్ముద్రతో సాక్షాత్కరించి వారల తరింపజేసెను.

అట్టి 'మౌనమనే'ది గురువు అనుగ్రహానికి ఉత్తమోత్తమమైన రూపం. ఆదే ఉత్తమోత్తమ ఉపదేశం కూడ. మౌనంలోనే సాధకుని ప్రార్థన సైతం పరాకాష్ఠ జెందుతుంది. స్పర్శ, దీక్ష, చతుర్దీక్ష మొదలైనవి 'మౌన'దీక్ష తరువాతివే. కనుక 'మౌనం' అన్ని దీక్షలకు మూలం.

గురువు మౌనంలో ప్రతిష్ఠితుడైనప్పుడు సాధకుని మనస్సు దానంతటదే విశుద్ధత పొందుతుంది. 'మౌనం'తో వాఙ్మనస్సులకు అతీత స్థితిని అందుకోవడ మగును. మౌనమనేది మాటలచే అవరోధించబడే నిరంతర భాషాప్రవాహం. చిత్తాన్ని ఏభావ మందైనా లగ్నం చేసేదానికి మూలానికి పోవునప్పుడు మౌనం సిద్ధిస్తుంది. చిత్తవృత్తులు లేని ధ్యాన నిష్ఠయే మౌనం. అనగా తెంపులేని సంభాషణ. మనో వాక్కులకు అతీతమైన స్థితి 'మౌనం'

మౌనంతో నేదో ఒక భావాన్ని దృఢంగా ధారణజేసి దానిమూలాన్ని విశ్లేషించాలి. 'మౌనం' అట్టి ఏకాగ్రతవల్ల సిద్ధిస్తుంది. అభ్యాసం సహజమై పోయినప్పుడు అది మౌనంలోకి పర్యవసిస్తుంది.

మనో వ్యాపారం లేని ధ్యానమే మౌనం. మనస్సును స్వాధీనం చేసుకొనే ప్రయత్నమే ధ్యానం. ప్రగాఢమైన ధ్యానం నిత్యమైన శబ్దబ్రహ్మ. శబ్దం ఈ విశ్వంలో మమేకమైనది. శబ్దమంటే అక్షర కూర్పుతో రూపం దాల్చిన భాష అనికాదు. శబ్దం కూడ పరమాత్మునివలె రూప గుణాలులేని జీవనవాహిని. భావాలకు చక్కని ప్రతిబింబాన్ని కల్గించే శక్తి శబ్దానికుంది. కానీ భాషకు లేదు, చిదానందునితో సరితూగే శబ్దం సంపూర్ణంగా మౌనంలోనే ఉంటుంది.

మౌనంలో ఎన్నో ఉత్తేజ భావ గంభీర తరంగాలు చిరుసవ్వడి చేస్తుంటాయి. మౌనం ఆవరించి యున్న ప్రాంతం ఉల్లాసకర మంద్రధ్వనితో మనస్సును ప్రశాంతం జేస్తుంది. ఇది అనుభవ పూర్వకంగా తెలియాలంటే మౌనధ్యానమందిరాలను సందర్శించినప్పుడు ప్రస్ఫుటమౌతుంది.

ఇట్టి మౌన వ్యాఖ్య "శ్రీ దక్షిణామూర్తి" చరిత్రలో ఆకళింపు జేసుకొనవచ్చును. ఆ పరమ పురుషుని మౌనం సాక్షాత్ పరబ్రహ్మ తత్వాన్ని గుర్తు చేయును. నిక్షిప్త జ్ఞానం పొందు భావం, అఖండజ్యోతి స్వరూపం సందర్శనమగును.

ఆ అఖండ జ్యోతి స్వరూప సందర్శనం గురువు చిన్ముద్రతో నగును. ఇట్టి 'చిన్ముద్ర'కు అర్థం, మహనీయులు తమ నెవరేని, ఏదేని ప్రశ్నించినచో వెంటనే 'చిన్ముద్ర' ధరించి సమాధానమిత్తురు. ఆ చిన్ముద్ర సమాధానమునకర్థం.

గురువు అనగానే అంగుష్ఠ, తర్జనీ (బొటన, చూపుడు) వ్రేళ్ళ ఏకం చేసిన ముద్రను ధరించడం చిన్ముద్ర అందురు. అటులే గురువు ఎడమ కాలును మడచి, మౌనమే ఆభరణంగా కలిగి, ఆనంద నేత్రాలను మూసుకొని శిష్యగణంతో వారి మనో నేత్రాలకు దర్శనమిస్తాడు. ఆ నేత్రానందంతో శిష్యులలో మనస్సు ప్రశాంతత, ఆహ్లాదం చేకూరుతుంది. ఆ భంగిమలోని దివ్యానుభూతి అనన్యమైనది. అనిర్వచనీయమైన ఆనందాన్ని అందించగల శక్తి ఆ చిన్ముద్రలో నుంది. అందుకే -

శ్లో॥ అంగుష్ఠం తత్పదం ప్రోక్తం తర్జనీ త్వంపదే స్థితం ।
తయోరైక్యం తయోస్సంధిశ్చిన్ముద్రా సాప్రకీర్తితా ॥

'ముద్ర' అనగా ఒక చేతితోనూ, లేక రెండు చేతులతోను ప్రదర్శించే భంగిమ, సర్వముద్రలలో శ్రేష్ఠమైనది చిన్ముద్ర. పరబ్రహ్మ జ్ఞానానికి సంకేతం. ఆ ముద్రలోని బొటనివ్రేలు పరబ్రహ్మాన్ని సూచించేది. మరి చూపుడు వ్రేలు జీవాత్మగా సూచిస్తుంది. తక్కిన మూడువ్రేళ్ళు (మధ్య, అంగుళీ, చిటికెన) నిటారుగా సచ్చిదానంద లక్ష్యానికి సూచకం. సచ్చిదానంద లక్షణంగల విశ్వంలో పరబ్రహ్మ తత్త్వంతో జీవుడు లక్ష్యంపొంది యుండాలి. విశ్వకారకం, విశ్వపరిరక్షణం, విశ్వలయత్వం ఆ పరబ్రహ్మ తత్వమే. విశ్వం శూన్య మయ్యేదాక, అనంతకోటి బ్రహ్మాండ పరబ్రహ్మ తత్త్వంతో జీవుడు మమేకమై ఈ చిన్ముద్ర. ఈ సమస్తానికి ఆధారం 'పరబ్రహ్మమే', అనే పూర్ణజ్ఞానం కల్గించేదే ఈ చిన్ముద్ర. దేనివలన విశ్వం ఉద్భవించిందో, ఆ కారణంలోనే విశ్వం లయం చెందుతుందనే అద్వైత సిద్ధాంతానికి ఈ చిన్ముద్రయే ఆధారం. అనగా నాయనా! నీవును నేనును నొక్కటేయని, ఇతరులు నన్ను నమ్మనివారని, మిగిలిన మూడు వ్రేళ్ళను వదలి, ఆ యిరువురికే ప్రాధాన్యమిచ్చునట్లని చిన్ముద్రలోని భావము. ఐక్య సంధాన చిహ్నమది.

ఆ అత్యద్భుత జ్ఞానతత్వముద్ర (చిన్ముద్ర) నుండి పరమ పురుషులు తాము పొందాలనుకున్న పూర్ణ జ్ఞానాన్ని పొందగలిగారు, ఈ చిన్ముద్ర దర్శనం శ్రీదక్షిణామూర్తిలో అవగతమగును. అటులే గురు ప్రముఖులైన శ్రీజగద్గురు శంకరాచార్యులు, శ్రీ షిరడీశుడు, శ్రీరాఘవేంద్రుడు ఆ చిన్ముద్రనే చేపట్టిరి.

కలియుగారంభంలో మానవుడు తొలిసారిగా ప్రదర్శించిన క్రియ కూడ చిన్ముద్రను ధరించడమే అని పరిశోధనా శాస్త్రం పేర్కొన్నది.

గురువు శిష్యుని యెడల హస్తంతో చిన్ముద్ర ప్రదర్శించడ మనునది, ఆ హస్తం భగవశ్శక్తితో నిండినది, మనో ఔషధం వంటి మహిమాన్వితమైనది. అందుకే "అయంమే హస్తో భగవాన్" అన్నారు. ఆ హస్తంలోని అయిదు వ్రేళ్ళు పంచ భూతశక్తులే. పరమాత్మ స్వరూపమైన బొటన వ్రేలితో మిగిలిన నాల్గు వ్రేళ్ళను స్పృశించడంతో ఆ నాలుగు వేళ్ళకును 'శక్తి' ఆపాదింపబడును.

ఆ హస్తంలోని బొటనవ్రేలితో చూపుడు వ్రేలు ఏకమవడంతో చిన్ముద్ర (జ్ఞానముద్ర) ఏర్పడును. ముదారాతీతిముద్ర. చిత్+ముద్ర = చిన్ముద్ర.

"ముద్రావినయ సంకేతః నిగూఢ బీజాక్షర ముద్రితా" ఇతి

శ్లో॥ ముదంకరోతి దేవస్య ద్రావయే దుఃఖ పాతకే ।
ఇతి ముద్రా నిరుక్తస్య మంత్రశాస్త్రేఽపిసూయతే ॥

భా:- ముద్రా శబ్దమున మొదటి అక్షరమగు 'ము' అను దానికి దైవమునకు ముదము చేయునది, 'ద్రా' అనునది దుఃఖ పాపములను తరిమివేయునది అని అర్థము.

సాధారణముగా గురువులు గొప్ప (ఆత్మ సంబంధమగు) విషయాలనే చెబుతూనే యుంటారు. అయితే ఆ చెప్పిన విషయాలు శిష్యునిలో వెలుగొందవలె. అనగా జ్ఞాన ప్రకాశమొందవలె. దైవ సమానమగు భక్తి గురువు నందున్నపుడే, అట్టి ప్రకాశ జ్యోతి వెలుగొందును. నిస్స్వార్థ భక్తి భావము కుదిరినప్పుడే శిష్యుని హృదయమునందు విజ్ఞాన జ్యోతులు వెలుగొందుచుండును.

ఏమిటా వెలుగు? ఎలా వెలుగొందును? ఎప్పుడూ?

శిష్యునిలోనొక యార్తి వెలువడియుండును. ఆ ఆర్తికి తోడుగా గురుబోధ శిష్యునకు అవగాహన కలిగినచో, అట్టి గురువుపై భక్తి యేర్పడును. శిష్యుని నవ్వించుచు కవ్వించుచుండిన గురువు యెడల భక్తితో బాటు ప్రేమ యనురాగము నిలుచును. శిష్యుని సుఖదుఃఖములలో గురువు పాల్గొనినచో గురువు యెడల శిష్యునకు గౌరవాదరములుండును. గురువు బోధించినది శిష్యుని హృదయములో ప్రకాశిస్తుంది.

గురువను దర్శనముతో మనస్సు భగవంతునియందు లగ్నమగునట్లు, గాఢమైన భక్తి భావమునుపొంది యుండవలెను. అనగా గురువు దర్శనమనెడిది, 'శిరసి గురు పాద ప్రణయిత' భావముండవలెను. అట్టి శిష్యుడే గురుని కేవలం నరునిగాకాక, సాక్షాన్నారాయణునిగా దర్శించును. మరియు భగవత్స్వరూపునిగా తల్లి, దండ్రిగా, ఆత్మ బంధువుగా, పరమ మిత్రునిగా నెంచి దర్శించును

అందులకే 'గురుదేవోభవ' అని పెద్దలందురు 'దేవ' అను పదమునకు అర్థము 'ప్రకాశము' అని. శిష్యుని హృదయమును ప్రకాశవంతమొనర్చు మహాపురుషుడు 'ప్రకాశము'నకర్థం విజ్ఞానమని కూడ

గురువును చేరడమనునది, భగవంతుని యాశ్రయించడమే అందులకు ముందుగా సరియైన విజ్ఞానప్రదుడైన భగవత్స్వరూపునిగా తలంచి చేరడం, "శాస్త్రం" యుత్తమమని చెప్పును. శ్రీ పాంచరాత్రాగమ గ్రంథాలు భగవంతుని పొందడానికి గుర్వువు ద్వారా పొందవలసిన ఐదు (౫) సంస్కారాల గురించి చెప్తున్నాయి

౧.తాపము, ౨ పుండ్రము, 3.నామము(తిలకము), ౪ మంత్రము, ౫ యాగము అని అంటారు ఈ ఐదింటిని సద్గురువుద్వారావే యుపదేశంగా పొందడమే "సమాశ్రయణమ"ని అంటారు

★★★

## గురు - సూత్రములు

""ప్రయాన్తి పరమం స్థానం గురుపూజా పరాయణాః" -

గురుపూజా పరాయణులు పరమ పదమును పొందుదురు.

(నా.పు. 9అ. 138/2 శ్లో)

★★★

"గురువాక్యం హి తారకం!"

గురువాక్యము తరింపబడేది కదా!

★★★

**"తేన నగురుర్భోజనీయ స్తద్దైవ చాన్నం నభునక్తిశృతుతత్"**

**గ్నురువునకు భోజనము పెట్టకున్న, తాను నేర్చిన వేదవిద్య పొందడు.**

★★★

# 36. గురువు - సమభావన

సమర్థుడైన గురువు సర్వ విద్యార్థుల పట్ల సమభావన కలిగియుంటాడు. అనగా ప్రత్యేకాభిమా, ం చూపించడు. సర్వులకు నొకేరకంగా బోధిస్తాడు. కానీ, ఆ బోధన ఆయా విద్యార్థుల మనో భావనను బట్టి గురు బోధనను నుపయోగించు కొంటారు.

అటులే, భగవంతుడును జీవుల పట్ల సమ భావన కల్గియుండడం కూడాను. కానీ, ఆ జీవుల మనో భావనను బట్టి వారికా భాగ్యం (ఫలం) లభించును.

అది, దుర్యోధనార్జునుల ప్రవర్తనయే తార్కాణము. కాబోయే యుద్ధమునకు వీరుభయులు ద్వారకకు చేరి, పెద్దలాదేశముగా శ్రీకృష్ణుని సహాయము కోరిరి. అందులకా పరమాత్మ వారి వారి వినయ విధేయతలు గ్రహించినను, ఇంకా పరీక్షించుటకు, యుద్ధ రంగమున యుభయులకును తాను సహకరించుటలో, తాను, తన పదివేయిల సైన్యముగా రెండు భాగములుగా నేర్పరిచి, తానుమాత్రం అస్త్రము పట్టనని యుద్ధము చేయనని, తన పదివేయిల సైన్యము అస్త్రములతో యుద్ధము చేయుదురని, రెండు ప్రక్రియల విషయము తెలిపెను. అదివినిన దుర్యోధనుడు రెండవదానిపై మనస్సు కలిగియుండెను. ఇక వాటిని పంచుకోవటంలో చిన్న వాడగు అర్జునునకు రాగా, అతడు సాక్షాత్ శ్రీ కృష్ణునే ఎన్నుకొనెను. అతడికి తెలుసు, శ్రీకృష్ణుడసామాన్యుడని, పరమాత్మయని. అర్జునుని, ఎన్నుకోవటం దుర్యోధనునకు తన మనో రథము నెరవేరినట్లుగా తలంచి, అటులే తనకిక రెండవది యగు పదివేయిల సైన్యమును గ్రహించి వెళ్ళెను. అనగా పరమాత్మను పరమాత్మగా తలంచని వానికి ఫలితమేమయ్యెనో కురుక్షేత్రమే తెలిపెను.

"భగవద్గీత"లోని చరమ శ్లోకమే బహుచక్కని తాత్పర్యము. అటులే, గురువుగారు కూడ సర్వులకును (శిష్యులకు) ఒకే రకంగా బోధిస్తాడు. అయినా, శిష్యుల మనో భావనతో ఆ బోధన ఏకీభవించడంలో గురువు బోధనలో భేదముండదు. అలాంటి ఆలోచన కథయిది.

కురు పాండవులకు ద్రోణుడే అన్ని విధాల రాజగురువయ్యెను. ఉభయులకును నొకే రీతిగా ధనుర్విద్యాది నైపుణ్యం కల్గించెను. కానీ దుర్యోధనుడికి మాత్రము, గురువు (ద్రోణుడు) భీముని పట్ల పక్షపాతం చూపుచున్నాడని, ఏవో రహస్యాలు నేర్పుచున్నాడని భావించెను. అది గ్రహించిన ద్రోణుడు ఒకనాడు వీరిద్దరిని యొక అరణ్యమునకు గైకొని వెళ్ళెను. మార్గ మధ్యములో నొక యక్షుడొక బ్రాహ్మణ బాలుని వెంటాడి వధించుటకు యత్నించుచుండెను. ఇది గని దుర్యోధనుడాశ్చర్యపడి యక్షుని ఆపి ప్రశ్నించెను. అప్పుడా యక్షుడు భీమదుర్యోధనులతో నిట్లనెను.

"అయ్యలారా! ఈ బ్రాహ్మణబాలకుని తండ్రి శాపముతో నా తండ్రి గతించెను. అందులకీ బాలకుని నేను వధించి నాపగ తీర్చుకోవలెనన్న, ఈ బాలుడు చిక్కగా మాయావిలాగ తప్పించుకొనుచున్నాడు. ఇక నావల్ల కాలేక మీరిరువురిలో నొకడు నా బాలుని పట్టి యిచ్చిన వారికి సహకరించిన ఫలితముగా సకల భోగ భాగ్యాలు కల్గిస్తాను. అయ్యోపాపం కదా! యని జాలిపడి వాడినేమి చేయకుండా వదలిన వానికి నొక మంత్రోపదేశం మాత్రం చేస్తాను. వాడిని వధించుటకు యత్నించి భోగాలను పొందుతారో, వధించిక మంత్రాన్ని పొందుతారో మీరే తెల్పుకోండి!" అన్నాడు. ఆ మాటలు రాక్షసుని వంటి యక్షుని ప్రవర్తనకు భీముడాశ్చర్యపడి, ఇట్టి అర్భకునిపై పరాక్రమం చూపించి భోగాలు పొందటం క్షత్రియ ధర్మమనిపించుకోదు. తానా పని చేయనని నిరాకరించెను. కానీ దుష్ట బుద్ధి కల దుర్యోధనుడు మాత్రము బాగా ఆలోచించి భోగాల లాలసుడై, మంత్రమును పొందుటకు నిరాకరించి, ఆ అర్భకుని వధించుటకే సిద్ధపడెను. తన గదతో మోదుటకు యత్నించగా నా బ్రాహ్మణ బాలుడు (మాయతో) శ్రీ కృష్ణుడిగా ప్రత్యక్షమై యిట్లనెను.

దుర్యోధనా! భీముడు నువ్వు, ఇద్దరునూ నొకే గురువు (ద్రోణుని) వద్ద విద్యా జ్ఞాన బోధ పొందితిరి. కానీ ఆ విద్యను ఎక్కడ, ఎలా యుపయోగించాలో గ్రహించలేక, తాత్కాలికమైన అశాశ్వతమై భోగ భాగ్యాలకాశపడి నీక్షత్రియధర్మం మరచితివి. గురువు బోధను గ్రహించలేక, అవగాహన వీడి ప్రవర్తించిన శిష్యునకీ చిన్న గుణపాఠం కేవలం కల్పితం మాత్రమే.

కావున సద్గురువు విద్యాదానం సర్వులకు సమంగానే యుంటుంది. నైపుణ్యుడు యొకరీతిగా గ్రహించగా, జడుడు మరొక రీతిగా గ్రహించడంలో వారి వారి మనో భావనలపై నాధారపడియుండును. కానీ, భేదమనేది గురువునకుండదు.

శ్రీకృష్ణుడును: అర్జునునితో నిట్లనెను.

శ్లో॥ "సమోఽహం సర్వభూతేషు నమే ద్వేష్యోఽస్తి నప్రియః ।
యే భజన్తి తు మాం భక్త్యా మయితే తేషు చాప్యహమ్ ॥ - భగవద్గీత (9-29)

నేను సమస్త ప్రాణులందును సమముగా నుండువాడను. నాకొకడు, ద్వేషింపదగినవాడు కాని, మరియొకడు యిష్టుడు గాని యెవడును లేడు. ఎవరు నన్ను భజింతురో భక్తి భావముతో నుందురో వారు నా యందును, నేను వారి యందును నుందును. అని.

అటులే గురువు కూడా తలంచి యుండును. యుండవలెను కూడా.

★★★

# 37. గురు శిష్య పరంపరాభి వర్ణనము

వంశము ద్వివిధములు. ఒకటి విద్యావంశము. రెండవది జన్మతో గలుగు వంశము. అందు శరీరమును మాత్రమొసంగు జన్మవంశము కన్న, సర్వవ్యవహార సాధనమగు జ్ఞానమొసంగియున్న విద్యావంశముత్తమమను అభిప్రాయమును సూచించడమైనది.

"శ్రీగురు దత్తాత్రేయాయ నమః" శ్రీగురు దత్తుడు ఆచార్యుడుగా కీర్తింపబడెను.

శా॥ సత్తామాత్రుడు నిర్విశేషుడు తనూ సర్వేంద్రియ ప్రాణహృ
చ్చిత్తాహంకృతి ధీప్రకాశకుడు సచ్చిత్తోషకాయుండు వి
ద్వత్తా పాంధతమ ప్రదీప మయుడాత్మస్వామిభాసిల్లె శ్రీ
దత్తాత్రేయ గురుండనంగ జగదంతర్యామియై మున్నిలన్ ॥

భా: దేశకాల వస్తువులచే గలుగు భేదములులేక, ఒక్క రూపముగా నుండు, మనో బుద్ధి చిత్తాహంకారములకు సాక్షియై, సచ్చిదానంద రూపుడై యాశ్రితులగు వారి తాపత్రయముల నడంచుచు, నొక్కకూటస్థ పరబ్రహ్మము (భ్రాంతి లేని జీవుడు) సకల జగంబున నియమించుచు దత్తాత్రేయాచార్యుండను పేర భూమిపై వెలుగొందెను. "దత్త" అనగా తననర్పించుకొను గురువు.

క॥ ఆదత్తాత్రేయ గురు
శ్రీదివ్యపదార వింద సేవాదిశ్రీ
యోదుడు ప్రత్యక్ష ప్ర
హ్లాదుండన శ్రీజనార్దనాహ్వయుడొప్పున్.

తా: ఆ దత్తాత్రేయ గురునకు శిష్యుడై యమ్మహానుభావుని పాదసేవయే తనకు మహోన్నత పదవిగా నానందించుచు ప్రత్యక్షముగా గానవచ్చు ప్రహ్లాదుడో యన, జనార్దన యోగి జగత్ప్రసిద్ధుడై వెలంగె.

తే॥ ఆ జనార్దన గురునక త్యద్భుతముగ
శ్రీమదేకో గురుస్వామి శిష్యుడయ్యె
ముని వశిష్ఠ మహామునీంద్రునకనర్థి
దాశరథి భక్తుడైన చందంబు దనర.

తా: మున్నారామభద్రుడు వశిష్ఠ మహామునికి శిష్యుడైనట్లు, బ్రహ్మవేత్తలలో నగ్రేసరుండగు 'నేకోగురు' స్వామి యాజనార్దన యోగీంద్రునకు శిష్యుడయ్యే.

విశే: "ఏకో గురుస్వామి" వారు రచించిన గీతా భాష్యాదులు వేదములట్లు

పరమప్రమాణములై అలరారుచుండ, వామదేవుడు, శుకుడు, అర్జునుడు, వ్యాసుడు, భీష్ముడు మొదలగు వారితో సమానుడై ప్రసిద్ధి గాంచెను. అమ్మహాత్ముని పరబ్రహ్మనిష్ఠను జాచిన ప్రహ్లాదుడు సైతము ఆశ్చర్యపడుచుండెననుట అతిశయోక్తి కాదు. ఈ గురుశిష్యులిరువురును లోకమునకాశ్చర్యము గలిగించుచుండిననుట తథ్యము.

క॥ ఆ నాగో రాముసకున్,
శ్రీనారాయణు కజుని చెలవున భక్తుం
డై నెగడె నెల్లదిక్కుల,
గోనేరు గురుండు తత్త్వకోవిదుడగుచున్.

భా: శ్రీమన్నారాయణునకు బ్రహ్మదేవుడు శిష్యుడైనట్లు ఆ నాగోజీ రామగురువునకు కోనేరు గురుడు శిష్యుడయ్యెను. బ్రహ్మవేత్తలలో నుత్తముడై త్రిలోకముల యందు ప్రసిద్ధి గాంచెను.

విశే: ఆ కోనేరు గురువు కాశీరామేశ్వర, మధ్య ప్రదేశమునందున్న సకల ప్రభువుల చేతను సాష్టాంగముగ నమస్కరింపబడుచు, ఆకాశాది సమస్త ప్రపంచమున కతీతుడై శుద్ధ పరబ్రహ్మ రూపుడై సర్వదామోక్ష సుఖముననుభవించుచు తేజరిల్లుచుండెను.

శా॥ ఆ కోనేరు గురూత్తముం గొలిచి దివ్యాధ్యాత్మ యోగంబు దా
శ్రీ కల్యాణ గుణ ప్రసిద్ధుడగుచున్ శ్రీమన్మహాదేవలో
కైకాచార్యుడు సంగ్రహించె నతి సౌఖ్యంబుప్ప సాందీపునిన్
శ్రీకృష్ణుండు భజించి విద్యనొనరం జేకొన్న చందంబునన్.

తా: శ్రీకృష్ణమూర్తి సాందీపుని సేవించి, చతుష్షష్టి (64) విద్యలను గ్రహించినట్లు, బ్రహ్మవేత్తయగు మహాదేవుండను గురువరుండు మనోనిగ్రహము, ఇంద్రియనిగ్రహము మొదలగు సమస్త సద్గుణములకు నిధియైన యాకోనేరు గురువునాశ్రయించి జీవ బ్రహ్మైక్యమును తెలిసికొనుటకు ముఖ్యసాధనమగు రాజయోగమును గ్రహించి బ్రహ్మానందమును పొందెను.

విశే: అట్టి మహాదేవాచార్యుడు సకల జీవులను, "సంసారభ్రాంతిలో జిక్కించి త్రిప్పునట్టి మాయను" తన చేత జిక్కించుకొని త్రిప్పుచున్నాడు. 'గురువు'లని చెప్పదగు వారలందరకును నాచార్యులై, సకల జగత్తునకును కారణ భూతులైయున్నారు. నానావిధములగు ప్రపంచములను గూడ నపరిమితమగు శక్తితో ప్రకాశింపజేయు సూర్యాదులకునూ కాంతినొసంగుచున్నాడు. ఇంద్రుడు, యముడు మొదలగు

సమస్త లోకపాలకులనూ ఆజ్ఞాపించుచు, వారలకధిపతిగాయున్న చతుర్ముఖునకునూ ప్రభువై యున్నాడు. ఆ యాచార్యుని రూపం సగుణమై ఉపాసకుల ననుగ్రహించుచుండును. నిర్గుణుడై నిర్వికల్పముగ ధ్యానింపబడుచు న<sup></sup>రోక్ష జ్ఞానమునకు విషయమై మోక్షమును గోరువారిని కరుణించుచున్నాడు.

ఇట్టి మహాప్రభావ సంపన్నుడగు నా గురుశ్రేష్ఠుని వేదాంతములోను నుపనిషత్తులు గాని, ఆగమాంతలగు షడధ్వ సహితములైన కర్మసాదాఖ్యము మొదలగునవి గాని, బ్రహ్మసూత్రము మొదలగు శాస్త్రములు గాని వర్ణింపనేరవు. ఇట్లుండ నమ్మహాత్ముని వర్ణింపనెవరితరము.

అత్రి మహాముని శ్రీ దత్తాత్రేయ రూపముతో నవతరించిన శ్రీమన్నారాయణునితో సమానుడునూ, సకల లోకములకు నంతర్యామి స్వరూపుడును, జీవ బ్రహ్మైక్య సమాధి నిష్ఠుడును. ఆచార్యులలో నుత్తముడునగు నమ్మహా దేవాచార్యునకు నీ కృతిని నిచ్చునట్లుగా రచింపనుపక్రమించినని శ్రీకోనేరుగురుస్వామి శిష్యుడగు నా మహాదేవాచార్యునకు శిష్యుడనై, పరశురామ పంతుల రామయ్యకును తిప్పాంబకును, పుత్రుడగు నేను, పరశురామపంతుల లింగమూర్తి గురుమూర్తిని పాదాభివందనములు సమర్పించుచు వ్రాయుచున్నాను. అని, యింత సుదీర్ఘ గురు పరంపరాభి వర్ణన చేసి, శిష్యుడనని రచించినకృతిని సమర్పించు విద్యా శిష్యులెందరో వారికిని నా వందనములు సమర్పిస్తున్నాను.

ఇట్టి ఈ భక్తుడు భగవంతుని 'గురు' భావకంగా, తానొక శిష్యునిగా తలంచుచు నిట్లు స్తుతించుచున్నాడు.

కII గురు శిష్య భావ కల్పక ।
గురు శిష్యాచార ధర్మగుణ పరిపాలా ।
గురు శిష్య రూపధారీ ।
గురు శిష్యైక్యావ బోధ గుణ గురమూర్తీ ।

ఇతడు 'గురువు', ఇతడు 'శిష్యుడు' అను సంకల్పములను కల్పించి, ఆ గురుశిష్యుల యాచారములను, ధర్మములను, గుణములను రక్షించుచు, వారి ఐక్యము నెరింగిన వాడగు నప్పరమాత్మ మిగుల గౌరవనీయుడు. వందనీయుడు, పూజనీయుడు గదా !

అట్టి గురు శిష్య సంప్రదాయము రామాయణములోను కనబడును.

శ్రీరాముని యవతార ప్రయోజనాన్ని నిర్విఘ్నంగా కొనసాగించటమే సీత అవతారానికి ప్రథమ ప్రయోజనము.

లక్ష్మణునకు శ్రీరాముని యెడల అద్వితీయమైన గురుభక్తి, భాతృభక్తి. అతనికి

అన్ని విధముల గురువు అన్నయే. ప్రాణము పోయినను సరే అన్నగారి మాట జవదాటడు. అందులకే సీతాదేవి పొడుపు మాటలకు మనస్సు విరిగి,

శ్లో॥ ధిక్త్వా మద్య ప్రణశ్య త్వం యన్మామేవం విశంకసే ।
స్త్రీత్వ దుష్టం స్వభావేన గురు వాక్యైవ్యవస్థితమ్ ॥

అని చెప్పుకున్నాడు. గురు మాటపై నిలబడి యున్నాడని అర్థం. పైగా, అతనికి తన అన్నగురువే కాక, సాక్షాత్ పరదైవం, అని విశ్వాసం. అందులకే-

శ్లో॥ అనివార్యం బలం తస్య బలైర్బల వతా మసి ।
త్రిభిర్లోకై సముద్యుక్తైః సేశ్వరైరపి సామరైః ॥

భా: "శివుడు, దేవతలు కలసి వచ్చినా సరే, ముల్లోకాలునునేకమై వచ్చినా సరే, మా అన్న బలాన్ని యెవరును ఆపలేరు." అని ఘంటాపథంగా పలికెను. ఇట్లు అన్నయెడల దైవభావం, గురుభావం కల లక్ష్మణుడు.

అందుకనే గురువు శాస్త్రజ్ఞాన సంపన్నుడై, పాపరహితుడై, కామరహితుడై బ్రహ్మజ్ఞుడై యుండాలి. ఇట్టిసలక్షణములు శ్రీరామునిలో నున్నందుననే లక్ష్మణుడతనిని గురువుగా నెంచుకొన్నాడు. గురువాజ్ఞగా సీతామాతను కాపాడాలని తలంచి, ప్రప్రథమముగా సీతను కాపాడుటయే తన విద్యుక్త ధర్మమని, కర్తవ్యమని యెంచి, శ్రీరాముని శౌర్య పరాక్రమముల గూర్చి విన్నవించాడు. గురువిశ్వాసమట్టిది. అయినను సీత వినకపోవటం అది మరియొక విషయము.

ఇట్టి గురుశిష్యుల సంబంధం పవిత్రమైనది కదా! పవిత్రాత్మ గల శిష్యుల హృదయాలలో గురువొక వ్యక్తిగా గాక, జ్ఞాన స్వరూపుడుగా వెలుగొందుతాడు. ఇట్టిదే, శిష్యుని యెడల గురువు యొక్క సంపూర్ణ జ్ఞానదృష్టి, సమ్యక్ దృష్టి శిష్యుల అంతర్భావాన్ని అవలోకిస్తుంటాడు. అట్టి ప్రియతమ గురుదేవుడు.

**"పవిత్రాత్మ"-"పావయస్తీతి పవిత్రాణి"; "మనస్సులోని కల్మషాన్ని నశింపజేసుకొని, శ్రేష్ఠమైన ఆత్మను గూర్చి చింతించుటయే."** అని, "అమృతనాదోపనిషత్తు" నందు-"కిల్బిషం హి క్షయం నీత్వా రుచిరంచైవ చింతయేత్"- అని చెప్పబడినది.

"పవిత్ర అంతఃకరణం" కలవాడు ఆత్మవిచారము చేయుటకర్హులౌతారు. అట్టి వారి హృదయంలో పవిత్రత, (పవిత్రభావన, సంకల్పం) చోటు చేసుకొని యుంటుందని, అట్టిదే గురుశిష్యుల యందును నాటియుండాలని గ్రహింపు.

శ్రీ రఘురాముడు భగవంతుడైనను వశిష్ఠుని సద్గురువుగా నారాధించెను. అటులే శ్రీగురుదత్తాత్రేయుల వారును శ్రీరామునకు గురువు.

శ్రీకృష్ణుడు సాందీపునకు శిష్యుడై, గురుదక్షిణగా అతని పుత్రుని బ్రతికించెనని ప్రతీతి.

శ్రీ దత్తాత్రేయ అవతారమున శ్రీనరహరి బాలుడును లోక సంగ్రహార్ధము జ్ఞాన వృద్ధుడును, వయోవృద్ధుడైన శ్రీకృష్ణ సరస్వతిని గురువుగా స్వీకరించెను.

గురు సంప్రదాయమునకు మూలపీఠము శ్రీ శంకరుడును, ఆయనకు శ్రీమహావిష్ణువును శిష్యుడయ్యెను. ఆ విష్ణువునకు బ్రహ్మ శిష్యుడయ్యెను. అతని వలననే అట్టి బ్రహ్మవిద్యా సంప్రదాయము వశిష్ఠునకును సంప్రదాయమయ్యెను. వశిష్ఠుని వలన శక్తియు, శక్తి వలన అతని పుత్రుడగు పరాశరుడును, పరాశరుని వలన సాక్షాత్తు నారాయణావతారమగు వ్యాసుడును, వ్యాసుని వలన శుకుడును, ఆ శుకుడు గౌడపాదుని శిష్యునిగా పొందెను. గౌడపాదుని శిష్యుడు గోవిందాచార్యుడు, గోవిందాచార్యునకు సాక్షాత్తు శివావతారమగు శ్రీశంకరాచార్యుడు శిష్యుడై బ్రహ్మవిద్యా సంప్రదాయమును లోకమున ఖ్యాతి తెచ్చెను.

అటుపిదప, శ్రీ శంకరాచార్యులకు శిష్యుడు విశ్వరూపుడు, అతనికి శిష్యుడు బోధజ్ఞానగిరి, వారి శిష్యుడు సింహగిరి ఈశ్వరతీర్థులు. వారి శిష్యుడు నృసింహతీర్థులు. వీరి ద్వారా సర్వవిద్యా విశారదుడైన విద్యారణ్యస్వామి బ్రహ్మవిద్యను గ్రహించి ప్రచారమొనర్చెను.

ఆ నృసింహ తీర్థుల శిష్యుడు మలయానందుడు, వారి వలన పొందిన వారు దేవతీర్థుడు. అతని శిష్యుడు యాదవేంద్ర సరస్వతి. వారి శిష్యుడు శ్రీకృష్ణసరస్వతి. ఆ కృష్ణ సరస్వతి శిష్యుడు శ్రీ నరహరి బాలుడు ఈ బాలునకే "నరసింహ సరస్వతి" అనునామమున కీర్తి ప్రతిష్ఠలు పొందియుండగా, గొప్ప గొప్ప విద్వాంసులును వీరిని సద్గురు భావముతో పూజించిరి. శిష్యులైరి. వారిలో మాధవుడనునొక బ్రాహ్మణుడును శిష్యుడై సన్న్యసించెను. అతడే "మాధవ సరస్వతి"

అటులే, బాలసరస్వతి, కృష్ణసరస్వతి, ఉపేంద్ర సరస్వతి, సదానంద సరస్వతి, జ్ఞానజ్యోతి సరస్వతి, తుదివాడే సిద్ధుడను పేరు గల శిష్యుడు.

ఆధ్యాత్మిక విద్యాబోధకులను దీక్షా గురువులని, వీరే వినాయకుడు, నంబియాండార్ నంబికిని, శ్రీ దక్షిణామూర్తి, నంది, సనకసనందాదులు, నారదుడు మొదలగు జ్ఞానదీక్షా గురువులని, శ్రీహయగ్రీవుల వారేమో నేరుగా సరస్వతీ దేవికే గురువులని, ప్రసిద్ధి. శివుడు, అగస్త్యుడు అరుణ గిరినాథులకు గురువులని, వీరందరును దివ్యైక గురు మండలమందురు.

★★★

# 38. శిష్యునిలో గురువుపై విశ్వాసము

## (అనుబంధం)

"ఈ ఆచార్యులు సమర్థులు, నన్ను కృతార్థుణ్ణి చేస్తారు", అను పరిపూర్ణ విశ్వాసంతో "గురోఃపాదావుపసంగృహ్య" అన్నట్టుగా, ఆయన శ్రీచరణాలమ్రోల, ఈ భారమంతా నిలిపి, మనస్సుస్థిరపరచి, మరీ అధ్యాయ..ుక కూర్చోవాలి. చూపోవైపు, చెవి ఓవైపు, మనస్సు మరెక్కడోనూనుండకూడదు.

అటులనే ఉభయులును (గురుశిష్యులు) చేయు అధ్యయనమందు శ్రద్ధాభక్తులను కలిగియుండిననే, ఆ గురుశిష్యులిరువురు రెండు మథించు కట్టెలుగానూ, అధ్యయనమే అట్టి మథనంగానూ, అరణి నుండి అగ్నివెలువడినట్లు చెప్పడంలో జ్ఞానము కూడ సమర్థుడైన గురువుయొక్క పర్యవేక్షణంలో అధ్యయనం, మననం, విచారణలద్వారా మథించబడునట్లుగా చెప్పబడింది. "శ్వేతాశ్వతరోపనిషత్తు" నందు.

కనుక, వీరిద్దరిలో అన్నిటికంటే ముందు అధ్యయనంలో శాస్త్రంపై విశ్వాసం యుండాలి. ప్రీతి, గౌరవాలుండాలి. ప్రయోజనంకోరి, యుభయులు పరస్పరం అధ్యయనంపై లక్ష్యసాధన కలిగియుండాలి.

ఇక ఆచార్యులు శిష్యులకు గురువుగాగాక, తల్లిగా, తండ్రిగా శ్రేయోభిలాషిగా, సైదోడుగా నుండాలి. ఆచార్యుని శిష్యుడు తనలో భాగంగానే భావించాలి. ఇరువురినడుమ నిత్యాన్నపాయమైన సంబంధం ఏర్పడాలి. నామమాత్రంగా, నుపదేశించుటలోను, గ్రహించుటలోనూ యిరువురును నుండరాదు. ఏదో యొక రాయిని విసిరినట్టుగా నుండరాదు.

అలక్ష్య లక్షణాలుండు శిష్యుడు తటస్థపడితే, గురువు ముందుగా నతన్ని చక్కగా పరీక్షించి, "ఫరవాలేదు పరువుదక్కిస్తా.. ..నే రాణిస్తాడు" అన్న విశ్వాసం గురువుగార్కి కలిగితేనే, వానికి తత్త్వోపదేశం చెయ్యమన్నారు పెద్దలు. కృతజ్ఞత లేనివానికి, విశ్వాసం లేనివానికి, ఆర్జవం లేనివానికి విద్యను, ముఖ్యంగా ఆధ్యాత్మిక (శ్రీ) విద్యను నుపదేశిస్తే, వానివలన నావిద్యాపరువుపోతోంది.

అందులకే ఆ రోజుల్లో నెంతో పరీక్షించి, ఎన్నో తిప్పలు పెట్టిననూ, యింకా యిన్నిపాట్లు పడ్డాయింకా కాళ్లావేళ్లా పడుతూంటే, అది కొంత విద్యపట్ల ఆసక్తియున్నటుల గ్రాహ్యమైన, యిక వీడు స్థిరపతి అని, ఆసక్తమతి అని, అనుకూలమతియని, అర్హుడని భావించి మరీ చెప్పేవారు పూర్వపు ఆచార్యులు.

శ్లో॥ తస్మై విద్వాన్ ఉపసన్నాయ సమ్యక్ ప్రశాంత చిత్తాయ ।
శమాన్వితాయ ప్రోవాచ తాం తత్త్వతో బ్రహ్మం విద్యాం ॥

అంటు "ఉపనిషత్తు"- ఈ ఉపసదనం ఎంత దీర్ఘ వ్యాపారమో చెప్పలేము. "ఉపసదనం" అంటె ఆశ్రయించడము. శిష్యుడు గురువును చేరిననూ, "మళ్లీరా! సంవత్సరం ఆగిరా!" అని అంటారు గురువులు. కొన్ని సందర్భములలో చేర్చుకొనినను, పదేళ్లు, పన్నెండేళ్లు కూడ గడచినను నోరుమెదపకుండా, ఏమియును చెప్పకుండా నున్న సందర్భాలు లేకపోలేదు.

ఉదాహరణకు, "పిప్పలాదుడు" తనవద్దకు చేరిన భరద్వాజాదులను వారు, అప్పటికే బ్రహ్మనిష్ఠులే బ్రహ్మజ్ఞానసంపన్నులే. కానీ, సంవత్సరం ఆగి వారిని రమ్మన్నాడు పిప్పలాదుడు. ఇదీ పరీక్ష.

ఉపకోసలుణ్ణి, జాబాలి (గురువు), పన్నెండేళ్లుంచుతాడు తన ఆశ్రమంలో. ఉపకోసలుడు సరేసరి. గురువు పరిచర్యలొనర్చుచూ, ఆయన నిషేధించిందల్లా మానేస్తూ చివరకు, "జిల్లేడు ఆకులు వద్దనలేదు కదా! అదీగాక, ఇవి వేరొకరికెవరికిని యుపయోగపడుటలేదని, అంచేతనివి తింటే తప్పులేదు" అనుకొని తిని కళ్లు పోగొట్టుకుంటాడు. దీనితో నెంతప్రీతి కలుగుతుందో దౌమ్యునికి ఉపమన్యువుపై. కాని మామూలు వాడికిది తెలియదు కదా! "పీడించుకొని తింటున్నాడ"న్న ప్రథే మిగులుతుంది.

గురుశిష్యులమధ్య "పితాపుత్ర" సంబంధమే కాదు, అంతకంటే చెప్పరాని బంధం, అనుబంధం వుండేవుంటుంది. ఆ బంధం మాటలకందనిది. ఇరువురిలో సౌమనస్యము తప్పవైమనస్యము సుతరామూ ఉండదు, ఉండకూడదు. "మావిద్విషావహై" అని ఉపనిషత్తు ఉద్ఘోషిస్తోంది.

అటులే, గురువును విశ్వసించిన వారికి నెట్టి ప్రమాదము రాదు. వచ్చినను తప్పును కూడ. కావున గురువు మాతాపితరుల కన్నమిన్న. గురువును గూర్చి నిందావాక్యము లాడరాదు. ఎవరేని యట్లు పలికినను సహింపరాదు. తల్లిదండ్రులనెవరైనను నిందావాక్యములు పలికినచోవిని, యూరుకుందురా? అటులే దైవ సమానుడగు గురువును నిందించినచో, పోరాడియైననూ నీ గురువు ప్రతిష్ఠను నిలుపుకోవాలి - అని, 'శ్రీరామకృష్ణ పరమహంస' 'గురు సుభాషితం' గ్రహించతగ్గది.

"గురుం ప్రకాశయేత్ ధీమాన్" అన్నారు పెద్దలు, బుద్ధిమంతుడైన శిష్యుడు తను నేర్చిన విద్యతో తను ఒదిగి యున్న వినయంతో ఆచార్యునకు కీర్తి ప్రతిష్ఠలు తేవాలి. తన విద్య, తన యశస్సు, తన సంపదకడకు తాను సర్వమూ ఆచార్యుని అనుగ్రహ ఫలాలమని, సర్వం ఆచార్యులకే అని, అంకిత భావం, ఆత్మార్పణబుద్ధి ఆచార్యుల యందు కలిగియుండాలి. అట్లాంటివారిని ఆచార్యులు రౌరవ నరకము నుండియు కాపాడుదురు. నిజమే!

నిసర్గదయాళువులైన ఆచార్యులు ప్రేమ తత్త్వము. తమ కీర్తికి శిష్యులను జయపతాకాలుగా ఆచార్యులు తీర్చిదిద్దాలి. అదియే వారి ఔదార్యమునకు ఆదర్శము.

శిష్యులును, ఆచార్యుల అక్షరభిక్షతోనే బ్రతుకుతున్నామని, రెండు పలుకులు పలికితే, అటులే రెండు రూకలును సంపాదిస్తే, ఒకే "కీర్తిరేఖ" తమ జీవితాన తళుక్కుమంటే, ఇదంతా ఆ ఆచార్యుల అనుగ్రహ ప్రసాదమని, వారి చలవే యనీ, బ్రతికినంతకాలం భావించే సద్బుద్ధికావాలి.

ఇదియే పరిష్కృతమైన, ఆదర్శమైన శిష్యాచార్య వ్యవస్థ. ఈ వ్యవస్థే భారతదేశమును ప్రపంచములో హిమగిరులంత ఎత్తున నిలబెడుతూంది. ఇటులే కొనసాగాలన్న భావమే, "మావిద్విషావహై", అనే ఉపనిషద్వాక్యమును శిష్యాచార్యులు మెలగాలి.

"అల నన్నయకు లేదు, తిక్కనకు లేదు, ఆ కీర్తి అస్మాదదృశుండు..... శిష్యుడైనట్టి ..... చెళ్ళపిళ్ళ వంశస్వామి ..... కున్నట్లగ౯" అని శ్రీవిశ్వనాధ వారన్నట్లు, గురువుల కీర్తికి శిష్యులు పతాకలుగా నిలవాలని ఆశిద్దాం.

గురువను, శిష్యుని శ్రేయోభిలాషిగా అర్థము. కనుక గురుకృప బహు సున్నితమైనది. అట్టి గురుకృప, శ్రేయోభిలాషిత్వము పొందవలెననిన శిష్యుడు గురువు పట్ల పరిపూర్ణ శరణాగతి కలిగి యుండాలి.

"వజ్రాదపి కఠోరాని, మృదూని కుసుమాదపి" -

అనగా వజ్రం కంటె కఠోరమైన మాటయున్నను, పువ్వునకంటే మృదువైన సద్గుణమైన మనస్సు గలిగియుండును. సద్గురువట్లు అనిపించుకొనును.

శ్రీరామలక్ష్మణులు బాల్యమున విశ్వామిత్రునితో కాననలకు వెడలి, వారితో అనేక విద్యల నభ్యసించిరి. వాటిలో 'బల, అతిబల' అనునవి కూడ నేర్చిరి. యాగరక్షణలో మారీచ సుబాహువులను తరిమి కొట్టిరి. వారిలో సుబాహువు గతించగా, వారితల్లి తాటకి కొడుకు మరణంతో క్రోధావేశంగారాగా, విశ్వామిత్రుడు వెంటనే, నాయనలారా! స్త్రీవధ కూడదనే సందేహంవీడి, ఆమెను సంహరించండి. స్త్రీవధ పాపము నాకు వదలిపెట్టుడు. అని ఆజ్ఞాపించెను.

"శిష్యపాపం గురుర్వజేత్" - అని

ఆ మాటతో, "మహామునీశ్వరా! మీరు మాకు గురువులు, మేము మీ కింకరులము. ఏమి చేయుమని ఆజ్ఞాపించినను చెయ్యటానికి సిద్ధంగానున్నామ"ని వారిరువురు వెంటనే తాటకిని సంహరించిరి.

అట్లు, గురువేమి చెప్పిననూ వెనుకాడకుండ పాప పుణ్యముల బేరీజులెంచక, "ఇట్లా ఎందుకూ? అటులా చేస్తే బాగుండదా! నేను చేయలేను. మరొకరికి చెప్పండీ." వంటి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు లేకుండా, పర్యవసానాల ప్రమేయం పెట్టుకోకుండా, ఫలితాల కోసం పర్యవేక్షించక, చెప్పినది చేయుటయే పరమ ప్రయోజనము. అటుల చేయుటయే జన్మ సార్థకం, చరితార్థకము. అట్టి వారినే కింకరులుగా సంబోధించుదురు. 'కింకర' అను శబ్దం 'సేవ' అనునదేగాక, 'కైంకర్యం' అనునర్థం కూడ కలదు. తనను తాను అంకిత మొనర్చుకొనుట అని.

శిష్యుడు గురూపదేశములను నాలకింపకున్నచో, ఆచరింపకున్నచో, వానిని శాసించియైనను బలత్కారముగానైనను ప్రయత్నించి, సరియైన మార్గంలో నడిపించుట అనునది ఉత్తమ గురువు లక్షణము.

మొదట్లో గురువు పట్ల అప్రియస్యతుగా నున్నటుల శిష్యుడు మెలగినను, శిష్యుని శ్రేయోభిలాషిగా నుపదేశమిచ్చుట యత్నించును సద్గురువు.

'గురు'వాక్యమే ప్రమాణము. గురువాజ్ఞలో గురు భక్తి కలిగి, పరబ్రహ్మ వాక్యముగా నెంచి ఆచరించుట శిష్యుని కర్తవ్యము. గురువు ఆజ్ఞనిచ్చునపుడు, ఇతడు 'యోగ్యుడా, అయోగ్యుడా!' అని విమర్శ శిష్యుడు చేయరాదు. గురుభక్తి యనునది, గురువును నెల్లప్పుడు పరబ్రహ్మ స్వరూపునిగా భావించ స్వభావమున్నచో గురుభక్తి నిలుచును. గురుభక్తి భవసాగరమునుండి తరింపజేసెడి సాధనము. కావున గురువును నెప్పుడును మానవ మాత్రునిగా నెంచరాదు.

"వక్తా శ్రోతాచ దుర్లభః" -

చెప్పేవాడు లభించిన, వినేవాడు లభించడు. వినేవాడు లభించిన చెప్పేవాడు (నాథుడు) లభించడు. మరొకపరి ఉభయులు దుర్లభులే, సుమా!

"సత్యవాక్కు, ప్రియవాక్కు, హితవాక్కు, మితవాక్కు" కలవాడే సద్గురువు. అట్టివి తన శిష్యుడు ఆలకించాలని ఆశిస్తాడు. వినెనొ, తాను చెప్పినది ధన్యమని, తాను ధన్యుడని భావించును. లేదా! (విననిచో) బాధ చెందుతాడు. తుదకు వాని కర్మయని తలంచుతాడు.

**ఒక ఉదాహరణ :-** సీతాపహరణంలో తనకు తోడు కమ్మని రావణాసురుడు మారీచుని ప్రేరేపించగా మారీచుడప్పుడతనితోనిట్లనును.

"శ్లో॥ సులభాః పురుషారాజన్ । సతతంప్రియవాదినః ।
అప్రియస్యతు పథ్యస్య వక్తాశ్రోతాచ దుర్లభః ॥ అనేది ఇదే.

రాజా! అప్రియాలు పలికేవాళ్లు కోకొల్లలు సుమా! ప్రీతికరంగా మాటలాడితే

యిచ్చి సన్మానాలు చేస్తావు. బహుమానాలు యిస్తావు. వీటిని గూర్చి వెతక నక్కరలేదు. కాని, నీకు యింపుగా లేకపోయినను, ఇది నీకు శ్రేయస్కరం. ఇలాచేయి, బాగుపడతావు". ఇలా చేయవద్దు చెడిపోతావు అని, చెప్పేవాళ్లు వెతికినాదొరకరు. ఎక్కడో నూటికొకడు, కోటికొకడుంటాడు. వినేవాడు నిరంతరం ప్రియభాషితాలు విని విని, అవియే వినటానికలవాటుపడి, యుండి అప్రియాన్ని పథ్యంగా (చెడుగా) భావించి మౌనం వహించుతాడు.

ఇక వినేవాడు మూర్ఖుడైతే, ఆ ప్రియవాక్యాన్ని పథ్యంగా భావించి, వినడానికి కూడ తిరస్కరించి, తన దుష్కార్యమునకే కుతూహలపడతాడు.

ఒకానొకపుడు యిద్దరు దుర్లభులైతే, ఇక చెప్పేదేమి లేదు. కాని వస్తు తత్త్వమెరిగిన వాణ్ణి కనుక, రావణా! నీకప్రియమైనా, పథ్యాన్ని చెప్పుచున్నాను. విను, లేదా! నీవుచెప్పినటులే అనగా రాజాజ్ఞగా, నా కర్తవ్యమును నేను పాటిస్తాను. నీవు నీ కర్మను అనుభవిస్తావు." పొమ్మంటాడు మారీచుడు.

రావణుడు వినడని తెలిసినా, మారీచుడు వాడికి హితబోధచేస్తాడు. హిత బోధమానలేదని.అర్థం. వినడం, వినకపోవడం అవతలివాడి వంతు హితబోధ చేయడం గురువు (శ్రేయోభిలాషి) కర్తవ్యం. వినెనా, అట్టి హితబోధ పాలలోవేసిన తేనెలాగ మిళితమై అమృతంలాగా మారును. వినకపోయెనా! ఉప్పు నీటిలో వేసిన తేనెలాగా వ్యర్థమగును

అయినా, ఎదుటి వాని శ్రేయోభిలాషి (గురువు) తన కర్తవ్యం విస్మరించదు కదా! అటులే మరొక ఉదాహరణ: ఒకనాడొక వేదాంతి నొక నీటి గట్టున కూర్చుని యుండగా నీటిలో కొట్టుకొను పోవుచున్న తేలును చూచాడు. అంతే! అతడాతేలును పట్టి గట్టుకు వేయబోయాడు. కానీ, ఆ తేలు అతనిని కుట్టింది. అయినా తన ప్రయత్నం మానుకోలేదు. దాని యలవాటు మానలేదు. అనగా కుట్టుతూనేయుంది.

**ఈ వింత దృశ్య**ము చూచినొకడు ఆ వేదాంతితో "ఏమయ్యా! ఆ తేలు కుట్టినను, మరల **మరల నీప్రయత్నం** ఏమిటీ? వింతగా ఉంది." అని ప్రశ్నించెను.

ఆ వేదాంతి అతనితో నిట్లనెను. "నాయనా! నా స్వభావం నాది, దాని స్వభావం దానిది. నా కర్తవ్యాన్ని నేను ఆచరిస్తున్నాను. దాని కర్తవ్యం అది ఆచరిస్తున్నది. అయినా దాని దుష్క్రియకు నా కర్తవ్యం మానుకోనుగా" అన్నాడు వేదాంతి.

కనుక, సద్గురువు తన సద్బోధను మానడు ఏనాటికైనా, శిష్యునిలో ఆ సద్బోధ నాటక మానదు. పూర్వపు తన దురలవాట్లు మెండుగా నుండినను వాటియంతటవే తొలగును. ఇక యా గురువుపై విశ్వాసము శాశ్వతముగా నిలుచును. దానితో నిక గురువు

ధన్యుడైనట్లే కదా? "శిష్యదావనుగ్రహః"-అని, వాత్సల్యమును గూర్చి "సర్వజ్ఞ సోమేశ్వరుడిట్లు" నిర్వచించెను.

"గౌణ శిష్యుడుగా"- నితడు గురువువాత్సల్యము పొందుటకర్హుడు. గౌణశిష్యుడన, శిష్యుడుగా కల్పిత సంబంధమున్నవాడని, గురువు యొక్క అభిమాన గుణుడని అర్థం

కొందరు శిష్యులు గురువుపట్ల భక్తి శ్రద్ధలు కలిగి, అభిమాన గుణులుగా తపన జెందువారలుగా ప్రవర్తించుదురు.

"గురుభక్తి ప్రశస్తి"ని గూర్చి "నారద ఉవాచ" "ఏతత్సర్వం గురౌ భక్త్యాపురుషో హ్యంజ సాజయేత్" (25వ శ్లోక పాదం)

26వశ్లో॥ యస్య సాక్షాత్ భగవతి జ్ఞాన దీపప్రదేగురౌ ।
మర్త్యాసద్దీః శృతం తస్య సర్వం కుంజర శౌచవత్ ॥

27వశ్లో॥ ఏషవైభగవాన్ సాక్షాత్ ప్రధానపురుషేశ్వరః ।
యోగైశ్వర్య విమృగా ఙ్ఘ్రిర్లోకోయం మన్యతేనరమ్ ॥

- (శ్రీమద్భాగవతం)

"దేవ గుర్వచ్యుతే భక్తి బ్రహ్మచారీ గురుకులే" (సూక్తి) అటులే గురువుపట్ల- అనగా గురుబోధన యందు శ్రద్ధ శిష్యునకెంతో అవసరం "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" అని గీతాచార్యుడు అన్నాడు భక్తికి, జ్ఞానానికి గానీ "శ్రద్ధ" అత్యవసరం. "స్కాంధపురాణం"లో శ్రద్ధను గూర్చినిట్లున్నది.

-"శ్రద్ధయాభజతః పుంసః శిలాఽపి ఫలదాయినీ ।
మూర్ఖోఽపి భజతో భక్త్యా గురుర్భవతి సిద్ధిదః ।
శ్రద్ధయాపరితో మంత్రస్య బద్ధోఽపి ఫలప్రదః ॥"-

బా: శ్రద్ధతో భజించేవాడికి శిలైనా ఫలదాయకమైతుందని! భక్తితో నారాధిస్తే మూర్ఖుడైనా, శాస్త్రహీనుడైనా, సిద్ధి దాయకుడై గురుత్వాన్ని పొందుతాడు. శ్రద్ధలేకపోయినట్లైతే ఏ పనిలోనూ ఫలం సిద్ధించదు. శ్రద్ధ ఉంటే, మాత్రం సుసంబద్ధం కాకపోయినా ఫలప్రదమౌతుందని- అర్థం

ఈ శ్రద్ధకు నిష్ఠ, సిద్ధి, ఆదర్శం అని నామాలు. అనగా శ్రద్ధ ఉన్నచోటే నిష్ఠ, సిద్ధి, ఆదర్శములుండును. ఇక సద్గురువుపట్ల తపన.

చిన్నకథ:- "ఏకనాథుడి" రచనలో నొకటి "బారూడ్".

"బారూడ్" అంటే "పల్లెప్రజల తత్త్వం" లాంటిది - "వించుచావలా"- అనగా తేలుకుట్టిందని అర్థం.

ఒక గురువుగారికి తేలుకుట్టింది. పాపం అతని శిష్యులంతా తపనపడుచు, "నేనంటే నేనని" పోటీపడుచు, గురువుగారి ఆయాసం చూడలేక తెగసేవలొనర్చుచున్నారు. అందులో నొకడు, ఇట్లు ప్రశ్నించాడు.

"గురువుగారూ! అసలు తేలు ఏది, ఎక్కడుందండీ?" అని, తేలుపై కోపంతో దానిని చంపవలెననే తపనతో.

"మన మనస్సులో" అని, గురువుగారన్నారు.

శిష్యుడు వెంటనే, "దీనికి విరుగుడు, మంత్రం ఏమీ?"

"మందు"అన్నాడు గురువు. అప్పుడా మందుకై శిష్యులు ప్రయత్నించగా- "ఆ మందుకై ఎవరు వెదకనక్కరలేదు ఎవరిని పిలవనక్కరలేదు. అట్టిది నావద్ద ఉంది, నేనే వేసుకొంటా" అన్నాడు గురువు.

"గురువా? ఇంతకీ తేలు ఎక్కడుందండీ?" అని మరొక శిష్యుడడుగా-

"చెప్పానుగానాయనా! మన మనస్సులో అనీ"- శిష్యులకేమి అర్థంకాకపోగా, "అదేరా! కామక్రోదాలనే తేలు కుట్టిందర్రా! కనుక, కేవలం ఆ పరమాత్మ జపంతో తగ్గిపోతుంది" అన్నాడు గురువు. జపంతో మనస్సు ఆధ్యాత్మికమౌతుందని, భావం.

తరచినకొద్ది నవనీతముద్భవించినట్లు, ప్రవచన వ్యాజంతో, ఆచార్యుల ఆశీస్సులతో సర్వసంగ్రహంతో, భగవత్కృపతో బుద్ధి పరిపక్వమౌతుంది. ఆ పరిపక్వ బుద్ధితో పర్యాలోచన నుండి, శాస్త్రపరిశోధనలద్వారా విజ్ఞానామృతం అభివ్యక్తమౌతూంది. అంతః శరణం విజ్ఞాన సంస్కృత రస పరిప్లుతమౌతూంది. అయినా చాలదు, పరిపూర్ణుడు కాలేదు.

ఇంకా ఎందరో విజ్ఞానులు, మహాత్ములు కలయిక అత్యవసరం. ఎట్లనగా?

"న రత్నమన్విష్యతి - మృగ్యతేహి తత్" -

దేశాటనమొనర్చి మహానుభావుల ఆచూకితో, వారినిచేరి, ఆశ్రయించి వారినుండి మరెన్నో జీవిత రహస్యాలను తెలిసికోవాలి. ధీరత్వమలవరచుకోవాలి. వైరాగ్య సత్యదర్శన లాలసతను పెంపొందించుకొని యోగసిద్ధిని సాధించాలి. ఆ యోగసిద్ధిని యెల్లెడల ఆచరణలో పెట్టాలి.

న్యాయయుక్త శాస్త్రమథనంతో మనస్సు శాణోల్లీఢమైన రత్నమువలె తేజోవంతమై విలసిల్లడంతో అతడు (శిష్యుడు) బ్రహ్మజిజ్ఞాసపరుడై ముముక్షువుగా నిలిచి ధీరుడౌతాడు.

దానినే-

"సావిద్యాయావిముక్తయే" విముక్తి కలిగించేది విద్యయేకదా!

"ౘ ాగతత్త్వోపనిషత్" లో 78వ మంత్రం ఇట్లు వివరించును.

-"శిష్యాశ్చ స్వస్వకార్యేషు ప్రార్థయంతి నసంశయః,
తత్తత్కర్మ కర్తవ్యగ్రః స్వాభ్యాసే విస్మృతో భవేత్,
అపి స్మృత్య గురోర్వాక్యమభ్యసే త్తదహర్నిశమ్ ॥

భా: శిష్యులు తమతమ కార్యములు సిద్ధించు నిమిత్తమై గురువును ఆశ్రయించి ప్రార్థించెదరు. అప్పుడా యా కార్యక్రమములో నిమగ్నమైనచో యోగి తనయోగ సాధన మరచును. కావున గురువుయొక్క బోధనను స్మరించుకొని రాత్రింబవళ్లు యోగసాధనయందే నిమగ్నమైయుండవలెను.

79వ మం:ఏవం భవేద్ఘటవస్థా సంతతాభ్యాసయోగతః ।
అనభ్యాసవతశ్చైవ వృథాగోష్ఠ్యా న సిద్ధ్యతి ॥

భా: ఇట్లు నిరంతరం యోగసాధన చేయుచున్నచో అతనిలో ఘటావస్థ కలుగును. అభ్యాసము చేయకుండా వృథాగోష్ఠి వలన ఘటావస్థ సిద్ధించదు. (ఘటావస్థయనగా- యోగసాధన ఫలం)

(అట్టి "ఘటావస్థ"ను గూర్చి ఈ ఉపనిషత్తులోని 67వ మం.(శ్లో)నుండి 80వ మం.(శ్లో) వరకు పఠించిన (గ్రహించిన వారగుదురు) ఏదియేమైన-

" తస్మాత్సర్వేషు ప్రయత్నేన యోగమేవ సదాఽభ్యసేత్"

కావున ప్రతిదియును ప్రయత్నపూర్వకమే యోగము. ఎల్లెడల అభ్యసనలో నుంచవలెను. గురుభక్తికి, గురుమార్గదర్శకత్వమునకు చక్కటి ఆదర్శనీయుడు "ఏకలవ్యుడు". ఇతడు తండ్రి వద్ద కొంత విలువిద్యనేర్చినను, తృప్తిచెందక, హస్తినాపురంలోనున్న ద్రోణాచార్యుడగు గురువును చేరి, ఆ విలువిద్యను నైపుణ్యముగా నేర్వతలంచెను. తండ్రి ఆజ్ఞతో ద్రోణుని చేరి తన మనోభావన వెల్లడించెను. కాని ద్రోణుడు కులగోత్రముల నడుగ, అతడొక బోయవాడని తెలిసి, ఆ విద్యను నేర్పనిరాకరించెను. అయినను, ఏకలవ్యుడు ద్రోణుని వేడుకొనుచు పాదములపడెను. ద్రోణుడు ఏకలవ్యుని దీక్షకు కడుంకడు సంతసించి, నాయనా! నా ఆశీర్వచన ఫలముతో నీ కోరిక నెరవేరునని, చెప్పి సముదాయించి పంపెను.

ఆ అభ్యసనంలోను ఏకలవ్యుడు మారుమాటాడక, గురువు ఆశీర్వచన బలమే తనకు కొండంతధైర్యమని తలంచి, మరొకమారు ద్రోణుని పాదములకు నమస్కరించి

నిష్క్రమించెను.

తన గూడెంవద్దనేనొక చెట్టు క్రింద ద్రోణుని విగ్రహం స్థాపించుకొని, దానిముందుకూర్చుని, గురుపూజనొనర్చి, నిగ్రహంతో నెట్టి నిస్పృహకులోనుగాక, ఈ గురువే తనకిక మార్గదర్శకుడుగానెంచి, శ్రద్ధాభక్తులతో, పట్టుదలతో తీవ్ర కృషి సలుపుచు స్వశక్తితో సాటిలేని మేటి విలుకాడయ్యెను.

తుదకు గురువగు ద్రోణాచార్యుడు కోరినటుల తన దక్షిణహస్త అంగుష్ఠమును వెనువెంటనే గురుదక్షిణగా సమర్పించిన గురుత్యాగశీలి ఏకలవ్యుడు, మహాభారతములో మణికిరీటుడయ్యెను.

''బ్రహ్మవిద్యోపనిషత్''-న చెప్పిన గురువాక్యముగా- ''శుభం వా శుభమన్యద్వాయదుక్తం గురుణాభువి" గురువు చేతనుపదేశింప బడినది మంచిదైనను, చెడుదైననూ మంచియే యగును.

కావున గురువునందు అనన్యభక్తితో ఏ దాపరికం లేకుండా శరణుజొచ్చి, శ్రద్ధాభక్తులతో సేవించినచో, గురువాజ్ఞలను తు.చ. పాటిస్తూ శిరసావహించిన శిష్యునకు, తప్పక తన మనోరథమును నెరవేర్చుకొనును. దైవానుగ్రహమునుపొంది, దుః ఖవిముక్తుడగును.

దైవభక్తితో గురుభక్తిని జోడించిన బంగారమునకు వన్నె తెచ్చినట్లగును. ఎందుకనగా గురువుదైవమునకు ప్రతినిధి మరియు సాక్షాత్ దైవ స్వరూపుడే. జ్ఞానప్రదాత, యోగప్రదాత యగు ఆచార్యుణ్ణి స్మరిస్తూ, భగవత్స్వరూపముగా మనస్సులో తలంచి యుండిన, కృతజ్ఞతను నిలుపుకొనియుండిన, అది (యోగ) విద్యఫలవంతమైన ఫలప్రాప్తమగును.

ఇట్టి గురుశిష్యులనిన పరమాత్మకు పరమ ప్రియులని భగవద్గీత వక్కాణించుచున్నది. బోధించిన ఆచార్యులను, బోధనుగ్రహించిన శిష్యులను కూడా పరమాత్మ ప్రశంసించుచుండును.

శిష్యుడప్పుడును అనుభవజ్ఞుడైన గురువును నాశ్రయించి, గురుసేవతో గుర్వనుగ్రహం పొంది, గురుమార్గాన్ని ఆస్వాదించ యత్నించవలెను. అనగా గురువు ఆత్మవిద్యామార్గ దర్శకుడు కనుక, వారి అమూల్యమైన అవగాహనను పొంది భావికాలమునకును నట్టి గురుప్రవర్తన (ఋజుప్రవర్తన)తో సంసార జీవితరథ చక్రమును త్రిప్పవలె.

దైవస్వరూపుడగు సద్గురువు లభించుట శిష్యుల అదృష్టము. శ్రీరామునకు విశ్వామిత్రుడు లభించుటనునది, శ్రీవివేకానందునకు శ్రీరామకృష్ణపరమహంస

లభించుటనునది, అటుగురువుల, ఇటు శిష్యుల పూర్వ జన్మల సుకృతఫల నిదర్శనము. శిష్యునకు వలె సద్గురువునకు కూడా యుత్తమ శిష్యుడు లభించుట గణనీయమైన లక్షణము.

గురువులను వారు అనేకులుందురు. కాని వారిలో నొకడు "చోదకుడు". ఇతడు కేవలం మార్గదర్శకుడు: మరొకడు బోధకుడు. స్థానమును నిలుపును. నిశ్చలుని నొనర్చును. ఇక ముఖ్యుడు మోక్షదుడు. పరతత్త్వమును బోధించును. ఇతడే అందరిలో ఉత్తముడు. అని తెలిసి కొనినను పరమునందును. - (బ్రహ్మవిద్యోపనిషత్)

శ్లో॥ ఆత్మాన మాత్మానా సాక్షాద్బ్రహ్మబుధ్వాసునిశ్చలమ్ ।
దేహజాత్యాది సంబంధా స్వర్ణాశ్రమ సమన్వితాన్ ॥

భా: ఆత్మచే ఆత్మను సాక్షాత్ బ్రహ్మనుగా తెలిసికొని, వర్ణాశ్రమములను దేహజాత్యాది సంబంధములను.....

శ్లో॥ వేద శాస్త్రాణి చాన్యాని పదపాంసుమివత్యజేత్ ।
గురు భక్తిం సదాకుర్యాచ్ఛ్రేయ సే భూయసే నరః ॥

భా: తక్కిన వేద శాస్త్రములను కాలియొక్కధూళివలె వదలవలెను. నరుడు ఎక్కువ శ్రేయస్సునకై గురుభక్తిని నెప్పుడును కల్గియుండవలెను అని .

"బ్రహ్మవిద్యోపనిషత్తు"లో గురువును గూర్చి వివరింపబడెను.

★★★

## గురు - సూత్రములు

"అధ్యాపితాయేగురుం వాద్రియంతే విప్రావాచ మనసాకర్మణావ"
ఉపదేశింపబడిన గురువును త్రికరణశుద్ధిగా అనగా మనసా, వాచా, కర్మణా నాదరించవలెను.

★★★

"త్రిమూర్తయో హి తుష్యన్తి భక్త్యా శ్రీ గురుపూజనాత్"
శ్రీ గురుపూజ చేయుటచే త్రిమూర్తులు తృప్తినొందుదురు.

★★★

"కుతోదైన్యం భయం తస్య యస్యోపరి గురోః కృపా"
గురుకృప ఎవరిపై వుండునో వారికి భయమేల? దీనత్వమేలా?

# 39. ఆచార్యుడు తప్పినచో

ఆచార్యుడు ఆదర్శ పురుషుడు. అట్టి ఆచార్యుడు ధర్మ మార్గమును తప్పినచో నేమిటి?

మనధర్మ శాస్త్రములో 7వ అధ్యాయము, 8వ శ్లోకము భావమిది. ఆచార్యుడైనను, తండ్రియైనను సురాపానము చేయునెడ, వారి యధికారముకన్న (పెద్దలని), ధర్మాధికారము మిక్కిలి బలవత్తరమైనది.

రాజు, గురువును, తండ్రియును దేవతాస్వరూపులే. అయినను వీరును ధర్మమునుల్లంఘించినచో శిక్షార్హులే. అని చెప్పబడినది.

అటులే 8వ అధ్యాయము 335 శ్లోకము న నిట్లు చెప్పబడెను.

శ్లో॥ పితా ఽఽ చార్య సుహృన్మాతా భార్యా పుత్రః పురోహితః ।
నాదండ్యో నామ రాజ్ఞోఽస్తి యస్స్వధర్మే తిష్ఠతి ॥

తండ్రి, ఆచార్యుడు, మిత్రుడు, తల్లి, భార్య, పుత్రుడు, పురోహితుడును, నింతకంటె యెక్కువైన వారును స్వధర్మ ప్రమాణముగా నడువని యెడల రాజుచే దండింపదగిన వారలే. అని -

మరియు మహాభారతం - శాంతిపర్వము 108వ అధ్యాయం 17వ శ్లోకమున నిట్లున్నది.

శ్లో॥ గరోరప్య వలిప్తస్య కార్య కార్య మజానతః ।
ఉత్పథం ప్రతి పన్నస్య న్యాయ్యం భవతి శాసనమ్ ॥

కర్తవ్యా కర్తవ్యముల నెరుంగక గర్వమున, అపమార్గమున సంచరించు గురువు సైతము శిక్షార్హుడే, దండనార్హుడే.

శ్లో॥ యం యం ధర్మం స్వయ మాచరితుం శక్తస్తం తం బోధయ నాన్యమ్ ।
శృణుతే సర్వస్తవ హిత బోధం యదితే నిష్ఠా తత్ర త్రిశుద్ధా ॥

భా: నీవుదేన్ని ఆచరించగలవో దాన్నే యితరులకు బోధించు. రెండవది బోధించకు, నీవు బోధించే నీకు త్రికరణశుద్ధి గల నిష్ఠ వుంటే, నీవుచేసే బోధ, ప్రతివాడూ వింటాడు.

ఈ సూక్తి చివరి పాదంలో "నిష్ఠా త్రిశుద్ధా" అనే పదాలున్నాయి. 'నిష్ఠ' అంటే ఆచరణ. 'త్రిశుద్ధి' అంటే మనో వాక్కాయ శుద్ధి. కాయశుద్ధి అన్నా, నిష్ఠ అన్నా ఒక్కటే.

కాగా, 'త్రిశుద్ధా నిష్ఠా' అనటంతో ఆచరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది.

సూక్తి ప్రథమ పాదం, "యం యం ధర్మం" అంటోంది. అనగా, ఏ ఏ ధర్మాలను నువ్వు ధర్మాలను స్వయంగా త్రికరణ శుద్ధిగా ఆచరించగలవో, అట్టివి మాత్రమే నువ్వు యితరులకు బోధించు. అని నిర్దేశిస్తోంది. దీనినే వెనుకకు త్రిప్పితే- నువు దేనిని బోధించాలనుకొంటున్నావో, దానిని నువ్వు ముందు త్రికరణ శుద్ధిగా ఆచరణలోపెట్టు, అని. అలా ఆచరణలో పెట్టటం చేతకాకపోతే, దానిని బోధించకు, అనియూ, అంటే భావనా పూర్వకంగా, తీవ్రతతో, ఆచరించడం చేతనైనపుడే నీబోధ ఫలిస్తోంది, అని సూక్తి తేల్చింది.

ఆచరణ, భావనా పూర్వక ఆచరణ, తీవ్రతతో కూడిన భావనాపూర్వక ఆచరణ - ఇవి వరుసగా మెట్లు. ఇవి ఆచార్యుడు బాగా అర్థం చేసుకొని మహాత్మునిగా కీర్తి పొందాలి.

వాల్మీకి రామాయణంలో 2-21-13వ శ్లో.న చతుర్థపాద స్థానములో ప్రథమంలో- "దండో భవతి శాశ్వతః" అనియు, మరియును, "పరిత్యాగో విధీయతే"- అనియు పాఠాన్తరములున్నవి. అటులే మహాభారతమునందున, -

భీష్ముడు పరశురాముని తోడను, అర్జునుడు ద్రోణాచార్యుని, భీష్మాచార్యుల వంటి వారిని యుద్ధమున నోడించుటనునది ధర్మమార్గమే కదా!

'శాంతి పర్వము' నందు - భీష్ముడు స్వయముగా శ్రీకృష్ణునితో నిట్లనును- ప్రహ్లాదుడు గురూపదేశమును ధర్మ విరుద్ధమని ధిక్కరించెను. గురువు పూజ్యుడుగా నీతికిని బుద్ధుడుగా నుండవలెనని, కాదేని -

ఆ (శాంతి) పర్వములో 55వ అ.16వ శ్లో

శ్లో॥ సమయ త్యాగినో లుబ్ధాన్గురున పిచ కేశవః ।
నిహన్తి సమరే పాపాన్ క్షత్రియ స్సహి ధర్మవిత్ ॥

కేశవా! మర్యాదను, నీతిని, శిష్టాచారమును పరిపాలింపక లోభియునగు వాడు గురువైయున్నను, వానిని యుద్ధమునందు చంపిన క్షత్రియుడు ధర్మజ్ఞుడు, అని - మరియు (మనుస్మృతి 8 - 350 శ్లో.లో)

శ్లో॥ గురుంవా బాల వృద్ధౌవా బ్రాహ్మణంవా బహుశృతమ్ ।
ఆతతాయిన మాయాంతం హన్యాదేవా విచారయన్ ॥

ఆతతాయి (దుష్టుడు, మంచిచెడు ఎరుగనివాడు) గురువుగానీ, వృద్ధుడుగానీ, బాలుడు గానీ, విద్వాంసుడగు బ్రాహ్మణుడు గానీ, నిస్సంశయముగా

వధింపవచ్చును.

అది హింసా, పాపమైనను తగలదని భావము, ఎందుకనగా అధర్మమొనర్చినప్పుడే వారు వధింపబడిరి. అనగా అధర్మమే వారిని వధించుచున్నదని తెలియునది.

అజ్ఞుడు తప్పు చేస్తే కొద్ది శిక్ష వేయవచ్చు. కానీ, 'గురు'వైన వాడు తప్పుజేస్తే యే శిక్షైన తప్పదు.

★★★

## గురు - సూత్రములు

"సర్వ శరీరస్థ చైతన్య బ్రహ్మ ప్రాపకో గురురుపాస్యః",

సర్వ జీవుల శరీరములందున్న చైతన్య బ్రహ్మమును పొందించు గురువు ఉపాసింపదగినవాడు. అని.

★★★

"పుస్తక ప్రత్యయాధీతం నాధీతం గురు సన్నిధౌ" - 234/2 (నా.పు)

"రాజతే న సభా మత్యే జారగ ర్భేవ కామినీ" - 235/1 (నా.పు)

గురువు సన్నిధిలో చదువక, పుస్తకము జూచి చదువ బడినచో, జారుని వలన గర్భమును ధరించిన స్త్రీవలె గౌరవమును పొందజాలరు.

★★★

"సముద్రమపి విద్యార్థీ వ్రజేద్గరుడ హంసవత్" - (నా.పు)

సముద్రమును గరుడ పక్షులు హంసలు దాటునట్లు విద్యార్థులు వేదసాగరమును దాటవలయును.

★★★

"లోకో యో గురుసేవకోఽస్య తు గృహేదైన్యం కుతోఽతోఽనిశం"

లోకములో నెవడు గురుసేవకుడో వాని యింట దైన్యముండదు.

# 40. ఎటువంటి శిష్యులకు విద్య గరపరాదు?

శ్రీ కృష్ణుడు అర్జునునకు గీతాబోధ చేస్తూ తుదకు 18వ అ. 67వ, 68వ శ్లోకాలలో నిట్లు పి ిరించెను.

శ్లో॥ ఇదంతే నా తపస్కాయ నా భక్తాయ కదాచన ।
నీ చా శు(శ్రూష వాచ్యం నచమాం యోఽభ్యసూయతి ॥

అర్జునా! నీకు బోధింపబడిన నీ గీతా శాస్త్రమును తపస్సు లేని వానికి గాని భక్తుడు కానివానికి గానీ, వినుటకిష్టములేనివానికి గాని, (గురుసేవా చేయని వానికి గానీ,) నన్ను దూషించువానికిగానీ, లేక నాయెడల అసూయజెందువానికిగానీ, ఎన్నడును చెప్పదగినది కాదు.

అని చెప్పుచూ, మరియెవరికి చెప్పవచ్చునో అది కూడ జెప్పుచున్నాడు.

శ్లో ॥ య ఇమం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి ।
భక్తింమయి పరాం కృత్వా మామేవైష్యత్స సంశయః ॥

అర్జునా! ఎవడు అతిరహస్యమైన నీ గీతాశాస్త్రమును నాభక్తులకు చెప్పునో అట్టివాడు నాయందుత్తమ భక్తిగలవాడై, సంశయరహితుడై నిస్సందేహముగా నన్నేపొందగలడు.

అని గీతలో చెప్పినటుల, వేద (విద్య)యనునది పరమ రహస్యమైనది, శ్రేష్ఠమైనది. పవిత్రమైనదియు. కావున నిట్టిది అసత్యవాది, మోసగాడు, కపటబుద్ధి, అసమర్థుడు, జ్ఞానులను పండితులను నొప్పించువాడు, పరనింద యొనర్చు శిష్యులకు గరపరాదు. ఎందుకనగా విశుద్ధమగు పరబ్రహ్మ తత్త్వమును నిట్టి దుర్గుణాలకు ప్రవచనము చేసినచో నది అపాత్రదానముగా బోధించిన గురువునకును శ్రేయస్సు కలుగదు.

దుర్గుణములతోనున్నవాడు తాను, సమస్త రత్నములతో నీ భూ భాగమంతయును విద్యకు ప్రతిఫలముగా నిత్తునని నను, అట్టివానికీ విద్య బోధింపరాదు.

అట్టిదే, "బ్రహ్మ పురాణము"న 245 వ అ. 31వ శ్లో. నుండి 39వ శ్లో.లవరకు వివరింపబడిన శ్లోకముల భావము:-

వశిష్ఠుడు జనక మహారాజుతో చెప్పిన బోధామృతమును వ్యాసుడిట్లు వివరించెను.

మహారాజా! ఇంతవరకు నీవు నానుండి విశుద్ధమును ఆద్యమును, సనాతనమును, శాశ్వతమును అగు బ్రహ్మతత్త్వమును అమత్సరుడవై - మనోదోషము లేవియును లేనివాడవై బోధామృతమును గ్రహించితివి. నీవును, ఈ పరమ విద్యానుశాసనమును వేదనిష్ఠ,

వదములయందును శాస్త్రములయందును ప్రామాణ్యబుద్ధి కలిగి, ప్రబోధమునొందుటకై ప్రణతుడవై తెలిసికొనగోరి అడిగినవారికి మాత్రమే బోధించవలెను. కానీ!

"అసత్యవాది, మోసగాడు, కపటబుద్ధి, అసమర్థుడు, జ్ఞానపరులగు పండితులను నొప్పించువాడు" ఇట్టివారికి బోధించరాదు. మరియు - "శిష్యులకు జ్ఞానము కలిగించుటకై నీ విద్యను శ్రద్ధకలవాడు **సద్గుణవంతుడు,** పరనిందచేయనివాడు. అనేక శాస్త్రములను పెద్దలవలన వినినవాడు. **వివేచనముతో కూడిన** శీలము కలవాడు, వేదశాస్త్రవిధి యందు ప్రీతి కలవాడు, వివాద**ములు** చే[illegible]**డు,** వినయవిధేయత కలవాడు, హేతువాదము చేయనివాడు" ఇట్టివారి**కి మాత్రమే బోధించవ**లెను.

ముఖ్యముగా - విశుద్ధమగు పరబ్రహ్మ తత్త్వమును, అపాత్రదానముగా ప్రవచనమొనర్చిన గురువునకును శ్రేయస్సు కలుగదు. మిక్కిలిగా, వ్రతనియమములు లేనివాడు తాను, సద్గుణములు లేశమైన లేకుండి, సమస్తరత్నములతోనీ భూమినంతటినీ అట్టి విద్యకు ప్రతిఫలముగానిత్తుననినను అట్టివానికి విద్యము బోధించరాదు.

నరేంద్రా! తత్త్వమునునెరుంగ గోరి జితేంద్రియుడై ప్రయత్నమైన, ఇంద్రియనిగ్రహము, శుచిత్వము కలిగిన వానికి మాత్రమే యిట్టి విద్యను బోధించవలెను.

ఈ తత్త్వ విద్య పరమ పవిత్రమైనది. అత్యంత గోప్యమైనది, శోకరహితము, భవభయములనిది, అగాధమైనది, అజరామరము, దోషరహితము, భయరహితము, శుభకరమును, "పరవాదము"అనుపేరుగల అనాది మధ్యమగు బ్రహ్మతత్త్వార్థమును నెరిగినచో మోహస్వరూపమును విడనాడును- అని తత్త్వవాస్తవమెరింగించెను -

కం: గురు భక్తిలేని వారికి నెరిగింపగ బోలగిట్టి నిర్మల బోధన్
గురుభక్తి కుదిరియుండిన నరులకునుపదేశమీయనగు నార్యులకున్

తే॥ గురుని మహిమ తెలియ గురుభక్తులకు గాక,
నితర జనులకెల్ల నేమియెరుక
తేనె తెరల జాడ తేనెటీగకుగాక,
నితర మక్షికాళికెరుక పడునె. - (ఆర్యుల ఉవాచ)

## "తేజోబిందూపనిషత్తు" - నందు

108, 109 వమం: "శాంకరంతు మహాశాస్త్రం",
నదేయం యస్యకస్యచిత్, నాస్తికాయ కృతఘ్నాయ
దుర్వృత్తాయ దురాత్మనే, గురుభక్తి విశుద్ధాంతః
కరుణాయ మహాత్మనే, సమ్యక్పరీక్ష్యదాతవ్యం

మాసగ్ం షణ్మాస వత్సరమ్."

భా. శంకర పరబ్రహ్మ సంబంధమైన శాస్త్రమును ఎవనికో ఒకనికివ్వరాదు (బోధింపరాదు) అనగా - నాస్తికునకు, కృతఘ్నునకు, దుర్వృత్తునికి, దురాత్మునికి, యేమాత్రం చెప్పరాదు.

గురుభక్తి విశుద్ధమైన అంతఃకరణ కలిగిన, ఉదరాశయములుండిన శిష్యునికిని మాసమో, ఆరు మాసములలో **లేదా సంవత్సర** పర్యంతం పరీక్షించి బోధింపవలెను.

అదియును **గాక, పరిపూర్ణుడైన శిష్యుడు**గానివానికే విద్యారహస్యములను బోధించరాదనుటను "శృతిమాత" అచటచట తెలుపుచున్నది.

"నాఽశిష్యాయ కదాచన" అని,

"అశిష్యాయ నదేయమ్" - అని మరియు,

"యోయది మోహాద్దాస్యతి సపాపీయాన్ భవతి"

ఎవడైన శిష్యుడుకాని వాడికి మోహావేశములతో విద్యారహస్యములను నుపదేశించినవాడు పాపాత్ముడగునని "శృతి" హెచ్చరిక.

బ్రహ్మాండ పురాణములో హయగ్రీవుడు అగస్త్యుని కోరికతో శ్రీలలితానామ సహస్రనామ స్తోత్రపూర్వ భాగము ప్రథమోధ్యాయమునందు నొకచోట నిట్లనుచున్నాడు.

"చక్ర రాజస్య విద్యాయాః శ్రీదేవ్యాదేశికాత్మనోః ।
రహస్య ఖండే తాదాత్మ్యం పరస్పర ముదీరతమ్ ॥

భా॰ రహస్య ఖండమున శ్రీచక్రానికీ, శ్రీవిద్యకు మరియు, శ్రీదేవికి, గురుశిష్యుల కుండవలసిన తాదాత్మ్యభావాలు చెప్పబడినవి.

- "రహస్యమితి మత్వాఽహం నోక్తవాన్ తేనచావ్యధా ।
పునశ్చ పృచ్ఛతే భక్త్యా తస్మాత్తత్తేవదామ్యహమ్ ॥"

ఈ స్తోత్ర నామములు రహస్యములైనవి. నీకు వివరించలేదు. అంతకంటేవేరే విధమైన కారణం ఏదీలేదు. ఇప్పుడు నీవు సవినయంగా భక్తిభావంతో నన్ను మళ్లీ అడిగావు కనుక, నీకుపదేశిస్తున్నాను.

"బ్రూయాచ్ఛిష్యాయ భక్తాయ రహస్యమపి దేశికః ।
భవతా న ప్రదేయం స్యాదభక్తాయ కదాచన ॥"

ఉత్తముడైన గురువు, ఎటువంటి మంత్ర రహస్యాన్నైనను వినయ సంపద భక్తి తాత్పర్యం గల శిష్యుడికే తెలుపవలెను. ప్రస్తుతం నీకు నేనుపదేశించబోయే ఈ సహస్ర

నామావళిని ఎన్నడూ భక్తుడు కానివానికి చెప్పరాదు.

ఎటువంటి శిష్యులకు బోధింపరాదు?

"న శఠాయ న దుష్టాయ నా విశ్వాసాయ కర్హిచిత్ ! "

శఠునకు, దుష్టునకు, **విశ్వాసరహితునకు** ఈ బ్రహ్మవిద్య బోధింపరాదు.

1. శఠుడనగా :- **"గూఢవిప్రియ కృత్ శఠః"** తెలపకుండా అపకారం చేసేవాడు గురువుగారు**ఉపదేశించినను విషయాన్ని** గ్రహించి, ఇతనికింత మాత్రమే తెలుసని, తెలిసినా **తెలియలేని వానిగా గురువును** తిరస్కరించేవాడు.

2. **దుష్టుడనగా** :- గురువు చెప్పిన రహస్యాన్ని గ్రహించి, దాని నితరులకును తెలిపి తిరిగి వేళాకోళం చేసేవాడు.

3. **అవిశ్వాసుడనగా** :- గురువు ఉపదేశించినది గ్రహించిన పిదప, ఆ రహస్యం మీదగాని, గురువుగారి మీదగాని నమ్మకంలేక చరించువాడు.

కనుక, "పశుతుల్యేషు నబ్రూయాజ్జనేషు"

ఇట్టి పశు తుల్యులైన మూఢ జనులకు ఈ విద్యగరపరాదు -
"తస్మాత్సంగోపయే దిదమ్"- అందుచే నిట్టిది గోప్యంగానే ఉంచాలి.

-"నావిద్యా వేదినే బ్రూయాన్నాభక్తాయ కదానచ"- ఈ విద్యయందున్న విముఖులకు, అభక్తులకునూ దీనిని ఉపదేశించరాదు.

"యోదదాతి విమూఢాత్మా శ్రీవిద్యారహితాయచ ।
తస్మైకుప్యంతి యోగిన్యసోఽనర్థం సుమహోస్మృతః॥"

తెలియక అయినా, ఇట్టి విద్యను భక్తిలేనివానికి చెప్పతగదు. అలా చెప్పినట్లైతే "యోగినీ సంఘం" అట్టి చర్యకు కోపము వహించును.

కావున - "పరీక్ష విద్యా విదుషస్తే భ్యో దద్యాద్విచక్షణః"

బుద్ధిమంతులు విద్యాదానం చేసేటప్పుడు విద్యావిధులను పరీక్షించి వారికి మాత్రమే విద్యాదానం చేయాలి.

మైత్రేయ్యుపనిషత్తు (ద్వితీయోధ్యాయమున) 10వ శ్లోకము (మం)న శిష్యుడు పొందవలసినది గూర్చి -

శ్లో॥ అద్వైత భావనా భైక్ష్యమభక్ష్యం ద్వైత భావనం ।
గురుశాస్త్రోక్త భావేన భిక్షోర్భైక్ష్యం విధీయతే ॥

భా: గురుశాస్త్రానుసారముగ అద్వైతన భావనయే ముఖ్యభిక్ష - ద్వైత భావనయే అభక్ష్యము

శ్లో ॥ అసంశయవతాం ముక్తిః సంశయావిష్ట చేతసాం ।
నముక్తిర్జన్మ జన్మాంతే తస్మాద్విశ్వాస మాప్నుయాత్ ॥ -(16వ శ్లో)

భా: శాస్త్రమునందు, గురువాక్యమునందు దృఢవిశ్వాసంగలవారికి ముక్తి సులభం. సంశయం గలవారికెన్ని జన్మలకైనను ముక్తి కలగదు. కనుక, వివేక శాస్త్రమునందుసు, గురువాక్యము నందును దృఢ విశ్వాసము కలిగియుందును.

కావుననే శ్రీభగవద్గీతా బోధామృతమును గ్రోలిన అర్జునుడు శ్రీకృష్ణుని గురువుగా, భగవంతునిగా గుర్తించి, విశ్వసించి, అర్థంచేసుకొని, అంగీకరించినట్లుగా నిట్లన్నాడు.

శ్లో॥ నష్టమోహః స్మృతిర్లబ్ధా త్వత్ ప్రసాదాన్మయాచ్యుత ।
స్మితోఽస్మి గతసందేహః కరిష్యేవచనం తవ ॥ - (18అ-73 శ్లో)

భా: పరమాత్మా! నా అజ్ఞానమిప్పుడు తొలగింది. నీయనుగ్రహంతో జ్ఞానాన్ని పొందితిని. నేనిప్పుడు స్థిరుణ్ణి. సంశయరహితుణ్ణి, అయి, నీయీ యుపదేశం ప్రకారం చేయడానికి సిద్ధంగానున్నాను. అని-

అభిలషించి యుండిన అర్జునునికీ ఆధ్యాత్మగీతాబోధామృత ప్రసాదం లభించింది. శ్రీకృష్ణుని జిహ్వకు సార్థకత లభించినది. అర్జునుడిలా ఆ జిహ్వాప్రసాదం పొంది మనమును ధన్యులమౌతాము.

"శ్రీదేవీ భాగవతము" 7వ స్కం 36వ అ: 21 1/2శ్లో: నుండి 28/1 శ్లోకపాదము వరకు శ్రీదేవి, పర్వతరాజుతో బ్రహ్మాజ్ఞానోపదేశమును బోధించుచూ నిట్లనెను.

శ్లో॥ దేవ్యువాచ:- ఇదం జ్యేష్ఠాయ పుత్రాయ భక్తియుక్తాయ శీలినే ॥

శ్లో॥ శిష్యాయ చ తథోక్తాయ వక్తవ్యం నాన్యథా క్వచిత్ ।
యస్యదేవే పరాభక్తిర్యథా దేవే తథాగురౌ ॥ - 22

శ్లో॥ తస్యైతే కథతాః హ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః ।
యేనోపదిష్టా విద్యేయం స ఏవ పరమేశ్వరః ॥ - 23

శ్లో॥ యస్యాయం సుకృతం కర్తుమసమర్థస్తతో ఋణీ ।
పిత్రోరప్యధికం ప్రోక్తో బ్రహ్మాజన్మ ప్రదాయకః ॥ - 24

శ్లో॥ పితృజాతం జన్మనష్టం నేత్థం జాతం కదాచన ।
తస్మైన ద్రుహ్యేదిత్యాది నిగమోఽప్యవదన్నగ ॥ - 25

శ్లో॥ తస్మాచ్ఛాస్త్రస్య సిద్ధాంతో బ్రహ్మాదాతాగురుః పరః ।
శివేరుష్టే గురుస్త్రాతా గురౌ రుష్టే న శంకరః ॥ - 26

శ్లో॥ తస్మాత్సర్వ ప్రయత్నేన శ్రీగురుంతోషయేన్నరః ।
కాయేన మనసా వాచా సర్వదా తత్పరోభవేత్ ॥ - 27

శ్లో॥ అన్యథా తు కృతఘ్నః స్యాత్కృతఘ్నే నాస్తి నిష్కృతిః । -28/1

అని వచించి, చివరిలో

శ్లో॥ ఇతి సంకట సంపాద్యాబ్రహ్మ విద్యా నగాధిపా ।
లబ్ధాయేన సధన్యః స్యాత్కృత కృత్యశ్చభూధర ॥ - 30

భా: దీనిని (బ్రహ్మ జ్ఞానము) జ్యేష్ఠపుత్రునకుగాని, భక్తియుక్తునకుగాని, గుణశాలికిగాని యుపదేశింపవలయును. తగిన శిష్యునకును దీనిని యుపదేశింప వచ్చును. ఇతరుని కెవ్వనికిని చెప్పరాదు. ఎవనికి తన యిష్టదేవతయందు, గురువునందు నిశ్చల భక్తియుండునో బ్రహ్మజ్ఞానమతనికి బోధింపవలయును. అతనికి బోధించిన విద్యలు చక్కగా ప్రకాశించును. జ్ఞానముపదేశించువాడు కేవలం పరమాత్ముడే. ఇట్టి జ్ఞానోపదేశమందిన వాడు తన గురునకు ద్రోహము తలపెట్టరాదని వేదమనును. బ్రహ్మజ్ఞాన మొసంగిన గురుడు శ్రేష్ఠుడని శాస్త్రములు వచించును. శివుడు కోపించిన వానిని గురుడు కాపాడును. గురుడు కోపించిన వానిని శివుడు కాపాడలేడు. కనుక, నుత్తమ శిష్యుడు మనోవాక్కాయ కర్మములతో గురుసేవాతత్పరుడై యెల్ల భంగుల గురువే సంతోషపెట్టవలయును. అటులచేయని శిష్యుడు కృతఘ్నుడగును. కృతఘ్నునకు ప్రాయశ్చిత్తమేదియును లేదు.

**ఓ నగపతీ!** బ్రహ్మవిద్య యింత కష్టసాధ్యమైనది. దీనిని బొందినవాడు ధన్యుడు. కృతార్థుడు." **అని భావము.**

**కావున,** బ్రహ్మోపదేశమొనరించు గురుతుల్యులెవరైనను పరమాత్మ స్వరూపులు. గీతనుపదేశించిన శ్రీకృష్ణుని దర్శించుటకు అర్జునునకు జ్ఞాననేత్రములు తెరువబడెను.

కాని, మన భౌతిక నేత్రాలతో నేరుగా సద్గురువు శ్రీకృష్ణపరమాత్మను దర్శించలేము కదా! కావున జిహ్వను ఆయన సేవలో వినియోగిస్తే -

"ఇదిగో నేనిక్కడున్నాన"ని నొక ఆధ్యాత్మకాచార్యులుగా దర్శనమిస్తాడు.

"హరే కృష్ణ" అను మంత్రజపం మనలోని "భౌతిక స్వభావం" - అనే దావాగ్నిని చల్లారుస్తుంది.

"శ్రీశ్రీ విశ్వనాథ చక్రవర్తి ఠాకూర్‌గారు" ఆధ్యాత్మికాచార్యుని నుద్దేశించి చేసే యీ క్రింది "గుర్వాష్టక" ప్రార్థనను గమనించండి.

"సంసార దావానల లీఢలోక,
త్రాణాయ కారుణ్యఘనా ఘనత్వమ్ ।
ప్రాప్తస్య కల్యాణ గుణార్ణవస్య,
వందే గురోః శ్రీచరణార విందమ్ ॥ - 1

ఆధ్యాత్మికాచార్యుడు కరుణాసముద్రుని (శ్రీకృష్ణుని) నుండి ఆశీస్సులను గ్రహిస్తుంటాడు.

ఒక మేఘమొక అడవిలోని దావానలంమీద కుంభ వృష్టి కురుపించినట్లు, ఆద్యాత్మికాచార్యుడు భౌతిక జీవితమనే అగ్నిహోత్రంపై వర్షించి దానిని చల్లారుస్తాడు. అలాంటి ఆధ్యాత్మికాచార్యుని శ్రీ చరణార విందాలకు నేను ప్రణమిల్లుచున్నాను.

దేవదేవుని తృప్తిని, ఆయన ప్రతినిధి అయిన ఆధ్యాత్మికాచార్యుని ద్వారా తెలుసుకోవాలి. అందులకు ఆధ్యాత్మికాచార్యుని కరుణకు పాత్రుడు కావాలి. ఈయన సంతృప్తి చెందితే దేవదేవుడు కూడా సంతృప్తి చెందినట్లే. అని ఆ "ఠాకూర్‌గారు" ఆ గుర్వష్టకము చివరలో నిట్లు వివరించెను.

"యస్య ప్రసాదాన్ భగవత్ ప్రసాదో,
యస్యాప్రసాదాన్నగతిః కుతోఽపి ।
ధ్యాయంస్తువం స్తస్య యశస్త్రసంధ్యం,
వందే గురోఃశ్రీచరణారవిందమ్ ॥" - 8

భా: "ఆధ్యాత్మికాచార్యుని యనుగ్రహంతో శ్రీకృష్ణుని యనుగ్రహం లభిస్తుంది. ఆయన అనుగ్రహంలేకపోతే యే వ్యక్తి ముందుకు పోలేడు. అందుచేతనే నేను నిరంతరం నా ఆధ్యాత్మికాచార్యుణ్ణి సదా మరియు కనీసం రోజుకుమూడు సార్లు స్మరిస్తూ, ఆయన శ్రీచరణారవిందాలకు ప్రణమిల్లుతున్నాము" అని.

ఆధ్యాత్మికాచార్యుడు దేవ దేవుని ప్రతినిధి. గురు పరంపరకు చెందిన బోధనలను అవగాహనచేసుకొనిన వ్యక్తి ఆధ్యాత్మిక గురువౌతాడు. గురుపరంపరల ప్రమాణాలనుండి సందేశాన్ని అందజేయడంలో శిష్యులకు తన వ్యక్తిగతమైన వ్యాఖ్యానాలను జోడించరాదు. వ్యక్తిగతమైన వ్యాఖ్యానంతో ముఖ్య సందేశం తరిగిపోతుంది. తప్పుదోవ పట్టినట్టవుతుంది. క్షేత్రము వంటి శిష్యుని మదిలో అసలైన పంట కన్న కలుపు మొక్కలను మొలిపించినట్లవుతుంది. కావున, ఆధ్యాత్మికాచార్యుల అర్హతలగూర్చి, అనగా గురుపరంపరను

గూర్చి గీతలో (4వ అ. 1నుంచి 4 శ్లో) శ్లోకాలలో శ్రీకృష్ణ పరమాత్మ అట్లు వివరించెను.

అటులే "ఐతరేయోపనిషత్తులో "ప్రజ్ఞానంబ్రహ్మ" అని ఋగ్వేదం నందున్నప్రథమ మహావాక్యమును, గురువు తొలుత శిష్యునకుపదేశించెను.

మరియు ఛాందోగ్యోపనిషత్తులోని "తత్త్వమసి" అని సామవేదమునకు సంబంధించినది యుపదేశించెను.

అనాదిగా జీవుడు సంసార తాపత్రయముతో విసుగుచెంది, విరక్తుడై మోక్షకామిగా ఆధ్యాత్మగురువు నాశ్రయించి, "నాప్రజ్ఞాన ఘనమైన బ్రహ్మాం" నీవై యున్నావని అర్థించును.

పై యుపదేశమునందిన శిష్యుడుగా జీవుడు ఆ తత్త్వమును పరిశీలించి, "అయమాత్మాబ్రహ్మ"యని దృఢపరచుకొని, నిష్ఠతో ధ్యానపరుడై "అహం బ్రహ్మాస్మి"గా తలంచి గురువును సాక్షాత్కరించుకొనును.

**"ఆకతాయి శిష్యుల ప్రవర్తన"** - యిట్లుండును.

మన సంగతి మనం తెలుసుకోవాలి, కానీ మన గురువును గురించి గొప్పలు చెప్పుకొంటె మనకేమి వస్తుంది? కొన్నాళ్లు పోయిన తదుపరి, మనతోటి వాళ్లుసాధన చేసి, కొంచెం విశిష్టమైన స్థితిని పొంది యున్నట్లైతే, అది చూచి కొందరు, "మనమూ గురువును నాశ్రయించియున్నను మనం యిట్లాగే ఉన్నామే? కనుక, మనమాశ్రయించిన గురువుకేమిరాదు -అని గురువునే తప్పుపట్టి, మనకు విద్యరాలేదంటే, ఆ విద్య గురువునకు రాదని యుండవచ్చును. ఎందుకంటే గురువునకు వచ్చియున్న నాకు రాలేదేమిటి? అని ప్రశ్నించిన, "నీవు సరిగా సాధన చేయలేదంటారు" కొందరు. అందుకని గురువునకే రాదంటే సరిపోలే? **"అందని ద్రాక్ష పుల్లన"** అన్నట్లు.

**ఇటువంటి** బుద్ధి మనకు క్రొత్తగా వచ్చింది కాదు. "ఛాందోగ్యోపనిషత్తు"లో అరుణ మహర్షి పుత్రుడైన శ్వేత కేతువు 12వ సవంత్సరాల వయస్సులో నాలుగువేదాలు, షట్శాస్త్రాలు అభ్యసించాడు. కానీ, ఆ కుర్రవాడికి ఉపనయనం చేయడం ఆలస్యమైంది. ఎందుకంటే తండ్రి తపోదీక్షలో నుండడంతో.

"గర్భాష్టమేషు బ్రాహ్మణముపనయీత,"అనేది శాస్త్ర సమ్మతం. సామాన్యమైన శక్తి సామర్థ్యాలు గల బ్రాహ్మణుని నుద్దేశించినది. విశేష శక్తి సామర్థ్యాలు కలిగి యుండడంతో బ్రహ్మావర్చస్సు. బ్రహ్మజ్ఞానం పొందినదిగా తలంచి, మరింకేమి అక్కరలేదని తలంచినచో వాడికి 5 (ఐదవ) యేటనే ఉపనయన సంస్కారంతో వేదాధ్యయనం ప్రారంభించవచ్చు.

అట్లుగాకున్నచో "ఆ షోడశం" 16వయేట చేయవచ్చును. అటుపిదప బాలునిలో బ్రాహ్మణ్యం పోతుంది, అని శాస్త్రం.

అరుణ మహర్షి పుత్రుడగు శ్వేతకేతువునకు 12వ ఏట యుపనయనము చేయకనే గురువుద్వారా సంపూర్ణాధ్యయనం చేయించాడు. శ్వేతకేతువుకూడ త్వరలోనే చతుర్వేదాలు, షట్ఛాస్త్రాలు వాటి అర్థాలు, సమన్వయాలు నేర్చాడు. అయితే తాను సర్వం నేర్చితిననే అహంతో అప్పుడప్పుడు తండ్రిని కూడ ధిక్కరించడంతోపాటు, ఎవ్వరైన పెద్దలు యింటికిరాగా! వారిని, తాను నేర్చినవిద్యలో ప్రశ్నించడం, తర్కించడంతోబాటు, మీరేమేమి నేర్చితిరి? అదియును పరిపూర్ణంగా నేర్చితిరా?" అని ప్రశ్నలు వేస్తూ, తన పాండిత్యమును వెల్లడించుకొనుచు, కొందరిని నోడించు చుండెడి వాడునూ.

ఒకనాడీతడీ "ప్రవాహనుడ"ను రాజసభలోనికి వెళ్లి, తన పాండిత్యపటిమ జూపుటకై యత్నించగా, పూర్వమే ఈతనిని గూర్చి యెరింగినరాజు, నాయనా! నీవు సకల విద్యలు నేర్చుకొంటివా? అయితే మరణించిన జీవులెచటికి పోవుదురో? పితృలోకమెట్లుండునో? మరల జీవులెట్లు పుడమికి వచ్చుదురో? చెప్పమని రాజు ప్రశ్నించెను. శ్వేతకేతువు రాజువేసిన ప్రశ్నలకేమి సమాధానమివ్వలేక తెల్లమొగమేసెను. అది జూచి, రాజు – "ఈ మాత్రం తెలియని వాడవు, గొప్ప విద్యావంతుడవని ఎట్లు విర్రవీగుచున్నావు? అని రాజాక్షేపణచేసెను. అంతే. శ్వేతకేతువు యింటికి చేరెను.

అయినను, శ్వేతకేతువునకున్న అహంభావమును గమనించిన తండ్రి అరుణ మహర్షి, యొకనాడు కొడుకును నేకాంతంగా కూర్చోబెట్టుకొని యిట్లు ప్రశ్నించెను.

ఏమిట్రానాయనా! మంచి గర్వంలోనున్నావు. ఏమిటీ విశేషము? అన్నాడు. అందులకా శ్వేతకేతువు", ఏముందీ నా చదువంతా పూర్తయినది. సర్వము నేర్చితిని కదా! నాన్నగారు ఇది నేను గురువుగారియింటికి వెళ్లవలసినపని లేదు కదా! అని, సమాధానమిచ్చెను. తనలోని భావన వెళ్లగ్రక్కెను. దానితో తండ్రి అరుణుడు నాయనా! నాకొక సందేహమున్నది. చెబుతావా! అని ప్రశ్నించెను.

"దాందేముంది అడగండి, చెపుతానన్నా"డా పుత్రుడు. అదేదో సులభ గ్రాహ్యమై యుండుననితోచి.

అపుడా తండ్రి, "నాయనా! ఒక ముఖ్య విషయాన్ని తెలుసుకొంటే (కీలక విషయంతో) సమస్త విషయాలు తెలుసుకోగలవు? ఆ విషయాన్ని తెలుసుకొన్నావా? అని ప్రశ్నించడంతో, శ్వేతకేతువు గుండెల్లో రెండవసారి పెద్దబండరాయి పడ్డట్టయింది. అంతే, బిక్కమొగమేశాడు. అయిననూ, తన అహం చంపుకోలేక, ఏమిటీ! ఒక్క విషయం

తెలుసుకొంటే అన్ని విషయాలు ఎలా తెలుస్తాయంటున్నారు? అది సాధ్యం కాదు." అన్నాడు పుత్రుడు.

"సాధ్యమవుతుందని నిరూపణ చేస్తానన్నా"డు తండ్రి అరుణుడు, విను మరీ-

"ఒక తండ్రి కుమారుల సంభాషణ యిది గ్రహించు" అని, కనువిప్పు కలిగించు యీ క్రింది కథ యిలా చెప్పాడు.

నాయనా!-"ఒక యేటి యొడ్డున నొక తండ్రి కుమారునకు మట్టి ముద్దను చూపించాడు. ఏమిటని? కుమారుడడుగగా-ఇది మట్టి ముద్దరా! చూచావా, ఇది కుమ్మరివాడు తయారు చేశాడు. అటుపిదప, అటు యొడ్డున, తయారైన కుండలు, కూజాలు మొదలగు వాటిని జూపగా, జూచి, "ఇవి యేమిటని" అడుగగా - "ఇవి కుండలు, కూజాలు, మూకుళ్లు, ప్రమిదలు, వగైరా" అని చెప్పగా -

నాయనా! ఇవి యన్ని ఆ మట్టి ముద్దతో తయారైనవేనా అని, ఆశ్చర్యవదనంతో ఒక వస్తువుతో యిన్ని వస్తువులా, అని, అడుగగా నిజమేనని తండ్రి చెప్పెను.

బాలుడప్పుడు ఒక ముఖ్యవస్తువుతో నెన్నెనా వస్తువులను తయారు చేయవచ్చునని తెలుసుకొనెను. ఆ నిరూపణతో శ్వేతకేతువునకు అనుమానం వచ్చి, మరల గురువుగారి వద్దకు వెళ్లుమని చెప్తాడా ఏమి? అని తలంచి, వెంటనే "ఇట్టి ముఖ్యవస్తువు ఏమిటో మా గురువుగారికినీ తెలియదు నాన్నా!" అని చెప్పడంతో - తండ్రి, అరుణమహర్షి "అదేమిట్రా, ఆయనకు తెలియదని నీవెట్లు తలంచితివి?" అన్నాడు. అదివిని, "నాన్నా! ఆయనకు నేనంటే చాలా యిష్టము. ఆయనకు నేను అన్ని సేవలు చేశాను. అందులకు, ఆయనకు తెలిసిన రహస్యము నాకు చెప్పకుండా యుండలేరు. కనుక, నిజముగా ఆయనకు తెలిసియుంటే నాకు చెప్పకుండా వుండేవారు కారు. ఆయనకు రాదు" అని అన్నాడు, పుత్రుడు శ్వేతకేతువు అనగా - తనకు అన్నియు తెలిసికొనినట్లుగా తలంచెను.

ఇంతకు చెప్పేదేమంటే, "మాగురువుగారు గొప్ప" అని చెప్పుకొనే వాళ్లను, "మీకేమి రాలేదేమయ్యా?" అని ప్రశ్నించితే వెంటనే శిష్యుడు, "మాగురుగారికే రాదు", అని అనేస్తాడు. ఇట్టిది సాధారణ శిష్య సమాధానం.

కావున గురువును గూర్చి తెలుసుకొనేవారు, ముందుగా తానెవరో తెలుసుకొనేందుకును గట్టి యత్నం చేయాలి. ఆ యత్నమనునదే లేక, కేవలం అహంకారంతో గురువుగారిని కించపరచినట్లు పలుకుట ఆకతాయి శిష్యప్రవర్తనయే.

"శ్రీశంకర భగవత్పాదుల వారు" యిక్కడ యిట్టి ఆకతాయి శిష్యుల గూర్చి

వ్యాఖ్యానం వ్రాస్తూ - "అలా గురువుగారి గురించి తక్కువగా మాటలాడడం మహాపాపమని తెలిసిననూ, తిరిగి గురుకు క్లేశాన్ని మరల యనుభవింప వలసి వస్తుందనే భయంతో, ఆ కుర్రవాడు అలా అనేశాడు. అదియొకానొక యనుచితకృత్యమ"ని తెలిపారు.

శిష్యుడు తన శిష్యత్వముతో గురువుగారి నుండి నిజముగానే నేర్చుకొనినది స్వల్పమని, నేర్చుకోవలసినది అనంతమని గ్రహించలేక, తను గురువునుండి నేర్చినదే గురువునకు వచ్చిన విద్యయని అల్పభావం కలిగియుండుట శోచనీయము.

గురువు తనను చేరిన శిష్యునిలోని దానవత్వమును తొలగించి మానవునిగా తీర్చి, అట్టి మానవుని మాధవునిగా కూడ తీర్చిదిద్దుతాడు, అని గ్రహించిన శిష్యుడే నిజమైన శిష్యుడు.

కొందరు శిష్యులు తమవల్లనే ఆచార్యులకు కీర్తిప్రతిష్ఠలు వస్తున్నాయని వారి యశోలతికలకు తామే బీజాలమని, తాములేక ఆచార్యులకు అస్తిత్వమే లేదని భావించేవారు లేకపోలేదు. అటులా ఆలోచించేవారు కొందరు రౌరవనరకంలో పడుదురని "శృతి"పలుకును.

ఈ "అక్షరభిక్ష" గురువు చలువనేయనే మతిలేని ఆకతాయి తలంచడు.

★★★

## గురు - సూత్రములు

"ఏకం గురుం వినా సోఽపి భావికస్య ప్రసీదతి"

కాలం జయించగల వాడొక్కడే గురువు. అయినను గురువు భావికుల పట్ల ప్రసన్నుడగును.

- (గు.చ. 32 అ. 81/2 శ్లో)

★★★

"బ్రాహ్మీముహూర్త ఉత్థాయ సద్భక్త్యా సంస్మరేద్గురుం"

బ్రాహ్మీ ముహూర్తమున నిద్రలేచి భక్తితో గురుని స్మరింపవలెను.

- (గు.చ. 36 అ. 104)

★★★

"న గృహ్ణాతి గురోర్వాక్యం స ఘోర నరకం వ్రజేత్"

గురువాక్యమును వినని వాడు ఘోరనరకమును పొందును.

# 41. బోధనానంతరం శిష్యుని కర్తవ్యం
## (తైతరీయోపనిషత్ - ౧౧ వ అనువాకం)

"ఆచార్యుడు శిష్యుని ఆదేశించడం" గూర్చి యిట్లు వివరింపబడి యున్నది.

"వేద మనూచ్యాచార్యోఽన్తే వాసినమను శాస్తి"

ఆచార్యుడు శిష్యునికి వేదమును బోధించి (ఇంటికి పంపునపుడు, మరొక్కసారి అతని కర్తవ్యములను గూర్చి వాత్సల్యముతో) ఆదేశించుచున్నాడు.

"సత్యం వద । ధర్మం చర । స్వాధ్యాయా న్మా ప్రమదః ।"

అనియిట్లు బోధించుచు, చివరకు,

"ఏష ఆదేశః । ఏష ఉపదేశః । ఏషా వేదోపనిషత్ ।
ఏ త దను శాసనమ్ । ఏవముపానితవ్యం ।
ఏవ ముచైతిదు పాస్యమ్ ॥" - అని, ముగింపు.

భా: 1. సదా సత్యమునే పలుకుము. ధర్మమునే ఆచరింపుడు. స్వాధ్యాయమును నిర్లక్ష్య మొనర్చకుము. ఆచార్యుని కిష్టమైన, ప్రయోజనకరమైన కానుకలను గైకొని యిమ్ము.

పూర్వం, విద్య సమాప్తమయ్యేవరకు విద్యార్థులు ఆచార్యుని యింటిలోనే యుండేవారు. వారిని పోషించే బాధ్యత ఆచార్యునిదే. కనుక విద్యార్థులింటికి వెళ్ళిన తదుపరి తమ సమర్థతానుసారం యాగాద్యనుష్ఠానాలకు, ఆశ్రమ సంరక్షణార్థం ధనాదుల నిచ్చుచుండటం పరిపాటి. కనుక నీ సదాచారాన్ని నిర్లక్ష్యం చేయకూడదని, "వేదశాసనమ్".

2. సద్గృహస్థుడవై సంతానము పొంది వంశము నిలబెట్టుకొనుము.

ఆచార్యుని ఆజ్ఞగా వివాహమొనర్చుకొని, సంతానం పొంది, తన వంశాచారాదులను నిలబెట్ట వలయును.

3. సత్యము నుండి తొలగుకుము.

ఇది ప్రమాణాను బద్ధము. చెప్పదగినదే సత్యం (అప్రియ సత్యమును పలుకరాదనునది లోకోక్తియే) "సత్యమే ఉన్నతలోకములకు దారి" అని శృతులు చెప్పును.

కనుక, పొరపాటుననైనను అసత్యమును చెప్పరాదు.

4. "ధర్మము నుండి తొలగుకుము" -

అధర్మ కర్మలను చేయకుండ యుండుటమే, కాక, అట్టిది శాస్త్రసమ్మతము కూడ. వివేక యుక్తమైన ధర్మ కార్యాలను ఆచరించాలి.

5. ఆత్మ సంరక్షణాది కుశలము నుండి తొలగక యుండును.

"ఇది నా తలరాత, లేదా! దైవేచ్ఛ" - అని, చేతులు ముడుచుకొని కూర్చోకుండా, శాయశక్తుల ఆత్మ సంరక్షణ చేసుకోవాలి.

6. ధర్మముగా న్యాయముగా నీ సంపదలను వృద్ధి పరుచుకొనుటలో నిర్లక్ష్యము చేయకుము, అట్టి సంపదల వలన మంగళకరమైన కార్యములను చేయుటలోను నిర్లక్ష్య మొనర్చకుము. "స్వాధ్యాయము, ప్రవచనము", ఈ రెండిటిని నిర్లక్ష్య మొనర్చుకము.

7. "భూతి" అనగా సంపద. లేక మంగళకరమైన పనులు. అని రెండర్థాలు. "న్యాయంగా ధర్మంగా సంపదలను నార్జించుకోవడం, వృద్ధి నొనర్చుకోవడం", శృతి ఆమోదిస్తుంది. అటువంటి సంపద యాగ (యజ్ఞా) యిష్టా పూర్వ కార్యాలకు అనుకూలిస్తుంది.

8. దేవతల పూజాది కర్మలు, పితృల శ్రాద్ధాది కర్మలను నొనర్చుటలో నిర్లక్షింపకుము. మాతా, పితరులు, ఆచార్యుని, అతిథిని దైవముగా నెంచి వారిని సేవింపుము.

సామాన్య లౌకిక సంబంధాలు కూడ, దీనిచే ఆధ్యాత్మిక సాధనగా మారుతాయి.

9. నింద్యములైన పనులను విడిచి, అనింద్యములైన పనులనే చేబట్టుము. మాచేత నొనర్చబడిన పనులలో నేవి మంచివో వాటినే నీవాచరింపుడు. ఒకవేళ పొరపాటున మేము తప్పుపనులొనర్చినను మమ్ములను అనుకరించకుము. అని అర్థం. పొరపాటుననో, భ్రాంతివీశవర్తులయ్యో పెద్దలునూ నొనర్చదగని పనులు చేస్తుంటారు. వారిననుకరించి, శిష్యులటు వంటి పనులనొనర్చరాదు. శాస్త్రమోదితమైన పనులు పెద్దలొనర్చుదురో, అవియే అనుకరణీయములని, ఆచరణీయములని ఎరుంగుడు.

10. మాకంటే శ్రేష్ఠులైన బ్రాహ్మణులెవ్వరైనను నీదగ్గర కొచ్చినచో వారి నాహ్వానించి, ఆసనమిచ్చి, ఫలాది ఆహారములను సమర్పించి, వారి శ్రమను పోగొట్టి సేవింపుడు.

"నప్రశ్వసి తవ్యం" - అనే దానికి, "ఊపిరి కూడ పీల్చ కూడద"ని మరో అర్థం. శ్రేష్ఠులైన బ్రాహ్మణులు సభలలోనేదైన శాస్త్రార్థాన్ని గూర్చిగాని, ఆధ్యాత్మిక విషయాలను గూర్చిగాని వివరించుచున్నపుడు నిశ్శబ్దముగా కూర్చొని శ్రద్ధగా వారు చెప్పినది

వినవలయును. కాని, వృధా అలజడిని సృష్టించకూడద"ని, గ్రహింపుము.

ఇట్లు, వేదసారాన్నంతా మరొకసారి సంక్షిప్తంగా శిష్యునికి తెలియజేస్తాడు ఆచార్యుడు.

పూర్వంలో ఆశ్రమములో చేరిన శిష్యుల పోషణ భారం గురువుగారిదై యుండడంతో, ధనికులను ధర్మానుష్ఠానం కొరకై సంపద కోరబడుతూండేది. శిష్యులకు అన్నపానాదులతో, "అన్నము" విలువను బోధించెడివారలు. "అన్నము" పరబ్రహ్మ స్వరూపమని, అన్నమే గురువని నెంచి గౌరవించవలెను. అందులకే, అన్నపానాదులను ఇతరుల (అతిథుల)కు అర్పించుదురో ఫలముగా వారును, అత్యంత శ్రద్ధా భక్తులతో సమర్పింపబడిన అన్నము పొందుదురు.

"అన్నం న నింద్యాత్" - అని పెద్దలు చెప్పిరి, కావున, అన్నమును పవిత్ర భావముతో సమర్పింపవలెను. మరియు "అన్నం న పరిచక్షీత" - అన్నమును నిరసన భావముతో నిరాకరింపకూడదని, చెప్పిరి.

ఇట్లు, అన్నము భగవత్స్వరూపమని తెలుసుకున్నాము కదా! అందులకే, భగవంతుడే ఇట్లనుచున్నాడు.

"అహమన్న అహమన్న అహమన్నం"
"అహమన్నాదః అహమన్నాదః అహమన్నాదః"

అని, అన్నమును శ్లోకించి పలికెను. కనుక, ఎవడన్నార్థుల కివ్వకుండ స్వయం అన్నం తినుచున్నాడో, అతనిని నేను తినుచున్నాన"ని, పలికెను.

అని గురువులునూ నట్లే శిష్యులకు బోధించి పంపుదురు.

భగవద్గీత 3వ అ॥, 13వ శ్లో॥ 2వ పాదము నిట్లు చెప్పుచున్నది.

"భుఞ్జతే తే త్వఘం పాప యేపచాన్త్యాత్మ కారణాత్"

ఎవరు తమ నిమిత్తమే భుజించుచున్నారో, అట్టివారు పాపమును తిను వారే యగుదురు. అని భావము.

"ఈశావాస్యోపనిషత్తు" - ఆరంభముననే -

"తేన త్యక్తేన భుఞ్జీథా" - నీకున్నదానిలో నాకింత త్యాగమొనర్చి భుజింపుము. నీకున్నది భగవంతున కర్పించి భుజింపుము. అని చెప్పబడినది. అట్లొనర్చిన "సర్వకిల్బిషైః", ఒకటి రెండు పాపముల నుండి, సర్వపాప విముక్తుడగునని, తెలుపబడినది. అదియే,

"భూత యజ్ఞమ"ని ప్రాణులకు అన్నమిడుటను పంచసూనము లలోనొకటని, ఇవి పాప పరిహారములని, భగవదారాధనా రూపములై, పరోపకార సంబంధములైనట్టివని బోధించుదురు.

పూర్వం, మహానీయుల నుండి పురాణములే ప్రప్రథమమున వల్లింపబడెడివని నిట్లు కొన్ని ఆధారములద్వారా తెలియుచున్నవి.

శ్లో॥ ప్రథమం సర్వ శాస్త్రాణాం పురాణం బ్రహ్మణాస్మృతం ।
అనంతరంచ వక్త్రేభ్యో వేదాస్తవ్య వినిస్సృతాః ॥

భా: బ్రహ్మచే ప్రప్రథమమున పురాణం స్మరింపబడి, పిమ్మట అతని ముఖము నుండి వేదములుత్పన్నములైనవని, "వాయుపురాణం"లో 1వఅ॥ 60వశ్లో॥న చెప్పబడెను.

అటులే, "పురాణోత్పత్తి"ని గూర్చి "విష్ణుపురాణము"న – పురాణోత్పత్తికి బీజములు వేదములందే యున్నవని, శ్రీవ్యాసుడు రోమహర్షుణునకు బోధింపగా, రోమహర్షణుడు తిరిగి వాటిని, అగ్నివర్చుడు, మైత్రేయుడు, సాంశపాయనుడు, కాశ్యపుడు, సావర్ణి, అకృత వ్రణుదులను ఆర్గురి శిష్యుల కాయా సందర్భములలో బోధించెన"ని తెలియుచున్నది.

పూర్వము మహనీయులు (ఆచార్యులు) తాము ఆధ్యాత్మిక విద్యను, ధర్మమును బోధించినప్పటికిని, శిష్యులకు దానిని గూర్చి ఆలోచించుటకును, విమర్శించుటకును, పూర్తిగా అధికారమిచ్చు చుండెడివారు. వారు బోధించిన బోధను, పూర్వాపర విచారణలేక, స్వయంగా దానిని గూర్చి నాలోచింపక, అమాంతముగా గ్రహించుడని చెప్పెడి వారు కారు. చెప్పరు కూడ.

"మహాత్ములగు గురువుల లక్షణమిట్లె యుండును" – గురువు బోధించిన దానిని శిష్యుడు తన సొంత పరిజ్ఞానంతో నిజ సంస్కారముతో, చక్కగా పరిశీలించి, విచారణ సలిపి, పూర్వాపరాలను గ్రహించయత్నించుదురు. తదుపరిదానిలో తనకు నచ్చిన దానిని గ్రహించెడివారు. అట్లు గ్రహించునది ధర్మ సమ్మతముగా శాస్త్ర సమ్మతముగా నుండవలెను. ఇట్టి స్వాతంత్ర్యమును పూర్వపు గురువులు తమ శిష్యులకిచ్చు చుండెడి వారు.

గురువు బోధించిన దానిని శిష్యుడు సొంత ప్రజ్ఞతో సమాలోచన చేయనిచో, నాతని బుద్ధి వికసించదు. అట్లుగాక, శిష్యుని కర్తవ్యము కూడ తమపై వేసికొనినచో, యిక గురువులకు శాంతి యుండదు.

కనుక గురువుల ధర్మమును గురువులు నెరవేర్చి, శిష్యుల ధర్మము నభిలిషింతురు.

అనగా ఫలమునాశించుట కాదు. శిష్యుడు తన యధార్థమును తాను గ్రహించుకొనవలసి యుండును. గురువు కేవలం మార్గదర్శకుడు. దారిని చూపువాడు మాత్రమే. శిష్యుడు తాను సొంతముగా దారిలో నుండు సద్వస్తువులను అన్వేషించుకోవలెను. అనగా సొంత జ్ఞానము నుపయోగించవలెను. దానినే "మెదడుకు పదునుపెట్టుట" అందురు.

కనుకనే గీతాబోధనలో శ్రీకృష్ణుడు అర్జుననకు బోధించినంత బోధించి, చివరకు యిలా అన్నాడు. "యథేచ్ఛసి తథాకురు", అని.

గురువు నుండి జ్ఞానమధువుగ్రోలు "శిష్యుణ్ణి", - తుమ్మెదగా నిట్లు అభివర్ణింపబడెను -

"పంచాచార్య పదాంబుజ భృంగమ్" - అని.

గురువు నుండి నేరుగా భక్తి శ్రద్ధలతోనుపదేశం పొందిన వారికి శుద్ధ బ్రహ్మజ్ఞానం కలుగుతుంది - ఎట్లనగా? స్వాతీ కార్తెలో ప్రప్రథమ వాన(జల) బిందువు ముత్యపు చిప్పలోపడి ముత్యములవుతున్నట్లుగా, గురుజ్ఞానోపదేశముతో శిష్యులు రెండవ ముత్యములుగా తయారగుదురు.

అట్లొనర్చుటలో శిష్యులపై వాత్సల్యముంటే గాని విద్యాబోధ చేయదానికితనిలో నుత్సాహముండును. లేనిచో శిష్యునిలో నుత్సాహము కల్గించలేడు. అదియును గాక, కేవలం డబ్బుకోసం గురువు వృత్తి నవలంభించేవారు కూలీ వారన బడుదురు. ఫలప్రదమైన కృతకృత్యతా భావాన్ని పొందింప జేయనూ లేరు.

సద్గురువుల బోధనలో శిష్యులు తప్పుచేసిన శిక్ష పొందుటలో వెనుకాడరాదు. క్షమించుమనుటకును వెనుకాడరాదు. గురువును చెడుగా నెప్పుడును వ్యాఖ్యానించరాదు. అట్టిది చాటుగానైనను, బాహ్యముగానైనను తగదు.

శిష్యుని ప్రేరణతో తగు గురువు లభించును. అట్టి గురువును చేరుతాడు కూడ. ఆగి ఆలోచించేవాడు, గురువు చెప్పినది చెప్పినట్లాచరించేవాడే శిష్యుడు. ఏదేమైనా, కారణమడుగడు. తనకింకా పరీక్షలున్నాయే, అని సంతాప పడడు. పరీక్షలెన్ని అధిగమించిన, అంత రాటు తేలుతాడు శిష్యుడు.

సంగ్రహంగా చెప్పాలంటే, నన్ను శిక్షించి, రక్షించువాడు గురువే, అని తలంచిన వాడే శిష్యుడు. శిక్షణలో(తో) రక్షణ పొందుదునని తలంచు నిజమైన శిష్యునకు తగు సద్గురువు లభించి తీరును.

అట్టి సద్గురువు కూడ శిష్యుడికి ఉపదేశం చేయుటలో అతని అర్హతను గ్రహించి

తగురీతిగానే ఉపదేశమిచ్చును. గురూ పదేశమనునది దానంతటనే అది లభించదు. శిష్యుడిలో యితరత్ర కోరికలుండినంతకాలం ఉపదేశా ర్హతకర్హుడు కాడు, పొందడు కూడ. అర్హత పొందరానట్టే లెక్క. కనుక, గురువును చేరునపుడు నితరత్ర కోరికలపై వైరాగ్యం కలిగి యుండిననే విద్యార్జనార్హులగుదురు. మరియు అజ్ఞానం, అహంకారము లావరించి యుండినచోనట్టి శిష్యులు విద్య నభ్యసింప అనర్హులు. అట్టివారికి గురువు లభించదు. లభించిననూలేక గురూపదేశం వ్యర్థమే.

సద్గురువు లభించడమనునది, శిష్యుని సత్కర్మల, పూర్వ పుణ్యాల బలం, ఫలం వలన లభించుతాడు. లభించిన తదుపరి సేవాకార్యక్రమాలతో ఆదరించవలెను. అట్టి పుణ్య సేవాకార్యక్రమం ఆపిననూ, నిర్లక్ష్యమొనర్చిననూ గురువతనిని వదలిపెట్టును. గురుసేవా కార్యక్రమమనునది దైవానుష్ఠానము. ఆ అనుష్ఠానం ఆపరాదు.

కొందరు తమకు గురువు లభించిన తదుపరి, చక్కగా విద్యనార్జించి, బహు విద్యావంతుడై, గురువును కూడ మించిన వాడైపోగా, సంకుచిత మనస్కులై అహంకార పూరితులై, గురువును నిర్లక్ష్యమొనర్చు స్వభావులై, ఇక గురువును సేవించడమటుండ, గురువు ఆజ్ఞ అటుండ, గురువును ధిక్కరించడము ప్రథమ కర్తవ్యముగా నెంచుకుంటాడు. ఈ గురువునుండి తాను పొందిన విజ్ఞానం (విద్య) బహుస్వల్పం. తన స్వయం కృషియే అపారమని యెంచి, తుదకు నిందించగలడు కూడ. కాని, తానెంతవిజ్ఞుడైనను గురువుతో సమానుడు కాలేడు. కాజాలడు కూడ.

గురువనగా – సర్వకారణ భూతశక్తి స్వరూపుడు. అట్టి శక్తి స్వరూప సంపన్నుడు శిష్యుని కూడ తనంత వానిగా చేయ యత్నించును. కాని, ఆ శిష్యునిలో స్వల్ప జ్ఞాన మావరించే సరికి, ఇక గురువు అవసరము లేని తత్త్వ స్వభావుడై, గురు ధిక్కారము ప్రారంభించి సంపూర్ణ కృతఘ్నుడుగా తయారవుతాడు.

సాధారణంగా నేటి కాలంలో నూటికి 80 మంది అట్టి కృతఘ్నులే కనపడుటకడు శోచనీయము. 10% ఇటు అటున్నవారు. 10%లో 5% గురు ధిక్కార మొనర్చక యుండి, 5% కాస్త సంస్కారవంతులుగా రాణించుచున్నారు. ఈ అటుఇటున్న వారిని పార్టుటైము గురుభక్తులు అందురు. వీరిపట్ల గురువెల్లప్పుడు అసంతృప్తుడే.

'శ్రీ మద్వేదాంత దేశికులు" శిష్యుని లక్షణాలిట్టివని, "న్యాస వింశతి"లో విశదపరిచిరి:-

శ్లో॥ సద్బుద్ధిః సాధుసేవీ సముచిత చరితః తత్త్వబోధా భిలాషి,
శుశ్రూషుః త్యక్త మానః ప్రణిపతన పరః ప్రశ్న కాలప్రతీక్షః ।

శాంతోదంతోఽన సూయుః శరణముపగతః శాస్త్ర విశ్వాస శాలీ,
శిష్యః ప్రాప్తః పరీక్షాం కృతవిదభిమతం తత్త్వతః శిక్షణీయః ॥

భా: బుద్ధి మంచిది కావాలి. చురుకైన, నిశితమైన బుద్ధి గల శిష్యుడన్నమాట. పెద్దల పట్ల వినయ విధేయతలు కలిగి, వారిని పరిచరించే మృదు బుద్ధి కలిగి యుండాలి. బాల్యహంకార **రహితుడై, సాధు** పురుష సేవనమనస్సు పొంది యుండాలి. శిష్యత్వానికి **సాధు సేవనమొక యోగ్యత.** అతడే శిష్యుడుగా ఆచార్య సేవనమూ చేయగలు**గుతాడు. సాధు సేవనంతో** ఆచార్యుని వలన పొందిన విద్య దివ్యంగా పరిమళిస్తుంది కూడాను. కనుకనిది శిష్యలక్షణాలలో నవశ్యమని, పరిగణనీయమని గ్రహించాలి. అటులే విశదవర్తనుడు కావాలి. పదిమంది మెచ్చుకో దగిన నడవడి కలవాడు కావాలి. పలువురు శ్లాఘించే చరిత్ర కలిగి యుండాలి. మంచి వినయంతో కూడిన 'వందన సమర్పణ' మనస్సు కలిగినవాడై, ముచ్చటైన తత్త్వజ్ఞానంపై కాంక్ష కలిగినవాడై యున్నచో, (తత్త్వ జిజ్ఞాసను సహజంగా పొందినవాడై యున్నచో) వేదాధ్యయనంలో ప్రయోజకుడౌతాడు.

సత్సంఘములో తిరుగుచూ వారి సూక్తి రత్నాలను విని, తన యెదలో భద్రంగా దాచుకోవాలి శిష్యుడు. ఇట్టి సంగ్రహణంతో శిష్యునిలో జ్ఞానం వికసిస్తుంది. ఇట్టి సంగ్రహణంతో శిష్యునిలో గురుబోధ శాశ్వతంగా నిలుస్తుంది. అందులకా శిష్యుడు అభిమానమును ఆమడదూరాన యుంచాలి. పెద్దలనిన తలదించుకొనే మాటలాడ యత్నించినచో వారిలోని మహత్త్వాన్ని, సౌశీల్యాన్ని నేర్చుకో గలుగుతాడు.

సందేహం కలిగినప్పుడు ప్రశ్నించకుండా, సర్వం తెలిసినట్టుగా యూరకే తలయూపరాదు శిష్యుడు. ప్రశ్నను వేయుతరి, సమయ సందర్భము గమనించి ప్రశ్నించాలి. సమాధానం పొందుటలో కుతూహలుడై, ఏదో అడిగాను అనునట్లుగాక! తత్కాల స్థితిని కూడ గమనించి, సందేహం తీరకపోతే, ప్రశ్నను మనస్సులో నుంచుకొనకుండా, ఆనాడు కాకపోయినను, మరునాడు, ఆమరునాడైనా ప్రశ్నించి సమాధానం పొందాలి. కాని, 'లేడికి లేచిందే పరుగు ముహూర్తమన్నట్లు'కాక, ఆచార్యుడు అన్వయాంతం శాంతం వినకముందే ప్రశ్నపై మరియొక ప్రశ్నల పరంపర వేయరాదు.

పూర్వమొక శిష్యుడు గురువుగారి దగ్గర 'మేఘ సందేశం' చదువుకుందామని వచ్చి కూర్చున్నాడు. మొదటి శ్లోకము ప్రారంభించారు ఆచార్యులిట్లు.

"కశ్చిత్ కాంతా" అన్నారు, వెనుకటి వారు (యతులు) పాటిస్తూ ఓబాణీలో చదివేవారు శ్లోకాన్ని అది మందా క్రాంతవృత్తం, నాల్గక్షరాలపైన రెండు యతులు. అందుచే పాదంలో విరుపులు అలావత్తాలి. ఇదిపాదం.

"కశ్చిత్ కాంతా - విరహ గురుణా - స్వాధికారాత్ ప్రమత్తః"

ముందీ పి ంపులతో చదివి, పదచ్ఛేదం చెప్పి, దండాన్వయంతో ప్రతిపదార్థం తెలిపి, అటు పిదప తాత్పర్యం బోధించి, ఛందో వ్యాకరణాలంకారాది విషయాలు వివరించి, ఇంకేమైన చమత్కారాలు, రసోక్తులుంటే, అవన్నీ వినిపించి, హృద్గతం అయ్యేట్లు వ్యాఖ్యానం చేస్తూ, పాఠం చెప్పటం అలనాటి పద్ధతి.

ఈ వ్యాఖ్యానం **పూర్తయ్యే వరకును** శిష్యుడు ఓపికతో శ్రద్ధతో వినాలి. అందులోనేమైనా ప్రశ్నాభావం **కలిగినా, వ్యాఖ్యాన** ప్రసంగంలో నెక్కడో యోదగ్గిర ఆ ప్రశ్నకు సమాధానం లభించవచ్చును. లేదా, ఇంతైనాకా ఇంకా ప్రశ్నతీరక యుండిన, మేము మొదట్లో చెప్పిన పరిస్థితులను యిప్పుడు గమనిస్తూ ప్రశ్నవేసి సందేహం తీర్చుకోవాలి. ఇదే ప్రశ్నించే పద్ధతి.

కానీ, మనవాడు ఒట్టి కంగారు గొడ్డు కదా! ఇంత అంతా గాబరాకాదు. తెలివి గలవాడే, బుద్ధిమంతుడే, వినీతుడే కానీ, తొందరపాటు కాస్త జాస్తి. అనగా, తాలిమి లేని వాడని, తన వాదననే నిజమనే తొందర. అట్టిది యాగురువు గారికీ పాటి తెలియదా! శిష్యుని ప్రశ్న గురువు తలలో మెదలదా? మరి, అటులా చదువు చున్నాడంటే యేదో యుంటుంది మెలిక. కాస్త ఆగితే, తెలివి గలవాడికే అన్వయం స్ఫురించి, తుదగు శిష్యునికున్న భ్రమ తొలగిపోతుంది. తొందరపాటుదనం వల్ల వెలితి పడి, వెలవెల పోవాల్సి వచ్చు కారణం జనించును.

అందుచేత ప్రశ్నాకాలం వ్యాఖ్యానంలో నెప్పొదన్నదీ ప్రతీక్షించాలి. ఇంతకు ప్రశ్న ఏమి?

గురువుగారి "కశ్చిత్ కాంతా" అనడంతోనే శిష్యుడు టకాయించాడు. అనగా శిష్యునిలో ప్రశ్న "కాచిత్ కాంతా" అనుటకు బదులు "కశ్చిత్ కాంతా" అంటున్నారేమిటని. 'కాంతా' శబ్దం స్త్రీలింగం, కనుక స్త్రీ లింగంలోనో విశేష ముండాలి కదా! అదేమిటట్లా చెప్తున్నారూ! అంటూ, గురువుతో వాదానికి లంకించుకున్నాడు. ఇదండి ఆ శిష్య మనస్తత్వం.

కనుక ప్రశ్నించడంలో నిదానం, ఓపిక, వివేచనం, ఏకాగ్రత, పరాకులేక, గురువునూ పరాకు పడనీయక శాంతస్వభావుడై, అంతరింద్రియ నిగ్రహంతో, బాహ్యేంద్రియ నిగ్రహంతో నుండాలి.

గురువు పాఠమూ, శిష్యుని అధ్యయనమొక తపస్సు. అది యొక యజ్ఞముకూడ. సాధారణంగా తపస్సు యొక్కడికే సంబంధించినది. కానీ, ఈ తపస్సు గురు శిష్యులిరువురకును సంబంధించినది. సరస్వతీ స్వరూపులిరువురు అందులకే, "ముఖే ముఖే

సరస్వతీ" అన్నారు పెద్దలు.

కనుక అధ్యయనమందు సకలేంద్రియాలును అధ్యయనో న్ముఖాలుగా నుండాలి. అంచేత శిష్యునిలో నేకాగ్రత, ఉత్సుకత, విషయముపై శ్రద్ధాదరాలు, తెలిసికొందామనే అభినివేశం, దీక్షదక్షతులుండాలి. ఇవన్నీ కల్గి యుండిన శిష్యుణ్ణి ఆచార్యుణ్ణి దగ్గరగా లాక్కొస్తాయి. వీరుభయులయందు అసూయ యుండరాదు, గురుగుణాలు దోషాలుగా పరిగణించడం ఘోరమైన తప్పిదం మరొకటి లేదు. ఇలాంటి తత్త్వంగల శిష్యుడెన్నడును శోభిల్లడు. సుతరామూ కూడదు. విద్యాధ్యయనంలో పాడి, గాడి తప్పును కూడ.

ఆచార్యుల నాశ్రయించి అమృత పానం చేయదగిన స్థితిని కాలదన్నుకొని, అజ్ఞుల నాశ్రయించి అనర్థాల పాలవుచున్నారు. మంత్రోపదేశం పొంది నిర్దోషులుగా శోభిల్ల వలసినవారు మమకారంతో కొట్టు మిట్టాడుతున్నారు. బాగా దిద్దుబాటు చేయదగిన ఆచార్యుని సన్నిధిని సేవ చేయటం మంచిది. లేదా! బాగాదిద్దు బాటును పొంది యోగ్యుడుగా కీర్తింపబడుతున్న శిష్యుల సన్నిధిని చేరి సేవించటమైనా మంచిది.

పైవారిలో ఆచార్యుని చేరిన, సేవించిననూ, ఉపదేశాదికం లభిస్తుంది. వారే దిద్దుబాటు చేస్తారు. శిష్య భారాన్ని వహిస్తారు. నిన్నొక వస్తువుగా రూపొందించుకొనే బాధ్యత. అవసరమునూ వారిదే, నీకేమి పేచీయుండదు కూడ.

రెండవవారైన, యోగ్యుడైన శిష్యుణ్ణి చేరేవా! అతని సహవాసంతో నీకు తెలియకుండా కొంత మార్పు వచ్చేక, పరిపూర్ణత్వానికి అతని తోడ్పాటుద్వారా, అతని ఆచార్యులే నీకు ఆచార్యులుగా నుండేట్టు ఆ శిష్య మిత్రుడే చేస్తాడు. ఆచార్య ప్రాప్తివల్ల పై లాభాలన్నీ శిష్యులకు సంప్రాప్తిస్తాయి.

భగవంతుడే కానీ, ఆచార్యుడే కానీ, మనకు సులభులుగా తలవాకిట నిలిచినంతకాలం, అటు తలయినా తిప్పము. మన తలలో నాతలపు పుట్టేటప్పటికి తీరా, వేళమించి పోతోంది. అయినా పరవాలేదు. నేరుగా ఆచార్యుల ద్వారా కాకపోయినా, శిష్యుల ద్వారానైనా, వ్యవహితంగానైనా, ఆచార్యులను పొంది, వారిని సేవించి బాగుపడే మార్గాలున్నాయి. శిష్యుడెంతటి మేధావుడైనను, మహాత్ముడైననూ గురువును నాశ్రయింపనిదే, గురు శుశ్రూష చేయనిదే విద్యాసిద్ధి, జ్ఞానసిద్ధి చేకూరదు. విద్యార్జనలో, విద్య, తెలివితేటలున్నను ప్రాచీనవేద మహర్షుల సాంప్రదాయ ప్రకారం గురువు నాశ్రయించి, గురుపాదసేవ చేయవలసిందే.

కురుపాండవులందరు ద్రోణాచార్యుని గురువుగా నెంచి, లౌకిక, ప్రాపంచిక విద్యలనే గాక, మహాయుద్ధ నైపుణ్యతను నేర్చిరి. వారిలోని పాండవ మధ్యముడగు అర్జునుడు

సాక్షాత్ శ్రీకృష్ణ పరమాత్మను గురువుగా కాక, ఆత్మీయుడుగా, పరమాత్మగా భావించి, గీతాతత్త్వోప దేశముతో తన అజ్ఞానాంధకారమును పారద్రోలుకొని, తన విధియగు యుద్ధకర్మనొనర్చెను.

శిష్యుడెప్పుడు విద్యార్జన యందు తృప్తి పడతాడో, అప్పుడే గురువు సంతృప్తి పడినట్లు లెక్క. గురువు నుండి జ్ఞానం పొందాలని శిష్యుడెంతగా అదుర్దా పడతాడో, శిష్యుని కట్టి జ్ఞానం కలిగించాలని గురువు కూడ అలాగే యుత్సుకత చూపుతాడు. అదే నిజమైన గురువులక్షణం. నిజమైన ఆత్మ (జ్ఞానం) పొందినపుడే శిష్యుడికి సంతృప్తి. అటులే గురువునకు కూడ అప్పుడే సంపూర్ణ సంతృప్తి.

విద్యయందభిరుచి, గురువు నందు భక్తి శ్రద్ధలు కలిగి, యుత్తముడైన శిష్యునికి మాత్రమే ముఖాముఖి యుపదేశింప దగినది. అయితే, గురుశిష్య సంబంధ ద్యోతకములుగా – శిష్యుడు గురువులకు పాదాభివందన మొనర్చుట, పాదములను పట్టుటయును, గురువు తన హస్తము చేత శిష్యుని శిరస్సును (మస్తకమును) స్పృశించుటయు మొదలగు అంగ క్రియా కలాపములున్నపుడే శిష్యత్వ మాపాదించుట జరుగును.

గురు(వు) వాక్యమున శిష్యునకు శ్రవణము నందుత్కంఠ(త) జనింపవలెను. వేదాంత విద్యనే కాదు, ఎటువంటి జ్ఞానాన్ని పొందాలనుకొనే విద్యార్థికైన సరే, చెప్పే విషయాన్నర్థం చేసుకొని ఆమోదించడానికి మున్ముందుగా నతనిలో అంతులేనితృష్ణ, జిజ్ఞాస ఉండి తీరాలి. తీరని తృష్ణ యుంటేనేగాని, యెటువంటి జ్ఞానాన్ని లాభం కలిగేటట్లు గ్రహించలేడు. గ్రహించి జీర్ణించుకోవడమే గాక, ఆ జ్ఞానాన్నాచరణలో పెట్టి, దాని కనువగునట్లు సంపూర్ణంగా జీవించాలి. తానావిజ్ఞాన మార్గంలో ప్రగతిని సాధించాలంటే, ఈ జిజ్ఞాస యతనికి తప్పకుండా యుండి తీరవలసినది యుత్తమలక్షణము.

వివేకంతో వినే ప్రతి యొక్కరిని బాగుపరచే యుపయోగకరమైన శక్తి గురువుకుండాలి. యోగ్యుడైన గురువు చెప్పే యే విద్యయైనను వింటున్న విద్యార్థి కొక విధమైన తన్మయత్వం కలుగుతుంది. అతడు గురువును విడిచి దూరంగావెళ్ళి ఏకాకిగా నున్నను, శాంతి యనునది అతనికుండదు. ఆనంద ముండదు కూడ. విద్యాభ్యాసంతోనే జీవితం సఫల మయిందనుకొనే శిష్యులు చాలా యుత్తములు. గురువునకును బోధనలో విసుగులేని మాతాపితృ ప్రేమ, ఓర్పు కలిగి యుండాలి, అదియే యుత్తమ లక్షణము.

ఆధ్యాపకుడు అనుగ్రహించువాడైతే, శిష్యుడు గ్రహించువాడు. అనగా నిచ్చువాడైన గురువు, పుచ్చుకొనేవాడు శిష్యుడు అని –

మహావేధ ప్రకారమెట్లనిన, ముందు సాధకుడు అభ్యాసదశలో గురువు నందేకైక

లక్ష్యము కలవాడై, మహావిద్యను గురుముఖము నుండి గ్రహించి, ఋషి, ఛందస్సు, దేవతా పూర్వకముగా మూల మంత్రమును శుష్క జపమును గురూపదిష్ఠ మార్గమున నాచరింపవలెను.

(శుష్కజప మనగా - "అనుసంధాన రహితమైనద"ని-) పిమ్మట ఆశ్వీజ శుక్ల పక్షమున మహర్నవమీ శతాబ్దిధేయ అష్టమినాడు రాత్రివేళ గురుపాదములకు నమస్కరించుట శిష్యుని కర్తవ్యం, విధియును.

అట్టి సమయాన గురువు 'మహిమ' చేత హస్త మస్తక సంయోగ క్రియలో మంత్రోపదేశం పొందింపజేసి, ఆ శిష్యునకు షట్చక్ర పూజా విధానముపదేశించి, షడ్విధ ఐక్యాను సంధాన మొనర్చుటచే, ఆ సమయమత తత్త్వ రహస్య మవగతమగును.

"కృద్ధో హన్యా ద్గురూనపి" - కోపంలో గురుజన హననాన్ని కైన పాల్పడడు శిష్యుడు. పాల్పడినచో శిష్యుడు కాడు.

గురువు యెడల శిష్యత్వము అనునది, గురువుపై ఈర్ష్యభావం గల శిష్యుడెప్పుడును బోధనలోని తర్కవాదాలను గానీ, పూర్వ పక్ష సిద్ధాంతాలను గానీ, అందులోని లక్ష్యంగానీ, ఏదీ ఆ శిష్యుని బుద్ధికి యెక్కదు. ఎందుకనగా? శిష్యుని మనస్సులో 'ఈర్ష్య' అనునదే చోటు చేసుకొని యుండును గాన. అతడా విషయాలపై స్వయంగా, నిర్మాణాత్మకంగా విమర్శన (పరిశీలన) చేయవలసిందే. కానీ, అతడా విమర్శలను చేయడానికి ముందు, శాస్త్రాలు చెప్పే విషయాన్ని శ్రద్ధగా, ఓర్పుతో పఠించాలి. లేదా! గురువు ద్వారా వినాలి. ఆ శాస్త్రాలు అర్థం చేసుకోకుండానే వాటిని తర్కించడానికి సిద్ధపడరాదు. గురువు చెప్పే లక్ష్యాన్ని, దానిని చేరేమార్గాన్ని శిష్యుడు పూర్తిగా తెలుసుకొనేటట్లు చేయడం గురువు ధర్మం.

గురువునూ తన నాశ్రయించిన శిష్యుడు యోగ్యుడా, కాదా! అని పరీక్షించుటలో బ్రాహ్మణుడైనచో ఒక సంవత్సరము, క్షత్రియుడైనచో రెండు వత్సరములు, వైశ్యుడైనచో మూడు ఏండ్లు పరీక్షించవలెనని పురాణములు చెప్పును. - (శి.పు. 15వ అ. 56వ శ్లో)

శిష్యుల ప్రవృత్తిని పరీక్షించి, యోగ్యుడగుచో, వారిని మనో వాక్కాయ కర్మల ద్వారా పవిత్రులనొనర్చి స్వధర్మములనతి క్రమించకుండునట్లు బోధించి, శాస్త్రములయందు నియుక్త మొనర్చవలెను. ఇతి శృత్యువాచ.

'శృతి' అనగా వేదము. అట్టి శృత్యనుసారము గురు శిష్య పరంపరలో, గురూపదిష్ఠమైన వాక్కు యొక్క శ్రవణము, మననము ద్వారా, జ్ఞానధార పరంపరగా సంక్రమించుట వల్లనే దీనికి 'శృతి' అని వ్యవహారము.

★★★

# 42. గురువు కన్న ధర్మము మిన్న

గంగా శంతనుల అష్టమపుత్రుడు భీష్ముడు. అతని సోదరులవలె అతనిని గూడ గంగ తన ప్రవాహంలో బడవేయుటకు తండ్రి శంతనుడంగీకరించకపోగా, పూర్వపు ఒప్పందం ప్రకారం ఆ బాలుని(భీష్ముని), భర్త శంతనుని వదలి వెళ్లిపోవుటకు నిశ్చయించుకొనెను. శంతనుని అనురాగమునకు, పుత్రోత్సాహమునకును లొంగి, భీష్ముని వదలిపోవుటకును సమ్మతించెను. కానీ, ఈ బాలుని ప్రస్తుతము తండ్రికి అప్పజెప్పక, గంగ వశిష్ఠునకప్పగించెను. అతని నుండి భీష్ముడు సకల వేదములను, శాస్త్రములను నభ్యసించెను. తదుపరి పరశురాముని వద్దకు చేర్చి గంగ తన విధి నెరవేరినట్లు ఆమె వెడలిపోయెను.

భీష్ముడు పరశురాముని బహుసేవలొనర్చుచు వారి నుండి అరివీర భయంకర అస్త్రవిద్యలను నేర్చి గురువంతటి దక్షుడై దేవతలకును ధీటుడై నిలిచెను. అటుపిదప ఆత్మజ్ఞానమున సనత్కుమారులంబోలి ఆత్మతత్పరుడయ్యెను. సర్వశాస్త్రములందును బృహస్పతిననుకరించెను. నవయౌవనుడై తండ్రి శంతనుని జేరి, అతని కండగానిలిచి రాజ్య విషయములందు నిమగ్నుడయ్యెను.

శంతనుడొకనాడు మనోవేదనతోనుండగా, తండ్రి మనోవేదనకు కారణమెరింగి, దాశరాజు పుత్రికయైన సత్యవతిని, ఆమె తండ్రిని ఒప్పించి భావి కాలంబుననిక ఆమె సంతతికే రాజ్యాభిషేకముండునని, అందులకు తాను యావజ్జీవితము బ్రహ్మచర్యవ్రత దీక్షతో నుండుననీ శపథం జేసెను. అదే భీష్మ ప్రతిజ్ఞ. సత్యవతిని శంతనునితో వివాహము జరిపెను. తండ్రి మనోవేదన తీర్చిన తనయుడయ్యెను. అందులకు శంతనుడు సంతసించి కుమారునకు స్వచ్ఛంద మరణప్రాప్తి పొందునట్లు వరమిచ్చెను.

కొంతకాలమునకు శంతనుడు తనువు చాలించగా, సత్యవతికి కలిగిన సంతానముగా నున్న చిత్రాంగదునకు పట్టము గట్టెను. అతడొక గంధర్వుని చేతిలో గతించెను. తదుపరి భీష్ముడు అతని సోదరుడైన విచిత్రవీర్యునకు పట్టము గట్టెను. తాను మాత్రము బ్రహ్మచర్యదీక్షలోనే నుండి రాజకార్య వ్యవహార దురంధరుడై ప్రజాపాలనలో నిమగ్నుడై యుండెను.

విచిత్ర వీర్యునకెవరును వివాహమునకు కన్యనివ్వకపోగా, భీష్ముడు కాశీరాజుపై దండెత్తి, అతని కూతురులగు అంబ, అంబిక, అంబాలికలను ముగ్గురను గైకొని తెచ్చెను. కాని అంబ అనునామె పూర్వమే సాళ్వరాజును వరించి యుండుటను గ్రహించి, ఆమెను నారాజు వద్దకు పంపెను. మిగిలిన ఇద్దరిని విచిత్రవీర్యునకిచ్చి వివాహం జరిపెను.

సాళ్వరాజును చేరిన అంబ, అతని నుండి నిరాకరింపబడగా, నెటుతోచక తిరిగి భీష్మునే జేరెను. తనను, సాళ్వరాజును నోడించి తెచ్చిన కారణాన నతడు భీష్మునే వివాహమాడుమని తననిట్లు త్రిప్పి పంపెనని జెప్పి, తననిక మీరే వివాహమాడుమని అంబ అర్థించెను. అందులకు తాను ముందుగా జేసిన శపథమును గూర్చి జెప్పి నిరాకరించెను.

అంబ యిక జేయునది లేక అరణ్యము చేరి పరశురాముని జేరి తన మొర విన్నవించెను. భీష్ముడు పరశురాముని శిష్యుడని తెలిసి, అతనితో తనకు వివాహము జరిపించునట్లు ప్రార్థించెను. అబల మాటలకు పరశురాముడు భీష్ముని పిలిపించి అంబను వివాహమాడుమని, ఇది నా యాజ్ఞయని శాసించెను. అందులకా భీష్ముడు తన వ్రతదీక్షను గూర్చి చెప్పెను. అయిననూ అట్టి వ్రతదీక్షను వదలివేయుడని గురువాజ్ఞగా నిష్ఠూరముగా శాసించెను.

కాని భీష్ముడు తన ధర్మదీక్షను వదలుకోకపోగా, అయితే తననెదురెంచి యుద్ధమొనర్పుమని గురువగు పరశురాముడు భీష్ముని వత్తిడి జేసెను. గురువాజ్ఞగా, తన వ్రతమును నిలుపుకోవడానికై యుద్ధమునకే సిద్ధమయ్యెను.

ఇరువురికి ఘోరయుద్ధము ఇరువదినాలుగురోజులు జరిగెను. భీష్మునకు స్వప్నములో వసువులు మోహనాస్త్ర మంత్రోపదేశమొనర్చిరి. మరునాటి దినమున భీష్ముడు ఆ అస్త్రప్రయోగము జేయుటకు పూనుకోగా, దేవతలు, గంగయును ప్రత్యక్షమై వారి యుద్ధమును వారించిరి. పరశురాముడును, తన ఓటమిని, భీష్ముని వ్రతదీక్షకు సమ్మతించితినని, తానేమి యిక జేయునది లేక, అంబతో నిస్సహాయం తెలిపెను.

భీష్ముడు పరశురాముని పాదముల సాష్టాంగ ప్రణామంబు జేయగా, నాతనిని లేవనెత్తి యొడిలోనికి గైకొని, "గురువును మించిన శిష్యుడవైతివని, గురువాజ్ఞ కన్న వ్రతధర్మదీక్ష గొప్పదని నిరూపించితి"వని సంతోషించి, అభినందించి. ఆశీర్వదించి పంపెను. తానును మహేంద్రశైలమునకు తపస్సునకై వెళ్లెను. "గురువాజ్ఞ కన్న ధర్మవ్రత దీక్ష మిన్న" కదా !

★★★

**గురు - సూత్రం**

"శ్రీశైల శ్రీగురుస్థానం, శ్రీ గురుర్మల్లికార్జునః" - (4 అ. 6/1 శ్లో)

# 43. వేదాధ్యయనము

పూర్వపు వేదాధ్యయనం - అధ్యాపన విధానం కూడా యత్యంత విచిత్రంగా, పవిత్రంగా కనిపిస్తుంది. "గురువు-శిష్యులు" నేలపై సుముఖంగా సుఖంగా దర్భాసనాలపై కూర్చుండెడివారు. గురువు ఎత్తుగా నున్న వేదికపైన యున్నచో శిష్యులు ఆ గురువునకభిముఖంగా కూర్చునెడివారు. ఒక గురువు వద్ద అయిదారుగురు శిష్యులుండెడివారు. ఎవరి వద్దను గ్రంథములుండెడివి కావు. ప్రారంభమున గురుశిష్యులిద్దరును "ఓం శ్రీగురుభ్యోనమః హరిఃఓం" అని చెప్పగా, లేదా గురువు మొదట ఈనాదోచారణతో ప్రారంభించగా శిష్యులును ఆనాదోచ్చారణను రెండు పర్యాయములు పలుకుదురు. తదుపరి సరస్వతీ సోత్రం, గురు స్తోత్రము చేయుదురు.

ఇట్లు వేదారంభము మొదలిడి, తుదకు అనగా వేదపాఠానంతరముననూ మరల "హరిఃఓం తత్సత్" అని శుభవాచకముతో ముగింతురు. లేదా "సహనావతు" అను శాంతి మంత్రముతో మరియు "ఓం తత్సత్"తో కూడా ముగింతురు.

"మంగళాదీని, మంగళమధ్యానీ, మంగళాంతాని శాస్త్రాణి ప్రథంతే" -అని శాస్త్రం.

గురువునకు వేదమంతా కంఠస్థమే. ఆ వేదమంత్రాన్ని చిన్నచిన్న పదాలుగా విడదీసి, రెండు మూడు పదాలను మాత్రమే స్వరంతో నుచ్చరిస్తాడు. శిష్యులాపదాలను శ్రద్ధగా నాలకిస్తూ అటులనే అదే స్వరంతో రెండు పర్యాయములుగా పలుకుతారు. ఉదాహరణముగా గురువు "హరిఃఓం" అనిన వెంటనే శిష్యులు "హరిఃఓం, హరిఃఓం" అని స్వరయుక్తముగా పలుకుచుందురు.

వేద పఠనం "ఉదాత్త, అనుదాత్త, స్వరితం, దీర్ఘ స్వరితం"లో కొనసాగును. వేదమంత్రములు స్వర భేదముతో భిన్నార్థ బోధకములగు చున్నవి. కావున స్వర యుక్తముగా నుచ్చరించుట మిగుల అవసరం. అది యెట్లనిన "తే" అను పదము ఉదాత్తముగా నుచ్చరించిన "వారు" అను అర్థమిచ్చును. ఆ పదమే అనుదాత్తముగా నుచ్చరించిన "నీకొరకు" అని అర్థం వచ్చును. అటులే "మా" అనుపదమును ఉదాత్తముగా నుచ్చరించిన నిషేదార్థకం. ఆ పదమే అనుదాత్తముగా నుచ్చరించిన "నన్ను" అను అర్థమిచ్చును.

ఉదా:- "ఉదాత్తము" - అక్షరమునకు ఏదియు గుర్తులేనిది (మా), "అనుదాత్తము"- అక్షరమునకు క్రింద అడ్డముగా గీత గుర్తుకలది (మా॒), "స్వరితం" - అక్షరమునకు పైభాగమున నిలువుగా గీత గుర్తుకలది (నమ॑), "ధీర్ఘ స్వరితం" - అక్షరమునకు పైభాగమున నిలువుగా రెండు గీతలు కలది (సర్వా॒న్).

వీటిని "గురుముఖతః" తెలుసుకొందురు శిష్యులు. వేదము తప్పుగా పలికిన గురుశిష్యులుభయులు పాత్రులగుదురు.

శ్లో॥ కర్తా కారయితాచైవ ప్రేరకశ్చాఽనుమోదకః ।
సుకృతే దుష్కృతే చైవ చత్వార స్సమభాగినః ॥

శ్లో॥ మంత్రోహీనస్స్వరతో వర్ణతోవా, మిథ్యాప్రయుక్తో నతమర్థమాహ ।
సవాక్ వజ్రో యజమానం హినస్తి, యథేంఽద్రః శత్రుః స్వరతో పరాధాత్ ॥

ఇట్లు ఆ రోజు ఉదయం పాఠం నాలుగయిదు గంటలు పఠనం కాగా, ఆ పాఠమును శిష్యుల బుద్ధి సామర్థ్యాన్ని బట్టి పది, పదిహేను పర్యాయములు పాఠం సాగుతుంది. దీనినే "సంథ" అంటారు. ఇట్టి సంథలు పూర్తయిన తదుపరి, గురువు చిన్నచిన్న వాక్యాలతో "పనస"గా సుమారు పదిమార్లు శిష్యులతో "వల్లె" పూర్తయిన విద్యార్థికా ప్రశ్న(పనస)పై సంపూర్ణ సామర్థ్యం వస్తుంది. అనగా, ఆ విద్యార్థి మరొక విద్యార్థికి మార్గదర్శకుడౌతాడని భావము.

వేదాధ్యయనంలో గురుశిష్యుల ఉచ్చారణ, స్వరము సుస్పష్టంగా నిర్దుష్టంగా నుండి వినువారికి వీరుభయులు "సాక్షాత్ సరస్వతీ" స్వరూపాలా అన్నట్లు గ్రాహ్యమౌతుంది. ఈ విధముగా రోజుకు పదిపన్నెండు గంటల చొప్పున, విరామం లేకుండా అధ్యయనం చేస్తే, ఒక వేదం పూర్తి చేయడానికి సుమారు పది లేక పన్నెండు సంవత్సరాలు పడుతుంది.

అటుపిదప కొన్ని ప్రత్యేక స్థలాలలో పరీక్ష నిర్వహింపబడుతుంది. పరీక్ష యనగానే మహా విద్వాంసులు యిద్దరు లేక ముగ్గురు పరీక్షాధికారులుగా నుంటారు. విద్యార్థి ముందుగా వారి పాదాలకు భక్తి భావంతో వినయంగా నమస్కరించి, ప్రవరతో (చతుస్సాగర పర్యంతం) నమస్కరించి పద్మాసనంలో నెదురుగా కూర్చుంటాడు. పరీక్షాధికారి "పనస"లలోని రెండు మూడు పదాలను ముందుగానందిస్తాడు. వెంటనే విద్యార్థియా"పనస"నంతటిని పూర్తిగా అప్పజెప్పుతాడు. ఎక్కడైనా అక్షరంలోగానీ, స్వరంలోగానీ రెండుమూడు దోషాలున్నచో సహించి సరిచేస్తారు.

ఇట్లు వేదమంతా రెండు మూడు గంటలు పరీక్ష సాగుతుంది. విద్వాంసులందరు యచటనే యాసీనులై యుండి, యీ పరీక్షనంతటినీ సునిశితంగా పరిశీలిస్తూంటారు. ఇచట రహస్యముండదు. కంఠస్థమైయున్న యీ వేద పరీక్షలో విద్యార్థి స్వయంప్రతిభతోనే నెగ్గుతాడు. అప్పటి నుండి యతడు వేదాధ్యయనపరుడుగా, నిత్యాభ్యాసనంతో కొన్నాళ్ళకే "అవధాని"గా మరియు ఘనాపాఠిగా వినుతికెక్కుతాడు.

ఒక మంత్ర భాగంలోని "పనస"నుండి మరియొక మంత్రములోని పనసకు దారి తప్పే సందర్భములు వేదంలోనెక్కువగా నుంటాయి. దీన్ని "కవుళ్లు"అంటారు.

సామాన్యంగా నిక్కడే దోషాలు దొర్లుతాయి. ఈ విధంగా కవుళ్లు తప్పకుండా దోషరహితంగా మనోనిగ్రహంతో, ఆలోచనా శక్తితో, ధారణాపటిమతో, వేదభాగమంతా నూటికి నూరుపాళ్లుగా నప్పగించి శిష్యుడు కృతార్థుడౌతాడు. అతడు "అవధాని" అనే పదానికి బిరుదునకర్హుడౌతాడు.

ఉదా:- "కవుళ్లు"-"తస్మాత్"-జ్ఞాతా అజ్ఞావయః, "తస్మాత్" యజ్ఞాత్సర్వహుతః, అటులనే "ఆదిత్యవర్ణం తమసస్తుపారే, ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్" ఇహాభపతి; నాన్యః పంథా అయనాయవిద్యతే; "నాన్యఃపంథా విద్యతేయనాయ" మొదలగునవి.

ఈ విధంగా తానభ్యసించిన వేదాన్ని తిరిగి విద్యార్థులకు నేర్పుచుండడంలో తనకిక మరు ్రనకు రా విధంగా నుండి వేద గురువుగా నిలిచిపోతాడు. ఇట్లు వేదవిద్య మనకును రాబోవు వారికిని తరతరాలుగా రక్షింపబడుతూ వస్తూంది. అందుకే ఇది ప్రమాణమైనది. శృతి, అనియు 'స్మృతి'లో నుంచుకొనునదైనది.

ఈ వేదాన్ని విద్వాంసులు "సంహిత, పద, క్రమ - జట, మాల, శిఖ, రేఖ, ధ్వజ, దండ, రథ, ఘన" పద్ధతిలో వల్లిస్తారు. 'సంహిత, పద, క్రమా'లు యితరులకు బోధించుటకు ఉపయోగపడుచుండగా, "జట, మాల, శిఖ, రేఖ, ధ్వజ, దండ, రథ, ఘన"లకు వేద పరిరక్షణయే ముఖ్య పరిరక్షణ ప్రయోజనము. ప్రాతిశాఖ్యా వేద మంత్రార్థ పరిశీలనం ఇదే.

ఈ వేదాధ్యాయనం మాసంలో మూడు రోజులు అనధ్యయన దినాలు. అవి బహుళ చతుర్ధశీ, అమావాస్య, శుద్ధ పాడ్యమీలు. ఆ రోజులలో శిష్యులకు సెలవు దినాలు.

ఇట్టి వేదపఠనం గూర్చి యింత విపులముగా నెందులకు చెప్పవలసినదంటే, మన సమాజంలో నేడు యెంతటి విస్తారమైన వేదరాశి, క్షీణించి పోయినదో స్పష్టంగా తెలియుచున్నది.

"కోటి విద్యలు కూటి కొరకే"యనే సామెత వేదపండితులకు ఎన్నడూ ససేమిరా వర్తించదు. అయినా "ఘనా పాటి"యైన వేదపండితులకును, తర్క, వ్యాకరణ, మీమాంసాది శాస్త్రములను వల్లించిన శాస్త్ర పండితులకును నేడు సరియైన జీవనోపాధి గానీ, ఆదరణ, పోషణలేదు. ఇట్టి వీరికి వినయంతో సమీపంగా వచ్చి చిన్న నమస్కారం చేస్తే చాలు, ఆనందపారవశ్యంతో తన్మయత్వం చెంది, వారికాయురారోగ్య ఐశ్వర్యాదులను ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తారు. వేదామృతమైన వాక్కులతో నాశీర్వదించే నేటి వేదపండితులను, శాస్త్రపండితులను ఆస్తికులైన విద్యాధికులు, పారిశ్రామిక సంపన్నులు_సర్వులును ఆదరించి, అభిమానించి వారిని, వారి విద్యను గౌరవించి సమ్మానింపవలసిన యవసరం నేడెంతైనయుంది. అని చెప్పుటకును ఇట్లు వ్రాయుటకు సాహసిస్తున్నాను.

★★★

# 44. వీధిబడులు

సుమారు (60,70)అరువది, డెబ్బది సంవత్సరములకు పూర్వం గ్రామములో వీధిబడులనునవి పాఠశాలలుగా వెలుగొందుచుండెడివి. గ్రామానికొకటే బడి. ఆ బడికి పంతులుగా బ్రాహ్మణ జాతి వారు కానీ, బలిజె, జంగమ జాతి వారుకానీ, భట్రాజులుగానీ, అక్కడక్కడ వైశ్యులును కాస్త కావ్యజ్ఞానులై, పురాణ, ఇతిహాసాలు తెలిసినవారై, శతకములు కంఠస్థములైయుండి, స్తుతులు, స్తోత్రములు పఠించి యుండి, బడిని (శాల (ప్రకృతి)-సాలె (వికృతి)) పంతులుగారని పిలువబడుచుండెడివారు. తెలంగాణ ప్రాంతములో బడిని సాలెయని, మాస్టారును అయ్యవారని, పంతులుగారని కూడా పిలుచుచుండెడివారు.

ఆ వీధి బడిలో విద్యార్థులు అక్షరస్వీకారమును ప్రారంభములో పలకపూజగా "శ్రీ" అని వ్రాసి పిల్లలచే దిద్దించి, "శ్రీ" సరస్వతి నమస్తుభ్యం" అని పలికించి "ఓంకార ప్రణవము"నూ ఉచ్చరింపజేస్తూ, క్రమంగా "అఆలు" దిద్దింపజేయ, ఇక సర్వాక్షరాల జ్ఞానంతో, వాచక జ్ఞానముగా "పెద్దబాలశిక్ష" సంపూర్ణముగా పఠింపజేసెడివారు.

వారట్లు కాస్త విజ్ఞానవంతులై ఉత్తరములు చదువుటకును వ్రాయుటకును, శతకములు కానీ, దస్తావేజులు చదువుటకును నిపుణులై యుండి ఆ ఊరిలో వీరే అక్షరజ్ఞులుగా నుండెడివారు. అట్టి వీధిబడులలో మగపిల్లలకే స్థానముండెడిది. ఇక ఆడపిల్లలకు మాత్రము ఆ బడిపంతులు వారివారి ఇండ్లల్లోకి వెళ్లి(తీరిక వేళల్లో) కొద్దో గొప్పో కావ్యజ్ఞానం కలిగించెడివారు. లేదా, ఆ ఆడపిల్లల తల్లిదండ్రులే అక్షరజ్ఞులుగా తీర్చిదిద్దెడివారు. అదియును వారు అక్షరజ్ఞులై యుండినచో.

ఈ బడులలో చదువు పిల్లలు మధ్య తరగతి కుటుంబీకులో, లేదా ఆ గ్రామ పెద్దల కుమారులు మాత్రము చదువుచుండెడివారు. సంవత్సరమునకొక పర్యాయముగానీ, ఆరుమాసాలకొకసారి గానీ ఆ వీధి బడిపంతులుకు నగదురూపముగా గానీ, ధాన్యరూపముగా గానీ గురుదక్షిణ చెల్లించెడివారు. ఆ గురుదక్షిణ గూర్చి పిల్లలకెట్టి సంబంధము లేకపోయెడిది. బడికి వెళ్లి చదువుకొనే బాధ్యత తప్ప.

పండుగలో దసరా పండుగకు ముందు పదిరోజులు పిల్లలకు పండుగే పండుగ. రకరకాల వేషాలతో రంగురంగుల విల్లంబుల చేతబూని, వారివారి యిండ్లకు పంతులను వెంట బెట్టుకొని వెళ్లెడివారు. ఆ పంతులు కూడ ఝరీదుస్తులు ధరించి, ఝరీ అంచుగల తలపాగతో వెళ్లెడివారు. ఆ గ్రామ పెద్దలను జేరి దైవస్తుతులతో స్తోత్రములతో చక్కగా గానమాలాపిస్తూ, వారిని కూడ పొగడుచుండెడివారు. ఇక పిల్లలు ఏక కంఠముగా నిట్లు పాడెడివారు.

శ్రీగణా ధీశాయ శివకుమారాయ,

నాగముఖ తొండాయ నాగభూషాయ.....అని,

ఇట్లు పాడుచు చివరకు "పంతులకు కట్నాలు, మాకు పుట్నాలు" సమర్పించుకోండి అని వేడుకొనెడి వారు. "కట్నాలు" అనగా అది ధనరూపము గానీ, నూతన వస్త్రములు గానీ సమర్పించుటయే. పిల్లలకు పప్పుబెల్లాలు పెట్టగా వాటితోనే మహదానందం పడెడివారు. పంతులు కూడా ధన్యుడయ్యెడి వారు. అట్టి పంతులును పిల్లలు వారి తల్లితండ్రులునూ "గురుదేవోభవ"గా గౌరవించెడివారు. ఆదిలో గానీ, అంత్యలోగానీ "గురుదక్షిణ"లు సమర్పించెడి వారు.

అట్టి వీధిబడులలో ప్రతి శుక్రవారము సరస్వతీపూజ జరుపు సంప్రదాయముండెడిది. పిల్లలకారోజు పాఠాలు లేవు. ఆ రోజులలో కట్టె పలకలుండేవి. ఆ పలకలను బాగా కడిగి వాటిపై నల్లనిరంగులు రుద్ది సుద్దముక్కతో చుట్టూ చక్కటి కళానైపుణ్యముగా చిత్తారులు తీర్చిదిద్ది మధ్యలో "శ్రీ" సరస్వతి అక్షరమును గానీ, "ఓం"కార ప్రణవమును గాని వ్రాసి యుంచి, ఆ పలకలన్నింటిని క్రమంగా పరచియుంచెదరు. పంతులు వచ్చి వాటినన్నింటిని షోడశోపచారములతో పూజించెడివారు. పిల్లలు కూడ శ్రీ గణేశస్తుతులు, సరస్వతీ స్తుతులు, స్తోత్రములు పఠించెడివారు. వారివారి యింద్లనుండి తెచ్చిన పప్పుబెల్లాలు నైవేద్యములుగా సమర్పించి, తదుపరి ఆ పంతులుగారి స్వహస్తముల ద్వారా వాటిని ప్రసాదముగా పిల్లలకు పంచగా వారు బహు సంతోషముగా తినెడివారలు. ఇదొక ఆనందదినము. ఈ తతంగమంతయు యొక పూటతో ముగిసెడిది. మధ్యాహ్నము సెలవు. మరునాడు పూర్తి సెలవు. అనగా ఆ వారములో శనివారము సెలవు దినము.

★★★

## గురు - సూత్రములు

"గురూపదేశాత్ తద్గమ్యం నాన్యథా శాస్త్ర కోటిభిః"

గురూపదేశము లేకుండా గమ్యస్థానము చేరుటకు వీలులేదని పరమ గురుసేవా సువిదితామని కోటి శాస్త్ర ప్రమాణము.

★★★

"ఆచార్యో బ్రహ్మణో మూర్తిః

# 45. ఆధ్యాత్మిక గురుదేవులు

మనం మానవులం. అనగా క్రొత్తవారము కాము. అనేక జన్మల నొందితిమి. అయినా జన్మల రహస్యములు ఎరుంగక, ఇంకా ప్రగాఢమైన అజ్ఞానాంధకారంలోనే నిమగ్నమై, తేరుకోలేక, తేరుకొనే యత్నమొనర్చక, పూర్వజన్మ పుణ్యకర్మ ఫలంతో నీ మానవ జన్మలను సార్థకత మొనర్చుకొనలేక కొట్టుమిట్టాడుతు, ఇదే జన్మలోనే నిరంతరం కొనసాగుతూంటామనే భ్రమలో, అహంకారంలో అధర్మపనులను, అశాస్త్రీయ ఆలోచనలతో జీవితమును, కాలమును వెళ్లబుచ్చుచున్నాము. అట్టి మనకు ఈ జన్మను, భావితరాల జన్మలను కూడ అజ్ఞానాంధకారంలో నిమగ్నమవకుండా, లభించిన ఈ జన్మను సార్థకతనొనర్చుటకు ఆధ్యాత్మికతను అలవరచుకొను ప్రయత్నమెంతయును అవశ్యకము. ఆ ఆధ్యాత్మికతను అలవరచుకొనుటకు ఆధ్యాత్మిక గురువును చేరవలెను. చేరిన తదుపరి ఈ శ్లోకమును స్మరించుకొని, వీరే నాగురువు, దైవము సర్వమును, అని త్రికరణశుద్ధిగా విశ్వసించియుండవలెను.

శ్లో॥ ఓం అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా ।
చక్షురున్మీలితం యేన తస్మై శ్రీగురువేనమః ॥

భా:. ప్రగాఢమైన అజ్ఞానాంధకారంలో నేను జన్మించాను. నా ఆధ్యాత్మిక గురువు జ్ఞానమనే అంజనంతో నా కన్నులు తెరిపించాడు. అలాంటి నా ఆధ్యాత్మిక గురువుకు నేను నమస్కారం చేస్తున్నాను.

అనే తలంపుతో వీరినుండి నేను సుదూర రహస్య ఆధ్యాత్మిక సత్యాలను పొందగలననే జిజ్ఞాస కల్గియుండవలెను. అప్పుడే వారిని చేరిన సార్థకత ధన్యమగును. అప్పుడే ఈ భౌతిక జగత్తునకు ఆవల మరోజగత్తుందని, అదే ఆధ్యాత్మిక జగత్తుగా గుర్తించడమగును. దానినే భగవద్గీత (15వ అ 6వ శ్లో)ను శ్రీకృష్ణభగవానుడిలా అభివర్ణించాడు.

శ్లో॥ న తద్ భాసయతే సూర్యోన శశాంకో నపావకః ।
యద్ గత్వాన నివర్తంతే తద్ధామ పరమం మమ ॥

భా: నేనుండే ఆ ధామంలో సూర్యుడుగాని, చంద్రుడుగాని. పావకుడు (అగ్ని, విద్యుచ్ఛక్తి) గాని ప్రకాశింపచేయరు. ఆ ధామం చేరుకొన్న వారెవ్వరును ఈ భౌతిక జగత్తుకు తిరిగిరారు - అని.

కానీ, మనమున్న ప్రస్తుత జగత్తు మాయాజగత్తు. అదే భౌతిక జగత్తు. ఇందులో

మనం మూడు యాతనలతో సతమతమౌతున్నాము. అవియే "ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక" యాతనలు. ఇవియే అజ్ఞానాంధకారయాతనలు. పాపభూయిష్టమైన జీవన యాతనలు. శ ్వత సుఖైశ్వరాలకు దూరమవుయాతనలు. ఇట్టి యాతనలనుండి, అనగా అజ్ఞానాంధకారం నుండి తొలగించువారే గురువులు.

గురువనగా మనలో జ్ఞాన జ్యోతిని వెలిగించేవాడే. అందుకు ఆధ్యాత్మిక గురువును చేరాలి. అని, "మాండూక్యోపనిషత్ 1.2.12) ఇలా వివరిస్తుంది.

- "తద్విజ్ఞానార్థం స గురువేవా భిగచ్ఛేత్ ।
సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠ ॥" -

అనగా, ఆధ్యాత్మిక విజ్ఞానం పొందుటకై వేదాలు కూడ గురు శిష్యపరంపరలో వచ్చిన గురువు అయి ఉండాలి. నిజానికి గురువు అనువాడు ఒక్కడే. అందుకే గురు శిష్యపరంపరలో కేవలం యొకే బోధన పునరుక్తమవుతున్నది, అందులకు శ్రీకృష్ణభగవానుడు (భగవద్గీత 9.అ.34శ్లో)లో ఇలా అంటాడు.

శ్లో॥ మన్మనా భవమద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి యుక్త్వై వమా త్మానం మత్పరాయణః ॥

భా: నిరంతరం నీ మనస్సు నన్ను గురించే ఆలోచిస్తూండు. నా భక్తుడి (శిష్యుడి)విగా నాకు పూజలు చేయి. నాకు నమస్కరించు. అలా పూర్తిగా నాయందే నీమనస్సు లగ్నమై యుంటే నిశ్చయంగా నీవు నన్ను పొందుతావు."

ఇదే అంశాన్నే పలువురు ఆధ్యాత్మికాచార్యులు, పీఠాధిపతులు తిరిగి తిరిగి బోధిస్తున్నారు. అట్లు గురు శిష్యపరంపరలో అనుశ్రుతంగా వస్తున్నబోధనలను పొందవలెనన్న ఆధ్యాత్మిక గురువునుచేరి, ఇతడే నన్ను ఉద్ధరించేవాడని నమ్మియుండాలి. అట్లుగాక, వేరే తలంచిన గోచరించేది ఏమిటి? అందులకే భగవద్గీత 4వ అ.2వ శ్లో) శ్రీకృష్ణుడిలా అంటాడు.

శ్లో॥ ఏవం పరంపరా ప్రాప్తం ఇమం రాజర్షయోవిదుః ।
స కాలే నేహ మహతా యోగగోనష్టః పరంతప॥

భా: ఇట్లు ఈ ఆధ్యాత్మిక శాస్త్రం గురుశిష్యపరంపర ద్వారా ప్రాప్తిస్తూ వస్తూంది. ఈ పద్ధతిలోనే రాజర్షులు దీనిని పొందారు. కాని కాలక్రమేణా ఆ పరంపర విచ్ఛిన్నమయ్యింది. తత్ఫలితంగానే ఈ శాస్త్రం నశించినట్లు గోచరిస్తుంది."-

ఆచార్యులందరును తనప్రతి నిధులే అని శ్రీకృష్ణుడిలా అంటాడు భగవద్గీత 4వ అ.34వ శ్లోలో-

శ్లో॥ తద్ విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞాని నస్తత్త్వదర్శినః ॥

భా॰ ఆధ్యాత్మిక గురువును ఆశ్రయించి తత్త్వజ్ఞానం పొందడానికి ప్రయత్నించు. వినయంతో వారిని ప్రశ్నించు. అతనికి పరిచర్యలొనర్చు. తాను స్వయంగా పరమార్థాన్ని దర్శించి ఆత్మసాక్షాత్కారం పొందినవాడు గనుక, వారు నీకు తత్త్వజ్ఞానాన్ని యుపదేశించగలదు " – అని

అనగా మొట్టమొదటి అడుగు శరణాగతి" అని, దానితో నితడు యోగ్యుడని. నన్నే శరణుజొచ్చాడని, విశ్వాసం గురువునకు ఏర్పడి, ఇతడు నిజంగా ప్రామాణికంగా శ్రద్ధాళువైన శిష్యునిగా నెరింగి, వానిలో నున్న అజ్ఞానాంధకారాన్ని పటాపంచలొనర్చగలడు. ఇక ఆ గురువు హృదయంలో మంచి స్థానం పొందగలడు శిష్యుడు. ఆ మంచి స్థానం ఏదో శ్రీకృష్ణుడిలా భగవద్గీత 14వ అ 26వశ్లో అంటాడు.

శ్లో॥ మాం చ యోఽవ్యభిచారేణ భక్తి యోగేన సేవతే ।
స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే ॥

భా కలుషితమైన భావం వీడి, భక్తిభావంతో సద్గురువుని ఆధ్యాత్మిక పరిచర్యలో నిమగ్నుడైన శిష్యుడు మూడు ప్రకృతి గుణాలను అధిగమించి ఆధ్యాత్మికస్థాయిని అందుకొంటాడు.

అనగా, అమరత్వానికి అర్హుడుగా అయి పరమపదానికి చేరువౌతాడు. వైదిక సారస్వత నిష్ణాతుడుగా, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడుగా నవుతాడు. ఆధ్యాత్మిక జీవనమే తన లక్ష్యమని, అదే జిజ్ఞాసగా మారడంతో ఆ శిష్యునకు గుర్వనుగ్రహంతోపాటు దైవానుగ్రహంకూడ కలుగును. గురువు శరణాగతి ముక్తికి సోపానము. అందుకే –

శ్లో॥ సాక్షాద్ధరిత్వేన సమస్త శాస్త్రైః,
ఉక్తస్తథా భావ్యతా ఏవ సద్భిః ।
కింతు ప్రభోర్యఃప్రియ ఏవ తస్య
వందే గురోః శ్రీచరణారవిందమ్ ॥ – (శ్రీలప్రభుః ఉవాచ)

"అపౌరుషేయాలైన వేదాలలో ఆధ్యాత్మిక గురువును దేవదేవునితో సమానంగా ఆరాధించాలి" అని చెప్పబడింది. ఆ ఆదేశాన్ని, ప్రభుని విశుద్ధభక్తులెందరో ఆచరించారు. ఆధ్యాత్మిక గురువు ప్రభుని అంతరంగిక సేవకులలో నొకరు. అందుచేత, అట్టి ఆధ్యాత్మిక గురుని పాదారవిందాలకు మనం నమస్కరింతుముగాక!"

ఆ భావనతో శిష్యుడుండిన పరమాత్మ కొలువుదీర్చియుండే ఆధ్యాత్మిక ధామాన్ని గూర్చిన, పరమ ‘దాన్ని గూర్చిన సందేశం గురువు అందజేస్తాడు. పరతత్త్వ మార్గానికి ఆ సందేశం దోహదమగును.

“మహాజనో యేనగతః స పంథాః” (పూర్వాచార్యులు పయనించిన మార్గంలోనే పయనించాలి) అనే సూక్తి ఉంది కదా! -

అటులా, ప్రతి శిష్యుడును గురువుయెడల వినయ విధేయతలను చూపాలి. శ్రీమద్భాగవతంలో (11-17-27శ్లో) ఇలా యుంది -

శ్లో॥ ఆచార్యం మాం విజానీయాన్నావ మన్యేత కర్హిచిత్ ।
న మర్త్య బుద్ధ్యా సూయేత సర్వదేవ మయోగురుః ॥

భా: “ఆధ్యాత్మిక గురువు నాతో సమానుడని గ్రహించు” అని, ఆనతిచ్చాడు భగవానుడు. మరియు, “ఎవరునూ ఆయనను చూచి అసూయపడరాదు. ఆయన మానవమాత్రుడని భావింపరాదు. ఎందుకనగా ఆధ్యాత్మిక గురువు సర్వదేవ మయుడు” అని.

అనగా ఆధ్యాత్మిక ఆచార్యుడు భగవత్సమానుడుగా నిర్దేశింపబడ్డాడు.

వేదాలలోని ఆధ్యాత్మిక దేవదేవుడు ఈ విశ్వాన్ని సృజించిన బ్రహ్మదేవునికి ముందుగా నుపదేశించాడు. ఆ బ్రహ్మనుంచి నారదునికి, నారదుని నుంచి వ్యాస భగవానుడు, ఆ వ్యాసుని నుండి ఆధ్యాత్మిక పీఠమునలంకరించిన ఆచార్యులకు సంక్రమించి, క్రమక్రమంగా గురు శిష్య పరంపరగా వస్తూంది. దానికి విరుద్ధంగా ప్రవర్తించిన ఎంతటి పండితుడైనా సరే అని “పద్మపురాణం” ఈవిధంగా చెబుతూంది.

“సంప్రదాయ విహీనాయే మంత్రాస్తే నిష్ఫలామతాః”

“ప్రామాణికుడైన గురు పరంపరా క్రమంలో వచ్చిన ఆచార్యుని వలన యుపదేశింపబడితే తప్ప, నీవు పొందే యే మంత్రమూ సరి అయిన ఫలితాన్ని యీయ జాలదు.”

అంతేగాక, గురుపరంపరాక్రమంలో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందిన ప్రామాణికుడైన ఆచార్యుడే, తన ఆచార్యుని పట్ల భక్తి ప్రపత్తులు గలవాడే, వేద పరమార్థాన్ని విస్పష్టంగా గ్రహించగలడు.

“శ్వేతాశ్వతరోపనిషత్” (6-3) ఇలా చెబుతూంది.

శ్లో॥ యస్య దేవే పరాభక్తిః యథా దేవే తథాగురౌ ।
తస్యైతే కథితాహ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః ॥

భా: దేవాధి దేవునితో సమానంగా **ఆధ్యాత్మికాచార్యుని** పట్లకూడ అచంచలమైన **విశ్వాసంగల** మహానీయులకే వేద పరమార్థం స్వయంగా విదితం కాగలదు."

మన **ఆచార్య దేవుని వరకును,** మన **పూర్వాచార్యులందరునూ** మనకు ప్రసాదించిన **సందేశం ఇదే! -**

వేదాలు, **పురాణాలు, మన భగవద్గీతయును** ఇస్తూన్న సందేశమిదే! -

అట్టి ఆచార్యుల వాక్కులును అమృత తుల్యమును, ఓర్పుగా మనమూ విందాము. విన్నవాటిని ఆచరణలోకి గురుశిష్య పరంపరముగా నుపదేశపూర్వకంగా ప్రబోధిస్తూ సత్కర్మలలో నిమగ్నమగునట్లు చూస్తూ మానవ జన్మ సాఫల్యం పొందుదాము. అదే ఆధ్యాత్మిక జ్ఞానమును సర్వులు కైవశం చేసుకునేందుకు ఏకైక మార్గము.

ఇక ఆధ్యాత్మికాచార్యుడు శిష్యులపట్ల సంతృప్తి చెందినట్లైన భగవానుడును సంతృప్తి చెందినట్లగును. "తద్విజ్ఞానార్థం స గురుమే వాభిగచ్ఛేత్" - అనుటలో "అభిగచ్ఛేత్" అను క్రియారూపం వైదిక శాసనం. అందుకే భగవద్గీతలో అర్జునుడు తుదిలో - (18అ 73వశ్లో)

శ్లో॥ నష్టమోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాఽచ్యుత ।
స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ ॥

భా: ఓ కృష్ణపరమాత్మా ! నీయనుగ్రహంవలన నా యజ్ఞానము నశించినది. ఆత్మస్మృతి జ్ఞానము కలిగినది. సంశయములు తొలగినవి. ఇక నీ యాజ్ఞను నెరవేర్చెదను." అని అన్నాడు.

నరుడైన అర్జునుడు ఆధ్యాత్మికాచార్యుడగు శ్రీ కృష్ణపరమాత్మ గీతోపదేశము విని, ఆచరించి ధన్యుడైనాడు.

"కఠోపనిషత్తు"లో ( 1-3-14)ని ప్రబోధం ఇదే.

శ్లో॥ ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్యవరాన్ని బోధత ।
క్షురస్య ధారా నిశితాదురత్యయా ।
దుర్గం పథస్తత్ కనయోవదంతి ॥

భా: దయచేసి నిదురలేవండీ ! మీ ప్రస్తుత మానవజన్మ ఎంత అమూల్యమైనదో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. ఆధ్యాత్మిక సాక్షాత్కార మార్గం మిక్కిలి

క్లిష్టమైనగి. అది మంగలి కత్తి అంచు అంత నిశితమైనది. ఆధ్యాత్మ విదులందరును ప్రకటిస్తున్న అభిప్రాయం యిదే!

అలాకాక, ఆధ్యాత్మిక గురువును సామాన్యమానవునిగా భావించేవాడు రాక్షస మనస్తత్వం కలవాడని శాస్త్రాలు చెబుతున్నాయి. నిజానికి భగవద్వైభవాన్ని ప్రచారం చేసే ఎవరైనను మనం గురువుగా **అంగీకరించవలసినదే**. ఎందుకనగా?

భగవంతుని **ఆదేశాలను భగవత్స్వరూపుడైన** ఆధ్యాత్మికాచార్యుని ద్వారా పొందడం జరుగుతుంది. తద్వారా ఆ ఆదేశానుసారం వ్యవహరించినపుడు ఈశరణాగత ప్రక్రియ ఖచ్చితంగానూ, దృఢంగాను రూపొందుతుంది. ఈ దశలో దైవమే హృదయనివాసిగా ఆదేశాలు అందజేస్తుంటాడు. అనగా ఆధ్యాత్మికాచార్యుడు దైవ ప్రతినిధిగా నుండి వెలుపల నుంచి శిష్యునకు తోడ్పడుతూంటే, ఆచార్యుని హృదయనివాసియైన భగవంతుడు అంతరంగముగా అతనికి తోడ్పడుతూంటాడు.

ఇక శిష్యుని (భక్తుని) దేహం ఆధ్యాత్మికదేహంగా చిదానందమయముగా నేర్పాటు చేస్తాడు భగవంతుడు. అనగా జనన మరణాల కతీతంగా నుండునట్లు ప్రసాదిస్తాడు. అదే అంతిమ పరిష్కారం. ఊర్ధ్వలోకంలో నిక జన్మసాఫల్యం లభించును. అని, గురుభక్తి కల్గియుండువాని ఫలితం గూర్చి "భాగవతం" (తృ.స్కం.లో 888)వ పద్యమిట్లున్నది.

కం॥ గురుభక్తిఁ జిత్తము మ, త్పరమై విలసిల్లునంత పర్యంతం స

త్పురుషులకి హలోకంబున, జిరతర మోక్షోదయంబు సేకురుచుండున్ ॥

★★★

## గురు - సూత్రములు

"పరబ్రహ్మము పరిపూర్ణము" - అని, గురువు శిష్యుని చక్కగా (త్రికరణ శుద్ధిగా) ఆలింగనమొన మొనర్చుకొని, "నేనే నీవు"గా భేదము లేదు అని, స్మృతి జ్ఞానమును ప్రసాదించవలెను.

★★★

"గురూంశ్చైవ వినిందీతి మూడాః పండిత మానినః"

తమను తాము పండితులుగా భావించుకొనే మూర్ఖులు గురువులనే నిందిస్తారు. (ధర్మవ్యాధోపాఖ్యానము).

# 46. శ్రీ ఆంజనేయ గురుస్తుతి

## విశ్వాసము

శ్రీరామా !

కః గురు శిష్య భావ కల్పక ।
గురు శిష్యాచార ధర్మగుణ పరిపాలా ।
గురు శిష్యరూప ధారీ ।
గురు శిష్యైక్యావ బోధగుణ గురుమూర్తీ ।

భా: "ఇతడు గురువు, ఇతడు శిష్యుడు"-అను సంకల్పములను, ధర్మములను, గుణములను రక్షించు నాయకుడవును నీవే. గురుశిష్యులిరువురును నీవే. నీ రూపము మిగుల గౌరవనీయమైనది. పూజనీయమైనది." అని శ్రీరామ భక్తుడగు ఆంజనేయ స్వామి వినుతించెను.

మరల నిట్లు స్తుతించెను.

శ్లో॥ గురుబ్రహ్మా, గురుర్విష్ణుః, గురుదేవమహేశ్వరః ।
గురుస్సాక్షాత్పర బ్రహ్మ తస్మై శ్రీగురువేనమః ॥

స్వామీ !

ప్రత్యగాత్మ పరమాత్మల విభజన లేనపుడు జీవేశ్వరులు ప్రత్యేకముగా లేరు. ఉండునదొకే బ్రహ్మమే. జీవునిలోని బ్రహ్మ మనస్సు. ఈశ్వరుని మనస్సు బ్రహ్మ. ఈ మనస్సు, బ్రహ్మయనెడు విభజన పోయి, యొకే బ్రహ్మము యొక్క మనస్సు నిలుచును.

బ్రహ్మయొక్క మనస్సు అహంకార తత్త్వము. మూడవ కీలునకు బ్రహ్మమే గురుడు. కనుక "గురుర్బ్రహ్మ" అతడు అహంకార తత్త్వమును కరుణముగా గైకొని సంకల్పించును. ఈశ్వరబుద్ధియే విష్ణువు. బుద్ధియు విష్ణువునొకటేయనినపుడు బ్రహ్మము యొక్క బుద్ధి మిగులును. బ్రహ్మము యొక్క బుద్ధియే మహతత్త్వము.

"గురుర్విష్ణుః" - గురుడైన బ్రహ్మము మహతత్త్వమును సాధనముగా తీసుకొని నిశ్చయించును. రక్షించును. అవిద్యావశమున జీవునహంకారము కలిగెను. అటులే ఈశ్వరుని నందలి యవిద్యా భాగం రుద్రుడు-బ్రహ్మమునందలి యవిద్యా భాగమవ్యక్త తత్త్వము, అహంకార రుద్రులొక్కటేయని గ్రహించునపుడది యవ్యక్తతత్త్వము.

"గురురేవ మహేశ్వరః" - గురుడైన బ్రహ్మమవ్యక్త తత్త్వమును పనిముట్టుగా

ధరించి యభిమానించును. లయమును జేయును. జీవునందున్న చిదాభాస తెలివి. ఈశ్వరునందున్న చిదాభాస పరబ్రహ్మము. తెలివి పరబ్రహ్మములొకటేయని గ్రహించునపుడది శబలబ్రహ్మము. బ్రహ్మములోని యెరుక శబలబ్రహ్మము.

"గురుస్సాక్షాత్పరబ్రహ్మ" – గురుడైన బ్రహ్మము శబల బ్రహ్మము నుపకరణముగా స్వీకరించి మనో బుద్ధ్యహంకారముల యొక్కయు, బ్రహ్మ విష్ణు మహేశుల యొక్కయు వృత్తులనెరుగును.

"తస్మై శ్రీ గురవే నమః" – అట్టి గురుస్వరూపుడగు బ్రహ్మమునకు నమస్కారము. అవి శ్రీఆంజనేయస్వామి తన స్వామియగు శ్రీరాముని గురుభావముగా గురువుగా నిట్లు స్తుతించెను. అటులే నిష్ఠాభక్తికిని మరొక ఉదంతం.

రామరావణుల యుద్ధరంగంలోనొక సందర్భంలో మేఘనాధుడు తండ్రియగు రావణుని ఆజ్ఞతో లంకలోని అశోక వనాన్ని నాశనమొనర్చిన హనుమంతునిపై యుద్ధానికి వెళ్లాడు. అనేక అస్త్రాలు హనుమంతునిపై ప్రయోగించాడు. కాని వాటినన్నిటిని లెక్కచేయలేదు. తుదకు మేఘనాధుడు హనుమంతునిపై నాగాస్త్రం ప్రయోగించాడు. ఆ నాగాస్త్రమునకు జంకక, శ్రీరాముని శత్రువగు రావణుని దర్శించవచ్చు. రావణుని యెదుట తన గురువగు శ్రీరాముని స్తుతించవచ్చని తలంచి మేఘనాధుని బందీగా వెళ్లాడు. ఆ రావణుని యెదుట శ్రీరాముని పొగడి శ్రీరామభక్తుడిగా నిలిచిపోయాడు.

మరొకమారు లంకాయుద్ధం జరుగుతున్నపుడునొక సందర్భమున మేఘనాధుడు అదే నాగపాశంతో శ్రీరాముణ్ణి, లక్ష్మణుణ్ణి బంధించాడు. ఆ నాగపాశం నుండి విడివడడానికై శ్రీరాముడప్పుడు సర్పాలకు ఆగర్భశత్రువైన గరుత్మంతుణ్ణి స్మరించాడు. అంతే ఆ గరుత్మంతుడు రాగానే సర్పాలన్నీ పాశం వీడి పారిపోయాయి. శ్రీరాముడప్పుడు కృతజ్ఞతగా గరుత్మంతుని భక్తి ప్రపత్తులకు మెచ్చి విష్ణురూపంలో సాక్షాత్కరించి ధన్యుణ్ణి చేశాడు. తానే ప్రస్తుతం శ్రీరాముని అవతారంలోనున్నాను అని కూడ వివరించాడు. గరుత్మంతుడు విష్ణుభక్తుడు కనుక, ఆ విష్ణురూపమును దర్శించి మిక్కిలిగా స్తుతించాడు. ఇంతవరకును భగవద్భక్తి. ఇక ఇదంతయును తిలకిస్తున్న హనుమంతుడు శ్రీరామభక్తుడగుటచే, శ్రీరామావతారరూపం తొలగి విష్ణురూపంలో చూడలేక, తన మనస్సులో ముద్రితమైన శ్రీరాముని రూపం కోరుతూ తహతహపడ్డాడు. ఆ తపనను గ్రహించిన విష్ణువు గరుత్మంతునకు సెలవిచ్చి, వెంటనే మరల శ్రీరాముని రూపం దాల్చి, హనుమంతునితో యిలా అన్నాడు. వత్సా! నన్ను విష్ణురూపంలో చూచి నీవు ఎందుకలా అశాంతి చెందావు? నువ్వు మహాజ్ఞానివి కదా! ఎందుకిలా చేశావు? అన్నాడు.

అందులకు హనుమంతుడు సవినయంగా ఇలా అన్నాడు.

శ్లో॥ శ్రీనాథే జానకీనాథే అభేదః పరమాత్మని ।
తథాపి మమసర్వస్వం రామః కమలలోచనః ॥

"పరమాత్ముడే, శ్రీనాథుడుగా, జానకీనాథుడనే రెండు రూపాలను దాల్చాడన్నది నిజమే. కాని, నా మనస్సు సదా జానకీనాథుని పాదపద్మాలనే దర్శించగోరి అశాంతి చెందాను-"ఎందుకనగా శ్రీరామరూపమే తన సర్వస్వమని, అదే భగవద్రూపమని, అదే తన గురురూపమని అభివ్యక్త పరచడం హనుమంతుని గురుభక్తికి నిదర్శనం.

అనగా గురువు రూపం 'గురు' రూపమే. గురుదేవుని రూపమున్నకై తపన చెందడం గురువు భక్తికి నిదర్శనం.

★★★

## గురు - సూత్రములు

మంత్రదీక్ష గురువునకు నమస్కరించుటెట్లు ?

శ్లో॥ వ్యత్యస్త పాణినాకార్యముప సంగ్రహణం గురోః ।
సవ్యేన సవ్యః స్పృష్టవ్యో దక్షిణేన చ దక్షిణః ॥

భా: తన చేతులు మార్చి, కుడిచేతిలో కుడిపాదం, ఎడమచేతితో ఎడమపాదంను స్పృశించి గురువునకు నమస్కరించవలెను.

★★★

శ్లో॥ **త్రీణి పంచచ** సప్తాని నవ ద్వాదశ సంఖ్యయా ।
**భక్త్యా కుర్యాన్న**మస్కార మశ్వమేధ ఫలం లభేత్ ॥

అట్టి నమస్కారములను భక్తి భావంతో మూడు, ఐదు, ఏడు, తొమ్మిది, పన్నెండు సంఖ్యల పర్యాయములు నమస్కరిస్తే అశ్వమేధ యాగమొనర్చినంత ఫలముండును.

★★★

"గురోస్సమీపే ఖట్వాయాం న శయీత"

గురువుల దగ్గర మంచములపై పరుండరాదు. - (37 అ. 245/2 శ్లో)

# 47. శ్రీ గోస్వామి తులసీదాసు గురుస్తుతి

## సంక్షిప్తకథ

బంద ఉఁగురు పదకంజ, కృపాసింధు నరరూప హరి!
మహామోహ తమ పుంజ, జాసుబ్చన రబి కరనికర ॥ (5-దోహ)

నేను నాగురుదేవుల పాదపద్మములకు నమస్కరించుచున్నాను- అతడు కృపాసముద్రుడు, మనుష్యరూపమును దాల్చిన శ్రీహరి. సూర్యకిరణములు అంధకారమును వలె, విజ్ఞాన నిధియైన ఆ గురువచనములు అజ్ఞానమును పటాపంచలు గావించును.

బంద ఉఁగురు పద పదమ పరాగా । సురుచి సుబాస సరస అనురాగా।
అమిఅమూరిమయ చూరనచారూ । సమన సకల భవరుజపరివారూ ॥
సుకృతి సంభు తనబిమలబిభూతి । మంజుల మంగలమోద ప్రసూతీ ॥
జనమన మంజు ముకుర మలహారనీ । కి ఏఁ తిలకగున గన బసకరనీ ॥
శ్రీగురు పదనఖమని గనజోతీ । సుమిరత దిబ్య దృష్టి హియఁహోతీ ॥
దలన మోహతమ సో సప్రకాసూ । బడే బాగఉర అవ ఇ జాసూ ॥
ఉఘరహిఁ బిమల బిలోచన హీకే । మిటహిఁ దోషదుఖభవ రజనీకే ।
సూ ఝహిఁరామచరిత మనిమానిక । గుపుతప్రకట జహఁ జోజెహి ఖానిక॥

భా: నాగురుదేవుని పవిత్రపాదపద్మములధూళి సుందరమైనది. సువాసనలు వెదజల్లునది. అనురాగ మధురిమలను చిలుకునది. అది జన్మమృత్యురూప సాంసారిక బాధలను నశింపజేయు దివ్యౌషధము. అమృతరూప వనస్పతియొక్క దివ్యచూర్ణము. అట్టి గురుపాదపద్మ రజమునకు నా వందనములు. ఈ ధూళి శంకరుని శరీరముపై గల విభూతివలె నిర్మలమైనది, శుభకరమైనది, ఆనందప్రదమైనది. ఇది గురుభక్తుని మనోదర్పణముపైగల మాలిన్యమును తొలగించును. అట్టిది తిలకముగా ధరించినచో పెక్కు సుగుణములను సమకూర్చును. శ్రీగురుదేవుని నఖద్యుతులు మణులవలె ప్రకాశించుచు స్మరణ మాత్రముననే అవి అజ్ఞానాంధకారమును రూపుమాపి, ఆత్మానందమును జేగూర్చును. గురుదేవుల పాదపద్మములను హృదయమున నిలుపుకొనినవాడు భాగ్యశాలి. గురుదేవుల కృపచే వాని మనో నేత్రములు విచ్చుకొనును- పాపములును, సాంసారిక బాధలును దూరమగును.

శ్రీరామకథలు అనెడి మణిమాణిక్యములు ఏగనియందు ప్రక్షిప్త(గుప్త)ములు గానున్నను, ప్రకటితములైనను, అవి హృదయమున ప్రకాశమానములగు చుండును.

దో - జథా సు అంజన అంజిదృగ, సాధక సిద్ధ సుజాన ।
కౌతుక దేఖతసైల బన, భూతల భూరినిధాన ॥

భా: సిద్ధాంజనమును కనులలో పెట్టుకొనిన సిద్ధులు, సాధకులు శిఖరముల పైనను వనముల మధ్యయందును, భూగర్భములయందును గల సమస్త నిధులను అనాయాసముగా చూచినట్లు గురుపాద కమలధూళిని కన్నులకద్దుకొనినవారు సిద్ధిని, జ్ఞానమును అవలీలగా పొందుదురు.

చౌ - గురుపదరజ మృదుమంజుల అంజన ।
నయన అమి అదృగదోష బిభంజన ।
తెహికం బిమల బిబేక బిలోచన ।
బరన ఉం రామ చరిత భవమోచన ॥

భా: గురుదేవుని పాదపద్మరజము కోమలమైనది, మనోజ్ఞమైనది. అది నేత్ర దోషములను రూపుమాపు నయనామృత సిద్ధాంజనము. ఈ అంజనముచే నామనో నేత్రములను నిర్మలమొనర్చుకొని, సంసార బంధములనుండి విముక్తిని ప్రసాదించు శ్రీరామచరితమును వర్ణించెదను, అనెను - ఆ రామచరితం వ్రాయుటకు మార్గదర్శకుడైయున్న, తనపట్ల గురుభావుకుడై యున్న శ్రీ హనుమను గురుదేవునిగా నుపాసిస్తూ ఇట్లు ప్రార్థించాడు.

"కృపాకరో గురుదేవకి నాయి." అంటూ ఎల్లప్పుడు

శ్లో॥ బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వమరోగతా ।
అజాడ్యం వాక్పటుత్వంచ హనుమత్ స్మరణాత్భవేత్ ॥

**అని హనుమంతు**ని బలం, బుద్ధి, విద్యా, యశస్సు, నిర్భయత్వం, మొదలగునవి నివ్వమని **ప్రార్థించాడు.** ఎందుకనగా అనన్నియు ఆ గురుదేవునికున్నవి గనుక.

శ్రీ తులసీదాసు, శ్రీరామశైలనివాసియైన, శ్రీ అనంతానందజీగారి ప్రియ శిష్యుడుగా నున్న "శ్రీనరహరి ఆనంద" అను గురువుగారి శిష్యుడు. ఈతడు బాలుడుగా నున్న తులసీదాసును వెదుకచువచ్చి, అయోధ్యకుగైకొనిపోయి, క్రీ.శ. 1504 సం.న మాఘ శుద్ధ పంచమీ శుక్రవారంనాడు అతడు తులసీదాసునకు ఉపనయన సంస్కారములను జరిపెను. తులసీదాసునకు "రామ్‌బోలా"అనునది మరొకపేరు. ఇతడు బాల్యమునుండియు ఏకసంథాగ్రాహి. "గురుముఖతః" ఒకసారి విన్నంతనే ఏ విషయమైనను అతనికి కంఠస్థమగుచుండెడిది.

శ్రీనరహరిస్వామి తులసీదాసునకు రామచరితమును వినిపించెను. ఆగురు

శిష్యులిరువురు "కాశీవెడలి, అచట కొంతకాలముగడిపిరి. కాశీలో "శేషసనాతన స్వామి" వారికడ తులసీదాసు పదునైదు సంవత్సరములు వేదవేదాంగములును అధ్యయనమొనర్చుకొని, ఆ గురువాజ్ఞతో జన్మస్థానమగు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ప్రయాగ సమీపమున బాందా జిల్లాలోని "రాజాపురం" అను గ్రామము చేరెను.

కొంతకాలమునకు (వి.శ.1628) సం॥న శ్రీఆంజనేయుని దర్శించి, వారియనుమతితో అయోధ్య చేరి, 1631వ సం.న అచట, శ్రీరామనవమి ఉత్సవములు జరుగుచుండ ఆ ప్రాతఃకాలముననే శ్రీతులసీదాసు శ్రీరామచరితమానస" రచన ప్రారంభించెను. 1633 వ సం. న సంపూర్ణంగావించెను

★★★

## గురు - సూత్రములు

హయనామివ జాత్యానాం అర్ధరాత్రార్ధ శాయినామ్ ॥ -238/2 (నా.పు)

శ్లో॥ నహి విద్యార్థినాం నిద్రాచిరం నేత్రేషు తిష్ఠతి ।
న భోజన విలంబీ స్యాన్నచ నారీ నిబంధనః ॥ -239/2 (నా.పు)

భా: జాత్యశ్వములు అర్ధరాత్రి సగము నిద్రించునట్లు, విద్యార్థులు చాలా కాలము వరకు నిద్రించరాదు. అటులే చాలా కాలము వరకు భోజనము చేయరాదు. నారీ నిర్బంధముండ రాదు.

★★★

"సర్వచింతా వధి ర్గురుః"

గురువు సర్వచింతలకు అవధియైనవాడు.

★★★

"త్రిమూర్తి రం రం రేవతి వక్తి శృతిరపి స్మృతిః ।
గుర్వర్చ నాదభీష్టాప్తిః పురుషార్థాప్తి రేవచ ॥"

శృతి స్మృతులు గురువే త్రిమూర్తి స్వరూపుడని చెప్పును, గురుని అర్చించుటచే అన్ని కోరికలు సిద్ధించును. మరియు చతుర్విధ పురుషార్థములు సిద్ధించును.

★★★

# 48. బలరామకృష్ణుల "గురుదక్షిణ"

బలరామకృష్ణు లిరువురును బాల్యమున గర్గాచార్యులనుండి "గాయత్రీ" మంత్రోపదేశం పొందిరి. తదుపరి విద్యాభ్యాసమునకు కాశీపురంలో నున్న అవంతీపుర వాసి యగు సాందీపుని చేరిరి. ఆ సాందీపునకు నత్యంత భక్తితో నమస్కరించగా, ఆ గురువర్యుడు వారియెడల ప్రణీత స్వాంతుడై వేదవేదాంతములను, వేదాంగములను మంత్రిదేవతాజ్ఞాన సహితంగా శ్రద్ధగా బోధించి, ధనుర్వేదాన్ని, మన్వాది ధర్మశాస్త్రాలను మీమాంసాది న్యాయశాస్త్రాలను, షడ్విధ తర్కశాస్త్రాన్ని, సంధి, విగ్రహయాన ఆసనద్వైధ ఆశ్రయాలనే ఆరు అంగాలుగల రాజనీతిని వారికి బోధించాడు.

రామకృష్ణులట్లు సమస్త విద్యలు సాందీపుని నుండిగ్రహించిరి. కొంత కాలమునకు గురువును సమీపించి, "మహాత్మా! మీ వలన మేము విద్యలన్నీ నేర్చుతిమి. కావున గురుదక్షిణ సమర్పింపని నాడు, నేర్చిన విద్య ఫలించదు. గురుదక్షిణగా మానుండి యేమి కావలయునో తెలుపగలరని అర్థించుచున్నాము." అని సవినయముగా పలికిరి.

ఇట్లు రామకృష్ణులిరువురు తనను గురుదక్షిణ కోరమని అర్థించడంతో, తానింతవరకును తనలో నున్న పుత్ర శోకము వెలువరించక వారికి విద్యాబోధన గావించెను. కానీ, తన ఆవేదన, వారి గురుదక్షిణకు ముడిపెట్టడం సహజముకాదని తాను మౌనము వహించెను. గురువిట్లు మౌనము వహించి యుండడంతోనేదో మనోవేదన గురువు పొందుచున్నాడని వారు గ్రహించి, "స్వామీ! మీరెందులకిట్లున్నారు - మీరేదో తపనపడుతున్నారు. ఆ మనో వేదనకు కారణమేమి, సెలవివ్వండి"యని ప్రాధేయపడిరి.

సాందీపునికొక కుమారుడుండేవాడు. అతనొకనాడు ప్రభాసక్షేత్రానికి వెళ్లి స్నానార్థం సముద్రంలో మునిగి మళ్లీ తిరిగి రాలేదు. అది జరిగి యెన్నో సంవత్సరాలు గడిచినవి. అయిననూ సాందీపుని భార్యపుత్ర వాత్సల్యము వీడక, మరువలేక, సుతవియోగ క్లేశంతో కృశించుచుండెడిది. ఆ ఆవేదన తాను పొందు చుండెడివాడు. అయినను నిస్సహాయ స్థితిలో నుండెడివాడు.

రామకృష్ణులిరువురు తనను గురుదక్షిణప్రస్తావనతో తన ఆవేదనను గుర్తుచేసినట్లయ్యెను. వారి వినతి విని, వీరిని నేనేమి కోరవలెను అని తలంచి, తుదకు తన మనోవేదన తన భార్య పుత్రశోకం యిట్టివారినుండియే నివారించుకొనుటయే తను కోరుకొను గురుదక్షిణయని, వారితో నిట్లనెను.

నాయనలారా! మీరు సర్వజ్ఞులు. మీనుండి మేము గురుదక్షిణగా పుత్రభిక్ష పెట్టమని అర్థించుచున్నాము. ఆ మాటలతో నిరువురు కడు ఆశ్చర్యపడి, ఆ కోరిక నేదైనను తీర్చెదమ"ని

విన్నవించిరి. ఆ మాటతో గురువు సాందీపునకు కొంత ఊరట కలుగగా, వారితో తన పూర్వ పుత్ర శోకవృత్తాంతమును వెల్లడించెను.

రామకృష్ణులిరువురును సమ్మతించి, గురువునుండి ఆశీస్సులు పొందిరి. వెంటనే మహారథాలను నధిరోహించి సర్వాస్త్రాలతో ప్రభాసక్షేత్రానికి చేరిరి. ఆ సముద్ర తీరాన చేరి సముద్రుని ప్రార్థించిరి. సముద్రుడు ప్రత్యక్షమై చేతులు జోడించి నిలువగా, వారు, తాము వచ్చిన గురుకార్యమును తెలిపిరి. సముద్రుడును విషయము గ్రహించి, ఆ బాలుని దాచినది తానుకానని, 'పంచజనుడ'నే అసురుడు శంఖరూపధారి ఆ బాలునిగైకొని వెళ్లెనని పలికెను. అతనిప్పుడు జలాంతరాననున్నాడని, వాని నుండి ఆ గురుపుత్రుని పొందుడని విన్నవించెను.

రామకృష్ణులామాటలు విని యిరువురును నీటిలోదూకి పంచజనుని పట్టి వధించి, అతని పొట్టలోనున్న గురుసుతునిగానక, ఆ దానవుని శరీరాన నున్న శంఖమునుగైకొనిరి.

ఆ శంఖముతో యమపురి కరిగి శంఖారావం గావించిరి. ఆ పాంచజన్య శంఖారావమున కదిరిపడిన యముడు కడుభక్తితో రామకృష్ణులిరువురికి నమస్కరించి, అర్చించి వచ్చిన కార్యం బడిగెను. యముని వినయమటుండీ, వారిట్లనిరి. "మా గురుపుత్రుడు కర్మవశాన మృతుడై యిక్కడికి గైకొని రాబడినట్లు గ్రహించినాము. అతను తన దోషఫలాన్ని అనుభవించవలసి యుండినను, మా శాసనంతో నాతని దోషాలన్ని నశించాయి. అతనిని తెచ్చి మాకప్పగించుడ"ని అన్నారు రామకృష్ణులు.

వారి యాజ్ఞతో యముడువెంటనే గురుపుత్రుని అప్పగించెను. ఆ గురు పుత్రుని వెంటబెట్టుకొని వెళ్లి గురువు నకప్పగించిరి. సాందీపుని, అతని భార్యకును ఆనందమునకంతు లేకపోయెను.

రామకృష్ణులిరువురు గురువునకు నమస్కరిస్తూ, "గురువర్యా! ఇంకేమైనా గురుదక్షిణను కోరుకోండి" అని అర్థించారు. అందులకు సాందీపుడు వారి వినయ సంపదకు సంతసించి మెచ్చి, "వత్సలారా! గురు నిష్క్రియగా అడిగిన దానిని తెచ్చియిచ్చారు. మీవంటి శిష్యులను సంపాదించిన గురువునకు కొరత ఏముంటుంది? వీరవరేణ్యులారా! మీ కీర్తి జగత్పావనమౌతుంది. మీవంటి శిష్యులు ఆదర్శనీయులు. ఇక మీరు మీయిండ్లకు వెళ్లవలసిన తరుణం ఆసన్నమైనది. శుభంగా వెళ్లిరండి" అని దీవించి వారిని పంపెను.

సర్వ సంపదలకన్నా, కడుపున పుట్టిన పుత్రసంపదమిన్నకదా! సాందీపుడు గురుదక్షిణగా పొందిన సంపద అదే.

★★★

# 49. అర్జునుని గురుదక్షిణ

భరద్వాజ సుతుడు ద్రోణుడు. పాంచాల దేశాధిపతి పృషతమహారాజు పుత్రుడు ద్రుపదుడు. వీరిరువురును భరద్వాజాశ్రమంలో సహాధ్యాయులై, మిత్రులై, వేదాభ్యాసంతోపాటు వివిధ విద్యలు నేర్చుకొనిరి. వారిరువురును పెరిగి పెద్దవారై ఆశ్రమం విడిచి వెళ్లిరి.

ద్రోణుడు అగ్నివేశుని శుశ్రూషలో ఆగ్నేయాస్త్రాది శస్త్రాస్త్రములవిద్యను అవగాహనమొనర్చుకొని, తదుపరి భార్గవ రాముని అనుగ్రహంతో మహాస్త్రాలెన్నెన్నో గ్రహించాడు.

ద్రుపదుడు పాంచాలాధిపతిగా పట్టాభిషిక్తుడై భోగభాగ్యాలతో తులదూగుచున్నాడు. కాని ద్రోణుడు మాత్రము దారిద్ర్యబాధతో జీవిస్తున్నాడు. కొంతకాలమునకతనికి వివాహము కాగా, వారికొక పుత్రుడును కలిగెను. అతడే అశ్వత్థామ. బాల్యమున తల్లిపాలు సరిపోక ఆకలితో నేడ్చుచుండెను. అట్టి ఆకలి బాధ, దారిద్ర్యబాధ దుర్భరంకాగా, ద్రోణుడు తోచని స్థితిలో నుండెను. అతని భార్య ద్రోణికి కొంత ఆలోచన తోచెను. అప్పుడప్పుడు తన భర్త తనతో బాల్యమున సహాధ్యాయియగు ద్రుపదుని గూర్చి, అతని స్నేహము గూర్చి పలుకుచుండెడివాడు. అట్టిదిప్పుడామెకు తోచగా, ఆద్రోణి, తన భర్తను ఆచిన్ననాటి సహపాఠకుడగు ద్రుపదునిచేరి, సందర్శించి, తమను ఆదుకోమని అర్థించ పురమాయించెను.

ద్రోణుడును తన దారిద్ర్యమునకు తాళలేక, పోగా, భార్యమాటలు చెవికెక్కి ఆ ద్రుపదుని ఆశ్రయించవలెనని తపనతో బయలుదేరెను. మహారాజు ద్రుపదుడు అష్టైశ్వర్యములతో తులతూగుచుండడం చూచి, బాల్యస్నేహ వాత్సల్యముతో తనగోడును ఆద్రుపదునకు మొరపెట్టుకొనెను. కాని, ద్రుపదుడు తానొక మహారాజునని, అహంకారుడై తోటి బాల్యమిత్రుడైన ద్రోణుని మాటలు పెడచెవిని బెట్టుచు, చూచినను చూడనట్లుగా నుండి, మర్యాద చేయలేదు సరికదా! కనీసం మాటవరుసకైన ద్రోణుని పలుకరించలేదు. అయిననూ, సహించిన ద్రోణుడు తన యవసరనిమిత్తమై బాల్యస్నేహాన్ని గుర్తుచేస్తూ, తుదకొక తనకుమారుని ఆకలి తీర్చునిమిత్తమై ఒక గోవును నిమ్మని అర్థించెను.

అందులకాద్రుపదుడు ద్రోణుని అవహేళన చేస్తూ, అమర్యాదకరంగా, తూష్ణీభావంతో తిరస్కరించాడు. అంతే, ఆ అవమాన భారంతో కృంగిపోయిన ద్రోణాచార్యుడు, ద్రుపదుని అహంకారమునకు పరితపించి, కృద్ధుడై యిట్లనెను.

ద్రుపదుడా! నీ అహంకారమును నాశస్త్రాస్త్రముల ప్రభావముతో కృంగదీయగలను. కాని, నేనట్లుచేయను. నావిద్యనభ్యసించిన శిష్యులద్వారా నీ గర్వమణిగించెదనని శపథమొనర్చి తిరుగు మొగము పట్టెను.

కొంతకాలమునకు ద్రోణుడు భార్యాబిడ్డలతో హస్తినాపురంచేరి, తన అస్త్రనైపుణ్యంతో పాండవ ధార్తరాష్ట్రానందనులమెప్పించి, ధనుర్విద్యాగురువుగా నియమితుడయ్యెను. ద్రోణాచార్యుడుగా ఖ్యాతిపొందెను.

ద్రోణాచార్యుని విద్యాభ్యాసంలో కౌరవపాండవులు శిష్యులుగా సకలవిద్యలు నేర్చిరి. విలువిద్యలో అర్జునుడు సాటిలేని వాడుగా నిలిచెను. కావున ద్రోణునకును అర్జునుడనిన మిక్కిలి మక్కువ. మిగిలిన వారును వారికి తోచిన విద్యలలో పారంగతులై మెలిగిరి.

ఇట్లుండ నొకనాడు తననవమానించి యున్న ద్రుపదమహారాజు ద్రోణునకు గుర్తొచ్చి, తన శిష్యులనందరిని పిలిచి, గురుదక్షిణ కోరెను. అందులకు తాము సిద్ధమని, అట్టి గురుదక్షిణ ఏమిటని కోరిరి. "ద్రుపదుని పట్టి తెచ్చి నాముందు పడవేయడమే నాకిచ్చు గురుదక్షిణ" అని ద్రోణుడు ఆదేశించెను.

అదెంతపని యని కౌరవులందరు ఆడంబరముగా వెళ్లి, ద్రుపదునితో పోరాడి, తుదకు పరాజయాన్ని చవిచూచి వెనుకకు తిరిగి వచ్చిరి. అంతట అర్జునుడు రంగప్రవేశం చేసి, ద్రుపదుని రథంపై సింహపు పిల్లవలె లంఘించి, అతని రెక్కలు విరిచి, నిర్బంధించగా, ద్రుపదుడు లొంగిపోయెను. వెంటనే ఆ గర్వోన్నతుని అర్జునుడు తన రథంపై నెక్కించుకొని, హస్తినకుచేరి, సర్వులు చూచుచుండగా ద్రోణాచార్యుని పాదసన్నిధికి చేర్చి, ఇదిగో నా "గురుదక్షిణ" అని సభక్తికంగా ద్రుపదుని సమర్పించుకొన్నాడు. ద్రుపదుని రాజగర్వం అణగద్రొక్కబడెను. ద్రోణుడు అర్జునుని పరాక్రమమునకు మెచ్చిమిక్కిలి సంతోషించెను.

★★★

## గురు - సూత్రములు

సహస్ర గుణితావిద్యా శతశః పరికీర్తితాః ॥ -237/2 (నా.పు)

ఆగమిష్యతి జిహ్వాగ్రే స్థలాన్నిమ్నమివోదకమ్ ॥ -238/1 (నా.పు)

ప్రయత్న శీలతే కార్యసిద్ధికి కారణము. నూరుమార్లు అధ్యయనం చేసి, వేయిమార్లు వల్లెవేసినచో విద్య పల్లమునకు ప్రవహించు 'నది' వలె ఆవిద్య వచ్చును.

★★★

# 50. కౌత్సుని గురుదక్షిణ

వరతంతు మహర్షి వద్ద కౌత్సుడను శిష్యుడుండెడివాడు ఈతడు కడు శ్రద్ధావన్తుడై తన గురువునకు శుశ్రూష చేస్తూ గురువు నుండి చతుర్దశ విద్యలు నేర్చెను. విద్యాపరిసమాప్తి కాలమున తనగురువును గురుదక్షిణ కోరవలసినదని అర్థించెను. శిష్యుడైన కౌత్సుని గురుభక్తికి, శుశ్రూషకు సంతుష్టాంతరంగుడై యెట్టి గురుదక్షిణగా కోరక, ఏదియును వలదని పలికెను. కానీ, కౌత్సుడు ఏదో కొంత గురుదక్షిణ కోరమని నిర్బంధించెను. అందులకు కౌత్సుడట్లు నిర్బంధించుట వరతన్తు మహర్షికి ఆగ్రహము కలిగెను. అయినను నతడు మరీ పట్టు వీడకపోగా, ఆగ్రహోదగ్రుడై యిట్లు శాసించెను.

శ్లో॥ అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః ।
పురాణం ధర్మ శాస్త్రంచ విద్యాహ్యేతాశ్చతుర్దశ ॥

షడంగములు, చతుర్వేదములు, మీమాంస, న్యాయ పురాణ, ధర్మశాస్త్రములు వెరసి పదునాలుగు విద్యాస్థానముల సమగ్రముగా నభ్యసించితివి గాన, నేను కోరినట్లుగా నొక్కొక్క విద్యకాక కోటి ప్రకారము పదునాలుగు కోట్ల ధనమునీయ వలసినదని శాసించెను.

కౌత్సుడు నిరస్తుడు. గుర్వాజ్ఞగా రఘు మహారాజు చెంతకు చేరెను. ఆ మహారాజు తన రాజ్య భోగభాగ్యములన్నిటి త్యజించి వానప్రస్థానాశ్రమముగా మట్టి పాత్ర చేబూనియుండెను. కౌత్సుదర్థించుటను తనకును గుర్వాజ్ఞగా నెంచి, సహృదయంతో కుబేరుని ప్రార్థించెను. రాజు యౌదార్యమునకు, గురుభక్తికి సంతసించి, కౌత్సుడడిగిన ధనము కన్న మిన్నగా ధనవర్షము కురిపించెను. ఆ మొత్తమును రాజు కౌత్సునప్పగించెను. కౌత్సుడును ఆ ధనమంతయును ఒంటెలపై, గుఱ్ఱములపై వేసుకొని గురువగు వరతన్తు మహర్షిని చేరి సమర్పించెను. మహర్షి శిష్యుని గురుభక్తికి సంతసించి, జరిగిన విషయమును గ్రహించి రఘుమహారాజును అభినందించెను. కాని కౌత్సుడు పరీక్షలో నెగ్గెనని సంతసముతో ఆ ధనమునంతయు తిరిగి కౌత్సునికే అప్పగించుచు నాయనా! నీవు గృహస్థుడవై జీవనాధారముగా నీ ధనమును సద్వినియోగ పరచుకోవలసిందని ఆదేశించెను.

ఇది కౌత్సుని గురుభక్తికి నిదర్శనము.

కావున, గురువు వద్ద విద్యనభ్యసించుటలో శుశ్రూషచేగాని, పుష్కళమైన ధనమును, లేక ధనమునకు ప్రత్యామ్నాయముగా మరేయితర విలువైన వస్తు సంపదను 'గురు' దక్షిణగా గురువునకు సమర్పించు సంప్రదాయము పూర్వముండెడిది. గురువును తృప్తుడై తన కృపాకటాక్ష వీక్షణముల ప్రభావముతో శిష్యుడును సకల విద్యా పారంగతుడై గురుసముడగుచుండెను. ★★★

# 5..గాలవుని గురుకట్నము (కథ)

గాలవుడను నొకముని పుత్రుడు. ఇతడు విశ్వామిత్రుని కడ విద్యనేర్చుకుని గురుకట్నముగా నతనిని నేదేని కోరుకోమనెను. విశ్వామిత్రుడు అక్కరలేదనినను కోరుకోమనెను. విశ్వామిత్రుడు అక్కరలేదనినను వినక బలవంతపెట్టెను. విశ్వామిత్రుడపుడు, "శుద్ధ ధవళ వర్ణమై యొక కర్ణము నీలమై యుండిన అశ్వముల నెనిమిది వందలు తెచ్చిఇమ్మ"ని పలికెను.

గాలవుడపుడు తన మిత్రుడైన గరుడుని నివియెట్లు పొందవలెనని అడుగగా, వారిద్దరును అట్టి అశ్వములకై వెదకనారంభించిరి.

గరుడుడు తన పూర్వ మిత్రుడైన ప్రతిష్ఠాన పురనాధుడైన యయాతి కడకు గాలవుని గైకొని వెళ్లెను. అతడు తనవద్ద గుఱ్ఱములు లేవని చెప్పుచు, తన కూతురు మాధవిని ఏరాజునకైన యిచ్చి అట్టి గుఱ్ఱములు పొందుడని పలికెను.

గాలవుడామెను గైకొని ఇక్ష్వాకు రాజును చేరెను. "ఈమె యువతియైనను కన్యగానే తిరిగి మారునని నొకముని వరము కలదని, కావున నీమెను గైకొని గుఱ్ఱములనిమ్మని కోరెను. అటులామెను ఆ రాజునకప్పగించి, అతని కడనుండి రెండువందల గుఱ్ఱములను గైకొని వెళ్లెను. ఆ రాజు కొంతకాలమునకు మాధవి వలన నొకపుత్రుని బడసి, యామెను రాజు తిరిగి గాలవునకిచ్చివేసెను.

అటులనే, దివోదాసుని కడ, రెండువందల గుఱ్ఱములను, మరియు ఔశీనరుని వద్దనుండి కూడ రెండువందల గుఱ్ఱములను పొందెను

ఇక గుఱ్ఱములెక్కడును లభించవని, గాలవుని మిత్రుడగు గరుడుడు పలుకగా, చేయునది లేక గాలవుడు గురువగు విశ్వామిత్రుని చేరి, తాను పొందియున్న ఆరువందల అశ్వములను అప్పగించి, తనతోనున్న మాధవిని కూడ గైకొమ్మని మిక్కిలిగా ప్రార్థించెను.

విశ్వామిత్రుడటులే స్వీకరించి సంతసించెను. మాధవి విశ్వామిత్రుని ద్వారా అష్టకుడను పుత్రుని పొందెను. శాశ్వతముగా నతని వద్దనే యుండెను. 'గురుకట్నము' చెల్లించుటకు శిష్యుడగు గాలవుని పాట్లు గ్రహింపదగినవి.

– (హరివంశం. భారతం)

★★★

# 52. గురుకట్నముగా యోగవిద్యను నర్థించుట

ఖాండిక్యుడను వానిసోదరుడుని కుమారుడు కేశిధ్వజుడు. ఇతడు యోగ విద్యయందారితేరియుండెను. ఈ కేశిధ్వజుడు తన పెదతండ్రి ఖాండిక్యుని నోడించి, అతని రాజ్యమునాక్రమించెను.

కొంతకాలమునకు కేశిధ్వజుడు యాగము చేయుచుండగా నతని యాగధేనువును నొకపులి మ్రింగెను. యాగము భంగమయ్యేనని తలంచి, దానికి ప్రతీకారముగా నేమిచేయవలెనో తోచకయుండెను. తుదకు తన పెదతండ్రి ఖాండిక్యుని చేరి విచారించయత్నించెను. కాని అచటికి వెళ్లగా ఖాండిక్యుని మంత్రులు అడ్డగించి, నిన్ను జంపుటకే సిద్ధపడి వచ్చుచున్నాడని పలికిరి. కేశిధ్వజుడు సలహామేరకు వచ్చిన కారణాన మిన్నకుండెను.

అటులనే ఖాండిక్యుడును మంత్రుల మాటలను వమ్ముజేసి, కేశిధ్వజునకెదురేగి ఆదరించెను. అతనికి కావలసిన సలహా నిచ్చెను. అందులకు కేశిధ్వజుడు మిక్కిలి సంతసించి, గురుకట్నముగా పెదతండ్రిని, ఏమికావలయునో కోరుకొనుమనెను. ఖాండిక్యుడు తిరిగి తన రాజ్యమిమ్మని కోరలేదు. మరియు ధనము కూడ అర్థించలేదు. తనకిక అతడు నేర్చిన యోగవిద్యను తనకును నేర్పమని కోరెను. అదియే అతనికి తోచినది. అనగా నీ భౌతిక సంపదకన్న ఆధ్యాత్మిక సంపదయగు "యోగవిద్య" కెంతటి ప్రాధాన్యమున్నదో గ్రహించదగినది.

★★★

## గురు - సూత్రములు

తల్లి తాబేలు తన పిల్లలను చూపులతో నెట్లు పోషిస్తుందో గురువు కూడా శిష్యులనట్లు తన చిన్ముద్ర దృష్టితో కాపాడుతాడు.

★★★

మనలను తుది గతివైపు నడిపించే జ్ఞాన గురువు శ్రీ షిర్డీ సాయినాథుడు.

★★★

# 53. కౌశికుని గానమహిమ

కౌశికుడను నొకబ్రాహ్మణుడు సర్వదావిష్ణు నామమును మధురముగా గానము చేయుచుండెడివాడు. అటులనే అతని శిష్యులను ఆ గానములో గురువును ననుకరించు చుండెడివారు. అటులనే పలువురును ననుకరించుచుండెడివారు. అనగా ఆ గానమంతటి మధురమైయుండెడిది.

అట్లు కౌశికుని గానమాధుర్యం మరీ పలువురి నోట వ్యాపించి ఖ్యాతి చెందడంతో, కళింగదేశపురాజు వచ్చివారిని చేరి, వారితో తనను కీర్తించునట్లు గానమొనరించుమని ఆదేశించెను. అందులకువారు నిరాకరించగా, తన భటులచే రాజు వారిని అటు నుండి వెడలగొట్టించెను. అయినను, తమ విష్ణునామ సంకీర్తనతో పయనమైరి-

అట్టి వారినందరికిని ఇహలోకం వీడునట్లు విష్ణుమూర్తియే స్వయంగా తనలోకమునకు దీసికొని పోయి వారి సంకీర్తనలను విని ముగ్ధుడయ్యెను. అటులే శ్రీలక్ష్మి కూడ వారి పాటలను విని, తుంబురుని కూడ వారితో (కౌశికుని, వారి శిష్యులతో) కలిసి పాడుమనెను. అతడటులే పాడగా ఆ పాటలకు మేళవింపుగా మిక్కిలి మధురమనిపించెను.

చూచితిరా! అట్టి గురువుతో నున్న శిష్యులును గురుగాన మాధుర్యంతో వైకుంఠపురమున కరిగిరి. సద్గురువుల సాంగత్యముచే సత్ఫలముండును.

★★★

## గురు - సూత్రములు

"గురుశాపహత మూఢపతీ భూమి మావాక్శిరాః"

"గురు శాపహతుడవైన నీవు తలక్రిందులుగా భూమిపై పడిపొమ్మ"నిరి దేవతలు త్రిశంకుని.

★★★

సూర్య చంద్రులు గురు శిష్యులు. అనగా జ్ఞాన భాస్కరుడైన సూర్యుడు గురువు. ఆయన తేజస్సును సంపూర్ణంగా గ్రహించె శిష్యుడు చంద్రుడు.

★★★

గురువు, తేడాలు చూపని ప్రభువు.

# 54. బ్రహ్మవిద్య - ఉపకోసల విద్య
## "ఛాందోగ్యోపనిషత్తు" - లోనిది

కమలసుతుడైన "ఉపకోసలుడ"నే బాలుడు బ్రహ్మవేత్తగా పేరుపొందిన గురువగు సత్యకామ జాబాలుణ్ణి యాశ్రయించి శుశ్రూషచేస్తూ పన్నెండేళ్ళు బ్రహ్మచర్య నెరపినాడు.

తనతో గురుకులంలో చేరిన వారంతా విద్యలు పూర్తిచేసుకొని సమావర్తనం గావించుకొని తమ యిళ్ళకు చేరుకుంటున్నారు. తాను మాత్రం అటులే యాశ్రమంలో నుండిపోయాడు.

అయితే, ఆ వెళ్ళేవాళ్ళంతా స్వాధ్యాయమునకై, మరో శాస్త్రము కోరుకోవచ్చిన వాళ్ళు. అది కాగానే వాళ్ళు వెళ్ళిపోతున్నారు.

ఉపకోసలుడు స్వాధ్యాయం మాత్రమే కోరివచ్చినవాడు కాదు. కేవలం బ్రహ్మవిద్య నెరుగగోరి వచ్చినాడు. బ్రహ్మవిద్యనుపదేశించాలంటే, శిష్యుని యెన్నో పరీక్షలు చేయాలి. అతని ఆసక్తి, అభిసంధి అనువర్తనం లాంటివన్నీ పరిశీలించాలి. అప్పుడు నిగ్గుదేరితే ఉపదేశం.

గురువగు సత్యకామునికి (జాబాలునకు) తన విద్యార్థి దశ గుర్తొచ్చి, తన గురువుగారు గురుకుల ప్రవేశంనాడు పెట్టిన పరీక్షతలంపున కొచ్చెను.

ఆ వేళ తన గురువు నాలుగు వందలగోవుల్ని సత్యకాముడి కప్పగించి, "అబ్బాయి! వీటిని వెయ్యి చేసుకొని రా. నిన్ను గురుకులంలో చేర్చుకొని విద్యనేర్పుతానన్నాడు. అట్టిదే గుర్తొచ్చిందేమో సత్యకామునకు.

అటులనే ఉపకోసలుడు సమ్మతించి ఆ గురుకులంలో చేరి పన్నెండేళ్ళు గడిపాడు. గురువగు సత్యకాముడు మాత్రము బ్రహ్మవిద్య గూర్చియే యెత్తడం లేదు. ఏమిచేస్తాడు? తెగబాధపడిపోతున్నాడు. ఎవరితోనూ చెప్పుకోలేడు ఉపకోసలుడు.

ఇంతలో నాగురువుగారికి దేశాంతరం వెళ్ళవలసిన అవసరం వచ్చి, వెళ్ళుతూ ఉపకోసలుణ్ణి పిలిచి, "నాయనా! నేను దేశాంతరం వెళ్ళాల్సిన పనిపడింది. అంతవరకు యీ అగ్నుల పరిచర్యనేమారకు. నేను వచ్చేంతవరకు నీ బాధ్యతే సుమా! అటులే ఆశ్రమం చూచుకోవస్తాను." అని వెళ్ళిపోయెను సత్యకాముడు. కాని వెళ్ళిపోయేముందు సత్యకాముని భార్య ఉపకోసలుణ్ణి గూర్చి యిలా అన్నది.

"ఉపకోసలుడితో వచ్చినవారంతా సమావర్తనం చేసుకొని వెళ్ళిపోయారు. కాని యితడు ఎంత శ్రద్ధగానో అగ్ని పరిచరణం కావిస్తున్నాడు. అందుకు మీరు వాణ్ణి పట్టించుకోక,

ఉపేక్షిస్తుంటే ఆ అగ్నులు కూడా మిమ్మల్ని నిందిస్తాయి. పాపం, వాడికి కాస్త మంత్రోపదేశం చేసి మరీ వెళ్ళండి" - అని ప్రాధేయపడింది.

అయిననూ ఆ మాటలు సత్యకాముడు విని విననట్లుగా వెళ్ళిపోయాడు దేశాంతరానికి. ఇక ఆమే ఏమియును చేయలేకపోగా, ఉపకోసలుడును బాధపడ్డాడు. అయినను, గురువాజ్ఞగా తనవిధిగా అగ్నిపరిచరణం మట్టుకు, యథావిధిగా శ్రద్ధగా చేస్తూ, కొన్ని దినాలకు భోజనం మానేశాడు. అదిగని గురుపత్ని, "ఉపకోసలా! భోజనం మానేశావేమి?" అని ప్రశ్నించింది. అందులకై నతడు "మాతా! భోజనంతో రకరకాల జనన మరణ జరాదులకు మూలమైన వ్యాధులు నన్ను పీడిస్తున్నాయి. అట్టి భోజనం చేయలేనమ్మా!" అని వైరాగ్యంతో పలికాడు ఉపకోసలుడు.

ఇదంతయును అగ్నులు వింటున్నాయి. శ్రద్ధతో తమ నారాధించడం కూడా చూస్తున్నాయి.

"ఇతడు కడు శ్రద్ధతో కష్టపడి మననారాధిస్తున్నాడు కదా! ఇతనికేమైన ఉపదేశించుదామా!" అని ఏకకంఠంగా తలంచి, ఆ అగ్నులు ఉపకోసలుడికి ఇట్లుపదేశిస్తున్నాయి.

"ప్రాణోబ్రహ్మ, కంబ్రహ్మ, ఖంబ్రహ్మ" అని ముచ్చటగా మూడు మాటలు చెప్పినది.

ఉపకోసలుడికి సందేహము కలిగింది.

"ప్రాణం బ్రహ్మ" అన్నారు బాగుంది. సమస్త జగత్తుకును బ్రతికించేది ప్రాణమే గనుక.

మరీ! ఈ "కం, ఖం" ఏమిటీ? అని ప్రశ్నించగానవి -

"కం" అనగా సుఖం; "ఖం" అనగా ఆకాశం -

"సుఖ శరీరకం, ఆకాశ శరీరకంబ్రహ్మ" అని "ఆకాశ" శబ్దంతో అపరిఛిన్నాత్వాన్ని గ్రహించి, అపరిచ్ఛిన్న సుఖబ్రహ్మ" అని ఈ రెండర్థాలుగా విశేషణ విశేష్యాలుగా గోచరిస్తాయి.

"కం; ఖం-ఖం, కం" అని విశేష్య విశేషణములుగాను అన్వయించుకోవాలి అని తాత్పర్యములను అపరిచ్ఛిన్న సుఖమే బ్రహ్మగా అన్వయము.

ఇట్లు మూడగ్నులు 1. గార్హపత్యాగ్ని 2. దక్షిణాగ్ని; 3. ఆహవనీయాగ్నిలు కలిసి యుపదేశించాయి.

తదుపరి, యిట్లు ఉపదేశించాయి.

"నాయనా! దేశాంతరం వెళ్లిన గురువు వచ్చేవరకు నీ ప్రాణాలు నిలపటం

కోసం బ్రహ్మస్వరూప మంత్రాన్ని దానికంగముగా యుపకారంగా "అగ్నివిద్య"ను మేం నీకు పదేశించేం" -

"మరియు ఆచార్యుల వల్లనొందిన విద్యేచక్కగా ఫలిస్తుంది. అంచేత సంయద్వామాది కల్యాణ గుణుడైన బ్రహ్మను, తదుపాసన స్థానమైన "అక్షిని, అక్షిరాది గతిని ఆచార్యులు నీకుపదేశిస్తారు" అని పలికి అంతర్ధానమైనారు.

ఆచార్య సత్యకామ జాబాలుడు దేశాంతరం నుండి తిరిగి వచ్చెను. ఉపకోసలుని మొగాననేదో తేజస్సు ప్రస్ఫుటంగా కానవచ్చింది.

"ఏమయ్యా! బ్రహ్మజ్ఞుడుగా కానవస్తున్నావు. నీకెవరు బ్రహ్మవిద్యను ఉపదేశించారు? అని ప్రశ్నించాడు. ముందు కాస్త నసిగిననూ "అగ్నులు ఉపదేశించినాయ"ని పలికెను, ఉపకోసలుడు.

"అగ్నులు ఏమిచెప్పినవి నాయనా" అని గురువడుగగా, "బ్రహ్మవిద్యాంగ భూతమైన అగ్నివిద్యను", అన్నాడు శిష్యుడు.

"నాయనా! నీకు, తామరాకుమీద నీటిబొట్టు అంటనట్లు, సకల పాపాలు నిన్నంటవు. విద్యకు లక్ష్యమైన బ్రహ్మనుగూర్చి ఉపదేశిస్తా"నని పలుకగా "మహాభాగ్యం, సెలవివ్వండి అన్నాడు ఉపకోసలుడు.

కంటితో యోగులు మాత్రం చూడగల పురుషుడొకడున్నాడు. ఆయనే ఆత్మ. ఆయనే నియన్త. ,అమృతుడాయనే. నిరతి శయానందత్వం, అభయం అన్నీ ఆయనే. దుః ఖ స్పర్శకూడ లేనివాడు. తామరాకుపై నీటిబొట్టులా, అని అన్నందువలన ఆయననేమి, ఏమి అంటవు." ఆ కంటిలో నెయ్యికానీ, నీళ్లు కానీ పోస్తే అక్కడ నిల్వవు. అంటుకొని కూడ యుండవు. మరి కొలకుల ద్వారా ప్రక్కలకు జాలువారుతాయి.

ఆ అక్షిపురుషుడే బ్రహ్మ. "సకల కల్యాణ గుణాశ్రయం - సత్యసంకల్పం." ఆ పురుషుణ్ణి యుపాసించిన వారిక్కూడ తత్క్రతున్యాయం చేత ఆ గుణాలు సిద్ధిస్తాయి. ఉపాసకుడికి ఉపాస్యలక్షణాలు సమకూరుతాయి

(ఉపాసకులకు శిష్టాచారముండుట శుభఫలదాయకము)

శోభనాలు సమకూరుతాయి. కోరికమేరకు సకలలోక వ్యాప్త దీప్తిమద్వి గ్రహయుక్తత్వం సంప్రాప్తిస్తుంది.

పుత్రాదులు శవదహనాది సంస్కారాలు చెయ్యకపోయినా, ఉపాసకుడు అర్చిరాది గతినే పొందుతాడు. అష్టగుణావిర్భావమేర్పడుతుంది.

ఉపకోసల విద్యాంగభూత అగ్నివిద్యోపాసన వలన అక్షిపురుషోపాసనం కావించి అర్చిరాది మార్గంలో బ్రహ్మను చేరి సుఖానుభవాన్ని పొందుతాడు ఉపాసకుడు.

"ఉపాసకుడు" అని ఈ ఉపమన్యువు, ఉపకోసలుని కథలు, స్పృహణీవర్తన గల శిష్యయోగ్యతాలక్షణాలివి

ఇట్టి బ్రహ్మవిద్యను **ఆదిని** పరమేశ్వరుడు స్వాంశభూతయైన పరాశక్తికి ఉపదేశించెను. - పరాశక్తివలన రుద్ర విష్ణువు బ్రహ్మలకు పరంపరగాను - అటులనే బ్రహ్మ వలన సనకాదులకు, వ్యాసాదులకు, క్రమంగా శ్రీశంకరాచార్యాది స్వస్వగురు పరంపరగా విస్తరించినది. వీరందరును జీవన్ముక్తులై బ్రహ్మత్వమును పొందిరి.

ఇట్లు కామ కలాసూత్రములందు శ్రీవిద్యాగురుపరంపర తెలియుచున్నది. ఇట్టి సులభమైన బ్రహ్మ విద్యను మన పూర్వాచార్యులగు శ్రీశంకరాచార్య విద్యారణ్యాచార్యులు మొదలగు శిష్టజనుల ఆచరణలో నుండినది బ్రహ్మవిద్య -

సమయాచారమందు గురుపరంపర బ్రహ్మవిద్య యిట్లు కొనసాగినది. పై భావరూప శ్లోకము అవి -

శ్లో॥ ప్రకాశరూపం శివమాది నాథం పరాంబికాం శంకరమాది దేవమ్,
నారాయణం పద్మభువం వశిష్ఠం శక్తించ తత్పుత్ర పరాశరంచ
వ్యాసం శుకం గౌడ పదం మహాంతం గోవింద యోగీంద్ర మథాస్య శిష్యమ్
శ్రీశంకరాచార్య మథాస్య పద్మపాదంచ హస్తామలకం చ శిష్యమ్
తంతోటకం వార్తిక కారమన్యానస్మద్గురూన్ సంతత మానతోఽస్మి ॥

★★★

## గురు - సూత్రములు

"అధ్యాపితా యే గురుం వాద్రియంతే విప్రావాచ మనసా కర్మణావ",

ఉపదేశింప బడిన గురువును త్రికరణ శుద్ధిగా అనగా మనసా, వాచా, కర్మణా నాదరించవలెను.

★★★

"గురోరధికః కశ్చిత్ త్రిషులోకేషు విద్యతే" -

గురువుకన్న అధికుడు ముల్లోకముల యందును లేదు.

# 55. బ్రహ్మ(వైశ్వానర) విద్య

విద్యనర్థించే వాడు "విద్యార్థి" అనబడును, అది యే విద్యయైనను సరే! ఆ విద్యార్థి విద్యనర్థించే వేళలో తన అహంకారాన్ని వదలి యుండిననే విద్యాభ్యాసమున కర్హుడు.

"ఛాందోగ్యోపనిషత్తు" పంచమాధ్యాయంలోనున్న వైశ్వానర విద్యప్రస్తావం యిది.

"ప్రాచీన శీలుడు, సత్యయజ్ఞుడు, ఇంద్రద్యుమ్నుడు, జనుడు, బుడిలుడు" అను నీ ఐదుగురు నొకచోట చేరి, యిట్లు చర్చించుకొన్నారు.

–"మనలో ఆత్మగా నుంటూ మనస్సునునియమిస్తున్న బ్రహ్మ ఏది?" –అని.

వారిచర్చయొక కొలిక్కిరాకపోగా, "అరుణ పుత్రుడైన 'ఉద్దాలకుడు' వైశ్వానరుణ్ణి ఆత్మగానుపాసిస్తున్నాడు కదా! ఆయనీ కీవిషయం తెలిసియుంటుంది. అతనిని చేరి అడిగి తెలుసుకొందాం" అని నిర్ధారించుకొనిరి. అటులే ఉద్దాలకునిని చేరిరి.

తాము వచ్చిన కారణం ఉద్ధాలకునితో చెప్పిరి. అతడు వారితో – "ఆత్మభూతమైన వైశ్వానర విద్యా స్వరూపాన్ని గురించి పరిపూర్ణంగా, నిశ్శంకగా వివరించే శక్తి నాకు లేదు. కనుక –

"కేకయరాజు అశ్వపతి" ఈ వైశ్వానరవిద్యాతత్త్వాన్ని యెరింగి, చక్కగానుపాసిస్తున్నట్లు విన్నాను. మనమంతాకలిసి ఆ రాజును చేరుదాం, సందేహం తీర్చుకొందాము" అన్నాడు. వారును సరేనన్నారు.

ఉద్దాలకుడితో కలిసి ఆ ఆరుగురును అశ్వపతిని చేరిరి. ఆ రాజు వచ్చిన ఋషులను విడివిడిగా భృత్య, పురోహితులతో అతిథి సత్కారాలు చేయించాడు. వారు సద్బ్రాహ్మణ గృహస్థులు కనుక.

ఊరట చెందిన తదుపరి, వారితో అశ్వపతి యిట్లన్నాడు. "పూజ్యులారా! నా రాజ్యంలో దొంగలు, ఈతిబాధకలవారు లేరు. మద్యపానీయులు లేరు. అవకాశం యుండి ఆహితాగ్నులు కానివారు, వేదాధ్యయనం చేయనివారు, వ్యభిచారులు, వ్యభిచారిణులు మొదలైన వారులేరు. అట్లాంటి వారి పాపపుడబ్బు నన్ను చేరటంలేదు. అందుచేత. నానుండి ప్రతిగ్రహించటానికి ఏదైననూ సరే, మీరేలాంటి సందేహమక్కరలేదు – అదియునూ గాక, త్వరలోనే నేనోయాగం చేయతలపెట్టాను. ఆ యాగంలో నొక్కొ ఋత్విక్కునకు నివ్వాలనుకొన్న సంభావన మీకును సమర్పిస్తాను. అందాకా, తమరు మా ఆతిథ్యాన్ని స్వీకరిస్తూండండి" – అన్నాడు.

అది విని వారు "రాజా! వచ్చిన వారి ప్రయోజనం గుర్తించి, అదినెరవేర్చి పంపటం ధర్మం. కావున మేమొక ప్రయోజనం కోరి వచ్చితిమి. అదియే "వైశ్వానర విద్యాతత్త్వాన్ని" గురించి మీ నుండి తెలుసుకోవాలని యుంది. నువ్వు వైశ్వానరోపాసనం చేస్తున్నావుకదా! దానిని మాకుపదేశింపుము. మరేమి మాకక్కరలేదు. నీవు చూపిన ఔదార్యానికి, ఆతిథ్యానికి కృతజ్ఞులం" అన్నారు.

అది వినిన రాజు, వెంటనే – "రేప్రొద్దున మీకు సమాధానం చెపుతానన్నా"డు.

"బ్రహ్మ విద్య, వైశ్వానరవిద్య" అట్టిది గ్రహించటానికీ, ఉపదేశించటానికీ వర్ణాధిక్యన్యూనత్వాలు అడ్డొస్తాయా? లేక బ్రహ్మవిద్యాగ్రహణాభినివేశమే నిలుస్తుందా? అనుకొన్నాడేమో అశ్వపతి యూ. ఎందుకనగా?

సమిత్పాణులై శ్రోత్రియుడై బ్రహ్మనిష్ఠుణ్ణి ఉపసదనం కావించాలి. కాని వీరు నన్ను శిష్యులుగా చేరి, బ్రహ్మవిద్యనపేక్షించినారు. బ్రహ్మవిద్యపొందుటకు నియమాన్ని చక్కగా పాటిస్తూన్న ఈ ఆరుగురును మహాశాలురు, మహాశ్రోత్రియులు, సద్బ్రాహ్మణులు అయియుండి ఆ అహంకారాన్ని పక్కన నెట్టి సమిద్భారహస్తులుగా, తమకంటే తక్కువజాతి క్షత్రియుడనైన నన్ను విద్యార్థులుగా నుపపత్తి కావించారు.

అట్టివారి నియమపాలనాభినివేశాన్ని, నిరహంకారితను, విద్యాజిజ్ఞాసను చూచి, అశ్వపతి చాలా సంతోషించెను. శాస్త్రమెరిగినవాడు కనుక, దాన్ని పాటించే బుద్ధి కలవాడు కూడ. వారు తెచ్చిన సమిధాదులను స్వీకరించకుండా శుశ్రూషా నిబంధనాన్ని అంగీకరించకుండా, వారికా విద్యను నుపదేశించడానికి పూనుకొన్నాడు. ముందుగా నావిద్యగూర్చి వారితో తెలిసిన దేమిటని ప్రశ్నించాడు.

ఒక్కొక్కరు యిట్లు, తమకు తెలిసినది చెప్పిరి. మొదట ఔపమన్యుడిట్లు తానుపాసిస్తున్నరీతిని పలికెను. నేను, "ద్యులోకాన్ని" వైశ్వానర స్వరూపంగా నుపాసిస్తున్నానన్నా"డు.

"బాగుంది, అయితే ద్యులోకం మాత్రమే వైశ్వానరుడు కాదు. అది అపరిచ్ఛిన్నం. వైశ్వానరునకు మూర్ధావయం మాత్రమే." అన్నాడు అశ్వపతి వెంటనే. సత్యయజ్ఞా! నీయుపాసనాక్రమం ఏమిటయ్యా? అని ప్రశ్నించగా –

అతడు, "నేను ఆదిత్యుణ్ణి" వైశ్వానరుడుగా నుపాసిస్తున్నానన్నా"డు.

అందులకు రాజు సంతోషించి, "ఆదిత్యుడు వైశ్వానరుడు కాదు. అతడు చక్షుర్భూతుడు. ఏకాంశమందు పూర్ణతాబుద్ధితో నుపాసిస్తున్నావు బాగుంది."

ఇంద్రద్యుమ్నా! నువెలా ఉపాసిస్తున్నావు?" అడిగాడు అశ్వపతి.

"స్వామీ! "వాయువును" వైశ్వానరుణ్ణిగానుపాసిస్తున్నానన్నా"డు.

అది విని రాజు, "కానీ, వాయువునూ వైశ్వానరుడు కాదయ్యా – అతనికది ప్రాణం మాత్రమే" అన్నాడు.

"జనా! నీవెట్లు ఉపాసిస్తున్నావయ్యా?" అని అశ్వపతి అడుగగా – "ఆకాశాన్ని" వైశ్వానరుడిగా నుపాసిస్తున్నానన్నాడు. అతడు – అందులకు రాజు సంతోషించి, "ఆకాశం" అతనికది మధ్యకాయం మాత్రమే" అన్నాడు రాజు.

"బుడిల స్వామీ! తమరెట్లు ఉపాసిస్తున్నారు?" అని అశ్వపతి ప్రశ్నించగా, నతడు "జలాన్ని" వైశ్వానరుడిగా నుపాసిస్తున్నానన్నాడు.

"బాగుంది. జలమే వైశ్వానరుడిగా భావించరాదు. అది ఆత్మకు మూత్రస్థానమే" అన్నాడు రాజు.

అయ్యా ఉద్దాలకా! మీరెట్లుపాసిస్తున్నారు? అని ప్రశ్నించాడు రాజు. "పృథ్వీ"ని వైశ్వానరుడిగానుపాసిస్తునానన్నాడతడు.

మంచిదే, పృథ్వీ ఆత్మకు పాదస్థానీయం మాత్రమే. కాని వైశ్వానరుడిగా భావించుటెట్లు? అని అశ్వపతి పలికి, వారితో "మీరు 'ఆత్మ' అవయవాలను, ఆత్మ అవయవిగా బావించుటెట్లు? మరియు, ఉపాసక శరీరంలో నాయాస్థానాలను ఉపాసించాలి. ఉపాసకుని మూర్ధే పరమాత్మకు మూర్ధభూతమైన ద్యులోకం.

అటులే, ఉపాసకుని 'చక్షువు' పరమాత్మచక్షురూపమైనది ఆదిత్యలోకం. అటులే ప్రాణ వాయువు పరమాత్మప్రాణం. 'ఆకాశం' పరమాత్మ మధ్యకాయం. 'జలం' పరమాత్మకు మూత్రస్థానం. అటులే 'పృథ్వీ' పరమాత్మకు పాదాల"ని చెప్పుచూ, మరల నిట్లనెను.

"సర్వాంతర్యామియైన వైశ్వానరాత్మకు ద్యులోకం శిరస్సు, సూర్యుడు నేత్రమ"ని పలికెను. మరియు వారితో –

"మీరిట్లు విడివిడిగా భావిస్తూ ఉపాసించుటకన్నా, సమిష్టిగా భావించి యుపాసించినచో వారు సర్వభూత సర్వాంతరవర్తియగు బ్రహ్మను పొందుతారు.

వైశ్వానరాత్మకు ఉపాసకుడు తనవక్షస్థలాన్ని అగ్నిగుండంవేదిని గావించుకొని, రొమ్ము, వెంట్రుకలను దర్భలుగా భావించి, పంచప్రాణాహుతులతో కర్మత్వం పరికల్పించి, త్రైలోక్యశరీరుడైన పరమాత్మను వైశ్వానర భూతాగ్నిగా శరీరాన్ని భావించుకొని యుపాసించాలి." అని, అశ్వపతి ఉపదేశించాడు వారికి.

కావున, ప్రాణాహుతులనట్లా తీసుకొంటుంటే వారి, వారి పాపాలు నిప్పురవ్వపడ్డ

మంజుగడ్డి పీచులా భస్మం అయిపోతాయి. అప్పుడుపాసకుడు సర్వలోకాల్లోనూ, సర్వభూతాలలోనూ, సర్వాత్మలలో భోగ్యవస్తువుగా నున్న పరమాత్మను పొందుతాడు.

కావున గీతాచార్యుడగు శ్రీకృష్ణపరమాత్మ "గీత"లో

శ్లో॥ అహంవైశ్వానరో భూత్వాప్రాణినాం దేహమాశ్రితః ।
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నంచతుర్విధం ॥

అని అర్జునునకు తన వైశ్వానరత్వం గూర్చి విశదపరిచెను.

ఏ గురువైనను శిష్యునకు నుపదేశించుటలో నతని ఉపాసనామార్గమున ప్రవేశపెట్టి, శ్రీమన్నారాయణుని భక్తి తత్వముగా ధ్యానించునట్లు చేయాలి. అదియే యోగము. అట్టి గురువులందరూ పూజ్యులు. వంద్యులే. అయినా వారిలో పురాణప్రవచకులు ఉత్తమ గురువులనబడుదురని, నారద పురాణ" ప్రవచనము.

"తత్త్వం గురు సమంనాస్తి. నదేవః కేశవాత్పరః

గురుసమమగు తత్త్వం, కేశవుని మించిన దైవం లేదు.

మరియు, "అగ్ని శుశ్రూషవశ్చైవ గురు శుశ్రూషకాస్తథా."

"అగ్ని మరియు గురువులను" సేవించువారలు సంసారమున బడరు. అనగా వారికి పునర్జన్మయే యుండదు.

కావున, గురువును ఉపాసనామార్గమున శుశ్రూష యొనర్చిన, ప్రార్థించినా ఆ గురుతత్త్వం శిష్యుని హృదయమున శాశ్వతంగా నాటుకొనిపోవును.

శ్లో॥ గురు శిష్యపదే స్థిత్వా స్వయమేవ సదాశివః ।
ప్రశ్నోత్తర పరైర్వాక్యై స్తంత్రం సమవతారయత్ ॥

★★★

## గురు - సూత్రం

"తేన న గురుర్భో జనీయ స్తథైవ చాన్నం న భునక్తి శృతం తత్" -

గురువునకు భోజనము పెట్టకున్న, తాను నేర్చిన వేద విద్య పొందదు.

★★★

# 56. గురు వాక్యపరిపాలకుడు

## (స్వామి అద్భుతానంద)

శ్రీరామకృష్ణ పరమహంస ప్రత్యక్ష శిష్యుల్లో "లాటూ మహారాజ్"గా పిలువబడే వారి సన్న్యాస నామధేయం స్వామి అద్భుతానంద. వీరు నిజమైన యోగి.

శ్రీరామకృష్ణులు భావాతీత స్థితిలో నున్నపుడు తన శిష్యుని నుద్దేశించి యిలా అన్నారు. "వేద వేదాంతాలోనున్న సత్యాలు ఒకరోజు నీ పెదవుల నుండి వెలువడుతాయి. ఆ మాటలే అక్షరాలా సత్యమైనాయి. నిజానికి ఆయన షట్ శాస్త్రాలు వ్యాఖ్యానంగా పఠించనూ లేదు. యజ్ఞాది యాగాలను నిర్వహించనూ లేదు. "జ్ఞానాదేవతు కైవల్యమ్" - "ఆత్మజ్ఞానం తప్పయితర యుపాయాల వలన మోక్ష ప్రాప్తి లేదు". అన్న శృతి వాక్యాన్ని అనుభవం ద్వారా నిరూపించి చూపించారు.

ఆ "స్వామి అద్భుతానంద" బీహార్ రాష్ట్రంలోని ఛాప్రాజిల్లాలో కుగ్రామంలో జన్మించారు. ఏ విధమైన పాఠశాల విద్యలేని వీరికి, తన గురువైన శ్రీరామ కృష్ణుల శిక్షణే ఆయన్ను బ్రహ్మజ్ఞానిగా చేసింది. గురువాక్యాలపై ఆయనకెంతటి శ్రద్ధావిశ్వాసాలో చెప్పనలవి కాదు.

దక్షిణేశ్వరంలో నొకసారి శ్రీరామకృష్ణులు లాటూతో నిలా అన్నారు - "మద్యం, కామినీ, కాంచనాల విషయంలో జాగ్రత్తగా నుండు. ఇవి ఆధ్యాత్మిక మార్గానికి అడ్డుగోడలు వంటివి". అప్పటి నుంచి తాను రోజూవెళ్ళే మార్గంలో సారాయిదుకాణం యున్నకారణంగా 8 మైళ్ళు దూరం చుట్టూ తిరిగి నడిచి కలకత్తాకు చేరుకొనే వాడు. ఈ విషయం శ్రీరామకృష్ణులకు తెలిసి లాటూతో యిలా అన్నాడు.

"నిన్ను సారాయి వాసన చూడొద్దు అన్నాను గాని, ఆ దుకాణం యున్న దారిలోపోకూడదని చెప్పలేదు కదా! ఒకవేళ నీకు ఏదైన హాని కలుగబోతుంటే, (తన దేహాన్ని చూపిస్తూ) దీన్ని గుర్తు తెచ్చుకో, నిన్నెటువంటి మత్తు మందు కలతపెట్టదు, పెట్టలేదు".

లాటూమహారాజ్ దక్షిణేశ్వరంలో, శ్రీరామకృష్ణులకు నిరంతరం సేవచెయ్యడంతోపాటు, గురుదేవులపట్ల పరిపూర్ణ విధేయత కలిగి యుండేలా తన జీవన విధానాన్ని మలచుకొని ఆధ్యాత్మిక జీవితానికి పునాదిని వేసుకొన్నారు.

ఒకసారి దక్షిణేశ్వరంలో ధ్యానానికి కూర్చోవలసిన సాయం సంధ్యవేళ లాటూ నిద్రపోతుండడం చూసి శ్రీరామకృష్ణులు అతణ్ణి లేపి, "నువ్వు ధ్యానికి వెచ్చించవలసిన

సమయాన్ని నిద్రకు యుపయోగిస్తే, ఇంకెప్పుడు నువ్వు దైవదర్శనం పొందుతావ్? రాత్రి ఎప్పుడు గడిచిందో తెలియనంత తీవ్రతతో ధ్యానం చేయాలి. ఇట్టి శుభ సమయంలో నీకు నిద్రవస్తోంది. నువ్వు యిక్కడకు వచ్చింది నిద్రపోవడానికా?" అన్నారు. అంతే! గురుదేవులు అన్నమాటలు లాటూ మనస్సులో బలంగా నాటుకొన్నాయి. అంతే! గురుదేవులు అన్నమాటలు లాటూ మనస్సులో నాటుకొన్నప్పటి నుంచి యేనాడు కూడా ఆయన రాత్రి పూట నిద్రపోలేదు. రాత్రంతా యిక ధ్యానంతో, ప్రార్థనలతోనే గడిపేవారు. దాన్ని తన జీవన కాలంలో అట్టిదే ఆచరణలో పెట్టి చూపించారు లాటూ.

ఆధ్యాత్మిక జీవితంలో ఆయన రాజీలేని పద్ధతి, ఈ క్రింది సంఘటన ద్వారా మనకు బాగా అవగతమౌతుంది. శ్రీరామకృష్ణులు మహా సమాధి అనంతరం బాలానగర్ మఠంలో నున్నపుడు, ఆయన తీవ్ర అనారోగ్యానికి గురి అయ్యారు. డాక్టర్లు కొద్దిరోజులపాటు విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు.

ఒకరోజు సాయం సంధ్యాసమయంలో అక్కడున్న స్వామిని పిలిచి, "నన్ను కూర్చోబెట్టు ధ్యానం చేయాలి" అన్నారు. అప్పుడు అక్కడే యున్న శారదానందస్వామి అనునతడు లాటూతో, "వద్దు లాటూ, డాక్టర్లూ గురుదేవులను విశ్రాంతి తీసుకోమని చెప్పారు కదా!" అన్నారు. కానీ, లాటూ వెంటనే "గురుదేవులు చెప్పినది చేయాలి. మీరు కూడ నాకిలా సాయం చేస్తారా! గురుదేవులనుపైకి లేపడానికి, లేదా! నేను ఆ మహావీరుణ్ణి (హనుమంతుణ్ణి) శరణువేడుతాను", అన్నారు. చేసేది లేక శారదానంద స్వామియుతోడు కాగా, ఆయన్ను కూర్చో పెట్టారు. ఇదే గురువాక్యాలపై లాటూకున్న భక్తి.

ఒక రోజు దక్షిణేశ్వరంలో లాటూ, ఒక వ్యక్తి (భక్తుడు) ప్రవర్తన సరిగా లేనందున తీవ్రముగా మందలించారు. అదిగమనించిన శ్రీరామకృష్ణులు లాటూతో, నాయనా! వారంతా సంసారంతో కష్ట నష్టాలననుభవిస్తూ కాస్సేపు మనశ్శాంతి కోసం ఇక్కడకొస్తారు. అందుచేత భక్తులతో కటువుగా మాట్లాడడం మంచిది కాదు. వారికి బాధ కలిగించే విధంగా నెప్పుడూ మాట్లాడకు. రేపు ఆ భక్తుని యింటికి వెళ్ళి క్షమాపణ కోరు. ఆ మాటతో లాటూ అలానే చేశారు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత, "ఆ భక్తుడికి నా నమస్కారాలు తెలియజేశావా" అన్నారు శ్రీరామకృష్ణులు. "లేదు అని, చెప్పగానే "వెళ్ళి తెలియ జేసిరా" అన్నారు. అటులే, లాటూ వెళ్ళి గురుదేవులు చెప్పిన విధంగా తెలియజేసి వచ్చాడు. అప్పుడు ఆ భక్తుడు ఏడ్వటం చూసి లాటూ మనస్సు చలించిపోయింది. అతడు తిరిగి వచ్చినపుడు గురుదేవులు ఇప్పుడు నీ తప్పు క్షమించబడింది అన్నారు.

"యస్యదేవే పరా భక్తిః యథాదేవే తథాగురౌ,
తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః

ప్రకాశంతే మహాత్మన" ఇతి (శ్వేతరోపనిషత్)

భగవంతుని యందున్న పరమ భక్తివలె, గురువు నందు పరమభక్తి కలిగిన మహాత్మునకు మాత్రమే ఈ సత్యాలన్నీ ప్రకాశిస్తాయి. అని భావం.

ఇట్లు శ్రీరామకృష్ణులపై స్వామి అద్భుతానందునికున్న శ్రద్ధా పరిపూర్ణ విశ్వాసాలు ఆయన్ను ఉన్నత ఆధ్యాత్మిక స్థాయికి తీసుకొని పోయాయి. ఆయన్ను శ్రీరామ కృష్ణుల శిష్యుల్లోనొక విశిష్ఠ వ్యక్తిగా చేశాయి.

★★★

## గురు - సూత్రములు

శిక్షించుట, శిక్ష గరపుట రెండూ గురువునకున్న విడదీయరాని అంశాలు.

★★★

సర్వం గురు(వు) మయం

★★★

గురునకు శరణాగతిగా నుండుటయే శిష్యుని కర్తవ్యం

★★★

తాననుభవించిన బ్రహ్మ పదార్థమును ఇతరులకిచ్చు ఆచార్యుడు గురుదేవుడు. గురువునకంతటి స్థానము సముచితమే.

★★★

గుణశీలుడైన శిష్యునకే గురు కృప యుండును.

★★★

సద్గురు కటాక్ష లేశ విశేషేణ సర్వసిద్ధయ స్సధ్యంతి సర్వబంధాః ప్రవివశ్యంతి. శ్రేయో విఘ్నాస్సర్వే ప్రళయం యాంతి, సర్వాణి శ్రేయాంసి స్వయమేవాయాంతి.

భా: సద్గురు కటాక్షమునపేక్షించుటతో సర్వసిద్ధులు సిద్ధించును. సర్వబంధములు నశించును. శ్రేయోవిఘ్నము లన్నియు నశించి, సర్వశ్రేయస్సులే వాటంతటవే వచ్చును.

# 57. దేహాభిమానమే సృష్టిలో పనికి మాలినది

"చదువులలో సారమిదే" అనే సామెతను ప్రహ్లాదుడు తండ్రియగు హిరణ్యకశిపుడు అడిగిన ప్రశ్నల సందర్భమున పలికినదిది పోతన భాగవతమున నున్న ఘట్టము.

"ప్రహ్లాదా! గురువుల వద్ద నెట్టి విద్య నేర్చితివి?" అని ప్రశ్నించిన, "తండ్రీ! చదువులలో సారమెల్ల చదివితి తండ్రి" యని సమాధానమిచ్చెను. అయితే, ప్రహ్లాదుడు గురువుల వద్ద నేర్చిన విద్యకన్న, ఆతడు నేర్చిన విద్య స్వయం పుట్టుకతో వచ్చిన విద్య గొప్పది. అదియే "ఆత్మజ్ఞాన విద్య" - అట్టిదొక ఉదాహరణగా నీచిన్నకథ -

ఒక శిష్యుడు గురువువద్ద విద్యాభ్యాసం పూర్తిచేసి తుదకు, వెళ్ళేటప్పుడు గురుదక్షిణగా నేమివ్వాలని గురువు నర్థించాడు కానీ, గురువుగారు ఏమీ వలదన్నాడు ఏదైనా తీసుకోవాలని బలవంతపెట్టాడు శిష్యుడు. "అయితే, సృష్టిలో అన్నిటి కన్నా పనికిమాలినది గురుదక్షిణగా నిమ్ము" అన్నాడు గురువు.

శిష్యుడు ఆలోచించి, కొంతమట్టి తీసి గురువు గారి దోసిట్లో పోశాడు. ఆ మట్టిని చూచి, "నాయనా! ఇది యెలా పనికి మాలినది? మట్టి మనందరి పుట్టినిల్లు. మరియు పంటలు పండుటకుపయోగపడు నదీ మట్టియే అన్నము పెట్టేదిగా నీవు గుర్తించలేదా!" అని పలుకగా, శిష్యుడు మరల ఆలోచించి, ఒక రాయిని గురువుగారి చేతిలో పెట్టాడు. ఆ రాయిని చేతబట్టుకొని, గురువు యిలా అన్నాడు. "నాయనా! ఈ రాయియే గుడిలోని దేవుడి విగ్రహం కదా! నదిలో నుండి గుడి మెట్లక్కడాని కుపయోగపడు నదీ రాయియే కదా!" అని పలుకగా- ఇక యింతకన్నా పనికిమాలినదేమి యుంటుందనీ, శిష్యునకు తోచక, తుదకు ఆలోచించి ఆలోచించి, తను నేర్చిన విద్యలోని సారము స్ఫురణకురాగా, ఈ దేహమే సృష్టిలో పనికి మాలినదని, అట్టి దేహాభిమానమే కడునీచమైనదని, అదియే అహంకారమునకు హేతువని, తలంచెను.

వెంటనే గురువు గారికి, తన దేహాన్నే గురుదక్షిణగా సమర్పించ దలచితినని త్రికరణ శుద్ధిగా పలుకగా, గురువుగారు మిక్కిలి సంతసించి, యిట్లనెను.

"నాయనా! నావద్ద విద్య నేర్చిన నీవు, నేర్పినందులకు నేను, ఇట్లు యిరువురము ధన్యులము, కృతార్థులము చదువులలో నున్నసారమిదే" అంటూ గురువుగారు ఆత్మానందంతో సంతృప్తి చెంది, ఆ శిష్యుని ఆత్మ జ్ఞానమునకు ఆనంద భాష్పములతో అక్కున చేర్చుకొని అభినందించెను.

★★★

# 58. కలిపురుషుడు - విద్యనభ్యసించుట

దశావతారములలో తుది అవతారముగా పరమాత్మ విష్ణుమూర్తి తన నిజమహిమగా జన్మించు యత్నమున శంభలమను నూరనుండు "విష్ణుయశుడ"ను బ్రాహ్మణుని, అతని ధర్మపత్ని "సుమతి" యందు విష్ణుయశస్సుగా వైష్ణవతేజమున ప్రవేశించగా నామె గర్భవతియయ్యెను. గ్రహనక్షత్ర తారారాశ్యాదులు తదధిష్ఠాన దేవతలు శుభస్థితినుండ గంధర్వులు గానములొనర్చు తరివాద్యములు మ్రోగుచుండ, పితృదేవతలును ఆనందముగా గంతులిడ, అప్సరసలాడుచుండ, "వైశాఖ శుక్లద్వాదశీ" తిథియందు సుమతి గర్భవాసమున "కల్కి పరమాత్మ" అవతరించెను. ఆ పుత్రునిగని తల్లిదండ్రులానంద భరితులైరి. అట్టి అవతారపురుషుని తమంత తాముగా చరణకమలములను సేవింప పుణ్యనదీనదసాగరములు ధరాధరాది స్థావర జంగమాత్మక ప్రకృతి భూతజాలము, మహర్షులు, దేవతలెల్లరానంద భరితులైరి. సర్వభూత కోటియు అనేక తీరులానందములనొందిరి.

సర్వులా బాలుని చూచి కలికాలుష్యము హరింపవచ్చిన వాడని గుర్తించి "కల్కి"యను పేరు పెట్టి డోలారోహణోత్సవము గావించిరి. తదుపరి, చూడా కర్మ చౌలాది సంస్కారములు యథావిధిని నిర్వర్తించి బ్రహ్మానందమొందిరి. శుక్లపక్ష చంద్రుని పగిది యాబాలుడు దినదినాభివృద్ధినొంది సర్వులకును చూడముచ్చట గొల్పుచుండెను.

విప్రసంఘము కూడ కల్కిని జూచి యెంతేని సంతోషించుచుండిరి. తండ్రి విష్ణుయశుడును వారి ఆదేశానుసారము కుమారునకు బ్రహ్మసంస్కారం (ఉపనయన మొనర్చి) యజ్ఞోపవీత ధారణమొనర్చెను. వేదమభ్యసింప తొలిదశలోనే ఆ బాలుడు తండ్రినిట్లు ప్రశ్నించెను.

తండ్రీ! వేదమననేమి? సావిత్రి యననేమి? లోకమునందే సూత్రముగా సంస్కరింపబడినవారు బ్రాహ్మణులుగా తెలియబడుదురు? అని.

తండ్రియిట్లు పలికెను -

నాయనా! హరివాక్కేవేదము. వేదమాతయే సావిత్రి. అదియే యజ్ఞ సూత్రము. అని ఆ ఉపనయన సంస్కారము వివరములన్నియు తెలిపెను. కాని, తన బంధువులగు విప్రుల అధోగతిని రూపుమాపుటకై, కల్కి భగవానుడు ధీరుడై, ధర్మపరుడై, సత్యవచనుడై నిక గురుకులవాసమొనర్చి విద్యనభ్యసింప మహేంద్ర పర్వతమందున్న భృగువంశీయుడగు జమదగ్ని తనయుడగు పరశురాముని ఆశ్రమమునకు జేరెను. బాలుని వినయవిధేయతలకు పరశురాముడు సంతసించి యిట్లనెను.

నాయనా! నీవిచట నీశాఖకు సంబంధించిన వేదమును శాస్త్రములను నభ్యసించుము. అదివిని, కల్కి మేనుపులకరింపగా నా పరశురామునకు సాష్టాంగ దండప్రణామంబొనర్చెను.

ఆ పరశురామునుండి వేదాధ్యయనమారంభించి, సాంగోపాంగముగానేర్చి, ధనుర్వేదమును. చతుష్షష్టి కళలను చక్కగానేర్చి, యాచార్యునకు చేతులు జోడించి నమస్కరిస్తూ యిట్లనెను.

ప్రభూ! దక్షిణ సమర్పించి మిమ్ము సంతుష్టుల జేయనాకు సర్వసిద్ధియునగు నది కోరుడన రాముడిట్లనియే -

నాయనా! నీవు సాక్షాద్విష్ణువవు - సర్వసమర్థుడవు. వేదవేదాంగవిద్యలు నానుండి, శివుని వలన నస్త్రవిద్యలు గ్రహించితివి. ఇకనీవు సింహళమందు పద్మాదేవి కెంతేని మిత్రమగు శుకమును (చిలుకను)గైకొని, ఆ పద్మాదేవిని వివాహమాడి దిగ్విజయము పొందుము - ధర్మదూరులను, మదాంధరాజులను మట్టుబెట్టుము. దేవాపిని, మీరుని భూమండలమున ప్రతిష్ఠించుము. సాధుపరిత్రాణము గావింపుము. దుష్టమారణములే నీవు నాకిచ్చు గురుదక్షిణలచే నేను సంతుష్టి నొందెదను. దానితో మేమెల్లరము యజ్ఞదాన తపఃకర్మ కార్యక్రమముల నెల్ల యధావిధిగా నొనర్చుకొందుము - అని పలికెను.

అదివిని, కల్కి అమ్మునివరునకు మిక్కిలిగా నమస్కరించి స్తుతించి సెలవుపొందెను. హృదయమున పరమశివునకు మ్రొక్కి తన స్తుతులతో మెప్పించి శంభల గ్రామము చేరెను.

★★★

## గురు - సూత్రములు

శ్రీ గురుని సన్నిహితత్వమే శిష్యుని చరితార్థము ఇక సేవాదులొనరించిన ఆ శిష్యుని వంశమూ చరితార్థము.

★★★

"గురువాక్యం కామధేనుర్నానుమానం కరోమ్యహం"

కామదాకామ ధుగ్యథా, కామదేనువుగా కోరికలు తీర్చును.

★★★

# 59. గురు, మిత్ర వాత్సల్యము

## (శ్రీకృష్ణ - కుచేలుని కథ)

"విద్యా" సహచర్యుల మిత్ర వాత్సల్యం, మరియు శిష్యులపట్ల గురువు వాత్సల్యమునకొక యుత్కృష్టమైన ఉదంతం. దృష్టాంతం. ద్రోణ ద్రుపదుల కథకు వ్యతిరేకం.

ద్వాపర యుగము నాటి చరిత్ర యిది. బాల్యమున శ్రీకృష్ణుడును, కుచేలుడను బ్రాహ్మణబాలుడు సాందీపుడను గురువు వద్ద సహాధ్యాయులు. ఇరువురును మిక్కిలి మక్కువతో గురువు యెడల భక్తి పూర్వకంగా నుండెడి వారలు. మిక్కిలి మిత్రత్వముగా మెలగెడివారు.

ఒకనాడు శ్రీకృష్ణుడు, కుచేలుడు, మరి కొందరు శిష్యులు కట్టెలకోసమై అడవికెళ్ళారు. కొందరు శిష్యులు ప్రొద్దుగ్రుంకకమునుపే ఆశ్రమం చేరుకొన్నారు. కాని కుచేలుడు, శ్రీకృష్ణుడు అడవిలో చిక్కుకొనగా, ఆ సాయంత్రం నుంచే కుండపోతగా వర్షమారంభమై కన్ను పొడుచు కొన్నా కనిపించని కటిక చీకటి కమ్ముకొనెను. ఆ అడవిలో వారిరువురే, చలికి వణకుతూ తుదకు నొక గుహలో నుండి, కుచేలుని ఉత్తరీయములో కట్టుకొనియున్న అటుకుల మూటచూచి. శ్రీకృష్ణుడు ఆకలిగా నున్నాడని, వెంటనే కుచేలుడు మూట విప్పి అటుకులందించెను. శ్రీకృష్ణుడు వాటిని తృప్తిగా తినెను. దారి బత్తెముగా తాను తెచ్చుకొన్న అటుకులు, ఆకలి యన్న మిత్రునకు సమర్పించడంలో కుచేలుడు బహు సంతృప్తి చెందాడు. వర్షం తగ్గుముఖం పట్టగా నిరువురు ఆశ్రమమునకు చేరిరి. గురువు సాందీపుడును వీరి రాకకై మిక్కిలి ఎదురు చూచుచుండెను. వారిరువురును తనను చేరగా మిక్కిలి సంతోషించెను. వారి వారి విద్యా భ్యాసానంతరం వాని నివాసములకు చేరుకొనిరి.

కొంతకాలమునకు శ్రీకృష్ణుడు ద్వారకలో వైభవోపేతుడై యుండగా, కుచేలుడు మాత్రము భార్య, బహు సంతానంతో దుర్భర దారిద్ర్యాన్నను భవిస్తున్నాడు. అయినా తన లేమికెన్నడు దుఃఖించక, కలిగినదానితో కాలక్షేపం చేస్తుండేవాడు. అతని భార్యకూడ మిక్కిలి అణుకువ కలది. ఆమెయు మిక్కిలి ఓరిమితో పాతివ్రత్య నియమములతో దైవ భక్తితో జీవనం సాగిస్తోంది.

కానియొక నాడు ఏమియును తినుటకు లభించకపోగా వారిరువురును ఉపవాసముండిరి. కాని పిల్లలు మాత్రము ఆకలియని అలమటించసాగిరి. ఇట్లు కొన్ని దినములు గడువగా కేవలం నీటితో ఆకలి తీర్చుకొనుచుండిరి.

ఇంతలో నొకనాడు కుచేలుని భార్యకు శ్రీకృష్ణుడు తన భర్తకు బాల్యమిత్రుడు కదా! యని గుర్తుకురాగా, వెంటనే భర్తను "శ్రీకృష్ణుని దర్శించి కొంత సహాయమర్థించమని

వేడెను. భార్యమాట కాదనలేక, కుచేలుడు బయలుదేరుటలో తన ఉత్తరీయమున నెక్కడో మిగిలిన కొన్ని అటుకులు మూట కట్టుకొని ద్వారకకు చేరెను. అచట ద్వారభటులు అడ్డగించినను, శ్రీకృష్ణుడు కుచేలుడు వచ్చినది తెలుసుకొని యెదురేగి ఆప్యాయంగా కౌగిట చేర్చుకొని, సగౌరవ మర్యాదలతో అంతఃపురమునకు గైకొని వెళ్ళెను. కుచేలుడును తన బాల్యమిత్రుడైన శ్రీకృష్ణుడిట్లు మిత్రవాత్సల్యము చూపుటలో చాలా ఆనందమొందెను.

వారిరువురును ఇష్టాగోష్టిలో మునిగిరి. కాని, కుచేలుడు మాత్రం తన లేమిని బయటపెట్టకపైకి సంతోషమును ప్రకటించు కొనుచుండెను.

గురుకుల విద్యాభ్యాస కాలంలో గడిపిన రోజులు, ఆడిన క్రీడలు గుర్తు తెచ్చుకొని నవ్వుకొనిరి. మన గురువు సాందీపుడు చూపిన ఆదరవాత్సల్యమును గుర్తు తెచ్చుకొనిరి. కట్టెల కోసమై వెళ్ళిన తాము పడిన పాట్లన్నియు తలంచుకొనిరి. మనము ఆశ్రమం చేరుకోగానే, అప్పటికే గురువు సాందీపుడు ఆందోళన పడుతూ, మనలను చూడగానే మిక్కిలి ప్రేమాదరములతో అక్కున చేర్చుకొని చూపిన వాత్సల్యమును గుర్తు జేసుకొనిరి. ఇట్లు బాల్య స్మృతులను, తమ గాఢమైన స్నేహ తత్త్వమును, గురు వాత్సల్యమును విడదీయరానివని ముచ్చటించుకొనుచు నవ్వుకొనిరి.

అంతలో శ్రీకృష్ణుడు ఆకలియని, కుచేలుడు తెచ్చిన మూటచూచెను. అవి అటుకులే, తనకై తెచ్చినవని, కుచేలుని మూట విప్పెను. కాని కుచేలుడు మాత్రం సంకోచంగా నసుగుతూ, వాటిని దాచయత్నించెను. అలనాడు అడవిలో అటుకుల సంగతి వేరు ఈనాడు శ్రీకృష్ణుడతివైభవోపేతంగా నుండడంతో, ఈ అటుకులెట్లు సమర్పించుటయా! యని సంకోచించుచుండెను. కాని శ్రీకృష్ణుడు కుచేలుని సందేహమును త్రోసిపుచ్చి, అటుకుల మూటవిప్పి యధేచ్ఛగా ఆరగించెను. కుచేలుడు నివ్వెరబోయెను. అంతే, కుచేలుని దారిద్ర్యం తొలగిపోయెను.

## ఇదియే మిత్ర, గురు వాత్సల్యమునకు తార్కాణం.

★★★

### గురు - సూత్రములు

"శ్రీగురోః కృపయా తత్రరోగ పీడాది నైవచ"

★★★

గురువు కోపము శిష్యుని ఆయుర్దాయ క్షీణము.

# 60. శ్రీకృష్ణార్జునుల (గురుశిష్య) సంబంధం

గురువుల యెడల భక్తి భావము. వినయ విధేయతలే సద్బోధకు మార్గము సుగమమగును.

**మహాభారతంలోని భగవద్గీత** యొక చిన్నఘట్టమైనను, అమోఘమైన **ఆధ్యాత్మికతను అందించిన ఘట్టమది.**

అర్జునుడు **తనమొరను అనగా తనకు** ఏర్పడిన మోహ తత్త్వమును ప్రథమాశ్వాసం 80వ శ్లోకమునుండి **మొదలు**కొని, రెండవ ఆశ్వాసములో మరల 5వ శ్లోకముననిట్లు తనకు గురువుల యెడల, మహానుభావులయెడలనున్న గౌరవభావము చాటుకొనెను.

శ్లో॥ గురూ నహత్వా హి మహానుభావాన్
శ్రేయో భోక్తుం భైక్ష్యమపీహలోకే ।
హత్వార్థ కామాంస్తు గురూనిహైవ
భుఞ్జీయ భోగాన్ రుధిర ప్రదిగ్ధాన్ ॥

భా: మహానుభావులైన గురువులను వధించక, ఈ లోకమునందు భిక్షాన్నమైనను భుజించుట శ్రేష్ఠము. వారిని వధించినచో అత్తరి వారి రక్తముతో తడిసిన ధన సంపదలనే (కామ్య భోగములనే) అనుభవింపవలసి యుండును. అని, పలుకుటలో "గురూన్ మహానుభావాన్" అనుచు, అర్జునుడు తన గురూత్వభావమునిట్లు వెల్లడించుటలో గురువుల యెడల, పెద్దలయెడల ఎంతగొప్ప గౌరవభావం కల్గియున్నాడో గ్రహించతగ్గది.

నిజముగా ఆలోచించిన గురువులు మహానీయులు, మహామనీషులు. అర్థకామములకు బహుదూరులు. వారు ప్రతియుగానికి ఆదర్శభూతులుగా, సంస్కృతీ చిహ్నములుగా, వారొనర్చిన త్యాగ జీవనమే తమ, (మన) వంటివారికి, పూర్వసనాతన ధర్మమాచరించు మార్గదర్శక గీటురాయివంటివారని గ్రహించతగ్గది. మరియు "సంస్కృతీ" అనే యుద్యానవనంలోని మహత్తర వికాస పుష్పాల వంటివారుగా" నుందురని కీర్తింపబడువారని అనేక ఉదాహరణములు కలవు.

అర్జునునిలో అజ్ఞానం, సంకుచితం, అహంభావం ఎన్నదగినవికావు, చర్చనీయాంశములు కావు. గురువుల యెడల తనకున్న ప్రేమాభిమానం, ఆదరం, గౌరవం, మన్ననే ప్రాధాన్యము.

అర్జునుడు క్షత్రియ రాజయినప్పటికినీ, ఎంతటి వీరుడైనప్పటికినీ, ఈ యుద్ధ

రంగమున తానాత్మజ్ఞాన శూన్యుడనైతినని యెంచినవాడై, చివరికెటుతోచక, తుదకు శ్రీకృష్ణునిని భగవానునిగా, సద్గురువుగా నెంచి, తన కాత్మజ్ఞానోపదేశమొనర్చి, భవిష్యత్ కర్తవ్యమును బోధించుమని నిట్లు ప్రార్థించెను.

శ్లో॥ కార్పణ్య దోషోపహత స్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మ సమ్మూఢ చేతాః ।
యచ్ఛ్రేయ స్స్యాన్నిశ్చితం బ్రూహితన్మే
శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ (2-7)

భా: "శ్రీకృష్ణా! నేను ఆత్మజ్ఞాన శూన్యతచే, ధర్మవిషయమున సందేహము కలిగి, ఏది శ్రేయస్కరమో, ఏది నిశ్చయమో తెలిసికొనలేకపోవుచున్నాను. అట్టిది నాకుపదేశింపుడు. నేను, నీకు శిష్యుడను, శరణుపొంది యున్న నన్ను, నీవు నిట్లొనర్చుమని శాసింపుడు." అని వేడెను. అనగా భగవానునకు శరణాగతుడయ్యెను. శరణాగతియే తన విపత్కర మానసిక పరిస్థితిని చక్కదిద్దగల సాధనమని, తాను శిష్యభావమును స్వీకరించి శ్రీకృష్ణుని గురుతుల్యుడుగా వేడెను.

శిష్యుడెంత వినయ భావము కలిగియుండెనో, గురువున కాతనిపై అంతంత ప్రీతి, ప్రేమ, వాత్సల్యం జనించుచుండును. కనుకనే, అర్జునుడు శ్రీకృష్ణుని గురువుగానెంచి భక్తి ప్రపత్తులద్వారా, శరణాగతిగా ఆత్మార్పణంతో తన శిష్య ధర్మమును పాటించెను. శ్రీకృష్ణమూర్తియు వెనువెంటనే తన గురు ధర్మమును పాటించెను. అనగా అర్జునుడి అహంకారము తొలగి శిష్యస్థానమును పొందెను, అని భావము.

"ఆత్మబుద్ధి సుఖంచైవ గురు బుద్ధి ర్విశిష్యతే "

అను ఆర్యోక్తిగా, శిష్యుడెంతటి ఆత్మబుద్ధి కలిగియుండినను, నేదేని తనమానసిక కలవరపాటును తొలగించు మహామనీషి, గురువు ఒక్కడే. ఆ గురువును నాశ్రయించి తన కున్న సందేహనివృత్తి మార్గము పొందుటకు యత్నించవలెను.

అట్టి గీతాశాస్త్రంలో (4వ అ. 1వ శ్లో॥ నుండి 3వ శ్లో॥ల వరకు) శ్రీకృష్ణ భగవానుడుపదేశించుటలో అర్జునుని సందేహనివృత్తికై, యీ గీతాయోగ శాస్త్రాన్ని తాను గురువుగా బోధించిన పరంపరను గూర్చియిట్లున్నది.

శ్లో॥ ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహ మవ్యయమ్ ।
వివస్వాన్ మనవేప్రాహమను రిక్ష్వాకనే ఽబ్రవీత్ ॥ - 1

శ్లో॥ ఏవం పరంపరా ప్రాప్తం ఇమం రాజర్షయో విదుః ।
సకాలే నేహమహతా యోగో నష్టః పరంతప ॥ - 2

శ్లో॥ స ఏవాయం మయాతేఽద్యయోగః ప్రోక్తః పురాతనః ।
భక్తోఽసిమే సఖాచేతి రహస్యం హ్యేత దుత్తమమ్ ॥ - 3

భా: వినశ్వరమైన ఈ యోగశాస్త్రాన్ని నేను మొదట సూర్యభగవానునికి చెప్పగా, **అతడు మానవపిత మనువునకు** జెప్పెను. ఆ మనువు ఇక్ష్వాకుల మహారాజునకు **బోధించెను. ఇటులీ ఉత్తమమైన శాస్త్రం (గీతను)** శిష్య శిష్యపరంపరద్వారా, **రాజర్షులు అవగతం చేసుకొన్నారు. కాని,** కాలక్రమంలో నాశిష్యపరంపర చెదిరిపోగా, **నిది (గీతాశాస్త్రం) వ్యాప్తి**లోకి లేక నశించునట్లుండినది

ఇప్పుడదే **శాస్త్ర**మును, నీవు నాకు మిత్రుడవని, భక్తుడవని నీకీ గీతాబోధ గరపితిని. ఇది దివ్యమైనదియును, రహస్యమైనదియును గ్రహించు. అని మరల, 18వ అ. 63వ శ్లో నిట్లు ఉగ్గడించెను.

శ్లో॥ ఇతి తే జ్ఞాన మాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మాయా ।
విమృశ్యైత దశేషేణ యధేచ్ఛసి తధాకురు ॥

ఈ విధముగా రహస్యములన్నిటికంటెను పరమరహస్యమైనట్టి జ్ఞానమును (గీతాశాస్త్రమును) నేను నీకు జెప్పితిని. దీనినంతను బాగుగ విచారణచేసి తదుపరి నీకెట్లిష్టమో - అట్లా చరింపుము" అని పలికి, తుదకు శ్రీకృష్ణభగవానుడు అర్జునునిపై తదుపరి కర్తవ్యము అతనికే వదలివేసెను. అయినను మరల హెచ్చరికగా, నిట్లని, తాను బోధించడం మానెను.

శ్లో॥ కచ్చిదేతచ్ఛ్రుతం పార్థత్వయైకాగ్రేణ చేతసా ।
కచ్చిదజ్ఞాన సమ్మోహః ప్రనష్టస్తే ధనంజయ ॥ (18-72)

ఓ అర్జునా ! నా యీబోధను నీవు ఏకాగ్రమనస్సుతో వింటివా? అజ్ఞాన జనితమగు నీయొక్క భ్రమ గీతబోధచే సంపూర్ణముగా నశించినదా? అని ప్రశ్నించడంతో - తన గురు ధర్మమును చాటుకొనినట్లయ్యెను.

నిజమే. ఉత్తమముడైన గురువు, వినయ సంపదగల శిష్యునకు తాను బోధించదలచినది బోధించును.

"బ్రూయాచ్ఛిష్యాయ భక్తాయ రహస్యమపిదేశికః",

అయినను తాను బోధించిన మంత్రరహస్యము వలన శిష్యుడు అజ్ఞానమును తొలగించు కొన్నాడా! లేదా! ప్రశ్నించడం గురువు బాధ్యత అందులకు -

అర్జునుడీ శ్లోకంతో శ్రీకృష్ణ పరమాత్మ గీతా బోధామృతమును గ్రోలి, విశ్వసించి,

అర్థంచేసుకొని, అంగీకరించినట్లుగా నిట్లు పలికెను.

శ్లో॥ నష్టమోహో స్మృతిర్లబ్ధా త్వత్ ప్రసాదాన్మయాచ్యుత ।
స్మితోఽస్మి గతసందేహః కరిష్యేవచనం తవ ॥ (18-73)

భా: నా అజ్ఞానం ఇప్పుడు తొలగింది. నీ యనుగ్రహంతో జ్ఞానాన్ని పొందితిని. నేనిప్పుడు స్థిరుణ్ణి. సంశయరహితుణ్ణి అయి నీయుపదేశం ప్రకారం చేయడానికి సిద్ధంగానున్నాను. అనగా, తన విద్యుక్తధర్మమును నెరవేర్చడానికి, అని అర్థము.

అర్జునుడిలా, మనం గూడ శ్రీకృష్ణుడి గీతామృతము గ్రోలి తరించవచ్చును. అందులకెందరో శ్రీకృష్ణుని వంటి ప్రతినిధులు, ఆధ్యాత్మికాచార్యులు లోకమును తరింపజేయుటకు వారివంతు వారు కృషి సల్పుచునేయున్నారు. శ్రీకృష్ణపరమాత్మ కేవలం ప్రామాణికాచార్యుడే అతని అనుగ్రహమున్నచో మనకట్టి ఆచార్యుడు లభించకపోడు సంకల్ప బలం చాలాగొప్పది. అభిలషించి యుండినచో అవశ్యంగా లభిస్తారు. అంతటి ఆచార్యుడు లభించాలన్న నిరంతర భక్తి తత్త్వంగా, అనన్యచింతనగా, త్రికరణశుద్ధిగా శ్రీకృష్ణనామాన్ని స్తుతిస్తూ, జిహ్వకు సార్థకత కలిగిస్తూండిన, ఆ జిహ్వకు శ్రీకృష్ణప్రసాదం అందితీరును అందులకతడు ధన్యుడునూ అగును.

అర్జునుడికి గీతాబోధన చేసిన శ్రీకృష్ణపరమాత్మ వేదాంత శాస్త్ర ప్రవీణుడని వేరే చెప్పనక్కరలేదు గీతాబోధన తన విద్యుక్తధర్మంగా, శోక సంవిగ్నమానసుడయిన అర్జునుని, చైతన్యవంతుని నొనర్చుటకై తాను అసామాన్యమైన సంక్లిష్ట పరిస్థితిని సంబాళించుటకు వేదసందేశ గీతా బోధామృత శక్తిని ధారపోశాడు. అట్టి వేదాలను బోధించిన గురువర్యుడు శ్రీకృష్ణపరమాత్మ "నభూతో నభవిష్యతి."

అది అసామాన్యమైన గురుబోధ దుర్భర సంఘర్షణకులోనైన అర్జునుడి మనస్సుకు స్పష్టత చేకూర్చి దానిని క్రమబద్ధం చేసి, ఏది ధర్మం, ఏది అధర్మమని తెలియజెప్పటానికి వేదాలనే ప్రమాణంగా నెన్నుకొన్నాడు శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణుడు వేదాలకు ప్రమాణం కాదు, వేదాలే కృష్ణుడికి ప్రమాణములు. ఇట్టి వేదాచార్య ప్రవరుడైన శ్రీకృష్ణుడికే భగవద్గీత వంటి నిగూఢ జ్ఞానాన్ని యొసగటానికర్హత కలదు.

అటులే, వేదాలను, ఉపనిషత్తులను క్షుణ్ణంగా అర్థం చేసుకొన్నటువంటి ఆచార్య పురుషులకును నిట్టి గీతను వ్యాఖ్యానించటానికంతే అర్హత ఉంది. గీతలోని లోతైన జ్ఞానం గురించి యిటువంటి పండితమ్మన్యులు వివరణలు, వ్యాఖ్యానాలు చేయటం మూలంగా, పామర జనులును వేదోపనిషత్తుల సారాన్ని, ధర్మ తత్త్వశాస్త్రాల మౌలిక సూత్రాలను చక్కగా అవగాహన మొనర్చుభాగ్యం పొందుచున్నారు. కావున, అది సర్వకాల సర్వావస్థలలో మానవాళి కంతటికిని పనికి వచ్చేబోధన – చైతన్యం, మెలకువ కలిగించు సద్గురు బోధన

అది. అత్యంతమైన క్లిష్టక్లేశాన్ని తరిమి కొట్టే గీతాబోధ గావించడంతో స్వధర్మమేమిటో గుర్తుకు రావడం అర్జునుడి వంటి శిష్యవరేణ్యుడికే సాధ్యం. అతడు అనన్య సామాన్య లక్షణ లక్షితుడు, శిష్యవరేణ్యుడు అని చెప్పటంలోను సందేహమక్కర్లేదు. కనుక, అట్టి ఉత్తమ శిష్యుడు, వేదాచార్యుడగు శ్రీకృష్ణ పరమాత్మ యిరువురును విశిష్టవ్యక్తులు. ఒక పరాక్రమమైన శిష్యునకు, మహిమోపేతమైన గురువు, అందించిన పౌరుషోపేతమైన సందేశం అసామాన్యమైన ఆధ్యాత్మిక జ్ఞాన తత్త్వబోధామృతం అది. తిరుగులేని ప్రామాణికత బోధ. సంశయ నివృత్తి చేసే తత్త్వసిద్ధాంతమది. సంబాళింపజేసిన శక్తిబోధ అది.

కావున, ఆ గీతాసుధ, "జ్ఞాన జ్యోతి" అర్జునుడి వంటి శిష్యుల హృదయాలలో వెలిగి, నిత్యసత్యం, కనుగొను అత్యంత కర్తవ్య నిర్వహణ లక్ష్యలక్షణమది. అదే అర్జునుని స్ఫూర్తి.

నిజమే. అర్జునుని అచంచల భక్తివిశ్వాసం సర్వులకు మార్గదర్శకం. గురువు సూచించే విషయంపై సంపూర్ణ విశ్వాసం కలిగియుండడం కూడా గురుభక్తియే -

ఒకరోజు శ్రీకృష్ణుడు అర్జునుడితో కలసి విహారంగా రథంలో వెళ్తున్నప్పుడు, శ్రీకృష్ణుడాకాశంపైకి చూస్తూ, అర్జునా! ఆకాశంలో నెగిరిపోతున్న ఆ అందమైన పావురాలు చూశావా! అన్నాడు. వెంటనే అర్జునుడును ఆకాశంపైకి తేరిపారచూసి, "అవును స్వామీ! నిజంగానే ఎంత అందమైన దృశ్యమిది" అన్నాడు తక్షణమే. అది నిజమో కాదో అనే విశ్లేషణ, విచక్షణ అర్జుననకసంగతం. శ్రీకృష్ణుడు చూచి చెప్పినదే నిజం, అనేవిశ్వాసం శ్రీకృష్ణునిపట్ల గురుభక్తి. సరే! శ్రీకృష్ణుడు మరల ఆకాశంకేసి చూచి "ఎంత వింత మిత్రమా! అవి పావురాలు కావు కావుగదా?" అన్నాడు. అర్జునుడును వాటిని చూచి, "అవును అవి పావురాలు కావుగదా?" అన్నాడు. శ్రీకృష్ణుడు అది విని తనలో తాను నవ్వుకున్నాడు.

**విషయమేమిటి** అంటే, అర్జునుని స్వామి భక్తి, విశ్వాసమట్టిది. ఇది 'ముఖస్తుతి' అనబడ**దు. శ్రీకృష్ణుని పలుకు**లపట్లగల విశ్వాసం. గురువుసూచించిన దానిని సమర్థించటం, గురువు సత్యనిష్ఠతను బలపరచటం.

★★★

## గురు - సూత్రములు

గురుభక్తి ద్వారానే భగవద్భక్తి ఏర్పడుతుంది.

★★★

'గురుభావం' గల శిష్యునకు 'గురుశక్తి' అలవడుతుంది.

# ౮1. గురువును మించిన శిష్యు(డు)లు

## శ్రీహనుమంతుని - యాజ్ఞవల్క్యుల శిష్యత్వం

మహామేధావి యయిన హనుమంతుడొకప్పుడు సూర్యుడి వద్దకు వెళ్ళి, "దివ్య స్వరూపా! లోకబాంధవా! సాక్షీభూతుడా! మీనుండి వేదశాస్త్రాల నేర్చుకోవాలని కుతూహలంగా నున్నది. దయచేసి ఆ విద్యలు నాకను గ్రహించు స్వామీ!" అంటూ ప్రార్థించెను.

అందులకా సూర్యభగవానుడు, "లోక సంచారిని, రాత్రనక, పగలనక నిరంతరం తిరుగుతూంటాను, కదా! నానుండి నీవెట్లు విద్యలు నేర్చుకొంటావు? ఏల వీలు పడుతుంది నాయనా?" - అన్నాడు.

ఈ ప్రశ్నకు హనుమంతుడు, "గ్రహపతీ! నేచెప్పేమాటలు ఆత్మస్తుతి అని మాత్రం తలంచకు, తూర్పు కొండపైన నొకపాదం, పడమటి కొండపై రెండవ పాదము పెట్టి, నీవెంబడే యుండి నేర్చుకోమంటే అలాచేస్తా, లేదా కదలుతున్ననీ రథం ముందరనే నేనడుస్తూ నేర్చుకొంటా" నన్నాడు.

అదివిని "ఎలా సాధ్యమని?" సూర్యుడడిగే సరికి, హనుమంతుడు విశ్వరూపము ధరించి ఉదయాద్రిపై నొకకాలు, అస్తగిరిపైన రెండోకాలు మోపి నిలబడ్డాడు. ఆ దృశ్యం చూచి ఆశ్చర్యచకితుడైనాడు భానుడు. ఆ వెంటనే "గురుస్థాన గౌరవం నాకిద్దామని వచ్చిన నీవంటి శిష్యుడు మహానుభావుడుగా తలంచెదను. అంతియే కాదు, నేను నీకుపదేశించ గలవాడినా! అయినా నువ్వు కోరివచ్చి, అర్థించి, అడిగినప్పుడు కాదనటం నావంటి వారి కుచితము కాదు. నీ విశ్వరూపంతో నాకు మహదానందంతోబాటు, ఆశ్చర్యం కూడ కలుగుచున్నది. నాకింత మహోన్నతమైన శిష్యుడు లభించినందుకు." అనుచూ, "అలాగనే తప్పక నేర్చుకో" - అని చెప్పి సంతోషంతో సమ్మతించాడు మార్తాండుడు.

అప్పుడా హనుమ నిజరూపం ధరించి యొక ఘడియకు తొమ్మిది లక్షల డెబ్బది రెండు వేయిల యోజనాల దూరం నడిచే సూర్యుని యెదుట సూక్ష్మదేహంతో నిలబడగా, ఆశ్చర్యం కలుగునట్లు తేజోవంతుడగు భానుడు,

శ్లో॥- "ఋగ్భిః పూర్వాహ్ణే దివ దేవ ఈయతే, యజుర్వేదే తిష్ఠతి మధ్యే అహ్నః ।
సామవేదే నాస్తమయే మహీయతే, వేదైరశూన్య స్త్రిభిరే సూర్యః ॥

పూర్వాహ్ణకాలములో ఋగ్వేద రూపుడై, మధ్యాహ్న వేళలో యజుర్వేద రూపుడై, సాయం సమయంలో సామవేద రూపుడై యుండుటచే వేదత్రయీ స్వరూపుడగు సూర్య భగవానుడు సంపూర్ణ వేదరూపుడే వేదము చెప్పుచున్నాడా! అన్నటుల

వెలుగొందు చుండెను. హనుమంతుడును కడుదీక్షతో, నిరసన వ్రతంతో గురువుకంటే ముందు నడుస్తూ, సూర్యుడివద్ద వేదశాస్త్రాలు, తొమ్మిది వ్యాకరణాలు సక్రమంగానేర్చి నవవ్యాకరణ పండితుడయ్యాడు. గురువును మించిన శిష్యుడయ్యాడు.

☆☆☆

అటులనే యాజ్ఞవల్క్యుడును సూర్యభగవానుని శిష్యుడు. కాని తొలుతనితడు వైశంపాయనుని నుండి యజుర్వేదాన్ని నేర్చుక్కున్నాడు. కొంతకాలానికి గురువుతో మాట మాటా తగాద వచ్చి, ఆ విద్యను అక్కడకక్కడే కక్కేసి, అటు పిదప సూర్యభగవానుణ్ణి చేరి ప్రార్థించాడు. సూర్యుడతనికి అశ్వరూపంతో వచ్చి యజుర్వేద యజుస్సుల నుపదేశించాడు. అట్లు యాజ్ఞవల్క్యుడును గురువును మించిన శిష్యుడయ్యాడు.

"ఆదిత్య హృదయం" కార్యసిద్ధికి కారణమైనట్లే యాజ్ఞవల్క్యుడును గురుస్తోత్రముగా "మార్తాండ స్తోత్రము" చేసెను. ఇది సద్యోజ్ఞాన సముపార్జనకు తోడ్పడుతుందని విశ్వాసము.

అందులో నొకటి-

"శ్రీమదాదిత్య శిష్యాయ యోగపట్టాభిషేకిణే ।
బ్రహ్మవిద్య ద్వరేణ్యాయ యాజ్ఞవల్క్యాయతేనమః ॥

"వైశంపాయనుడు" శ్రీ వ్యాస భగవానుని వలననే యజుర్వేదమునభ్యసించిన వాడైయుండగా, పూర్వమొకప్పుడు భరతవర్షమందలి మహర్షులు మేరుపర్వతముపై నొకచోట సమావేశమై యుండిరి. అట్టి సమావేశమునకు రానివారు "బ్రహ్మహత్యా పాతకము" వాత పడుదురనియు సమయనిబంధన గావించుకొనిరి. దైవవశమున నీవైశంపాయనుడు ఆ సభకు **పోలేకపోయెను. అంతట** ప్రమాదవశమున తన యడుగుల క్రింద పడిన బాలుడు తన మే**నల్లుడు అసువుల** బాసెను. కనుక వైశంపాయనుడు తన శిష్యులలో కొందరిని రావించి, **తపమొనర్చ** యాజ్ఞాపించెను. వారు తీవ్రతపము మొదలిడిరి. వీరే "చరకాధ్వర్యుల"ని పేరు వడిసిరి.

ఇట్లుండ, యాజ్ఞవల్క్యుడు తన గురువైన వైశంపాయనుని చేరి శిష్యుడుగా నిట్లనెను.

శ్లో॥ "యాజ్ఞవల్క్యశ్చ" తచ్ఛిష్యః అహహాభగవన్కియత్ ।
చరితే నాల్ప సారాణాంచరిష్యేఽహం సుదశ్చరం ॥

ఓ గురూత్తమా! అల్పజ్ఞులైన వీరి తపమేపాటిది? నేను అతిదుష్కరమైన

తపమునాచరింతును"ననెను.

ఇట్లు యాజ్ఞవల్క్యుడనిన మాటలనాలకించి వైశంపాయనుడు కోపించి యిట్లా జ్ఞాపించెను.

శ్లో॥ "ఇత్యుక్తో గురురప్యాహ కుపితో యాహ్యలంత్వయా ।
విప్రావ మంత్రా శిష్యేణ మదధీతం త్యజాశ్వితి ॥"

విప్రుల నవమానపరచు శిష్యునితో నాకు పనిలేదు. నీవు యిందుండి తొలగి పొమ్ము. నావద్ద నేర్చిన యజుర్వేదమును వదలిపెట్టుము" అని పలికెను.

అట్టి గురువు వాక్యముతో శక్తి సామర్థ్యం, ఆత్మ గౌరవము గల యాజ్ఞవల్క్యుడు, తాను గురువు నుండి నేర్చిన యాజుషమంత్రములను వమనము జేసి, అందుండి వెడలిపోయెను.

అవమన రూపముతో నున్న "యజూరాశిని" వైశంపాయనుని తక్కిన శిష్యులావేదమునందలి యాదరభావముతో దానినినెంచిరి. కాని, విప్రరూపముతో దానిని గ్రహించుటనుచితము కాదని తలంచి, వారు "తిత్తిరి పక్షుల" రూపము దాల్చి, ఆ యజుర్గణములను గ్రహించిరి. తదుపరి వాటిని శిష్య ప్రశిష్యులకు బోధించి ప్రచారములోనికి తెచ్చిరి. కనుక, నీ యజుర్భాగములకు "తైత్తిరీయమ్ము"ను పేరు వాటిల్లెను.

ఇట్లు యాజ్ఞవల్క్యుడు గురువు నుండి ఋణవిముక్తుడై, గురువు నుండి నేర్చిన యాజుషములకన్నను పటిష్టములైన యాజుషములను సూర్యభగవానుని గూర్చి తపమొనర్చి సంపాదించెను.

"యజూంష్యయాతయామాని మునయేఽదాత్ప్రసాదితః"

అట్లు తపమొనర్చిన కారణమున, సూర్యభగవానుడు యాజ్ఞవల్క్యునికి మిక్కిలి పటిష్టములైన యజుర్గణములను వాజీ రూపములో నుండి యుపదేశించుటచే "వాజిసనములు" అని పేరిడిరి. వీటి నధ్యయనమొనర్చువారలు "వాజసనేయులు"గా వినుతికెక్కిరి.

సంస్కృతంలో "వాజీ" అనగా "అశ్వము" అని, అటులనే "అన్నంవైవాజః" అనుటతో వాజము అనగా "అన్నము" అని, "వాజసనిః"–"సనిః" అనగా 'దానము' అను మాటతో "వాజసనిః" అనగా నిరతాన్నప్రదాత అని వేదవాక్కు.

పూర్వమొకానొక "మహర్షి" నిరతాన్నప్రదాతచే నతడు "వాజసనిః" అని పేరుతో ఖ్యాతికెక్కెను. ఈ వాజసని తనయుడే "వాజసనేయుడే"గా "యాజ్ఞవల్క్య మహర్షి"గా ప్రఖ్యాతి పొందెను.

ఇట్టి యాజ్ఞవల్క్యుడు తాను నేర్చిన యజుర్గణములను కణ్వుడు. మధ్యందినుడు మొదలగు శిష్యులకును అధ్యాపనమొనర్చగా, వారునూ వాజసనేయులుగా, వాజసనేయ శాఖలుగా పేరొందిరి. ఈ శాఖలు పదునైదని, పదునేడని మతబేధము కలదు. ఈ 'వాజసనేయ సంహితాభాగం' నలుబది అధ్యాయముల గ్రంథము.

ఈ కణ్వ, మధ్యందినుల కధ్యయనమొనర్చిన యజుర్గణములకు "శుక్ల యజుర్వేదము"గా; చరకాధ్వర్యువుల కధ్యయనమొనర్చిన యజుర్గణములకు "కృష్ణయజుర్వేదమ"ని పేరుగా వినుతికెక్కెను.

★★★

## గురు - సూత్రములు

"యన్నామ స్మరణాత్సద్యో దైన్యహా నిర్ఘృణాం భవేత్"

గురునామ స్మరణతో తక్షణమే మానవుల దీనత్వమును నశింపజేయును గదా!

★★★

"పారోఽలభ్యోగురు వినా" - గురువులేక మోక్షము అలభ్యం.

★★★

శ్లో॥ శాక్తీ జ్ఞానవతీ దీక్షా శిష్యదేహం ప్రవిశ్యతు ।
గురుణా యోగమార్గేణ క్రియతే జ్ఞాన చక్షుషా ॥

భా: గురువు యోగమార్గముచే శిష్యుని దేహమును ప్రవేశించి, జ్ఞాన నేత్రముతో జ్ఞానయుక్తమగు దీక్షను నిచ్చును. దానికి "శక్తి" అనిపేరు.

- (శి.పు. 15వ.అ, 10వ.శ్లో)

★★★

శక్తిపాతముననుసరించియే శిష్యుడు గుర్వను గ్రహం పొందును.

★★★

గురుభక్తి, భగవద్భక్తితో సమానము.

★★★

'గురువు' అనువారు ఎల్లప్పుడూ ఆధ్యాత్మికంగా, ప్రామాణికంగా, ఋజు ప్రవర్తకుడుగా నుండాలి.

# 62. భక్తప్రహ్లాదుని విద్యాభ్యాసము

శ్రీవ్యాస భగవానునిచే విరచింపబడిన భక్తి రసభరితమైన గ్రంథము (పురాణము) శ్రీమద్భాగవతము. అందులో సప్తమస్కంధములోని భక్తప్రహ్లాద చరిత్రము ఆధ్యాత్మిక విద్యాభ్యాసమునకు మార్గదర్శకము.

కృత యుగమునాటి చరిత్రము, నేటి కలియుగపు కాలపరిస్థితికి, అనగా ప్రహ్లాదుడు జన్మతః ఆధ్యాత్మ విద్యయందు నిమగ్నుడగుటకు గల కారణము పరిశీలించిన, ఆబాలుని తల్లి (మాతృమూర్తి) లీలావతి గర్భవతిగా నున్నపుడు, బ్రహ్మమానస పుత్రుడైన నారదమహర్షి నుండి విష్ణుకీర్తనలు, సత్కథలు గర్భమునందున్న ప్రహ్లాదుడు వినడం మిక్కిలి చోద్యము. గర్భవతిగానున్న లీలావతి వినడమను సంఘటన, గర్భమునందున్న శిశువు భాగ్యమే భాగ్యము. మాతృమూర్తి లీలావతి నోచుకొన్న నోము ఫలము ప్రహ్లాదుడు పుట్టడం. అట్టి పుత్రునిగన్న తల్లి ధన్యురాలని, ఈనాటి (కలియుగ) మాతృమూర్తుల కాదర్శము గమనార్హము గర్వించతగినది కూడా.

అట్టి మాతృమూర్తి లీలావతి భర్త దనుజవరేణ్యుడైన, విష్ణుద్వేషియైన, హరిహినిందితుడైన హిరణ్యకశిపునకు విచిత్రచరిత్రులు నలువురు పుత్రులుద్భవించిరి. అందు ప్రహ్లాదుడు బాల్యమునుండియే హరిభక్తుడుగా నుండి, ఆధ్యాత్మిక విద్యయందు విశ్వాసము కల్గి, అదియే జీవునకు మోక్షదాయకమని, నేటి విద్యార్థులు గమనింపదగిన చరిత్ర ప్రహ్లాదచరిత్ర.

"పుత్రుల్ నేర్చిన నేరకున్న జనకుల్ పోషింతురెల్లప్పుడున్"
మిత్రత్వంబున బుద్ధిసెప్పి దురితోన్మేషంబు వారింతురే
శతృత్వంబుదలంపరెట్టి యెడ నాసౌజన్యం రత్నాకరుం
పుత్రున్ లోకపవిత్రు దండ్రి...........

ప్రహ్లాదుడు జన్మతః నారదోపదేశ మహిమతో సర్వుల, సర్వజీవుల యెడల సమహిత తత్త్వంబున మెలగుచు, పెద్దల బొడగన్న భృత్యునికైవడి నమస్కృతులందజేస్తు, కన్నుదోయికి నన్యకాంతులడ్డంబైన మాతృభావనతో మరలుచు, తోడివారిని ధర్మవత్సలతను జూపుచు, దీనుల యెడల తల్లిదండ్రుల భంగిగావుచు, సములయెడల సోదరస్థితి జరుపుచు, దైవతములంచు గురువుల దలంచువాడు, లీల లందు బొంకులు లేనివాడుగా, మృదు మర్యాద శీలుడైన బాలుడు ప్రహ్లాదుడు.

అట్టి గుణములనేకములు గల గుణనిధి ప్రహ్లాదుడు, గురుకాలంబునుండి సద్గుణ గరిష్ఠుడుగా ఫణితికిని, బృహస్పతికిని భాషాపతిగా భగవంతుడైన వాసుదేవునియందు

సహజ సంవర్ధమాన నిరంతరధ్యాన నిరతుడుగా నుండెడివాడు. అనగా, "శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సంధానుండై", "నలినాక్షుడును నిధానము గంటినేనన"ని యుబ్బి గంతులువైచు చుండెడివాడు. బుధజన విధేయుండును, సుగుణ మణి గరిష్ఠుండును, పరమపవిత్రుండును నైయున్న ప్రహ్లాదుని, తండ్రిహిరణ్యకశిపుడు మాత్రము అట్టి సుగుణములయందు విరోధిగా నుండెడివాడు. అట్టివి జాడ్యపులక్షణములని నెరింగి, వీడు విద్యాభ్యాసంబున గాని తీవ్రమతి గాడంచునెంచి, యిట్లుతలపోసెను.

"చదువని వాడజ్ఞుండగు, జదివిన సదసద్వివేక చతురత గలుగుం
చదువగ వలయును జనులకు" - చదివించెదనార్యులొద్ద......

(ఆచార్యులను ఆర్యులనడం గౌరవసూచకం)

అసురవరేణ్యుడైన హిరణ్యకశిపుడిట్లు తలంచడం, ప్రతి తండ్రియును తలంచడమనునది సర్వసాధారణమే. కొందరు తనయులు విద్యా భ్యాసమునకు ముందు "అంధప్రక్రియ" కలిగి యుండుటయు సహజము కాని, ప్రహ్లాదుడట్టి పుట్టుకతో పుట్టలేదు. హరివైరియైన హిరణ్యకశిపుడట్లు తలపోయడం అట్టి అసురులకే పాటి.

శుక్రాచార్యుల పుత్రులైన చండామార్కుల రావించి, పుత్రుడైన ప్రహ్లాదుని, వీరు నీ గురువులని జెప్పి, వారేవిద్యను నేర్పుదురో, ఆ విద్యను నేర్చి నీతి కుశలుడవు కమ్మని పలికి వారితో పంపెను.

గురుకులమునకు జేరిన ప్రహ్లాదునకు చండామార్కులు పాఠయోగ్యములైన పెక్కు శాస్త్రములు పఠింపజేసిరి. ఆ ప్రహ్లాదుడును అంచిత భక్తితోడ పఠించుచు, చలింపని వైష్ణవ భక్తి పూర్ణుడైయుండి, ఏపగిది వారు చెప్పిన ఆ పగిదించదువుచు, ఇదియని యని ఆక్షేపింపక నుండెడివాడు.

అంత కొన్ని దినంబులనంతరం హిరణ్యకశిపుడు పుత్రుని విద్యాభ్యాసం బెట్లున్నదో నిజమెరుంగనెంచి, వానితో భాషింప జూచెదనని, గురుకులమునకు కబురంపెను. వెంటనే గురువులతో నాహూయమానుండైన ప్రహ్లాదుండే తెంచగా, తండ్రి హిరణ్యకశిపుడు, వత్సా! రమ్మని చేరజేరి, సంపూర్ణ వాత్సల్యముతో, దీవించిన యుత్కంఠతో నుండుటలో, "తనయుల సంభాషణములు, జనకులకుంగర్ణయుగళ సద్భూషణములు" కదా!

హిరణ్య కశిపుడు ప్రహ్లాదుని అంకముపై కూర్చుండబెట్టుకొని, పుత్రా! నీకెయ్యది భద్రంబైయున్నది చెప్పుమనిన, ప్రహ్లాదుండును కన్నతండ్రితో ప్రతిపక్షాను రూపంబైన విష్ణుగానంచేయగా, బాలుడు పరపక్షంబుననే నున్నాడని గ్రహించెను. గురువుల పైమండిపడెను. కుమారుని కూడ తూలనాడెను.

కాని, హరిభక్తుండైన ప్రహ్లాదుడు మాత్రము తొణకక యుండుటనునది హరిభక్తులకై సాధ్యము కదా! ఎట్లనిన -

సీ॥ "మందార మకరంద మాధుర్యమునదేలు,
మధుపంబు వోవునే మదనములకు
నిర్మల మందాకినీవీచికల దూగు,
రాయంచ సనునే తరంగిణులకు
లలితరసాల పల్లవ ఖాదియై చొక్కు,
కోయిల సేరునే కుటజములకు
పూర్ణేందు చంద్రికా స్ఫురితచ కోరక,
మరుగునే సాంద్ర నీ హారములకు

తే గీ॥ నంబుజోదర దివ్య పాదారవింద, చింతనామృత పాన విశేషమత్త
చిత్తమేరీతి నితరంబు జేరనేర్చు, వినుతగుణశీల మాటలువేయునేల" -

అట్టి ప్రహ్లాదుని దైవాయత్తమైన మనస్సు నుండి మరల్చుటకు వీలుకాకపోగా, నితడు నాతనయుడుగాడు, శత్రువు, దైత్యకుల కంటకుడని నిందించి, యీతనిని హింసించుమని కోపముతో హిరణ్యకశిపుడు పలికెను - ఆమాటలు విన్న ఆర్యులిరువురు, "మహారాజా! ఈ పాపని మరల చదివింతుము. వినకపోయెనా, కోపించి, దండించుదము." అని విన్న వించి బాలుని నాదరినుండి తోడ్కొని తిరిగి గురుకులమునకు వెళ్లిరి

భార్గవ నందనుండగు గురువు చండామార్కులు, రాజనందనుండగు ప్రహ్లాద శిష్యునకు సామదానభేద దండోపాయంబుల విద్యగరిపి, యిక నతడు నీతి కోవిదుడయ్యెనని నమ్మి నిశ్చయించిరి. అయినను నాబాలుని దైత్యరాజు వద్దకు గోనిపోవుటకు ప్రహ్లాదుని నిట్లువేడుకొనిరి.

నాయనా! ప్రహ్లాద నీవు దైత్యకుల దీపకుడవు. మేము నేర్పిన విద్యయగు త్రివర్గ పారములు అనగా, ధర్మార్థకామములు తప్పకు. మేజెప్పిన నీతి మరువక, మీ తండ్రియెదుట విరోధి శాస్త్రములు విప్పకు. అని, పలువిధములు బుజ్జగించి, నా దానవ బాలుని దోడ్కొని దైత్యరాజు వద్దకు చేరిన గురుండు ఆ బాలుని తండ్రికి మ్రొక్కుమని ముందుకు త్రోసిరి.

రాజుతోనిట్లు విన్నవించుకొనిరి. మహారాజా! అన్య పక్షంబుల మానువరకు శిక్షించితిమి. నీతిపారంగుడైన నీకుమారుని విద్యాకౌశలము వీక్షింపుము అని పలికిరి.

రాజ గురువు మాటలాలకించిన రాజు తనయుడు విని తండ్రికి దండప్రణామంబు చేసి నిలువగా, నాదైత్యరాజు తనయుని చేతులారా గాఢాలింగనం బొనర్చుకొని, అంకము

నిడుకొని, గారాబంబున శిరస్సునిమిరి, చెక్కిళ్ళు ముద్దులగొని, ప్రేమాతిశయముగా నయనానందకరముగా వదనారవిందంబు దడుపుచు మందమధురాలాపంబుల నిట్లనెను.

నాయనా కుమారా! యీ గురువులు నీకెట్టి వేదార్థంబులు బోధించిరో ఎటు పఠింపించిరో, ఆ విద్యాసారంబెరుంగ మహావాంఛతో నున్నాడను గోరెద అట్టి పద్యంబొక్కటి చెప్పితాత్పర్యంబు భాషింపుడు.

అని పలికిన వెంటనే ప్రహ్లాదుండిట్లనెను, సహజమైన ధోరణితో.

"చదివించిరి నను గురువులు, చదివితి ధర్మార్థ ముఖర శాస్త్రములు నే
జదివినవి గలవుపెక్కులు, చదువులలో మర్మమెల్ల జదివితి దండ్రీ."

మరియు నవవిధ భక్తి మార్గములు అనగా -

-"శ్రవణం, కీర్తనం, విష్ణోస్మరణం, పాదసేవనం ।
అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం ఆత్మనివేదనం॥"

వీటితో సర్వాత్మకముగా హరిని నమ్మి సజ్జనుడై యుండుట భద్రంబంచు నేను తలంతునని, నిదియే సత్యంబుతండ్రీ. అట్టి హరిభక్తి వర్జితుల సంసారములు వ్యర్థములు.

ఎందుకనగా-

సీ॥ "కమలాక్షు నర్చించు కరములు కరములు,
శ్రీనాథు వర్ణించు జిహ్వాజిహ్వ.
సుర రక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు,
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము.
విష్ణునాకర్ణించు వీనులు వీనులు,
మధువైరి దవిలిన మనము మనము.
భగవంతు వలగొను పదములు పదములు,
పురుషోత్తముని మీద బుద్ధి బుద్ధి

తే॥ దేవ దేవుని జింతించు దినము దినము,
చక్రహస్తుని ప్రకటించు చదువుచదువు,
కుంభినీధవు జెప్పెడి గురుడు గురుడు,
తండ్రి హరి జేరుమనియెడు తండ్రి తండ్రి" -

అని వైకుంఠవాసుని కీర్తి వేయినోళ్ళ బొగుడుచు అట్టి హరిచింతనమొనర్చునదే జన్మంబని, హరిభక్తిలేని విబుధుండు విబుధుడే కాడనియు నొక్కిజెప్పెను, ప్రహ్లాదుడు.

★★★

# 63. మంత్రగ్రహణము (కచుని వృత్తాంతం)

పూర్వం దేవతలకు రాక్షసులకు నేర్పడిన బద్ధవైరంవలన తరచు వారిరు వురికిని పరస్పరం యుద్ధాలు సంభవించుచుండెడివి. ఆ యుద్ధములో నిరువురి తెగవారు కొందరు గతించుచుండిరి. కాని రాక్షసుల గురువగు శుక్రాచార్యుడు వారిని తన "సంజీవనీ" మంత్రముతో బ్రతికించుచుండెడివాడు. ఇట్లు రాక్షసుల పునర్జీవము పొందుటకు దేవతలకు కడు సంకటపరిస్థితి యేర్పడెను.

ఇట్టి సంకటస్థితిని నివారించుకొనుటకై యింద్రాది దేవతలందరు, తమ వారిని నెట్లు పునర్జీవింప యత్నింప తర్కించుకొనిరి. తుదకు సృష్టికర్త బ్రహ్మను చేరి మొరపెట్టుకొనిరి. బ్రహ్మవారితో నిట్లనియె.

"శుక్రాచార్యుడు ఘోరతపస్సొనర్చి ఈశ్వరుని మెప్పించి "మృత సంజీవనీ" అను విద్యను పొందియున్నాడు. ఆ విద్యచే తమ రాక్షసవర్గమును పునర్జీవింప జేయుచున్నాడు. కావున, ఆ విద్యను మీలో నెవరైనను శుక్రాచార్యుని నుండి పొందినచో దేవతలు పునర్జీవితులగుదురు." అనెను.

దేవతలును బ్రహ్మమాటలు విని, ఆ శుక్రాచార్యుని మెప్పించి ఓర్పుతో, మెలకువతో శిష్యత్వమొనర్చి "మృతసంజీవనీ" విద్యను పొందవలెనని తలంచిరి. అందులకు సమర్థులు ఎవరని? తర్కించుకొనిరి. వారందరికిని ఋషులలో నగ్రేసరుడైన బృహస్పతి కుమారుడు "కచుడను"వాడు సమర్థుడని తోచెను. వెంటనే వారందరు తమ గురువగు బృహస్పతిని చేరి, తమ నిర్ణయమును మొరపెట్టుకొనిరి.

దేవతల మొరవిని, సమ్మతించి దేవకార్యమునకు తన తనయుని (కచుని) ప్రేరేపించుదనని వారికి మాటయిచ్చెను. బృహస్పతియు కచుని పిలిచి, నీవు శుక్రాచార్యుని చేరి, శిష్యునిగా వినయవిధేయతలతో మెలగి, ఓర్పుతో, నేర్పుతో విద్యనభ్యసించుచుండమని, సమయసందర్భముగా మనకోరిక ఫలించునని దీవించి పంపెను.

తండ్రి ఆజ్ఞగా, దేవతల కార్యదీక్షితుడుగా, కచుడు శుక్రాచార్యుని చేరి, నమస్కరించి మీనుండి విద్యనభ్యసించ వచ్చితిని, తాను బృహస్పతికుమారుడని కచుడను నామధేయుడనని వినయవిధేయతలతో పలుకుటను, శుక్రాచార్యుడును మిక్కిలి సంతసించెను. అటులే శుక్రాచార్యుని గారాబు కూతురు దేవయానియు కచుని అందచందములకు, మిక్కిలిగావినయ విధేయతలకు సంతోషించి తండ్రిని మెప్పించి శిష్యత్వమునకు సమ్మతింపజేసెను. కూతురు మాట యనిన నా తండ్రికి వేదవాక్కు గనుక, మిక్కిలిగా దేవతలకు గురువైన బృహస్పతి, తన కుమారుని (కచుని) విద్యనభ్యసించ తన వద్దకు పంపుటను, తన యౌన్నత్యమునకిది తార్కాణమని అహంకరించెను కూడా! కావున సమ్మతించెను.

కచుడు గురువైన శుక్రాచార్యుని శుశ్రూష యొనర్చుచు మిక్కిలి మక్కువతో అణకువతో అన్ని విధముల అనురాగపూరితముగా నుండి విద్యనభ్యసించుచుండెను. శుక్రాచార్యుని కూతురునూ కచుడొనర్చుగురు శుశ్రూషలకు ముగ్ధురాలై, కచుని అంటిపెట్టుకొని యుండెడిది. కచుడును నామెతో మిక్కిలి అనురాగముతో స్నేహ బాంధవ్యముతో మెలగుచుండెడి వాడు.

ఇట్లు పరస్పరం దీటుగా మెలగడం శుక్రాచార్యుడును కూతురుపై నున్న ప్రేమానురాగములతో నేమనలేక, చూచి చూడనట్లుండెడివాడు. కచుడును తన విద్యాభ్యాసము యెడల కడు శ్రద్ధ జూపుతూండడం సహజముగా నుండెను.

ఇట్లు కచుడు శుక్రాచార్యుని చేరుటలోని మర్మం కొంత రాక్షసులకు మాత్రం మిక్కిలి బాధగా నుండెను. ఎటులైన నితడు తమ గురువు నుండి విద్య నభ్యసించడం నెపంబుతో "మృతసంజీవని" మంత్రోపదేశం పొంది వెడలిపోయినచో, దేవతలునూ యీమంత్రోపదేశముతో మరణం లేకుండ నుందురని తలంచి కచుని పట్ల అసూయాగ్రస్తులై యుండిరి.

కాని, కచుడును నొకనాడు మాట వరుసగా గురువును "మృతసంజీవని" విద్యనేర్పుమని కోరనూలేదు. అటులే శుక్రాచార్యుడును కచుడిట్లు తలంచియున్నాడని కోరునని తలంచనూలేదు. కావున గురుశిష్యుల మధ్య వాత్సల్యం బాగా పెరిగి యుండెను. మిక్కిలిగా కచుడు గురుపుత్రిక దేవయానితో ప్రేమగా నుండడం, తనకూతురును ఆనందముగా నుండడం తనకును తృప్తిగా నుండెను.

రాక్షసులకు మాత్రం కచుని యెడల అసూయతోబాటు, ఆగ్రహంకలిగి, ఇతని నెట్టైన తుదముట్టింపజేయవలెనని తలంచి యుండిరి.

ఒకనాడు కచుడు అరణ్యమున హోమసమిధలు ఏరుచుండగా, యిదే అదనని రాక్షసులు కచుని బట్టి చంపి, అతని శవమును చెట్టుకు వ్రేలాడదీసి వెళ్లిరి. ఆశ్రమమున కెంతకును కచుడు రాకపోగా, ఇతడేమయ్యెనని దేవయాని వాపోయి, తుదకు తండ్రియగు శుక్రాచార్యుని చేరి, యావిషయముచెప్పగా, శుక్రాచార్యుడు దివ్యదృష్టితో వెతకగా, కచుడు గతించినట్లు కనుగొనెను. ఆ మాట దేవయానితో జెప్పగా, నామె మిక్కిలిరోదించెను. ఆమె నోదార్చుటకై వెంటనే కచునిపై "మృతసంజీవని" మంత్రప్రయోగమొనర్చి బ్రతికించెను. ఆ మంత్రప్రభావముతో కచుడు బ్రతికి తిరిగి గుర్వాశ్రమమునకు జేరెను. దేవయాని ఆనందం మిన్నుముట్టెను.

రాక్షసుల వంచన ఫలించకపోగా, మరికొన్నాళ్ళకు వారు కచుని పట్టి చంపి, శవమును కాల్చిబూడిదచేసిరి. శుక్రాచార్యుడు సోమపానమొనర్చువాడు. కనుక, రాక్షసులు

బూడిదను మధువుతో కలిపి శుక్రాచార్యునిచే త్రావించిరి. ఇక కచుని కనుగొన లేక బ్రతికించలేక పోవునని రాక్షసులు తలంచిరి.

యథారీతిగా కచుడు ఆశ్రమమునకు రాకపోగా, దేవయాని మరల దుఃఖపడుచు, తండ్రిని చేరి మొరపెట్టుకొనెను. కూతురు మారామునకు శుక్రాచార్యుడు యథాస్థితిగా దివ్యదృష్టితో వెతకగా, త్రిలోకములయందును కచుని కానక, ఆ విషయం కూతురు దేవయానితో చెప్పెను. దేవయానికి దుఃఖముపెల్లుబుకగా, ఆమెపై నున్న ప్రేమతో, కచుని నిట్లు హింస జరుగుటను శుక్రాచార్యుడు సహించలేక, మరల తన దివ్యదృష్టితో వెతకనారంభించెను. అంతటను లేకపోగా, ఆశ్చర్యపడి తుదకు రాక్షసులొనర్చిన అకృత్యమునకు జాలిపడి, కచుడు బూడిద రూపములో సురాపానం ద్వారా తనతోత్రావించిరని కనుగొని, ఆ విషయమును కూడ దేవయానితో జెప్పెను. ఇక చేయునదియు యేమిలేదని చెప్పుచు ఓదార్చయత్నించెను. కాని దేవయాని మిక్కిలి రోదించుచు మొరాయించగా, తోచక శుక్రాచార్యుడు, తన యుదరమునుండి కచుని బ్రతికించుటెట్లని యాలోచించెను. తుదకు దేవయాని పట్టుదలకు, ఉదరమునందున్న కచునకు "మృతసంజీవనీ" మంత్రోపదేశమొనర్చెను.

కచుడట్లు మంత్రమును పొంది, బ్రతికి శుక్రాచార్యుని కడుపును చీల్చుకొని బయటపడెను. కాని శుక్రాచార్యుడు గతించుటతో దేవయాని దుఖమును జూచి, తానునేర్చిన విద్యను గురువగు శుక్రాచార్యునిపై ప్రయోగించి బ్రతికించెను. శుక్రాచార్యుడు బ్రతికి శిష్యుని కృతజ్ఞతకు ప్రాణభిక్షకు మిక్కిలి సంతసించెను.

ఇక కచుడు తలవని తలంపుగా పొందిన మృతసంజీవనీ విద్యకు గురువునకును, తనను పంపినదేవతలకును మనస్సులో నమస్కరించుకొనెను. రాక్షసులు చేసిన దుష్కృత్యమునకు తనకు సత్ఫలితమే లభించెనని సంతోషించి, గురువును చేరి పాదాభివందనమొనర్చి సెలవుపొంది వెడలెను.

ఇట్లు కచుడు తానునేర్చిన "మృతసంజీవనీ" మంత్రమును దేవతలందరికిని యుపదేశమొనర్చి, దేవతలకార్యమొనర్చినందులకు దేవతలెల్లరును కచుని అభినందించి దీవించిరి. దేవతలకును నిక మరణమనునది లేకుండాపోయెను.

దీనిని బట్టి గ్రహించినదేమిటి?

గురువుయెడల వినయవిధేయతలున్న శిష్యునకు నెట్టివిద్యయైన గురువునుండి పొంద వీలగునని ఆదర్శమైన కథ యిది యని గ్రహింపు.

★★★

# 64. తారక మంత్రోపదేశం

## మత్స్యేంద్రనాథ-గోరక్షక నాథుల కథ

మత్స్యేంద్రనాథుడను గురువునకు గోరక్షక నాథుడను శిష్యుడుండెడివాడు. గురువు వెంబడి యుండి శుశ్రూష నొనర్చుచూ, గురువు వెంబడే భిక్షాటనమొనర్చు చుండెడివాడు.

ఒకనాడు మత్స్యేంద్రనాథుడు ఒక యిల్లాలి గృహము ముందు నిలుచుండీ ఆమెను భిక్ష కోరెను. ఆమె భిక్ష పెట్టగా వెడలి, తన శిష్యునకును తినిపించి తాను తినెను. ఆ ఆహారము అతి మధురంగా నుండెను. వారుభయులు ఊరిచివర చెరువు గట్టుపై నున్నరావి చెట్టునీడలో నుండెడి వారు.

ఒకనాడు గోరక్షక నాథుడు చెరువులో స్నానమాచరించి వచ్చి గురువును చేరి, స్వామి! నాకు తారకమంత్రం ఉపదేశించండి! అంటూ గురువు పాదాలపై పడ్డాడు. గురువు మత్స్యేంద్రనాథుడు శిష్యుని లేపి, "నాయనా! దానికింకా సమయం రాలేదు. ఆ సమయం వచ్చినపుడు నా అంతట నేనే నీకు మంత్రోపదేశం చేస్తాను." అన్నాడు.

శిష్యుడగు గోరక్షక నాథుడు యథారీతిగానొక నాడు ఆ పూర్వం యింటికి వెళ్ళి, "భవతీ భిక్షాందేహి!" అని అరిచాడు. ఆయింటి యిల్లాలు బయటకురాగా! అమ్మా! మీరు పూర్వం పెట్టిన భిక్షాన్నము బహు రుచిగానుందని మా గురువుగారు తృప్తిగాతిని ఆనందించారు. ఈనాడు కూడా అలాంటి పదార్థాలే భిక్షగా తెమ్మని నన్నుపంపాడు. త్వరగా పెట్టి పంపండి తల్లీ!" అన్నాడు.

ఆ యిల్లాలు విని, ఆశ్చర్యపడి, విసుగు చెంది, "నీలాంటి వాడికి భిక్ష పెట్టడమే తప్పని, నువ్వు అరచి గీపెట్టినా! నువ్వు కన్ను పెరుగుకొన్నా సరే, భిక్ష పెట్టేది లేదు" అని మొండికేసి మాట్లాడింది.

గోరక్షకనాథుడు వెంటనే, "అమ్మా! మీలాంటి తల్లుల భిక్షవల్ల బ్రతికే వాళ్ళము. అట్టిమాపై కోపమొస్తే మేం చేసేది ఏమీలేదు. మీరన్నటుల నాకన్ను పెరికి మీపాదాల ముందుంచుతాను భిక్షపెట్టండి తల్లీ!" అన్నాడు.

అయితే పెరుక్కోచూద్దాము? అనేసిందామె. వెంటనే చేతనున్న మేడి పుల్లతో కన్ను పెరుక్కుని అరచేతి బెట్టుకొని చూపించి, "అమ్మా! ఇప్పుడైనా! భిక్షపెట్టు తల్లీ!" అన్నాడు దీనంగా గోరక్షకుడు. అది చూచి, ఆమె దిమ్మెరపోయి. అతనిననునయించి కోరిన భిక్ష పెట్టి పంపింది.

గోరక్షిత **నాథుడు భిక్షతో** గురువును చేరగా, "నీకంటికి ఏమయినది గోరక్షకా!" అని ఆదుర్దాగా అడిగాడు, మత్స్యేంద్రనాథుడు. జరిగినదంతా చెప్పాడు గోరక్షకుడు. అయితే భిక్షకోసం ఆ యిల్లాలికొక కన్ను ఇచ్చావు. నేను కోరితే రెండవ కన్ను నాకిస్తావా! అని ప్రశ్నించాడు శిష్యుడిని పరీక్షించదలచి.

గురువు గారు అన్నదే తడవుగా రెండవ కన్ను పెరికి గురువుగారి పాదాల దగ్గర పెట్టి నమస్కరించెను. **అదిచూచి మత్స్యేంద్రనాథుడు** ఆశ్చర్యపడి, "నాయనా! నీగురుభక్తి అసామాన్యం. ఇట్టి త్యాగం **నేను కనీవినీ యెరుంగను."** అని ఆప్యాయంగా అక్కున జేర్చుకొని, అతనిని అనునయించుచూ, లొట్టబోయిన ఆ రెండు కళ్ళను ఆప్యాయంగా తాకారు. అంతే! గురువుగారి కరస్పర్శతో మరుక్షణంలోనే శిష్యుడగు గోరక్షణకు కండ్ల చూపులు వచ్చాయి. తన గురువు అనుగ్రహమునకు కృతజ్ఞతగా గురుపాదాలపై తల వాల్చి నమస్కరించాడు.

గురువు మత్స్యేంద్రనాథుడు శిష్యుడగు గోరక్షకుని లేవనెత్తి, "నాయనా! నువ్వు నన్ను తారక మంత్రోపదశే మొనర్చమని కోరావు. ఆ సమయం ఆసన్నమైనది యిప్పుడు. నేను మాతృగర్భంలో నుండగా, పరమ శివుడు నాకుపదేశించిన ఆ మంత్రాన్ని యథావిధిగా నీకు ఉపదేశిస్తాను. జన్మ చరితార్థం చేసుకో!" అంటూ ఆశీర్వదించారు శిష్యుని గురువగు మత్స్యేంద్రనాథుడు.

గురుభక్తికి యిదొక నిదర్శనము మాత్రమే.

★★★

## గురు - సూత్రములు

"యస్య నాస్తి దృఢా భక్తిః స సదాక్లే శదైన్యభాక్"

ఎవనికి గురువు యందు దృఢమైన భక్తిలేదో వాడెల్లప్పుడు దుఃఖములచే దీనుడై యుండును.

★★★

సద్గురువుల సాహచర్యం సాధకుల సలక్షణ కర్తవ్యం.

★★★

"శాస్త్రమాచార్యుని సన్నిధి చదువునట్టి జనుడు జనుడు".అని అన్నారు పెద్దలు.

# 65. అద్వైత జ్ఞాన దృష్టి

'నిశ్చలానంద స్వామి' అను అద్వైత గురువునకునొక సంపన్నుడైన శిష్యుడుండెడివాడు. ఇతడు కొన్ని దశాబ్దాల నుండి గురువును భక్తి శ్రద్ధలతో సేవించు కొంటూండగా, **గురువుగారి అద్వైతం అతనికి** బాగా వంట బట్టి పోయినది. పరోపకార గుణము, పెద్దలనిన **భక్తి గౌరవాదరములు జూ**పుచు గురువుగారి అడుగు జాడలలో నడిచెడివాడు.

కొంతకాలానికి అతనికి ఒక కుమారుడు కలుగగా ఆ బాలునకు 'ఆనందమూర్తి' అను పేరుపెట్టి, తనలాగానే తన కుమారుడును నిశ్చలానంద స్వామిపై గురుభక్తి కలిగి యుండవలెనని తలంచెను. కాని ఆనందమూర్తి పెరిగి పెద్దవాడై తండ్రి సంపాదించిన సంపదను అనుభవిస్తూ, తండ్రికి విరుద్ధంగా ప్రవర్తించెడి వాడు. కొంతకాలానికి ఆనందమూర్తికి 'అరుణ' అనునామెతో వివాహమయ్యెను. ఆమె ఆధ్యాత్మిక జ్ఞానసంపన్నురాలుగా నుండి, మామ గారి అడుగు జాడలలో నుండెడిది.

ఇట్లుండగా, నిశ్చలానందస్వామి ఆ ఆనందమూర్తి ఇంటికి పూర్వ పరిచయంతో తరుచు వస్తూండడంతో నింకా ఆమెకు (అరుణకు) గురుభక్తి, భగవద్భక్తి స్థిరపడిపోయెను. భర్త యెడలను ఆమె జూపిన గౌరవాదరములకు నిశ్చలానందస్వామి సంతోషపడి, ఆమెకు అద్వైత జ్ఞాన బోధ గావించు చుండెడివాడు. ఆమెతో బాటు ఆమె భర్త ఆనందమూర్తి కూడా విను చుండెడివాడు.

అద్వైతం అనగా! సమదృష్టితో ప్రతి వారిని ప్రతి వస్తువును చూడడము. అట్టి జ్ఞానికి రాజు, పేదకు, బంగారానికి, మట్టిగడ్డకు మధ్య తేడా నుండదు. అనగా ఏకత్వమే అని.

ఒకరోజు ఆనందమూర్తి తన గదిలో పనిమనిషి లక్ష్మితో అసభ్యంగా నుండడం, భార్య అరుణ జూచి, ఏమిటీ నికృష్టమైన పని? అని భర్తను నిలదీసింది. అతడు వెంటనే, నువ్వు ఆ పనిమనిషీ లక్ష్మి ఇద్దరూ నాకు సమానులే కదా! అన్నాడు. అనగా అద్వైత జ్ఞానం అతనికిట్లు వొంట బట్టినది.

అరుణకేమి తోచక భర్తను ఏమనలేక, యుండగా నొకనాడు నిశ్చలానంద స్వామి ఇంటికిరాగా, ఆమె తన ఆవేదన వెళ్ళ గక్కినది. ఆమె ఆవేదనకు పరిష్కారము ఆలోచించెను. ఆ మరునాడు స్వామి ఆజ్ఞగా, ఆనందమూర్తికి భోజనంలో పిండి వంటలలో ఆవుపేడతో అరిసెలుగా వడ్డించింది. ఇవి ఏమిటని ప్రశ్నించగా సత్యవాక్కుగా, "ఆవు పేడతో నొనర్చిన పిండి వంటకం" అని సమాధాన మిచ్చెను. ఆనందమూర్తి కోపంతో నాకూ! ఆవుపేడ

వడ్డిస్తావా! అని లేచ అలిగి వెళ్ళి పోయాడు.

అంతలో నిశ్చలానందస్వామి వచ్చి, నాయనా! ఆనందమూర్తీ! నీ భార్య అద్వైత స్థితిలోనే నీకు ఆవుపేడతో నొనర్చిన అరిసెలు పెట్టినది కదా! పిండితో చేసిన అరిసెలకు, అవు పేడతో చేసిన అరిసెలకు తేడా ఏమిటీ? అని ప్రశ్నించాడు స్వామి. ఆనందమూర్తికి ఏమనాలో తెలియక, తాను చేసిన తప్పును తెలుసుకొని, స్వామి పాదాలపై పడ్డాడు. పశ్చాత్తాపంతో తలవంచుకొన్నాడు.

అది గమనించిన స్వామి, "నాయనా! అద్వైతం అనగా! దేనిపైననూ మోహాలు, బంధాలు, అనురాగాలు వీడి యుండడంతోబాటు, అందరిలోను, అన్నింటిలోనూ ఏకాత్మ భావన కల్గి యుండవలెను." అని ప్రశాంతంగా బోధించెను.

సద్గురువుల సాహచర్యం సాధకుల ముఖ్య కర్తవ్యం

★★★

## గురు - సూత్రములు

"నిస్సంశయం భజగురుం, సోఽభీష్టం తే ప్రదాస్యతి"

సంశయ రహితుడైన గురువును భజించుము. ఆయన నీ కోరికలను తీర్చును.

★★★

"గురుం విద్ధి కృపాసింధుం, వేదశాస్త్రాది విశృతం"

గురువు కృపాసింధువని యెరుంగుము. ఇది వేదశాస్త్రముల యందు తెలుపబడినది.

★★★

"కిం దుర్లభం తచ్చరణ శరణస్యతు భూతలే"

గురు చరణముల శరణందిన వానికి భూమియందు దుర్లభమనేదే లేదు.

★★★

ఆధ్యాత్మిక గురుదేవుని ఆదేశాలను అమలు జరిపే శిష్యుడు శ్రద్ధాళుడై యుంటాడు.

# 66. "బలికి గురూపదేశము"

బలి చక్రవర్తి ఒకనాటి ప్రాతఃకాలమునందు సభలో సింహాసనారూఢుడై యుండెను. ఇంకనూ సభ్యులెవ్వరును రాలేదు. ఇట్టి ఏకాంత వాతావరణమందు అతని మనస్సులో వింత వింత భావతరంగాలుత్పన్నము కాజొచ్చెను. ఆతడొకసారి తన జీవితమంతయు పర్యాలోకనమొనర్చి తన్ను తానిట్లు ప్రశ్నించుకొనెను.

"పదికోట్ల సం॥లు త్రిలోక రాజ్యమునేలితిని. అయినను జీవితమందు సాధించినదేది కలదు? కేవలం ఆహార, నిద్రా, మైధునములలోనే కాలము వ్యర్థపుచ్చడమైనది. ఈ దేహమును, లోకమును విడిచిపోవునపుడు నాతో కూడవచ్చునదేదైన కలదా! నేనెటనుండి వచ్చితిని? వచ్చి సాధించినదేది? ఏది సాధింపవలసి యున్నది? తుదకెక్కడికేగవలెను? ఆ పోవుమార్గమేది?

అట్లు వితర్కించిన కొలది అతనికి చిత్తక్షోభ కలిగెనేగాని, దారి తెన్ను కానరాలేదు. వెంటనే అతడు ప్రాసాదతలమునకు పోయి యేకాంతమున యేకాగ్రత మనస్సుతో గురువగు శుక్రాచార్యుని ధ్యానించెను. మెరుపుమెరసి నట్లుగా శుక్రాచార్యుడు ప్రత్యక్షమయ్యెను. శిష్యుడగు బలి చిత్తమెరింగి యిట్లతనికి తగు సమాధానమునిచ్చెను.

"నాయనా! యిట్లు ఎవరికి వారు స్వబుద్ధివలన జీవిత రహస్యములను భేదింపలేనప్పుడు గురువులను, శాస్త్రములను ఆధారమొనర్చుకొని, ఇటులీ సమస్యలను తీర్చుకొను సంకల్ప బలంతో పఠించి జ్ఞానము నార్జించవచ్చును. లేదా గురూపదేశముతో వివేకవంతుడై జ్ఞాన మార్గముతో నరుడు, తానెందుండి యిటకు వచ్చెనో, ఎటకేగవలయునో, గమ్యస్థానం చేరు మార్గమేదో చక్కగా తెలిసికోవలయును. ఇదియే నిజమగు జీవిత పరమావధి. ఆ అంతరంగమెరుగు హరుడే గురుడౌను, కదా! ఆ పరమాత్మదర్శనం కోరువాడు గురువును అవలంబనం పొందాలి. ఎంతటి గహనమైన విషయాన్నైన ఆ గురువు శిష్యుని హృదయాంతరంగంలో హత్తుకొనేటట్లు చేస్తాడు. అట్టిది బ్రహ్మతత్త్వమెరింగి యున్నగురువునకే సాధ్యమిది." అని యుపదేశించెను.

★★★

గురు - సూత్రం

గురుమూర్తిమ్ సదాధ్యాయేత్, గురు మంత్రం సదాజపేత్

★★★

# 67. ఏకనాథ్ మహారాజ్ (కథ)

మహారాష్ట్రంలోనున్న పైఠాన్ (ప్రతిష్ఠానపురం)లో నొకపేద బ్రాహ్మణుడుండే వాడు. ఆయన తనకెవరైనను యెదురై వచ్చిన వారికెల్ల సాష్టాంగ దండప్రణామంబు చేయుచుండెడివాడు. అనగా నతనికి అందరు భగవత్స్వరూపులే అని. అందులకతనిని అందరు "దండాలస్వామి" అనేవారు.

ఒక రోజు ఆ బ్రాహ్మణుడు దారిలో వస్తూండగా నొకచోట చచ్చిపడి యున్న గాడిదనుజూచి, జాలిపడి తన శక్తితో దానిని బ్రతికించాడు. ఆ విషయం అందరికి తెలిసింది. ఆయన గురువునకు తెలిసి, అట్లొనర్చుట నచ్చక, ఆ శిష్యుని పిలిచి సజీవ సమాధి కమ్మని ఆదేశించాడు. అతడటులే వెంటనే గురువాజ్ఞగా పద్మాసనం వేసుకొని యోగమార్గంగా తనప్రాణాలు వదిలేశాడు.

దాంతో గ్రామపెద్దలది బ్రహ్మహత్యాపాతకంగా నాదేశించిన గురుదేవుని, "శిక్షనైన పొందవలె లేదా, మీ పవిత్రతను నిరూపించుకోవలె" అని పలికిరి. సరేనని తన పవిత్రతనే నిరూపించుకోవడానికి సిద్ధపడగా, "అయితే ఈ గుడిలో నున్న నంది విగ్రహంతో గడ్డిని తినిపించాలి" - అని కోరిరి. ఆ గురువు గుడిలోనికి వెళ్ళి అందరూ చూస్తుండగా నొకచేయి నందిపైవేసి, మరొకచేత్తో గడ్డిని నంది ముందుపెట్టి, "స్వామీ! మీరు నాశిష్యుని వలన నొక గాడిదకు ప్రాణదానం చేసారు. ఆ పుణ్యఫలంగా నీగడ్డిని తిని ఆ గ్రామపెద్దల కోర్కెను తీర్చండి " అని ప్రార్థించాడు. అంతే, నంది నాలుక జాపి ఆ గడ్డిని తినేసింది.

అలా నందితో గడ్డిని తినిపించిన గురువే ఏకనాథ్ మహారాజ్. సంవత్సరం 1450లో జన్మించారు. తండ్రి సూర్యనారాయణ, తల్లిరుక్మిణీదేవి. 12వ ఏటనే ఏకనాథ్ సర్వవిద్యాపారంగతుడయ్యాడు. ఈతని గురువు శ్రీజనార్దనస్వామి. శిష్యునకు దత్తాత్రేయ స్వామి దర్శనంగావింప జేసిన మహత్తర గురువతడు.

★★★

## గురు - సూత్రం

సమస్త గురుపీఠముల యందు శ్రీదత్తుడే ప్రతిష్ఠితు డైయున్నాడు.
గురువనగా శ్రీదత్తుడే సందియం లేదు.

★★★

# 68. బాల అరుణి (కథ)

పూర్వం "దౌమ్యుడు" అనే మహర్షి వద్ద అనేకమంది శిష్యులు విద్యనభ్యసించు చుండెడివారు. ఒకనాడు శిష్యులకు విద్యను బోధిస్తున్నసమయంలో కుంభవృష్టి కురువనారంభించెను. అప్పుడు దౌమ్యుడు "అరుణి"అనే శిష్యుని పిలిచి, "నాయనా! కుండపోతగా వర్షం కురుస్తున్నది, ఒకసారి మనపొలం వద్దకు వెళ్ళి చూచిరా. బోదెగట్లు తెగిపోయి ఉండవచ్చును." అని చెప్పెను.

వెంటనే గురువుగారి ఆజ్ఞగా పొలమువద్దకు చేరగా, అన్నటులే చెరువు గట్టునకు గండి పడుతూండడం చూచిన అరుణి, ఇంకా ఆలసించిన గండి పెద్దదై పంటకొట్టుకొని పోవునేమోనని భావించి, ఆ పంటను కాపాడుటకు ఆ గండికి అడ్డంగా పడుకొనెను.

వర్షం కాస్త తగ్గుముఖం పట్టడంతో తెలతెలవారడం కూడా జరుగగ, పంపిన శిష్యుడు అరుణి మాత్రం ఆశ్రమానికి రాకపోగా గురువు దౌమ్యుడు శిష్యులతో సహా అతనిని వెతుకుతూ పొలము చేరుతాడు. అక్కడక్కడ వెతుకుతూ గండికి అడ్డంగా పడియుండి స్పృహ తప్పిన అరుణిని చూచి గురువునకు గుండె అదిరినంతపని అయినది. వెంటనే ఆ శిష్యుని లేవదీసి సేదతీర్చి తన దివ్యశక్తితో స్పృశించి స్పృహను తెప్పించెను. తనాజ్ఞ నిట్లు పాటించిన శిష్యుని భక్తికి మెచ్చి ఆ గురువు మనసారా దీవిస్తాడు.

కావున గురువును విశ్వసించి యున్నవారికి నెట్టి ప్రమాదం రాదు. వచ్చిననూ తప్పును కూడ.

★★★

## గురు - సూత్రములు

"యస్య ప్రసాదాత్ భగవద్ ప్రసాదః" - అని,

- ("విశ్వనాథ ఠాకూర్ చక్రవర్తిగారి గురుస్తుతి")

భా: "గుర్వనుగ్రహంతోనే భగవదనుగ్రహం మనకు లభ్యం

★★★

మంత్రమూలం గురోర్వాకం, ముక్తిమూలం గురోర్కృపా

# 69. అష్టావక్రుని వృత్తాంతము

పూర్వము 'ఏకపాదుడు' అనే అధ్యాపకుడుండెడివాడు. అతను శిష్యులకు అహర్నిశలు విరామం లేకుండా బోధిస్తూండేవాడు. అతని భార్యనిండు చూలాలు. భార్య గర్భంలోనున్న పిల్లవాడు తన తండ్రిని, "తండ్రీ లేత హృదయులైన యీ విద్యార్థులను నెందుకింత బాధ పెడుతున్నారు? విశ్రాంతి లేకుండా వీరి నింత చదివించి ప్రయోజనం ఏమిటి?" అన్నాడు మందలిస్తూ. అప్పుడు ఏకపాదుడు అన్నాడు. "విద్యార్థులకు విశ్రాంతి గనుకనిస్తే వారిమనస్సు వక్రమార్గాలపై పయనిస్తుంది. కనుక వీరికిక విశ్రాంతి అనేది యివ్వకూడదు. చేతి నిండా పని యివ్వాలి. మనస్సునిండా సత్సంకల్పాలు కలుగునట్లు చూడాలి. ఈ రెండింటికి సన్నిహిత సంబంధ బాంధవ్యం ఏర్పరచాలి. ఈ సత్యమును నీవు గుర్తించాలికదా! అదిలేక, అధ్యాపకుడైన నన్ను విమర్శించుచున్నావా?" అని కోపముతో భార్య గర్భంలోనున్న శిశువును అష్టావక్రుడవై జన్మించుగాక!" అని శపిస్తాడు. అటులే ఆ శిశువు తల్లి ప్రసవించిన తదుపరి చూడగా నిజంగా అష్టావక్రుడుగానే జన్మిస్తాడు.

కారణం తెలిసికోకుండా తండ్రినే నధిక్షేపించిన తనయుడెట్లు పతనమగునో, ఈ కథ వలన నీతి తెలుసుకోవచ్చు. కుమారుడును తండ్రికి శిష్యుడే. కాన, శాసించే హక్కు, విమర్శించే హక్కులేదు. తండ్రి ప్రప్రధమ గురుతుల్యుడు గనుక.

★★★

### గురు - సూత్రములు

"కిం తు ప్రభోర్యః ప్రియ ఏవ తస్య" - అని,

- ("విశ్వనాథ ఠాకూర్ చక్రవర్తిగారి గురుస్తుతి")

"భగవంతునికి గురువు అంతరంగిక సేవకుడు" కనుక, గురువు పట్ల భక్తి ప్రపత్తులను ప్రదర్శించవలె.

★★★

దేవుడు ఎప్పుడునూ దేవుడే, అటులే గురువు ఎప్పుడునూ గురువే. అందుకే దేవుడు ఆరాధనీయుడు. గురువు ఆరాధించే దేవుడు.

# 70. తపశ్శక్తి మహిమ

బ్రహ్మదత్తుడను రాజకుమారుడును, మరియు కౌశికుడను బ్రాహ్మణుని పుత్రులు ఆర్గురును గర్గుడను గురువుని శిష్యులు.

ఒకనాడు బ్రహ్మదత్తునితోను ఆర్గురు శిష్యులును అరణ్యములో తమ గురువు ధేనువును మేపుచుండి, ఆకలి బాధచే బితరులకు శ్రాద్ధమును పెట్టునెపముతో నాగోవును జంపి, తామెల్లరు భుజించిరి. ఆశ్రమము చేరి గురువుతో, "గోవును వ్యాఘ్రము చంపితినేనని" అసత్యము పలికిరి. గర్గుడు తన తపశ్శక్తితో వారి అసత్ప్రవర్తనను గ్రహించి తెలిసియు మిన్నకుండెను.

కాని అట్టి ఘోర పాతకమొనర్చిన కారణాన ఆ ఏడుగురు శిష్యులు మరుజన్మమున వ్యాధులై పుట్టిరి. ఆ తదుపరి జన్మమున చక్రవాకములై పుట్టిరి.

ఈ చక్రవాకములకు పూర్వజన్మ స్మృతులుండుటచే, తామొనర్చిన గోహత్యకు, గురువుతో అసత్యమును పలికిన దోషముల కిట్టి జన్మలకు పశ్చాత్తాపపడి, విష్ణుమూర్తిని గూర్చి తపస్సొనర్చగా ఆ భగవదనుగ్రహముతో కావలసిన జన్మములెత్తి తరించిరి.

అసత్ప్రవర్తన, ఫలితమిట్లుండునని నీతి.

★★★

## గురు - సూత్రములు

"సాక్షాద్ధరిత్వేన సమస్త శాస్త్రైః" - అన్నారు.,

గురువు సాక్షాత్ హరివంటి వాడని సర్వశాస్త్రాలు చెబుతున్నాయి.

★★★

గురువు పట్ల జూపిన భక్తి ప్రపత్తులే దైవంపట్ల జూపినట్లగును.

★★★

గురువును చేరి శరణాగతిని పొందిన, భగవంతుడు తనను శరణాగతిగానే స్వీకరిస్తాడు.

# 71. మిత్రసఖుడు (కల్మషపాదుని) వృత్తాంతము

మిత్రసఖుడు సూర్యవంశపు రాజు. సాదుసుని కుమారుడు. ఇతడొకనాడు వేటాడుటలో రెండుపులులను జూచి, వానిలో నొకదానిని గొట్టెను. రెండవది భయపడి దనుజరూపు దాల్చిపారిపోయెను.

కొంతకాలమునకు మిత్రసఖుడొక యాగము చేయుచుండగా, పారిపోయిన (పులి) దనుజుడు వశిష్ఠ రూపము దాల్చి నా యాగమునచేరి, తనకు నరమాంసముతో భోజనము పెట్టుమని రాజు మిత్రసఖుని కోరెను. వశిష్ఠుడే యిట్లు కోరెనని విశ్వసించి, అటులే పెట్టుటకు సిద్ధముకాగ, అటులే ఆ దనుజుడు వంటలవాడు (సూపకారుడు)గా చేరి నరమాంసము వండెను. అంతలో నిజమైన వశిష్ఠుడే రాగా, నాతనికి మిత్రసఖుడు స్వయంగా నరమాంస భోజనమిడెను. వశిష్ఠుడది చూచి ఆశ్చర్యపడి, "రాజా! నాకు నరమాంసపు భోజనము బెట్టెదవా!" యని వెంటనే "నీవు నరులను భక్షించు రాక్షసుడవు కమ్మ"ని మిత్రసఖుని శపించెను.

మిత్రసఖుడును ఆశ్చర్యపడి, "నీవే స్వయముగా వచ్చికోరి, నన్నిట్లు శపించెదవేల?" అని వశిష్ఠునితో, కోపముగా నిట్లు "మహర్షి నీవిక సూర్యవంశపు రాజులకు గురువుగా నుండకుందు"వని ప్రతి శాపమిచ్చుటకు సిద్ధపడగా, వశిష్ఠుడును ఆశ్చర్యపడి, తన దివ్యదృష్టితో జరిగిన వృత్తాంతంబెరింగి, ఆ జరిగిన వృత్తాంతంబెరింగించెను. రాజును ఖిన్నుడైపోగా, తానొర్చిన తప్పిదమునకు మహర్షిని వేడెను.

రాజు పశ్చాత్తాపమునకు మహర్షి చింతించి యిట్లనెను. "రాజా! ఈ నా శాపము కేవలం పన్నెండు వత్సరములుండి తదుపరి శాపవిమోచనము పొందుదువ"ని పలికి ఊరడించెను.

అయినను, రాజు గురువగు వశిష్ఠునకు ప్రతిశాపమిచ్చుటలో తన హస్తమందున్న మంత్రజలమును తిరిగి తనపాదములపై జల్లుకొనెను. ఆ మంత్రపూరిత జల ప్రభావముతో నతడు కల్మషపాదుడయ్యెను. ఆనాటి నుండి అతడు "కల్మషపాదుడు"గా పేరుబడసెను.

ఇటులుండగా నొకనాడు వశిష్ఠుని కుమారుడగు "శక్తి" ఆశ్రమారణ్యములో నిలబడియుండగా, ఈ కల్మషపాదుడు వశిష్ఠుని కలియుటకు వెళ్ళుచూ, దారిలోనున్న శక్తిని తొలగుమని శాసించెను. శక్తి విని, నేను ధర్మపథముననే నిలుచున్నానని పలుకగా, కల్మషపాదునకు కోపము వచ్చి శక్తిని మోదెను. శక్తి వెంటనే అతనిని నరమాంసము తిను రాక్షసుడవు కమ్మని శపించెను. తదుపరి ఇతడు వశిష్ఠుని పుత్రునిగానెరింగి, పశ్చాత్తాపపడి, శాపవిమోచనమునకు అర్థించెను. అయినను, విమోచనమును పొందక, రాజు దనుజుడై

మనుజులను వధించుచు భక్షించుచుండెను. అటులనే, అతనిలో విశ్వామిత్రుడును ఆవహించుటచే, వశిష్ఠునిపైనున్న కోపకారణాన, ఆ శక్తిని, అతని సోదరులను కూడ భక్షించెను. అట్లు భక్షించుటలో అచటనే శక్తిభార్యను జూచి, యామెను భక్షించుటకును వెంబడించెను. ఆమె పరుగిడుచుండగా వశిష్ఠుడు జూచి మంత్రపూతజలమును నా రాక్షసునిపై జల్లెను. ఆ దనుజునకు శాపవిమోచన మయ్యెను. అతడు పూర్వరూపమగు మిత్రసఖునిగా దాల్చెను.

ఈ "కల్మషపాదుని శాపవిమోచన కథ" మరి యొకటిగా ప్రసిద్ధి –

గౌతముని శిష్యుడగు 'ఉదంకుడు' ఒకనాడు గురుకార్యార్థియై నరుగుచుండగా, వానిని దారిలో కల్మషపాదుడను దనుజుడు అడ్డగించి అతనిని భక్షింపబోయెను. ఉదంకుడును రాజును గుర్తించిన వాడై నిట్లనెను.

నేను గురుకార్యార్థియై, నీభార్య చెవికుండలములే మాగురుపత్ని కోరియుండిన కారణాన, అవి యిప్పింపుడని కోరుచూ వాటిని మాగురుపత్నికందించిన నీకు భోజనమయ్యెదనని పలికెను– ఇట్లీతని గురుకార్యార్థమును గ్రహించిన వాడైనకల్మషపాదుడు, వానికొక యానవాలిచ్చి, "దీనిని జూపి నాభార్యనుండి వాటిని పొందుడ"ని యుదంకుని పంపెను.

ఆ ఉదంకుడును కల్మషపాదుని భార్యను చేరి అనవాలును జూపగా, ఆ కుండలములను నిట్లతడు పొందుటలో అతని మనశ్శుద్ధిని, గురుకార్యార్థిని గ్రహించిన కల్మషపాదుని భార్య, భర్త ఆజ్ఞగా తనకుండలముల నతని కందించెను. ఆ ఉదంకుడు వాటిని పొంది తన గురుపత్నికిచ్చి, తిరిగి తానిచ్చిన మాటగా కల్మషపాదుని చేరి భుజించుటకర్థించెను. ఇట్టి గురుకార్యపరత్వమునకు, సత్యసంధతకును సంతసించిన కల్మషపాదుడు మెచ్చి, "విప్రులు కడు నీతిపరులు కదా! మరియు కడు సమర్థులు. ఈ విప్ర శాపమువలననే తనకీ దురవస్థ కల్గిందని" తలంచి, తనకు పూర్వమిటులే బ్రాహ్మణ మిథునమునన్న బ్రాహ్మణుని జంపి తినుటతో, నాతని భార్య మిక్కిలి దుఃఖించి, "నీవును సతీసంగమము జరుపునపుడు మరణింతువుగాక!" అని శపించినదిగా గుర్తుజేసుకొనెను.

ఆ ఉదంకునితో, "స్వామీ! నన్నీదురవస్థనుండి కాపాడుమని ప్రార్థించెను. ఉదంకుడును కల్మషపాదుని పశ్చాత్తాపమునకు సంతసించి, ఆతని శరీరమును తన కరములచే స్పృశించెను. అంతలో కల్మషపాదుడు శాపవిమోచనంపొంది నిజరూపము దాల్చెను.

★★★

# 72. గురుధిక్కారము
## (ఇందీవరాక్షుని వృత్తాంతము)

'నలనాభుడ'ను గంధర్వరాజు కుమారుడు 'ఇందీవరాక్షుడు'. వరూధినికి తోబుట్టువు.

బ్రహ్మమిత్రుడను మునీశ్వరుడు తన శిష్యులకు ఆయుర్వేద విద్య గడుపుచుండెడివాడు. ఇందీవరాక్షుడా విద్యను నేర్చుటకై ఆ మునిని చేరి నమస్కరించి, తనకును నావిద్య నేర్పుమని కోరెను. కాని బ్రహ్మమిత్రుడు, గంధర్వులకు నేర్పదగినది కాదని అతనిని నిరాకరించెను.

అందులకాగంధర్వుడు, ఎటులనైన నావిద్యనుపొందుటకై తన మాయచేత నొకబ్రాహ్మణ శిష్యరూపములో నాశిష్యబృందముతో కూర్చుండి కడు శ్రద్ధగా నా ఆయుర్వేద విద్యను నభ్యసించెను.

ఇంతవరకు ఇందీవరాక్షునిలోనున్న విద్యాకాంక్ష పొగడదగినదే. కానీ, తాననుకొన్నది మాయతో, వంచనతో సాధించ గలిగితిననే గర్వముతో గురువగు బ్రహ్మమిత్రుని పరిహసించెనునిట్లు.

"నీవు నేర్పరానిదని, నేర్పకుండనిచో, దానినే నేను నిన్ను మోసగించి నేర్చితిని. కావలసినది పొందితిని", అని తన నిజరూపము జూపుచు పలుధిక్కారపు మాటలు పలుకుచు తన అహంకారము గురువు యెడల ప్రదర్శించెను.

అందులకాబ్రహ్మమిత్రుడు అతనిలో నున్న విద్యాకాంక్షకు సంతసించియుండినను, పలికిన పరిహాసపు పలుకులకు కృద్ధుడై వెంటనే నిట్లతని శపించెను. "నీవు గంధర్వమాయతో నన్ను మోసగించి నేర్చుకొంటివి. అయినను నేర్చి యూరకుండక, అహంకారముతో గర్వించి అసుర వాక్యములు పలికినందులకు "అసురుడవుకమ్ము"ని, ఇందీవరాక్షుని శపించెను.

ఆ శాపముతో ఇందీవరాక్షుడు తనలోని అహంకారమునకు ఖిన్నుడై, పశ్చాత్తాపపడి వెంటనే ఆ ముని పాదములపై బడి, శాపవిమోచనమునకై అర్థించెను. మునియును అతని పశ్చాత్తాపమునకు కరుణించి, నీవు బ్రహ్మరాక్షసుడవై తిరుగుచూ ఒకనాడు నీ నిజకుమారి 'మనోరమ'నే భక్షింప యత్నించుదువు. అప్పుడామె ఆలపించిన ధ్వని విని 'స్వచోచి'యను నతడామెను కాపాడుటకై నీపై ఆగ్నేయాస్త్రమును ప్రయోగించును. దాని స్పర్శతో తిరిగి నీ నిజరూపము నీకు వచ్చును." అని పలికెను.

కొంతకాలమున కటులే జరుగగా, ఇందీవరాక్షుడు తన నిజరూపము పొంది

ధన్యుడయ్యెను.

ఈ కథ వలన "గురుధిక్కారము" కూడదని నీతి.

-(ఈ కథ "మార్కండేయ పురాణం" లోనిది)-

ఇట్టి నీతియే నారదపురాణమునందును మదయంతి సౌదామస మహారాజు (భర్త) తాననెను.

శ్లో॥ "గురుంతుం కృత్యహుం కృత్యయోవదేన్మూఢ ధీన్నరః ।
అరణ్యే నిర్జలేదేశేన భవేద్బ్రహ్మ రాక్షసః ॥ -(9వఅ 32శ్లో)

భా: గురువును తిరస్కరించి, దూషించిన మూర్ఖుడు అరణ్యమున నిర్జల ప్రదేశమున బ్రహ్మరాక్షసుడుగా పుట్టును"

★★★

## గురు - సూత్రములు

ఇతరులకు తెలియని తనదోషాలు తాను తెలుసుకొని సిగ్గుపడునో అతడే సర్వలోకానికి గురువు.

★★★

గురువులు ప్రభుపాదులు.

★★★

"సమయే కరుణా యోగ్యేత్వాం ప్రత్యాయాతి సద్గురుః"

సద్గురువు, కరుణించటానికి తగిన సమయం రాగా తానే దగ్గరకు వస్తాడు.

★★★

విద్యార్థిలో ఆర్తి పెల్లుబికితే అదే సద్గురువునకు కరుణాయోగ్యమైన తరుణం.

★★★

గురువు, నన్నింత కఠినంగా పరీక్షించడం తగునా! - అని తలంచని విద్యార్థియే ఆ సద్గురు కృపకు పాత్రుడగును.

★★★

గురువునకు ప్రియమొనర్చువాడే శిష్యుడు.

# 73. భుశుండుని గురుధిక్కారము

శ్రీ తులసి రామాయణము "శ్రీరామ చరిత మానసము', శివపార్వతుల సంవాదమున, శివుడు పార్వతితో నిట్లనెను. ఓ ఉమా! గరుడుడు 'కాక భుశుండిని' ఆశ్రమమునకు రాగానే తనలోని మోహము, భ్రమ దూరమైనవని పలికిన వచనములకు, కాక భుశుండి ప్రసన్నచిత్తుడై, అనురాగ పూర్వకముగా, తాను పొందిన శివుని శాపమును గూర్చి నిట్లనెను -

ఖగరాజా! నేను అయోధ్యానగరమున నివసించియుండగా నచట కొంతకాలమున కచట కరువు తాండవించగా, అనేక ఆపదలకు గురియై, అటనుండి ఉజ్జయినీ నగరము జేరితిని. అచటను పరమ శివుని ఆరాధించుచుంటిమి.

అక్కడ ఒక బ్రాహ్మణుడు వైదిక పద్ధతిలో శివుని అహర్నిశలు అర్చించుచుండెను. అతడు పరమ సాధువు. పరమార్థమును ఎరిగినవాడు. శివోపాసకుడు. అయినను విష్ణునింద చేయకుండెడివాడు. నిష్కపటిగా దయాళుడుగా నుండెడివాడు. అట్టి బ్రాహ్మణుని నేను చేరితిని. నేనును నతని దయాళుత్వమునకు, నిష్కపటముతో సేవించుచుంటినని, అతడు నన్ను విశ్వసించెను. కాని నాలోని కపట స్వభావమును నెరుంగక, నాపై వినయమును జూచి, అతడు నన్ను తన పుత్రునివలె భావించి బోధించుచుండెను.

ఆ బ్రాహ్మణుడు నాకు శివ మంత్రమునే గాక, అనేక పవిత్ర విషయములను ఉపదేశించెను. నేను ప్రతిదినము దేవాలయమునకు వెళ్ళి, శివమంత్రములను జపించుచుంటిని. కాని నా హృదయమున దంబాహంకారములు నిండి యుండెను. దానితో నేను, పాప బుద్ధిని, దుష్టత్వమును, నీచత్వమును పెంచుకొని, మోహవశుడనై, ఇక హరిభక్తులను, బ్రాహ్మణులను చూడగనే నేను కోపముతో మండిపడు చుంటిని. అదియునుగాక, భగవంతుడైన విష్ణువును కూడ వైరభావముతో చూచుచుండెడి వాడను.

గురువుగారు నా ప్రవర్తనను జూచి బాధపడుచును, నాకు నిత్యము సదుపదేశముల నిచ్చుచుండిరి. కాని నేను వారి ఉపదేశములను పెడచెవిన పెట్టుటయే గాక, రాను రానునాకు కోపము అధికము కాజొచ్చెను. అట్టితరి, గర్వియైన నాకు నీతివాక్యములు చెవికెక్కునా!?

ఒక దినమున గురువుగారు నన్ను పిలిచి పుత్రవాత్సల్యముతో నిట్లనెను. "నాయనా! శివుని సేవాఫలము నిరంతరం శ్రీరాముని చరణములపై భక్తి కుదురు కొనుటయే" శివుడు, బ్రహ్మయు శ్రీరాముని భజించెదరు. శ్రీరాముని చరణ సేవయందు ఆసక్తులై యుండురు. అట్టి శ్రీరాముని (విష్ణువును) వైరము పూని, నీవు ఎట్లు సుఖమును ఆశించుచున్నావు? శివుడును హరిసేవకుడు" - అని యిట్లు, అనేక రీతుల నీతులు

గఱపెను.

ఆ నీతులు నాచెవి కెక్కకపోగా, నాహృదయములో కోపాగ్ని మరింత రగుల్కొనెను. జాతిచేత అనర్హుడనైన నాకు గురువుగారు విద్యలను నేర్పుట పామునకు పాలు పోసినట్లైనది గర్వపోతునకు, కుటిలుడునకు, దౌర్భాగ్యుడునకు గురూపదేశములు వంటపట్టునా! అందులో కుజాతి వాడనునైన నేను రాత్రింబవళ్ళు గురువునకే ద్రోహము తలపెట్టితిని. కాని గురువు గారు అత్యంత దయాళువు అగుటచే నన్ను ఆయన ఏమాత్రము కోప పడలేదు కదా! ఆయన అనుక్షణము చక్కని విజ్ఞానమును బోధించుచుండెను.

నీచుడు తనకు ఔన్నత్యమును గూర్చినవానికే హాని చేకూర్చును. సోదరా! వైనతేయా! వినుము. పొగ నిప్పునుండి ఉత్పన్నమగును. కాని, అదేపొగ మేఘముగా రూపొంది, తాను వర్షించిన జలముతోనే ఆ నిప్పును ఆర్పివేయును. ధూళి మార్గములో పడి. అందరి పాదములచే త్రొక్కబడి అవమానము పొందియుండును. కాని, ఆ ధూళి గాలివలన పైకెగిరి ఆ గాలినే చుట్టుముట్టి తుదకు మానవుల (రాజుల) కండ్లలోను, కిరీటములపైనను పడును. అనగా అధములతో సాంగత్యము చేసిన పవిత్రులు పతితులగుదురు. కనుకనే, బుద్ధిమంతులు అధములతో సాంగత్య మొనర్చరు. దుష్టులతో కలహమొనర్చినను, స్నేహమొనర్చినను సజ్జనుడు దుర్జనుడగును. కావున, ఖలుని యెడ ఎల్లప్పుడు తటస్థునిగా మెలగవలెను. అట్టి దుర్గుణములు గలనాకు, గురువుగారు హితవచనములే గఱపుచుండిరి. కాని అవి నాకు రుచింపలేదు.

ఒకనాడు నేను శివాలయములో శివనామమును జపించుచుంటిని. అదే సమయమున గురువుగారచటికి విచ్చేసిరి కాని గర్విత మతినైన నేను లేవలేదు, పైగానతనికి నమస్కరింపనులేదు. అయినను గురువుగారు దయా నిధులు కాబట్టి, నాదౌష్ట్యమును చూచియు, ఆయన నన్నేమియును అనలేదు కదా! ఆయన హృదయములో ఆవంతయు కోపము లేకుండెను.

అయినను, అట్లు గురువును నిరాదరించుట మహాపాపము. మహాదేవుడు దీనిని సహింపలేకపోయెను.

మందిరము లోపలనుండి యొక అదృశ్యవాణి యిట్లు పలికెను. "ఓరి! దౌర్భాగ్యుడా! మూర్ఖుడా! దురభిమానీ! నీ గురువు మిక్కిలి దయామయుడు. గావున నిన్ను కోపగింపలేదు. ఆయన పరిపూర్ణ జ్ఞాని. ఐనను శఠుడా! నేను నిన్ను శపించెదను. నీతి బాహ్యమైనపని నాకు రుచింపదు. దుష్టుడా! నిన్ను దండిపనిచో వైదిక నిష్ఠా నియమములను ఉల్లంఘించినట్లు అగును" గురువు నెడ ఈర్ష్యాళువు అయిన మూర్ఖుడు కోట్లకొలది యుగముల వగకు రౌరవ నరకము యాతనలకు గురియగును. తరువాత పశుపక్ష్యాది

యోనులలో జన్మించును. వేలకొలది జన్మలలో దుఃఖములననుభవించును.

"ఓరీ! పాపీ! నీవు గురువుగారి ముందు కొండచిలువ వలె కూర్చుని యుంటివి. నీ బుద్ధి పంకిలమైనది. కావున నీవు సర్పమువై, నీచాతినీచముగా అధోగతిపాలై, పెద్ద చెట్టు తొఱ్ఱలో పడి యుండెదవు." అని శపించెను.

అట్టి భయంకరమైన ఆ శివుని శాపము విని, గురువు గారు "హాహా" కారము చేసెను. వణుకుచున్న నన్ను చూచి, ఆ గురువు హృదయములో దుఃఖము ఉప్పొంగెను. నా విహ్వల స్థితిని గమనించి, ఆ గురువు (బ్రాహ్మణుడు) శివునకు భక్తితో దండప్రణామంబుల నాచరించి, అంజలి ఘటించి, గద్గద కంఠముతో మిక్కిలిగా స్తుతించెను.

(సూచన:- ఈ శంకర స్తుతి ప్రత్యేకముగా స్తుతులలోనున్నది.)

సర్వజ్ఞుడైన శివుడు ఈ స్తుతిని విని, బ్రాహ్మణుని భక్తి విశ్వాసములను గ్రహించెను. అపుడు మందిరమున నుండి అశరీరవాణి "ఓ ద్విజశ్రేష్ఠుడా వరమును కోరుకొనుము" అని పలికెను.

ఆ బ్రాహ్మణుడు యిట్లు పలికెను. ఓ ప్రభూ! నాయెడ మీరు ప్రసన్నులైనచో, ఈ దీనునిపై కృపయుంచి, మొదట మీ చరణములపై భక్తిని ప్రసాదింపుడు. పిమ్మట రెండవ వరమును అనుగ్రహింపుడు. ప్రభూ! ఈ జడప్రాణి మీమాయకు వశుడై నిత్యము నిరంతరము అజ్ఞానముతో తిరుగుచుండును. కృపాసాగరా! ఇతనిపై కోపగింపకుడు. ఓ దీనదయాళూ! శంకరా! ఈతనిని కనికరించి శాపవిముక్తి త్వరగా కలుగునట్లు అనుగ్రహింపుడు. ఇతనికి హితమును కూర్చుడు!" అని ప్రార్థించెను

పరహితార్థ పూర్ణములైన బ్రాహ్మణ వచనములను విని, ఆ అదృశ్యవాణి "అట్లే కానిమ్ము", అని పలికి మరల, "ఇతని ఘోర పాపములను జూచి తగిన శాపమునిచ్చితిని. కాని, నీ సాధుత్వమును సరళ వచనములను గమనించి, పరోపకారియునైన వానిపై, ఖరారియైన శ్రీరాముని వలె నేను కృపను ప్రసరింపజేసెదను. నా శాపము వ్యర్థము కాదు. ఇతనికి వేయి జన్మలు తప్పవు. కాని జనన మరణ దుఃఖములు ఇతనిని బాధింపవు. ఏ జన్మలోనూ ఇతని జ్ఞానము లుప్తము కాబోదు." అని బ్రాహ్మణ వచనములకు అట్లు పలికినను, తిరిగి శూద్రుని కూడ యిట్లు హెచ్చరించెను.

"ఓ భుశుండీ! వినుము. ఇప్పటి నీ జన్మ అయోధ్యానగర ప్రభావమునను, నీ మనస్సు నాసేవ యందే నిమగ్నమైనందున, నా అనుగ్రహము పలనను నీ హృదయమున శ్రీరామభక్తి యుదయించును. నా వచనములు సత్యములు. వత్సా! బ్రాహ్మణసేవయే శ్రీహరిని సంతృప్తి పరచువ్రతము వేరొకటి లేదు. ఇక యెప్పుడును ఏ విధముగను బ్రాహ్మణులను

నిరాదరింప వలదు. సజ్జనుడు అనంతుడైన భగవంతుని వంటి వాడని ఎరుంగుము. ఇంద్రుని వజ్రాయుధముతోను, నా త్రిశూలముతోను, కాలుని దండముతోను, శ్రీహరి కరాళ చక్రముతోను మృతి చెందనివాడు విప్రద్రోహమనెడి అగ్నిలో మాడిమసియగును. ఈ వివేకమును మనస్సున నుంచుకొనుము. దానితో ప్రపంచమున నీకు దుర్లభమైనదేదియు యుండదు. మరియొక వరము నిచ్చు చున్నాను. నా ఆశీః ప్రభావమున నీవెక్కడికైనను అప్రతి హతముగా సంచరింప వచ్చును." అని పలికెను.

ఆ పరమశివుని వచనములను విని, గురువు ప్రసన్నచిత్తుడై "తథాఽస్తు" అని పలికి నాకు నచ్చచెప్పి, అతడు శివుని చరణములను స్మరించుచు తన యింటికి వెళ్ళెను.

"ఖగరాజా! విధిప్రేరితుడనై నేను వింధ్యాచలమున కొండచిలవనై, కొలది కాలముననే అనాయాసముగనే ఆ శరీరమును వీడితిని. నాకు క్లేశములు గూడ ఎదురు కాలేదు. ఇట్లు నానా యోనులలో జన్మించుచు వచ్చిననూ ఏ జన్మమునందు నా జ్ఞానము లుప్తము కాలేదు. శ్రీరాముని భజనను వీడలేదు.

కాని, ఒక్క విషయము మాత్రము నన్ను సర్వదా బాధించుచునే యుండెను. అంతటి గురువు (బ్రాహ్మణుని)గారి కోమల, సుశీల స్వభావమును నేను మరువకుండ యున్నందున, వేద, పురాణ, శాస్త్రములలో పేర్కొనబడినట్లు, దేవతలకును లభ్యముకాని బ్రాహ్మణ శరీరమును పొందుటకు తహతహలాడి చివరి జన్మలో నట్టి జన్మనే పొందితిని. ఆ ద్విజ దేహమున శ్రీరాముని విశిష్ట లీలలన్నింటిని స్మరించుచు, గురు వచనములను కూడ స్మరించుకొనుచు, శ్రీరాముని చరణములందే అనుక్షణము లగ్నపరచితిని. అతనినే కీర్తించుచుంటిని.

★★★

## గురు - సూత్రములు

శిష్యునకు 'అపక్వాహంకారం' లుప్తమైనప్పుడే 'గురుభావం' అభివ్యక్తమౌతుంది.

★★★

గురువు గృహమొక దేవాలయం వంటిది.

★★★

గురు శూశ్రుష శివ పూజ వంటిది.

# 74. ఆషాఢభూతి(కథ)

దేవశర్మ అనునొక సన్యాసి. అతడు కదులుబ్బుడు. ఎవ్వరేని ఏదేనైనను యిచ్చినచో నట్టిదానిని విక్రయించి, ఆ సొమ్మునునొక బొంతలో బెట్టి, యాబొంతను సదా తనయొద్దనే జాగ్రత్త పరచుకొనుచుండెను. ఈతని వద్ద ధనమున్నటుల కెవరికిని తెలియక యుండెను. ఆ ధనమును ఖర్చు చేయటం కాని, యితరులకు దానమివ్వటం కాని యెరుగడు.

అటులా ధనమున్నటుల అతని శిష్యుడగు ఆషాఢ భూతికే తెలుసు. గురువు లోభత్వమునకా శిష్యుడును సిగ్గుపడుచుండెడివాడు. అట్టి గురువు వద్దనుండుట కన్న ఆ గురువు వద్దనున్న దాచియుంచిన ధనమునెటులైన తస్కరించి పోవడం మిన్నయని తలంచియుండెను. ఆ ప్రయత్నములోనే యుండి అవకాశమునకు నెదురు చూచుచుండెను. కాని గురువు కూడ ఏ అవకాశమివ్వక యుండుటను గ్రహించిన ఆషాఢభూతి ఉపాయముతో నెటులైన కాజేయదలచి, ఒకనాడు గురువును చేరి యిట్లనెను.

"అయ్యా! నన్నుద్ధరించు భారము మీదే. సంసార బాధలకు రోసి మీనుండి జ్ఞానము పొందుటకై మిమ్ములనాశ్రయించితిని. ఈ శరీర సుఖ సౌఖ్యములు బుద్బుదప్రాయములు. కదా! ఇక ధనమా చంచలమైనది. అట్టిదానితో నాకేమియును అవసరం లేదని తోచినది. కావున, మీరు నన్ను మీ సేవ చేయునటుల తరింపజేయు తరుణమిమ్మ"ని మిక్కిలి వినయవిధేయతల ఉట్టి పడునటుల తన కపట అణకువ ప్రదర్శించెను.

దేవశర్మ వానిని నమ్మియుండి, అపుడపుడు తనకు తెలిసి తెలియని వేదాంత వాక్యములను ప్రకటించుచుండెడివాడు. కానీ యాబొంతను మాత్రము ఏమారక, అతనికివ్వక యుండెను. ఆషాఢభూతికినీ అతని వేదాంత వాక్యముల రక్తిని ప్రదర్శించుచుండుటను, భవ బంధముల యెడల విరక్తి ప్రకటించునటుల నటించుచుండెను.

ఒకనాడు భిక్షకై గురువు వెంబడి యొక ఇంటికి వెళ్లి తిరిగి వచ్చుటలో తన బట్టలకంటిననొక చీపురు పుల్లను చూచి, ఆ పుల్లను దేవశర్మ చూచుచుండగనే ఆ యింటి యజమాని యింటికి వెళ్లి అప్పజెప్పెను ఆషాఢభూతి. పరుల పుల్లైన తనకక్కరలేదనుట త్యాగము ప్రదర్శించుటను జూచిన దేవశర్మ, తనశిష్యుడెంతటి త్యాగజీవి కదా! యని నమ్మియుండెను. ఆ నమ్మకమే మనస్సులోనుంచుకొని నొకసారి ప్రయాణంలో బొంతభారము మోయలేక శిష్యునకిచ్చెను. దానినతడు మహాప్రసాదముగా మోయుచున్నటుల నటించి నమ్మించెను.

ఒకనాడా బొంతను నటులే శిష్యునకిచ్చి స్నానమొనర్చుటకై నదిలో దిగి మునగగా, యిదే సమయమని అతడు (ఆషాఢభూతి) బొంతతో పలాయనమయ్యెను. దేవశర్మ నీటిలోనుండి లేచుసరికి శిష్యుడు కనబడకపోగా, లబోదిబోమని అరచెను. చేయునది లేక తన లోభత్వం వీడి నిజమైన సన్యాసిగా జీవించసాగెను. ★★★

# 75. కర్ణుని భంగపాటు

అర్జునునకు ధీటుగా కర్ణుడు బ్రహ్మాస్త్రమును పొందుటకై మహేంద్రనగరముపై నున్న జమదగ్ని తనయుడు 'పరశురాముని' జేరెను. పరశురాముడు క్షత్రియ వంశ శత్రువు. అని తెలిసిన కర్ణుడు, అందులో తాను సూతపుత్రుడనని తెలిసినను తానాస్త్రమును పొందలేనని కపట బ్రాహ్మణ వేషధారియై అతని వద్దకు వెళ్లి శిష్యత్వమును పొందెను.

కొంతకాలమునకు కర్ణుని గురుసేవా తత్త్వమునకు విశ్వసించి, సంతసించి అతనికా అస్త్రవిద్య పరశురాముడు నేర్పెను. కాని విధి వక్రించుననుటకొక ఉదాహరణముగా ఇంద్రుడు వజ్ర కీటకధారియై ఆశ్రమమును చేరెను. ఆ సమయమున, తిరిగి తిరిగి వచ్చిన పరశురాముని అలసట తీర్చుటకై కర్ణుడు గురుని తలను తన తొడపై నిడుకొని సేద తీర్చుచుండెను. ఇంద్రుడదే అదనని, తన మాయారూపమగు కీటకధారిగా కర్ణుని తొడక్రిందజేరి, వాని తొడను తొలుచుచుండెను. కర్ణుని తొడ నుండి రక్తము స్రవించి పారుచు నిద్రించుచుండిన పరశురాముని దేహం క్రిందకు జేరెను. రక్తస్పర్శతో తడికాగా పరశురామునకు మెలకువ కాగా, అంతవరకును, గాయపడి తొడనుండి రక్తధార వెలువడిచుండినను ఓర్చుకొని యుండుటను కర్ణునిగని, ఇతడు బ్రాహ్మణుడు కాడని, తన దివ్యదృష్టితో పరశురాముడు గ్రహించెను.

వెంటనే యితడు క్షత్రియుడని యెరింగి, "అసత్యవచనముతో నమ్మించి, నానుండి విద్య నేర్చితివి. కావున నీవు నేర్చిన ఆ విద్య, అవసర సమయమున భంగమగునట్లు శపించుచున్నా"నని పరశురాముడాగ్రహముగా పలికెను. కీటకరూపధారియగు ఇంద్రుడును తన పాచిక పారినందున సంతసించి, మనస్సులో పరశురామునకు నమస్కరించి మాయమయ్యెను.

కర్ణుడిట్లు తానునేర్చిన బ్రహ్మాస్త్ర విద్యావిభవము వికలమగుటను, తన దురదృష్టమని తలంచి, తను పొందిన భంగపాటునకు విచారిస్తూ అవమాన భారంతో తిరుగుముఖము పట్టెను.

అటులనే కర్ణుడు యుద్ధరంగమున తాను నేర్చిన విద్యను ప్రదర్శించుకోలేక ఫల్గుని నుండి భంగపాటును పొందెను. మోసముతో నేర్చిన తగు సమయమున భంగపాటొనర్చునని ఈ కథ వలన నీతి గ్రహించతగినది.

★★★

# 76. శిష్యుడును గురువగును
## (తోతాపురి శిష్యుని కథ)

"తోతాపురి" రామకృష్ణుని గురువులలో నొకడు. ఒక రోజు సాయంత్రం వారిరువురు వేదాంత చర్చలో నిమగ్నులైయుండిరి. ప్రక్కనే అగ్నిహోత్రం వెలుగుతూండడంతో, ఆ సమీపములో తోతాపురి జ్ఞాననిమగ్నుడై యుండుతరి, నొక సేవకుడు ఆ అగ్నిహోత్రాన్ని సమీపించి, తన హుక్కా అంటించుకోడానికై నిప్పు తీసుకోబోయెను. ధ్యాననిమగ్నుడై యుండు తోతాపురి అది చూచి పట్టలేని ఆగ్రహంతో అతణ్ణి తిట్టడమే కాక కొట్టబోయాడు కూడ.

వేదాంత చర్చలోనిట్లు కోపం వహించడం తగదు. రామకృష్ణ పరమహంస, తనగురువు సేవకుని నిట్లు కోపగించడం చూచి, విస్తుబోయి తుదకు పగలబడి నవ్వెను. శిష్యుడట్లు నవ్వుతూండడం చూచిన గురువు తోతాపురీ, ఎందుకట్లు నవ్వుతున్నావు? అని ప్రశ్నించగా, స్వామి రామకృష్ణ పరమహంస వెంటనే నిట్లనెను.

గురువర్యా! మీరిదివరకే నాతో "బ్రహ్మమొక్కటే సత్యమనీ, ప్రపంచములో అన్నీ దాని వ్యక్త రూపాలేనని", చెప్పినది మరచి, అంతలో నీతడొనర్చిన కార్యమునకు మీరిట్లు మండిపడడం చూచి నవ్వుకున్నాను".

తోతాపురి శిష్యుని మాటలోని అంతరార్థం గ్రహించి సిగ్గుపడి, శిష్యునితోనిట్లనెను. "నాయనా! నీవన్నది పరమసత్యం. నేనట్లు ఉద్రేకపడడం పొరపాటే. కోపంతో పరమసత్యాన్ని మరచితిని" అని పశ్చాత్తాపపడ్డాడు.

"జీవునకు క్రోధం పరమశత్రువు" అని చెప్పడంవరకే. కాని అమలులో శూన్యమని, రామకృష్ణ పరమహంస వంటి శిష్యులు చెప్పడంలో అలాంటి గురువులీనాడు ఎందరో కలరని తలంపు. శిష్యుని మాటతో తప్పు దిద్దుకొను గురువులు కలరు.

★★★

**గురు - సూత్రం**

"అశిష్యాయ న దేయం యోయది మోహదాస్యతి స పాపీ యాం భవతి"

★★★

# 77. గురువుపై గురితప్పి పతనమైన పాండురంగని కథ

"పాండురంగ మహాత్మ్యము"లోని భక్తి మార్గాన్ని బోధిస్తూనే, గృహస్థాశ్రమ ధర్మాన్ని కీర్తించిన ప్రత్యేకమైన కథ ఇది.

అగస్త్యుని ఆశ్రమంలో అనేకులు శిష్యులు విద్యనభ్యసిస్తున్నారు. వారిలో 'ప్రయుతుడ'ను ముని కుమారు లిరువురు అయుతుడు, నియుతుడను వారున్నారు. వారిరువురు మిగిలిన శిష్యులందరిలో గొప్ప జ్ఞాన సంపద కలవారై, మిక్కిలి తేజోవంతులై, శాంతపరులై, ఓరిమిగల వారై యుండిరి. మరియు గురువు యెడల అతివినయ విధేయతలతో మెలగుచుండెడివారలు. అందుకని గురువు కూడా వారిని మిక్కిలి వాత్సల్యంగా చూచెడివారలు.

అయుతుడు, నియుతుడు యుక్తవయస్కులైనారు. అయినను, నిరంతరం వారు శాస్త్రాలు వేదాలు వల్లిస్తూండడంలో ఏనాడు తమ వయస్సును పరిగణించు కోలేదు.

అట్టి అహోరాత్రులు వేదాధ్యయన పరులైన వారిరువుని చూచి ముగ్ధుడైన అగస్త్యుడు వెంటనే వానికి వివాహ మొనర్చవలెనని తలంచెను. అందులకై తగిన కన్యల ఆన్వేషణగా బ్రహ్మలోకానికెళ్ళి, బ్రహ్మపుత్రికలైన 'సావిత్రి, గాయత్రీ'లను వీరిరువుకిచ్చి వివాహమొనర్చ నిశ్చయించాడు.

గురువు అగస్త్యుడు తిరిగివచ్చి వారిరువురితో వివాహం గూర్చి ప్రసంగించాడు. నియుతుడు గురువాజ్ఞగా వివాహానికి అంగీకరించాడు. కానీ జ్యేష్ఠుడగు అయుతుడు మాత్రము వివాహానికి అంగీకరించలేదు. గురువెన్ని విధాలుగా గృహస్థ ధర్మం గూర్చి చెప్పినను **అయుతుడు వినక** గురువాజ్ఞను ధిక్కరించగా, ఇక అగస్త్యునికో సహనం నశించి, ఆ అ**యుతుని ఆశ్రమంను**ండి బహిష్కరించెను.

ఆ కన్య లిరువురుని నియుతునికే యిచ్చి వివాహ మొనర్చెను.

అయుతుడు తనమనస్సు ఏమాత్రము త్రిప్పుకోకపోగా, స్త్రీలంటేనే చిరాకు పడుచు, గురువాజ్ఞను పాటించ లేననుచు, దృఢ నిశ్చయుడై బ్రహ్మచర్యమే పాటించయత్నించాడు. గొప్ప తపస్సంపన్నుడై పోవాలనే దీక్ష కలిగి, అడవి వెళ్ళినియమవ్రతుడై తపోనిష్ఠుడైపోయెను. ఆ తపోనిష్ఠకు ముల్లోకాలు తల్లడిల్లిపోగా, ఇంద్రాది దేవతలు కలతచెందిరి.

అయుతుని తపస్సును నెట్లైన భంగపరుచ యత్నించుటకై ఇంద్రుడే వృద్ధ బ్రాహ్మణ రూపములో అతని ఆశ్రమ ప్రాంతంలో నివసించెను. అయుతుని మనస్సును

గృహస్థాశ్రమంవైపు తిప్పాలని ఇంద్రుని లక్ష్యం.

అయుతుడు ఆవృద్ధ బ్రాహ్మణుని రాకకు కారణమడుగగా నీతడు "నేను, సమస్త ధర్మాలలో ప్రశస్తమైనదిగా గృహస్థాశ్రమ ధర్మం పాటిస్తూ తీర్థ యాత్రలు చేస్తున్నాను. నువ్వుకూడ ఈ తపస్సు మాని గృహస్థ ధర్మం స్వీకరించి, నాతోరమ్మనె"ను. కానీ, అతడు తన పంతం గూర్చి, తన గురువు అగస్త్యుని నుండి బహిష్కరింపబడితినని, పలికి తుదకు బ్రహ్మచర్య దీక్షనే మోక్షాన్నిస్తుందని పలికెను.

ఇంద్రుడు విని, "నాయనా! మీ తండ్రి నాకు స్నేహితుడు. గురువాగ్రహంతో మరియు బ్రహ్మచర్య దీక్షతో సాధించేది ఏమిలేదు. పరాశరాది మునులు, జనక మహారాజు వంటి రాజులును గృహస్థాశ్రమ ధర్మంతో ముక్తిని పొంది కృతకృత్యులైరి. సన్యాసులే మోక్షార్హులని ఎలా తలంచావు. గృహస్థుడవై విష్ణువును పూజించి, నివేదన మొనర్చి అతిధులను సేవిస్తూ, వారి అనుగ్రహంతో నీవు నీ భార్యయును మోక్షాన్ని పొందవచ్చును. శిలాప్రతిమలా కూర్చుండి కేవలం తపస్సే ముక్తి ప్రదమని" కాదు అన్నాడు.

అయుతుడు దానినే మాత్రం అంగీకరించక "స్వామి! కుక్క సింహం కానట్లు, గాజు రత్నం కానట్లు, ఉమ్మెత్తకాయ కల్పవృక్ష ఫలం కానట్లు, ఈ బూడిద బొట్టులాంటి అస్థిరమైన నీచ గృహస్థా శ్రమ ధర్మమ్మును ఎందుకు కీర్తిస్తున్నావు" అన్నాడు కోపంగా.

ఇంద్రుడును అయుతుని వాదీపటిమకు సంతసించిననూ, పైకి కోపం ప్రకటిస్తూ, "నీవు అగస్త్యుని వంటి సద్గురువునే ధిక్కరించిన వాడవు. అట్టి నీ వంటి వానికి హితోపదేశ మొనర్చుట పిరికి వానికి యుద్ధ మొనర్చుట గూర్చి, లోభికి దానధర్మం గూర్చి చెప్పినట్లైనది. నీవేదో శుకుని వంటి గొప్ప వాడవగుదువని తలంచి, దురాశలో అందని పండ్లకు అర్రులు చాచినట్లున్నది. బొందితోనే కైలాసం చేరెదవా! నీకింత పట్టుదల పనికి రాదు" – అంటూ నిట్టూర్చి అక్కడి నుండి వెళ్ళెను.

ఇంద్రుడు తన ప్రయత్నం మానక, అయుతునికొక యాతన కలిగేటట్లు, ఒక వృద్ధ ధేనువును సృష్టించి, అతని ఆశ్రమంలోకి ప్రవేశింప జేసెను. తన ఆశ్రమంలో లేవలేకపడియున్న ఆ వృద్ధ ధేనువు సంరక్షణలో పడి, తన తపోదీక్షను కొనసాగించు కోలేక పోయెను. అట్లగుటతో పరితపిస్తూ, తప్పు చేస్తున్నానని భావించి, ఆ ధేనువును ఆశ్రమం నుండి తరిమిపంపెను.

ఆ ధేనువు నేరుగా "వాధూలముని" ఆశ్రమంలో ప్రవేశించి, అచట చెట్ల పొదల్లో తపస్సొనర్చు ఆ మునిని త్రొక్కెను. దానితో ఆ మునికి తపోభంగంకాగా, ఆవునిలా విడిచిపెట్టినదెవరో గ్రహించి, తన తపస్సును భంగ మొనర్చిన కారకుడు అయుతుడని వెంటనే, "నీవొక కప్ప రూపము పొందుమ"ని శపించెను. అయుతుడు వణుకుచు, ఆవాధూల

మునిని చేరి, తన తప్పిదమును గూర్చి చెప్పి తనను క్షమించమని, ఈ శాపాన్ని ఉపసంహరించమని వేడెను.

వాధూలముని అతని ప్రార్థనకు జాలిపడి నిజం గ్రహించి, తానూ ఇంద్రునిలాగా ఉపదేశ మొనర్చెను. పెద్దలమాట తిరస్కరించ వద్దని చెప్పి తన శాపవిమోచన మార్గం చెప్పి, ఆ పౌండరీకుని చేరి దర్శించి, సేవించి తరించమని పలికి ఆశీర్వదించిపంపెను.

అయుతుడు అటులే పుండరీక క్షేత్రం చేరి ఆ స్వామిని దర్శించి సేవించుచుండగా నచటనే అతడు చిత్ర విచిత్ర వర్ణములతో మగ కప్పగా మారెను. అయినను భగవధ్యాన పరుడై 'హరిదాసు' అనే పేరుతో జీవిస్తున్నాడు.

కొంతకాలం గడిచిన పిదప, కన్యాకుబ్జ రాచపుత్రిక తన చెలులతో పౌండరీకుని చేరి, అచటనున్న అందమైన మగ కప్పను పట్టుకొనుటతో, ఆ కప్ప భీతితో వణకగా, దానిని విసరికొట్టెను. ఆ విసురుటలో అక్కడున్న ఒక బ్రాహ్మణునిపై పడగా, అతడు కోపించి ఆమెను, ఆమె చెలిని 'ఆడకప్ప రూపం పొందుదుర'ని శపించెను. తోటి చెలులు, తాను ఇట్లు కప్పరూపములు పొందగా, ఆ కప్ప లిరువురును, తోటి చెలులతో వైవాహిక జీవితం గడుపుచుండగా, వారిలో వారికి సవితి మాత్సర్యం గ్రహించి, తానిట్లు కప్పగా రూపొందుటకు కారణం, గురువును ధిక్కరించుట యే యని పశ్చాత్తాపపడి, ఆ పౌండరీకుని అనుగ్రహంతో శాప విముక్తిని పొంది, గృహస్థుడై సత్ప్రవర్తనతో ధర్మకార్యాలొనర్చుచు తుదకు జీవన్ముక్తి పొందెను అయుతుడు.

★★★

## గురు - సూత్రములు

"బ్రహ్మచారీ గురు శుశ్రూష్యా మరణాత్."

బ్రహ్మచారి ఆమరణ పర్యంతం గురు శూశ్రూష చేయవలెను.

– (బౌధాయన సూక్తి : 2 - 16 -15)

★★★

"విశ్వరూపో గురుః ప్రోక్త శ్శిష్యో గురువపుః స్మృతః"

గురువు జగత్స్వరూపుడని, శిష్యుడు గురువుయొక్క శరీరమని స్మృతులు చెప్పుచున్నవి.

# 78. సత్యకాముని కథ

"జబాల"యనునొక వనిత కుమారుడు, విద్యనభ్యసించుటకై "గౌతమ మహర్షి" గురువునొద్దకు చేరెను. ఆ గురువు, నీ గోత్రమెయ్యేది? అని అడిగెను. అతడు తన తండ్రినేయెరుగడు, గోత్రమెట్లు యెరుగును. తల్లి జబాలను విచారించగా, ఆమెయునెరుగనని చెప్పగా, తోచక గురుని చేరి తనపేరు మాత్రము సత్యకాముడని, తన పూర్వ గురువగు హారిద్రమతుడు చెప్పినది జెప్పెను. అతడు (గౌతముడు) వల్లెయని సత్యకామునకు ఉపనయనము గావించి, తన శిష్యునిగా సమ్మతించెను.

కొంతకాలమునకు గురువు గౌతముడు సత్యకాముని పిలిచి బక్కచిక్కిన 400 సంఖ్య గల గోవులను అప్పగిస్తూ, ఆ గోవులను సహస్ర సంఖ్య కలవిగా జేసి కావుమనెను. సత్యకాముడు గురువాజ్ఞగా నాగోవులను నరణ్యములకు గొనిపోయి, యవి సహస్ర సంఖ్య కలవి యగువరకు నచ్చటనే యుండెను. వానిలో నొక వృషభమందు వాయుదేవుడావేశించి యిట్లనెను. సత్యకామా! మేము సహస్ర సంఖ్య కలవారమైతిమి. మమ్ములను గురువునప్పగించుము. నీకు బ్రహ్మజ్ఞానము పదేశించెదమని ఆ వృషభము పలికెను.

సత్యకాముడటులే గోవులను మరలించుకొని పోవుచుండగా దారిలో నతనికావృషభము బ్రహ్మజ్ఞానమందొక పాదమెరింగించెను. ఆ వృషభమే వాయుదేవుడు. అటులే "అగ్ని"యొక పాదము, సూర్యుడొక పాదము, "మద్గి"యను పక్షియొక పాదము ఉపదేశించెను. ఇటుల వారివారి యుపదేశములు పొంది గురువాశ్రమము జేరెను. సహస్ర సంఖ్య గల గోవులతో చేరిన సత్యకాముని గురువు చూచి, "నాయనా! నీ ముఖమందు బ్రహ్మజ్ఞాన కళ యేర్పడినది. ఆ బ్రహ్మజ్ఞానముపదేశించిన వారెవర"ని అడిగెను. అందులకు సత్యకాముడు వినయ విధేయతలతో, "ఆచార్యా! దేవతలు నాకుపదేశించిరి. కానీ, నేను ఈ బ్రహ్మజ్ఞానమును గురువు (మీ వలన) నేర్చినచో మాత్రమే పరిపూర్ణుడనగుదునని, కావున మీరును యుపదేశించుడని యర్థించెను.

గౌతముడు సంతోషించి, అతని వినయవిధేయతలకు ఆనంద భాష్పములు చెమ్మరిల్లగా, సత్యకాముని కోరికగా నటులే బ్రహ్మజ్ఞానము పరిపూర్ణముగా నుపదేశించెను.

★★★

# 79. పరనిందా ఫలితం
## (గురుశిష్యుల కథ)

ఏదేని ఒకరి గురించి చెడుగా చెప్పినపుడు, మాట్లాడినపుడు, అతని చెడు తత్త్వమును నిందించిన వారలు కొంత పంచుకొంటారు. దానితో అతనిలోని చెడుతనము కొంత తరిగినట్లై మంచికి తావిచ్చిన వాడగునని శృతి వాక్యము.

అందులకొక గురుశిష్యుల కథ ఉదాహరణం.

ఒక గురువు, ఒక శిష్యుడు కాలినడకన ప్రయాణం చేస్తూ, వారు కనకపురమనే గ్రామం చేరుకొన్నారు. ఆ రాత్రి వారు గ్రామానికి వెళ్ళాలనిన అక్కడున్న ఒక నదిని దాటి వెళ్ళాలి. కానీ, తుఫాను, ఈదురుగాలి, వర్షముతో ప్రకృతి అంతా అల్లకల్లోలంగా ఉంది.

ఆ నదిని దాటవలనన్నా ఒక్కడును పడవ వేయడానికి ముందుకు రాలేదు. తుదకొకడు, "నేను మీరిరువురిని నా భుజాలపై మోస్తూ దాటించగలన"ని అన్నాడు. గురుశిష్యులు ఒప్పుకొన్నారు. ఆ వ్యక్తి మొదట శిష్యుని, ఆ తర్వాత గురువును మోస్తూ నదిని దాటించాడు. కానీ, వారిద్దరిని మోస్తూ దాటించడంలో తేడా కనిపెట్టి, ఆ విషయాన్ని బయటికి అనేశాడు. ఏమిటా తేడా? అని ఉండబట్టలేక ప్రశ్నించాడు శిష్యుడు.

స్వామీ! ఏమీ లేదు. కొన్నాళ్లనుండి నేనేదో కనిపించని బరువును మోస్తున్నట్లుగా నుండెడిది. మరల నిన్ను మోయగానే ఆ బరువు రెట్టింపు అయినట్లు తోచినది. అటులే మీ గురువును మోయునపుడు ఆ బరువంతయు తొలగినట్లై ఎంతో హాయిగా, తేలికగా తోచినట్లైనది. కాని వారిని దింపగానే, మరల యధాతధా బరువంతా వచ్చి చేరినట్లైనది. అని పలికి వారి నుండి సెలవు పొంది వెళ్ళాడా వ్యక్తి.

ఆ వ్యక్తి వెళ్లిన తదుపరి, శిష్యునిలో సందేహం తలెత్తి వెంటనే గురువును అడిగాడు. "స్వామీ! ఇతని మాటల్లోని ఆంతర్యమేమిటి?"

"మరేం లేదు. నీవును విన్నావు కదా! నన్ను మోయుటలో అతనిలో నున్న పాపభారం తొలగి తేలికనిపించింది. నన్ను దింపగానే మరల ఆ పాపభారమంతా యథాతథంగా అతడి నెత్తికెక్కినది" అన్నాడు గురువు.

ఆ మాటలు వినిన శిష్యుడు ఆశ్చర్యపడ్డాడు. గురుశిష్యులిరువురూ కనకపురం గ్రామంలో ఒక పెద్దమనిషి యింట మకాం చేశారు. శిష్యునిలోని సందేహం నివృత్తికై, అతడు (శిష్యుడు) ఏదో పనిపై నదిని దాటించిన వ్యక్తి వాకబు చేసి వచ్చెను.

కొంతకాలానికి వారిరువురు తిరిగి తిరిగి మరలా కనకపురానికి చేరుకొన్నారు.

ఆ రాత్రి తమను నది దాటించిన వ్యక్తికై వాకబు చేశారు. ఒకరికొకరు ఆ వ్యక్తి గూర్చి ఇట్లు పలకిరి.

"అతడా? పాపి, ఎన్నో పాపాలు చేసినవాడేనా? అతడు ఊరి చివర ఎక్కడో ఉంటాడు." అన్నాడు ఒకడు.

మరొకడు, "ఆ పాపిని ఈ రోజే సంతలో చూశాను" అన్నాడు. ఇట్లు ప్రతివారును అతని గూర్చి చెప్పుచూ అతడు పాపుడని చెప్పడం జరిగెను.

తుదకతడు కనిపించాడు. గురువును చూచిన తోడనే సాష్టాంగ దండప్రణామంబు చేశాడు. గురువతని భక్తికి సంతసించి, "నాయనా! నువ్వు ఎంతో కాలంగా మోసిన, కనిపించని బరువంతా మాయమైపోయింది గదా! అవునా!" అని అడిగాడు చిరునవ్వుతో.

అతడు వెంటనే "అవును స్వామీ! మీ ఆశీస్సులతో అంతా పోయింది. ఇప్పుడెంతో హాయిగా ఉంది" అన్నాడు.

ఆ గ్రామం నుంచి తిరిగి వెడుతున్నపుడు "ఆ పాపపు వ్యక్తి భారమంతా ఎలా తొలగింది స్వామీ!" అని ప్రశ్నించాడు ఆశ్చర్యంగా.

"నాయనా! ఆశ్చర్యపడేదేముంది. ఆ వ్యక్తి పాపపు భారమంతా, అతని గూర్చి పలికిన వారందరు పంచుకున్నారు, నీతో సహా" అన్నాడు గంభీరంగా గురువుగారు.

శిష్యుడు విస్తుపోయాడు.

"స్వామీ! నాతో సహా అన్నారు, అదెలా?"

"నాయనా! క్రిందటి సారి నువ్వు ఒంటరిగా కనకపురానికి వచ్చినపుడు, ఆ ఊళ్లోనున్న వారందరిని, ఆ వ్యక్తిని గూర్చి "పాపభారాన్ని మోస్తున్న ఆ పాపి ఏడీ? అని ప్రశ్నించావు. వారును, అతడా! మహాపాపి. ఎటు వెళ్లాడో తెలియదు? అన్నారు. ఇట్లు ప్రతివారును అతడు మహాపాపిగా అతనిలోని చెడ్డగుణం నిందించిన వారంతా అతని పాపభారం భరించడమైనది. వారిలో వాకబు చేసిన నీకును కూడా కొంత సంక్రమించగా, అతడిప్పుడు నిష్కల్మషుడై తేలికగా, హాయిగా నున్నాడు.

ఎందుకనగా మాట పడినవాడు ఆ బరువునుంచి బయటపడి హాయిగానుంటాడు. మాటలన్నవాడు అనగా అకారణంగా పరనింద పలుకువాడు పాపమును పంచుకొన్నవాడగును. అంతకంటే మరేం లేదు" అన్నాడు గురువు.

"కావున పరనింద పాపభూయిష్టము" నీతి.

★★★

# 80. తిరుమల నంబి కథ

## గురుశిష్యుల బంధము

"శ్రీశైల పూర్ణులు" అంటే తిరుమలనంబిగారు. రామానుజులకు మేనమామ. "గోవింద భట్టరు" రామానుజులకు పినతల్లి కుమారుడు. ఈ రామానుజులను కొందరు యాదవ ప్రకాశులు యేలాగైనా యడ్డు తొలగించుకోవాలని తలంచిరి. ఆ విషయం గోవిందభట్టరు తెలుసుకొని రామానుజులను రక్షించెను. అందులకు శ్రీశైలపూర్ణులు (తిరుమలనంబి) ఈ గోవిందభట్టరును దిద్దుబాటు చేసి, పంచ సంస్కారాలు ప్రసాదించి తమ శిష్యునిగా చేసుకొన్నారు.

ఆనాటి నుండి గోవిందభట్టరుకు తమ ఆచార్యులు తిరుమలనంబిగారంటే చెప్పలేనంత భక్తి. ఆ ఆచార్యులకు సకలకైంకర్యాలు తానే చెయ్యాలన్నదే ఆయన జీవిత ధ్యేయం. ఆ ఆచార్య భక్తి ఎంతవరకు వెళ్ళిందంటే, ఆ ఆచార్యులకు పడుకోవడానికి పక్కవేసి, ఒక సారిదానిపై తాను పడుకొని చూచి, బాగుందని భావించాకే తృప్తి కలిగేది గోవింద భట్టరునకు.

ఒకనాడు రామానుజులు అదిచూచి, తిరుమలనంబిని యిట్లడిగెను. "ఏమిటీ? యితడు ఇలా ఆచార్యుల పక్కపై పడుకొని లేస్తున్నాడు", అని. అందులకాచార్య గోవిందభట్టరునుండియే తెలిసికోవాలని, అతనిని పిలిచి ఏమయ్యా! గురుతల్పంపై పడుకొంటే యెంత పాపమో నీకు తెలియదా? ఎందుకలా చేశావు. అన్నారు గురువు. "స్వామీ! పక్కాఎలాయుందో, ఏ ముల్లైనా లోపలయుంటే, అది మీకు గ్రుచ్చుకుంటే ఎంతబాధ, దుమ్ముధూళి అన్నీ ముందుగా నా శరీరానికే అంటి, ఏ బాధయైనను నా శరీరానికే సోకి తెలిసి, దానిని సరిచేయవచ్చుకదా! మీకెలాంటి నిద్రాభంగం లేకుండా హాయిగా నిద్రించడమే నా సేవకు పరమార్థం. ఆచార్యులకు బాధ కలగకుండాయుంటే నాకంతే చాలు. ఆ ప్రక్రియతో నాకు 'కుంభీ పాక నరకం ప్రాప్తించిననూ మేలే" - అన్నాడు శిష్యుడు.

శ్రీరామానుజులు క్షణకాలం గోవిందభట్టర్ గురు భక్తికి నిశ్చేష్టులైరి. ఆయనకొక దృశ్యం కనులముందు కదిలింది. ఒకనాడు గోవిందభట్టర్ వస్తూంటే, వెనుక దూరంగా రామానుజులు వస్తున్నారు. గోవిందభట్టర్ ముందొక తెల్లత్రాచు నాలుకపై నున్ననొక ముల్లుతో బాధపడుచుండగా, వెంటనే నీతడు ధైర్యముగా నా పాముని పట్టి దాని నాలుకపై నున్న ముల్లును తొలగించాడు. ఆ దృశ్యం చూచిన రామానుజులు గోవిందభట్టర్ భూతదయకు ఆశ్చర్యపోయారు. ఆ దృశ్యం కళ్ళల్లాడింది.

సంవత్సరకాలం శ్రీ మద్రామాయణం పారాయణ కాలక్షేపం పూర్తిచేసుకొని

శ్రీరామానుజులు కాంచీపురానికి ప్రయాణమయ్యారు. శ్రీశైలపూర్ణులు యీ సంవత్సరకాలం శ్రీరామా నుజులు తమతో నున్నందులకు గుర్తుగా తానేదైన సన్మానం చేయాలని తలంచెను. అందులకు శ్రీశైలపూర్ణులు శ్రీరామానుజులను పిలిచి, "రామానుజా! నీకు చాలయిష్టమైనది, నేనియ్యదగినదేదైన కోరుకో. నీకది యియ్యాల"ని యుందన్నారు. ఎంత విచిత్రం, శ్రీ రామాయాణార్థాన్ని యేడాది పాటు యనుగ్రహించడమే కాక, ప్రేమగా నింకాయేదో యియ్యాలి, అనుకొనేది ఆచార్యులపై అభిమానం యెంత గొప్పది. శ్రీరామానుజులు క్షణకాలం మౌనం వహించి తన్మయత్వం చెందాడు.

ఇట్లు యిక్కడున్నంతకాలం శ్రీరామానుజులు గోవిందభట్టర్‌ను గమనిస్తూనే యున్నారు. ఆ ఆచార్యభక్తి, వినయం, విధేయత అన్నీ అతనినెంతో ఆకర్షించినాయి. అందుకే, "స్వామీ! దేవరవారికంత యనుగ్రహం కలిగితే, యీ గోవిందభట్టర్‌ని నాకు ప్రసాదించండి" అన్నారు శ్రీశైలపూర్ణునితో. అతడొక్కక్షణం గోవిందభట్టర్ కేసి చూచి, యితడు లేకుండా నేనుండగలనా? అని, మరల మనస్సుదిటవు చేసుకొని, యితనిని సాధారణంగా నిచ్చిన తనను విడిచి శిష్యుడుండలేదని, అందుకని ఉదకధారతో నీకందిస్తున్నానని గోవిందభట్టర్‌ను శ్రీరామానుజులకు ధారాదత్తం చేశారు శ్రీశైలపూర్ణులు.

గోవిందభట్టర్ లాంటి శిష్యులనిన ప్రీతి యెవరికుండదూ. అలాంటి గురువులు, ఈలాంటి శిష్యులు నేడు చాలా అరుదు.

★★★

## గురు - సూత్రములు

"ఆచార్యః శ్రేష్ఠో గురుణాం మాతే త్యే కే"

తల్లి తండ్రులకన్నా ఆచార్యుడు ఉన్నత స్థానీయుడు.

- (గౌతమ సూక్తి :1-2-56)

★★★

"స్థితా గురౌస్థే యాత్"

ఆచార్యుడు నిలబడియుండగా బ్రహ్మచారి నిలబడియే యుండవలెను.

- (వైఖాయనస ధర్మ సూక్తి :8-2-15)

★★★

# 81. గురుబోధనా శక్తి

## (పరాశర - మైత్రేయుల వృత్తాంతం)

పరాశర మహర్షి తన దీర్ఘమైన జీవిత కాలాన్నంతా నొక్కక్షణం కూడా వృథాపోనీయక, ఏదో యొక యుపదేశం యితరులకు బోధిస్తూండేవారు. ఈ విషయంలో తనకెవరూ సాటిలేరు, అని అనపించుకొనడమేగాక, బోధనలో మంచి యనుభవాన్ని సాధించాడు. ఇతడు, శిష్యుడు అంటే చాలు, తను అతనికేదో బోధించేవాడు.

అందులకే ప్రజలంతా అతడిని సకల శాస్త్రాలలోను, వేదాలలోను పరిపూర్ణ పండితునిగా గుర్తించేవారు. అని, ఇదే మాటను పరాశరుడు తన "విష్ణు పురాణము"లో తన శిష్యుడైన మైత్రేయుడిని మాటగా చెప్పించాడు. మైత్రేయుని పోలిన యనేక వేల శిష్యులనుద్ధరింప జేసిన మహనీయుడుగా పరాశర మహర్షి గోచరిస్తాడు. ఆచార్యుడిగాను నుండే వారు.

ఆచార్యుడనగా! "స్వయం ఆచరతే తస్మాత్ ఆచార్య ఉచ్యతే" - అని చెప్పబడినట్లు, తానాచరించుచు, ఇతరులకు ఉపదేశించుచుండు వాడు ఆచార్యుడు. అనే సూత్రాన్ని అక్షరాల పాటించిన మహనీయులలో పరాశరమహర్షియే ముందు లెక్కించ తగినవాడు. "విష్ణుపురాణం" గ్రంధ కర్తయును, అందున్న మొదటి శ్లోకమే దీనికి యుదాహరణం.

మైత్రేయుడు పరాశర మహర్షికి నమస్కరిస్తూ -

శ్లో॥ త్వత్తో హి వేదాధ్యయన మధీత మఖిలంగురో ।
ధర్మ శాస్త్రాణి సర్వాణి తథాఙ్గాని యధాక్రమమ్ ॥

భా: ఓ గురుదేవా! మీ వలన వేద వేదాంగములను, సర్వ శాస్త్రములను చదివి, అధ్యయన మొనర్చితిని. అని గుర్వను గ్రహమును పొగడెను.

అటులనే గ్రంథకర్తగా, గొప్ప తత్త్వజ్ఞునిగా, యుపాధ్యాయునిగా, అనుష్ఠాన శీలునిగా నున్న పరాశర మహర్షి తన యనుభవములో దర్శించిన యనుభవ యధార్థము లన్నిటిని, అనేక గ్రంథాలుగా వెలువరించి లోకానికిని యుపకరించారు.

ఋగ్వేదంలో ననేక సూక్తాలు రచించినవి, వీరు దర్శించి యుపదేశించినవే. లోక ప్రసిద్ధమైన "విష్ణుపురాణం"తో బాటు, "పరాశర స్మృతి" అను ధర్మశాస్త్ర గ్రంధము కూడ వీరు రచించినదే - సంఘ సంస్కరణలను అధికంగా నాదరించి, కలికాలానికి సరిగా సరిపోయేటట్లు వ్రాయబడిందీ గ్రంథం.

శ్లో॥ కృతేతు మానవోధర్మః త్రేతాయాం గౌతమః స్మృతః ।
ద్వాపరే శంఖ లిఖితః కలౌ పారాశరః స్మృతః ॥

అను నీ శ్లోకం ప్రసిద్ధికెక్కింది. జ్యోతిష్యంలోను, ఆయుర్వేదంలోను కూడ వీరు గ్రంథకర్తలు.

పరాశర మహర్షి తన దీర్ఘమైన జీవనకాలంలో చాలా భాగం తపస్సుతో సిద్ధిని పొందినట్లు, అందులకే వీరిపేరుతోనే "పరాశర క్షేత్రం", "పరాశర తీర్థం" అని ప్రసిద్ధి కెక్కిన స్థల మహాత్మ్యమునకే పరాశరేశ్వరుడే కారణం, అని చెబుతారు.

అటులనే వేద ప్రసిద్ధి.

ఇతిహాస పురాణాల్లో, లౌకిక వ్యవహారాల్లో బాగా ప్రసిద్ధి చెందినట్లుగా, అదేరీతిగా "వేదాల్లో"ను ప్రసిద్ధికెక్కిన మహావ్యక్తి 'తైత్తరీక ఆరణ్యకం'లో మొదటి ప్రశ్నలో-

"సహోవాచ వ్యాసః పారాశర్యః" అనే వాక్యం కనిపిస్తోంది. "పరాశరునకు కుమారుడైన వ్యాసుడు పలికెన"ని దీని అర్థం.

ఈ వాక్యం, "కృష్ణ ద్వైపాయనే" పరాశరుడైన వాని కుమారుడు "వ్యాసుడు" అని సూచిస్తుంది.

విష్ణుపురాణాదుల్లో పరాశరాది మహర్షులు ఈ మూడు శక్తుల గూర్చి ప్రస్తావించారు.

1. విష్ణు శక్తి, ఇదే పరాశక్తి లక్ష్మీ రూపిణి.
2. క్షేత్రజ్ఞ శక్తి, అనగా జీవశక్తి.
3. మాయా రూపిణి అయిన అవిద్యాశక్తి (ప్రకృతి స్వరూపం).

ఈ మూడు శక్తులలో మూడవదైన "ప్రకృతి స్వరూప మాయాశక్తి".

రెండవదైన జీవ శక్తిని భగవత్సంకల్పంచే ఆదరించి యుంటుందంటారు పరాశరులు.

★★★

## గురు - సూత్రం

"గుర్వభావే తత్పుత్రేచ గురువత్కర్మాచరతి"

ఆచార్యుడు లేనిచో అతని పుత్రుని గురువుగా భావించి కర్మలాచరించవలెను.

- (వైఖాయనస ధర్మ సూక్తి :8-2-25)

# 82. శిష్యత్వమునకు అర్హత

కబీరుదాసును ఎరుగని వారు లేరు. వారి నిరాడంబరత, అమృతం ఒలుకు పలుకులు. సమదృష్టి కలవాడు. దైవధ్యానమగ్నుడు. పేదరికంతోనున్ననూ దివ్యానందజీవి. నేతవృత్తిలో భగవన్నామ తత్పరుడు. కాశీ నివాసి. అతని భార్య లోయీ, ఉత్తమ ధర్మపత్ని. వారన్నా మహారాజుల నుంచి సామాన్యుడి దాకా, సర్వులకు ఆయన పట్లా భక్తి గౌరవాలు కోరుకుంటే కనకవర్షం కురుస్తుంది. వారికి కానీ, పేదరికమే భగవత్సన్నిధికి చేరుస్తుందని విశ్వాసం ఆయనది.

ఇట్లుండగా వారి ఇంటికొకడు చేరి వినయ విధేయతలతో వినమ్రుడై చేతులు కట్టుకొని నిలుచున్నాడు. చూచుటకతడు బలిష్ఠంగా రాజదర్పంతో నుండడం కబీరు గ్రహించి, ఎవరు నీవని ప్రశ్నించాడు. అందులకతడు, తాను రాజునేనని నిజంచెప్పి, శిష్యునిగా స్వీకరించి, జీవితం తరించే ఉపదేశమిమ్మని అర్థించెను.

అందులకు కబీరు అదెలా సాధ్యమని, పలుకగా, నేను కేవలం యాచకునిగా వచ్చితిని. రాజుగా కాదు. నన్నను గ్రహించి నా అభ్యర్థనను మన్నించండి." అన్నాడు రాజు

కబీరు సరేనని సమ్మతించగా, వారి కుటుంబంలో రాజు ఒక సభ్యుడై వారి సేవలొనర్చుచూ శ్రమలో బాధ్యతగా శ్రద్ధాభక్తుడై మెలగుచుండెను.

ఇలా ఆరేళ్ళు కాలం గడువగా, కబీరు భార్య లోయీకి జాలి కలిగి, రాజై యుండు వాడు యిట్లు సేవా తత్పరుడుగా కాలం గడపడం జూచి, ఒకనాడు భర్తతో అతనిని శిష్యునిగా అంగీకరించి ఉపదేశమిమ్మని కోరింది.

ఆ మాటవిని, కబీరు, "అతని మనస్సు ఇంకా స్వచ్ఛంకాలేదు. కావున ఆ అర్హతకు తగడు." అన్నాడు. లోయీ వాదించగా, "సరే- అని, నువ్వు ఒకనాడు ఇంట్లో చెత్తంత ప్రోగుచేసి, అతను వచ్చి నిలుచున్నప్పుడు నెత్తిన పోయి. అప్పుడతడు ఏమన్నాడో నాతో చెప్పు." అన్నాడు కబీరు.

భార్య లోయీ అటులేచేసింది ఒకనాడు. కానీ, రాజు నివ్వెరపోయి, అవమానంగా నిట్టూర్చి "ఇదే నా రాజ్యంలో ఇట్లొనర్చుటకు సాహసించే దానివి కాదు" అన్నాడు రాజు

అట్లన్న మాటలు లోయీ భర్తతో చెప్పింది. కబీరు, "చూశావా! అతడింకా ఉపదేశానికి అర్హుడు కాలేదు." అన్నాడు నవ్వుతూ. లోయీ కూడ సమ్మతించింది.

మరికొంత కాలం గడచిన తదుపరి, రాజు చేయుసేవలలో శాంతస్వభావం,

స్వచ్ఛత, ఓపిక, వినమ్రత పెరిగింది. లోయీ, కబీరులు కూడ గుర్తించారు.

అయినా, పరీక్ష తప్పనిసరి కదా! అందుకని కబీరు ఆదేశంగా లోయీ మరల ఒకనాడు అటులే చెత్తనంతటిని ప్రోగుచేసి, రాజు రావడంతో అతని శిరస్సుపై చల్లింది. అదిగని, రాజు - "తల్లీ! ఇట్లొనర్చుటలోనూ నా అహం చావలేదు. అందులకీ శాస్తి నాకు తగినదే." అన్నాడు.

లోయీ రాజు అన్నమాటలు భర్తతో చెప్పగా, "అతడు (రాజు) ఇప్పుడు ఉపదేశానికి అర్హుడ"ని సంతృప్తిచెందిన కబీరు, వెంటనే రాజును లోపలికి పిలిచి సాదరంగా ఉపదేశమిచ్చెను.

అనగా రాజువైపు కబీరు దృష్టి సారించగా రాజు "ఆత్మ" మెరుపులాగా ఊర్ధ్వలోకాలవైపు సాగిపోయి పరమాత్మతో తాదాత్మ్యం చెందింది. దాంతో తన భూమండలాధిపత్యమంతా ఒక గడ్డిపరకగా తోచింది రాజుకు. అప్పుడు అతనిలో సమానదృష్టి కలిగి, కబీరు దివ్యచరణాలపై వ్రాలి అశృధారలతో అభిషేకించెను.

కబీరు కూడ సంతోషించి, "నాయనా! నీ సాధన పరిపక్వమైంది. నువ్విక నీ రాజ్యానికి వెళ్ళుము." అని సెలవిచ్చెను.

రాజు గురువాజ్ఞగా తిరిగి రాజ్యానికి వెళ్ళగా, అక్కడున్న వారెల్లరు రాజులోని నిశ్చలతను చూచి ఆశ్చర్యపడిరి. రాజునకు రాజ్యకాంక్ష తీరినట్లున్నదని గ్రహించిరి.

అయినా! అఖిల భువనాలను ఏలే భగవత్సన్నిధి లభించిన వారికి, ఈ చిన్నరాజ్యం ఒక లెక్కనా!

★★★

## గురు - సూత్రములు

"గురున్నావమన్యేత" - గురువును అవమానించరాదు.

- (వైఖాయనస సూక్తి :10-3-43)

★★★

గురునికి పాదప్రణామం వల్ల శిష్యునిలో "అహంకారం" నశిస్తుంది. గురువు సంతుష్టుడౌతాడు.

# 83. గురు పీఠాధిపత్యం - కథ

ఒక గురుకుల ఆశ్రమమున గురువుగారు తన తదనంతరం తన పీఠ బాధ్యత లెవరికివ్వాలి? అని, ఆలోచించెను. ఆ గురువు వద్ద కొందరు శిష్యులు విద్యనభ్యసిస్తూండేవారు. ఒకనాడొక శిష్యుడు గురువును చేరి, "స్వామీ! నాకు జ్ఞానాన్ని ప్రసాదించండి" అని అర్థించాడు. వెంటనే సరేనని, తనలో నితనికి ఏ పని కల్పించాలి? అని తలంచి, వడ్లుదంచే పనిని అప్పగించాడు. అంతే అతడింకేమి ఆలోచించక, వెంటనే ఇది మహాప్రసాదమని భావించి, ఆ వడ్లను దంచడం ప్రారంభించాడు. విరామం లేకుండా దంచుతూనే యున్నాడు. ఇటుల ఇరువది సంవత్సరాలు దంచుతూనే యున్నాడు.

ఇలా యుండగా, గురువుగారు ఒకనాడు, "నన్నెవరు అర్థంచేసుకొంటారో వారికే పీఠాధిపత్యం యిస్తానన్నాడు." అయితే గురుకీర్తన చేస్తే వరాలిస్తాడనే పిచ్చితనం కొందరిలో నుండేది. అంతలో నొక మేధావి అయిన కుర్రవాడు అన్నిచోటులా గురు కీర్తన లాలపిస్తూ ఆ ఆశ్రమమునకురాగా, అందరూ "ఆ బాలునకు వరాలిస్తాడేమో" యని తలంచిరి. కాని అది జరుగలేదు. సాధారణంగా ఆ పిల్లవాడు గుణవంతుడు. కమ్మని కంఠంతో పాడుతూండడం, అదియునూ మంచి సాహిత్యంలో గురుకీర్తన ఆలాపించడం అతని నిత్యకృత్యం. అటుల ఆలాపిస్తూ గురువును చేరాడు.

సాధారణంగా స్వామీ (గురూ)జీ వద్దకు యెవ్వరైనవస్తే చాలు, వారి శిష్యులందరు నతనిని చుట్టేస్తారు. అటులే అందరు ఆ బాలుని చుట్టుపడి, ఆశ్రమము కూడ విడిచి వెళ్ళారు. అంతలో గురువు ఆశ్రమమునకు వచ్చారు. శిష్యులెవరును గురువు రాకడను పరికించలేదు. వారందరును ఆశ్రమ నియమమును కూడ మరచిరి. అనగా, ఆశ్రమమునకు నెవరు వచ్చిననూ గురువాజ్ఞ లేనిది నితరులతో మాట్లాడుట కానీ, కనీసం చూచుటను కానీ తప్పు. గురువాజ్ఞగానే ఆ పనులు నిర్వహించవలెను. అనగా గురువుపై మాత్రమే దృష్టి పెట్టి యుండి వచ్చిన వారు ప్రముఖులైన స్వయంగా శిష్యుల నాశీర్వదించి వెళ్తారు సాధారణులైన ఆ గురువు నుండి ఆశీర్వాదం పొంది వెళ్తారు. వీలగుచో ఉపదేశం పొంది వెళ్తారు.

ఈ జానపద గాయకుడు గురుకీర్తనతో గురువు దర్శనమునకైరాగా, ఆ ఆశ్రమ శిష్యులంతా ఆ బాలుని చుట్టూ పడి యుండగా, అచటనే వడ్లుదంచుతున్న కుర్రవాడు మాత్రము గురువాజ్ఞగా ఆశ్రమము విడువక తన పనిని తాను జేసుకొంటున్నాడు. వచ్చిన గాయకుడది గని, వీరందరు తన చుట్టూ మూగినను అతడు మాత్రము రాలేకపోవడం ఆశ్చర్యపడి, తానే స్వయంగా అతనిని చేరగా, అతడును నేవో పాటలు పాడుతూండగావిని,

మీ పాటలు నాకెంతో ఆనందం నిచ్చాయి. మీరిట్లు 20 యేళ్ళుగా యిక్కడే యుంటున్నారట కదా! చాలా సంతోషం. మీరు పాడిన పాటలలో నొకపాట వ్రాసియిస్తే నేను దానిని పాడతాను", అన్నాడు వచ్చిన జానపద గాయక బాలుడు. అందులకతడు "నాయనా! నేను గురువాజ్ఞగా నింతకాలం వడ్లు దంచుతూ నానిధిని నేను నిర్వహించుచున్నాను. ఈ వడ్లలోని బియ్యపుపొట్లే మన నందరిని నావరించి యున్న అజ్ఞానం. లోపలిబియ్యమే విజ్ఞానము. అట్టి పొట్టనెడి ఆవరణంను తొలగించి విజ్ఞానాన్ని బయట పెట్టడమే నేను చేసే ఈ బియ్యపు దంపుడు పని. నీవన్నటుల ఈ 20 ఏళ్ళుగా నేను వేరే ఎరుగకున్నాను." అని పలికాడు.

ఆ మాటలు వినిన బాలుడు, ఇట్లాజ్ఞాపించిన గురువు యొక్క సేవావ్రతంతో దీక్షతో నున్న యితని నుండిపాట విన కుతూహలం పడగా, ఆ వడ్లు దంచేవాడు "కరుణ లేని కఠినాత్ముడీ గురుదేవుడు", అని పాడుతూ "చివరన నువ్వూ నేను ఈ బ్రహ్మాండమంతానేనే. అనే చరణం కూడ కలుపుతూ పాడు." అని చెప్పగా ఆ బాలుడట్లే పాడెను, ఆ పాట వినిన మిగితా శిష్యులందరికిని తమ గురువునునిట్లు నిందించుటతో మిక్కిలి మండిపడిరి. గురువు కూడా విని ఆశ్చర్యపోయి, "ఎక్కడిదీపాట?" అని ప్రశ్నించగా, అప్పుడా బాలుడు వడ్లుదంచువాని అసలు ఆంతర్యమును, గురుసేవా దీక్షను గూర్చి పాడుచు చివరన ఆ చివరి చరణం కూడపాడి వినిపించెను.

ఆ చివరి చరణంతో గురువునకు కరుణ కలిగి, ఇట్లు తన ఆజ్ఞలోనే నిమగ్నుడగుటలో పొందిన జ్ఞానిని (ఆ బియ్యందంచే శిష్యుని) చేరి, తోడి శిష్యులందరు వినునట్లు, "నాయనా! నా యాజ్ఞలో నిట్లు నీవు పొందిన ఆధ్యాత్మిక జ్ఞానమునకు, నా పీఠాధిపత్యం నీకే యిస్తున్నాను." అనేశాడు. మిగితా శిష్యులంతా ఆ మాట వినడంతో తెల్లమొగం వేశారు.

ఈ కథలోని నీతి ఏమిటంటే? ప్రతి శిష్యుడు (భక్తుడు)ను గురువాజ్ఞ, గురుసేవలోనే గురువునుండి యోగ్యతను, అర్హతను పొందినట్లైన "బ్రహ్మజ్ఞానం" కలుగునని, సేవానిష్ఠ కలిగిన వాళ్ళకే జ్ఞానోదయమగునని గ్రహించతగు కథయిది.

గురు దృష్టిలో పడేసేవ సేవయే కాదు. గురువునకు ఒళ్ళంతా కళ్ళని తలంచాలి. మెప్పునకై సేవించరాదు. నిష్కామ సేవయే నిజమైన ఉత్తమ సేవయనబడును. సేవాభక్తితో నేది చేసినను సత్ఫలితముండును. ఆడంబరంలేక, అనుగ్రహించు సేవయే సేవ. సర్వమును గ్రహించు వాడు గురుదేవుడు. "గురుదృష్టియే దైవదృష్టి"యని గ్రహించిన శిష్యుడు గుర్వనుగ్రహపాత్రుడు.

★★★

# 84. విష్ణు శర్మ విద్యాబోధన
## ('పంచ తంత్ర' కథా సమీక్ష)

దక్షిణాపథంలో 'మహిళారోప్యం' అనునొక నగరముండెడిది. అక్కడ అందరు కోరునట్లు కల్పవృక్షరూపములో, ఎందరో రాజులచే మకుటాయమానంగా పూజింపబడుచు, సంపూర్ణ కళారంగంలో నిపుణుడుగా నున్న ఆ మహారాజు పేరు "అమరశక్తి"

అట్టి ఆ మహారాజునకు బహుశక్తి, ఉగ్రశక్తి మరియు అనంతశక్తి అను నామధేయములుగా ముగ్గురు పుత్రులుండిరి. ఆ ముగ్గురును అతిమూర్ఖులుగా, మరియు శాస్త్రపఠన మందు విముఖులుగా నున్న పుత్రులయెడల ఆవేదన చెందుచు, ఒకనాడు తన మంత్రులనందరిని పిలిపించి యిట్లనియెను.

"అమాత్యవర్యులారా! నాయీ పుత్రులస్థితి గతులు మీకందరికిని తెలిసినదేకదా! ఇంతటి విశాలరాజ్యంలో నున్న రాజుగా నున్ననేను సుఖసంతోషములతో నెట్లుందును. నాజీవితమే వ్యర్థమగును. కావున, ఏదో ఒక ఉపాయంతో వీరిని బుద్ధి శాలురుగా తీర్చిదిద్దిన వారికి జీవిత పర్యంతం పోషణ భారంవహింతును" అని ఆవేదనను చెప్పుకొనెను.

వారిలో "సుమతి" అను నొక మంత్రివర్యుడిట్లనియె – "మహారాజా! శాస్త్రములనునవి అనేకములు. వాటినన్నింటిని అధ్యయన మొనర్చుటచే జ్ఞానం ప్రాప్తించును. అందులకు కాలం సరిపోదు. అన్ని శాస్త్రములకన్న అర్థ శాస్త్రము మిన్న. ఆ శాస్త్రమును నేర్పుటలో మహానిపుణుడైన నొక బ్రాహ్మణుడు కలడు. అతడి పేరే 'విష్ణుశర్మ' అను గురువర్యుడు. ఎందరో శిష్యులను శాస్త్రపారంగతులుగానొనర్చిన ఘనకీర్తి పొందినవాడితడు. అందులకై, యిట్టి మీ పుత్రులను వారి వశమొనర్చినచోనతడు త్వరలోనే బుద్ధి కుశలురను చేయగలరు" అని.

ఆ మాటలు విన్న రాజు వెంటనే ఆ విష్ణుశర్మ గారిని పిలిపించి నిట్లు ప్రార్థించెను.

"మహానుభావా! నా పుత్రులు ముగ్గురును బుద్ధిహీనులు. శాస్త్రపఠన విముఖులు. ఈ నా పుత్రులను మీరు అర్థ శాస్త్రములో విద్వత్ ప్రాప్తి పొందునట్లు జేయుము. మీకెల్లెడల ధన సహాయమును నొనర్చెదను. నన్ననుగ్రహించిన సమ్మతించుడు." అని

ఆ మాటలు విన్న విష్ణు శర్మ రాజుతో నిట్లనెను – "మహారాజా! నేను ధనమునకై విద్యయొసంగెడివాడను కాను. ఎటులైన నీ పుత్రులను ఆరుమాసములలో అర్థ, నీతి శాస్త్రకోవిదులను గావించెదను. అట్లు గానిచో నా పేరునే వదలివేయుదును. అని నొక్కి జెప్పుచు, నీ మనోరథమును నెరవేర్చెదను. పులి గర్భమున పులులే పుట్టును. మేకలెట్లు పుట్టగలవు. కావున విచారించవలదు. ఈ దినము నుండియే మీ పుత్రులను నాశిష్యులుగా

స్వీకరించి, అన్న ప్రకారముగా ఆరు మాసములలో అసాధారణ విద్వత్ పండితులుగా నొనర్చెదను." అని.

ఇట్టి అసంభావ్యమైన విష్ణుశర్మగారి ప్రకటనకు మహారాజును, అచటి మంత్రులును మిక్కిలి ప్రసన్నులై అటులే సమ్మతించిరి. మహారాజు తన పుత్రులను విష్ణుశర్మ గారికి అప్పజెప్పెను.

విష్ణుశర్మ ఆ రాజపుత్రుల ముప్వురిని గైకొని తన ఆశ్రమమునకు వెళ్ళెను. అచట అనునయముగా వారికి 1. **మిత్రభేదము**, 2. మిత్ర లాభము, 3. సంధి విగ్రహము, 4. లబ్ధనాశము, 5. అసంప్రేక్ష్య కారిత్వము లను పంచతంత్రములను బోధించుచు సులభతరముగా నభ్యసింపజేసి, ప్రతిజ్ఞా పూర్వకంగా ఆరు మాసములలో వారిని అసాధారణ విద్వాంసులుగా నొనర్చి మహారాజునకప్పగించెను. రాజును సంతోషించెను.

అర్థ, నీతి శాస్త్రముల సారవంతమైన ఈ పంచతంత్రములను మొదట నిట్లు సంస్కృత భాషలో రాజ పుత్రులకు అభ్యసింపబడినవి. తదుపరి ఈ పంచతంత్ర కథలను పఠనీయములుగా ఆంధ్రభాషలో యెల్లరకు బోధనీయాంశములుగా గద్యరూపముగా జటిలపదములతో తెలుగు భాషకు వన్నె తెచ్చునట్లు మిత్రబేధము, మిత్రలాభమును శ్రీపరవస్తు చిన్నయసూరి గారు ఆంధ్రీకరించిరి.

అటు పిదప శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు సంధి విగ్రహమును గద్య రూపములో హృద్యముగా రచించిరి.

తదుపరి శ్రీదూబగుంట నారాయణ కవి గారు ఆ పంచతంత్ర కథలను మొత్తము పద్యరూపముగా వ్రాసిరి. ఇట్లు వీరు తెలుగు భాషలోకి అనువదించి తెలుగు భాషాభిమానులుగా నిలిచి ధన్యులైరి.

బాలురకే గాక, పెద్దలకును నీతి బోధక కథలుగా పఠనీయములైనవి. అందులకే గురువు చెంతజేరిన వారిట్లగుదురు అనునది నీతి.

★★★

## గురు - సూత్రం

"యోగురుస్స శివః ప్రోక్తో యశ్శివస్స గురు స్మృతః"

"ఎవడు గురువో, అతడే శివుడు. ఎవడు శివుడో అతడే గురువు" అని మహర్షులు చెప్పిరి.

# 85. పరమానందయ్య శిష్యుల కథ(లు)

మన రాష్ట్రంలో గురు శిష్యుల కథలలో కొంత వినోద సంబంధమగు పరమానందయ్య శిష్యుల కథ యొకటి. ఈ కథ పూర్వం నుండి ఈనాటి వరకును పలు సందర్భాలలో తెలివి లేని శిష్యులను పోల్చుటలో "పరమానందయ్య శిష్యులురా, వీ(మీరు)రు" అని, వారు చేసే చిలిపి, చిరాకు పనులకు సంబోధించుచుందురు. అనగా వీరు కొంత వినోద దాయకంగా, మరియు కొంత అసహ్యం, కోపం కలిగించే వారలుగా ప్రవర్తించెడి వారని గ్రహించుదుము.

ఎవరైన తెలివి తక్కువ పనులు చేస్తే, కొంత కోపగించు కొన్నను, వారి అమాయకత్వం పనులకు కొంత నవ్వు తెచ్చుకొన్నను, కొంత జాలి కూడ కలుగును. ఇటువంటి వారిని పుట్టించిన ఆ బ్రహ్మదేవుడిని కూడ స్మరించుకొందుము. ఏది యేమైన పరమానందయ్య శిష్యుల కథలు కొంత వినోద దాయకంగానున్న, కొందరు ఈనాటి కంప్యూటర్ యుగపు విద్యార్థులకు మాత్రము, పూర్వంలో ఈలాంటి విద్యార్థులు (శిష్యులు) ఉండెడివారా! అని, ఆశ్చర్యం పడుదురుకూడ. అమాయకత్వమే వారి విజ్ఞానము.

పూర్వం ఒక గ్రామంలో పరమానందయ్య అనే యొక సద్బ్రాహ్మణుడుండెడి వాడు. వారి కుటుంబము చిరకాలం నుండి పండిత కుటుంబము. కనుక ఈ పరమానందయ్యను గ్రామస్థులు గౌరవంగా చూస్తుండెడి వారలు. అదొక వరప్రసాదమని వారలు విశ్వసించెడి వారలు. అందుచే, ఆ బ్రాహ్మణుని ప్రతి శుభాశుభ కార్యములకై సలహాలు పొందెడివారలు. అదేమోకాని, ఆ గురువు (బ్రాహ్మణుని) వాక్కు ప్రకారం జరుగుచుండెడిది. కావున ఆ బ్రాహ్మణుని కుటుంబ పోషణ ఆ గ్రామస్తుల ఆదరాభిమానములతో హాయిగా గడచుచుండెడిది. మీదు మిక్కిలిగా సర్వులకు పరమ పూజ్యుడుగా చేలామణి అయి ఉండిరి. సాక్షాత్ గురుతుల్యులుగా, అతని మాటయే వేద వాక్యంగా భావించెడి వారు. సహజంగా గ్రామస్థులు, తాము నమ్మిన వారిని, తమకు నమ్మకం కలిగించెడి వారిని భగవత్స్వరూపునిగా గౌరవిస్తారు.

పరమానందయ్య వారు కొంత పాండిత్యంతో పాటు కొంత వైద్యం కూడ తెలిసిన వారగుటచే, అదృష్ట వంతులు బ్రతికి బట్టకట్టే జాతకులు బాగుపడెడి వారలు. అథవా ఎవరైనా గతించినను, కాలం చెల్లి గతించినాడని, ఆయుష్షు లేకున్న ఆయన (బ్రాహ్మణుడు) మాత్రం యేం చేస్తాడులే! అని ఊరడించుకొనివారలు, పల్లెత్తు పలుకైనా పలికెడి కారు - నిజమే కదా! బ్రాహ్మణుడు దైవస్వరూపుడు. అట్టి గురువును గౌరవించడమనునది మన భారతీయ సాంప్రదాయం. ఇక చులకనకు తావెక్కడిది. చులకనగా చూస్తే

పుట్టగతులు దునా? ఏది ఏమైనను, తమకొక బ్రాహ్మణదిక్కు కలదని కొండంత విశ్వాసముతో ఆ గ్రామస్తులేగాక, చుట్టూ ఉన్న గ్రామ ప్రజలు కూడ వారి కుటుంబాన్ని పోషించుకొంటూ గౌరవాదరములతో చూచెడి వారలు.

ఆ పరమానందయ్యగారి సతీమణి సుందరమ్మగారు. ఆమె, భర్తయెడల పరమ భక్తి, ఆదరాభిమానములతో మెలగుచుండెడిది. అందుచే ఆమెను కూడ గ్రామస్తులు పరమ పూజ్యురాలునుగా గౌరవించెడి వారలు. కొంతకాలమునకు వారు (పరమానందయ్య, వాని సతీమణి) పేరు ప్రతిష్ఠలకు ఆ గ్రామమునకు "పరమానంద పురం"గా చెలామణి అయ్యెను.

ఇలా ఉండగా, కొంతకాలమునకు ఆ బ్రాహ్మణుని కీర్తి పేరు ప్రతిష్ఠలు మరింత యినుమడించునట్లు, నలు చెరుగులా వ్యాపించు నిమిత్తమేమో, అదృష్ట భాగ్యమేమో, వారి చెంతకు శిష్యులు చేరిరి. వారందరును బ్రహ్మచారులే. తనను చేరిన శిష్యులను ఆ పరమానందయ్యగారు పుత్రవాత్సల్యముతో జూస్తూ, తనకు తోచిన విద్యను, కూడ ప్రసాదించెడి వారు. ఆ శిష్యులు తనతో చేరినందున, తనకిది భారమని తలంచెడి వారు కారు. కాని, వారి ధర్మపత్ని మాత్రము శిష్యుల యెడ అప్పుడప్పుడు కొంత చిరాకు, అసంతృప్తి చూపెడిది. అయినను ఆమెపైకి కటువుగా పలికినను, మనస్సు మాత్రము ఆర్ద్రత కలది. శిష్యులొనర్చు చిలిపి, అమాయకపు చేష్టలకు ఆమె వారిని మందలించెడిది. ఆ వెంటనే గురువు, భార్యను సర్ది, తాను శిష్యులను సముదాయించెడి వాడు. ఎందుకనగా తనను చేరిన శిష్యులు అమాయకులు. వారొనర్చు పనులు చిలిపి పనులైననూ, అవి యొకో సమయములో ఘనకార్యములుగా కూడ తోచెడివి. అందులకే, ఆ పరమానందయ్యా గురువుగారికంత కీర్తి, పేరు ప్రతిష్ఠలు, దినాదినాభివృద్ధియైనవి. మరీ! ఆ శిష్యుల చిలిపి చేష్ఠలు, అమాయకపు పనులు తెలుసుకోవలెనన్న ప్రతి గురువు, ప్రతి శిష్యుడు, అనగా సర్వులును ఆ పరమానందయ్య శిష్యుల కథలు చదివి, నవ్వుకొని సంతోషించుదురని ఆశిద్దాము. సంతోషమే సగము బలము కదా! అదొక ఆనందం. "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" - కదండీ!

ఏమండీ - "నవ్వండి, నవ్వించండి" - ఉభయత్ర శ్రేయస్సు కోరండి.

గ్రంథ విస్తరణయగునని, ఆ కథలు వ్రాయలేకపోవడంతో, నన్ను మన్నించగలరని ఆశిస్తున్నాను.

★★★

# 86. వీరశైవుల శివ(గురు) భక్తి

ఆధ్యాత్మికమును అవలంభించడం సనాతన ధర్మం. మోక్షోపాయం అది. చరిత్ర కందనంత తొలి ధర్మం అదే. ఈ ఆధ్యాత్మికంను పొందుటకు ఆధ్యాత్మికాచార్యుని చేరి వినయ విధేయతలతో వారిని సంతృప్తి పరచి, వారి నుండి మనస్ఫూర్తి ఆశీర్వాదములను పొందుటయే ఆధ్యాత్మిక జీవన విజయ రహస్యమై యున్నది. కావున ఆధ్యాత్మిక గురువునకు నమ్రుడై అణకువగా నుండుట శిష్యునకత్యంతావశ్యకము.

ఆధ్యాత్మికాచార్యుల పరంపరగా ప్రామాణికముగా శుభము కోరువారై యున్నచో, అట్టి ఆచార్యుల నిర్దేశతతోనే చేరిన శిష్యులు పవిత్రులు కాగలరు. అట్టి శ్రద్ధావంతులైన శిష్యులు గురువును భగవానుని కన్న మిన్నగానే భావించుదురు. ఆధ్యాత్మిక జిజ్ఞాసువుగా నిత్య కర్మానుష్ఠానమునందాసక్తి గలవారై పరతత్త్వంపై ప్రేరణ కలిగియుండినవారు, ఆ పరతత్త్వంపై జిజ్ఞాసగల మార్గదర్శకుడగు గురువును చేరుటకు ఉద్యుక్తులగుదురు. అట్లు చేరుటలో ఆ గురువునందున్న తేజో తత్త్వము, ఆధ్యాత్మిక చైతన్యం శిష్యుల యెడల జాగృతం కలుగును. కరుణాంతరంగుడైన ఆధ్యాత్మిక గురువు శ్రవణాసక్తుడైన శిష్యునకు తగినట్లు దివ్య ఆధ్యాత్మిక సందేశముల నొసంగును. ఇక వారికి ఆ గురువే భగవత్స్వరూపుడు. దేవుడు అనేవిషయం వారికి తెలియదు. అట్టి వారిలో వీరశైవులు యొకరు.

పన్నెండవ శతాబ్దారంభానికి ధార్మిక పరిణామంగా వీరశైవం పుట్టింది. బసవేశ్వరుడు ప్రవేశపెట్టిన కొన్ని మార్పులతో శైవం వీర శైవంగా రూపుదిద్దుకుంది. విగ్రహారాధన కొంతమందికే పరిమితం కాగా, సగుణారాధన విధానం సమాజంలో చక్కదిద్దేందుకే వీరశైవం పుట్టింది. దీక్షా పూర్వక లింగధారణం, అతి వర్ణాశ్రమం, సమాన ప్రతిపత్తి, **క్రతుకర్మ** నిరాసనం, పంచాచారాలు, అష్టావరణాలు, షట్స్థల సిద్ధాంతం, దేహమే దేవా**లయమనే భావన,** జంగమ పూజకు ప్రాధాన్యం ఇవి వీరిలో ముఖ్యమైన మార్పులు.

వీరు పాటించవలసిన పంచాచారాలు తప్పనిసరి. అవి సదాచారం, లింగాచారం, గణాచారం, భృత్యాచారం, శివాచారం.

వీరి గురువు బోధించిన శివాద్వైత తత్త్వ ప్రకారం జీవితాన్ని సాగించడం సదాచారం. గురువు చేత ఇష్ట లింగధారణ పొంది, పూజించి, జ్ఞానయోగాలను నేర్చి శివయోగాన్ని సాధించడాన్ని లింగాచారం అంటారు. లింగస్వరూపుడైన భక్తుడు తాను చేసే పూజాదులను నెవరైన నిందించినపుడు వారికి అట్లు నిందించరాదని తెలియజెప్పాలి. అటులను వీలుకానిచో "శివ శివ" అనే రెండక్షర పదములతో చెవులు మూసుకోవాలి. అదే గణాచారం. తనవంటి శరణులకు తాను దాసుడనే భావంతో నడుచుకోవటాన్ని

భృత్యాచారం అంటారు. శివభక్తులమధ్య వర్ణభేదాన్ని పాటించకుండా ఉండటాన్నే శివాచారం అంటారు.

అష్టావరణాలు 1.గురువు, 2.లింగం, 3.జంగముడు, 4.పాదోదకం, 5.ప్రసాదం, 6.విభూతి, 7.రుద్రాక్ష, 8.మంత్రం.

వీటిలో గురువు కేవలం జ్ఞానబోధకుడు కాదు. తనలో జ్యోతి రూపానగల పరతత్త్వాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకొని, ఆ అనుభవాన్ని శిష్యునిలో కలుగజేసేవాడు. అటువంటి యోగసాధకుడైన గురువు తాకినంతనే శిష్యుడు గురుతుల్యుడవుతాడు. ఆ స్థితి శాస్త్రాల నుండి లభించేది కాదు. అందువల్లనే వీరశైవుడికి సరైన గురువును ఎన్నుకోవడం ముఖ్య కర్తవ్యం. వీరికి గురువు శివుని కంటే పూజ్యుడు.

రెండవదైన లింగం పరమశివుడికి నిరాకారత్వానికి సంకేతం. గురువు శిష్యుడికి దీక్షనిచ్చేటప్పుడు శిష్యునిలోనున్న చైతన్య కళను బయటకులాగి, దానికి యిష్టలింగాకారం ఇచ్చి శిష్యుని చేతిలో నుంచుతాడు. శిష్యుని ప్రాణకళయే దీపశిఖలా ప్రకాశిస్తూ బయటకు వస్తుంది. కాబట్టి లోపల కూడా అటువంటి వెలుగే ఉందని భావించి, శిష్యుడు దానిని సాధించడానికి ప్రయత్నిస్తాడు. అలా దీక్షా సమయంలో గురువు చేతపెట్టిన ఇష్టలింగాన్నే శిష్యుడు నిత్యం పూజించాలి. అది శివునితో సమానం కాబట్టి క్షణకాలమైనా ఆ లింగాన్ని శరీరం నుండి దూరంగా ఉంచకూడదు. అలా చేస్తే అది ఆధ్యాత్మికంగా మరణంతో సమానం. శివుణ్ణైనా సరే వీరశైవుడు మరో రూపంలో పూజింప కూడదు. అందులకే వీరశైవులకు విగ్రహారాధన నిషిద్ధం.

## మూడవదైన జంగమ లక్షణం:-

"నిస్సంగత్వం నిరాభారం నిస్సమం నిరుపాధికమ్ ।

నిర్దేహం నిర్మలం నిత్యం తత్త్వాజంగమలక్షణమ్ ॥" -

"జంగమ" అంటే చరన్మూర్తి. ఒక చోట ఉండేది కాదు. ఈ జంగములు మూడు రకాలు. మఠాల్లోనుంటూ శరణులకు ధర్మబోధ చేసేవారు. స్వయం జగములు. దేశాటన చేస్తూ శిష్యులకు మతబోధ చేసేవారు చర జంగములు. ఈ రెండు పనులతో పాటు గుహలలో నేకాంతంగా గడిపేవారు పరజంగములు. శరీరానికి శుద్ధి గురువు నుండి, మనస్సునకు శుద్ధి లింగం నుండి, భావాలకు శుద్ధి జంగము నుండి, శివభక్తులకు కల్గుతుంది. పరమశివుడే ఈ మూడు రూపాలకు మూలం అని, మనిషి పరమ శివుని రూపమే కాబట్టి అంతర రూపాలైన తను మనోభావాలు గురు, లింగ, జంగములుగా బహిర్గతాలయ్యాయని భక్తుల విశ్వాసం. అష్టావరణాలలో నీ మూడింటికి సమాన స్థానం ఉంది.

నాల్గవదైన పాదోదకం శివయోగులు, శివానుభావం గల గురువుల పాదాలు పూజించి పుచ్చుకొనేది. అలా చేయడంవల్ల తమ జ్ఞానం శుద్ధమవుతుందని, అదొక యోగం అని, వారి విశ్వాసం. పాదోదకం అంటే కాళ్ళు కడిగిన నీరనే భావన నిజం కాదు. గురువు శివపూజ చేస్తూ మంత్రపూతం చేసిన జలాన్ని పాదోదకం అంటారు.

మహాదేవుడు గురువు రూపంలోనో, జంగమ రూపంలోనో ఎదురు వచ్చి ఇచ్చేదే నిజమైన ప్రసాదం. గురువు తనకు శిష్యులో, భక్తులో నిర్మల భావంతో అర్పించిన భక్ష్యాలను స్వీకరించి, సంతోషంతో తిరిగి భక్తులకు అందించినపుడు అది పవిత్రమైన ప్రసాదం అవుతుంది.

ఇట్లు ఆరవది విభూతి. శైవులందరికీ విభూతి (భస్మం) చాలా పవిత్రమైంది.

ఏడవది రుద్రాక్ష. శివుని నేత్రం నుండి పుట్టినది. ఈ రుద్రాక్షలను వీరశైవులు పవిత్రంగా ధరిస్తారు.

ఇక చివరిది మంత్రం. "ఓం నమశ్శివాయ" అనే పంచాక్షరీ మహామంత్రం. వీరశైవులు ఈ మంత్రాన్ని ప్రణవంతో కలిపిగాని, కలపకుండాగాని జపిస్తారు. ఇక ఏ మంత్రాన్ని జపించటానికి సమ్మతించరు -

ఇలా వీరశైవులు పంచాచారాలను, అష్టావరణాలను పాటిస్తారు. వీరశైవుల మతానుసారం జీవుడు శివైక్యం చెందాలంటే ఆరుమెట్లు ఎక్కాలి, షట్ స్థల సిద్ధాంతములని, స్థలం అంటే పరబ్రహ్మ స్వరూపుడైన శివుడని అర్థం. జీవుడిని అంగమని, పరబ్రహ్మను లింగమని పిలుస్తారు. ఆ లింగమే శివుడు.

ఆ ఆరు స్థలాలు ఇవి - 1.భక్తస్థలం, 2.మహేశ్వర స్థలం, 3.ప్రసాది స్థలం, 4.ప్రాణలింగ స్థలం, 5.శరణ స్థలం, 6.ఐక్య స్థలం. వీటిలో మొదటి ఐదు సాధక దశలు. ఆ మెట్లెక్కే వరకు జీవుడు ద్వైతి. ఆరో మెట్టెక్కే సరికి శివుని ఐక్యమై అద్వైతి అవుతాడు జీవుడు. ఇలా వీరశైవుల ద్వైత, అద్వైతంలు సమన్వయం చెందుటచే, శివాద్వైతం, ద్వైతాద్వైతంగా తాదాత్మ్యం పొందుతారు.

ద్వైతాద్వైత సత్యాలు ఆ పరబ్రహ్మ స్వరూపునికే వదిలేద్దాం. ఎవరి సిద్ధాంతం వారికే సొంతం.

★★★

# 87. బ్రహ్మ కలితో చెప్పిన గురుతత్త్వము

"బ్రహ్మవైవర్త పురాణం" అష్టాదశ పురాణములలో నొకటి. అందు సద్గురు కథలలో బ్రహ్మకలిపురుషుని నిట్లు ఆశిస్తూ, 'గురు(వు)' తత్త్వమును గూర్చి నిట్లు వివరించెను.

శ్లో॥ గురుసేవారతాంశ్చైవ, పురాణ శ్రవణాదరాన్ ।
స్వధర్మ నిరతాంశ్చైవ, కదాప్యేతాన్న పీడయ ॥

భా॥ ఓ కలీ! గురుసేవారతులను, పురాణశ్రవణమునందు ఆదరం కలవారిని, తమ తమ ధర్మముల నిర్వర్తించుట యందు ఉత్సాహము కలవారిని ఎప్పుడును పీడించవద్దు.

"కలే శృణు ప్రవక్ష్యామి గురు మహాత్మ్యముత్తమం"

కలీ! గురు మహత్త్వము ఉత్తమమైనది. చెబుతున్నాను శ్రద్ధగావినుడు

శ్లో॥ గకార స్సిద్ధిదః ప్రోక్తో రేఫః పాపస్య దాహకః ।
ఉకారో విష్ణురవ్యక్తః త్రితయాత్మా గురుః స్మృతిః ॥

భా॥ 'గ' అన్న శబ్దము సిద్ధిని కలుగజేయును. 'ర' అన్నది పాపమును దావానలమువలె భస్మము చేయును. 'ఉ' అన్నది విష్ణువు. ఈ 'గురు' అన్న శబ్దము అవ్యక్తమైన త్రిమూర్త్యాత్మకము అని అనబడును.

శ్లో॥ గణేశో వహ్నియుక్తశ్చ విష్ణునా చ సమన్వితః ।
వర్ణద్వయాత్మకో మంత్రశ్చతుర్వర్గ ఫలప్రదః ॥

భా॥ ఈ రెండక్షరముల మంత్రము 'గురు' అన్నది గణేశ, అగ్ని, విష్ణుయుతము. చతుర్వర్గ ఫల (ధర్మ, అర్థ, కామ, మోక్ష)ముల నొసంగునది.

శ్లో॥ గణేశ సంజ్ఞో గకారః వహ్ని సంజ్ఞో రకారః ।
విష్ణు సంజ్ఞో ఉ కార స్స్యాదేవం గురురితి స్ఫుటం ॥

భా॥ 'గ'కారం గణేశునకు, 'ర'కారము అగ్నికి, 'ఉ'కారము విష్ణువునకు సంజ్ఞలుగా నున్న యీ శబ్దార్థముల సమన్వితమైనదే 'గురు' అన్నది నిశ్చయము.

శ్లో॥ గురుః పితాగురుర్మాతా గురురేవ పరశ్శివః ।
ఈశ్వరో యది కుప్యేత గురూ రక్షతి తం తదా ॥

భా॥ గురువు తల్లిదండ్రియు, పరమపురుషుడైన శివుడు, శివుడు కోపించిన వానిను

గురువు రక్షించును.

శ్లో॥ యదా కదాచిచ్ఛిష్యాయ గురుః కుప్యేత దైవతః ।
పరిరక్షితు మేశానస్తం న శక్నోతి సర్వథా ॥

భా॥ ఎప్పుడైన శిష్యుని గురువు కోపించిన యీశానునుడైన ఈశ్వరుడే అయినా రక్షింప సమర్థుడు కాదు.

శ్లో॥ హరే ప్రసన్నేఽపి వైష్ణవా జనాః సంప్రార్థయంతే గురుభక్తి మవ్యయాం ।
గురౌ ప్రసన్నే జగతామధీశ్వరో జనార్దన స్తుష్యతి సర్వసిద్ధిదః ॥

భా॥ శ్రీహరి ప్రసన్నుడైనచో విష్ణుభక్తులు ఎడతెగనట్టి గురుభక్తిని ప్రసాదించమని ప్రార్థించెదరు. గురువు ప్రసన్నుడైనచో జగత్తునకే ఈశ్వరుడైన జనార్ధనుడు సంతుష్టుడై సర్వమును సిద్ధింపజేయును.

శ్లో॥ యది ప్రసన్న ఈశానః సద్గురుర్నైవ తుష్యతి ।
గురౌ ప్రసన్న ఆసన్న ఈశానస్తస్య ధీమతః ॥

భా॥ ఈశ్వరుడు ప్రసన్నుడైన గురువు సంతసింపక పోవచ్చును. గురువు ప్రసన్నుడైన బుద్ధిమంతునకు భగవంతుడు సమీపముననే యుండును.

శ్లో॥ అత యేవ గురుం భాక్త్యాశాస్త్ర మార్గేణ యోభజేత్ ।
స జ్యోతీ రూప భాక్తీర్థ వ్రతయోగ తపోఽర్థభాక్ ॥

భా॥ అందులకై గురువును శాస్త్రములయందు చెప్పిన రీతిగా భజించవలయును. ఆ తీరున భజించినవాడు బ్రహ్మ స్వరూపుడై తాను స్వయముగా తీర్థము, వ్రతము, యోగము, తపస్సు అన్న పదములకు అర్థమై వెలుగొందును.

శ్లో॥ వర్ణాశ్రమ వృషాచార సద్వివేక క్రియాపథం ।
భక్తిం విరక్తిం ముక్తించ తస్య దర్శయతే గురుః ॥

భా॥ అట్టి వానికి వర్ణాశ్రమధర్మములు, ఆచారధర్మములు, సద్వివేకమును ఆచరణపెట్టుటలో మార్గము, భక్తియననేమి, విరక్తి ఎట్లు ప్రాప్తించును, ముక్తి ఏ తీరున సిద్ధించును, అన్ని విషయములకు మార్గ దర్శకుడు 'గురువగును.

శ్లో॥ ఇతి శృత్వావిధేర్వాక్యం పప్రచ్ఛ ప్రణతః కలిః ।
సర్వదేవ సమానోఽసౌ కుతోజాతో గురుర్వద ॥

భా॥ బ్రహ్మ పల్కిన పలుకులు విన్న కలి నమస్కరించి "సర్వదేవతలతో సమానుడై

ఉండికూడా, గురువు ఎందులకు జన్మమునొందునో తెలుపుము" అనెను.

శ్లో॥ బ్రహ్మ తమాహ వక్ష్యామి విస్తరేణ యథాతథం ।
శృణుష్వైకాగ్ర చిత్తేన పారోఽలభ్యో గురుం వినా ॥

భా॥ బ్రహ్మ అతనితో, "యథా తథంగా చెప్పుదును, ఏకాగ్ర చిత్తముతో వినుము. గురువు లేక మోక్షము" లభ్యము కాదు.

శ్లో॥ గురుం వినా నశ్రవణం భవేద్యస్యాపి కస్యచిత్ ।
వినా సచ్ఛాస్త్ర శ్రవణాత్త్వద్ధ్భయాన్ముచ్యతే కథం ॥

భా॥ గురువు లేకుండా యెక్కడైనా శ్రవణము యెట్లు సాధ్యపడును. గురుముఖతః సచ్ఛాస్త్రములను విననిదే వానికి భయము యేరీతిగా పోవును. అనగా వాటి అర్థసహితముగా గ్రహించినగాని మానవునిలోని అజ్ఞానము నశించదు.

గురువు జ్ఞానసముపార్జనం చేసుకొన్న అనుభవజ్ఞుడు, తత్వదర్శి అట్టివాడు శిష్యునిలోని అజ్ఞానమును తన నేర్పుతో శ్రవణంతో తొలగించగలడు. స్వబుద్ధిచే తత్వము సిద్ధించదు. శాస్త్రములు సులభములు గావు. శ్రవణంతోనే శాస్త్రములు సులభమగును.

శ్లో॥ శాస్త్ర తత్త్వేఽవ బుద్ధే తు సంసార తరణం స్వతః ।
గురుః ప్రకాశకస్త స్మాజ్జ్యోతిరూప ప్రదర్శకః ॥

భా॥ గురువు లేకుండా స్వంతమేదస్సుతో శ్రవణం సాధ్యపడదు. గురువు నుండి శ్రవణము వలన శాస్త్రములు సుబోధకములగును. శాస్త్రమును దాని లోతుపాతులతో గ్రహించిన తాను సంసారము నుండి తరించగలడు. అందుకని ఉపదేశించు గురువు బ్రహ్మగా ప్రదర్శించును.

అనగా అనుభవజ్ఞుడైన గురువు మాత్రమే విడమరచి శాస్త్రమును సుబోధకముచేయ సమర్థుడు. వారు శిష్యునిలో తనబోధచే జ్ఞానమను జ్యోతిని వెలిగించును.

"గురు సేవనయా సర్వసిద్ధిర్జాతా పురాకలే"

గురువును సేవించుట వలన సర్వము సిద్ధించును

అని బ్రహ్మ కలితో గురు తత్త్వమును వివరించెను.

★★★

# 88. గురు స్మరణ మహిమ

శ్లో॥ 'గురు రిత్యక్షరద్వంద్వం కేవలం సోఽమృతార్ణవః ।
తస్మిన్ క్షణం నిమగ్నస్యత్రి తాపా నిర్దిహన్తికిం ॥

భా॥ 'గురు' అను రెండుక్షరములు అమృతరస సముద్రములు అందు మునిగిన వానిని త్రితాపములు దహింపవు. (త్రితాపములు - ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆది దైవికం)

శ్లో॥ సద్గురు స్మరణం యస్య చిత్తే పూజ్యః స సర్వతః ।
గురు నామ సుధాపానం యస్య సోఽప్యమరో భవేత్ ॥

భా॥ ఎవని చిత్తమున 'సద్గురు' స్మరణము జరుగునో అతడు సర్వత్ర పూజ్యుడు. 'గురు' నామామృతమును నెవడు పానము చేయునో అతడు ముక్తుడే యగును.

ప్రశ్న : 'సద్గురువు' ఎట్లు లభించును ?

సమాధానం :

శ్లో॥ యదామమ శివస్యాఽపి బ్రహ్మణో బ్రాహ్మణ్యావా ।
అనుగ్రహో భవేన్నృణాం లభ్యతే సద్గురుస్తదా ॥

భా॥ నేను (విష్ణువు)ను గాని, బ్రహ్మగాని, శివుడు గాని, బ్రహ్మజ్ఞాన సంపన్నుడుగాని అనుగ్రహించినపుడు నరులకు సద్గురువు లభించును.

అయినా

శ్లో॥ మయాథవేశ్వరేణాఽపి దీయతే బ్రహ్మణావరః
గురుణా దీయతే సోఽపి త్రిమూర్త్యాత్మా గురుస్తతః ॥

భా॥ నేను (విష్ణువు), ఈశ్వరుడు, బ్రహ్మ ఇవ్వగల వరములను గురువే ఇవ్వగలడు. అందుకే గురువు త్రిమూర్త్యాత్మకుడు.

శ్లో॥ గురుర్బ్రహ్మ గురుర్విష్ణు ర్గిరిజారమణో గురుః ।
వేదశాస్త్ర పురాణేషు ప్రసిద్ధవిందమేనహి ॥

భా॥ గురువు బ్రహ్మయని, విష్ణువని, గిరజారమణుడని వేదశాస్త్ర పురాణాదుల యందు ప్రసిద్ధము.

శ్లో॥ సాక్షాద్గురుర్బ్రహ్మ విష్ణు శివస్వరూపి న సంశయః ।
సావధానం మనః కృత్వా సేవాకార్యాఽస్య యత్నతః ॥

భా॥ గుర్నువు సాక్షాత్తు త్రిమూర్త్య స్వరూపి సంశయం లేదు. మనస్సును

సాం ఖానమొనర్చుకొని గురుసేవా కార్యమును ప్రయత్న పూర్వకముగా చేయవలెను.

శ్లో॥ యత్ర కుత్ర దృఢాభక్తిః యదాయస్య మహాత్మనః ।
తత్రమహాదేవః ప్రకాశముపగచ్ఛతి ॥

భా॥ దృఢమైన గురుభక్తి గల మహాత్ములు ఎక్కడెక్కడుందురో అచ్చోట పరమ శివుడు ప్రకాశించుచుండును.

శ్లో॥ భక్తిర్యస్య నిజేగురౌ హరిహర బ్రహ్మాత్మ బుద్ధ్యాస్థిరా ।
యో వాచా మనసాఽనిశం సువచసా సంసేవతే సోఽచిరాత్ ॥

శ్లో॥ ఈశానుగ్రహపాత్రమేవ భవతి క్షిప్రం యధా దీపకః ।
శ్రీ శస్తద్వశ వర్తితాం చరతి యః స్వీయేష్టధీ దీపపకః ॥

భా॥ ఎవడు గురువునందు హరి, హర, బ్రహ్మలను దర్శించు బుద్ధి కలవాడో, ఎవడు మనోవాక్కాయ కర్మలతో, మంచి వాక్కులతో గురునిసేవించునో, దీపకుని వలె వానికిని తక్షణమే ఈశ్వరానుగ్రహ పాత్రత సిద్ధించును. విష్ణువు అతని యధీనుడు.

శ్లో॥ రాజ్ఞీప్రాహ మహదోషా గురు శాపాద్భవిష్యతి ।
తద్వాక్యం న వృధాఽతస్తత్పదే భజ తరిష్యతి ॥

భా॥ గురువును శపించుట (దూషించుట) వలన మహాదోషము వాటిల్లును. గురువాక్యము వృధాకాదు. కావున వారి పాదములను భజించిన తరింపగలరు. (మిత్రసహుడను రాజుతో, రాణి అనును)

శ్లో॥ గంగా పాపం, శశీతాపం, దైన్యం కల్పతరుర్హరేత్ ।
పాపం తాపంచదైన్యంచ సద్యశ్రీ గురుదర్శనమ్ ॥

భా॥ గంగాపాపమును, చంద్రుదు తాపమును, కల్పవృక్షము దీనత్వమును పోగొట్టును. ఈ మూడింటిని (పాపం, తాపం, దైన్యం) శ్రీ గురు దర్శనంతో హరించును.

శ్లో॥ గురుద్రోహి నరస్యేహ పరత్రాఽపి కుతస్సుఖం ।
కుంభీపాకే గురుద్రోహి పాతకాత్సగమిష్యతి ॥

భా॥ గురు ద్రోహికి ఇహ, పరలోకమునను సుఖము లేదు. గురుద్రోహి కుంభీపాకమును నరకమునకుపోవచ్చును.

శ్లో॥ గురుసంతోషమాత్రేణ కింకిమత్ర నసిద్ధ్యతి ।
గురౌతుష్టే క్షణాదేవ వేద శాస్త్రాది లభ్యతే ॥

భా॥ గురువు సంతోషించినచో ఏమి సిద్ధించదు ? (సర్వం సిద్ధించును అర్థం) గురువు

తప్పుడైన క్షణకాలమున వేదశాస్త్రాది విద్యలు లభించును

శ్లో॥ యోనరోదైన్య హతకః సోఽపి సేవేతబేద్గురుం ।
సోఽపి భూత్వా సర్వపూజ్యః పరంపారం గమిష్యతి ॥

భా॥ దీనత్వము చేత ఒకవేళ బాధపడుచున్నను నతడు గురుని సేవించినచో సర్వులచే పూజింపబడువాడై ఇహపరముల దాట గలడు.

శ్లో॥ యః శ్రీగురుం భజే త్సోఽపి పరత్రేహచ సద్ధిభాక్ ।
తద్గృహేఽఖండితా లక్ష్మీరష్టైశ్వర్యస్సమన్వితా ॥

భా॥ ఎవడు శ్రీగురుని భజించు చుండునో ఇహపరములు యందు సిద్ధిని పొందును. వారింట అష్టైశ్వర్యయుక్తమై అఖండమైన శ్రీ నివసించును.

శ్లో॥ తమారాధ్య గురుం భక్త్యా ప్రహ్వా ప్రశ్రయ సేవనైః ।
ప్రసన్నం తమను ప్రాప్య పృచ్ఛే జ్ఞాతవ్య మాత్మనః ॥

భా॥ అట్టి సద్గురువును చేర భక్తితోనారాధించి, వాగ్రూపమునను, శుశ్రూషవల్లను, వినయభక్తులతోను సేవజేసి, ఆయనను ప్రసన్నునిగ జేసుకొని, తాను తెలుసుకొన వలసిన ఆత్మ జ్ఞాన విషయమై ప్రశ్నింపవలెను.

శిష్యుడు పరతత్త్వముపై తెలిసికొన గోరు మార్గదర్శకుడగు గురువును చేరుటకు ఉద్యుక్తుడగును. అప్పుడు దారువునందు అగ్ని వ్యాపించి యున్నటుల, ఆ దారువుచే మరొక దారువును ప్రజ్జ్వరిల్ల జేయురీతిగా ఆధ్యాత్మిక గురువును సమీపించి, సేవించిన ఆ తేజోతత్త్వం, ఆధ్యాత్మిక చైతన్యం శిష్యుని యెడల జాగృతమగును. అట్లు, కరుణాంతరంగుడైన ఆధ్యాత్మిక గురువు శ్రవాణాసక్తుడైన శిష్యునకు తగినట్లు ఆధ్యాత్మిక సందేశమును నొసంగును.

"యో గురు స్స శివః ప్రోక్తో, యశ్శివస్య గురుస్స్మృతః"

శివుడంటే సద్గురువు, సద్గురువు అంటే శివుడే - అని అనగా సద్గురువును ఆరాధించదంతో దైవాన్ని ఆరాధించదంతో సమానం.

## శిష్యుడు గురువును ప్రార్థింపవసిన విధానము

శ్లో॥ స్వామిన్నమస్తే నతలోకబన్ధో కారుణ్యసిన్ధో పతితం భవాబ్ధౌ ।
మాముద్ధరాత్మీయ కటాక్షదృష్ట్యా బుజ్వాతికారుణ్య సుధాభి వృష్ట్యా ॥

భా॥ స్వామి మీ చరణారవిందములకు నమస్కారము. తమకు నమ్రులగు వారలకు జననీ జనకుల యట్లు బంధువుడవును, దయాసముద్రుడవును నగు స్వామీ!

నేఁ సంసారసాగర నిమగ్నుడనైతిని. తమ కరుణామృత వర్షధారలచేతను, సరళ కటాక్ష వీక్షణముల చేతను నుద్ధరింప వేడుచున్నాను.

శ్లో॥ దుర్వార సంసార దవాగ్ని తప్తం, దధూయమానం దురదృష్టవాతైః ।
భీతం ప్రపన్నం పరిపాహిమృత్యోః శరణ్యమన్యం యదహం న జానే ॥

భా॥ గురుస్వామీ! నేను దుర్వారసంసార దావానలములో జిక్కి పరితపించుచు, ప్రారబ్ధవాయువుచే కంపింపబడుచు, మృత్యువు వలన భీతి చెంది తమకు శరణాగతుడనైతిని. నన్ను రక్షింపుము. తమకంటే శరణాగత రక్షకుల నితరులనెవరిని నే నెరుంగను.

"పంచాక్షర్యాది మంత్రాణాం - ఉపదేష్టాతు పార్వతీ న గురుర్బోధకో భూయాత్" - అని పార్వతికి శివుడు బోధించాడు. అందుకే ఉపదేశం గూర్చి -

శ్లో॥ పుస్తకే లఖితాన్ మంత్రాన్ ఆలోక్య ప్రజపంతి యే ।
బ్రహ్మహత్యా సమం తేషాం పాతకం పరికీర్తితం ॥

భా॥ గురూపదేశం లేకుండా గ్రంథాలలోని మంత్రాలు జపిస్తే బ్రహ్మహత్యా సమమైన పాపం పొందుటయగును.

యాజ్ఞ్యవల్క్యుడిట్లనెను -

శ్లో॥ భవేద్వీర్యవీతీ విద్యా, గురువక్త్ర సముద్భవా ।
అన్యథా ఫలహీనాస్యాత్ నిర్వీర్యాఽప్యతి దుఃఖదా ॥

మంత్రాలకు, ఔషధ మూలికల వాడుక విషయాలకు అగస్త్యుని శాపం ఉన్నది. అందుకే వాటిని గురు ముఖతః గ్రహిస్తే ఆ శాపం అంటదని పెద్దలమాట.

"ఆచార్యాద్దైవ విద్యా విదితా సాధిష్టం ప్రాపత్"

గురువు నుండిన పొందిన విద్యయే సాధుతమమై యుండును. అని శృతి శాసనంతోనే గురువులవద్ద నుండి విద్యనభ్యసించు సదాచారమేర్పడినది. కావున ఆ ఆచారమును యథాతథా పరిరక్షించవలెనని సర్వ శాస్త్రములు, పురాణములు ఘోషించుచున్నవి.

★★★

# 89. రోగనివారణ

సిద్ధుడు, నామధారకునితోనిట్లు వివరించెను.

పూర్వము 'నందిశర్మ' అను విప్రుడొకడు శరీర కుష్ఠురోగముతో బాధపడుచు తులజాపురమున మూడు సంవత్సరములు భవానీదేవిని సేవించెను. అట్లు సేవించినన్నాళ్ళు ఉపవసించి అర్చించెను. అందుకు భవానీ అతని స్వప్నమున దర్శనమిచ్చి చందలాపరమేశ్వరి దగ్గరకు వెళ్ళుమని ఆజ్ఞాపించెను. ఆ ఆజ్ఞప్రకారము వెళ్ళి చందలాపరమేశ్వరిని దర్శించెను. ఆ దేవిని కూడ ఏడుమాసములును ఉపవాసముండి అర్చించెను. ఆ దేవియును నందిశర్మ స్వప్నమున గంధర్వనగరము చేరి త్రిమూర్త్యాత్మకుడైన "శ్రీ నృసింహసరస్వతి"ని సేవించుమని ఆజ్ఞాపించెను. అట్లు ఆజ్ఞాపించుటలో నందిశర్మ ఆశ్చర్యపడి, మహత్తర శక్తిమాతవైయుండి నన్నొక నరుని చేరుమని ప్రేరేపించుట ఏమి? నా ప్రారబ్ధము అయినా నీవంటి దానవు నన్నిట్లు ప్రేరేపించుట భరింపరానిదైనను, ఆజ్ఞగా అచటికి వెళ్ళెను.

నందిశర్మ గంధర్వనగరము (గాణగాపురం) చేరి, ఆ యతీశ్వరుడుని దర్శించెను. అచటి బ్రాహ్మణులు నందిశర్మను దూరముగానుంచి, ఆ శ్రీగురునితో నితని కుష్ఠురోగ విషయమును వెల్లడించిరి. అయినా, శ్రీగురుడు అంతయు తెలిసినట్లు అతనిని లోపలికి రమ్మని చెప్పెను. నందిశర్మ శ్రీగురుని దూరమునుండియే సాష్టాంగముగా నమస్కరించి, వీరు నిజముగా సాక్షాత్ త్రిమూర్త్యాత్మకుడే అని, సందేహంవీడి, తనను క్షమించమన్నట్లు మరల దండప్రణామంబు గావించి

శ్లో॥ ప్రాహస్వామిన్తమోనోఽహం శుద్ధోఽహం స్వామిదర్శనాత్ ।
త్వాం పరంబ్రహ్మనో జానేఽహం మన్దోఽజ్ఞానవేష్టితః ॥

భా॥ శ్రీగురునితో నతనిట్లనెను. స్వామీ! తమస్సుచే నంధుడనైతిని. మిమ్ములను దర్శించి శుద్ధుడనైతిని. పరబ్రహ్మవని తెలియక, మందుడనై, అజ్ఞానముచే ఆవరింపబడితిని.

శ్లో॥ సాక్షాత్పరబ్రహ్మవస్తుత్వాం న వేద్మీశ తామసః ।
అద్యమే సుదినం ధన్యం దర్శనా త్పావనోఽస్మితే ॥

భా॥ మీరు సాక్షాత్తు పరబ్రహ్మవస్తువే. నేను తామసుడనై మిమ్ముల తెలియనైతిని. ఈ దినము సుదినమగుటచే పావనుడనైతిని. నా దుష్కరమంతయును నశించెను.

శ్లో॥ పాపకర్మాఽస్మి పాపాత్మాముడోఽజ్ఞః పాపసంభవః ।
దైవయోగేన శరణం ప్రపద్యే భగవత్పదమ్ ॥

భా॥ పాపకర్ముడను, మూఢుడను, పాపుడను, జ్ఞానహీనుడను, పాపసంభవుడను నేడు దైవయోగమున మీ పాదములు శరణు వేడ౯ల్గితిని.

శ్లో॥ త్వం హి భక్తజనాధారః శరణాగతరక్షణః ।
ప్రసృతా బిరుదాళిస్తే శ్రీ నృసింహసరస్వతి ॥

భా॥ ఓ నృసింహ సరస్వతీ **స్వామీ ! మీరు భక్త**జనాధారుడను. శరణాగత రక్షకుడవు. ఇట్లు మీ బిరుదులు **ప్రవర్తిల్లుచున్నవి. నిజమే** నేను పరబ్రహ్మపదమును చూచితిని. నా దుష్కర్మలు గతించెను. ఓ యతీశ్వరా! మీ కృపవలన నా మనోరథం సిద్ధించెను.

శ్లో॥ నృదేహేనావతీర్ణోఽసి త్వం భక్తజన కామధుక్ ।
కస్తేవేద పరమ్పారొ త్రిమూర్తిస్త్వం న సంశయః ॥

భా॥ మీరు భక్తజనులకు కామధేనువు, నరరూపమున అవతరించితివి. మీ అంతమునెరుగుట ఎట్లు సాధ్యము. మీరు త్రిమూర్తులు సందేహము లేదు.

మీ శరణుజొచ్చితిని. కుష్టురోగిని, అంగవిహీనుడను, నాముఖమును జూచుటకందరు అసహ్యింతురు. మీరు నా ఆర్తిని పోగొట్టుదురని చేరితిని.

అని ప్రార్థింపగా శ్రీగురుడు చిరునగువుతో సోమనాధుడను శిష్యుని పిలిచి ఇతనిని సంకల్ప పూర్వకముగా సంగమమాచరింప జేసి, అచట నున్న అశ్వత్థ వృక్షమును పూజింపజేసి, అతని తడివస్త్రమును అచటనే పారవేయించి, నూతన వస్త్రముధరింపజేసి గైకొనిరమ్ము.'' అని ఆదేశించెను. ఆ సోమనాధుడిట్లే నందిశర్మను సంగమ స్నానమాచరింపజేసి, అశ్వత్థ వృక్షమును పూజింపజేసిరి. అంతలో నందిశర్మ శరీరము బంగారు వర్ణముతో తేజరిల్లెను. తదుపరి సోమనాధుడు అతనికి నూతనవస్త్రమిచ్చి, ఆ పూర్వవస్త్రమును విడిపించి దూరముగా పారవేయించెను. ఆ వస్త్రము పడిన చోటెల్ల చవిటినేలగా నయ్యెను

వెంటనే సోమనాధుడతనిని శ్రీగురుని సన్నిధికి తెచ్చిరి. బంగారు వర్ణఛాయతో వెలుగుచున్న నందిశర్మను చూచిన అచటి వారందరు ఆశ్చర్యపడిరి. నందిశర్మయును ఆనందాశ్చర్యములతో శ్రీగురుని పాదములు బట్టి ధన్యుడనైతినని పలికెను.

తదుపరి శ్రీగురుడు, ''బ్రాహ్మణుడా! నీ శరీరాంగములన్నింటిని పరీక్షించుకొంటివా!" అని పలుకగా, నందిశర్మ తన పిక్కల యందున్న కుష్టురోగశేషము గూర్చి మొరపెట్టుకొనెను. అందులకు శ్రీగురుడిట్లనెను. నా యందు సంశయముతో చేరితివి కావున, నీ విప్పుడు నవీన కవితతో నన్ను స్తుతించుము. దానితో నీవు శాశ్వత శుద్ధుడవగుదువు." అని పలికెను. నందిశర్మ మందబుద్ధుడగుటతో అట్లు కవిత్వము

చెప్పలేదని మొరవిని, వానినోదార్చి "ఏది నీనోరు తెరువుమ"ని, అతని నాలుకపై కొంత భస్మము వేసెను. ఆ తక్షణమే నందిశర్మ జ్ఞానియై శ్రీగురుని పాదములపై బడియిట్లు స్తుతించెను.

శ్లో॥ త్వం విశ్వతారకోఽసీశ దేవ మానుషవేషధృక్
త్రిమూర్తి రేక రూపోఽసి పరంబ్రహ్మ గురోత్వమిత్ ॥

భా॥ స్వామీ! మీరు విశ్వతారకుడవు. మనుష్యరూపమున అగుపించు, ఏకరూప త్రిమూర్త్యావతారం మీరు, పరబ్రహ్మ రూపుడైన గురువు.

"ఆది, అనాధియు మీరే, పరదైవము మీరే"

ముందు మందబుద్ధిగలనేను మీ మహిమలెరుంగనైతిని. నన్నుద్ధరించుటకై అవతరించిన మీరు నన్ను మీ కింకరుడినిగా భావించి రక్షించితిరి. అపండితుడనైన నన్ను కవి పండితునిగా చేసితిరి. సర్వం మీ అనుగ్రహ పాత్రుడనైతిని. నాపాపములన్ని అగ్నిస్పర్శచే భస్మమగునటుల నశించెను. శృతి చెప్పినట్లు గురువంటే "మనలోని అజ్ఞానాంధకారాన్ని, భ్రమలను పోగొట్టి, జ్ఞానప్రకాశం నింపేవాడు" అని. మరియు మన కర్మలనుండి నివారణమొనర్చుటకై బ్రహ్మ సృష్టికి ముందుగానే గురుసృష్టి జరిగింది. (అందుకే త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు భూలోకంలో గురు పరంపరగా ఆదిగురువైన దత్తావతారంను అవతరింప జేసిరి.) అట్టి మీ "చరణం పవిత్రం" సత్యము. నా నొసటి వ్రాతలోని దుష్టాక్షరములన్నియు మీ పాదస్పర్శతో సర్వం శుభాక్షరములయ్యెను. మీరు సాక్షాత్ శ్రీగురుదత్తావతార నృసింహ సరస్వతీయతులు. ఐహికాముష్మికములనేగాక, వైకుంఠమును గూడ నొసంగెడు కామధేనువు వంటివారు. సందేహము లేదు. ఈ నామాట సత్యము - సత్యము - సత్యము - శ్రీ గురువేనమః

★★★

## గురు - సూత్రములు

**త్యాగభావమునకు గురువులు తరువుల వంటివారు.**

★★★

కువాదుల శిష్యుల పట్ల సద్గురువులు మౌనాన్నే పాటిస్తారు.

★★★

"గురుం వినానహి గ్రాహ్య ఆచారోఽప్యథవా మనుః"

ఆచారము గాని, మంత్రముగాని, గురువులేకనే గ్రహింపరాదు.

- (గు.చ. 36 అ. 102/1)

# 90. గురునిలో శ్రీకల్లేశ్వరుని దర్శించుట

మహారాష్ట్రంలోని 'హిప్పగిరి' అను గ్రామంలోని 'నరకేసరి' అను బ్రాహ్మణుడు శివారాధనాపరుడుగా నియమ నిష్ఠలు కలవాడు అతడు తన గ్రామమున వెలసియున్న "కల్లేశ్వరుడ"ను శివుని ఆరాధిస్తూ ప్రతినిత్యము ఐదు నూతన పద్యములను రచించి వాటిని శ్రీకల్లేశ్వరునకు అంకితమిచ్చువాడు. ఆ పద్యములు కడు రమ్యముగా నుండి శోభనొసంగెడివి. ఆ బ్రాహ్మణుని ఏకాగ్రతయే అట్లు పద్యకవిత్వమందు నైపుణ్యం పొందుభాగ్యం. మరి ఏ యితర దేవతలను గాని, ఆరాధించేవాడు కాదు, అతడు. మీదు మిక్కిలి నరాధిపతులపై అసలే కవిత్వం చూపేవాడు కాదు.

ఒకనాడు ఆ గ్రామమునకు "శ్రీ గురుడు నృసింహ సరస్వతి" విచ్చేయగా, ఆ గ్రామ ప్రజలు శ్రీగురుని భక్తి ప్రపత్తులతో పూజించిరి. అట్టి గురువుపై బహుగుణ వర్ణనలతో కవిత్వము చెప్పుమని, ఆ గ్రామప్రజలు నరకేసరి బ్రాహ్మణుని అర్థించిరి. కాని అందులకాతడు "నాయీ నాలుకను శ్రీకల్లేశ్వరునకే అంకితమొనర్చితిని. కావున మరియే యితరులను నేనెట్లు స్తుతింతును?" అని వారిని నిరుత్సాహపరచెను. వారేమియు పలుకలేక మిన్నకుండిరి.

ఆ బ్రాహ్మణుడు యధారీతిగా ఆ దినము శ్రీకల్లేశ్వరుని అర్చించుచుండగా అనుకోకుండ నిద్రలో నిమగ్నమయ్యెను. ఆ నిద్రలో శ్రీకల్లేశ్వర లింగమున్న స్థానమున శ్రీగురుడు కొలువైయుండడంతో, స్వప్నములోనే శ్రీగురుని షోడశోపచారములతో అర్చించెను. శ్రీగురుడతనితో "అర్చసి కుతః కవితానర్హమానుషమ్" "నీ కవిత్వమున కనర్హుడైన మనుష్యునినెట్లు అర్చించుచున్నావు" అని పలికెను. అయినను, సంపూర్ణంగా అర్చించి వెంటనే మేల్కొని, తాను పొందిన అనుభూతికి విప్రుడు విస్మితుడై తాను అర్చించు శ్రీకల్లేశ్వరుడు శ్రీనృసింహసరస్వతియేన, శ్రీగురుడు శివావతారమని గ్రహించి, తన తప్పిదమునకు శ్రీగురుని చేరి పదమునకు దండప్రణామములనొనర్చుచు, నిట్లనెను -

"స్వామీ! నన్ననుగ్రహించుడు, సంశయంలేక మీరు సాక్షాత్ శ్రీ కర్పూరగౌరుడైన కల్లేశ్వరులే - అదియేగాక, మీరు త్రిమూర్తుల అవతార పురుషులే, ఓ జగద్గురూ! నామనస్సు స్థిమిత పడిందిప్పుడు. మీ పాదముల నంటియున్నాను. విశ్వధారులు మీరు. సర్వులను సంరక్షించు సామర్థ్యులు మీరు. నేనల్పుడనై మిమ్ములనెరుంగకయుండి, నా పూర్వజన్మ సుకృతఫలముండి మీ వంటివారిని దర్శించితిని. నే నెప్పుడూ ఇంతకుముందు మిమ్ములను దర్శించనూలేదు, అర్చించనూ లేదు. అయినను నన్నిట్లు అనుగ్రహించుటలో నేనెంతటి ధన్యుడనో" అని భక్తి ప్రపత్తుల హృద్యములైన పద్యములతో స్తుతించెనిట్లు విప్రనరకేసరి.

శ్రీగురుడును అనుగ్రహిస్తూ "విప్రవర్యా! నీవిట్లే శ్రీ కల్లేశ్వరుని కవిత్వంతో అర్చిస్తూ తరించ"మని ఆశీస్సులందజేసి వెడలిరి. ★★★

# 91. శివునికన్నా శ్రీగురుడు మిన్న (కథ)

పూర్వము 'తంతుకుడు' అనేనొక సాలెవాడు గురు భక్తుడై నిత్యము మూడు పూటలూ శ్రీగురుని దర్శించనిదే, నమస్కరించనిదే నీళ్ళైన త్రాగేవాడు కాదు. మూడు పూటలా గురువు ఆశ్రమము నందు శుభ్రపరచి కళ్ళాపుచల్లి వెళ్ళేవాడు. తరుచు గురువు అగుపించినంతనే దూరముగా నిలిచి నమస్కరించి తప్పుకొనేవాడు.

కొంతకాలమునకు శివరాత్రి వచ్చెను. తంతుని బంధుజనము శ్రీశైలయాత్రకై సిద్ధపడి తంతునిని కూడ పిలిచిరి. అతడిట్లనెను. "శ్రీశైల శ్రీ గురుస్థానం శ్రీగురుర్మల్లికార్జునః" అని వానితో చెప్పి రాననెను. వారు నవ్వుకొనుచు మూర్ఖుడని శ్రీశైలం వెళ్ళి పోయిరి.

తంతుకుడు గురుసేవగా తన నిత్యకర్తవ్యమొనర్చుచు గురువునకు నమస్కరించి వెళ్ళుచుండగా శ్రీగురువు తంతుకునితో నిట్లనెను. "ఓరీ! నీ బంధువులెల్లరు శివరాత్రియాత్రగా శ్రీశైలం వెళ్ళిరికదా! నీవు వెళ్ళలేదేమి?" అని అడుగగా, అతడు "అత్రైవ మేఽఖిలం" అని పలుకుచు, మరల నిట్లనెను. "స్వామీ! సర్వక్షేత్రములు, తీర్థములు నీ చరణములకడనే కలవు. వారు మూర్ఖులై వ్యర్థముగా రాతిని దర్శించుటకై వెళ్ళిరి" అని పలికి నమస్కరించి తంతుకుడు తన యింటికి వెళ్ళెను.

కొన్నిదినములకే మాఘ బహుళ చతుర్దశీ నాటి శివరాత్రి పర్వము వచ్చెను. ఆనాటి మధ్యాహ్నమున గురుభక్తుడైన తంతుకుడు ఉపవాసమునకై సంగమమున స్నానమాచరించి, శ్రీ గురుని దర్శించి, సాష్టాంగముగా నమస్కరించి చేతులు కట్టుకొని నిలిచెను. శ్రీ గురుడు అతనితో "నీవెప్పుడైన శ్రీశైలమును చూచితివా!" అని ప్రశ్నించగా నీతడు, "స్వామీ! నే నెప్పుడును ఎరుగను. మీ పాదములే నాకు సర్వస్వము", అని మిన్నకుండెను.

**శ్రీగురుడు** దయతలచి అతనితో నీకు శ్రీశైలమును దర్శింపజేతును, "కన్నులుమూసుకొని నా పాదములను పట్టుకొనుము?" అని పలుకగా అటులే యని ఆజ్ఞగా, శ్రీగురుని పాదుకలను గట్టిగా పట్టుకొని కన్నులు మూసుకొనెను. అంతే! శ్రీ గురుడాతనితో శ్రీశైలం చేరి, అచటి పాతాళగంగ నదీ తీరమున చేర్చి, అతనిని "కళ్ళుతెరువు"మనెను. శ్రీ గురుడిట్లనెను. "ఇచట స్నానాదుల గావించుకొని, శ్రీ మల్లికార్జునుని దర్శించుము అని పలుకగా, ఆజ్ఞగా ఆ నదియందు స్నానాదుల గావించుచుండగా అచట తన బంధువులను చూచెను. వారును అతనిని చూచి ఆశ్చర్యపడి, "ఇతడెట్టు వచ్చెన"ను కొనిరి. అతడును వారిని పలుకరించి, వారితో మల్లికార్జునుని దర్శించెను అట్లు స్వామిని దర్శించుటలోను, పూజించుటలోను శ్రీగురునే తన మనమున నిలుపుకొనెను. అట్లు అర్చనలో

తంతుకుడశి సంతుష్టుడై, శ్రీ గురుని తిరిగి చేరి నమస్కరించి యిట్లనెను -

"స్వామీ! నాకు దేవాలయమున సున్న ఆ లింగస్థానమున అందరు మిమ్ములను పూజించుచున్నారేమి? మీరు వారి సమీపముననే నున్ననూ, వారింతవరకు వచ్చి పూజించంటేమి? మీరెవరో వారెరుగరా! మీ మహాత్మ్యమెరుంగక ఈశ్వరుడు ఈ శైలమున నున్నాడని వచ్చుట ఏమి?" అని శ్రీగురుని ప్రశ్నించెను.

శ్రీ గురుడు, "నాయనా! అట్లు అందరిని ఆకట్టుకొనే మహాత్మ్యమును ప్రతిక్షేత్రమునకుండును. వాటిలో ఈ శ్రీశైలమొకటి. ఈ శ్రీశైల క్షేత్రమహిమ అపారమైనదని స్కాంధపురాణమున చెప్పబడెను" - అని తంతుకునితో నుడివెను.

★★★

## గురు - సూత్రములు

"అధిగమ్య గురోరాజ్ఞాం ప్రతిమాం పూజయేద్ద్విజః ।"
గుర్వాజ్ఞతోనే ద్విజుదు ప్రతిమా పూజ చేయవలెను.

★★★

"శ్రీగురోరాజ్ఞాయా యోఽర్చేత్కాష్ఠం పాషాణమేవవా ।
దేవ స్స ఏవ భవతి స భక్త్యా ప్రసీదతీ ॥"
గుర్వాజ్ఞగా అర్చించినది కర్రయైనను, రాయియైనను అది దైవ సమానమే. అది భక్తునకు ప్రసన్నమగును.

★★★

•"వ్యస్తాభ్యాం స్వకరాభ్యాంచ సమ్ముఖస్థ గురోః పదౌ ।
జాను ప్రభృతి పాదాన్తం విమృజ్యైవాభి వాదయేత్ ॥"
గురునికి ఎదురుగా వుండి తన చేతులను వ్యస్తముగా (అనగా ఒకదానిపై నొకటి అడ్డముగా వేసి) గురునికి, గురుని కుడి కాలును తన కుడి చేతితోను, ఎడమకాలును తన ఎడమచేతితోను, గురుని పిక్కల మొదలు పాదముల చివర వరకు నిమురుతూ నమస్కరించవలెను.

★★★

"కామధేనుర్గురోర్వాక్యం మూఢా జానన్తినైవ తత్"
శ్రీ గురుని మాట కామధేనువు.
ఆ విషయము మూర్ఖ జనులకు తెలియదు.

# 92. గురుభక్తి (కథ)

పూర్వము వ్యోమకేశుడైన శివుడు తన అర్ధాంగియైన హిమవత్పుత్రిక పార్వతితో "గురుభక్తి"ని గూర్చి ఒక దృష్టాంతపు కథను నిట్లు వివరించెను.

ఓ గిరిజా! -

శ్లో॥ గురుభక్తిస్తు సులభా తత్కాల ఫలదా మతా ।
విలంబేనైవ సిద్ధిస్తు తపోనుష్ఠానతో నృణాం ॥

భా॥ గురుభక్తి సులభమైనది. తక్షణమే ఫలితమొసంగునది. తపో అనుష్ఠాదుల వలన ఫలితము ఆలస్యముగా సిద్ధించును.

అనుష్ఠానాదులలో విఘ్నములే వాటిల్లు చుండును.

శ్లో॥ కూర్యాద్యః సద్గురోర్భక్తిం స శ్రీఘ్రం ఫలమాప్నుయాత్ ।
యజ్ఞాదీనాం ఫలం చాపి తదం తర్గతమేవహి ॥

భా॥ సద్గురు భక్తితో ఫలము శ్రీఘ్రముగా లభించును. యజ్ఞాదుల ఫలితము కూడ అందులోనివే. అనగా గురుభక్తిచే లభించు ఫలితములోనివే యగును.

అందుచే - "భక్త్యా గురుకులావాసం కృత్వాసేవ్యోగురుస్తతః"

గురుకులవాసముండి గురుని సేవింపవలయును. అని -

బ్రహ్మవంశమున పుట్టిన "త్వష్ట"యను నతని తండ్రి ఉపనయన సంస్కారమొనర్చి, విద్యాభ్యాసమునకై, నొకగురుకుల వాసమున కంపెను. అచట 'త్వష్ట'యు బ్రహ్మచర్యానిష్ఠతో, ప్రీతితో, **భక్తితో గురుసేవను** నొనర్చుచుండెను.

**ఇట్లుండనొకనాడు** మహావేగముతో కూడిన గాలివలన గురుని పర్ణశాల జీర్ణమై యుండుటచే ఆ పర్ణశాల అంతయు జలమయమయ్యెను. అది చూచిన గురువు త్వష్టతో నిట్లనెను. 'నాయనా! ఎటులైననొక క్రొత్త పర్ణశాలను నిర్మింపవలెను. అందుకు నీవు సిద్ధపడుము' అని ఆదేశించెను.

తదనంతరం గురుపత్ని నాయనా! నాకొక చిత్రవిచిత్రము గానుండు, రంగులేని, దారముతో కుట్టని, నా శరీర ప్రమాణమున కనువగు రవికెను దెమ్ము. అని ఆదేశించెను.

అంతట గురుపుత్రుడు "త్వష్ట"ను సమీపించి, "నాకు సరియగు, నీటిలో నడిచినను తడవని పాదుకలు తెమ్ము. అవి నా సంకల్పంతో సుఖముగా సంచరించుట కనువగునట్లుండ

వలెను. అని కోరెను.

ఇంతలో గురుపుత్రి సమీపించి, 'త్వష్ట'తో "ఓ బంధూ! నాకు చూడచక్కని రెండు చెవిపోగులు తెచ్చియిమ్ము. మరియు ఆడుకొనుటకు నూతనమైన నొక అందమైన బొమ్మరిల్లును తెమ్ము. అందులోని వంట పాత్రలు మణులతో చేసినవిగా, వండినవి వేడిగా నుండునట్లు, మసి అంటనివిగా పాత్రలుండవలెను" – అని అర్థించెను.

ఇట్లు నలుగురు కోరినట్లు గురుకార్యార్థమై భావించిన 'త్వష్ట' బయలుదేరి తిరిగి నొకచోట నొక 'అవధూత'ను దర్శించెను. అవధూత త్వష్ట ఆవేదనను గ్రహించి ఓదార్చి యిట్లనెను. "బాలుడా! నీ ఆవేదన తీరవలెనన్న, అన్ని కోరికలను సిద్ధింపజేయగల సమర్థుడు ఆ కాశీవిశ్వేశ్వరుడొక్కడే. కావున కాశీ వెళ్ళుము. అచటి కాశీవిశ్వేశ్వరుని దర్శించి ఆరాధించుము. తప్పక నీ కోరికలు తీరును. బ్రహ్మాదుల కోరికలే తీరినవి అచట. విష్ణువు అచట పాలనకు వరము పొందెను, అచటికిచేరిన వెంటనే నీ కోరిక తీరి, మనస్సు చలించుట మానును. అదియేగాక, అచ్చోట చతర్విధపురుషార్థములు వెంటనే లభించును. ఎందుకనగా కాశీవిశ్వేశ్వరుడు మిక్కిలి దయాళువు. మంగళప్రదమైన ఆనందనిలయమది. సమస్త ధర్మములకు రాశిలాంటిది కాశి. సర్వజీవులకు మోక్షస్థానమిది. సమస్త దోషముల నివారణ స్థలమది. ఇంకను చెప్పనేల, కాశీమహాత్మ్యమును వర్ణింప ఆ ఆదిశేషునికి తరముకాదు. కావున కాశీలో నీవొక లింగమును ప్రతిష్ఠింపజేయుము. అందుకు తప్పక కాశీని దర్శించుటకు నీవు యాత్ర సాగింపుము. కాశీ తీర్థయాత్రలో వెళ్ళిన వారికి అడుగడుగున అశ్వమేధ ఫలమబ్బును." అని, కాశీక్షేత్ర మహాత్మ్యమును అవధూత వక్కాణించెను. అది విన్న 'త్వష్ట' సంతృప్తిచెంది, ఆ కాశీని చేరుటకు స్వామి అవధూతయే సమర్థుడని విశ్వసించి, స్వామీ! నావంటివానిని అచటికి చేర్చుటకు మీరే సమర్థులు. మీరు తప్ప నాకెవ్వరు దిక్కులేరు, అని అవధూత పాదములపై పడి ప్రార్థించెను.

అవధూత, 'త్వష్ట' ప్రార్థనకు సంతసించి, అటులేయసుచు, "నీవలన నాకును కాశీని దర్శించు భాగ్యము లభించును, నావెంట రమ్ము" అని ఆ బాలునితో మనోవేగమున కాశీని చేరి, "బాలకా! ఇదియే కాశీ. నీవిక విశ్వేశ్వరుని దర్శింపుము." అని అవధూత పలికెను. అది విన్న 'త్వష్ట' స్వామీ! ఈ కాశీలోని ఆ విశ్వేశ్వరుని నెట్లు దర్శించవలెనో, నేనెట్లు ఈ కాశీ మహాత్మ్యమును చూచి తెలుసుకోగలనో తెలియదు. అందుకు మీరే సమర్థులు. కావున, నా కోరిక మన్నించి, ఆ కాశీవిశ్వేశ్వరుడే మీరని తలంచితిని. నేనెట్లు ఈ కాశీయాత్ర చేయవలెనో దయయుంచి విశదపరుచుము, మీరే నా గురుదేవులు. మీ అనుగ్రహముతో నాకన్నియును సిద్ధించును. నేనారాధించకనే ఆ విశ్వనాథుని రూపములో మీరు నన్ను ఇచటికి చేర్చితిరి. ఆ గురువే మిమ్ములను దర్శింపజేసిరి. మీ కన్నా దిక్కు నాకింకేది. ఏ దానాదులు చేసినను మీ వంటి వారల దర్శనం దుర్లభము. నా భాగ్యమేమో

ఏ ప్రయత్నము లేకయే నాకీ గురుప్రసాదము లభించెను" అని, ఈ తీరున స్తుతించెను.

ఆ స్తుతికి మెచ్చిన అవధూత మిక్కిలి సంతసించి ఆ బ్రహ్మచారి 'త్వష్ట'కు తక్షణమే విశ్వేశ్వరుడుగా ప్రత్యక్షమై, "నాయనా! ప్రసన్నుడనైతిని. నీ యిష్టమైన కోరికను కోరుకో"- అనెను. ఆ విశ్వేశ్వరుని దర్శించిన బాలుడు మిక్కిలి సంతోషించి, తన ఆవేదనను వెలిబుచ్చెను. అతని గురుభక్తికి మెచ్చి "బాలకా! వాని కోరికలన్నియును నెరవేర్చెదను. అదియుగాక, అన్ని విద్యలు నీకు లభించునుగాక! ఇక నీవు "విశ్వకర్మ"యను పేరున సర్వవిద్యాపారంగతుడవు కమ్ము. చతుర్విధ పురుషార్థములు లభించును నీకు. బ్రహ్మదేవునివలె త్వష్ట అను నామమునకు సార్థకతగా నీవును సృష్టిరచన చేయగలవు. సంశయము లేదు." అని వరంబులొసంగి అవధూత గురువు అదృశ్యమయ్యెను.

ఇట్లు వరములు పొందిన 'త్వష్ట' అపరబ్రహ్మవలె త్వష్టగా విధి పూర్వకముగా కాశీయందు తనపేరనొక లింగప్రతిష్ఠ జేసెను. శూలపాణియే దర్శనమొసగగా వానికి దుర్లభమైన కార్యమేది? వెంటనే గురుని ఆశ్రమము చేరి గురునకు పాదాభివందనములొనరించి, వారి వారి కోరికలన్నియు తీర్చి, వారికిని చేతులెత్తి వందనమాచరించి నిలిచెను.

ఆ గురువు శిష్యుని విధేయతకు మెచ్చి సర్వం తెలిసి సంతోషించి ఆలింగనమొనరించి ఇట్లనెను - "శిష్యా! నీ గురుభక్తికి సంతసించితిమి. మా కోరికలన్నియును తీర్చితివి. నీవు జ్ఞాన రసికుడవు కమ్ము. ఆచంద్రార్కము చిరంజీవివై సర్వవిద్యలు, కళలతో విరాజిల్లి 'త్వష్ట'గా సృష్టిరచన చేయుము. అష్ట సిద్ధులు నీ యాధీనమందుదును. నవ నిధులు నీవియే. ఇట్టి చింతలు, విచారములు నీదరికిరావు, నీ ప్రతిభ స్వర్గ మర్త్యపాతాళముల యందు విస్తరించును గాక!" అని ఆశీస్సులంద జేసి యింటికి పంపెను.

ఇట్లు, పరమేశ్వరుడు పార్వతికి గురుభక్తికి నిదర్శన కథ తెలిపి ఇట్లనెను. దేవీ! గురుభక్తి మహిమ యిట్టిది.

"గురుం య ఏక భావేన భజేత్సోఽభీష్ట భాగ్భవేత్ ।"

గురువునకు ఏగైక భక్తితో కొలచిన కోరికలన్నియు తీరును.

శ్లో॥ సేతుం భవనిధేః పారం శక్త ఏకో గురుర్భువి ।
గురుం భజతి యో భక్త్యా తస్యాధీ నాస్త్రిమూర్తయః ॥

భా॥ సంసారసాగరమును తరింపజేయు సమర్థుడు ఈ భూమియందు గురువొక్కడే
ఎవడు భక్తితో గురువు నారాధించునో త్రిమూర్తులు వాని యధీనమున నుందురు.

శ్లో॥ స్వయం త్రిమూర్తయోఽపీహ గచ్ఛన్తి శ్రీగురోః పదం ।
గురుం వినా గతిర్నేతి వక్తి శృతిరపి స్మృతః ॥

భా॥ త్రిమూర్తులును స్వయముగా శ్రీగురుని పాదముల నాశ్రయింతురు. శృతి స్మృతులు గురువులేక గతులు లేవని చాటుచున్నవి.

శ్లో॥ యస్యదేవే పరాభక్తిర్యథాదేవే తథాగురౌ ।
తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశన్తే మహాత్మనః ॥

భా॥ "దేవుని యందు ఎంతభక్తియో, అంత భక్తి గురువునందుంచ వలయును. అట్టివానికే గురువు చెప్పిన బోధ అనుభవమునకు రాగలదు." ఇది వేదవచనము.

కావున, గురుభక్తిని కల్గియుండడమే సర్వశ్రేయోదాయకము అని ఈశ్వరుడు పార్వతితో విశదపరచెను.

ఈ కథను పఠించిన వారికి, పఠించి విశదపరచేవారికిని ఆ ఈశ్వరుని అనుగ్రహముందునని బ్రహ్మాండ పురాణమున తెలిపిన కథను సూతమహర్షి శౌనకాదులతో వివరించెను.

★★★

## గురు - సూత్రం

శిష్య ఇతి చ:-

"విద్యాధ్వస్త ప్రపంచాఽవ గాహిత జ్ఞానాఽవశిష్టం బ్రహ్మైవ శిష్యః",

- (మహానారాయణోపనిషత్తు)

విద్యచేత తనకంటె జగత్తు అంతయు అదృశ్యమగునపుడు, తన కంటె వేరైన వస్తువెద్దియును లేక, తానొక్కడుగానే మిగిలి యుండుటచే ఆబ్రహ్మమే శిష్యుడు. అని విష్ణువే గురువుగా బ్రహ్మ నమస్కరించి అనేక రీతులుగా స్తుతించి, పరమ తత్త్వ రహస్యమును తెలుసుకొనెను.

★★★

# 93. గురువాక్య పరిపాలన

శ్లో॥ గురుర్యోగ్యోఽథవాఽయోగ్య ఇత్యాది నవిచారయేత్ ।
గురుం బ్రహ్మమయం ధ్యాత్వాసేవాం కుర్వీత భక్తిమాన్ ॥

భా॥ గురువు యోగ్యుడా! అయోగ్యుడా!యని విచారణతో పని లేదు. గురువుని పరబ్రహ్మ స్వరూపుడని ధ్యానించి భక్తితో సేవించవలెను.

శ్లో॥ దృఢ భక్తిర్యస్య తస్య సర్వసిద్ధిః క్షణేన హి ।
అతో విహాయ సందేహ సావధానో భజేద్గురుమ్ ॥

భా॥ ఎవనికి గురుని యందు దృఢమైన భక్తి కలదో వానికి క్షణమాత్రమున సర్వము సిద్ధించును. అందుచే సందేహాలను వదలి సావధానచిత్తుడవై గురుని భజింపవలెను.

శ్లో॥ గురోరన్యావం నవక్షేత భావయేదీశ్వరం గురుం ।
నరదృష్ట్యా నవీక్షత్ త్రిమూర్తింభావయద్గురుం ॥

భా॥ గురువును ఈశ్వరునిగా భావింపవలెను. ఎప్పుడును గురువును అల్పుడుగా చూడరాదు. గురుని నరుడని భావించరాదు. త్రిమూర్తి రూపుడుగా భావించవలెను.

శ్లో॥ ఏవం నిశ్చిత్యమనసా భజేద్యో గురోః పదే ।
శూలపాణిర్భవేత్తస్య ప్రసన్నో నాత్ర సంశయః ॥

భా॥ ఈ రీతిగా మనస్సున నిశ్చయించుకొని ఎవడు శ్రీగురుని పాదములను భజించునో వానియందు శూలపాణియైన శివుడు ఏ సంశయములేక ప్రసన్నుడగును.

శ్లో॥ మంత్ర తీర్థే ద్విజే దేవేదైవజ్ఞే భిషజే గురౌ ।
యాదృశీ భావనా యస్య సిద్ధిర్భవతి తాదృశీ ॥

భా॥ మంత్రమందు, తీర్థమందు, బ్రాహ్మణునియందు, దేవునియందు, జ్యోతిష్యునియందు, వైద్యునియందును గురునియందును ఎవనికెట్టి భావముండునో అట్టి సిద్ధియే వానికి కలుగును.

శ్లో॥ మంత్రాదిషు యథా భక్తిర్భవిష్యతి తథాఫలం ।
తథా గురుం శివం పశ్యేద్యస్తస్యేశః ప్రసీదీతి ॥

భా॥ మంత్రాదులయందు భక్తిననుసరించి ఫలితమెట్లు కలుగునో అటులనే గురుని

శివునిగా భావించి సేవించిన వానికి శివుడు ప్రసన్నుడగును. ఫలితము ఆలస్యముగా సిద్ధించును.

అని చెప్పి, అట్టి గురుభక్తిని ప్రసాదించు నిదర్శన కథనునిట్లు వివరించెను. ఋషులారా! పూర్వము పాంచ్యాల నగరమున సింహకేతుడను రాజునకు "ధనంజయుడ"ను ధార్మికపుత్రుదుండెను. అతడొకనాడు వేట నిమిత్తమై అరణ్యమున (దూతయైన శబరునితో) తిరుగుచు తిరుగుచు ఆగి, ఒక శివాలయమును చేరెను. అచట అనేక లింగములను జూచి అందున్న నొక లింగమును గైకొని, దాని నర్చించనిచ్చగించెను. రాజపుత్రుడు అది తెలిసికొని, అతని వ నోభీష్టమునకు సంతసించెను. శబరుడు అజ్ఞాని గనుక, ఈ లింగమునునెట్లు అర్చించవలెనో నాకుపదేశింపుమని రాజపుత్రుని అర్థించెను.

అది విని రాజపుత్రుడిట్లుపదేశించెను – శబరీ! నీవీలింగమును నీ గృహమునకు గైకొనిపోయి శుచియైన స్థానమున ఈ లింగమును గిరిజారమణుడుగా భావించి స్థాపించిము. గంధపుష్పాదులతో, ధూపదీపాదులతో నిత్యము అర్చించుము. నివేదనగా స్వామికి చితాభస్మమును అర్పించి, మీరేమి తినుదురో వాటిని కూడా అర్పించి ప్రసాదముగా మీరిరువురును (భార్యాభర్తలు) భక్షింపుడని ఉపదేశించెను. ఇట్లు చెప్పిన రీతిగా శబరుడు అటులే ఇంటికిగైకొని వెళ్లి శుచియైన స్థలములో స్థాపించి భార్యతో కూడా అభిషేకిస్తూ గంధపుష్పాదులతో అర్చించి గురువుగా రాజపుత్రుడు తెలిపినట్లు చితాభస్మమును తెచ్చి నివేదించసాగెను.

కాని ఒకనాడు చితాభస్మము ఎక్కడనూ లభించకపోగా ఆ దినము లింగమునెట్లు పూజించవలెనో తోచక ఖిన్నుడై యుండెను. అది చూచి భార్య ఇట్లనెను.

నాథా!

శ్లో॥ గురువాక్యం నయః కుర్యాద్రౌరవం నరకం వ్రజేత్ ।
న దూరం పాతకం తస్య సదా దారిద్ర్య భాక్భచ ॥

భా॥ గురువాక్యమును పాటించనివాడు రౌరవ నరకమును పొందును. నరక లోకమువానికి దూరము కాదు. వాడు దరిద్రుడగును.

శ్లో॥ అథోగతి ర్భవేత్తస్య నరకోఽఖండతోఽస్యచ
గురుభక్తింతు యః కుర్యాత్స నిస్తీర్ణో భవార్ణయేత్ ॥

భా॥ వాడు అధోగతిని పొందును తెరపి లేని నరకమును పొందును. గురువాక్యమును నెవడు భక్తితో ఆచరించునో వాడు భవార్ణవము (సంసారసముద్రము)ను దాటును.

అని సర్వవేదములు, సర్వ శాస్త్రములు వక్కాణించుచున్నవి. అందుకని నాథా!

ఈ లింగపూజకై నా పై మోహము వీడి ఈ ఇంటియందున్న కట్టెలచే నన్ను నిప్పంటించిన నా దేహము దగ్ధమగును. ఆ భస్మముతో లింగమునకు నివేదనమొనర్చి సంతృప్తునొందుదు. విచారించక నేనీమాటలు సంతోషముతో వెలిబుచ్చుచున్నాను. ఎందుకనగా నేను నీ అర్ధాంగిని నా యీదేహము బుద్బుదప్రాయము. ఎన్నడైనను నశించుట తథ్యము. కావున శివునకై దేహమును త్యజించుట మోక్షమే కదా! అని పలికెను.

ఆ మాటలువిన్న శబరుడు "ప్రాణప్రియా! నాకన్న చిన్న దానవు బొమ్మలాంటి నీ దేహమును నేనెట్లు దహింపజేతును. సంతానమును పొందలేదు. సంసార సుఖము ఇంకను నెరుగవు. నీ అందము కొంగ్రొత్తగానే కన్పించుచున్నది. అదియేగాక, నీ తల్లి దండ్రులు నన్ను రక్షించమని నిన్నిచ్చి నాతో వివాహము చేసిరి, నేనును బాస చేసితిని. ఇప్పుడు నిన్ను దహింపజేసిన, స్త్రీ హంతకుడని లోకులు నన్ను నిందింతురు" అని వాపోయెను. ఆ మాటలు విన్న స్త్రీ శబరి యిట్లనెను.

"నాథా! ఈశ్వరునికై దహింపబడుటలో దోషమెవరికిని కలుగదు. ఈ దేహము సాఫల్యమొందును. విచారించకుము. అగ్నితో నన్ను దహింపజేయుము." అని వేడుకొనగా, శబరుడు నిశ్చల మనస్సుతో శబరిని దగ్ధము చేసెను. ఆ చితాభస్మముతో లింగార్చన చేసి, అటు శివుని, భార్యను, సంతుష్టిజేసెను ఆ సంతృప్తిలో మైమరచి ప్రసాదము గైకొనుమని ఎప్పటిలాగా భార్యను కేకవేసెను. ఆ కేకతో ఈశ్వరుడు ఆమె యెడల ప్రసన్నుడైన కారణంతో, నిజముగానే శబరి వచ్చి భస్మమును ప్రసాదముగాగైకొనెను. కొంత తేరుకున్న శబరుడు ఆశ్చర్యపడి, నిజము తెలిసి ఆనందోత్సాహముతో శివుని ప్రార్థించెను.

శివుడు పార్వతీసహితుడై ప్రత్యక్షమై, వారిని స్వర్గ ధామము పొందుటకనుగ్రహించి అదృశ్యులైరి.

"మునులారా! చూచితిరా! గుర్వాజ్ఞను పాటించిన వారికెట్టి సుగతులుండునో!" అని సూతుడు పలికెను. (గురుచరిత్ర 40వ అధ్యాయము)

★★★

## గురు - సూత్రం

"గురూక్తౌ యస్య విశ్వాసస్స ఫలం లభతే ధృతం"

గురువాక్యము నందెంతటి విశ్వాసముండునో అంత శీఘ్రముగా ఫలితము లభించును.

- (గు.చ. 40 అ. 110/2 శ్లో)

# 94. హనుమంతుడు ఆచార్యుడు

ఆత్మాన్వేషణములో ఉపాయము ఆచార్యుడే. ఆచార్యుడే హనుమ. పరమాత్మ ఆచార్యుని దూతగా వరించి, తానే జ్ఞానమును ప్రసాదించి శరీరమున కారణజన్మునిగా జన్మింపజేసి వానివలన ముముక్షువునగు జీవుని స్వభావము నెరింగి తానే స్వయముగా ఆ జీవుని బంధించిన మనస్సును మర్దించి తనతో చేర్చుకొని పరమపదమునకు తీసికొనిపోవును.

జీవుని తరింపజేయగల ఆచార్యుడు లభించుటచే పరమాత్మ సంతోషించును. వాక్యకుశలుడగు హనుమను ఆచార్యునిగా (దూతగా) ఎన్నుకోవడంలో, పరమాత్మ (శ్రీరాముడు) ముముక్షువులగు జీవులకై అన్వేషించుచు యోగ్యుడగు ఆచార్యుని పొందిన వృత్తాంతమును సూచించుచున్నది. భగవంతుడు జీవులను పొందుటకై తానై యత్నించుచుండును. కాని తనంతపొందదు. ఆచార్యుల ద్వారా జీవుని తరింపజేయును. అందుకే "ఉపనిషత్తు" విరక్తికలిగినవాడు ఆచార్యునే చేరవలసినదని చెప్పినది.

"స గురుమేవాభిగచ్ఛేత్" - అంతియేగాని భగవంతుని సాక్షాత్తుగా చేరుట జీవునకు శక్యము కాదు. అట్టి యార్తి జీవునిలో కలిగిననాడు భగవానుడే యోగ్యుడగు ఆచార్యుని వరించి జీవుని వద్దకు పంపును. ఆచార్యుడు వేదసంపన్నుడు కనుక, "శృతి" కూడ - "శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్" - శ్రోత్రీయుడు, బ్రహ్మనిష్ఠుడు అగు ఆచార్యుని చేరవలెనని చెప్పినది. వేద వేదాంగములనధ్యయనము చేసి అర్థమునెరింగిన వాడు శ్రోత్రియుడు. సతతము భగవదనుభవమున నిలిచినవాడు బ్రహ్మనిష్ఠుడు. ఆ లక్షణములు ఆచార్యుడగు హనుమకు గలవు, త్రివేదాధ్యయనము చేసినవాడని హనుమను శ్రీరాముడు ప్రశంసించెను. ఋగ్వేదవినీతుడుగా, యజుర్వేదధారిగా, సామవేద విదుడుగా పేరొందెను.

ఇట్లు హనుమ వేదాధ్యయన సంపన్నుడని శ్రీరాముని ప్రశంసనందినవాడు. ఇట్టివాడు దూతగా నున్నచో కార్యము తప్పక సిద్ధించును.

రాజునకు దూత యెట్లు సాయపడునో భగవంతునకాచార్యుడంత సాయపడును. భగవంతుని సందేశమును జీవునకందించు దూతయే ఆచార్యుడు. అతనికి కావలసినది వాగ్వైభవమే. అతని వాక్కేమంత్రము. మంత్రమును, మంత్రార్థమును నెరింగి శిష్యుల కందింప గలిగిన వాడే ఆచార్యుడు. ఆచార్యత్వమునెరిపిన వాడు ఆచార్యుడు. తాను పరిశుద్ధుడై శిష్యుల దృష్టిని ఆత్మవైపు మరలించగలడు. ఆత్మదర్శనమునకు భగవత్ప్రాప్తి యిట్టి ఆచార్యుడావశ్యకమని యెరుంగవలెను. ఇట్లు శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అగు

ఆచార్యుడు హనుమలో మనకు దర్శన మొసంగును.

భగవానునికి దూరమై భగవానుని పొందవలెనని పరితపించు జీవుని వెతకి, భగవంతునితో జేర్చుటకు భగవంతునిచే వరింపబడి భగవదత్తమగు సందేశమును నందించెడి ఆచార్యుడే సమర్థుడు. ఆ ఆచార్యుడే హనుమ. భగవంతుని వహించు శబ్దమే మంత్రము. ఆ మంత్రము నొసంగు ఆచార్యుడు మంత్రస్వరూపియే. హనుమ యొక్క ఉత్పత్తి ప్రకారమును పరిశీలించిన మంత్రము (శబ్దము)నకు హనుమతోగల సామ్యము మనకు గోచరించును

శ్రీరామునకును సుగ్రీవునకును మంత్రాంగము జరిపినవాడు హనుమ. అనగా ఆచార్యత్వం వహించినవాడని అర్థము, అందుచే హనుమ సుగ్రీవునకు సచివుడుగా, శ్రీరామునకు దూతగా, రామదాసుగా భగవద్వాహనమై మంత్రాంగము నడుపుటలో నేర్పరుడై ఖ్యాతి, కీర్తి, యశస్సులను పొందిన వాడయ్యెను.

ఇట్లు హనుమ ఆచార్యుడుగా, ఆచార్యులు ప్రసాదించు మంత్రముగా గోచరించును.

శ్లో॥ తతో రావణ నీతయాః సీతాయ శ్శత్రు కర్శనః ।
ఇయేష పదమన్వేష్టుం చారణాచరితే పథి ॥ - (రామ.సుం.కాం. 1-1)

భగవంతుని నుండి వేరుచేయబడిన జీవుని అన్వేషించుటకు ఆచార్యుడు సంకల్పించుటయే ఆచార్య స్వరూపము. అనగా ఆచార్యుడు శత్రుకర్శనుడు. భగవత్ప్రాప్తికి ప్రతిబంధకమగు కామమనే శత్రువును జయింప కల్గించువాడే గురువు. ఈ పైశ్లోకము హనుమస్వరూపంగా (ఆచార్యుడుగా) నున్నది.

జీవి మానవుడుగా పుట్టుట, పుట్టి సద్గురువు సమాగమము పొందుట. పొంది ప్రకృతియను భవబంధము నుండి విడువడుటమనునవి దుర్లభములు.

ఎందుకు దుర్లభములు ?

1. తాను స్వతంత్రుడనని తలంచుట,
2. తనను తాను, లేక యితరులు రక్షించగలరని తపన,
3. భగవత్ప్రాప్తి తనకై యని తలంచుట. అను ఈ మూడును ఆత్మ స్వరూపమునకు, ఉపాయమునకు, పొందు ఫలమునకు విరోధులు. ఈ విరోధులను జయింపగలవాడే గురువు.

గురువు ఎట్లు 'భావించును' -

1. తాను భగవానునికి చెందినవాడనని,
2. భగవంతుడే తనకు రక్షకుడని తలంచుట,
3. తాను చేయునది భగవంతుని కైంకర్యముగా నెరింగిన వాడు గురువు. అతడే శత్రుకర్శనుడు. ఆచార్యుడును చారణులు (పూర్వఋషులు)ను అనుసరించవలెను. అదే చారణ చరిత మార్గము. వారి నడవడియే ప్రమాణం అని (ఉపనిషత్తు ఉవాచ)

ఇట్టి గురువు యొక్క సంకల్పమే శిష్యునకు "రక్ష". భగవత్సంకల్పము కంటే, ఆచార్య సంకల్పము రక్షింపబడునది. అట్లు రక్షించుటకు ఆచార్యుడు భగవత్ప్రాప్తి పొందు జీవుని అన్వేషించును. అనగా ఆ జీవుడు భగవద్వేషి కాకుండు వాడు, సాత్వికులగు సత్పురుషులతో సమాగమము కోరువాడుగా నున్నవానిని ఆచార్యుడు అన్వేషించును.

ఆ జీవి ఎవరు? సీత. అనగా స్త్రీ, పరతంత్రురాలు. జీవుడన్నంత మాత్రాన పురుషుడును భగవానునకు పరతంత్రుడే. అనగా స్త్రీ వంటి వాడే. నిజమైన పురుషుడను వాడు భగవానుడొక్కడే. అతడు కదు స్వతంత్రుడు.

తానే పురుషుడనను భావించు అవివేకి రావణుడు. అహంకారి, అహంభావి అతడు. అందుకే అసత్ప్రలాపాలతో కాలంబుచ్చుతాడు.

"రావయతి అసత్ప్రలాపాన్ కారయతి ఇతి రావణః"

64 విద్యలలో ఆరితేరిన రావణుడును జీవుడే, అనగా పరతంత్రుడే, అని తెలియని మూర్ఖుడతడు. అయినా అట్టి వానికిని జ్ఞానము బోధించుటకు యత్నించెను, ఆచార్యుడుగా హనుమ.

"హనుమాన్" అను పేరులోనే మహాసత్వ సంపద, బుద్ధి వైశారధ్యము అన్వర్ధనామధేయమైనాయి. నిగమ, నిరుక్త, వ్యాకరణాది సంప్రదాయాల ననుసరించి శబ్దబ్రహ్మ స్వరూపాన్ని తెలుసుకొన్నవాడతడు. ఆయన వాక్ - సౌష్టవము, స్వాధ్యాయాభ్యాస విశిష్టత, వేదవిజ్ఞాన కౌశలము, విజ్ఞాన సంపద సూచింపబడ్డాయి.

కనుకనే రావణునకును బోధించుటకర్హుడని,

"అథ సంస్కార సంపన్నో హనుమాన్ సచివోత్తమః"

సంస్కార సంపన్నుడైన సచివోత్తముడుగా వాల్మీకి చెప్పినాడు.

అతడు సతతం ప్రతిశ్వాసలో భగవన్నామమునే అను సంధించుచు రోమ రోమమునందు ఆ (శ్రీరామ)నామ మంత్రస్వరూపుడైనాడు. అందుకే అతడు రామదూత.

మహాభారతంలో హనుమ భీమునితో నిట్లనెను..

"వరం మయాయానితోఽసౌ రామో రాజీవలోచనం ।
యావద్రామ కథేయం తే భవలోకేషు శత్రుహ ।
తావజ్జీవేయ మిత్యేవం తథాస్త్వితి చ సోఽబ్రవీత్ ॥ (వనపర్వం - 148-17)

శ్రీరాముణ్ణి నేనొక వరమడిగాను -"రామాయణం లోకంలో గానం చేయబడినంతకాలం **నేను జీవించియుండాలి" అని**, శ్రీరాముడందులకు అనుగ్రహించాడు. ఆ సంవాదంతో ఈ **శ్లోకము** ప్రసిద్ధ పొంది **ప్రార్థనా**శ్లోకంగా మారింది.

"యత్రయత్ర రఘునాథ కీర్తనం తత్ర తత్ర కృత మస్త కాంజలిమ్,
బాష్పవారి పరిపూర్ణ లోచనం మారుతిం నమత రాక్షసాంతకమ్ ॥"

ఈ సన్నివేశంతో హనుమంతుని మహానుభావం. భక్తి పరాయణత్వం వ్యక్తమౌతోంది.

పరాశరసంహితలోను హనుమ రుద్రావతారమని యిట్లు చెప్పబడింది.

"దుష్టానాం శిక్షణార్థాయ, శిష్టానాం రక్షణాయచ
రామకార్యార్థ సిద్ధ్యర్థం జాతః శ్రీహనుమాన్ శివః
ఆంజనేయః పూజితశ్చేత్ పూజితాస్సర్వ దేవతాః ॥

అందుకే, ఆంజనేయుని పూజిస్తే దేవతలందరూ పూజింపబడినట్లే, హనుమ సూర్యునివలన సకల శాస్త్రాలు నేర్చి (శాస్త్ర విహిత కర్మలనాచరించు వాడు హనుమ) ఆచార్యుడుగా వినుతికెక్కెను. కనుక, హనుమంతుని ఆదర్శంగా మెలగువాడే ఆచార్యుడు.

★★★

## గురు - సూత్రములు

"గురువాక్యం కామధేనుంతి వక్తి శృతిః స్వయం"

గురువాక్యం కామధేనువు అని శృతి స్వయంగా పల్కుచున్నది.

- (39 అ. 110/1)

★★★

"గురుస్థానాని చైతాని మునీనాం సమ్మతాని చ"

ఇది ముని సమ్మతమైన గురువు యొక్క స్థానమిది. - (37 అ. 68/1)

# 95. నారదుడు మహర్షియే గాక మహాగురువు

బహు జన్మాంతర సుకృత పరిపాకముచేత దుర్లభమగు మానవ జన్మ లభించును. అట్టి మానవునకు ఆ సుకృతఫలముచే సదాచార్యుడు లభించును. ఆ సదాచార్యుని కటాక్షము చేతనే బ్రహ్మమునందు మనస్సు లగ్నమగును. అదియే ఆధ్యాత్మికము. ఆ ఆధ్యాత్మికముచేత వ్యక్తి భక్తి తత్త్వములో నిమగ్నమగును, దాంతో నతడు నిత్య సత్యమగు బ్రహ్మజ్ఞానము పొందినవాడగును, ఆ జ్ఞానము దివ్య నేత్రదృష్టి వంటిది, ఆ దృష్టితో నతడు ధర్మాచరణమందే లయమై ముక్తి మార్గమున బడును.

ఆ కోవకు చెందినవాడే వాల్మీకి మహాముని. కొంత పూర్వ సంచిత పుణ్యఫలముతో పరబ్రహ్మ స్వరూపుడగు శ్రీరాముని తత్త్వము నెరుంగుటకు వాల్మీకి ఋషియై, శ్రీమద్రామాయణ కావ్యరచనకు పూనుకొనెను, అట్లు పూనుకొనుటకును బ్రహ్మోపదేశమవసరమే కదా!

వాల్మీకి తన ఆశ్రమమున నుండగా, ముందుగా బ్రహ్మయే ప్రత్యక్షమై నారదుని గురువుగా నెంచుకోమని ఆదేశించెను. అటులనే వాల్మీకి నారదుని గురువుగా సంకల్పించుకొనెను. నారదుడు ప్రత్యక్ష మయ్యెను.

ఆత్మజ్ఞానము బ్రహ్మవిద్యను గూర్చి ఉపదేశం పొందవలెనని శిష్యులు గురువులనడిగెడి ప్రశ్నకు "పరిప్రశ్నము" అని పేరు. వాల్మీకి అను జీవుని చేరియుండి అజ్ఞానమును ఛేదించువాడు నారదుడు గురువుగా తటస్థపడెను.

"ఆచార్యాద్ధైవ విదితా విద్యా సాధిష్ఠం ప్రాపత్" -
ఆచార్యుడు బ్రహ్మవిద్యోపదేశమునకు ఆవశ్యకమని ఉపనిషత్తు తెలుపును

"నారదుడు అనగా 'నారము' అనునది అజ్ఞానము. 'ద' చేరి, ఆ అజ్ఞానమును ఖండించునదిగా, ఛేదించునది అర్థము వచ్చును, దాంతో 'నారద' పదము జీవుని పరమపదమును పొందింపజేయును. అనగా భగవత్ జ్ఞానము ప్రసాదించు నారదుడే గురువై నాడు వాల్మీకికి.

రామాయణం 'బాలకాండ' ప్రప్రథమమున నున్న శ్లోకమిది.

శ్లో॥ తపస్స్వాధ్యాయ నిరతం తపస్వీ వాగ్విదాం వరం ।
నారదం పరిప్రప్రచ్ఛ వాల్మీకిర్ముని పుంగవమ్ ॥

భా॥ తపస్వి యగు వాల్మీకి తపస్స్వాధాయ నిరతుడు, వాగ్వేత్తలలో శ్రేష్ఠుడు, మునిపుంగవుడు అయిన నారదుని ప్రశ్నించెను.

అట్లు సమాధానము చెప్పుటలో ఆచార్యుడగు నారదుడు తపస్సు, వేదాధ్యయనము, ధర్మబ్రహ్మ జిజ్ఞాస స్వరూపుడు. వాగ్విదాం వరుడు. అనగా శబ్ద స్వరూపమును నెరింగిన వారిలో శ్రేష్ఠుడు. వేదాధ్యయనము, దాని అర్థమును నెరింగినవాడతడు. సతతము భగద్విషయమునే మననము చేయువాడు.

ఇట్లు "నారదుడు" అనుపదము గురువును సూచించునదిగా నెరుంగవలెను. ఇక వాల్మీకి 'తపస్వి'. అనగా శ్రీరామ ... ముమును బ్రహ్మవిషయైకమైన ఆలోచన గూర్చి తపన జెందువాడు. అందులో తాను పొందవలసిన జ్ఞానమును పొందలేక దైన్యము పొందినవాడు శిష్యుడు. దైన్యముతోనే శ్లోకము అతనిలో ఉత్పన్నమైనది. ఆ శ్లోకము లోక (కల్యాణ) మునకై కావ్యరూపముదాల్చెను. అట్లు శోకము + లోకము = 'శ్లోకము'గా వాల్మీకి నుండి ఆవేదన మొదలిడినది. దాంతో వాల్మీకికి నారదునికి శిష్యాచార్య సంబంధము నిరూపింపబడి, "శ్రీమద్రామాయణం" కావ్య రచనకు నాందీ శ్లోకముగా శుభారంభమైనది. అదియే -

శ్లో॥ మా నిషాద! ప్రతిష్ఠాం త్వ మగమః శాశ్వతీః సమాః ।
యత్ క్రౌంచమిధునాదేక మవధీః కామమోహితమ్ ॥

ఈ శ్లోకము మొదట దైన్యముతో వచ్చినను, దానినే మరల మరల పఠించుటతో శోకము శ్లోకముగా కీర్తింపబడెను. "శ్లోకము" అనగా శ్లాఘించుట లేక మరల మరల కీర్తించుటను అర్థము.

ఈ శ్లోకమునకు బహుళార్థములు వచ్చును. విబుధులు గ్రహించుదురని మనవి.

★★★

## గురు - సూత్రములు

సిద్ధుడై గురువు నోటి నుంచి శక్తి పూర్వకంగా స్వీకరించిన వాక్యమే మంత్రం.

★★★

శృతికి నిజమైన ఆధారం మననం. శృతి గురువు పని, మననం శిష్యుడి పని.

★★★

"ప్రకాశితాఽద్య భవీతా రసకల్పా గురుస్మృతిః"

జ్ఞాన ప్రకాశమునొసంగు రసవంతమైనది గురుస్మరణం.

- (గు.చ. 41 అ. 3/2 శ్లో)

# 96. శ్రీగురువాక్య పరిపాలనతోనే మంత్రసిద్ధి

ముందు గురువు ఎట్టివాడో తెలుసుకొందాము -

శ్లో॥ దీపదర్శన మాత్రేణ ప్రణశ్యతి తమో యథా ।
సద్గురోర్దర్శనాద్దేవి తథాజ్ఞానం వినశ్యతి ॥

భా॥ దీపకాంతికి అంధకారం తొలగినట్లు, సద్గురు దర్శనంతో అజ్ఞానం తొలుగుతుంది.

శ్లో॥ మనుష్య చర్మణా బద్ధః సాక్షాత్ పర శివః స్వయం ।
సచ్ఛిష్యానుగ్రహార్థాయ గూఢం పర్యటీతి క్షి తౌ ॥

భా॥ చర్మ బద్ధుడై మనుష్యరూపంలో సచ్ఛీలురైన శిష్యులను అనుగ్రహించటానికి గురురూపంలో భూమిపై నున్నవాడే సాక్షాత్ "శివుడు"

- (కులార్ణవ తంత్రములోనిది)

శ్లో॥ వేదాంతానామనే కత్వాత్ సంశయానాం బహత్వతా ।
వద్యస్యాపతి సూక్ష్మత్వాన్న జానాతి గురువినా ॥

భా॥ వేదాంతం విస్తృతమైనది. ప్రశ్నలు అసంఖ్యాకములైనవి. తెలుసుకోదగిన పరమాత్మతత్వం అత్యంత సూక్ష్మమైనది. దీనిని గురువు తప్ప వేరెవరూ తెలుసుకోలేరు. చెప్పలేరు. సహస్ర ముఖుడైన శేషుడు, విద్యాధాత్రి శారదా, గణేశుడు కూడా గురుమహిమను అంచనావేయలేరు. అది అపారమైనది. మహిమాన్వితమైనది.

శ్లో॥ నరాకృతి రాతి పరబ్రహ్మ రూపాయా జ్ఞాన హారిణే ।
కులధర్మ ప్రకాశాయ తస్మై శ్రీ గురవేనమః ॥

భా॥ పరబ్రహ్మ (పరమేశ్వరుడు) మానవుల అజ్ఞాన పటలాన్ని చీల్చి చెండాడేటందుకు "గురువు" రూపములో అవతరించాడు. కులధర్మాన్ని ఆచరింపజేయడానికి నడుం కట్టాడు. అట్టి సద్గురువునకు నమస్కారము.

(యోగోపనిషత్తు)లో

శ్లో॥ గురుః బ్రహ్మ గురుః విష్ణుర్గురుర్దేవ సదాచ్యుతః ।
న గురోరధికః కశ్చిత్ త్రిషులోకేషు విద్యతే ॥

శ్లో॥ దివ్యజ్ఞానో పదేష్టారం దేశికం పరమేశ్వరమ్ ।
పూజయేత్పరయా భక్త్యా తస్యజ్ఞాన ఫలం లభేత్ ॥

శ్లో॥ కర్ణధారం గురుంప్రాప్య తద్వాక్యం ప్లవవద్దృఢమ్ ।
అభాస వాసనా శక్త్యా తరన్తి భవసాగరమ్ ॥ - (ఇత్యుపనిషత్)

(భావార్థములు సులభములు) - మరికొన్ని "ఉపనిషత్తుల"లో గురువు ఔన్నత్యమును గూర్చి సాక్షాత్ శ్రీరామచంద్రుడు హనుమంతునితో అంటాడు ఇలా -

శ్లో॥ గురూపదిష్ట మార్గేణ ధ్యాయాన్మద్గుణమవ్యయమ్ ।
మత్సాయుజ్యం ద్విజం సమ్యగ్భజేద్భ్రమర కీటకమ్ ॥

భా॥ గురూపదిష్టమగు మార్గము ద్వారా నాశరహితమైన నా స్వరూపమును, గుణములను లెస్సగా ధ్యానించినట్లై తే ఆ బ్రహ్మనిష్ఠుడు భ్రమరకీట న్యాయమున నా సాయుజ్యమును పొందును. (ముక్తికోపనిషత్) అందుకై శిష్యుడు -

శ్లో॥ గురుభక్తి సదాకుర్యాచ్ఛ్రేయసే భూయసే నరః ।
గురురేవ హరిస్సాక్షాన్నన్య ఇత్యబ్రవీతి శ్రుతిః ॥

భా॥ పరమ శ్రేయస్సును పొందుటకు సదాగురుభక్తిని కలిగి యుండవలెను, గురువుసాక్షాత్ హరియే. వేరేమి కాదని శ్రుతులనును. - (బ్రహ్మవిద్యోపనిషత్)

శ్లో॥ దుర్లభో విషయ త్యాగోదుర్లభం తత్త్వ దర్శనమ్ ।
దుర్లభా సహజావస్థ సద్గురోః కరుణా వినా ॥

భా॥ సద్గురువు యొక్క కరుణా కటాక్షములు లేకుండా, ఐహికవాంఛా విషయాలను త్యజింపలేము. వీటిని త్యజింపకుండా ఆత్మజ్ఞానము పొందుట దుర్గభము అటువంటి దుర్లభమైన విషయాలను "గురువు" సహాయంతోనే అధిగమించగలమని పెద్దల ఉవాచ. - (మహోపనిషత్)

శ్లో॥ **యస్య సాక్షాత్** భగవతేజ్ఞాన దీప ప్రదేగురౌ ।
**మనుష్య ఇతి** దుర్బుద్ధిస్తస్య సర్వా నిరర్థకమ్ ॥

భా॥ గురువుని సాధారణ మనిషిగా ఊహించే శిష్యుడు, దుర్బుద్ధి మెండుగా గలవాడు. ఎంత సాధన చేసినా ఫలితం పొందలేదు. గురువంటే "ప్రత్యక్ష దైవమ్" - మనలో జ్ఞాన దీపాన్ని వెలిగించి సమస్త ప్రపంచాన్ని పరిచయం చేసి, ఆధ్యాత్మిక మార్గాన్ని చూపే మహానుభావుడుగా గౌరవిస్తే - పూజిస్తే - గురువు మాట వేదవాక్కుగా ఆచరిస్తే ఆ శిష్యుడు ధన్యుడౌతాడు. - (హంసయోగప్రకాశ్)

శ్లో॥ భవ పాశ వినాశాయ జ్ఞాన దృష్టి ప్రదర్శినే ।
నమో సద్గురువే తుభ్యం భక్తి, ముక్తి ప్రదాయినే ॥

భా॥ సంసార బంధాల నుండి ముక్తి, స్వచ్ఛమైన జ్ఞానదృష్టిని, భోగము, యోగములనిచ్చే

వాడుగా, ఆ సద్గురువు మానవ రూపంలో ఉన్న పరబ్రహ్మయే.

శ్లో॥ ధర్మార్థ కామైః కిం తస్య మోక్షస్తస్య కరేస్థితః
సర్వార్థే శ్రీగురోర్దేవో యస్యభక్తిః స్థిరాసదా ॥

భా॥ అనన్యమైన గురుభక్తి గలవానికి ధర్మార్థకామ మోక్షాలనబడే పురుషార్థ చతుష్టయములు అరచేతిలోనే యుండగలవు. గురుభక్తి వలన సర్వార్థసిద్ధి చేకూరకలదు.

గురువే జ్ఞాన ప్రదాత. అందుకే "ఈశ్వరునికి, ఆత్మకు, గురువు"నకు మధ్యభేదం లేదని శ్రీ శంకరాచార్య ఉవాచ.

"ఈ ముగ్గురు భిన్నవస్తువులుగా నున్న ఒకే వస్తువు" - అని 'రమణ మహర్షి' అన్నారు.

అందుకే, గురువే ఈశ్వరుడన్న విశ్వాసంతో గురువునకు స్వాత్మార్పణం.చేసుకొంటే అది ఈశ్వరార్పణమే అవుతుంది. గురువు వద్ద చేసే ప్రతిపత్తి (స్తుతి) ఈశ్వర ప్రతిపత్తియే. అనుభావనగా శిష్యుడు వేదాధ్యయనానంతరం చెప్పే శాంతిపాఠంగా ఈ శ్లోకమును -

శ్లో॥ యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోఽతి తస్మై ।
తం హదేవం ఆత్మబుద్ధి ప్రకాశం ముముక్షుర్వైశరణమహం ప్రపద్యే ॥

భా॥ ఎవడు బ్రహ్మను పూర్వం సృష్టించాడో, వేదములతనికి అనుగ్రహించాడో, ఆ ప్రకాశరూపుని, బుద్ధి ప్రేరకుని మోక్షార్థం శరణు చెందుతున్నాము. అని ప్రార్థన చేయాలి.

గురువు, యోగ్యుడైన శిష్యుని చేరుతాడు. విశ్వామిత్రుడు శ్రీరాముని చేరి కృతార్థుడైనాడు.

"రమణమహర్షి"వల్ల కావ్యకంఠ గణపతిముని కృతార్థుడైనాడు. అట్లు గురువువద్ద శిష్యుడు, "అనుంగు శిష్యుడు"గానో, "అంతేవాసి"గానో వుండిన, గురువు సంపూర్ణ ఆదరాభిమానాలు చూరుగొన్నవాడై యుండినచో - "భక్తోఽసి మే సఖాచేతి రహస్యం హ్యేతదుత్తమం" అని గురువు తనకున్న పరిపూర్ణ జ్ఞానాన్ని శిష్యునకు ప్రసాదిస్తాడు.

ఆ సాధనామార్గములో శిష్యుడు తొలుత సాధకుడుగా, తదుపరి గురువాజ్ఞ పరిపాలకుడయ్యాక "సాధువు"గా, గురుకృపతో సాధనాఫలాన్ని అందుకొన్నాక "సిద్ధుడు"గాను మారుతాడు. ఉపదేశ క్రమంలో గురువు దీక్ష నిస్తాడు. "వినాదీక్షం న మోక్షః"

ఈ దీక్షలు మూడు రకాలు - అవి "స్పర్శ, దృక్, మానసికము"లు. ఈ

మూడింటికన్న ముక్తికి ఉత్తమమైనది శక్తిపాతం. "శక్తిపాతాను సారేణ శిష్యోఽను గ్రహమర్హతి" - అట్లు గురువు శివుణ్ణి తనలో ఆవహింపజేసుకొని, శిష్యుని శిరస్సుపై చేతులుంచి, కళ్ళల్లోకి సూటిగా చూస్తూ యిచ్చే దీక్షయే శక్తిపాతం. ఇది శీఘ్ర ఫలప్రదాయిని.

శిష్యుడట్లు సాధనా మార్గంలో ఒక్కోమెట్టు ఎక్కుతూ లక్ష్యాన్ని చేరడంలో గురువే ఆలంబన. అందుకే గురువు చెంత దాపరికం ఉండకూడదు. బిడియం పడకూడదు. అతి వినయం అసలేపనికిరాదు. సద్గురువు సర్వం గ్రహించగలడు. కనుక గురువును దేవుడిగానెంచి, విద్యనభ్యసిస్తూ, ఉపదేశం పొందుతూ దీక్ష, ఉపాసనలతో మెలగుచూ, యిలా ఒక్కొక్కమెట్టు అధిరోహిస్తూ ముందుకుసాగాలి. తుదకు గురువు కనుసన్నలలో మెలగిన, గురువు నుండి షట్చక్రభేదనం జరిగి అమృతస్రావం పొంగి శిష్యుని చేరును.

అట్లు శిష్యుడు గురువు నుండి మంత్రసాధనను పొందుటను గూర్చి కులావర్ణ మంత్ర శాస్త్రంలోనిట్లున్నది.

"మననాత్ త్రాయతే ఇతి మంత్రః" అనగా మంత్రమును మననము చేయుటలో, అర్థజ్ఞానముగా ఆయామంత్రాధిష్ఠాన దేవతను మననం చేసినట్లైతే, ఆ మంత్రం జపమొనర్చుటతో, మంత్రచైతన్యంతో మంత్రసాధనా ఫలితముతో రక్షణపొంది దైవ, దేవతాస్వరూపమే తానగును. అనగా సారూప్యముగా మార్పు చెందును.

ఆ మంత్రమును పొందుటకు సద్గురువుతోనే సాధ్యము.

శ్లో॥ మంత్రరూపీ భవేద్దేవో దేవరూపీ గురోర్భవేత్ ।
గురురూపీ భవేదాత్మా ఆత్మరూపీ మనుర్భవేత్ ॥

శ్లో॥ **ఇతితే కథితం** దేవీ మంత్రచైతన్యముత్తమమ్ ।
**యస్యజ్ఞాన మాత్రేణ** అద్వైతం జ్ఞానముత్తమమ్ ॥

భా॥ **దేవతలు మంత్ర**స్వరూపులు. ఆ దేవతల మంత్రము మనకు ఉపదేశించిన గురువే ఆ దేవతాస్వరూపుడు. ఆ దేవతాస్వరూప భావనగా గురువు నుండి పొందిన మంత్రమును జపించిన ఫలితముగా తాను ఆ గురుస్వరూపుడై పోవును.

అట్లు ముందు గురువు నందు ప్రవేశించియున్న మంత్రగతమైన ఆ దేవతాచైతన్యం ద్వారా జపసాధకునికి మనస్సు గురువు రూపం పొందుటగును.

శ్లో॥ గురుసేనా గయాప్రోక్తం దేహస్స్యాదక్షయోవటః ।
తత్పాదం విష్ణు పాదం స్యాత్ తత్రాదత్త మనస్తతామ్ ॥

భా॥ గురుసేవయే గయాక్షేత్రం. గురుదేవుని దేహమే అక్షయ వటవృక్షము. గురుదేవుని పాదమే విష్ణుపాదం. ఆ గురుదేవుని పాదమునందు సమర్పింపబడిన సాధకుని

మనస్సు బ్రహ్మస్వరూపమే అగుచున్నది.

కావున గురుముఖతః మంత్రానుష్ఠాన పూర్వకంగా జపిస్తేనే సత్ఫలితం శిష్యుడు పొందగలడు.

అందుకుగాను శంకరాచార్యుదన్నట్లు -

శ్లో॥ న సుఖం వేదశాస్త్రేషు, న సుఖం మంత్రయంత్రకే ।
గురోః ప్రసాదాత్ అన్యత్య సుఖం నాస్తిమహీతలే ॥

వేదశాస్త్రముల అధ్యయనమునందు, మంత్రయంత్రము లందును సుఖంలేదు. కేవలం గురు ప్రబోధమువలనే అన్ని సాధ్యమై ఆత్మానందం కలుగుతుంది. మరి దేనివలన కాదు.

పుస్తకములు, పుస్తకములలో మంత్రములున్న చాలదు. ఆ పుస్తక మంత్రముల సమాచారం పొందవలెనన్న సద్గురువు సాన్నిధ్యం అవసరం. లేదనుకొంటే పొరపాటే.

శ్లో॥ పుస్తకౌ లిఖితాన్ మంత్రాన్ విలోక్య ప్రజపంతియే ।
బ్రహ్మహత్యా సమం తేషాం పాతకం స్యాధి దుఃఖదం ॥

గురువు వినా పుస్తకముల ఆశ్రయించిన, అనగా అందున్న మంత్రములను సాధించబోయిన బ్రహ్మహత్యా సమానం, దుఃఖ దాయకం.

అందుకే, "కానని వాని నూతగొని కానని వాడు విశిష్ట వస్తువుల్ కానని భంగి"... అన్న చందాన వుంటుంది.

"సాధనా మార్గాన్ని అనుసరించాలన్నా సద్గురువును ఆశ్రయించండి" -

"నమో మహద్భ్యో గురుభ్యో, ఋషిభ్యో, మునిభ్యో నమః"

★★★

## గురు - సూత్రం

"గురు భక్తిం సుకఠినాం దృఢధృత్యా తు యఃసుధీః ।
సేకరోతి కుతస్తస్య భయం కాలాత్కలేరపి ॥"

ఎంతో కఠినమైన గురుభక్తి దృఢ చిత్తముతో స్వీకరించు బుద్ధిమంతునకు కాలభయముకాని, కలిభయముకాని లేవు. - (గు.చ. 41 అ. 83 శ్లో)

★★★

# 97. సాళువ - తుళువ వంశీయుల గురుశిష్యుల ఔన్నత్యము

## మహామంత్రి తిమ్మరుసు చరిత్ర:

సుమారు నాలుగు శతాబ్దాల సంవత్సరములకు పూర్వము విజయలక్ష్మిని వరించిన విలసిత వీర నగరం విజయనగరం. ఈ నగరమునకు ఏకచ్ఛత్రాధిపత్యముగా ఏలిన ఏకైక చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయులు. వారి పరిపాలనలో విజయనగరం వీరవిఖ్యాతముగా, కళామతల్లిగా వెలుగొందుటతో వీరు సాహితీ సమరాంగణ సార్వభౌముడుగా వినుతికెక్కెను.

అందుకు కారణభూతుడైన విజయనగర సామ్రాజ్య నిర్మాత, మహామంత్రి తిమ్మరుసు. ఇతడు నిశిత వీక్షణల ముక్కంటి వంటి అగ్నినేత్రములు కలవాడు. స్ఫురద్రూపి, విశాల ఫాలభాగము, దుర్నిరక్షమగు బ్రహ్మవర్చస్సుతో సర్వదా ప్రకాశించువాడు మంత్రాంగము నెరపుటలో మహామంత్రిగా కీర్తినందిరి వారు.

ఆ విజయనగర సామ్రాజ్యాధినేత అయిన శ్రీకృష్ణదేవరాయల వారిచే ముద్దుగా "అప్పాజీ" అని పిలిపించుకొన్న తిమ్మరుసు చరిత్ర గురుశిష్యులకును ఆదర్శవంతమైనది.

తిమ్మరుసు ఆరువేల నియోగి బ్రాహ్మణ కుటుంబీకుల ఇంట్లో జననమొందిరి. వీరి తండ్రి పేరు సాళువ రాచరాజు. జన్మస్థలము గుంటూరు జిల్లా కొండవీడు సీమ. వీరిది దరిద్రకుటుంబము. దాంతో జీవనము దుర్భరముగాగ కొంత కాలమునకు తిమ్మరుసు తల్లితండ్రులు కన్నుమూసిరి. తిమ్మరుసునకొక తమ్ముడు గూడ యుండెను. వీరికి మాతాపితరులు కరువుగాగ, వారిని ఆదుకొన్న కుటుంబము కూడ అంతంత మాత్రమే అగుటతో ఉన్న ఊరు అచ్చిరాక, గ్రామగ్రామ పర్యటనము గావించిరి వారు.

గౌరవ జీవనము గడుపుటకు అన్నదమ్ములిద్దరు ప్రొద్దుటే లేచి విస్తరాకులు సేకరించి, కుట్టి, విక్రయించెడి వారు. ఆ వృత్తిలో వచ్చీరాని ఆదాయం అచ్చిరాక పోవటంతో తుదకు మధూకరం చేపట్టిరి. ఆ ప్రాంత గ్రామ సత్రంలో ఒకపూటగా ఒకరోజు మాత్రమే భోజనం పెట్టేవారు. మరునాడు ఆ సత్రంలో భుజించి పారవేసిన పుల్లి విస్తరాకులలో మిగిలిన ఆహారమును తిని కాలం వెళ్లబుచ్చేవారు. అయిన ఏమిటిది అని తలంచిన ఆ బాలురు పరువుగా బ్రతుకనెంచి దేశదేశాలు తిరిగిరి. బ్రతుకు జీవనమునకై చిరు ఉద్యోగము కూడ వారికిచ్చు నాధుడు లేక, తుదకు చంద్రగిరిలోని ఒక రైతును ఆశ్రయించిరి. అతడు వారిని గొడ్లు మేపడానికి నియమించుకొని, గంజి పోసి ఊడిగం బాగా చేయించుకొనేవాడు.

ఒక్కొక్కనాడు అది కూడా కరువైనా, తృప్తిగానుండేవారు.

ఒకనాడు అడవిలో తిమ్మరుసు మిట్ట మధ్యాహ్నమున ఆకలితో అలమటించి తుదకు శోషవచ్చి ఒక చెట్టుక్రింద స్పృహ తప్పిపడిపోయెను. అట్టి తరి ఒక కోడె త్రాచు కృతాంతుడి పాశంలా జలజలా ప్రాకుతూ తిమ్మరుసును సమీపించి అతని తలపై ఎండ తగలకుండా గొడుగువలె పడగవిప్పి పట్టెను. ఆ వింత దృశ్యమును అటునుండి వచ్చిన ఒక సాధుపుంగవుడు చూచి ఆశ్చర్యపడెను. ఆ త్రాచు కొంతసేపటికి పడగ ముడుచుకొని వెళ్లిపోయెను. ఆ సాధుపుంగవుడు తిమ్మరుసును చేరి, తన కమండలమునుండి నీరు జల్లి స్పృహ నుండి తెరపి, తేరిపార చూచెను. అతనిలో మహాపురుష లక్షణాలున్నట్లు అఖండ మేధా సంపత్తి గల అన న్య అసాధారణ బ్రహ్మవర్చస్సు, అనంత శేముషి సంపదతో తులతూగు భవిష్యత్తు జీవమున్నట్లు గ్రహించెను. తన వద్ద ఉన్న కందమూలాదులతో బాలుని క్షుద్బాధ తీర్చి సర్వము తెలుసుకొనెను. అతడు బాలుని వెంట నిడుకొని తనకు తెలిసిన ఒక సామంత రాజు వద్ద లేఖకుడిగా జేర్చెను. ఆ లేఖనం వ్రాయుటలో ఆ బాలునకు బాల్యము నుండి అందెవేసిన చెయ్యి. తదుపరి తిమ్మరుసు జీవితము మున్ముందు విచిత్రమైన మెలికలు తిరగడానికి ఒక కారణం ఉంది.

తిమ్మరుసు తీరికవేళల్లో విద్యాభ్యాసంనకు ఒక గురువు వద్ద శిష్యుడిగా చేరి యుండెను. గురువు తనకు తోచినది విద్య గరిపినను, తిమ్మరుసు చురుకుగా నేర్పిన విద్యనే గాక అపూర్వ మేధాసంపత్తితో జీవనం సార్ధకం చేసుకొనుచుండెను.

ఆ సమయంలో తుళువ నరసరాయల వారివద్ద నున్న ఒక దుర్గాధీశుడు ఒకనాడు ఒక పలకపై గీతగీసి దీనిని చెరపకుండ చిన్నగా చేయుటెట్లో ఆలోచించి, తుదకు ఆ సమీపముననున్న గురువు వద్దకు పలకను ఇచ్చి భటుని పంపెను. ఆ భటుడు గురువును చేరి పలకపై గీచిన గీతను చూపి చెరపకుండా చిన్నగా చేయమని కోరెను. ఆ గురువు పలకపై నున్న గీతను చూచి చెరపకుండా చిన్నగా చేయుటెట్లో తెలియక, పలకను వెనుక ముందుకు తిప్పి నిస్సహాయ స్థితిని కనబరచెను. అంతలో అక్కడేయున్న తిమ్మరుసు గురువు వద్దనున్న పలకపై గీతను చూచి దానిని చిన్నగా చేయుటలో ఆ గీతప్రక్కన మరొక పెద్దగీతను గీచెను. అది చూచిన గురువు వచ్చిన భటుడును తిమ్మరుసు మేధాసంపత్తికి ఆశ్చర్యపడి, వెళ్లి ఆ వింత విషయమును దుర్గాధీశునకు విశదపరచెను. అతడును ఆశ్చర్యపడి అంతటి మేధాసంపత్తి గల బాలుని చూచుటకై పిలవనంపుటలో భటుని పంపెను. ఆ భటుడు వెళ్లి తిమ్మరుసును వెంటబెట్టుకొని రమ్మన్న విషయమును గురువుతో చెప్పగా ఆ మాట విన్న గురువు, తిమ్మరుసు మేధస్సుకు మెచ్చి దుర్గాధీశుడేదో గొప్ప బహుమానము ఇవ్వబోతున్నాడని తలంచి 'పంపిస్తాను' అని భటుని పంపెను.

గురువు తిమ్మరుసును చేరదీసి "నీకు నేను గురువును కదా! ఆ ఇచ్చే బహుమానం

నాకందించునట్లు చూడవా!" అని అర్థించెను. తిమ్మరుసు గురువాజ్ఞను సమ్మతించెను. వెంటనే ఆ గురువు తిమ్మరుసును వెంటనిడుకొని దుర్గాధీశుని కొలువు కూటమునకు చేరెను. వారిరువురు వచ్చినది దుర్గాధీశుడు జూచి, "వీరిద్దరిలో పలకపై నున్న గీతను చిన్నగా చేసినదెవరు? అని సమీప్య భటుని ప్రశ్నించెను. భటుడు ఆ ప్రక్కనున్న బాలుడేయని సైగ జేసెను. దుర్గాధీశుడు ముందుగానే తిమ్మరుసు మేధాశక్తిని గ్రహించదలచి స్వయముగా పరీక్షించదలచెను. ఆ సభా మంటపమున ఒక తివాచీని పరిపించి దాని చివరన బహుమతి పళ్లెముంచెను. అతడు వారిని ఇట్లు ప్రశ్నించెను.

"మీలో గీతను చిన్నగా చేసినదెవరు?" గురువు వెంటనే 'నేనే'యని టక్కున సమాధానమిచ్చెను. అది విన్న దుర్గాధీశుడు, గురువర్యా! మీ ముందు పరచియున్న తివాచీని త్రొక్కకుండా వచ్చి ఈ బల్లపై నున్న బహుమతిని అందుకోండి"యని పలికెను. అది విన్న గురువునకు గొంతులో వెలక్కాయ పడ్డట్లై తివాచీని త్రొక్కకుండ బహుమతిని నెట్లు పొందవలెనో తోచక తికమకపడెను. అప్పుడు దుర్గాధీశుడు తిమ్మరుసును అటులే ఆదేశించెను. తిమ్మరుసు జన్మతః మేధస్సు కలవాడగుటతో, అటులేయని తివాచీని ముందుకు చుట్టుకొంటూ వచ్చి బహుమాన పళ్లెరము అందుకొనెను. అది చూచిన దుర్గాధీశుడేగాక సభలోనున్న వారందరూ 'భేష్ భేష్' యని కరతాళధ్వనులొనర్చిరి. గురువు మొఖము తెల్లబోయెను. లేఖకుడిగా నున్న తిమ్మరుసు కొన్నాళ్లకు దుర్గాధీశుల కొలువు సంపాదించి క్షణక్షణానికి తన అపూర్వ మేధా సంపత్తిని ప్రదర్శించుచుండెను. ఒకనాడు ఆ దుర్గాధీశుడు తోటివారితో చదరంగము ఆడుచుండగా దుర్గాధీశుడు ఎత్తుకు పై ఎత్తు వేయుటలో తోచక యుండుటను గ్రహించి ప్రక్కనే యున్న తిమ్మరుసు అతని తరపున ఎత్తు వేసి చదరంగములో గెలుపు చూపెను. ఆ ఎత్తును గ్రహించిన వారిద్దరు తిమ్మరుసును మిక్కిలి ప్రశంసించిరి.

అట్లు అందరి మన్ననలను పొందుతూ తన గౌరవాన్ని, హోదాను నిలబెట్టుకొనుచుండగా ఆ తరుణంలో తుళువ నరసరాయలకు తగు మంత్రాంగము నెరుపు వ్యక్తికై అన్వేషించుచుండెను. అటు ఇటు చెప్పుకొనుచుండగా ఈ తిమ్మరుసు అపూర్వ ప్రతిభా పాటవాలు విని, వెంటనే రప్పించుకొని మంత్రిగా నియమించుకొనెను. తిమ్మరుసు మంత్రాంగము నెరపుటలో నరసరాజును మెప్పించెను.

ఇంతలో ఆ విజయనగర రాజైన సాళువ నరసింహరాయలకు విపరీతమైన జబ్బు చేసి, మరణావస్థలో నుండగా ఆ రాజు తన పిల్లలతో సహా రాజ్యభారమును దండనాథుడైన నరసరాజునకు అప్పగించి గతించెను.

తిమ్మరుసు బుద్ధి విశేషముతో, నరసరాయల భుజ పరాక్రమముతో విజయనగర సామ్రాజ్యము దినదినాభివృద్ధి జెందెను. అట్లు సర్వతోముఖముగా ఆ తుళువ వంశము వన్నె కెక్కుటలో తిమ్మరుసు కారణభూతుడయ్యెను.

ఆ తుళువ వంశ తిలకుడుగా నరసరాయల రెండవభార్య నాగాంబ కుమారుడగు శ్రీకృష్ణదేవరాయలను విజయనగరాధీశుడుగా నొనర్చుటలో ఈ తిమ్మరుసు మంత్రాంగము ఫలించెను. ఆ దేవరాయలను తిమ్మరుసు స్వతహాగా పరిపూర్ణుని జేయుటకై మిక్కిలి పాటుపడెను. అందుకు తాను స్వతహాగా పరిపూర్ణుని జేయుటకై మిక్కిలి పాటుపడెను. అందుకు తాను స్వతహాగా మహాకవియే గాక, సంస్కృతములో ఉద్దండ పండితుడు. శ్రీకృష్ణదేవరాయలను శస్త్రాస్త్ర విద్యలయందును నైపుణ్యుని జేసి, సకల సాహిత్యముల యందును పాటవము గలుగునట్లు పలు కావ్యాలను పఠింపింప జేసి, అతనిని పండిత ప్రకాండుడిగా నొనర్చినాడు. మరియు రాయలను దుష్టరాజ్యాంగము నుండి కాపాడుచు ప్రాణదాతగా నిలిచెను. ఇందుకుగాను శ్రీకృష్ణదేవరాయలకు తిమ్మరుసు గారన్న గౌరవము, భయము, భక్తి కలిగియుండి వారిని సద్గురువుగా నెంచుకొని వారి కనుసన్నలలో ప్రియశిష్యునిగా మెలగెడివాడు.

శ్రీకృష్ణదేవరాయల వారి పట్టాభిషేకమునకు ముందు తిమ్మరుసు రాయలవారిని పిలిచి, చివర, గురువుగా తానొనర్చు దండనగా చెంప ఛెళ్ళుమనిపించెను. కాబోవు చక్రవర్తిని కదా! యని, అట్లొనర్చుటలో గర్వించక కళ్ల నీళ్లు మాత్రమే పెట్టుకొనెను రాయలవారు. గురుశిష్యుల అనురాగ అనుబంధములో అదొక గొప్ప నిదర్శనము.

తదుపరి శ్రీకృష్ణదేవరాయలను విజయనగరాధీశునిగా నొనర్చి ఆ రాజ్యమునకు, రాజునకు సర్వవిధముల అండగా నిలచిన తిమ్మరుసు గొప్ప కీర్తిప్రతిష్టలు పొందెను. వీరిరువురి అనుబంధము గురుశిష్యుల వంటిదిగా నేటి గురువులకు, శ్రీకృష్ణదేవరాయల వంటి శిష్యులకు ఆదర్శవంతమైన కథనమిది.

సర్వేజనాస్సుఖినోభవంతు.

★★★

## గురు - సూత్రం

"గురోరన్యో నదేవోఽస్తి వేదశాస్త్ర ప్రమాణతః ।
గురుం నిన్దతియో మూఢం సౌకరీం యోని మృచ్ఛతి ॥

గురుని కంటే వేరుదైవములేదు. అని వేదశాస్త్ర ప్రమాణము. గురుని నిందించు మూఢుడు పందియోని యందు జన్మించును.

- (47 అ. 41 శ్లో)

# 98. పరుష వాక్యములతో భంగపడిన శిష్యుని వ్యధ

గురువు బోధనలను అమలు పరుచుటలో భంగపడిన ఒక శిష్యుని కథ:-

పూర్వమొక గురువు ఆశ్రమంలో విద్యార్థులెందరో విద్యనభ్యసించుచుండిరి. గురువు విద్యార్థులకు విద్యాధ్యయనంలో అప్పుడప్పుడు వారికి పురుషాధిక్యత గూర్చి బోధిస్తూండేవాడు. అనగా స్త్రీలు ఏనాటికైనా పురుషుల చెప్పుచేతలలో మెలగవలసినదే అని. అట్లు మెలగునట్లు ఆ స్త్రీ యొక్క భర్తపై ఆధారపడి యుంటుందని కూడ చెప్పాడు గురువు. ఆ విధముగా బోధించడంతో కొందరు విద్యార్థులకు ఆ బోధన బాగా తలకెక్కిపోయింది. ఆ బోధను సార్థక పరచవలెనని కూడా వారిలో గట్టి తలంపు కలిగిపోయింది. కొంతకాలానికి విద్యార్థులు చదువు ముగిసినవారు వారి వారి నివాసాలకు వెళ్లిపోయిరి. అటుపిదప, ఎవరెవరు ఎట్లు తంటాలుపడ్డారో అటు ఉండనిండు.

కాని, వారిలో ఒక విద్యార్థి యింటికి వెళ్లడంతో పెద్దలు కుదిర్చిన అమ్మాయితో వివాహము చేసుకొన్నాడు. ఆ వచ్చిన భార్య చూస్తే చుక్కలాగా ఉన్నా, గంప గయ్యాళి అని, ఆమె ప్రవర్తనలో తేటతెల్లమైంది. దాంతో ఆ విద్యార్థికి గురువు బోధించినటుల భార్యను చెప్పుచేతలలో నుంచుకోవడం అటుంచి, భార్య చెప్పుచేతలలో మెలగవలసిన దుస్థితి ఏర్పడింది. చేసేది ఏమియులేక కాలము వెళ్లబుచ్చుచున్నాడతడు.

అంతలో ఒకనాడు ఆ విద్యార్థికి విద్యనభ్యసింపజేసిన గురువు తటస్థపడ్డాడు. ఆ గురువును చూడటంతో అతనికి పరమానందమై గురువునకు సాష్టాంగదండప్రణామంబులొనర్చెను. ఆ గురువు శిష్యుని వినయవిధేయతలకు సంతోషించి, విశేషముల నడిగెను."ఏముంది స్వామీ! నేను ఆశ్రమం నుండి రాగానే నా పెద్దలు నాకు వివాహమొనర్చిరి. నా భార్య చక్కటి గుణవతి. స్వామీ! మీరన్నటుల ఆమె నా అదుపు ఆజ్ఞలలో మెలగుతున్నదని, నా మాటకు ఎదురు చెప్పేది కాదని" గొప్పలు చెప్పుకొనెను.

ఆ మాటలు విన్న గురువు సంతోషించినను, కొంత హెచ్చరికగా ఇలా అన్నాడు. "నాయనా! అణకువగా మెలగుతున్నదని, ఆమెను నీవు అనవసరంగా బాధించుచున్నావా ఏమి?" అదివిని, శిష్యుడు "అదేమీ లేదు, అయినా మీరే స్వయంగా చూడండి. అందుకు గాను, ఈదినమే మాయింటికి భోజనానికి రండి, వచ్చిన నేను ధన్యుడనౌతాను." అని గురువును బలవంతపెట్టెను. శిష్యుని మాట కాదనక 'సరే' అని సమ్మతించెను.

ఇక, ఆ శిష్యుని పాట్లేమో చూద్దాము. ఇంటికి వెళ్లి అణకువతో భార్యను మిక్కిలి ప్రేమతో పలకరించాడు. ఆ అణకువ నిత్యమున్నదే కదా! అని దీని ఆంతర్యమేమోయున్నట్లు భార్యకు కొంత అవగతమై "ఏమిటీ విశేషము?" అని కాస్త చిరునవ్వుతో ముక్తసరిగా ప్రశ్నించింది. అతడప్పుడు ఇక భార్య ప్రసన్నమైనదని, తలంచి, "ఏమీలేదు, నాకు పూర్వము విద్యగరపిన గురువుగారు నేడుదయం తటస్థపడెను. వారిని మనయింటికి భోజనమునకు ఆహ్వానించితిని. అందుకుగాను నీవు సమ్మతించి సహకరించగలవు" అని ఆమెను అర్థించగా, "అదెంతపని అలాగే రమ్మనండి" అనే సమాధానంతో తృప్తిపడక మరల భార్యతో గొణుగుచూ "ఏమే, ఒక్కదినము గురువు సమక్షములో నేను, నా పురుషాధిక్యతను కనబరచుటలో అప్పుడప్పుడు నిన్ను పరుష వాక్యములు పలుకుదును. వాటిని విని కూడ, విననట్లు అణకువగా మెలగవలెన"ని అర్థించెను. అదివిని, భార్య "ఈ ఒక్కనాడే గదా నేను పడేది" "సరేనని", పలికి, మరల యిట్లనెను. "కాని, వాటిని, ఓర్చుకొనుటలో వందకు మించరాదు. మించిన సహించేది లేద"ని గట్టిగా వక్కాణించెను. "మించను లే"అని ఆ భర్త సంతోషించెను-

గురువుగారిని విందుకు ఆహ్వానించెను ఆ శిష్యుడు. గురువుగారు రాగానే నమస్కరించి మిక్కిలి వినయవిధేయతలతో అర్ఘ్యపాద్యములిచ్చి భోజనమునకు కూర్చుండజేసెను. గురువుగారికి విసనకర్రతో విసురుతూ శిష్యుడు ప్రక్కలోనే కూర్చుండెను. ఆ గురువునకు భార్యను నమస్కరించమనీ, ఇక పరుషవాక్యములు పలుకుట మొదలిడుచు; "భోజనము వడ్డించుటలో ఇంత జాప్యమా!" అని మరలా, ఏది ఎక్కడ వడ్డించేది తెలియదా! తెలివితక్కువ దద్దమ్మా" అని, యిట్లు తుదివరకు భర్త తన ఆధిక్యతను కనపరచటంతో గురువు భుజించుచున్నను ఆ మాటలు మింగరానివయ్యెను. పలికినవన్నీ లెక్కింపు చేసుకొనునట్లు ఒక చోట గుర్తులు వేయుచుండెను భార్య. అయినను తనను సమర్థించుకొనునట్లు ఇంకా బాధనీయముగా దూషించుటతో అవి వందకు మించగా, భర్త మాట తప్పినాడని, భార్య ఉగ్రరూపం దాల్చి ఓర్పు నశించి అప్పుడే మసలుతున్న చారు పాత్రతో వచ్చి తన భర్తపై, వచ్చిన గురువుపై పడబోసి, తన సహజ ధోరణి వాక్యములు ప్రారంభించెను. దాంతో గురువుగారు పలాయనం చిత్తగించగా, తదుపరి ఆ భర్త సంగతి చెప్పనక్కరలేదు - మీరే ఊహించుకోవచ్చు.

ఇదండీ! పురుషాధిక్యతకు తగు ప్రతిచర్య.

★★★

# 99. విద్యను దుర్వినియోగపరచుటలో పొందు దుష్ఫలితం

పూర్వము ఒకానొక ఆశ్రమంలోని గురువు వద్ద కొందరు విద్యార్థులు విద్యనభ్యసించెడి వారు. వారిలో కొందరు విద్యార్థులకు వారి కుతూహలముతో "మృత్యుంజయ మంత్రసిద్ధి" విద్యను కూడ గురువు నేర్పెను. అయినా అన్ని విద్యలతో పాటు ఈ విద్యను కూడ లోకోపకారమునకు వినియోగించవలెనని హెచ్చరించెను. విద్యార్థులందరు అటులేయని సమ్మతించి, వారి వారి స్వగ్రామములకు వెళ్లిరి.

మృత్యుంజయ మంత్రమనగా గతించిన జీవులను పునరుజ్జీవులనొనర్చుట. జీవి యొక్క అవయవములున్నను చాలు. అట్టిదానిని కూడ ఏరి కూర్చి బ్రతికించవచ్చును.

అట్లు ఈ విద్యను నేర్చిన ఆకతాయి విద్యార్థులు నలుగురు కలిసి తమ స్వగ్రామములకు వెళ్లుటలో మార్గమధ్యములోని అడవిలో అక్కడక్కడ పడియున్న అస్తికలను చూచిరి. అంతే, వారిలో గురువు నేర్పిన మృత్యుంజయ మంత్రమును పరీక్షించుటకు పూనుకొని సిద్ధపడిరి.

వారిలో నొకడు "నేను ఈ శుష్క అస్తికలను క్రమంగా కూర్చి అతుకునట్లు మంత్రించెదనని పూనుకొనెను. ఇక రెండవవాడు, "నేను దీనికి మేధస్సు, మజ్జలను ధారపోతున"ని మంత్రం ప్రయోగించెను. మూడవ వాడు, "నేను దీనికి రక్త,మాంసములను కలిగించెదన"ని అతడా మంత్రమును పఠించెను. ఇంకేముంది. అదొక నిండు సింహ రూపముతో నిలబడెను.

ఈ దృశ్యమునంతయును తిలకిస్తున్ననొక బాటసారి వారిని అట్లొనర్చుటలో ప్రాణాపాయమని కూడ హెచ్చరించెను. అయినా వారు వినే స్థితిలో లేనట్లు గ్రహించి, ఆ సమీప వృక్షమునధిరోహించి చూస్తూ కూర్చుండెను. ఇక నాల్గవ వాడు తానేమి తక్కువనా!యని, నేను దీనికి నిండుగా చర్మము పొందింపజేసి ఈ సప్తధాతువుల రూపమునకు ప్రాణమును ధారపోసెదన"ని వెంటనే అట్లు ప్రాణమంత్రమును పఠించెను. అంతే, అదొక భయంకరమైన నిండు ప్రాణి(సింహము)గా తయారయింది. అది చూచి వారు నలుగురును తామొనర్చిన విద్య సఫలీకృతమైనదని మిక్కిలి సంతోషించుచు కేరింతలు పెట్టిరి. కాని రాబోవు ప్రమాదమును గుర్తించలేకపోయిరి. బ్రతికిన ఆ సింహము ఆకలిగా గర్జించి, వెంటనే ఆ నలుగురిని పట్టి కడుపు నింపుకొని తన దారిన వెళ్లెను.

చూచితిరా! గురువు హెచ్చరికను ఖాతరు చేయని ఆకతాయి విద్యార్థుల అగచాట్లు, పొందిన దుష్పరిణామ ఫలితము.

★★★

# గురు - సూత్రములు

"యస్యదేవే పరాభక్తి ర్యథా దేవే తథాగురౌ, సబ్రహ్మ విత్పరం ప్రేయా దితి వేదానుసాసనమ్ ఇత్యుపనిషత్. ఎవనికి దేవుని యందున్నట్లే గురువునందు భక్తియుండునో,ఆ బ్రహ్మవేత్త (శిష్యుడు) పరబ్రహ్మను పొందునని వేదశాసనము. అని

★★★

పరమాత్మనెరుగరాదు గురుకృపను బడయకయే రామాయ
వైరాగ్యభావముననను గురుపాద వనజమును చేరి తాను గురుడే దైవంబనుచును
మదినిల్పి గురి మీరు రామరామ.

విమలమౌ యీ సౌఖ్యము సూత్రంబు క్రమముగా గురుని వలన భ్రమ
గుణంబులు రోసియు నెరుగవలె బ్రహ్మమును రామరామ (శ్రీరామశతకము)

"గురుభిర్దాన్తః"-గురువులచే ఇంద్రియ నిగ్రహం కలుగును.

(రామా.అయో. 8-14శ్లో)

★★★

"ప్రజ్ఞాం దదాతి చాచార్య స్తస్మాత్స గురురుచ్యతే" (111-3/2శ్లో) ఆచార్యుడు జ్ఞానేపదేశమొనర్చును కనుక అతని గురువని చెప్పుదురు.

("సహి విద్యాతస్తం జనయతి తచ్ఛ్రేష్ఠ జన్మ") అని ఉపనిషత్.

★★★

'లఘుత్వమగమద్ దేవో గురూణాం గురురవ్యజః'
పరమేశ్వరుడగు శ్రీరాముడు గురువులకును గురువైనవాడయ్యెను;
హనుమంతునకు భక్తి చేతను లఘువయ్యెను.

★★★

జననీ జనకాంఘ్ర్యబ్జ నమసాద్గురు కీర్తనే ।
మతి ప్రకాశో జాతో మే సద్గురు స్మరణాదపి ॥

జననీ జనకులకు ప్రణమిల్లిన నాకు సద్గురుని స్మరించుట యందును, సద్గురుని కీర్తించుట యందును బుద్ధి వికసించినది అని నామధారకుడనెను.

★★★

"ధర్మాన్నప్రమది తవ్యమ్"

ధర్మ విషయములందు ప్రమాదము పొందకుమని గురువు శిష్య శ్రేయోభిలాషియై ఉపదేశించవలయును.

★★★

"న గృహ్ణాతి గురోర్వాక్యం స ఘోరం నరకం వ్రజేత్" - (గు.చ. 36 అ, 40/2)

గురువాక్యమును వినని వాడు ఘోర నరకమును పొందును.

★★★

"శిష్యేణాన్నం గ్రుహీతవ్యం గురోర్గేహే త్వ సంశయం"

గురువు యింట శిష్యుడు సంశయం లేకుండా అన్నముతినవచ్చును

- (గు.చ.36 అ, 60/2)

"గురుం వినా నహి గ్రాహ్యా ఆచారోఽప్యథవా మనుః"

ఆచారముగాని, మంత్రముగాని గురువు లేకనే గ్రహింపరాదు.

- (గు.చ. 36అ, 102/1)

★★★

"బ్రాహ్మే మహూర్త ఉత్థాయ సద్భక్త్యా సంస్మరేద్గురుం ।
బ్రాహ్మణం చిన్తయేద్విష్ణుం మహేశం చ సలక్షణం ॥"

"బ్రాహ్మీముహూర్తమున నిద్రలేచి భక్తితో గురుని స్మరింపవలెను? తదుపరి గుణ సంహితముగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను స్మరించవలెను.

- (గు.చ. 36 అ. 104 శ్లో)

★★★

"యః కరోతి గురోస్సేవాం స పరంహీరమేష్యతి ।
ఘోరదుఃఖం కుతస్తస్య స ఏవ సుఖాబాక్సదా ॥"

గురుసేవ చేయువాడు సంసారసాగరమును తరింపగలడన దుఃఖమెక్కడిది ? వాడెప్పుడును సుఖవంతుడే. - (గు.చ.41 అ. 50 శ్లో)

★★★

"చతుర్విధ పుమార్థాంశ్చ గురురేవ ప్రదాస్యతి ।

యమమార్గః కుతస్తస్య గురుభక్తిర్వరా తపః ॥"

చతుర్విధ పురుషార్థములను గురువేయిచ్చును వానికి యముని వలన భయమెక్కడిది. వానికి గురు భక్తికి మించినది లేదు.

★★★

"అపార దుస్తరా సార సంసారోత్తరాణాయ హి ।

న క్వాపి శ్రీగురోరన్యా గతిరత్ర పరత్రచ ॥

అపారమైనదియు, తరింప దుష్కరమైనదియు, సారము లేనిదియు అగు సంసారసాగరమును దాటింప సమర్థుడగు శ్రీగురుని మించిన యితరము ఇహపరముల యందు కానము. - (47 అ. 43 శ్లో)

★★★

"యథా భక్తిస్తథైవ తే భవిష్యతి ఫలావాప్తిః"

ఏ తీరున భక్తియుండునో ఆ తీరుననే వానికి ఫలితము లభించును

★★★

"త్రిమూర్తిర్గురురేవేతి వక్తి శృతిరపి స్మృతిః ।

గుర్వర్చనాద భీష్టాప్తిః పురుషార్థాప్తిరేవ చ ॥"

శృతి, స్మృతులు గురువే త్రిమూర్తి స్వరూపుడని చెప్పును గురుని అర్చించుటచే అన్ని కోరికలు సిద్ధించును. చతుర్విధ పురుషార్థములు లభించును.

- (గు.చ. 37 అ. 23)

★★★

"శ్రీ గురోరాజ్ఞాయా యోఽర్చేత్కాష్ఠం పాషాణమేవ వా ।

దేవ స్స ఏవభవతి సచ భక్త్యా ప్రసీదతి ॥

గురువు ఆజ్ఞగా అర్చించినది - కర్రయైనను, రాయి అయినను అది దైవసమానమే. అది గురు భక్తునకు ప్రసన్నమగును.

★★★

గురువును మానవ మాత్రునిగా నెంచినవాడు ఛండాలతుల్యుడు.

★★★

గురూపదేశమును జ్ఞాపకముంచు కోవడం శిష్యుని ప్రథమ కర్తవ్యం.

★★★

"త్రిమూర్తయో హి తుష్యన్తి భక్త్యా శ్రీగురుపూజనాత్"

భక్తితో శ్రీగురుపూజ చేయుటచే త్రిమూర్తులు తృప్తి నొందుదురు.

– (గు.చ. 37 అ. 22/2)

★★★

"బినగుర హో ఇకిగ్యాన"–గురువు లేనిచో జ్ఞానము లభ్యమగునా । (తు.రా)

★★★

"గురుభక్తాయ దాతవ్యం సాధకాయ విశేషతః"

★★★

"గురురేవ పరోధర్మో గురురేవ పరాగతిః"

గురువే పరమధర్మము, గురువే పరాగతిః

★★★

"గురోరధికః కశ్చిత్ త్రిషులోకేషు విద్యతే" – గురువు కన్న అధికుడు ముల్లోకముల యందును లేడు.

★★★

"గురువు" అని యెంచినపుడు అతడు "యోగ్యుడా"! అయోగ్యుడా" అని తలంచరాదు.

★★★

గురువుపై భక్తిచే సర్వము సిద్ధించును.

★★★

గురువే సర్వ రక్షకుడు.

★★★

గురువు కామధేనువు, కల్పవృక్షము వంటివాడు.

★★★

సద్గురు దేవుని వాక్కు, దృష్టి శిష్యులకు మహాప్రసాదమం.

గురుమార్గం నడవండి, 'గురు'నామ స్మరణం చేయండి.

"చండాలోఽస్తు సతు ద్విజోఽస్తు గురురిత్యేషా మనిషా మమ"

చండాలుడు కాని, బ్రాహ్మణుడు కాని, జ్ఞానియైనవాడు, వినయసంపన్నుడు నాకు గురువగుదురు.

- (శంకరోవాచ)

★★★

## బసవవచనాలు

గురువు వచనము లేక లింగమనిపించదు.

గురువు వచనము లేక నిత్యమనిపించదు.

గురువు వచనము లేక వ్రతమనిపించదు.

★★★



శృంగేరి పీఠాధిపతి



శ్రీ శ్రీ శ్రీ భగవాన్ వేదవ్యాస